కవిరాజ శిఖామణి

నన్నెచోడదేవకృత

కుమార సంభవము

(సంజీవనీ వ్యాఖ్యా సమేతము)

ద్వితీయ భాగము

(7-12 ఆశ్వాసములు)

వ్యాఖ్యాత

డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు,

ఎం.ఏ., పిహెచ్.డి

రాజమహేంద్రవరము

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయము

పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాదు - 14.

1998

ఆచార్య నాయని కృష్ణకుమారి
ఉపాధ్యక్షులు
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం



లలిత కళాతోరణం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ - 500 004

సమర్పణ

బోధన, పరిశోధన, ప్రచురణ అనే మూడు విషయాలు లక్ష్యంగా తెలుగు సాహిత్యం, భాష, చరిత్ర, కళలు - సంస్కృతి వంటి రంగాలలో కృషి సల్పడానికి 1985 వ సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది పూర్వం ఉన్న ఆంధ్రప్రదేశ్ సాహిత్య, సంగీత, నాటక, నృత్య, లలిత కళా అకాడమీలు ఇందులో విలీనం కావడంవలన పైన పేర్కొన్న లక్ష్యాలతోపాటు మరెన్నో బాధ్యతలు దీనికి సంక్రమించాయి అన్ని విశ్వవిద్యాలయాలవలె కేవలం పరన పాఠనాలతో సరిపెట్టుకునే అల్పపరిధి కాదు దీనిది మన సంస్కృతిని ప్రపంచం నలుమూలలకూ వ్యాప్తి చేయడానికి ఉద్దేశింపబడిన "సాంస్కృతిక విశ్వవిద్యాలయ"మిది ప్రచారసాధనకు పరికరమే ప్రచురణ

ప్రచురణ కార్యక్రమానికి అనుగుణంగా ఈ విశ్వవిద్యాలయం ఇప్పటికెన్నో ప్రముఖ గ్రంథాలను ప్రచురించింది వ్యాఖ్యా స్రవంతి శీర్షికన సుప్రసిద్ధ పండితులచే ప్రాచీన కావ్య ప్రబంధాలకు వ్యాఖ్యానాలు వ్రాయించి ప్రచురించింది ఇప్పటివరకు ఈ ప్రణాళికలో కుమార సంభవం, కాశీఖండం, శివరాత్రి మాహాత్మ్యం వంటి గ్రంథాలను వ్యాఖ్యా సహితంగా ముద్రించింది

తెలుగులో పేరుపొందిన ప్రాచీన ఆధునిక గ్రంథాలను

ఇంగ్లీషు, హిందీ బాషలలోనికి అనువాదం చేయించి ప్రచురించింది

తెలుగులో విజ్ఞాన సర్వస్వ సంపుటాలను తయారు చేయించే కార్యక్రమంలో 'విశ్వసాహితి'ని, 'హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఆంధ్రాస్' అనే పేరుతో ఆంగ్లంలో ఒక సంపుటాన్ని ప్రచురించింది

ప్రాచీన ప్రౌఢాంధ్ర కావ్యాలకు వ్యాఖ్యానాలు లేకపోతే అర్థం చేసుకునే శక్తి విద్యార్థిలోకానికి నానాటికీ తగ్గిపోయే ప్రమాదం ఉంది అందుచేత విద్యార్థుల సౌకర్యార్థం అలాంటి కావ్యాలకు సమర్థులైన పండితులచేత వ్యాఖ్యానాలు రచింపజేసే ప్రణాళికను వ్యాఖ్యాస్రవంతి పేర తెలుగు విశ్వవిద్యాలయం చేపట్టింది

"కుమార సంభవం" పండ్రెండు ఆశ్వాసాల మహాకావ్యం మొత్తం కావ్యం వ్యాఖ్యానంతో సువిస్తృతం అయింది కాబట్టి దానిని రెండు సంపుటాలుగా ప్రకటింప తలపెట్టడమైనది మొదటి ఆరు ఆశ్వాసాలూ ఒక సంపుటంలోనూ, తరువాతి ఆరు ఆశ్వాసాలూ రెండో సంపుటంలోనూ ఉంటాయి మొదటి ఆరాశ్వాసాల సంపుటం ఇదివరకే (1994) వచ్చింది ఇప్పుడు ఇది రెండో సంపుటం ఇందులో ఏడవ ఆశ్వాసం మొదలుకొని పన్నెండవ ఆశ్వాసం వరకు వ్యాఖ్యానం సుసజ్జితమై ఉంది

ఈ క్లిష్టమైన కావ్యానికి సమగ్రమైన వ్యాఖ్యానం వ్రాసి మా కందించిన వారు శ్రీ మృత్యుంజయరావుగారు

నాయని కృష్ణకుమారి

తేది 16-4-1998 ఉపాధ్యక్షులు

విషయ సూచిక

సప్తమాశ్వాసము

శివుఁడు కపటవటు రూపమునఁ దపఃపరాయణయగు పార్వతి కడకువచ్చుట 1
చతురిక పార్వతిని గపటవటువునకుఁ బరిచయము చేయుట 13
కపటవటువు పార్వతితో శివు నధిక్షేపించుచుఁ బలుకుట 16
పార్వతి కపటవటువును నిరాకరించుచుఁ బలుకుట 23
కపటవటువు పార్వతి తపఃకరణము నధిక్షేపించుట 27
కపటవటువును బార్వతి చెలు లధిక్షేపించుట 39
శివుఁడు పార్వతికి నిజస్వరూపముతోఁ బ్రత్యక్షమగుట 46
సప్తర్షులు శివునికడకు వచ్చుట 61
ఓషధిప్రస్థపురవర్ణనము 67
హిమవద్వర్ణనము 101
సప్తర్షులు హిమవంతునితోఁ బార్వతిని శివున కిమ్మని పలుకుట 103
హిమవంతుఁడు సప్తర్షుల మాటలకు సంతసించుట 106
కైలాసపురవర్ణనము 113
ఆశ్వాసాంతము 124

అష్టమాశ్వాసము

పార్వతీ సౌందర్య వర్ణనము 133
పురస్త్రీలు శివుని వీక్షించుట 165
పెండ్లివారిని జూచి పురస్త్రీలు వితర్కించుట 179
సూర్యాస్తమయవర్ణనము 189
అంధకార వర్ణనము 194
జారచోరాది వర్ణనము 197
చంద్రోదయ వర్ణనము 199
విటోక్తి వర్ణనము 209

వేశ్యల వర్ణనము 213
విట విదూషకాదుల చతురసంభాషణములు 231
ఆశ్వాసాంతము 254

నవమాశ్వాసము

పెండ్లికూఁతురగు పార్వతి వర్ణన 263
పెండ్లికొడుకగు నీశ్వరుని వర్ణన 274
పార్వతీశ్వరుల వివాహవర్ణన 279
మన్మథుఁడు పునర్జీవితుఁడగుట 285
పార్వతీశ్వరుల వివాహోత్సవమును జూచిన పౌరుల వేడుకలు 292
పార్వతీశ్వరుల వనవిహారము 320
మధుపానగోష్ఠి 340
పార్వతీశ్వరుల రతివర్ణన 352
దేవతలు పార్వతీశ్వరులకడ కగ్నిని బంపుట 363
ఆశ్వాసాంతము 365

దశమాశ్వాసము

అగ్ని రతిక్రీడాపరులైయున్న పార్వతీశ్వరుల కడకు వచ్చుట 369
శివుని వీర్యముం దాల్చిన యగ్ని శరవణ సరసి కరుగుట 376
అగ్ని సప్తర్షుల భార్యలతోఁ గ్రీడించుట 388
అగ్ని సాంగత్యమున సప్తర్షుల భార్యలు గర్భవతులగుట 393
కుమారోత్పత్తి 400
నారదాగమనము 403
సురపతి కుమారునిపై నెత్తివచ్చుట 408
బృహస్పతి కృత దారిద్ర్యవిద్రావణస్తవము 426
కుమారుని యువరాజ పట్టాభిషేకము 435
కుమారస్వామి కృత క్రౌంచభేదనము 447

కుమారుఁడు సుమతినిఁ దారకునికడకు రాయబారిగాఁ బంపుట 451
తారకుని దూత కుమారస్వామికడకు వచ్చుట 470
తారకునకు శుక్రుఁడు రాజనీతి నుపదేశించుట 486
శుక్రుని వాక్యములకుఁ దారకుని ప్రత్యాఖ్యానము 495
ఆశ్వాసాంతము 498

ఏకాదశాశ్వాసము

కుమారస్వామి సేన యుద్ధప్రస్థానము 504
సూర్యాస్తమయము 524
కుమారస్వామి సేనయందలి వీరుల యుత్సాహవాక్యములు 526
యుద్ధవీరుల భార్యల పరితాపము 540
సూర్యోదయము 546
కుమారస్వామి సేనలోఁ జతురంగబలముల యుద్ధసన్నాహము 548
కుమారుఁడు గజము నారోహించుట 551
తారకుని యుద్ధ సన్నాహము 555
శుక్రుఁడు తారకునకు అమరవీరులను నిరూపించుట 562
బృహస్పతి కుమారస్వామికి రాక్షసవీరులను నిరూపించుట 573
యుద్ధారంభము 577
సూర్యాస్తమయము 635
ఆశ్వాసాంతము 638

ద్వాదశాశ్వాసము

విరూపాక్ష కుంజరాక్షుల యుద్ధము 648
కుబేరోగ్రదంష్ట్రుల యుద్ధము 655
పవనమందారకుల యుద్ధము 658
వరుణ మహాబాహుల యుద్ధము 662
నిర్ఋతి ఆరణి దుర్వారులతో యుద్ధము చేయుట 664

యమకేతుమాటల యుద్ధము	668
అగ్ని మహాకాయుల యుద్ధము	673
ఇక్ష్వాకుడు పెక్కండ్రు రాక్షసులను జంపుట	673
ఇంద్ర జంభాసురుల యుద్ధము	681
విష్ణు నరకాసురుల యుద్ధము	688
విష్ణు మురాసురుల యుద్ధము	690
నర సహస్రకవచాసురుల యుద్ధము	691
విష్ణు కాలనేముల యుద్ధము	694
ప్రమథులు రాక్షసులను దాఁకుట	701
మహామాయ రక్తబీజునిఁ దాఁకుట	705
విఘ్నేశ్వరుఁడు రాక్షసవీరులపై దండెత్తుట	710
తారకుఁడు దేవసేనఁ దాఁకుట	713
కుమార తారకుల యుద్ధము	718
తారకాసురవధ	752
తారక సంహారకుఁడగు కుమారుని దేవత లభినందించుట	755
కుమారుని శివపుర ప్రవేశము	763
దేవత లర్ధనారీశ్వరునిఁ జూచుట	766
శివుఁడు కుమారునకు జ్ఞానోపదేశంబు చేయుట	772
ఆశ్వాసాంతము	782

కుమార సంభవము

సప్తమాశ్వాసము

క శ్రీ శ్రిత వక్షుఁడు, ముక్తి
శ్రీ శ్రిత సహజావదాత చిత్తుఁడు, వాణీ
శ్రీ శ్రిత సుముఖుఁడు, కీర్తి
శ్రీ శ్రిత దిఙ్ముఖుఁడు శేముషీనిధి పేర్మిన్

అర్థము: శ్రీ - శ్రిత - వక్షుఁడు = లక్ష్మికి ఆశ్రయమైన వక్షము గలవాఁడు, ముక్తి - శ్రీ - శ్రిత - సహజ + అవదాత - చిత్తుఁడు = మోక్షమనెడు లక్ష్మికి ఆశ్రయమైన సహజముగాఁ దెల్లని - (నిర్మలమైన) మనస్సు గలవాఁడు, వాణీ - శ్రీ - శ్రిత - సుముఖుఁడు = వాక్సంపదకు ఆశ్రయమైన మంచి ముఖము గలవాఁడు, కీర్తి - శ్రీ - శ్రిత - దిశ్ (క్) + ముఖుఁడు = కీర్తియనెడు లక్ష్మికి ఆశ్రయమైన దిక్కుల ముఖములు గలవాఁడు, పేర్మిన్ = గొప్పతనము నందు, శేముషీ - నిధి - బుద్ధికి నిధియైనవాఁడు,

తాత్పర్యము. లక్ష్మి కాశ్రయమైన వక్షముగలవాఁడు, మోక్ష లక్ష్మికి ఆశ్రయమైన సహజనిర్మలమైన మనస్సుగలవాఁడు, వాక్సంపద కాశ్రయమైన ముఖము గలవాఁడు, కీర్తి లక్ష్మి కాశ్రయమైన దిక్కుల ముఖములు గలవాఁడు, పేర్మియందు బుద్ధికి నిధియైనవాడు అగు జంగమ మల్లికార్జునుఁడు

విశేషములు: ముక్తిశ్రీ - కీర్తిశ్రీ -- రూపకములు

శివుఁడు కపట వటు రూపమునఁ దపఃపరాయణ యగు పార్వతి కడకు వచ్చుట

వ పరమేశ్వరుండు నిజమనోరథంబు సిద్ధి వొందం భార్వతికిం బ్రత్యక్షంబు గాఁ దలంచి తదీయాంతర్గతం బారయ వేఁడి నిజరూపంబు చూపనొల్లక యాక్షణంబ

అర్థము . పరమేశ్వరుండు, నిజమనోరథంబు = తనదైన కోరిక, సిద్ధి + పొందన్= నెఱవేఱుటకు, పార్వతికిన్, ప్రత్యక్షంబు + కాన్ + తలంచి = ఎదురఁదోఁచఁదలఁచి, తదీయ + అంతర్గతంబు = ఆమెదియగు మనస్సు, ఆరయన్ - వేఁడి = చూడఁగోరి, నిజరూపంబు = తనదైన ఆకృతి, చూపన్ + ఒల్లక చూపుట కిష్టపడక, ఆ - క్షణంబ = ఆ క్షణమే

తాత్పర్యము . పరమేశ్వరుఁడు తన కోరిక నెఱవేఱుటకుఁ బార్వతికిఁ బ్రత్యక్షము గానెంచి, ఆమె మనోభావమును బరీక్షింపఁగోరి, తన రూపమును జూపుట కిష్టపడక ఆ క్షణమే తరువాతి పద్యముతో నన్వయము

సీ మెఱుఁగుఁదీఁగెలతోడి మేఘుంబు నా జన్ని
దములతోఁ గృష్ణాజినము ధరించి
మకరధ్వజముతోడి మరుపచ్చవిల్లు
నా గోఁచితో మోదుగుఁగోల పట్టి
చంద్రికతోడి తుషారపుంజంబు నాఁ
దనుకాంతితో భూతిధామ మెసఁగ
వీణారవముతోడి వేదనాదంబు నా
రాగమ్ముతోడ శివాగమములు

తే. చదువుచును బ్రహ్మవర్చసపదవితోడి
దివ్యతేజంబు మొగమునఁ దేజరిల్ల
సుందరాకార మమర బాలేందుధరుఁడు
తాల్చి చనుదెంచె గిరిరాజతనయ కడకు 3

అర్థము: బాల+ఇందు-ధరుఁడు=చంద్రకళను ధరించిన వాఁడు - శివుఁడు

మెఱుఁగుఁదీఁగెల తోడి = విద్యుల్లతలతోఁగూడిన, మేఘుంబు, నాన్ = అనఁగా, జన్నిదములతోన్ = జందెములతో, కృష్ణ + అజినమున్ = లేడి చర్మమును, ధరించి

మకర - ధ్వజముతోడి = మొసలి టెక్కెముతోఁ గూడిన, మరు - పచ్చవిల్లు-నాన్ = మన్మథుని చెఱకువిల్లు అనునట్లు, గోఁచితోన్ = కౌపీనముతో, మోదుగుఁగోల= మోదుగుదండము - ఆషాఢము, పట్టి = పట్టుకొని,

చంద్రికతోడి = వెన్నెలతోఁగూడిన, తుషార - పుంజంబు - నాన్ - మంచు సమూహము అనునట్లు, తను - కాంతితోన్ = దేహకాంతితో, భూతి - ధామము = విభూతి కాంతి, ఎసఁగన్ = అతిశయింపఁగా,

వీణా - రవముతోడి = వీణా ధ్వనితోఁగూడిన, వేద - నాదంబు = వేద ధ్వని, నాన్= అనునట్లు, రాగమ్ముతోడన్ = సంగీతముతో, శివ + ఆగమములు = ఈశ్వరాగమములు, చదువుచును,

బ్రహ్మ వర్చస - పదవి తోడి = బ్రహ్మ తేజస్సు, యొక్క విధముతోఁగూడిన, దివ్యా- తేజంబు = దివ్య తేజస్సు, మొగమునన్ = ముఖమునందు, తేజరిల్లన్ = ప్రకాశింపఁగా, సుందర+ ఆకారము = అందమైన రూపము, అమరన్ = ఒప్పఁగా, తాల్చి= ధరించి, గిరి - రాజ - తనయ- కడకున్ = పర్వతప్రభు పుత్రిక - పార్వతి దగ్గఱకు, చనుదెంచెన్ = వచ్చెను

తాత్పర్యము: విద్యుల్లతలతోఁగూడిన మేఘమా యనునట్లు జందెములతో నల్లయిట్టితోలుఁదాల్చి, మొసలిటెక్కెముతోఁగూడిన మన్మథుని చెఱకువిల్లా అనునట్లు, కౌపీనముతో ఆషాఢదండమును బట్టుకొని, వెన్నెలతోఁగూడిన మంచుసమూహమా యనునట్లు, శరీరకాంతితో విభూతికాంతి అతిశయింపఁగా, వీణాధ్వనితోఁగూడిన వేదధ్వనియా యన సంగీతముతో నీశ్వరాగమములు చదువుచు, బ్రహ్మవర్చస్సుతో దివ్యతేజస్సు ముఖమునఁ బ్రకాశింపఁగా, అందమైనరూప మొప్పఁ జంద్రకళావతంసుఁడు పర్వతరాజపుత్రికకడకు వచ్చెను

విశేషములు. ఉత్ప్రేక్ష, సహోక్తి అలంకారములు బ్రహ్మవర్చస - బ్రహ్మ, హస్తి, రాజ శబ్దములకుఁ బరమైన వర్చస్ శబ్దమునకుఁ బరముగా 'అ' ప్రత్యయాగమము వచ్చును బ్రహ్మ + వర్చస్ - బ్రహ్మవర్చస

వ ఇట్లినబింబంబు మహీతలంబున కవతరించినభంగిం దేజోమూర్తియై చనుదెంచు నభినవమునికుమారుం గని నగజ ససంభ్రమంబున నతిథి మహేశ్వరస్వరూపంబ యని తాత్పర్యభక్తియుక్తి నభ్యుత్థానాభిగమనపూర్వకంబుగా 4

అర్థము: ఇట్లు, ఇన-బింబంబు = సూర్యబింబము మహీతలంబునకున్ = భూతలమునకు, అవతరించిన - భంగిన్ = దిగిన విధమున, తేజస్ + మూర్తి + ఐ = తేజస్స్వరూపుఁడయి, చనుదెంచు = వచ్చు, అభినవ - ముని - కుమారున్ = క్రొత్త మునికుమారుని, కని = చూచి, నగజ = పార్వతి, ససంభ్రమంబునన్ = వేగిరపాటుతో, అతిథి, మహేశ్వర - స్వరూపంబు + అ - మహేశ్వరుని స్వరూపమే, అని, తాత్పర్య - భక్తి - యుక్తిన్ = తత్పరత్వము, భక్తి అనువాని కూడికతో, అభ్యుత్థాన + అభిగమన - పూర్వకంబుగాన్ = లేచుట, ఎదురేఁగుట మున్నుగా,

తాత్పర్యము . ఇట్లు సూర్యమండలము భూతలమునకు దిగినట్లుగాఁ దేజస్స్వరూపుఁడై వచ్చు నూతన మునికుమారునిఁ జూచి పార్వతి వేగిరపాటుతో, అతిథి మహేశ్వరస్వరూపమే యనియెంచి భక్తితత్పరత్వములతో లేచుట, నెదురేఁగుట మున్నుగా తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . ఇనబింబంబు మహీతలంబున కవతరించిన భంగిన్ - అలంకార ముత్ప్రేక్ష

స్వాగత. ఆ గిరీంద్రసుత హర్షముతో శై
వాగ మోదిత విధాయతితో సు
స్వాగతాభినుత వాక్యములం ద
భ్యాగతోచిత సపర్యలఁ దన్పెన్ 5

అర్థము : ఆ - గిరి + ఇంద్ర - సుత = ఆ పర్వతశ్రేష్ఠుని కూఁతురు - పార్వతి, హర్షముతోన్ = సంతోషముతో, శైవ + ఆగమ + ఉదిత - విధా + ఆయతితోన్ = శైవశాస్త్రములందుఁ జెప్పఁబడిన ప్రకారముయొక్క కర్మముతో, సు-స్వాగత + అభినుత - వాక్యములందున్ = సుస్వాగత ప్రశంసావాక్యములందు, అభ్యాగత + ఉచిత - సపర్యలన్= అభ్యాగతునకుఁ దగిన సేవలతో, తన్పెన్ = తృప్తిపఱిచెను

తాత్పర్యము : ఆ పార్వతి సంతోషముతో నీశ్వరాగమములందుఁ జెప్పఁబడిన ప్రకారముగల విధితో సుస్వాగత ప్రశంసా వాక్యముల నభ్యాగతునకుఁ దగిన సేవలతోఁ (ఆ ముని కుమారుని) తృప్తిపఱిచెను

విశేషములు . అభ్యాగతుఁడు - తిథి పర్వము ఉత్సవము మొదలగు సందర్భములందు ద్రవ్యాపేక్షతో వచ్చినవాఁడు అతిథి = తిథ్యాది నిమిత్తము లేకుండక్షుత్పిపాసానివారణార్థము వచ్చినవాఁడు భోజన సమయమున వచ్చినవాఁడు ఈ రెండుపదములకును ఈ భేదమున్నను గవులు వీని నభేదముగా వాడినారు పార్వతి శివుని స్వాగతాభినుతవాక్యములను దనుపుట స్వాగతవృత్తముననే నిబంధించుట మెచ్చఁదగినది

ఛందస్సు - స్వాగతవృత్తము - నాలుగు పాదము లుండును ప్రతి పాదమునను ర,న,భ,గగ అను గణము లుండును మొదటి యక్షరమునకును, ఏడవ యక్షరమునకును యతిమైత్రి, ప్రాసనియమము గలదు

వ ఇట్లు కృతక మునికుమారుండు సద్విధి నభ్యర్చితుండై గిరిజ రూపసౌందర్య విభ్రమ విలాసంబులు గనుంగొని మెచ్చి నిజాంతర్గతంబున 6

అర్థము. ఇట్లు, కృతక - ముని - కుమారుండు = కపట ముని కుమారుఁడు, సత్ + విధిన్ = మంచి విధానముతో, అభ్యర్చితుండు + ఐ = పూజింపఁబడిన వాఁడయి, గిరిజ = పార్వతి యొక్క, రూప - సౌందర్య - విభ్రమ - విలాసంబులు = ఆకారముయొక్క అందము విభ్రమము విలాసము అనువానిని, కనుంగొని = చూచి, మెచ్చి, నిజ + అంతర్గతంబునన్ = తనదైన మనస్సునందు

తాత్పర్యము. ఇట్లు కపట ముని కుమారుఁడు బాగైన విధానముతోఁ బూజింపఁబడినవాఁడయి, పార్వతి ఆకార సౌందర్య విభ్రమ విలాసములు చూచి మెచ్చి తన మనస్సునందు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అభ్యర్చితుఁడు - అభి + అర్చితుఁడు - యణాదేశ సంధి నిజాంతర్గతము - నిజ + అంతర్గతము - సవర్ణదీర్ఘసంధి

సీ భూతి పూసిన నింత పొడమెడుఁ దనుకాంతి
తొడసిన నెంత మె ర్గడరియున్నొ !
వంది కందిన నింత వఱలెడు ముఖరోచు
లెలమిన నెంత సల్లలిత మగునొ !
పాలయింపకయు నింత వెలిఁగెడుఁ జూడ్కు ల
ల్లార్చిన నెంత రమ్యంబు లగునొ !
జడలు గట్టియు నింత సక్కనైనది వేణి
దీర్చిన నెఱు లెంత దేసి యగునొ!

తే యీడ విడిచిన మేఁదీఁగె యింత నయము
గలిగియున్నది వాడికె గలిగెనేని
నెంత నవకమై యుండునొ యింతి కనుచు
శివుఁడు గిరిరాజసుత విశేషించె నర్థి. 7

అర్థము: ఇంతికిన్ = స్త్రీకి - ఈమెకు -

తను - కాంతి = దేహకాంతి, భూతి - పూసినన్ - విభూతి అలఁదిననే, ఇంత = ఇంతగా, పొడమెడున్ = పుట్టుచున్నది, తొడసినన్ = ప్రాపించినచో, ఎంత = ఎంతగా, మెర్గు + అడరి + ఉన్నొ = ప్రకాశ మతిశయించియుండునో,

ముఖ - రోచులు = మోము కాంతులు, వంది = దుఃఖించి - శ్రమించి, కందినన్ = వాడిననే, ఇంత, - వఱలెడున్ = ప్రకాశించుచున్నవి, ఎలమినన్ = వికాసము నొందినచో, ఎంత, సత్ + లలితము + అగునొ = మిక్కిలి మనోహరమగునో,

చూడ్కులు = చూపులు, పొలయింపకయున్ = చలింపఁజేయకున్నను, ఇంత, వెలిఁగెడున్ = ప్రకాశించుచున్నవి, అల్లార్చినన్ = చలింపఁజేసినచో, ఎంత, రమ్యంబులు + అగునొ= సుందరము లగునో, వేణి = జుత్తు, జడలు+కట్టియున్= జడలు కట్టినప్పటికి, ఇంత, చక్కన + ఐనది = సుందరముగా నున్నది, తీర్చినన్= దిద్దినచో, నెఱులు = వెండ్రుకలు, ఎంత, దేసి + అగునొ = మనోహరము లగునో

మేఁదీఁగె = లతవంటి శరీరము, ఈడ - విడిచినన్ = ఉపేక్షించినను, ఇంత నయమ్ము + కలిగియున్నది = ఇంత బాగు కలిగియున్నది, వాడికె = పోషణము (?), కలిగెన్+ ఏనిన్ = కలిగియున్నచో, ఎంత - నవకము + ఐ = ఎంత, సుందరమయి, ఉండునో, అనుచున్, శివుఁడు, గిరిరాజ - సుతన్ = కొండలఱేని కూఁతును, అర్థిన్ = కోరికతో, విశేషించెన్ = స్తుతించెను

తాత్పర్యము : ఈమెకు - దేహకాంతి విభూతి అలఁదిననే యింతగాఁ బుట్టుచున్నదే, ప్రాపించినచో నింకెంతఁ బ్రకాశమతిశయించెడిదో! ముఖకాంతులు శ్రమించి వాడిననే యింత ఒప్పుచున్నవే, ఇఁక వికాసము నొందినచో నింకెంత మనోహరములగునో, చూపులు ప్రసరింపఁజేయకయే ఇంతగాఁ బ్రకాశించుచున్నవే, ఇఁక అల్లార్చినచో ఎంత రమణీయములగునో, జుత్తు జడలుగట్టియున్నను ఇంత చక్కఁగా నున్నదే, ఇఁకఁ దీర్చినచో నెంత మనోహరముగా నుండునో, దేహలత ఉపేక్షించిననే ఇంత బాగు గలిగియున్నదే, పోషణమేయున్నచో నింకెంత అందముగా నుండెడిదో అనుచు శివుఁడు పార్వతిని గోరికతో స్తుతించెను

విశేషములు. అలంకారము కావ్యార్థాపత్తి సల్లలితము - సత్ + లలితము - తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణ మాదేశ మగును. మేఁదీఁగె - తీఁగెవంటి మే ఉపమానోత్తరపదకర్మధారయము మెర్గు - మెఱుఁగు - 'అచ్చికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు

బహుళంబుగా నగు ' బాల ప్రకీర్ణక 7 'అలఘురేఫము లుప్తాచ్చ మగుచో లఘు రేఫం బగు ప్రౌఢ ము ల వి సంజ్ఞ 2 మెర్గు నయము = (నానా) అందము విధము, నేర్పు, నీతి, (సం) వాడికె పదము నిఘంటువులఁ గానరాదు అర్థము సందర్భోచితముగాఁ జెప్పఁబడినది

వనమయూరము ఈ రమణి బాల కడు నేచిన మహా కాం
తారములలోన నతిదారుణముగా నీ
ఘోరతప మిప్పటనుగోలె విరచింపన్
గారణ మదేమి యొకొ కౌతుకము మూడన్ 8

అర్థము. ఈ రమణి = ఈ స్త్రీ, బాల = చిన్న వయసు గలది, కడున్ = మిక్కిలి, ఏచిన = అతిశయించిన, మహత్ (మహా) + కాంతారములలోనన్ = గొప్ప అడవులలో, అతి - దారుణముగాన్ = మిక్కిలి ఘోరముగా, ఈ - ఘోర - తపము = ఈ భయంకర తపస్సు, ఇప్పటను + కోలెన్ = ఇప్పటి నుండియు, విరచింపన్ = చేయుటకు, కారణము, అది + ఏమి + ఒకొ = అది యేమయి యుండునో, చూడన్ = చూడఁగా, కౌతుకము = వేడుక

తాత్పర్యము. ఈ యింతి చిన్నది మిక్కిలి విజృంభించిన పెద్ద అడవులలో నతిభయంకరముగా నీ తీవ్ర తపస్సు ఇప్పటినుండి చేయుటకుఁ గారణ మేమయి యుండునో ! చూడ వేడుక

విశేషములు. ఛందస్సు - వనమయూరము - నాలుగు పాదము లుండును, ప్రతి పాదమునను భ - జ - స- న - గగ అను గణము లుండును మొదటి యక్షరమునకును తొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు

మానిని ఆననలీల సుధాకరబింబ నవాంబురుహంబుల చెల్వగుటన్
వేనలి కృష్ణభుజంగకలాపి సవిస్తరభాసురమై చనుటం,
దా నతిబాలకి యయ్యుఁ దపం బుచితస్థితిఁ జేయుచునుండుట నీ
మానిని రూపచరిత్ర లుదారసమం బగుచున్నవి చిత్రగతిన్ 9

అర్థము : ఆనన - లీల = ముఖ విలాసము, సుధాకర - బింబ = చంద్రబింబమువొక్కయు, నవ + అంబురుహంబుల = క్రొత్త పద్మముల

యొక్కయు, చెల్వు = అందము, అగుటన్ = అగుటచేతను, వేనలి = జడ, కృష్ణ - భుజంగ - కలాపి - సవిస్తర - భాసురము + ఐ = నల్లత్రాఁచు, నెమలి అనువానివలె అధికముగాఁ బ్రకాశించునదియై,చనుటన్ = ఒప్పుటచేతను, తాను, అతి - బాలకి + అయ్యున్ = మిక్కిలి చిన్నదియైనను, తపంబు, ఉచిత - స్థితిన్ = తగిన విధముగా, చేయుచున్ + ఉండుటన్ = చేయుచుండుటచేత, ఈ మానిని = ఈ స్త్రీ యొక్క, రూప - చరిత్రలు = ఆకారమును, చరిత్రమును, చిత్ర గతిన్ = విచిత్రమైన విధమున, ఉదారసమంబు + అగుచున్ + ఉన్నవి = గొప్పదియు, సమమును అగుచున్నవి

తాత్పర్యము. ముఖసౌందర్యము చంద్రబింబువలెను, క్రొత్త పద్మమువలెను సుందరమగుటచేతను, జడ నల్లత్రాఁచువలెను నెమలివలెను ప్రకాశించునది యగుటచేతను, తాను మిక్కిలి చిన్నదియయ్యును సముచితముగాఁ దపస్సు చేయుటచేతను, ఈమె ఆకారము, చరిత్ర చిత్రముగా ఉదారము, సమము అగుచున్నవి

విశేషములు. సుధాకరబింబమునకును, పద్మములకును అన్యోన్యవిరోధము అట్లే కృష్ణభుజంగమునకును నెమలికిని అన్యోన్యవిరోధము ఆమె ముఖము చంద్రపద్మములవలె నున్నది ఆమె జడ భుజంగకలాపులవలె నున్నది అందుచేతనే 'చిత్రము' ఇట్లు ఆమె ఆకారము ఉదారమగుచున్నది ఆమె మిక్కిలి చిన్నది అయినను సముచితముగాఁ దపస్సు చేయుచున్నది అందుచేతనే ఆమె చరిత్ర సమ మగుచున్నది అలంకార ముపమ

ఛందస్సు మానిని -నాలుగు పాదము లుండును ప్రతిపాదమునను ఏడు భగణములపై నొక గురువుండును మొదటి యక్షరమునకును బదుమూఁడవ అక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు

వ ఈ సుందరాంగి యెవ్వరి నందనయో యనుచు సంశయాకులిత హృదయుం డగుచున్న మునికుమారుం జతురిక కనుంగొని **10**

అర్థము. ఈ - సుందర + అంగి =ఈ అందగత్తె, ఎవ్వరి - నందనయో= ఎవరి కూఁతురో, అనుచున్, సంశయ + ఆకులిత - హృదయుండు = సందియముచేఁ గలఁగిన హృదయము గలవాఁడు, అగుచున్ + ఉన్న = అగుచున్న, మునికుమారున్ = మునికుమారుని, చతురిక, కనుంగొని =చూచి.

తాత్పర్యము : ఈ అందగత్తె ఎవరి కూఁతురో యనుచు సందియముచేఁ గలఁగిన హృదయము గలవాఁడగుచున్న మునికుమారునిఁ జూచి - తరువాతి పద్యముతో నన్వయము

గీ **హిమనగాధీశ్వరునకు నుత్తమచరిత్ర**
మేనకకుఁ బుత్రి, పార్వతి మెలఁతపేరు
వెలయ మైనాకభూధరు చెలియ, లమల
కమలదళనేత్ర వరకన్యకాలలామ 11

అర్థము అమల - కమల - దళ - నేత్ర = నిర్మలములైన పద్మదళములవంటి కన్నులు గలది, అగు, వర - కన్యకా - లలామ - శ్రేష్ఠురాలయిన కన్యాతిలకము, హిమ - నగ + అధి + ఈశ్వరునకున్ = హిమవత్పర్వతరాజునకును, ఉత్తమ - చరిత్ర = మిక్కిలి మంచి నడవడిగలది, అగు, మేనకకున్, పుత్రి = కూఁతురు, మెలఁత - పేరు = ఇంతిపేరు, పార్వతి, వెలయన్ = ఒప్పునట్లు, మైనాక - భూధరు = మైనాకపర్వతుని యొక్క, చెలియలు= చెల్లెలు

తాత్పర్యము పద్మదళాక్షి యగు నీ కన్యారత్నము హిమవత్పర్వత రాజునకును, ఉత్తమచరిత్ర యగు మేనకకును గూఁతురు ఈ యింతిపేరు పార్వతి మైనాకపర్వతుని చెల్లెలు

వ **అనిన నాశ్చర్యహృదయుఁ డగుచు నగజ కభిముఖుండై** 12

అర్థము. అనినన్ = అనఁగా, ఆశ్చర్య - హృదయుఁడు = అచ్చెరువొందిన హృదయము గలవాఁడు, అగుచున్, అగజకున్ + అభిముఖుండు + ఐ = పార్వతి కెదురై

తాత్పర్యము. అనిన మునికుమారుఁడు ఆశ్చర్యమొంది పార్వతి కెదురయి తరువాతి పద్యముతో నన్వయము

శివుఁడు పార్వతితో సంబాషించుట

చ. **పరము కపర్దసంగమునఁ బావనమైన సురాపగాంబువుల్**
శిరమునఁ దాల్చి ముందఱు ప్రసిద్ధియు సిద్ధియుఁ గన్నకంటె నీ
పరమ తపఃప్రభావమునఁ బర్వతవల్లభుఁ డిప్పు డెంతయున్
నిరుపమకీర్తిమైఁ దనరి నిర్మలుఁ డయ్యె జగంబులోపలన్. 13

అర్థము : పరము - కపర్ద - సంగమునన్ = ఉత్కృష్టుఁడైన శివుని యొక్క జడముడి సంగతిచే, పావనము + ఐన = పవిత్రమైన, సుర + ఆపగా + అంబువుల్ = ఆకాశగంగా జలములు, శిరమునన్ = శిరస్సునందు, తాల్చి = ధరించి, ముందఱు = పూర్వము, ప్రసిద్ధియున్ = కీర్తియును, సిద్ధియున్ = పరిశుద్ధతయును, కన్నకంటెన్ = పొందినదానికంటెను, పర్వత-వల్లభుఁడు = కొండలఱేఁడు - హిమవంతుఁడు, నీ - పరమ తపస్ (ఃు) + ప్రభావమునన్ = నీ ఉత్కృష్టమైన తపస్సుయొక్క మహిమచేత, ఇప్పుడు, ఎంతయున్ = మిక్కిలి, నిరుపమ - కీర్తిమైన్ = సాటిలేనికీర్తితో, తనరి = ఒప్పి, జగంబు లోపలన్ = లోకమునందు, నిర్మలుఁడు = పవిత్రుఁడు, అయ్యెన్

తాత్పర్యము . మిక్కిలి గొప్పవాఁడయిన శివుని జటాజూటసంగతిచేఁ బవిత్రమైన ఆకాశగంగానదీజలములను శిరస్సున ధరించి పూర్వము కీర్తిని, పరిశుద్ధతను బొందినదానికంటెఁ బర్వతరాజగు హిమవంతుఁడు నీ యుత్కృష్ట తపఃప్రభావముచే నిప్పుడెంతయో నిరుపమానమైన కీర్తితో నొప్పి లోకములో నిర్మలుఁడయ్యెను

విశేషములు . ఈ పద్య భావము కాళిదాసునను గలదు

'వికీర్ణ సప్తర్షి బలి ప్రహాసిభి
స్తధా న గాఙ్గైः సలిలై ర్దివశ్చ్యుతై ः
యధా త్వదీయై శ్చరితై రనావిలై
ర్మహీధరः పావిత ఏష సాన్వయः కు సం 5 37

నంన్కృతమున ఘ్వర్గంగాజలములు నప్తర్షుల బలులచేఁ బ్రహసించుచున్నట్టివని చెప్పఁబడఁగా, తెలుఁగున నవి పరము కపర్ద సంగమునఁ బావనమైనవని చెప్పఁబడెను ఈ మార్పువలన గంగాజలముల కింకను నెక్కువ పావిత్ర్యము సిద్ధించినది ఏలయన నది 'పరము' కపర్దము అంత పవిత్రములైన గంగాజలములచే హిమవంతుఁడు పొందిన పవిత్రతకంటెఁ బార్వతీతపః ప్రభావముచేఁ బొందినది మహత్తర మనుటచేఁ బార్వతి తపస్సునకుఁ బ్రభావ మతిశయించినది కపర్ద - కపర్దోऽస్య జటాజూటः, అమరము - శివుని జటా జూటమునకుఁ గపర్దమనిపేరు 'ముందఱు' - 'ముందఱ' రెండు రూపములును గలవు కన్న కంటె ' కంటె వర్ణకంబు పరంబగునపుడు విశేషణ నవర్ణకంబుమీఁది యమహత్తచ్ఛబ్దార్థమునకు లోపంబు విభాష నగు కన్నకంటె - కన్నదానికంటె ప్రౌఢ క్రియ 2 కన్న - కనిన - 'పడ్వాదుల నవర్ణకంబున కత్వంబును గడహల్లునకు ద్విత్వంబును విభాష నగు' బాల క్రియ 51.

వ అని వెండియు నిట్లనియె 14

అర్థము. అని, వెండియున్ = మరల, ఇట్లు + అనియెన్

తాత్పర్యము. అవి మరల నిట్లు పలికెను

సీ స్వర్గార్థి యందమే స్వర్గంబు తమ హిమ
గిరి చఱులం దొక కెలన నుండు
నర్థార్థి యందమే నర్థేశుకంటెను
దన పుట్టినింటనె ధనము గలదు
పురుషార్థి యందమే బురుషులు తనుఁగోరి
తప మర్థిఁ జేయంగఁ దగిన రూపు
మోక్షార్థి యందమే ముగ్ధ తా మోక్షంబుఁ
దలఁపంగనేనియుఁ దటియుఁగాదు

గీ ముఖవికాసంబు చూడ నీ ముదితవలనఁ
గామభోగాభిలాషయ కలిగినదియ
దీనిఁ దగిలించి తగులక తాన ధైర్య
వంతుఁడై యున్న సాబగుఁ డెవ్వండొ జగతి?" 15

అర్థము. స్వర్గ + అర్థి = స్వర్గమును గోరునది, అందము + ఏన్ = అందమన్నచో, స్వర్గంబు, తమ, హిమ - గిరి - చరుల + అందున్ = హిమవత్పర్వతపుఁ జటియలందు, ఒక - కెలనన్ = ఒక పార్శ్వమున, ఉండున్

అర్థ + అర్థి = ధనమును గోరునది, అందము + ఏన్ = అందమన్నచో, అర్థ+ ఈశు - కంటెను = ధనపతి - కుబేరుని కంటెను, తన, పుట్టినింటనె - (పుట్టిన + ఇంటనె) = పుట్టినింటియందే, ధనము, కలదు

పురుష + అర్థి = పురుషుని (భర్తను) గోరునది, అందము + ఏన్ = అందమేని, పురుషులు = మగవారు, తనున్ = తన్ను, కోరి, తపము, అర్థిన్ = కోరికతో, చేయంగన్= చేయుటకు, తగిన - రూపు = తగిన రూపము,

మోక్ష + అర్థి = మోక్షమును గోరునది, అందము + ఏన్ = అందమేని, ముగ్ధ = ఉదయించుచున్న యౌవనము గలది యగు, తాన్ = తాను, మోక్షంబున్,

తలఁపంగన్ + ఏనియున్ = తలఁచుటకైనను - దానికయి తపస్సువంటి క్రియల నాచరించుట మఱియు ననావశ్యకమనుట, తఱియున్ = సమయమును, కాదు

ముఖ - వికాసంబు = మోమునందము, చూడన్ = చూడఁగా, ఈ - ముదితవలనన్ = ఈ యింతి నుండి, కామ - భోగ + అభిలాష + అ = మన్మథ సుఖకాంక్షయే, కలిగినదియ - కలిగిన + అది + అ = కలిగియున్నట్టిదే

దీనిన్ = ఈమెను, తగిలించి = మరులుకొలిపి, తగులక = ప్రేమింపక, తాను + అ = తానే, ధైర్యవంతుఁడు + ఐ = ధైర్యముగలవాఁడయి, ఉన్న = ఉన్నట్టి, సొబగుఁడు= అందగాఁడు, జగతిన్ = జగతియందు, ఎవ్వండొ = ఎవఁడో?

తాత్పర్యము. ఈమె స్వర్గమును గోరి తపము చేయున్నదని యందమన్న, నది తమ హిమవత్పర్వతపుఁజఱియలయం దొక ప్రక్కనుండును డబ్బును గోరి యందమేనిఁ గుబేరునికంటెను ధన మెక్కువగాఁ గలదు భర్తనుగోరి యందమేని, పురుషులే తన్నుఁగోరి తపస్సు చేయఁదగిన రూప మామెది మోక్షమును గోరి యందమా, ఉదయద్యోవనయగు నీమె మోక్షమును గూర్చి ఆలోచించుటకైనను సమయము కాదు ముఖసౌందర్యము చూడఁగా నీ యింతి వలన మన్మథసౌఖ్యముల ననుభవించుకోరికగలిగియున్నట్లే కనుపట్టును ఈమెను వలపించి, వలవక తానే ధైర్యవంతుఁడై యున్న అందగాఁ డీ లోకమున నెవ్వఁడో కదా !

విశేషములు. సంస్కృత కుమారసంభవమునఁ గపటవటు వీ భావముల తోనే పార్వతిని పృచ్ఛించినట్లున్నది

దివం యది ప్రార్థయసే, వృధాశ్రమః
పితుః ప్రదేశా స్తవ దేవభూమయః,
అ ధోపయన్తార, మలం సమాధినా,
న రత్న మన్విష్యతి మృగ్యతే హి తత్ కుమార సం 5 45

'కులే ప్రసూతిః ప్రథమస్య వేధస
స్త్రిలోకసౌన్దర్య మి వోదితం వపుః,
అమృగ్య మైశ్వర్యసుఖం, నవం వయ,
స్తపఃఫలం స్యా త్కి మతఃపరం వద కుమార సం 5 41

తెలుఁగున మోక్షార్థియందమే ముగ్ధ దటియుఁగాదు' అను భావ మధికము

చతురిక పార్వతిని గపట వటువునకుఁ బరిచయము చేయుట

వ అనిన మునికుమారు పరేంగితజ్ఞతకు మెచ్చి వీఁడు సామాన్యపురుషుండు గాఁడు నిజప్రకారం బెఱింగింపవలయునని చతురిక కృతకబ్రహ్మచారిం గనుంగొని **16**

అర్థము అనినన్ ముని-కుమారు = మునికుమారునియొక్క, పర + ఇంగితజ్ఞతకున్ = ఇతరుల అభిప్రాయము నెఱుఁగఁగలుగుటకు, మెచ్చి, వీఁడు సామాన్య - పురుషుండు = సాధారణపురుషుఁడు, కాఁడు, నిజ ప్రకారంబు = తమదైన విధము, ఎఱింగింపవలయున్ = తెలుపవలయును, అని, చతురిక, కృతక - బ్రహ్మచారిన్ = కపటవటువును, కనుంగొని = చూచి

తాత్పర్యము . అనఁగా మునికుమారుని ఇతరాభిప్రాయవేత్తృతకు మెచ్చి వీఁడు సామాన్యుఁడు కాఁడు మన విధమంతయుఁ దెలుపవలయునని చతురిక కపటవటువును జూచి - తరువాతి పద్యముతో నన్వయము

మ హరి నేత్రాంబుజ మంఘ్రిపీర, మజు మస్తాబ్జంబు సత్కేళి పం
కరుహం, బా సితరోచి జూటలతికాకల్పంబు, విశ్వంభరా
ధరవంశేశులు కర్ణకుండలము, లుద్యద్దేవతానీకముల్
పరివారంబుగ నున్న శంభుఁ దనకుం బ్రాణేశుఁగాఁ బ్రీతితోన్. **17**

అర్థము. హరి - నేత్ర + అంబుజము = విష్ణువుయొక్క, నయన పద్మము, అంఘ్రి - పీరము = పాదపీరము, అజు - మస్త + అబ్జంబు = బ్రహ్మయొక్క పద్మమువంటి శిరస్సు' - పద్మమువంటి బ్రహ్మకపాలము, సత్ + కేళి - పంకరుహంబు = మేలైన క్రీడాపద్మము, ఆ - సిత - రోచి = ఆ చంద్రుఁడు, జూట - లతికా + ఆకల్పంబు = తీఁగవంటి జడముడి యొక్క ఆభరణము, విశ్వంభరాధరవంశ + ఈశులు = పర్వతవంశ ప్రభువులు - మేరు మందరములు, కర్ణ - కుండలములు = చెవుల కుండలములు, ఉద్యత్ + దేవతా + అనీకముల్ = గొప్ప వారయిన దేవతల సమూహములు, పరివారంబుగన్ = పరివారముగను, ఉన్న = ఉన్నట్టి, శంభున్ = ఈశ్వరుని, తనకున్ = తనకు, ప్రాణ + ఈశున్ + కాన్ = ప్రాణపతినిగా, ప్రీతితోన్ = ప్రేమముతో

తాత్పర్యము : విష్ణు నేత్రపద్మము పాదపీరముగను, పద్మమువంటి బ్రహ్మకపాలము క్రీడాపద్మముగాను - విలాసార్థమైన పద్మముగను, ఆ చంద్రుఁడు

తీఁగవంటి జడముడికి అలంకారముగను, పర్వత కులప్రభువులగు మేరుమందరములు కర్ణకుండలములుగను, శ్రేష్ఠులైన దేవతల సమూహములు పరివారముగను ఉన్న యీశ్వరునిఁ దనకుఁ బ్రాణేశ్వరునిగాఁ బ్రేమముతో - తరువాతి వచనముతో నన్వయము

విశేషములు ఇందలి శంభుని వర్ణన యంతయుఁ దత్సర్వ శ్రేష్ఠతాప్రతిపాదకముగా నున్నది విశ్వంభరాధరవంశేశులు = నాగకుల ప్రభువులు? ఉపమానుప్రాణితమైన రూపకాలంకారము

వ సన్మనంబునం గోరి ఘోరతపంబు సేయుచు **18**

అర్థము. సత్ + మనంబునన్ = మంచి మనస్సునందు, కోరి, ఘోర - తపంబు= భయంకరమైన తపస్సు, చేయుచున్

తాత్పర్యము. తన మంచిమనసునఁ గోరి తీవ్రమైన తపస్సు నాచరించుచు- తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. సన్మనంబు - సత్ + మనంబు - అనునాసిక సంధి

సీ ఈ నీరజానన దాన కుదురు చేసి
వలయు బీజములెల్ల మొలవఁబెట్టి,
నిచ్చలు నిష్ఠతో నీరులు పోయంగ
నెలమితో నన్నియుఁ గలయ మొలచి
పెరిఁగి నానావిధ తరులతా గుల్మాదు
లేచి నయంబునఁ బూచి కాచి
ఫల మందెనేనియు మొలకయు మొలవ దీ
చెలువ తపఃఫలసిద్ధివలన

తే నింక నెన్నండు దయఁ బరమేశ్వరుండు
కన్ను దెఱచునో యని తన కున్నరూపు
నెఱయఁ జెప్పిన విని కేలు చఱచికొనుచు
నఱిమ పాఱుండు ప్రక్కలు విఱుగ నగుచు **19**

అర్థము. ఈ - నీరజ + ఆనన = ఈ పద్మముఖి, తాను + అ = తానే, కుదురు - చేసి = పా దొనరించి, వలయు = కావలసిన, బీజములు + ఎల్లన్ = విత్తనము లన్నియును, మొలవన్ + పెట్టి = మొలచునట్లు చేసి,

నిచ్చలున్ = ఎల్లప్పుడును, నిష్ఠతోనే = నియమముతో, నీరులు, పోయంగన్, ఎలమితోన్ = వికాసముతో, అన్నియున్ = ఆ విత్తు లన్నియును, కలయన్ = సంపూర్ణముగా, మొలచి,

పెరిఁగి, నానా - విధ - తరు - లతా - గుల్మ + ఆదులు = పలురీతులైన చెట్లు, తీఁగలు, పొదలు మున్నగునవి, ఏచి = విజృంభించి, నయంబునన్ = బాగుగా, పూచి, కాచి = కాయలు కాచి,

ఫలము + అందెన్ + ఏనియున్ = ఫలించినప్పటికిని, ఈ - చెలువ - తపస్ + ఫలసిద్ధి - వలనన్ = ఈ ఇంతి తపస్సునెడి ఫలముయొక్క సిద్ధి విషయమున, మొలకయున్ = అంకురమైనను, మొలవదు = మొలకెత్తదు

ఇంకన్, ఎన్నండు = ఎప్పుడు, పరమేశ్వరుండు, దయన్ = దయతో, కన్ను - తెఱచునో = కన్నులు విప్పునో, అని, తనకున్, ఉన్నరూపు = ఉన్న సంగతి, నెఱయన్ = పూర్ణముగా, చెప్పినన్ = చెప్పఁగా, నఱిమ - పాఱుండు = కపట బ్రాహ్మణుఁడు, విని, కేలు = చేతులు, చఱిచికొనుచున్ = చప్పట్లు చఱచుచు, ప్రక్కలు - విఱుగన్ = ప్రక్కలు విఱుగునట్లు, నగుచున్ = నవ్వుచును

తాత్పర్యము. "ఈ పద్మాక్షిమ్మ తానయి పాదుచేసి వలసిన విత్తనములన్నియుఁ జల్లి, నిత్యమును నియమముతో నీరులు పోయఁగా వికాసముతో ఆ విత్తులన్నియును సంపూర్ణముగాఁ బెరిఁగి పెక్కురీతులైన చెట్లు, తీఁగలు, పొదలుగా విజృంభించి బాగుగాఁ బుష్పించి ఫలించినప్పటికిని, ఈమె తపఃఫలము సిద్ధించువిషయమున ఒక్క మొలకేనియు మొలకెత్తదయ్యెను ఇఁక నెప్పుడు పరమేశ్వరుఁడు దయతోఁ గన్నులు తెఱచునో !" అని తన కున్నవిషయము అంతయుఁ జెప్పఁగా ఆ కపట బ్రాహ్మణుఁడు విని చేతులు చఱిచికొనుచుఁ బ్రక్కలు విఱుగునట్లు నవ్వుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. ఈ పద్యభావము కాళిదాసునను గలదు

'द्रुमेषु सख्या कृतजन्मसु स्वयं
फलं तपस्साक्षिषु दृष्ट मेष्वपि,
न च प्ररोहाभिमुखो2 पि दृश्यते
मनोरथो स्या शशिमौलिसंश्रयः కుమార సం 5 60

కపట వటువు పార్వతితో శివు నభిక్షేపించుచుఁ బలుకుట

శా ఎట్టెట్టూ ! శివుఁ గల్చెనంటి నికమా ? యీ తన్వి దన్ గల్వఁగా
నట్టుల్ మెచ్చకయున్న వే తపము సేయంజొచ్చె ము న్నాతఁ డే
మట్టుం బోలినవానిఁ గాఁ దలఁచి తా మోహించె ! దేశంబులోఁ
బుట్టం బట్టులు మాలెనే నగజ యా భూతేశ్వరుం గల్వఁగాన్ 20

అర్థము. ఎట్టెట్టూ = ఎట్టూ + ఎట్టూ = ఆశ్చర్య సూచకము - ఏమేమీ, ఈ తన్వి = ఈ యింతి, శివున్ = శివుని, కల్చెన్ + అంటి = వలచెనంటివి, నికమా= నిక్కమా !, తన్ = తన్ను, కల్వఁగాన్ = వలవఁగా, అట్టుల్ = ఆ విధముగా, మెచ్చక + ఉన్నన్ = మెచ్చకపోఁగా, వే = శీఘ్రముగా, తపము + చేయన్ + చొచ్చెన్= తపస్సు చేయ్నారంభించెను, మున్ను = మొదట, ఆతఁడు = ఆ శివుఁడు, ఏ-ముట్టున్ + పోలినవానిన్ + కాన్ = ఏ విధముగాఁ దగినవానినిగా, తలఁచి = ఎంచి, తాన్ = తాను, మోహించెన్ = వలచెను? నగజ = పార్వతి, ఆ -భూత + ఈశ్వరున్ = ఆ భూతనాధుని - పిశాచ ప్రభువును - శివుని, కల్వఁగాన్ = ప్రేమించుటకు, దేశంబులోన్, పుట్టన్ + పట్టులు = (వలపు) పుట్టుటకు స్థానములు, మాలెనే = నశించెనా ?

తాత్పర్యము. ఏమేమీ ! ఈమె శివుని వలచె నంటివి నిజమా ? త న్నాతఁ డా విధముగా మెచ్చకపోఁగా నీమె వెంటనే తపము చేయ నారంభించెను మొదట నాతఁ డేవిధముగాఁ దగినవాఁడని యెంచి యీమె యతనిని వలచెను ? పార్వతి ఆ భూతనాధుని బ్రేమించుట కిఁక దేశములోఁ బ్రేమస్థానములే నశించెనా ?'

విశేషములు. ఎట్టెట్టూ - ఎట్టూ + ఎట్టూ - 'అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తఱుచుగ నగు' బాల సం 10 నికము - నిక్కము - (రూపాం) అంటాతఁడే - అంటి + ఆతఁడే అను-ధాతువు, 'భూతంబున లిట్టగు' బాల క్రి 3 అను + లిట్ 'లకారంబునకు డు ఱు వు రు ను ము ఘ్ను గు ' బాల క్రి 8 అను + వు 'లిట్టు వుఙ్ను పరంబగునపుడు తివర్ణకం బగు' అను + తి + వు 'తి దు ట లు పరంబులగునవు డన్వాదుల నుస్థానంబున సున్నయు నుండు డు లోపంబును విభాష నగు' బాల క్రి 58 అం + తి + వు 'ఇట బిందువుమీఁది త దలకు నిత్య వైకల్పికంబులయి ట డలగు బాల క్రి 59 అంటి + వు 'ఇకారంబు మీఁది కు ను వు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వం బగు' బాల తత్సమ 25 అంటివి 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు' బాల క్రి 24 అంటి + ఇ 'అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు

డచ్చునకు సంధి యగు ' బాల సం 11 అంటి + ఆతఁడే - 'మధ్యమపురుష క్రియలయం దిత్తునకు సంధియగును ' బాల సం 7 అంటాతఁడే కలుచు = కల్చు 'ఆచ్చికంబులం బదమధ్యంబుల న ల డ రల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు బాల ప్రకీర్ణక 17

చ వగవఁగ నద్రిరాజు హిమవంతుఁడు తండ్రి, సురాంగనాలికిన్
మిగిలిన పేర్మిమైఁ దనరు మేనక తల్లి, సురూపసంపదన్
జగములలోన మే లనఁగఁ జాలిన పార్వతి ! నీవు భిక్షుకుం
దగిలి తపంబు సేసె దఁటె ! దైన్యము సేసెదె మేను నింతకున్ 21

అర్థము వగవఁగన్ = ఆలోచింపఁగా, అద్రి - రాజు = కొండలఱేఁడు అగు హిమవంతుఁడు, తండ్రి, సుర + అంగనా + ఆలికిన్ = దేవతా స్త్రీల సమూహమునకు, మిగిలిన = ఎక్కువైన - దేవతాస్త్రీలను మించిన అనుట, పేర్మి - మైన్ = గొప్పతనముతో, తనరు = ఒప్పునట్టి, మేనక, తల్లి, సురూప - సంపదన్ = మంచి సౌందర్యమనెడి సంపదయందు, జగములలోనన్ = లోకములలో, మేలు + అనఁగన్ + చాలిన = మేలయినది అన సమర్థమైన, పార్వతి = పార్వతీ, నీవు, భిక్షుకున్ = అడుగుకొనువానిని, తగిలి = కోరి, తపంబు, చేసెదు + అఁటె = చేయుదువా ? ఇంతకున్ = ఇంతకును, మేనున్ = శరీరమును, దైన్యము + చేస్నెదె + దీనమైనదానినిగాఁ జేయుదువా? ఆయాసపెట్టుదువా? - అనుట

తాత్పర్యము. 'ఆలోచింపఁగాఁ గొండలఱేఁ డగుహిమవంతుఁడు తండ్రి దేవతాస్త్రీలను మించిన గొప్పతనముతో నొప్పు మేనక తల్లి సౌందర్య సంపదయందు లోకములలో మేలయినది అనఁజాలిన పార్వతీ ! నీవు అడుగుకొనువానిని గోరి తపము చేయుదువా ? ఇంతకును శరీరము నాయాసపెట్టుదువా?'

సీ వారిరుహానన ! నీ రూపు గనుఁగొన్న
నలకూబరుండైనఁ గలచి వచ్చుఁ
బొలఁతి ! నీ భోగోపభోగముల్ చూచి జం
భారాతియైననుఁ గోరి వచ్చుఁ
గోమలి ! నీ కళాకుశలత విని శత
దల సంభవుండైనఁ దగిలి వచ్చు
లలితాంగి నీ శుభలక్షణోన్నతి చూచి
పురుషోత్తముండైన మరిగి వచ్చు

తే నిన్నుఁ గోరి తపంబులు నిష్ఠ నొరులు
సేయఁగోరుచోఁ దప మీవు సేసె దనుట
రత్నములఁ గోరి విని జనుల్ రాక, ఋనుల
రత్నములు గోరి పైఁబడి రాకఁబోలు 22

అర్థము. వారిరుహ + అనన = పద్మముఖీ ! నీ - రూపు = నీ ఆకారము (అందము), కనుఁగొన్నన్ = చూచినచో, నలకూబరుండు + ఐనన్ = నలకూబరుఁడైనను, కలిచివచ్చున్ = వలచి వచ్చును

పొలఁతి = ఇంతీ! నీ - భోగ + ఉపభోగములన్ = నీ సుఖానుభవములను చూచి, జంభ + అరాతి + ఐనను = జంభాసురునకు శత్రువు (ఇంద్రుఁడు) అయినను, కోరి, వచ్చున్

కోమలి ! నీ - కళా - కుశలతన్ = నీ విద్యా నైపుణ్యమును, విని, శతదల - సంభవుండు + ఐనన్ = పద్మమునుండి పుట్టుకగలవాఁడు - (బ్రహ్మ) ఐనను, తగిలి = ఆసక్తి వహించి, వచ్చున్

లలిత + అంగి = మనోహరమైన శరీరముగలదానా ! నీ - శుభ - లక్షణ + ఉన్నతి = నీ శుభలక్షణముల ఔన్నత్యము, చూచి, పురుష + ఉత్తముండు + ఐనన్ = విష్ణువయినను, మరిగి = ఆసక్తి గొని, వచ్చున్

ఒరులు = ఇతరులు, నిన్నున్, కోరి, తపంబులు, నిష్ఠన్ = నియమముతో, చేయన్ + కోరుచోన్ = చేయఁగోరుచో, ఈవు = నీవు, తపము, చేసెదు + అనుట = చేసెదవు అనుట, రత్నములన్, కోరి, విని, జనుల్ = జనులు, రాక = వచ్చుట మాని, జనులన్ = జనులను, రత్నములు, కోరి, పైఁబడి - రాకన్ = పైఁబడి వచ్చుటను, పోలున్,

తాత్పర్యము. పద్మముఖి! నీ అందమును జూచినచోఁ బురుషులలో మిక్కిలి అందగాఁడయిన నలకూబరుఁడయినను నిన్ను వలచి వచ్చును నీ భోగానుభవమును జూచి మహాభోగియైన ఇంద్రుఁడయినను నిన్నుఁగోరి వచ్చును నీ కళానైపుణిని విని విద్యాధికుఁడైన పద్మభవుఁడైనను నీయం దాసక్తి వహించివచ్చును నీ శుభలక్షణముల ఔన్నత్యమును జూచి, సర్వ శుభలక్షణ సంపన్నుఁడగు విష్ణువయినను నిన్నుఁ గోరి వచ్చును ఇతరులు నిన్నుఁగోరి తపములు నియమముతోఁ జేయఁగోరుచో, నీవు తపముఁ జేయుచున్నా వనుట, రత్నములను

గోరి వీని జనులు వచ్చుట గాక, రత్నములే జనులను గోరి పైఁబడి వచ్చుటను బోలును

విశేషములు. రత్నములఁగోరి రాకఁబోలు - ఈ భావము కాళిదాసునను గలదు 'న రత్న మన్విష్యతి మృగ్యతే హి తత్' సం కుమార సం 5-45 రాక - రాక -ఇందు మొదటి రాక వచ్చు ధాతు వ్యతిరేకక్వార్థరూపము, రెండవది వచ్చు ధాతు కృదంత రూపము అలంకార ముపమ

చ జనులు విరుద్ధవేషి యగుశంకరు నేలకొ యిందుఁ డొందెఁ బా
వనతరుఁ డంచుఁ జిత్తముల వందఁగ, దానిపయిం త్రిలోక శో
భనవగునీవు నా తపసి పాల్పడి మిక్కిలి వంత చేసెదో
యని యనిశంబుఁ దద్దయు భయంపడుచున్నది లోకమంతయున్ 23

అర్థము పావనతరుఁడు = మిక్కిలి పవిత్రుఁడు, అగు, ఇందుఁడు = చంద్రుఁడు, విరుద్ధ వేషి = విపరీతమైన వేషముగలవాఁడు, అగు, శంకరున్ = శివుని, ఏలకొ= ఎందుచేతనో, ఒందెన్ = పొందెను - ఆశ్రయించెను, అంచున్ - అనుచు, జనులు= లోకులు, చిత్తములన్ = మనస్సులందు, వందఁగన్ = దుఃఖింపఁగా, దానిపయిన్= ఆపై, త్రిలోక - శోభనవు - ముల్లోకములందును శోభిల్లుదానవు, అగు నీవున్ = నీవు కూడ, ఆ - తపసి - పాల్పడి = ఆ మునికి (శివునకు) అధీనవయి, మిక్కిలి, వంత - చేసెదో (చెసెదవు + ఓ) = దుఃఖము గలుగఁజేయుదువో, అని, లోకము + అంతయున్ = లోకమంతయును, అనిశంబున్= ఎల్లప్పుడును, తద్దయున్ = మిక్కిలి, భయంపడుచున్ + ఉన్నది = భయపడుచున్నది

తాత్పర్యము మిక్కిలి పవిత్రుఁడైన చంద్రుఁడు విరుద్ధవేషధారియగు శివునేల యాశ్రయించెనని జనులు మనస్సులందు దుఃఖించుచుండఁగా, నాపైని ముల్లోకములందును శోభిల్లు నీవుకూడ నా మునికి - శివునకు అధీనవయి మిక్కిలి దుఃఖమును గలిగింతువేమో యని లోకమంతయును ఎల్లప్పుడును మిక్కిలి భయపడుచున్నది

విశేషములు. ఈ భావము కాళిదాసు కుమారసంభవమునను గలదు

'ద్వయం గతం సంప్రతి శోచనీయతాం
సమాగమప్రార్థనయా పినాకినం,
కలా చ సా కాన్తిమతీ కలావత
స్త్వ మస్య లోకస్య చ నేత్రకౌముదీ సం కుమారసం 5-71

సీ పుడమియై కదలక పడియుండు నెల్లచో
నెఱి లేక నీర యై నెఱసి యుండు,
ననలుఁడై డాసినఁ గొని కాలుచుండు, వా
తూలుఁడై కనుకనిఁ దూలుచుండు
నాకాశమై చూడలేకుండుఁ బ్రాలేయ
ధాముఁడై పెరుఁగుచుఁ దఱుగుచుండు,
భానుఁడై మిన్నులపైఁ బాఱుచుండు, మ
హాత్ముఁ డయ్యును బొడవడఁగియుండు

తే నిన్ని రూపులందు నే రూపు నిజముగా
నెఱుఁగవచ్చు? వీని కెల్ల నొక్క
రూపు సేయ నెవ్వ రోపుదు ? రట్టి మా
యావి నీకుఁ దగుల నగునె, బేల? 24

అర్థము: పుడమి + ఐ = భూమియయి, కదలక, ఎల్లచోన్ = అంతటను, పడి+ ఉండున్, నెఱి - లేక = స్థైర్యము లేక, నీరు + అ +ఐ = నీరే యయి, నెఱసి + ఉండున్= వ్యాపించును

అనలుఁడు + ఐ = అగ్నియయి, డాసినన్ = సమీపించినచో, కొని కాలుచున్ + ఉండున్ = దహించుచుండును, వాతూలుఁడు + ఐ = వాయువయి, కనుకనిన్ = సంభ్రమముతో, తూలుచున్ + ఉండున్ = చలించుచుండును

ఆకాశము + ఐ = ఆకాశమయి, చూడన్ = చూడఁగా, లేక + ఉండున్ = లేకుండును, ప్రాలేయ - ధాముఁడు + ఐ = హిమకరుఁడయి = చంద్రుఁడయి, పెరుఁగుచున్+ తఱుగుచున్ + ఉండున్ = వృద్ధి క్షయములు పొందుచుండును

భానుఁడు + ఐ = సూర్యుఁడయి, మిన్నులపైన్ = ఆకాశముమీఁద, పాఱుచున్ + ఉండున్ = పరువెత్తుచుండును, మహాత్ముఁడు + అయ్యును = గొప్పవాఁడైనను, పొడవు+ అడఁగి + ఉండున్ = రూపుమాసియుండును

ఇన్ని రూపుల + అందున్ = ఇన్ని మూర్తులందును, ఏ - రూపు, నిజము + కాన్ = నిజమయినదిగా, ఎఱుఁగన్ + వచ్చున్, వీనికిన్ + ఎల్లన్ = ఈ రూపులన్నిటిని, ఒక్క రూపు + చేయన్ = ఏకరూపముగాఁ జేయుటకు, ఎవ్వరు, ఓపుదురు = చాలుదురు ? బేల = అమాయికురాలా! అట్టి - మాయావిన్ = అట్టి మాయలమారిని, తగులన్ = కోరఁగా, నీకున్, అగునె = తగునా ?

తాత్పర్యము . శివుఁడు అష్టమూర్తి అతఁడు పృథివియై యంతటను బడియుండును నిలుకడలేక నీరే యయి వ్యాపించును అగ్నియై సమీపించుచో దహించుచుండును వాయువయి సంభ్రమముతోఁ జలించుచుండును ఆకాశమయి చూడఁగా లేకుండును హిమకరుఁడయి పెరుఁగుచుఁ, దఱుగుచు నుండును సూర్యుఁడయి ఆకాశముపైఁ బరువెత్తుచుండును మహాత్ముఁడైనను నిరాకారుఁడై యుండును ఈ యెనిమిది మూర్తులందును, ఏ మూర్తి నిజముగాఁ దెలియవచ్చును? వీని నన్నిటిని ఏకరూపముగాఁ జేయుట కెవ్వరు చాలుదురు? అమాయికురాలా! అట్టి మాయలాని యం దాసక్తి వహించుటకు నీకుఁ దగునా? తగ దనుట

విశేషములు : ఇందు శివుని అష్టమూర్తిత్వము చెప్పఁబడినది పంచభూతములు (పృథివ్యప్తేజోవాయురాకాశములు), సూర్యచంద్రులు, యజమానుఁడు ననునవి శివుని యష్టమూర్తులు

ఏ సకలకళాధరుండు జలజప్రభవుండు విరించి యుండఁ, బా
యక సిరిఁ దక్కనేలిన మురాంతకుఁ డుండ, సమస్త దేవతా
ప్రకరముఁ గొల్వ నున్న సురపాలకుఁ డుండఁగ నిట్టె మూర్ఖు భి
క్షుకు నపదార్థ నేమిగతిఁ గోరితి శంకరుఁ బంకజాననా !" 25

అర్థము: పంకజ + ఆననా = పద్మముఖీ!, సకల - కళా - ధరుండు = ఎల్ల విద్యలను ధరించినవాఁడును, జలజ ప్రభవుండు = తమ్మిచూలియు, ఆగు, విరించి= బ్రహ్మ, ఉండన్ = ఉండఁగాను, పాయక = విడువక - ఎల్లవేళల ననుట, సిరిన్ = లక్ష్మిని, తక్కన్ + ఏలిన = తానే పాలించిన, ముర + అంతకుఁడు = మురాసురుని అంతమొందించినవాఁడు - విష్ణువు, ఉండన్ = ఉండఁగాను, సమస్త- దేవతా - ప్రకరమున్ = ఎల్ల దేవతల సమూహమును, కొల్వన్ + ఉన్న = సేవింపఁగా నున్న, సుర - పాలకుఁడు = దేవతలను బాలించువాఁడు, ఇంద్రుఁడు, ఉండఁగన్ = ఉండఁగాను, ఇట్టి - మూర్ఖున్ = ఇటువంటి, అవివేకిని, భిక్షుకున్ =

యాచకుని, అపదార్థున్ = వస్తురూపము లేనివానిని - అనాచ్యుని, శంకరున్ = శివుని, ఏమి - గతిన్ = ఏ విధముగా కోరితి = వరించితివి ?

తాత్పర్యము పద్మముఖీ! ఎల్ల విద్యలను ధరించినవాఁడును, పద్మభవుఁడును అగు బ్రహ్మ యుండఁగాను, ఎల్లప్పుడును లక్ష్మిని దానే పాలించు విష్ణువుండఁగాను, ఎల్ల దేవతల సమూహము సేవలనందు ఇంద్రుఁ డుండఁగాను, ఇట్టి మూర్ఖుఁడును, యాచకుఁడును, వస్తురూపము లేనివాఁడును అగు శివు నేరీతిగా వరించితివి ?

విశేషములు . భిక్షక - శబ్దము లేదు APTE లో భిక్షాక శబ్దము గలదు భిక్షుక రూపమే సరియైనది అప్పుడు 'కల్పితి' అని యున్నచో యతి తప్పును అందుచే 'భిక్షుకు నపదార్థు నేమిగతిఁ గోరితి' అనుపారమే మేలయినది బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుఁడు అనువారికడనున్న గుణములు శివునికడ లే వనుట బ్రహ్మ సకల కళాధరుండు - పండితుఁడు - వివేకి, శివుఁడు అవివేకి - మూర్ఖుఁడు విష్ణువు పాయక సిరిఁ దక్కనేలినవాఁడు - ధనవంతుఁడు శివుడు భిక్షుకుఁడు - యాచకుఁడు ఇంద్రుఁడు సమస్తదేవతాప్రకరము సేవల నందువాఁడు వస్తు రూపము గలవాఁడు శివుఁడు అపదార్థుఁడు - వస్తురూపము లేనివాఁడు - కోరితి- 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు' బాల క్రియ 24 కోరితి + వ్ + ఇ కోరితి + ఇ - 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు' బాల సం 11 కోరితి ఇట్లే కల్పితి + వి - కల్పితి

వ అని యనేకప్రకారంబులం బరమేశ్వరు నిరాకరించుచు నితరసురవరుఁ విశేషించుచున్న కృతకవిప్రు నగజ కటాక్షించుచు 26

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ - పెక్కు రీతుల, పరమేశ్వరున్ = శివుని, నిరాకరించుచున్ = అనాదరము చేయుచు, ఇతర - సుర - వరులన్ = అన్య దేవతా శ్రేష్ఠులను, విశేషించుచున్ + ఉన్న = స్తుతించుచున్న, కృతక - విప్రున్ = కపట బ్రాహ్మణుని, అగజ = పార్వతి, కటాక్షించుచున్ = కడగంటఁజూచుచు - అనాదరముతోఁ జూచుచు నని భావము

తాత్పర్యము . అని పెక్కురీతులఁ బరమేశ్వరు ననాదరించుచు నన్య దేవతా శ్రేష్ఠులను స్తుతించుచున్న కపట బ్రాహ్మణుని బార్వతి క్రీగంటఁ జూచుచు - తరువాతి పద్యముతో నన్వయము

పార్వతి కపట వటువును నిరాకరించుచుఁ బలుకుట

నీ బ్రహ్మాండనికరంబు పరమేశు జలమూర్తి
నుదయించు నల్పబుద్బుదము లనఁగ
భాసుర స్థూలరూపమునందుఁ బరమాణు
సమితి నా రోమకూపముల నుండుఁ
గాలాగ్ని తనుమహాజ్వాలాభిహతిఁ దూలి
గలగొను విస్ఫులింగమ్ము లనఁగ
నట్టి బ్రహ్మాండంబులం దొక్క బ్రహ్మాండ
కుహరైకవాసులై కుత్సితాత్ము

తే లనఁగ వర్తించు హరి కమలాస నామ
రేశ్వరాదులఁ దెచ్చి సర్వేశుతోడ
నెన్ని సాళులు పెట్టఁగా నెన్నె దీవు
జడుఁడ వై తెట్లు బ్రాహ్మణజాతిఁ బుట్టి ? 27

అర్థము . బ్రహ్మాండ - నికరంబు = బ్రహ్మాండముల సమూహము, పరమేశు - జల - మూర్తిన్ = శివుని జలరూప మూర్తియందు, అల్ప బుద్బుదములు + అనఁగన్ = చిన్న బుడగలు అనునట్లు, ఉదయించున్ = పుట్టును

(ఆ బ్రహ్మాండములు), భాసుర-స్థూల - రూపమునందున్ = ప్రకాశించు (ఒప్పునట్టి), పెద్దదియగు రూపమునందు, పరమాణు - సమితి - నాన్ = పరమాణువుల సమూహ మనునట్లు, రోమకూపములన్ = వెండ్రుకల రంధ్రములందు, ఉండున్

కాల + అగ్ని = ప్రళయాగ్ని, తను - మహత్ (మహా) - జ్వాలా + అభిహతిన్ = తేజోమూర్తి యొక్క గొప్ప అగ్ని శిఖల దెబ్బచే, తూలి = చలించి, విస్ఫులింగమ్ములు = మిడుఁగుఱులు, అనఁగన్, కలగొనున్ = వ్యాపించును

అట్టి బ్రహ్మాండంబులందున్, ఒక్క బ్రహ్మాండ కుహర + ఏక - వాసులు+ ఐ= గుహవంటి బ్రహ్మాండమునందే నివసించువారయి, కుత్సిత + ఆత్ములు = నింద్యులు, అనఁగన్, వర్తించు = ఉండు, హరి - కమల + ఆసన + అమర + ఈశ్వర + ఆదులన్= విష్ణు బ్రహ్మేంద్రులు మున్నగువారినిదెచ్చి, ఈవు, సర్వ + ఈశుతోడన్ = సర్వేశ్వరునితో, ఎన్ని + చాళులు = ఎన్ని కొండెములు, పెట్టఁగాన్= పెట్టుటకు, ఎన్నెదు - ఎన్నెదవు

బ్రాహ్మణ - జాతిన్ = బ్రాహ్మణజన్మమునందు, పుట్టి - బ్రాహ్మణ జన్మము నెత్తి, ఎట్లు = ఏ రీతిగా, జడుఁడవు + ఐతి = మందుఁడవు - బుద్ధి లేనివాఁడవు, ఐతివి ?

తాత్పర్యము . బ్రహ్మాండముల సముదాయము పరమేశ్వరుని జలరూప మూర్తియందుఁ జిన్నబుడగ లనునట్లు పుట్టును అఎ భాసురమైన పెద్ద ఆకృతియందుఁ బరమాణువుల సమూహ మనునట్లు రోమ రంధ్రములయం దుండును ప్రళయాగ్ని అగ్నిమూర్తి మహాజ్వాలల దెబ్బచేఁ జలించి నిడుఁగుఁ లన వ్యాపించును అట్టి బ్రహ్మాండములం దొక్క బ్రహ్మాండ కుహరమునంతే నిపసించుచు, నింద్యాత్ము లననుండు విష్ణుబ్రహ్మేంద్రాదులను దెచ్చి సర్వేశ్వరునిలో నెన్ని కొండెములు పెట్టనెంతువు? బ్రాహ్మణ జన్మము నెత్తి నీవు మందుఁడ వెట్లయితివి ?

విశేషములు . అలంకారము ఉత్ప్రేక్ష ఎన్ని సాళులు = ఎన్ని + చాళులు = ఎన్ని కొండెములు ఎన్నె దీవు = ఎన్నెదవు + ఈవు = 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు ' బాల క్రియ 24 ఎన్నెద + ఉ + ఈవు - 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు ' బాల సంధి 11 ఎన్నెదు + ఈవు = 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు ' బాల సంధి 7 ఐతెట్లు - ఐతివి + ఎట్లు - లిడ్వకార లోపము, అపదాది సర్వసంధి ఐతి + ఎట్లు = 'మధ్యమపురుష క్రియ లయం దిత్తునకు సంధి యగును ' బాల సంధి 7 ఐతెట్లు

ఉ గంధగజాసురారిఁ బురకాయజకాలబలప్రహారి, ను
గ్రాంధక హారిఁ, దీవ్ర గరళాయతవహ్నివిహారి, దేవతా
సింధుజలౌఘధారి సుర సిద్ధ మునీంద్రగణోపకారి, ను
ద్బంధవిదారి నోఁ బలుక బ్రాహ్మఁడ ! నీ వధికారివే మహిన్? 28

అర్థము : బ్రాహ్మఁడ = ఓయి బ్రాహ్మణుఁడా! గంధ - గజ + అసుర + అరిన్ = మదించిన గజాసురునకు శత్రువైనవాఁడును, పుర-కాయజ-కాల-బల-ప్రహారిన్ = త్రిపురములయొక్కయు, మన్మథునియొక్కయు, యమునియొక్కయు బలమును సంపూర్ణముగా హరించినవాఁడును, ఉగ్ర + అంధక హారిన్ = భయంకరుఁడయిన అంధకాసురుని హరించినవాఁడును, తీవ్ర-గరళ + ఆయత-వహ్ని - విహారిన్ = తీక్ష్ణమైన హాలాహలమనెడి విపులమైన అగ్నిని విశేషముగా

హరించినవాఁడును, దేవతా - సింధు - జల + ఓఘ - ధారిన్ = దివ్య గంగానదీ జల ప్రవాహమును ధరించినవాఁడును, సుర-సిద్ధ-ముని + ఇంద్ర - గణ + ఉపకారిన్ = దేవతలు, సిద్ధులు, మునిశ్రేష్ఠులు అనువారి సమూహమునకు మేలుచేయువాఁడును, ఉద్బంధ-విదారిన్ = గొప్పదైన కట్టును ద్రెంచువాఁడును అగు, ఈశ్వరుని, నోన్ = నొచ్చునట్లు, పలుకన్ = పలుకుటకు, నీవు, మహిన్ = భూమియందు, అధికారివి + ఏ = అధికారము - అర్హత, కలవాఁడవా ?

తాత్పర్యము మదించిన గజాసురునకు శత్రువైనవాఁడును, త్రిపురాసురులయు, మన్మథునిదియు, యమునిదియు బలమును హరించినవాఁడును, భయంకరుఁడైన అంధకాసురుని హరించినవాఁడును, తీక్ష్ణమైన హాలాహలమనెడి విషులమైన అగ్నిని విశేషముగా హరించినవాఁడును, దివ్యగంగాజలప్రవాహమును ధరించినవాఁడును, సురల, సిద్ధుల, మునిశ్రేష్ఠుల సమూహమునకు మేలు చేయువాఁడును, మహాబంధనమును ద్రెంచువాఁడును అగు నీశ్వరుని నొవ్వనాడుటకు ఓ బ్రాహ్మణుఁడా! నీవు భూమియం దధికారివా? కా వనుట

విశేషములు. అలంకార మంత్యానుప్రాసము నొచ్చు ధాతువు 'మధ్యమ ముడుజులు ముజు వాఁబడు' బాల క్రియ 31 'ముజీత్తులు ముత్తు నాఁబడు' బాల క్రియ 86 (ముత్తు పరమగుచో) 'చావు నోవులు చచ్చు నొచ్చుల కగు' నోవు బాల క్రియ 94 'తుమర్థ భావలక్షణంబులందు నుజి యగు' నోవు + నుజి బాల క్రియ 40 'జీత్తు పరం బగునపుడు వాని వువర్ణంబు విభాషను లోపించు' బాల క్రియ 95 నోన్ బ్రాహ్మఁడ - బ్రాహ్మణుఁడ - బ్రాహ్మణ శబ్దమునకు వ్యావహారిక రూపము నిఘంటువుల కెక్కలేదు బాపఁడ = అన్నచో నిర్బాధము జలౌఘ - జల + ఓఘ - వృద్ధి సంధి

చ హరుఁ జెడనాడి ముందఱు కృతాంతకు కన్నది యేమి? నీలకం
ధరు నుఱ కెగ్గులాడి మఱి దక్షుని కన్నది యేమి? విశ్వ
సంహరుపయి నెత్తిపోయి విషమాయుధు కన్నది యేమి? పూర్వ భీ
కరగతి చూచిచూచి పురఘస్మరుఁ బల్కుట నీకు బుద్ధియే? 29

అర్థము. హరున్ = ఈశ్వరుని, చెడన్ + ఆడి = నిందించి, తిరస్కరించి, ముందఱు = పూర్వము, కృతాంతకు - కన్న + అది = యముఁడు పొందినది, ఏమి? నీల-కంధరున్ = కాలగళుని - ఈశ్వరుని, ఉఱక = లక్ష్యపెట్టక, ఎగ్గులు+

ఆడి = నిందలు పలికి, మఱి, దక్షుని - కన్నది + ఏమి? = దక్ష ప్రజాపతి పొందినది యేమి? విశ్వ - సంహరుపయిన్ = భువనములను హరించువాని (శివుని)పై, ఎత్తిపోయి = దండెత్తిపోయి, విషమ + ఆయుధు - కన్న + అది - ఏమి? = లయించు బాణములు గలవాఁడు - మన్మథుఁడు పొందినది యేమి?, పూర్వ-భీకర-గతి = మునుపటి భయంకరమైన విధము, చూచి - చూచి, పుర-ఘస్మరున్ = త్రిపురహరుని-ఈశ్వరుని, పల్కుట = నిందించుట, నీకున్, బుద్ధియే = వివేకమా?

తాత్పర్యము . ఈశ్వరుని నిందించి పూర్వము యముఁడు పొందినది యేమి? గరళకంరుని లక్ష్యపెట్టక నిందించి దక్షప్రజాపతి పొందినది యేమి? విశ్వసంహరుఁడగు నీశ్వరునిపై దండెత్తిపోయి మన్మథుఁడు పొందినది యేమి? మునుపటి భయంకర విధమును జూచిచూచి యీశ్వరుని నిందించుట నీకు వివేకమా? కా దనుట

విశేషములు . కృతాంతకు కన్నది, దక్షుని కన్నది, విషమాయుధు కన్నది - 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్మపద ప్రథమకుఁ దటుచుగ యొక్కషష్ఠ్యగు' ప్రౌఢ కారక 15 'యొక్కకు లోపంబు బహుళంబు ' ప్రౌఢ కారక 16 కన్నది - కన్న + అది - 'అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు' బాల సంధి 45 ముందటు - (రూపాం) ముందఱ

వ అదియునుం గాక 30

అర్థ తాత్పర్యములు . మఱియును - తరువాతి పద్యముతో నన్వయము

చ **నిటలతటప్రచండతరనేత్ర సముత్థిత తీవ్ర పావకో**
త్కట శిఖలం బురాంగభవకాలహరం బగు టేమిపెద్ద? ధూ
ర్జటి నెప మల్గి చూచిన నజప్రకరాండసహస్రకోటు లో
క్కటఁ గమరున్ మహానలము గప్పినఁ దూలకణాళిపోలె నై 31

అర్థము . నిటల శిఖలన్ నిటల - తట = నొసటి ప్రదేశమునందలి, ప్రచండ-తర = మిక్కిలి తీక్ష్ణమైన, నేత్ర = కంటినుండి, సముత్థిత = లేచిన, తీవ్ర = భయంకరమైన, పావక = అగ్నియొక్క, ఉత్కట = ఉగ్రములైన, శిఖలన్ = జ్వాలలచే, పుర + అంగభవ - కాల - హరంబు = త్రిపురములను, మన్మథుని, యముని నశింపఁజేసినది, అగుట, ఏమి - పెద్ద = ఏమి విశేషము? ధూర్జటి =

శివుఁడు, నెపము + అల్లి - చూచుడును = సకారణముగాఁ గోపించి చూచినంతనే, మహత్ (మహా) + అనలము = గొప్ప యగ్ని, కప్పినన్ = క్రమ్మినచో, తూల - కణ+ ఆళి-పోలెన్ + ఐ = దూది లేశముల వరుస విధమయి, అజ - ప్రకర + అండ - సహస్ర - కోటులు = వేలకోటుల సంఖ్యగల బ్రహ్మాండములు - వేయి బ్రహ్మాండముల సమూహములు, ఒక్కటన్ = ఒక్కమాటుగా, కమరున్ = కాలును

తాత్పర్యము నొసటనున్న తీక్ష్ణతరమైన కంటినుండి బయలువెడలిన భయంకరాగ్నితీవ్రజ్వాలలచేఁ ద్రిపురములును, మన్మథుఁడును, యముఁడును నశించు టేమివిశేషము? ఈశ్వరుఁడు సకారణముగాఁ గోపించి చూచినచో వేలకోటుల సంఖ్యలుగల బ్రహ్మాండములు మహాగ్ని క్రమ్మినచో దూదిలవముల వరుసవలెనయి యొక్కమాఱుగాఁ గాలిపోవును

విశేషములు . అలంకార ముపమ

వ నీ వెంతవాఁడ వఖిలభువనాధీశ్వరుండైన పరమేశ్వరు దూషింప!' ననుచున్న గిరిజ పలుకులు విని కృతకమునికుమారుం డపహసించుచు 32

అర్థము. అఖిల - భువన + అధీశ్వరుండు = ఎల్లలోకములకు ప్రభువు, ఐన పరమేశ్వరున్, దూషింపన్ = నిందించుటకు, నీవు + ఎంతవాఁడవు! అనుచున్ + ఉన్న, గిరిజ = పార్వతియొక్క, పలుకులు = మాటలు, విని, కృతక - ముని-కుమారుండు = కపట మునికుమారుఁడు, అపహసించుచున్ = పరిహసించుచు

తాత్పర్యము. ఎల్లలోకములకుఁ ప్రభువైన పరమేశ్వరుని నిందించుటకు నీ వెంతటివాఁడ?' వనుచున్న పార్వతి పలుకులు విని కపటమునిబాలకుఁడు పరిహసించుచు - తరువాతి పద్యముతో నన్వయము

కపట వటువు పార్వతి తపఃకరణము నధిక్షేపించుట

చ తగరము వాఁడిచేసి వెడతాపసి నాకడ బీరగాఁడుగాఁ
బొగడెదు నీవు, మా కలుగఁబోయెదు, లోకమువారు బిక్షుకున్
నగసుత గల్చిపోయెనని నవ్వుదు, రాతఁడు నీకుఁ గల్వఁగాఁ
దగఁడని బుద్ధిసెప్పు డిది తప్పె వరానన ! నీకుఁ జూడఁగాన్ ? 33

అర్థము. తగరమున్ = మెత్తనిదైన తగరమను లోహమును, వాఁడిచేసి = పదనుగలదానినిగాఁజేసి, నీవు, వెడ-తాపసిన్= = అల్పుఁడైన మునిని, నా-కడన్ =

నా దగ్గఱ, బీర-కాఁడు + కాన్ = తేజస్సుగలవానినిగా, పొగడెదు = పొగడెదవు, మాకున్ + అలుగన్ + పోయెదు =మమ్ము ద్వేషింపఁబోదువు, లోకమువారు = ప్రజలు, నగసుత = కొండకూఁతురు -పార్వతి, భిక్షుకున్ = యాచకుని, కల్చిపోయెన్ = వలచెను, అని, నవ్వుదురు = పరిహసింతురు, వర+ఆనన = శ్రేష్ఠమైనముఖముగలదానా! సుందరీ ! ఆతఁడు = ఆ శివుఁడు! కల్వఁగాన్ = వలచుటకు, తగఁడు = అర్హుఁడుకాఁడు, అని బుద్ధి + చెప్పుడు = బుద్ధి-హితముచెప్పుట, నీకున్, చూడఁగాన్ = ఆలోచింపఁగా, తప్పె = అపరాధమా!

తాత్పర్యము. తగరము మిక్కిలి మెత్తని లోహము అది యెన్నఁటికిని బదనెక్కదు అట్టిదానికిఁ బదను పెట్టునట్లు అల్పమునియగు నా యీశ్వరుని దేజస్సుగలవానినిగా నీవు ప్రశంసింతువు మమ్ము ద్వేషింతువు లోకమునందలి ప్రజలు పార్వతి యొకయాచకుని వలచెనని పరిహసింతురు సుందరీ! ఆ శివుఁడు నీకు వలచుటకుఁ దగఁడని హితము చెప్పుటయు నీకుఁ జూడఁగా నేర మాయెనా?

విశేషములు. అలంకార ముపమ బీర - కాఁడు - బీరగాఁడు 'కా కత్తియ వర్ణకంబులు పుంస్త్వస్త్రీత్వంబుల మతుబర్ధంబునం దాటాదుల కగు' బాల తద్ధిత 11 'కా కత్తియల ककारंबुनకు గకారంబు కొండొకచోఁ గానంబడియెడి' బాల తద్ధిత 12 బీరగాఁడు - బీరము గలవాఁడు

ఉ **నేరక కల్చి భిక్షుకుని నీ వొక పెద్దగఁ జేసె దింత, జం**
భారియె భోగసంపదఁ? గృతాంతకుఁడే పటు విక్రమంబునన్ ?
వారిధివల్లభుండె విభవంబున? నా ధనదుండె భూరి వి
త్తోరు సమృద్ధి ? నీ చెనఁటి యూఁపర లేటికి నాడె దెన్నియున్? 34

అర్థము. నీవు, భిక్షుకునిన్, నేరక = తెలియక, కల్చి = వలచి, ఇంత = ఇంతగా, ఒక - పెద్దగన్ + చేసెదు = ఒక గొప్పవానినిగాఁ జేసెదవు, (అతఁడు), భోగ - సంపదన్ = సౌఖ్య సంపత్తియందు, జంభ + అరియె = జంభరాక్షసునకు శత్రువైన ఇంద్రుఁడా ? పటు-విక్రమంబునన్ = తీవ్రమైన పరాక్రమమునందు, యముఁడా? విభవంబునన్ = వైభవమునందు, వారిధి - వల్లభుండె = సముద్రముల కధిపతియగు వరుణుఁడా? భూరి - విత్త + ఉరు - సమృద్ధిన్ = అధికమైన ధనముయొక్క గొప్ప సమృద్ధియందు, ఆ - ధనదుండె = ప్రసిద్ధుఁడైన కుబేరుఁడా?, ఈ-చెనఁటి + ఊఁపరలు = ఈ పనికిమాలిన వ్యర్థభాషణములు, ఎన్నియున్ = ఎన్నియైనను, ఏటికిన్ = ఎందులకు, ఆడెదు = పలుకుదువు?

తాత్పర్యము నీ వొక యాచకునిఁ దెలియక ప్రేమించి వాని నింతగా నొక పెద్దవానినిగాఁ జేసెదవు అతఁడు సౌఖ్యసంపత్తియందు మహాభోగియగు నింద్రుఁడా? మహాపరాక్రమమునందు యముఁడా? వైభవమునందు వరుణుఁడా? అధికమైన ధనసమృద్ధియందుఁ గుబేరుఁడా? పనికిమాలిన యీ వ్యర్థ భాషణముల నెన్నియు నేల యాడెదవు?

వ మఱి యట్లుంగాక 35

అర్థతాత్పర్యములు. అదియును గాక - తరువాతి పద్యముతో నన్వయము

సీ మగ లాఁడువారికి మరగి మ్రుచ్చిలి బంది
వట్టి కన్నంబులు వెట్టి తెరువు
త్రెక్కొని చని పరదేశంబు లుడుగక
త్రిమ్మరి వ్రేళ్లును తొమ్ముఁ బోయి
యాచకులై వేఁడి నీచుల సేవించి
కల మెక్కి చని నలిఁ గయ్యమాడి
యేనుంగునకుఁ దాడి యి ట్లెన్నియేనియుఁ
గష్టముల్ పడి రాక కలదు గాక

ఆ మగలఁ గోరి తొల్లి మగువలు తపములు
చేసి నవసి రనినచెట్ట లెందుఁ
గలవె? దీని కచ్చు నిలిపితి వీవ, నీ
వలన సతుల పురులు పాలిసెఁగాక 36

అర్థము మగలు = పురుషులు, ఆఁడువారికిన్ = స్త్రీలకు, మరగి = ఆసక్తివహించి, మ్రుచ్చిలి = వంచించి, బంది - పట్టి = బందిపోటు చేసి, కన్నంబులు + పెట్టి = కన్నము వేసి దోఁచుకొని, తెరువు-త్రెక్కొని = దారిగొట్టి, చని = పోయి, పర-దేశంబులు = దేశాంతరములు, ఉడుగక = మానక, త్రిమ్మరి = తిరిగి, వ్రేళ్లును తొమ్ముఁన్ + పోయి = వ్రేళ్లును, తొమ్మును అఱిగిపోయి, యాచకులు + ఐ = భిక్షుకులయి, వేఁడి = అడుగుకొని, నీచులన్ = అధములను, సేవించి, కలము + ఎక్కి = ఓడనెక్కి, చని, నలిన్ = ఉత్సాహముతో, కయ్యము + ఆడి = కలహించి, ఏనుంగునకున్ + తాడి = ఏనుఁగున కెదురొడ్డి, ఇట్లు + ఎన్ని + ఏనియున్ = ఈ రీతిగా నెన్నియైనను, కష్టముల్ - పడి = కష్టము లనుభవించి, రాక - వచ్చుట, కలదు - కాక = ఉన్నది కాని,

మగలన్ + కోరి = పురుషులను గోరి, తొల్లి = పూర్వము, మగువలు = స్త్రీలు, తపములు, చేసి, నవసిరి = కృశించిరి, అనిన చెట్టలు = అనిన దారుణములు, ఎందున్ = ఎచ్చటనైనను, కలవె = ఉన్నవా?

ఈవు + అ = నీవే, దీనికిన్ = స్త్రీలు పురుషులకొఱకుఁ దపస్సు చేసి కృశించుటకు, అచ్చు - నిలిపితివి = ప్రథమ దృష్టాంతమును నిలిపితివి, నీ వలనన్ = నీ మూలమున, సతుల = స్త్రీల, పురులు = పరువు, పోలినెన్ + కాక = నశించెనుగాక!

తాత్పర్యము పురుషులు స్త్రీలయెడ నాసక్తి వహించి, పెంచించి, బందిపోటుతనము చేసి, కన్నము వేసి, దారిగొట్టి, దేశాంతరములు మానక తిరిగి వ్రేళ్లును, తొమ్మును అటిగి పోయి, భిక్షుకులయి నీచులను గొలిచి ఓడ నెక్కి పోయి, ఉత్సాహముతోఁ గలహించి, యేనుఁగునకు ఎదురొడ్డి - ఈ రీతిగా నెన్నేని కష్టము లనుభవించుట లోకమున నున్నదికాని, పూర్వము పురుషులను గోరి స్త్రీలు తపముల నాచరించి కృశించిన దారుణము లెందైనఁ గలవా? నీవే దీనికిఁ బ్రథమదృష్టాంతమును నిలిపితివి నీ వలన స్త్రీల పరువు పోయినది

విశేషములు వ్రేళ్లును తొమ్మఁబోయి - దీనికర్థము సందర్భానుసారముగాఁ జెప్పఁబడినది

క వసుధాధరేంద్రసుత! నీ
వసదృశముగ శివునిఁ గూడి యాడుట యాఁడుం
బసి పని, 'సమాన శీల
వ్యసనేషు సుసఖ్య' మనిన వచనము వినవే ? 37

అర్థము: వసుధాధర + ఇంద్ర - సుత = పర్వతరాజు కూఁతురా! - పార్వతీ! నీవు, అసదృశముగన్ = సాటిలేని రీతిగా, శివునిన్ కూడి = కలిసి, ఆడుట = విహరించుట, ఆఁడున్ + పసి - పని = స్త్రీల పిల్ల చేష్ట, సమాన - శీల - వ్యసనేషు = సమానమైన స్వభావము, వ్యసనము గలవారిలో, సు-సఖ్యమ్ = మంచి స్నేహము, అనిన, వచనమున్ = మాటను, వినవే = వినలేదా?

తాత్పర్యము. పార్వతీ ! నీవు అసమానముగా శివునిఁ గూడి విహరించుట- శివునిఁ బెడ్డియాడుట స్త్రీల పిల్లచేష్ట మంచిస్నేహము సమానస్వభావము వ్యసనము గలవారియందే యొప్పు నను మాట నీవు వినలేదా?

విశేషములు . సమాన శీల సుసఖ్యమ్ + అనిన - 'అనుకరణంబునం దహామాదుల మకారంబునకు ద్విరుక్తి విభాషనగు బాల సంధి 53

సీ ఎమ్ములు దొడవను నింతియ కా దందుఁ
బెనుబాము లెడనెడఁ బెనఁగియుండు
వాదేమి మెయిపూఁత బూది యన్నింతయ
కా దది యొలుకుల బూది నెఱయ
నశనంబు భిక్షాన్న మనుటయ కా దందుఁ
గూడఁబోసిన పులికూడు మఱియు
నేకాకియై యుండు నింతియకాదు ప్రే
తావాసముల నుండు ననుదినంబు

తే చూడ విరసమై నగ్నంబుతోడ నుండు
నదియుఁగా కిరుసంజల నాడు, మరులు
గొరగఁ గలుచుఁగా కాతనిఁగోరి తపము
సేసె దట గౌరి! నీ వెంత చేట్ల పురులొ ! 38

అర్థము . గౌరి = పార్వతీ! ఎమ్ములు = ఎముకలు, తొడవు + అను + ఇంతియ - కాదు = ఆభరణము అనుట మాత్రమే కాదు, అందున్ = ఆ ఎముకలలో, పెను + పాములు = పెద్దపాములు, ఎడనెడన్ = నడుమనడుమ, పెనఁగి + ఉండున్ = మెలిగొనియుండును

వాదు + ఏమి = వాదమేమి? మెయి - పూఁత= శరీరముపైఁబూఁత, బూది = బూడిద, అను + ఇంతియ-కాదు = అను నింతమాత్రమేకాదు, అది = ఆ పూఁత, నెఱయన్ = పూర్ణముగా, ఒలుకుల - బూది= కాటి బూడిద

అశనంబు = ఆహారము, భిక్షా + అన్నము = బిచ్చపుఁగూడు, అనుట + అ + కాదు = అనుటయే కాదు, అందున్ = ఆ కూటిలో, కూడన్ + పోసిన = కలియునట్లు పోసిన, పులి-కూడు = పులిసినయన్నము,

మఱియున్, ఏకాకి + ఐ = ఒంటరివాఁడయి, ఉండన్, ఇంతియ - కాదు = ఇంతెకాదు, అనుదినంబున్ = ప్రతిదినమును, ప్రేత + ఆవాసములన్ = శ్మశానభూములందు, ఉండున్

చూడన్, విరసము + ఐ = అసహ్యమయి, నగ్నంబు తోడన్ = దిగంబరత్వముతో, ఉండున్, అదియున్ + కాక, ఇరు-సంజలన్ =

ప్రాతస్సాయంసంధ్యాసమయముల రెంటను, ఆడున్ = నర్తించును, పిసుళు = పిశాచము, గొరగన్ = భిక్షుకుని, కలుచున్ + కాక = వలచును గాని, ఆపనన్, కోరి, తపము + చేసెదు + అట = తపస్సు చేయుదువట, నీవు + ఎంత, చేట్ల - పులో = నీవు ఎంత చేటులు దెచ్చు ప్రకృతివో - స్వభావముగలదానవో!

తాత్పర్యము గౌరీ! ఆ శివునకు ఎముకలు ఆభరణములనునంత మాత్రమే కాదు ఆ ఎముకలలో బెద్దపాములు నడుమనిడుమ మెలిగొనియుండును శరీరముపై బూత నిర్వివాదముగా, బూడిద యనునింతమాత్రమేకాదు ఆ పూత యంతయుఁ గాటి బూడిద ఆతని ఆహారము బిచ్చపుఁగూడనుటయేకాదు ఆ కూడు పులిసిన అన్నముతోఁ గూడినది మటియు నొంటరివాఁ డనుట మాత్రమే కాదు ప్రతిదినమును అతఁడు శ్మశానభూములం దుండును చూడఁగా నతఁడు అసహ్యముగా దిగంబరుఁడై యుండును అదియునుగాక ప్రాతస్సాయం సంధ్యాసమయములందు రెంటను దాండవము చేయును భిక్షుకునిఁ బిశాచము వలచును గాని, నీ వాతనిని గోరి తపస్సు చేయుట విడ్డూరము నీవు ఎంత చేటులు దెచ్చు స్వభావము గలదానవో!

విశేషములు. ఇంతియ - ఇంతె నగ్నంబుతోడన్ - నగ్నత్వము లోడన్ భావార్థమునకు మాఱుగా విశేషణము వాడఁబడినది అదియుఁగా కిరుసంజల నాడున్- మఱులు గొరగఁగలుచుఁగాక' అని విభజింపఁబడినది చేసెదట - చేసెదవు + అట - లాట్టు వకారమునకు వైభాషికలోపము బాల క్రియ 24 చేసెద + ఉ + అట - అపదాదిస్వరసంధి బాల సంధి 11 చేసెదు + అట ఉత్వసంధి బాల సంధి 1 నీ వెంత చేట్ల పురులో - నీ కృత్యములు (బింకపుఁబనులు) ఎట్టి చెట్టలను తెచ్చునోకదా! అని వావిళ్లప్రతి వ్యాఖ్యాత వ్యాఖ్యానించెను కాని యిందలి శబ్దముల కా యర్థమెట్లు పొసఁగునో తెలియదు అందుచే నీవు + ఎంత - చేట్ల పురులో - నీవు ఎంత చేటులను దెచ్చు ప్రకృతివో అని వ్యాఖ్యానింపఁబడినది పురులు - స్వభావము, ప్రకృతి (సూ ని)

క తొడవులు చిలికిన యెమ్ములు
గుడిముట్టు కపాల, మిల్లు గుడి; ముడియె ద్దె
క్కుడు; గట్టువలువు దో లగు,
బడరునకై నవయ నేమి ప్రళయము వచ్చెన్? 39

అర్థము. తొడవులు = ఆభరణములు, చివికిన - చీకిపోయిన, ఎమ్ములు= ఎముకలు, కుడిముట్టు = భోజన పాత్రము, కపాలము = పుర్రె, ఇల్లు, గుడి =

దేవాలయము, ముడి = ముదిసిన, ఎద్దు, ఎక్కుడు = వాహనము, కట్టు - వలువు= కట్టు బట్ట, తోలు, అగున్, బడరునకున్ + ఐ = దరిద్రునకయి, నవయన్ = శ్రమించుటకు, ఏమి - ప్రళయము - వచ్చెన్ = ఏమి కొంప మునిఁగెను?

తాత్పర్యము శివునకు ఆభరణములు చీకిపోయిన ఎముకలు భోజనపాత్రము పుట్టె, ఇల్లు దేవాలయము, ముదిసినయెద్దె వాహనము, కట్టుబట్ట తోలు అట్టి దరిద్రునకై నీవు శ్రమపడుట కేమి కొంప మునిఁగెను?

విశేషములు మా రా ప్రతిలో 'ఇల్లు గుడిముడి = అని విభజించి ఇల్లు శ్మశానమని వ్రాయఁబడెను కాని 'గుడిముడి = శ్మశానము' అని నిఘంటువులఁ గానరాలేదు అందుచే ఇల్లు గుడి - ముడియెద్దు = ముసలి యెద్దు అని అర్థము చెప్పఁబడెను

సీ మణి భూషణ ప్రభామంజరు లెలమించి
తనువల్లికకు వసంతంబు సేయు!
సమదాంచితాంగ విభ్రమములు వెలయించి
శృంగారలక్ష్మికిఁ జెన్ను సేయు!
కాముకజనుల నీక్షణ మాత్ర నెఱిఁగించి
సౌభాగ్యవామ కుత్సవము సేయు!
కోరిక రతికళాకుశలత ప్రకటించి
దర్పకు రాజ్యపదస్థుఁ జేయు!

తే సారసంసార మెల్ల నిస్సార మేల
చేయ నెత్తెదు? వలదు, నా చెప్పు సేయు!
తరుణి! నిను వేఁడికొని కాంతుఁ దపముఁసేయ
నర్దిసేయకు, మొం డేదియైనఁ జేయు! 40

అర్థము : మణి - భూషణ - ప్రభా - మంజరులు = రత్నాలంకారముల కాంతులనెడు పూలగుత్తులు, ఎలమించి = వికసింపఁజేసి, తను-వల్లికకున్ = మైఁదీఁగకు, వసంతంబు + చేయు = వసంత మగునట్లు చేయుము

స-మద + అంచిత + అంగ - విభ్రమములు = గంధముతోఁ గూడినవి, ఒప్పినవి, అగు, అవయవముల విలాసములు, వెలయించి = ప్రకాశింపఁజేసి,

శృంగార - లక్ష్మికిన్ = సొగసైన వేషమనెడి లక్ష్మికి, చెన్ను +చేయు = అందమును గూర్పుము

కాముక - జనులన్ = ప్రేమించు జనులను, వీక్షణ-మాత్రన్ = చూపులోడనే, ఎటిఁగించి = తెలియఁజేసి, సౌభాగ్య-వామకున్ = సౌందర్యమనెడు స్త్రీకి, ఉత్సవము+ చేయు = పండుగు చేయుము

కోరికన్ = కోరికతో, రతి-కళా-కుశలత = సంభోగ విద్యానైపుణ్యము, ప్రకటించి = తెలిపి, దర్పకున్ = మన్మథుని, రాజ్య - పదస్థున్ + చేయు = రాజ్యాధికారస్థానమునందు ఉన్నవానినిగాఁ జెయుము

తరుణి = ఇంతీ! సార-సంసారము + ఎల్లన్ = సారవంతమైన సంసారము నంతను, నిస్సారము = సారహీనమయినదిగా, ఏల - చేయన్ + ఎత్తెదు = ఎందులకుఁజేయఁబూనుదువు? వలదు = వద్దు, నా-చెప్పు + చేయు = నేను జెప్పునది చెయుము, నినున్, వేఁడికొని, కాంతున్ = చూతును, తపము + చేయన్ = తపము నాచరించుటకు, అర్థిన్ + చేయకుము = కోరకుము, ఒండు + ఏమి + ఐనన్ + చేయు =మఱియొకటి యేదయినను జేయుము

తాత్పర్యము. పార్వతీ! రత్నాలంకారముల కాంతు లనెడు పూల గుత్తులను వికసింపఁజేసి నీ మైఁదీఁగకు వసంతమగునట్లు చేయుము పరిమళవంతములైన అవయవముల విలాసములు ప్రకటించి నీ సొగసైన వేషమనెడి లక్ష్మికి అందమును గూర్పుము కాముకులను జూపులతోడనే తెలియునట్లుచేసి నీ సౌందర్యమనెడు స్త్రీకిఁ బండువు చేయుము కోరికతో సంభోగవిద్యానైపుణిని ప్రకటించి మన్మథుని రాజ్యాధికారస్థానమందుండునట్లు చేయుము సారవంతమైన సంసారమునంతను ఏల నిస్సారమయినదిగాఁ జేయఁబూనుదువు? వలదు నేనుజెప్పినట్లు చేయుము నిన్ను వేఁడికొందును తపస్సు చేయఁగోరకుము మఱియొకటి యేదయినను జేయుము

విశేషములు . వావిళ్లప్రతి వ్యాఖ్యాత 'పాదాంతములందలి 'చేయు' అనుదానిని ప్రథమపురుషక్రియగా వ్యాఖ్యానించెను కాని అది మధ్యమ పురుషైకవచన క్రియగనే చెప్పుట మేలనిపించినది ప్రభామంజరులు, శృంగార లక్ష్మి సౌభాగ్యవామ - రూపకములు చేయు = చేయుము 'మధ్యమపురుష మువర్ణకంబునకు హలవ సానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు' బాల సంధి 47 ఎత్తెదు

- ఎత్తెద + వు 'లాట్టువకారమునకు వైభాషికలోపము' - బాల క్రియ 24 అపదాది స్వరసంధి - బాల సంధి 11 నా - చెప్పు - నా మాట - ధాతువు ఎశేష్యముగాఁ బ్రయుక్తము - కృదంతము - 'ఉవర్ణకం బడుక్వాదుల కగు' బాల కృదం 21 చెప్పు + ఉ = చెప్పు - అపదాది స్వరసంధి బాల సంధి 11 ఒప్పు' లోనగువానివంటిది

చ ఎలఁబొఁవోని మేను నవయించియు, రాగరసంబు నిండుఁగుం
డలొ యను వీఁగుఁజన్నుల బెడం గెడలించియు, మారు పువ్వుఁదూ
పుల నగు లోలదృగ్రుచు లపోహము పుచ్చియు, భోగవృద్ధి ని
ష్ఫలముగఁ జేసియుం, దుదిఁ దపంబున నయ్యెడిదేమి చెప్పుమా! 41

అర్థము ఎలఁబొఁ + పోని = లేఁజిగురువంటి, మేను = శరీరము, నవయించియున్ = కృశింపఁజేసియును, రాగ-రసంబు - నిండు + కుండలొ = శృంగారరసముయొక్క పూర్ణకుంభములో అను, వీఁగు + చన్నుల = నిక్కుఁ జన్నుల యొక్క, బెడంగు = అందము, ఎడలించియున్ = పోఁగొట్టియును, మారు-పువ్వు -తూపులన్ = మన్మధుని పుష్పబాణములను, నగు =పరిహసించు, లోల - దృశ్ (క్) + రుచులు = చలించు దృక్కాంతులు, అపోహము - పుచ్చియున్ = చెడఁగొట్టియును, భోగ-వృద్ధిన్ = సుఖ సమృద్ధిని, నిష్ఫలముగన్ + చేసియున్ = వ్యర్థము చేసియును, తుదిన్ = చివర, తపంబునన్ = తపస్సుచేత, అయ్యెడిది + ఏమి = అగునదియేమి, చెప్పుమా

తాత్పర్యము . లేఁజిగురువంటివేనిని గృశింపఁజేసియును శృంగారరసపూర్ణకుంభములాయననున్న నిక్కుఁజన్నుల అందమును బోఁగొట్టియు, మన్మధుని పుష్పబాణములను బరిహసించు చంచలదృక్కాంతులను జెడఁగొట్టియును సుఖసమృద్ధిని వ్యర్థముగాఁజేసియును జివరకుఁ దపమువలన నగులాభ మేమో చెప్పుము

విశేషములు ఎలఁబొఁ - ఎలపొఁయని సూ ని ఎలపొఁవోని మేను - అలంకార ముపమ మారు పువ్వుఁదూపుల నగు - అలంకారము వ్యతిరేకము - 'వ్యతిరేకో విశేష శ్చే దుపమేయోపమానయోఃʼ చన్ద్రా దృశ్ + రుచులు = దృక్ + రుచులు - దృగ్రుచులు నిండుఁగుండలొ - నిండు + కుండలొ, పువ్వుఁదూపులు - పువ్వు + తూపులు - 'సమాసముల నుదంత స్త్రీ సమములకుఁ బరుషములు పరములగుచుండఁగా నుగాగమము' - బాల సంధి 25 పిమ్మట ద్రుతకార్యము బాల సంధి 16, 17

వ అని యనేకప్రకారంబుల భేదించుచున్న తన్నుఁ బ్రతీకరించి యదత్త ప్రతివచనయై యున్న గౌరి నాక్షేపించుచు 42

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ = పలు విధముల, భేదించుచున్ + ఉన్న = విరోధించుచున్న, తన్నున్ = తన్ను - ఈశ్వరుని, ప్రతీకరించి = నిరాకరించి, అదత్త - ప్రతివచన + ఐ = సమాధానము నొసఁగనిదయి, ఉన్న, గౌరిన్ = పార్వతిని, ఆక్షేపించుచున్ తిరస్కరించుచు

తాత్పర్యము అని పెక్కురీతుల విరోధించుచున్న తన్నుఁదిరస్కరించి సమాధానము చెప్పుచున్న పార్వతిని నిరాకరించుచు - తరువాలి పద్యముతో నన్వయము

క పులిగూడు తిండి గొరగం
గలిచియు నో చెల్ల ! యింత గల్పించెదు శ్రీ
గలవానిఁ దగిన పురుషుం
గలిచిన నీ కన్నుదోయిఁ గను డరు దనుమా 43

అర్థము : పులి - కూడు - తిండి + గొరగన్ + పులిసిన అన్నమును దిను భిక్షుకుని, కలిచియున్ = వలచియు, ఓచెల్ల = బాపురే, ఇంత, కల్పించెదు = కలిగింతువు, శ్రీ + కలవానిన్ = డబ్బు గలవానిని, తగిన - పురుషున్ = నీ కర్హుఁడైనపురుషుని, కలిచిన = వలచిన, నీ- కన్నుదోయిన్ = నీకన్నుల జంటను, కనుడు = కనుట, అరుదు = అపూర్వము, అనుమా

తాత్పర్యము . పులిసిన కూటిని దిను భిక్షుకుని వలచియు బాపురే! ఇంత కల్పించెదవు డబ్బుగలవానిని నీ కర్హుఁడగు వానిని వలచిన నీ కన్నుల జంటను గనుట దుర్లభముగదా!

వ అని వాయోడక నెరనంటం బలికి పెక్కు దెఱంగుల నీశు దూషించుచుఁ దన్ను వికారదృష్టిఁ గనుంగొని సాభిలాషోక్తులు ప్రకటించుచున్న కృతకవిప్రు నగజ కటాక్షించి 44

అర్థము : అని, వాయోడక = సంకోచింపక, నెరను = మర్మమును, అంటన్ +పలికి = తాఁకునట్లు పలికి, పెక్కు - తెఱంగులన్ = అనేక విధముల, ఈశున్ = ఈశ్వరుని, దూషించుచున్ = నిందించుచు, తన్నున్, వికార - దృష్టిన్ =

వికృతపుఁజూపుతో, కనుంగొని = చూచి, స+అభిలాష+ ఉక్తులు = కోరికతోఁగూడిన మాటలు, ప్రకటించుచున్ + ఉన్న = వెలయించుచున్న, కృతక -విప్రున్ = కపట బ్రాహ్మణుని, అగజ = పార్వతి, కటాక్షించి = క్రీఁగంటఁ జూచి - అనాదరముతోఁ జూచి

తాత్పర్యము. అని సంకోచింపక మర్మము ముట్టఁబలికి యనేకవిధముల నీశ్వరుని నిందించుచుఁ దన్ను వికారపుఁజూపుతోఁ జూచి కోరికతోఁ గూడిన మాటలు వెలయించుచున్న కపట బ్రాహ్మణుని బార్వతి యనాదరముతోఁ గడకంటఁ జూచి - తరువాతి పద్యముతో నన్వయము

క **ఏలిదము చేసి మెచ్చక**
తూలముగాఁ బలికి కడవ దూషించెదు, నీ
ప్రేలరితన మంగజహరు
భాలాంబకవహ్ని పాలుపడ కుడుగ దెడన్ 45

అర్థము. ఏలిదము + చేసి = చులుకనచేసి, మెచ్చక, తూలముగాన్ = తేలికగా, పలికి, కడవన్ = హద్దుమీఱి, దూషించెదు = నిందింతువు, నీ - ప్రేలరితనము = నీ వదరుఁబోతుతనము, అంగజ-హరు = మన్మథహరునియొక్క-శివునియొక్క, భాల + అంబక - వహ్ని = నొసటికంటి మంటయొక్క, పాలు పడక= పాలుగాక, ఎడన్ - ఉడుగదు = నడుమ నాఁగదు

తాత్పర్యము. శివునిఁ జులుకన చేసి మెచ్చక తేలిక చేసి పలికి మేరమీఱి నిందింతువు నీ వదరుఁబోతుతనము ఫాలాక్షుని నొసటికంటిమంట పాల్పడక తప్పదు

విశేషములు. ఏలిదము - ఎల్లిదము (రూపాం) తూలము = దూది - తేలిక అని భావము, దూషించెదు - మూషించెదవు - లాద్వకారమునకు వైభాషికలోపము - బాల క్రి 24 అపదాదిస్వరసంధి బాల సంధి 11 భాలము (రూపాం) ఫాలము అంబకము (నానా) కన్ను, బాణము

వ **అని కోపించి నెఱయం దలంచి తపోభంగభీతిం దన్నుఁ దాన సంతరించుకొనుచున్న నగజం గని సఖులు కపట వటు కృతానేక విఘ్నపరంపరకు గౌరి నిశ్చలతపోభారంబునకు విస్మితు లగుచు** 46

అర్థము: అని, కోపించి, నెఱయన్ = బాగుగా, తలంచి, తపన్ (ః) + భంగ - భీతిన్ = తపస్సుయొక్క విఘ్నమువలని భయముచేత, తన్నున్, తాను + అ =

తానే, సంతరించుకొనుచున్ + ఉన్న = సరిపెట్టుకొనుచున్న, నగజన్ = పార్వతి, కని, సఖులు = చెలికత్తెలు, కపట - వటు - కృత + అనేక - సమ్ము - ఎలమి = కృతకబ్రహ్మచారిచేతఁ జేయఁబడిన పెక్కు ఆతంకముల యొక్క ఎలమి, గౌరి = పార్వతియొక్క, నిశ్చల-తపస్ + భారంబునకున్ = ఎడతెగని తపస్సుయొక్క బరువునకును, విస్మితులు + అగుచున్ = ఆశ్చర్యపడినవారగుచు

విశేషములు : విస్మితులగుచు - నేను జూచిన ప్రతులన్నిటి నెట్లే కలదు కాని 'విస్మితులు' అను దానికి విశేషకుడు స్త్రీలింగమైన సఖులు కాబట్టి విస్మితలగుచునని యుండవలయును

తాత్పర్యము . అని కోపించి బాగుగాఁ దలఁచి తపస్సు పాడుచేసిన భయముచేఁ దన్నుఁదానే సరిపెట్టుకొనుచున్న పార్వతిని జూచి చెలికత్తెలు కపట బ్రహ్మచారి చేసిన పెక్కు విఘ్నములకును, పార్వతి అచంచల తపోతిశయమునకును ఆశ్చర్యపడినవారగుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ అలఁచి విపత్ప్రయోగత మహాత్ముల ధైర్య మడంపఁజూతు, నీ
యలవియె ధాత్రి? బేల విది యాఱడి కాఱియ దక్కు మమ్మహా
ప్రళయము వచ్చినం దలరి పాడటి క్రాఁగఁగ, వారి ధైర్య మీ
కులగిరులే? పయోనిధులె? కుంభినియే? నభమే? యజాండమే? 47

అర్థము అలఁచి = శ్రమపెట్టి, విపద్ + ప్రయోగతన్ = ఆపదను గలిగించుటచేత, మహత్ (మహా) ఆత్ముల - ధైర్యము = గొప్ప వారి ధైర్యము, అడంపన్ + చూతు = నశింపఁజేయఁజూతువు ధాత్రిన్ = భూమియందు, నీ + అలవి + ఎ = నీ తరమా ? బేలవు = వెఱ్ఱివాఁడవు, ఇది, ఆఱడి - కాఱియ - వృధాశ్రమము, తక్కుము = విడువుము, ఆ + మహత్ (మహా) - ప్రళయము = ఆ గొప్ప ప్రళయము, వచ్చినన్ = వచ్చినను, తలరి = చలించి, పాడటి = పాడుపడి క్రాఁగఁగన్ - నశించుటకు, వారి-ధైర్యము = ఆ మహాత్ముల ధైర్యము, ఈ - కుల - గిరులు + ఏ = ఈ కులపర్వతములా? పయోనిధులు + ఎ = సముద్రములా? కుంభిని + ఏ = భూమియా? నభము + ఏ = ఆకాశమా? అజాండము+ ఏ = బ్రహ్మాండమా?

తాత్పర్యము . శ్రమపెట్టి ఆపదను గలిగించుటచే గొప్పవారి ధైర్యమును నశింపఁ జేయఁజూతువు అది భూమియందు నీ తరమా? వెఱ్ఱివాఁడవు ఇది నీ వృధాశ్రమము మానుము ఆ మహాప్రళయము వచ్చినను జలించి, పాడువడి, నశించుటకు మహాత్ముల ధైర్యము ఆ కులపర్వతములా? సముద్రములా? భూమియా? ఆకాశమా? బ్రహ్మాండమా?

విశేషములు మహాప్రళయము వచ్చుచో గులపర్వతాదులు చలించి నశింపవచ్చునుగాని, శివుని ధైర్యము నశింపదనుట బేలవిధి - బేల విది యని రాళ్ళపల్లివారి పాఠము

వ అనుచుం గృతకవిప్రు నందఱు నాక్షేపించి 48

అర్థము అనుచున్, కృతక - విప్రున్ = కపటబ్రాహ్మణుని, అందఱున్ = చెలికత్తె లందఱును, ఆక్షేపించి = తిరస్కరించి

తాత్పర్యము అని పలుకుచుఁ గపటబ్రాహ్మణు నందఱుఁ దిరస్కరించి - తరువాతి పద్యముతో నన్వయము

కపట వటువును బార్వతి చెలులదిక్షేపించుట

క "తఱుసంటి, తన్ను నెదిరిని
నెఱుఁగడు తనకొలఁది పుడుక నెఱుఁగఁడు, మొండిఁ
డఱజాతి, మ్రక్కు, మన్నం
గొఱఁ, డెక్కడ - నిట్టి ప్రేలుగొండులుఁ గలరే ? 49

అర్థము . తఱుసంటి = అజ్ఞుఁడు, తన్నున్, ఎదిరినిన్ - ఎదుటివానిని ఎఱుఁగఁడు, తన కొలఁది - పుడుకలు - తనస్థితికిఁ దగిన ప్రసంగములు, ఎఱుఁగఁడు, మొండిఁడు = మొండివాఁడు, అఱజాతి = హీనకుల్యుఁడు, మ్రక్కు = కలుషాత్ముఁడు, మన్నం గొఱఁడు = గౌరవము లేనివాఁడు, ఎక్కడన్ = ఎచ్చటనైనను, ఇట్టి, ప్రేలు గొండులు = ప్రలాపులు, కలరే = ఉన్నారా ?

తాత్పర్యము . ఇతఁడు అజ్ఞుఁడు తన్నును ఎదుటివానిని ఎఱుఁగఁడు తనస్థితికిఁ దగిన ప్రసంగములు చేయుట తెలియనివాఁడు మొండివాఁడు హీనకులుఁడు కలుషాత్ముఁడు గౌరవహీనుఁడు ఎక్కడనైన నిట్టి ప్రేలరు లున్నారా? లే రనుట

విశేషములు . ఈ పద్య మాచ్చికశబ్దమయమగుట గమనింపఁదగినది మొండిఁడు - మొండి + ఈ - 'ఈ ప్రత్యయంబు కొన్నింటికి స్వార్థంబునం దగు' బాల తద్ధిత 16 అపదాదిస్వరసంధి - బాల సం 11 మొం'డి' 'మహత్తులగు మగాదులకుం గయిరాదులకును డుజ్జగు నుత్వంబు గాదు' బాల ఆచ్చిక 4 మొండి + డుజ్ - 'జిత్తు బిందుపూర్వం బగు' బాల తత్సమ 19 మొండిఁడు

వ అనుచు గిరినందన కెడసొచ్చి మునినందనుం గనుంగొని 50

అర్థము. అనుచున్ గిరినందనకున్ = కొండకూఁతునకు - పార్వతికి, ఎడ + చొచ్చి= అడ్డుపడి, మునీ - నందనున్ = మునికుమారుని - కపటవటువును, కనుంగొని = చూచి

తాత్పర్యము అనుచుఁ బార్వతి కడ్డుపడి కపటవటువును జూచి - తరువాతి పద్యముతో నన్వయము

సీ. సురవిరోధుల నోర్చి సురసేన నెల్లఁ జే
కొని కావనోపెడు కొడుకుఁ బడయ
సురరాజు మొదలుగా సురలెల్లఁ గొలువఁ బే
రోలగంబునఁ గొలువుండఁ బేర్మి
శ్రీ వాక్చచీ సురసిద్ధ విద్యాధర
దనుజాంగనల వర్ష్వఁబనులు గొనఁగఁ
బద్మసంభవు శిరఃపద్మంబు సత్కీళి
పద్మంబుగాఁ గేలఁ బట్టి యాడఁ

తే బుండరీకాక్షు లోచనపుండరీక
మంఘ్రిపీరంబుగా మీఁద నడుగు సాఁప
నభవు దేహార్ధ మురువడి నాక్రమించి
కొనఁగఁ జువ్వె యీ తపమెత్తికొనియె నగజ 51

అర్థము. సుర-విరోధులన్ = దేవతల శత్రువులను - రాక్షసులను, ఓర్చి = ఓడించి, సుర-సేనన్ + ఎల్లన్ = దేవసైన్యమునంతను, చేకొని = గ్రహించి - నాయకుఁడయి, కావన్ = రక్షించుటకు, ఓపెడు = సమర్థుఁడగు, కొడుకున్ - కుమారుని, పడయన్ = పొందుటకును, సుర-రాజు = దేవాధిపతి - ఇంద్రుఁడు, మొదలుగాన్ = మున్నుగా, సురలు + ఎల్లన్ = దేవతలందఱను, కొలువన్ = సేవించుచుండఁగా, పేర్మిన్ - గొప్పతనముతో, పేరోలగంబునన్ (పేరు + ఓలగంబునన్) = నిండుకొలువున, కొలువు + ఉండన్ = కొలువుదీర్పఁగను,

శ్రీ - వాచ్ (క్) + శచీ - సుర - సిద్ధ - విద్యాధర - దనుజ + అంగనలన్- లక్ష్మి, సరస్వతి, శచీదేవి, సురల, సిద్ధుల, విద్యాధర, - రాక్షసుల భార్యలను, వర్ష్వఁబనులు - కొనఁగన్ = దాస్యముచేయించుకొనఁగను,

పద్మసంభవు = తమ్మిచూలి - బ్రహ్మయొక్క, శిరస్ (ఃు) + పద్మంబు = తామరవంటి శిరస్సు, సత్ + కేళి - పద్మంబుగాన్ = మేలయిన విలాసపద్మముగా, కేలన్ = చేతితో, పట్టి + ఆడన్ = పట్టి యాడుటకును

పుండరీక + అక్షు = తెల్లఁదామరల వంటి కన్నులు గలవాని యొక్క - ఎష్ణునియొక్క, లోచన-పుండరీకము = తెల్లదామరవంటికన్ను, అంఘ్రి - పీరముగాన్= పాదపీరముగా, మీఁదన్, అడుగు+చాఁపన్ = పాదములు మోపుటకును,

అభవు = ఈశ్వరుని యొక్క, దేహ + అర్ధము = మేనిసగము, ఉరువడిన్= ఉరవడితో - మిక్కిలి వేగముతో, ఆక్రమించికొనఁగన్ + చువ్వె ఆక్రమించుకొనుటకునుజుమా, అగజ = పార్వతి, ఈ-తపము + ఎత్తికొనియెన్= ఈ తపస్సునకుఁ బూనుకొనెను

తాత్పర్యము రాక్షసుల నోడించి దేవసైన్యమునెల్ల గ్రహించి రక్షింపఁజాలు కుమారునిఁ బడయుటకును, ఇంద్రాదిదేవతలందఱు సేవింప నిండోలగమున గొప్పతనముతోఁ గొలువు దీర్చుటకును, లక్ష్మీసరస్వతులచేతను, సురసిద్ధ విద్యాధర రాక్షస స్త్రీల చేతను దాస్యము చేయించుకొనుటకును, బ్రహ్మ శిరఃకమలమును లీలాకమలముగాఁ జేతఁబట్టి యాడుటకును, పుండరీకాక్షుని నేత్రపుండరీకము పాదపీరముగాఁ బై నడుగుమోపుటకును జుమా పార్వతి యీ తపమునకుఁ బూనుకొనెను

విశేషములు . ఓర్చి - ఓడు ధాతువు 'చుగాగమం బాచ్చికంబున కసంయుక్త న ల డ రాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు ' బాల క్రియ 73 ఓడు+చు 'అ డోడు కూడుల డకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫం బగు ' బాల క్రియ 80 ఓరుచు 'పదాంతబులయి యసంయుక్తంబులయిన ను లు రుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు ' బాల ప్రకీర్ణ 16 ఓర్చు 'సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకంబగు ' బాల క్రియ 38 ఓర్చు + ఇ అపదాదిస్వరసంధి - బాల సంధి 11 ఓర్చి, పేరోలగము - పేరు + ఓలగము - 'కర్మధారయంబునందుఁ' బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు నిభాష నగు' బాల సం 29 టుగాగమ మగుచో పేరుటోలగము కానిచో ఉత్వసంధిచే బాల సం 1 పేరోలగము వాక్చి - వాచ్ + శచీ వాక్+ శచీ - వర్గముల మొదటి నాల్గక్షరముల (ఝుయ్యూల) కంటె పరమగు శవర్ణమునకు

అచ్చులుగాని, అంతస్థములుగాని, అనునాసికములుగాని, హకారముగాని (లట్టులు) పరమై యున్నపుడు ఛకారము వైకల్పికముగా నాదేశమగును వాక్ + చ్చే = వాక్చే - వాక్కే వర్ణాబనులు - వరవు + పనులు 'లాఁటి యచ్చునకు సహిత మొకానొకచో నుడినడుమలోపంబు గానంబడియెడి బాల ప్రకీర్ణ 18 వర్ణ + పనులు 'సమాసమున ఉదంతస్త్రీసమంబునకుఁ బరుషము పరమగుచుండఁగా నుగాగమము' బాల సంధి 25 ద్రుతకార్యము - బాల సంధి 16,17 వర్ణాబనులు ఉరువడి - రూపాం ఉరవడి

శా **నీ యజ్ఞానత నీశు విశ్వజనకున్ నిందించె దీ విమ్మహా**
మాయం జండిక నాదిమూర్తిఁ ద్రిజగన్మాతన్ మదాంధుండవై
డాయం జూచెదు పాపకర్మ! నినుఁ జూడం గూడునే కేవల
స్త్రీయే? పార్వతి నన్యధామతిగఁ దాఁ జింతింప నీ ప్రాప్తియే? 52

అర్థము. నీ +అజ్ఞానతన్ = నీ తెలివిలేమిచేత, ఈశున్, విశ్వ - జనకున్ = జగజ్జనకుని, ఈవు, నిందించెదు = దూషింతువు, పాప-కర్మ = పాపపుఁబనులు గలవాఁడా! ఈ +మహా-మాయన్ = ఈ మహామాయను, చండికన్, ఆది-మూర్తిన్ = తొలిమూర్తిని, త్రిజగత్+మాతన్ =ముల్లోకములతల్లిని, మద+అంధుండవు + ఐ = క్రొవ్వుచేఁ గ్నులు గాననివాఁడవయి, డాయన్ + చూచెదు = సమీపింపఁజూతువు, నినున్, చూడన్ + కూడునే= చూడఁదగునా, కేవల స్త్రీయే= సామాన్యస్త్రీయా?, పార్వతిన్, అన్యధా-మతిగన్ = వేఱు తలఁపుతో, తాన్, చింతింపన్ = భావించుటకు, నీ-ప్రాప్తియే = నీ శక్తియా? పార్వతిని వేఱుగా భావించుటయే నీకుఁజేతనగునా? అనుట

తాత్పర్యము. నీవు నీ తెలివిలేమిచే జగజ్జనకుఁడగు నీశ్వరుని నిందింతువు ఈ మహామాయయు, చండికయు, ఆదిమూర్తియు, త్రిజగజ్జననియు నగుపార్వతిని గ్రొవ్వుచేఁ గన్నులుగానక సమీపింపఁజూతువు పాపకర్ముఁడా! నిన్నుఁజూచుట తగునా? ఆమె కేవల స్త్రీయా? పార్వతిని వేఱుబుద్ధితోఁ జూచుటయే నీ శక్తియా?

విశేషములు. నిందించెదీవు నిందించెదవు + ఈవు - లాట్టు వకారమునకు వైభాషికలోపము బాల క్రియ 24 నిందించెద + ఉ + ఈవు అపదాదిస్వరసంధి బాల సంధి 11 నిందించెదు + ఈవు - ఉకారసంధి బాల సంధి 1 నిందించెదీవు ఇట్లే చూచెదు గ్రహించునది

సీ జ్ఞానస్వరూపమై సర్వాత్ముఁడున్నఁ దా
జ్ఞేయ స్వరూపమై నెఱసియుండుఁ
బురుషస్వరూపమై పరమేశుఁడున్నఁ దాఁ
బ్రకృతిస్వరూపమై పరఁగుచుండు
సూక్ష్మస్వరూపమై శుద్ధాత్ముఁడున్నఁ దా
స్థూలస్వరూపమై తోఁచియుండు
నర్థస్వరూపమై యమలాత్ముఁడున్నఁ దా
శబ్దస్వరూపమై జరుగుచుండు

ఆ హరుఁడు రుద్రరూపమై యున్నఁ దా నుమా
మూర్తి దాల్చి లోకములకు హితము
సేయుచుండుఁ గాన శివశక్తి భేదంబు
తెఱఁగు నీకు జడున కెఱుఁగ లావె? 53

అర్థము. సర్వ - ఆత్ముఁడు = శివుఁడు, జ్ఞాన - స్వరూపము + ఐ = జ్ఞానముయొక్క ఆకారమయి, ఉన్నన్ = ఉండఁగా, తాన్ = తాను (పార్వతి) జ్ఞేయ స్వరూపము + ఐ = జ్ఞేయము (తెలియఁదగినది) యొక్క ఆకారమయి, నెఱసి + ఉండున్ = వెలసియుండును

పరమేశుఁడు, పురుష - స్వరూపము + ఐ = పురుషునియొక్క స్వరూపమయి, ఉన్నన్, తాన్ = పార్వతి, ప్రకృతి - స్వరూపము + ఐ = ప్రకృతియొక్క స్వరూపమయి, పరఁగుచున్ + ఉండున్ = ఒప్పుచుండును

శుద్ధాత్ముఁడు = పరిశుద్ధమైన ఆత్మగలవాఁడు - ఈశ్వరుఁడు, సూక్ష్మ - స్వరూపము + ఐ, ఉన్నన్, తాన్, స్థూల - స్వరూపము + ఐ, తోఁచి ఉండున్

అమల + ఆత్ముఁడు = నిర్మలమైన ఆత్మగలవాఁడు - ఈశ్వరుఁడు, అర్థ - స్వరూపము + ఐ = అర్థముయొక్క స్వరూపమయి, ఉన్నన్, తాన్, శబ్ద - స్వరూపము + ఐ = శబ్దముయొక్క స్వరూపమయి, జరుగుచున్ + ఉండున్ = సాఁగుచుండును

హరుఁడు = శివుఁడు, రుద్ర - రూపము + ఐ = రుద్రుని ఆకారమయి, ఉన్నన్, తాన్, ఉమా - మూర్తి = ఉమ - పార్వతి యొక్క ఆకారము, తాల్చి = ధరించి, లోకములకున్, హితము =మేలు, చేయుచున్ + ఉండున్

కానన్ = కావున, శివ - శక్తి - భేదంబులు = శివునకు, శక్తికిఁ (పార్వతికి) గల భేదముల, తెఱఁగు = విధము, జడునకున్ = మందబుద్ధికి, నీకున్, ఎఱుఁగన్, లావె? = అలవియా?

తాత్పర్యము . సర్వాత్ముఁడైనశివుఁడు జ్ఞానస్వరూపమయి యుండఁగాఁ బార్వతి జ్ఞేయస్వరూపమయియుండును పరమేశుఁడు పురుషస్వరూపమయియుండఁగాఁ, బార్వతి ప్రకృతిస్వరూపమయి యొప్పుచుండును శుద్ధాత్ముఁడైన శివుఁడు సూక్ష్మస్వరూపమయి యుండఁగాఁ బార్వతి స్థూలస్వరూపమయి తోఁచియుండును పరమాత్ముఁడైన శివుఁడు అర్థస్వరూపమయియుండగాఁ బార్వతి శబ్దస్వరూపమయి జరుగుచుండును శివుఁడు రుద్రస్వరూపమయి యుండఁగాఁ, బార్వతి ఉమామూర్తిని దాల్చి లోకములకు మేలుచేయుచుండును కావున మందబుద్ధివైన నీకు శివశక్తిభేదము లెఱుఁగశక్యమా? శక్యము గాదనుట

విశేషములు జ్ఞానము - జ్ఞేయము, పురుషుఁడు - ప్రకృతి, సూక్ష్మము - స్థూలము, అర్థము - శబ్దము, రుద్రుఁడు - ఉమ ఈ జంటలు అవినాభావ స్థితినిదెలుపును ఇవి శివశక్తుల కుపమానములయి, వారి అవినాభావస్థితిని సూచించును అర్థ స్వరూపమై శబ్ద స్వరూపమై జరుగుచుండు 'వాగర్థా నివ సమ్పృక్తౌ' - అని పార్వతీ పరమేశ్వరులను కాళిదాసు వాగర్థములతోఁ బోల్చుట స్మరింపఁదగినది,

వ **అనుచున్న సఖులం గని గిరిజ మది నాక్షేపించుచు** 54

అర్థము. అనుచున్ + ఉన్న, సఖులన్ = చెలికత్తెలను, కని = చూచి, గిరిజ= పార్వతి, మదిన్ = మనస్సునందు, ఆక్షేపించుచున్ = దూఱుచు

తాత్పర్యము: అని పలుకుచున్న చెలికత్తెలను జూచి పార్వతి మనసునందు దూఱుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ **జలజభవాచ్యుతాది సురసంఘము లెల్లను భక్తియుక్తులై**
కొలుచు మహేశు నీ చపల కుత్సిత విప్రుఁడు వచ్చి నోరఁ గ్రొ
వ్వులు పలుకంగ మీరును జెవుల్ సార వించు సహించి మాఱుమా
టలు నొడికట్టి పల్కెద రొడంబడినట్టులు బ్రహ్మబంధుతోన్ 55

అర్థము జలజ-భవ + అచ్యుత + ఆది - సుర - సంఘములు + ఎల్లను = బ్రహ్మ, విష్ణువు మున్నగు దేవతల సమూహములన్నియు, భక్తి - యుక్తులు + ఐ = భక్తితోఁ గూడినవారయి, కొలుచు = సేవించు, మహేశున్ = మహేశ్వరుని, ఈ-చపల-కుత్సిత-విప్రుఁడు = ఈ చంచలుఁడు, కపటియైన బ్రాహ్మణుఁడు, వచ్చి, నోరన్ = నోటితో, క్రొవ్వులు = పొగరుఁబోతుమాటలు, పలుకంగన్ = పలుకఁగా,మీరును = మీరుగూడ, చెవుల్, చొరన్ = ప్రవేశింపఁగా, వించున్ = వినుచు, సహించి = సైఁచి, మాఱు-మాటలు = సమాధానములు, నొడికట్టి = మాటకట్టి, ఒడంబడిన + అట్టులు = అంగీకరించినట్లు, బ్రహ్మబంధు + తోన్ = నీచబ్రాహ్మణునితో, పల్కెదరు

తాత్పర్యము. బ్రహ్మ, విష్ణువు మున్నగు దేవతలందఱును భక్తితోఁ గూడిన వారయి సేవించు శివుని ఈ చంచలుఁడు కపటి యైనబ్రాహ్మణుఁడు వచ్చి నోటికొలఁదిఁ బొగరుఁబోతుమాటలు పలుకఁగా, మీరును జెవులార వానిని వినుచు సహించి ప్రతివచనములు కూర్చి అంగీకరించినట్లు ఆ నీచ బ్రాహ్మణునితోఁ బల్కెదరు

విశేషములు. చొరన్ - చొచ్చు ధాతువు 'తుమర్థ భావలక్షణంబులందు నుజీయగు బాల క్రియ 40 చొచ్చు + నుజి 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు ' బాల క్రియ 86 'అగు వచ్చు చొచ్చు చూచులకు ముత్తు పరంబగునపుడు కా రా చొరు చూడు లగు ' చొరు + నుజి 'జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు ' బాల క్రియ 20 చొరను వించు - వినుచు 'చువర్ణకంబు పరంబగునపు డన్వాదుల కుత్వలోపంబేని నుస్థానంబున బిందువేని విభాష నగు' బాల క్రియ 55 విన్చు - వించు ఒడికట్టి = భరించి అనుటకంటె, నొడి = నుడి, కట్టి = కూర్చి అనుట మేలేమోయని భావించి యట్లర్థము చెప్పఁబడినది

వ వీనిం బలికి బరమేశ్వరుం బలికించి విను డేమిపని? యని కోపావేశంబునం బరాఙ్ముఖయై చననున్న కన్నెఱింగి, వరదుండు గౌరి నిశ్చల భక్తియుక్తికి ననురక్తుండై యాక్షణంబ ప్రత్యక్షంబై నిజస్వరూపంబు చూపిన 56

అర్థము. వీనిన్ = ఈ కపట బ్రాహ్మణుని, పలికి = నిందించి,'పరమేశ్వరున్= ఈశ్వరుని, పలికించి = నిందింపఁజేసి, వినుడు = వినుట, ఏమిపని?, అని, కోప+ ఆవేశంబునన్ = క్రోధావేశముతో, పరాఙ్ముఖ + ఐ = పెడమొగము పెట్టినదయి,

చనన్ + ఉన్న = పోవనున్న, కన్నెఱింగి = జాడతెలిసి, వరుండు = వరుఁడుల నిచ్చువాఁడు - శివుఁడు, గౌరి = పార్వతియొక్క, నిశ్చల-భక్తి-యుక్తికిన్ = అచంచలమైన భక్తిగలిగియుండుటకు, అనురక్తుండు + ఐ = అనురాగము గలవాఁడయి - సంతోషించినవాఁడయి, ఆ క్షణంబు + అ = ఆ క్షణమే, ప్రత్యక్షంబు + ఐ = ఎదురఁదోఁచినవాఁడయి, నిజ-స్వరూపంబు = తనచైన స్వరూపము, చూపినన్ = చూపఁగా

తాత్పర్యము . 'ఈ కపటబ్రాహ్మణుని నిందించి, వానిచే నీశ్వరుని నిందింపఁజేసి వినుట యేమి పని?' అని కోపావేశమునఁ బెడమొగము గలయిు పోనున్న జాడ తెలిసి యీశ్వరుఁడు పార్వతి స్థిరభక్తియుక్తికి సంతోషించి యా క్షణమే ప్రత్యక్షమై తన స్వరూపము చూపఁగా - తరువాతి పద్యములో నన్నయము

శివుఁడు పార్వతికి నిజ స్వరూపముతోఁ బ్రత్యక్షమగుట

సీ శిరమున సురసింధుశీకరావళికంటె
నటమున్న యెగసె శీతాంశురుచులు
భాలతటాంబకోద్భాసంబునకు మున్న
ముడివడి తనరెఁ గెంజడల చాయ
గళమున విలసిల్లు గరళంబునకు మున్న
కాలాహిభూషణకాంతి మిగిలెఁ
బాండురాంగోన్నతప్రభకంటె ముందఱఁ
బర్వె లిప్తామలభస్మదీప్తి

తే. కటివృతవ్యాప్తచర్మంబుకంటె మున్న
మేఖలోరగఫణములు మిగిలి వెలిఁగెఁ
బాదపీరోరువజ్రప్రభాతి కంటె
మున్న పదనఖసంకాశ మున్నతిల్లె 57

అర్థము . శిరమునన్ = తలపయిని, సుర-సింధు-శీకర + ఆవళి కంటెన్ = ఆకాశగంగానదీ జలకణములవరుసకంటెను, అటమున్న = అంతకుముందే, శీత + అంశు - రుచులు = చంద్రకాంతులు, ఎగసెన్ = లేచెను

భాల- తట + అంబక + ఉద్భాసంబునకున్ = నొసటికంటి ప్రకాశమునకు, మున్ను + అ = ముందే, కెంజడల (కెంపు + జడల) - చాయ = ఎఱ్ఱనిజడలకాంతి, ముడివడి = పెనఁగి, తనరెన్ + ఒప్పెను

గళమునన్ = కంఠమునందు, విలసిల్లు = ప్రకాశించు, గరళంబునకున్ - హాలాహలమునకు, మున్ను + అ, కాల - అహి - భూషణ - కాంతి = కాలసర్పములనెడు ఆభరణముల కాంతి, మిగిలెన్ = అతిశయించెను

పాండురి + అంగ + ఉన్నత - ప్రభకంటెన్ = తెల్లని శరీరపు గొప్పకాంతి కంటెను, ముందఱ + ల = ముందే, లిప్త + అమల - భస్మ - దీప్తి = పూయఁబడిన నిర్మలమైన బూదియొక్క కాంతి, పర్వెన్ = వ్యాపించెను

కటి - వృత - వ్యాప్త - చర్మంబుకంటెన్ = మొలయం దావరించి వ్యాపించిన యేనుఁగుతోలుకంటెను, మున్ను + అ, మేఖలా + ఉరగ -ఫణములు = మొలత్రాడైన పాముల పడగలు, మిగిలి = అతిశయించి, వెలిఁగెన్ = ప్రకాశించెను

పాద - పీఠ + ఉరు - వజ్ర - ప్రభాతికంటెన్ = పాదపీఠమునందలి గొప్ప వజ్రములకాంతికంటెను, మున్ను + అ, పద - నఖ - సంకాశము = కాలిగోరుల ప్రకాశము, ఉన్నతిల్లెన్ = అతిశయించెను

తాత్పర్యము శిరమునందలి ఆకాశగంగానదీ జలకణములకంటెను ముందే చంద్రకాంతు లెగసెను నొసటికంటి ప్రకాశమునకు ముందే కెంజడల కాంతి పెనఁగి యొప్పెను కంఠమునఁ బ్రకాశించుహాలాహలముకంటె ముందే కాలసర్పాభరణముల కాంతి అతిశయించెను తెల్లని శరీరపు గొప్ప కాంతి కంటె ముందే ఒడలికిఁ బూసికొన్న భస్మము కాంతి వ్యాపించెను మొలయందలి పాముల పడగలు మిక్కిలి ప్రకాశించెను పాదపీఠమునందలి వజ్రముల కాంతికంటెను ముందే కాలిగోరుల ప్రకాశ మతిశయిల్లెను

విశేషములు కెంజగలు - కెంపు + జడలు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగ నగు ' బాల సంధి 36, కె + జడలు లుప్తశేషమునకుఁ బరుషములు పరములగునపుడే నుగాగమము విధింపఁబడినది కాని యిచ్చట సరళము పరమగుచుండుటచే నుగాగమప్రాప్తి కవకాశములేదు 'కెంధూళి కెంజడ లని ప్రయోగంబులం గానంబడియెడి' అనుటచే ఇచ్చట నుగాగమము సిద్ధించును కె + ను + జడలు 'వర్గయుక్తరళములు పరములగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువును గానంబడియెడి' బాల సంధి 19 కెంజడలు ఉన్నతిల్లు ఉన్నతి + ఇంచు - 'నిర్జి నామంబుల కయుగాగమంబు గలుగదు ' బాల క్రియ 65 అనుదాని జ్ఞాపకము చేత నామమగు 'ఉన్నతి' యనుదానికి ధాతుత్వవివక్షయం దించుగాగమ మగును ఉన్నతి + ఇంచు 'రంజాదుల యించుక్కారంబునకు సబిందుకంబున

కప్రేరణంబున ద్విరుక్తలకారం బగు' బాల క్రియ 71 ఉన్నది + ఇల్లు -అపదాదిస్వరసంధి బాల సంధి 11 చే ఉన్నదిల్లు

వ త దవసరంబున 58

అర్థతాత్పర్యములు. ఆ పిమ్మట - తరువాతి పద్యముతో నన్వయము

క తరుణతర తరణి కిరణ
స్ఫురణ విడంబించు నభవు జూటాటవిలో
సురనది వొలిచె లతాంత
స్థిర కింశుకవనము నడిమి సింహిక వోలెన్ 59

అర్థము. తరుణతర - తరణి - కిరణ - స్ఫురణన్ = మిక్కిలిలేఁతయైన సూర్యుని కిరణముల ప్రకాశముచే, విడంబించు = అతిశయించు, అభవు = శివునియొక్క, జూట + అటవిలోన్ = అడవివంటి జడముడియందు, సుర-నది = ఆకాశగంగ, లతాంత - స్థిర - కింశుక - వనము - నడిమి - సింహిక + పోలెన్ = పూలచే నిలుకడగల మోదుగువనముమధ్యమున నున్న ఆఁడుసింగము విధమున, పొలిచెన్ = ప్రకాశించెను

తాత్పర్యము. బాలసూర్యుని కిరణముల ప్రకాశముచే నతిశయించు శివుని జూటాటవిలో నాకాశగంగపూలతో నిండిన మోదుగువనమునడుమనున్న ఆఁడుసింగమువలెఁ బ్రకాశించెను

విశేషములు. అలంకార ముపమ సింహమనక సింహిక యనుట ఉపమేయమగు 'సురనది'తో లింగసామ్యముకొఱకు

క స్ఫురిత ప్రవాళ లతికా
త్యరుణద్యుతిఁ దెగడు మృదు జటాటవిలోనం
గర మొప్పెఁ జంద్రఖండం
బరుణాంబుజవనము నడిమి హంసియ పోలెన్ 60

అర్థము. స్ఫురిత - ప్రవాళ - లతికా + అతి - అరుణ - ద్యుతిన్ = వికసించిన పగడపుఁదీఁగలయొక్క మిక్కిలి యెఱ్ఱనికాంతిని, తెగడు = తిరస్కరించు, మృదు = శివునియొక్క, జటా + అటవిలోనన్ = అడవివంటి జడలయందు, చంద్ర

- ఖ ంబు = చంద్రకళ, అరుణ + అంబుజ - వనము - నడిమి - హంసియ + పోలెన్ = ఎఱ్ఱని తామరలతోఁపు నడుమనున్న ఆఁడు అంచవలె, కరము = మిక్కిఁ ఒప్పెన్ = ఒప్పెను

తాత్పర్యము . వికసించిన పవడపుఁదీఁగల మిక్కిలి యెఱ్ఱనికాంతిని దిరస్కరించు శివుని అడవినిబోలిన జడలయందుఁ జంద్రరేఖ యెఱ్ఱతామరలతోఁపునడుమనున్న ఆఁడుఅంచవిధమున మిక్కిలి యొప్పెను

విశేషములు అలంకార ముపమ అతి + అరుణ = అత్యరుణ - యణాదేశసంధి

తే పాండురాంగ విశుద్ధాంగభాతి నడుమ
నురు కపర్దారుణద్యుతు లొప్పెఁ జూడ
నమృతమధనార్థ మర్థి దుగ్ధాబ్ధి నడుమ
సురలు నిలిపిన కనకభూధరము పోలె 61

అర్థము పాండుర + అంగ - విశుద్ధ + అంగ - భాతి - నడుమన్ = తెల్లని దేహము యొక్క మిక్కిలి నిర్మలములైన అవయవముల కాంతి మధ్యమున, ఉరు - కపర్ద + అరుణ - ద్యుతులు = గొప్ప జటాజూటముయొక్క ఎఱ్ఱని కాంతులు, అమృత - మధన + అర్థము = అమృతముకొఱకైన చిలుకుట నిమిత్తము, అర్థిన్ = కోరికతో, దుగ్ధ + అబ్ధి - నడుమన్ + క్షీరసముద్రమధ్యమున, సురలు = దేవతలు నిలిపిన, కనక - భూధరము పోలెన్ = బంగారు కొండ విధమున, చూడన్ = చూడఁగా, ఒప్పెన్

తాత్పర్యము . తెల్లని దేహమునందలి నిర్మలమైన అవయవముల కాంతి నడుఁ ఁబెద్ద జటాజూటము నెఱ్ఱని కాంతులు అమృతముకొఱకు మధించుటకయి క్షీ ీరసముద్రమధ్యమున దేవతలు కోరికతో నిలిపిన మేరుపర్వతమువలెఁ జూడనొప్పెను

విశేషములు. అలంకారముపమ ఈశ్వరుని జటాజూటమునకుఁ గపర్దమని పేరు 'కపర్దో ఽస్య జటాజూటః' అమరము

చ పరము శరీరభూతిరుచి పర్వినఁ దద్వన సర్వజీవ దు
ర్భరతర చిత్తతామసము వాసిన శుద్ధమయాత్మవేదులై
యరిగిరి ముక్తి, కర్థి మదినైనఁ దలంచినఁగల్గుమోక్ష మీ
శ్వరుఁ గనుఁగంటఁ జూచి రట, వా రమృతాత్ములు కావు డొప్పదే ? 62

అర్థము. పరము = ఉత్కృష్టుఁడైన శివుని యొక్క, శరీర - భూతి - రుచి = దేహము నందలి భస్మము కాంతి, పర్వినన్ = వ్యాపింపఁగా, తత్ + వన - సర్వ - జీవ - దుర్భరతర - చిత్త - తామసము = ఆ వనమునందలి యెల్ల జీవుల భరింపశక్యముకాని మనస్సునందలి తమస్సు (చీఁకటి - అజ్ఞానము) పాఱిపోన్ = వీడఁగా, శుద్ధ - మయ - ఆత్మవేదులు + ఐ = నిర్మలమైన ఆత్మజ్ఞానము గలవారయి, ముక్తిన్ = మోక్షమునకు, అరిగిరి = వెడలిరి, అర్థిన్ = కోరికతో, మదిన్ + ఐనన్ = మనస్సునందయినను, తలంచినన్ = తలఁచినచో, కల్గు = కలుగునట్టి, మోక్షము, ఈశ్వరున్, కనుఁగంటన్ = కనులార, చూచిరి + అట, వారు, అమృత + ఆత్ములు = అమృతమయమైన ఆత్మగలవారు, కావుడు = అగుట, ఒప్పదే = తగదా ?

తాత్పర్యము. ఉత్కృష్టుఁడైన శివుని దేహవిభూతికాంతి వ్యాపింపఁగా నా వనమునందలి యెల్లజీవులును మనస్సులందలి దుర్భరతమస్సు నశింపఁగా, నిర్మలమైన ఆత్మజ్ఞానముగలవారయి మోక్షము నొందిరి కోరి మనస్సులోఁ దలఁచిననే మోక్షము కలుగుచుండఁగా, నీశ్వరుని గనులారఁ జూచిరట! ఇఁక వా రమృతమయాత్ములు అగుట యేమి చోద్యము?

విశేషములు . అలంకారము కావ్యార్థాపత్తి 'కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే' చంద్రా కావుడు = కావుట - భావార్థక టవర్ణకమునకు బదులుగా డువర్ణకమును వాడుట యీ కవికిఁ బరిపాటి

వ. ఇట్లు మునికుమారుం డాక్షణంబ పరమేశ్వరుండైనం బార్వతి బిట్టులికి యెదురుకొని త న్నోసరించుచు 63

అర్థము : ఇట్లు, ముని - కుమారుండు, ఆ క్షణంబు + అ = వెంటనే పరమేశ్వరుండు + ఐనన్ = పరమేశ్వరుఁడు కాఁగా, పార్వతి, బిట్టు + ఉలికి = మిక్కిలి భయపడి, ఎదురుకొని = అభిముఖమయి, తన్నున్ = ఓసరించుచున్ = తన్నుఁ దొలఁగఁజేయుచు

తాత్పర్యము ఇట్లు మునికుమారుఁడు వెంటనే పరమేశ్వరుఁడు కాఁగాఁ బార్వతి మిక్కిలి భయపడి యతని కభిముఖముగాఁ దొలఁగుచు - తరువాతి పద్యముతో నన్వయము

క తన మనమున సంభ్రమమును
దనువున ఘుర్మోదకములుఁ దనరఁగ శంభుం
గని సతి నివ్వెఱఁగై ని
ల్చెను వడఁకుచు నీర ముని౦గి లేచిన భంగిన్ 64

అర్థము తన - మనమునన్ = తన మనస్సునందు, సంభ్రమమును = వేగిరపాటును, తనువునన్ = శరీరమునందు, ఘర్మ + ఉదకములున్ = చెమట నీరును, తనరఁగన్ = ఒప్పఁగా, సతి = స్త్రీ - పార్వతి, శంభున్ = శివుని, కని = చూచి, నివ్వెఱఁగు (నిండు + వెఱఁగు) + ఐ = మిక్కిలి ఆశ్చర్యపడినదయి, నీరన్ = నీటియందు, ముని౦గి, లేచిన - భంగిన్ = లేచిన విధమున, వడఁకుచున్, నిల్చెను

తాత్పర్యము. తన మనస్సునందు వేగిరపాటును, శరీరమునఁ జెమ్మటయు నొప్పఁగాఁ బార్వతి యీశ్వరునిఁ జూచి, మిక్కిలి ఆశ్చర్యపడుచు, నీట ముని౦గి లేచినట్లు వడఁకుచు నిలిచెను

విశేషములు. అలంకారము ఉపమ

సీ పగలింటి కట్టెండ నొగిలిన కుముదిని
సితరోచిఁ గని వికసిల్లునట్లు
వేసవి వడగాలి నోసిన లేఁదీఁగ
క్రొక్కారుఁగని మవ్వమెక్కునట్లు
ఫణివిషవహ్నిఁ జేడ్పడియున్న శశిరేఖ
నెఱవిడుపునఁ గాంతి వఱలునట్లు
శాపాగ్నిఁబడి దివ్యసతి వంది శాపమో
క్షముఁగని నిజకాంతి నమరునట్లు

తే విరహతాప తపస్తాప విశిఖచయము
దాఁకి కందిన మేఁదీఁగ తత్క్షణంబు
గౌరి కాత్మేశుఁడగు నీశుఁ గనుడుఁ బ్రీతి
నెలమిఁ దొల్లింటికంటెను జెలువ మెసఁగె 65

అర్థము పగలింటి - కట్టెండన్ (కడు + ఎండ) = పగటిపెక్కైనయెండచే, నొగిలిన = వాడిన, కుముదిని = కలువతీఁగ, పెతకోచిన్ = చంద్రుని, కని = చూచి, వికసిల్లునట్లు = వికసించువిధమున

వేసవి - వడ - గాలిన్ = వేసవికాలపు వడగాల్పుచే, నోసిన = బాధపడిన - కమలిన, లేఁదీఁగ (లేత + తీఁగ), క్రొక్కారున్ (క్రొత్త + కాచు) = లలుకరించి, కని, మవ్వము + ఎక్కునట్లు = కోమలత్వము నందిన విధమునను

ఫణి - విష - వహ్నిన్ = రాహు విషాగ్నిచే, చేడ్పడి + ఉన్న = హానిపొందియున్న, శశిరేఖ = చంద్రుని పూర్ణబింబము, నెఱ-విడుపునన్ = గ్రహణ పూర్ణమోక్షముచే, కాంతిన్ = ప్రకాశముతో, వఱలునట్లు = ఒప్పురీతిని,

దివ్య-సతి = దేవతాస్త్రీ, శాప + అగ్నిన్ = శాపమనెడి అగ్నియందు, పడి, వంది= దుఃఖించి, శాప - మోక్షమున్ = శాపముయొక్కవిడుపును, కని, నిజ-కాంతిన్ = తనదైన కాంతితో, అమరునట్లు = ఒప్పువిధమున

విరహ - తాప - తపన్ + తాప - విశిఖి - చయము = ఎడఁబాటువలని తాపము అనెడి గ్రీష్మ తాపాగ్నుల సమూహము, తాఁకి, కందిన= వాడిన, మే+తీఁగ= అంగలత, తత్+క్షణంబు + అ = ఆ క్షణమే, గౌరికిన్ = పార్వతికి, ఆత్మ + ఈశుఁడు + అగు = తన ప్రభువగు, ఈశున్ = ఈశ్వరుని, కనుడున్ = చూచినంతనే, ప్రీతిన్ = సంతోషముతో, ఎలమిన్ = వికాసముతో, తొల్లింటికంటెను= మునుపటికంటెను, చెలువము = అందము, ఎసఁగెన్ = అతిశయించెను

తాత్పర్యము : పగటి, తీక్ష్ణమైన యెండచేఁ గమలిన కలువతీఁగ చంద్రునిఁ జూచి వికసించునట్లును, వేసవి వడగాడ్పుచే వాడిన లేఁదీఁగ తొలకరిని జూచి కోమలత్వమును బొందినట్లును, రాహువిషాగ్నిచే హానిఁబొందియున్న చంద్రుని పూర్ణబింబము గ్రహణమోక్షమునఁ గాంతిచే నొప్పునట్లును, శాపమనెడి అగ్నిచేఁ బడి దేవకాంత దుఃఖించి శాపమోక్షమును బొంది తనదైన కాంతితో నొప్పునట్లును, విరహతాపమనెడి గ్రీష్మతాపాగ్నుల సమూహము తాఁకి కందిన దేహలత ఆక్షణమే గౌరికి నిజేశుఁడైన యీశ్వరునిఁ జూచినంతనే సంతోషముచే వికాసముతోఁ బూర్వముకంటెను అంద మతిశయించెను

విశేషములు . అలంకారము మాలోపమ కట్టెండ - కడు + ఎండ 'కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల అ డల కచ్చు పరంగునపుడు ద్విరుక్తటకారం

బగు ' బాల సంధి 12 కట్టు + ఎండ 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు ' బాల సంధి 1 కట్టెండ క్రొక్కారు - క్రొత్త + కారు - 'సమాసంబునం బ్రాఁతాదుల లొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు' బాల సంధి 36 క్రొ + కారు 'క్రొత్త శబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్ని యెడల మీఁది హల్లునకు ద్విత్వంబు నగు ' బాల సంధి 38 లేఁదీఁగ - లేఁత + తీఁగ ప్రాఁతాది సూత్రముచే (బాల సంధి 36) లే + తీఁగ 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు' బాల సంధి 37 లే+ను+తీఁగ ద్రుతకార్యముచే (బాల సంధి 16, 17) లేఁదీఁగ విషవహ్ని, శాపాగ్ని, విరహతాపతప్తాప - అనుచోట్ల రూపకాలంకారము ఫణి = (నానా) - పాము, రాహువు శశిరేఖ - చంద్రకళ గాదు ఏలన రాహువుచేఁ జేడ్పాటునందునది పూర్ణశశియేకాని శశిరేఖ కాదు మఱి యిచట రేఖ యన ఆభోగము = పరిపూర్ణత (సూ ని) రేఖా శబ్ద ప్రయోగము గౌరి కుపమానముగా స్త్రీలింగస్వారస్యము కొఱకు తపన్ - (నానా) (నపుం) తపస్సు, (పుం) గ్రీష్మము కనుడున్ = ఆనంతర్యార్థకము అవ్యవధానమును సూచించును తొల్లింటి - 'టివర్ణంబు కొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును గొన్నింటి కంత్యాగమంబును గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు ' బాల ఆచ్ఛిక 31 హ్రస్వము మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువు బహుళముగా నగు ' తొల్లింటి బాల ఆచ్ఛిక 32

వ తత్ప్రస్తవంబున 66

అర్థతాత్పర్యములు . ఆ ప్రసంగమునందు - తరువాతి పద్యముతో నన్వయము

మ **అనుశీతాచ్ఛజలంబులోఁ బొలయు మత్స్యాశంకఁ బుట్టింప లో**
చన యుగ్మంబు, సుధాప్రచలితాబ్జభ్రాంతి సంధిల్ల నా
ననపద్మం, బగజాత నిల్చి గలితానందాశ్రుసుస్వేదముల్
తనరారం బతిఁ బ్రీతిఁ జూచె మెఱుఁగుల్ దల్కొత్తఁ గ్రేగన్నులన్. 67

అర్థము . లోచన - యుగ్మంబు = కన్నుల జంట, అను - శీత + అచ్ఛ-జలంబులోన్ = చల్లని, నిర్మలమైన నీటిలో, పొలయు = సంచరించు, మత్స్య + ఆశంకన్ = చేఁపల భ్రాంతిని, పుట్టింపన్ = కలిగింపఁగాను, ఆనన - పద్మంబు = తామరవంటి ముఖము, సుధా - ప్రచలిత + అబ్జ - భ్రాంతి = అమృతము

తొనికిసలాడు చంద్రునియొక్కభ్రాంతిని, సంధిల్లన్ = స్పృశింపగాను, లగిచాల= కొండకూతురు - పార్వతి, నిల్చి, గలిత + ఆనంద + అశ్రు - నిస్వేదములన్ = జాతిన సంతోషబాష్పములు, చెమటలు, తనరారన్ = ఒప్పగా, క్రేగన్నులన్ (క్రేవ+ కన్నులు) = క్రేగన్నులందు, మెఱుగుల్ = కాంతులు, తళుక్కన్ = ప్రకాశింపగా, పతిన్ = నాథుని, ప్రీతిన్ = సంతోషముతో, చూచెన్

తాత్పర్యము . కన్నులజంట చల్లనిదియు, నిర్మలమునైనట్టి జేగిల భ్రాంతిని బుట్టింపగను, ముఖపద్మము అమృతము లొనికిసలాడు చంద్రుని భ్రాంతిని స్పృశింపగను, పార్వతి నిలిచి సంతోషబాష్పములు, చెమటలు చాలగా, క్రేగన్నులలో మెఱుగులు ప్రకాశింపగా భర్తను ప్రీతితో జూచెను

విశేషములు. అలంకారము భ్రాంతిమంతము స్వభావోక్తి క్రేగన్నులు - క్రేవ + కన్నులు 'సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చుమోది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు ' బాల సంధి 36 క్రే+కన్నులు 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు ' బాల సంధి 37 క్రే+ను+కన్నులు = ద్రుతకార్యము (బాల సంధి 16,17) చే క్రేగన్నులు సంధిల్లు - 'రంజాదుల యించుక్కకారంబునకు సబిందుకంబున కప్రేరణంబునం ద్విరుక్తలకారంబగు ' బాల క్రియ 71 సంధా + ఇంచు - సంధా + ఇల్ల్ + ఉ = సంధిల్లు ।- అపదాదిస్వర సంధి - బాల సంధి 11

వ హరియును 68

చ పతిగని లజ్జ నాననము పాయగ నల్లన వాంచి సమ్మదా
మృతరసపూరితార్ద్ర వినిమీలిత లోల కటాక్ష వీక్షణా
యతసితదీధితుల్ గలయ నద్రిజ విచ్చె మహేశుమోద రా
జతగిరిమోద మున్నతి నిశాకరదీప్తులు గప్పునొప్పునన్ 69

అర్థము: అద్రిజ = పార్వతి, పతిన్ = భర్తను - ఈశుని, కని = చూచి, లజ్జన్ = సిగ్గుతో, ఆననము = ముఖము, పాయగన్ = తొలగునట్లు, అల్లనన్= మెల్లగా, వాంచి = వంచి, సమ్మదా దీధితుల్ సమ్మద + అమృత - రస = సంతోషము అనెడి అమృతరసముతో, పూరిత = నిండినదగుటచే, ఆర్ద్ర = తడిసిన, వినిమీలిత = మూయబడిన, లోల = చంచలమైన, కటాక్ష - వీక్షణ = క్రేగంటిచూపులయొక్క, ఆయత = దీర్ఘములయిన, సిత = తెల్లని, దీధితుల్ =

కాంతులు, కలయన్ = కూడఁగా, రాజత-గిరి-మీఁదన్ = వెండికొండపై, ఉన్నతిన్= ఉన్నతిలో, నిశాకర-దీప్తులు = చంద్రుని కాంతులు, కప్పు + ఒప్పునన్ = కప్పు విధమున, మహేశుమీఁదన్ = మహేశ్వరునిపై, విచ్చెన్ = వ్యాపింపఁజేసెను

తాత్పర్యము పార్వతి భర్తను జూచి సిగ్గుతో ముఖము తొలఁగునట్లు మెల్లఁగా వంచి, ఆనందామృతరసముచే నిండినదగుటచేఁ దడిసిన, మూయఁబడిన, చంచలమైన క్రీఁగంటిచూపుల నిడుపులు, తెల్లనివి అగుకాంతులు కూడఁగా, పార్వతి మహేశ్వరునిపై - వెండికొండపై నున్నతితోఁ జంద్రుని కాంతులు వ్యాపించువిధమున వ్యాపింపఁజేసెను

విశేషములు అలంకార ముపమ మహేశునకు రాజతగిరి ఉపమానము అద్రిజ కటాక్షవీక్షణాయతసితదీధితులకు నిశాకర దీప్తులు ఉపమానము వా ప్రతిలోని 'అర్థ' కంటె 'ఆర్ద్ర' మేలనిపించుటచే నది స్వీకృతము స్వభావోక్తియు

వ అంత నంతకాంతకుం డచలసుత చంచలాపాంగావలోకన సుధారసప్రవాహనిర్మగ్నుండై సాగియుచు 70.

అర్థము . అంతన్, అంతక + అంతకుండు = యముని అంత మొందించినవాఁడు - ఈశ్వరుఁడు, అచల-సుత = పార్వతియొక్క, చంచల + అపాంగ + అవలోకన - సుధా - రస -ప్రవాహ - నిర్మగ్నుండు + ఐ = చలించు క్రీఁగంటి చూపులనెడు, అమృతరస ప్రవాహమునందు మునిఁగినవాఁడయి, సాగియుచున్ = పారవశ్యము చెందుచు

తాత్పర్యము . అంత నీశ్వరుఁడు పార్వతి చలించు క్రీఁగంటి చూపులనెడు అమృతరసప్రవాహమునందు మునిఁగి, పరవశుఁడగుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అపాంగావలోకన సుధారసప్రవాహ - రూపకము

సీ మెలరారు క్రీఁగంటి మెఱుఁగుఁదీఁగల డుల్లు
కారాకులొక్కొ క్రొక్కారు మెఱుఁగు?
లాననకాంతి సుధాంభోధి కల్లడి
డిండీరమో చంద్రమండలంబు?
ఎసితోచితాలాప రసపూరమును గ్రమ్మఁ
జాలుఁగాకేమి రసాయనంబు?
నీలధమ్మిల్ల తమాల ప్రతానిని
చివుళులో నర్తించు శిఖికలాప?

తే మనుచు రమణీయమగు నపాంగావలోక
నాతిభాతియు వదనాంబుజాతరుచియు
వచనమాధుర్యమును నురుకచభరంబు
దేవదేవుండు తగిలి కీర్తింపఁదొడఁగె 71

అర్థము క్రొక్కారు (క్రొత్త + కారు)-మెఱుఁగులు = లొలకరి మెఱుపులు, మెలరారు - సంచరించు, క్రీఁగంటి (క్రిందు + కంటి) - మెఱుఁగుఁదీఁగలన్ (మెఱుఁగు + తీఁగలన్) క్రీఁగన్నుల చూపులనెడి మెఱపుఁదీఁగలనుండి, డుల్లు = రాలునట్టి, కారాకులు + ఒక్కొ = పండుటాకులా?, అనుచున్, రమణీయము + అగు = సుందరమగు, అపాంగ + అవలోకన + అతిభాతియున్ = క్రీఁగంటిచూపుల అమితమైనకాంతిని,

చంద్ర-మండలంబు = చంద్రబింబము, ఆనన-కాంతి-సుధా + అంభోధి=ముఖకాంతియనెడు అమృతసముద్రముయొక్క, కల్లడి = పొంగు, డిండీరమో = నురుగో, (అనుచున్, రమణీయమగు), వదన + అంబుజాత - రుచియున్ = ముఖపద్మకాంతిని,

రసాయనంబు = అమృతము, లసిత + ఉచిత + ఆలాప -రస-పూరమును= ఒప్పునట్టి, తగిన, వాగ్రసప్రవాహమును, క్రమ్మన్ + చాలున్ + కాకేమి = ప్రసరింపఁజేయఁజాలునుగదా, (అనుచున్ రమణీయమగు) వచన - మాధుర్యమును = వాఙ్మాధుర్యమును,

నర్తించు - శిఖి - కలాపము = నృత్యముచేయు నెమిలిపింఛము, నీల-ధమ్మిల్ల - తమాల - ప్రతానిని - చివుళులో = నల్లనికొప్పు అనెడి చీఁకటి మ్రానిలతయొక్క చివురులా, (అనుచున్, రమణీయమగు) ఉరు-కచ-భరంబున్= గొప్పదియగు కొప్పును

దేవదేవుండు = శివుఁడు, తగిలి = ఆసక్తిగలిగి, కీర్తింపన్ + తొడఁగెన్ = ప్రశంసింప నారంభించెను

తాత్పర్యము : దేవదేవుఁడైన శివుఁడు పార్వతియొక్క సుందరమయిన క్రీఁగంటి చూపులకాంతిని తొలకరి మెఱుపో, సంచరించు క్రీఁగంటిచూపులనెడి మెఱుఁగుఁదీఁగలనుండి రాలినపండుటాకులో అనుచును ఆమె సుందరమైన ముఖపద్మకాంతిని చంద్రమండలమో, ముఖకాంతియనెడు అమృతసముద్రపు

నురుగో అనుచును, ఆమె సుందరమగు వాఙ్మాధుర్యమును అమృతమో, ఒప్పునట్టి వాగ్రసప్రవాహమును ప్రసరింపఁజేయఁజాలునో అనుచును, ఆమె సుందరమగు గొప్పకొప్పును నృత్యము చేయునెమిలి పించమో, నల్లని కొప్పు అనెడి చీఁకటిమ్రాని తీవచిగురులో అనుచును ఆసక్తితోఁ బ్రశంసింప నారంభించెను

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష, యథాసంఖ్యము ఈ పద్యాన్వయ మించుక క్లేశకరమయినది ఒక్కొక్క ఉపమేయమునకు రెండేసి ఉపమానములు

వ ఇట్లు హర గిరిజ లధికప్రణయరసాపూర్ణసాగరంబులను నభిమానశీలంబులను నతిక్రమించుచున్న కన్నెఱింగి పరమేశ్వరునకుం జతురిక కృతాంజలియై 72

అర్థము . ఇట్లు, హర - గిరిజలు = శివుఁడును, పార్వతియు, అధిక - ప్రణయ - రస + ఆపూర్ణ - సాగరంబులను = ఎక్కువైన ప్రేమమనెడిజలముతో నిండిన సముద్రములను, అభిమాన-శీలంబులనున్ = అభిమానమును, శీలమును, అతిక్రమించుచున్ +ఉన్న = దాఁటుచున్న, కన్నెఱింగి = జాడతెలిసి, పరమేశ్వరునకున్, చతురిక, కృత + అంజలి + ఐ = నమస్కరించినదయి

తాత్పర్యము ఇట్లు పార్వతీశ్వరులు అధికమైన అనురాగరసముతో నిండిన సముద్రములను, అభిమాన శీలములను అతిక్రమించుచున్న జాడతెలిసి చతురిక పరమేశ్వరునకు నమస్కరించినదయి - తరువాతి పద్యముతో నన్వయము

క గిరిసుత కన్యాగుణ మా
దరమున మును సుప్రతిష్ఠితము సేసి లసత్
పరిణయ పూర్వకమున నీ
శ్వర! సుదతిఁ బరిగ్రహింపు సన్మార్గమునన్ 73

అర్థము. గిరి - సుత-కన్యా-గుణము = పార్వతి కన్యాత్వము, ఆదరమునన్= మన్ననతో, మును = ముందు, సుప్రతిష్ఠితము + చేసి = బాగుగా స్థాపించి, ఈశ్వర= ఈశ్వరుఁడా ! లసత్ + పరిణయ - పూర్వకమునన్ + ఒప్పుచున్న వివాహపూర్వకముగా, సత్ + మార్గమునన్ = మంచి పద్ధతిని, సుదతిన్ = ఇంతిని-పార్వతిని, పరిగ్రహింపు = స్వీకరింపుము

తాత్పర్యము : ఈశ్వరా! ముందు పార్వతి కన్యాత్వమును మన్ననతో స్థాపించి ఒప్పునట్టి వివాహపూర్వకముగా మంచిపద్ధతిని బార్వతిని స్వీకరింపుము

విశేషములు పరిగ్రహింపు - పరిగ్రహింపుము - 'మధ్యమపురుషమువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు' బాల సంధి 47 సన్మార్గము - సత్ + మార్గము - అనునాసిక సంధి

వ హిమవంతు నఖిలజగద్వినుతుం జేసి కృతార్థుం జేయవలయునని నవరదుండు దాని కోరినవరంబు దయసేసి 74

అర్థము. హిమవంతున్, అఖిల - జగత్ + వినుతున్ = ఎల్లలోకములచేఁ బొగడఁబడువానిని, చేసి, కృత + అర్థున్ = ధన్యుని, చేయవలయున్, అనినన్, వరదుండు = వరములనిచ్చువాఁడు - ఈశ్వరుఁడు, దాని - కోరిన - వరంబు = ఆమె కోరిన కోరిక, దయ + చేసి = ఇచ్చి

తాత్పర్యము. హిమవంతుని సర్వలోకస్తుతిపాత్రునిగాఁ జేసి ధన్యాత్ముని జేయవలయు ననఁగా వరదుఁడగు నీశ్వరుఁడు ఆమెకోరినకోరిక ననుగ్రహించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. దాని కోరిన - అది కోరిన - 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్మపదప్రథమకుఁ దఱుచుగ యొక్కషష్ఠి యగు' దాని యొక్క కోరిన - ప్రౌఢ కారక 15 'యొక్కకు లోపంబు బహుళంబు' - ప్రౌఢ కారక 16 దానికోరిన

క తమకంబున నరుగు మరా
ళము లంబుదరవము విని చలాచలమతి సం
గము వాసినట్లు నవసం
గము మిరువురు వదలి చతురికావచనగతిన్ 75

అర్థము. తమకంబునన్ = మోహముతో, అరుగు = వెడలు, మరాళములు = హంసలు - అంచల కవ, అంబుద - రవమున్ = మేఘధ్వనిని - ఉఱుమును, విని, చలాచలమతిన్ = చలించుబుద్ధితో, సంగము = కలయిక, పాసిన + అట్లు = వీడిన విధమున, ఇరువురున్ = ఇద్దఱును - పార్వతీశ్వరులు, చతురికా - వచన - గతిన్ = చతురిక మాటనుబట్టి, నవ-సంగమము = క్రొత్తకలయిక, వదలి = వీడి

తాత్పర్యము. మోహముతో వెడలు సంచలజంట మేఘధ్వని వినఁగనే చలించు బుద్ధితోఁ గలయిక వీడినట్లు పార్వతీశ్వరులిద్దఱును జతురికమాట ననుసరించి క్రొత్తకలయికను వీడి - తరువాతి వచనముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

వ హర గిరిజ లొండొరుల చిత్తంబులు విడుజట్లుగొని తార నీ హారాచలంబుల కరిగి రంత నంత వృత్తాంతంబును హిమవంతుం డెటింగి నిజరాజమందిరోత్సవంబుసేయించి సమస్త రాజ్య విభవాన్వితుండై 76

అర్థము. హరగిరిజలు = హరుఁడును గిరిజయు, ఒండొరుల = ఒక్కొక్కరి, చిత్తంబులు = మనసులు, విడుజట్లు + కొని = ఒకరి మనసు నొక రాకర్షించి, తార - నీహార + అచలంబులకున్ = క్రమముగా వెండి కొండకును, మంచుకొండకును, అరిగిరి, అంతన్, అంత-వృత్తాంతంబును = సర్వవిషయమును, హిమవంతుండు, ఎటింగి, నిజ-రాజమందిర + ఉత్సవంబు = తనదైన రాజభవనపువేడుక, చేయించి సమస్త - రాజ్య - విభవ + అన్వితుండు + ఐ = సకల రాజ్యవైభవములతోఁ గూడిన వాఁడయి -

తాత్పర్యము. శివపార్వతు లొకరొకరిమనస్సు లాకర్షించుకొని క్రమముగా కైలాసమునకును, హిమవత్పర్వతమునకును వెడలిరి అంత హిమవంతుఁడెల్ల వృత్తాంతము నెటిఁగి తన రాజభవనోత్సవమును జేయించి సకల రాజ్యవైభవముతోఁగూడిన వాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము

**క చనుదెంచి పేర్మితో నిజ
తనయం దోడ్కొని ముదమునఁ దన పురమునకుం
జని సతులఁ దపోవేషం
బనునయమున సుతకుఁ బాపుఁ డని నియమించెన్ 77**

అర్థము. చనుదెంచి = వచ్చి, పేర్మితోన్ = కూరిమితో, నిజ-తనయన్ = తన కూఁతును - పార్వతిని, తోడ్కొని = తీసికొని, ముదమునన్ = సంతోషముతో, తన - పురమునకున్ = తన నగరమునకు - ఓషధిప్రస్థ పురమునకు, చని, సతులన్ = ఇంతులను - చెలికత్తెలను, సుతకున్ = కూఁతునకు, తపన్ + వేషంబు = తాపసవేషమును, అనునయమునన్ = ప్రార్థనముతో, పాపుఁడు = తొలగింపుఁడు అని, నియమించెన్ = ఆజ్ఞాపించెను

తాత్పర్యము వచ్చి కూరిమితోఁ దన కూఁతును దీసికొని సంతోషముతోఁ దనపురమునకు వెడలి తన కూఁతునకుఁ దాపసవేషమును దొలఁగింపుఁడని యామె చెలికత్తెల నాజ్ఞాపించెను

వ అంత నంతఃపురాభ్యంతరప్రౌఢకాంత లత్యంతసంతోషంబున సుగంధతైలాభ్యంగనామలకోద్వర్తనపూర్వం బపరిమిత పరిమళమిళిత హంసోదకంబుల 78

అర్థము . అంతన్, అంతఃపుర + అభ్యంతర - ప్రౌఢకాంతలు = అంతిపురమునందలి ప్రౌఢాంగనలు, అత్యంత - సంతోషంబునన్ = మిక్కిలి సంతోషముతో, సుగంధ - తైల + అభ్యంగన + అమలక + ఉద్వర్తన - పూర్వంబు = పరిమళవంతమైన నూనెతోడి తలంటును ఉసిరికపిండితో నలుగువెట్టుట మున్నుగా, అపరిమిత - పరిమళ - మిళిత - హంస + ఉదకంబులన్ = అధికమైన సువాసనతోఁగూడిన - ఎండకు వేఁడెక్కి, వెన్నెలకుఁ జల్లఁబడు నీరులతో

తాత్పర్యము . అంత నంతిపురమునందలి ప్రౌఢాంగనలు మిక్కిలి సంతోషమునఁ బరిమళవంతమైన నూనియతోడి తలంటును ఉసిరికపిండితో నలుగువెట్టుట మున్నుగా నధికమైన సువాసనతోఁగూడిన హంసోదకములతో- తరువాతి పద్యముతో నన్వయము

తే . **ఒడలి భస్మరజంబు పోఁ గడిగి పుచ్చి**
జడలు విచ్చినఁ గరమొప్ప శైలతనయ
కాలపరిణతి నిర్ముక్త గళిత పర్ణ
మధుకరాకీర్ణ తరులతామహిమ వోలె 79

అర్థము. ఒడలి - భస్మ - రజంబు = మేని బూదిపొడి, పోన్ = పోవునట్లు, కడిగి - పుచ్చి = కడిగివైచి, జడలు, విచ్చినన్ = విప్పఁగా, శైల - తనయ = కొండకూఁతురు - పార్వతి, కాల - పరిణతిన్ = కాలముయొక్క మార్పుచే, నిర్ముక్త = విడువఁబడిన, గళిత-పర్ణ = రాలిన ఆకులు గలిగినట్టియు, మధుకర + ఆకీర్ణ = తుమ్మెదలతో నిండినట్టియు, తరు-లతా మహిమ + పోలెన్ = చెట్టుతీఁగవిధము వలె, కరము + ఒప్పెన్ = మిక్కిలి యొప్పెను

తాత్పర్యము . మేని బూదిపొడి పోవునట్లు కడిగివైచి, జడలు విప్పఁగాఁ, బార్వతి, కాలపరిణతిచే నాకులు రాలి తుమ్మెదలు నిండిన చెట్టుతీఁగవలె మిక్కిలి యొప్పెను

విశేషములు . అలంకార ముపమ మహిమ = విధము - ఉపమా వాచకము

ఆ కసటువోవఁ దొడసి కడిగిన కనకంపుఁ
బ్రతిమవోలె నొప్పు నతివ మేను
కచభరంబు పొల్చె గవుసెన వుచ్చిన
కుసుమబాణు నీలకుంచి వోలె 80

అర్థము అతివ - మేను = ఇంతి (పార్వతి) శరీరము, కసటు + పోవన్ = ముటికి పోవునట్లు, లొడసి = తోమి, కడిగిన, కనకము + ప్రతిమ + పోలెన్ = బంగారు బొమ్మ విధమున, ఒప్పున్, కచ-భరంబు = కొప్పు, గవుసెన = గలీబు, వుచ్చిన = తీసివైచిన, కుసుమ - బాణు = పుష్పాస్త్రుని (మన్మధుని) యొక్క, నీల - కుంచి + పోలెన్ = నల్లని కుంచెవలె, పొల్చెన్ = ఒప్పెను

తాత్పర్యము . పార్వతి యొడలు మాలిన్యము పోవునట్లు తోమికడిగిన బంగారు ప్రతిమవలె నొప్పెను ఆమె కొప్పు గలీబు తీసివైచిన మన్మధుని నల్లని కుంచెవలె నొప్పెను

విశేషములు . అలంకారములు ఉపమలు కనకంపుఁ బ్రతిమ - కనకము + ప్రతిమ - 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు' బాల సంధి 32 కనకంపు + ప్రతిమ పుంపులకుఁ బరుషము పరమగుచుండఁగా నుగాగమము + బాల సంధి 25 కనకంపు + ను + ప్రతిమ ద్రుతకార్యము బాల సంధి 16,17 కనకంపుఁ బ్రతిమ

సప్తర్షులు శివునికడకు వచ్చుట

వ అంత నట గిరిశుండు రజతగిరి కరిగి పరిణయోద్యుక్తుండై సప్తర్షులం దలంచుడుఁ దదీయస్మరణ ప్రేరితంబై మునిగణం బాక్షణంబ చనుదెంచి 81

అర్థము. అంతన్, అట = అక్కడ, గిరిశుండు = శివుఁడు (కొండపైఁబరుండు వాఁడు), రజత - గిరికిన్ = వెండికొండకు - కైలాసమునకు, అరిగి, పరిణయ + ఉద్యుక్తుండు + ఐ = పెండ్లికిఁ బ్రయత్నించినవాఁడయి, సప్త + ఋషులన్ = ఏడుగురు ఋషులను, తలంచుడున్ = తలఁచినంతనే, తదీయ + స్మరణ - ప్రేరితంబు + ఐ = ఆ శివునిదైన తలఁపుచేఁ బ్రేరేపింపఁబడినదయి, మునిగణంబు = మునుల సమూహము, ఆ-క్షణంబు + అ = ఆ క్షణమే, చనుదెంచి = వచ్చి

తాత్పర్యము : అంత నక్కడ శివుఁడు కైలాసమునకుఁ బోయి వివాహ ప్రయత్నము గలవాఁడయి సప్తమహర్షులను దలఁచినంతనే, ఆతని తలఁపుచేఁ బ్రేరేపింపఁబడినవారయి సప్తర్షులు వెంటనే వచ్చి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. సప్తర్షులు = సప్త + ఋషులు - గుణసంధి గిరిపుఁడు = గిరిపై (కైలాసముపై) శయనించువాఁడు - శివుఁడు సప్తర్షులు - మరీచి, అత్రి, అంగిరసుఁడు, పులస్త్యుఁడు, పులహుఁడు, క్రతువు, వసిష్ఠుఁడు

క కనుచూడ్కిం గోలెను దం
డ నమస్కారములు సేసి డాయంజని స
న్మునితతి కరముకుళితులై
వినుతించుచు నిలిచి రఖిలవేదస్తుతులన్ 82

అర్థము. కను- చూడ్కిన్ + కోలెను = చూచినది మొదలు, దండ - నమస్కారములు + చేసి = సాష్టాంగ ప్రణామములు చేసి, డాయన్ +చని = సమీపింపనేఁగి, సత్ + ముని - తతి = శ్రేష్ఠులైన మునుల సమూహము, కర-ముకుళితులు + ఐ = చేతుల ముకుళితములు గలవారయి - చేతులు జోడించినవారయి, అఖిల - వేద -స్తుతులన్ = సర్వవేదస్తోత్రములలో, వినుతించుచున్ = పొగడుచు, నిలిచిరి

తాత్పర్యము. సప్తర్షులు శివుని ధర్శించినదిమొదలు సాష్టాంగ ప్రణామములు చేసి సమీపించి చేతులు జోడించి సర్వవేదస్తోత్రములతోఁ బొగడుచు నిలిచిరి

విశేషములు. సత్ + ముని = సన్ముని - అనునాసిక సంధి సన్మునితతి ముకుళితులై నిలిచిరి 'మహత్సమూహార్థకశబ్దం బమహత్కార్యయుక్తంబయ్యెఁ ద్యద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు విభాష నగు ప్రౌఢ శబ్ద 17

వ అమ్మహార్షులు పరమేశ్వరానుమతంబున నిజార్హస్థానాసీనులై కరకమలంబులు మొగిడించి 83

అర్థము. ఆ + మహత్ (మహా) + ఋషులు = ఆ గొప్పమునులు, పరమేశ్వర + అనుమతంబునన్ = శివుని ఆజ్ఞచే, నిజ + అర్హ-స్థాన + ఆసీనులు + ఐ = తమకుఁ దగిన స్థానములందుఁ గూర్చున్నవారయి, కర - కమలంబులు = కేలుఁదమ్ములు, మొగిడించి = ముడువఁజేసి

తాత్పర్యము. ఆ గొప్ప మునులు శివుని యనుమతిచేఁ దమ కుచితములైన స్థానములందుఁ గూర్చున్నవారయి కేలుఁదమ్ములు ముడిచి - తరువాతి పద్యముతో నన్వయము

క త్రినయన! నీ వెవ్వని మన
మునఁ దగ వర్తించి తతఁడు ముక్తుండగు నీ
మనమున వర్తించితి మటె
ధనదసఖా! యేమె కామె ధన్యుల మెందున్! 84

అర్థము త్రినయన = ముక్కంటీ! నీవు, ఎవ్వనిన్, మనమునన్ = మనసునందు, తగన్, వర్తించితి (వి) = ఉంచితివి, అతఁడు, ముక్తుండు + అగున్ = మోక్షము నొందినవాఁడగును, ధనద-సఖా = కుబేరుని మిత్రుఁడా! నీ - మనమునన్ = నీ మనసునందు, వర్తించితిమి + అటె = ఉండితిమట, ఎందున్, ఏము + ఎ = మేమే, ధన్యులము = కృతార్థులము, కామె = కామా?

తాత్పర్యము. ముక్కంటీ! నీవు మనసులో నెవనిని దలఁతువో అతఁడు మోక్షము నొందినవాఁడగును కుబేరమిత్రమా! మేము నీ మనసులో నర్తిలితిమట! ఎందును ధన్యులము మేమే కామా! అగుదు మనుట

విశేషములు వర్తించితతఁడు - వర్తించితి + అతఁడు వర్తించితివి + అతఁడు - 'లిడ్వికారమునకు వైబాషికలోపము' - బాల క్రియ 24 వర్తించితి + ఇ + అతఁడు అంద్వవగాగమసంధి బాల సంధి 11 వర్తించితి + అతఁడు - 'మధ్యమపురుషక్రియలయం దిత్తునకు సంధి యగును' బాల సంధి 7

వ **'మమ్ము రావించిన కార్యం బానతి యి'మ్మనిన నమ్మునీశ్వరుల నీశ్వరుండు కరుణావలోకన సముచితాలాపసుధా ప్రవాహంబునం దేల్చుచు** 85

అర్థము. మమ్మున్, రావించిన, కార్యంబు = ప్రయోజనము, ఆనతి + ఇమ్ము + అనినన్ = సెలవిమ్మనఁగా, ఆ + ముని + ఈశ్వరులన్ = ఆ మునిశ్రేష్ఠులను, ఈశ్వరుండు, కరుణా + అవలోకన = సముచిత + ఆలాప - సుధా - ప్రవాహంబునన్=దయాదృష్టికి తగిన మాటలు అనెడి అమృతప్రవాహమునందు, తేల్చుచున్ = తేలునట్లు చేయుచు

తాత్పర్యము : 'మమ్ము రావించిన కార్యమును సెలవి'మ్మనఁగా, నా మునీశ్వరుల నీశ్వరుఁడు దయాదృష్టికిఁ దగిన యాలాపము అనెడి అమృతరసప్రవాహమునందుఁ దేల్చుచు తరువాతి పద్యముతో నన్వయము

చ గిరిజ తపఃప్రభూతికి నకృత్రిమభక్తికి మెచ్చి దానికిన్
వర మనురక్తి నిచ్చితి, వివాహమునం దదభీష్టసిద్ధి చె
చ్చెరఁ బొనరింపఁగావలయు, శీతగిరీశ్వరు పాలికేఁగి మ
త్పరిణయకార్య మోజగొనఁ బల్కి రయంబున రండు గ్రమ్మఱన్ 86

అర్థము గిరిజ - తపస్ + ప్రభూతికిన్ = పార్వతి తపస్సంపదకును, అకృత్రిమ - భక్తికిన్ = నిష్కపటమైన భక్తికిని, మెచ్చి, దానికిన్ = ఆమెకు, వరము, అనురక్తిన్ = ప్రేమముతో, ఇచ్చితిన్, వివాహమునన్ = పెండ్లిచే, తద్ + అభీష్ట - సిద్ధి = ఆమె కోరిక నెఱవేఱుట, చెచ్చెరన్ = శీఘ్రముగా, పొనరింపఁగాన్ + వలయున్ = చేయవలయును, (మీరు), శీత - గిరి + ఈశ్వరు-పాలికిన్ = మంచుకొండరాయని (హిమవంతుని) కడకు, ఏఁగి,మత్ + పరిణయ - కార్యము= నా పెండ్లిపని, ఓజ + కొనన్ = సిద్ధించునట్లు, పల్కి = మాటాడి, రయంబునన్ = వేగముగా, క్రమ్మఱన్ = మరల, రండు

తాత్పర్యము. 'పార్వతి తపస్సంపదకును, నిష్కపటమైన భక్తికిని మెచ్చి, యామెకు వర మనురాగముతో నొసఁగితిని పెండ్లిచే నామెకోరికను నెఱవేర్పవలయును మీరు హిమవంతునికడకరిగి నా వివాహకార్యము సిద్ధించునట్లు మాటలాడి మరల వేగముగా రండు'

విశేషములు. రండు - వచ్చు ధాతువు 'ఆశీశ్శాపసంప్రార్థన విధులందు లూట్టగు బాల క్రియ 6 వచ్చు + లూట్ 'లకారంబునకు డు ఱు వు రు ను ము ఞ్ఞ గు' బాల క్రియ 8 మధ్యమపురుష బహువచనము గావున - వచ్చు + రు 'లూణ్మధ్యమ వు రులకు ముడుజ్ఞులగు' వచ్చు + డుజ్ బాల క్రియ 29 'మధ్యమ ముడుజ్ఞీలు ముజ్ఞు నాఁబడు' బాల క్రియ 31 ముజ్ఞీత్తులు ముత్తు నాఁబడు' బాల క్రియ 86 'అగు వచ్చు చొచ్చు చూచులకు ముత్తు పరంబగునపుడు కా రా చొరు చూడు లగు' బాల క్రియ 91 రా + డుజ్ 'ముజ్ఞు పరంబగునపుడు దీర్ఘంబునకు హ్రస్వంబును మువర్ణకంబునకు మాముడియు నగు' బాల క్రియ 61 ర + డుజ్ 'జిత్తు బిందు పూర్వంబగు' బాల తత్సమ 19 రండు

వ అని తమ్ము నాప్తులంజేసి నిజాప్తకార్యం బెటిఁగించి నియమించుటకు నమ్మునులు ప్రముదితహృదయులై మహాప్రసాదంబని వీడుకొని శుభవాచనంబులు వినుచు, శుభద్రవ్యంబులు సూచుచు, శుభశకునంబులు గైకొనుచుం దుహినాచలంబునకుం జనిచని ముందట 87

అర్థము అని, తమ్మున్, ఆప్తులన్ + చేసి = ఇష్టులనుజేసి, నిజ + ఆప్త - కార్యంబు = తనదైన ఇష్టమైన పని, ఎఱిఁగించి = తెలిపి, నియమించుటకున్ = నియోగించుటకు, ఆ + మునులు, ప్రముదిత-హృదయులు + ఐ = మిక్కిలి సంతోషించిన హృదయము గలవారయి, మహత్ (మహా) + ప్రసాదంబు + అని, వీడుకొని = సెలవుగైకొని, శుభ-వచనంబులు = శుభకరములైన మాటలు, వినుచున్, శుభ-ద్రవ్యంబులు = శుభకరవస్తువులు, చూచుచున్, శుభ-శకునంబులు = శుభకరములైన శకునములు, కైకొనుచున్ = స్వీకరించుచు, తుహిన + అచలంబునకున్ = మంచుకొండకు-హిమవంతమునకు, చనిచని = పోయిపోయి, ముందటన్ = ఎదుట

తాత్పర్యము అని తమ్ము హితులనుజేసి తన యిష్టకార్యము నెఱిఁగించి నియోగించుటకు ఆ మునులు సంతసించి మహాప్రసాదమని సెలవుపుచ్చుకొని శుభవచనములు వినుచు, శుభద్రవ్యములు చూచుచు, శుభశకునములు గైకొనుచు హిమవంతమునకుఁ బోయిపోయి యెదుర - తరువాతి పద్యముతో నన్వయము

చ పరము కపర్దరాగరుచి పర్వెనొ? కాంచనశైలభాతి మైఁ
బొరసెనొ? కల్పవృక్షఫలభూరిరసం బొడఁగూడెనో? నదీ
శ్వర వర సంగ మాగమన సమ్మదరాగము? నాఁగ హేమ పం
కరుహ రజఃపిశంగరుచిఁ గ్రాలు సురాపగఁ గాంచి రమ్మునుల్ 88

అర్థము . అమ్మునుల్ = ఆ + మునుల్ = ఆ సప్తర్షులు, పరము = ఉత్కృష్టుడైన యీశ్వరునియొక్క, కపర్ద-రాగ-రుచి = జటాజూటముయొక్క ఎఱ్ఱని కాంతి, పర్వెనొ = వ్యాపించెనో, కాంచన-శైల-భాతి = బంగరుకొండ (మేరువు) కాంతి, మైన్ = మేన, పొరసెనొ = పొందెనో, కల్పవృక్ష-ఫల-భూరి-రసంబు = ఈవిమ్రాని పండ్ల అధికమైన రసము, ఒడఁగూడెనో = లభించెనో, నదీ+ ఈశ్వర-వర-సంగమ + ఆగమన-సమ్మద-రాగమొ = సముద్రునితోడి మేలయిన కలయికకొఱకు వచ్చుటయందలి సంతోషముయొక్క ఎఱుపో, నాఁగన్ = అనఁగా, హేమ - పంకరుహ-రజస్-పిశంగ-రుచిన్ = బంగరు తామరల పుప్పొడి యొక్క కపిల వర్ణపుఁగాంతితో, క్రాలు = ఒప్పు, సుర + ఆపగన్ = దేవనదిని-గంగానదిని, కాంచిరి = చూచిరి

తాత్పర్యము ఆ సప్తర్షులు పరమేశ్వరుని జటాజూటము నెఱ్ఱని కాంతి వ్యాపించెనో, మేరు పర్వతకాంతి మేనఁ గలిగెనో, కల్పవృక్షఫలముల అధికమైన

రసము పొందెనో, సముద్రునితోడి కలయికకై వచ్చుట యందలి సంతోషపుటెఱుపో యన బంగరు తామరల పుప్పొడిదైన కపిలవర్ణపుఁగాంతితో నొప్పు గంగానదిని జూచిరి

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష, సందేహము కాంచి సన్మునుల్ అను పారముకంటె రాళ్లపల్లివారి 'కాంచి రమ్మునుల్' అను పారము మేలయినదిగాఁ గనుపట్టుటచే నది స్వీకరింపఁబడినది

మ. కర మొప్పన్ వియదంగనా తరలముక్తాహారమో శంభు న
త్యురు జూటాశ్రిత సర్పకంచుకమొ, హేమోర్వీధరోద్యత్సుధా
కరకాంతంబొ, హిమాచలోపరిశరత్కందంబొ, భూస్త్రీసితాం
బరమో వారిధి తృష్ణఁ ద్రాగెడు సుధాపానంబొ నాఁగా మునుల్ 89

అర్థము. మునుల్ = మునులు - సప్తర్షులు, వియత్ + అంగనా-తరల-ముక్తా-హారమో = ఆకాశమనెడి స్త్రీయొక్క చలించుచున్న ముత్యాలపేరో, శంభు = శివునియొక్క, అతి + ఉరు-జూట + ఆశ్రిత-సర్ప-కంచుకమొ = మిక్కిలి పెద్దదైన జడముడిని ఆశ్రయించిన పాము కుబుసమో, హేమ + ఉర్వీధర + ఉద్యత్ + సుధాకర కాంతంబొ = మేరుపర్వతమునందుఁ బైకి లేచుచున్న చంద్రకాంతశిలయో, హిమ + అచల + ఉపరి-శరద్ + కందంబొ = హిమవత్పర్వతముపైనున్న శరత్కాలమేఘమో, భూ-స్త్రీ-సిత + అంబరమో = భూమియను నింతి తెల్లనివస్త్రమో, వారిధి = సముద్రము, తృష్ణన్ = దప్పితో, త్రాగెడు = త్రాగునట్టి, సుధా-పానంబొ = అమృత పానీయమో, నాఁగాన్ = అనఁగా, కరము + ఒప్పన్ = మిక్కిలి ఒప్పఁగా, (సురాపగఁ గాంచిరి)

తాత్పర్యము : మునులు ఆకాశమనెడు స్త్రీ తాల్చిన చలించు ముత్యాల పేరో, శివుని జటాజూటము నాశ్రయించిన పాము కుబుసమో, మేరుపర్వతముపైకిఁ బోవుచున్న చంద్రకాంతశిలయో, హిమవత్పర్వముపైఁగల శరత్కాలమేఘమో, భూమియను స్త్రీ ధరించిన తెల్లని వస్త్రమో, సముద్రము దప్పితోఁ ద్రాగునట్టి అమృతపానీయమో అనొ మిక్కిలి యొప్పు (సురాపగను గాంచిరి)

విశేషములు : 'సురాపగఁ గాంచిరి' అను పూర్వపద్యమునందలి దానితో దీనిని బూరింపవలయును అలంకారము ఉత్ప్రేక్ష, సందేహము వియదంగనా, భూస్త్రీ అనుచోట్ల రూపకము 'హేమోర్వీధరగ్లౌసుధాకరకాంతంబొ' అను దానికంటె, 'హేమోర్వీధరోద్యత్సుధాకరకాంతంబొ' అను పారము మేలయినదిగాఁ గనవచ్చుటచే

నది స్వీకరింపఁబడినది 'కాంతము' అనుదానిని చంద్ర సూర్యాయశబ్దముల తుదిని జేర్చుచో 'శిల' అర్థము నిచ్చును

వ అని వర్ణించుచుం దదీయామల స్నాన పవిత్రీకృతగాత్రులై తుహినాచలంబునకుం జని తదుపకంరంబున 90

అర్థము . అని, వర్ణించుచున్, తదీయ + అమల-స్నాన-పవిత్రీకృత-గాత్రులు + ఐ = గంగానదికి సంబంధించిన నిర్మలమైన స్నానముచేఁ బవిత్రముగాఁ జేయఁబడిన శరీరములు గలవారయి, తుహిన + అచలంబునకున్ = మంచుకొండకు, చని = వెడలి, తద్ + ఉపకంరంబునన్ = దాని సమీపమున

తాత్పర్యము. అని వర్ణించుచు నా గంగానదియందు నిర్మలమైన స్నానముచేఁ బావనముగాఁజేయఁబడిన శరీరములు గలవారయి హిమాచలమునకుఁ బోయి, దాని సమీపమున - తరువాతి పద్యముతో నన్వయము

ఓషదిప్రస్థ పుర వర్ణనము

సీ వేదాదులగు మహావిద్యల కెల్లను
వనజాసనుఁడుఁ దాను నునికిపట్లు
శృంగారవతులగు నంగనావలి కెల్ల
నమరావతియుఁ దాను నాలయంబు
లనుపమానర్ఘ్యరత్నానీకముల కెల్ల
నంభోనిధియుఁ దాను నాకరంబు
లక్షయంబగు నసంఖ్యార్థరాసుల కెల్ల
నలకయుఁ దానును నిలయము లన
తే వఱలు పేర్మితో భారతవర్షమునకు
భూషణం బన నధికవిభూతిఁ దనరి
పరఁగు హిమనగాధీశ్వరు పురవరంబు
ప్రస్తుతం బగు నోషధీప్రస్థపురము 91

అర్థము. వేద + ఆదులు + అగు = వేదములు మున్నుగాఁగల, మహాత్ (మహా)-విద్యలకున్ + ఎల్లన్ = గొప్ప చదువులకెల్లను, వనజ + ఆసనుఁడున్ = తామర ఆసనముగాఁ గలవాఁడు - బ్రహ్మయును, తానున్ = తానును - ఓషధీప్రస్థపురమును, ఉనికిపట్లు = ఉండుచోట్లు

శృంగారవతులు + అగు = సౌందర్యవతులైన, అంగనా + ఆవలికిన్ + ఎల్లన్ = స్త్రీల వరుస (సమూహము) కంతకును, అమరావతియున్ = దేవతల పత్తనమైన అమరావతియును, తానున్, ఆలయంబులు = నిలయములు

అనుపమ + అనర్ఘ్య-రత్న + అనీకములకున్ + ఎల్లన్ = సాటిలేని, అమూల్యములైన, రత్నముల సమూహములకెల్లను, అంభోనిధియున్ = సముద్రమును, తానున్, ఆకరంబులు = స్థానములు

అక్షయంబు = నాశనములెనిని అగు, అసంఖ్య + అర్థ-రాసులకున్ + ఎల్లన్= లెక్కలేని ధనరాశుల కన్నిటికిని, అలకయున్ = కుబేరుని పత్తనమై అలకానగరమును, తానున్, నిలయములు = చోట్లు,

అనన్ = అనునట్లు, వఱలు-పేర్మితోన్ = ఒప్పునట్టి గొప్పత ముతో భారతవర్షమునకున్ = భారతదేశమునకు, భూషణంబు = అలంకారము, అనన్= అనఁగా, అధిక-విభూతిన్ = ఎక్కువ సంపదతో, తనరి = తగి, పరఁగు = ఒప్పునట్టి, హిమ-నగ + అధి + ఈశ్వరు-పుర-వరంబు = హిమవత్పర్వతరాజు నగరశ్రేష్ఠము, ఓషధీప్రస్థపురము = ఓషధీప్రస్థ మనుపత్తనము, ప్రస్తుతంబు + అగున్ = మిక్కిలి పొగడఁబడినది యగును

తాత్పర్యము . వేదములు మున్నుగాఁగల మహావిద్యలకెల్ల బ్రహ్మయును దానును స్థానములు, సౌందర్యవతులగు స్త్రీలకెల్ల నమరావతియును దానును నిలయములు, సాటిలేని అమూల్యములైన రత్నముల సమూహములకెల్ల సముద్రమును దానును స్థానములు, క్షయముగాని లెక్కలేని ధనరాశులకెల్ల నలకాపత్తనమును దానును నిలయము లనఁగానొప్పి భారతదేశమున కలంకారమన మిక్కిలి సంపదతోఁ దగి యొప్పు హిమవత్పర్వతరాజు పత్తనశ్రేష్ఠమైన ఓషధీప్రస్థపురము మిక్కిలి పొగడఁబడినది యగును

విశేషములు . అలంకార ముదాత్తము

వ తత్పురవరంబునందు **92**

అర్థము . తద్ + పుర-వరంబు + అందున్ = ఆ నగరశ్రేష్ఠమైన ఓషధిప్రస్థమందు

తాత్పర్యము: ఆ నగరశ్రేష్ఠమైన ఓషధిప్రస్థమునందు - తరువాతి పద్యముతో నన్వయము

క జల మిక్షు ఫల రసంబులు
కలు పంబురుహోత్పలములు, గరుసులు ముత్యం
బులు, మీలు మణులు సంకులు
నలి సస్యము చెఱకు రాజనపుఁబొల మెల్లన్ 93

అర్థము రాజనపుఁబొలము = మేలిరకపువరి పండు పొలము, ఎల్లన్ = అంతయును, జలము = నీరు, ఇక్షు-ఫల-రసంబులు = చెఱకురసములు, కలుపు = సస్యములో మొలచు గాద, అంబురుహ + ఉత్పలములు = తామరలు, కలువలు, గరుసులు = గులకఱాలు, ముత్యంబులు, మీలు = చేఁపలు, మణులు, సంకులు = శంఖములు, నలిన్ = క్రమముగా, సస్యము = పంట, చెఱకు

తాత్పర్యము . మేలిరకపు వరిపండుచేలలోనెల్ల నీరు చెఱకు రసము, కలుపుగడ్డి తామరలు, కలువలు, గులకఱాలు ముత్యములు, చేఁపలు మణులును, శంఖములును, పంట చెఱకు

విశేషములు అలంకార ముదాత్తము మీలు-మీను - 'లువర్ణంబు బహువచనంబు' బాల తత్సమ 12 మీను + లు 'బహుబచనంబు పరంబగునపుడు చేను పేను మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు' బాల ఆచ్చిక 20 మీలు రాజనపుఁబొలము రాజనము + పొలము 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు' బాల సంధి 32 రాజనపు + పొలము 'సమానంబుల నుదంతంబులగు స్త్రీనమంబులకుం బుంపు లకుం బరుషసరళంబులు పరంబులగునపుడు నుగాగమం బగు' బాల సంధి 25 రాజనపు + ను + పొలము 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు' బాల సంధి 16 'ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాషనగు' బాల సంధి 17 రాజనపుఁబొలము

చ హాలిక నితంబినీ తతి ప్రయత్నమునం దమ కాచియున్న య
క్కలమవనాళీ జక్రవిహగంబులు సొచ్చినఁ జోఁపిపుచ్చఁ జే
తులు చఱువంగ నెత్తుటయుఁ దుంగకుచంబులు వాని నాఁగు న
ప్పులుఁగుల యొప్పు దమ్మి వెడఁ బోలినపక్షము సేయునట్టివై 94

అర్థము హాలిక-నితంబినీ-తతి = కాపుఁబడఁతుల సమూహము, ప్రయత్నమునన్ = ప్రయత్నముతో, తమ-కాచి + ఉన్న = తాము రక్షించియున్న,

ఆ + కలమ-వన + ఆళిన్ = ఆ వరిచేల వరుసను,చక్ర-విహగంబులు = చక్రవాకపక్షులు, చొచ్చినన్ = ప్రవేశింపఁగా, చోఁపి-పుచ్చన్ = తఱిమివేయుటకు, చేతులు చఱువంగన్= చఱుచుటకని, ఎత్తుటయున్ = ఎత్తఁగా, తుంగ-కుచంబులు = వారి యెత్తయిన పాలిండ్లు, ఆ + పులుఁగుల +ఒప్పు = ఆ పిట్టల చక్కఁదనము, తమ్మున్, వెడన్ = అల్పముగా, పోలిన - పక్షము + చేయు + అట్టివి + ఐ = పోలిన యభిమానము గలిగినట్టివయి, వానిన్ = ఆ చక్రవాకములను, ఆఁగున్ = ఆఁపును

తాత్పర్యము . వరిపొలములను గాచు కాపుఁబడఁతులగుంపు పూనికతోఁ దాము రక్షించుచున్న వరిచేలలోనికిఁ జక్రవాకపక్షులు ప్రవేశింపఁగా వానిని దఱిమివేయుటకు వారు తమ చేతులు చఱుచుటకయి యెత్తఁగా, వారి యెత్తయిన స్తనములు, ఆ పక్షుల చక్కఁదనము తమ్ము ఇంచుక పోలిన యభిమానముచే వాని నాఁపును

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష తమ కాచియున్న - తాము కాచియున్న- 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱుచుగ యొక్కషష్ఠి యగు' ప్రౌఢ కారక 15 తమయొక్క కాచియున్న 'యొక్కకు లోపంబు బహుళంబు - ప్రౌఢ కారక 16 తమకాచియున్న అక్కలమ- ఆ + కలమ - త్రికసంధి

చ నలిఁ గమలాననల్ మృదునినాదములన్ వెడదొక్కుఁబల్కులన్
సొలవక చిల్కలన్ వెడలఁజోఁపు నెలుంగులుఁ దమ్ము డాయరాఁ
బిలుచుట కాఁగ నా చిలుకపిం డనిశంబును జేలలోన మం
దలుగొని పాయకుండు మదిఁ దద్వచనశ్రవణాభిలాషులై 95

అర్థము: కమల + ఆననల్ = పద్మముఖులు - కాపుఁబడఁతులు, నలిన్= ఉత్సాహముతో, మృదు-నినాదములన్ = మృదువులైన ధ్వనులతో, వెడ-తొక్కు+ పల్కులన్ = ఇంచుక అవ్యక్త మధురములైన మాటలతో, సొలవక = తగ్గక, చిల్కలన్= చిలుకలను, వెడలన్ + చోఁపు + ఎలుంగులున్ = పోఁద్రోలు కంరధ్వనులు సైతము, తమ్మున్, డాయన్ + రాన్ + పిలుచుట-కాఁగన్ = దగ్గఱకు రమ్మని పిలుచునట్లు కాఁగా, ఆ-చిలుక-పిండు = ఆ చిలుకల గుంపు, అనిశంబును= ఎల్లప్పుడును, మదిన్ = మనస్సునందు, తద్ + వచన-శ్రవణ + అభిలాషులు + ఐ = వారి మాటల వినికియందుఁ గోరికగలవయి, చేలలోనన్ =

పొలములందు, మందలు +కొని = గుంపులుకట్టి, పాయక + ఉండున్ = విడువకుండును

తాత్పర్యము : పొలముకాపరులగు స్త్రీలు ఉత్సాహముతో మృదువులైన ధ్వనులతోను, ఇంచుక అవ్యక్త మధురములైన కంఠధ్వనులతోను తగ్గక చిలుకలను వెడలఁగొట్టుటకైన కంఠధ్వనులుసైతమును దమ్ము దగ్గటకు రమ్మని పిలుచునట్లు కాఁగా, నా చిలుకలగుంపు ఎల్లప్పుడును మనసులో వారి మాటలను వినుకోరికతోఁ జేలలో గుంపులుకట్టి విడువకుండును

విశేషములు . అలంకార ముత్రేక్ష సొలవక - 'సొలచు' ధాతు వ్యతిరేక క్ష్వార్థ రూపము చోఁపునెలుంగులు - చోఁపు + ఎలుంగులు - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' బాల సంధి 33 '

సీ నిమ్మలు మాదీఫలమ్ములు నతిరమ్య
ముగఁ బండి నేలపై మోచియుండుఁ
బనసలు నీడలుఁ బండి గుత్తులుగట్టి
వారక వానిపై వ్రాలియుండుఁ
దేరు మామిళ్లును నేరేళ్లుఁ గడుఁ జెల్వ
మై పండి వానిపై నదికియుండుఁ
గ్రముకంబులును వరఖర్జూర నికరంబు
నొగిఁ బండి వానిపై నొఱఁగియుండు

ఆ నాలికేరములును దాలసమూహంబుఁ
బండి వానిఁ గప్పియుండు నొప్పి
వరుసఁ దరతరంబ వనములు సత్ఫల
రాసులై నభమ్ము రాయుచుండు. 96

అర్థము . నిమ్మలున్, మాదీఫలమ్ములున్ = మాదిఫలమ్ములున్ = మాతులుంగములును, అతి-రమ్యముగన్ = మిక్కిలి సుందరముగా, పండి, నేలపైన్, మోచి + ఉండున్ = ఆనియుండును

పనసలున్, ఈడలున్ = ఈడెచెట్లును (ఎట్టికిత్తలి) పండి, గుత్తులు + కట్టి, వారక = ఉడుగక, వానిపైన్, వ్రాలి + ఉండున్

తేరు మామిళ్లును = తేరువలె నడుగున గుబురుగాను, పైని పొడుగుగాను

పెరుఁగు నొకజాతి మామిడులును, నేరేళ్లున్, కడున్, చెల్వము + ఐ = అందమయి, పండి, వానిపైన్, అదికి + ఉండున్

క్రముకంబులును = పోఁకలును, వర-ఖర్జూర-నికరంబున్ = మేలయిన ఖర్జూర సమూహమును, ఒగిన్ = క్రమముగా, పండి, వానిపైన్, ఒఱఁగి + ఉండున్= వ్రాలియుండును

నాలికేరములును = నారికేలములును - కొబ్బరులును, తాల-సమూహంబున్= తాటిచెట్ల గుంపును, పండి, ఒప్పి వానిన్, కప్పి + ఉండున్

వరుసన్, తరతరంబ = క్రమక్రమముగా, వనములు = తోటలు, సత్ + ఫల-రాసులు + ఐ = మంచి పండ్లప్రోవులు గలవయి, నభమ్మున్ = ఆకాశమును, రాయుచున్ + ఉండున్ = ఒరయుచుండును

తాత్పర్యము. నిమ్మచెట్లును, మాదిపలములును మిక్కిలి అందముగాఁ బండి నేలపై నానియుండును పనసలును, ఈడచెట్లును పండి గుత్తులుగట్టి ఉడుగక వానిపై వ్రాలియుండును తేరుమామిడులును, నేరేళ్లును మిక్కిలి సుందరముగాఁ బండి వానిపై నదికియుండును పోఁకలును, మేలయిన ఖర్జూరములును పండి వానిపై నొఱఁగియుండును కొబ్బరులును, తాటిచెట్ల గుంపును పండి వానిని గప్పియుండును తోఁటలు క్రమముగా మంచి పండ్లప్రోవులు గలవయి ఆకాశము నొరయుచుండును

విశేషములు. 'తేరు మామిండ్లు' అనుదానికంటె తేరుమామిళ్లు అను పారము మేలు, సలక్షణము

మ రసముల్ గ్రమ్ముచు వృక్షపక్వఫలముల్ రమ్యేక్షుసంఘంబుపై
వెసఁ బడ్డన్ వడి వ్రస్సి వాని రస ముర్విన్ వెల్లిగొంచున్ వనం
బొసఁగన్ దత్తరురాజిపైఁ బఱచుఁ దా రొండొంటి కాత్మీయ స
ద్రసమాధుర్యత చూపున ట్లురుతరారామంబు లం దందమై 97

అర్థము. అందున్ = ఆ ఓషధిప్రస్థపురమందు, ఉరుతర + ఆరామంబులు= మిక్కిలి పెద్దవియైన తోఁటలు, అందము + ఐ = సుందరమై, తారు = తాము - వృక్షములును, ఇక్షు సంఘమును, ఒండు + ఒంటికిన్ = ఒకదాని కింకొకటి, ఆత్మీయ-సత్ + రస-మాధుర్యత = తమదైన మేలైన రసముయొక్క తీయఁదనము,

చూపు + అట్లు = చూపువిధమున, వృక్ష-పక్వ-ఫలముల్ = చెట్ల పండిన పండ్లు, రసముల్, క్రమ్మ్మించున్ = కాఱుచు, రమ్య + ఇక్షు - సంఘంబుపైన్ = రమణీయమైన చెఱకులగుంపుపై, వెసన్ = శీఘ్రముగా, పడ్డన్ = పడఁగా, వడిన్= వేగముగా, వ్రస్సి = బ్రద్దలయి, వాని-రసము = ఆ చెఱకుల రసము, ఉర్విన్ = నేలమీఁద వెల్లి + కొంచున్ = ప్రవాహము కట్టుచు, వనంబు = నీరు, ఒసఁగన్ = ఇచ్చుటకు, తద్ + తరు-రాజిపైన్ = ఆ చెట్లవరుస మీఁదికి, పఱచున్ = ప్రవహించును

తాత్పర్యము . ఆ ఓషధిప్రస్థపురమున మిక్కిలి పెద్దవియైనతోఁటలు సుందరమై - వృక్షములును, చెఱకుగుంపులును బరస్పరము తమతమ మేలైనరసముల తీయఁదనములను జూపునట్లు - చెట్ల పండిన పండ్లు రసములు కాఱుచు రమణీయమైన చెఱకులగుంపుపై శీఘ్రముగాఁబడఁగా, వేగముగా విఱిగి ఆ చెఱకుల రసము నేలమీఁదఁ బ్రవాహముగట్టుచు నీటినిచ్చుట కా వృక్ష పంక్తిమీఁదికిఁ బ్రవహించును

విశేషములు అలంకారము అతిశయోక్తి, ఉత్ప్రేక్ష మాధుర్యత - భావార్థక తద్ధితాంతముపై మరల భావార్థకప్రత్యయము మాధుర్య మనుట సలక్షణము తత్తరు - తద్ + తరు - అనునాసికాంతస్థ భిన్నములైన హల్లులకు (ఱుల్లులకు) కరినహల్లులు (ఖ్రులు) పరమగునపుడు వాని వర్గములందలి ప్రథమవర్ణములు (చ్రులు) ఆదేశముగా వచ్చును

తే ఓలిఁ దాంబూలవల్లి తమాల నీల
భాతిఁ దఱఁకంగఁ, బరిపక్వ పనస పూగ
భాసురారుణద్యుతులు పైఁ బర్వి, పొగడఁ
జాలు వనలక్ష్మి ప్రత్యూషవేళ వోలె 98

అర్థము . ఓలిన్ = క్రమముగా, తాంబూల-వల్లి = తమ్ములపుఁదీఁగ, తమాల-నీల-భాతిన్ = చీఁకటిమ్రాని నల్లని కాంతితో, తఱఁకంగన్ = వ్యాపింపఁగా, పరిపక్వ - పనస-పూగ - భాస్కర + అరుణ ద్యుతులు = బాగుగాఁ బండిన పనసల, పోఁకల ప్రకాశించు నెఱ్ఱని కాంతులు, పైన్ = పైని, పర్వి = వ్యాపించి, వన-లక్ష్మి, ప్రత్యూష-వేళ + పోలెన్ = ఉషఃకాలమువలె, పొగడన్ + చాలున్ = పొగడఁదగియుండును

తాత్పర్యము. తమ్ములపుఁదీఁగ క్రమముగాఁ జీఁకటిమ్రాని నల్లని కాంతితో వ్యాపింపఁగాఁ బండిన పనసల, పోఁకల ప్రకాశించు నెఱ్ఱనికాంతులు పైని బ్రసరించి వనలక్ష్మి ఉషఃకాలము వలెఁ బొగడఁదగియుండును

విశేషములు. అలంకార ముపమ తఱఁకు = వ్యాపించు - ఈ ధాతు వొక్క యీ కుమారసంభవకావ్యమునందే ప్రయుక్తమయినది

మ. తమ వక్త్రాధర కేశ.యాన నయనోద్దామప్రభావంబులన్
రమణం బోలుదు మన్నఁ దత్పురసతుల్ రాజీవ బంధూక భృం
గ మరాళోత్పలరాజి నూరి వెలి నల్కన్ నీరఁ ద్రోపించిన
ట్లమరెం దోయజషండముల్ పురవరోద్యానంబులం దందమై 99

అర్థము: తమ = తమయొక్క, వక్త్ర + అధర + కేశ-యాన-నయన + ఉద్దామ-ప్రభావంబులన్ = ముఖము, క్రిందిపెదవి, తలవెండ్రుకలు, నడక, కన్నులు అనువానియొక్క, గొప్ప మహిమలను, రమణన్ = ఒప్పిదమునందు, పోలుదుము + అన్నన్ = పోలుదుమనఁగా, తద్ + పుర-సతుల్ = ఆ ఓషధిప్రస్థపురమునందలి స్త్రీలు, రాజీవ-బంధూక-భృంగ-మరాళ + ఉత్పల-రాజిన్ = తామరల, మంకెనల, తుమ్మెదల, హంసముల, కలువల సమూహమును, ఊరి-వెలిన్ = ఊరివెలుపల, అల్కన్ = కోపముతో, నీరన్ = నీటియందు, త్రోపించిన + అట్లు = త్రోయునట్లు చేసిన రీతిని, పుర-వర + ఉద్యానంబులందున్ = పురశ్రేష్ఠమునందలి ఉపవనములందు, తోయజ-షండముల్ = జలజసమూహములు, అందము + ఐ, అమరెన్ = ఒప్పెను

తాత్పర్యము : ఆ ఓషధిప్రస్థపురమునందలి స్త్రీలు తమ ముఖము, క్రిందిపెదవి, శిరోజములు, గమనము, కన్నులు అనువాని గొప్పప్రభావములను, ఒప్పిదమునందుఁబోలుదుమనఁగాఁ దామరల, మంకెనపూల, తుమ్మెదల, హంసముల, కలువల సమూహమును గోపముతో నూరివెలుపల నీటియందుఁ ద్రోయించినట్లు ఆ పురమునందలి ఉద్యానవనములందు జలజసమూహము లొప్పును

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష యథాసంఖ్యము ఆ యూరి స్త్రీలకుఁ దమ వక్త్రాదులను బోలుదు మన్నందులకు రాజీవాదులపైఁ గోపము అనఁగాఁదమ

వక్త్రాదులు సాటియేలేనివని వారి గర్వము వక్త్రమును రాజీవము, అధరమును బంధూకము, కేశములను భృంగములు, యానమును మరాళము, నయనములను ఉత్పలము పోలునని క్రమాన్వయము

మ వర కార్తస్వర వస్తు నిర్మితములై, వస్త్రాంగరాగ స్ర గా
భరణానోకహ నందనాన్వితములై, పానాశనాధ్యంబులై,
స్మరకేళీనిరతాంగనాస్పదములై, సంగీతరంగంబులై
పురబాహ్యంబులఁ గృత్రిమాచలము లొప్పుం జూడ రమ్యంబులై 100

అర్థము . పుర-బాహ్యంబులన్ = ఆ ఓషధిప్రస్థపురము వెలుపలి ప్రదేశములందు, కృత్రిమ + అచలములు = క్రీడాపర్వతములు, వర-కార్తస్వర-వస్తు-నిర్మితములు + ఐ = శ్రేష్ఠములైన బంగారు వస్తువులతోఁ జేయఁబడినవయి, వస్త్ర + అంగరాగ-స్రజ్ + ఆభరణ + అనోకహ-నందన + అన్వితములు + ఐ = వస్త్రములు, మైపూఁతలు, పుష్పమాలలు, అలంకారములు, వృక్షములు, ఉద్యానములు అనువానితోఁ గూడినవయి, పాన + అశన + ఆధ్యంబులు + ఐ = త్రాగుడు, తిండి అనువానితో సమృద్ధములయి, స్మర-కేళీ-నిరత + అంగనా + ఆస్పదములు + ఐ = మన్మథక్రీడయందు మిక్కిలి యాసక్తిగల స్త్రీలకుఁ జోటయినవియు, సంగీత-రంగంబులు + ఐ = గానమునకు స్థానములయినవియునై, చూడన్ + రమ్యంబులు + ఐ = చూచుట కందమయినవయి, ఒప్పున్

తాత్పర్యము . ఆ ఓషధిప్రస్థనగరము వెలుపలిప్రదేశములందుఁ గ్రీడాపర్వతములు శ్రేష్ఠములైన బంగారువస్తువులచే నిర్మింపఁబడినవయి, వస్త్రములు, మైపూఁతలు, పుష్పమాలలు, అలంకారములు, వృక్షములు, ఉద్యానములు అనువానితోఁ గూడినవయి, త్రాగుడు తిండి అనువానితో సమృద్ధములయి, మన్మథక్రీడయందు మిక్కిలి యాసక్తిగల యింతులకుఁ జోటయినవయి, గానమునకు స్థానములయి చూచుటకు సుందరములయి యొప్పును

మహోస్రగ్ధర ఫలభారానమ్రచూతప్రకరవిహర దుత్పన్నకీరాళి పుంస్కో
కిలరావంబుల్ సెలంగున్ గృతకనగతటాకీర్ణ కేకీరవంబున్
గలయం దద్దోష మోలిం గలమవన సురక్షా పరానంతకాంతా
కుల మంజు ధ్వానమున్ సంకులముగ వరుసంగూడి చెల్వంది మ్రోయున్ 101

అర్థము .ఫల రావంబుల్ ఫల = పండ్లయొక్క, భార = బరువుతో,

ఆనమ్ర =మిక్కిలివంగిన, చూత = మామిడిచెట్లయొక్క, ప్రకర = సమూహమునందు, విహరత్ = విహరించుచున్నట్టియు, ఉత్పన్న = పైకెగురునట్టియు, కీర + ఆళి = చిలుకల వరుసయొక్కయు, పుంస్కోకల = మగ కోకిలములయొక్కయు, రావంబుల్ = కూతలు, కృతక రవంబున్ కృతక-నగ = క్రీడాపర్వతముయొక్క, తట + చటీయలందు, ఆకీర్ణ = వ్యాపించిన, కేకీరవంబున్ = ఆడునెమళ్ల ధ్వనిని, తద్ + ఘోషము = ఆ కీరముల పుంస్కోకిలముల ధ్వని, ఓలిన్ = వరుసగా, కలయన్ = కూడగా, చెలంగున్, మ్రోయును, కలమ ధ్వానమున్ కలమ-వన = వరిచేలయొక్క సురక్షా = మంచి రక్షణమునందు, పర = ఆసక్తిగల, అనంత-కాంతా = పెక్కండ్రు స్త్రీలయొక్క, కుల = సమూహముయొక్క, మంజు = మనోహరమైన, ధ్వానమున్ = ధ్వనియును, సంకులముగన్ = నిండగా, వరుసన్ = క్రమముగా, కూడి, చెల్వు + అంది = అందమునొంది, మ్రోయున్ = ధ్వనించును

తాత్పర్యము . పండ్ల బరువుతో మిక్కిలి వంగిన మామిడిచెట్ల సమూహమునందు విహరించుచుఁ బైకెగురు చిలుకలయు మగకోయిలలయు కూఁతలు క్రీడాపర్వతపుఁ జఱీయలందు వ్యాపించిన ఆడునెమళ్ల ధ్వనిని గూడి మ్రోయును, వరిచేలను బాగుగా రక్షించుటయం దాసక్తిగల పెక్కండ్రు స్త్రీలగుంపు చేయు మనోహరధ్వనియును నిండఁగాఁ గూడి అందమునొంది మ్రోయును

విశేషములు · మహాస్రగ్ధరకు నాలుగు పాదము లుండును స త త న స ర ర గ అను గణము లుండును 1 - 9 - 16 అక్షరములకు యతిమైత్రి ప్రాసనియమము గలదు

తే **దాన సంపదఁ గడసన్న తమకు నొరులఁ**
గడవ సర్వస్వదానులఁ గని పురమున
నుండ లజ్జించి వెడలినట్లుండుఁ దనరి
బాహ్యతద్దేశముల మదభద్రకరులు **102**

అర్థము మద-భద్ర-కరులు = మదించిన భద్ర గజములు, దాన-సంపదన్ = దాన (మదజల) సంపదయందు, కడచన్న = ప్రశస్తములైన, తమకున్, ఒరులన్ = ఇతరులను, కడవన్ = అతిక్రమించుటకు, సర్వస్వ-దానులన్ = ఉన్న యెల్లసొమ్మును దానముచేయువారిని, కని=చూచి, పురమునన్ = నగరమునందు, ఉండన్ = ఉండుటకు, లజ్జించి = సిగ్గుపడి, బాహ్య-తద్ + దేశములన్ =

వెలుపలివైన ఆ ప్రదేశములందు, తనరి = ఒప్పి, వెడలిన + అట్లు + ఉండున్ = వెడలినరీతి నుండును

తాత్పర్యము మదించిన భద్రగజములు దానసంపద యందుఁబ్రశస్తములైన తమ కితరుల నతిక్రమింప నాయూరియందుఁ దమకున్న యంతసొమ్మును దానముచేయు మహాదాతలను జూచి, పురమున కుండుటకు సిగ్గుపడి, నగరము వెలుపలిప్రదేశములం దొప్పి వెడలినరీతి నుండును

విశేషములు అలంకారము శ్లేషానుప్రాణితమైన ఉత్ప్రేక్ష దానము - ఏనుఁగు మదజలము, ఈవి దాని = దానముగలవాఁడు - దాత తద్బహువచనము దానులు

చ వర వనితాననేందురుచి వర్గములన్ మణిహేమహర్మ్య వి
స్ఫుర దురుదీప్తులన్ వెడలఁజోపినఁ జీఁకటి వాసి నిల్చెనో
పురకమలానితంబ తట భూషితమై విలసిల్లు మేచకాం
బర మొకొ నాఁగ నొప్పుఁ బురబాహ్యవృతాసితనందనావళుల్ 103

అర్థము. పుర నావళుల్ పుర = నగరమునకు, బాహ్య = వెలుపల, వృత = ఆవరించిన, అసిత = నల్లని, నందన = ఉద్యానములయొక్క, ఆవళుల్= వరుసలు, వర వర్గములన్ వర = శ్రేష్ఠమైన, వనితా = స్త్రీలయొక్క, ఆనన + ఇందు = ముఖచంద్రులయొక్క, రుచి = కాంతులయొక్క, వర్గములన్= సమూహములచేతను, మణి దీప్తులన్ మణి-హేమ-హర్మ్య=రత్నమయములు, స్వర్ణమయములునైన మేడలయొక్క విస్ఫురత్ = ప్రకాశించుచున్న, ఉరు = గొప్ప, దీప్తులన్ = కాంతులచేతను, వెడలన్ + జోఁపినన్ = వెడలఁగొట్టఁగా, చీఁకటి + పాసి = చీఁకటిపోయి, నిల్చెనో, పు భూసితమై పుర-కమలా = పురలక్ష్మి యొక్క, నితంబ-తట = కటి ప్రదేశమునందు, భూషితము + ఐ = అలంకారమయి, విలసిల్లు = ప్రకాశించు, మేచక + అంబరము + ఒకొ = నల్లని చీరయా, నాఁగన్= అనఁగా, ఒప్పున్

తాత్పర్యము. ఆ ఓషధిప్రస్థనగరమునకు వెలుపల నావరించిన నల్లని యుద్యానముల వరుసలు - శ్రేష్ఠరాండ్రయిన స్త్రీల ముఖచంద్రుల కాంతుల సమూహములచేతను, రత్న స్వర్ణమయములైన మేడల ప్రకాశించు కాంతులచేతను వెడలఁగొట్టఁగాఁ జీఁకటి పోయి నిలిచెనా యనునట్లును (లేక), పురలక్ష్మి కటిప్రదేశమున నలంకారమై ప్రకాశించు నల్లనిచీరయా యనునట్లును నొప్పును

విశేషములు అలంకార ముత్ప్రేక్ష పుర కమలా - అనుచో రూపకము సందేహము ఆననేందు - అనుచో నుపమ

క మరకత మయ వజ్ర మహా
స్ఫురణమెయిం దొంగలించి పొదలినభంగిన్
దరుగుల్మ లతా హరి ద
త్యురు రుచిఁ గర మొప్పు బాహ్యకోద్యానంబుల్ 104

అర్థము .బాహ్యక + ఉద్యానంబుల్ = నగరము వెలుపలి ఉపవనములు, మరకత-మయ = గరుడపచ్చలతో నిండిన, వజ్ర-మహాత్ (మహా) + స్ఫురణ మెయిన్ = వజ్రములయొక్క గొప్ప కాంతితో, తొంగలించి = ప్రకాశించి, పొదలిన-భంగిన్ = ఒప్పిన రీతిని, తరు-గుల్మ-లతా = చెట్లయొక్కయు, పొదల యొక్కయు, తీఁగలయొక్కయు, హరిత్ = ఆకుపచ్చని, అతి + ఉరు-రుచిన్ = మిక్కిలి గొప్ప కాంతితో, కరము = మిక్కిలి, ఒప్పున్

తాత్పర్యము . ఓషధిప్రస్థనగరము వెలుపలి యుపవనములు గరుడ పచ్చలతో నిండిన వజ్రముల గొప్ప కాంతితోఁ బ్రకాశించి, యొప్పినరీతిని, చెట్ల, పొదల, తీఁగల ఆకుపచ్చని కాంతితో మిక్కిలి యొప్పును

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క సరసిరుహరాగ పుష్ప
త్కరరుచి వెలిఁబర్వునట్లు క్రముకామ్రఫలా
త్యరుణాబ్జశాలి వన వి
స్ఫురణం గరమొప్పుఁ జూడఁ బురబాహ్యంబుల్ 105

అర్థము సరసిరుహ-రాగ = పద్మరాగములయొక్క, పుష్ప = పుష్పరాగములయొక్కయు, ఉత్కర = సమూహముయొక్క, రుచి = కాంతి, వెలిన్ = వెలుపల, పర్వు + అట్లు = వ్యాపించువిధమున, క్రముక = పోఁకలతోను, ఆమ్ర-ఫల = మామిడిపండ్లతోను, అతి + అరుణ = మిక్కిలి యెఱ్ఱనైన, అబ్జ = తామరపూలతోను, శాలి = ఒప్పునట్టి, వన = తోఁటలయొక్క, విస్ఫురణన్ = విశేష ప్రకాశముతో, పుర-బాహ్యంబుల్ = ఊరిబహిఃప్రదేశములు, చూడన్ = చూచుటకు, కరము = మిక్కిలి, ఒప్పున్

తాత్పర్యము . ఆ ఓషధిప్రస్థనగరము వెలుపలి ప్రదేశములు పద్మరాగ

పుష్పరాగముల సమూహము కాంతి వెలుపలికి వ్యాపించెనా యనునట్లు, పోకలతో, మామిడిపండ్లతో, మిక్కిలి యెఱ్ఱని తామరపూలతో నొప్పు తోటల ప్రకాశముచే మిక్కిలి యొప్పును

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

చ శరధిసమస్తవస్తువులు శౌర్యమునం బురి సూఱగొన్నయ
ట్లురుతర రత్నవప్రనికరోన్నతి నప్పురికోట యొప్పు, నా
శరధి నిజార్థలోభమున సాహసుఁడై పురిమీఁద నెత్తి భీ
కరముగఁ జుట్టుముట్టె ననఁగాఁ బరిఖాజలవృద్ధి పొల్పగున్ 106

అర్థము. శరధి-సమస్త-వస్తువులున్ = సముద్రునియొక్క యెల్ల వస్తువులును, పురి = పురము - ఓషధిప్రస్థము, శౌర్యమునన్ = పరాక్రమముతో, చూఱగొన్న + అట్లు = కొల్లగొట్టిన విధమున, ఉరుతర - రత్న-వప్ర-నికర + ఉన్నతిన్ = మిక్కిలిపెద్ద - మణిమయ ప్రాకారముల - సమూహముయొక్క, ఔన్నత్యముతో, ఆ + పురి-కోట = ఆ పురమునందలి కోట, ఒప్పున్, ఆ-శరధి = ఆ సముద్రుఁడు, నిజ+అర్థ-లోభమునన్ = తన వస్తువులందలి ఆశచే, సాహసుఁడు+ ఐ = తెగించినవాఁడయి, పురి-మీఁదన్ = నగరముపై, ఎత్తి = దండెత్తి, భీకరముగన్ = భయంకరముగా, చుట్టుముట్టెన్ = చుట్టుముట్టినాఁడా, అనఁగాన్ = అనునట్లు, పరిఖా-జల-వృద్ధి = అగడ్తలయందలి నీటి పెంపు, పొల్పు + అగున్ = ఒప్పును

తాత్పర్యము : సముద్రుని యెల్లవస్తువులను బరాక్రమముతో నోషధిప్రస్థపురము కొల్ల గొట్టినట్లు మిక్కిలి పెద్దవియగు మణిమయ ప్రాకారముల సమూహము నౌన్నత్యము గలిగి ఆ పురికోట యొప్పును ఆ సముద్రుఁడు తన వస్తువులందలి యాశచేఁ దెగువగలవాఁడయి ఆ పురముపై దండెత్తి భయంకరముగా నూరిని జుట్టుముట్టెనా యనునట్లు అగడ్తలందు నీటిసమృద్ధి యొప్పును

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

క పరిఖామలజలజములలో
నురగ ఫణా మణుల దీప్తు లొగి నెగసియుఁ బై
నెరసి సితాసిత రక్తం
బురుహంబుల పోలె నిలిచి పాలిచి వెలుంగున్ 107

అర్థము పరిఖా + అమల-జలములలోన్ = అగడ్తయందలి నిర్మలములైన నీరులలో, ఉరగ-ఫణా-మణుల-దీప్తులు = పాముల పడగలందలి మణుల కాంతులు, ఒగిన్ = క్రమముగా, నెగసియున్ = పయికి వ్యాపించియు, పైన్ + నెరసి = పైని నిండి, సిత + అసిత + రక్త + అంబురుహంబుల - పోలెన్ = తెల్లని, నల్లని, ఎఱ్ఱని తామరలవలె, నెలిచి = ఉండి, పొలిచి = ఒప్పి, వెలుంగున్ = ప్రకాశించును

తాత్పర్యము . అగడ్తయందలి నీరులలో బాముల పడగల మణుల కాంతులు పైకి వ్యాపించి, నిండి, తెల్లని, నల్లని, ఎఱ్ఱని తామరలవలె నుండి యొప్పి ప్రకాశించెను

విశేషములు అలంకార ముపమ

చ కొలఁదికి మీఱఁ బెద్దయగు కోట తనర్పున వస్తు సంతతో
జ్జ్వలిత లసత్ప్రభాతి రవిచంద్రరుచుల్ సొరనేరకున్న సం
ధ్యలు దివసత్రియామలును దత్పురి వారజనం బెఱుంగుఁ ద
మ్ములము చవిన్ విహంగగతిఁ బువ్వులతావి రతిప్రసంగతిన్ 108

అర్థము : కొలఁదికిన్-మీఱన్ = మితి నతిక్రమించునట్లు, పెద్ద + అగు = ఎత్తయినది యగు, కోట-తనర్పునన్ = కోటయొక్క ఔన్నత్యముచే, వస్తు-సంతత + ఉజ్జ్వలిత-లసత్ + ప్రభాతిన్ = వస్తువులయొక్క ఎడతెగని ఉజ్జ్వలముగాఁ బ్రకాశించు కాంతిచే, రవి-చంద్ర-రుచుల్ = సూర్యునియొక్కయు, చంద్రునియొక్కయు కాంతులు - కిరణములు, చొరన్ + నేరక + ఉన్నన్ = ప్రవేశింపలేకపోఁగా, తద్ + పురి-వార-జనంబు = ఆ నగరమునందలి వేశ్యల సమూహము, సంధ్యలున్ = తొలి మలి సంజలును, దివస-త్రియామలును = పగళ్లు, రాత్రులును, (క్రమముగా), తమ్ములము-చవిన్ = తాంబూలపు రుచి చేతను, విహంగ-గతిన్ = పక్షులగమనముచేతను, పువ్వుల-తావిన్ = పూలవాసనచేతను, రతి-ప్రసంగతిన్ = సంభోగమునందలి, కూటమిచేతను, ఎఱుంగున్ = తెలియును

తాత్పర్యము మితిమీఱునట్లు ఎత్తుగానున్న కోట ఔన్నత్యముచే నందలి వస్తువుల ఎడతెగని కాంతిచే సూర్యచంద్రుల కిరణములు ప్రవేశింపఁజాలకపోఁగా, నందలి వేశ్యలు తాంబూలపు రుచిచేఁ బ్రాతస్సంధ్యను, పక్షుల గమనముచే సాయం సంధ్యను, పువ్వుల వాసనచేఁ బగటిని, సంభోగపుఁ గూటమిచే రాత్రులను దెలిసికొందురు

విశేషములు అలంకారములు అతిశయోక్తి, యథాసంఖ్యము తమ్ములము చని = లాంబూలపు చుచి చీసకిసి ప్రాతస్సంధ్యకును సంబంధమేమో తెలియకున్నది అది 'చలి' గాక 'చని' అయియుండునా? తమ్ములము-చవిన్ = లాంబూలపుఁగాంతిచే లాంబూలము నెఱ్ఱని కాంతినిబట్టి ప్రాతస్సంధ్యయు నిట్లే యెఱ్ఱనిదయి యుండునని వేశ్యలు తెలిసికొందురని చెప్పవచ్చును పక్షులు సాయంకాలములందు గూండ్లకుఁ జేరును గావున విహంగ గతిని బట్టి వారు సాయంసంధ్యనెఱుఁగుదురు పువ్వుల తావి పగటివేళలందే ప్రబలముగా నుండును అందుచే వాని తావిని బట్టి పగళ్ల నెఱుఁగుదురు రతిప్రసంగతికి సమయము రాత్రులే దివారతి యుండఁగూడదా యన నది నిషిద్ధమని భావించుకాల మది పైఁగా వారు వేశ్యలు గావున వారికడకు వీటులు త మ్మొరులు చూడకుండ రాత్రులందే ప్రచ్ఛన్నముగా నేఁగుదురు కావున రతిప్రసంగతిచే వారు రాత్రుల నెఱుఁగుదురు ఇంత యేల యన నా కోటలు సూర్యచంద్రకిరణములు ప్రవేశింపలేనంత ఎత్తయినవి సూర్యచంద్రులనుబట్టియే కదా సంధ్యాదుల నెఱుఁగఁగలుగుట

క పరువడిఁ గులగిరు లిడి వా
రిరుహాసనుఁ డొనర గండరించెనొకో నాఁ
గర మమరి తత్పురంబున
నురుతరమణిహర్మ్యనికర మొలి వెలుంగున్ 109

అర్థము. వారిరుహాసనుఁడు = పద్మాసనుఁడు - బ్రహ్మ, పరువడిన్ = శ్రద్ధతో, కుల-గిరులు = కులపర్వతములు, ఇడి = పెట్టి, ఒనరన్ = పొసఁగునట్లు, గండరించెన్ + ఒకో - నాన్ = నిర్మించెనా యనునట్లు, తద్ + పురంబునన్ = ఆ ఓషధిప్రస్థనగరమునందు, ఉరుతర-మణి-హర్మ్య-నికరము = మిక్కిలి పెద్దవి, మణిమయములైనవి అగు మేడల సముదాయము, కరము = మిక్కిలి, అమరి = ఒప్పి, ఓలిన్ = బాగుగా, వెలుంగున్ = ప్రకాశించును

తాత్పర్యము. బ్రహ్మ శ్రద్ధతోఁ గులపర్వతములను బెట్టి పొసఁగునట్లు నిర్మించెనా యనునట్లు ఆ ఓషధిప్రస్థపురమునందలి మిక్కిలి పెద్దవియు, మణిమయములును నైన మేడలు మిక్కిలి యొప్పి బాగుగాఁ బ్రకాశించును

విశేషములు. అలంకార మతిశయోక్తి, ఉత్ప్రేక్ష 'గండరించు' కాని కండరించు కాదు గండరువు ఉన్నది కదా!

క కులగిరులు బలసి కొలువఁగఁ
బొలుపగు హేమాద్రిఁ బోలెఁ బురవరహార్మ్యా
వలి నడుమఁ గనకమయమై
యలఘుతరోన్నతిగ రాజహర్మ్యము వెలయున్ 110

అర్థము. కుల-గిరులు = కులపర్వతములు, బలసి = చుట్టు నుండి, కొలువఁగన్ = సేవింపఁగా, పొలుపు + అగు = అందమగు, హేమ + అద్రిన్ + పోలెన్ = బంగరుకొండ - మేరువు వలె, పుర-వర-హర్మ్య + ఆవలి-నడుమన్ = పురశ్రేష్ఠమైన ఓషధిప్రస్థమందలి, మేడల వరుస నడుమ, కనక-మయము + ఐ = స్వర్ణ నిర్మితమయి, అలఘుతర + ఉన్నతిగన్ = మిక్కిలి ఎత్తుగా, రాజ-హర్మ్యము = రాజభవనము, వెలయున్ = ప్రకాశించును

తాత్పర్యము. కులపర్వతములు పరివేష్టించి సేవింపఁగా నొప్పారు మేరువువలెఁ బురశ్రేష్ఠమైన ఓషధిప్రస్థమందలి మేడలవరుస నడుమ స్వర్ణ నిర్మితమయి మిక్కిలి ఉన్నతముగా రాజసౌధము ప్రకాశించును

విశేషములు. అలంకార ముపమ

చ. 'తన వెలుఁ గొక్కప్రొద్దు; నిజధామము వెల్గఁగఁజేయు మా వెలుం
గనిశముఁ, బర్వు ధామము అనంతము మా' కని హర్మ్యసంచయం
బున మణు లప్పురంబున 'నభోమణి ధామము దాఁటిపోవనీ'
మని రవిఁ జాఁద నెత్తె నన నంబరమంది వెలుంగు సద్రుచిన్ 111

అర్థము. తన-వెలుఁగు = తన ప్రకాశము, ఒక్క-ప్రొద్దు = ఒక్కకాలము - పగలు, నిజ-ధామమున్ = తనదైన స్థానమును - ఆకాశమును, వెల్గఁగన్ + చేయున్ = ప్రకాశింపఁజేయును, మా-వెలుంగు = మా ప్రకాశము, అనిశమున్ = ఎల్లప్పుడును, పర్వు-ధామములు = వ్యాపించు స్థానములు, మాకున్, అనంతము = పెక్కు, అని, హర్మ్య-సంచయంబున - మణులు = మేడల సమూహమునందలి మణులు, అప్పురంబునన్ = ఆ + పురంబునన్ = ఆ ఓషధిప్రస్థపురమునందు, నభోమణిన్ = సూర్యుని - నభస్సునందలి మణిని, ధామమున్ = ఆకాశమును, దాఁటి పోవనీము = అతిక్రమింపనీము, అని, రవిన్ = సూర్యుని, చాఁదన్ + ఎత్తెన్ + అనన్ = అధఃకరించెనన, అంబరము = ఆకాశము, అంది = తాఁకి, సత్ + రుచిన్ = మంచి కాంతితో, వెలుంగున్ = ప్రకాశించును

తాత్పర్యము. ఆ ఓషధిప్రస్థపురము సౌధసమూహమునందలి మణులు 'తన వెలుఁగు ఒక్క పగటి వేళ మాత్రమే అది తన స్థానమైన ఆకాశమునే ప్రకాశింపఁజేయును మా వెలుఁగో ఎల్లవేళల నుండునది అది వ్యాపించు స్థానములకు లెక్కలేదు సూర్యుని ఆకాశము నతిక్రమింపనీ'మని సూర్యు నధ కరించె నన ఆకాశము నంటి మంచికాతితో వెలుఁగొందును

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష ఇందు 'నభోమణి' నభస్సునందు మణి అని సూర్యునకుఁ 'బర్యాయముగ బ్రయుక్తమైనది విశేష్యము సాభిప్రాయ మైనందున నలంకారము పరికరాంకురము' 'సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాఙ్కురః' చంద్రా, తాము హర్మ్యమణులైన, సూర్యుఁడు నభమున మణి, సంబంధాతిశయోక్తియు 'సంబన్ధాతిశయోక్తి స్స్యా దయోగే యోగకల్పనమ్' అంబరము - (నానా) ఆకాశము, వస్త్రము ధామము (నానా) స్థానము, వెలుఁగు, ఆకాశము సద్రుచి - సత్ + రుచి - అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులుకాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును

క ఆ మాడు విండ్ల తుదిఁ గల
శామల మణు లభ్రమార్గ మడరి లసత్తే
జో మహిమఁ దనరి తారు న
భోమణు లనఁ జాలి కాంతిఁ బొదలి వెలుంగున్ 112

అర్థము. ఆ-మాడువిండ్ల-తుదిన్ = ఆ మేడల కొనలందు, కలశ + అమల-మణులు = ఘటాకార శిఖరములందలి, నిర్మలమయిన మణుటు, అభ్ర-మార్గము = మేఘ మార్గము - ఆకాశము, అడరి = వ్యాపించి, లసత్ + తేజస్ + మహిమన్ = ప్రకాశించుచున్న కాంతియొక్క గొప్పతనమున, తనరి = ఒప్పి, తారున్ = తాముఁగూడ, నభోమణులు = నభస్సు = ఆకాశమునందలి మణులు = సూర్యులు, అనన్ + చాలి = అననొప్పి, కాంతిన్ = ప్రకాశముతో, పొదలి = ఒప్పి, వెలుంగున్ = ప్రకాశించును

తాత్పర్యము. ఆ మేడల అగ్రములందుఁ గలశాకారశిఖరములందలి నిర్మలములయిన మణులు ఆకాశమువఱకు వ్యాపించి, ప్రకాశించుచున్న కాంత్యతిశయమువ నొప్పి తాముసైతము నభోమణులు - నభస్సునందలి మణులు - సూర్యులు అనఁజాలి కాంతి గలిగి వెలుఁగొందును

విశేషములు.అలంకారము సంబంధాతిశయోక్తి మాడుసిల్లు - మాడుపు + ఇల్లు - దాని బహువచనము మాడుఎండ్లులు లువర్ణంబు బహువచనంబు' బాల తత్సమ 12 మూడువిల్లు+లు 'ఔషధక్తికంబుల లిపెర్లసల లువర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందుపూర్వక డువర్ణంబు బహుళంబుగా నగు బాల ఆచ్చిక 16 మూడు విండులు 'బహువచనము పరంబగునపుడు డ - ల - ట - ర - ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు ' బాల ఆచ్చిక 12 మాడువిండ్లు కావ్యలింగాలంకారమును, 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్' చన్ద్రా తేజోమహిమ తేజస్ + మహిమ పదాంత సకారమునకు విసర్గాదేశము తేజః + మహిమ హ్రస్వ అకారము తదువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముకాని, మృదుహల్లులు (హళ్ళులు) కాని పరము లగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మాఱును తేజోమహిమ నభోమణియు నిట్టిదే

క కనకమయ హర్మ్య పంక్తులు
ఘనమార్గం బడరియున్నఁ గల్పకుజంబుల్
గని యూడలు దిగ్గెనొ యనఁ
దనరుచుఁ దత్కేతుదండతతి విలసిల్లున్ 113

అర్థము . కనక-మయ-హర్మ్య-పంక్తులు = స్వర్ణనిర్మితములైన సౌధముల వరుసలు, ఘన-మార్గంబు = మేఘమార్గము - ఆకాశము, అడరి + ఉన్నన్ = వ్యాపించియుండఁగా, కల్ప-కుజంబుల్ = కల్పవృక్షములు, కని = చూచి, ఊడలు-దిగ్గెనొ = ఊడలు, దిగెనా, అనన్ = అనఁగా, తనరుచున్ = ఒప్పుచు, తద్ + కేతు-దండ-తతి = వాని జెండాల కట్టల సమూహము, విలసిల్లున్ = ప్రకాశించును

తాత్పర్యము.ఓషధిప్రస్థపురమున స్వర్ణనిర్మితములైన సౌధముల వరుసలు ఆకాశమువఱకు వ్యాపించి యుండఁగాఁ గల్పవృక్షములు చూచి ఊడలు దిగెనా యనునట్లు ఆ సౌధముల జెండాకట్టలసమూహ మొప్పును

విశేషములు.అలంకారముత్ప్రేక్ష తత్కేతు - తద్ + కేతు అనునాసికాంతస్థ భిన్నములైన హల్లులకు (ఱుల్లులకు) కరినహల్లులు (ఖర్రులు) పరమగునపుడు వానివర్గములందలి ప్రథమవర్ణములు (చర్రులు) ఆదేశమగును

మ కమనీయాత్మక సర్వలోహ మణి సత్కాష్ఠేష్టికా నిర్మితో
త్తమ హర్మ్యంబుల గండరించిన కపోతవ్రాతపంక్తుల్ బిడా
లము లోలిం గని, వానిమీఁది కలుకన్ లంఘించి, కాకున్నఁ ద
ద్భ్రమఁ బై నూఁగినఁ బల్క వొండెడ గడీపారావతానీకముల్ 114

అర్థము.కమనీయాత్మక హర్మ్యంబులన్ కమనీయ + ఆత్మక = రమణీయములైన స్వరూపములు గల, సర్వ-లోహ-మణి-సత్-కాష్ఠ + ఇష్టికా = సకలలోహమయములు, మణిమయములునైన మంచి దూలములతోను, ఇటుకలతోను, నిర్మిత = కట్టఁబడిన, ఉత్తమ = శ్రేష్ఠములైన, హర్మ్యంబులన్ = మేడలయందు, గండరించిన = చెక్కఁబడిన, కపోత-వ్రాత-పంక్తుల్ = పావురముల సమూహముల వరుసలు, బిడాలములు = పిల్లులు, ఓలిన్ = బాగుగా, కని = చూచి, వాని-మీఁదికిన్ = ఆ కృత్రిమ కపోతములమీఁదికి, అలుకన్ = కోపముతో, లంఘించి = దుమికి, కాకున్నన్ - (కాక + ఉన్నన్) = అవి సహజ కపోతములు కాకపోఁగా, తద్ +భ్రమన్ = (ఇంకను) ఆ భ్రాంతితో, పైన్ = మీఁద, ఊఁగినన్ = చలింపఁగా, ఒండెడన్ (ఒండు + ఎడన్) = మఱియొకచోట, గడీ-పారావత + అనీకముల్ = దుర్గమునందలి(సహజ) పావురముల సమూహములు, పల్కవు = కిక్కురుమనకుండ నుండును

తాత్పర్యము . రమణీయములైన సకలలోహమయములైన మంచి దూలములతోను, సర్వమణిమయములైన యిటుకలతోను, నిర్మింపఁబడిన మేలయిన మేడలయందుఁ జెక్కఁబడిన (కృత్రిమములైన) పావురముల సమూహములను బిల్లులు చక్కఁగాఁజూచి వానిపైకి దుమికి, అవి (సహజ) కపోతములు కాకపోఁగా, ఇంకను భ్రాంతిపోక, పైని జలింపఁగా, ఇదియంతయుఁ జూచుచున్న వేఱుచోటి దుర్గస్థ సహజ కపోతముల సమూహములు ఆ పిల్లులు తమపై నెక్కఁడఁబడునో యను భయమునఁ గిక్కురుమనకుండ నుండును

విశేషములు . బిడాలములకు హర్మ్యములందుఁ జెక్కఁబడిన కృత్రిమ కపోతములందు సహజకపోతభ్రాంతి గావున నలంకారము భ్రాంతిమంతము పిల్లుల చేష్టలను జూచిన గడీ పారావతానీకములు నిశ్శబ్దముగానుండు ననుచో స్వభావోక్తియు గడీ-గడి-దేశ్యవిశేష్యము = దుర్గము హర్మ్యములందుఁ జెక్కిన కృత్రిమపారావతములు, బిడాలములకు సహజ పారావతము లను భ్రాంతిని బుట్టించునంత సహజత యుట్టిపడుచుండె నన్నమాట

చ గగనము దాఁకు చిత్రగతకాననసంహతి పొల్చు హర్మ్యముల్
నగములుసావి యూఁగిన మనంబులఁ బూర్ణసరోవరంబుల
వ్యగ జలకేళి సల్పనని వచ్చి, యెటింగి, వియచ్చరాంగనల్
మగుడుట సూచి నవ్వుదురు మాడువులందు రమించు దంపతుల్ 115

అర్థము .గగనము + తాఁకు = ఆకాశము నంటునట్టి, చిత్ర-గత-కానన-సంహతి = చిత్తరువునందు లిఖింపఁబడిన వనముల సమూహము, పొల్చు = ఒప్పునట్టి, హర్మ్యముల్ = మేడలు, నగములు-సావి = కొండలు అని, ఊఁగిన-మనంబులన్ = అవునా కాదాయని యూఁగులాడు మనస్సులతో, పూర్ణ-సరోవరంబులు + అన్ + వగన్ = నిండుసరస్సు లనెడి తలఁపుతో, జల-కేళి = జలక్రీడ స్నానము, సల్పన్ + అని = చేయుటకని, వచ్చి, ఎటింగి = అది సరోవరముకాక, చిత్రగతకాననపంక్తి ప్రతిఫలించు నాకాశమని గ్రహించి, వియచ్చరాంగనల్ - వియత్ + చర + అంగనల్ = ఆకాశమునందు సంచరించు స్త్రీలు - దేవతాస్త్రీలు, మగుడుట = మరలిపోవుట, చూచి, మాడువుల + అందున్ = మేడలయందు, రమించు = క్రీడించు - సంభోగించు, దంపతుల్ = భార్యాభర్తలు, నవ్వుదురు = పరిహసింతురు

తాత్పర్యము ఆ ఓషధిప్రస్థపురమునఁ బెద్దపెద్ద మేడలు గలవు అవి గగనమును దాఁకుచున్నవి ఆ మేడల యగ్రముల నడవులు చిత్తరువున లిఖింపఁబడియున్నవి ఆకాశమున సంచరించు దేవతాస్త్రీ లా మేడలను జూచి కొండ లనుకొనిరి గగనమును గాననపంక్తి ప్రతిఫలించుచున్న సరోవరమని భ్రమించి, వా రందు స్నానము చేయఁబూని, అది సరోవరము కాదని యెటిఁగి, తిరిగిపోయిరి మేడలయందుఁ గ్రీడించు దంపతులు వారిని జూచి పరిహసించిరి

విశేషములు అలంకారము భ్రాంతిమంతము తాఁకి అనుదానిని తాఁకుగా మార్చి హర్మ్యములకు విశేషణముగాఁ జేయఁబడినది వియచ్చరాంగనలకు, బ్రతిఫలిత చిత్రగత కాననపంక్తి యగు గగనమునందు సరోవరభ్రాంతి చిత్ర సంహతిఁ బొల్చు' అనికాక 'చిత్ర సంహతి' అనుదానిని 'పొల్చు'నకుఁ గర్తనుగాఁజేసి, 'పొల్చు' అనుదానిని 'హర్మ్యముల్' అనుదానికి ధాతుజవిశేషణముగాఁ జేయుటైనది అన్నిప్రతులందును 'సాగి' అనియున్నను, అది 'సావి'యయి యుండునని అన్వయసౌలభ్యమునకుఁ దలఁపఁబడినది సావి = సవి = అని ఊఁగిన మనంబుల - అది సరోవరమా కాదా యని వారి మనస్సు లూఁగులాడినవి 'వనంబుల' కంటె 'మనంబుల' అనుటయే లెస్స వియచ్చర =

నియత్ + చర-సకార తవర్గములకు శవర్ణ చవర్గములతోఁ బూర్వమందైనను బరమందైనను గూడిక కలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును

తే పరమమాహేశ్వరవ్రజ విరచి తోరు
కనక మణిగణమయము లాకాశ మడరి
మానితంబులై స్వర్ణసోపానపంక్తు
లనఁగ నప్పురి నొప్పె దేవాలయములు 116

అర్థము పరమ - మాహేశ్వర - వ్రజ = గొప్ప శివభక్తులయొక్క సమూహముచేత, విరచిత = నిర్మింపఁబడిన, ఉరు-కనక-మణి-గణ = గొప్పవియగు బంగారు, మణుల సమూహముతో నిండినవి, అగు, దేవ + ఆలయములు = దేవునిగుడులు, ఆకాశము + అడరి = ఆకాశమువఱకు వ్యాపించి, మానితంబులు + ఐ = మన్నింపఁబడినవై, అప్పురిన్ = ఆ + పురిన్ = ఆ నగరమునందు, స్వర్ణ-సోపాన-పంక్తులు = బంగారు మెట్ల వరుసలు, అనఁగన్, ఒప్పెన్.

తాత్పర్యము. ఆ ఓషధిప్రస్థపురమున దేవాలయములు గొప్ప శివభక్తుల సమూహముచే నిర్మింపఁబడిన గొప్ప బంగారు, మణుల సమూహముతో నిండినవయి బంగారుమెట్ల వరుస లనఁగా నొప్పెను

విశేషములు. అలంకారములు సంబంధాతిశయోక్తి, ఉత్ప్రేక్ష

క పురివీధులు గనుఁగొన సుం
దరమగు ఘటయోని సమయఁద్రాగిన రత్నా
కరము లొకొ వివిధ రత్నా
కరములు నా వరమణిప్రకరభరితములై 117

అర్థము. వివిధ-రత్న + ఆకరములు = పలురకములైన రత్నములకు స్థానములు, అగు, పురి-వీధులు = ఆ నగరమునందలి వీధులు, వర-మణి-ప్రకర-భరితములు + ఐ = శ్రేష్ఠములైన మణుల సమూహముచే నిండిననియై, ఘట-యోని = కుంభజుఁడు - అగస్త్యుఁడు, సమయన్ = నశించునట్లు - నిశ్శేషముగా, త్రాగిన, రత్నాకరములు + ఒకొ = సముద్రములా, నాన్ = అనఁగా కనుఁగొనన్= చూచుటకు, సుందరము + అగును = అందమగును

తాత్పర్యము . పలురకములైన రత్నముల కాన్పులగు నా ఓషధిప్రస్థపురవీధులు, మేలయిన మణుల సమూహముతో నుండినవై అగస్త్యుడు సంపూర్ణముగా ద్రాగిన సముద్రములా యనునట్లు చూడనందముగా నుండును

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

క వేదాచారులు, సంతత
వేదాధ్యయనులు, సమస్తవిద్యానిపుణుల్,
వేదాఖిలార్థవిదులు, మ
హాదేవధ్యాననిరతు, లప్పురి విప్రుల్ 118

అర్థము.అప్పురి-విప్రుల్ = (ఆ + పురి) ఆ ఓషధిప్రస్థపుర బ్రాహ్మణులు, వేద + ఆచారులు = వేదములందలి నడవడి గలవారు, సంతత-వేద + అధ్యయనులు = నిరంతర వేదపఠనము గలవారు, సమస్త-విద్యా-నిపుణుల్ = ఎల్ల విద్యలందును నేర్పుగలవారు, వేద + అఖిల + అర్థ-విదులు = వేదములందలి, ఎల్ల విషయములు, తెలిసినవారు, మహాదేవ-ధ్యాన-నిరతులు = శివుని ధ్యానమునం దాసక్తి గలవారు

తాత్పర్యము : ఆ ఓషధిప్రస్థపురమునందలి బ్రాహ్మణులు వేదోక్తములయిన నియమములు గలవారు, నిరంతరము వేదముల నధ్యయనము చేయువారు, సర్వవిద్యలందును నేర్పుగలవారు, వేదములందలి యెల్ల విషయములు తెలిసినవారు, శివుని ధ్యానించుటయం దాసక్తిగలవారు

చ అవిరళ నిత్యకర్మ వివిధాధ్వర వహ్నిముఖంబులన్ సదా
దివిజగణాళి నాహుతులఁ దృప్తులఁ జేయుచు హోమధూమ సం
భవ ఘనవృష్టి భూజనులఁ బాయక తృప్తులఁజేయుచున్ మహో
త్సవకరులై రమింతు రనిశంబు ధరామరు లప్పురంబునన్ 119

అర్థము :అప్పురంబునన్ = ఆ + పురంబునన్ = ఆ ఓషధిప్రస్థపురమునందు, ధరా + అమరులు = భూసురులు, అనిశంబున్ = ఎల్లప్పుడును, అవిరళ ముఖంబులన్ = అవిరళ = అధికమైన, నిత్య-కర్మ = నిత్యకృత్యములైన, వివిధ = పలురీతులైన, అధ్వర = యజ్ఞములందలి, వహ్ని - ముఖంబులన్ = అగ్నుల ద్వారములచే, సదా = ఎల్లప్పుడును, దివిజ-గణ + ఆళిన్ = దేవతల సమూహముల వరుసను, ఆహుతులన్ = మంత్రపూర్వకములైన

వేల్చుటలచే, తృప్తులన్ = తనిసినవారినిగా, చేయుచున్ హోమ-ధూమ-సంభవ-ఘన-ఎష్టిన్ = యజ్ఞములందలి పొగచే, పుట్టు, గొప్ప వర్షముచే, భూజనులన్ = భూమియందలి జనులను, పాయక = విడువక, తృప్తులన్ + చేయుచున్ = తృప్తినందినవారినిగాఁ జేయుచు, మహోత్సవకరులు + ఐ = మహత్ (మహా) + ఉత్సవ) = గొప్పవేడుకనుజేయువారయి రమింతురు = ఆనందింతురు

తాత్పర్యము . ఆ ఓషధిప్రస్థపురమునందలి బ్రాహ్మణులు ఎల్లప్పుడును అధికముగా నిత్యకృత్యముగాఁ ఒలరీతులైన యజ్ఞములను జేయుచు నందలి అగ్నుల ద్వారమున సర్వదా దేవతాసమూహములను మంత్రపూర్వకములైన వేలుములచేఁ దృప్తిపఱుచుచు, యజ్ఞములందలి పొగలచేఁ బుట్టు గొప్పవానచే భూమియందలి జనులను నిరంతరమును దనియించుచు గొప్పవేడుక చేయుచు నానందింతురు

విశేషములు . ధరామరులు - ఇది ధరావరులయి యుండునేమో! ధరావరులనఁగా రాజులు ఇందలి విషయము రాజులకే బాగుగా నన్వయించుచున్నది అట్లు గాక ధరామరు లన్నచో, బ్రాహ్మణులకు రెండు పద్యములు కాఁగా, రాజుల కొక్కటియైనను లేకుండఁబోవుచున్నది

క ధనదు ధనసంఖ్య నవ నిధు
లన విని 'యర్థేశనామ మతనికి నీ మే
మొనర నసంఖ్యార్థేశుల'
మని ధనపతి నుఱరు పేర్మి నప్పురి వైశ్యుల్ 120

అర్థము అప్పురి (ఆ + పురి) - వైశ్యుల్ = ఆ ఓషధిప్రస్థపురమునందలి కోమటులు, ధనదు = కుబేరునియొక్క, ధన-సంఖ్య = ధనములయొక్క సంఖ్య, నవ-నిధులు = తొమ్మిది నిధులు, అనన్ = అనఁగా, విని, అతనికిన్ = ఆ కుబేరునకు, అర్థేశ (అర్థ + ఈశ) - నామము = అర్థేశుఁడను పేరు - అర్థములకు ఈశుఁడు అను బిరుదు, ఈము = ఒసఁగము, ఏము = మేము, ఒనరన్ = పొసఁగఁగా, అసంఖ్య + అర్థేశులము = అసంఖ్య + అర్థ + ఈశులము = లెక్కలేనన్ని అర్థములకుఁ బ్రభువులము, అని, పేర్మిన్ = గొప్పతనముచే, ధనపతిన్ = కుబేరుని, ఉఱరు = లెక్కచేయరు

తాత్పర్యము . ఆ ఓషధిప్రస్థపురమునందలి కోమటులు కుబేరుని ధనముల సంఖ్య తొమ్మిదికిఁ బరిమితములైన నిధులే యనుట విని, ఆ కుబేరునకు

అర్థేశుఁడను బిరుదు నొసఁగము మేము పొసఁగఁగా నసంఖ్యాకములైన అర్థములకుఁ బ్రభువులము' అని గొప్పతనమునఁ గుబేరుని లెక్కచేయరు

విశేషములు అలంకారము - అతిశయోక్తి, కావ్యలింగము కుబేరుని వననిధులు = మహాపద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, ఖర్వము

క నలిఁ గోటికోటి పడగలు
గలంగొనఁ గట్టినను వానిఁ గావని మదిలోఁ
దలఁప రసంఖ్యార్థ ధ్వజ
ములు గట్టినవారు వైశ్యముఖ్యు లనేకుల్ 121

అర్థము. అసంఖ్య + అర్థ-ధ్వజములు = లెక్కలేనన్ని ధనచిహ్నములైన పడగలు, కట్టినవారు, అనేకుల్ = పెక్కండ్రు, వైశ్య-ముఖ్యులు = శ్రేష్ఠులైన కోమటులు, నలిన్ = ఉత్సాహముతో, కోటికోటి-పడగలు = కోటికోటి సంఖ్యగల ధ్వజములు, కలగొనన్ = బాగుగా, కట్టినను = కట్టినప్పటికిని, వానిన్ = ఆ ధ్వజములను, కావు + అని = సరిపడవని, మదిలోన్ = మనసులో, తలఁపరు = గణింపరు

తాత్పర్యము. ఆ ఓషధిప్రస్థమునందలి పెక్కండ్రు కోమటులు లెక్కలేనన్ని, ధనచిహ్నములైన ధ్వజములను గట్టినవారయి, కోటి కోటి సంఖ్యగల పడగలు గట్టినప్పటికిని అవి సరిపోవని వానిని మదిలో గణింపరు

విశేషములు. అలంకార మతిశయోక్తి

చ అనిశము గో సహస్రవిధి నందుల కోమటు లిచ్చు ధేనువుల్
గొని చను భూసురోత్తముల గోవుల పాదహతిన్ మహీతలం
బనయముఁ గ్రుంగి మ ట్టవిసి యప్పురిచుట్టున నూటరేఁగి బో
రన నట జాలువాఱి నదులై చను నంబుధిఁగూడఁ బెల్లునన్ 122

అర్థము. అందుల - కోమటులు = ఆ ఓషధిప్రస్థపురమునందలి కోమటులు, అనిశమున్ = ఎల్లప్పుడును - ప్రతిదినమును, గో - సహస్ర-విధిన్ = వేయి గోవుల (నిచ్చు) నియమముచే, ఇచ్చు = ఇచ్చునట్టి, ధేనువుల్ = ఆవులు, కొని = తీసికొని, చను = వెడలు, భూసుర + ఉత్తముల = బ్రాహ్మణశ్రేష్ఠుల, గోవుల = ఆవుల

యొక్క పాదహతిన్ = కాళ్ళ దెబ్బచే, మహి - తలంబు = భూతలము, అనయమున్ = ఎక్కిలి, క్రుంగి = అణఁగి, మట్టు + అవిసి = కుదురు, పగిలి, అప్పురి = ఆ + పురి = చుట్టునన్ = ఆ ఓషధిప్రస్థపురము చుట్టును, ఊట -రేఁగి = ఊట పుట్టి, బోరనన్ = అధికముగా, అటన్ = అక్కడ, జాలువాటి = జాలు + పాటి = ప్రవాహముగట్టి, నదులు + ఐ, పెల్లునన్ = ఉద్ధతితో, అంబుధిన్ = సముద్రమును, కూడన్ = కలియుటకు, చనున్ = పోవును

తాత్పర్యము ఆ పురమునందలి కోమటులు ప్రతిదినమును వేయి గోవుల నిచ్చు నియమమున నిచ్చునట్టి గోవులను బరిగ్రహించి పోవుబ్రాహ్మణశ్రేష్ఠుల గోవుల కాళ్ళదెబ్బచే భూతలము మిక్కిలి క్రుంగి, కుదురు పగిలి, ఆ పురము చుట్టును నీరూరి అధికముగాఁ బ్రవాహము గట్టి నదులయి ఉద్ధతితో సముద్రమునఁ గలియుటకుఁ బోవును

విశేషములు . అలంకార మతిశయోక్తి అందుల కోమటులు = అందలి కోమటులు "అందుల" పద ప్రయోగము కవి ప్రాచీనతకు నిదర్శము 'బోరన'లో 'ర' యందలి అత్వమునకును, నదులు + ఐ లోని ఐత్వమునకును స్వరప్రధానయతిగా మైత్రి చెల్లినది కాని నన్నయలో రేఫమునకే యతిమైత్రి గనవచ్చుచున్నది 'బో-రన దమయంతీ స్వయంవ-రమునకు నొప్పం జనుదెంచిరి '

క **ఎత్తిన పువ్వులు ముడుచుచుఁ**
బొత్తిచ్చిన పన్నిదములు వొడుచుచు నత్యు
ద్వృత్తి గతి వీధిలో సుభ
టోత్తము లంగళ్ల మెఱయుచుండుదు రెలమిన్ **123**

అర్థము సుభట + ఉత్తములు = మంచి యోధులలో శ్రేష్ఠులు, ఎత్తిన = దండలుగాఁ గట్టిన, పువ్వులు, ముడుఁచుచున్ = తుఱుముచు, పొత్తిచ్చిన పన్నిదములు = నెయ్యపుఁబందెములు, పొడుచుచున్ = ఒడ్డుచు, అతి + ఉద్వృత్తి - గతిన్ = మిక్కిలి గర్వము తోడి నడకతో, వీధిలో, అంగళ్లన్ = విపణులందు అంగడులందు, ఎలమిన్ = సంతోషముతో, మెఱయుచున్ + ఉండుదురు = ప్రకాశించుచుందురు

తాత్పర్యము శ్రేష్ఠులైన యోధులు దండలుగా గ్రుచ్చిన పువ్వులు పెట్టుకొనుచు, నెయ్యపుఁబందెము లొడ్డుచు మిక్కిలి గర్వపు నడకతో వీధిలోని అంగడులలో సంతోషముతోఁ బ్రకాశించుచుందురు

విశేషములు ఎత్తు - ఒకనిధమగు పూలదండ (సూ ని) అని ఉండుటచే దానిని ధాతువుగా నెంచి - దండగా గ్రుచ్చు అని యర్థము చెప్పఁబడినది పొత్తచ్చిన - పొత్తు = స్నేహము కావున పొత్తిచ్చిన = నెయ్యంపు అని యర్థము చెప్పఁబడినది పన్నిదములు వొడుచుచు - పన్నిదములు + పొడుచుచు గసడనాదేశము బాల సంధి 13 అత్యుద్వత్తి - అతి + ఉద్వత్తి - యణాదేశసంధి సుభటోత్తములు - సుభట + ఉత్తములు - గుణసంధి అంగళ్ళన్ - అంగడి - 'బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు బాల తత్సమ 31 అంగడి + లను 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు బాల తత్సమ 45 అంగడులను 'బహువచనంబు పరంబగునపుడు డ ల ట ర ల యిత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు' బాల ఆచ్చిక 12 'బహువచనశ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకార లకారంబుల కలఘులకారంబు నిత్యంబుగ నగు' బాల ఆచ్చిక 14 అంగళ్ళను ఇది సప్తమ్యర్థక ద్వితీయ 'జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగా నగు' బాల కారక 22 అంగళ్లను = అంగళ్లయందు

చ సురసతు లర్థిఁ దత్పురము చూడ మనంబునఁ గోరి కోటపై
వరుస విమానముల్ నిలిపి వచ్చిరొ నా మణిహేమభాతి న
ట్టిరవులు వొల్చు, నింద్రు పురి కిప్పురి మేలని యా సురాంగనల్
మరిగి రమించుచున్నటులు మానిను లొప్పుదు రప్పురంబునన్ 124

అర్థము : సుర - సతులు = దేవతాస్త్రీలు, అర్థిన్ = కోరికతో, తత్ + పురము= ఆ ఓషధిప్రస్థపురము, చూడన్ = చూచుటకు, మనంబునన్ = మనసునందు, కోరి, కోటపైన్ = కోటమీఁద, వరుసన్ = వరుసగా, విమానములన్, నిలిపి, వచ్చిరో, నాన్ = అనఁగా, మణి - హేమ - భాతిన్ = మణులయొక్కయు, బంగారము యొక్కయు కాంతితో, నట్టిరవులు - నట్టు + ఇరవులు = నట్టిండ్లు, పొల్పున్ = ఒప్పును, ఆ - సుర + అంగనల్ = ఆ దేవతాస్త్రీలు, ఇంద్రు పురికిన్ = ఇంద్రుని పురమైన అమరావతికంటె, ఇప్పురి - ఈ + పురి = ఈ ఓషధి ప్రస్థపురము, మేలు + అని, మరిగి = అలవాటుపడి, రమించుచున్ + ఉన్న + అటులు = ఆనందించుచున్నవిధమున - క్రీడించుచున్నవిధమున, అప్పురంబునన్ - ఆ - పురంబునన్ = ఆ ఓషధిప్రస్థపురమునందు, మానినులు = స్త్రీలు, ఒప్పుదురు

తాత్పర్యము. దేవతా స్త్రీలు ఆ ఓషధి ప్రస్థపురమును జూడఁగోరి కోటమీఁద

వరుసగా విమానములు నిలిపి వచ్చిరా యనునట్లు మణుల, బంగారప్రాంతాలలో నాట్యశాలలు ఒప్పును ఇంద్రుని పురమైన అమరావతికంటె నీ పురమే మేలని ఆ దేవలాస్త్రీలు అలవాటుపడి క్రీడించుచున్నారా యనునట్లు ఆ పురమున స్త్రీ లొప్పుదురు

విశేషములు అలంకార ముత్ప్రేక్ష నట్టిరవులు - నట్టు + ఇరవులు - నట్టిండ్లు అప్పురము - ఆ + పురము త్రికసంధి బాల సమాస 14, 15

సీ తా నింతియై యుండగా నొరు నర్థించి
హరి వేడె లక్ష్మి మాహాత్మ్య మెంత ?
తా నారియై యుండగా నజు డాత్మజు
గవసె భారతి నేర్పుకలిమి యెంత ?
తా బత్నియై యుండగా బరాంగన వజ్రి
కామించె శచి సుభగత్వ మెంత ?
తా గాంతయై యుండగా గాము డీల్గె మున్
రతి శుభలక్షణోన్నతి యదెంత ?

తే తమ్ము వంచించి మును లుగ్రతపము చేసి
రప్పర స్త్రీల సోయగ మనగ నెంత ?
యంచు నెమ్మోయి ద్రిజగంబులందు నొరుల
గామినుల మెచ్చ రప్పురాంగనలు పేర్మి 125

అర్థము. తాను = లక్ష్మి, ఇంతి + ఐ = భార్యయయి ఉండగా, ఒరున్ = ఇతరుని, అర్థించి = కోరి, హరి = విష్ణువు (వామనుడై) వేడెన్, లక్ష్మి, మాహాత్మ్యము = గొప్పతనము, ఎంత ?

తాన్ = తాను - భారతి, నారి + ఐ = భార్యయై, ఉండగాన్, అజుడు = బ్రహ్మ, ఆత్మజన్ = కూతును, కవసెన్ = కూడెను, భారతి - నేర్పు - కలిమి = సరస్వతి నైపుణ్య సంపద, ఎంత ?

తాన్ = తాను - శచి, పత్ని + ఐ = భార్యయయి, ఉండగాన్, వజ్రి - వజ్రాయుధముగలవాడు - ఇంద్రుడు, పర + అంగనన్ = ఇతరుని - గౌతముని - భార్యను, కామించెన్ = కోరెను, శచి - సుభగత్వము = శచీదేవి సౌభాగ్యము ఎంత?

తాన్ = తాను - రతి, కాంత + ఐ = భార్యయయి, ఉండఁగాన్, కాముఁడు= మన్మథుఁడు, మున్ = మున్ను -ముందుగా, ఈల్గెన్ = చచ్చెను, రతి - శుభ - లక్షణ + ఉన్నతి = రతి దేవి యొక్క శుభ లక్షణములయొక్క ఔన్నత్యము = అది+ ఎంత ?

తమ్మున్ = అప్సరసలను, వంచించి = మోసగించి, మునులు, ఉగ్ర - తపము = భయంకరమైన తపస్సు, చేసిరి, అప్సరన్ + స్త్రీల = అచ్చరల యొక్క, సోయగము + అనఁగన్ = అందమనఁగా, ఎంత ?

అంచున్ = అనుచు, అప్సురాంగనలు = ఆ + పుర + అంగనలు = ఆ ఓషధి ప్రస్థపురమునందలి స్త్రీలు, పేర్మిన్ = గొప్పతనమునందు, ఎమ్మెయిన్ = ఏ + మెయిన్ = ఏవిధముగను, త్రిజగంబుల + అందున్ = ముల్లోకములందును, కామినులన్ + ఒరులన్ = ఇతర స్త్రీలను, మెచ్చరు

తాత్పర్యము. ' తాను భార్యయై యుండియు నితరుని - బలిని బ్రార్థించి విష్ణువు లక్ష్మిని - సంపదను వేఁడెను ఆమె గొప్పతన మే పాటిది ? తాను భార్యయై యుండఁగా బ్రహ్మ పుత్రికను గూడెను భార్వతి నేర్పు ఏపాటిది ? తాను భార్యయై యుండఁగా నింద్రుఁడు ఇతరుని భార్యను - గౌతముని భార్యయగు అహల్యను, కోరెను శచీదేవి సౌభాగ్య మేపాటిది ? తాను భార్యయై యుండఁగా మన్మథుఁడు ముందుగాఁ జచ్చెను ఇంక రతి శుభలక్షణౌన్నత్య మేపాటిది ? తమ్ము నిరాకరించి మునులు భయంకరమైన తపస్సులను జేసిరనఁగా నీక నచ్చరల అంద మేపాటిది? అనుచు ఆ ఓషధిప్రస్థపురమునందలి స్త్రీలు గొప్పతనమున ఏవిధముగను ముల్లోకములందలి ఇతరస్త్రీలను మెచ్చుకొనరు

విశేషములు ఒరు నర్థించి హరి వేఁడె లక్ష్మి - సాక్షా ల్లక్ష్మి తనకు భార్యయైయున్నను, విష్ణువు వామనుఁడై బలిచక్రవర్తిని పదత్రయ భూరూపలక్ష్మిని వేఁడుకొనెను అజుఁ డాత్మజఁ గవసె - బ్రహ్మకు భారతి భార్యయై యుండఁగా నతఁడు స్వపుత్రికనే కూడెను పరాంగన వఱి కామించె - ఇంద్రుఁడు గౌతముని భార్యయగు సహల్యను గామించెను కాముఁడిల్లె మున్ - రతికంటె ముందుగా నామె భర్తయగు మన్మథుఁడీశ్వరుని మూఁడవకంటిమంటచే దగ్ధుఁడయ్యెను తమ్ము వంచించి మును లుగ్రతపము చేసిరి - తమ తపస్సులకు విఘ్నము చేయవచ్చిన అప్సరసలను లెక్కచేయక మును లుగ్రతపములను గొనసాగించిరి ఒరులఁగామినులన్ - ఒరుఁడు - ఒరులు ఒరులు అను బహువచనాంతరూపమును మహత్యర్థకముగాఁగూడఁ బ్రయోగింపవచ్చును

చ కనుఁగొన సుందరాకృతులు కన్నుల పండువు, మంజుభాషణల్
వినఁ బ్రమృతాంబుపూరములు వీనులకుం దలఁపన్ విలాసముల్
మనసునకున్ సుఖాస్పదము, మాఱుపు లందిన మేనులందు ర
జ్జనులకుఁ గామభోగముల, జన్మఫలం బనఁ బొల్తు రంగనల్ 126

అర్థము.అంగనల్ = ఆ ఓషధిప్రస్థపురమునందలి స్త్రీలు, అజ్జనులకున్ = ఆ + జనులకున్ = ఆ ఓషధిప్రస్థపురమునందలి పురుషులకు, సుందర + ఆకృతులు = అందమైన ఆకారములు, కనుఁగొనన్ = చూచుటకు, కన్నుల-పండువు = కనువిందైనవి, మంజు-భాషణల్ = మనోహరములయిన మాటలు, వినన్ = వినుటకు, వీనులకున్ = చెవులకు, అమృత + అంబు-పూరములు = అమృతజలప్రవాహములు, విలాసముల్ = ఒయ్యారములు, తలఁపన్ = విచారింపఁగా, మనసునకున్ = మనస్సునకు, సుఖాస్పదము = సుఖ + ఆస్పదము = సౌఖ్యమునకుఁజోటు, కామ-భోగములన్ = మన్మధసౌఖ్యములందు, మాఱుపులు + అందిన-మేనులు =వర్తనములందిన శరీరములు, అందురు = (లోకులు) అందురు జన్మ-ఫలంబు = పుట్టువునకు ఫలమైనవారు, అనన్ = అనఁగా, పొల్తురు = ఒప్పుదురు

తాత్పర్యము.ఆ యోషధిప్రస్థమునందలి స్త్రీల సుందరాకారములు అందలి జనులకుఁజూడఁ గనువిందుఁగలిగించు నట్టివి వారి మనోహరాలాపములు వినుటకు వీనులకు అమృతప్రవాహము లగునట్టివి వారి యొయ్యారములు దలఁపఁగా మనస్సునకు సౌఖ్యావహమయినట్టివి మన్మధ సౌఖ్యములందు వారు వర్తనమునందిన శరీరములైనవారు ఇంతయేల? ఆచ్చటి స్త్రీలు ఆ పురుషుల పుట్టువులకు ఫలమైనవారని యంద ఱనఁగా నొప్పుదురు

విశేషములు:'మాఱుపులందిన మేను లందు ర-జ్జనులకుఁ గామభోగముల - అను సూ ని పారము అన్వయసౌలభ్యమునకు స్వీకరింపఁబడినది 'మాఱుపులందిన మేని కందు ర-జ్జనులకుఁ గామభోగములు' అనునది వావిళ్ళవారి ప్రతి పారము

చ అనుపమకాంతిమై సుచిరమైన మెఱుంగులొ? సోలి వీఁగ కొ
య్యన నడపాడు లేఁబొఱలొ? యాయువు వచ్చిన చిత్రరూపులో?
ఘనపదమూర్తి సేకొనిన కామ సుఖంబులొ? యంచు భావకుల్
గనుఁగొన లగ్గ నోటువడఁగాఁ గర మొప్పుదు రప్పురాంగనల్ 127

అర్థము అనుపమ-కాంతిమైన్ = సాటిలేని కాంతిలో, సుచిరము + ఐన = మిక్కిలి చిరకాలముండునయైన, మెఱుంగులో = మెఱుపులో, సోలి = వ్రాలి వీఁగక = చలింపక, ఒయ్యన = మెల్లఁగా, నడపాడు = (నడపు + ఆడు) = సంచరించు, లేఁబొఱలో = లేత పాటలో, - లేఁజివురులో, ఆయువు-వచ్చిన = ప్రాణము వచ్చిన, చిత్ర-రూపులో = చిత్తరువునందలి రూపములో, ఘనపదమూర్తి = ఆకారమును, చేకొనిన = స్వీకరించిన, కామసుఖంబులో = మన్మథసౌఖ్యములో అంచున్, భావకుల్ = భావుకులైనవారు, కనుఁగొనన్ = చూడఁగా, లగ్గన్ = మిక్కిలి, ఓటు + పడఁగాన్ = ఓడిపోఁగా, అప్పుడాంగనల్ = ఆ + పుర + లంగనల్ = ఆ యోషధిప్రస్థపురస్త్రీలు, కరము = మిక్కిలి, ఒప్పుదురు

తాత్పర్యము. 'వీరు సాటిలేని కాంతితో మిక్కిలిచిరకాలముండు మెఱుపులా? సోలి చలింపక మెల్లఁగా నంచరించు లేఁజివురులా? ప్రాణమువచ్చిన చిత్రగతరూపములా? అనుచు భావుకులు చూచి యొకరితోనొకరు పందెములు వైచికొని మిక్కిలి యోడిపోవునట్లు ఆ యోషధిప్రస్థపురమునందలి స్త్రీలు ఒప్పుదురు

విశేషములు. మెఱుఁగు చిరకాల ముండదు దానికి 'అచిరద్యుతి' యనిపేరు ఓషధిప్రస్థపురస్త్రీ లట్లుగాక సుచిరద్యుతులు చిరకాలముండు కాంతి గలవారు, పాఱలు (చివురులు) సోలిపోవుట, వీఁగిపోవుట అను లక్షణములు గలవి అవి నడయాడలేవు ఆ స్త్రీ లట్లుగాక సౌకుమార్యమునఁ జివురులవంటి వారయ్యు వానివలె సోలక, వీఁగక, నడపాడఁగలవారు అచ్చటి స్త్రీలు ఆకారము ధరించిన మన్మథసౌఖ్యము లన నుందురు వా రెటువంటివారనువిషయమున భావుకు లొండొరులతోఁ బందెములు వైచికొని యోడిపోవుదురు అనఁగా వారి సౌందర్యసౌకుమార్యములు వారి యూహాముల కతీతముగా నుండునని భావము ఇందు 'ఘనపద' అననేమో తెలియరాలేదు

క పాయక సర్వర్తుక పు
ష్పాయత గంధములు గొంచు నప్పురిఁ బగలున్
రేయును నింటింటికి మృదు
వాయువు చనుచుండు గట్టివాలును బోలెన్ 128

అర్థము. పాయక = మానక, సర్వర్తుక - సర్వ + ఋతుక-పుష్ప + ఆయత-గంధములు = ఎల్ల ఋతువులందలి పూలయొక్క నిరివియైన పరిమళములు, కొంచున్ = కొనుచు = తీసికొనుచు, అప్పురిన్ (ఆ + పురిన్) =

ఆ ఓషధిప్రస్థపురమందు, పగలున్-రేయునున్ = పగలును, రేయియును, మృదు-వాయువు = మందమారుతము, ఇంటింటికిన్ = ప్రతి గృహమునకు, గట్టివాలును+పోలెన్ = చందన పుష్పము లమ్మెడి స్త్రీ లేక పురుషుఁడు వలె, చనుచున్ + ఉండున్ = సోవుచుండును

తాత్పర్యము ఆ ఓషధిప్రస్థపురమున మందమారుతము మానక ఎల్లఋతువులందలి పూల విరివియైన పరిమళములు తీసికొనుచుఁ బగలును, రేయియును, ప్రతిగృహమునకును చందనపుష్పాదు లమ్మెడి పురుషునివలెఁ బోవుచుండును

విశేషములు . అలంకార ముపమ గట్టివాలు - గట్టువాలు అని శబ్దరత్నాకరము కాని భారతాదుల పెక్కు ప్రతుల పారమును బట్టియుఁ గన్నడమును బట్టియు 'గట్టివాలు' అని గ్రహింపఁబడినట్లు సూ ని గట్టి = పరిమళద్రవ్యముల యుండ వల్ల - స్త్రీప్రత్యయము గట్టివల్ల - సైరంధ్రీ జాతిస్త్రీ (సూ ని)

మ **సమదానేకపబృంహితంబు, హయహేషాఘోషమున్, గీతవా**
ద్య మృదుధ్వానము, వేదరావము, భటోద్దండోక్తులున్ భూరిపం
చ మహాశబ్దరవంబుఁ గూడి సుమహత్సంక్షోభితాంభోధి నా
దమొ నా దిగ్బధిరీకృతంబగుచు నిత్యంబుం జెలంగుం బురిన్ 129

అర్థము . పురిన్ = ఓషధిప్రస్థపురమునందు, సమద + అనేకప బృంహితంబున్ = మదముతోఁగూడిన ఏనుఁగుల ఘీంకృతులును, హయ-హేషా-ఘోషమున్ = గుఱ్ఱముల సకిలింతల ధ్వనియును, గీత - వాద్య - మృదు - ధ్వానమున్ = సంగీతము యొక్కయు, మృదంగాది వాద్యముల యొక్క మెత్తని ధ్వనియును, వేద - రావమున్ = వేద ధ్వనియును, భట + ఉద్దండ + ఉక్తులున్ = యోధుల యొక్క అధికములైన మాటలును, (ఇట్లు), భూరి పంచ - మహత్ (మహా) - శబ్ద - రవంబున్ = గొప్పవియగు వీణ, వేణువు, మృదంగము, కాహళము, శంఖము - అను నైదు గొప్ప వాద్యముల ధ్వనియును, కూడి, సు-మహత్ - సంక్షోభిత + అంభోధి - నాదమొ = మిక్కిలి యెక్కువగాఁ గలఁతపెట్టఁబడిన సముద్రము యొక్క ధ్వనియో, నాన్ = అనఁగా, దిశ్ (క్) + బధిరీకృతంబు = దిక్కులు చెవుడు పడునట్లు చేయఁబడినది, అగుచున్, పురిన్ = ఓషధి ప్రస్థపురమునందు, నిత్యంబున్ = ఎల్లప్పుడును, చెలంగున్ = మ్రోయును

తాత్పర్యము మదపుటేనుఁగుల ఘీంకృతిధ్వనియును, గుట్టముల సకిలింతల ధ్వనియును, సంగీతవాద్యముల మృదువైన ధ్వనియును, వేదముల ధ్వనియును, యోధుల అధికమైన మాటలును, పెద్దవియగు వీణ, వేణువు, మృదంగము, కాహళము, శంఖము అను నైదువాద్యముల ధ్వనియును గూడి మిక్కిలి యెక్కువగాఁ గలఁత పెట్టఁబడిన సముద్రపు ఘోషమో యనఁగా దిక్కులు చెవులుపడునట్లు చేయఁబడుచు నోషధిప్రస్థపురమున నెల్లప్పుడును మ్రోయును

విశేషములు. అలంకారము ఉత్ప్రేక్ష, అతిశయోక్తియును

సీ. రాజకదంబ విరాజితంబగుఁ గాని
కంటక పార్థివోత్కరము గాదు
పద్మాలయాతిశోభన మనం జనుఁగాని
కుముదోదయాది సంకులము గాదు
శుద్ధ సువర్ణ ప్రసిద్ధాత్మ మగుఁగాని
వర చిత్ర వర్ణ సంకరముగాదు
పరమౌషధి ప్రభాభాసురం బగుఁ గాని
దుస్తృణ ద్యోతి విద్యుతము గాదు

తే వనకులంబును దత్సరోవర కులంబుఁ
జెలువ మగు హర్మ్యకులము సుక్షేత్రకులముఁ
బొలయ నిన్నింటితోఁ దాను బోలియున్న
ప్రస్తుతం బగునోషధీప్రస్థ పురము 130

అర్థము: ఇందు శ్లేషమూలమున నోషధిప్రస్థపురమునకు వన - సరోవర - హర్మ్య - సుక్షేత్రకులములతోఁ బోలిక చెప్పఁబడినది వన - కులంబును = వనముల సమూహమును, తద్ + సరోవర - కులంబున్ = ఆ సరస్సుల సమూహమును, చెలువము + అగు = అందమగు, హర్మ్య - కులమున్ - మేడల సమూహమును, సుక్షేత్ర - కులమున్ = మంచిపొలముల గుంపును, పొలయన్ = ఒప్పఁగా, ఇన్నింటితోన్, తాను, పోలి + ఉన్న = పోలియున్నట్టి, ప్రస్తుతంబు + అగు = మిక్కిలి కొనియాడఁబడినదియగు, ఓషధీ ప్రస్థపురము.

రాజ - కదంబ - విరాజితంబు = (ఓషధి) రాజుల సమూహముచేఁ బ్రకాశించునది - (వన ప) ఒక విధమైన కడిమిచెట్లచేఁ బ్రకాశించునది, అగున్ +

కాని = అగును గాని, కంటక - పార్థివ + ఉత్కరము = (ఓషప) శత్రురాజుల సమూహముగలది - (వనప) ముండ్లతోడి భూ సంబంధమైన వాని సమూహము గలది, కాదు

పద్మ + ఆలయా + అతి - శోభనము = (ఓషప) లక్ష్మిచేత - సంపదలచేత- మిక్కిలి ప్రకాశించునది, (సరోవరప) పద్మ + ఆలయ + అతి శోభనము - తామరలకు నిలయ మగుటచే మిక్కిలి ప్రకాశించునది, అనన్ + చనున్ + కాని = అన నొప్పును గాని, కుముద + ఉదయ + ఆది - సంకులము= (ఓషప) సంతోషహీనులగు వారి పుట్టుక మున్నగు వానిచేఁ గలవరపడినది, (సరోవరప) పెద (పిన) గుమ్మడు నాఁచు అనువాని పుట్టుక మున్నగువానిచే నిండినది - కాదు

శుద్ధ - సువర్ణ - ప్రసిద్ధ + ఆత్మము = (ఓషప) శుద్ధులైన మంచి కులమునకుఁ జెందిన వారిచేఁ బ్రసిద్ధమైనది, (హార్మ్యప) స్వచ్ఛమైన బంగారముచేఁ బ్రసిద్ధమైనది, అగున్ + కాని = అగును గాని, వర - చిత్ర - వర్ణ - సంకరము = (ఓషప) మేలయిన వింతలయిన కులములచే మిశ్రమైనది - కాదు (హార్మ్యప) మేలయిన చిత్తరువులయొక్క రంగులతో మిశ్రమమైనది - కాదు

పరమ + ఓషధి -ప్రభా - భాసురంబు= (ఓషప) గొప్ప జ్యోతిష్మతుల కాంతులచేఁ బ్రకాశించునది, (సుక్షేత్రప) గొప్ప మందుతీఁగల మహిమచేఁ బ్రకాశించునది, అగున్ + కాని, దుస్తృణ - ద్యోతి - విద్యుతము = (ఉభయప) చెడు గడ్డిచే వెలుఁగునట్టిది - కాదు

తాత్పర్యము: వన సమూహము, సరస్సమూహము, హార్మ్య సమూహము, సుక్షేత్రకులము - అను ఇన్నింటితోఁ బోలిక గలిగి మిక్కిలి కొనియాడఁబడిన ఓషధీప్రస్థపురము - రాజుల సమూహము చేఁ ప్రకాశించునది కాని శత్రురాజుల సమూహము గలది కాదు వన సమూహము వలె గడిమిచెట్లచేఁ ప్రకాశించును గాని, ముండ్లచెట్లు గలది కాదు పద్మాలయ (లక్ష్మి)చే మిక్కిలి ప్రకాశించునది కాని సంతోషహీనుల యుదయముచేఁ గలవరపడినది కాదు సరోవరమువలెఁ దామరలకు నిలయమగుటచే మిక్కిలి ప్రకాశించును గాని గుమ్మడు, నాచు అనువానితో నిండినది కాదు శుద్ధులైన సద్వర్ణులచేఁ బ్రసిద్ధమైనది కాని వింతలైన కులముల

సంకరము గలది కాదు హార్మ్యము వలె స్వచ్ఛమైన బంగారముచేఁ బ్రసిద్ధమయినదికాని చిత్తరువుల రంగులతో మిశ్రమయినది కాదు సుక్షేత్రమువలె గొప్ప జ్యోతిష్మతుల ప్రభచేఁ బ్రకాశించునది కాని దుస్పర్శముచేఁ వెలుఁగునట్టిదికాదు

విశేషములు . అలంకారము - శ్లేషము

క. ఉరుతర మణిగణ రుచి వి
స్ఫురితంబై వివిధ విపుల భోగాన్వితమై
పరమ శ్రీ సహితంబై
యురగాధిపుఁబోలె తత్పురోన్నతి వొలుచున్ 131

అర్థము . తద్ + పుర +ఉన్నతి = ఆ ఓషధిప్రస్థపురము నౌన్నత్యము, ఉరుతర - మణి - గణ - రుచి - విస్ఫురితంబు + ఐ =మిక్కిలి గొప్పనియైన మణులయొక్క సమూహముయొక్కకాంతిచే మిక్కిలిప్రకాశించునది యయి, - ఉభయపరము, వివిధ - విపుల - భోగ - అన్వితము + ఐ = పలురీతులయినవి, గొప్పవియైన సుఖములతోఁ గూడినవయి, అని పురోన్నతిపరము, పలురీతులయినవి, పెద్దవియైన పడగలతోఁ గూడినవయి అని 'ఉరగాధిపుపరము', పరమ - శ్రీ - సహితంబు + ఐ = మిక్కిలి ఉత్కృష్టుఁడైన విష్ణువుతోను, శ్రీ + లక్ష్మితోను గూడినదయి - అని ఉరగాధిపుపరము, ఉరగ + అధిపున్ + పోలెన్ = పాములలోఁడగు శేషునివిధమున, పొలుచున్ = ప్రకాశించును

తాత్పర్యము : ఆ ఓషధిప్రస్థపురౌన్నత్యము మిక్కిలి గొప్పవియైన మణుల సమూహము కాంతితోఁ బ్రకాశించునదియయి, పలురీతులైన గొప్ప సుఖములతోఁ గూడినదయి, ఉత్కృష్టమైన సంపదతోఁ గూడినదయి, మిక్కిలి గొప్పమణుల సమూహము కాంతులతోఁ బ్రకాశించునదియయి, పలువిధములైన విశాలములయిన పడగలతోఁ గూడినదియయి, ఉత్కృష్టుఁడైన విష్ణువుతోను, లక్ష్మితోను గూడినదయి, పాములలోఁడయిన శేషునివలెఁ బ్రకాశించును

విశేషములు . అలంకారము శ్లేషోత్థాపితమైన ఉపమ, భోగ = సుఖము, పాము పడగ, పరమ - శ్రీ - ఉత్కృష్టమైన సంపద -ఉత్కృష్టుఁడైన విష్ణువు, లక్ష్మి అని అర్థద్వయముచే శ్లేషము తత్పురోన్నతి వొలుచున్ = తత్పురోన్నతి + పొలుచున్ 'ప్రథమమోఁది పురుషములకు గసడదవలు బహుళముగా నగు' బాల సంధి 13

హిమవద్వర్ణనము

సీ మును మహీధేనువు చను వత్సమై కుడ్చి
వస్తు సంపూర్ణమై వలలువాఁడు
కమఠోరగేంద్ర దిగ్గజరాజి దాల్చు భూ
భార మెక్కటిఁ దాల్చి పరఁగువాఁడు
త్రైలోక్యజననియై తనరు శర్వాణికి
జనకుండు నా సడిసన్నవాఁడు
విశ్వైకగురుఁడగు నీశ్వరునకు నర్థి
మామగా నెగడిన మహిమవాఁడు

తే తుహినకర తీవ్రకర హుతవహులు వరుసఁ
బాచు తమ మోషధీప్రభాభాతిఁ దాన
పాచి విలసిల్లువాఁడు దిగ్భరిత కీర్తి
మంతుఁ డచలుండు పతి హిమవంతుఁ డతఁడు 132

అర్థము. మును = పూర్వము, మహీ - ధేనువు - చను = భూమియనెడు నావు పొదుఁగు, వత్సము + ఐ = దూడయయి, కుడ్చి = కుడిచి, వస్తు - సంపూర్ణము + ఐ = రత్నములు, ఓషధులు మున్నగు వస్తువులతో నిండి, వలలువాఁడు = ఒప్పువాఁడు

కమఠ + ఉరగ + ఇంద్ర - దిశ్ (క్) + గజ - రాజి = ఆది కూర్మము, పాఁపతెడగు అనంతుఁడు, దిక్కులందలి ఏనుఁగుల సమూహము, తాల్చు = భరించు, భూ - భారము = భూమియొక్క బరువు, ఎక్కటిన్ = ఒక్కఁడును, తాల్చి = భరించి, పరఁగువాఁడు = ఒప్పువాఁడు

త్రైలోక్య - జనని + ఐ = ముల్లోకముల తల్లి యయి, తనరు = ఒప్పునట్టి, శర్వాణికిన్ = పార్వతికి, జనకుండు - నాన్ = తండ్రియనఁగా, సడి + చన్నవాఁడు = కీర్తికెక్కినవాఁడు,

విశ్వ + ఏక - గురుఁడు + అగు = లోకమునకు ఒకే ఒక గురువైన, ఈశ్వరునకున్ = శివునకు, అర్థిన్ = కోరికతో, మామగాన్, నెగడిన = ప్రసిద్ధికెక్కిన, మహిమ - వాఁడు = గొప్పతనము గలవాఁడు

తుహినకర - తీవ్రకర - హుతవహులు = చంద్రుఁడు, సూర్యుఁడు, అగ్ని, వరుసన్, పాచు = తొలఁగఁజేయు, తమము = చీఁకటి, ఓషధీ - ప్రభా - భాతిన్ =

ఓషధులయొక్క, కాంతులయొక్క, ప్రకాశముచేత, తాను + అ = తానే, పాచి = తొలఁగించి, విలసిల్లువాఁడు = ప్రకాశించువాఁడు, దిశ్ (క్) + భరిత - కీర్తి - మంతుఁడు = దిక్కులందు నిండిన కీర్తి గలవాఁడు, అతఁడు, అచలుండు = చలనము లేనివాఁడు, పతి = (పర్వత) రాజు, హిమవంతుఁడు

తాత్పర్యము . పూర్వము భూమి గోవుకాఁగా దాని పాదుఁగును హిమవంతుఁడు దూడయై కుడిచెను మేరువు పాలు పిదుకువాఁడయి ప్రకాశించు రత్నములను, మహౌషధులను బిదికెను ఇదియంతయుఁ బృథుమహారాజు నాజ్ఞ చొప్పున జరిగెను ఆదికూర్మము, పాఁపఱేఁడు అగు అనంతుఁడు, దిగ్గజముల వరుస భరించు భూభారమును ఒక్కఁడే భరించి యొప్పువాఁడు ముల్లోకములకుఁ దల్లియైయొప్పు పార్వతికిఁ దండ్రి యనఁగాఁ గీర్తికెక్కినవాఁడు లోకైకగురుఁడైన యీశ్వరునకు మామయను ప్రసిద్ధిని వహించినవాఁడు చంద్రుఁడు, సూర్యుఁడు, అగ్ని వరుసగాఁ దమకాంతులచేఁ బోఁగొట్టు చీఁకటిని దా నొక్కఁడే తన ఓషధులకాంతులచేఁ బోఁగొట్టి ప్రకాశించువాఁడు దిక్కులందు నిండిన కీర్తిగల వాఁడు, చలనము లేనివాఁడు అతఁడు పర్వతరాజగు హిమవంతుఁడు

విశేషములు : మును మహీధేనువు వఱలువాఁడు !

'యం సర్వశైలాః పరికల్ప్య వత్సం
మేరౌ స్థితే దోగ్ధరి దోహదక్షే,
భాస్వన్తి రత్నాని మహౌషధీశ్చ
పృథూపదిష్టాం దుదుహు ర్ధరిత్రీమ్ కాళిదాసకుమార 1 - 2

ఆదికూర్మము, ఆదివరాహము, అనంతుఁడు, అష్టదిగ్గజములు, సప్తకుల పర్వతములు భూభారమును వహించుచున్నవని పురాణములు శర్వాణి - ఇంద్ర, వరుణ, భవ, శర, రుద్ర, మృడ, హిమ, అరణ్య, యవ, యనన, మాతుల, ఆచార్య శబ్దములకు ఈ ప్రత్యయమును, అంతకు ముందు ఆన్ అను నాగమమును వచ్చును శర్వ + ఆన్ + ఈ = శర్వాణీ త్రైలోక్యం - త్రయాణాం లోకానాం సమాహారః - త్రైలోక్యమ్ మూఁడు లోకముల సమాహారము సమాహారార్థకమగు ద్విగువు ఏకవచనాంతమును, నపుంసకము నగును నడిసన్న - నడి+ చన్న - నిందపోయిన - కీర్తికెక్కిన విశ్వైక - విశ్వ + ఏక - వృద్ధి సంధి అ ఆలకు ఏ ఐలు పరములగునపుడు ఐకారమును, ఓ ఔలు పరములగునపుడు ఔకారమును

ఏకాదేశములగును హుతవహుఁడు -హుతమును - హవిస్సును - వహించువాఁడు - అగ్ని పాచు - పాయుధాతు ప్రేరణార్థకరూపము - 'అట్లు చుక్కుగాగమంబు లడంగ్వాది మాయ్వాదులకగు నగుచో వాని కడవ్రాలు లోపించు' - బాల క్రి 76 పాచు - (రూపాం) పాపు ఓషధి - ఓషధీ శబ్దములు రెండును గలవు దిశ్ + భరిత - దిక్ + భరిత - దిగ్భరిత చను - చన్ను - చను 'అకారంబుక్రింది అకారంబునకుం దుది ను లుల క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు' బాల ప్రకీర్ణ 7

సప్తర్షులు హిమవంతునితోఁ బార్వతిని శివునకిమ్మని పలుకుట

వ అని యనేక ప్రకారంబుల వర్ణింపందగిన వర్ణనల కెక్కి మహీరమణీ ముఖలలామంబునుంబోలె నతిరమణీయంబైన యోషధిప్రస్థపురవర ప్రభావంబు గనుంగొని మెచ్చి పిచ్చలించుచు వచ్చు మునీంద్రుల కచలేంద్రుం డెదురువచ్చి వినయవినమితోత్తమాంగుండై నిజరాజమందిరంబునకుం దోడ్కొని చని సముచితాసనపాద్యాద్యశేషార్చనా భ్యర్చితులఁ జేసి కర్పూరపాళీవిరాజితంబులగు విడియంబు లిచ్చి ముకుళితకరకమలుండై భవదీయాగమనప్రయోజనం బెటింగించి దయసేయుం డనినగిరిపతి నమ్మునిపతులు యథోచితవచనంబులం గలపికొని. 133

అర్థము. అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, వర్ణింపన్ + తగిన, వర్ణనలకున్ + ఎక్కి = వర్ణనలు వహించి, మహీ -రమణీ - ముఖ లలామంబునున్ + పోలెన్ = భూమియనెడు స్త్రీయొక్క మొగమునకు నుదుటియలంకారము విధమున, అతి - రమణీయంబు + ఐన = మిక్కిలి సుందరమైన, ఓషధి ప్రస్థ - పుర - వర - ప్రభావంబు = పురశ్రేష్ఠమైన ఓషధిప్రస్థము యొక్క గొప్పతనము, కనుంగొని = చూచి, మెచ్చి, పిచ్చలించుచున్ - ఆనందించుచు, వచ్చు = వచ్చునట్టి, ముని + ఇంద్రులకున్ = ముని శ్రేష్ఠులకు, అచలేంద్రుండు - అచల + ఇంద్రుండు - పర్వతశ్రేష్ఠుఁడు, - హిమవంతుఁడు, ఎదురు వచ్చి, వినమ - వినమిత - ఉత్తమాంగుండు + ఐ = అడఁకువచేత - వంపఁబడిన - శిరస్సు గలవాఁడయి, నిజ-రాజ - మందిరంబునకున్ = తనదైన రాజభవనమునకు, తోడ్కొని - చని = తీసికొని వెడలి, సముచిత + ఆసన - పాద్య - ఆది + ఆశేష + అర్చన (అర్చనా) + అభ్యర్చితులన్ + చేసి = అర్హములైన, ఆసనము, పాద్యము మున్నగు సమస్తమైన పూజలచేఁ బూజింపఁబడిన వారిని జేసి, కర్పూర - పాళీ -

విరాజితంబులు + అగు = కప్పురములయొక్క వరుసచేఁ బ్రకాశించునవియగు విడియంబులు = తాంబూలములు, ఇచ్చి, ముకుళిత - కర - కమలుండు + ఐ= ముడిచిన హస్తపద్మములు గలవాఁడయి, భవదీయ + ఆగమన - ప్రయోజనంబు= మీదయిన రాకకుఁ గారణము, ఎటింగించి = తెలిపి, దయసేయుండు = విచ్చేయుఁడు అనిన, గిరి-పతిన్ = కొండల తేనిని, అమ్మునిపతులు - ఆ + ముని-పతులు = ఆ మునిశ్రేష్ఠులు, యథోచిత - యథా + ఉచిత - వచనంబులన్ = ఔచిత్యము నతిక్రమింపని మాటలతో, కలపికొని

తాత్పర్యము . అని పెక్కువిధముల వర్ణింపఁదగిన వర్ణనలలో నొప్పి భూమియను స్త్రీ ముఖాలంకారమోయన మిక్కిలి సుందరమైన ఓషధి ప్రస్థపురవరము గొప్పతనమును జూచి మెచ్చి ఆనందించుచు వచ్చునట్టి మునిశ్రేష్ఠులకుఁ బర్వతశ్రేష్ఠుఁడు అగు హిమవంతుఁడు ఎదురువచ్చి వినయముచే శిరస్సు వంచి తన రాజభవనమునకుఁ దోడ్కొనిపోయి, సముచితములైన ఆసనము, పాద్యము మున్నగు సమస్తపూజావిధానములచేఁ బూజించి, కర్పూరముచే నొప్పుతాంబూలము లిచ్చి నమస్కరించి 'మీ రాకకుఁ గారణమును దెలిపి విచ్చేయుఁ' డనినకొండలతేనిని ఆ మునీశ్వరులు సముచితములైన మాటలతోఁ గలుపుకొని - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . మహీ - రమణీ - మహియనెడు రమణి - రూపకము ఆది + అశేష = ఆద్యశేష - యణాదేశ సంధి యథోచిత - ఉచిత మనతిక్రమమ్య - అవ్యయీభావ సమాసము

మ రజతాద్రిస్థుఁ డనాదిదేవుఁ డఖిలారాధ్యుం డసాధ్యుండు త
త్త్రిజగన్నాథుఁడు మమ్ము నీ కడకుఁ బుత్తేరంగ నా స్వామి క
ద్రిజ నీ నే మడుగంగ వచ్చితి ముమాదేవిన్ లసత్కన్యకా
వ్రజచూడామణి నిమ్ము శంభునకు భాస్వత్పర్వతాధీశ్వరా ! 134

అర్థము . భాస్వత్ + పర్వత + అధి + ఈశ్వరా! = ప్రకాశించుచున్న కొండలచేఁడా! రజత + అద్రి-స్థుఁడు = వెండికొండ (కైలాసము) పై నుండువాఁడు, అనాది-దేవుఁడు = మొదలులేని దేవుఁడు, అఖిల + ఆరాధ్యుండు = ఎల్లరకుఁ బూజనీయుఁడు, అసాధ్యుండు = సాధింపరానివాఁడు, తద్ + త్రిజగత్ + నాథుఁడు = ఆ ముల్లోకముల ప్రభువు - ఈశ్వరుఁడు, మమ్మున్, నీ కడకున్ = నీయొద్దకు, పుత్తేరంగన్ = పంపఁగా, ఆ-స్వామికిన్ = ఆ ప్రభువునకు, అద్రిజన్

= పార్వతిని, ఈన్ = ఇచ్చుటకు, ఏము, అడుగంగన్, వచ్చితిమి, లసత్ + కన్యకా-వ్రజ-చూడామణిన్ = ఒప్పుచున్న కన్యకల సమూహమునందుఁ దలమానికమైన (శ్రేష్ఠురాలయిన), ఉమా-దేవిన్ = పార్వతీదేవిని, శంభుసకున్, ఇమ్ము

తాత్పర్యము 'ప్రకాశించుచున్న పర్వతప్రభూ! కైలాసముపై నుండువాఁడును, అనాదియగు దెవుఁడును, సర్వారాధ్యుఁడును, అసాధ్యుఁడును, ఆ ముల్లోకముల ప్రభువును అగు నీశ్వరుఁడు మమ్ము నీయొద్దకుఁ బంపఁగా నా ప్రభువునకుఁ బార్వతి నిమ్మని మే మడుగ వచ్చితిమి కన్యకలలో శ్రేష్ఠురాలగు నుమాదేవిని ఈశ్వరున కిమ్ము'

విశేషములు. పుత్తేరంగన్ = 'పుచ్చు ధాతువు 'తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తం బగు నగుచో నుత్వంబు పయిని దాని తకారంబు దకారం బగు' బాల క్రియ 110 పుచ్చు + తెంచు 'అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు' బాల క్రియ 112 పుత్ + తెంచు ఒక హల్లునకు విజాతీయమగు హల్లుతో సంయోగమేర్పడునప్పు డా హల్లు పరహల్లుగా మాఱునను నిర్దేశానుసారముగా గ్రహింపఁదగును కాన చకారము పరహల్లుగా మాఱి పుత్ + తెంచు = పుత్తెంచు అగును 'తుమర్థ భావలక్షణంబులందు నుజి యగు బాల క్రియ 40 పుత్తెంచు + నుజి ముజ్జిత్తులు ముత్తు నాఁబడు బాల క్రియ 86 'అద్దానికి ముత్తు పరంబగునపుడు తే తేరు లగు' పుత్తేరు + నుజి బాల క్రియ 113 'జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు' బాల క్రియ 20 పుత్తేరను 'నుజ్యంతంబగు నగుధాతువు క్రియావిశేషణంబుల కనుప్రయుక్తంబగు నుజికి విభాష నగు' బాల క్రియ 115 పుత్తేరను + కాను 'దానికి హ్రస్వంబు విభాష నగు' బాల క్రియ 116 పుత్తేరను + కను ద్రుతకార్యము (బాల సంధి 16,17) పుత్తేరంగను 'అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగ నగు' బాల సంధి 20 పుత్తేరంగన్

వ అనిన నమ్మునివతుల దివ్యవచనంబులు ప్రియంబున నాదరించి 135

అర్థము. అనినన్, అమ్ముని పతుల (ఆ + మునిపతుల) = ఆ మునీశ్వరుల, దివ్య-వచనంబులు = మంచి మాటలు, ప్రియంబునన్ = ప్రీతితో, ఆదరించి = మన్నించి

తాత్పర్యము. అనఁగా ఆ మునీశ్వరుల దివ్యములయిన పలుకులు ప్రితితో మన్నించి - తరువాతి పద్యముతో నన్వయము

హిమవంతుఁడు సప్తర్షుల మాటలకు సంతసించుట

క విని ముత్పులకితదేహము
వినుతానందాశ్రు గళిత విమలాక్షములున్
దనరఁగ మహాప్రసాదం
బని పరమేశ్వరుని కెలఁగి యగపతి భక్తిన్ 136

అర్థము. విని, ముద్ + పులకిత-దేహమున్ = సంతోషముతో గగుర్పొడిచిన మేనును, వినుత + ఆనంద + అశ్రు-గళిత-విమల + అక్షములున్ = పొగడఁబడిన సంతోషబాష్పములు రాలిన నిర్మలములైన కన్నులును, తనరఁగన్ = ఒప్పఁగా, అగపతి = పర్వతరాజు - హిమవంతుఁడు, మహత్ (మహా) + ప్రసాదంబు + అని, భక్తిన్ = భక్తితో, పరమేశ్వరునికిన్, ఎఱఁగి = నమస్కరించి

తాత్పర్యము . విని సంతోషముచే గగుర్పొడిచిన మేనును, సంతోష బాష్పములు రాలిన కన్నులును ఒప్పఁగా హిమవంతుఁడు భక్తితో నీశ్వరునకు నమస్కరించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . విమలాక్షములున్ - అక్షిన్ శబ్దము అవ్వయీభావ సమాసమునను, బహువ్రీహి సమాసమునను ఉత్తరపదమైనపుడు అకారాంత మగును కాని యిటఁ గర్మధారయ సమాసమునను అకారంత మగుట విశేషము

చ పరమున కేను దాసుఁడని పల్కఁగఁ బ్రాప్తుఁడఁగాను మత్సుతన్
హరునకు నిత్తు నా వెఱవనయ్యె సపుత్రకళత్ర మేను మీ
వరువుఁడ మిమ్ముఁ గొల్వఁగలవాఁడ నవశ్యము దీని మీరు చె
చ్చెర నొడఁగూర్చి నాకు దయసేసి కృతార్థునిఁజేయుఁ డిత్తఱిన్ 137

అర్థము : పరమునకున్ = గొప్పవాఁడయిన శివునకు, ఏను = నేను, దాసుఁడు + అని = సేవకుఁడనని, పల్కఁగన్ = పలుకుటకు, ప్రాప్తుఁడన్ = సమర్థుఁడను, కాను, మత్ + సుతన్ = నా కూఁతును, హరునకున్ = ఈశ్వరునకు, ఇత్తున్ = ఇచ్చెదను, నాన్ = అనుటకు, వెఱవన్ + అయ్యెన్ = భయపడనయ్యెను, సపుత్ర-కళత్రము = పుత్త్రులతోను, భార్యతోను, ఏను = నేను, మీ-వరువుఁడన్ = దాసుఁడను, మిమ్మున్, కొల్వఁగలవాఁడన్ =

సేవింపఁగలవాఁడను, అవశ్యమున్ = తప్పక, దీనిన్ = ఈ కార్యమును, మీరు, చెచ్చెరన్ = శీఘ్రముగా, ఒడఁగూర్చి = పొసఁగించి, నాకున్, దయ + చేసి = నన్ననుగ్రహించి, ఇత్తఱిన్ = ఈ + తఱిన్ = ఈ సమయమున, కృతార్థునిన్ = ధన్యుని, చేయుఁడు

తాత్పర్యము. 'పరమేశ్వరున కేను దాసుఁడనని పలుకులకు సమర్థుఁడను గాను నా పుత్రిని శివునకు నిత్తుననుటకు భయమగుచున్నది భార్యాపుత్ర సహితముగ నేను మీ సేవకుఁడను మిమ్ము సేవింపఁగలవాఁడను మీరు ఈ శుభమును దప్పక శీఘ్రముగాఁ బొసఁగించి దయతో నిప్పుడు నన్ను ధన్యాత్మునిం జేయుఁడు'

విశేషములు. ఏను దాసుఁడని - 'ప్రథమాంతంబులగు యుష్మదస్మ ద్విశేషణంబుల కేకత్వంబున వు నులును, బహుత్వంబున రు ములు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు' బాల కారక 33 ఏను దాసుఁడు + ను 'ఈ యాగమంబులు పరంబులగునపు డుత్వంబున కత్వంబగు' బాల కారక 34 ఏను దాసుఁడను + అని - 'ఏను దాసుఁడనని' అని కావలసియుండఁగా, ప్రాయికగ్రహణముచే నీ ఏను దాసుఁడని అనుప్రయోగము రక్షిత మయ్యెను ఏను దాసినని వా ప్రతి, సా ప్రతులలోని పారము దాసి స్త్రీలింగమగుటచే బాగులేదు దాసుఁడని మా రా ప్రతి పారము

చ **కులముల రాజు, గోత్రమునకుం బతి, వేల్పులవేల్పు, సంపదల్**
కలిమి కధీశుఁ, డీవి కధికారి, త్రిమూర్తుల కాదిమూర్తి, దా
నెలమి సమస్తలోకముల కీశ్వరుఁ డిమ్మెయి నన్ను నేలఁగాఁ
దలఁచిన దీన నేను గడు ధన్యుఁడఁ బుణ్యుఁడ లోకమాన్యుఁడన్ **138**

అర్థము: కులముల-రాజు = కులములకుఁ బ్రభువు, గోత్రమునకున్ = పర్వతమునకు (కైలాసమునకు), పతి = ప్రభువు, వేల్పుల-వేల్పు = దేవదేవుఁడు, సంపదల్-కలిమికిన్ = సంపదలు గలుగుటకు, అధి + ఈశుఁడు = ప్రభువు, ఈవికిన్ = ఔదార్యమునకు అధికారి, త్రిమూర్తులకున్ = బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు మువ్వురకును, ఆది-మూర్తి = మొదటివాఁడు, తాను, ఎలమిన్ = ప్రీతితో, సమస్త-లోకములకున్ = ఎల్ల భువనములకు, ఈశ్వరుఁడు = ప్రభువు, ఇమ్మెయిన్ (ఈ + మెయిన్) = ఈ విధముగా, నన్నున్, ఏలఁగాన్ = పాలింపఁగా, తలఁచిన-దీనన్ = తలఁచిన యీ కారణముచేత, ఏను, కడున్ = మిక్కిలి, ధన్యుఁడన్, పుణ్యుఁడన్, లోక-మాన్యుఁడన్ = జగములచే మన్నింపఁదగినవాఁడను

తాత్పర్యము కులములకు రాజును, కైలాసనగమునకుఁ బతియును, దేవదేవుఁడును, సంపదలు గలుగుట కధిపతియును, ఔదార్యమున కధికారియును, బ్రహ్మ విష్ణు మహేశ్వరులనెడి త్రిమూర్తులకును మొదటివాఁడును, సర్వభువనాధీశుఁడును అగు నీశ్వరుఁడీ రీతిగా నన్నుఁ బాలింపఁదలఁచుటచే నేను గృతార్థుఁడను, పుణ్యాత్ముఁడను, లోకమాన్యుఁడను అగుచున్నాను

క ఇది నాకు నుంకు విచ్చుట
యిది మొదలుగ నన్ను నరణ మిచ్చితిఁ ద్రిజగ
ద్విదితముగ నీశ్వరున కని
ముద మొదవ శిలోచ్చయోత్తముఁడు నిశ్చితుఁడై 139

అర్థము. ఇది = ఈ విధముగా నన్ను నీ వనుగ్రహించుట, నాకున్, ఉంకువ = ఓలి, ఇచ్చుట, ఇది-మొదలుగన్ = ఇది మొదలుకొని, త్రిజగత్ + విదితముగన్ = ముల్లోకములందును బ్రసిద్ధమగునట్లు, ఈశ్వరునకున్ = శివునకు, నీకు, నన్నున్, అరణము + ఇచ్చితిన్ = అరణమును (యౌతకమును) ఇచ్చితిని, అని = అని పలికి, శిలోచ్చయ + ఉత్తముఁడు = పర్వతశ్రేష్ఠుఁడు - హిమవంతుఁడు, ముదము + ఒదవన్ = సంతోషము గలుగునట్లు, నిశ్చితుఁడు + ఐ = నిశ్చయించినవాఁడయి

తాత్పర్యము. 'ఈ విధముగా నన్ను నీ వనుగ్రహించుట నాకు నీ వరణము నిచ్చుటయే ఇది మొదలుకొని ముల్లోకములందును బ్రసిద్ధమగునట్లు ఈశ్వరుఁడవైన నీకు న న్నరణముగా నిచ్చితిని' అని పలికి పర్వతోత్తముఁడు సంతోషము గలుగునట్లు నిశ్చయించినవాఁడయి' - తరువాతి వచనముతో నన్వయము

వ 'ఈ మునివరులకుం జూడ గౌరిం దోడ్కొని రం'డని విదగ్ధాంగనల్ నియమించినఁ దద్గణికానియోగంబున మణికోశంబున వెలుడు మదను ఖడ్గలతికయుం బోలె నగజ నైపథ్యాగారంబు వెడలి లజ్జావనతాన యగుచు 140

అర్థము. ఈ-ముని-వరులకున్ = ఈ మునీశ్వరులకు, చూడన్ = చూడ వీలగునట్లు, గౌరిన్ = పార్వతిని, తోడ్కొని-రండు = తీసికొని రండు, అని, విదగ్ధ+ అంగనలన్ = ప్రౌఢలైన స్త్రీలను, నియమించినన్ = ఆజ్ఞాపింపఁగా, తద్ + గణికా-నియోగంబునన్ = ఆ ప్రౌఢాంగనల పంపుచే, మణి-కోశంబునన్-వెలుడు =

మణిమయమైన ఒటనుండి, వెలువడునట్టి, మదను = మన్మథునియొక్క, ఖడ్గ-లతికయున్ + పోలెన్ = లతవంటి కత్తివలె, అగజ = పార్వతి, నైపథ్య + అగారంబునన్ = అలంకరింపకొను గృహమునుండి, వెడలి, లజ్జా + అవనత + ఆనన = సిగ్గుచే వంపఁబడిన ముఖము గలది, అగుచున్

తాత్పర్యము 'ఈ మునిశ్రేష్ఠులు మామటకు వీలగునట్లు పార్వతిని దీసికొని రం'డని ప్రౌఢాంగనల నియమింపఁగా, వారి పంపున మణిమయమైన ఒటనుండి వెలువడు మన్మథుని లతవంటి కత్తియో యనఁ బార్వతి అలంకరణ గృహమునుండి వెలువడి సిగ్గుచేఁ దలవంచుకొన్నది యగుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

చ తన తనుకాంతి తళ్కులు సుధారసపూరముగాఁగ దానిలోఁ
గనుఁగవ దీధితుల్ ఋషినికాయములై పొలయంగ, భ్రూలతల్
సను లహరీప్రవాహముగ శైలజ వచ్చె సభానికేతనం
బను మహిఁ గప్పు రాగభరితాంబుధి నా మదలీలఁ గ్రాలుచున్ 141

అర్థము. తన-తను-కాంతి-తళ్కులు = తన శరీరకాంతుల తళతళలు, సుధా-రస-పూరము = అమృతరసప్రవాహము, కాఁగన్ = కాఁగా, దానిలోన్ = ఆ ప్రవాహములో, కనుఁగవ (కను + కవ)-దీధితుల్ = కన్నులజంట కాంతులు, ఋష-నికాయములు + ఐ = చేపలగుంపులయి, పొలయంగన్ = సంచరింపఁగను, భ్రూ-లతల్ = బొమతీవలు, చను = ఒప్పునట్టి, లహరీ-ప్రవాహము + కన్ = పెద్దయలల ప్రవాహముగను, శైల-జ = కొండకూఁతురు - పార్వతి, సభా-నికేతనంబు + అను-మహిన్ = సభామందిరము అనెడి భూమిని, కప్పు = కప్పునట్టి, రాగ-భరిత + అంబుధి-నాన్ = అనురాగముతో నిండిన సముద్రమోయనునట్లు, మద-లీలన్ = పరమానందమువలని విలాసముతో, క్రాలుచున్ = ఒప్పుచు, వచ్చెన్

తాత్పర్యము. తన శరీరకాంతి తళతళలు అమృతరసప్రవాహము కాఁగా, దానిలోఁ గన్నుల కాంతులు చేపల సమూహములయి సంచరింపఁగా, బొమతీవలు పెద్దయలల ప్రవాహముకాఁగా, పార్వతి సభాస్థానమనెడి భూమిని గప్పునట్టి అనురాగభరితమైన సముద్రమో యనునట్లు పరమానందమువలని విలాసముతో వచ్చెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము

వ ఇట్లు చనుదెంచి నిజజనకు నూరుపీరం బలంకరించుచున్న గౌరి నమ్మునివరులు గని తదుత్తమస్త్రీలక్షణలక్షితంబగు సర్వాంగోపాంగప్రత్యేక సముదాయశోభ లుపలక్షించి చూచి ప్రముదితహృదయు లగుచు నిప్పరమేశ్వరి పరమేశ్వరు నగ్రమహిషి యగు డేమి యపూర్వం బని నిశ్చయించి పార్వతి ముద్రారోహణంబు సేసి నగపతిచేత సత్కృతులై వీడ్కొని చనుదెంచి రంత నంతకుమున్న తద్వృత్తాంతంబెల్ల నెఱింగి హరి పరమేష్ఠి పురందర ప్రముఖ సురాసురోరగసిద్ధ విద్యాధరాద్యఖిల భువన భవనాధీశ్వరు లీశ్వరాచలంబున కరిగి తదున్నతిఁ గని విస్మితు లగుచు 142

అర్థము : ఇట్లు, చనుదెంచి = వచ్చి, నిజ-జనకు = తన తండ్రియొక్క, ఊరు-పీరంబు = తొడయనెడి పీరము, అలంకరించుచున్ + ఉన్న, గౌరిన్ = పార్వతిని, అమ్మునివరులు (ఆ + ముని-వరులు) = ఆ మునిశ్రేష్ఠులు, కని, తద్ + ఉత్తమ-స్త్రీ-లక్షణ-లక్షితంబు = ఆమెయొక్క, శ్రేష్ఠురాలయిన స్త్రీయొక్క లక్షణములచేఁ జూడఁబడినది, అగు, సర్వ + అంగ + ఉప + అంగ-ప్రత్యేక-సముదాయ-శోభలు = ఎల్ల అవయవములయు, ఉపాంగములయు, వేర్వేఱు సొగసులు, ఉపలక్షించి, చూచి = బాగుగాఁజూచి, ప్రముదిత-హృదయులు = సంతోషించిన హృదయములు గలవారు, అగుచున్, ఇప్పరమేశ్వరి = (ఈ + పరమేశ్వరి) = ఈ పార్వతి, పరమేశ్వరు + అగ్ర-మహిషి = పరమేశ్వరునియొక్క పట్టపుదేవి, అగుడు = అగుట, ఏమి-అపూర్వంబు = ఏమి వింత, అని, నిశ్చయించి, పార్వతి-ముద్రా + ఆరోహణంబు + చేసి = పార్వతియొక్క, వివాహనిశ్చయ సూచకముగా సేలాలు శిరస్సుపై నుంచి (?), నగ-పతి చేతన = కొండలఱేనిచేత, సత్కృతులు + ఐ = సత్కరింపఁబడినవారయి, వీడ్కొని = సెలవుపుచ్చుకొని, చనుదెంచిరి = వచ్చిరి, అంతన్ = పిమ్మట, అంతకున్ + మున్ను + అ = అంతకుమునుపే, తద్ + వృత్తాంతంబు + ఎల్లన్ = ఆ వృత్తాంతమంతయు, ఎఱింగి, హరి-పరమేష్ఠి-పురందర-ప్రముఖ-సుర + అసుర + ఉరగ-సిద్ధ-విద్యాధర + ఆది + అఖిల-భువన-భవన + అధీశ్వరులు = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతలు, రాక్షసులు, నాగులు, సిద్ధులు, విద్యాధరులు మొదలగు నెల్ల లోకములనెడి భవనములకుఁ బ్రభువులు, ఈశ్వర + అచలంబునకున్ = శివుని కొండకు - కైలాసమునకు, అరిగి = వెడలి, తద్ + ఉన్నతిన్ = ఆ కొండయొక్క ఔన్నత్యమును, కని = చూచి, విస్మితులు = ఆశ్చర్యపడినవారు, అగుచున్

తాత్పర్యము . ఇట్లు వచ్చి తన తండ్రి తాత యను పీఠమును అలంకరించుచున్న పార్వతిని ఆ సప్తర్షులు చూచి ఆమె ఉత్తమస్త్రీలక్షణములుగల అంగముల, ఉపాంగముల శోభలను వేర్వేఱుగను, సామూహికముగను బాగుగాఁ జూచి, సంతోషించి, యీ పార్వతి పరమేశ్వరుని పట్టపుదేవి యగుట యేమి అబ్బురము? అని నిశ్చయించి ఆమె వివాహనిశ్చయసూచకముగా శిశిరఋతువైఁ బేలాలనుంచి హిమవంతునిచే సత్కరింపఁబడినవారయి సెలవుపుచ్చుకొని వచ్చిరి అంత నంతకుమునుపే యీ వృత్తాంత మంతయు నెటిఁగి విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతలు, రాక్షసులు, నాగులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగు నెల్ల లోకముల ప్రభువులును గైలాసమునకు వెడలి దాని యౌన్నత్యమును జూచి యాశ్చర్యపడుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . జనకు నూరుపీఠము - జనకునియొక్క + ఊరుపీఠము - 'షష్ఠీ సమాసంబునం దుకార బుకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమం బగు ' బాల సంధి 34 ఇట్లే పరమేశ్వరు + అగ్రమహిషి - పరమేశ్వరునియొక్క + అగ్రమహిషి బాల సంధి 34

క రాజాలంకృత, మర్క వి
రాజిత, మురు సింహ మిథున రమ్యము, ఘన వి
భ్రాజిత మను పురుడునగో
రాజతగిరి మింటితోడ రాయుచునుండున్ 143

అర్థము : ఇందుఁ గైలాసమునకు, ఆకాశమునకును శ్లేషమూలమునఁ బోలిక చెప్పఁబడినది రాజ + అలంకృతము = (కైలాస) యక్షులచే నలంకరింపఁబడినది (ఆకాశ) చంద్రునిచే నలంకరింపఁబడినది, అర్క-విరాజితము = (కైలాస) స్ఫటికముచే బ్రకాశించునది, (ఆకాశ) సూర్యునిచేఁ బ్రకాశించునది, ఉరు-సింహ-మిథున-రమ్యము = (కైలాస) గొప్పవియగు సింహదంపతులచే రమణీయమైనది, (ఆకాశ) గొప్ప సింహ, మిథునరాశులచే రమణీయమైనది, ఘన-విభ్రాజితము = (కైలాస) అభ్రకముచేఁ బ్రకాశించునది, (ఆకాశ) మేఘములచేఁ బ్రకాశించునది, అను = అనెడి, పురుడునగో = సామ్యముచేతనో, రాజత-గిరి = వెండికొండ - కైలాసము, మింటితోడన్ = ఆకాశముతో, రాయుచున్ + ఉండున్= పోటీపడుచుండును

తాత్పర్యము . ఆకాశము రాజాలంక్రతము (చంద్రునిచే నలంక్రతము) అర్క విరాజితము (సూర్యునిచే విరాజితము), సింహ మిధున రమ్యము (సింహ మిధున రాశులచే రమ్యము) ఘనవిభ్రాజితము (మేఘములచే విభ్రాజితము) అట్లే కైలాసమును, రాజాలంక్రతము (యక్షులచే నలంక్రతము), అర్కవిరాజితము (స్ఫటికముచే రచింక్రతము), సింహమిధురమ్యము (సింహదంష్ట్రులచే రమ్యము), ఘనవిభ్రాజితము (అభ్రకముచే విభ్రాజితము) ఈ సామ్యములచేఁ గాఁబోలును గైలాసము ఆకాశముతోఁ బోటీపడుచుండును

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష అది శ్లేషోత్ప్రాణితము

వ అనుచుం దదారోహణోద్యుక్తు లగుచుండి రంత 144

అర్థము . అనుచున్, తద్ + ఆరోహణ + ఉద్యుక్తులు = దాని నెక్కుట కుద్యమించినవారు, అగుచున్ + ఉండిరి, అంతన్

తాత్పర్యము . అనుచు సప్తర్షు లా కైలాసము నారోహింప నుద్యమించిరి అంత - తరువాతి పద్యముతో నన్వయము

చ **హరి గరుడుండు, బ్రహ్మ కలహంసము, నా ఖచరేంద్రులున్ గరం**
బురవడి నద్రిపై కెగురనోపక తత్పృథుపాదపంక్తిపై
నిరవుగ నిల్చి నిల్చి తుది కెయ్దిరి, ప్రోన్నతులైన వారి వి
స్తర వర పాదసేవ దగు సద్గతి కూఁతయ కాదె యెమ్మెయిన్ 145

అర్థము . హరి-గరుడుండున్ = విష్ణువాహనమైన గరుత్మంతుఁడును, బ్రహ్మ-కలహంసమున్ = బ్రహ్మ వాహనమైన రాజహంసమును, ఆ-ఖచర-ఇంద్రులున్ = ఆ గగనచర శ్రేష్ఠులును, కరంబు = మిక్కిలి, ఉరవడిన్ = వేగముతో, అద్రిపైన్ = కొండ (కైలాసము)పైకి, ఎగురన్ = ఎగురుటకు, ఓపక = చాలక, తద్ + పృథు-పాద-పంక్తిపైన్ = దాని (కైలాసము) యొక్క పెద్దదియగు ప్రత్యంత పర్వతపంక్తిపై - దాని గొప్ప అడుగులవరుసపై, ఇరవుగన్ = స్థానముగా, నిల్చి-నిల్చి, తుదికిన్ = చివరకు-ఎట్టకేలకు, ఎయ్దిరి = ఎగిరిరి, ప్రోన్నతులు (ప్ర+ఉన్నతులు) = మిక్కిలి గొప్పవారు - మిక్కిలి ఎత్తయినవారు, ఐన-వారి = అగువారియొక్క, నిస్తర-వర-పాదసేవ = అధికమైనది, మేలైనది అగు ప్రత్యంత

పర్వతములను సేవించుట - అధికమైనది, మేలయినది అగు చరణసేవ, తగు = ఒప్పునట్టి, సత్ + గతికిన్ = ఉత్తమ గతికి, ఉన్నత గమనమునకు, ఎమ్మెయిన్ = (ఏ+మెయిన్) = ఏ విధముగానైనను, ఊఁత+అ = ఆధారమే, కాదె = కాదా? - అగు ననుట

తాత్పర్యము . విష్ణుమూర్తి గరుత్మద్వాహనమును, బ్రహ్మ హంసవాహనమును, ఆ గగనచరులైన దేవతలును, మిక్కిలి వేగముతోఁగైలాసముపై కెగురఁజాలక, దాని పెద్దదియగు ప్రత్యంత పర్వత పంక్తిపై - గొప్ప అడుగులవరుసపై జోటుచేసికొని నిలిచి నిలిచి యెట్టకేల కెగిరిరి మిక్కిలి ఉన్నతులైన వారి మేలయిన ప్రత్యంత పర్వత సేవ - మేలయిన చరణసేవ తగునట్టి ఉత్తమ - ఉన్నతగతికి ఏవిధముగానైనను ఆధారమగునుగదా!

విశేషములు అలంకారము శ్లేషోత్ప్రాణితమైన అర్థాంతరన్యాసము ఎయ్దు - (రూపాం) ఎయిదు గరుడుండు - (పారాం) గరుడండు సద్గతి - సత్+గతి అనునాసికాంతస్థవర్ణములు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులుకాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును ఉరువడి (రూపాం) ఉరవడి తత్ప్రభు - తద్ + ప్రభు - అనునాసికాంతస్థ భిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కరినహల్లులు (ఖర్రులు) పరమగునపుడు వాని వర్గములందలి ప్రథమవర్ణములు (చర్రులు) ఆదేశముగా వచ్చును ప్రొన్నతులు - ప్ర + ఉన్నతులు - గుణసంధి

వ ఇ ట్లెట్టకేనియుఁ జని తదుపరితలంబున **146**

అర్థము. ఇట్లు, ఎట్టకేనియున్ = ఎట్టకేలకు, చని, తద్ + ఉపరితలంబునన్= దాని పయిభాగమున

తాత్పర్యము . ఇట్లు ఎట్టకేలకు వెడలి దాని పయిభాగమున - తరువాతి పద్యముతో నన్వయము

కైలాస పురవర్ణనము

సీ రసరసాయన సుధారస నిర్ఝరంబులై
క్రమ్మంగ నెలరారు కల్పతరులఁ
బరుసవేదులఁ బొంది హరికాంతశిఖిఁ గ్రాఁగి
కనకంబు లగు నయస్కాంతశిలలు

సురుచి రౌషధి తృణజ్యోతిః ప్రభాలీల
మాయించి వెలిఁగెడు మణిగణముల
బహుల చింతామణి ప్రాసాద వృత భూష
ణాంబర స్నాన పానాంగరాగ

తే మాలికాంగలతానందమందిరముల
మ్రానఁ బండులు సతులకు మరిగి యాడు
సిద్ధ విద్యాధరామర స్త్రీ సమూహ
భాసితం బగు కైలాసపర్వతంబు 147

అర్థము రస నిర్భరంబులై - రస = రుచిచేత, రసాయన = ఆనందపఱుచునట్టి, సుధా-రస = అమృతరసము యొక్క నిర్భరంబులు + ఐ = ఏఱులు గలవయి, క్రమ్మంగన్ = వ్యాపింపఁగా, ఎలరారు = సన్నగాలికిఁ గదలుచున్న, కల్ప-తరులన్ = కల్పవృక్షములను,

పరుసవేదులన్ = స్పర్శవేధులను (ఇనుమును బంగారముగాఁజేయు రసశిలావిశేషములను), పొంది = కూడి, హరికాంత-శిఖిన్ = సూర్యకాంతశిలలనెడి యగ్నియందు, క్రాఁగి = తపించి, కనకంబులు + అగు = బంగారములగు, అయస్కాంత-శిలలన్ = సూదంటురాళ్లను,

సురుచిర లీలన్ సురుచిర = మిక్కిలి ప్రకాశించు, ఓషధి = ఓషధియగు, తృణజ్యోతిన్ = తృణజ్యోతియనుదానియొక్క ప్రభా-లీలన్ = కాంతుల విలాసమును, మాయించి = నశింపఁజేసి, వెలిఁగెడు = ప్రకాశించు, మణి-గణములన్ = మణుల సమూహములను,

బహుల మందిరములన్ బహుల = అనేకములైన, చింతామణి= చింతామణులతోడి, ప్రాసాద = భవనములందు, వృత = ఎన్నుకొనఁబడిన, భూషణ = అలంకారములు, అంబర = వస్త్రములు, స్నాన = స్నానము, పాన = పానము, అంగరాగ = మైపూఁత, మాలికా = దండలు, అంగలతా = మైఁదీఁగలకు, ఆనంద = సంతోషమును గలిగించు, మందిరములన్ = భవనములను, మ్రానన్= చెట్టునందు, పండులున్ = పండ్లను, సతులకున్ = ప్రియురాండ్రకు, మరిగి = వలచి, ఆడు = క్రీడించునట్టి, సిద్ధ-విద్యాధర + అమర + స్త్రీ-విలాస-భాసితంబు=

సిద్ధులయు, విద్యాధరులయు, దేవతలయు, వారి యింతులయి విలాసములచేఁ బ్రకాశించునది, అగు, కైలాసపర్వతంబున్ = కైలాసపర్వతమును

తాత్పర్యము రుచిచే నానందపఱుచునట్టి యమృతరసప్రవాహములు గలిగి వ్యాపించి సన్నగాలికిఁ గదలు కల్పవృక్షములను, స్పర్శవేధులను గూడి సూర్యకాంతశిలలనెడి యగ్నియందుఁ గాలి బంగారములుగా మాఱు సూదంటుఱాలను, మిక్కిలి ప్రకాశించు తృణజ్యోతి యనునోషధికాంతుల నణఁచి వెలుఁగు మణిసమూహములను, పెక్కు చింతామణిమయభవనములందుఁ దమకువలయు నలంకారములు, వస్త్రములు స్నానపానములు, మైపూఁత, మాలికలు, మైఁదీఁగల కానందమును గలిగించు మందిరములును, వృక్షఫలములును దమ ప్రియురాండ్రకుఁ గోరి క్రీడించు సిద్ధవిద్యాధర దేవతలయుఁ దత్ప్రియలయు విలాసములచేఁ బ్రకాశించు కైలాసపర్వతమును - తరువాతి గద్యముతో నన్వయము

వ కని దాని రమణీయ విభూతి విశేషంబునకు మెచ్చి 148

అర్థము కని = చూచి, దాని = ఆ కైలాసపర్వతముయొక్క రమణీయ-విభూతి-విశేషంబునకున్ = సుందరమయిన వైభవాధిక్యమునకు, మెచ్చి

తాత్పర్యము . చూచి దాని సుందరమైన వైభవాధిక్యమునకు మెచ్చి తరువాతి పద్యముతో నన్వయము

క "శిరమున సర్వాత్ముండగు
పరమేశ్వరుఁ దాల్చి నిల్చి పాదములఁ జరా
చర ధాత్రిఁ దాల్చి పరఁగిన
హరగిరి పెం పేరికైన నలవియె పొగడన్?" 149

అర్థము: శిరమునన్ = శిరస్సునందు - శిఖరమునందు, సర్వాత్ముండు + అగు = అఖిలస్వరూపుఁడగు, పరమేశ్వరున్ = శివుని, తాల్చి = ధరించి, నిల్చి, పాదములన్ = పాదములందు, చర + అచర-ధాత్రిన్ = జంగమ స్థావరాత్మకమగుభూమిని తాల్చి, పరఁగిన = ఒప్పిన, హర-గిరి-పెంపు = కైలాసము మహత్త్వము, ఏరికిన్ + ఐనన్ = ఎవరికయినను, పొగడన్, అలవియె = శక్యమా? -- కాదనుట

తాత్పర్యము. 'శిరస్సునందు సర్వాత్మ్మఁడగు పరమేశ్వరునిఁ దాల్చి నిలిచి, పాదములందు జంగమస్థావరాత్మకమగు భూమిని దాల్చి యొప్పిన కైలాసము మహత్త్వమును బొగడ నెవరికిని శక్యముగాదు

వ అని మెచ్చి పిచ్చలించుచు 150

అర్థము అని, మెచ్చి, పిచ్చలించుచున్ = ఆనందించుచు

తాత్పర్యము అని మెచ్చి ఆనందించుచు - తరువాతి పద్యములో నన్వయము

సీ కనకహర్మ్యములతోఁ బెనఁగిన పవడంపు
భద్రంబులది వీరభద్రపురము
ముల్లోకముల సోడు ముట్టెడి నవ పుష్ప
దామంబులది పుష్పదంతపురము
చారుముక్తాఫల హారోపశోభిత
కూటంబులది భృంగిరీటి పురము
పద్మరాగోన్నత ప్రాసాద దీధితు
లెసఁగినయదియ చండీశపురము

తే వఱలు జాంబూనదాధిక వస్తు ఖచిత
సురభివనములయది గణేశ్వరు పురంబు
విమల రుచిఁ బొల్చు గోమేధికములఁ దనరు
గోపురంబులయది నందగోపురంబు 151

అర్థము. వీరభద్రపురము = వీరభద్రుఁ డనుగణాధీశుని పురము, కనక-హర్మ్యములతోన్ = బంగరు మేడలతో, పెనఁగిన = కూడిన, పవడంపు-భద్రంబులది = పగడముల శుభములు గలది

పుష్పదంత-పురము = పుష్పదంతుఁడను ప్రమథుని పురము, ముల్లోకముల= (మూఁడు లోకముల) = ముల్లోకములయొక్క, సోడుముట్టెడి = బ్రహ్మరంధ్రమును స్పృశించునట్టి, నవ-పుష్పదామంబులది = క్రొంబూలమాలలు గలది

భృంగిరీటి-పురము = భృంగిరిటుని పురము, చారు-ముక్తాఫల-హార + ఉపశోభిత-కూటంబులది = మనోహరమైన ముత్యాల దండలచే శోభిల్లు శిఖరములుగలది

చండీశ-పురము = చండీశ్వరుఁ డనువాని పురము, పద్మరాగ + ఉన్నత-ప్రాసాద-దీధితులు = పద్మరాగమణిమయమైన, ఎత్తయిన, మేడల కాంతులు, ఎసఁగిన + అది + అ = ఒప్పునట్టిదే

గణేశ్వరు-పురంబు = గణేశ్వరుని పురము, వటులు = ఒప్పునట్టి, జాంబూనద + అధిక-వస్తు-ఖచిత-సురభి-వనముల + అది = బంగారపు పెక్కు-వస్తువులతోఁ బొదుగఁబడినదయి, పరిమళించునుద్యానములు గలది

నంద-గోపురంబు = నందుఁ డనువాని గోపురము, విమల-రుచిన్ = నిర్మలమయిన కాంతితో, పొల్చు = ప్రకాశించు, గోమేధికములన్ = గోమేధికరత్నములతో, తనరు = ఒప్పు, గోపురంబుల + అది = పురద్వారములు గలది

తాత్పర్యము వీరభద్రుని పురము బంగరు మేడలతోఁ గూడిన పగడముల శుభములు గలది పుష్పదంతుఁ డనువాని పురము ముల్లోకముల బ్రహ్మరంధ్రములను స్పృశించు క్రొంబూలమాలలు గలది భృంగిరిటి పురము మనోహరములైన ముత్యాల పేరులచే నొప్పు శిఖరములు గలది చండీశ్వరుని పురము పద్మరాగమణిమయములై ఉన్నతములయిన మేడల కాంతులతిశయించునది గణేశ్వరుని పురము బంగరు వస్తువులచేఁ బొదుగఁబడినదయి పరిమళించునుద్యానములు గలది నందగోపురము నిర్మలకాంతితోఁ బ్రకాశించు గోమేధికరత్నములతో నొప్పు పురద్వారములు గలది

విశేషములు. భద్రంబులది - భద్రంబుల + అది 'అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు' బాల సంధి 45 ఇట్లే ధామంబులది, కూటంబులది, ఎసఁగినయది, గోపురంబులయది - ఈ రెండును అల్లోపము రాని రూపములు

వ అనుచు నెడనెడ ననేక గణాధీశపురవరాతివిభూతి విశేష రమణీయంబులఁ గని విస్మితు లగుచు 152

అర్థము . అనుచున్, ఎడనెడన్ = అచ్చట నచ్చట, అనేక-గణ + అధీశ-పుర-వర + అతి-విభూతి-విశేష-రమణీయంబులన్ = పెక్కండ్రు గణనాయకుల పురశ్రేష్ఠముల అధికవైభవాతిశయముచే రమ్యము లయినవి, కని, విస్మితులు = ఆశ్చర్యపడినవారు, అగుచున్

తాత్పర్యము . అనుచు అచ్చటచ్చటఁ బెక్కండ్రు ప్రమథనాయకుల పురశ్రేష్ఠముల అధికవైభవాతిశయ రామణీయకములను జూచి అచ్చెరువందుచు - తరువాతి పద్యముతో నన్వయము

మందాక్రాంత "ఫాలాభీలాంబకు నురుజటాబంధనాపీడ్యమాన
వ్యాళాధీశానన విగళితోచ్ఛ్వాస నిర్ధూత గంగా
స్థూలోర్మి శీకర సమితి పైఁ దూలి శోభిల్లుఁ జూడన్
గైలాసోర్వీధరపతికిని ముక్తాఫలచ్ఛత్రలీలన్" 153

అర్థము . ఫాల + ఆభీల + అంబకు = నుదుట భయంకరమైన కన్నుగలవాని (శివుని) యొక్క, ఉరు సమితి ఉరు = పెద్దదియైన, జటా = జడలయొక్క, బంధన = కట్టుటచేత - జడలనుగట్టుటచేత ననుట, ఆపీడ్యమాన= బాధింపఁబడుచున్న, వ్యాళ + అధీశ = పాఁపఱేని (శేషుని) యొక్క, ఆనన = ముఖమునుండి, విగళిత = జాఱిన - వెలువడిన, ఉచ్ఛ్వాస = ఊర్పులచే, నిర్ధూత= ఎగురఁగొట్టఁబడిన, గంగా - గంగానదియొక్క, స్థూల = పెద్దవియైన, ఊర్మి = అలలయొక్క, శీకర = తుంపరలయొక్క, సమితిపైన్ = సమూహము మీఁద, తూలి = చలించి, పడి, చూడన్ = చూడఁగా, కైలాస + ఉర్వీధర-పతికిని = కైలాస పర్వతరాజునకు, ముక్తాఫల + ఛత్ర-లీలన్ = ముత్యాల గొడుగువిధమున, శోభిల్లున్ = ప్రకాశించును

తాత్పర్యము . ఫాలాక్షుని జడముడిని బంధించుటచేఁ బీడింపఁబడుచున్న పాఁపఱేని ముఖమునుండి వినిర్గతములగు నూర్పులచే నెగురఁగొట్టఁబడు గంగానది పెనుగరళ్ల తుంపరలగుంపుపైఁ జలించి కైలాసపర్వతరాజునకుఁ బట్టిన ముత్యాల గొడుగువలె శోభిల్లును

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష - అది అతిశయోక్త్యుత్ప్రాణితము కైలాసము ఉర్వీధరపతి గావుననే వానికి ముత్యాలగొడుగుండును శీకరసమితి

వెల్లనై ముక్తాఫలచ్ఛత్రమువలెనే యుండును శివునకుఁ బెద్ద కపర్దము గలదు ఆయన భుజగభూషణుఁడు గావున ఆ కపర్దమును బాఁపలెనిచే బంధించును దానివలన భుజగరాజునకు బాధ గలిగి పుచ్చు నిట్టూర్పులచే శివుని శిరస్సుపైనే ఉన్న గంగానదిలోఁ బెనుదరఁగ లేర్పడి వానినుండి తుంపరలగుంపు గలిగి కైలాసముపైఁ జుట్టును వ్యాపించి ఆ నగచక్రవర్తికిఁ బట్టిన ముత్యాలవెల్లగొడుగో యన నొప్పును అంబకము - (నానా) కన్ను, బాణము ముక్తాఫలచ్ఛత్ర - ముక్తాఫల + ఛత్ర - హ్రస్వమునకుఁ బరమైన ఛ కారము ద్విరుక్త మగును మందాక్రాంత - నాలుగు పాదము లుండును ప్రతిపాదమునను మ, భ, న, త, త, గగ లను గణము లుండును మొదటి యక్షరమునకును బదునొకండవ యక్షరమునకును యతిమైత్రి, ప్రాస నియమము గలదు

వ అని వర్ణించుచుం జనిచని ముందట ననతిదూరంబున 154

అర్థము. అని, వర్ణించుచున్, చని-చని = పోయి పోయి, ముందటన్ = ఎదుట, అనతిదూరంబునన్ = కొలఁది దవ్వున

తాత్పర్యము అని విష్ణుబ్రహ్మాదులు వర్ణించుచుఁ బోయిపోయి యెదుట నించుక దవ్వున - తరువాతి పద్యముతో నన్వయము

సీ మెలుఁగులఁ గన్నులు మిఱుమిట్లుపోయెడు
నమల చింతామణి హర్మ్యములను
దలతల వెలిఁగెడుతరలప్రభా స్పర్శ
వేది కుట్టిమతల వీధికలను
దేదీప్యమానమై తేజరిల్లెడు సిద్ధ
ఘటికాది నవ వప్రగోపురముల
భాభాసితానూన పరమౌషధీలతా
చారుతరానేక తోరణములఁ

తే జిత్రవర్ణాతిశయ రత్నచిత్రితాంగ
రంగవల్లీ బహు సురంగాంగణములఁ
గలిగి విశ్వంబునకుఁ దన వెలుఁగు వెలుఁగు
సేయుఁ దేజోమయం బగు శివు పురంబు 155

అర్థము. మెఱుఁగులన్ = కాంతులచే, కన్నులు, మిఱుమిట్లు + పోయెడు = మిఱుమిట్లుగొలుపునట్టి, అమల-చింతామణి-హర్మ్యములను = నిర్మలమైన చింతామణిమయములైన మేడలను,

తలతల = తళతళమని, వెలిఁగెడు = మెఱయునట్టి, తరల-ప్రభా-స్పర్శవేది-కుట్టిమతల-వీధికలను = చంచలమైన కాంతులుగల పరుసవేదితో నిర్మితమైన నెలకట్టులుగల వీధులను,

దేదీప్యమానము + ఐ = మిక్కిలి ప్రకాశించుచున్నదయి, తేజరిలిల్లెడు = ప్రకాశించు, సిద్ధ-ఘటికా + ఆది-నవ-వప్ర-గోపురములన్ = సిద్ధఘటికలు మున్నగు క్రొత్త ప్రాకారములను, గోపురములను భా-భాసిత + అనూన తోరణములన్ భా = కాంతులచే, భాసిత = ప్రకాశించిన, అనూన = అధికమైన, పరమ + ఓషధీ-లతా = మహౌషధుల లతలనెడి, చారుతర = మిక్కిలి మనోహరమైన, అనేక = పెక్కు తోరణములన్, చిత్రవర్ణా సు రంగాంగణములన్ చిత్రవర్ణ = చిత్రములైన రంగులయొక్క, అతిశయ = ఆధిక్యముగల, రత్న = మణులచే, చిత్రిత + అంగ = చిత్రింపఁబడిన భాగములు గల, రంగవల్లీ = మ్రుగ్గులుగల, బహు = పెక్కు, సు-రంగ + అంగణములన్ = మేలయిన రంగముల ముంగిళ్లను,

కలిగి, తేజోమయంబు + అగు = తేజస్సుతో నిండినదయిన, శివు-పురంబు = శివునిపురము, విశ్వంబునకున్, తన-వెలుఁగు = తనకాంతి, వెలుఁగు + చేయున్ = వెలుఁగు నిచ్చును

తాత్పర్యము : కాంతులచేఁ గన్నులు మిఱుమిట్లు గొలుపు నిర్మలములైన చింతామణి నిర్మితములగు మేడలను, తళతళమని మెఱయు కాంతులుగల స్పర్శవేదితోఁ గట్టఁబడిన నెలకట్లు గల వీధులను, దేదీప్యమానముగాఁ బ్రకాశించు సిద్ధఘటికలు మున్నగునవిగల క్రొత్తప్రాకారములను గోపురములను, కాంతులచేఁ బ్రకాశించు పెక్కు మహౌషధుల లతలనెడి మనోహరములైన అసంఖ్యాకములైన తోరణములను, చిత్రవర్ణములచే నతిశయించు క్రొత్త మణులచేఁ జిత్రింపఁబడిన రంగవల్లులుగల రంగస్థలముల ప్రాంగణములను గలిగి తేజోమయమైన శివుని పురము విశ్వమునకుఁ దనవెలుఁగు నొసఁగును

విశేషములు . మిటుమిట్లు - మిట్లు+మిట్లు - 'అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు' బాల సంధి 42 'చిత్రవర్ణాతిశయ నూత్నరత్న చిత్రి - తాంగ రంగవల్లీ సురంగాంగణములఁ' - అను పారమున మొదటి పాదమున యతిభంగమయినది అందుచే మా రా ప్రతిలోని పయిపారము స్వీకరింపఁబడినది

క కని వనజాసన హరి సుర
ప నిలింపాసురవరాహిపతు లతి మోదం
బున వచ్చి మెచ్చి తత్పురి
వినుతించుచుఁ జనిరి పురము వీధిం దఱియన్ 156

అర్థము: కని = చూచి, వనజ + ఆసన-హరి-సురప-నిలింప + అసురవర+ అహిపతులు = బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుఁడు, దేవతలు, రాక్షసశ్రేష్ఠులు, భుజగరాజయిన వాసుకి, అతి-మోదంబునన్ = మిక్కిలి సంతోషముతో, వచ్చి, మెచ్చి, తద్ + పురిన్ = ఆ పురమును, వినుతించుచున్ = పొగడుచు, పురము-వీధిన్ = పురవీధిని, తఱియన్ = సమీపింపఁగా, చనిరి

తాత్పర్యము : బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుఁడు, దేవతలు, రాక్షసశ్రేష్ఠులు, వాసుకి చూచి మిక్కిలి సంతోషముతో వచ్చి మెచ్చి యా శివునిపురమును బొగడుచుఁ బురవీధిని సమీపింపనేఁగిరి

వ ఇట్లు రమణీయంబగు రాజమార్గంబు గడచి సదాశివ ద్వారంబుఁ దూరి మహాద్వారంబునకుంజని తద్ద్వారపాలక నివారితులై నిలిచి తదనంతరంబ పరమేశ్వరు నవసరంబు వడసి నందిమహాకాళానుజ్ఞాతులై సభామందిరంబున కరిగి తన్మధ్య మణివేదికాతలంబున ధర్మాద్యష్టదలాంబుజైశ్వర్యవరిశోభితోత్తుంగ సింహాసనాసీనుండై నిఖిల గణ పరివృతుండై తమకుం బ్రత్యక్షంబై యున్న త్రిలోచనుం గని సర్వాంగీణ ప్రణామ జయజీవస్తుతిశతంబులం గరకమలకుట్మల పుట ఘటిత నిటలతట విలసితు లగుచున్నం దత్సురవరులం గని వరదుండు కరుణారసార్ద్రహృదయుండై 157

అర్థము . ఇట్లు, రమణీయంబు + అగు = సుందరమైన, రాజమార్గంబు = రాజవీధి, కడచి = దాఁటి, సదాశివ-ద్వారంబున్, తూరి = ప్రవేశించి,

మహాద్వారంబునకున్, చని, తద్ + ద్వార-పాలక-నివారితులు + ఐ = ఆ దౌవారికులచే నడ్డగింపఁబడిన వారయి, నిలిచి, తద్ + అనంతరంబు + అ = ఆ వెంటనే, పరమేశ్వరు + అవసరంబు = శివుని యనుమతి, పడసి = పొంది, నంది-మహాకాళ + అనుజ్ఞాతులు + ఐ = నంది, మహాకాళుఁడు అనువారిచే ననుమతింపఁబడినవారయి, సభా-మందిరంబునకున్ = కొలువుకూటమునకు, అరిగి = వెడలి, తద్ + మధ్య-మణి-వేదికా-తలంబునన్ = దాని నడిమి మణిమయమైన లఁగునందు, ధర్మ + ఆది + అష్టదల + అంబుజ + ఐశ్వర్య - పరిశోభిత - ఉత్తుంగ -సింహాసన + ఆసీనుండు + ఐ = ధర్మము మున్నగు ఎనిమిది కేకుల పద్మసంపదచేఁ బ్రకాశించిన మిక్కిలి ఎత్తయిన, సింహాసనమునందుఁ గూరుచున్నవాఁడయి నిఖిల-గణ-పరివృతుండు + ఐ = ఎల్ల ప్రమథగణములచేఁ జుట్టఁబడినవాఁడయి తమకున్, ప్రత్యక్షంబు + ఐ, ఉన్న, త్రిలోచనున్ = ముక్కంటిని - శివుని, కని, సర్వాంగీణ-ప్రణామ-జయజీవ-స్తుతి-శతంబులన్ = సాష్టాంగ నమస్కారములు, జయింపుము, జీవింపుము అను నూర్లకొలఁది స్తోత్రములచే, కర-కమల-కుట్మల-పుట-ఘటిత-నిటల-తట-విలసితులు = తామరమొగ్గలవంటి చేదొప్పలచేఁ గూర్పఁబడిన నుదురులచే ప్రకాశించినవారు, అగుచున్ + ఉన్నన్ = అగుచుండఁగా, తద్ + సుర-వరులన్ = ఆ దేవతాశ్రేష్ఠులను, కని, వరదుండు = వరముల నిచ్చువాఁడు - శివుఁడు, కరుణా-రస + ఆర్ద్ర-హృదయుండు + ఐ = దయారసముచేఁ దడిసిన హృదయము గలవాఁడయి

తాత్పర్యము . ఇట్లు అందమైన రాజవీధిని దాఁటి సదాశివద్వారమును ప్రవేశించి, మహాద్వారమునకు వెడలి యచ్చటి ద్వారపాలకులచే వారింపఁబడినవారయి నిలిచి ఫాలతలముల నంజలిపుటములు ఘటింప నా దేవతాశ్రేష్ఠులను జూచి శివుఁడు దయారసార్ద్ర హృదయుఁడై - తరువాతి పద్యముతో నన్వయము

సీ దశన సౌదామినుల్ దనర మో మలరించి
నీరజోదరుఁ దన్నుఁ జేరఁబిలిచె,
వచనామృతౌఘప్రవాహాభిషిక్తుఁగాఁ
జేయుచుఁ బరమేష్ఠి దాయఁ బిలిచెఁ

గరతలారుణదీప్తి కరరుహద్యుతులలో
సంధిల్ల నింద్రుఁ జేసన్న నునిచె
దృఙ్మరీచులు పర్వ ది గధీశ్వరుల నోలి
మన్నించి కన్నులసన్న నునిచె

తే నంత నందిమహాకాళు లఖిల సిద్ధ
సాధ్య దేవాసురేంద్రాది జనుల నెల్ల
వరుస నునిచిరి శివుఁడు దేవతల కెల్లఁ
గరుణఁ గొలువిచ్చి పేరోలగమున నుండె 158

అర్థము · శివుఁడు కర్త

దశన-సౌదామినుల్ = దంతముల మెఱపులు, తనరన్ = ఒప్పఁగా, మోము = ముఖము, అలరించి, = వికసింపఁజేసి, నీరజ + ఉదరున్ = పద్మము ఉదరమందుఁ గలవానిని - విష్ణువును, తన్నున్ + చేరన్ + పిలిచెన్ = తన దగ్గఱకు రమ్మనెను

వచన + అమృత + ఓఘ-ప్రవాహ + అభిషిక్తున్ + కాన్ = మాటలనెడి అమృతప్రవాహముచే నభిషేకింపఁబడినవానినిగా, చేయుచున్, పరమేష్ఠిన్ = బ్రహ్మను, దాయన్ + పిలిచెన్ = దగ్గఱకుఁ బిలిచెను

కరతల + అరుణ-దీప్తి-కరరుహ-ద్యుతులలోన్ = అరచేతులయొక్క ఎఱ్ఱనికాంతి, గోరుల కాంతులలో, సంధిల్లన్ = కూడఁగా, ఇంద్రున్, చే-సన్నన్ = చేతిసంజ్ఞచే, ఉనిచెన్ = ఉంచెను

దృఙ్మరీచులు (దృశ్ (క్) + మరీచులు = కన్నుల కాంతులు, పర్వన్ = వ్యాపింపఁగా, దిశ్ (క్) + అధి + ఈశ్వరులన్ = దిక్పాలకులను, ఓలిన్ = వరుసగా, మన్నించి = ఆదరించి, కన్నుల-సన్నన్ = కంటిసంజ్ఞచే, ఉనిచెన్

అంతన్, నంది-మహాకాళులు = నంది, మహాకాళుఁడు అనువారు, అఖిల-సిద్ధ-సాధ్య-దేవ + అసుర + ఇంద్ర + ఆది - జనులన్ + ఎల్లన్ = ఎల్ల సిద్ధులు, సాధ్యులు, దేవతలు, రాక్షసశ్రేష్ఠులు మున్నగువారినందఱను, వరుసన్, ఉనిచిరి

శివుఁడు, దేవతలకున్ + ఎల్లన్, కరుణన్ = దయతో, కొలువు + ఇచ్చి, పేరు + ఓలగమునన్ = నిండు సభయందు, ఉండెన్

తాత్పర్యము . శివుఁడు దంతముల మెలపు లొప్పఁగా ముఖమును వికసింపఁజేసి విష్ణువును దగ్గఱకుఁ బిలిచెను మాటలనెడి అమృతప్రవాహమునం దభిషేకించి బ్రహ్మను జేరువకుఁ బిలిచెను అరచేతుల కాంతి గోరులకాంతులలోఁ గూడఁగా నింద్రునిఁ జేసన్నచే నుంచెను కన్నుల కాంతులు వ్యాపింప దిక్పతులను గ్రమముగా మన్నించి కుసంజ్ఞచే నుంచెను అంత నందియును, మహాకాళుఁడును సిద్ధ సాధ్య దేవాసురశ్రేష్ఠులనెల్ల వరుసగా నుంచిరి శివుఁడు దేవతల కందఱకును దయతోఁ గొలువిచ్చి తాను నిండుసభను దీర్చెను

విశేషములు దశన సౌదామినులు - దశనములనెడి సౌదామినులు - రూపకము వచనామృత - వచనమనెడి అమృత - రూపకము దృశ్(క్) + మరీచులు - దృజ్మరీచులు - దృగ్మరీచులు - అనునాసికసంధి దిగధీశ్వరులు - దిశ్(క్) + అధి + ఈశ్వరులు ఝల్లునకు అచ్చు పరముగాఁ దృతీయవర్ణాదేశము- సవర్ణదీర్ఘసంధి సన్న (వికృతి) - సంజ్ఞ (ప్రకృతి) పేరోలగము - పేరు + ఓలగము- 'కర్మధారయంబునందుఁ బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు' - బాల సంధి 29 టుగాగమ మగుచో - పేరుటోలగము

అశ్వాసాంతము

మ అరిషడ్వర్గజయుండు, తత్త్వవిదుఁ డాత్మారాముఁ డజ్ఞానసిం
ధురకుంభాగ్రవిదారణోగ్రనఖవద్దోర్దర్పవిఖ్యాత కే
సరి, దుర్వార గభీర ఘోరతర సంసారోర్వకూపార సం
తరణాత్యున్నతసేతుకల్పుఁ డఖిలాధారుండు ధీరుం డెదన్ 159

అర్థము. ఇది కృతి భర్తృవర్ణనము కృతిభర్తయగు జంగమ మల్లికార్జునుఁడు- అరి-షట్ + వర్గ-జయుండు = ఆర్వురు శత్రువుల సమూహమును జయించువాఁడు, తత్త్వ-విదుఁడు = తత్త్వవేత్త, ఆత్మారాముఁడు = ఆత్మయందే రమించుచు దానియందే తృప్తుఁడై యుండువాఁడు - యోగి, అజ్ఞాన కేసరి అజ్ఞాన = అజ్ఞానమనెడి, సింధుర = ఏనుఁగుయొక్క, కుంభ = కుంభస్థలముయొక్క, అగ్ర = కొనయొక్క, విదారణ = చీల్చుటచే, ఉగ్ర = భయంకరములయిన, నఖవత్ = గోరులుగల, దోస్ (దోఃs)+ దర్ప = భుజగర్వముచే, విఖ్యాత = ప్రసిద్ధమైన, కేసరి = సింహమయినవాఁడు, దుర్వార కల్పుఁడు, దుర్వార = అడ్డగింపరాని, గభీర = లోఁతయిన, ఘోర-తర = మిక్కిలి భయంకరమైన, సంసార =

సంసారమనెడి, ఉరు = గొప్పదియగు, అకూపార = సముద్రమునొక్క, సంతరణ = దాటుటకైన, అతి + ఉన్నత = మిక్కిలి ఎత్తయిన - ఎక్కిలి గొప్పదియగు, సేతు - కల్పుఁడు = వంతెనతో సమానమయినవాఁడు, అఖిల + ఆధారుండు = అన్నింటికి ఆధారమయినవాఁడు ఎదన్ = హృదయమునందు, ధీరుండు = ధైర్యముగలవాఁడు

తాత్పర్యము కృతిభర్త యగు జంగమ మల్లికార్జునుఁడు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యము లనెడి అంతశ్శత్రువుల నార్చువరకు జయించినవాఁడు, తత్త్వవేత్త, ఆత్మారాముఁడు, అజ్ఞాన మనెడి యేనుఁగు కుంభస్థలాగ్రమును జీల్చుగల గోరులతో నొప్పు భుజగర్వముచేఁ బ్రసిద్ధమైన సింహ మయినవాఁడు, వారింపరానిది, లోఁతయినది, భయంకరమయినది అగు సంసారమనెడి మహాసముద్రమును దాటుటకైన మిక్కిలి గొప్ప వంతెనతో సమానమయినవాఁడు అన్నిటికి నాధార మయినవాఁడు ధైర్యవంతుఁడు

విశేషములు అజ్ఞాన సింధుర కేసరి - రూపకాలంకారము సంసారోర్వకూపార సేతు కల్పుఁడు - రూపకాలంకారము సంసారోర్వకూపార - సంసార + ఉరు = సంసారోరు - గుణసంధి సంసారోరు + అకూపార = సంసారోర్వకూపార - యణాదేశసంధి సంతరణాత్యున్నత - సంతరణ + అతి - సంతరణాతి - సవర్ణదీర్ఘసంధి సంతరణాతి + ఉన్నత - సంతరణాత్యున్నత - యణాదేశసంధి

క **సకల జన వినుత గుణగణ**
నికర మణి ప్రచుర రుచిర నిర్మల భూషా
ప్రకరాకల్పుఁ డనల్పుఁడు
సుకవిజనప్రణుత శివ యశోనిధి పేర్మిన్ **160**

అర్థము. సకల జన ప్రకరాకల్పుఁడు సకల-జన = ఎల్లజనులచేత, వినుత = పొగడఁబడిన, గుణ = మంచిగుణములయొక్క గణ = సమూహములయొక్క, నికర = ప్రోవులనెడి, మణి = మణులతో, ప్రచుర = అధికమైన, రుచిర = మనోహరమైన, నిర్మల = స్వచ్ఛమైన, భూషా = భూషణముల యొక్క, ప్రకర = సమూహము, ఆకల్పుఁడు = అలంకారముగాఁ గలవాఁడు,

అనల్పుఁడు = తక్కువ కానివాఁడు, పేర్మిన్ = గొప్పతనముతో, సుకవి --- నిధి సుకవి - జన=సత్కవుల చేత, ప్రణుత = ప్రశంసింపఁబడిన, శివ - యశన్ (.) - నిధి = శుభకరమైన కీర్తికి నిధి

తాత్పర్యము . కృతిపతి యగు జంగమ మలికార్జునుఁడు ఎల్లజనులు పొగడు సద్గుణ సమూహములనెడి మణులతో నిండిన నిర్మలభూషణములచే నలంకరింపఁ బడువాఁడు, గొప్పవాఁడు, సత్కవులచేఁ బొగడఁబడు మంగళకరయశస్సునకు నిధానమైన వాఁడు

మ పరమానందుఁ, డనిందితాచరణుఁ, డభ్రాంతుండు, శాంతుండు దు
ర్ధర సంసార సుఖోరు భూరితర కాంతారాంతరోద్భూత సం
కర కర్మేంద్రియ దుష్టసత్త్వభవ సంగత్యక్త సువ్యక్త భా
సుర బోధాత్మకుఁ డాత్మతత్త్వగతి సంశుద్ధుండు సిద్ధుం డిలన్ 161

అర్థము. పరమ + ఆనందుఁడు = గొప్ప ఆనందము గలవాఁడు, అనిందిత + ఆచరణుఁడు = సత్కర్మాచరణము గలవాఁడు, అభ్రాంతుండు = భ్రాంతుఁడు గానివాఁడు - నిశ్చయజ్ఞానము గలవాఁడు, శాంతుండు = శమగుణ సంపన్నుఁడు, సంసారసుఖ = సంసారసౌఖ్యమనెడి, ఉరు = గొప్పదియు, భూరితర = మిక్కిలి పెద్దదియు, అగు, కాంతార + అంతర = అడవిలో, ఉద్భూత = పుట్టిన, సంకర - కర్మ + ఇంద్రియ = కూడిన కర్మేంద్రియములనెడి, దుష్ట-సత్త్వ = క్రూరజంతువులనుండి, భవ = పుట్టిన, సంగ = కలయికచే, త్యక్త = విడువఁబడిన, సువ్యక్త = మిక్కిలి స్పష్టమైన, భాసుర = ప్రకాశవంతమైన, బోధ + ఆత్మకుఁడు = జ్ఞానము గలవాఁడు, ఆత్మ-తత్త్వ - గతి - సంశుద్ధుండు = ఆత్మ తత్త్వముయొక్క విధముచే మిక్కిలి పవిత్రమైనవాఁడు, ఇలన్ = భూమియందు, సిద్ధుండు = దేవుఁడు,

తాత్పర్యము . కృతిభర్తయగు జంగమ మల్లికార్జునుఁడు, పరమమైన ఆనందము గలవాఁడు, సత్కర్మాచరణుఁడు, నిశ్చయజ్ఞానసంపన్నుఁడు, శమగుణము గలవాఁడు, దుర్భరమైన సంసారసౌఖ్యములనెడి గొప్పయడవిలోఁ బుట్టిన కర్మేంద్రియములనెడి దుష్టమృగసంగముచే విడువఁబడిన జ్ఞానము గలవాఁడు, ఆత్మతత్త్వజ్ఞానముచేఁ బవిత్రమైనవాఁడు, భూలోకసిద్ధుఁడు

క అబ్ధిగభీరుఁడు, సద్గుణ
లుబ్ధుఁడు, భూలోకఫాలలోచనుఁ డఖిలా
రబ్ధ విముక్తుఁడు, బోధా
లబ్ధుఁడు, మునిముఖ్య ముఖలలాముఁడు ధాత్రిన్ 162

అర్థము అబ్ధి - గభీరుఁడు = సముద్రము వలె లోఁతయిన వాఁడు, సత్ + గుణ = లుబ్ధుఁడు = మంచి గుణములందు, లోభముగలవాఁడు, భూలోక - ఫాలలోచనుఁడు = భూలోకమునందలి శివుఁడు, అఖిల + ఆరబ్ధ - విముక్తుఁడు = ఎల్ల ఆరంభములనుండి విడుమర గలవాఁడు, బోధ + ఆలబ్ధుఁడు = జ్ఞానమును బొందినవాఁడు, ధాత్రిన్ = భూమియందు, ముని - ముఖ్య - ముఖ - లలాముఁడు = మునిశ్రేష్ఠుల ముఖములకుఁ దిలకమైనవాఁడు -మునిశ్రేష్ఠుఁడు

తాత్పర్యము. జంగమ మల్లికార్జునుఁడు సముద్రము వలె లోఁతయినవాఁడు, మంచి గుణములందు లోభముగలవాఁడు, భూలోక శివుఁడు, ఎల్ల ఆరంభములను విడిచినవాఁడు, జ్ఞానసంపన్నుఁడు, మునిశ్రేష్ఠుఁడు

వనమయూరము భూసురకులాగ్రణి, ప్రబుద్ధుఁడు, ప్రసిద్ధుం
డాసకలలోకవినుతాత్ముఁడు, మహాత్ముం
డాసురభవోత్తరణుఁ, డాద్యుఁ, డవిభేద్యుం,
డాసురగురుండు మతియందు నుతుఁ డెందున్ 163

అర్థము . భూసుర - కుల + అగ్రణి = బ్రాహ్మణ వంశశ్రేష్ఠుఁడు, ప్రబుద్ధుఁడు = గొప్పజ్ఞాని, ప్రసిద్ధుండు, ఆ - సకల - లోక - వినుత + ఆత్ముఁడు = ఎల్లలోకములచేఁ బొగడఁబడువాఁడు, మహాత్ముండు = మిక్కిలి గొప్పవాఁడు, ఆసుర - భవ + ఉత్తరణుఁడు = అసుర సంబంధమైన సంసారమును దాఁటినవాఁడు, ఆద్యుఁడు = మొదటివాఁడు, అవిభేద్యుండు = భేదింపరానివాఁడు, మతి + అందున్ = బుద్ధియందు, ఆ - సుర - గురుండు = దేవతల గురువైన ఆ బృహస్పతి, ఎందున్ = ఏవిషయమునను, నుతుఁడు = పొగడఁబడువాఁడు

తాత్పర్యము : శ్రీ జంగమ మల్లికార్జునుఁడు బ్రాహ్మణశ్రేష్ఠుఁడు గొప్ప జ్ఞాని ప్రసిద్ధుఁడు, సర్వలోకనుతుఁడు మహాత్ముఁడు ఆసురమైన సంసారమును దాఁటినవాఁడు ఆద్యుఁడు భేదింపరానివాఁడు మతియందు బృహస్పతి ఎందును బొగడఁబడువాఁడు

విశేషములు. ఛందస్సు వనయమూరము లక్షణమునకు నీ యాశ్వాసము నందలి ఎనిమిదవ పద్యము లక్షణమును జూచునది

గద్యము.

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్యశ్రీపాదపంకజ
భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవ
ప్రణీతంబైన కుమారసంభవంబను కథయందు సప్తమాశ్వాసము
సమాప్తము
దీనికి వ్యాఖ్య పూర్వాశ్వాసాంతగద్యములకు వలెనే

మ ఇది శ్రీ జొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధ స్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్ను విలసత్ సంజీవనీవ్యాఖ్యయౌ

కుమార సంభవము

అష్టమాశ్వాసము

క శ్రీ మహిళా మహనీయో
ద్దామోరస్స్థలుఁడుఁ, గీర్తితశ్లోకుఁడుఁ, దే
జోమయుఁడుఁ, బుణ్యధనుఁడు, మ
హామునిముఖ్యుండు మల్లికార్జునుఁ డెలమిన్ 1

అర్థము. శ్రీ స్థలుఁడున్ శ్రీ = మహిళా = లక్ష్మియను స్త్రీ చేత, మహనీయ = గొప్పదియు, ఉద్దామ = అధికమయినదియు, అగు, ఉరస్+స్థలుఁడున్= వక్షస్థలము గలవాఁడును, కీర్తిత - శ్లోకుఁడున్ - స్తుతింపఁబడిన యశస్సు గలవాఁడును, తేజోమయుఁడున్ = తేజస్సు నిండినవాఁడును, పుణ్య-ధనుఁడున్= పుణ్యమనెడి ధనము గలవాఁడును, మహత్ (మహా) - ముని - ముఖ్యుండున్ = గొప్ప మునులలో శ్రేష్ఠుఁడును, అగు, మల్లికార్జునుఁడు, ఎలమిన్ = సంతోషముతో

తాత్పర్యము. లక్ష్మియను స్త్రీ చేత గొప్పది యగు వక్షస్థలము గలవాఁడును, స్తుతింపఁబడిన కీర్తిగలవాఁడును, తేజస్సుతో నిండినవాఁడును, పుణ్యమనెడి ధనము గలవాఁడును, మహాముని శ్రేష్ఠుఁడును అగు మల్లికార్జునుఁడు సంతోషముతో

విశేషములు. గీర్తిత, దేజో అనువానిలోని ఆదేశసరళములకు ముందు బిందువు లేదు ఇందుఁ బెట్టఁబడినది గసడదవాదేశ మనుకొందమన్న అవి సాంస్కృతికపరుషములగుటచే దాని కవకాశము లేదు వాని ననుసరించియే తేజోమయుఁడు అనుదానిని ద్రుతాంతముగాఁజేసి 'పుణ్య' అనుదానిలో సరళాదేశము చేయఁబడినది ఎలమిన్ అనుదానికి దేనితోను అన్వయము లేదు పాదపూరణార్థమని తలఁపవలయును

వ ఇట్లు పరమేశ్వరుండు మహాదర్శనంబుండె నంత హిమవంతంబునకుఁ గూఁతంగతులు సనిన మునిగణంబు మగిడి వచ్చి తదాస్థానరంగంబుం జొచ్చి 2

అర్థము. ఇట్లు, పరమేశ్వరుండు, మహాదర్శనంబు + ఉండెన్, అంతన్, హిమవంతంబునకున్, కూఁతంగతులు + చనిన = కూఁతవేటు దూరమునకుఁబోయిన, (?) ముని-గణంబు = మునుల సమూహము, మగిడివచ్చి = మరలివచ్చి, తద్ + ఆస్థాన - రంగంబున్ + చొచ్చి = ఆ శివుని కొలువు కూటమును బ్రవేశించి

తాత్పర్యము. ఇట్లు పరమేశ్వరుఁడు కొలువుదీర్చి యుండెను అంత హిమవంతమునకుఁ బోయిన మునుల సమూహము మరలివచ్చి యా శివుని కొలువుకూటమును బ్రవేశించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . కూఁతంగతులు సనిన - అర్థము కాలేదు, వావిళ్లవారి లఘుటీక ననుసరించి యర్థము వ్రాయఁబడినది

మహోగ్రహరి వాణీంద్రామరేంద్రాద్యమరగణఫణీంద్రాసురేంద్రోరుజూటో
త్కర సద్రత్నాతిధామాగ్ర సితపదనఖౌఘప్రపూర్ణేందురశ్మి
స్ఫురితాంగోద్య త్ప్రభాబ్ధి క్షుభితరవనిభస్తోత్ర సంగీతరా వా
వరితాశాత్యంతశోభావహుఁ గనియె మునివ్రాత మా దేవదేవున్ 3

అర్థము:ముని-వ్రాతము = మునుల సమూహము, హరి శోభావహున్ హరి = విష్ణువు, వాణీ + ఇంద్ర = సరస్వతి భర్తయగు బ్రహ్మ, అమర + ఇంద్ర = దేవేంద్రుఁడు, ఆది = మున్నగు, అమర-గణ = దేవతల సమూహము, ఫణి + ఇంద్ర = భుజగశ్రేష్ఠుఁడు, అసుర + ఇంద్ర = రాక్షసశ్రేష్ఠులు - అనువారియొక్క, ఉరు - జూట + ఉత్కర = పెద్ద జడముడుల సమూహమునందలి, సత్ + రత్న - మేలయిన రత్నములయొక్క, అతి-ధామ = ఎక్కువ కాంతిచేత, అగ్ర = అధికముగా, సిత = తెల్లనైన, పద-నఖ + ఓఘ = కాలి గోరుల సమూహము అనెడి, ప్ర-పూర్ణ + ఇందు-రశ్మి = నిండు చంద్రుని కాంతియందు, స్ఫురిత = తోఁచిన, అంగశరీరముగల శివుని యొక్క, ఉద్యత్ = ఉద్యమించుచున్న - తీర్చుచున్న, సభా = కొలువనెడి, అబ్ధి = సముద్రముయొక్క, క్షుభిత-రవ = కలఁకవలని ధ్వనితో, నిభ = సమానమైన, స్తోత్ర-సంగీత-రావ = స్తుతిగానధ్వనిచేత, ఆవరిత = ఆవరింపఁబడిన, ఆశా = దిక్కులకు, అత్యంత = మిక్కిలి, శోభా + ఆవహున్ = కాంతిని గలిగించువాఁడగు, ఆ-దేవ-దేవున్ = దేవతలకు దేవుఁడైన ఆ శివుని, కనియెన్ = చూచెను

తాత్పర్యము. విష్ణువు, బ్రహ్మ, దేవేంద్రుఁడు మున్నగు దేవసమూహము,

నాగరాజు, రాక్షసశ్రేష్ఠులు అనువారి పెద్ద జడముడులందలి మేలయిన రత్నముల అధికకాంతిచే మిక్కిలి తెల్లనైన కాలిగోరులసమూహ మనెడి నిండుచంద్రుని కాంతియందుఁ దోఁచిన శరీరము గలవాఁడగు శివుఁడు తీర్చు కొలువనెడిసముద్రము కలఁగిన ధ్వనితో సమానమైన స్తుతిగానధ్వనిచే నావరింపఁబడిన దిక్కులకు మిక్కిలి శోభను గలిగించు దేవదేవుని మునులసమూహము చూచెను

విశేషములు కిరీటధారులైన విష్ణుబ్రహ్మాదులు శివునిపాదములపైఁ దమ శిరసులు మోపి నమస్కరింపఁగా వారి కిరీటములందలి రత్నముల కాంతిచే నతని కాలిగోరులు మిక్కిలి తెల్లనై వెన్నెలల నీనుచుండును ఆ వెన్నెలలో శివుని శరీరము ప్రతిఫలించును అట్టి శివుఁడు తీర్చు కొలు వొక సముద్రమువలెను, ఆ కొలువున విష్ణ్వాదులు శివునిఁజేయు సంస్తుతిగానశబ్ద మా సముద్రపు ఘోషమువలెను నుండెను ఆ ధ్వని దిక్కులకు వ్యాపించుచుండెను అలంకారము సితవదనళోళుప్రవూర్ణేందు రశ్మి-సభాబ్ధి - అనుచోటుల రూపకము అబ్ధిక్షుభితరవనిభస్తోత్రసంగీతరావ - అనుచో ఉపమ నళోళు = నఖ+ఓళు - వృద్ధిసంధి విష్ణ్వాది దేవతలందఱిచేతను నమస్కరింపఁబడువాఁ డగుటచేతనే శివుఁడు దేవదేవుఁడు మహాస్రగ్ధర లక్షణమునకు 7 - 101 పద్యవాఖ్యను అరయునది

వ కని ముహుర్ముహుర్మహీతలాలింగితసర్వాంగులై మస్తకన్యస్తహస్త కమలముకుళితోద్భాసితులై సమస్తవేదస్తుతులం బ్రస్తుతించుచున్న మునిస్తోమంబుఁ గరుణావకలోకనామృతాభిషిక్తులం జేసి పరమేశ్వరుండు డాయంబిలిచిన మహాప్రసాదం బనుచుం గరతలాహితాననులగుచుం దమ పోయి వచ్చిన కార్యసిద్ధిక్రమంబు సవిస్తరంబుగా విన్నపంబుసేసిన నయన కర్ణ కుండలుం డపర్ణారూపవర్ణనాకర్ణనదత్తకర్ణుం డైనకన్నెఱింగి హరి పరమేష్ఠి మునిపురందరాధీశ్వరుండైన పరమేశ్వరునకు నగజ సమస్తప్రశస్త లక్షణలక్షితాంగోపాంగవిశేషంబులు వర్ణించి వెండియు 4

అర్థము: కని, ముహు సర్వాంగులై ముహుః + ముహుః = మాటిమాటికి, మహీతల = భూతలముచే, ఆలింగిత = ఆలింగనము చేసికొనఁబడిన, సర్వ + అంగులు + ఐ = ఎల్ల అవయవములు గలవారయి - సాష్టాంగ నమస్కారముచేసినవా రయి, మస్తక ద్భాసితులై మస్తక + శిరస్సులందు, న్యస్త = ఉంపఁబడిన, హస్త-కమల = కేలుఁదమ్ములయొక్క, ముకుళిత = మొగుడుటలచే, ఉత్ + భాసితులు + ఐ = మిక్కిలి ప్రకాశించినవారయి, సమస్త-

వేద-స్తుతులన్ = ఎల్ల వైదికస్తోత్రములచేతను, ప్రస్తుతించుచున్ + ఉన్న = సన్నుతించుచున్న, ముని-స్తోమంబున్ = మునుల సమూహమును, సప్తర్షులను, కరుణా + అవలోకన + అమృత + అభిషిక్తులన్ = దయాదృష్టి యనెడి అమృతముచే అభిషేకింపఁబడిన వారిని, చేసి, పరమేశ్వరుండు, డాయన్ + పిలిచినన్ = చేరువకుఁ బిలువఁగా, మహాప్రసాదంబు, అనుచున్, కర-తల + ఆహిత + ఆననులు = అఱచేతులందు ఉంపఁబడిన ముఖములు గలవారు, అగుచున్, తమ-పోయివచ్చిన = తాము వెడలివచ్చిన, కార్యసిద్ధి-క్రమంబు = పని జరగిన రీతి, సవిస్తరంబుగాన్ = సంపూర్ణముగా, విన్నపంబు + చేసినన్ = మనవి చేయఁగా, నయన-కర్ణ-కుండలుండు-పాములు (కన్నులు చెవులుగాఁ గలది - పాము) కర్ణభూషణములుగాఁ గలవాఁడు - శివుఁడు, అపర్ణా - రూప - వర్ణన + ఆకర్ణన - దత్తకర్ణుండు = పార్వతియొక్క, సౌందర్యముయొక్క వర్ణనయొక్క, వినుటకయి ఈయఁబడిన, చెవులుగలవాఁడు - పార్వతీసౌందర్యవర్ణనమును వినఁ జెవులొగ్గినవాఁడు, ఐన-కన్నెఱింగి = అయిన జాడ తెలిసి, హరి-పరమేష్ఠి-ముని-పురందర + అధి + ఈశ్వరుండు + ఐన = విష్ణువు, బ్రహ్మ, మునీంద్రులు అనువారికిఁ బ్రభువయిన, పరమేశ్వరునకున్, అగజ = పార్వతియొక్క, సమస్త-ప్రశస్త-లక్షణ + లక్షిత + అంగ + ఉపాంగ - విశేషంబులు = ఎల్ల, శ్రేష్ఠములయిన లక్షణములచేఁ జూడఁబడిన - ఉత్తమ లక్షణములు గల - అంగముల, ఉపాంగముల, విశేషములు, వర్ణించి, వెండియున్ = మఱియును

తాత్పర్యము : చూచి మాటిమాటికి సాష్టాంగపడినవారయి శిరసులందుఁ గేలుదమ్ములు మొగిడ్చి, ఎల్ల వేదస్తోత్రములచేఁ, బ్రస్తుతించుచున్న సప్తర్షులను దయాదృష్టి యనెడునమృతముచే నభిషేకించి పరమేశ్వరుఁడు చేరఁ బిలువ, మహాప్రసాదమని ముఖములందు హస్తతలములు ఘటించి తాము పోయి వచ్చిన కార్యము నెఱవేఱిన రీతిని విపులముగా మనవిచేయఁ బార్వతీసౌందర్యవర్ణనమును శివుఁడు వినఁగోరిన జాడ తెలిసి విష్ణుబ్రహ్మమునీంద్రులకుఁ బ్రభువైన పరమేశ్వరునకుఁ బార్వతి సర్వలక్షణసంపన్నములయిన అంగములను, ఉపాంగములను వర్ణించి - మఱియును - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు .తమ పోయివచ్చిన - తాము పోయి వచ్చిన - 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్మపదప్రథమకుఁ దఱుచుగ యొక్కష్షి యగు' ప్రౌఢ కారక 15 తమ యొక్క పోయివచ్చిన 'యొక్కకు లోపంబు బహుళంబు' ప్రౌఢ కారక 16 తమ పోయివచ్చిన

పార్వతీ సౌందర్య వర్ణనము

మ హరినీలోపమమధ్యకేశి, శశిబిం బాస్యోష్ఠ, రాజీవకే
సర నేత్రామలగంధి, విద్రుమ లతా సద్వర్ణ తన్వంగి, సిం
ధుర కుంభాలసయానపూర్ణకుచ, సంస్తుత్యారుణాబ్జాంఘ్రికం
ధర శైలాత్మజఁ జెప్పనొప్పగు సుధాధామార్ధచూడామణీ ! 5

అర్థము . సుధా - ధామ + అర్ధ - చూడామణీ = అర్ధచంద్రుఁడు తలమానికముగాఁ గలవాఁడా! - ఈశ్వరా!, శైల + ఆత్మజన్ = కొండకూఁతును - పార్వతిని, హరి - నీల + ఉపమ - మధ్య - కేశి = సింహముతో సదృశమైన నడుము నీలముతో (నీలమణితో) సదృశమైన కేశములు గలది, శశి-బింబ + ఆస్య + ఓష్ఠ = చంద్రునివంటి ముఖము, దొండపండువంటి పెదవి కలది, రాజీవ - కేసర - నేత్ర + అమల - గంధి = తామరలవంటి కన్నులు గలది, కేసరముల (అకరువుల) వలె నిర్మలమయిన పరిమళము గలది, విద్రుమ లతా-సత్ + వర్ణ-తను + అంగి = పగడమువలె మేలయిన వర్ణము గలది, తీఁగవలె సన్నని మేను గలది, సింధుర - కుంభ + అలస-యాన - పూర్ణ-కుచ = ఏనుఁగువలె మందమయిన గమనము గలది - కుండలవలె నిండయిన స్తనములు గలది, సంస్తుత్య + అరుణ + అబ్జ + అంఘ్రి - కంధర = మిక్కిలి పొగడఁదగిన, ఎఱ్ఱని తామరల వంటి పాదములు గలది, శంఖమువంటి కంఠము గలది, అని, చెప్పన్ + ఒప్పు + అగున్ = చెప్పఁదగును

తాత్పర్యము . అర్ధచంద్రుఁడు తలమానికముగాఁ గలవాఁడా! ఈశ్వరా! పార్వతిని సింహమధ్య అనియు, నీలమణిసదృశకేశియనియు, చంద్రమణి అనియు, బింబోష్ఠి యనియు, పద్మనయన యనియు, కేసరగంధి యనియు, విద్రుమ వర్ణ యనియు, లతాతన్వంగి యనియు, గజమందగమన యనియు, కుంభపూర్ణస్తన యనియు, అరుణాబ్జాంఘ్రి యనియు, అబ్జ (శంఖ) - కంఠి యనియుఁ జెప్పఁదగును

విశేషములు . అలంకారముపమ యథాసంఖ్యము అబ్జ శబ్దమున శ్లేషము నీలోపమ - నీల + ఉపమ - గుణసంధి ఆస్య + ఓష్ఠ = ఆస్యోష్ఠ - సమాసమున అకారాంత పదములకు ఓతుఃఓష్ఠఃఅను పదములు పరము లగునపుడు వృద్ధ్యాదేశము వైకల్పికము ఇచ్చట వృద్ధిరాలేదు కనుక పరరూప మేకాదేశమైనది సద్వర్ణ - సత్ + వర్ణ తన్వంగి - తను + అంగి - యణాదేశసంధి

సీ మా నటి పగలెల్ల మాయు దీ వని నిండు
వెన్నెల నగునట్లు వెలఁది నవ్వు
నచిరాంశురుచులేమి యని వాని దెసఁ దప్పఁ
జూచు భావనఁ గ్రేళ్లసూచు నతివ
ఖగముల కీ మందగతి యేటికని రాజ
హంసలపైఁ బడునట్లు నడుచుఁ
బలువలౌ చిలుకల పలువడు లుడిగింతు
నని పల్కునట్ల యింపారఁ బల్కు

తే నా నగాత్మజ లలితరూపాతిశయ వి
లాస శుభగుణ సౌందర్య లక్షణముల
నగణితైశ్వర్య నిరుపమానాత్మ! నీక
తగు మహాదేవి గా దేవతాలలామ! 6

అర్థము. మాను + అటి = ఒప్పిదము పోయి, పగలు + ఎల్లన్ = పగటివేళ అంతయు, ఈవు = నీవు, మాయుదు = నశింతువు, అని, నిండు-వెన్నెలన్, నగు+ అట్లు = నవ్వునట్లు, వెలఁది = ఇంతి - పార్వతి, నవ్వున్

అచిరాంశు - రుచులు = విద్యుత్ప్రభలు, ఏమి, అని = వాని గొప్పతనమేమని, వాని - దెసన్ = వానివైపు, తప్పన్ + చూచు - భావనన్ = అనాదరము చేయు తలఁపుతో, అతివ = స్త్రీ - పార్వతి, క్రేళ్లు + చూచున్ = చంచలముగాఁ జూచును

ఖగములకున్ = పక్షులకు, ఈ - మంద-గతి = ఈ మెల్లని నడక, ఏటికిన్+ అని = ఎందులకని, రాజహంసలపైన్ = రాయంచలమీఁద, పడు + అట్లు + అ = పడినవిధముననే, నడుచున్

పలువలు + ఔ = ప్రేలరులగు, చిలుకల = చిలుకలయొక్క, పలువడులు = దొప్పములు, ఉడిగింతున్ = పోఁగొట్టుదును, అని, పల్కు + అట్లు + అ = పలుకు విధముననే, ఇంపారన్ = చక్కగా, పల్కున్

అగణిత + ఐశ్వర్య - నిరుపమాన + ఆత్మ = లెక్కలేని ఐశ్వర్యముచే సాటిలేని స్వరూపము గలవాఁడా!, దేవతా - లలామ = దేవశ్రేష్ఠుఁడా! ఆ - నగ + ఆత్మజ = ఆ కొండకూఁతురు - పార్వతి, లలిత - రూప + అతిశయ - విలాస-శుభగుణ - సౌందర్య - లక్షణములన్ = మనోహరమైన ఆకారముచేతను,

ఎక్కువయైన విలాసముచేతను, శుభ-గుణ = శుభములైన గుణములచేతను, సౌందర్యముయొక్క, లక్షణములచేతను, మహాదేవి + కాన్ = పట్టపుదేవిగా, నీకున్+ అ = నీకే, తగున్

తాత్పర్యము లెక్కింపశక్యముకాని యైశ్వర్యముచే సాటిలేని స్వరూపముగలవాఁడా! దేవతాశ్రేష్ఠుఁడా! పరమేశ్వరా! 'మనోజ్ఞత చెడి పగలంతయు నీవు నశింతు'వని నిండువెన్నెలను బరిహసించునట్లు పార్వతి నవ్వును క్షణమాత్రకాలమే యుండు మెఱపులకాంతు లేమి గొప్పవి యని వాని ననాదరముతోఁజూచు తలఁపునఁ బార్వతి చాంచల్యముతోఁ జూచును పక్షుల కీ మందగమన మెందులకని రాయంచలపైఁబడునట్లు - రాయంచల నతిశయించునట్లు ఆమె నడచును ప్రేలరులైన చిలుకల దొష్ట్యములు మానుపుదునని పలుకువిధమున నామె మనోజ్ఞముగాఁ బలుకును ఆ పార్వతి మనోహరాకారముచేతను, అతిశయవిలాసముచేతను, శుభగుణములచేతను, సౌందర్యలక్షణములచేతను, మహాదేవిగా నీకే తగును

విశేషములు . సీసపద్యము నాలుగు పాదములందును అలంకారము హేతూత్ప్రేక్ష మాయుదీవు - మాయుదువు + ఈవు లాద్వకారలోపము - బాల క్రియ 24 మాయుదు + ఉ + ఈవు అపదాది స్వరసంధి బాల సంధి 11 మాయుదు + ఈవు = మాయుదీవు - ఉకారసంధి బాల సంధి 1

క నెఱిగలుగ నాఁడునాఁటికి
గుఱి గడవఁగఁ బెరుఁగు జఘనకుచకచభరముల్
పిఱు దొడలు నడుము నల్గును
విఱుగక తక్కువని గిరిజ వెఱచుచు నడచున్ 7

అర్థము . నెఱి + కలుగన్ = ఒప్పిదమగునట్లు, నాఁడు - నాఁటికిన్ = నానాఁటికి, జఘన-కుచ-కచ-భరముల్ = పిఱుఁదుల యొక్కయు, స్తనముల యొక్కయు, కేశపాశముయొక్కయు, భరముల్ = అతిశయములు - బరువులు, గుఱి + కడవఁగన్ = లక్ష్యము నతిశయించునట్లు - మితిమీఱునట్లు, పెరుఁగున్ = వృద్ధిపొందును, చిఱు తొడలున్ = పిక్కలును, నడుమును, అల్గును = కంరమును, విఱుగక - తక్కువ = విఱిగిపోనకమానవు, అని, గిరిజ = పార్వతి, వెఱచుచున్ = భయపడుచు, నడచున్

తాత్పర్యము . ఒప్పిదమగునట్లు నానాఁటికిఁ బిఱుదుల, స్తనముల,

శిరోజముల బరువులు మితిమీఱి పెరుఁగుచున్నవి క్రమముగాఁ బిఱుఁదుల బరువుచేఁ బిక్కలును, స్తనభారముచే నడుమును, కచభారముచేఁ గంఠమును వీటిగిపోవకమానవని భయపడుచుఁ బార్వతి నడుచును

విశేషములు. అలంకారము హేతూత్ప్రేక్ష, యథాసంఖ్యము ఆమె గమన మాంద్యము సహేతుకముగా నిరూపింపఁబడినది

చ జలజము సావి కోకములు షట్పదముల్ పఱతెంచి తద్దయున్
నలి వినుతాస్యమండలము నాసికయున్ శశిబింబ చంపకం
బులు సవి డాయనొల్ల కతిమోహమునం బెడఁబాయనోప కా
కులమతి నున్నభంగిఁ గుచకుంతలవక్త్రము లొప్పు గౌరికిన్ 8

అర్థము. జలజము-సావి = పద్మ మని, కోకములున్ = చక్రవాకములును, షట్పదముల్ = తుమ్మెదలును, తద్దయున్ = మిక్కిలి, నలిన్ = ఉత్సాహముతో, పఱతెంచి = వచ్చి, వినుత + ఆస్య - మండలమున్ = పొగడఁబడిన ముఖబింబమును, నాసికయున్ = ముక్కును, శశిబింబ-చంపకంబులు-సవి = క్రమముగాఁ జంద్రబింబమును, సంపెఁగయును అని, డాయన్ + ఒల్లక = సమీపింప నంగీకరింపక, అతి - మోహమునన్ = మిక్కిలి మక్కువతో, పెడఁబాయన్ + ఓపక = విడిచిపెట్టఁజాలక, ఆకుల-మతిన్ = కలఁగిన బుద్ధితో, ఉన్న-భంగిన్ = ఉన్నవిధమున, గౌరికిన్ = పార్వతికి, కుచ-కుంతల-వక్త్రములు = స్తనములు, తలవెండ్రుకలు, ముఖము, ఒప్పున్

తాత్పర్యము . పార్వతి ముఖమును జూచి పద్మమని తలఁచి చక్రవాకములును, తుమ్మెదలును ఉత్సాహముతోవచ్చి, ముఖబింబమును, అందలి ముక్కును గ్రమముగాఁ జంద్రబింబము, సంపెఁగ అని తలఁచి, వానివలని ద్వేషముచే సమీపింప నిష్టపడక, దానియందలి మిక్కుటమైన మక్కువతో విడిచిపెట్టఁజాలక కలఁగిన బుద్ధితో నున్నవిధమునఁ బార్వతికి స్తనములు, శిరోజములు, ముఖము ఒప్పును

విశేషములు చక్రవాకములకును, తుమ్మెదలకును పద్మమనిన ఇష్టము పార్వతి ముఖమును జూచి అవి పద్మభ్రాంతితో నుత్సాహమునఁ బరుగుపరుగున వచ్చినవి కాని వానికి ముఖము చంద్రబింబమువలెను, అందలినాసిక సంపఁగి వలెను దోఁచెను కోకములకుఁ జంద్రబింబమన్నను, తుమ్మెదలకు సంపెఁగ యన్నను పడకపోవుటచే, సమీపింప నిష్టపడలేదు జలజభ్రాంతివీడకపోవను

ఇష్టపడలేదు ఇట్లు అవి కలఁగిన బుద్ధితోనున్నవా యనునట్లు పార్వతికిఁ గుచములు, కుంతలములు, ముఖము నొప్పును అలంకారము భ్రాంతిమంతము, హేతూత్ప్రేక్ష, యథాసంఖ్యము సావి - (రూపాం) సవి పార్వతి కుచములు కోకములవలెను, కుంతలములు తుమ్మెదలవలెను, ముఖము పద్మ చంద్రబింబములవలెను ఉన్నవని ఫలితార్థము

సీ క్రొవ్విరు లెసఁగి పూఁగొలల మో పోపక
నవకంపు లేఁదీఁగె నెవులునట్లు
వీఁగారు చనుఁగవ వ్రేఁగునఁ గొఁదీఁగె
వడు వసివాళులు వాడుచుండు
విలసిల్లు నిండారు వెన్నెలలోఁ గారు
విగ్గోరు దీఁగెలు వెలుఁగునట్లు
తెలిమోముపైఁబర్వి తొలఁకాడు చాయలో
మెలరారు కనుఁగవ మెఱుఁగు లడరుఁ

తే దావి వొంపిరివోవు నెత్తమ్మివలన
వెలయు కంపారి తెమ్మెరల్ వీచునట్లు
కమ్మవాతెఱ వాసన గలసి కలయ
సోడుముట్టుచు నూర్పులు సుడియుచుండు 9

అర్థము . క్రొవ్విరులు (క్రొత్త + విరులు) = క్రొత్తపూలు, ఎసఁగి = అతిశయించి, పూ గొలల (పూవు + గొలల)-మోపు = పూవుగుత్తుల భారము, ఓపక = మోయలేక, నవకంపు లేఁదీఁగె = (నవకము + లేత + తీఁగె) = మృదువైన లేత తీఁగె, నెవులు + అట్లు = బాధచెందు విధమున, వీఁగారు (వీఁగు + ఆరు) = నిక్కునట్టి, చనుఁగవ = స్తనద్వయముయొక్క, వ్రేఁగునన్ = బరువుచే, కొఁదీఁగె (కొను + తీఁగె) = తీఁగవంటి నడుము, వడు వసివాళులు, వాడుచున్ + ఉండున్ = మిక్కిలి వాడుచుండును

విలసిల్లు = ప్రకాశించునట్టి, నిండారు (నిండు + ఆరు)-వెన్నెలలోన్ = నిండు వెన్నెలలో, కారు = నల్లని, విగ్గోరు + తీఁగెలు = విగ్గోరనెడి లతలు, వెలుఁగు+ అట్లు = ప్రకాశించువిధమున, తెలి-మోముపైన్ = తెల్లని ముఖముపై, పర్వి = వ్యాపించి, తొలఁకాడు = ప్రకాశించు, చాయలోన్ = కాంతిలో, మెలరారు

= మనోహరమగు, కనుఁగవ = కన్నులజంటయొక్క,మెఱుఁగులు = కాంతులు, అడరున్ = అతిశయించును

తావి = పరిమళము, పొంపిరి + పోవు = అతిశయించు, నెత్తమ్మి (నెఱ + తమ్మి) వలనన్ = పద్మము నుండి, వెలయు = కలుగునట్టి, కంపారి (కంపు + ఆరి) = వాసన నిండి, తెమ్మెరల్ = దక్షిణపు గాలి, వీచు + అట్లు = వ్యాపించునట్లు, కమ్మ-వాతెఱ = పరిమళించు పెదవియొక్క, వాసన = పరిమళము, కలసి = కూడి, కలయన్ = అంతటను, సోడుముట్టుచున్ = వ్యాపించుచు, ఊర్పులు = శ్వాసములు, సుడియుచున్ + ఉండున్ = వ్యాపించుచుండును

తాత్పర్యము క్రొంబూలు అధికమై పూలగుత్తుల బరువును మోయలేక మృదువైన లేఁదీఁగ బాధపడువిధమున, నిక్కుచనుదోయి బరువుచేఁ దీఁగవంటి నడుము మిక్కిలి వాడుచుండును ప్రకాశించు నిండువెన్నెలలో నల్లని విగ్గోరు తీఁగెలు వెలుఁగువిధమున, తెల్లనిముఖముపై వ్యాపించి ప్రకాశించు కాంతిలో మనోహరమగు కనుదోయికాంతు లతిశయించును పరిమళ మధికమగు తామర నుండి పుట్టు వాసన నిండి గాలి వీచువిధమున పరిమళించు పెదవివాసనకూడి అంతటను వ్యాపించుచు నూర్పులు ప్రసరించుచుండును

విశేషములు. అలంకార ముపమ క్రొవ్విరులు = క్రొత్త + విరులు పూగొల - పూవు + గొల నవకంపులేఁదీఁగె - నవకము + లేఁత + తీఁగె నెపులు - (రూపాం) నెగులు కొఁదీఁగె = కొను + తీఁగె వసివాళులు - వసివాడు + లు నెత్తమ్మి - నెఱ + తమ్మి కంపు = కమ్మని వాసన తెమ్మెరలు - తెన్ + ఎరల్ - దక్షిణపు గాలి

శా ఆ లీలాలసదృఙ్మరీచి దివిజాహారప్రవాహోరు క
ల్లోలానీకము పోలెఁ బొల్పెసఁగ నాలోలాతిరమ్యాసిత
భ్రూలాస్యాంచితమైన పార్వతి ముఖాంభోజంబు నేణాంకిత
ప్రాలేయద్యుతిమండలంబు నుపమింపంబోయి శంకించెదన్ 10

అర్థము: ఆ-లీలా + అలస - దృశ్(క్) + మరీచి = విలాసముచే మందమైన ఆ కన్నుల కాంతి, దివిజ + ఆహార = దేవతల ఆహారమైన అమృతముయొక్క, ప్రవాహ = ప్రవాహముయొక్క, ఉరు = గొప్పవియగు, కల్లోల + అనీకము + పోలెన్ = తరఁగల సమూహము వలె, పొల్పు + ఎసఁగన్ = ఒప్పఁగా, ఆలోల + అతి-రమ్య + అసిత + భ్రూ-లాస్య + అంచితము = చంచలము, మిక్కిలి సుందరము, అసిత

= నల్లని, భ్రూ = కనుబొమలయొక్క, లాస్య = నాట్యముచే, అంచితము = ఒప్పినది, ఐన, పార్వతి-ముఖ + అంభోజంబున్ = పార్వతి ముఖపద్మమును, ఏణ + అంకిత-ప్రాలేయ-ద్యుతి మండలంబున్ = జింకచేత చిహ్నితమైన చంద్రమండలమును (తో), ఉపమింపన్ + పోయి = పోల్పఁబోయి, శంకించెదన్ = సందేహింతును

తాత్పర్యము . సవిలాసము, మందము నైన ఆ కన్నులకాంతి అమృతస్రవాహపుఁబెనుగరళ్లవలె ఒప్పఁగా, చంచలము, అతిసుందరము, నల్లనిది అగు కనుబొమల నాట్యముచే నొప్పు పార్వతి ముఖపద్మమును జింకతో నొప్పు చంద్రబింబముతోఁ బోల్పఁబోయి సందేహింతును

విశేషములు. అలంకారము సందేహము దృఙ్మరీచి-దృశ్(క్) + మరీచి - అనునాసిక సంధి

మ మెలుపిచ్చుం దనువల్లి వల్లికకు, నా మీనాక్షి లోలాక్షముల్
పొలపం బిచ్చు మెఱుంగుఁదీఁగెలకు, నా పూర్ణామలద్యోతికిన్
దెలుపిచ్చున్ ముఖమండలంబు, దమకుం దియ్యంబు లోఁదాల్ప న
గ్గలమై యుండెడు వాని నొండుఁ బొగడంగా నేర మా సుందరిన్ 11

అర్థము. ఆ-మీన + అక్షి = చేఁపలవంటి కన్నులుగల ఆ పార్వతియొక్క, తను-వల్లి = తీఁగవంటి మేను, వల్లికకున్ = తీఁగకు, మెలుపు = సౌకుమార్యము, ఇచ్చున్, (ఆ-మీనాక్షి) లోల + అక్షముల్ = చంచలము లయిన కన్నులు, మెఱుంగు + తీఁగెలకున్ = విద్యుల్లతలకు, పొలపంబు = కాంతి, ఇచ్చున్, (ఆ మీనాక్షి) ముఖ-మండలంబు = ముఖబింబము, ఆ-పూర్ణ + అమలద్యోతికిన్ = ఆ నిండు చంద్రునకు, తెలుపు = స్వచ్ఛత, ఇచ్చున్, ఆ సుందరిన్ = ఆ అందగత్తె (పార్వతి) విషయమున, తమకున్ = తమకంటె (పంచమ్యర్థమున షష్ఠి), తియ్యంబు= మాధుర్యము, లోన్ + తాల్పన్ = లోపల వహింప, అగ్గలము + ఐ = అధికమయి, ఉండెడు-వానిన్ + ఒండున్ = ఉండు నితరమైన దానిని, పొగడంగాన్ + నేరము= ప్రశంసింపఁ జాలము

తాత్పర్యము. ఆ పార్వతి దేహలత తీఁగకు సౌకుమార్యము నిచ్చును ఆ మీనాక్షి చంచలాక్షులు విద్యుల్లతలకుఁ గాంతి నిచ్చును ఆమె ముఖబింబము ఆ

పూర్ణచంద్రునకు స్వచ్ఛత నిచ్చును ఆమె విషయమున ఆమె దేహాద్యవయవముల కంటె మాధుర్యమునుదాల్చు నితరవస్తువులను బొగడఁజాలము

విశేషములు. తీఁగె చాల సుకుమార మయినది అట్టి దానికే సౌకుమార్యము నొసఁగు నట్టిది ఆమె దేహవల్లి విద్యుల్లతలు కాంతిమంతమయినవి అట్టివానికే కాంతినిచ్చునవి ఆమె కన్నులు పూర్ణచంద్రుఁడు తెల్లనివాఁడు అట్టివానికే తెలుపిచ్చునట్టిది ఆమె ముఖమండలము ఇట్లు ఆమె దేహాదులకు ప్రసిద్ధోపమానములయిన లతాదులే చాలనప్పుడు, ఇతరములయిన వాని నేమిపొగడఁగలము? పార్వతి దేహాద్యవయవములు నిరుపమానము లనుట అలంకారము - అతిశయోక్తి

సీ. సల్లలితాశోకపల్లవంబులుఁ బాద
పల్లవంబులు నొక్కతల్లి ప్రజలొ?
ప్రణయాతిశయమునఁ బాయని జక్కవ
కవయు నెవ్వలి సన్నుఁగవయుఁ గవయొ?
వలకోటఁ బెరిఁగిన వలరాజు హస్తిహ
స్తంబును గేశపాశంబు నెనయొ?
పరిమళాకీర్ణ తోయరుహంబు నానన
తోయరుహంబును దొరయొ తలఁప?

ఆ. లీలఁ బులినకేళిసోలంబుతోఁ గ్రాలి
నడచు నంచనడలు నడలు గెడలొ?
యనఁగ బాదతలముఁ, జనుకట్టుఁ, గచము, నా
ననము, నడపు, నద్రితనయ కమరు. 12

అర్థము : సల్లలిత + అశోక-పల్లవంబులున్ = మిక్కిలి మనోహరమైన అశోకవృక్షపుఁ జివురులును, పాద-పల్లవంబులున్ = చివురులవంటి పాదములును, ఒక్క-తల్లి-ప్రజలొ = ఒక తల్లి బిడ్డలా? అనఁగన్, పాదతలమున్,

ప్రణయ + అతిశయమునన్ = ప్రేమాధిక్యముచే, పాయని = ఒండొటిని వీడని, జక్కవ-కవయున్ = చక్రవాకముల జంటయు, నెవ్వలి + చన్ను + కవయున్ = మిక్కిలి వట్రులైన స్తనద్వయమును, కవయొ = జంటయా? అనఁగన్, చనుకట్టున్,

వల-కోటన్ = వలపనెడు కోటయందు, పెరిఁగిన, వలరాజు = మన్మథునియొక్క, హస్తి = ఏనుఁగుయొక్క, హస్తంబును = తొండమును, కేశ-పాశంబున్ = శిరోజముల సమూహమును - జడయును, ఎనయె = సమానమా, అనఁగన్, కచమున్ = కేశబంధమును,

పరిమళ + ఆకీర్ణ-తోయరుహంబును = సువాసనతో నిండిన పద్మమును, ఆనన-తోయరుహంబును = పద్మమువంటి ముఖమును, తలఁపన్ = భావింపఁగా, దొరయె = సమానమో, అనఁగన్, ఆననమున్ = ముఖమును,

లీలన్ = విలాసముతో, పులిన-కేళిన్ = ఇసుక తిన్నెలయందలి క్రీడలో, సోలంబుతోన్ = పారవశ్యముతో, క్రాలి = ఒప్పి, నడచు + అంచ-నడలున్ = నడచునట్టి హంసల నడకలును, నడలున్, గెడలొ = సమానములో, అనఁగన్, నడపున్ = నడకయు, అద్రి-తనయకున్ = కొండకూఁతునకు = పార్వతికి, అమరున్ = ఒప్పును

తాత్పర్యము . మిక్కిలి మనోహరములైన అశోకవృక్షపుఁ జివురులును, ఆమె అడుగుఁజివురులును ఒక తల్లి బిడ్డలా యనఁ బాదతలములును, అనురాగాతిశయమున నొండొంటిని వీడని చక్రవాకముల జంటయు, ఆమె మిక్కిలి వట్రువలయిన స్తనముల జంటయు జతయా యన జనుకట్టును, వలపనెడి దుర్గమునఁ బెరిఁగిన మన్మథుని యేనుఁగుతొండమును ఆమె కేశపాశమును సమానములా యన శిరోజములును, పరిమళముతో నిండిన పద్మమును, ఆమె ముఖపద్మమును సమానములా యన ముఖమును, సైకతస్థల విహారమునఁ బారవశ్యముతో నడచు హంసల గమనములును, ఆమె నడకలును సమానములా యన నడకయును బార్వతి కొప్పును

విశేషములు అలంకారములు ఉత్ప్రేక్ష, యథాసంఖ్యము నెవ్వలి సన్ను - నెవ్వలి + చన్ను, గసడదవాదేవము - బాల సంధి 13 చన్నుఁగవ - చన్ను + కవ - సమాసమున నుదంతస్త్రీసమమునకుఁ బరుషము పరమగుచుండఁగా నుగాగమము - బాల సంధి 24 ద్రుతకార్యము - బాల సంధి 15,16 వలకోట - వలపు + కోట వలపు శబ్దమునకు సమాసమున నంత్యవర్ణలోపము - వలపనెడు కోట - రూపకము ఇట్లే వలరాజు - వలపు + రాజు ఆనన తోయరుహము - తోయరుహము వంటి ఆననము - ఉపమిత సమాసము దొర = సాటి 'దొరయు గెడ జోడు పోలిక ఉపమ కొప్పున్' కావ్యా 5 16 సాలంబుతో - అను దానికి సోలంబుతో

నని రా అ కృ శర్మగారి సవరణ నడచు నంచ - నడచు + అంచ - ఉదంత తద్ధర్మార్థక విశేషణమునకు అచ్చుపరముగా నుగాగమము - బాల సంధి 33 సల్లలిత - సత్ + లలిత - తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణ మాదేశ మగును

క మెలుపునఁ జాయను దమలోఁ
గలసి యుమాదేవి యడుగుఁగవఁ బోలంగాఁ
దలఁచియొ దూదియు, లక్కయు
లలితంబుగఁ గలసి పొలుచు లత్తుక రేకుల్ 13

అర్థము మెలుపునన్ = సౌకుమార్యమునను, చాయను = వర్ణమునను, తమలోన్, కలసి, ఉమా-దేవి-అడుగు + కవన్ = పార్వతీదేవియొక్క పాదద్వయమును, పోలంగాన్ = పోలుటకు, తలఁచియో, దూదియున్, లక్కయున్, లలితంబుగన్ = చక్కఁగా, కలసి, లత్తుక-రేకుల్, పొలుచున్ = ఒప్పును

తాత్పర్యము సౌకుమార్యమున దూదియు, వర్ణమున లక్కయు ఒకదానితోనొకటి కూడి పార్వతీదేవి పాదద్వయమును బోలఁదలఁచియో అవి లలితముగాఁ గలిసి లత్తుకరేకులుగా నొప్పెను

విశేషములు. అలంకారము హేతూత్ప్రేక్ష అడుగుఁగవ - అడుగు + కవ- పూర్వపదద్యమునందలి చన్నుఁగవ ప్రక్రియవలెనే, ఉమ - ఉ = ఓసీ! మా - (తపస్సు) వలదు అని తల్లిచేఁ జెప్పఁబడినదగుటచేఁ బార్వతికి 'ఉమ'యను పేరు వచ్చెను 'ఉమేతి మాత్రా తపసో నిషిద్ధా - పశ్చా దుమాఖ్యాం సుముఖీ జగామ ' కాళి కుమార సం 1 - 26 లత్తుక - వికృతి - అలక్తము - ప్రకృతి

క త్ర్యంబక! నగసుత నిబిడ కు
చంబుల పొలు పెన్న మాకు శక్యమె? నీ డెం
దంబునకు వచ్చునట్టి ధ్రు
వంబుగ; వే ఱొండు తగిన వర్ణన గలదే? 14

అర్థము: త్ర్యంబక = ముక్కంటీ! నగ-సుత = పర్వత పుత్రిక - (పార్వతి) యొక్క, నిబిడ - కుచంబుల - పొలుపు = సాంద్రములైన స్తనముల చక్కఁదనము, ఎన్నన్ = గణించుటకు, మాకున్, శక్యమె = తరమా? ధ్రువంబుగన్ = నిశ్చయముగా, నీ-డెందంబునకున్ = నీ హృదయమునకు, వచ్చునట్టి = నచ్చినదఁట, వేఱు + ఒండు = మఱియొక, తగిన,వర్ణన, కలదే!

తాత్పర్యము. ముక్కంటీ! పార్వతి వృద్ధమైన స్తనముల చక్కఁదనము నెన్న మా తరమా? నిశ్చయముగా లది నీ మనస్సునకు నచ్చిన దనఁగా, నిఁక సముచితమైన వర్ణన మటియొకటి కలదా? లేదనుట

విశేషములు. త్ర్యంబక - త్రి + అంబక - యణాదేశ సంధి

క పరమానందుని నిను సుఖ
పరవశుఁ గావింపనోపుఁ బరమార్థమునన్
ధరణీధరవర నందన
గురుజఘన విశేష మొరులకొలఁదియె పొగడన్? 15

అర్థము. ధరణీధర-వర-నందన = పర్వతరాజు కూఁతురు అగు పార్వతియొక్క, గురు-జఘన-విశేషము = గొప్ప మొలయొక్క పెంపు, పరమ + అర్థమునన్ = సత్యముగా, పరమ + ఆనందునిన్ = గొప్ప ఆనందముగలవానిని, నినున్, సుఖ-పరవశున్ = సౌఖ్యముచేఁ బారవశ్యము చెందినవానిని, కావింపన్ + ఓపున్ = చేయఁగలుగును, అట్టిది, పొగడన్ = పొగడుటకు, ఒరుల-కొలఁదియె = ఇతరులకు సాధ్యమా?

తాత్పర్యము. పార్వతి గొప్ప కటి ప్రదేశము పరమానందుఁడవైన నిన్ను సత్యముగా సుఖపరవశునిఁజేయఁగలదు అట్టిదానిని బొగడుట కితరులకు శక్యమా? - కా దనుట

విశేషములు. జఘనము - స్త్రీశ్రోణి పురోభాగము - స్త్రీశ్రోణి పశ్చాద్భాగము- అమరము

చ. నడు మస దింతి చన్నుల తనర్పున ముందఱు గానరాదు మా,
కడుగిడుచోటఁ గా ల్దెమలినంతన కౌనుకు బిందమయ్యెడున్;
దొడిఁబడఁజేయు మా వలన దోసము లేదని చెప్ప డాసె నాఁ
గడుబెడఁగొందు గౌరి తెలి కన్నులు వీనుల డాసి దేసియై 16

అర్థము. నడుము, అసదు = కృశము, ఇంతి = స్త్రీ (పార్వతి) యొక్క, చన్నుల - తనర్పునన్ = స్తనములయొక్క స్థౌల్యముచే, ముందఱు - ఎదుటి ప్రదేశము, మాకున్, కానన్ + రాదు = కనఁబడదు, అడుగు + ఇడు-చోటన్ = అడుగు మోపుచోట, కాల్ = కాలు, తెమలిన + అంతన్ + అ = తొట్రుపడినంతనే,

కొనుకున్ = నడుమునకు, బిందము = ఆపద, అయ్యెడున్ = అగును, తొడిఁబడన్ + చేయున్ = తొట్రుపడునట్లు చేయును మా-వలనన్, దోసము = తప్పు, లేదు + అని, చెప్పన్ = చెప్పుటకు, డాసెన్ = సమీపించెను, నాన్ = అనఁగా, గౌరి = పార్వతియొక్క, తెలి-కన్నులు = తెల్లని కన్నులు, వీనులన్ = చెవులను, డాసి = సమీపించి, దేసి + ఐ = అందమయి, కడున్ = మిక్కిలి, బెడఁగు + ఒందున్= శోభిల్లును

తాత్పర్యము. పార్వతి ఆ కర్ణాంతనేత్ర ఆమె కన్నులు చెవులను డాయుట వాని కీ విషయమును జెప్పుటకా యని తోఁచును అది యేదనఁగా - 'పార్వతి నడుము మివులఁ గ్నశించినది ఆమె స్తనముల విరివిచే నెదుటి ప్రదేశము కనఁబడదు ఆమె అడుగుపెట్టు చోటఁ గాలు తొట్రుపడినంతనే ఆమె నడుమునకు ఆపద అగును తొట్రుపడఁజేయును' మావలన దోషము లేదు అనునది ఆ విషయమును జెప్పుటకా యనునట్లు ఆమె కన్నులు చెవులవఱకు వ్యాపించి మిక్కిలి శోభిల్లును

విశేషములు . అలంకారము హేతూత్ప్రేక్ష కావ్యలింగము కొనుకు = కొనునకు - 'కువర్ణకంబు పరంబగునవుడు కవిత్రయుంబువారి ప్రయోగంబులందక్కఁ దక్కిన మహాకవి ప్రయోగంబులందును గొన్నియెడల నగాగమంబు చూపట్టదు' ప్రౌఢ శబ్ద 19 బిందము (వికృతి) - భిన్నము (ప్రకృతి) డాసి - దేసి - అనుప్రాసము

క తనుమధ్య యోప దీ గురు
ఘనకుచభారంబు దాల్పఁగా నని యజుఁ డి
మ్మున నీల మణి కణిక దీ
ర్చిన క్రియ నూఁగారుఁదీఁగ చెలువకు నమరున్ 17

అర్థము: ఈ-గురు-ఘన-కుచ-భారంబు = ఈ పెద్దస్తనముల అధికమయిన బరువు, తాల్పఁగాన్ = మోయుటకు, తను-మధ్య = సన్నని నడుము గలది-స్త్రీ-పార్వతి, ఓపదు = చాలదు, అని, అజుఁడు = బ్రహ్మ, ఇమ్మునన్ = వీలుగా, నీలమణి-కణిక = నీలమణిమయమైన సూది, తీర్చిన-క్రియన్ = అమర్చిన విధమున, చెలువకున్ = స్త్రీకి - పార్వతికి, నూఁగారు + తీఁగ = తీఁగవంటి రోమావళి, అమరున్ = ఒప్పును

తాత్పర్యము . 'ఈ గొప్పదియగు స్తనభారమును దాల్చుటకు నడుము సన్ననిదైన యీ పార్వతి చాలదు' అని బ్రహ్మ వీలుగా నీలమణిమయమైన కణిక నమర్చెనా యనునట్లు పార్వతికిఁ దీఁగవంటి రోమరాజి ఒప్పును

విశేషములు అలంకారము హేతూత్ప్రేక్షన నూఁగారుఁదీఁగ = నూఁగారు + తీగ సమాసమున ఉదంతస్త్రీసమమునకుఁ బరుషము పరమగుచుండఁగా నుగాగమము బాల సంధి 24, పిమ్మట ద్రుతకార్యము - బాల సంధి 15,16 'తనుమధ్య' అను పార్వతి విశేషణము సాభిప్రాయమగుటచే పరికరాలంకారమును

సీ అలికేశి లక్తకా దల పాదతలములు
నమృతాంశుముఖ శుక్తికాంఘ్రియుగముఁ
గంబుకంధర వ్రీహిగర్భాభజంఘలు
బిసహస్త రంభోరులసితరుచియుఁ
బూర్ణకుంభస్తన పులిన నితంబంబు
హరిమధ్య వేదిమధ్యాభినుతియుఁ
గుంభికుంభనితంబ కోకస్తనంబులు
కరభోరు మృదులతాకరయుగంబుఁ

ఆ గామశరధిజాను క్రముక కంరంబును
గమరపాద వికచకమలముఖముఁ
బల్లవాంఘ్రితల సుబర్ణాలకములు
నజునకైనఁ బొగడ నరిదిగాదె 18

అర్థము . అలి-కేశి = తుమ్మెదలవంటి కేశములుగల పార్వతియొక్క, లక్తకా-దల-పాదతలములున్ = లత్తుక రేకులుగల అడుగులును, అమృత + అంశు-ముఖ = చంద్రుని వంటి ముఖముగల పార్వతి యొక్క, శుక్తికా + అంఘ్రి-యుగమున్ = ముత్తెపుఁజిప్పల వంటి పదముల జంటయును,

కంబు-కంధర = శంఖము వంటి కంఠముగల పార్వతియొక్క, వ్రీహి-గర్భ + ఆభ-జంఘలున్ = వరిపొట్టలతో సమానములయిన పిక్కలును, బిస-హస్త = తామరతూండ్ల వంటి చేతులు గల పార్వతియొక్క, రంభా + ఊరు-లసిత-రుచియున్ = అరఁటుల వంటి తొడల ప్రకాశించు కాంతియును,

పూర్ణ-కుంభ-స్తన = నిండు కుండల వంటి స్తనములుగల పార్వతి యొక్క, పులిన-నితంబంబున్ = ఇసుక తిన్నెలవంటి పిఱుఁదును, హరి-మధ్య = సింహము

నడుము ఎంటి నడుము గల పార్వతి యొక్క, వేది-మధ్య + అభినుతియున్ = అరఁగు వంటి నడుము యొక్క పొగడ్తయును,

కుంభి-కుంభ-నితంబ = ఏనుఁగు కుంభస్థలములవంటి పిఱుఁదులుగల పార్వతి యొక్క కోక-స్తనంబులున్ = చక్రవాకములవంటి స్తనములును, కరభ + ఊరు = కరభము (మనికట్టు మొదలు చిటికెన వ్రేలి మొదలుదాఁకఁ గల చేతి వెలుపలిచోటు) వంటి తొడలుగల పార్వతి యొక్క, మృదు-లతాకర-యుగంబున్ = కోమలములయిన తీఁగలవంటి చేతుల జంటయును

కామ-శరధి-జాను = మన్మథుని అమ్ములపొది వంటి మోఁకాళ్లు గల పార్వతియొక్క, క్రముక-కంరంబును = పోఁక వంటి కంరమును, కమర-పాద = తాఁబేలు వంటి పాదములుగల పార్వతియొక్క, వికచ-కమల-ముఖమున్ = వికసించిన తామరవంటి ముఖమును, పల్లవ + అంఘ్రి-తల = చివురులవంటి పాదతలములుగల పార్వతియొక్క, సు-బర్హిణ + అలకములున్ = మంచి నెమలివంటి ముంగురులును, అజునకున్ + ఐనన్ = బ్రహ్మ కయినను, పొగడన్ = పొగడుటకు, అరిది + కాదె = అశక్యము కదా!

తాత్పర్యము . పార్వతి లత్తుకరేకులవంటి పాదతలములును, ముత్తెపుఁజిప్పలవంటి పదద్వయమును, వరిపొట్టలవంటి పిక్కలును, అరఁటుల వంటి తొడల కాంతియు, ఇనుకతిన్నెలవంటి పిఱుఁదులును, అరఁగువంటి నడుము ప్రశంసయును, చక్రవాకములవంటి స్తనములును, మృదులతలవంటి చేతుల జంటయును, పోఁకవంటి కంరమును, వికసించిన తామర వంటి ముఖమును, నెమలివంటి ముంగురులును, బొగడుటకు బ్రహ్మకైన శక్యముగాదు

విశేషములు . పార్వతి విశేషణములందును ఆమె అవయవ వర్ణనను గావించుట అరయఁదగినది ఆమె విశేషణములలోని అవయవ వర్ణ్య కేశాది పాద పర్యంతముగావించి, ఆమె అవయవములను బాదాద్యలక పర్యంతముగావించుట గమనింపఁదగినది 'దేవతానాం రూపం పాదాఙ్గుష్ఠ ప్రభృతి వర్ణ్యతే, మానుషాణాం కేశాదారభ్యేతి ధార్మికాః' - దేవతయగు పార్వతిని ఈ కవి యీ ప్రబంధమున మానుషిగాఁ జిత్రించుటచే, ఇట్లు రెండువిధముల నామె యవయములను వర్ణించుట మెచ్చఁదగినది ఈ విషయమును కవియే క్రింది వచనమున - ఆరోహిణ్యవరోహిణుల నని చెప్పుట అరయునది

వ అని యనేక ప్రకారంబుల నగజ రూప విభ్రమ సౌందర్య విలాసంబులు ఆరోహిణ్యవరోహిణుల వర్ణించుచున్న సప్తమహర్షుల వచనంబు లతను పంచబాణంబులైన ట్లింద్రుధరు డెందంబు భేదించిన రాగోత్కటంబునం దావగొనక పరమేశ్వరుం డప్పుడ హిమవంతంబున కరుగ నుద్యుక్తుండై ప్రయాణభేరి సలువం బంచిన నా క్షణంబ 19

అర్థము . అని, అనేక-ప్రకారంబులన్ = పెక్కురీతుల, అగజ-నగజ = పార్వతియొక్క, రూప-విభ్రమ-సౌందర్య-విలాసంబులు = ఆకార విలాసములు, చక్కఁదనపు విలాసములు, ఆరోహిణీ + అవరోహిణులన్ = క్రిందినుండి పైకిని, పాదాద్యలకపర్యంతమును - పైనుండి క్రిందికిని - కేశాదిపాదపర్యంతమును, వర్ణించుచున్ + ఉన్న, సప్త-మహత్ (మహా) + ఋషుల = ఏడుగురు మునివరుల, వచనంబులు = మాటలు, అతను-పంచ-బాణంబులు + ఐన + అట్లు = మన్మథుని యైదుబాణములయినవిధమున ఇందు-ధరు = చంద్రుని ధరించినవాఁడగు శివునియొక్క, డెందంబున్ + హృదయమును, భేదించినన్ = భేదింపఁగా, రాగ + ఉత్కటంబునన్ = ప్రేమాతిశయమున, తావగొనక = నిల్పోపక, పరమేశ్వరుండు, అప్పుడ (అప్పుడు + అ), హిమవంతంబునకున్, అరుగన్, ఉద్యుక్తుండు + ఐ = పూనినవాఁడయి, ప్రయాణ-భేరిన్ = ప్రయాణవాద్యమును, చఱువన్ + పంచినన్ = మ్రోయింప నాజ్ఞాపింపఁగా, ఆ-క్షణంబు + అ = ఆ క్షణమే

తాత్పర్యము : అని పెక్కువిధములఁ బార్వతి సౌందర్యవిలాసములను గ్రిందినుండిపైకిని - పాదాది కేశపర్యంతమును, పైనుండి క్రిందికిని - కేశాది పాద పర్యంతమును, వర్ణించుచున్న సప్తమహామునుల మాటలు మన్మథుని పంచబాణములుగా నీశ్వరుని హృదయమును భేదింపఁగాఁ బ్రేమాతిశయమున నిల్పోపక శివుఁడు వెంటనే హిమవంతమునకుఁబోవఁ బ్రయాణభేరి మ్రోయింపఁబంప వాక్షణమే తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : మన్మథుని పంచబాణములు - అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము

శివుని హిమవన్నగ ప్రయాణము

క భేరీరవంబు సెలఁగెన్
భోరన బ్రహ్మాండభాండపూరితమై త
త్తారాద్రిగుహల నిరర
తీరంబులఁ బెల్లుతోఁ బ్రతిధ్వను లెసఁగన్ 20

అర్థము: భేరీ-రవంబు = భేరీధ్వని, భోరనన్ = అధికముగా, బ్రహ్మాండ-భాండ-పూరితము + ఐ = భాండమువంటి బ్రహ్మాండము నిండినదయి, తద్ + తార + అద్రి-గుహలన్ = ఆ వెండికొండ గుహలందును, నిర్ఝర-తీరంబులన్ = సెలయేటిదరులందును, పెల్లుతోన్ = ఆధిక్యముతో, ప్రతి-ధ్వనులు = మార్మ్రోఁతలు, ఎసఁగన్ = అతిశయింపఁగా, చెలఁగెన్ = మ్రోసెను

తాత్పర్యము భేరీధ్వని బ్రహ్మాండభాండము నిండి కైలాసపర్వతగుహలందును, సెలయేటి దరులందును అధికముగాఁ బ్రతిధ్వను లతిశయింప మ్రోసెను

వ తదవసరంబున 21

అర్థతాత్పర్యములు: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ ధ్రువమండలంబు సముత్తుంగశృంగంబుల
సంధిల్లి రత్నభూషణము గాఁగ
నక్షత్రలోకంబు నయమొందు వర లలా
టమున మాణిక్యపట్టంబు గాఁగఁ
గనకాచలేంద్రంబు గళమునఁ గట్టిన
కమనీయ మగుహైఁడిగంట గాఁగఁ
గులపర్వతంబులు బలసి తద్దయు రమ్య
మగుసురగజ్జెల పగిది గాఁగ.

ఆ ముదముతోఁ జతుస్సముద్రముల్ గాహుల
ఘర్ఘరముల పగిదిఁ గలసి మ్రోయఁ
జెలువ మెసఁగి వచ్చి నిలిచె సురాసురా
ధీశు నెదుర నా గవేశ్వరుండు 22

అర్థము. ధ్రువ-మండలంబు = ధ్రువనక్షత్ర మండలము, సమ్ + ఉత్తుంగ-శృంగంబులన్ = మిక్కిలి యెత్తైన కొమ్ములందు, సంధిల్లి = తగులుకొని, రత్న-భూషణము = రత్నాలంకారము, కాఁగన్

నక్షత్ర-లోకంబు, నయము + ఒందు = బాగయిన, వర-లలాటమునన్ = శ్రేష్ఠమైన నుదుట, మాణిక్య-పట్టంబు = మణి పట్టము, కాగఁన్,

కనక + అచల + ఇంద్రంబు = మేరుపర్వతశ్రేష్ఠము, గళమునన్ = కంఠమందు, కట్టిన, పైఁడి-గంట = బంగారు గంట, కాఁగన్

కుల-పర్వతంబులు, బలసి = చుట్టి, తద్దయున్ = మిక్కిలి, రమ్యము + అగు = రమణీయమగు, సురగజ్జెల = మ్రోయుచున్న గజ్జెలయొక్క, పగిది = విధము, కాఁగన్

ముదముతోన్ = సంతోషముతో, చతుస్సముద్రముల్ = నాలుగు సముద్రములును, కాళుల-ఘర్ఘరముల-పగిదిన్ = కాళ్లయందలి గజ్జెల విధమున, కలసి = కూడి, మ్రోయన్ = ధ్వనింపఁగా,

ఆ-గవేశ్వరుండు (గో + ఈశ్వరుండు) = ఆ వృషభరాజు, సుర + అసుర + అధి + ఈశు + ఎదురన్ = దేవతల రాక్షసుల ప్రభువైన యీశ్వరుని ఎదుట, చెలువము = అందము, ఎసఁగి = అతిశయించి, వచ్చి, నిలిచెన్

తాత్పర్యము. ధ్రువనక్షత్ర మండలము మిక్కిలి యెత్తయిన కొమ్ములందుఁ దగులుకొని రత్నాలంకారము కాఁగను, నక్షత్రమండలము మేలయిననుదుట మణిమయపట్టము కాఁగను, మేరుపర్వతము కంఠమునఁ గట్టిన రమణీయ స్వర్ణ ఘంట కాఁగను, కులపర్వతములు బలసి మిక్కిలి సుందరములైన మ్రోయుగజ్జెలు కాఁగను, నాలుగుసముద్రములును బ్రీతితోఁ గాళ్ల గజ్జెల వలెఁ గలసి మ్రోయఁగా నా వృషభరాజము సురాసురప్రభువగు శివుని యెదుట అంద మతిశయింప వచ్చి నిలిచెను

విశేషములు : అది సామాన్య వృషభమయినచో నతిశయోక్త్యలంకారమని చెప్పవచ్చునుగాని, అది శివుని వాహనము అగువృషభము గావున నలంకారము స్వభావోక్తియే యని చెప్పనొప్పును కులపర్వతములు - ఏడు - మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము

కాళులు - కాలు + లు 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన డ - ల - ర ల కలఘులకారంబు బహుళంబుగా నగు' బాల ఆచ్చిక 13 సురాసురాధీశునెదుర - సురాసురాధీశు + ఎదుర - 'షష్ఠీసమాసంబునం దుకార ఋకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమం బగు' బాల సంధి 34 గవేశ్వరుండు - గో + ఈశ్వరుండు - 'గో' శబ్దమునకు అకారాద్యచ్చులు పరమగునేని 'గవ' 'గవ్' 'గ' ఆదేశము లగును గవ + ఈశ్వరుండు - గుణసంధిచే గవేశ్వరుండు అగును గవ్ ఆదేశమయినచో గవ్ + ఈశ్వరుండు - గవీశ్వరుండు అగును గ ఆదేశమగుచో గ ఈశ్వరుండు అగును 'గ' ఆదేశమున సంధి కాదు

వ అంతం బరమేశ్వరుండు వివాహప్రయాణప్రసాధనాలంకృతుండై 23

అర్థము : అంతన్, పరమేశ్వరుండు, వివాహ-ప్రయాణ-ప్రసాధన + అలంకృతుండు + ఐ = పెండ్లికైన పయనపుఁ గైసేఁతచే నలంకరింపఁబడినవాఁ డయి

తాత్పర్యము . అంతఁ బరమేశ్వరుఁడు పెండ్లికైన పయనమునఁ గైసేయఁబడినవాఁ డయి - తరువాతి పద్యముతో నన్వయము

చ ప్రకటితమేఘనాదములు పర్వఁగ ముందట, గీతవాద్యవ
ల్లకుల రవంబు లోలిన కెలంకుల మ్రోయఁగఁ జండి కీర్తి పా
రక పరనోరురావములు డగ్గఱి వెన్కొన, శంఖ కాహళా
ధిక నినదంబు లెల్లఁ గడు దిగ్బధిరీకృతమై చెలంగఁగాన్ 24

అర్థము : ముందటన్ = ముందు, ప్రకటిత = ప్రకటింపఁబడిన, మేఘ-నాదములు = మేఘధ్వనులు, పర్వఁగన్ = వ్యాపింపఁగను, గీత-వాద్య-వల్లకుల-రవంబులు = గీతములయు, వాద్యములయు, వీణెలయు ధ్వనులు, ఓలిన (ఓలిన్+అ) = క్రమముగా, కెలంకులన్ = పార్శ్వములందు, మ్రోయఁగన్ = ధ్వనింపఁగను, చండి-కీర్తి-పారక-పరన + ఉరు-రావములు = చండి యశస్సును పరించువారి పరనాధికధ్వనులు, డగ్గఱి = సమీపించి, వెన్కొనన్ = వెనుకనుండఁగా, శంఖ-కాహళ + అధిక-నినదంబులు = శంఖములయు, బూకాలయు, పెద్ద, ధ్వనులు, ఎల్లన్ = అన్నియును, కడున్ = మిక్కిలి, దిగ్బధిరీకృతము (దిశ్ (క్) + బధిరీకృతము) + ఐ = దిక్కులు చెవుడుపడునట్లు చేయునవి యై, చెలంగఁగాన్ = ధ్వనింపఁగా

తాత్పర్యము . ముందు మేఘధ్వనులు వ్యాపింపఁగను, గీతములయు, వాద్యములయు, వీణెలయు ధ్వనులు క్రమముగాఁ బార్శ్వములందు మ్రోయఁగను, చండి కీర్తిని బరించువారి పరనాధికధ్వనులు సమీపించి వెనుకఁబడుచుండఁగా, శంఖములయు, బాకాలయు పెద్ద శబ్దములు అన్నియు దిక్కులను జెవుడుపడునట్లు చేయునవియై ధ్వనింపఁగను - తరువాతి గద్యముతో నన్వయము

వ మణి కనక నేత్ర పట్టికామయంబగు నాయగంబునం బన్నియున్న నంది నిందుశేఖరుం డెక్కుడు 25

అర్థము . మణి-కనక-నేత్ర-పట్టికా-మయంబు = మణులు, బంగారము, పట్టువస్త్రము అనువానితో నిండినది, అగు, ఆయగంబునన్ = చిత్రకంబళముతో, పన్ని + ఉన్న = సిద్దపఱుపఁబడియున్న, నందిన్ = నందిని, ఇందు-శేఖరుండు = చంద్రుఁడు శిరోభూషణముగాఁ గలవాఁడు - శివుఁడు, ఎక్కుడున్ = ఎక్కినంతనే,

తాత్పర్యము . మణులు, బంగారము, పట్టువస్త్రము అనువానితోనిండిన చిత్రకంబళము వేసియున్న నందిని శివుఁ డెక్కినంతనే - తరువాతి పద్యముతో, నన్వయము

చ హరునకు రెండు రెండొకొ గజాజినమున్ దహనాంబకంబు నా నురువృషభేంద్రు నెక్కుటయు నొందెఁ గటిన్ విపులాభ్రపంక్తి భా స్కరుఁడు లలాటపట్టమున గంగయుఁ జంద్రుఁడు రెండు రెండొ నా శిరమునఁ బొంది రబ్జపధసింధు సుధాకరు లద్భుతంబుగాన్ 26

అర్థము . హరునకున్ - ఈశ్వరునకు, గజ + అజినమున్ = ఏనికతోలును, దహన + అంబకంబున్ = అగ్నినేత్రమును, రెండు-రెండు+ఒకొ = రెండేసి ఉన్నవేమో, నాన్ = అనఁగా, ఉరు-వృషభ + ఇంద్రున్ = గొప్పదియగు వృషభరాజమును, ఎక్కుటయున్ = ఎక్కినంతనే, కటిన్ = మొలయందు, విపుల + అభ్రపంక్తి = విరివియైన మేఘముల వరుస, లలాట-పట్టమునన్ = ఫాలపట్టికయందు, భాస్కరుఁడు = సూర్యుఁడు, ఒందెన్ = కలిగెను, గంగయున్, చంద్రుఁడున్, రెండు-రెండు+ఒ-నాన్ = రెండేసియా యనఁగా, అద్భుతంబుగాన్= ఆశ్చర్యకరముగా, శిరమునన్ = తలయందు, అబ్ద + పధ + సింధు-సుధాకరులు = ఆకాశగంగానదియును, చంద్రుఁడును, పొందిరి = కలిగిరి

తాత్పర్యము ఈశ్వరునకు ఏనికతోలును, అగ్నినేత్రమును రెండేసి యున్నవా యనునట్లు అతఁడు తన వాహనమైన వృషభరాజము నెక్కఁగానే మొలయందు విరివియైన మేఘముల వరుసయును, ఫాలపట్టికయందు సూర్యుఁడును గలిగిరి అతనికి గంగయును, జంద్రుడును ఇద్దఱిద్ద ఱుండిరా యనునట్లు ఆశ్చర్యకరముగా శిరస్సుపై నాకాశగంగాసుధాకరు లుండిరి

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష ఆతని వాహనమైన వృషభము మిక్కిలి యెత్తయిన దగుటచే దానిపై నాసీనుఁడయిన ఈశ్వరుని కటిమండలమున మేఘమండలము వ్యాపించి మఱియొక ఏనుఁగుచర్మమువలె నుండెను అతని ఫాల మింకను నెత్తయి సూర్యమండలము వఱకు వ్యాపించుటచే, సూర్యుఁడు మఱియొక అగ్నినేత్రమువలె నుండెను అతని శిరస్సు ఆకాశమువఱకు వ్యాపించుటచే శిరస్సున నదివఱకుండిన గంగగాక మఱియొక ఆకాశగంగయు, చంద్రుఁడుగాక మఱియొక చంద్రుఁడు నుండినట్లు తోఁచెనని భావము ఆ వృషభేంద్ర మంతయున్నతముగా నుండె ననుట

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము **27**

క జంగమ హిమవంతము నురు
జంగమ రజతాద్రి యెక్కి చను విధమున నో
జం గమనీయ గవేశు భు
జంగమరాట్కటకుఁ డెక్కి చనునెడ నొప్పెన్ **28**

అర్థము. భుజంగమ-రాట్ + కటకుఁడు = నాగరాజు హస్తాభరణముగాఁ గలవాఁడు - శివుఁడు, ఓజన్ = ఉత్సాహముతో, కమనీయ-గో + ఈశున్ = అందమైన గోరాజును - నందిని, ఎక్కి, చను + ఎడన్ = వెడలునప్పుడు, ఉరు-జంగమ-రజత + అద్రి = గొప్పదియగు, చరమైన వెండికొండ, జంగమ-హిమవంతమున్ = చరమైన హిమవంతమును, ఎక్కి, చను-విధమునన్, ఒప్పెన్

తాత్పర్యము : శివుఁడు నంది నెక్కి వెడలునప్పుడు చరమైన గొప్ప కైలాసము చరమైన హిమవంతము నెక్కి వెడలున ట్లొప్పెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష గవేశున్ = గో + ఈశున్ = గవ + ఈశున్ = గవేశున్ చూడు 22వ పద్యము ప్రతిపాదాదిని 'జంగమ' శబ్దము పున పున రావృత్తమగుటచే ననుప్రాసాలంకారము చను నెడ = చను + ఎడ 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు' బాల సంధి 33

క సురచాప వృతాసిత జల
ధర మంబరతలమునందుఁ దనరె నొకో నా
గరుడి విచిత్రాంగముపై
హరి యెక్క వెలింగె మేన హరినీలరుచుల్ 29

అర్థము సుర-చాప-వృత + అసిత-జలధరము = ఇంద్రధనుస్సుచే నావరింపఁబడిన నల్లని మేఘము, అంబర-తలము + అందున్ = ఆకాశప్రదేశమునందు, తనరెన్ + ఒకో = ఒప్పెనా, నాన్ = అనఁగా, హరి + విష్ణువు, గరుడి-విచిత్ర + అంగముపైన్ = గరుత్మంతుని ఆశ్చర్యకరమైన శరీరముమీఁద, ఎక్కన్ = ఎక్కఁగా, మేనన్ = శరీరమునందు, హరినీలరుచుల్ = ఇంద్రనీలకాంతులు వెలింగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము . ఇంద్రధనుస్సుచే నావరింపఁబడిన నల్లని మేఘము ఆకాశప్రదేశమునందు ఒప్పెనా యనునట్లు ఆ గరుత్మంతుని ఆశ్చర్యకరమయిన శరీరముపై విష్ణు వెక్కఁగా నతనిమేన నింద్రనీలకాంతులు వెలిఁగెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క శర దమలాభ్రముపై లస
దరుణద్యుతిబింబ ముదయ మయ్యెనొకో నా
వర రాజహంసపై నం
బురుహాసనుఁ డొప్పె రాగపూర్ణాంగముతోన్ 30

అర్థము శరద్ + అమల + అభ్రముపైన్ = శరత్కాలమునందలి నిర్మలమైన ఆకాశముపై, లసత్ + అరుణ-ద్యుతి - బింబము = ప్రకాశించుచున్న సూర్యుని బింబము, ఉదయము + అయ్యెన్ + ఒకో-నాన్ = ఉదయించెనా యనఁగా, వర-రాజహంసపైన్ = శ్రేష్ఠమైన రాజహంసముమీఁద, అంబురుహ + ఆసనుఁడు = బ్రహ్మ, రాగ-పూర్ణ + అంగముతోన్ = ఎఱుపుతో నిండిన శరీరముతో, ఒప్పెన్

తాత్పర్యము .శరత్కాలమునందలి నిర్మలమైన ఆకాశముపైఁ బ్రకాశించు సూర్యబింబ ముదయించెనా యనునట్లు శ్రేష్ఠమైన రాజహంసముమీఁద బ్రహ్మ ఎఱుపుతో నిండిన శరీరముతో నొప్పెను

విశేషములు .అలంకార ముత్ప్రేక్ష శారదాభ్రము నిర్మలమై రాజహంసము

వలెనే యుండును ఉదయత్సూర్యబింబము బ్రహ్మ శరీరమువలెనే రాగపూర్ణమై యుండును

తే వితతరుచిఁ బొల్చు రజతపర్వతముమీఁద
నెలమిఁ బూచిన నెత్తమ్మికొలన పోలె
నమరె నైరావతముమీఁద నమరనాథుఁ
డలరు'నయనాబ్జములు వేయుఁ బొలయుచుండ 31

అర్థము . వితత-రుచిన్ = అధికమైన కాంతితో, పొల్చు = ఒప్పునట్టి, రజత-పర్వతము మీఁదన్ = వెండికొండపై, పూచిన-నెత్తమ్మి (నెఱ + తమ్మి) - కొలను + అ - పోలెన్ = వికసించిన తామరకొలనే అనునట్లు, అమర-నాథుఁడు = దేవేంద్రుఁడు అలరు-నయన + అబ్జములు = వికసించిన నేత్రపద్మములు, వేయున్ = వేయియును, పొలయుచున్ + ఉండన్ = ప్రకాశించుచుండఁగా, ఐరావతము మీఁదన్ = వెల్లయేనుఁగుపై, అమరెన్ = ఒప్పెను

తాత్పర్యము . అధికమైన కాంతితో నొప్పు వెండికొండపై వికసించిన తామరకొలనే యనునట్లు, దేవేంద్రుఁడు వికసించు కనుదమ్ములు వేయియు నొప్పుచుండఁగా నైరావతముపై నొప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క మారుతగతిఁ జను మణికన
కోరు విమానములమీఁద నొప్పిరి వర బృం
దారకసతు లుడువృత సం
ధ్యారుణితాంబుదతటిల్లతావలి వోలెన్ 32

అర్థము . వర-బృందారక-సతులు = శ్రేష్ఠురాండ్రయిన దేవతాస్త్రీలు, ఉడు-వృత-సంధ్యా + అరుణిత + అంబుద-తటిత్ + లతా + ఆవలి + పోలెన్ = నక్షత్రములచే నావరింపఁబడిన సంధ్యాసమయముచే ఎఱ్ఱగాఁజేయఁబడిన మేఘములందలి మెఱుపుదీఁగల విధమున, మారుత-గతిన్ = వాయుగమనముతో, చను = పోవు, మణి-కనక + ఉరు-విమానముల మీఁదన్, ఒప్పిరి

తాత్పర్యము . దేవతాస్త్రీలు-నక్షత్రములతో నావరింపఁబడి సంధ్యచే ఎఱ్ఱగాఁజేయఁబడిన మేఘములందలి విద్యుల్లతల సమూహమువలె, వాయువేగముతోఁబోవు మణికనకమయములైన పెద్ద విమానములపై నొప్పిరి

విశేషములు అలంకార ముపమ తటిల్లత - తటిత్ + లత - తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణము ఆదేశ మగును

వ మఱియు ననేకాశ్వ రథ కరి కరేణు శిబి కాందోల మృగ ఖగ విమా నారోహకులై చతుర్దశభువనంబుల జనంబులు భూనభోంతరాపూరితంబులై పరమసుఖ లీల నిజేచ్ఛావిహారు లగుచుం జను నవసరంబున 33

అర్థము మఱియున్, అనేక + అశ్వ-రథ-కరి-కరేణు-శిబికా + ఆందోల-మృగ-ఖగ-విమాన + ఆరోహకులు + ఐ = పెక్కు గుఱ్ఱములు, ఏనుఁగులు, పల్లకులు, ఊయలలు, మృగములు, పక్షులు, విమానములు అనువాని నెక్కినవారయి, చతుర్ + దశ - భువనంబుల-జనంబులున్ = పదునాలుగు లోకములందలి జనులును, భూ-నభస్(ః) + అంతర + ఆపూరితంబులు + ఐ = భూమ్యాకాశముల నడుమ నిండినవయి, పరమ-సుఖ-లీలన్ = ఉత్కృష్టమైన సౌఖ్య విలాసముతో, నిజ + ఇచ్ఛా-విహారులు = స్వేచ్ఛతోడి విహారములు గలవారు, అగుచున్, చను + అవసరంబునన్ = పోవు సమయమునందు

తాత్పర్యము మఱియును పెక్కు గుఱ్ఱములు, ఏనుఁగులు, ఆడేనుఁగులు, పల్లకులు, ఊయలలు, మృగములు, పక్షులు, విమానములు అనువాని నారోహించి, పదునాలుగు లోకములవారును మిక్కిలి సుఖముతో స్వేచ్ఛగా విహరించుచుఁ బోవుసమయమున - తరువాతి పద్యముతో నన్వయము

**చ ఉరగులు కేతుదండముల యోలములం దనురక్తి నొంది ఖే
చరు లమితాతపత్రముల చాటున దుస్సహలోలభావులై,
గరుళులు కేతనాంతముల క్రందునఁ బొందులు గాంచి లీలతో
సురతసుఖంబులంది రతిశూర్పకవైరిరసాతిరేకులై 34**

అర్థము : ఉరగులు = నాగులు, కేతు-దండముల + ఓలములన్ = టెక్కెపుఁగఱ్ఱల మఱుఁగులందు, అనురక్తిన్ = అనురాగమును, ఒంది = పొంది, ఖేచరులు = గగనచరులు, అమిత + ఆతపత్రముల-చాటునన్ = అధికమైన గొడుగుల మఱుఁగునను, దుస్సహ-లోల-భావులు + ఐ = సహించుటకు శక్యముకాని చంచల భావములు గలవారయి, గరుళులు = గరుడులు, కేతన +

అంతముల -క్రందునన్ = ధ్వజముల కొనల సందడియందును, పొందులు + కాంచి = కూటములు పొంది, లీలతోన్ = విలాసముతో, అతి-శూర్పకవైరి-రస + అతిరేకులు + ఐ = అమితమైన మన్మధరసా (శృంగారరసా) పరిమితత్వము గలవారయి, సురత-సుఖంబులు = రతిసౌఖ్యములు, అందిరి

తాత్పర్యము .నాగులు టెక్కెపు దండముల మఱుఁగులందు అనురాగమును బొందియు, గగనచారులు గొడుగుల మాటున దుర్భరమైన చంచలత్వము గలవారయి, గరుడులు ధ్వజముల కొనల సందడియందుఁ గూటములు పొంది, విలాసముతో, అమితమైన శృంగారరసాతిరేకము గలవారయి రతిసౌఖ్యముల నందిరి

విశేషములు . ఉరగులు - ఉరగీ - ఉరగ ఏకశేషవృత్తి ఖేచరులు - ఖేచరీ - ఖేచర అట్లే గరుడీ - గరుడ - గరుడులు అయి యుండునా ? గరుళులు - గరుడి+లు 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' బాల తత్సమ 45 గరుడు+లు 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబు లయి యుదంతంబులయిన డ ల ర ల కలఘులకారంబు బహుళంబుగా నగు' బాల ఆచ్చిక 13

వ మఱియుం గులశిఖరి శిఖరాగ్రతల ఘనాఘనపట లాంతర సుర తరంగిణీ పులినప్రదేశంబుల ననేకు లనేకప్రకారంబుల విహరించుచు 35

అర్థము .మఱియున్, కుల-శిఖరి - శిఖర + అగ్ర-తల-ఘనా-ఘన-పటల + అంతర-సుర-తరంగిణీ-పులిన ప్రదేశంబులన్ = కుల పర్వతములయొక్క, శిఖరములయొక్క పలు ప్రదేశములందలి, వర్షాకాలపు మేఘముల సమూహములోపలను, ఆకాశగంగాసైకత స్థలములందును, అనేకులు = పెక్కండ్రు, అనేక-ప్రకారంబులన్ = పెక్కు రీతుల, విహరించుచున్ = క్రీడించుచు

తాత్పర్యము : మఱియును గులపర్వతశిఖరముల పలుప్రదేశములందలి వర్షాకాలపు మేఘముల సమూహములోపలను, ఆకాశగంగా సైకత స్థలములందును పెక్కండ్రు పెక్కువిధములఁ గ్రీడించుచు తరువాతి పద్యముతో నన్వయము

సీ ముదితల కుచకుంభముల ప్రతిబింబము
లనఁ గుంభికుంభంబు లొనరి తనర
కాంతల సితదంత కాంతి పైఁ బర్వె నా
మణిహేమదండచామరలు వొలయ
సుదతుల వాలారుచూడ్కుల మెఱుఁగులు
నెరసె నా నిశితాస్త్రనికర మెసఁగ
సతుల నీలాలకద్యుతి దొంగలించె నాఁ
గప్పారి జల్లితొంగళ్లు గ్రాల

తే నమరరమణీసమేతులై యమరముఖ్యు
లమరి తమతమ రాజ్యచిహ్నములతోడ
నెలసి కర మర్థితోఁ దన్ను బలసి కొలిచి
నడవ శీతాద్రి కభవుండు నడచెఁ బేర్మి 36

అర్థము. ముదితల - స్త్రీలయొక్క, కుచ-కుంభముల = కుండలవంటి స్తనముల యొక్క, ప్రతిబింబములు + అనన్, కుంభికుంభములు = ఏనుఁగుల కుంభస్థలములు, ఒనరి = కలిగి, తనరన్ = ఒప్పఁగా,

కాంతల = స్త్రీలయొక్క, సిత-దంత-కాంతి = తెల్లని దంతముల ప్రకాశము, పైన్ = పైని, పర్వెన్ + నాన్ = వ్యాపించెనన, మణి-హేమ-దండ-చామరలు = మణులతోను, బంగారముతోను నిర్మింపఁబడిన దండములుగల వింజామరలు, పొలయన్ = ప్రకాశింపఁగా,

సుదతుల = స్త్రీలయొక్క, వాలారు-చూడ్కుల-మెఱుఁగులు = నిడుదలయిన చూపుల కాంతులు, నెరసెన్ + నాన్ = వ్యాపించెనా యన, నిశిత + అస్త్ర-నికరము = వాఁడియైన బాణముల సమూహము, ఎసఁగన్ = అతిశయింపఁగా,

సతుల = స్త్రీలయొక్క, నీల + అలక-ద్యుతి = నల్లని ముంగురుల కాంతి, తొంగలించెన్ + నాన్ = ప్రసరించెనా యన, కప్పారి = నల్లనయి, జల్లి-తొంగళ్లు= జాలరుగల గొడుగులు, క్రాలన్ = ఒప్పఁగా,

అమర-ముఖ్యులు = దేవతాశ్రేష్ఠులు, అమర-రమణీసమేతులు + ఐ = దేవతాస్త్రీలతోఁ గూడినవారయి, అమరి = ఒప్పి, తమ-తమ-రాజ్య-

అంతముల -క్రందునన్ = ధ్వజముల కొనల సందడియందును, పొందులు + కాంచి = కూటములు పొంది, లీలతోన్ = విలాసముతో, అతి-శూర్పకవైరి-రస + అతిరేకులు + ఐ = అమితమైన మన్మథరసా (శృంగారరసా) పరిమితత్వము గలవారయి, సురత-సుఖంబులు = రతిసౌఖ్యములు, అందిరి

తాత్పర్యము .నాగులు టెక్కెపు దండముల మఱుఁగులందు అనురాగమును బొందియు, గగనచారులు గొడుగుల మాటున దుర్భరమైన చంచలత్వము గలవారయి, గరుడులు ధ్వజముల కొనల సందడియందుఁ గూటములు పొంది, విలాసముతో, అమితమైన శృంగారరసాతిరేకము గలవారయి రతిసౌఖ్యముల నందిరి

విశేషములు . ఉరగులు - ఉరగీ - ఉరగ ఏకశేషవృత్తి ఖేచరులు - ఖేచరీ - ఖేచర అట్లే గరుడీ - గరుడ - గరుడులు అయి యుండునా ? గరుళులు - గరుడి+లు 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' బాల తత్సమ 45 గరుడు+లు 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబు లయి యుదంతంబులయిన డ ల ర ల కలఘులకారంబు బహుళంబుగా నగు' బాల ఆచ్చిక 13

వ మఱియుం గులశిఖరి శిఖరాగ్రతల ఘనాఘనపట లాంతర సుర తరంగిణీ పులినప్రదేశంబుల ననేకు లనేకప్రకారంబుల విహరించుచు. 35

అర్థము .మఱియున్, కుల-శిఖరి - శిఖర + అగ్ర-తల-ఘనా-ఘన-పటల + అంతర-సుర-తరంగిణీ-పులిన ప్రదేశంబులన్ = కుల పర్వతములయొక్క, శిఖరములయొక్క పలు ప్రదేశములందలి, వర్షాకాలపు మేఘముల సమూహములోపలను, ఆకాశగంగాసైకత స్థలములందును, అనేకులు = పెక్కండ్రు, అనేక-ప్రకారంబులన్ = పెక్కు రీతుల, విహరించుచున్ = క్రీడించుచు

తాత్పర్యము : మఱియును గులపర్వతశిఖరముల పలుప్రదేశములందలి వర్షాకాలపు మేఘముల సమూహములోపలను, ఆకాశగంగా సైకత స్థలములందును పెక్కండ్రు పెక్కువిధములఁ గ్రీడించుచు తరువాతి పద్యముతో నన్వయము

సీ ముదితల కుచకుంభముల ప్రతిబింబము
లనఁ గుంభికుంభంబు లొనరి తనర
కాంతల సితదంత కాంతి పైఁ బర్వె నా
మణిహేమదండచామరలు వొలయ
సుదతుల వాలారుచూడ్కుల మెఱుఁగులు
నెరసె నా నిశితాస్త్రనికర మెసఁగ
సతుల నీలాలకద్యుతి దొంగలించె నాఁ
గప్పారి జల్లితొంగళ్లు క్రాల

తే నమరరమణీసమేతులై యమరముఖ్యు
లమరి తమతమ రాజ్యచిహ్నములతోడ
నెలసి కర మర్దితోఁ దన్ను బలసి కొలిచి
నడవ శీతాద్రి కభవుండు నడచెఁ బేర్మి 36

అర్థము : ముదితల - స్త్రీలయొక్క, కుచ-కుంభముల = కుండలవంటి స్తనముల యొక్క, ప్రతిబింబములు + అనన్, కుంభికుంభములు = ఏనుఁగుల కుంభస్థలములు, ఒనరి = కలిగి, తనరన్ = ఒప్పఁగా,

కాంతల = స్త్రీలయొక్క, సిత-దంత-కాంతి = తెల్లని దంతముల ప్రకాశము, పైన్ = పైని, పర్వెన్ + నాన్ = వ్యాపించెనన, మణి-హేమ-దండ-చామరలు = మణులతోను, బంగారముతోను నిర్మింపఁబడిన దండములుగల వింజామరలు, పొలయన్ = ప్రకాశింపఁగా,

సుదతుల = స్త్రీలయొక్క, వాలారు-చూడ్కుల-మెఱుఁగులు = నిడుదలయిన చూపుల కాంతులు, నెరసెన్ + నాన్ = వ్యాపించెనా యన, నిశిత + అస్త్ర-నికరము = వాఁడియైన బాణముల సమూహము, ఎసఁగన్ = అతిశయింపఁగా,

సతుల = స్త్రీలయొక్క, నీల + అలక-ద్యుతి = నల్లని ముంగురుల కాంతి, తొంగలించెన్ + నాన్ = ప్రసరించెనా యన, కప్పారి = నల్లనయి, జల్లి-తొంగళ్లు= జాలరుగల గొడుగులు, క్రాలన్ = ఒప్పఁగా,

అమర-ముఖ్యులు = దేవతాశ్రేష్ఠులు, అమర-రమణీసమేతులు + ఐ = దేవతాస్త్రీలతోఁ గూడినవారయి, అమరి = ఒప్పి, తమ-తమ-రాజ్య-

చిహ్నములతోడన్= తమతమ రాచటికపుఁజిన్నెలతో, ఎలసి = కూడి, కరము = మిక్కిలి, అర్థితోన్ = కోరికతో, తన్మున్, బలసి = చుట్టి, కొలిచి = సేవించి, నడవన్, అభవుండు, పేర్మిన్ = గొప్పతనముతో, శీత + అద్రికిన్ = హిమపర్వతమునకు, నడచెన్

తాత్పర్యము. తమ యింతుల కుంభములవంటి కుచముల ప్రతిబింబము లనఁగా నేనుఁగుల కుంభస్థలము లొప్పఁగను, తమ స్త్రీల తెల్లని దంతముల కాంతి పైని వ్యాపించెనా యన మణిహేమమయములైన దండములుగల వింజామరలు ప్రకాశింపఁగను, తమ పడఁతుల నిడుపులైన చూపుల కాంతులు వ్యాపించెనా యన వాఁడి బాణముల సమూహ మొప్పఁగను, తమ రమణుల నల్లని ముంగురుల కాంతి ప్రసరించెనా యన నల్లనై కుచ్చులు గల గొడుగు లొప్పఁగను, దేవతాశ్రేష్ఠులు దేవతాస్త్రీలతోఁగూడి తమ తమ రాచటికపుఁ జిన్నెలతో మిక్కిలి కోరి తన్నుఁ జుట్టి కొలిచి నడవఁగా శివుఁడు హిమపర్వతమునకు గొప్పతనముతో నడచెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష దేవతల రాజ్యచిహ్నములన్నియుఁ దమ ప్రియురాండ్ర అవయములవలెనే యున్నవని వర్ణించుట రమ్యము 'చామరా' అను ఆకారాంత స్త్రీలింగరూపముగూడఁ గలదు 'చామర' దాని తత్సమ రూపము

వ అయ్యవసరంబున 37

అర్థతాత్పర్యములు . ఆ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క. సురవనితా కర చామీ
కర చామర పవన చలిత గంగాజల శీ
కర నికర మడరి విద్యా
ధర ఖేచర దివిజ గణ పథశ్రమ మార్చెన్. 38

అర్థము: సుర నికరము సుర-వనితా = దేవతాస్త్రీల యొక్క, కర= చేతులందలి, చామీకర-చామర = బంగారు వింజామరల వలన, చలిత = కదలిన, గంగా-జల-శీకర-నికరము = గంగ నీటి తుంపరల సమూహము, అడరి = అతిశయించి, విద్యాధర-ఖేచర-దివిజ-గణ-పథ-శ్రమము = విద్యాధరులయు, గగనచరులయు, దేవతాసమూహములయు మార్గాయాసమును, ఆర్చెన్ = ఉపశమిల్లఁజేసెను

తాత్పర్యము దేవతాస్త్రీల చేతులందలి బంగారు వింజామరల గాలిచే గదలిన గంగాజలముల తుంపరల గుంపు అతిశయించి విద్యాధరులయు, గగనచరులయు, దేవగణములయు మార్గాయాసము నపనయించెను

వ మఱియు - తరువాతి పద్యముతో నన్వయము 39

మహాస్రగ్ధర సితతుంగాంగప్రభాభాసిత సురగరుడశ్రేణి సంధిల్ల బూర్ణా
మృత వారాశి ప్రలీనామితజల బడబామేయ విభ్రాంతి విస్ప
ష్టత రారాజజ్జటాజూట సురుచుల నజాండంబు సంధ్యాభ సంధా
దితలీలం గ్రాల దేజో2ధికగతి నడచెన్ దేవదేవుండు పేర్మిన్ 40

అర్థము. సిత శ్రేణి సిత = తెల్లనిదియు, తుంగ = ఎత్తయినదియు (అగు) అంగ = శరీరము యొక్క, ప్రభా = కాంతిచేత, భాసిత = ప్రకాశించిన, సుర-గరుడ-శ్రేణి = దేవతలయు, గరుడులయు వరుస, సంధిల్లన్ = కలుగగా, పూర్ణ + అమృత-వారాశి-ప్రలీన + అమిత-జల-బడబా + అమేయ-విభ్రాంతిన్ = నిండిన అమృతసముద్రమునందు లీనమైన అమితజలముయొక్కయు బడబాగ్ని యొక్కయు, అపరిమితమైన విభ్రాంతితో, విస్పష్టతర + ఆరాజత్ + జటా-జూట-సురుచులన్ = మిక్కిలి స్పష్టముగా ప్రకాశించుచున్న జడముడియొక్క మంచి కాంతులతో, అజాండంబు = బ్రహ్మాండము, సంధ్యా + ఆభ-సంధాదిత-లీలన్ = సంజకాంతితో గప్పబడిన విధమున, క్రాలన్ = ఒప్పగా, దేవదేవుండు = శివుడు, పేర్మిన్ = గొప్పతనముతో, తేజస్ + అధిక-గతిన్ = తేజస్సుచే నధికమైన గమనముతో, నడచెన్

తాత్పర్యము. దేవదేవుడయిన శివుడు అధికమైనతేజస్సుతోడి గమనముతో నడచెను అతని తెల్లనిదియు, ఎత్తయినదియు అగు మేని కాంతిచే సురగరుడుల శ్రేణి ప్రకాశించుచుండెను అమృతసముద్రమందలి అపరిమిత జల బడబాగ్నుల భ్రాంతితో మిక్కిలి స్పష్టముగా బ్రకాశించుచున్న జటాజూటపుగాంతులచే బ్రహ్మాండము సంజకాంతులతో గప్పినట్లు ఒప్పెను

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష భ్రాంతిమంతము ఆరాజత్ + జటా= ఆరాజజ్జటా మహాస్రగ్ధరాలక్షణమునకు బ్రథమాశ్వాసమునందలి 68వ పద్యమును జూచునది

వ ఇట్లు త్రినయనుండు దిన శుభ ప్రయాణంబుల హిమవంతంబునకుం
జనుదెంచె నంతం దుహినాచలాధీశ్వరుం డీశ్వరురాక యెఱింగి యాక్షణంబ
మహోత్సవంబు సేయించిన 41

అర్థము. ఇట్లు, త్రినయనుండు = ముక్కంటి, దిన-శుభ-ప్రయాణంబులన్= పగటి శుభప్రయాణములచే, హిమవంతంబునకున్, చనుదెంచెన్ = వచ్చెను, అంతన్, తుహిన + అచల + అధి + ఈశ్వరుండు = మంచుకొండఱేఁడు, ఈశ్వరు= శివునియొక్క, రాక, ఎఱింగి, ఆక్షణంబు + అ = ఆక్షణమే, మహత్ (మహా) + ఉత్సవంబు, చేయించినన్

తాత్పర్యము ఇట్లు ముక్కంటి పగటి శుభ ప్రయాణములచే హిమవంతమునకు వచ్చెను అంత హిమవంతుఁడు ఈశ్వరుని రాక ఎఱిఁగి ఆక్షణమే మహోత్సవము చేయింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

సీ మణి హేమ రచిత తోరణములుఁ బల్లవ
తోరణములు వస్త్రతోరణములు
మకరతోరణములు ముకురతోరణములు
వీధుల వీధుల వెలసి తనరె
వాతపూరణములుఁ గేతనానీకంబుఁ
గలు వడగలు నెల్లకడలఁ బొలసెఁ
గస్తూరి మ్రేఁకపైఁ గర్పూర మౌక్తిక
రంగవల్లులు నొప్పె నంగణములఁ

ఆ గనక వస్తు పూర్ణ కలశాలిపై మణి
దర్పణములు నిల్చి తద్ద వొల్చె
జగములందుఁ బేర్మి నెగడు పురంబుల
చెలువ మిప్పురమున వెలసె ననఁగ 42

అర్థము: జగముల + అందున్ = లోకములందు, పేర్మి = గొప్పతనము, నెగడు = ఒప్పునట్టి, పురంబులన్ = పురములందలి, చెలువము = అందము, ఇప్పురమునన్ (ఈ + పురమునన్) = ఈ నగరమున, వెలసెన్ + అనఁగన్ = ఒప్పె ననఁగా, మణి-హేమ-రచిత-తోరణములున్ = మణులతోను బంగారముతోను నిర్మింపఁబడిన తోరణములును, పల్లవ-తోరణములున్ = చివురుల తోరణములును, వస్త్ర-తోరణములున్ = గుడ్డల-తోరణములున,

మకర-తోరణములున్ = మొసలి యాకారపుఁదోరణములును, ముకుర-తోరణములున్ = అద్దాల (అరవిరి మొగ్గల) తోరణములును, వీధుల-వీధులన్ = వీధివీధిని, వెలసి = కలిగి, తనరెన్ = ఒప్పెను

వాత-పూరణములున్ = గాలితో నిండి తలగడలవలె సౌధాగ్రముల వ్రేలాడఁగట్టఁబడిన ధ్వజవిశేషములును, కేతన + అనీకంబున్ = ధ్వజముల సమూహమును, కలువడగలున్ = వీరధ్వజములును, ఎల్ల-కడలన్ = అన్ని దిక్కులందును, పొలసెన్ = వ్యాపించెను

కస్తూరి-మ్రేఁకపైన్ = కస్తూరి పూఁతపై, కర్పూర-మౌక్తిక - రంగవల్లులున్ = కప్పురపు, ముత్యాల ముగ్గులును, అంగణములన్ = ముంగిళ్లను, ఒప్పెన్

కనక-వస్తు-పూర్ణ-కలశ + ఆలిపైన్ = బంగారువస్తువులతో నిండిన కలశముల వరుసపై, మణి-దర్పణములు = మణిమయములైన అద్దములు, నిల్చి, తద్ద = మిక్కిలి, పొల్చెన్

తాత్పర్యము. లోకములందు గొప్పతనము ఒప్పు పురములందలి అందమీ పురమున నొప్పెననఁగా, ఓషధిప్రస్థపురమున వీధి వీధిని మణిస్వర్ణమయ తోరణములును, చివురులతోరణములును, వస్త్రతోరణములును, మకరతోరణములును, ముకురతోరణములును ఒప్పెను వాతపూరణములును, ధ్వజసమూహమును, వీరధ్వజములును, అన్నిదిక్కులను వ్యాపించెను కస్తూరిపూఁతపై కర్పూరముతోను, ముత్యాలతోను ముగ్గులు ముంగిళ్ల నొప్పెను బంగారువస్తువులతో నిండిన కలశముల వరుసపై మణిమయములైన అద్దములు నిలిచి మిక్కిలి ఒప్పెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష స్వభావోక్తి

క కలధౌత హర్మ్యములపైఁ
గలివడగలు గలయ నెగసి క్రాలెం దద్దో
హలమునఁ బురసతి తన మన
మలరి మొగిం జేతులెత్తి యాడిన భంగిన్ 43

అర్థము. కలధౌత-హర్మ్యములపైన్ = వెండి (బంగారు) మేడలమీఁద, కలివడగలు = వీరధ్వజములు, కలయన్ = అంతటను, నెగసి = ఎగసి = ఎగిరి

తద్ + దోహలమునన్ = ఆ యుత్సాహముతో, పుర-సతి = పురమనెడు స్త్రీ, తన-మనము = తన మనస్సు, అలరి = సంతోషించి, మొగిన్ = ఉత్సాహముతో, చేతులు, ఎత్తి, ఆడిన-భంగిన్ = ఆడిన విధమున, క్రాలెన్ = ఒప్పెను

తాత్పర్యము వెండి (బంగారు) మేడలపై వీరధ్వజములు అంతట నెగిరి, పురమనెడి స్త్రీ ఆ యుత్సాహముతో మన మలరి పూనికమ్రైఁ జేతులెత్తి నృత్యము చేసెనా యనునట్లు ఒప్పెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష కలిపడగలు (రూపాం) కలువడగలు కలధౌత-వెండియు, బంగారమును 'కలధౌతం రూప్య హేమ్నో:' అమరము

తే **అప్పురమున వణిగ్జను లాపణములఁ**
గలయఁ బచరించియున్న నిర్మలినరత్న
రాశు లొప్పె నుమావరు రాక కర్థి
వెలయ నెత్తిన వలపుదీవియలు వోలె. **44**

అర్థము . అప్పురమునన్ (ఆ + పురమునన్) = ఆ నగరమునందు, వణిజ్(క్) + జనులు = వర్తకజనులు, ఆపణములన్ = అంగడులందు, కలయన్ = అంతటను, పచరించి + ఉన్న = అమర్చియున్న, నిర్మలిన-రత్న-రాశులు = అమలములైన రత్నముల ప్రోవులు, ఉమా-వరు-రాకకున్ = ఉమ భర్త రాకకు, అర్థిన్ = కోరికతో, వెలయన్ = ప్రసిద్ధమగునట్లు ఎత్తిన, వలపు-దీవియలు + పోలెన్ = ప్రీతిసూచక దీపములవలె, ఒప్పెన్

తాత్పర్యము : ఆ ఓషధిప్రస్థపురమున వర్తకులు అంగళ్లలో నంతట, నమర్చియున్న నిర్మలములైన రత్నరాశులు శివునిరాకకై కోరికతోఁ బ్రసిద్ధముగా నెత్తిన ప్రీతిసూచకదీపములో యన నొప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష వలపుదీవియలు-రాగదీవియలు? తానదీవియలు అని సాహిత్య అకాడమీ ప్రతి

వ. అంత హిమవంతుం డనంత సామ్రాజ్యవిభవాన్వితుండై పరమేశ్వరునకు నెదురుసని సమ్మదరసపూరితుం డగుచు **45**

అర్థము : అంతన్, హిమవంతుండు, అనంత-సామ్రాజ్య-విభవ + అన్వితుండు + ఐ = అంతులేని సామ్రాజ్యవైభవముతోఁ గూడినవాఁడయి,

పరమేశ్వరునకున్, ఎదురు + చని = ఎదురేఁగి, సమ్మదరస-పూరితుండు = ఆనంద రసముతో నిండినవాఁడు, అగుచున్

తాత్పర్యము. అంత హిమవంతుఁడు అనంతమైన సామ్రాజ్యవైభవముతోఁ గూడినవాఁడయి పరమేశ్వరున కెదురేఁగి ఆనందరసపూరితుఁడగుచు - తరువాతి పద్యముతో నన్వయము

మహాస్రగ్ధర ఫణభృన్నాథోత్తమాంగప్రకర మణి విభాభాసితోత్తుంగజూటా
రుణ సద్యోత ప్రసంగారుణిత బహుపదారూఢ దేవాహి దిక్చా
రణ సిద్ధాదిత్య యక్షోరగ దనుజ మునీంద్ర ప్రకాశాంగు ఫాలే
క్షణు వాణీంద్రాచ్యుతేంద్రాగణితనుతయశుం గాంచె నద్రీశుఁ డీశున్ 46

అర్థము. ఫణ ప్రకాశాంగున్ ఫణభృత్ = పడగలను ధరించిన వానియొక్క-పాములయొక్క, నాథ = ప్రభువుయొక్క - వాసుకియొక్క, ఉత్తమాంగ = శిరస్సులయొక్క, ప్రకర = సమూహము నందలి, మణి = మణుల యొక్క విభా = కాంతులచే, భాసిత = ప్రకాశించిన, ఉత్తుంగ = మిక్కిలి యెత్తయిన, జూట = జడముడియొక్క, అరుణ = ఎఱ్ఱని, సత్ +ద్యోత = మంచి ప్రకాశముయొక్క, ప్రసంగ = ప్రసక్తిచే, అరుణిత = ఎఱ్ఱగాఁజేయఁబడిన, బహు = అనేకములయిన, పద = స్థానములను, ఆరూఢ = అధిరోహించిన, దేవ= దేవతలయు, అహి = నాగులయు, దిశ్ (క్) + చారణ = దిక్చారణులయు, సిద్ధ = సిద్ధులయు, ఆదిత్య = సూర్యులయు, యక్ష = యక్షులయు, ఉరగ = నాగులయు, దనుజ = రాక్షసులయు, ముని + ఇంద్ర = మునిశ్రేష్ఠులయు, ప్రకాశ = ప్రకాశముగల, అంగున్ = శరీరము గలవాఁడును, ఫాల + ఈక్షణున్ = నుదుటఁ గన్నుగలవాఁడును, వాణీం యశున్ - వాణీ + ఇంద్ర = సరస్వతీభర్తయగు బ్రహ్మచేతను, అచ్యుత = విష్ణువుచేతను, ఇంద్ర = ఇంద్రునిచేతను, అగణిత = అగణితముగా - లెక్కలేనివిధమున, నుత = పొగడఁబడిన, యశున్ = కీర్తిగలవాఁడును, అగు, ఈశున్ = ఈశ్వరుని, అద్రి + ఈశుఁడు = పర్వతరాజు - హిమవంతుడు, కాంచెన్ = చూచెను

తాత్పర్యము. ఈశ్వరుఁడు తన జటాజూటమును నాగరాజుచే బంధించుకొనెను నాగరాజు శిరస్సులందలి మణుల కాంతులచే నది యెఱ్ఱఁబడెను దాని యెఱుపుచే నెఱ్ఱనయిన పెక్కుస్థానముల నధిరోహించిన దేవాదుల

ప్రకాశవంతములగు శరీరములు గలవాఁడును, నుదుటఁ గన్నుగలవాఁడును, బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుఁడు అనువారిచేఁ బెక్కుమాఱులు నుతింపఁబడిన కీర్తిగలవాఁడును అగు ఈశ్వరుని హిమవంతుఁడు చూచెను

విశేషములు . ఘణభ్రన్నాధాది సుదీర్ఘసమాసముచే నీశ్వరుని మహిమాతిశయము ద్యోతక మగుచున్నది బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుఁడు అనువారే యతని కీర్తిని బెక్కుమాఱులు నుతించిరనఁగా నతని సర్వోత్తరత్వము తెలియుచున్నది 'అగణిత తనుయశున్' అను పారమును శ్రీ రా అ శర్మగారు అగణిత నుతయశున్‌గా సవరించిరి అది మేలుగాఁగనఁబడుటచే స్వీకృతము మహాస్రగ్ధరాలక్షణమునకు పూర్వవ్యాఖ్య (1 - 68) అరయునది

వ కని గిరిపతి నిరతిశయభక్తిపూర్వకంబున సర్వాంగీణ ప్రణాముండై వరదకరుణాభిషిక్తుం డగుచు నిజపురంబునకుం దోడ్కొని చనుదేరం బరమేశ్వరుండు తత్పురప్రవేశంబు సేయు నవసరంబునం బౌరు లతిసంభ్రమంబునం బఱతెంచి 47

అర్థము . కని, గిరి-పతి = కొండలఱేఁడు, హిమవంతుఁడు, నిరతిశయ-భక్తి-పూర్వకంబునన్ = అధికభక్తిపురస్సరముగా, సర్వాంగీణ-ప్రణాముండు + ఐ = సాష్టాంగనమస్కారము గలవాఁడయి, వరద-కరుణా + అభిషిక్తుండు = వరముల నిచ్చు శివునియొక్క, దయారసముచే నభిషేకింపఁబడినవాఁడు, అగుచున్, నిజ-పురంబునకున్ = తన నగరమునకు, తోడ్కొని-చనుదేరన్ = తీసికొనిరాఁగా. పరమేశ్వరుండు, తద్ + పుర-ప్రవేశంబు = ఆ నగర ప్రవేశము, చేయు + అవసరంబునన్ = చేయు సమయమున, పౌరులు = పుర ప్రజలు, అతి-సంభ్రమంబునన్ = మిక్కిలి వేగిరపాటుతో, పఱతెంచి = పరుగున వచ్చి

తాత్పర్యము . హిమవంతుఁడు చూచి అధికభక్తిపురస్సరముగా సాష్టాంగ నమస్కార మాచరించి వరదుఁడైన శివుని దయారసముచే నభిషేకింపఁబడినవాఁడగుచుఁ దనపురమునకుఁ దీసికొనిరాఁగాఁ బరమేశ్వరుఁడు ఆ నగరమును ప్రవేశించునప్పుడు పురప్రజలు అధికమైన వేగిరపాటుతోఁ బరుగునవచ్చి - తరువాతి పద్యముతో నన్వయము

మ అమృతాంభోనిధిలో సితాసిత సురక్తాంభోజముల్ పూచె నా
సమదాలాప విలాసవాస దరహాసద్యోతి తాత్మీయ దం
త మరీచి ప్రసరంబుతో వదనసందామేక్షణశ్రగ్ధరో
త్తమదీప్తుల్ దనరంగ నిల్చి రతివల్ తద్రాజమార్గంబులన్ 48

అర్థము. అమృత + అంభోనిధిలోన్ = అమృత సముద్రములో, సిత + అసిత-సురక్త + అంభోజముల్ = తెల్లని, నల్లని మిక్కిలి యెఱ్ఱని తామరలు, పూచెన్ + నాన్ = పుష్పించెనా యనునట్లు, సమదా ప్రసరంబులోన్, స-మద = పరమానందముతోఁగూడిన, ఆలాప = మాటలయొక్క, విలాస = లీలకు, వాస = స్థానమయి, దర-హాస = చిఱునవ్వుచే, ద్యోతిత = ప్రకాశించిన, ఆత్మీయ = తమవైన, దంత = పండ్ల యొక్క, మరీచి = కిరణములయొక్క, ప్రసరంబులోన్ = సమూహములో, వదన దీపుల్, వదన = ముఖమునందలి, సందామ = మేలయిన మాలవంటి, ఈక్షణ = చూపులనెడి, స్రజ్ (క్) + భర = మాలయొక్క బరువుయొక్క, ఉత్తమ = శ్రేష్ఠములయిన, దీప్తుల్ = కాంతులు, తనరంగన్ = ఒప్పఁగా, తద్ + రాజ-మార్గంబులన్ = ఆ పురమునందలి రాజవీధులలో, అతివల్ = స్త్రీలు, నిల్చిరి

తాత్పర్యము. అమృతసముద్రములోఁ దెల్లని, నల్లని, యెఱ్ఱని తామరలు పుష్పించెనా యనునట్లు, పరమానందముతోఁ గూడిన, వాగ్విలాసమునకు స్థానమయి, చిఱునవ్వుచేఁ బ్రకాశించిన తమ దంతకాంతులసమూహములో ముఖమునందలి చూపులనెడి మాల కాంతులు ఒప్పఁగా నా రాజవీధులందు స్త్రీలు నిల్చిరి

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష రూపకము

పుర స్త్రీలు శివుని వీక్షించుట

వ ఇట్లు పుర నారీ నికరంబు రధ్యానురధ్యాకీర్ణంబై నిలిచి 49

అర్థము: ఇట్లు, పుర-నారీ-నికరంబు = పురమునందలి స్త్రీల సమూహము, రధ్యా + అనురధ్యా + ఆకీర్ణంబు + ఐ = త్రోవత్రోవకు వ్యాపించినదయి, నిలిచి

తాత్పర్యము. ఇట్లు పురమునందలి స్త్రీలు త్రోవత్రోవను వ్యాపించి నిలిచి - తరువాతి పద్యముతో నన్వయము

క దరహాసామృతమున నా
స్మరహరు మును స్నపనమార్చి మఱి నయనేందీ
వరములఁ బూరణ సేసిరి
పురసతు లుల్లమున నింపు వొంపిరిపోవన్ 50

అర్థము. పుర-సతులు = నగరమందలి స్త్రీలు, ఉల్లమునన్ = మనసునందు, ఇంపు = ఆనందము, పొంపిరి + పోవన్ = అతిశయింపఁగా, ఆ-స్మర-హరున్ = ఆ మన్మథసంహారకుని - శివుని, మును = ముందు, దర-హాస + అమృతమునన్= చిఱునవ్వనెడు, అమృతమునందు, స్నపనము + ఆర్చి = స్నానమాడించి, మఱి = మఱియును, నయన ఇందీవరములన్ = కన్నులనెడి నల్లకలువలచే, పూరణ + చేసిరి = అలంకరించిరి

తాత్పర్యము. పురస్త్రీలు మనస్సులందు ఆనంద మతిశయింపఁగా ఆ శివుని ముందుగాఁ జిఱునవ్వనెడి యమృతముచే స్నానము చేయించి, పిమ్మట కన్నులనెడి నల్లకలువలచే నలంకరించిరి

విశేషములు. అలంకారము రూపకము

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము 51

చ. దళితసరోరుహాస్యలు సుధామయహర్మ్యములెక్కి ప్రీతితోఁ
జెలువగు వల్దముత్యముల సేసలు చల్లిరి పాండురాంగుపై
నలి సతటిత్సితాంబుదగణంబు ఘనోపలవృష్టి రాజతా
చలము పయిన్ మొగిం గురియు చాడ్పున సద్రుచు లుల్లసిల్లగన్ 52

అర్థము. స-తటిత్ + సిత + అంబుద-గణంబు = మెఱుపులతోఁ గూడిన తెల్లనైన, మేఘముల సమూహము, ఘన + ఉపల-వృష్టి = వడగండ్ల వర్షము, రాజత + అచలము పయిన్ = వెండికొండపై, మొగిన్ = పూనికతో, కురియు-చాడ్పునన్ = కురియు విధమున, దళిత-సరోరుహ + ఆస్యలు = వికసించిన పద్మములవంటి ముఖములు గలవారు - స్త్రీలు, సుధామయ-హర్మ్యములు = సున్నముతో నిండిన మేడలు, ఎక్కి, ప్రీతితోన్ = సంతోషముతో, చెలువు + అగు = అందమగు, వల్ద-ముత్యములన్ = స్థూలములైన ముత్యములతో, సత్ + రుచులు = మేలికాంతులు, ఉల్లసిల్లఁగన్ = ప్రకాశింపఁగా, పాండుర + అంగు-పైన్ = తెల్లని శరీరము గలవాఁడగు శివునిమీఁద, నలిన్ = ఉత్సాహముతో, సేసలు + చల్లిరి = అక్షతలు చల్లిరి

తాత్పర్యము మెఱుపులతోఁగూడిన తెల్లనైన మేఘముల సమూహము వెండికొండపై వడగండ్లవాన కురియువిధమున, వికసించిన పద్మములవంటి ముఖములుగల పురస్త్రీలు సున్నముతో నిండిన మేడలెక్కి ప్రీతితో మేలికాంతులు ప్రకాశింపఁగాఁ దెల్లని శరీరముగల శివునిపై నుత్సాహముతో నందమైన పెద్ద ముత్యములను అక్షతలు చల్లిరి

విశేషములు. అలంకార ముపమ సద్రుచులు - సత్ + రుచులు

క చెలువలు సూచిరి శివు నిరు
వలఁకుల హర్మ్యంబు లెక్కి వడిఁ జూడ్కులు సూ
డ్కులతోడఁ బెనఁగి పాలుపుగఁ
గలువల తోరణము లోలిఁ గట్టిన భంగిన్ 53

అర్థము . చెలువలు = స్త్రీలు, ఇరు-వలఁకులన్ = రెండువైపులను, హర్మ్యంబులు + ఎక్కి = మేడలెక్కి, వడిన్ = వేగముగా, చూడ్కులు = చూపులు, చూడ్కులతోడన్ = చూపులతో, పెనఁగి = కూడి, పాలుపుగన్ అందముగా, కలువల-తోరణములు = కలువపూల తోరణములు, ఓలిన్ = వరుసగా, కట్టిన-భంగిన్ = కట్టినరీతిని, శివున్, చూచిరి

తాత్పర్యము . పురస్త్రీలు ఇరుపార్శ్వములను మేడలెక్కి ఒకవైపున్న స్త్రీలచూపులు రెండవ వైపున్న స్త్రీలచూపులతోఁగూడి అందముగాఁ గలువల తోరణములు వరుసగాఁ గట్టినట్లు శివునిఁ జూచిరి

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష వలఁకులు - వలను + లు 'కలన్వాదుల నువర్ణంబు కుఙ్ఞగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల ఆచ్చిక 18 వల + కుఙి + లు 'జిత్తు బిందుపూర్వంబగు' బాల తత్సమ 19 వలఁకులు

క లోలమతి రెండు కన్నులుఁ
జాలవు శివుఁ జూడ నని విచారించియె తా
జాలకము కన్ను లన్నిట
నోలిన చనఁ జూచుచుండె నొక్కతె ప్రీతిన్ 54.

అర్థము లోల-మతిన్ = ఆసక్తమైన బుద్ధితో, శివున్, చూడన్ = చూచుటకు, రెండు-కన్నులున్, చాలవు, అని, విచారించియు = తలఁచియో, ఒక్కతె = ఒక స్త్రీ, ప్రీతిన్ = ఇష్టముతో, తాన్, జాలకము-కన్నులు + అన్నిటన్ = గవాక్షపుఁగన్ను లన్నిటినుండి, ఓలిన్ + అ = బాగుగనే, చనన్ = తగునట్లు, చూచుచున్ + ఉండెన్

తాత్పర్యము .శివునిఁ జూచుటకు రెండుకన్నులును సరిపోవని ఆసక్తమైన బుద్ధితోఁదలఁచి కాఁబోలు, ఒకామె ప్రీతితో గవాక్షపుఁ గన్నులన్నిటినుండి బాగుగాఁ జూచుచుండెను

విశేషములు .అలంకారము హేతూత్ప్రేక్ష తన కన్నులతోనేగాక జాలకమున కున్న కన్నులన్నిటితోను జూచుట ఆమె లోలమతిత్వమును శివుని సౌందర్యాతిశయమును దెలుపును

తే **అడ్డగోడలపై వ్రాలి యభవుఁ జూచు**
సతుల కుచములపై ముఖసరసిజములు
భాసురం బయ్యెఁ బూర్ణకుంభములమీఁదఁ
బడిఁడి యద్దముల్ నిలిపిన భంగివోలె 55

అర్థము . అడ్డగోడలపైన్, వ్రాలి, అభవున్ = శివుని, చూచు, సతుల-కుచములపైన్ = స్త్రీల స్తనములమీఁద, ముఖ-నరసిజములు = ముఖ పద్మములు, పూర్ణ-కుంభములమీఁదన్ = నిండుకుండలమీఁద, పసిఁడి-అద్దముల్ = బంగరుటద్దములు, నిలిపిన-భంగి + పోలెన్ = నిలిపినట్లుగా, భాసురంబు + అయ్యెన్ = ప్రకాశించెను

తాత్పర్యము : అడ్డగోడలమీఁద వంగి, శివుని జూచునట్టి స్త్రీల స్తనముల మీఁద వారి ముఖపద్మములుండి, పూర్ణకుంభములపై బంగరుటద్దములను నిలిపిన విధమున నొప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

చ **నుతనవయౌవనద్యుతి తనుద్యుతికిన్ మెఱుఁగీఁగఁ దత్తనూ**
ద్యుతి మణిభూషణద్యుతుల కొప్పముతో మెఱుఁగీఁగఁ దన్మణి
ద్యుతులు నభోమణిద్యుతులతో నెనయై తన వక్త్రపంకజ
ద్యుతులకు నీ మెఱుంగు లొక యుగ్మలి వచ్చెఁ బురారిఁ జూడఁగాన్ 56

అర్థము. నుత-నవ-యౌవన-ద్యుతి = పొగడఁబడిన క్రొత్త జవ్వనముయొక్క కాంతి, తను-ద్యుతికిన్ = శరీరకాంతికి, మెఱుఁగు + ఈఁగన్ = ప్రకాశము నొసఁగఁగా, తద్ + తనూ-ద్యుతి = ఆ శరీరకాంతి, మణి-భూషణ-ద్యుతులకున్ = మణిమయములైన నగల కాంతులకు, ఒప్పముతోన్ = ఒప్పుతో, మెఱుఁగు + ఈఁగన్, తద్ + మణి-ద్యుతులు = ఆ మణుల కాంతులు, నభోమణి-ద్యుతులతోన్ = సూర్యకాంతులతో, ఎన + ఐ = సాటి యయి, తన-వక్త్ర-పంకజ-ద్యుతులకున్ = తన ముఖపద్మ కాంతులకు, మెఱుంగులు + ఈన్ = కాంతు లొసఁగఁగా, ఒక-ఉగ్మలి = ఒక స్త్రీ, పుర + అరిన్ = ఈశ్వరుని, చూడఁగాన్ = చూచుటకు, వచ్చెన్

తాత్పర్యము. తన జవ్వనపుఁగాంతి శరీరకాంతికిఁ బ్రకాశమునొసఁగఁగా, నా శరీరకాంతి మణిభూషణముల కాంతులకు బాగుగాఁ బ్రకాశమునొసఁగఁగాఁ, ఆ మణిభూషణకాంతులు సూర్యునికాంతులకు సాటి యయినవయి, నిజముఖపద్మములకుఁ బ్రకాశము నిచ్చునట్లు ఒకామె శివునిఁ జూచుటకు వచ్చెను

విశేషములు. మణుల కాంతులు సూర్యకాంతితో సాటివచ్చునవి కావునను, ఆమె ముఖము పద్మము వంటిది కావునను, సూర్యపద్మములకుఁగల బంధుత్వముచే ముఖపద్మము వికాసము నొందుచున్నది

వ **మఱియును తరువాతి పద్యముతో నన్వయము** 57

శా **ఆలోలాలస కుంచి తాకులిత ముగ్ధా కీర్ణ విస్తీర్ణ లీ**
లాలాస్య స్ఫురి తాయతోన్మద విశాల స్మేర విస్ఫార దృ
గ్జాలంబుల్ గలయంగ విచ్చి విటమత్స్యవ్రాతముం దివ్వుచున్
రోలంబాలక వచ్చి చూచె జితమారుం జంద్రచూడామణిన్ 58

అర్థము. అలోలాలస దృగ్జాలంబుల్ ఆలోల = చంచలములు, అలస = మందములు, కుంచిత = ముడిఁగినవి, ఆకులిత = కలఁతనొందినవి, ముగ్ధ = సుందరములు, ఆకీర్ణ = వ్యాపించినవి, విస్తీర్ణ = విరివియైనవి, లీలా = విలాసముతో, లాస్య = నాట్యముచే, స్ఫురిత = ప్రకాశించునవి, ఆయత = దీర్ఘములయినవి, ఉన్మద = మత్తెక్కించునవి, విశాల = విశాలములయినవి, స్మేర = వికసించునవి, విస్ఫార = విప్పారినవి, అగు, దృశ్ (క్) + జాలంబుల్ = చూపుల సమూహములు - చూపులనెడి వలలు, కలయంగన్ = అంతటను, విచ్చి, విట-

మత్స్య-వ్రాతమున్ = వీటులనెడి చేఁపల సమూహమును, తివ్వుచున్ = ఆకర్షించుచు, రోలంబ + అలక = తుమ్మెదలవంటి ముంగురులు గలది - స్త్రీ, వచ్చి, జిత-మారున్ = జయింపఁబడిన మన్మథుఁడు గలవాఁడు, అగు, చంద్ర-చూడా-మణిన్ = చంద్రుఁడు శిరోభూషణముగాఁ గలవానిని - శివుని, చూచెన్

తాత్పర్యము చంచలములు, మందములు, ముడిఁగినవి, కలఁత నొందినవి, సుందరములు, వ్యాపించినవి, విరివియైనవి, విలాసముతోడి నాట్యముతోఁ బ్రకాశించునవి, దీర్ఘములు, మత్తుగలిగించునవి, విశాలములు, వికసించునవి, విప్పారినవి అగు దృష్టుల సమూహములు - దృష్టులనెడి వలలు బాగుగా విచ్చి వీటు లనెడి చేఁపల సమూహము నాకర్షించుచుఁ దుమ్మెదలవంటి ముంగురులు గల ఒక స్త్రీ మన్మథహరుఁడగు శివునిఁ జూచెను

విశేషములు :దృగ్జాలములు - శ్లిష్ట రూపకము వీట మత్స్య - రూపకము దృగ్జాలంబుల్ - దృశ్ (క్) + జాలంబుల్ - తివ్వు - తివు (రూపాం)

చ నునుపుగఁ జందనం బలఁది నూతన మౌక్తిక హారముల్ ఘన
స్తన యుగళంబుపైఁ బొలయ, జాదులు వేణిఁ బెనంగఁ దెల్పుతోఁ
గనుఁగవ గ్రాల, దువ్వలువుఁగట్టి, తదుజ్జ్వల కీర్తిమూర్తి సే
కొని చనుదెంచులీల నొక కోమలి వచ్చె గిరీశుఁ గన్గొనన్ 59

అర్థము : నునుపుగన్ = నున్నగా, చందనంబు = మంచిగంధము, అలఁది= పూసి, నూతన-మౌక్తిక-హారముల్ = క్రొత్త ముత్యాల పేరులు, ఘన-స్తన-యుగళంబుపైన్ = గొప్పదియగు చనుఁగవమీఁద, పొలయన్ = వ్యాపింపఁగా, జాదులు = జాజిపూలు, వేణిన్ = జడయందు, పెనంగన్ = కూడఁగా, కనుఁగవ= కన్నులజంట, తెల్పుతోన్, క్రాలన్ = ఒప్పఁగా, దువ్వలువున్ = సన్నని వస్త్రమును, కట్టి = ధరించి, తద్ + ఉజ్జ్వల-కీర్తి-మూర్తి = వాని ప్రకాశించు కీర్తి యొక్క, ఆకారమును, చేకొని = స్వీకరించి, చనుదెంచు-లీలన్ = వచ్చురీతిని, ఒక-కోమలి= ఒక సుందరి, గిరీశున్ = శివుని, కన్గొనన్ = చూచుటకు, వచ్చెన్

తాత్పర్యము . ఒక సుందరాంగి నున్నగా మంచిగంధముఁ బూసి క్రొత్త ముత్యాలపేరులు గొప్ప చనుఁగవపై వ్యాపింపఁగా, జాజిపూలు జడలోఁ బెనఁగులాడఁ, గనుఁగవ తెల్పుగలిగి యొప్పు సన్నని వస్త్రమును ధరించి వాని యుజ్జ్వలమైన కీర్త్యాకృతిని స్వీకరించి వచ్చునట్లు శివునిఁ జూడ వచ్చెను

విశేషములు అలంకారము స్వభావోక్తి ఉత్ప్రేక్ష వలుపు (రూపా) వలువ దువ + వలువు

చ గురుకుచలిప్త సాంద్రతర కుంకుమ చందన ఘర్మబిందువుల్
దొరఁగ రతిశ్రమాకులిత ధూర్జటి నొక్కతె చూచుచుండెఁ గే
సరి నఖరాగ్రనిర్దళిత సక్షతజాత విమిశ్ర మౌక్తికో
త్కర గళదుచ్చ కుంభ మదదంతియ పోలె నచేతనస్థితిన్ 60

అర్థము రతి-శ్రమ + ఆకులిత = సురతము వలని అలయికచేఁ గలఁగినది (అగు), ఒక్కతె = ఒకామె, కేసరి దంతియ-పోలెన్ = కేసరి = సింహముయొక్క నఖర = గోరుల, అగ్ర = కొనలచే, నిర్దళిత = చీల్పఁబడిన, సక్షత-జాత = రక్తముతో, విమిశ్ర = కలిసిన, మౌక్తిక + ఉత్కర = ముత్యముల సమూహము, గళత్ = జాఱుచున్న, ఉచ్చ = ఉన్నతమైన, కుంభ = కుంభస్థలములుగల, మద-దంతి + అ = మదగజమా, పోలెన్ = అనఁగా, అచేతన-స్థితిన్ = మైమఱచిన స్థితితో, గురు బిందువుల్ గురు-కుచ = పెద్దవియగు స్తనములందు, లిప్త = పూయఁబడిన, సాంద్రతర = మిక్కిలి దట్టమైన, కుంకుమ = కుంకుమము, చందన = మంచిగంధము అనువానితోడి, ఘర్మ-బిందువుల్ = చెమటబొట్లు, తొరుఁగన్ = రాలఁగా, ధూర్జటిన్ = శివుని, చూచుచున్ + ఉండెన్

తాత్పర్యము. సురతక్రీడవలని అలయికచేఁ గలఁగిన ఒకస్త్రీ గొప్పవియగు స్తనములందుఁ బూయఁబడిన దట్టమైన కుంకుమము, మంచిగంధము ననువానితోడి చెమటబొట్టులు రాలఁగా, సింహము గోరులకొనలచేఁ జీల్పఁబడి రక్తముతోఁ గలసిన ముత్యాల సమూహము రాలుచున్న ఉన్నతమైన కుంభస్థలములుగల మదగజమా యనునట్లు మైమఱచిన స్థితితో శివునిఁ జూచుచుండెను

విశేషములు. అలంకారము ఉత్ప్రేక్ష

చ కమలదళాక్షి సాలఁ దమకంబునఁ గూర్చు నిజేశుతోడఁ జి
త్తము దనివోవఁగా బహువిధంబులఁ గూడిన హృద్గతానురా
గము వెలిఁబేర్చెనో యన నఖక్షతచుంబనరంజితాంగవి
భ్రమగతి వచ్చి చూచె నొక భామిని జంగమమల్లికార్జునున్ 61

అర్థము. కమల-దళ + అక్షి = తామరరేకులవంటి కన్నులుగలది, (అగు), ఒక-భామిని = ఒకస్త్రీ, చాలన్ + తమకంబునన్ = మిక్కిలి మోహముతో, కూర్చు-

నిజ + ఈశుతోడన్ = ప్రియమైన తన భర్తతో, చిత్తము = మనస్సు, తనివోఁగాన్= తృప్తిఁజెందఁగా, బహు-విధంబులన్ = అనేకరీతుల, కూడినన్, హృద్ + గత + అనురాగము = హృదయమును బొందిన ప్రేమము, వెలిన్ = వెలుపలికి, పేర్చెనో+ అనన్ = పొంగెనా యనునట్లు, నఖ-క్షత-చుంబన-రంజిత + అంగ-విభ్రమ-గతిన్= గోటి నొక్కులచేతను, ముద్దులచేతను, సంతోషపెట్టఁబడిన - రంగువేయఁబడిన, అవయవములయొక్క, విలాసముతోడి గమనముతో, వచ్చి, జంగమ-మల్లికార్జునున్= జంగమమల్లికార్జునుని- శివుని, చూచెన్

తాత్పర్యము : తామరరేకులవంటి కన్నులుగ్గల ఒక స్త్రీ మిక్కిలి మోహముతో స్వీయ ప్రియభర్తతో మనస్సు తృప్తిపడునట్లు పెక్కురీతులఁ గూడఁగా, హృదయస్థమైన రాగము వెలుపలికిఁ బొంగెనా యనునట్లు గోటినొక్కులు ముద్దులు అనువానిచే రంజితములైన అవయవముల విలాసముతోడి గమనముతో వచ్చి జంగమమల్లికార్జునునితో నభిన్నుఁడైన శివునిఁ జూచెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష రాగము, రంజిత అనుచో శ్లేషము కవి జంగమమల్లికార్జున శివుల కభేదము చెప్పుచుండును తని, తనివి, తనివు రూపాంతరములు

తే **మగువ జంగమమల్లయఁ దగిలి చూచి**
యంద కన్నులు మనమును నంటియున్న
నచలభావన నిల్చెఁ దా నట్ల, పరము
నభవుఁ గని జను లచలాత్మ లగుట యరుదె? 62

అర్థము. మగువ = స్త్రీ, జంగమ మల్లయన్ = జంగమ మల్లికార్జునునితో నభిన్నుఁడైన శివుని, తగిలి - చూచి = ఆసక్తితోఁజూచి, అందున్ + = అతనియందే, కన్నులున్ = కన్నులును, మనమును = మనస్సును, అంటి + ఉన్నన్ = తగిలియుండఁగా, తాను, అచల-భావనన్ = నిశ్చలత్వముతో, నిల్చెన్, అట్లు + అ = అది యట్లే, పరమున్ + అభవున్ = ఉత్కృష్టుఁడైన శివుని, కని = చూచి, జనులు, అచల + ఆత్ములు = నిశ్చలములైన ఆత్మ గలవారు, అగుట, అరుదె = ఆశ్చర్యమా?

తాత్పర్యము. ఒక యింతి జంగమమల్లికార్జునునితో నభిన్నుఁడైన శివుని ఆసక్తితోఁ జూచి అతనియందే కన్నులును, మనస్సును దగులుకొనఁగా

నిశ్చలత్వముతో నిలిచెను అదియట్లే కదా! గొప్పవాఁడైన శివునిఁ జూచి జనులు నిశ్చలాత్ములగుటలో నాశ్చర్యమేమున్నది?

విశేషములు అలంకారము అర్థాంతరన్యాసము అచలభావన - స్తంభమను సాత్త్విక భావము

తే **ముడువ నెత్తిన పువ్వులు ముడిచికొనఁగ**
మఱచి చేఁ బట్టికొనుచుఁ దన్నెఱుఁగ కర్థిఁ
బోలి చనుదెంచెఁ ద్రైలోక్యపూజ్యు నచల
భక్తిఁ బూజింపఁ జనుదెంచు భంగి వోలె 63

అర్థము ఒక స్త్రీ అను కర్త అధ్యాహార్యము ముడువన్ = తుఱుముకొనుటకు, ఎత్తిన = పట్టిన, పువ్వులు, ముడిచికొనఁగన్ = తుఱుముకొనుట, మఱచి, చేన్ = చేతితో, పట్టుకొనుచున్, తన్నున్ + ఎఱుఁగక = పరవశయయి, అర్థిన్ + పోలి, త్రైలోక్య-పూజ్యున్ = ముల్లోకములచేఁ బూజింపఁదగినవానిని, అచల-భక్తిన్ = నిశ్చలభక్తితో, పూజింపన్ = పూజించుటకు, చనుదెంచు-భంగి + పోలెన్ = వచ్చురీతిని, చనుదెంచెన్

తాత్పర్యము ఒక స్త్రీ తనతలలో ముడుచుకొనుటకుఁ బుచ్చుకొనిన పువ్వులు ముడుచుకొన మఱచి వానిని జేతఁబట్టుకొనుచు మైమఱచి, ముల్లోకములచేఁ బూజింపఁదగినవాఁడగు శివుని నిశ్చలభక్తితోఁ బూజింపవచ్చెనా యనునట్లు వచ్చెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

ఆ **కొప్పు విచ్చి విచ్చి కట్టంగ మఱచి చేఁ**
బొదివి పట్టికొనుచుఁ బొలిఁతి వచ్చె
నెల్ల సమయములకు నీశుండు వేల్పని
ముడియవైన వచ్చు వడువు వోలె 64

అర్థము. పొలిఁతి - పొలఁతి = స్త్రీ, కొప్పున్ = కొసెను, విచ్చి, విచ్చి = మిక్కిలి విప్పి, కట్టంగన్ = కట్టుట, మఱచి, చేన్ = చేత, పొదివి-పట్టికొనుచున్ =

చుట్టఁబెట్టుకొనుచు, ఎల్ల-సమయములకున్ = అన్నివేళలకు, ఈశుండు, వేల్పు + అని = దేవుఁడని, ముడియవైవన్ = దానిని స్థిరీకరించుటకై వస్త్రమును ముడివేసి ప్రమాణము చేయుటకు, వచ్చు - వడువు + పోలెన్ = వచ్చునిధమున, వచ్చెన్

తాత్పర్యము . ఒక యింతి కోకను మిక్కిలి విప్పి శివునిఁ జూచు సంభ్రమమునఁ గట్టుట మఱచి చేతఁజుట్టఁబెట్టుకొనుచు, నన్నివేళలకును ఈశ్వరుఁడు దేవుఁడని - ఆ విషయమును స్థిరీకరించుటకై వస్త్రమును ముడివేసి ప్రమాణము చేయుటకు వచ్చుచున్నదా యనునట్లు వచ్చెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష కొపు = కాసె యని పూర్వటీక ఈ శబ్దము నిఘంటువులో లేదు

తే **చెలువ యొక్కర్తు గట్టిన చీర వీడి**
పడఁగఁ జనుదెంచె దద్ద సంభ్రమముతోడ
వరుఁడు చూచుచునుండ నిర్వాణ భీతి,
నట్ల, శివుఁగాంచి నిర్వాణ మగుట యరుదె ? 65

అర్థము . నిర్వాణ-భీతిన్ = (వస్త్ర) మోక్షము (నగ్నత) వలని భయమున, వరుఁడు = భర్త, చూచుచున్ + ఉండన్ = చూచుచుండఁగా, చెలువ + ఒక్కర్తు = ఒక స్త్రీ, కట్టిన-చీర + ధరించినచీర, వీడిపడఁగన్ = ఊడిపోవుచుండఁగా, తద్ద-సంభ్రమముతోడన్ = మిక్కిలి వేగిరపాటుతో, చనుదెంచెన్ = వచ్చెను అట్లు + అ = అది యట్లే, శివున్, కాంచి, నిర్వాణము = మోక్షను, అగుట, అరుదె = ఆశ్చర్యమా?

తాత్పర్యము భర్త తనభార్యకు వస్త్రమోక్షమగునేమో యను భయమునఁ జూచుచుండఁగా, నొకస్త్రీ తానుగట్టిన చీర యూడిపోవుచుండఁగా మిక్కిలి వేగిరపాటుతో శివునిఁ జూడవచ్చెను అది యట్లే శివునిఁ జూచుచో మోక్ష మగుటలో నాశ్చర్య మేమున్నది ?

విశేషములు . అలంకారము నిర్వాణశబ్దమున కర్థద్వయముచే శ్లేషము అర్థాంతరన్యాసము

సీ వెలిమిడి నలికంబు చెలుపంగఁ బోవుచ
తెలుపార మైనిండ నలఁదికొనుచుఁ
బూవులు దుఱుమంగఁ బోవుచ వల గొంత
తోఁపంగ ముందలఁ దుఱిమికొనుచు
మోవి లత్తుక పూయఁబోవుచ లాలాట
పట్టికఁ దిలకంబుఁ బెట్టుకొనుచుఁ
గాటుక మొడుచుచ కన్నుల నిడఁబోయి
పొల్తుక గళమునఁ బూసికొనుచు

ఆ సితరుచీందుఖండ శిఖి నేత్ర గరళంబు
లొడల దలను నుదుట మెడను దాల్చి
పొల్చు శంభు నోర్తు పోలి చూపఱు దన
కెఱఁగుచుండ వచ్చె నీశుఁజూడ 66

అర్థము వెలిమిడిన్ = విభూతితో, అలికంబు = నుదురు, చెలుపంగన్ + పోవుచున్ + అ = పూయఁబోవుచునే, తెలుపారన్ = తెలుపునిండునట్లు, మైనిండన్ = శరీరము నిండుగా, అలఁదికొనుచున్ = పూసికొనుచు,

పూవులు, తుఱుమంగన్ + పోవుచున్ + అ = ముడిచికొనఁబోవుచునే, వల గొంత = కుడిభాగమునఁ గొంత, తోఁపంగన్ = తోఁచునట్లు, ముందలన్ = తలముందరి భాగమున, తుఱిమికొనుచున్

మోవిన్ = పెదవియందు, లత్తుక = లాక్షారసము, పూయన్ + పోవుచున్ + అ = పూయఁబోవుచునే, లాలాట-పట్టికన్ = పలకవంటి నుదుటియందు, తిలకంబున్ = బొట్టును, పెట్టుకొనుచున్

కాటుకన్, మొడుచుచున్ + అ = మెదుచుచునే, కన్నులన్, ఇడన్ + పోయి = పెట్టఁబోయి, పొల్తుక =స్త్రీ, గళమునన్ = కంఠమున, పూసికొనుచున్

సితరుచి + ఇందుఖండ-శిఖినేత్ర-గరళంబులు = తెల్లనికాంతి, చంద్రకళ, నిప్పుఁగన్ను, కాలకూటము అనునవి, క్రమముగా, ఒడలన్ = శరీరమునందు, తలను = తలయందు, నుదుటన్ = నుదుటియందు, మెడను, తాల్చి = ధరించి, పొల్చు = ఒప్పునట్టి, శంభున్ = శివుని, ఓర్తు = ఒక్క స్త్రీ, పోలి, చూపఱు = చూచువారు, తనకున్, ఎఱఁగుచున్ + ఉండన్ = నమస్కరించుచుండఁగా, ఈశున్ = ఈశ్వరుని, చూడన్ = చూచుటకు, వచ్చెన్

తాత్పర్యము . ఒకామె విభూతిని నుదుటఁ బూయఁబోవుచునే తెలుపు నిండునట్లు ఒడలినిండఁ బూసికొనుచు, పువ్వులు ముడిచికొనఁబోవుచునే కుడివైపునఁ గొంత తోఁచునట్లు తలముందరిభాగమునఁ దుఱిమికొనుచు, పెదవిని లత్తుక పూయఁబోవుచునే నుదుటఁ దిలకమును బెట్టుకొనుచు, కాటుకను బెట్టుకొనుచునే కన్నులందుఁ బెట్టుకొనఁబోయి కంఠమునఁ బూసికొనుచు, తెల్లని కాంతిని, చంద్రకళను, అగ్నినేత్రమును, కాలకూటమును గ్రమముగా మేనను, దలను నుదుటను, మెడను దాల్చి యొప్పునట్టి శివునిఁబోలి, చూచువారు శివభ్రాంతితోఁ దనకు మ్రొక్కుచుండ నీశ్వరునిఁ జూడవచ్చెను

విశేషములు. సితరుచీందుఖండ దాల్చి' అనుచో యథా సంఖ్యము ఉపమ, భ్రాంతిమంతము

తరువత

కడుఁ దోరమై పొల్చు కచకుచభరముఁ గటిచక్రభారము నగ్గలమైన వేగ
నడవంగ నేరక నయమున నంచనడలకు నందమై నడతెంచుచున్న
మడఁతి జూచిన వీటమండలి యెల్ల మారారిఁ గనుంగొన మఱచెఁ దానట్ల
వడి నింద్రియంబుల వశగతులైనవారికి శివుఁ గానవచ్చునే జగతి? 67

అర్థము . కడున్ = మిక్కిలి, తోరము + ఐ = స్థూలమయి,పొల్చు = ఒప్పునట్టి, కచ-కుచ-భారమున్ = కేశపాశము యొక్కయు, స్తనముల యొక్కయు బరువును, కటి-చక్ర-భరమున్ = వలయాకారపుఁ బిఱుఁదుల బరువును, అగ్గలము + ఐనన్ = అధికము కాఁగా, వేగన్ = వడిగా, నడవంగన్ + నేరక = నడవఁజాలక, నయమునన్ = అందమున, అంచ+నడలకున్ = హంస నడకల కంటెను, అందము + ఐ, నడతెంచుచున్ + ఉన్న = వచ్చుచున్న, మడఁతిన్ = స్త్రీని, చూచిన = చూచినట్టి, విట-మండలి + ఎల్లన్ = విటకాండ్ర సమూహమంతయు, మార + అరిన్ = మన్మథునకు శత్రువైన శివుని, కనుఁగొనన్ + మఱచెన్ = చూచుట మఱచెను, తాను + అట్లు + అ = అది యట్లే, వడిన్ = వేగముతో, ఇంద్రియంబుల-వశగతులు + ఐన-వారికిన్ = ఇంద్రియములకు వశపడినవారికి, జగతిన్ = లోకమున, శివున్ = శివుని, కానన్ + వచ్చునే = చూడ నలవియగునా?

తాత్పర్యము : మిక్కిలి స్థూలమయి యొప్పు కేశములయు స్తనములయు బరువును, పిఱుఁదుల బరువును అధికముకాఁగా వేగముగా నడవఁజాలక అందమున హంస నడకలకంటె నందమై, వచ్చుచున్న స్త్రీని జూచిన వీటకాండ్రందఱు శివునిఁ

జూడమఱచిరి అది యట్లే కదా! ఇంద్రియములకు వశపడినవారికి లోకమున శివునిఁజూడ నలవికాదు

విశేషములు అలంకారము అర్థాంతరన్యాసము అంచనడలకు నందమై-అంచ నడకల కంటె నందమై - ఇచట పంచమ్యర్థమున కువర్ణక మయినది 'షష్ఠీస్థానికంబగు కువర్ణకం బొకొక్కచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి' ప్రౌఢ కారక 13 తరువద లక్షణమునకు కి - 109 పద్యవ్యాఖ్య నరయునది

క హరుఁ జూచు, మగుడఁ బ్రాణే
శ్వరుఁ జూచు, మహేశుఁ జూచు, వల్లభుఁ జూచున్
బొరిఁబొరిఁ జిత్తము నిల్వక
తరుణియ యొక్కర్తు వికటతాపసివోలెన్ 68

అర్థము. తరుణియ + ఒక్కర్తు = ఒక యువతి, వికట-తాపసి + పోలెన్ = చంచలుఁడైన తపస్వివలె, పొరిన్ + పొరిన్ = మాటిమాటికి, చిత్తము = మనస్సు, నిల్వక, హరున్ = శివుని, చూచున్, మగుడన్ = మరల, ప్రాణ + ఈశ్వరున్ = భర్తను, చూచున్, మహేశున్ = పరమేశ్వరుని, చూచున్, మగుడన్, వల్లభున్ = మగనిని, చూచున్

తాత్పర్యము ఒక యువతి చంచలుఁడగు తపస్వివలె మాటిమాటికి మనస్సు నిలువక శివునిఁ జూచును, మరల భర్తను జూచును పరమేశ్వరునిఁ జూచును మరల మగనినిఁ జూచును

విశేషములు. అలంకారము ఉపమ

తే ప్రియు నఖాంకముల్ గురుకుచద్వయముమీఁదఁ
గాంచి పేద నిధానముఁ గాంచినట్లు
విచ్చి చూచుచుఁ గప్పుచు వచ్చి చూచె
దేవతాధిపు నమ్మహాదేవు నోర్తు 69.

అర్థము. ఓర్తు = ఒక స్త్రీ, ప్రియు-నఖ + అంకముల్ = ప్రియుని గోటి గుఱుతులు, గురు-కుచ-ద్వయము మీఁదన్ = పెద్దదియగు చనుఁగవపై, కాంచి = చూచి, పేద = పేదవాఁడు, నిధానమున్ = నిధిని - ధనరాశిని, కాంచిన + అట్లు=

చూచినరీతిని, విచ్చి, చూచుచున్, కప్పుచున్, వచ్చి, దేవతా + అధిపున్ = దేవతలప్రభువును, ఆ + మహాదేవున్ = ఆ శివుని, చూచెన్

తాత్పర్యము . ఒక స్త్రీ పెద్దదియగు చనుఁగవమీఁదఁ దనప్రియుని గోటిగుఱుతులు చూచి, పేదవాఁడు నిధిని జూచురీతిని, విప్పిచూచుచు మరలఁ గప్పుచు వచ్చి దేవతలకుఁ బ్రభువైన ఆ మహేశ్వరునిఁ జూచెను

విశేషములు .పేదవాఁడు నిధిని జూచినప్పుడు దానిని సంతోషముతో విప్పి చూచును మరల నెవరైనఁ జూచుచున్నారేమో యను భయమున దానిని గప్పివైచును అట్లే ఆ యింతియుఁ గుచములపైఁ బ్రియుఁడుంచిన గోటిగుఱుతులను సంతోషమునఁ జూచుకొనుచు, మరల నెవరైనఁ జూచుచున్నారేమోయని కప్పికొనును అలంకార ముపమ

క. వనజంబులుఁ గలువలుఁ బూ
చిన కొలఁకుల మాడ్కిఁ బెనఁగి చెలు వడరెఁ బురిన్
జను పతులు సతులు నీశ్వరుఁ
గనుఁగొనుచో వీధివీధిఁ గనుఁగవ రుచులన్ 70

అర్థము . వీధి వీధిన్ = ప్రతి వీధియందును, చను-పతులున్ + సతులున్= పోవు మగలును వారియాండ్రును, ఈశ్వరున్ = శివుని, కనుఁగొనుచోన్= చూచునప్పుడు, కనుఁగవ-రుచులన్ = నేత్రద్వయకాంతులచే, వనజంబులున్= తామరలును, కలువలున్, పూచిన, కొలఁకుల-మాడ్కిన్ = సరస్సులవిధమున, పెనఁగి = కూడి, పురిన్ = పురమందు, చెలువు + అడరెన్ = అంద మతిశయించెను

తాత్పర్యము : ప్రతివీధియందును బురుషులును స్త్రీలును శివుని గనుఁగొనునప్పుడు వారి నేత్రద్వయకాంతులచేఁ దామరలును గలువలును బూచిన సరస్సుల విధమున పురమందు అందమతిశయించెను

విశేషములు:అలంకార ముత్ప్రేక్ష కొలఁకులు = కొలను + లు 'కలన్వాదుల నువర్ణంబు కుజ్ఞగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల ఆచ్చిక 18 కొల + కుజ్ + లు 'జిత్తు బిందుపూర్వంబగు ' బాల తత్సమ 19

చ స్ఫురదరుణాధరోరురుచిఁ బొంది కరంబును రక్తుఁడై పితే
తరనయనాతిభాతి నసితద్యుతిఁ జెల్వుగ నొంది నిర్మలో
త్కర దరహాసదీధితి సితప్రభఁదాల్చి, మహేశ్వరుండు త్రై
పురుషముఁ దాన యైనగతిఁ బొల్చెఁ బురాంగన లోలిఁ జూచుచోన్ 71

అర్థము పుర + అంగనలు = పురమునందలి స్త్రీలు, ఓలిన్ = బాగుగా, చూచుచోన్ = చూచునప్పుడు, మహేశ్వరుండు, స్ఫురత్ + అరుణ + అధర + ఉరు-రుచిన్ = ప్రకాశించుచున్న ఎఱ్ఱని క్రిందిపెదవి యొక్కగొప్పకాంతిని, పొంది, కరంబును = మిక్కిలి, రక్తుఁడు + ఐ = ఎఱ్ఱనివాఁడయి, సిత + ఇతర-నయన + అతి-భాతిన్ = నల్లని కన్నుల అధిక కాంతిచే, అసిత-ద్యుతిన్ = నల్లనికాంతిని, చెల్వుగన్ = అందముగా, ఒంది, నిర్మల + ఉత్కర-దర-హాస-దీధితిన్ = నిర్మలమైనరాశియగు చిఱునవ్వుకాంతిచే, సిత-ప్రభన్ = తెల్లనికాంతిని, తాల్చి త్రైపురుషమున్ = బ్రహ్మ విష్ణు మహేశ్వరుల భావమును - త్రిమూర్తిత్వమును, తాను + అ = తానే, ఐన-గతిన్ = అయినవిధమున, పొల్చెన్ = ప్రకాశించెను

తాత్పర్యము . పురస్త్రీలు శివుని బాగుగాఁ జూచునప్పుడు అతఁడు వారి యెఱ్ఱని క్రిందిపెదవుల గొప్పకాంతిని బొంది మిక్కిలి యెఱ్ఱనివాఁడయి బ్రహ్మయును, వారి నల్లని కన్నుల కాంతి నందముగాఁ బొంది విష్ణువును, వారి నిర్మలమైన చిఱునవ్వుకాంతిచేఁ దెల్లనికాంతిని బొంది మహేశ్వరుఁడును - ఈ రీతిగాఁ త్రిమూర్తిత్వమును దానే యయినవిధమునఁ బ్రకాశించెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష త్రైపురుషము - త్రయాణాం పురుషాణాం సమాహారః - త్రిపురుషమ్ త్రిపురుషస్య భావః త్రైపురుషమ్ - దాని తత్సమ రూపము - త్రైపురుషము

వ మఱియును గొందఱు విదగ్ధాంగనలు సురవరులకుం బ్రతికరంబుఁ జూపుచు 72

అర్థము: మఱియును, కొందఱు, విదగ్ధ + అంగనలు = ప్రౌఢస్త్రీలు, సుర-వరులకున్ = దేవతాశ్రేష్ఠులకు, ప్రతికరంబున్ = చేసినదానికి బదులు పారితోషికాదులు చేయుటను, చూపుచున్

తాత్పర్యము . మఱియును గొంతమంది ప్రౌఢస్త్రీలు దేవతాశ్రేష్ఠులకు బదులుపారితోషికాదులు చేయుచు - తరువాతి పద్యముతో నన్వయము

పెండ్లివారిని జూచి పురస్త్రీలు వితర్కించుట.

తే. వెలుఁగ సూరెలఁ దానదీవియలఁ బోలు
నిధులు భూరుహముల పయి నీడ గాఁగఁ
బుష్పకముమీఁదఁ గిన్నరుల్ బొగడ వచ్చు
ధనదు నల నలకూబరుతండ్రిఁ గంటె? 73

అర్థము . తాన-దీవియలన్ = స్థానదీపములను, పోలు = పోలునట్టి, నిధులు = నవనిధులు, సూరెలన్ = పార్శ్వములందు, వెలుఁగన్ = ప్రకాశింపఁగా, భూరుహముల పయిన్ = చెట్లపై, నీడ + కాఁగన్ = నీడగా, పుష్పకముమీఁదన్ = పుష్పకవిమానము మీఁద, కిన్నరుల్, పొగడన్ = పొగడుచుండఁగా, వచ్చు, అల = ఆ, నలకూబరు-తండ్రిన్ = నలకూబరుని తండ్రియగు, ధనదున్ = కుబేరుని, కంటె- (కంటివి + ఎ) = చూచితివా?

తాత్పర్యము . వివిధస్థానములందుఁ బెట్టిన దీపములవలె నవనిధులు పార్శ్వములఁ బ్రకాశించుచుండ, చెట్లపై నీడలవలెఁ బుష్పకవిమానముమీఁదఁ గిన్నరులు పొగడుచుండ, వచ్చునట్టి ఆ నలకూబరుని తండ్రియగు కుబేరునిఁ జూచితివా?

విశేషములు. అలంకార ముపమ కంటె కంటివి + ఎ = లిడ్వికారమునకు లోపము - బాల క్రియ 24 అపదాది స్వరసంధి బాల సంధి 11, కంటె

తే. **తన సహస్రాక్షదీధితుల్ దనరి యాత**
పత్ర తతులెల్లఁ బించాతపత్రభాతిఁ
బడగ లెల్లను నేత్రంపుఁ బడగలట్ల
యెసఁగఁ జనుదెంచువాఁడు దేవేంద్రుఁ గంటె? 74

అర్థము . తన = తనయొక్క, సహస్ర + అక్ష-దీధితుల్ = వేయి కన్నులకాంతులు, తనరి = ఒప్పి, ఆతపత్ర-తతులు + ఎల్లన్ = గొడుగుల సమూహము లన్నియును, పించ + ఆతపత్ర-భాతిన్ = నెమలిపురితోఁ జేయఁబడిన గొడుగుల విధమునను, పడగలు + ఎల్లను = ధ్వజములన్నియును, నేత్రంపుఁబడగల + అట్లు + అ = (నేత్రము + పడగల) = వస్త్రపుఁడెక్కెములవలెనే, ఎసఁగన్ = ఒప్పఁగా, చనుదెంచువాఁడు = వచ్చువాఁడు, అగు, దేవేంద్రున్, కంటె (కంటివి + ఎ) = చూచితివా?

తాత్పర్యము : తన వేయికన్నుల కాంతులు ఒప్పుటచే గొడుగుల సమూహములన్నియును నెమలిపురితోఁ జేయఁబడిన గొడుగుల విధమునను, పడగలన్నియును వస్త్రపుఁబడగలవలెను ఒప్పఁగా వచ్చువాఁడగు దేవేంద్రునిఁ జూచితివా?

విశేషములు . బహువ్రీహి సమాసాంతమునందే అకారాంతముగావలసిన

అక్షిన్ శబ్ద మిట బహువ్రీహి కాకున్నను అకారాంతముగాఁ బ్రయుక్తమగుట విశేషము 8 - 11లోని 'ఆ మీనాక్షి లోలాక్షముల్' ఇట్టిదే అలంకారము తద్గుణము- 'తద్గుణ స్స్వగుణత్యాగా దన్యదీయ గుణగ్రహాः' - చన్ద్రా

ఉ వేదములాదిగా నఖిలవిద్యలు మూర్తులు దాల్చి కొల్వఁద
క్షాది నవప్రజాపతులు నాంగిరసాదిమునివ్రజంబు నా
హ్లాదముతో నుతింపఁ, గలహంసగతుల్ వొలుపొంద వచ్చువాఁ
డాదిజుఁ డాదికర్త చతురాననుఁ డాతఁడు వారిజాననా! 75

అర్థము. వారిజ + ఆనవా = పద్మమువంటి ముఖముగలదానా! ఆతఁడు, వేదములు + ఆదిగాన్ = వేదములు మొదలుగా, అఖిల విద్యలున్ = ఎల్ల విద్యలును, మూర్తులు = రూపములు, తాల్చి = ధరించి, కొల్వన్ = సేవింపఁగా, దక్ష + ఆది-నవ-ప్రజాపతులున్ = దక్షుఁడు మున్నుగాఁగల తొమ్మండ్రు బ్రహ్మలు, ఆంగిరస + ఆది-ముని-వ్రజంబున్ = ఆంగిరసుఁడు మున్నుగాఁగల మునుల సమూహమును, ఆహ్లాదముతోన్ = సంతోషముతో, నుతింపన్ = పొగడఁగా, కలహంస-గతుల్ = రాయంచ నడకలు, పొలుపు + ఒందన్ = ఒప్పఁగా, వచ్చువాఁడు, ఆదిజుఁడు = మొదటఁబుట్టినవాఁడు, ఆది-కర్త = మొదటికర్త, అగు, చతురాననుఁడు (చతుర్ + ఆననుఁడు) = నాలుగు మోములు గలవాఁడు - బ్రహ్మ

తాత్పర్యము. పద్మముఖీ! ఆతఁడు వేదాదిసకలవిద్యలును సాకారములై కొలువఁగా, దక్షాదులైన తొమ్మండ్రు బ్రహ్మలును, ఆంగిరసుఁడు మున్నగు మునుల సమూహమును సంతోషముతో నుతింపఁగా వాహనమైన రాయంచ నడకలు ఒప్పఁగా వచ్చునట్టివాఁడు ఆదిజుఁడు, ఆదికర్తయైన బ్రహ్మ

విశేషములు : నవప్రజాపతులు - భృగువు, పులస్త్యుఁడు, పులహుఁడు, ఆంగిరసుఁడు, అత్రి, క్రతువు, దక్షుఁడు, వసిష్ఠుఁడు, మరీచి చతుర్+ ఆననుఁడు- చతుः + ఆననుఁడు - చతురాననుఁడు ఆంగిరసుఁడు = అంగిరుని పుత్త్రుఁడు - బృహస్పతి

క అరి శంఖ కౌస్తుభంబులు
గరముల నురమునను దాల్చి కమలాప్త సుధా
కర కుజ సంభృతి నవ జల
ధరమో నా వచ్చు ధరణిధరు హరిఁ గంటే? 76

అర్థము . అరి-శంఖ-కౌస్తుభంబులు = చక్రము, శంఖము, కౌస్తుభమణి అనువానిని, కరములన్ = చేతులందును, ఉరమునన్ = ఱొమ్మునను, తాల్చి = ధరించి, కమల + ఆప్త-సుధాకర-కుజ-సంభృత-నవ-జలధరమో-నాన్ = పద్మమిత్రుఁడు (సూర్యుఁడు), చంద్రుఁడు, కుజుఁడు అనువారితోఁగూడుకొనిన క్రొమ్మొయిలో యనఁగా, వచ్చు, ధరణిధరున్ = భూమిని ధరించువాఁడు-విష్ణువును-హరిన్ = విష్ణువును, కంటే (కంటివి + ఏ) = చూచితివా?

తాత్పర్యము . సుదర్శనచక్రమును, పాంచజన్యమను శంఖమును, కౌస్తుభమణిని చేతులందును, ఱొమ్మునను ధరించి, సూర్యచంద్ర కుజ సహితమైన క్రొత్తమేఘమో యనఁగా వచ్చు విష్ణువును జూచితివా?

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష చక్రము సూర్యునివలెను, శంఖము చంద్రునివలెను, కౌస్తుభము కుజునివలెను, విష్ణువు క్రొత్త మేఘమువలెను బోల్పఁబడుట చూడఁదగును అరి-(నానా) చక్రము, శత్రువు తెలుఁగుపదమగుచో కప్పము, నారి

చ **తన రజతాద్రితోన విదితంబుగ నీశుఁడు వచ్చెఁ, బోల, దెం**
దును గిరు లేఁగనేర, విది ధూర్జటి నందియ, కాదు నందికిన్
గనుఁగొన నిట్టి దీర్ఘతమగాత్రముఁ దెల్పును గల్గునే? యనన్
ఘనవిధమంది క్రాలు విషకంరు మహోక్షముపెంపుఁ జూచితే 77

అర్థము . తన-రజత + అద్రి-తోన్ + అ = తన వెండికొండతోనే ఈశుఁడు= శివుఁడు, విదితంబుగన్ = ప్రసిద్ధముగా, వచ్చెన్, పోలదు = అది సరికాదు, ఎందును = ఎచ్చటను, గిరులు = కొండలు, ఏఁగన్ + నేరవు = వెడలఁజాలవు, ఇది, ధూర్జటి = శివునియొక్క, నంది + అ = నందియే, కాదు, కనుఁగొనన్ = చూడఁగా, నందికిన్, ఇట్టి దీర్ఘ-తమ-గాత్రమున్ = మిక్కిలి పొడవైన శరీరమును, తెల్పును = తెలుపును, కల్గునే = ఉండునా? అనన్ = అనఁగా, ఘన-విధము = గొప్పదియగు రీతిని, అంది, క్రాలు = ఒప్పునట్టి, విష-కంరు = విషము కంరమందుఁగలవాని-శివునియొక్క మహోక్షము = మహత్ (మహా) + ఉక్షము = గొప్పయెద్దుయొక్క, పెంపున్ = అతిశయమును, చూచితే = చూచితివి + ఏ

తాత్పర్యము . శివుఁడు తన వెండికొండతోనే ప్రసిద్ధముగా వచ్చెను అది సరికాదు ఏలన ఎచ్చటను గొండలు నడవఁజాలవు ఇది శివుని నందియే కాదు

నందికి ఇట్టి మిక్కిలి పాడవైన శరీరమును, తెలుపును ఉండుట చూడము - అనునట్లు గొప్పగా నొప్పు శివుని పెద్దయెద్దు నతిశయమును జూచితివా?

విశేషములు . అలంకారము హేత్వపహ్నవము 'స ఏవ యుక్తిపూర్వ శ్చే దుచ్యతే హేత్వపహ్నుతిః' చంద్రా

చ వరవృషభేంద్ర చిత్రితరవం బెసఁగం దొలఁకాడు గంగ క్రొ
న్నురువులు మౌళిపైఁ జెదరి నూత్నలతాంతవిభాతిగా సుధా
కర కరజాలముల్ దిశలఁ గ్రాలెడు చామరపంక్తిగా సురే
శ్వర హరి పద్మజుల్ వొగడ వచ్చు నుమావరు శంభుఁ జూచితే 78

అర్థము . వర-వృషభ + ఇంద్ర-చిత్రిత-రవంబు = శ్రేష్ఠమయిన వృషభరాజముచేఁ గావింపఁబడిన ధ్వని, ఎసఁగన్ = అతిశయింపఁగా, తొలఁకాడు= కలఁగునట్టి-చలించునట్టి, గంగ = గంగయొక్క క్రొన్నురువులు (క్రొత్త + నురువులు), మౌళిపైన్ = శిరస్సుమీఁద, చెదరి, నూత్న-లతాంత-విభాతి + కాన్ = క్రొత్తపూవులయొక్క కాంతి కాఁగా, సుధాకర-కర-జాలముల్ = చంద్రుని కిరణముల సమూహములు, దిశల్ = దిక్కులందు, క్రాలెడు = ఒప్పునట్టి, చామర-పంక్తి + కాన్ = వింజామరముల వరుస కాఁగా, సుర + ఈశ్వర-హరి-పద్మజుల్ = ఇంద్రుఁడు, విష్ణువు, బ్రహ్మ, పొగడన్ = పొగడుచుండఁగా, వచ్చు = వచ్చునట్టి, ఉమా-వరున్ = పార్వతీనాథుని-శివుని, శంభున్, చూచితే

తాత్పర్యము . శ్రేష్ఠమైన వృషభరాజము గావించు ఱంకె అతిశయింపఁగాఁ జలించు గంగ క్రొత్తనురువులు శిరస్సుపైఁ జెదరి క్రొత్తపువ్వుల విశేషకాంతికాఁగా, చంద్రకిరణముల సమూహములు దిక్కులందు ఒప్పు వింజామరల వరుసకాఁగా ఇంద్ర విష్ణు బ్రహ్మలు పొగడుచుండఁగా వచ్చెడు శివునిఁ జూచితివా?

విశేషములు . శివుని వాహనమైన నంది ఱంకె వేయఁగా నతని శిరము నందలి గంగ క్రొత్తనురువులు శిరస్సుపైఁ జెదరి వింతపూవులవలె నుండెను అతని శిరస్సుననున్న చంద్రుని కిరణములు దిక్కులందు వ్యాపించి వింజామరలవలె నుండెను ఒక మహారాజు వచ్చుచున్నట్లు శివుని రాకను వర్ణించుట చూడనగును అలంకార ముపమ క్రొన్నురువులు - క్రొత్త + నురువులు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చు మీఁదివర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు' బాల సంధి 36 క్రొ + నురువులు 'క్రొత్తశబ్దమున కాద్యక్షరశేషంబునకుం

గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు బాల సంధి 38 క్రొన్నురువులు

వ అనుచు మనోనురాగంబునం జూచుచుండి రంతఁ గొందఱు ప్రౌఢాంగన లీశ్వరు ననేకప్రకారంబుల నుపలక్షించుచు 79

అర్థము. అనుచున్, మనోనురాగంబునన్ (మనస్ + అనురాగంబునన్) = మనఃప్రీతితో, చూచుచున్ + ఉండిరి, అంతన్ కొందఱు, ప్రౌఢ + అంగనలు = ప్రౌఢలైన స్త్రీలు, ఈశ్వరున్, అనేక-ప్రకారంబులన్ = పెక్కు రీతుల, ఉపలక్షించుచున్= చూచుచు

తాత్పర్యము. అనుచు మనసునకు సంతోషము గలుగునట్లు చూచుచుండిరి అంతఁ గొందఱు ప్రౌఢలైన స్త్రీలు ఈశ్వరుని, బెక్కురీతులఁ జూచుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ ఉరురజతాద్రిపైఁ బొగడ నుగ్రతరోన్నతిఁ బాండురాంగు నం
త్యరుణజటాచయావృతసితాహిఫణామణు లొప్పు శీతభూ
ధరవరహేమశృంగసువృతంబగు నాకనదీజలంబు బం
ధుర బహువర్ణ విస్ఫురితతోయజకోరకరాజి పెంపునన్ 80

అర్థము : ఉరు - రజత + అద్రిపైన్ = గొప్పదియగు వెండికొండమీఁద, పొగడన్ = పొగడునట్లు, ఉగ్రతర + ఉన్నతిన్ = మిక్కిలి భయంకరమైన - అత్యంతమైన ఔన్నత్యముతో, పాండుర + అంగు = తెల్లని శరీరము గలవాని - శివునియొక్క, అతి + అరుణ-జటా-చయ + ఆవృత-సిత + అహి -ఫణా-మణులు = మిక్కిలి యెఱ్ఱనైన జడలసమూహముచే నావరింపఁబడిన తెల్లని పాము పడగలందలి మణులు, శీత-భూధర-వర-హేమ-శృంగ-సువృతంబు + అగు = మంచుకొండయొక్క శ్రేష్ఠమైన బంగరుశిఖరముచే నావరింపఁబడినది అగు, నాక-నదీ-జలంబు = ఆకాశగంగాజలముయొక్క, బంధుర-బహువర్ణ-విస్ఫురిత-తోయజ-కోరక-రాజి-పెంపునన్ = ఒప్పిదములైన పెక్కురంగులతోఁ బ్రకాశించు తామరమొగ్గల సమూహము విధమున, ఒప్పున్

తాత్పర్యము : పెద్ద వెండికొండ మీఁద మిక్కిలి ఉన్నతితోఁ దెల్లని శరీరముగల శివుఁ డున్నాఁడు అతని మిక్కిలి యెఱ్ఱనైన జటాసమూహముచే నావరింపఁబడిన

పాముపడగలందలి తెల్లని మణులు - హిమవత్పర్వతపు బంగారు శిఖరముచే నావరింపఁబడిన ఆకాశగంగానదీజలములందు ఒప్పెడు పలురంగుల తామరమొగ్గల వరుసవిధమున నొప్పును

విశేషములు. అలంకార ముపమ 'పెంపు' ఉపమావాచకము ఫణామణు లుపమేయము తోయజకోరకరాజి ఉపమానము ఒప్పుట సామాన్య ధర్మము పెంపు = విధము అనుటకు 'సంపాదించు పెంపున' వసు 4 23

చ స్ఫురదురుఫాలనేత్రశిఖిఁ బూర్ణతరామలబింబ మొక్కపాల్
గరఁగె ననంగ నొప్పు శశిఖండము ముందఱఁ గాఁగి క్రమ్మ ను
త్కరవర తత్సుధారసము కల్లడి నాఁ దగి జూటపూరితా
మరనది వొల్చె నర్ధశశిమండలనిర్ఝరసింధుమౌళికిన్ 81

అర్థము. అర్ధ - శశి - మండల - నిర్ఝర - సింధు - మౌళికిన్ = సగము చంద్రబింబము, ఆకాశగంగ శిరమునందుఁ గలవానికి - శివునకు, జూట-పూరిత + అమర-నది = జడముడియందు నిండిన ఆకాశగంగ, స్ఫురత్ + ఉరు-ఫాల-నేత్ర-శిఖిన్ = ప్రకాశించుచున్న గొప్ప నుదుటికంటిమంటచే, పూర్ణతర + అమల-బింబము = సంపూర్ణ చంద్రబింబము, ఒక్క-పాల్ = ఒక కొంత భాగము, కరఁగెన్ + అనంగన్ + ఒప్పు = కరఁగెననఁగా నొప్పునట్టి, శశి-ఖండము = చంద్రకళ, ముందఱన్ = ముందుగా, కాఁగి = తప్తమై, క్రమ్మ = వ్యాపించు, ఉత్కరవర-తద్ + సుధా-రసము-కల్లడి = రాశిగల ఆ శశిఖండముయొక్క అమృతరసము యొక్క పొంగు, నాన్ = అనఁగా, తగి = ఒప్పి, పొల్చెన్

తాత్పర్యము శిరమున అర్ధచంద్రుడు, దేవనది గల శివునకు, - నొసటి కంటి మంటచే నిండుచంద్రుని బింబ మొకకొంత కరఁగె నన నొప్పు చంద్రకళ, ముందుగాఁ గాఁగి వ్యాపించు దాని అమృతరసము పొంగు అనఁదగి జటాజూటము నందు నిండిన ఆకాశగంగ యొప్పెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ అని యి ట్లనేకవిధంబుల వితర్కించుచు వర్ణించుచుం జూచుచున్న యవసరంబునం బరమేశ్వరుండు పౌరజనంబుల నయనేందీవరంబుల నిజాననేందుచంద్రికాజాలంబుల నలంకరించుచుఁ దదీయావలోక నామృతనయనకలశంబు లాత్మీయ దయావలోకనామృతానందరసాపూర్ణంబులు

సేయుచు విపణిమార్గంబు గడచి ప్రాలేయాచలచక్రవర్తి రాజమందిరంబుఁ బ్రవేశించి త దంతఃపురాంగనాదత్త పంచమణి శేపాక్షతాకలితోత్తమాంగుం డగుచుం జనుదెంచి కనకమయ రమ్యహర్మ్య మణిభద్రంబున రుద్రుండు వృషభేంద్రుం జేర్చి డిగ్గి నగపతిదత్తసముత్తుంగమణిసింహాసనాసీనుం డయ్యె నంత హిమవంతుండు మృడు నడుగులు గడిగి తదీయామలజలపవిత్రీకృతాత్మీయమందిరాభ్యంతరుండై పరమానందంబున 87

అర్థము. అని, ఇట్లు, అనేక-విధంబులన్, వితర్కించుచున్ = ఊహించుచు, వర్ణించుచున్, చూచుచున్ + ఉన్న, అవసరంబునన్ = సమయమునందు పరమేశ్వరుండు, పౌర-జనంబుల = పురజనులయొక్క, నయన + ఇందీవరంబులన్= కనుఁగలువలను, నిజ + ఆనన + ఇందు-చంద్రికా-జాలంబులన్= తనదైన ముఖచంద్రుని వెన్నెలల సమూహములచే, అలంకరించుచున్, తదీయ + అవలోకన + అమృత-నయన కలశంబులు = వారివైన చూపులనెడి అమృతముగల నేత్రములనెడి పాత్రములను, ఆత్మీయ-దయా-అవలోకన + అమృత + ఆనంద-రస-పూర్ణంబులు = తనదైన దయతోడి చూపులనెడి అమృతానందరసముచే నిండినవి, చేయుచున్, విపణి-మార్గంబు = అంగడివీధి, కడచి = దాటి, ప్రాలేయ + అచల-చక్రవర్తి-రాజ-మందిరంబున్ = హిమవత్పర్వతరాజుయొక్క రాజభవనమును, ప్రవేశించి, తద్ + అంతఃపుర + అంగనా-దత్త-పంచ-మణి-శేష + అక్షత + ఆకలిత + ఉత్తమాంగుండు = ఆతని అంతఃపురస్త్రీలచే నీఁబడిన అయిదుమణులు, సేసఁబ్రాలు అనువానిచేఁ గూర్పఁబడిన శిరస్సు గలవాఁడు, అగుచున్, చనుదెంచి, కనకమయ-రమ్య-హర్మ్య-మణి భద్రంబునన్ = బంగారుతో నిర్మింపఁబడిన సుందరమైన మేడయందలి మణిభద్రమునందు, రుద్రుండు = శివుఁడు వృషభ + ఇంద్రున్ = వృషభరాజమును - నందిని, చేర్చి, డిగ్గి = దిగి, నగ-పతి-దత్త-సముత్తుంగ-మణి-సింహాసన + ఆసీనుండు = కొండలఱేనిచే నీఁబడిన మిక్కిలి యెత్తయిన మణినిర్మితమైన సింహాసనమునందుఁ గూర్చున్నవాఁడు, అయ్యెన్, అంతన్, హిమవంతుండు, మృడు + అడుగులు = ఈశ్వరునియొక్క పాదములు, కడిగి, తదీయ + అమల-జల-పవిత్రీకృత + ఆత్మీయ-మందిర + అభ్యంతరుండు + ఐ = ఆ పవిత్రమైన నీటిచేఁ బావనము చేయఁబడిన తనదైన భవనముయొక్క లోపలిభాగము గలవాఁడయి, పరమ + ఆనందంబునన్ = గొప్ప ఆనందముతో

తాత్పర్యము . అని యిట్లు అనేకవిధముల భావించుచు, వర్ణించుచుఁ జూచుచున్న సమయమున నీశ్వరుఁడు పురజనుల కనుఁగల్వలను దనముఖచంద్రుని వెన్నెలల సమూహముచే నలంకరించుచు, వారి చూపులనెడి అమృతముగల నేత్రములనెడి పాత్రములను దన దయాదృష్టియనెడి అమృతరసముతో నిండినవిగాఁ జేయుచు అంగడి వీధిని దాఁటి, హిమవత్పర్వతచక్రవర్తి రాజభవనమును బ్రవేశించి, అందలి అంతఃపురస్త్రీలు తన శిరస్సున పంచమణులు సేసఁబ్రాలు చల్లఁగా వచ్చి సువర్ణమయమైన రమ్యహర్మ్యమునందలి మణిభద్రమునఁ దన వాహనమైన నందిని జేర్చి, దిగి, పర్వతరా జొసంఁగిన సమున్నతమణిమయసింహాసనమున నాసీనుఁ డయ్యెను అంత హిమవంతుఁడు శివుని పాదములు గడిగి యా పవిత్రజలములచే భవనాంతరమును బావనము చేసికొని పరమానందముతో - తరువాతి పద్యముతో నన్వయము

క "పరమేశ్వరు పాదోదక
పరివృతమై నేఁడు లగ్గఁ బావనమై సు
స్థిరమై మద్గృహమును మ
త్పురము శుభోన్నతిఁ ద్రిలోకపూజ్యం బయ్యెన్ 83

అర్థము: పరమేశ్వరు = మహేశ్వరుని యొక్క, పాద + ఉదక-పరివృతము+ ఐ = అడుగులు గడిగిన నీటిచేఁ జుట్టఁబడినదయి, నేఁడు = ఈదినము, మత్ + గృహమును = నా యిల్లును, మత్ + పురమున్ = నా నగరమును, లగ్గన్ = మిక్కిలి, పావనము + ఐ = పవిత్రమయి, సుస్థిరము + ఐ = నిలుకడగలదియై, శుభ + ఉన్నతిన్ శుభాధిక్యముచే, త్రిలోక-పూజ్యంబు = ముల్లోకములకుఁ బూజింపఁదగినది, అయ్యెన్

తాత్పర్యము . పరమేశ్వరుని పాదోదకముచేఁ బరివృతమయి, నేఁడు నా గృహమును, నా పురమును మిక్కిలి పావనమయి శుభాధిక్యముచే ముల్లోకములకుఁ బూజింపఁదగినది అయ్యెను

వ. అనుచుండె నంతం దత్పురజనంబులు పరమానందరసప్రవాహమునం దేలుచు 84

అర్థము . అనుచున్ + ఉండెన్, అంతన్, తద్ + పుర-జనంబులు = ఆ నగరమునందలి జనులు, పరమ + ఆనంద-రస-ప్రవాహమునన్ = గొప్ప ఆనందరసముయొక్క ప్రవాహమునందు, తేలుచున్ -

తాత్పర్యము. అని పలుకుచుండెను అంత, నా నగరవాసులు పరమానంద రసప్రవాహమునఁ దేలుచు - తరువాతి పద్యముతో నన్వయము

క గిరిసుత కారణమున నీ
శ్వరు నింటికిఁ దెచ్చుకొనియె శైలేంద్రుఁడు సుం
దర వర తనయలఁ బడసిన
పురుషులు దా రెందు రాజపూజ్యులు గారే? 85

అర్థము. శైల + ఇంద్రుఁడు = పర్వతరాజు, గిరి-సుత-కారణమునన్ = పార్వతికారణముగా, ఈశ్వరున్, ఇంటికిన్, తెచ్చుకొనియెన్, సుందర-వర-తనయలన్= అందమైన మేలికూఁతులను, పడసిన = పొందిన, పురుషులు-తారు = ఆ పురుషులు, ఎందున్ = ఎక్కడనైనను రాజ-పూజ్యులు = రాజులచేఁ బూజింపఁదగినవారు, కారే = కారా! అగుదు రనుట

తాత్పర్యము : పర్వతరాజు పార్వతి కారణమున నీశ్వరుని ఇంటికిఁ దెచ్చుకొనియెను అందమైన మేలికూఁతులు గల పురుషు లెందయినను రాజపూజ్యు లగుదురు కదా!

విశేషములు అలంకార మర్థాంతరన్యాసము

వ అనుచు ననేక ప్రధాన సురపురుషులు దమతమ రమ్యహార్మ్యంబుల హరి పరమేష్ఠి పురందరాద్యమరవరుల విడియించి రంత నటఁ బురాభ్యంతర బాహ్యోద్యానవనంబులం దఖిలజనంబులుం గ్రిక్కిఱిసి విడిసి తత్పురజనాభ్యర్చితు లగుచుం బరమసుఖలీలం బ్రవర్తించుచుండి రంత 86

అర్థము: అనుచున్, అనేక-ప్రధాన-సుర-పురుషులు = పెక్కండ్రు ముఖ్యులైన దివ్యపురుషులు, తమ-తమ, రమ్య-హార్మ్యంబులన్ = సుందరములయిన మేడలందు, హరి-పరమేష్ఠి - పురందర + ఆది + అమరవరులన్ = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతాశ్రేష్ఠులను, విడియించిరి = బసచేయించిరి, అంతన్, అటన్, పుర + అభ్యంతర-బాహ్య + ఉద్యానవనంబులందున్ = నగరములోపలి, వెలుపలి ఉద్యానవనములందు, అఖిల-జనంబులున్ = ఎల్ల జనులును, క్రిక్కిఱిసి-విడిసి = క్రిక్కిఱియునట్లు బసచేసి, తద్ + పుర-జన + అభి + అర్చితులు = ఆ నగరమునందలి జనులచేఁ బూజింపఁబడినవారు, అగుచున్, పరమ-సుఖ-లీలన్= మిక్కిలి సౌఖ్యముతో, ప్రవర్తించుచున్ + ఉండిరి, అంతన్

తాత్పర్యము . అనుచుఁ బెక్కండ్రు ముఖ్య దివ్యపురుషులు తమతమ సుందరహార్మ్యములందు విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతాశ్రేష్ఠులను విడిదిచేయించిరి అంత నట నగరము లోపలి వెలుపలి ఉద్యానవనములందు జను లెల్లరును గ్రిక్కిటియునట్లు బసచేసి యా యూరిజనులచేఁ బూజితులగుచు మిక్కిలి సౌఖ్యముతోఁ బ్రవర్తించుచుండిరి అంత-తరువాతి పద్యముతో నన్వయము

క మృడు బలము లుర్విఁ గ్రిక్కొన
విడిసిన దశశతకరుండు విడియఁగ దన కె
య్యెడ నెడ సాలక యరిగిన
వడువున నపరాద్రి నందవనమున కరిగెన్ 87

అర్థము. మృడు-బలములు = శివుని సైన్యములు, ఉర్విన్ = భూమియందు, క్రిక్కొనన్-విడిసినన్ = క్రిక్కిటియునట్లు విడిదిచేయఁగా, దశ-శత-కరుండు = వేయి కిరణములవాఁడు - సూర్యుఁడు, విడియఁగన్ = బసచేయుటకు, తనకున్ ఎయ్యెడన్ (ఏ + ఎడన్) = ఎచ్చోటను, ఎడ = ఎడము, చాలక, అరిగిన-వడువునన్ = వెడలిపోయిన రీతిని, అపర +అద్రి-నంద-వనమునకున్ = పడమటి కొండయందలి ఉద్యానవనమునకు, అరిగెన్

తాత్పర్యము : శివుని సైన్యము భూమియందుఁ గ్రిక్కిటియునట్లు విడియఁగా, సహస్రకిరణుఁడైన సూర్యుఁడు తన కెచ్చటను విడియుటకుఁ జోటు చాలక వెడలెనా యనునట్లు పడమటికొండయందలి యుద్యానవనమునకు వెడలెను

విశేషములు. అలంకరముత్ప్రేక్ష సూర్యుఁడు సహస్రకిరణుఁడగుటచేతనే వానికి నగరమునఁ జోటు చాలలేదనుట

సూర్యాస్తమయ వర్ణనము

వ త దనంతరంబ 88

అర్థతాత్పర్యములు : ఆ వెంటనే, తరువాతి పద్యముతో నన్వయము

క పోంక నలినీ రజస్వల
సోంకిన దోషంబు వాయ సూర్యుఁడు కలితా
శంక నపరాంబునిధిలోఁ
గ్రుంకె నొకో యనఁగఁ బ్రొద్దు గ్రుంకుడు నంతన్ 89

అర్థము . పొంకన్-పొఁకన్ = వేఁగుఁబోఁకయందు - ఉదయసంధ్యా సమయమున, నలినీ-రజస్వలన్ = తామరతీఁగ యనెడు ముట్టుతను, పుష్పవతిని, సోంకిన = సోఁకిన, దోషంబు = పాపము, పాయన్ = పోవుటకు, సూర్యుఁడు, కలిత+ ఆశంకన్ = కూడిన అనిష్ట శంకతో, అపర + అంబునిధిలోన్ = పడమటి సముద్రమునందు, క్రుంకెన్ + ఒకో = మునిఁగెనా, అనఁగన్, ప్రొద్దు-క్రుంకుడున్= సూర్యాస్తమయము కాఁగానే, అంతన్

తాత్పర్యము. తామరతీఁగ యనెడు రజస్వలను దాఁకిన పాపము పోవుటకు సూర్యుఁడు అనిష్టశంకతోఁ బడమటి సముద్రమున మునిఁగెనా యనునట్లు సూర్యాస్తమయము కాఁగా - అంత తరువాతి పద్యములో నన్వయము

విశేషములు . రజస్వల యనఁగా రజస్సుగలదియని యర్థము రజస్సు అనఁగా - పుప్పొడియనియు, ముట్టునెత్తురనియు, నర్థము నలిని = పద్మిని నలినీ పక్షమునఁ బుప్పొడి గలది యనియు, స్త్రీ పక్షమున ముట్టుతయనియుఁ జమత్కారము ముట్టుతను దాఁకుట దోషము స్నానము చేయుటయే తత్పరిహారము అలంకారము రూపకానుప్రాణితమైన హేతూత్ప్రేక్ష ప్రొద్దు - వికృతి - బ్రధ్న - ప్రకృతి పొంక, సోంక అను పూర్ణబిందురూపముల ప్రయోగము నన్నెచోడని ప్రాచీనతకు నిదర్శనము

చ ఇనుఁ డొడఁగూడి రాక కుదధీశుదిగంగన రాగ మొందెనో
యన నెఱసంజ వర్వె నమరాధిపదిక్పతి దానిఁజూచి వం
దినఁ దనుకంతి మాసె ననఁ దె ల్లఱఁ జీఁకటి గప్పె; నంబుజా
సన హరి విశ్వరూపయుగసంగమలీల నభంబు వొల్పుగాన్ 90

అర్థము అంబుజ + అసన = పద్మము పీఠముగాఁగల వాఁడు - బ్రహ్మ, హరి = విష్ణువు, అనువారియొక్క, విశ్వ-రూప-యుగ-సంగమ-లీలన్ = విశ్వరూపముల జంటయొక్క కూడికవలె, నభంబు = ఆకాశము, పొల్పుగాన్ = ఒప్పుగా, ఇనుఁడు = సూర్యుఁడు - ప్రభువు-భర్త, ఒడఁగూడి = సమ్మతించి, రాకకున్= వచ్చుటకు, ఉదధి = ఈశు-దిశ్ (క్) + అంగన = సముద్రాధిపతియగు వరుణుని దిక్కు అగు పడమర యను స్త్రీ, రాగము = ప్రేమ, ఎఱుపు, ఒందెనో = పొందెనా, అనన్, నెఱసంజ = నిండుసంధ్య, పర్వెన్ = వ్యాపించెను, అమర + అధిప-దిశ్ (క్) + సతి = దేవతల ప్రభువైన ఇంద్రుని దిక్కు అగు తూర్పు అనెడి స్త్రీ, దానిన్ = పడమటి దిక్కునెడి స్త్రీ రాగమొందుటను, చూచి, వందినన్ =

దుఃఖింపఁగా, తను-కాంతి = శరీరకాంతి, మాసెన్ + అనన్ = నల్లఁబడె ననఁగా, లెల్పు + అటన్ = తెలుపు నశింపఁగా, చీఁకటి, కప్పెన్ = క్రమ్మెను

తాత్పర్యము బ్రహ్మ విష్ణువుల విశ్వరూపముల జంట కూడిన విధమున నాకాశమొప్పఁగాఁ బడమటి దిక్కున నెఱసంజయుఁ దూర్పుదిక్కునఁ జీఁకటియుఁ గ్రమ్మెను పడమట నెఱసంజ పర్వుట ప్రభువగు సూర్యుఁడు సమ్మతించి వచ్చుటకు అపరదిక్పతి రాగమొందెనా యనున ట్లుండెను తూర్పునఁ జీఁకటిక్రమ్ముట అపర దిక్పతి తనకు లభించిన భర్తృసంగమసుఖముచే రాగమొందుటను జూచి ప్రాచీదిశాంగన అసూయపడి నల్లనయినట్లుండెను

విశేషములు. నెఱసంజయుఁ, జీఁకటియు వ్యాపించుట బ్రహ్మ విష్ణువుల విశ్వరూపద్వయమువలె నుండుటకు బ్రహ్మ రక్తవర్ణుఁడుగను, విష్ణువు నీలవర్ణుఁడుగను నుండుటయే కారణము ఇనుఁడు, రాగము అనుశబ్దముల కర్థద్వయముండుటచే శ్లేషము తదనుప్రాణితమైన హేతూత్ప్రేక్ష ఉదధీశుదిగంగన, అమరాధిప దిక్పతి యనుచో రూపకమును, ఉత్ప్రేక్ష, తదుత్థాపితము విశ్వరూప మనుట యేలయన ఆ యెఱుపును నలుపును నభమంతయు వ్యాపించుటచే నెఱసంజ వర్వె - నెఱసంజ + పర్వె, నభంబు వొల్పుగాన్ - నభంబు + పొల్పుగాన్ - గసడదవాదేశము సంధ్య - ప్రకృతి - సంజ - వికృతి

ఆ కువలయారి సనియెఁ గువలయహితుఁడగు
రాజు వచ్చె నని కరంబు నమ్మి
రమణ లోక మెల్ల రాగిల్లున ట్లెఱ
సంజ గలయఁ బర్వె సకలదిశల 91

అర్థము. కువలయ + అరి = కలువల శత్రువు (సూర్యుఁడు) భూవలయమునకు శత్రువు, చనియెన్ = పోయెను, కువలయహితుఁడు = కలువలకు మిత్రుఁడు - చంద్రుఁడు - భూవలయమునకు మిత్రుఁడు, అగు, రాజు = చంద్రుఁడు - ప్రభువు, వచ్చెన్, అని, కరంబున్ = మిక్కిలి, నమ్మి, రమణన్ = ప్రీతితో, లోకము + ఎల్లన్ = లోకమంతయు, రాగిల్లు + అట్లు = సంతోషించునట్లు ఎట్టనైన విధమున, ఎఱసంజ = ఎట్టని సంధ్య, సకల-దిశలన్ = ఎల్లదిక్కులను, కలయన్ = అంతటను, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము. కలువల శత్రువైన సూర్యుఁడు (భూవలయమునకు శత్రువని అర్థాంతరము) పోయెను, కలువలకు మిత్రుఁడైన రాజు - చంద్రుడు

(భూవలయమునకు మిత్రుఁడైన ప్రభువని అర్థాంతరము) వచ్చెను లని మిక్కిలి విశ్వసించి ప్రీతితో నానందించునట్లు ఎఱ్ఱని సాయంసంధ్య యెల్లదిక్కులందును అంతటను వ్యాపించెను

విశేషములు . కువలయ శబ్దమునకును, రాజ శబ్దమునకును అర్థద్వయముండుటచే అలంకారము శ్లేషము రాగిల్లు - సంతోషించు, ఎఱ్ఱనగు - అనుటచేతను శ్లేషము శ్లేషానుప్రాణితమగు హేతూత్ప్రేక్ష

తే చాలఁ బ్రియుఁడగు శశి నిశాసంగతాను
రాగ రసమున సంధ్యానురాగ మడరి
కవయ నా చంద్రరజనీముఖముల నడరు
ఘర్మబిందు లనంగఁ జుక్కలు వెలింగె 92

అర్థము : చాలన్ = మిక్కిలి, ప్రియుఁడు + అగు + ఇష్టుఁడగు, శశి = చంద్రుఁడు, నిశా-సంగత + అనురాగ - రసమునన్ = రాత్రియనెడు స్త్రీయందుఁగూడిన ప్రేమరసముచే, సంధ్యా + అనురాగము = సంజయనెడి యనురాగము, అడరి = విజృంభించి - అధికమయి, కవయన్ = కూడఁగా, ఆ-చంద్ర-రజనీ-ముఖములన్ = ఆ చంద్ర రాత్రి ముఖములందు, అడరు = వ్యాపించు, ఘర్మబిందులు = చెమట బొట్టులు, అనంగన్, చుక్కలు, వెలింగెన్

తాత్పర్యము : మిక్కిలి యిష్టుఁడగు చంద్రుఁడు అను నాయకుఁడు రాత్రియను నాయికయందుఁ గలిగిన ప్రేమరసముచే సంజయను ప్రేమ మధికమయి కూడఁగా, ఆ చంద్ర రాత్రి ముఖములందు వ్యాపించు స్వేదబిందువులా యనునట్లు నక్షత్రములు ప్రకాశించెను

విశేషములు : శశి యను పుంలింగశబ్దముచే నాయకప్రతీతియును, నిశా యను స్త్రీలింగశబ్దముచే నాయికా ప్రతీతియును గలుగుచున్నవి సంధ్యానురాగము - సంధ్యయనెడి అనురాగము - రూపకము తదనుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము

మణిగణనికరము సరసిజహితుఁ డటు సనఁ దరతర మ
త్యురుణరుచిని మెఱుఁ గడరుడు వడి నం
బరమున నుడుతతి ప్రవిమల మయ్యెన్
నిరుపమ మణిగణ నికర విభాతిన్ 93

అర్థము. సరసిజ-హితుఁడు = పద్మమిత్రుఁడు - సూర్యుఁడు, అటు = ఆ విధముగా, చనన్ = పోవఁగా, తరతరము = క్రమక్రమముగా, అతి + అరుణ-రుచిని = మిక్కిలి ఎఱ్ఱనైన కాంతితో, మెఱుఁగు = ప్రకాశము, అడరుడున్ = వ్యాపించినంతనే, వడిన్ = వేగముగా, అంబరమునన్ = ఆకాశమున ఉడు-తతి = నక్షత్రముల సమూహము, నిరుపమ, మణి - గణ - నికర - విభాతిన్ = సాటిలేని, మణులయొక్క సమూహముయొక్క విశేషమైన కాంతితో, ప్రవిమలము + అయ్యెన్ = మిక్కిలి నిర్మల మయ్యెను

తాత్పర్యము ఆ రీతిగా సూర్యుఁడు అస్తమింపఁగాఁ క్రమక్రమముగా మిక్కిలి ఎఱ్ఱనైన కాంతితోఁ గాంతి వ్యాపించినంతనే వేగముగా నాకాశమున నక్షత్రముల సమూహము మణిగణనికరవిశేషకాంతితో నిర్మల మయ్యెను

విశేషములు. మణిగణనికరము - ఛందస్సు నాలుగుపాదములుండును ప్రతిపాదమునను - న - న - న - న - స అనుగణము లుండును మొదటి యక్షరమునకును తొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు పద్యనామము పద్యమున నిబంధింపఁబడుట గమనింపఁదగినది

క కోకనదంబులు మొగుడం
గోకంబులు విరిసి దిశలకుం జన మెఱుఁగై
ప్రోకలు గొని మౌక్తిక నిక
రాకర మనఁ దార లెసఁగె నంబరవీథిన్ 94

అర్థము. కోకనదంబులు = చెందమ్ములు, మొగుడన్ = ముడిచికొనఁగా, కోకంబులు = చక్రవాకములు, విరిసి = చెదరి, దిశలకున్ = దిక్కులకు, చనన్ = వెడలఁగా, తారలు = నక్షత్రములు, మెఱుఁగు + ఐ = ప్రకాశవంతములయి, ప్రోకలు + కొని = గుంపులయి, మౌక్తిక-నికర + ఆకరము + అనన్ = ముత్యాల గుంపులకు స్థానమనఁగా, అంబర-వీథిన్ = ఆకాశమార్గమున, ఎసఁగెన్ = ఒప్పెను

తాత్పర్యము : చెందమ్ములు ముకుళింపఁగా, చక్రవాకములు చెదరి దిక్కులకుఁ జనఁగా, ప్రకాశవంతములయి, గుంపులయి, నక్షత్రములు ముత్యాల సమూహమన, నాకాశమున నొప్పెను

విశేషములు : అలంకారము స్వభావోక్తి, ఉపమ

క తఱిఁ దఱి నినుతో నడవక
పిఱు పిక్కిన రుచులు తమము బిట్టడరుడు ని
వ్వెఱ నిండ్లలోన డాఁగిన
తెఱఁగున నుద్దీపదీపదీప్తులు వెలిఁగెన్ 95

అర్థము . తటిన్ + తటిన్ = తోడ్తో, ఇనులోన్ = సూర్యునిలో, నడవక, పిఱు + చిక్కిన = వెనుకఁబడిన, రుచులు = కాంతులు, తమము = చీఁకటి, బిట్టు = శీఘ్రముగా, అడరుడున్ = వ్యాపించినంతనే, నివ్వెఱన్ (నిండు + వెఱు) = మిక్కిలి భయముతో, ఇండ్లలోనన్, డాఁగిన = దాఁగిన, తెఱంగునన్ = విధమున, ఉద్దీప-దీప-దీప్తులు = ప్రకాశవంతములైన దీపముల కాంతులు, వెలిఁగెన్= ప్రకాశించెను

తాత్పర్యము : సూర్యునితో వెనువెంట నడవక వెనుకఁబడిన కాంతులు చీఁకటి శీఘ్రముగా వ్యాపించినంతనే మిక్కిలి భయపడి యిండ్లలో డాఁగినరీతిని ప్రకాశమానములగు దీపముల కాంతులు వెలుఁగొందెను

విశేషములు. అలంకారముత్ప్రేక్ష నివ్వెఱ - నిండు + వెఱ - 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి ' బాల సంధి 39

వ అయ్యవసరంబున 96

అర్థతాత్పర్యములు . ఆ + అవసరంబునన్ = ఆ సమయమున తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. ఆ + అవసరంబునన్ - యడాగమము - బాల సంధి 3 ఆ + యవసరంబునన్ త్రికసంధి బాల సమాస 14,13 అయ్యవసరంబునన్

అందకార వర్ణనము

సీ హరి గడుఁబ్రీతిఁ గస్తురి పూసెనో? కాలుఁ
డర్థిఁ గాలాగరు వలఁదె నొక్కొ?
మహిషాసురుఁడు కర్దమం బాడెనో? మహా
కాళి నీలపటంబుఁ గప్పెనొక్కొ?
మదహస్తిపై నలిమండలి ముసరెనో?
బలి నీలభూషాలిఁ బొలిచెనొక్కొ?

ఆ. భైరవుండు కృష్ణఫణిమయాకల్పముల్
దాల్చెనో యనంగఁ దరతరంబ
దలిచి తూఱరాని తఱచుతో నభమున
భూరితరమహాంధకార మడరె 97

అర్థము హరి = విష్ణువు, కడున్ + ప్రీతిన్ = మిక్కిలి సంతోషముతో, కస్తురి = కస్తూరి, పూసెనో, కాలుఁడు = యముఁడు అర్థిన్ = కోరికతో, కాల + అగరువు = నల్లని అగరు, అలఁదెన్ + ఒక్కొ = పూసెనో

మహిష + అసురుఁడు, కర్దమంబు + ఆడెనో = బురదయందు స్నానము చేసెనో, మహాకాళి, నీల-పటంబున్ = నల్లని వస్త్రమును, కప్పెన్ + ఒక్కొ = కప్పెనా?

మద-హస్తిపైన్ = మదపుటేనుఁగుమీఁద, అలిమండలి = తుమ్మెదల గుంపు, ముసరెనో, బలి = బలరాముఁడు, నీల-భూషా + ఆలిన్ = నల్లని అలంకారముల వరుసతో, పొలిచెన్ + ఒక్కొ = ఒప్పెనా?

భైరవుండు = ఈ పేరుగల శివగణాధిపుఁడు, కృష్ణ-ఫణి-మయ + ఆకల్పముల్ = నల్లని పాఁపతొడవులు, తాల్చెనో = ధరించెనో, అనంగన్, తరతరంబు + అ = క్రమక్రమముగా, దలిచి = వ్యాపించి (?), తూఱన్ + రాని = చొరనలవికాని, తఱుచుతోన్ = సాంద్రతతో, నభమునన్ = ఆకాశమున, భూరితర-మహాత్ (మహా) +అంధకారము = మిక్కిలి ఎక్కువయైన గొప్పచీఁకటి, అడరెన్ = వ్యాపించెను

తాత్పర్యము· విష్ణువు మిక్కిలి ప్రీతితోఁ గస్తూరిని బూసికొనెనా? కాలుఁడు కోరికతోఁ గాలాగరువును అలఁదికొనెనా? మహిషాసురుఁడు బురదలో మునిఁగెనా? మహాకాళి నల్లనివస్త్రమును గప్పికొనెనా? మదగజమునైఁ దుమ్మెదల గుంపు వ్యాపించెనా? బలరాముఁడు నల్లనియలంకారములతో నొప్పెనా? భైరవుఁడు నల్లత్రాచు ఆభరణములను ధరించెనా? అనురీతిని క్రమక్రమముగాఁ జొచ్చుటకు వీలులేని సాంద్రతతో నాకాశమున నధికమైన గాఢాంధకార మలముకొనెను

విశేషములు. అలంకారము ఉత్ప్రేక్ష నల్లనివారును, నల్లనివియును నల్లని వస్తువులను పూసికొనుటయో, కప్పికొనుటయో చేసినట్లు చెప్పుట నల్లని చీఁకటితోడి యుత్ప్రేక్షకు దలిచి - తెలియలేదు ప్రకరణానుగుణముగా నర్థము గ్రాయఁబడినది సీస పద్యమునందలి మూఁడవ పాదము లుప్తమయినది

క నుత వర్ణాంతర నిమ్నో
న్నత తల నిఖిలోచ్చ నీచ నానావస్తు
స్థితి సమము సేసె గత గౌ
రతఁ జీఁకటి దుర్వివేకి రాజ్యముపోలెన్. 98

అర్థము : చీఁకటి, గత-గౌరతన్ = పోయిన తెల్లఁదనముతో, దుర్వివేకి - రాజ్యము-పోలెన్ = మంచి వివేకము లేనివాని రాజ్యము వలె, నుత స్థితిన్ నుత = పొగడఁబడిన, వర్ణ + అంతర = రంగుల (కులముల) భేదము, నిమ్న + ఉన్నత తల = పల్లపు ఎత్తు ప్రదేశములు, నిఖిల + ఉచ్చ-నీచ = ఎల్ల ఎక్కువ తక్కువలుగల, నానా = అనేక, వస్తు = వస్తువులయొక్క, స్థితిన్ = ఉనికిని, సమము + చేసెన్ = సమానము చేసెను

తాత్పర్యము . చీఁకటి పోయినతెల్లఁదనముతో దుర్వివేకముగల రాజు రాజ్యమువలె వర్ణభేదములు, నిమ్నోన్నతములు, ఉచ్చనీచములు గల పెక్కువస్తువుల స్థితిని సమానము చేసెను

విశేషములు . చీఁకటిలో రంగుల పరస్పరభేదములు, ఎత్తు పల్లములు, ఉచ్చనీచములు తెలియవు దుర్వివేకియైనరాజు రాజ్యమునందును, కులభేదములు, ఎక్కువ తక్కువలు, మంచి చెడ్డలు నశించి యందఱును సమానముగా నుందురు అలంకార ముపమ

తే చీరి నేతితోఁ గాటుక పిక్క మెదిచి
నెఱయ బ్రహ్మాండకుహరంబు తెఱపిఁ గదియ
వరుసతో ముద్ద పరువడి వైచి కలయ
నీలి గుడిపిన క్రియఁ జీకువాలు గవిసె 99

అర్థము : చీరి-నేతితోన్ = ఇంచుక నేతితో, కాటుక, చిక్కన్ = చిక్కఁగా, మెదిచి = ఒకచేతివ్రేలిపైనుంచి వేఱొకవ్రేలితోరాచి, నెఱయన్ = నిండుగా, బ్రహ్మాండ-కుహరంబు + తెఱపిన్ = గుహవంటి బ్రహ్మాండముయొక్క తెఱపిని, కదియన్ = కూడునట్లు, వరుసతోన్, ముద్ద, పరువడిన్ = శీఘ్రముగా, వైచి, కలయన్=అంతటను, నీలి-కుడిపిన-క్రియన్ = నైల్యమును వ్యాపింపఁజేసిన రీతిని, చీకువాలు = చీఁకటి, కవిసెన్ = క్రమ్మెను

తాత్పర్యము : ఇంచుక నేతితోఁ గాటుక చిక్కఁగా వ్రేలితో రాచి బ్రహ్మాండకుహరము తెఱపిని బూర్ణముగాఁ గూడునట్లు ముద్దగ శీఘ్రముగా వైచి అంతటను నైల్యమును వ్యాపింపఁజేసినరీతిని చీఁకటి వ్యాపించెను

విశేషములు . అలంకారము ఉత్ప్రేక్ష

వ అంతం దెలిపి గని జారచోరాది గూఢాచారు లత్యుత్సవంబునం బ్రచరింప నుద్యుక్తులై

అర్థము. అంతన్, తెలిపి + కని = వీలుచూచి, జార-చోర + ఆది-గూఢ+ ఆచారులు = వ్యభిచారులు, దొంగలు, మున్నగు రహస్య వ్యాపారులు, ప్రచరింపన్ = సంచరించుటకు, ఉద్యుక్తులు + ఐ = ప్రయత్నించిన వారయి

తాత్పర్యము . అంత వీలుచూచుకొని జారులు, చోరులు మున్నగు రహస్యవ్యాపారులు సంచరించుటకుఁ బ్రయత్నించినవారయి - తరువాతి పద్యముతో నన్వయము

జారచోరాది వర్ణనము

ఉ సన్నలువాఱఁ బల్కుచుఁ గుచంబులు సూపుచుఁ గెల్లగించి క్రేఁ
గన్నులఁ దూఱఁజూచుచు, మొగంబునకున్ మురిపెంబుఁ దెచ్చుచున్
బిన్నటినవ్వు నున్పిడుచుఁ బెన్నెఱివేణులు సప్పరించుచుం
జె న్నొదవించుచున్ జఱభిచెయ్యులు దాల్చిరి జారకామినుల్. 101

అర్థము : జార-కామినుల్ = వ్యభిచరించు స్త్రీలు, సన్నలు-వాఱన్ = భావము సూచితమగునట్లు, పల్కుచున్, కుచంబులు = స్తనములు, చూపుచున్, కెల్లగించి = పురికొల్పి, క్రేఁగన్నులన్ (క్రేవ + కన్నులన్) = క్రీఁగన్నులతో, తూఱన్ + చూచుచున్ = గాటముగాఁ జూచుచు, మొగంబునకున్ = ముఖమునకు, మురిపెంబున్ = చక్కఁదనమును, తెచ్చుచున్, పిన్నటి-నవ్వు = చిఱునవ్వు, నున్పిడుచున్ = మనోహరము చేయుచు, పెన్నెఱి-వేణులు (పెను+నెఱి) = పెద్ద వెండ్రుకలజడలు, చప్పఱించుచున్ = నిమురుచు, చెన్ను + ఒదవించుచున్ = అందమును గలిగించుచు, జఱభి-చెయ్యులు = వేశ్యల చేష్టలు, తాల్చిరి = పూనిరి

తాత్పర్యము . వ్యభిచారిణులు భావము సూచితమగునట్లు పల్కుచు, స్తనములు చూపుచు, పురికొల్పి క్రీఁగన్నులతో గాటముగాఁ జూచుచు, ముఖమునకుఁ జక్కఁదనమును దెచ్చుచు, చిఱునవ్వు మనోహరముగా నవ్వుచు, పెద్ద వెండ్రుకల జడలు నిమురుచు, అందమును గలిగించుచు వేశ్యలచేష్టలను జేసిరి

విశేషములు : అలంకారము స్వభావోక్తి సన్న (వికృతి) - సంజ్ఞ (ప్రకృతి) పెన్నెఱి - పెను + నెఱి

క జారపతి రాగరుతిఁ గని
భోరన రాగంబుతోడఁ బొల్తుక సనియెన్
వారక ప్రియు పుత్తెంచిన
వారలతోఁ జనుట గూర్చువారికిఁ జనదే? 102

అర్థము. జార-పతి = అంకుమగనియొక్క, రాగ-రుతిన్ = అనురాగము తోడి ధ్వనిని, కని = చూచి, భోరన = శీఘ్రముగా, పొల్తుక = స్త్రీ, రాగంబుతోడన్ = అనురాగముతో, చనియెన్ = వెడలెను, వారక = తప్పక, ప్రియు-పుత్తెంచిన-వారలతోన్ = ప్రియుఁడు పంపినవారితో, చనుట, కూర్చు-వారికిన్ = ప్రేమించువారికి, చనదే = తగదా?

తాత్పర్యము : ఉపపతి రాగమును జూచి ఇంతి రాగముతో శీఘ్రముగా వెడలెను ప్రియుఁడు పంపినవారితోఁ జనుట యిష్టులైనవారికిఁ దగునుగదా!

విశేషములు. అలంకార మర్థాంతరన్యాసము

క ఆలోల దృష్టి సంజ్ఞల
బాలకి దగిలించి జారపతి రావించెన్
లీలానికేతనమునకు
నాలోకనవిద్య వడసినదియును బోలెన్ 103

అర్థము. బాలకి = తరుణి, ఆలోకన-విద్య = చూచుటయను విద్య, పడసిన + అదియును + పోలెన్ = పొందినదా యనునట్లు, ఆలోల-దృష్టి-సంజ్ఞలన్ = చంచలములయిన నేత్రసంజ్ఞలను, తగిలించి = తగులుకొనునట్లుచేసి, లీలా-నికేతనమునకున్ = విలాసగృహమునకు, జారపతిన్ = ఉపపతిని, రావించెన్ = రప్పించెను

తాత్పర్యము. తరుణి చూచుట యనుకళను బొందినదా యనునట్లు చంచలములయిన కనుసన్నలను దగులుకొనఁజేసి విలాసగృహమునకు ఉపపతిని రప్పించెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ ఇ ట్లనేకప్రకారంబులం గామకేళీలాలసు లగుచుండి రంత నక్కడ

అర్థము ఇట్లు, అనేక-ప్రకారంబులన్ = పెక్కువిధముల, కామ-కేళీ-లాలసులు = మన్మధక్రీడాసక్తులు, అగుచున్ + ఉండిరి, అంతన్, అక్కడన్

తాత్పర్యము ఈ రీతిగాఁ బెక్కువిధముల మన్మధక్రీడాసక్తు లగుచుండిరి అంత నక్కడ - తరువాతి పద్యముతో నన్వయము

చంద్రోదయ వర్ణనము

చ తమమను నీలవర్ణపరిధానము వీడఁగఁ, బూర్వశైలశృం
గములనునున్నతస్తనయుగంబు దనర్పఁ జకోరబంధువ
ర్గము ముద మొందఁగా నిజముఖద్యుతి వెల్పుగ, నిండుగర్భచి
హ్నాము లభిరామమయ్యె నమరాధిపదిక్సతికిం గ్రమంబునన్ 105

అర్థము: అమర + అధిప-దిశ్(క్) + సతికిన్ = దేవేంద్రుని దిక్కు (తూర్పు దిక్కు) అనెడి స్త్రీకి, క్రమంబునన్ = క్రమముగా, తమము + అను = చీఁకటి యనెడి, నీల-వర్ణ-పరిధానము = నల్లరంగు వస్త్రము, వీడఁగన్ = ఊడిపోఁగా, పూర్వ-శైల-శృంగములు = తూర్పుకొండ శిఖరములు, అను, ఉన్నత-స్తనయుగంబు = ఎత్తయిన చన్నులజంట, తనర్పన్ = ఒప్పఁగా, చకోర-బంధు-వర్గము = వెన్నెల పులుఁగులనెడి చుట్టముల సమూహము, ముదము + ఒందఁగాన్ = సంతోషపడఁగా, నిజ-ముఖ-ద్యుతి = తనదైన మొగము కాంతి, వెల్పుగన్ = తెల్లనకాఁగా, నిండు-గర్భ-చిహ్నాములు = నిండుచూలు చిన్నెలు, అభిరామము + అయ్యెన్ = మనోహరమయ్యెను

తాత్పర్యము : తూర్పుదిక్కునెడు స్త్రీకిఁ జీఁకటియను నల్లరంగు వస్త్ర మూడిపోఁగా, తూర్పుకొండశిఖరములనెడి ఉన్నతములయిన చన్నుల కవ యొప్పఁగా, వెన్నెలపులుఁగు లనెడి బంధువుల సముదాయము సంతోషింపఁగా, తన ముఖకాంతి తెలుపుగా నిండుచూలుచిన్నెలు క్రమముగా మనోహరము లయ్యెను

విశేషములు : అలంకారము రూపకము వస్త్ర మూడిపోవుట, చనుఁగవ

పెరుఁగుట, ముఖము తెల్లనగుట అనునవి నిండు చూలి చిన్నెలు ఆ చిన్నెలను జూచి బంధుకోటి అలరును చకోరములకు ముదమేల యన అవి వెన్నెలపులుఁగులు గనుక వెన్నెల యన వాని కిష్టము ముఖము తెల్లనగుట వానికి సంతోషమును గూర్చును

వ తదనంతరంబ 106

అర్థతాత్పర్యములు. ఆ తరువాతనే తరువాతి పద్యముతో నన్వయము

శా పూర్వాంభోధిజలంబు లన్నియు వడిం బొ ల్పేదఁగాఁద్రాగి త
ద్దీర్వాణోరునదీజలౌఘముల నాక్షేపింప విన్వీధి న
య్యోర్వోగ్రాగ్ని రయంబున న్నెగసె నా నత్యంతరాగద్యుతుల్
పర్వన్ బి ట్టుదయించెఁ జంద్రుఁ డెదలోఁ బాంథుల్ భయం బందఁగన్ 107

అర్థము. పూర్వ + అంభోధి-జలంబులు = తూర్పుసముద్రజలములు, అన్నియున్,వడిన్ = వేగముగా, పొల్పు + ఏదఁగాన్ = ఒప్పు నశింపఁగా, త్రాగి, తద్+ గీర్వాణ + ఉరు-నదీ-జల + ఓఘములన్ = ఆ దివ్యనదీ (గంగా) జలప్రవాహములను, ఆక్షేపింపన్ = ఆకర్షించుటకు - పీల్చుటకు, విన్వీధిన్ (వినుఁ+ వీధిన్) = ఆకాశమార్గమున, అయ్యోర్వోగ్రాగ్ని - (ఆ+ఔర్వ +ఉగ్ర + అగ్ని) = ఆ భయంకర బడబాగ్ని, రయంబుననన్ = వేగముతో, నెగసెన్ + నాన్ = ఎగిరెనా యనునట్లు, అత్యంత-రాగ-ద్యుతుల్ = మిక్కిలి యెఱ్ఱని కాంతులు, పర్వన్ = వ్యాపింపఁగా, పాంథుల్ = విరహులు, ఎదలోన్ = హృదయమునందు, భయంబు+ అందఁగన్ = భయపడఁగా, చంద్రుఁడు, బిట్టు + ఉదయించెన్ = శీఘ్రముగా ఉదయించెను

తాత్పర్యము : తూర్పుసంద్రమునందలి జలములనన్నిటిని వేగముగా దానియొప్పు నశింపఁగాఁ ద్రాగి ఇంకను ఆకాశగంగాజలములను ద్రావ నాకాశవీధికి ఆ బడబాగ్ని వడిగా నెగిరెనా యనునట్లు, మిక్కిలి యెఱ్ఱనికాంతులు వ్యాపింపఁగా విరహులు హృదయమున భయపడఁగాఁ జంద్రుఁడు శీఘ్రముగా నుదయించెను

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష పాంథులు భయపడుటకుఁ గారణము చంద్రుఁడు వారికిఁ దాపకారణము గనుక

సీ సంధిల్లు పూర్వదిక్పతి కటి మణికాంచి
రంజిల్లు నాయకరత్న మొక్కొ?
విలసిల్లు నద్దేవి వృత్తస్తనాంతరా
పూరిత కాశ్మీరపుంజ మొక్కొ?
తనరారు నా హరిత్తరళాక్షి పరిపక్వ
బింబారుణాధరబింబ మొక్కొ?
మేలిల్లు నబ్బాల ఫాలతటంబున
విలసిల్లు రోచనతిలక మొక్కొ?

ఆ మవ్వ మొప్పఁ దన సమాగమంబునకు నా
రమణివలనఁ బర్వు రాగ మొక్కొ?
యనఁగ దరతరంబ తనరె నత్యరుణాంగ
భాతిఁ గువలయైకబాంధవుండు 108

అర్థము. సంధిల్లు = సమకూడునట్టి, పూర్వ-దిశ్ (క్) + సతి-కటి-మణి-కాంచిన్ = తూర్పుదిక్కనెడు స్త్రీయొక్క మొలయందలి మణిమయమైన మొలనూలియందు, రంజిల్లు = ప్రకాశించునట్టి, నాయకరత్నము + ఒక్కొ = మధ్యమణియా?

విలసిల్లు = ప్రకాశించునట్టి, అద్దేవి (ఆ + దేవి) = ఆ పూర్వదిక్పతియొక్క, వృత్త-స్తన + అంతర + ఆపూరిత- కాశ్మీర-పుంజము + ఒక్కొ = వట్రువలైన చన్నుల నడుమ నిండింపఁబడిన కుంకుమపువ్వు రాశియా?

తనరారు = ఒప్పునట్టి, ఆ-హరి బింబమొక్కొ = ఆ-హరిత్ + తరళ + అక్షి = ఆ పూర్వదిక్పతియొక్క, పరిపక్వ = మిక్కిలి పండిన, బింబ = దొండపండువలె, అరుణ = ఎఱ్ఱనైన, అధర-బింబము + ఒక్కొ = దొండపండువంటి క్రింది పెదవియా?

మేలిల్లు = శ్రేష్ఠమగు, అబ్బాల (ఆ + బాల) =ఆ పూర్వదిక్పతియొక్క ఫాల-తటంబునన్ = నొసటిప్రదేశమునందు, విలసిల్లు = ప్రకాశించునట్టి, రోచన-తిలకము + ఒక్కొ = గోరోచనపు బొట్టా,

మవ్వము = ఉత్సాహము, ఒప్పన్ = ఒప్పఁగా తన-సమాగమంబునకున్ = తన సంగమమునకు, ఆ-రమణి-వలనన్ = ఆ పూర్వదిక్పతి నుండి, పర్వు = వ్యాపించునట్టి, రాగము + ఒక్కొ = అనురాగమా? ఎఱుపా?

అనఁగన్, అతి + అరుణ + అంగ-భాతిన్ = మిక్కిలి యెఱ్ఱని మేనికాంతితో, కువలయ + ఏక-బాంధవుండు = కలువలయొక్క ముఖ్యమైన చుట్టము - చంద్రుఁడు, తరతరంబు + అ = అత్యంతము, తనరెన్ = ఒప్పెను

తాత్పర్యము . తూర్పుదిక్కనెడు స్త్రీ మొలయందలి మొలనూలియందుఁ బ్రకాశించు మధ్యమణియో, ఆ దేవి వర్తులస్తనముల నడుమ నిండారిన కుంకుమ పువ్వురాశియో, ఆమె పండినదొండపండువలె నెఱ్ఱనైన క్రిందిపెదవియో, ఆమె నుదుటఁ బ్రకాశించు గోరోచనపుఁదిలకమో, తన సంగమమున కామెనుండి వ్యాపించు రాగమో యన మిక్కిలి యెఱ్ఱనికాంతితో కలువలకుఁ జుట్టమైన చంద్రుఁడు మిక్కిలి యొప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క **తన రాగంబునఁ ద్రిజగము**
ననురాగిల్లెనొ? జగంబు ననురాగముతో
ననురాగిల్లెనొ తా మఱి?
యన జగములతోన చంద్రుఁ డనురాగిల్లెన్ **109**

అర్థము . తన-రాగంబునన్ = తన యెఱుపుతో - ప్రేమముతో, త్రిజగమున్ = మూఁడు లోకములును, అనుఠాగిల్లెనొ = అనుసరించి యెఱ్ఱనయ్యెనో - ప్రేమమునొందెనో, జగంబు + అనురాగముతోన్ = జగముయొక్క ఎఱుపుతో - ప్రేమముతో, తాన్ = తాను, మఱి, అనురాగిల్లెనొ = ఎఱుపయ్యెనో - ప్రేమమునందెనో, అనన్, చంద్రుఁడు, జగములతోన్ + అ =లోకములతోపాటే, అనురాగిల్లెన్ = ఎఱుపయ్యెను - ప్రేమమునొందెను

తాత్పర్యము . తన రాగముచే ముల్లోకములును రాగమునొందెనో, లేక జగము రాగముతోఁ దాను రాగమునొందెనో యనునట్లు చంద్రుఁడు జగములతోపాటే రాగమునొందెను

విశేషములు . అలంకారము సహోక్తి సందేహము రాగశబ్దమున కర్థద్వయముచే శ్లేషమును

ఆ పద్మరాగ రాగభాతితో నాకాశ
జలధి జలములందు సంక్రమించి
చంద్రబింబకము నిశాముఖమున నొప్పె
విరహ విధుర కోక విహగ లీల 110

అర్థము . చంద్ర-బింబకము = చంద్రమండలము, పద్మ రాగ-రాగ-భాతితోన్= పద్మరాగ మణియొక్క ఎఱ్ఱని కాంతితో; ఆకాశ-జలధి-జలముల + అందున్ = ఆకాశమనెడి సముద్రము జలములందు, సంక్రమించి = చేరి, విరహ-విధుర-కోక-విహగ-లీలన్ = ఎడఁబాటుచే బాధింపఁబడిన చక్రవాకము విధమున, నిశా-ముఖమునన్ = రాత్రి ప్రారంభమున, ఒప్పెన్

తాత్పర్యము.చంద్రబింబము పద్మరాగమణి యెఱ్ఱనికాంతితో ఆకాశమనెడి సముద్రజలములలోఁ జేరి నిశారంభమున నెడఁబాటుచే బాధింపఁబడిన చక్రవాక పక్షి విధమున నొప్పెను

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితమైన ఉపమ

తే తరుణతర శశిమండలాత్యరుణ రుచుల
గొడగు లెదఁగ్రుచ్చి వడి నెత్తికొనిన సాంద్ర
తిమిరపటలంబు వొలుపారె దీపదీప్తి
పరివృతంబైన కజ్జలపాత్రవోలె 111

అర్థము . తరుణతర - శశి-మండల + అతి + అరుణ-రుచుల-కొడగులు= బాలచంద్రబింబముయొక్క మిక్కిలి ఎఱ్ఱనైన కాంతులనెడి గొడుగులు, ఎదన్ = హృదయమునందు, క్రుచ్చి, వడిన్ = వేగముగా, ఎత్తికొనిన, సాంద్ర-తిమిర-పటలంబు = దట్టమైన చీఁకటుల సమూహము, దీప-దీప్తి-పరివృతంబు = దివ్వెయొక్క కాంతిచేఁ జుట్టఁబడినది, ఐన, కజ్జల-పాత్ర + పోలెన్ = కాటుకబరణివలె, పొలుపారెన్ = ఒప్పెను

తాత్పర్యము . బాలచంద్రబింబము నెఱ్ఱనికాంతులనెడి గొడుగులు నడుమఁగ్రుచ్చి వడి నెత్తుకొనిన దట్టపుఁజీకటుల మొత్తము దీపకాంతిచేఁ బరివృతమైన కాటుకబరణివలె నొప్పెను

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్ష

తే ఈశు నుద్వాహమున కమరేంద్రదిగ్వి
లాసవతి పైఁడి పాళియఁ బోసి తెచ్చు
జాదరలొ నాఁగ రాగపూర్ణోదయేందు
బింబమునఁ బాండుకిరణాంకురంబు లెసఁగె 112

అర్థము. ఈశు + ఉద్వాహమునకున్ = ఈశ్వరుని పెండ్లికి, అమర + ఇంద్ర-దిశ్ (క్) + విలాసవతి = తూర్పుదిక్కునెడు నొయారి, పైఁడి-పాళియన్ = బంగారు పాత్రమున, పోసి, తెచ్చు, జాదరలొ = గందవొడులో, నాఁగన్ = అనఁగా, రాగ-పూర్ణ + ఉదయ + ఇందు-బింబమునన్ = ఎఱుపుతో నిండిన ఉదయచంద్రబింబమునందు, పాండు-కిరణ + అంకురంబులు = తెల్లని కిరణముల మొలకలు, ఎసఁగెన్ = ఒప్పెను

తాత్పర్యము : ఈశ్వరుని వివాహమునకుఁ దూర్పుదిక్కునెడు నొయారి బంగరు పాత్రమునఁ బోసి తెచ్చు గందవొడులో యన నెఱ్ఱని ఉదయచంద్రబింబమునందుఁ దెల్లని కిరణముల మొలక లొప్పెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష దిగ్వీలాసవతి అనుచో రూపకము ఈశునియొక్క ఉద్వాహము = ఈశు + ఉద్వాహము - 'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చుపరమగునపుడు నుగాగమంబగు ' బాల సంధి 34

తే కరము రాగిమై రజనీముఖంబుఁ గాంచి
తమముఁ దత్కేశభరమని తాల్మి లేక
కముపఁ గరములు పైఁజాఁచి కామి యెటిఁగి
వెల్లనైనట్లు శశి గడు విమల మయ్యె 113

అర్థము . కరమున్ = మిక్కిలి, రాగి + ఐ = రాగము (ప్రేమము) గలవాఁడయి ఎఱుపు గలవాఁడయి, రజనీ-ముఖంబున్ = రాత్రియొక్క మొగమును, కాంచి = చూచి, తమమున్ = చీఁకటిని, తద్ + కేశ-భరము + అని = ఆమె కొప్పు అని, తాల్మి-లేక = ఓర్పులేక, కముపన్ = పట్టుకొనుటకు, కరములు = చేతులు-కిరణములు, పైన్ = మీఁదికి, చాఁచి, కామి = (కేశభరము) కాకపోవుట, ఎటిఁగి, వెల్లన + ఐన + అట్లు = తెల్లఁబోయిన విధమున, శశి = చంద్రుఁడు, కడున్ = మిక్కిలి, విమలము + అయ్యెన్ = తెల్లఁబడెను

తాత్పర్యము : మిక్కిలి రాగము (ప్రేమము, ఎఱుపు) గలవాఁడయి,

రాత్రియను స్త్రీ ముఖమును జూచి, చీఁకటిని ఆమె కొప్పు అని తలఁచి, ఓర్వులేక, పట్టుకొనుటకుఁ గరములు (చేతులు, కిరణములు) మీఁదికిఁ జాఁచి, అది కేశభరము కాదని యెటిఁగి తెల్లఁబోయినట్లు చంద్రుఁడు మిక్కిలి తెల్లఁబడెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష రాగి, కరములు అను శబ్దముల కర్థద్వయముచే శ్లేషము తమమును రజనీకేశభరముగా భ్రమించెననుటచే భ్రాంతిమంతమును 'శశి' అను పుంలింగశబ్దముచే నాయక ప్రతీతియు, 'రజని' యను స్త్రీలింగశబ్దముచే నాయికా ప్రతీతియుఁ గలుగుచున్నవి కముపన్-కముచు = (గ్రహించు) ధాతు తుమున్నంత రూపము

తే ఉదయశైలంబుపై రాగ మొంది సకల
దిగ్వధూ దేహములయందుఁ దెలుపుమిగిలి
వేదనాచ్యుతిఁ గువలయామోదవృత్తిఁ
జందనముఁ బోలి చంద్రికాజాల మొప్పె 114

అర్థము. ఉదయ-శైలంబుపైన్ = పొడుపుఁగొండపై, రాగము = ఎఱుపు - అనురాగము, ఒంది, సకల దిశ్ (క్) + వధూ-దేహముల + అందున్ = ఎల్లదిక్కులనెడి స్త్రీల శరీరములందును, తెలుపు-మిగిలి = తెలుపు అతిశయించి, వేదనా-చ్యుతిన్ = (విరహ) బాధయొక్క జాఱుపాటుచే - విరహబాధపోవుటచే, కువలయ + ఆమోద-వృత్తిన్ = కలువలయొక్క సంతోషముచే - భూవలయము యొక్క సంతోషముచే, చందనమున్ + పోలి = మంచిగంధమునుబోలి, చంద్రికా-జాలము = వెన్నెలల సమూహము, ఒప్పెన్

తాత్పర్యము: వెన్నెలల సమూహము పొడుపుఁగొండపై నెఱుపును వహించి, అనురాగము వహించి, దిక్కులనెడు స్త్రీల మేనులందుఁ దెలు పతిశయించి, విరహబాధపోవుటచేఁ దాప ముడుగుటచేఁ గలువలకు సంతోషమొదవి చందనమువలె నొప్పెను.

విశేషములు. అలంకారము శ్లేషానుప్రాణితోపమ

క. మేలుగ నెలకొన్న తమో
జాలముఁ బోఁదోలి యెసఁగెఁ జంద్రాతప మ
క్కాళిందీపూరం బల
నోలిన గంగాప్రవాహ మొత్తిన భంగిన్ 115

అర్థము ఆక్కాళిందీ-పూరంబు (ఆ + కాళిందీ-పూరంబు) = ఆ యమునానదీప్రవాహము, అఱన్ = నశించునట్లు, ఓలిన్ + అ = క్రమముగా, గంగా-ప్రవాహము = గంగానదీ ప్రవాహము, ఒత్తిన-భంగిన్ = విజృంభించిన విధముగా, చంద్ర + ఆతపము = వెన్నెల, మేలుగన్ = బాగుగా, నెలకొన్న = ఉన్నట్టి, తమస్ (ః) + జాలమున్ = చీఁకట్ల సముదాయమును, పోన్ + తోలి = పోవునట్లు తోలి, ఎసఁగెన్ = ఒప్పెను

తాత్పర్యము . ఆ యమునా నదీ ప్రవాహము నశించునట్లు గంగా ప్రవాహము విజృంభించిన విధమున వెన్నెల చీఁకట్లసముదాయమును బోఁదోలి యొప్పెను

విశేషములు · అలంకార ముత్ప్రేక్ష కాళిందీపూరము నలుపు చీఁకట్లు నలుపు గంగాప్రవాహము తెలుపు వెన్నెల తెలుపు

క తన సుతుఁడగు శశి మెయి కఱఁ
గని చెచ్చెరఁ గడిగి పుచ్చఁగా నని దుగ్ధాం
బునిధి నభంబున కెగసెనొ
యనఁ జంద్రిక పర్వె సాంద్రమై విమలంబై 116

అర్థము . దుగ్ధ + అంబునిధి = క్షీరసముద్రము, తన-సుతుఁడు = తన కొడుకు, అగు, శశి = చంద్రునియొక్క, మెయి = శరీరముయొక్క, కఱన్ = నలుపును, కని = చూచి, చెచ్చెరన్ = శీఘ్రముగా, కడిగి-పుచ్చఁగాన్ + అని = కడిగివేయుటకయి, నభంబునకున్ = ఆకాశమునకు, ఎగసెనొ = ఎగిరెనో, అనన్, చంద్రిక = వెన్నెల, సాంద్రము + ఐ = దట్టమయి, విమలంబు + ఐ = నిర్మలమయి, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము : క్షీరసముద్రము తన కుమారుఁడైన చంద్రుని మేని నలుపుఁజూచి వెంటనే కడిగివేయుటకు ఆకాశమున కెగిరెనా యనునట్లు వెన్నెల చిక్కనయి, నిర్మలమయి వ్యాపించెను

విశేషములు . అలంకారము హేతూత్ప్రేక్ష దేవదానవు లమృతము కొఱకు క్షీరసముద్రమును మథించినప్పు డందుండి చంద్రుఁడు పుట్టెను అందుచేఁ జంద్రుఁడు క్షీరసముద్రము కుమారుఁడు చంద్రుఁ డనక శశియనుట మచ్చను సూచించుటకు శశము (కుందేలు) గలవాఁడు శశి చంద్రునిలోని మచ్చ శశాకారమున

నుండును గనుక నతనికి శశి యనిపేరు దుగ్ధాంబునిధియనుట చంద్రికతోడి సామ్యమునకు

తే అష్టతనువృత్తి కెంతయు నలసి పరముఁ
డమృతకర మని సుఖకరమని సుధాంశు
తనువ తాల్చె నా వెన్నెల దరతరంబ
నిండి కడుఁ బిక్కటిల్లె బ్రహ్మాండ మెల్ల 117

అర్థము అష్ట-తను-వృత్తికిన్ = ఎనిమిది శరీరముల ఉనికికి, ఎంతయున్= మిక్కిలి, అలసి = బడలి, పరముఁడు = ఉత్కృష్టుడు - శివుఁడు, అమృతకరము+ అని = సౌఖ్యమునుజేయునదియని, సుధా + అంశు-తనువు + అ = అమృతకిరణుని-చంద్రునియొక్క, మేనినే, తాల్చెన్ + నాన్ = ధరించె ననునట్లు, వెన్నెల, తరతరంబు + అ = మిక్కిలి, నిండి, బ్రహ్మాండము + ఎల్లన్ = బ్రహ్మాండమంతయు, కడున్ = మిక్కిలి, పిక్కటిల్లెన్ = వ్యాపించెను

తాత్పర్యము :శివుఁడు ఎనిమిది మేనులను వహించుటకు మిక్కిలి బడలి అమృతమును జేయునది - సౌఖ్యమును గలిగించునది యని ఒక్క అమృతకిరణుని శరీరమునే తాల్చెనా యనునట్లు వెన్నెల మిక్కిలి నిండి బ్రహ్మాండమంతయు వ్యాపించెను

విశేషములు . అలంకారము హేతూత్ప్రేక్ష శివుఁ డష్టతనువు పంచ భూతములు (5), సూర్యచంద్రులు (2), యజమానుఁడు (1), ఇవి శివుని ఎనిమిది తనువులు శివుఁడు తెలుపుగావున, చంద్రుఁడును తెలుపుగావున అ ట్లనుట

సీ దుగ్ధాంబునిధి నిట్టఁ దోఁచెనో యని శేషు
పాన్పుగా హరి నీటఁ బవ్వడింప
నొదవి సుధారస ముప్పొంగెనో యని
దేవతల్ దనివోవఁ ద్రావఁదలఁపఁ
దొలఁకాడు మిన్నేఱు వెలివిరిసెనో యని
లీల సురాంగన లోలలాడఁ
బాదరసం బుర్విఁ బరగెనో యని సిద్ధ
నికరంబు గలశముల్ నించుకొనఁగఁ

తే బాండురాంగుండు విశ్వరూపంబుఁ దాల్చి
యెలసెనో యని సద్భక్తు లెలమిఁ గొలువ
నఖిలజీవుల కానంద మతిశయిల్ల
నచ్చవెన్నెల విమలమై యలరి కాసె 118

అర్థము. దుగ్ధ + అంబునిధి = క్షీరసముద్రము, నిట్టన్ + తోఁచెనో + అని = పొంగిపొరలెనో యని, శేషు-పాన్పు + కాన్ = శేషుఁడు పానుపుగా, హరి = విష్ణువు, నీటన్ = నీటియందు, పవ్వడింపన్ = పరుండఁగను

సుధారసము = అమృతరసము, ఒదవి = పుట్టి, ఉప్పొంగెనో = పెల్లుబికెనో, అని, దేవతల్, తని + పోవన్ = తృప్తిదీఱ, ద్రావన్ = త్రాగుటకు, తలఁపన్ = ఎంచఁగను,

తొలఁకాడు (తొలఁకు + ఆడు) = చలించునట్టి, మిన్నేఱు (మిన్ను+ఏఱు)= ఆకాశగంగ, వెలివిరిసెనో = పొంగిపొరలెనో, అని, లీలన్ = విలాసముతో, సుర + అంగనలు = దేవతా స్త్రీలు, ఓలలాడన్ = స్నానముచేయఁగను

పాదరసంబు, ఉర్విన్ = భూమియందు, పరగెనో = ప్రవహించెనో, అని, సిద్ధ-నికరంబు = సిద్ధుల సమూహము, కలశములో = పాత్రములు, నించుకొనఁగన్= నిండించుకొనఁగను,

పాండుర + అంగుండు = తెల్లని శరీరము గలవాఁడు, విశ్వరూపంబున్, తాల్చి, ఎలసెనో = వ్యాపించెనో, అని, సత్ + భక్తులు = మంచి భక్తులు, ఎలమిన్ = సంతోషముతో, కొలువన్ = సేవింపఁగను,

సకల-జీవులకున్ = ఎల్లప్రాణులకును, ఆనందము, అతిశయిల్లన్ = అధికముకాఁగా, అచ్చ-వెన్నెల = నిర్మలమైన వెన్నెల, విమలము + ఐ = స్వచ్ఛమయి, అలరి = ఒప్పి, కాసెన్

తాత్పర్యము. క్షీరసముద్రము పొంగిపొరలెనా యని శేషుఁడు పానుపుగా విష్ణువు నీటియందుఁ బరుండఁగను, అమృతరసము పుట్టి పె ల్లుబికెనో యని దేవతలు తృప్తిదీఱఁ ద్రావనెంచఁగను, చలించు నాకాశగంగ పొంగిపొరలెనోయని విలాసముతో దేవతా స్త్రీలు స్నానమాడఁగను, పాదరసము భూమిపైఁ బ్రవహించెనా యని సిద్ధులు పాత్రములు నిండించుకొనఁగను, తెల్లనిమేనుగల శివుఁడు

విశ్వరూపమును దాల్చి వ్యాపించెనా యని భక్తవరులు ప్రీతితో సేవింపఁగను, ఎల్లప్రాణులకును సంతోష మతిశయింపఁగను, స్వచ్ఛమైన వెన్నెల నిర్మలమై యొప్పి కాసెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష పవ్వడించు (రూపాం) పవడించు

వ తదవసరంబున **119**

అర్థతాత్పర్యములు . ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విటీ విటవర్ణనము

క వలరాజు రతియుఁ దమతమ
బలముల రతికలహాములకుఁ బన్నించిరొ? నాఁ
గలయఁ గయిసేసి విటవిటి
యలు నిలిచిరి పురమువీధులం దభినవమై **120**

అర్థము : వలరాజున్ = మన్మధుఁడును, రతియున్, తమ-తమ - బలములన్ = తమ తమ సేనలను, రతి-కలహాములకున్ = మన్మధయుద్ధములకు, పన్నించిరొ = సిద్ధపఱిచిరో, నాన్ = అనఁగా, విటవిటియలు = జారులును, జారిణులును, కలయన్ = అంతటను, కయి + చేసి = అలంకరించుకొని, పురము-వీధులందున్ = నగరవీధులలో, అభినవము + ఐ = నూతనమై, నిలిచిరి

తాత్పర్యము: మన్మధుఁడును, రతియుఁ దమతమ సేనలను, మన్మధయుద్ధములకు సిద్ధపఱిచిరాయన జారులును, జారిణులును అంతట నలంకరించుకొని పురవీధులలోఁ గ్రొత్తగా నిలిచిరి

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష విటియ = విటకత్తె?

వ మఱియును. తరువాతి పద్యముతో నన్వయము **121**

తే. వీధి వీధులఁ బుష్పలావికలు గలయ
నెత్తి పట్టిన క్రొవ్విరి యెత్తు లొప్పె
సతులపై నెలయు నవ్వీటసమితి నేయ
మదనుఁ డేర్చిన యలరంపపాదులలోలె **122**

అర్థము. వీధి వీధులన్ = ప్రతివీధియందును, పుష్పలావికలు = పూవులమ్మి స్త్రీలు, కలయన్ = అంతటను, ఎత్తి-పట్టిన, క్రొవ్విరి (క్రొత్త + విరి) ఎత్తులు = క్రొంబూల దండలు, సతులపైన్ = స్త్రీలమీఁద, ఎలయు = అసక్తులగు, ఆ + విట-సమితిన్ = ఆ జారుల సమూహమును, ఏయన్ = కొట్టుటకు, మదనుఁడు = మన్మథుఁడు, ఏర్చిన = సంధించిన, అలరంపపాదుల + పోలెన్ (అలరు + అమ్మి + పాదుల + పోలెన్) = పూవుటమ్మిల పాదుల విధమున, ఒప్పెన్

తాత్పర్యము. ప్రతివీధియందును బూలమ్మి స్త్రీలు అంతటను ఎత్తి పట్టిన క్రొంబూల దండలు - స్త్రీలయం దాసక్తులగు విటకాండ్ర గుంపును గొట్టుటకు మన్మథుఁడు సంధించిన పూవుటమ్మిల పాదులా యన నొప్పెను

విశేషములు · అలంకార ముత్ప్రేక్ష అమ్మి + పాదులు - 'కొండొకచో సమాసంబులందు నామ్వాది కనుమ్వాదుల మువర్ణంబులు పజ్వవర్ణంబు లగు' బాల సమాస 19 అ+పజ్+పాదులు - 'జిత్తు బిందుపూర్వంబగు ' బాల తత్సమ 19 అంపపాదులు అలరు + అంప - 'అలరు' పేర్వాదులలోనిదని భావింపవలయును అప్పుడు టుగామము విభాష. టుగామము కానిచో అలరంప క్రొవ్విరి = క్రొత్త + విరి 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు ' బాల సంధి 36 క్రొ + విరి 'క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం, గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు ' క్రొవ్విరి బాల సం 38

వ. అంత - తరువాతి పద్యముతో నన్వయము **123**

చ. అనుపమదివ్యమూర్తి, దరహాసవిలాసవిభాసి, నిండుజ
వ్వని, సుకుమారి దన్ను విటవర్గము నల్గడ వచ్చి ప్రీతితోఁ
గనుఁగొని మూఁడు జాడ నెడగానక సూరెలు వాఱుచుండె మో
హినియును బోలె నొక్క శరదిందునిభానన నిల్చి ముంగిటన్ 124

అర్థము: అనుపమ - దివ్యమూర్తి = సాటిలేని దివ్యమైన ఆకారముగలది, దర-హాస-విలాస-విభాసి = చిఱునవ్వువలని ఒప్పుచేఁ బ్రకాశించునది, నిండు-జవ్వని = సంపూర్ణ యౌవనము గలది, సుకుమారి = అందగత్తె, అగు, ఒక్క-శరద్ +ఇందునిభ + ఆనన = శరత్కాలపుఁజంద్రునితో సమానమైన ముఖము గల ఒకతె, మోహినియును + పోలెన్ = అచ్చరవలె, ముంగిటన్ = ముంగిటియందు,

నిల్చి, తన్నున్, విట-వర్గము = విటకాండ్ర సమూహము, నల్లడన్ = నాలుగు దిక్కులనుండి, వచ్చి, ప్రీతితోన్ = ఇష్టముతో, కనుఁగొని, మూరిన్ =మోహముతో, చూడన్ = చూడఁగా ఎడ +కానక = తెఱపిగానక, సూరెలు + పాఱుచున్ + ఉండెన్ = ప్రక్కల కొదుగుచుండెను

తాత్పర్యము . సాటిలేని ఆకారము గలదియుఁ, జిఱునవ్వుచేఁ బ్రకాశించునదియు, సంపూర్ణయౌవనవతియు, సుకుమారియు నగు నొక శరచ్చంద్రముఖి మోహినివలె ముంగిట నిల్చి, తన్ను విటకాండ్రు నాలుగు దిక్కులనుండి వచ్చి సంతసముతోఁ జిత్తవిభ్రమముతోఁ జూడఁగాఁ, దెఱపిగానక ప్రక్కల కొదుఁగుచుండెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

ఉ అంగజరాగ సంగత నిజాంగ విలిప్త నవాంగరాగ దీ
ప్తిం గొఱలంగ హారమణిదీధితు లత్యరుణప్రభాతిలో
నం గలయంగఁ దారక గణ స్ఫురితద్యుతిఁ దాల్చి పొల్చు సం
ధ్యాంగనవోలె నొక్క వనజానన భోరన వచ్చె రచ్చకున్ 125

అర్థము. అంగజ-రాగ దీప్తిన్ అంగజ = శరీరము నందుఁ బుట్టిన, రాగ = ఎఱుపుతో, సంగత = కూడుకొనిన, నిజ = తనవైన, అంగ = అవయవములందు, విలిప్త = విశేషముగాఁ బూయఁబడిన, నవ = క్రొత్తదైన, అంగరాగ = మై పూఁతయొక్క, దీప్తిన్ = కాంతితో, కొఱలంగన్ = నిండఁగా, హార-మణి-దీధితులు = హారమునందలి రత్నముల కాంతులు, అతి + అరుణ-ప్రభాతిలోనన్ = మిక్కిలి యెఱ్ఱనైన కాంతిలో, కలయంగన్ = కూడఁగా, ఒక్క-వనజ + ఆనన = ఒక పద్మముఖి, తారక-గణ-స్ఫురిత-ద్యుతిన్ = నక్షత్రముల సమూహముయొక్క ప్రకాశించు కాంతిని, తాల్చి, పొల్చు = ఒప్పునట్టి, సంధ్యా + అంగన + పోలెన్ = సంజయనెడి స్త్రీ విధమున, భోరనన్ = శీఘ్రముగా, రచ్చకున్ = రాజమార్గమునకు, వచ్చెన్

తాత్పర్యము : మేని యెఱుపుతోఁ గూడిన తన అవయవములందుఁ బూయఁబడిన మైపూఁత కాంతితో నిండఁగా హారమణికాంతులు మిక్కిలి యెఱ్ఱని కాంతితోఁ గూడఁగా నొక పద్మముఖి నక్షత్రముల సమూహము కాంతిని దాల్చి యొప్పు సంధ్యయను స్త్రీవలె శీఘ్రముగా రాజమార్గమునకు వచ్చెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోక్ష్రేక్ష సహజముగా నెట్టినైన ఆమె దేహావయములందు మైపూత పూయబడినది ఆ కాంతితో హారమణికాంతులు కూడెను అప్పు డామె సహజముగానెట్టినైనసంధ్య తెల్లని నక్షత్రముల కాంతితో గూడినట్లుండెను

ఉ కోమల సన్నతాంగి, మదకోకిల సుస్వన, భూషణోరుహా
రామల పుష్పజాల, సవిటాలిమదప్రచికిత్స, కేసరీ
యామిత చారుగంధి, తరుణారుణ పల్లవహస్త, రాజకీ
రామృతవాణి పుష్పితలతాకృతి నొక్కత నిల్చె ముంగిటన్ 126

అర్థము. కోమల-సన్నత + అంగి = మృదువైనది మిక్కిలి వంగినది అగు శరీరము గలది, మద-కోకిల-సుస్వన = మదించిన కోకిలయొక్క మంచి కంఠధ్వని గలది, భూషణ + ఉరు + హార + అమల-పుష్ప-జాల = అలంకారమైన గొప్ప హారమనెడి నిర్మలములైన పూవుల సమూహము గలది, స-విట + అలి-మద-ప్రచికిత్స = విటకాండ్రనెడి తుమ్మెదలయొక్క మదమునకు వైద్యముతో గూడినది, కేసరీయ + అమిత + చారు-గంధి = కింజల్కములకు సంబంధించిన అధికమైన మనోహరమైన పరిమళము గలది, తరుణ + అరుణ-పల్లవ-హస్త = లేతవి, ఎఱ్ఱనివి అగు చివురులనెడి చేతులు గలది, రాజ-కీర + అమృతవాణి = రాచిలుకలయొక్క దివ్యమైన వాక్కులు గలది, అగు, ఒక్కత = ఒకస్త్రీ, పుష్పిత-లతా + ఆకృతిన్ = పూచిన తీగ ఆకారముతో, ముంగిటన్, నిల్చెన్

తాత్పర్యము : మృదువైనది మిక్కిలి వంగినదియైన శరీరము గలది, మత్తకోకిల కంఠధ్వనివంటి కంఠధ్వని గలది, అలంకారమైన గొప్ప హారమనెడి నిర్మలములైన పుష్పముల సమూహము గలది, విటకాండ్రనెడి తుమ్మెదల మదమునకు వైద్యముతో గూడినది, కింజల్కముల అధికము మనోహరము నైన పరిమళమువంటి పరిమళము గలది, లేతవి, ఎఱ్ఱనివి యైన చివురులనెడి చేతులు గలది, రాచిలుకల అమృతవాణి వంటి అమృతవాణి గలది అగు నొక స్త్రీ పూచిన తీగ ఆకారముతో ముంగిట నిలిచెను

విశేషములు : అలంకారము ఉపమ రూపకానుప్రాణితము ఆమె పుష్పితలతాకృతితో వచ్చెననుటచే లతకుసంబంధించిన వన్నియు నామెకును గలవని చెప్పబడెను పుష్పితలత కోమలము సన్నతము అయినట్లు ఆమెయు అట్టి శరీరము గలది లతకు మదకోకిలముల స్వనమున్నట్లే ఆమెకును అట్టి

స్వసమే కలది లతకుఁ బుష్పజాలమువలె నామెకు హారము గలదు అలుల మదమునకుఁ జికిత్స గలది లత ఆమె వీటుల మదమునకుఁ జికిత్స గలది లతకుఁ గేసరముల గంధముండునట్లు ఆమెయు మేనిగంధముగలది లతకుఁ దరుణములు, అరుణములునైన పల్లవములవలె నామెకును అట్టిహస్తములు గలవు రాచిలుకల వాణివంటివాణి ఆమెకును గలదు

తే సర్వలక్షణసంపూర్ణ చంద్రవదన
నిండువెన్నెలలో నోర్తు నిలిచి పాలిచె
నమృత మధనావసరమున నమరకాంత
పాలకడలిలో నిల్చిన భంగి వోలె 127

అర్థము . అమృత - మధన + అవసరమునన్ = అమృతముకొఱకు క్షీరసముద్రమును మథించు సమయమున, అమర-కాంత = దేవతా స్త్రీ, పాల-కడలిలోన్ = క్షీరసముద్రములో, నిల్చిన-భంగి + పోలెన్ = నిల్చినట్లు, సర్వ-లక్షణ-సంపూర్ణ = ఎల్ల శుభలక్షణములతో నిండినది, చంద్ర-వదన = చంద్రునివంటి ముఖము గలది, అగు, ఓర్తు = ఒకస్త్రీ, నిండు-వెన్నెలలోన్, నిలిచి, పాలిచెన్

తాత్పర్యము దేవదానవు లమృతముకొఱకు క్షీరసముద్రమును మథించునప్పు డందుఁ బొడమిన దేవతాస్త్రీవలె, సర్వలక్షణసంపూర్ణయగు నొక చంద్రముఖి నిండువెన్నెలలో నిలిచి యొప్పెను

విశేషములు. అలంకారముపమ ఆం ప్ర సా పరిషత్పత్రికలోని 'అమరలేమ' యను పారము వైరిసమాసమగును అందుచే మా రా కవి ప్రతిలోని 'అమరకాంత' పారము స్వీకరింపఁబడినది

వ మతియు తరువాతి పద్యముతో నన్వయము 128

వేశ్యల వర్ణము

క జారపతి కడకు వెన్నెల
నారఁగ సితపుష్పలేపనాంబరయుతయై
మారుఁ డమృతాంశురుచిఁ బొయి
గారంబునఁ బోసి నడపుగతి నో ర్తరిగెన్ 129

అర్థము : ఓర్తు = ఒక స్త్రీ, జార-పతి-కడకున్ = ఉపపతియొద్దకు, వెన్నెలన్= వెన్నెలయందు, ఆరఁగన్ = నిండుగా, సిత-పుష్పలేపన + అంబర-

యుత + ఐ= తెల్లనిపూలు, మైపూత, వస్త్రములు అనువానితోఁగూడినదియై, మారుఁడు = మన్మథుఁడు, అమృతాంశు-రుచిన్ = చంద్రునికాంతిని పాయిగారంబునన్ = కరువున, పోసి, నడపు-గతిన్ = ప్రవర్తింపఁజేయు విధమున, అరిగెన్ = వెడలెను

తాత్పర్యము. ఒక స్త్రీ ఉపపతికడకు వెన్నెలలో నిండుగాఁ దెల్లని పూలు, మైపూత, వస్త్రములు తాల్చినదయి, మన్మథుఁడు వెన్నెలను గరువునఁబోసి ప్రవర్తింపఁజేసిన విధమున వెడలెను

విశేషములు · అలంకార ముత్ప్రేక్ష అమృతాంశురుచిని గరువునఁ బోసె ననుటచేతనే పుష్పాదికమునకు 'సిత'యను విశేషణము

చ **తగులము సేసిచేసి యెడ దవ్వయి పోయిన డాసి క్రమ్మఱం**
దిగిచి నయంబునం బెనఁగి తియ్యముఁబెంచి విటేంద్రసంఘమున్
మిగిలిచనంగనీక యొక మెల్తుక యాసయ చూపిచూపి ప్రీ
తిగ నెలయించుచుండె మరుదీమము పోలె ననేకమాయలన్ 130

అర్థము. తగులము = వలపు, చేసిచేసి, ఎడ - దవ్వు + అయి-పోయినన్= మిక్కిలి దూరమునకుఁబోఁగా, ఒక మెల్తుక = ఒక మెలఁతుక, స్త్రీ - ఒక జారిణి డాసి= సమీపించి, క్రమ్మఱన్ = మరల, తిగిచి = ఆకర్షించి, నయంబునన్ = నేర్పుతో, పెనఁగి = కూడి, తియ్యమున్ = అనురాగమును, పెంచి, విట + ఇంద్ర-సంఘమున్= విటశ్రేష్ఠుల సమూహమును, మిగిలి-చనంగనీక = అతిశయించిపోనీక, ఆస + అ = ఆశయే, చూపి-చూపి, మరుదీమము + అ + పోలెన్ = మన్మథుఁడేర్పఱిచిన యెఱవలె, అనేక-మాయలన్ = పెక్కుమాయలతో, ప్రీతిగన్, ఎలయించుచున్ + ఉండెన్ = వశపఱుచుకొనుచుండెను

తాత్పర్యము: వలపు చేసిచేసి, మిక్కిలి దూరమునకుఁ బోఁగా ఒక జారిణి సమీపించి మరల ఆకర్షించి నేర్పుతోఁ గలిసి, అనురాగమును బెంచి విటశేఖరుల సమూహమును అతిశయింపనీక ఆశ చూపిచూపి మన్మథుఁడేర్పఱిచిన యెఱవలెఁ బెక్కుమాయలతోఁ బ్రీతిగా వశపఱుచుకొనుచుండెను

విశేషములు: అలంకారము స్వభావోక్తి మెల్తుక-మెలఁతుక మెలఁత + ఉక 'ఉకవర్ణకంబు చిఱుతాదులకు స్వార్థంబునందగు' బాల తద్ధిత 10 అపదాది స్వరసంధి బాల సంధి 11 'లాఁతియచ్చునకు సహితమొకానొకచో నుడినడుమ లోపంబు గానంబడియెడి, బాల ప్రకీర్ణ 18

క లీలా లోలాలస దృ
గ్జాలంబులఁ దగిలి మిగిలి చనక డిగె విటేం
ద్రాలి వెలయాలి మ్రోలికి
జాలరివలఁ దగిలివచ్చు రుషముల పోలెన్ 131

అర్థము: ఎటు + ఇంద్ర + ఆలి = ఎటశ్రేష్ఠుల వరుస, లీలా-లోల + అలస-దృశ్ (క్) + జాలంబులన్ = విలాసముచేఁ జంచలములు మందములునైన దృష్టుల సమూహములనెడి వలయందు, తగిలి = పడి, మిగిలి-చనక = అతిక్రమించిపోక, జాలరి-వలన్ = చేఁపలనుబట్టువాని వలయందు, తగిలివచ్చు, రుషముల పోలెన్= చేఁపలవలె, వెలయాలి-మ్రోలికిన్ = వేశ్య సమీపమునకు, డిగెన్ = దిగెను

తాత్పర్యము . విటశేఖరుల సమూహము వెలయాలి విలాసముచేఁ జంచలములు, మందములునైన దృష్టిజాలములనెడి వలయందుఁ దగులుకొని దాఁటిపోక ఆమె సమీపమునకు జాలరివాని వలలోఁబడి వచ్చు చేఁపలవిధమున వచ్చెను

విశేషములు . అలంకార ముపమ 'దృగ్జాలంబులన్' అనుచో శ్లిష్ట రూపకము 'మ్రోలికిన్' అనికాక 'మ్రోలకున్' అనియుండుట లెస్స

వ అయ్యవసరంబున 132

అర్థతాత్పర్యములు . ఆ + అవసరంబునన్ = ఆ సమయమున తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు:ఆ + అవసరము - యడాగమ (బాల సంధి 3), త్రికసంధులు (బాల సమాస 14, 13)

ఉ రోయిడఁ బంచువారుఁ దగ రోసి లతాంగులఁ జూచి మెచ్చుచున్
రో యిడువారు, నగ్గలపు రోయిడ లంజల నప్పురంబులో
రోయుచు వచ్చువారుఁ గని రో యుచితంబుగ నిచ్చి క్రమ్మఱం
బోయెడువారు, రో యిడఁగ బొల్తులఁ గానఁగ రోయువారలున్. 133

అర్థము: రోయి + ఇడన్ = వేశ్యాశుల్కము నిచ్చుటకు, పంచువారున్ = పంపెడువారును, తగన్ = తగునట్లు, రోసి = వెదకి, లతా + అంగులన్ = తీఁగలవంటి శరీరములు గలవారిని - స్త్రీలను, చూచి, మెచ్చుచున్, రోయి - ఇడు-

వారున్ = శుల్కమునిచ్చువారును, అగ్గలపు-రోయి (అగ్గలము+రోయి) + ఇడన్= అధికమైన శుల్కము నిచ్చుటకు, లంజలన్ = వేశ్యలను, అప్పురంబులోన్ (ఆ + పురంబులోన్) = ఆ నగరములో, రోయుచున్ = వెదకుచు, వచ్చు-వారున్, కని= చూచి, రో = ధనము, ఉచితంబుగన్ = తగినట్లుగ, ఇచ్చి, క్రమ్మఱన్ = మరలపోయెడు-వారున్, రోయి + ఇడఁగన్ = శుల్కము నిచ్చుటకు, పొల్తులన్ = పాలఁతులను - స్త్రీలను, కానఁగన్ = చూచుటకు, రోయువారలున్ = వెదకువారును

తాత్పర్యము . వేశ్యలకు శుల్కము నిచ్చుటకుఁ బంపువారును వెదకి తీవబోఁడులను జూచి మెచ్చుచు శుల్కము నిచ్చువారును, అధికముగా శుల్కము నిచ్చుటకు ఆ నగరములో వేశ్యలను వెదకుచు వచ్చువారును, చూచి ధనము నుచితముగా నిచ్చి మరలఁ బోయెడువారును, శుల్కము నిచ్చుటకు స్త్రీలను జూడ నన్వేషించువారును - ఏటు లి ట్లనేకవిధములుగా నగుచుండిరి

విశేషములు . రోయుచితంబుగన్ అనుచో రోయి + ఉచితంబుగన్ అనియు, రో + ఉచితంబుగన్ అనియు ఛేదింపనగును రో = రై = ధనము, 'రై గ్లో శబ్దంబుల కోత్వంబు విభాష నగు ' బాల తత్సమ 64 ఇ గ్లో సూత్రముచేఁ బ్రధమైకవచన లోపము బాల తత్సమ 44

వ అగుచుండునంత 134

అర్థతాత్పర్యములు . అగుచున్ + ఉండు + అంతన్ = అగుచున్నంత - తరువాతి పద్యముతో నన్వయము.

సీ నేలయు నింగియుఁ దాళముల్ వాయింప,
నెండమావులఁబట్ట, బండతలయు
మ్రోఁకాలు ముడివెట్ట, ఓఁకటఁ జిగుళులు
గోయఁ జట్రాతిపైఁ గ్రుంగ, నిడుపు
లేక చిత్రము వ్రాయ, నాకాశమునఁ దాప
రము లిడ, మంచుఁ గుంచమునఁ గొలువ,
నేనుంగు పురుడోమ, రానారఁ గొన, గాలి
గం టిడ, నినమునఁ గట్టు దాల్ప,

ఆ నీరి నడుముఁ దెంప, నెలను దే మొండిచే
వెల్పఁ, గలియుఁ ద్రచ్చి వెన్నఁ గొనఁగఁ
గడవ నేర్పు గలిగి కందువు మానెఁడై
కత్తిగొంటు లయిన యత్తగంతు 135

అర్థము. నేలయున్, నింగియున్ = ఆకాశమును, తాళముల్, వాయింపన్ = వాయింపఁగను, ఎండమావులన్ = మృగతృష్ణలను, పట్టన్ = పట్టఁగను

బండతలయున్ = బట్టతలయు, మ్రోఁకాలును = మ్రోఁకాలును, ముడి + పెట్టన్ = ముడిపెట్టఁగను, తోఁకటన్ = తోఁకటియందు, చిగుళులు = చివుళులు = చివురులు, కోయన్ = కోయఁగను, చట్రాతిపైన్ = చాపఱాతిమీఁద, క్రుంగన్ = దిగఁబడఁగను,

ఇడుపు-లేక = గోడలేక, చిత్రము - వ్రాయన్ = చిత్తరువును వ్రాయఁగను, ఆకాశమునన్, తాపరములు + ఇడన్ = మెట్లు పెట్టఁగను, మంచున్ = మంచును, కుంచమునన్ = కుంచముతో, కొలువన్ = కొలుచుటకును,

ఏనుంగు - పురుడోమన్ = ఏనుఁగు పురుడు పోయఁగను, రా-నారన్ + కొనన్ = రాతిలో నారను దీయఁగను, గాలిన్ = గాలియందు, గంటు + ఇడన్ = గాయము చేయఁగను, ఇనుమునన్ = ఇనుముతో, కట్టు +తాల్పన్ = కట్టుత్రాడు పేనఁగను,

నీరి నడుము = నీటి నడిమి భాగమును, తెంపన్ = నఱుకఁగను, నెలను = చంద్రుని, తేన్ = తెచ్చుటకు, మొండి-చే = మొండిచేతిని, వెల్పన్ = చాపఁగను కలియున్ = గంజిని, త్రచ్చి = చిలికి, వెన్నన్ + కొనఁగన్ = వెన్నతీయఁగను, కడవన్ = అతిక్రమించుటకు - అసాధ్యములను సాధ్యములు చేయ, నేర్పు + కలిగి, కందువు - మానెఁడై, కత్తిగొంటులు + అయిన = కత్తివలెఁ గ్రూర స్వభావలైన, అత్త-గంతు = వేశ్యామాతల గుంపు

తాత్పర్యము. భూమ్యాకాశములను దాళములుగాఁ జేసి వాయింపఁగను, ఎండమావులను బట్టఁగను, బట్టతలకును, మ్రోఁకాలికిని ముడిపెట్టఁగను, తోఁకటియందుఁ జివురులు కోయఁగను, చట్రాతిపై దిగఁబడఁగను, గోడలేకయే చిత్తరువును వ్రాయఁగను, ఆకాశమునకు మెట్లు పెట్టఁగను, మంచును గుంచముతోఁ

గొలువఁగను, ఏనుఁగు పురుడు పోయఁగను, ఱాతినుండి నారను దీయఁగను, గాలియందు గంటువెట్టఁగను, ఇనుముతోఁ గట్టుత్రాడు పేనఁగను, నీటి నడుమును నఱకఁగను, చంద్రునిఁ దెచ్చుటకు మొండిచేతిని జాఁపఁగను, గంజిని జిలికి వెన్న తీయఁగను - ఇట్టి యసాధ్యములను సాధ్యములు చేయు నేర్పు గలిగి కందువ మానెఁడై కత్తివలెఁ గ్రూరస్వభావలైన వేశ్యామాతల సమూహము - తరువాతి వచనముతో నన్వయము

విశేషములు . ఏనుఁగు పురుడోము అననేమియో సరిగాఁ దెలియలేదు నిఘంటువులలో 'పురుడోము' కనఁబడలేదు 'పురులోము' కలదు దానికి 'క్షాత్రము మెఱయించు' అను నర్థమిాఁబడినది అది యిచ్చట సరిపడునా యని సందియము గలిగినది అందుచే 'పురుడోము' = పురుడుపోయు అని యర్థము చెప్పఁబడినది ఏనుఁగునకుఁ బురుడు పోయుట యసాధ్యమా ? కందువ = మోసము అని వా ప్రతి వ్యాఖ్యానము దాని కీ యర్థమెచ్చటను గాన రాలేదు అందుచే దానిని స్వీకరింపలేదు ఇక నే యర్థమును దోఁచలేదు

వ ఎడకాఱ కెడసొచ్చి చిల్లతర్కంబులాడుచు లోవెల లొడంబలికి తగ రోవెలలు గొన బాడతికాఱం బుజ్జగించుచు 136

అర్థము : ఎడకాఱకున్ = తార్పుకాండ్రకు, ఎడ+చొచ్చి = అడ్డము వచ్చి చిల్లతర్కంబులు = పనికిమాలిన జగడములు, ఆడుచున్, లోవెల లొడవెడన్ + పలికి, తగన్, రో-వెలలు = శుల్కములు, కొనన్, బాడతికాఱన్ = విటులను, బుజ్జగించుచున్ = అనునయించుచు - బతిమాలుచు

తాత్పర్యము: తార్పుకాండ్ర కడ్డము వచ్చి పనికిమాలిన జగడములాడుచుఁ బలికి తగినరీతిని శుల్కములు గొన విటకాండ్రను బతిమాలుచు - తరువాతి పద్యముతో న్వయము

విశేషములు : 'లోవెల లొడవెడంబలికి' అర్థము కాలేదు అది 'లోవెలలు' గాక, 'రోవెలలు' అయియుండునా? వా ప్రతి లో 'ఒడవెడ' నని యుండఁగా, 'ఒడఁబడ'నని గ్రహించి 'సమ్మతించునట్లు' అని యర్థము వ్రాయఁబడినది ఎడకాఱు - ఎడకా + లు 'కా ప్రత్యయంబు మీఁది బహువచన లకారంబునకు లఘ్వులఘు రేఫంబులును లఘురేఫంబునకు ముందు పూర్ణబిందుపూర్వక డకారంబు నగు ' బాల ఆచ్చిక 7 ఎడకాఱు - ఎడకాండ్రు ఇట్లే బాడతికాఱు, బాడతికాండ్రు

'నేలయు నింగియుఁ దాలముల్ వాయింప' ననునది 'నేలయు నింగియుఁ దాళముల్ గాఁజేసి - యేపున రేఁగి వాయించియాడ' అను తిక్కన భారత విరాట పర్వ పద్యభాగమును దలఁపించుచున్నది

ఉ వంచన లేదు బిడ్డగలవా రొరు లేగుడు తార నేఁటిరే
యించుకసేపు పోవుటయు నెల్లియ పిల్తుము తారు మమ్ము ర
క్షించుట గాదె యర్థ మొరుచేఁ గొననిచ్చుటఁ దమ్ము బల్మిఁ ద
క్కించినదాని కేమియును గింకపడం జన దల్లు రిత్తఱిన్ 137

అర్థము . వంచన లేదు = మోసము లేదు, బిడ్డ + కలవారు = సంతానవంతులు, ఒరులు = ఒకరు, ఏగుడు = ఏగుట, తార (తారు + అ) = తామే, నేఁటి - రే = ఈరాత్రి, ఇంచుకసేపు - కొంచెము సేపు, పోవుటయున్ = పోఁగా, ఎల్లియ - (ఎల్లి + అ) = మఱునాఁడే, పిల్తుము = పిలిచెదము, అర్థము = ధనము, ఒరుచేన్ = ఇతరునిచే, కొననిచ్చుటన్ = గ్రహింపనిచ్చుటచే, తారు = వారు, మమ్మున్, రక్షించుట + కాదె, తమ్మున్, బల్మిన్ = బలవంతముగా, తక్కించిన దానికిన్ = త్రోచిపుచ్చినందులకు, అల్లురు = కూఁతుప్రియులు - విటులు, ఇత్తఱిన్ (ఈ + తఱిన్) = ఈ సమయమున, ఏమియును = ఇంచుకయును, కింకపడన్ + చనదు = కోపగించుకొనరాదు

తాత్పర్యము . 'మా మోనము లేదు సంతానవంతు లొకరేఁగుట, తామే నేఁటి రాత్రి కొంచెము సేపు గడవఁగా, వారిని జేపే పిలిచెదము ఇతరునిచే ధనమును గొననిచ్చుటచే వారు మమ్ము రక్షించుట కాదా ? అల్లురు తమ్ము బలవంతముగా వెడలనడచినందులకీ సమయమున నించుకయు మాపైఁ గోపపడవలదు

విశేషములు : ఈ పద్యము భావ మస్పష్టముగా నున్నది వేశ్య యింటి నుండి యొకరు వెడలిపోఁగా నింకొకరు వత్తురు తాము వెడలి యింకొకరి నుండి ధనము గ్రహింపఁజేయుటచే, వారు మమ్ము రక్షించుటయే వారిని బలవంతముగా గెంటివేసినందుట కల్లు రా సమయమున మాపై నించుకయుఁ గోపపడరాదు ఇందు 'ఏగుడు' అనునది ఏగు ధాతువు నానంతర్యార్థక రూపమా ? లేక ఏగు ధాతువు భావార్థక రూపమా ? భావార్థకమునకు బదులుగా డువర్ణమును వాడుట యీ కవికిఁ బరిపాటి

వ మఱియుం దక్కోపక పై నడుచు బొజ్జంగులం గనువలిలేక తూల
నొదరుచు 138

అర్థము . మటియున్, తక్కోపక = త్రోచిపుచ్చుట సహింపఁజాలక, పై నడుచు = మీఁదికి నడుచు, బొజ్జంగులన్ = విటులను, కనువలి = సంకోచము, లేక, తూలన్ + ఒదరుచున్ = నిందించుచు

తాత్పర్యము. మటియును ద్రోచిపుచ్చుట సహింపఁజాలక మీఁదికి నడుచు విటులను సంకోచములేక తూలనాడుచు - తరువాతి పద్యముతో నన్వయము

మ భయమే పెట్టనివారిఁ బిల్వమనఁగాఁ బైవచ్చి మీ రిన్ని బూ
మియ లాడం బనిలేదు పాఱుఁడవుఁబో మేలయ్యె నొడ్డించి లం
జియతో నుండఁగ వచ్చె నెట్టిబొజ్జఁగో ఛీ కష్టమీకున్న రా
జయినం బిల్తుమె యెల్లప్రొద్దుఁ జనునే యాలంబులుం దొట్టులున్ 139

అర్థము. పెట్టని-వారిన్ = ఈనివారిని, పిల్వము + అనఁగాన్ = పిలువము అనఁగా, భయమే = మాకు భయమా?, మీరు, పైన్ + వచ్చి = మీఁదికి వచ్చి, ఇన్ని-బూమియలు = ఇన్ని మాయమాటలు, ఆడన్ = పలుకుటకు, పని-లేదు= ప్రయోజనము లేదు, పాఱుఁడవు + పో = బ్రాహ్మణుఁడవు, మేలు + అయ్యెన్ = మంచిదయ్యెను, ఒడ్డించి = ప్రయత్నించి, లంజియతోన్ = వేశ్యతో, ఉండఁగన్ + వచ్చెన్, ఎట్టి-బొజ్జఁగో = ఎట్టి విటుఁడో, ఛీ, కష్టము + ఈక + ఉన్నన్= శ్రమమునకు ఫలము నీకున్నచో, రాజు + అయినన్ = రా జయినను, పిల్తుమె = పిలిచెదమా? ఆలంబులున్ = యుద్ధములును, తొట్టులున్ = మల్లబంధ విశేషములును, ఎల్ల-ప్రొద్దున్ = సర్వకాలమును, చనునే = తగునా?

తాత్పర్యము : ఇవి వేశ్యామాత పలుకులు 'ఈయనివారిని బిలువమన్నచో మా కేమిభయమా? మీరు మీఁదికి వచ్చి యిన్నిమాయమాటలు పలుకవలసిన పనిలేదు బ్రాహ్మణుఁడవే మంచిదయ్యెను ప్రయత్నించి వేశ్యతో నుండుటకు వచ్చెను ఎట్టివిటుఁడో? ఛీ మేము పడిన శ్రమమునకు ఫలము నీకున్నచో రా జయినను బిలుతుమా? కలహములును, మల్లబంధ విశేషములును, సర్వకాలమును దగునా?

క పురులు గలఁ డిచ్చునని తన
పురు లెఱుఁగక పిల్తు మేముఁ బుడుకక తానుం
బురులఁ బొడకట్టి మెఱయుచుఁ
బురు లీకయు తక్కిపోయెఁ బురినమ్మి క్రియన్ 140

అర్థము పురులు-కలఁడు = ధనమున్నవాఁడు, ఇచ్చును, అని, ఏమున్ = మేమును, తన+పురులు + ఎఱుఁగక = తన స్వభావము తెలియక, పిల్తుము, తానున్, పుడుకక = ఈయక, పురులన్ + పొడకట్టి = ధనవంతుఁడుగాఁ గనఁబడి, మెఱయుచున్ = ప్రకాశించుచు, పురి-నమ్మి-క్రియన్ = మగ నెమిలి వలె, పురులు + ఈక + అ = ధనమీయకయే - పింఛమునొసఁగకయే, తక్కి పోయెన్ = తొలఁగెను

తాత్పర్యము . 'ఇతఁడు ధనవంతుఁడు' ఇచ్చును అని మేమును దన స్వభావము తెలియక పిలువఁగా దానును ఈయక ధనవంతుఁడుగాఁ గనఁబడి ప్రకాశించుచు మగనెమిలివలె పురులు (ధనము - పింఛము) ఈయకయే తొలఁగిపోయెను

విశేషములు పురి - బహువచనము - పురులు పురులు అనుదానికిఁగల నానార్థములచే నలంకారము శ్లేషము

వ అని తలవీండ్లన పాయంబలికి నిజనందనల బుజ్జగించి వెలయాలి కేనంబు లలవడ నోజ గొల్పుచు 141

అర్థము . అని, తలవీండ్లన్ + అ = తలవాఁకిండ్ల నుండియే, పాయన్ = తొలఁగిపోవునట్లు, పలికి, నిజ-నందనలన్ = తమ కూఁతులను, బుజ్జగించి, వెలయాలి-కేనంబులు = వేశ్యావంచనలు, అలవడన్ = కలుగఁగా, ఓజగొల్పుచున్= పురికొల్పుచు

తాత్పర్యము . అని తలవాఁకిండ్లనుండియే తొలఁగిపోవునట్లు పలికి తమ కూఁతులను బుజ్జగించి వేశ్యామాయలు గలుగఁగాఁ బురికొల్పుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ కలువక కల్చినట్లుఁ దమకం బెద లేకయుఁ గల్గినట్లుఁ జేఁ
గల విటు నర్థమంతయును గైకొనునంతకుఁ బొచ్చపోక, చేఁ
గల పురు లెయ్యుడున్ విడిచి గ్రక్కున నెక్కడియేనివానిఁగాఁ
దలఁచి ధనేతరున్ మదనుఁ దా నొరుఁ గల్వమి నేర్పు వేశ్యకున్ 142

అర్థము . కలువక = వలవక, కల్చిన + అట్లున్ = వలచినట్లును, తమకంబు= మోహము, ఎదన్ = హృదయమునందు, లేకయున్ = లేకున్నను, కల్గిన + అట్లున్ = ఉన్నట్లును, చేన్ + కల = చేతనున్న, విటు + అర్థము +

అంతయును = వీటుని ధనమంతయును, కైకొను + అంతకున్ = పుచ్చుకొనునంతవఱకును, పొచ్చపోక = కొఱఁతవడక = హాన్యము పడక, చేన్ + కల-పురులు = చేతనున్న ధనము, ఎయ్యుడున్ = అయిపోవఁగనే, ఎక్కడి + ఏని-వానిన్ + కాన్ = ఎక్కడివాఁడో అనురీతిని-ఏమియు సంబంధములేనివానినిగా, తలఁచి, గ్రక్కునన్ = శీఘ్రముగా, విడిచి, తాను, ధన + ఇతరున్ = డబ్బులేనివానిని, మదనున్ = మన్మథుని, ఒరున్ = ఇతరుని, కల్వమి = ఒల్లకుండుట, వేశ్యకున్, నేర్పున్ = బోధించును

తాత్పర్యము వలవకయే వలచినట్లును, హృదయమున మోహములేకున్నను, ఉన్నట్లును వీటునిచేతనున్న ధనమంతయును పుచ్చుకొనునంతవఱకును గొఱఁత వడక, చేతనున్న డబ్బు అయిపోవఁగనే, యెక్కడివాఁడో యనునట్లు తలఁచి వెంటనే విడిచి, డబ్బులేనివానిని ఇతరుని మన్మథునైనను ఒల్లకుండునట్లు వేశ్యకు నేర్పును

విశేషములు. కలుచు - కల్చు వీటు + అర్థము - 'షష్ఠీ సమాసమునం దుకార బుకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' వీటునర్థము బాల సంధి 34 ఎయ్యు - ఎయిదు (రూపాం) ఎయ్యుడున్ - ఎయిదినంతనే - ఒక్కక్షణమైన ఆలస్యములేక అని ఆనంతార్యార్థకప్రయోజనము

చ పలుచని పూఁతలున్, మెఱుఁగుఁబండ్లును, నున్నినికోరకొప్పులున్
బొలకువతీపుఁ, జెన్నుఁ, బొరపొచ్చెముఁ బొచ్చముకాఁగ మాయలన్
లలనలఁ దేర్పఁజూచు మగలంజియలం గని వారిపొంతఁ బో
వలవదు, రొక్క మీఁగలుగువాఁడ మనోజుఁడు గూలియాలికిన్ 143

అర్థము: పలుచని-పూఁతలున్ = పలుచనిమైపూఁతలును, మెఱుఁగు + పండ్లును = తళతళలాడు దంతములును, నున్నని-కోర-కొప్పులున్ = నున్ననైన ప్రక్కకొప్పులును, పొలకువ తీపున్ = జాడయొక్క మాధుర్యమును, చెన్నున్ = అందమును, పొరపొచ్చెమున్ = కపటమును, పొచ్చము-కాఁగన్ = కాపట్యయుక్తము కాఁగా, మాయలన్ = మాయలచే, లలనలన్ = స్త్రీలను, తేర్పన్ + చూచు = తేఱుకొనఁజేయఁజూచు, మగలంజియలన్ = లంజలవలె మాయాయౌవన చిహ్నములను ధరించిన మగవారిని, కని, వారి-పొంతన్ = వారిదగ్గఱకు, పోన్ + వలవదు = పోవలదు, కూలి + ఆలికిన్ = వేశ్యకు, రొక్కము = ధనము, ఈన్ + కలుగువాఁడు + అ = ఈయఁగలవాఁడే, మనోజుఁడు = మన్మథుడు

తాత్పర్యము పలుచని మైపూఁతలును, తళతళలాడు దంతములును, నున్నని ప్రక్క కొప్పులును, అందమును, కపటమును మోసముతోఁ గూడినదికాఁగా మాయలచే స్త్రీలను దేఱుకొనునట్లు చేయఁజూచు మాయాయౌవనచిహ్నములను ధరించు మగవారిని జూచి, వారి దగ్గఱకుఁ బోవలదు వేశ్యకు ధనమీఁగలవాఁడే మన్మథుఁడు

విశేషములు పలుకులతీపు అని మా రా ప్రతిపారము కాని 'పలుకులతీపుఁజెన్నుఁ బొరపొచ్చెము' - అనుచో యతిమైత్రి తప్పినది అందుచే నది 'పొలకువ తీపు'గా మార్పుఁబడియుండవచ్చును పలుకులతీపు పొరపచ్చెము - పొర - పరవలె, పొచ్చెము - పచ్చెము ని వేం రా లంజియ - లంజె (రూపాం)

వ అని లంజకాని రీతి నూల్కొలుపుచు నుండి రంత నందుల నాయక స్త్రీ లమర కటక సమూహంబు లందుఁ దమ వయోరూపగుణంబుల కనురూపంబులైన బొజుంగుల రోసి రోలుగొనం దొడంగి రంత 144

అర్థము. అని, లంజకాని రీతిన్ = వేశ్యకాని విధమున, నూల్కొలుపుచున్+ ఉండిరి = పురికొల్పుచుండిరి, అంతన్, అందుల = అందలి, నాయకస్త్రీలు = నాయకురాండ్రు, అమర-కటక-సమూహంబుల + అందున్ = దేవతల శిబిరముల సమూహములందు, తమ-వయస్(ఃు) + రూప-గుణంబులకున్ = తమవైన వయస్సు, రూపము, గుణములు ననువానికి, అనురూపంబులు + ఐన = తగినవారైన, బొజుంగులన్ = విటులను, రోసి = వెదకి, రోలుకొనన్ + తొడంగిరి= జల్పములాడఁజొచ్చిరి, అంతన్

తాత్పర్యము . అని వేశ్యకానిదానివలెఁ బురికొల్పుచు నుండిరి అంత వారిలో నాయకురాండ్రు తమ వయోరూపగుణములకుఁ దగిన విటులను వెదకి జల్పములాడఁ జొచ్చిరి అంత - తరువాతి పద్యముతో నన్వయము

సీ కమియ నీలేక శృంగారాతిచేష్టలఁ
బచరించుచుండు నా భద్రు నొల్ల
మృదురేఖ ననురక్తిఁ బొదలించి రసమెల్ల
గాలించికొనునొ పాంచాలు నొల్ల
ధనమెక్క నీగియ తగులుగా రతి బెట్టి
దము సేయునట్టి దత్తకుని నొల్ల
మనసీక మందుల మాయల మరగించి
కారించు నా కూచిమారు నొల్లఁ

ఆ గలిచి తాల్మి గల్గఁ గలిపించి బేటంబు
సలుపు నెదురు తన్నుఁ గలిచెనేనిఁ
దానుఁ గలిచె నేనిఁ దగ నిచ్చు నయవిదుఁ
డని మనోజ్ఞు నొక్క వనిత గలిచె 145

అర్థము కమియన్ + ఈన్ + లేక = బాగుగా నీయలేక, శృంగార + అతి-చేష్టలన్ = శృంగారము మితిమీఱిన పనులను, పచరించుచున్ + ఉండు = చేయుచుండునట్టి, ఆ-భద్రున్ = ఆ భద్రనామక నాయకుని, ఒల్లన్ = వలవను

మృదు-రేఖన్ = మృదువుగా, అనురక్తిన్ = వలపును, పొదలించి = వర్ధిల్లఁజేసి, రసము = ఎల్లన్ = శృంగారమునంతను, గాలించికొనునొ = వెదకుకొనునేమో, పాంచాలున్ = పాంచాలదేశపుఁబురుషుని, ఒల్లన్

ధనము + ఎక్కున్ + ఈగి + అ = ధనము నధికముగా నిచ్చుటయే, తగులు + కొన్ = సంబంధముగా, రతిన్ = సంభోగమును, బెట్టిదము + చేయు + అట్టి = అధికముచేయునట్టి, దత్తకునిన్ = కేరళదేశపు వీటుని, ఒల్లన్

మనసు + ఈక = వలపులేక, మందులన్ = మందులతోను, మాయలన్ = మాయలతోను, మరగించి = ఆసఁగొలిపి, కారించు = బాధించునట్టి, ఆ-కూచిమారున్ = కూచిమారుఁడను ఆ జాతిపురుషుని, ఒల్లన్

కలిచి = వలచి, తాల్మి + కల్గన్ = ఓర్పుగలుగునట్లు, కలిపించి = వలపించి, ఎదురు, తన్నున్, కలిచెన్ = ఏనిన్ = వలచినచో, బేటంబు + చలుపున్ = సంభోగించును, తానున్, కలిచెన్ + ఏనిన్, తగన్, ఇచ్చు, నయ-విదుఁడు = నీతితెలిసినవాఁడు, అని, మనోజ్ఞున్ = అందమైనవానిని, వనిత = స్త్రీ, కలిచెన్ = వలచెను

తాత్పర్యము. బాగుగా నీఁజాలక మితిమీఱిన శృంగారచేష్టలను జేయు ఆ భద్రనామకపురుషు నొల్లను వలపును మృదువుగా వర్ధిల్లఁజేసి శృంగారమునంతను వెదకుకొనునేమో ఆ పాంచాలదేశపుఁబురుషు నొల్లను ధన మధికముగా నిచ్చి దానికిఁ దగినట్లు సంభోగము నధికముచేయునట్టి దత్తకనామక కేరళదేశవిటు నొల్లను వలపులేక మందులతోను, మాయలతోను ఆశచూపి బాధించునట్టి ఆ కూచిమారు నొల్లను తాను వలచి, ఓర్పుతోఁ దన్ను వలపించి, వలచినచో సంభోగించును తాను వలచినచోఁ దగునట్లు ధనమిచ్చు నయవిదుఁడని ఒక యింతి సుందరాంగుని వలచెను

వ అనుచుఁ గొంద అమరస్త్రీలు వంచనలేక పల్కుచు మనఃప్రియులు వొలయలుకఁ గట్టలుక సేసి పోయిన విరహపరితాపంబునం దురపిల్లి నిజాంతర్గతఖేదంబులు ప్రియవయస్యలచే నెఱింగించుచు 146

అర్థము. అనుచున్, కొందఱు, అమర-స్త్రీలు = దేవతాస్త్రీలు (?) వంచన-లేక = మోసములేక, పల్కుచున్, మనస్ (ఃకు) + ప్రియులు = మనోవల్లభులు, పొలయలుకన్ = ప్రణయకలహమును, కట్టలుక (కడు + అలుక) = అధికమైన కోపము,చేసి, పోయినన్ = పోఁగా, విరహ-పరితాపంబునన్ = ఎడఁబాటువలని దుఃఖముచే, దురపిల్లి = దుఃఖించి, నిజ + అంతర్గత-ఖేదంబులు = తమ మనస్సునందలి దుఃఖములు, ప్రియ-వయస్యలచేన్ = ఇష్టసఖులచే, ఎఱింగించుచున్ = తెలియఁజేయుచు

తాత్పర్యము. అనుచుఁ గొందఱు దేవతాస్త్రీలు (?) మోసములేక పలుకుచు మనోవల్లభులు ప్రణయకలహమును బెనుగోపముగాఁ జేసిపోఁగా విరహతాపముచే దుఃఖించి తమ మనోదుఃఖములను ఇష్టసఖులచేఁ దెలియఁజేయుచు - తరువాతి పద్యముతో నన్వయము

క తన హృదయమునం దెన్నఁడు
నను నించుక వొందనీఁడు నా యెదలోఁ దా
ననిశము నుండు ని దేమిటఁ
జనునని మదినున్న విభుని సతి నెగ్గించెన్ 147

అర్థము. తన-హృదయమునందున్ = తన మనసునందు, ఎన్నఁడున్ = ఎప్పుడును, ననున్ = నన్ను, ఇంచుక = కొంచెము, పొందన్ + ఈఁడు = కలుగనీఁడు, నా + ఎదలోన్ = నా హృదయమునందు, తాను, అనిశమున్ = ఎల్లప్పుడును, ఉండున్, ఇది, ఏమిటన్ = ఏ విధముగా, చనున్ = తగును, అని, సతి = స్త్రీ, మదిన్ + ఉన్న-విభునిన్ = మనసునందలి నాథుని, నెగ్గించెన్ = నిందించెను - రోఁతపడెను

తాత్పర్యము. 'తన హృదయమునం దెప్పుడును న న్నించుకైనను ఉండనీఁడు కాని నా హృదయమునం దెల్లప్పుడును దా నుండును ఇది యేమి న్యాయము?' అని యింతి మనోనాథుని నిందించెను

క కని కొంత దవ్వ వెండ్రుక
కొన నేయం దాన నేర్చుఁ గుసుమాస్త్రుఁడు నా
మనమునఁ బాయని పతి నురి
యును దాఁకక, నన్న తాఁక నుతియుచు నునికిన్ 148

అర్థము కుసుమ + అస్త్రుఁడు = పువ్వులు బాణములుగాఁ గలవాఁడు - మన్మథుఁడు, కని = చూచి, కొంత-దవ్వు + అ = ఇంచుక దూరముననే, వెండ్రుక-కొనన్ = వెండ్రుకకొనతో, ఏయన్ = కొట్టుటకు, తాను + అ = తానే, నేర్చున్ = సమర్థుఁడగును, నన్నున్ + అ = నన్నే, తాఁకన్ = స్పృశించునట్లు, ఉటియుచున్ + ఉనికిన్ = (అంపవాన) కురియుచుండుటచే, నా-మనమునన్ = నా మనస్సునందు, పాయని = ఏడువని, పతిన్ = భర్తను, తాఁకక = స్పృశింపక, ఉరియును = చలించును

తాత్పర్యము . మన్మథుఁడు ఇంచుకదూరమునుండియే వెండ్రుక కొనతోనైనను గొట్ట సమర్థుఁడు అతఁడు నా మీఁదనే యంపవానఁ గురియుచుండుటచే, నా మనసును విడువకున్న నా పతిని దాఁకక చలించును మన్మథుడు నన్నే కొట్టుచున్నాఁడుగాని, నా మనసులోనున్న నా భర్తను గొట్టలేక చలించుచున్నాఁడని భావము

విశేషములు ఈ పద్యము భావము అస్పష్టముగా నున్నది

చ స్ఫురదురుకాంతి నీ మొగముఁ బోలఁగ నోపక వందుచున్న చం
దురుఁ డెదఁబోలఁగంటి నని త్రుళ్లెడు నిప్పుడు నీదు వక్త్రపం
కరుహ మవారితాశ్రుజలకజ్జలసంగతమైనఁ జూచి సుం
దరి! వల దేలయేడ్చె? దని తత్పతి నొక్కతె పల్కెఁ బెల్కుఱన్ 149

అర్థము :స్ఫురత్ + ఉరు + కాంతిన్ = ప్రకాశించుచున్న గొప్ప కాంతియందు, నీ-మొగమున్ = నీ ముఖమును, పోలఁగన్ + ఓపక = పోలఁజాలక, వందుచున్ + ఉన్న = దుఃఖించుచున్న, చందురుఁడు = చంద్రుఁడు, నీదు-వక్త్ర-పంకరుహము = నీయొక్క ముఖపద్మము, అవారిత + అశ్రు-జల-కజ్జల-సంగతము + ఐనన్ = అడ్డగింపఁబడని కన్నీటితోఁగూడిన కాటుకతోఁ గూడినది కాఁగా, చూచి, ఎదన్ = హృదయమునందు, పోలన్ + కంటిన్ = సరిపోలఁగలిగితిని, అని, ఇప్పుడు, త్రుళ్లెడున్ = సంతోషించుచున్నాఁడు, సుందరి = ఓ సుందరీ, వలదు, ఏల + ఏడ్చెదు = ఎందుల కేడ్తువు? అని, ఒక్కతె = ఒక స్త్రీ, తద్ + పతిన్ = ఆ యింతిని, పెల్కుఱన్ = భయపడఁగా, పల్కెన్

తాత్పర్యము.ఆమె ముఖము నిష్కళంకమైనది చంద్రుఁడు సకలంకుఁడు అందుచే అధికమైన కాంతియందు ఆమె ముఖమును బోలలేక పోవుచున్నానే యని చంద్రుఁడు దు.ఖించుచుండెను ఇప్పు డామె యేడ్చుచుండుటచే నామె ముఖపద్మము కన్నీటితోఁ గూడిన కాటుక గలది యగుటచే సకళంక మయినది

అదిచూచి చంద్రుఁ డామె ముఖమును బోలఁగలిగితినని ఇప్పుడు ఉప్పొంగుచున్నాఁడు 'సుందరీ! ఏడువవలదు' అని- ఒక యింతి యామె భయపడునట్లు పల్కెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష వక్త్రపంకరుహ మనుచో నుపమ తన ముఖము చంద్రునికంటెఁ గాంతిమత్తరముగా నుండవలయునని యామె తలఁపు (చంద్రుఁడు తన ముఖము నెక్కడఁబోలునో యని యామె భయము) ఆ భయముచే నామె యేడ్చుచుండెను నిజమున కామె యేడ్చుటచేతనే ముఖము కాటుకకన్నీటిచేఁ గళంకితమయి, చంద్రుఁడు దానిని బోలుటకు వీలయ్యెను అందుచే నింకొకతె ఆమె నేడువవలదని వారించుచుండెను స్ఫురత్ + ఉరు = స్ఫురదురు చందురుఁడు (వికృతి) = చంద్రుఁడు (ప్రకృతి) ఏడ్చెదని - ఏడ్చెదవు + అని లాట్టు వకారమునకు లోపము - బాల క్రి 24 ఏడ్చెద + ఉ + అని అపదాది స్వరసంధి - బాల సంధి 11 ఏడ్చెదు + అని ఉత్వసంధి బాల సంధి 1 ఏడ్చెదని పెల్కుఱు - పెలుకుఱు (రూపా)

వ మఱియు నంద కొందఱు దమవలచు చెలికత్తెల వలచు బొజ్జంగులం దెలిచి, తెలియనివారి ననునయరీతి నాక్షేపించుచు 150

అర్థము: మఱియున్, అందున్ + అ = అంద = అందే, కొందఱు, తమ-వలచు = తాము ప్రేమించునట్టి, చెలికత్తెలన్, వలచు, బొజ్జంగులన్ = విటులను, తెలిచి = తేర్చి, తెలియనివారిన్, అనునయ-రీతిన్ = బుజ్జగించు విధమున, ఆక్షేపించుచున్ = బెదరించుచు

తాత్పర్యము: మఱియు నందే కొందఱు తాము వలచు చెలికత్తెలను వలచునట్టి విటులను దేర్చి, తెలియనివారిని బుజ్జగించు విధమున బెదరించుచు - తరువాతి పద్యముతో వన్వయము

చ కలుచుట దోసమే? మగలఁ గల్వక యాండురు దొల్లి యాండురం
గలుతురె? తక్కు లేక నినుఁ గల్చుడు నేరమిగాఁ దలంచియే
యలుగుదు, మ్రొక్కినం దెలవ దాఁటది గీడ్పడ మ్రొక్కుఁగాక నిం
గొలుచునె? కల్చువారియెడఁ గోఱడ మెప్పుడుఁ జేయు డొప్పునే? 151

అర్థము. కలుచుట = వలచుట, దోసమే = తప్పా, ఆండురు = ఆంధ్రు-స్త్రీలు, మగలన్ = పురుషులను, కల్వక = ఒల్లక, తొల్లి = పూర్వము, ఆండురన్=

స్త్రీలను, కలుతురె = వలతురా? తక్కు-లేక = వంచన లేక, నినున్ = నిన్ను, కల్చుడు = వలచుట, నేరమి + కాన్ = తప్పుగా, తలంచియే = భావించియే, అలుగుదు = కోపింతువు, మ్రొక్కినన్, తెలవదు = తేఱదు, ఆఁటది = స్త్రీ, కీడ్పడన్ = దైన్యమునొందఁగా, మ్రొక్కున్ + కాక, నిన్ = నిన్ను, కొలుచునె = సేవించుచున్నదే! కల్చువారి + ఎడన్ = వలచువారియెడల, కోఱడము = క్రోధము, ఎప్పుడున్ = ఎల్లప్పుడును, చేయుడు = చేయుట, ఒప్పునే = తగునా?

తాత్పర్యము : వలచుట తప్పా? స్త్రీలు పురుషులను వలవక మునుపు స్త్రీలను వలచిరా? వంచనలేక నిన్ను వలచుటయే తప్పుగా భావించి కోపింతువు స్త్రీ నాయకుఁడు మ్రొక్కినను దేఱదు అట్టి ఆమె దైన్యముతో మ్రొక్కుటయేకాక నిన్ను బతిమాలి సేవించుచుండఁగాఁ బ్రియపై నిట్లు వక్రత్వముఁ జూపుట నీకుఁ దగునా? వలచువారియెడల నెల్లప్పుడును గోపముచేయుట తగునా?

విశేషములు. ఆండురు ఆండ్రు - ఆలు + లు - 'ఆల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందటి లువర్ణంబునకు బిందుపూర్వక డకారంబు నగు ' బాల ఆచ్చిక 11 ఆండ్రు - ఆండురు అనుటకుఁ బ్రయోగాంతరము - 'మలయాచలంబుపైఁ జిలువయిల్లాండుర ఫణరత్నములయందుఁ బ్రతిఫలించి ' కాశీ ఆ 1 'ఆ సమయంబునన్ మగని యాండురు గన్యలు ' నిర్వ ఆ 5

క ధృతి దక్కె మ్రొక్కి పైఁబడి
మతిఁ గీడ్పడి తెలుప నలుక మానక సౌభా
గ్యత మెఱయుచునికి నీ వా
సతికిం బ్రాణేశుఁ డగుట సార్థక మయ్యెన్ 152

అర్థము : ధృతి = ధైర్యము, తక్కి = విడిచి, మ్రొక్కి, పైన్ + పడి = మీఁదఁబడి, మతిన్ + కీడ్పడి = తెలివి కోలుపోయి, తెలుపన్ = తేర్పఁగా, అలుక = కోపము, మానక = వీడక, సౌభాగ్యతన్ = సుభగత్వముతో, మెఱయుచున్ + ఉనికి = ప్రకాశించుచుండుట, నీవు, ఆ-సతికిన్ = ఆ స్త్రీకి, ప్రాణ + ఈశుఁడు = ప్రాణేశ్వరుఁడు, అగుట, సార్థకము + అయ్యెన్ = నిజమయ్యెను

తాత్పర్యము. ధైర్యము కోలుపోయి మ్రొక్కి, పైఁబడి, తెలివి దక్కితేర్పఁగాఁ, గోపము విడువక సౌభాగ్యముతో నొప్పుచుండుటచే నీవు ఆ స్త్రీకిఁ బ్రాణేశ్వరుఁడ వగుట సార్థకమయ్యెను ఆమె నిన్నుఁ బ్రాణేశ్వరునిగా భావించుటచేతనే, నీ వన్ని చేసినను ఆమె నీపైఁ గోపము విడువకుండె నని భావము

చ కనుకనిఁ దొల్లి దానిదెసఁ గన్నులఁ జూచినవాని నేయు నా
మనసిజుఁ డణ్చుఁ గోయిలలు మట్టు నళుల్, నవయించుఁ దెమ్మెరల్
గనుకని నిన్ను నిప్పు డిది గన్నులఁ జూచిన దాని నేసె నా
మనసిజుఁ, డణ్చెఁ గోయిలలు, మట్టె నళుల్, నవయించెఁ దెమ్మెరల్ 153

అర్థము కనుకనిన్ = సంభ్రమముతో, తొల్లి = పూర్వము, దాని-దెసన్ = ఆమెవైపు, కన్నులన్ = కన్నులతో, చూచిన-వానిన్, ఆ-మనసిజుఁడు = ఆ మన్మథుఁడు, ఏయున్ = కొట్టును, కోయిలలు = కోకిలములు, అణ్చున్ = అణఁచును, అళుల్ = తుమ్మెదలు, మట్టున్ = బాధించును, తెమ్మెరల్ = గాలి, నవయించున్ = బాధించును, ఇప్పుడు, నిన్నున్, ఇది = ఈమె, కనుకనిన్ = సంభ్రమముతో, కన్నులన్, చూచినన్, దానిన్ = ఆమెను, ఆ-మనసిజుఁడు, ఏసెన్ = కొట్టెను, కోయిలలు, అణ్చెన్, అళుల్, మట్టెన్, తెమ్మెరల్, నవయించెన్

తాత్పర్యము పూర్వము దానివైపు సంభ్రమముతోఁ గన్నులఁజూచినవాని నా మన్మథుఁడు కొట్టును కోకిలములు అణఁగఁద్రొక్కును తుమ్మెదలు బాధించును గాలి బాధించును ఇప్పుడు ఈమె నిన్ను సంభ్రమముతోఁ గంటఁజూచినచో, నామె నా మన్మథుఁడు కొట్టెను కోకిలము లణఁగఁద్రొక్కును తుమ్మెదలు బాధించెను గాలి బాధించెను

విశేషములు: అణ్చు - అణఁచు 'లాఁతి యచ్చునకు సహిత మొకానొకచో నుడినడుమ లోపంబు గానంబడియెడి' బాల ప్రకీర్ణక 18 'అణ్చు' అనుదానికి 'అంచు' అను పారాంతరము గలదు అంచు = అణఁగఁజేయు తెమ్మెరల్ = ఏకవచనమే 'తెమ్మెర' ఉండదు

చ **అమరఁగ నీ వనంతవిరహానలపూరిత మైనదాని చి**
త్తమున రమింతు ప్రీతి, నవదాహకరంబగు నీ మనంబులో
నిమిషముఁ బొందెదట్టె యిది నీ కలుగం జను, నైనఁ జాల నే
రమి యొకచో సహించియును రమ్మి దయన్ సుభగైకభూషణా ! 154

అర్థము . అమరఁగన్ = ఒప్పునట్లుగా, నీవు, అనంత-విరహ + అనల-పూరితము = అంతులేని యెడఁబాటు అనెడి అగ్నితో నిండినది, ఐన, దాని-చిత్తమునన్ = ఆమె మనస్సునందు, ప్రీతిన్ = ప్రీతితో, రమింతు = క్రీడింతువు, ఆనందింతువు, అవదాహకరంబు = తాపశాంతినిజేయునట్టిది, అగు, నీ-

మనంబులోన్ = నీ మనస్సులో, నిమిషమున్ + పొందదు + అట్టి = తెప్పపాటు కాలముగూడ నుండదఁట, ఇది = ఈ విషయము, నీకున్, అలుగన్ + చనున్ = కోపింపఁదగినది, ఐనన్ = అయినను, సుభగ + ఏక-భూషణా = సుభగత్వము ప్రధానమైన అలంకారముగాఁ గలవాఁడా! చాల-నేరమి = గొప్పతప్పు, ఒకచోన్ = ఒకచోట, సహించియును = ఓర్చియును, దయన్ = దయతో రమ్ము

తాత్పర్యము నీవు అంతులేని విరహాగ్నితో నిండిన ఆమె మనస్సునందుఁ బ్రీతితో రమింతువు కాని తాపోపశమనముఁజేయు నీ మనస్సులో నామె ఒక నిమిషముగూడ నుండదటే ఈ విషయము నీకుఁ గోపమువహింపఁదగినది అయినను ఓయి సుభగత్వము ముఖ్యాలంకారముగాఁ గలవాఁడా! గొప్పతప్పు నొకచో సహించి దయతో రమ్ము

విశేషములు . రమింతు - రమింతువు 'లాడ్వకారమునకు లోపము - బాల క్రియ 24 రమింతు + ఉ అపదాదిస్వరసంధి బాల సంధి 11 రమింతు అవదాహ-కరంబు - అవదాహము = తాపమును బోఁగొట్టునది - వట్టివేరు - 'అవదా హేష్టకాపధే' అమరము తాపశాంతిని జేయునది అవనశ్యతి దాహోఽనే నే త్యవదాహమ్ - దీనిచేత దాహ మణఁగును

తే నీవు దక్కినఁ దక్కదు జీవ, మీవు
దక్కకున్నను దక్కు, నిత్యంబుఁ బురుడు
వారి కెడయైన, మట్టి జీవంబుతోడ
నునికి సతి తప్పు, నీ వల్గియుంట దప్పె? 155

అర్థము . నీవు, తక్కినన్ = వదలిన యెడల, జీవము = నా ప్రాణము తక్కదు = మిగులదు, ఈవు = నీవు, తక్కక + ఉన్నను = వదలక పోయినచో, తక్కున్ = (ప్రాణము) మిగులును, నిత్యంబున్ = ఎల్లప్పుడును, పురుడు వారికిన్ = సమప్రేమము గలవారికి, ఎడ + ఐనన్ = ఎడఁబాటు గలిగినపుడు, మట్టి = మందమయి, జీవంబుతోడన్ = ప్రాణముతో, ఉనికి = ఉండుట, సతి-తప్పు = ఇంతి తప్పు, నీవు అల్గి + ఉంట = కోపించుట, తప్పె = తప్పా?

తాత్పర్యము . నీవు వీడుచో నా ప్రాణము మిగులదు విడువకున్నచో మిగులును ఎల్లప్పుడును సమప్రేమము గలవారికి ఎడఁబాటు గలిగినపుడు మందమయి ప్రాణముతో నుండుట యింతి తప్పు నీవు కోపించుట తప్పా? కాదనుట

వ అని యనేకప్రకారంబుల ఋజువక్రోక్తిభేదంబుల ననునయించి విటవిటీజనంబులం గూర్చుచుండి రంత నట విటగోష్ఠియందు విట విదూషక నాగరక పీరమర్దకులు చతురోక్తి పరిహాసోక్తి వక్రోక్తి గ్రామ్యోక్తులం దగిలి సంభాషించుచుఁ దమతమ మనోవ్యాపారంబు లెఱింగించుడు నొండొరుల సంతరించుచు 156

అర్థము అని, అనేక ప్రకారంబులన్ = పెక్కురీతుల, ఋజు-వక్ర + ఉక్తి-భేదంబులన్ = ఋజూక్తి, వక్రోక్తి అనుభేదములచే, అనునయించి = బుజ్జగించి, విట-విటీ-జనంబులన్ = విటజనములను, విటీజనములను, కూర్చుచున్ + ఉండిరి, అంతన్, నట-విట-గోష్ఠి + అందున్ = నటులయు విటులయు సభయందు, విట-విదూషక-నాగరక-పీరమర్దకులు = విటులు, విదూషకులు, నాగరకులు, పీరమర్దులు అను శృంగారనాయకానుచరులు (క్రమముగా) చతురోక్తి - పరిహాసోక్తి - వక్రోక్తి- గ్రామ్యోక్తులన్ = చతురము, పరిహాసము, వక్రము, గ్రామ్యము నైన మాటలందు, తగిలి = ఆసక్తివహించి, సంభాషించుచున్ = మాటలాడుచు, తమతమ - మనస్ (ఃు) + వ్యాపారంబులు = తమతమ మనస్సుల వర్తనములు, ఎఱింగించుచున్ = తెలియఁజేయుచు, ఒండొరులన్ = ఒకరినొకరు, సంతరించుచున్ = ఆదరించుచు

తాత్పర్యము . అని పెక్కు రీతుల ఋజూక్తి వక్రోక్తి అను భేదములచే బుజ్జగించి విటజనములను, విటీజనములను గూర్చుచుండిరి అంత నటులయు విటులయు సభయందు విటులు, విదూషకులు, నాగరకులు, పీరమర్దులు అనెడి శృంగారనాయకానుచరులు క్రమముగా చతురోక్తి, పరిహాసోక్తి, వక్రోక్తి, గ్రామ్యోక్తులతో సంభాషించుచుఁ దమతమ మనస్స్థితులను ఎఱిఁగించుకొనుచు ఒకరినొకరు ఆదరించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విట విదూషకాదుల చతుర సంబాషణములు

క వెలయఁగ సుజనుల మనమును
వెలయాండుర జవ్వనంబు, వెన్నెల తెలుపుం
జలిగాలి తనుపు, నిర్ఝర
జలములు, నివియెల్ల సర్వసామాన్యంబుల్ 157

అర్థము . వెలయఁగన్ = ఒప్పుగా, సుజనుల = మంచివారియొక్క మనమును = మనస్సును, వెలయాండుర = వేశ్యలయొక్క జవ్వనంబున్ =

యౌవనమును, వెన్నెల - తెలుపున్ = వెన్నెలయొక్క స్వచ్ఛతయును, చలిగాలి తనుపున్ = చలిగాలియొక్క చల్లఁదనమును, నిర్ఝర-జలములున్ = ఏఱుల నీరును - ఇవి ఎల్లన్, సర్వసామాన్యంబుల్ = సర్వసాధారణములు

తాత్పర్యము . సజ్జనుల మనస్సును, వేశ్యల యౌవనమును, వెన్నెల స్వచ్ఛతయును, చలిగాలి చల్లనయును, సెలయేఱుల నీరును - ఇవి యన్నియును సర్వసాధారణములు

ఉ **భావజుకేళి నచ్చుపడి పైఁబడి తద్విటు నిచ్చఁగూడి రాఁ**
గా వివిధోపచారములఁ గామసుఖంబులు సల్పిపుచ్చి తా
రోవెల నీఁగి వెండొకని రోయుఁ దగన్, వెలయాలికూటముం,
బూవుల మేలికంపుఁ దమ పొందున కా కటమీఁద నిల్చునే? 158

అర్థము . భావజు - కేళిన్ = మన్మథక్రీడయందు, అచ్చుపడి = ఏర్పడి, పైఁబడి, తద్ +విటున్ = ఆ విటుని, ఇచ్చన్ + కూడి-రాఁగాన్ = కోరికతోఁ గూడివచ్చుటకు, వివిధ + ఉపచారములన్ = పలురీతులయిన సేవలతో, కామ - సుఖంబులు = మన్మథసౌఖ్యములు, సల్పిపుచ్చి = చేసివైచి, తాన్, రో-వెలన్ + ఈఁగి = ఇచ్చిన శుల్కమును నివర్తించి, వెండొకనిన్ (వెండి + ఒకనిన్) = మఱియొకనిని, తగన్= తగునట్లు, రోయున్ = వెదకును, వెలయాలి - కూటమున్ = వేశ్యా సంగమమును, పూవుల - మేలి - కంపున్ = పువ్వుల మంచి వాసనయును, తమ - పొందున్ + అ - కాక = తమ పొందునే కాని, - అట - మీఁదన్ = ఆపైని, నిల్చునే = నిలుచునా ?

తాత్పర్యము . మన్మథక్రీడ కిష్టపడి పైఁబడి విటునిగూడిరాఁగా వివిధోపచారములతో మన్మథసుఖములనుజేసి పంపి తాను గైకొన్న శుల్కమును నివర్తించి వేశ్య మఱియొకనిని వెదకును వేశ్యాసంగమమును, పూవుల సువాసనయును దమ అనుభవమువఱకే కాని ఆపైని నిలువవు

విశేషములు: వెండొకని - వెండి + ఒకని - ఇక్కడ ఇత్వసంధి చేయఁబడినది కనుక 'వెండి'ని ఏమ్యాదులలోఁ జేర్చుకొననగును 'ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగా నగును ' బాల సంధి 5 వేఱొకని అని పారాంతరము కూటము - కూటమి (రూపాం) తమ పొందున' కా కటమీఁదనిల్చునే - ఒక్కపొందునకేకాని తరువాత నిలువవనుట ఇందు విశేషము సామాన్యముచే సమర్థింపఁబడినది కావున అలంకారము అర్థాంతరన్యాసము

క చెఱ కీనపుచ్చ కటిముటిఁ
గఱచిన రస మానరానిగతిఁ దరుణులఁ జే
వెఱ వాపక సంగతి కే
డ్తెఱ సేసి మనోరథములు దీఱునె పడయన్ ? 159

అర్థము. చెఱకు + ఈనపుచ్చక = చెఱకుగడ నీననీక- ముదురనీక, అటిముటిన్ = శీఘ్రముగా, కఱచినన్ = కొఱికినచో,రసము, ఆనన్ + రాని - గతిన్ = త్రావ శక్యముగాని విధమున, తరుణులన్ = యువతులను, చేవెఱ = లజ్జ (?), పాపక = పోఁగొట్టక, సంగతికిన్ = సంగమమునకు, ఏడ్తెఱ + చేసి = వేగపడి, మనోరథములు = కోరికలు, పడయన్ + తీఱునె = పొందనగునా ?

తాత్పర్యము చెఱకుగడను ముదురనీక తొందరపడి కొఱికి చెఱకు రసమును బొందరాని విధమున యువతుల సిగ్గును బోఁగొట్టక సంగమమునకు వేగపడినచోఁ గోరికలు పొందనగునా ?కా దనుట

విశేషములు. అలంకారముపమ ఈ పద్యము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంస్కరణముల ననుసరించి వ్యాఖ్యానింపఁబడినది

క వరసతి సురతకళాగమ
పరిణతుఁ డగువిటునిఁగూడి పాయదు, మఱి డె
ప్పరమునఁ బాసియు నెన్నఁడు
నొరుఁ గవయదు జున్నుఁదిన్న యొట్టియపోలెన్ 160

అర్థము. వర - సతి = శ్రేష్ఠురాలయిన స్త్రీ, సురత - కళా + ఆగమ - పరిణతుఁడు = రతిశాస్త్రపారంగతుఁడు, అగు, విటునిన్, కూడి, పాయదు = విడువదు, మఱి, డెప్పరమునన్ = అనివార్యముగా, పాసియున్ = విడిచియు, ఎన్నఁడున్ = ఎప్పుడును, జున్నున్, తిన్న, ఒట్టియ + పోలెన్ = ఒంటె విధమున (?) ఒరున్ = ఇతరుని, కవయదు = కూడదు

తాత్పర్యము. శ్రేష్ఠురాలయిన స్త్రీ రతిశాస్త్రపారంగతుఁడగు విటునిఁగూడి విడిచిపెట్టదు అనివార్యముగా విడిచిపెట్టినను జున్నును దినిన యొంటెవలె, నెన్నఁడును ఇతరునిఁ గూడదు

విశేషములు అలంకార ముపమ ఒట్టియ = ఒంటె (?) - నిఘంటువులఁ గానరాదు

క తన మతి సతిరతి పతిమతి
కనుకూలముగా నిరీక్షణాలాపాలిం
గన చుంబన వరకరణా
సనవిద్యలఁ గూడునేని సమరతిఁ బడయున్ 161

అర్థము. తన - మతిన్ = తన తలఁపునందు, సతి - రతి = సతియొక్కరతి, పతి - మతికిన్ = భర్త తలఁపునకు, అనుకూలముగాన్ = తగినవిధముగా, నిరీక్ష విద్యలన్, నిరీక్షణ = చూచుట, ఆలాప = మాటలాడుట, ఆలింగన = కౌఁగిలించుకొనుట, చుంబన = ముద్దుపెట్టుకొనుట, వర - కరణ + ఆసన - విద్యలన్ = శ్రేష్ఠమయిన రతిబంధము, ఆసనము అనువిద్యలతో, కూడున్ + ఏనిన్, సమరతిన్, పడయున్ = పొందును

తాత్పర్యము . సతి రతి పతితలఁపున కనుకూలముగాఁ జూచుట, మాటలాడుట, కౌఁగిలించుకొనుట, ముద్దిడుకొనుట, రతిబంధము, ఆసనము అనువిద్యలతోఁ గూడినచో సమరతిని బొందును

ఆ మరణకాలమైన మతి జన్మదేశంబుఁ
దలఁచు నుష్ట మట్టి తలఁపుఁ దలఁపె ?
యధిపుఁ బాసినపుడ యలఁదుర వలవదె ?
మెలుఁత మెట్టఁబడినమీనువోలె. 162

అర్థము : ఉష్టము = ఒంటె, మరణ - కాలము + ఐనన్ = మరణ సమయము కాఁగా, మతి, జన్మ - దేశంబున్ = పుట్టిన దేశమును, తలఁచున్, అట్టి -తలఁపున్, తలఁపె ?, మెలుఁత = మెలఁత - స్త్రీ, మెట్టన్ = మెఱక ప్రదేశమునందు, పడిన, మీను + పోలెన్ = చేపవిధమున, అధిపున్ = భర్తను, పాసిన + అపుడు + అ = విడిచినప్పుడే, అలఁదురన్ + వలవదె = దుఃఖింపవలదా ?

తాత్పర్యము . ఒంటె మరణ సమయమున జన్మదేశమును దలఁచును అట్టి తలఁపును ఒక తలఁపా ? స్త్రీ మెఱకపైఁబడిన మీనువిధమున భర్తను వీడినప్పుడే దు ఖింపవలదా ?

క ఈగికిఁ గలుచు హరిద్రా
రాగం బది నిల్వ డెయిది రతి మేడ్పడి సం
భోగ గతిఁ గలుచు విటుని వి
రాగం బది నిల్చు భావరసజననంబై. 163

అర్థము ఈగికిన్ = ఈవికి, కలుచు = వలచు, హరిద్రారాగంబు + అది= ప్రేమవిషయమునఁ జంచలమైనది, నిల్వదు, ఎయిది = చేరి, రతిన్ = రతియందు, మేడ్పడి = మేడు + పడి = అజ్ఞతనొంది, సంభోగ - గతిన్ = సంభోగరీతిని, కలుచు= వలచునట్టి, విటుని - విరాగంబు + అది = విటుని విరక్తి, భావ - రస-జననంబు + ఐ = భావము, రసము అనివాని ఆవిర్భావము గలదయి, నిల్చున్

తాత్పర్యము . "ధనాసక్తిచే వలచుట హరిద్రారాగమువలెఁ ద్వరలో మాసిపోవును విటుఁడు విరాగియైనను నిర్వ్యాజరతసంపదగలదేని రసభావము లుద్దీపించుచుండును

విశేషములు. హరిద్రారాగము = పసుపురంగు గలది - ప్రేమ విషయమునఁ జంచల మయినది 'క్షణమాత్రానురాగశ్చ హరిద్రారాగ ఉచ్యతే'

క **విరహమునకంటె దుఃఖముఁ**
గర మిష్టముఁ గవయఁగాన్పుకంటె సుఖంబున్
బరికింప నొండు లే దిది
పరమార్థ మమర్త్య మర్త్య ఫణిలోకములన్ 164

అర్థము . విరహమున కంటెన్ = ఎడఁబాటుకంటెను, దుఃఖమున్ = కష్టమును, కరము + ఇష్టమున్ + మిక్కిలి ప్రియమైన దానిని, కవయన్ + కాన్పు - కంటెన్ = పొందఁగనుటకంటెను, సుఖంబున్ = సుఖమును, పరికింపన్ = ఆలోచింపఁగా, ఒండు= ఒకటి, లేదు, ఇది, అమర్త్య - మర్త్య - ఫణి - లోకములన్ = దేవతల, మనుజుల, నాగముల లోకములందు, పరమార్థము = యథార్థము

తాత్పర్యము ఎడఁబాటుకంటె దుఃఖమును, మిక్కిలి యిష్టమైన దానిని బొందఁగలుగుటకంటె సుఖమును ఆలోచింపఁగా నింకొకటి లేదు ఇది దేవతల, మనుష్యుల, నాగుల విషయమున యథార్థము

క ఇలఁ బుట్టదు, పుట్టియుఁ దా
నిలువదు, నిలిచియును నొక్కనిజమునఁ దిరమై
కలదాఁక నెయిద నేరదు,
వెలయాండుర కలుపు మగల విడుపును సతులన్ 165

అర్థము వెలయాండుర - కలుపున్ = వేశ్యలయొక్క వలపును, సతులన్ = స్త్రీలను, మగల - విడుపును = పురుషులత్యాగమును, ఇలన్ = భూమియందు, పుట్టదు, పుట్టియున్ = పుట్టినను, తాన్, నిలువదు, నిలిచియును, ఒక్క - నిజమునన్ = ఒకే స్థితితో,తిరము + ఐ = స్థిరమయి, కలదాఁకన్ = సర్వకాలమును, ఎయిదన్ + నేరదు = సాగఁజాలదు

తాత్పర్యము. వేశ్యల వలపును, పురుషులు స్త్రీలను త్యజించుటయును, భూమిలోఁ బుట్టదు పుట్టినను నిలువదు, నిలిచియును ఒకేస్థితితో స్థిరముగా సర్వకాలమును సాగఁజాలదు

తే వలను లేదేని రూపేల ? వలనుగొలుపు
రూపు లేదేని వలనేల ? రూపు వలనుఁ
గల కళావతిఁ గలిపించి కలిచియుండె
నేని కామసుఖంబెల్ల వానియదియు 166

అర్థము. వలను = చాతుర్యము, లేదు+ ఏనిన్ = లేకున్నచో, రూపు = అందము, ఏల ?, వలను, కొలుపు = కలిగించు, రూపు, లేదు + ఏనిన్, వలను, ఏల ? రూపున్, వలనున్, కల, కళావతిన్ = స్త్రీని, కలిపించి = వలచునట్లు చేసి, కలిచి + ఉండెన్ + ఏనిన్ = ప్రేమించియున్నచో, కామ - సుఖంబు + ఎల్లన్ = మన్మధసౌఖ్యమంతయును, వాని + అది + అ = వానిదే

తాత్పర్యము . "చతురత్వమును, రూపమును, విద్యయుఁ గలస్త్రీని పురుషుఁడు తన్నుఁబ్రేమించునట్లు నడచుకొనుచుఁ దానును ప్రేమించెనేని, వానికి మన్మధసౌఖ్యము సంపూర్ణమగును "

చ కరమభిలాషులై బహుముఖంబులఁ గూర్చినఁ బెద్దగాదు దా
రరగొన కిచ్చినం దఱుగ దన్యభవార్జితవిత్తసంఖ్య, సా
గరము నదీప్రవాహములఁ గప్పిన నెక్కడు మేర, కా పయో
ధర బడబానలార్కతతి ద్రావినఁ దక్కువ గాని మాడ్కియై 167

అర్థము సాగరము = సముద్రము, నదీ - ప్రవాహములన్ - నదుల ప్రవాహములతో, కప్పినన్ = కప్పినప్పటికిని, మేరకున్ + ఎక్కదు = హద్దు మీఱదు, ఆ -పయోధర - బడబా + ఆసల +ఆర్క-తతి = ఆ మేఘముల సమూహము, బడబాగ్ని, సూర్యుఁడు, త్రావినన్ = త్రాగినప్పటికిని, తక్కువ + కాని - మాడ్కి + ఐ = తగ్గిపోవని విధముగా, అన్య-భవ + ఆర్జిత - విత్త - సంఖ్య = పెఱపుట్టువులందు సంపాదింపఁబడిన సొమ్ముల సంఖ్య, కరము = మిక్కిలి, అభిలాషలు + ఐ = కోరికగలవారయి,బహు-ముఖంబులన్ = అనేకవిధముల, కూర్చినన్ = ప్రోగుచేసినప్పటికిని, పెద్ద + కాదు = అధికముగాదు, తారు = వారు, అర + కొనక = సందేహింపక, ఇచ్చినన్ = దానము చేసినను, తఱుగదు = తగ్గదు

అర్థము. నదీ ప్రవాహములు చేరినను సముద్రము మర్యాద నతిక్రమింపదు మేఘములు, బడబాగ్ని, సూర్యుఁడు త్రాగినను తఱుగదు అట్లే పెఱపుట్టువులం దార్జించిన ధనము కోరికతో నెన్నోవిధములఁ గూర్చినను పెరుఁగదు వెనుదీయక దానముచేసినను దఱుగదు

విశేషములు. అలంకారము ఉపమ

క. **ప్రాలు గలనాఁడు ధాన్యము**
పోలె సుసేవ్యుఁడగు నరుఁడు పొలుపుగ, మేనం
బ్రాలు దొలంగుడు నముకయుఁ
బోలె నసేవ్యుఁడగు నెట్టి పురుషుండైనన్ 168

అర్థము. ప్రాలు = బియ్యము, సామర్థ్యము, కల - నాఁడు = ఉన్నప్పుడు, ధాన్యము + పోలెన్ = ధాన్యము వలె, నరుఁడు = మనుష్యుఁడు, పొలుపుగన్ = ఒప్పుగ, సుసేవ్యుఁడు = బాగుగా సేవింపఁదగినవాఁడు - మిక్కిలి గౌరవింపఁదగినవాఁడు, అగున్, మేనన్ = శరీరమున - లోపల అని భావము, ప్రాలు = బియ్యము, సామర్థ్యము, తొలంగుడున్ = పోయినంతనే, ఎట్టి - పురుషుండు + ఐనన్ = ఎటువంటి పురుషుఁడయినను, ఉముకయున్ + పోలెన్ = పొట్టువలె, అసేవ్యుఁడు + అగున్ = సేవింపఁదగనివాఁడు - గౌరవంపఁదగనివాఁడు అగును

తాత్పర్యము. బియ్యముతోఁ గూడినప్పుడు వడ్లవలె, మనుష్యుఁడు సామర్థ్యమున్నప్పుడు గౌరవింపఁదగినవాఁడుగను బియ్యము తొలఁగినప్పుడు పొట్టువలె, ఎట్టివాఁడయినను సామర్థ్య ముడిగినప్పుడు గౌరవహీనుఁ డగును

విశేషములు. అలంకార ముపమ - శ్లేషానుప్రాణితము ప్రాలు (బహువ)- ప్రాయి (ఏకవ), ప్రాయి = బియ్యము, శక్తి, సామర్థ్యము బియ్య మను నర్థమున ప్రాయిశబ్దము బహువచనాంతముగానే ప్రయోగింపఁబడుచున్నది సమాసములలో నేకవచనాంతముగాఁ బ్రయుక్తమగుచున్నది ఉదా ననుఁబ్రాయి ఉముక - ఊఁక (రూపాం)

ఉ **వాలిక లంబుజాక్షములు, వంకలు భ్రూలత, లంద డెందముల్**
సాలఁగ నున్పు, లంద వలిసన్నులు సిక్కనిఱాలు సూడఁగా
బాలసమంద చిత్రరతిఁ బ్రౌఢలు గావున నొక్కభంగిఁ బాం
చాలున కైనఁ గాంతల నిజం బిది యిట్టిది నాఁగఁజాలునే ? 169

అర్థము. చూడఁగాన్, అంబుజ + అక్షములు = పద్మములవంటి కన్నులు, వాలికలు = దీర్ఘములు, భ్రూ-లతలు = బొమతీవలు, వంకలు = వక్రములు, అందున్ + అ = అంద = అందే, డెందముల్ = హృదయములు, చాలఁగన్ = మిక్కిలి, నున్పులు = నున్ననివి, అంద, వలి-చన్నులు = గుండ్రని స్తనములు, చిక్కని = కఠినములైన, ఱాలు, బాలసము = బాలిశము - మౌర్ఖ్యము, అంద, చిత్ర - రతి = వింత సురతమునందు, ప్రౌఢలు = నేర్పుగలవారు, కావునన్, ఒక్క - భంగిన్ = ఒక్కరీతిగా, పాంచాలునకున్ + ఐనన్ = పాంచాల జాతిపురుషునకైనను, కాంతల = స్త్రీల, నిజంబు = స్వరూపము, ఇట్టిది, నాఁగన్ + చాలునే = అనుటకు శక్తియున్నదా ?

తాత్పర్యము . నేత్రపద్మములు దీర్ఘములు, బొమతీవలు వక్రములు, హృదయములు నున్ననివి, వలుదకుచములు కఠినశిలలు, గుణము బాలిశము - మౌర్ఖ్యము, చిత్రమైన సురతమునందుఁ బ్రౌఢిగలవారు కావున స్త్రీజనముల స్వరూపమిట్టిదని రసతత్త్వజ్ఞుఁడగు పాంచాలజాతి పురుషుఁడైన నెఱుఁగఁజాలఁడు

విశేషములు : అక్షము = కన్ను - ఇంద్రియార్థకమైనను లక్షణచేఁ గంటియందు వర్తించుచున్నది అంబుజాక్షములు - అక్ష్ణంబుజములు అని ఉపమానోత్తరపదముగా నుండవలయును బాలసము (వికృతి) - బాలిశము (ప్రకృతి), 'చిత్తరతి'యను పారముకంటెఁ 'జిత్రరతి' యనుపారము మేలయినదిగా స్వీకరింపఁబడినది పాంచాలుఁడు - కామశాస్త్రమున నొకజాతి పురుషుండు

వ **అని యి ట్లనేకప్రకారమంబులం గామతత్త్వమతభేదంబులఁ గొన్ని**
వాదంబులు సేయుచుం దమతమవలఁకు లెన్నుచుండి రంత
వితవిటీజనంబులు రతికేళీ రతికలహోనునయాద్యనేకవిధ నిధువన క్రియలం
బ్రవర్తింపఁదొడంగిన 170

అర్థము అని, ఇట్లు, అనేకప్రకారంబులన్, కామ - తత్త్వ - మత-భేదంబులన్ = మన్మథశాస్త్ర మత భేదములందు, కొన్ని - వాదంబులు, చేయుచున్, తమతమ - వలఁకులు = నేర్పులు, ఎన్నుచున్ + ఉండిరి, అంతన్, విట - విటీ - జనంబులు, రతి - కేళీ = రతిక్రీడలు, రతి - కలహ, అనునయ + ఆది + అనేక - విధ = అనునయించుట మున్నగు పెక్కురీతులయిన, నిధువన - క్రియలన్ సంభోగక్రియలయందు, ప్రవర్తింపన్ + తొడంగినన్ = ప్రవర్తింపఁబూనిన

తాత్పర్యము . అని యిట్లు పెక్కురీతుల మన్మథశాస్త్ర భేదములందుఁ గొన్ని వాదములు చేయుచుఁ దమతమ నేర్పులు గణించుచుండిరి అంత విటవిటీజనులు రతిక్రీడ, రతికలహము, అనునయము మున్నగు పలువిధములయిన సంభోగ క్రియలయందుఁ బ్రవర్తింపఁబూనిన తరువాతి పద్యముతో నన్వయము

క రాగరసాంబుధిఁ గామ ర
సాగణితామృతము వడయునని మథియింపం
గా గర్జిల్లురవం బనఁ
గా గళరుతు లెసఁగె లంజికావాటికలన్ 171

అర్థము . రాగ - రస + అంబుధిన్ = ప్రేమరసమనెడి సముద్రమును, కామ- రస + అగణిత + అమృతము = మన్మథరసము అనెడి అధికమైన అమృతము, పడయున్ + అని = లభించునని, మథియింపంగాన్ = త్రచ్చఁగా, గర్జిల్లు - రవంబు + అనఁగాన్ = ఉఱిమెడుధ్వని యనునట్లు, లంజికా - వాటికలన్= వేశ్యాగృహములందు, గళ-రుతులు = కంఠధ్వనులు, ఎసఁగెన్ = అతిశయించెను

తాత్పర్యము. ప్రేమరసమనెడి సముద్రమును మన్మథరసమనెడి అధికమైన అమృతము లభించునని మథింపఁగా, ఉఱుములచప్పుడనెడి కంఠధ్వనులు వేశ్యల గృహములం దతిశయించెను

విశేషములు . అలంకారము రూపకము

మ గళనాదంబులు, శుష్కరోదనముఁ, జీత్కారంబు, హుంకారసం
కలితాహాసముఁ, దాడనప్రహరణోగ్రధ్వానముం, జంచల
ద్వలయారావము, భూషణస్వనము, నా వారాంగనామందిరా
వలి నొక్కుమ్మడి మ్రోసెఁ గామకలహోద్యద్యారవాభంబులై 172

అర్థము. ఆ - వార + అంగనా - మందిర + ఆవలిన్ = ఆ వేశ్యాగృహముల వరుసయందు, గళ - నాదంబులున్ = కంరధ్వనులును, శుష్క - రోదనమున్ = కఠోరమైన యేడ్పును, చీత్కారంబున్ = గాడిదమున్నగు వానివంటి ధ్వనియును, హుంకార - సంకలిత + ఆహాసమున్ + హుంకార ధ్వనితో గూడిన అట్టహాసమును, తాడన - ప్రహరణ + ఉగ్ర - ధ్వానమున్ = కొట్టుటవలని భయంకరధ్వనియును, చంచలత్ + వలయ + ఆరావమున్ = మిక్కిలి చలించుచున్న హస్తపాదాభరణముల ధ్వనియును, భూషణ - స్వనమున్ = అలంకారముల చప్పుడును, కామ - కలహ + ఉత్ + వాద్య + ఆరవ + ఆభంబులు + ఐ = మన్మథయుద్ధమునందలి గొప్ప వాద్యములయొక్క ధ్వనులతో సమానము లయి, ఒక్క + ఉమ్మడిన్ = ఒక్కపెట్టున మ్రోసెన్ = ధ్వనించెను

తాత్పర్యము : ఆ వేశ్యాగృహముల వరుసయందుఁ గంరధ్వనులును, కఠోరములయిన యేడ్పులును, గాడిదమున్నగువాని ధ్వనులవంటి ధ్వనులును, హుంకారముతోఁ గూడ అట్టహాసమును, కొట్టుటవలని భయంకరధ్వనియును, మిక్కిలి చలించు హస్తపాదాభరణముల ధ్వనియును, అలంకారముల ధ్వనియును, మన్మథయుద్ధమునందలి పెద్దవాద్యముల చప్పుడుతో సమానమయి ఒక్కపెట్టున మ్రోసెను

తే నెగడు పేర్చిందు లను విడినీరఁ బ్రియుఁడు
కరజ హలముల మైపూఁతఁ గలయఁ గలఁచి
కామబీజంబు లలుక వేగమున మొలచు
మొలక లన మేన నిండ ముత్పులక లెసఁగె 173

అర్థము . నెగడు = నిండు, పేర్చిందులు + అను - విడినీర్‌న్ చెమరుబిందువులనెడి కట్టిననీటియందు, ప్రియుఁడు, కరజ - హలములన్ = గోరులనెడి నాగండ్లచే, మై-పూఁతన్ = కలపమును, కలయన్ = బాగుగా, కలఁచి, కామ - బీజంబులు = వలపు అనెడి విత్తనములు, అలుకన్ = చల్లఁగా, వేగమునన్ = శీఘ్రముగా, మొలచు = మొలచునట్టి, మొలకలు + అనన్ = మొక్కలనఁగా, మేనన్ = శరీరమున, నిండన్ = నిండుగా, ముత్పులకలు (ముద్ + పులకలు) = సంతోషమువలని గగుర్పాటులు, ఎసఁగెన్ = అతిశయించెను

తాత్పర్యము . నిండిన చెమట బిందువులనెడి కట్టిననీటఁ బ్రియుఁడు గోరులనెడి నాగండ్లచే మైపూఁతను బాగుగాఁ గలఁచి వలపనెడి విత్తనములను

చల్లఁగా శీఘ్రముగా మొలచు మొక్కలా యనునట్లు సంతోషమువలని గగుర్పాటు శరీరమునిండ నతిశయించెను

విశేషములు అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష

క **తరుణి పదాహతిఁ బతి మై**
నురుతర పులకాంకురంబు లొగి నెగసెను ద
చ్చరణ స్పర్శన సుఖ వి
స్ఫురణ నశోకాత్ముఁడగుట సూచించు క్రియన్ 174

అర్థము . తరుణి = యువతియొక్క, పద + ఆహతిన్ = పాదముల దెబ్బచే, పతి = ప్రియునియొక్క, మైన్ = శరీరమునందు, ఉరుతర - పులక + అంకురంబులు = అధికమైన గగుర్పాటు అనెడి మొలకలు, తద్ + చరణ - స్పర్శన- సుఖవిస్ఫురణన్ = ఆమె పాదముల తాఁకిడివలని సుఖముయొక్క విస్ఫూర్తిచే, అశోక + ఆత్ముఁడు = అశోకస్వరూపుఁడు - శోకములేనివాని స్వరూపము గలవాఁడు - అశోకవృక్షస్వరూపమైనవాఁడు, అగుటన్ = అగుటను, సూచించు - క్రియన్ = సూచించు విధమున, ఒగిన్= బాగుగా, ఎగసెను = లేచెను

తాత్పర్యము. యువతి పాదతాడనముచేఁ బ్రియుని శరీరమున నధికముగా గగుర్పాటనెడి మొలకలు, ఆమె పాదస్పర్శసౌఖ్యముచే అశోకాత్ముఁడగుటను సూచించునట్లు బాగుగా లేచెను

విశేషములు . అలంకారము ఉత్ప్రేక్ష అది శ్లేషానుప్రాణితము రూపకోత్థాపితము - అశోకాత్ముఁడనుచో శ్లేషము పులకాంకురంబు లనుచో రూపకము స్త్రీచరణాహతిచే నశోకవృక్షము చిగుర్చును 'పాదాహతః ప్రమదయా వికస త్యశోకః '

తే **ఒక్క నెపమును లేక న న్నున్నయట్టె**
పాసిపోయెదు, పోయిన బాస సూడ
నలుకతెఱఁగు గా దిది యేమి' యనుచు నధిపు
చేయు విడుచుచుఁ గోమలి జీవి విడిచె. 175

అర్థము : ఒక్క - నెపమును = ఒక్క సాకయినను, లేక, నన్నున్, ఉన్నయట్టె= ఉన్నట్లుగనే, పాసిపోయెదు = విడిచి వెడలెదవు, పోయిన - బాస+

చూడన్ = పోయిన నిమిత్తము చూడఁగా, అలుక - తెలుఁగు + కాదు = కోపించిన చందము గాదు, ఇది + ఏమి, అనుచున్, అధిపు - చేయు = భర్త చేయి, విడుచుచున్, కోమలి = స్త్రీ, జీవిన్ = జీవమును - ప్రాణమును, విడిచెన్

తాత్పర్యము. ఒక్క సాకయినను లేకయే నన్ను ఉన్నట్లుగనే విడిచిపోయెదవు నీవు పోయిన నిమిత్తము చూడఁగా నీవు కోపించి పోయినట్లు కనఁబడదు ఇది యేమి ?' యనుచుఁ గోమలి భర్త చేయి విడుచుచుఁ బ్రాణము విడిచెను

శా **భ్రూలాస్యం, బధరోష్ఠకంపము, ముఖాంభోజాతసంరంభ, మా**
లోలాలోకనవక్త్ర మొక్కొకఁడ చాలున్ నొంప, నీ యల్క వోఁ
గా లీలావతి ! దీనిపై మగుడ నీ కన్నీరు లింకేల ? న
న్నేలా యొల్లక పుష్పబాణునకుఁ బట్టీఁజూచితే నిర్దయన్ 176

అర్థము. లీలావతి = విలాసినీ ! భ్రూ-లాస్యంబు = కనుబొమల నాట్యము, అధర + ఓష్ఠ - కంపము = క్రింది పెదవి అదరు, ముఖ + అంభోజాత - సంరంభము= పద్మమువంటి ముఖముయొక్క సంక్షోభము, ఆ - లోల+ ఆలోకన వక్త్రము = చలించు చూపులు గల ఆ ముఖము, ఒక్కొకఁడు + అ (ఒక్క + ఒకఁడు + అ) = ఒక్కొక్కటే, నొంపన్ = బాధించుటకు, చాలున్ = సమర్థము, నీ + అల్క + పోఁగాన్ = నీ కోపమునకుఁ బైపెచ్చు, దీనిపైన్ = కోపమునకుఁబైఁగా, మగుడన్ = మరల, నీ - కన్నీరులు (కను+నీరులు) + ఇంకన్ + ఏల = ఇంకను నీవు కన్నీరు నింపవేల ? నన్నున్, ఏలా = ఏల = ఎందులకు, ఒల్లక = వలవక, పుష్పబాణునకున్ = పూవులు బాణములుగాఁ గలవానికి - మన్మధునకు, నిర్దయన్- దయలేకుండ, పట్టు + ఈన్ = పట్టి యిచ్చుటకు, చూచితే = చూచితివా !

తాత్పర్యము: ఓ విలాసినీ ! నీవు నాపైఁ గోపము నూనితివి ఆ స్థితిలో నీ కనుబొమలు నాట్యము చేయుచున్నవి నీ క్రిఁబెదవి కంపించుచున్నది నీ ముఖ పద్మము సంక్షోభము చెందినది నీ ముఖమునఁ జూపులు చలించుచున్నవి అవి ఒక్కొక్కటే నన్ను బాధింపసమర్థమగును అట్టి కోపమునకుఁదోడు నీవు కన్నీరు గూడ నింపనేల ? న న్నొల్లక దయారహితవై మన్మధునకుఁ బట్టి యీ నెంచితివా?

విశేషములు. అలంకారము స్వభావోక్తి

మ **'ఒక యన్యాయము లేదె యెవ్వరికి నే నోటంబుతో మ్రొక్క, నో**
డక లె, మ్మిప్పటి కింతపైఁపు, మిటు కష్టంబే మనంబింక నా
లికిఁ గట్టాయము సేయుచుండు డిది మేలే నీ ? కనుం బుప్పసా
యకతాపంబు సహింప కోర్తు సురతైకాసక్తి దీనాస్యవై 177

అర్థము . ఓర్తు = ఒకామె, పుష్ప - సాయక - తాపంబు = పువ్వులు బాణములుగాఁగలవాని - మన్మథుని - తాపము, సహింపక = ఓర్వక, సురత + ఏక + ఆసక్తిన్ = రతియందే కల కోరికతో, దీన + ఆస్య + ఐ = విచారముతోడి ముఖము గలదయి, ఒక - అన్యాయము - లేదె = ఒక దోషము లేదా ? ఎవ్వరికిన్, ఏను = నేను, ఓటంబుతోన్ = ఓడుటతో, మ్రొక్కన్ = మ్రొక్కును, ఓడక = సందేహింపక, లెమ్ము, ఇప్పటికిన్, ఇంత-సైఁపుము = ఈపాటి సైరింపుము, ఇటు = ఈ విధముగా, ఇంకన్, మనంబు = మనస్సు, కష్టంబే = కష్టమా ? ఆలికిన్ = భార్యకు, కట్టాయము =నిర్బంధము, చేయుదున్ + ఉండుడు = చేయుచుండుట, ఇది, నీకున్, మేలే = మంచిదా, అనున్

తాత్పర్యము . ఒక యింతి మన్మథబాధ సహింపలేక రతిక్రియయందే' కోరిక గలదయి, దీనవదనయై 'నీ కొక తప్పులేదా ? నే నెవ్వరికిని ఓడిపోయి మ్రొక్కను నీవు జంకక లెమ్ము ఇప్పటి కీపాటి సహింపుము ఇట్లీక మనస్సునకుఁ గష్టమా ? భార్యకు నిర్బంధము గలిగించుట నీకు మంచిదా ?' యని పలుకును

తే విరహకాలంబు మరుబాణవితతిఁ గొన్న
గంటు లన్నియుఁ బ్రియుఁగూడి కైపు మిగిలి
పెనఁగునెడ నిట్టు లవిసె నా వనిత మేనఁ
గలయ నవనఖదంతవిక్షతము లడరె 178

అర్థము విరహ - కాలంబు = ప్రియునెడఁబాసిన కాలమున, మరు-బాణ-వితతిన్ = మన్మథుని బాణముల సమూహముచే, కొన్న = పొందిన, గంటులు + అన్నియున్ = గాయములన్నియు, ప్రియున్ + కూడి = ప్రియుని గూడి, కైపు-మిగిలి = ఉద్రేక మతిశయించి, పెనఁగు + ఎడన్ = రతిక్రియ సలుపు సమయమున, ఇట్టులు, అవిసెన్ + నాన్ = పగిలె ననునట్లు, వనిత - మేనన్ = స్త్రీ శరీరమున, కలయన్ = అంతటను, నవ - నఖ - దంత - విక్షతములు = క్రొత్త గోటి పంటి నొక్కులు, అడెరెన్ = అతిశయించెను

తాత్పర్యము . ప్రియు నెడఁబాసిన సమయమున మన్మథబాణ సమూహముచే నైన గాయములన్నియును బ్రియుని గూడి ఉద్రేకమతిశయించి రతిక్రియ జరపునప్పు డీ రీతిగాఁ బగిలెనా యనునట్లు ఇంతి శరీరమున నంతటను గ్రొత్త గోటి పంటి గంటు లతిశయించెను

విశేషములు : అలంకార ముల్రోక్ష 'విరహతాపంబు' అను సా అ ప్రతి పారముకంటె, విరహ కాలంబు' అను మా రా ప్రతి పారము మే లపించుటచే నది స్వీకరింపఁబడినది

సీ అలక లన్ తరుణుల నార్చుచుఁ దా రాడి
చూపు నర్తకు లన సుడిసె బొమలు
గళనాద మను ఘనగాయని సాహ్యాళు
లనఁ గ్రమ్మ్ము నూర్పు లందంద చెలఁగె
వలిసన్ను లను కోకముల నూఁచి యాడు లేఁ
దరఁగలు నాఁగ ముత్తరఁగ లెసఁగె
వర లంబనము లనువాద్యంబులకు నొత్తు
వెట్టు తాళములనఁ బేర్ల తోడ

తే మొనసి మొలనూలి మువ్వల మొరప మమరె
మసఁగు విపరీతరతి యను మలయపవన
వేగమున సోలియాడు లేఁదీఁగ యనఁగ
నమరి కౌఁదీఁగ వెస నసియాడుచుండె 17

అర్థము . అలకలు = ముంగురులు, అన్ = అను, తరుణులన్ = యువతులను, ఆర్చుచున్ = ఆడించుచు, తారు = తాము, ఆడి - చూపు, నర్తకులు = నట్టువరాండ్రు, అనన్, బొమలు, సుడిసెన్ = చలించెను

గళ - నాదము = కంఠధ్వని, అను, ఘన - గాయని = గొప్ప పాటకత్తె యొక్క, సాహ్య + ఆళులు = తోడి చెలికత్తెలు, అనన్, క్రమ్ము = ఆక్రమించు, ఊర్పులు = నిశ్శ్వాసములు, అందంద + మఱిమఱి, చెలఁగెన్ = ఒప్పెను

వలి + చన్నులు = గుండ్రని స్తనములు, అను = అనెడి, కోకములన్ = చక్రవాకములను, ఊఁచి+ఆడు = ఊగించి ఆడునట్టి, లేఁదరఁగలు (లేఁత + తరఁగలు) = చిన్న అలలు, నాఁగన్ = అనునట్లు, ముత్తరఁగలు (మూఁడు + తరఁగలు) = మూఁడు వళులు, ఎసఁగెన్ = ఒప్పెను

వర - లంబనములు = శ్రేష్ఠములైన కంఠహారములు, అను, వాద్యంబులకున్, ఒత్తు +పెట్టు = రంజనమిచ్చెడు, తాళములు + అనన్ = తాళము లనఁగా, పేర్ల తోడన్ = హారములతో, మొనసి = ఒప్పి, మొలనూలి = కటి సూత్రమునందలి, మువ్వల = కింకిణుల, మొరపము = ధ్వని, అమరెన్ = ఒప్పెను

మసఁగు = విజృంభించు, విపరీత - రతి = పురుషాయితము, అను, మలయ - పవన - వేగమునన్ = మలయపర్వతమునుండి వచ్చు గాలియొక్క

వేగముచే, సోలి + ఆడు = పరవశమయి, ఆడునట్టి, లేదీఁగ (లేఁత + తీఁగ), అనఁగన్, అమరి = ఒప్పి, కొఁదీఁగ (కొను + తీఁగ) = తీఁగవంటి నడుము, వెసన్ = శీఘ్రముగా, అసియాడుచున్ + ఉండెన్ = కదలుచుండెను

తాత్పర్యము ముంగురులనెడి యువతులను ఆడించుచుఁ దాము ఆడిచూపెడి నట్టువరాండ్రన బొమలు చలించెను కంరధ్వని యనెడు గొప్ప పాటకత్తె తోడిచెలికత్తెలన వ్యాపించు శ్వాసములు మటిమటి యొప్పెను గుండ్రని స్తనములనెడి చక్రవాకములను ఊఁగించి ఆడు చిన్నలలన మూఁడు వళు లొప్పెను మేలి కంరహారములనెడి వాద్యములకు రంజన మిచ్చెడు తాళములన హారములతో నొప్పి మొలనూలి మువ్వల ధ్వని యొప్పెను చెలరేఁగు పురుషాయిత మనెడి మలయవాయువు వేగముచే సోలియాడు లేదీఁగ యన నొప్పి తీఁగవంటి నడుము వేగముగాఁ గదలుచుండెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష

లేదీఁగ = లేఁత + తీఁగ, కొఁదీఁగ = కొను + తీఁగ - ప్రాఁతాది సంధి (బాల సంధి 36) ద్రుతకార్యము (బాల సంధి 16, 17)

మ గళనాదంబులు మంజుగానములుగాఁ గాంచీలసత్కింకిణీ
కలనాదంబులు హృద్యవాద్యములుగాఁ గాంతోరుపీరోన్నత
స్థలరంగమ్ములఁ గాముఁ డన్నటకుఁ డోజంగూడ నాడింపఁగా
లలనాపాత్రము లాడి రొప్ప రతిలీలాలాస్యలోలాస్యలై. **180**

అర్థము. గళ - నాదంబులు = కంరధ్వనులు, మంజు - గానములు + కాన్= మనోహరములైన గానములు కాఁగా, కాంచీ - లసత్ - కింకిణీ - కల - నాదంబులు = మొలనూలియందుఁ బ్రకాశించుచున్న, మువ్వల, అవ్యక్త మధురములయిన ధ్వనులు, హృద్యవాద్యములు + కాన్ = మనోహరములైన వాద్యములు కాఁగా, కాంతా + ఊరు - పీర + ఉన్నత - స్థల - రంగమ్ములన్ = కాంతలయొక్క - కటిస్థలములనెడి యెత్తయిన రంగస్థలములందు, కాముఁడు= మన్మథుఁడు, అన్ = అను, నటకుఁడు = నటుఁడు, ఓజన్ = నేర్పుతో, కూడన్=కూడునట్లు, ఆడింపఁగాన్, లలనా - పాత్రములు = స్త్రీలనెడు నటులు, రతి -లీలా - లాస్య - లోల + ఆస్యలు + ఐ = సంభోగక్రీడ యనెడు నాట్యముచేఁ జలించు ముఖములు గలవారయి, ఒప్పన్ = ఒప్పఁగా, ఆడిరి = నాట్యము చేసిరి

తాత్పర్యము. కంఠధ్వనులు మనోహరగానములుగను, మొలనూలి మువ్వల అవ్యక్త మధురధ్వనులు హృద్యములైన వాద్యములుగను, స్త్రీల ఊరుపీఠములనెడి ఉన్నతరంగస్థలములందు మన్మథుఁడనెడి నటుఁడు నేర్పుతోఁ గూడున ట్లాడింపఁగా స్త్రీలనెడు నటులు రతిక్రీడయను నాట్యముచేఁ జలించు ముఖములు గలవారయి ఆడిరి

విశేషములు. అలంకారము రూపకము

వ ఇట్లు కాముకకామినీజనంబు లనవరత సుఖసుధారస ప్లవ ప్లావితులగుచుండి రంత 181

అర్థము. ఇట్లు, కాముక - కామినీ - జనంబులు = వీటులును, వీటురాండ్రును, అనవరత - సుఖ - సుధా - రస - ప్లవ - ప్లావితులు = ఎడతెగని రతిసౌఖ్యమనెడి అమృతరసముయొక్క వెల్లువయందుఁ దేలింపఁబడినవారు, అగుచున్ + ఉండిరి, అంతన్

తాత్పర్యము: ఇట్లు వీటీవీటజనములు ఎడతెగని రతి సౌఖ్యమనెడి అమృతరస ప్రవాహమునందుఁ దేలినవారగుచుండిరి పిమ్మట - తరువాతి పద్యముతో నన్వయము

చ అరుణకరోత్కరాభిహతి నన్కనుకయ్యెడు సాంద్రచంద్రికా
తరమునఁ దూఱితూఱి నవతామరసోత్థసుగంధసద్రజః
పరివృతమై నయంబునఁ బ్రభాతసమీరణ మంత వీచెఁ ద
త్పురి సురతశ్రమాకులవధూతనుఘర్మకణాపనోదియై 182

అర్థము. అంతన్ = పిమ్మట, ప్రభాత - సమీరణము = ఉదయ కాలపు వాయువు, అరుణ - కర + ఉత్కర + అభిహతిన్ = సూర్యుని కిరణముల సమూహముయొక్క దెబ్బచే, అన్కనుకు + అయ్యెడు = పల్చనగాక, గట్టిగాక, జాఱు పదనగు, సాంద్ర - చంద్రికా + అంతరమునన్ = దట్టమైన వెన్నెల నడుమ, తూఱి - తూఱి = చొచ్చి చొచ్చి, నవ - తామరస + ఉత్థ - సుగంధ - సత్ + రజస్(ఃఁ) + పరివృతము + ఐ = అప్పుడే వికసించిన తామరలనుండి లేచిన పరిమళముతోడి మేలిపుప్పొడులచే ఆవరింపఁబడినదయి, తద్ + పురి నోదియై, తద్ + పురి = ఆ నగరమునందలి, సురత - శ్రమ = సంభోగము వలని అలయికచే, ఆకుల = కలఁతఁజెందిన, వధూ = స్త్రీలయొక్క, తను = శరీరములందలి, ఘర్మ - కణ + అపనోది + ఐ = చెమరుబిందువులయొక్క (ను) తొలఁగించునదియై, నయంబునన్ - మృదువుగా, వీచెన్

తాత్పర్యము అంత నుదయకాలపువాయువు సూర్యకిరణముల దెబ్బచే బలుచనగాక గట్టిగాక జాటుపదనైనవెన్నెల నడుమఁ జొచ్చిచొచ్చి అప్పుడే వికసించిన తామరలనుండి లేచిన పరిమళముతోడి పుప్పొడులచే నావరింపఁబడినదయి, ఆ యూరి సంభోగశ్రమాకులలైన స్త్రీల మేనుల చెమరు బిందువులను దొలఁగించునదియై మృదువుగా వీచెను

విశేషములు మంచిగాలి మాంద్యము, సౌరభ్యము, శైత్యము అను మూఁడు గుణములతోఁ గూడియుండును ఇటఁ బ్రభాత వాయువునకు సాంద్రచంద్రికాంతరమునఁ దూఱుటచే మాంద్యమును, నవతామరసోత్థసద్రజఃపరివృతమగుటచే సౌరభ్యమును, వధూతనుఘర్మకణాపనోది యగుటచే శైత్యమును గలిగెను

క ఈ హరుఁ డగసుత నేఁడు వి
వాహంబై పడయు మాకు వల్లభు నని యు
త్సాహమునఁ జెలఁగుగతిఁ బురి
గేహంబులఁ జెలఁగెఁ గలయఁ గృకవాకంబుల్ 183

అర్థము ఈ - హరుఁడు = ఈ శివుఁడు, నేఁడు = ఈ దినము, అగసుతన్ = కొండకూఁతును - పార్వతిని, వివాహంబు + ఐ = పెండ్లియై, మాకున్, వల్లభున్ = నాయకుని, (కుమారస్వామిని), పడయున్ + అని = సంపాదించునని, ఉత్సాహమునన్, చెలఁగు - గతిన్ = విజృంభించువిధమున, పురి-గేహంబులన్ = నగరి యిండ్లయందు, కృకవాకంబుల్ = కోళ్ళు - నెమళ్ళు, కలయన్ = అంతటను, చెలఁగెన్ = మ్రోసెను

తాత్పర్యము . ఈ యీశ్వరుఁడు నేఁడు పార్వతిని బెండ్లియై మాకు నాయకుని సంపాదించునని యుత్సాహముతో విజృంభించెనా యనునట్లు, ఆ యూరి యిండ్లలోని కోళ్ళు - నెమళ్ళు అంతటను మ్రోసెను

విశేషములు. పార్వతీశ్వరుల కొడుకగు కుమారస్వామి కృకవాకుధ్వజుఁడు శిఖి వాహనుఁడు, కావుననే వాని కంత యుత్సాహ మనుట అలంకార ముత్ప్రేక్ష కృకవాకు వని ఉకారాంత శబ్దమేకాని కృకవాకమని అకారాంత శబ్దము గానరాదు

క తొలుకొని కుక్కుట రవములు
సెలఁగుడుఁ దదనంతరంబ చెఱువుల నదులం
గొలఁకుల వనముల నత్యవి
రలమై బహువిహగనివహరవములు సెలఁగెన్ 184

అర్థము . కుక్కుట - రవములు = కోళ్ళ ధ్వనులు, తొలుకొని = ప్రారంభమయి, చెలఁగుడున్ = ధ్వనించినంతనే, తద్ + అనంతరంబు + అ = వెంటనే, చెఱువులన్ నదులన్, కొలఁకులన్, వనములన్ = తోఁటలందును, బహు - విహగ- నివహ - రవములు = పెక్కు పక్షుల సమూహముల ధ్వనులు, అతి + అవిరలము + ఐ = మిక్కిలి అధికమయి, చెలఁగెన్ = మ్రోసెను

తాత్పర్యము . కోళ్ల ధ్వనులు మొదట మ్రోసినంతనే చెఱువులందును, నదులయందును, కొలఁకులందును, తోఁటలందును పెక్కుపక్షులగుంపుల ధ్వనులు మిక్కిలి అధికమయి మ్రోసెను

విశేషములు: కొలఁకులు - కొలను + లు 'కలన్వాదుల నువర్ణంబు కుజ్ఞగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు ' బాల ఆచ్చిక 18 అత్యవిరల= అతి + అవిరల - యణాదేశసంధి

క మెలఁతుకకు ముదంబున జే
కులపైఁ బడియుండి మాపు కుముదంబుల, రే
పలరుడు నలి తామరలను
నలుగడఁ బఱతెంచి మూఁగు నలిఁ దామరలన్ 185

అర్థము . మెలఁతుకకున్ = స్త్రీకి - ఆఁడు తుమ్మెదకు, ముదంబునన్ = సంతోషముతో, మాపు = రాత్రి, కుముదంబులన్ = కలువలందు, జేకులపైన్ = జేకులమీఁద, పడియుండి, అలి = తుమ్మెద, రేపు = ప్రాతఃకాలము, అలరుడున్ = ఒప్పినంతనే, తాన్ = తాను, మరలను = తిరిగి, నలిన్ = ఉత్సాహముతో నలుగడన్ = నాలుగు దిక్కులను, పఱతెంచి = వచ్చి, తామరలన్ = పద్మములను, మూఁగున్

తాత్పర్యము : కలువలు రాత్రి వికసించును పద్మములు ప్రొద్దున వికసించును తుమ్మెద తన పెంటికి సంతోషమగునట్లు రాత్రి కలువలందు జేకులపైఁ బడియుండి తెల్లవాఱఁగనే మరల నాలుగు దిక్కులనుండి యుత్సాహముతో వచ్చి తామరలపై మూఁగును

విశేషములు : మగతుమ్మెద రాత్రి కలువరేకులపైఁ బడియుండుటయుఁ బ్రొద్దునఁ దామరలను జేరుటయుఁ దన పెంటి సంతోషముకొఱకే మెలఁతుకకు-ముదంబున - అని విభాగము అలరుడున్ + అలి = అలరుడు నలి,

మూఁగున్+నలిన్= మూఁగు నలిన్, స్థిరపరకత్వమున ద్రుతలోపము - తాన్ + మరలను = తామరలను (స్థిరపరకత్వమున ద్రుతలోపము,) తామరలన్ - అనుచోట్లఁగల సభంగశ్లేషమును గమనించునది

తే **ఇనుఁడు దనదీప్తిఁ దనచేత నిచ్చిపోయి**
మఱున కేతెంచి నిజరుచి మగుడఁ గొనినఁ
'దెలివి చెడి తెల్లనై' రను పలుకు జగతి
నిలుపు గతి దీపకలికలు వెలరువాఱె 186

అర్థము. ఇనుఁడు = సూర్యుఁడు, తన - దీప్తిన్ = తన కాంతిని, తన చేతన్= తన చేతితో - తనంత ననుట, ఇచ్చి, పోయి, మఱువక = మఱచి పోవక, ఏతెంచి= వచ్చి, నిజ - రుచిన్ = తనదైన కాంతిని, మగుడన్ = మరల, కొనినన్= తీసికొనఁగా, తెలివి - చెడి, తెల్లన + ఐరి' అను, పలుకున్ - మాటను, జగతిన్ = లోకమున, నిలుపు - గతిన్ = స్థాపించువిధమున, దీప - కలికలు = మొగ్గలవంటి దివ్వెలు, వెలరువాఱెన్ = తెల్లనయ్యెను

తాత్పర్యము సూర్యుఁడు తన కాంతిని చేతితో - తాను స్వయముగా మఱువక వచ్చి తనకాంతిని మరల స్వీకరింపఁగా 'తెలివిచెడి తెల్లనైరి' అనుమాట లోకమున నిలుపువిధమున దివ్వెలు తెల్లనయ్యెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష దీపకలికలు - కలికలవంటి దీపములు - ఉపమిత సమాసము 'తెలివి తెల్లవాఱిన' ట్లున్నదని లోకోక్తి సూర్యుఁడస్తమించుచుఁ దన కాంతిని అగ్నియందును, చంద్రునియందును, నక్షత్రములందును, దీపములందును, ఓషధులందును నిక్షేపించునని శాస్త్రము 'సౌరం తేజః సాయ మగ్నిం సంక్రమతే అని శ్రుతి 'దినాన్తే నిహితం తేజ స్సవిత్రేవ హుతాశనః' అని రఘువంశమునఁ గాళిదాసు

తే **రవి పదాహతిఁ జెడి యుడురాజు వోయె**
నని సరోజములొద్దఁ జక్రాహ్వయములు
చెట్ట లాడుట కవి వికసిల్లుటకును
వెల్లనైనట్లు చుక్కలు వెలరువాఱె 187

అర్థము: ఉడు - రాజు = నక్షత్రాధిపతి, - చంద్రుఁడు, రవి - పద+ఆహతిన్= సూర్యునియొక్క కిరణముల దెబ్బచే - సూర్యుని పాదముల దెబ్బచే, చెడి =

నశించి, పోయెన్, అని, చక్రాహ్వాయములు = చక్రవాకపక్షులు, సరోజముల + ఒద్దన్ = తామరల దగ్గఱ, చెట్టలు + ఆడుటకున్ = పడిపోయిన చంద్రుని నిందించుటకును, ఉత్సాహముతో తెక్కలల్లాడు (ర్చు) టకు, ననియు, అవి = ఆ మిత్రములయిన సరోజములు, వికసిల్లుటకును = వాని చెట్టలాడుట కుప్పొంగుటకును, వెల్లవ + ఐన + అట్లు = అవమానము నొంది తెల్లవోయినట్లు, చుక్కలు = చంద్రుని మిత్రములైన నక్షత్రములు, వెలరువాఱెన్ = కాంతివిహీనములై వెలవెలఁబోయినవి

తాత్పర్యము . చంద్రుఁడు చక్రవాకములకును తామరలకును విరోధి రవిపదాహతిచేఁ జంద్రుఁడు నశించిపోయె ననుసంతోషవార్తను చక్రవాకములు తమ మిత్రములైన పద్మములకడకు వచ్చి చెప్పి చంద్రుని నిందింపఁగా - ఉత్సాహముతో తెక్క లల్లార్పఁగా, నా పద్మములు వికసించెను అది చూచి అవమానముచెంది తెల్లనయినట్లు చంద్రుని మిత్రములైన నక్షత్రములు కాంతి విహీనములయి వెలవెలఁబోయినవి

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష - శ్లేషానుప్రాణితము

తే రాజరుచి వాయఁ గువలయరమణ దఱఁకెఁ
గలయఁ దమ్ముల మొగముల నెలమి మిగిలె
శీతకరుఁడైన రాజు వాసిన ధరిత్రి
వందుఁ గా కెందు దాయలు వగతు రెట్లు 188

అర్థము . రాజ - రుచి = చంద్రకాంతి, ప్రభువు కాంతి, పాయన్ = పోఁగా, కువలయ - రమణ = కలువ యను స్త్రీ - భూవలయమను స్త్రీ, తఱఁకెన్ = క్షీణించెను, తమ్ముల - మొగములన్ = పద్మముల ముఖములందు, తమ్ముల ముఖములందు, కలయన్ = బాగుగా, ఎలమి = సంతోషము, మిగిలెన్ = అతిశయించెను శీత - కరుఁడు = చల్లని కిరణములు గలవాఁడు - చల్లన చేయు వాఁడు - చల్లఁగా నేలువాఁడు, ఐన, రాజు = చంద్రుఁడు, ప్రభువు, పాసినన్ = పోయినచో, ధరిత్రి = భూమి, వందున్ + కాక = దుఃఖించును గాని, దాయలు = శత్రువులు, జ్ఞాతులు, వగతురు + ఎట్లు = దుఃఖింతురా ?

తాత్పర్యము . చంద్రుని కాంతి పోఁగాఁ గలువ యను స్త్రీ క్షీణించెను ప్రభువు కాంతి పోఁగా భూమండలమను స్త్రీ క్షీణించెను పద్మముల ముఖములందు

(అనుజుల ముఖములందు) సంతోషము బాగుగా నతిశయించెను అది యట్లే కదా ! చల్లనఁ గలిగించు - చల్లఁగానేలు ప్రభువు పోయినచో, భూమి దుఃఖించును గాని, జ్ఞాతులైనవారు శత్రువులు దుఃఖింతురా ? దుఃఖింపరని భావము

విశేషములు . రాజ, కువలయ, తమ్ములు, దాయలు - అను శబ్దముల కర్థద్వయసిద్ధిచే నలంకారము శ్లేషము ఎశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడుటచే అర్థాంతరన్యాసాలంకారమును గలదు అది శ్లేషోత్థాపితము తమ్మి - బహువ తమ్ములు - పద్మములు, తమ్ముఁడు - బహువ తమ్ములు = అనుజులు, కువలయరమణ అనుచో రూపకాలంకారము

చ కుముదముతో నలందురఁ జకోరము, లబ్జినితోన పొంగఁ గో
కములు, హిమంబుతోన చనఁ గౌముది, గానముతోఁ జెలంగ వా
ద్యము, లమృతాంశుతో నడఁగఁ దారకముల్, నిశితోన పాయఁగా
దము, ముదయాద్రి నెక్కెఁ బటుధాముఁడు రాగముతో వెలుంగుచున్ 189

అర్థము . చకోరములు = వెన్నెల పులుఁగులు, కుముదముతోన్ = తెల్ల కలువతో, అలందురన్ = దుఃఖింపఁగను, కోకములు = చక్రవాకములు, అబ్జినితోన్+ అ = తామరతీఁగతోనే, పొంగన్ = ఉబ్బఁగను, కౌముది = వెన్నెల, హిమంబుతోన్+అ=మంచుతోనే, చనన్ = పోఁగా, వాద్యములు = సంగీత సాధనములు, గానముతోన్ = పాటతో, చెలంగన్ = మ్రోయఁగా, తారకముల్ = నక్షత్రములు, అమృతాంశుతోన్ = చంద్రునితో, అడఁగన్ = నశింపఁగను, తమము =చీఁకటి, నిశితోన్ + అ = రాత్రితోనే, పాయఁగాన్ = తొలఁగఁగా, పటు-ధాముఁడు=తీక్ష్ణములయిన కిరణములు గలవాఁడు - సూర్యుఁడు, రాగముతోన్= ఎఱుపుతో, ప్రీతితో, వెలుంగుచున్ = ప్రకాశించుచు, ఉదయ + అద్రిన్ = తూర్పుకొండను, ఎక్కెన్

తాత్పర్యము · వెన్నెలపులుఁగులు తెల్లకలువతోపాటు దుఃఖింపఁగను, చక్రవాకములు తామరతీఁగ (కమలిని)తోపాటు సంతోషింపఁగను, వెన్నెల మంచుతోపాటే పోవఁగను, వాద్యములు గానముతోపాటు మ్రోయఁగను, నక్షత్రములు చంద్రునితోపాటు నశింపఁగను, చీఁకటి రాత్రితోపాటే నశింపఁగను, సూర్యుఁడు ఎఱ్ఱనై ప్రకాశించుచుఁ దూర్పుకొండ నెక్కెను

విశేషములు అలంకారము సహోక్తి

తే అస్తగిరిఁ బొందె రా, జుదయాద్రి నెక్కి
నినుఁడు, తేజస్వులగు వారి కెల్లప్రొద్దు
మానితంబగునిల నొక్కమాట పొందు
హానివృద్ధులు సూచించునట్ల పోలె 190

అర్థము తేజస్వులు + అగు - వారికిన్ = తేజస్సుగలవారికి, ఎల్లప్రొద్దున్= ఎల్లప్పుడును, మానితంబు + అగు + ఇలన్ = మన్నింపఁబడినది యగు భూమియందు, ఒక్క - మాటు + అ = ఒక్కమాఱే, పొందు, హాని-వృద్ధులు = హానియును, వృద్ధియును, సూచించు + అట్లు + అ-పోలెన్ = సూచించు విధము వలెనే, రాజు = చంద్రుఁడు - ప్రభువు, అస్త-గిరిన్ = అస్తపర్వతమును - హానిని, పొందెన్, ఇనుఁడు = సూర్యుడు (ప్రభువు), ఉదయ + ఆద్రిన్ = పొడుపుఁగొండను - వృద్ధిని, ఎక్కెన్

తాత్పర్యము తేజస్వులగువారి కెల్లప్పుడును మన్నింపఁబడినదియగు భూమియందు ఒక్కమాఱే పొందు హానిని వృద్ధిని సూచించునట్లే, రాజు (చంద్రుఁడు) అస్తగిరిని బొందెను ప్రభు వస్తమించెను ఇనుఁడు (సూర్యుఁడు) ఉదయగిరిని అధిరోహించెను ప్రభు వభ్యుదయమును బొందెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష ఈ పద్యము కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలమునందలి -

యా త్యేకతో ఽస్తశిఖరం పతి రోషధీనా
మావిష్కృతారుణ పురస్సర ఏకతో ఽర్కః
తేజోద్వయస్య యుగపద్వ్యసనోదయాభ్యాం
లోకో నియమ్యత ఇ వాత్మదశాన్తరేషు
(అభి శాకు) అను శ్లోకమున కనువాదము

ఆ హరు వివాహమునకుఁ గర మనురక్తుఁడై
వరుస జగములెల్ల వసుమయంబు
సేసెనో రయమునఁ జిత్రభానుఁ డనఁగ
వసుసమూహిఁ గప్పె వసుధ యెల్ల 191

అర్థము చిత్రభానుఁడు = సూర్యుఁడు, హరు - వివాహమునకున్ = ఈశ్వరుని పెండ్లికి, కరము = మిక్కిలి, అనురక్తుఁడు + ఐ = ఇష్టము గలవాఁడయి, వరుసన్ = క్రమముగా, జగములు + ఎల్లన్ = లోకములన్నియు, రయమునన్ = శీఘ్రముగా, వసుమయంబు = కిరణములతో నిండినది - రత్నములతో నిండినది (గా) చేసెనో, అనఁగన్, వసుధ + ఎల్లన్ = భూమినంతను, వసు - సమూహిన్ = కిరణముల సమూహముతో - రత్నముల సమూహముతో, కప్పెన్

తాత్పర్యము. ఈశ్వరుని వివాహమునకు సూర్యుఁడు మిక్కిలి యిష్టము గలవాఁడయి క్రమముగా లోకములనన్నిటిని వసుమయము చేసెనో యన వసుధనంతను వసుసమూహముతోఁ గప్పెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష 'వసుమయము' అనుచో శ్లేషము వసుధా శబ్దము గూడ సాభిప్రాయప్రయుక్తము వసు దధాతీతి వసుధా - వసువును (ధనమును) ధరించునది

క **మునిజనదత్తార్ఘ్య కుచం**
దన రసముల జగములెల్లఁ దడిసెనొ ? లోకం
బినుఁ డుదయింపఁగ రాగము
దనరెనొ ? నా నరుణకిరణధామము పర్వెన్ **192**

అర్థము. ముని - జన - దత్త + అర్ఘ్య - కుచందన - రసములన్ = మునుల సమూహముచేత ఒసఁగఁబడిన అర్ఘ్యమనెడి రక్తచందన రసములచే, జగములు + ఎల్లన్ = జగములన్నియు, తడిసెనొ = తడిసెనా, ఇనుఁడు = సూర్యుఁడు, ఉదయింపఁగన్ = ఉదయించుటకు, లోకంబు, రాగము + తనరెనొ = ఇష్టపడెనో, ఎఱ్ఱపడెనో, నాన్ = అనఁగా, అరుణ - కిరణ - ధామము = సూర్యకిరణముల కాంతి, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము. మునిజను లిచ్చు నర్ఘ్యమనెడి రక్తచందనరసముచే లోకములన్నియుఁ దడిసెనో, లేక సూర్యుఁ డుదయించుటకు లోకము అనురాగము చెందెనో - ఎఱ్ఱనయ్యెనో అనఁగా సూర్యకిరణ=ముల కాంతి వ్యాపించెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష అర్ఘ్య కుచందన అనుచో రూపకము 'రాగము' అనుచో శ్లేషము

క సరసిజరాగావహమై
సరసిజ రాగాత్మకప్రచరశోభితమై
యరుణద్యుతి భాసురమై
యరుణద్యుతి భాతిఁ బ్రకటితమై భువిఁ బర్వెన్ 193

అర్థము. అరుణద్యుతి = సూర్యకాంతి, సరసిజ - రాగ + అవహము + ఐ= పద్మములకు అనురాగము (ఎఱుపు) గలిగించునదియై, సరసిజ - రాగ + ఆత్మక- ప్రచార - శోభితము + ఐ = పద్మరాగమణిస్వరూపమైన మార్గములచేఁ బ్రకాశించునదియై, భాసురము + ఐ = ప్రకాశించునదియై, అరుణద్యుతి - భాతిన్= ఎఱ్ఱనికాంతితో, ప్రకటము + ఐ = ప్రసిద్ధమయి, భువిన్ = భూమియందు, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము. సూర్యకాంతి పద్మములకు రాగమును గలిగించునదియై, పద్మరాగమణి స్వరూపమైన మార్గములచేఁ బ్రకాశించునదియై, భాసురమయి, యెఱ్ఱనికాంతితోఁ బ్రసిద్ధమై భూమియందు వ్యాపించెను

వ త దవసరంబున 194

అర్థతాత్పర్యములు తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి నవమాశ్వాసమునందలి 2_వచనముతో నన్వయము

ఆశ్వాసాంతము

మ. భవరౌద్రాశనిపాత భీత సుమహద్భక్తాచలేంద్రాశ్రయా
ర్ణవు గంభీరు నుదారు ధీరుఁ బరమానందాత్మ సంకల్పసం
భవ బాణేంధన దావపావకు జగత్ప్రఖ్యాత కీర్త్యంగనా
ధవు నజ్ఞానతమఃపతంగు శివతత్త్వ జ్ఞాన సన్మానసున్ 195

అర్థము. భవ ర్ణవు, భవ = సంసారమనెడి, రౌద్ర + అశని పాత = భయంకరమైన పిడుగుపాటు వలన, భీత = భయపడిన, సు-మహత్ + భక్త = గొప్ప భక్తులనెడు, అచల + ఇంద్ర = పర్వత శ్రేష్ఠములకు, ఆశ్రయ = ప్రాపయిన, అర్ణవున్ = సముద్రుఁడైనవాఁడును, గంభీరున్ = లోఁతయినవాఁడును, ఉదారున్= ఉదారుఁడైనవాఁడును, ధీరున్ = ధైర్యముగలవాఁడును, పరమ + ఆనంద + ఆత్మున్ = పరమానంద స్వరూపుఁడైనవాఁడును, సంకల్పసంభవ - బాణ + ఇంధన - దావ- పావకున్ = మన్మథుని బాణములనెడి కట్టెలకుఁ గార్చిచ్చు

అయినవాఁడును, జగత్ + ప్రఖ్యాత, - కీర్తి, + అంగనా - ధవున్ = లోకప్రసిద్ధమైన కీర్తి అనెడి స్త్రీకి భర్తయైనవాఁడును, అజ్ఞాన-తమస్ ( ) + పతంగున్ = అజ్ఞానమనెడి చీఁకటికి సూర్యుఁడైనవాఁడును, శివ-తత్త్వ - జ్ఞాన - సత్ + మానసున్ = ఈశ్వర తత్త్వ జ్ఞానమునకు మంచి మనసు గలవాఁడును (అగు) కృతి భర్తయైన శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

తాత్పర్యము. సంసార మనెడి భయంకరమైన పిడుగుపాటువలన భయపడిన మిక్కిలి గొప్ప భక్తులనెడి పర్వతశ్రేష్ఠులకుఁ బ్రాపయిన సముద్రము అయినవాఁడును, గంభీరుఁడును, ఉదారుఁడును, ధీరుఁడును, పరమానందస్వరూపుఁడును, మన్మథుని బాణములనెడి కట్టెలకుఁ గార్చిచ్చు అయినవాఁడును, జగత్ప్రసిద్ధమైన కీర్తియనెడి స్త్రీకి భర్తయైనవాఁడును, అజ్ఞానమనెడి చీఁకటికి సూర్యుఁడైనవాఁడును, శివతత్త్వ జ్ఞానముగల మంచి మనస్సు గలవాఁడును అగు కృతిభర్తను శ్రీ జంగమ మల్లికార్జునస్వామిని

విశేషములు. భవరౌద్రాశనిపాత, భక్తా చలేంద్ర, ఆశ్రయార్ణవు, బాణేంధన దావపావకు, కీర్త్యంగనాధవు, అజ్ఞానతమఃపతంగు - అనుచోట్ల రూపకాలంకారము గలదు

క జనవినుతు, సితయశోనిధి,
ననుపమ శుభమూర్తి, మల్లికార్జునమునినా
ధు నపార ఘోర భవ దుఃఖ నివృత్తుఁ గళానిధానుఁ గైవల్యరతున్ **196**

అర్థము. జన - వినుతున్ = జనులచే విశేషముగాఁ బొగడఁబడువాఁడును, సిత - యశస్ (ఃస) + నిధిన్ = తెల్లని కీర్తికి నిధానమయినవాఁడును, అనుపమ - శుభ - మూర్తిన్ = సాటిలేని మంగళకరమైన ఆకారము గలవాఁడును, మల్లికార్జున-ముని - నాధున్ = మల్లికార్జునుఁడనెడి మునిశ్రేష్ఠుని, అపార - ఘోర - భవ - దుఃఖ-నివృత్తున్ = పారము లేని భయంకరమైన సంసార దుఃఖమునుండి మరలిన వాఁడును, కళానిధానున్ = విద్యలకు నిధియైనవాఁడును, కైవల్య-రతున్ = మోక్షమునం దాసక్తి గలవాఁడును అగు జంగమమల్లికార్జునుని

తాత్పర్యము. జనులచే విశేషముగాఁ బొగడఁబడువాఁడును, తెల్లనికీర్తికి నిధియైనవాఁడును, సాటిలేని శుభాకృతిగలవాఁడును, మల్లికార్జునమునిశ్రేష్ఠుఁడును,

పారములేని, భయంకర సంసార దుఃఖమునుండి మరలినవాఁడును, విద్యలకు నిధియైనవాఁడును, మోక్షమునం దాసక్తిగలవాఁడును అగు జంగమ మల్లికార్జునుని

మ పరవాదీంద్రఘనాఘనానిలు, జగద్భ్రాజిష్ణు, నర్ధేందుశే
ఖరు, ధర్మజ్ఞు, మహీసురేంద్రు, బుధలోక స్తోత్రపాత్రున్, మనో
హరు, సద్బ్రహ్మతపోధనాదినిధి, నార్యశ్రేణివర్యున్, మహా
పురుషున్, జంగమమల్లికార్జును, జగత్పూజ్యప్రభాభాసితున్ 197

అర్థము . పర నానిలు పర = శత్రువైన, వాది + ఇంద్ర = వాదము చేయువారిలో శ్రేష్ఠులనెడి, ఘనా -ఘన + అనిలున్ = వర్షాకాలపు మేఘములకు వాయువైన వాఁడును, జగత్ + భ్రాజిష్ణున్ = లోకములందుఁ బ్రకాశించు శీలము గలవాఁడును, అర్ధ + ఇందు - శేఖరున్ = సగము చంద్రుఁడు శిరోభూషణముగాఁ గలవాఁడును, ధర్మజ్ఞున్ = ధర్మము తెలిసినవాఁడును, మహీసుర + ఇంద్రున్ = బ్రాహ్మణశ్రేష్ఠుఁడును, బుధ-లోక-స్తోత్ర-పాత్రున్ = పండితుల సమూహము యొక్క స్తుతులకు అర్హుఁడైనవాఁడును, మనోహరున్ = అందమైనవాఁడును, సత్ + బ్రహ్మ - తపస్ (ఃస) + ధన + ఆది -నిధిన్ = సద్బ్రాహ్మణులైన తపోధనులకు, మునులకు మూలమైన నిధియైనవాఁడును, ఆర్య-శ్రేణి-వర్యున్ = పెద్దల వరుసలో శ్రేష్ఠుఁడును, మహాపురుషున్ = గొప్పవాఁడును, జగత్ + పూజ్య - ప్రభా-భాసితున్ - లోకములందుఁ బూజింపఁదగిన ప్రభచేఁ బ్రకాశించువాఁడును అగు, జంగమమల్లికార్జునున్

తాత్పర్యము . శత్రువులైన వాదిశ్రేష్ఠులనెడి వర్షాకాలపు మేఘములకు వాయువైన వాఁడును, లోకములందుఁ బ్రకాశించువాఁడును, చంద్రకళ శిరోభూషణముగాఁ గలవాఁడును, ధర్మవేత్తయును, బ్రాహ్మణశ్రేష్ఠుఁడును, పండితజనస్తుతిపాత్రుఁడును, మనోహరుఁడును, సద్బ్రాహ్మణులైన మునులకు మూలనిధియైనవాఁడును, ఆర్యులలో శ్రేష్ఠుఁడును, పండితజనస్తుతిపాత్రుఁడును, మనోహరుఁడును, సద్బ్రాహ్మణులైన మునులకు మూలనిధియైన వాఁడును, ఆర్యులలో శ్రేష్ఠుఁడును, మహాపురుషుఁడును, లోకపూజ్యమైన ప్రభచేఁ బ్రకాశించువాఁడును అగు జంగమమల్లికార్జునుని

క. సజ్జననిధాను, విబుధా
పజ్జలనిధికుంభజప్రభావు, శిశిరభూ
భృజ్జాతాధిపసన్నిభు
హృజ్జన్మాస్త్రానభిజ్ఞు, నీప్సితఫలదున్ 198

అర్థము సత్ + జన - నిధానున్ = మంచి జనులకు నిధియైనవాఁడును, విబుధ + ఆపద్ + జలనిధి - కుంభజ - ప్రభావున్ = పండితుల ఆపదలనెడి సముద్రమునకు అగస్త్యుని మహిమ వంటి మహిమ గలవాఁడును, శిశిర - భూభృత్+ జాతా + అధిప - సన్నిభున్ = హిమవత్పర్వతపుత్త్రియగు పార్వతియొక్క భర్తయైన శివునితో సమానుఁడును, హృద్ + జన్మ + అస్త్ర + అనభిజ్ఞున్ = మన్మధాస్త్రములు తెలియనివాఁడును, ఈప్సిత= ఫలదున్ = కోరిన ఫలముల నిచ్చువాఁడును అగు జంగమమల్లికార్జునదేవుని

తాత్పర్యము సుజనులకు నిధియైనవాఁడును, పండితుల ఆపదలనెడి సముద్రములకు అగస్త్యుఁడైనవాఁడును, పార్వతీభర్తతో (శివునితో) సమానమైనవాఁడును, మన్మధాస్త్రముల నెఱుఁగనివాఁడును అగు జంగమమల్లికార్జునదేవుని

విశేషములు . సత్ + జన = సద్ + జన - సజ్జన ఆపద్ + జలనిధి = ఆపజ్జలనిధి, భూభృత్ + జాతా = భూభృజ్జాతా ఆపజ్జలనిధి - రూపక సమాసము

వసంతతిలకము **కారుణ్యమూర్తి, నవికారు, నగేంద్రధీరున్,**
మారారి, సర్వజనమాన్యు, సదా వదాన్యున్
నీరేజపత్రనిభనేత్రు, జగత్పవిత్రున్,
ప్రారబ్ధపుణ్యమితభాషు, గుణాభిలాషున్ **199**

అర్థము . కారుణ్య - మూర్తిన్ = దయా స్వరూపుఁడును, అవికారున్ = మార్పునొందనివాఁడును, నగ + ఇంద్ర - ధీరున్ = పర్వతశ్రేష్ఠునివలె ధైర్యముగలవాఁడును, మార + అరిన్ = మన్మథునకు శత్రువైనవాఁడును, సర్వ - జన- మాన్యున్ = జనులందఱిచేతను మన్నింపఁదగినవాఁడును, సదా - వదాన్యున్ = ఎల్లప్పుడును దాతయైనవాఁడును, నీరేజ - పత్ర - నిభ -నేత్రున్ = తామరరేకులతో సమానమైన కన్నులుగలవాఁడును, జగత్ + పవిత్రున్ = లోకములోఁ బావనుఁడైనవాఁడును, ప్రారబ్ధ - పుణ్య = ప్రారంభింపఁబడిన పుణ్యము గలవారితో, మిత - భాషున్ = తక్కువ మాటలాడువాఁడును, గుణ + అభిలాషున్ = మంచి గుణములందుఁ గోరిక గలవాఁడును అగు జంగమ మల్లికార్జునుని

తాత్పర్యము . దయాస్వరూపుఁడు, అవికారుఁడును, పర్వతశ్రేష్ఠునివలె ధైర్యవంతుఁడును, మన్మథునకు శత్రువైనవాఁడును, ఎల్లజనులకు మాన్యుఁడైనవాఁడును, నిరంతరమును దాతయైనవాఁడును, తామరరేకులవంటి కన్నులు గలవాఁడును, జగత్తులోఁ బవిత్రుఁడైనవాఁడును, పుణ్యాత్ములతో మితముగా మాటలాడువాఁడును, సుగుణములందుఁ గోరిక గలవాఁడును అగు జంగమ మల్లికార్జునదేవుని

విశేషములు 'వసంత తిలక' వృత్తమునకు నాలుగు పాదములుండును ప్రతిపాదమునను త, భ, జ, జ, గగ అనుగణము లుండును మొదటి యక్షరమునకును ఎనిమిదవ యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు కారు - ధీరు, మాన్యు - వదాన్యు అనురీతిగా నంత్యానుప్రాసమను శబ్దాలంకారము గలదు

గద్యము

ఇది శ్రీమజ్జంగమమల్లికార్జునదేవ దివ్య శ్రీ పాద పంకజభ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవప్రణీతంబైన కుమారసంభవం బనుకథయం దష్టమాశ్వాసము

దీనికి వ్యాఖ్య పూర్వాశ్వాసాంతగద్యలకు వలెనే

అష్టమాశ్వాసము చివర తంజావూరి ప్రతిలో 'శ్రీమద్రాజాధిరాజ రాజమహారాజ శహాజీ రాజభూపాలక సార్వభౌమస్య యిష్టార్థా ఃి, భవానీశంక్కర కృపయా సఫలాఃి సంత్తు ఉమామహేశ్వరో రక్షతు శివాయ నమఃి' అని కలదు

శహాజీ మహారాజు క్రీ శ 1684 - 1712 వఱకుఁ బాలించినవాఁడు ఈ గ్రంథ మాకాలమున నుల్లేఖింపఁబడినది ' శ్రీ ని వేం రావు

మ ఇది శ్రీ జొన్నలగడ్డ వంశమణియా మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోత్తము శాబ్దికార్థ వివిధస్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్ము విలసత్ సంజీవనీవ్యాఖ్య యౌ

కుమార సంభవము

నవమాశ్వాసము

క శ్రీ రామా సంచిత విపు
లోరస్థలు, నిర్మలాత్మయోగ సుధాకూ
పార సుధాకరుఁ, గవి నీ
రేరుహ రవి, దివ్యమునివరేణ్యు, నగణ్యున్ 1

అర్థము శ్రీ - రామా - సంచిత - విపుల + ఉరస్ + స్థలున్ = లక్ష్మి యను స్త్రీతోఁగూడుకొనిన విశాలమయిన వక్షస్స్థలము గలవాఁడును, నిర్మ కరున్, నిర్మల = స్వచ్ఛమయిన, ఆత్మ - యోగ = పరమాత్మధ్యానమనెడి, సుధా + అకూపార = అమృతసముద్రమునకు, సుధాకరున్ = చంద్రుఁడైనవాఁడును, కవి-నీరేరుహ - రవిన్ = కవులనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును, దివ్య - ముని-వరేణ్యున్ = దివ్యుఁడైన మునిశ్రేష్ఠుఁడును, అగణ్యున్ = గణింప శక్యముగాని వాఁడును, అగు జంగమ మల్లికార్జునుని

తాత్పర్యము లక్ష్మీ దేవితోఁ గూడిన విశాలమైన వక్షస్థలము గలవాఁడును, నిర్మలమైన పరమాత్మధ్యానమనెడి అమృత సముద్రమునకుఁ జంద్రుఁడైనవాఁడును, కవులనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును, దివ్యమునిశ్రేష్ఠుఁడును, ఇట్టి వాఁడని గణింప శక్యముగానివాఁడును అగు జంగమమల్లికార్జునుని

విశేషములు . ఆత్మయోగ సుధాకూపార సుధాకరు - రూపకము, కవి నీరేరుహ రవి - రూపకము వీరశైవుఁడయిన జంగమమల్లికార్జునుని విష్ణువుగ వర్ణించుట విశేషము వరేణ్య - గణ్య - అంత్యానుప్రాసము

వ హరి పరమేష్ఠి పురందరాద్యమరవరసహితుండైన యీశ్వరునకు హిమవంతుండు సుప్రభాతార్చనావిధి నభ్యర్చితుంజేసి వివాహమండపంబు నిర్మింప నుద్యుక్తుండగుడు నాక్షణంబ 2

అర్థము. హరి - విష్ణువు, పరమేష్ఠి = బ్రహ్మ, పురందర = ఇంద్రుఁడు, ఆది = మొదలగు, అమర - వర = దేవతా శ్రేష్ఠులతో, సహితుండు = కూడినవాఁడు, ఐన, ఈశ్వరునకున్, హిమవంతుండు, సుప్రభాత + అర్చనా - విధిన్ = ఉదయకాలపు పూజా విధానముతో, అభ్యర్చితున్ (అభి + అర్చితున్) = పూజింపఁబడినవానిని, చేసి, వివాహమండపంబున్, నిర్మింపన్, ఉద్యుక్తుండు = పూనినవాఁడు, అగుడున్ = అయినంతనే, ఆ-క్షణంబు + అ = ఆ క్షణమే

తాత్పర్యము. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతాశ్రేష్ఠులతోఁగూడి యీశ్వరునకు హిమవంతుఁడు ఉదయకాల పూజా విధానమునఁ బూజించి కల్యాణమండపమును నిర్మింపఁబూనినంతనే, ఆ క్షణమే - తరువాతి పద్యముతో నన్వయము

సీ. **కనకాచలము నెలకట్టయ్యె, నవరత్న**
వర్గంబు నవరంగవల్లు లయ్యెఁ ,
గల్పకుజంబులుఁ గంబంబులుగ మీఁదఁ
గల్పలతాతతి గలయఁబర్వి
సుందరంబగు పచ్చపందిరియును దోర
ణంబులు నయ్యె దివ్యాంబరములు
గంబకట్టులు మేలుకట్లును నయ్యెఁ దా
రకములు మణివిలంబకము లయ్యె

గీ **నమృత రస రసాయనాబ్ధులు పూర్ణ కుం**
భంబు లయ్యె, నిందు భాను మండ
లాలి దర్పణంబు లయ్యె, సర్వేశు ను
ద్వాహ మండపమునఁ దమకుఁ దార 3

అర్థము : సర్వ + ఈశు + ఉద్వాహ - మండపమునన్ = సర్వేశ్వరుని వివాహమండపమునందు, తమకున్ + తారు + అ = తమకుఁదామే,

కనక + అచలము = మేరుపర్వతము, నెలకట్టు + అయ్యెన్ = కుట్టిమస్థలము అయ్యెను, నవ-రత్న-వర్గంబులు = తొమ్మిది రత్నముల సమూహములును, నవ-రంగవల్లులు = క్రొత్త ముగ్గులు, అయ్యెన్

కల్ప - కుజంబులున్ = కల్పవృక్షములును, కంబంబులుగన్ =

స్తంభములుగను, మీఁదన్ = వానిపై, కల్ప - లతా - తతి = కల్పవృక్షపుఁదీవెల సమూహము, కలయన్ = అంతటను, పర్వి = వ్యాపించి, సుందరంబు + అగు = అందమయిన, పచ్చ - పందిరియును, తోరణంబులున్, అయ్యెన్

దివ్య + అంబరములు = దివ్యములయిన వస్త్రములు, కంబ - కట్టులు= స్తంభముల కట్టులును, మేలుకట్లును = వితానములును, అయ్యెన్

తారకములు = నక్షత్రములు, మణి - విలంబకములు = మణులతో వ్రేలాడఁగట్టిన గుత్తులు, అయ్యెన్

అమృతరస - రసాయన + అబ్ధులు = అమృతసముద్రములు, పూర్ణ - కుంభంబులు, అయ్యెన్,

ఇందు - భాను - మండల + ఆలి = చంద్రసూర్యబింబముల వరుస, దర్పణంబులు = అద్దములు, అయ్యెన్

తాత్పర్యము . పరమేశ్వరుని వివాహమండపమున వివిధవస్తువులు తమకుఁదామే వివిధవస్తువులుగా నయ్యెను మేరుపర్వతము కుట్టిమ మయ్యెను నవరత్నములు ముగ్గులయ్యెను కల్పవృక్షములు స్తంభములుగను, వానిపైఁ గల్పవృక్షపుఁదీవెలు వ్యాపించి సుందరమైన పచ్చని పందిరియును, తోరణములును అయ్యెను దివ్యములయినవస్త్రములు స్తంభపుఁగట్టులును, వితానములు నయ్యెను నక్షత్రములు వ్రేలాడు మణుల గుత్తులయ్యెను అమృత సముద్రములు పూర్ణకుంభము లయ్యెను చంద్ర సూర్యబింబములు దర్పణములయ్యెను

గీ. **విష్టరం బయ్యెను బరుసవేది, వేది**
యయ్యెఁ జింతామణులు, వెలయంగ మీఁద
నౌషధులు నిధుల్ దీపము లయ్యె, ననలుఁ
డొలసి వరహోమకుండమై వెలుఁగుచుండె 4

అర్థము . పరుసవేది = స్పర్శవేధి (ఇనుమును బంగారముగాఁ జేయు రసశిలా విశేషము), విష్టరంబు + అయ్యెను = ఆసన మయ్యెను, చింతామణులు, వేది + అయ్యెన్ = అరఁగు అయ్యెను, వెలయంగన్ = ఒప్పునట్లు, మీఁదన్ = పైని, ఔషధుల్ = ఓషధులు, నిధుల్, దీపములు, అయ్యెన్, అనలుఁడు = అగ్ని, ఒలసి= కూడి, వర - హోమ - కుండము + ఐ = మేలయిన హోమకుండమయి, వెలుఁగుచున్ + ఉండెన్

తాత్పర్యము . స్పర్శవేది ఆసనము అయ్యెను చింతామణులు అరఁగు అయ్యెను దానిపై నోషధులును నిధులును దీపములయ్యెను అగ్ని హోమకుండమై వెలుఁగుచుండెను

వ తదనంతరంబున హిమవంతుండు దైవజ్ఞనియుక్తుండై హైమవతిం గైసేయుండని విదగ్ధాంగనల నియమించిన నక్షణంబ వారు నవరత్నరంగాతి సుందరంబగు చంద్రకాంతమణిమయమజ్జనవేదికాతలంబున నగజ నునిచి హంసోదకంబులను దీర్థ సుగంధోదకంబులను మజ్జనంబార్చి నైపథ్యనికేతనంబునకుం దెచ్చి దివ్యాంబరాలంకృతం జేసిన 5

అర్థము. తద్ + అనంతరంబునన్, హిమవంతుండు, దైవజ్ఞ-నియుక్తుండు+ ఐ = జ్యోతిష్కులచే నియోగింపఁబడినవాఁడయి, హైమవతిన్ = పార్వతిని, కైసేయుండు + అని = అలంకరింపుఁడని, విదగ్ధ + అంగనలన్ = నేర్పరులైన స్త్రీలను, నియమించినన్, అక్షణంబు + అ = వెంటనే, వారు, నవ - రత్న- రంగ + అతి - సుందరంబు + అగు = తొమ్మిది రత్నముల రంగస్థలముచే మిక్కిలి అందమయినది యగు, చంద్రకాంత - మణి - మయ- మజ్జన - వేదికా - తలంబునన్ = చంద్రకాంతమణులతో నిర్మింపఁబడిన స్నానపుటరఁగుపై, అగజన్= పార్వతిని, ఉనిచి = ఉంచి, హంస + ఉదకంబులను =ఎండకు వేఁడిమి చెంది, వెన్నెలకు జల్లనగు జలములచేతను, తీర్థ - సుగంధ + ఉదకంబులను పరిమళితములగు తీర్థజలములచేతను, మజ్జనంబు = స్నానము, ఆర్చి = ఆడించి, నైపథ్య - నికేతనంబునకున్ = వేష గృహమునకు, తెచ్చి = తీసికొనివచ్చి, దివ్య + అంబర + అలంకృతన్ = దివ్యములయిన వస్త్రములచే నలంకరింపఁబడినదిగా, చేసినన్

తాత్పర్యము . వెంటనే హిమవంతుఁడు దైవజ్ఞులచే నియోగింపఁబడినవాఁడయి పార్వతి నలంకరింపుఁడని నేర్పరులైన స్త్రీలను నియమింపఁగా, వారు నవరత్నమయరంగముచే మిక్కిలి సుందరమైన చంద్రకాంతమణిమయమైన స్నానపుటరంగుపైఁ బార్వతి నుంచి హంసోదకముల చేతను, పరిమళభరితములైన తీర్థోదకములచేతను స్నానమాడించి వేషగృహమునకుఁ దీసికొనివచ్చి దివ్యవస్త్రములచే నలంకరింపఁజేసిన - తరువాతి పద్యముతో నన్వయము

పెండ్లి కూఁతురగు పార్వతి వర్ణన

గీ మజ్జనం బొప్ప నాడి నిర్మలిన మగు దు
కూలములు గట్టి పాల్చెఁ గుత్కీలతనయ
వర్షసమయము సన శరద్వ్యాప్తి వెలుఁగు
కాశ సంకాశ మగు మహీకాంతవోలె 6

అర్థము కుత్కీల - తనయ = కొండకూఁతురు - పార్వతి, మజ్జనంబు+ ఒప్పున్ + ఆడి = ఒప్పుగా స్నానముచేసి, నిర్మలినము + అగు = నిర్మలము అయిన, దుకూలములు = సన్నని వస్త్రములు (తెల్లనివస్త్రములు) కట్టి, వర్ష - సమయము = వాన కాలము, చనన్ = పోఁగా, శరద్ + వ్యాప్తిన్ = శరత్కాలము వ్యాపించుటచే, వెలుఁగు = ప్రకాశించు, కాశ - సంకాశము = తెల్లు సమీపమున నున్నది, అగు, మహీ - కాంత + పోలెన్ = భూమియను స్త్రీ విధమున, పాల్చెన్ = ఒప్పెను

తాత్పర్యము పార్వతి స్నానము చేసి నిర్మలములైన తెల్లని వస్త్రములు ధరించి, వర్షకాలముపోయి శరత్తు వచ్చుటచే నొప్పు తెల్లుతోఁగూడిన భూమియను స్త్రీవలె నొప్పెను

విశేషములు. అలంకార ముపమ రూపకానుప్రాణితము

ఈ పద్యము కాళిదాసు శ్లోకమున కనుకరణము

సా మజ్జలస్నానవిశుద్ధగాత్రీ
గృహీతవ త్యుద్ధమనీయ వస్త్రా
నిర్వృత్తపర్జన్యజలాభిషేకా
ప్రఫుల్లకాశా వసుధేవ రేజే కుమార సం 7-11

వ మఱియును తరువాతి పద్యముతో నన్వయము 7

గీ అలికులాన్వితమగు వికచాంబుజంబొ ?
జలధరంబులో వెలువడు చంద్రమండ
లంబొ ? నా నొప్పుఁ గుటిలాలకంబు లోలిఁ
దీర్చి సఖు లర్థిఁజూడ నద్రిజ మొగంబు 8

అర్థము. కుటిల + అలకంబులు = వంకరలైన ముంగురులు, ఓలిన్ = క్రమముగా, తీర్చి, సఖులు = చెలికత్తెలు, అర్థిన్ = కోరికతో, చూడన్, అద్రిజ =

పార్వతియొక్క, మొగంబు = ముఖము, అలి - కుల + అన్వితము = తుమ్మెదల గుంపుతోఁ గూడినది, అగు, వికచ + అంబుజంబొ = వికసించిన పద్మమో, జలధరంబులోన్ - వెలువడు = మేఘములోనుండి పైకి వచ్చునట్టి, చంద్ర - మండలంబొ = చంద్రబింబమో, నాన్ = అనఁగా, ఒప్పెన్

తాత్పర్యము. వంకరలైన ముంగురులను గ్రమముగాఁ దీర్చి సఖులు కోరి చూడఁ బార్వతి ముఖము తుమ్మెదల గుంపుతోఁ గూడిన విరిదామరయో, మేఘములోనుండి వెలువడిన చంద్రబింబమో యన నొప్పెను

విశేషములు . అలంకారము సందేహము ఈ పద్యము కాళిదాసు కుమారసంభవశ్లోకమున కించుక యనుకరణము

లగద్విరేఫం పరిభూయ పద్మం
సమేఘలేఖం శశినశ్చ బిమ్బమ్,
త దాననశ్రీ రలకైః ప్రసిద్ధి
శ్చిచ్ఛేద సాదృశ్యకథాప్రసఙ్గమ్ కుమార సం 7-16

జలధరంబులో వెలువడు - జలధరంబువలన వెలువడు 'ఉండి పదం బొకానొకచో వలనవర్ణకంబున కనుప్రయుక్తం బగు ' బాల కారక 10 జలధరంబు వలన నుండి వెలువడు 'ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు ' బాల కారక 11 జలధరంబులోనుండి వెలువడు 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తముల మీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు ' ప్రౌఢ కారక 11 జలధరంబులో వెలువడు 'నూతిలో వెలువడఁ గోమలిం దిగిచె' నని నన్నయ ప్రయోగము భార ఆది 3 ఆ

వ అయ్యవసరంబునం దత్సతు లగజ సర్వాంగకానూనప్రభావప్రసరంబు దమచూడ్కుల కక్కజంబై వెక్కసంబందుచు 9

అర్థము. ఆ + అవసరంబునన్ = ఆ సమయమున, తద్ + సతులు = ఆ యింతులు, అగజ = పార్వతియొక్క, సర్వ + అంగక + అనూన - ప్రభావ - ప్రసరంబు = ఎల్ల అవయవముల తక్కువకాని కాంతియొక్క వ్యాప్తి, తమ - చూడ్కులకున్ = తమ చూపులకు, అక్కజంబు + ఐ = అశక్యమయి, వెక్కసంబు= దుస్సహము, అందుచున్

తాత్పర్యము ఆ సమయమున నా చెలికత్తెల చూపులకు పార్వతి సర్వావయవముల అధికమైన కాంతి వ్యాప్తి అశక్యమయి వారు దుస్సహత్వ మందుచు - తరువాతి పద్యముతో నన్వయము

సీ మణిభూషణప్రభఁ దనుకాంతి వెలయనీ
దను లీల మేనఁ జందన మలంది
కచనీలభాతి చీఁకటి గొల్పు దెస లను
కరణి వేసవి జాదివిరు లమర్చి
యాననద్యుతిఁ గప్పు నమలాక్షదీప్తు ల
న్గతి నంజనము గన్నుఁగవ నమర్చి
దరహాసరుచి వరాధరకాంతి మాన్పు న
న్వడువునఁ గెమ్మోవి వన్ని పూన్చి

గీ పాలఁతు లన్నింటికినిఁ బోలుపొందు గాఁగ
నెరయఁ గైసేయు నెపమున మఱువుసేసి
మేర కగ్గలమై పర్వు మెఱుఁగు లెల్ల
వరుస నలఁతికిఁ దెచ్చిరి వెరవు మెఱసి 10

అర్థము. మణి - భూషణ - ప్రభన్ = రత్నాలంకారముల కాంతిని, తను-కాంతి = శరీర కాంతి, వెలయనీదు = ప్రకాశింపనీదు, అను - లీలన్ = అనురీతిని, మేనన్ = శరీరమునందు, చందనము = మంచిగంధము, అలంది = పూసి,

కచ - నీల - భాతి = వెండ్రుకల నల్లనికాంతి, దెసలు = దిక్కులు, చీఁకటి+ కొల్పున్ = చీఁకటిగాఁ జేయును, అనుకరణిన్ = అను విధమున, వేనలిన్= కొప్పునందు, జాది - విరులు = జాజిపూలు, అమర్చి = పెట్టి

అమల + అక్ష - దీప్తులు = నిర్మలములయిన కన్నుల కాంతులు, ఆనన-ద్యుతిన్ = ముఖకాంతిని, కప్పున్, అన్ + గతిన్ = అనువిధమున, కన్నుఁగవన్ (కన్ను + కవన్) = కన్నుల జంటయందు, అంజనమున్ = కాటుకను, అమర్చి,

దర - హాస - రుచి = చిఱునగవు కాంతి, వర + అధర - కాంతిన్ = మేలయిన క్రిందిపెదవికాంతిని, మాన్పున్ = పోఁగొట్టును, అన్ + వడువునన్ = అనువిధమున, కెమ్మోవిన్ (కెంపు + మోవి) = ఎఱ్ఱని పెదవియందు, వన్ని - పూన్చి= రంగుపూసి

పొలఁతులు = స్త్రీలు - చెలులు, వెరవు - మెటసి = ఉపాయమొప్ప, అన్నింటికినిన్, పోలుపొందు + కాఁగన్ = సంబంధసామరస్యముండునట్లు, నెలయన్ = పూర్తిగా, కైసేయు - నెపమునన్ = అలంకరించు వ్యాజమున, మఱువు + చేసి = దాఁచి, మేరకున్ + అగ్గలము + ఐ = హద్దును మించి, పర్వు = వ్యాపించు, మెఱుఁగులు + ఎల్లన్ = కాంతులన్నియును, వరుసన్ = క్రమముగా, అలతికిన్ = హద్దునకు, తెచ్చిరి

తాత్పర్యము. రత్నాలంకారముల కాంతిని శరీరకాంతి ప్రకాశింపనీదు అని శరీరమునఁ జందన మలఁది, శిరోజముల నల్లనికాంతి దెసలను జీఁకటిగాఁ జేయునని కొప్పున జాదిపూలు పెట్టి, నిర్మలములయిన కన్నులకాంతులు ముఖకాంతిని గప్పివేయునని కనుఁగవయందుఁ గాటుక పెట్టి, చిఱునగవు కాంతి క్రీఁబెదవి కాంతిని బోఁగొట్టునని కెమ్మోవిని రంగుపూసి, చెలికత్తెలు ఉపాయ మొప్పఁగా అన్నిటికిని సంబంధ సామరస్య ముండునట్లు పూర్తిగా నలంకరించు వ్యాజమున దాఁచి మితిమీఱి వ్యాపించు కాంతులనన్నిటిని హద్దులోనుంచిరి

విశేషములు . కన్ను అనునర్థమున అక్షిన్ శబ్దమునకు బదులుగా అక్ష శబ్దమును బ్రయోగించుట విశేషము కెమ్మోవి - కెంపు + మోవి 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు గొండొకచోఁ గానంబడియెడి ' బాల సంధి 39

చ అలకల కాంతిఁ గప్పె లలితాక్షవిభాతి, నిజాలకాక్షసం
చలతరదీప్తిఁ గప్పె విలసత్స్మితదీధితి పర్వి, లీలతో
నతికతలాలకాక్ష దరహాస గభస్తి నుతాధరారుణో
జ్జ్వల రుచి గప్పె, నన్నిటికి వన్నువ వెట్టినమాడ్కిఁ బొల్పుగాన్ 11

అర్థము. లలిత + అక్ష - విభాతి = మనోహరములయిన కన్నుల కాంతి, అలకల - కాంతిన్ = ముంగురుల కాంతిని, కప్పెన్, నిజ = తనదైన, అలక + అక్ష= సంచలతర - దీప్తిన్ = ముంగురులయుఁ, గన్నులయు మిక్కిలి చలించు కాంతిని, విలసత్ - స్మిత - దీధితి = ప్రకాశించుచున్న నవ్వుయొక్క కాంతి, పర్వి, కప్పెన్, లీలతోన్ - విలాసముతో, అలిక గభస్తిన్, అలిక - తల = ఫాల ప్రదేశమునందలి, అలక = ముంగురులు, అక్ష = కన్నులు, దరహాస = చిఱునవ్వు (అనువాని), గభస్తిన్ = కాంతిని, నుత + అధర + అరుణ + ఉజ్జ్వల - రుచి = పొగడఁబడిన క్రీఁబెదవి యొక్క ఎఱ్ఱని ప్రకాశవంతమైన కాంతి, అన్నిటికిన్, వన్నువ = వర్ణము, పెట్టిన - మాడ్కిన్ = పెట్టిన విధమున, పొల్పుగాన్ = ఒప్పుగా, కప్పెన్

తాత్పర్యము పార్వతి సుందరములయిన కన్నుల కాంతి ముంగురుల కాంతిని గప్పెను ముంగురులయుఁ గన్నులయుఁ గాంతిని చిఱునవ్వు కాంతి వ్యాపించి కప్పెను ఫాలమునందలి అలకలు, అక్షులు, చిఱునవ్వు అనువాని కాంతిని గ్రీఁబెదవిదైన అరుణకాంతి అన్నిటికిని రంగుపూసిన విధమున, ఒప్పుగాఁ గప్పెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష

వ అయ్యవసరంబున 12

అర్థతాత్పర్యములు. ఆ + అవసరంబునన్ = ఆ సమయమున, తరువాతి పద్యముతో నన్వయము

సీ శృంగారరాజ్యలక్ష్మికి ముడిఁ గలిపిన
గతి హంసతిలకంబుఁ గబరిఁ బూన్చి
మరు రాజధానికి మణివప్ర మిడుగతిఁ
గటి నూత్నరత్నమేఖల యొనర్చి
యెలదూఁడు చక్రవాకులకు మేపించిన
గతి హారలత సన్నుఁగవ నమర్చి
సౌభాగ్యలావణ్యసతులఁ దూన్చియచూచు
గతిఁ గర్ణముల వస్తుఖచితకర్ణ

తే పూరములు వెట్టి తూఁగాడఁ బొలుఁతు లొండ్లు
నవయవంబుల కన్నింటి కవయమైన
పసదనంబులు నూల్కొల్పి భావమెసఁగఁ
జేసి రుమకు శృంగారంబు చెలువుమిగుల 13

అర్థము పొలుఁతులు = పొలఁతులు = స్త్రీలు - చెలికత్తెలు, శృంగార - రాజ్య - లక్ష్మికిన్ = శృంగార రాజ్యమనెడు లక్ష్మికి, ముడిన్ = కిరీటమును, కలిపిన - గతిన్ = పెట్టిన విధమున, కబరిన్ = కొప్పునందు, హంసతిలకంబున్ = రాగిడిబిళ్లను, పూన్చి = అమర్చి,

మరు - రాజధానికిన్ = మన్మథుని ముఖ్యపత్తనమునకు, మణి - వప్రము= రత్నమయమైన ప్రాకారము, ఇడు - గతిన్ = ఇచ్చురీతిని, కటిన్ = మొలయందు, నూత్న - రత్న - మేఖల = క్రొత్తదియగు రత్నమయమైన మొలనూలు, ఒనర్చి = అమర్చి

చక్రవాకులన్ = ఆఁడుఁజక్కవలకు, ఎలతూఁడు = లేఁదూఁడు, మేపించిన గతిన్ = తినిపించిన విధమున, చన్ను + కవన్ = చన్నులజంటయందు, హారలతన్= తీఁగవంటి పేరును, అమర్చి

సౌభాగ్య - లావణ్య - సతులన్ = సౌభాగ్యము, లావణ్యముగల స్త్రీలను, తూర్చి + అ - చూచు - గతిన్ = తూనిక వేసియే చూచు విధమున, కర్ణములన్= చెవులందు, వస్తు - ఖచిత - కర్ణపూరరములు = బంగారముతోఁ జెక్కఁబడిన కర్ణాభరణములు, తూఁగాడన్= చలించునట్లు పెట్టి, ఒండ్లు + అవయవంబులకున్+ అన్నిటికిన్ = ఇతరాంగముల కన్నిటికిని, అవయము + ఐన = రంజకములయిన, పసదనంబులు = అలంకారములు, నూల్కొల్పి × నెలకొలిపి, భావము + ఎసఁగన్= శృంగారభావ మతిశయించునట్లు, చెలువు-మిగులన్ = అంద మతిశయించునట్లు, ఉమకున్ = పార్వతికి, శృంగారంబు = అలంకారము, చేసిరి

తాత్పర్యము . చెలికత్తెలు శృంగార మనెడు రాజ్యలక్ష్మికిఁ గిరీటమును బెట్టినట్లు కొప్పున రాగిడిబిళ్లను అమర్చి, మన్మథుని రాజధానికి మణిమయ ప్రాకారమును నిర్మించువిధమున మొలయందు, నూత్నరత్నముల మొలనూలు నమర్చి, ఆఁడుజక్కవలకు లేఁదూఁడు మేపిన విధమునఁ జనుఁగవయందుఁ దీఁగవంటి హారము నమర్చి, సౌభాగ్యము, లావణ్యముగల సతులను దూనికవేసి చూచులాగునఁ జెవులందుఁ గర్ణాభరణములను బెట్టి, ఇతరావయవముల కన్నిటికిని రంజకమైన అలంకారములు అంద మతిశయింప, శృంగారభావము మిగులఁ బార్వతికిఁ బెట్టిరి

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

క తొడవులు తదవయవములకుఁ
దొడవులొ ? సతి యవయములు తొడవుల కమరం
దొడవులొ ? యని తర్కించుచుఁ
బడఁతులు గైనేసి రచలపతిసుత కెలమిన్ **14**

అర్థము: తొడవులు = ఆభరణములు, తద్ + అవయవములకున్ = ఆమె అవయవములకు, తొడవులొ = ఆభరణములో, సతి = పార్వతియొక్క, అవయవములు, తోడవులకున్, అమరన్ = ఒప్పునట్లు, తొడవులొ, అని,

తర్కించుచున్ = ఆలోచించుచు, పడఁతులు = స్త్రీలు - చెలులు, అచల - పతి-సుతకున్ = కొండలేని కూఁతునకు - పార్వతికి, ఎలమిన్ = ప్రీతితో, కైసేసిరి = అలంకరించిరి

తాత్పర్యము . పార్వతి అవయవముల కాభరణము లాభరణములో, ఆభరణముల కామె అవయవములే ఆభరణములో యని తర్కించుచుఁ జెలికత్తెలు పార్వతిని ప్రీతితో నలంకరించిరి

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క మలయజపంకము ననువుగ
నలఁదిన మైఁదీఁగ వెలిఁగె నంబుజరాగా
మలమణిశలాకపయి వె
న్నెల పర్విన కరణి ధారుణీధరసుతకున్ 15

అర్థము . ధారుణీధర - సుతకున్ = కొండ కూఁతునకు - పార్వతికి, మలయజ - పంకమున్ = మంచి గంధపు బురదను, అనువుగన్ = బాగుగా, అలఁదిన = పూసిన, మైఁదీఁగ = తీఁగవంటి శరీరము, అంబుజరాగ + అమల - మణి - శలాకపయిన్ = పద్మరాగ మనెడి మణితోఁ జేయఁబడిన కమ్మిపయిని, వెన్నెల, పర్విన = వ్యాపించిన, కరణిన్ = విధమున, వెలిఁగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము : మంచిగంధపుఁబంకము బాగుగా నలఁది పార్వతి మైఁదీఁగ పద్మరాగమణిశలాకపై వెన్నెల వ్యాపించినట్లు వెలిఁగెను

విశేషములు . అలంకార ముపమ

క లలితాంగంబుల నన్నిటఁ
గలయన్ మణిభూషణములు గదిసి బెడంగై
వెలిఁగె నగరాజనందన
పొలుపుగ నవకల్పలతిక పూచిన భంగిన్ 16

అర్థము . లలిత + అంగంబులన్ + అన్నిటన్ = మనోహరములయిన అవయవముల నన్నిటియందును, కలయన్ = బాగుగా, మణి- భూషణములు = రత్నాలంకారములు, కదిసి = కూడి, బెడంగు + ఐ = అందమై, నగ - రాజ - నందన = కొండలేని కూఁతురు - పార్వతి, పొలుపుగన్ = ఒప్పుగా, నవ - కల్ప-

లతిక = క్రొత్త కల్పలత, పూచిన - భంగిన్ = పుష్పించిన విధమున, వెలిఁగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము మనోహరములయిన అవయవముల నన్నిటను రత్నాలంకారములు గూడి చక్కనయి పార్వతి నవకల్పలత పుష్పించిన విధమున నుండెను

విశేషములు అలంకార ముపమ

వ **అట్లు గైనేసి సతు లగజకు నిలువుటద్దంబు సూపిన** 17

అర్థము అట్లు, కైసేసి = అలంకరించి, సతులు = స్త్రీలు - సఖులు, అగజకున్ = పార్వతికి, నిలువుటద్దంబు (నిలువు + అద్దంబు) చూపినన్

తాత్పర్యము. ఆ రీతిగా నలంకరించి సఖులు పార్వతికి నిలువుటద్దము చూపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. నిలువుటద్దము - నిలువు + అద్దము 'కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు ' బాల సంధి 28

క **ఆ రమణి సుందరాకృతి**
గారవమునఁ దగులు మిగిలి కనుఁగొన నా శృం
గారాధిదేవతాకృతి
నారయఁ బ్రతిబింబ మెనఁగె నద్దములోనన్ 18

అర్థము. ఆ - రమణి - సుందర + ఆకృతిన్ = ఆ యింతి (పార్వతి) యొక్క, అందమైన ఆకారమును, గారవమునన్ = ఆదరముతో, తగులు - మిగిలి= ఆసక్తి అతిశయించి, కనుఁగొనన్ = చూడఁగా, ఆ - శృంగార + అధిదేవతా+ ఆకృతిన్ = ఆ శృంగారరసాధిదేవత ఆకారమును, అద్దములోనన్, ఆరయన్ = చూడఁగా, ప్రతిబింబము, ఎసఁగెన్

తాత్పర్యము. ఆ పార్వతి సుందరాకారమును మిక్కిలి ఆసక్తితో నద్దములోఁ జూడఁగా నా శృంగారరసాధిదేవత ప్రతిబింబ మన నొప్పెను

వ **అంత హిమవంతుఁడు గౌరీదేవి నుద్వాహమండపంబునకు రావించిన ననేకమణిభూషణప్రభాభాసిత యగుచు** 19

అర్థము అంతన్ హిమవంతుఁడు, గౌరీదేవిన్, ఉద్వాహమండపంబునకున్ = ఎవాహమండపమునకు, రావించినన్ = రప్పింపఁగా, అనేక - మణి - భూషణ - ప్రభా - భాసిత = పెక్కు రత్నాలంకారముల కాంతిచేఁ బ్రకాశించినది, అగుచున్

తాత్పర్యము అంత హిమవంతుఁడు గౌరీదేవిని వివాహమండపమునకు రావింపఁగా నామె పెక్కు రత్నాలంకారముల కాంతితోఁ బ్రకాశించుచు - తరువాతి పద్యములో నన్వయము

చ నసిచిన కల్పవల్లి మదనాగగతిన్ నడపాడఁ జొచ్చెనో
యనఁ జనుదెంచెఁ గండవడ మల్లన వెల్వడి బాలికాలితో
ఘనపటలంబువెల్వడు వికాసితతారకసంభృతేందులే
ఖ నయముఁ గ్రేణిసేయుచు నగప్రియనందన చెన్నువింతగాన్ 20

అర్థము నసిచిన = పూచిన, కల్పవల్లి = కల్పలత, మద - నాగ - గతిన్= మదించిన యేనుఁగు గమనముతో, నడపాడన్ + చొచ్చెనో + అనన్ = సంచరింపఁజొచ్చెనో యనఁగా, నగ-ప్రియ-నందన = పర్వత ప్రియ పుత్రిక - పార్వతి, చెన్ను = అందము, వింత + కాన్ = ఆశ్చర్యముగా, బాలికా = ఆలితోన్=బాలికల వరుసతో - చెలికత్తెల వరుసతో, కండవడము =తెరలోనుండి, అల్లనన్ = మెల్లఁగా, వెల్వడి, ఘన - పటలంబున్ = మేఘముల గుంపును,వెల్వడు= వెలువడునట్టి, వికాసిత - తారక - సంభృత + ఇందు - లేఖ - నయమున్ = ప్రకాశించిన నక్షత్రములతోఁ గూడిన చంద్రలేఖయొక్క విధమును, క్రేణి + చేయుచున్ = తిరస్కరించుచు, చనుదెంచెన్ = వచ్చెను

తాత్పర్యము. పూచిన కల్పలత మత్తేభగమనముతో సంచరింపఁజొచ్చెనా యనునట్లు పార్వతి అందము వింతగొలుపఁగాఁ, జెలికత్తెలతోఁ దెరలోనుండి వెలువడి, మేఘబృందమునుండి వెలువడు ప్రకాశించు నక్షత్రములతోడి చంద్రరేఖ విధమును దిరస్కరించుచు వచ్చెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష కండవడము వెల్వడి, ఘనపటలంబు వెల్వడు - కండవడము వలన నుండి వెల్వడి - ఘనపటలంబు వలన నుండి వెల్వడు - ఉండిశబ్దము పరమగుచుండఁగా వలనకు ద్వితీయాసప్తములు బాల కారక 11 వలన కాదేశంబగు ద్వితీయా సప్తములమోఁది యుండికి లోపము ప్రై కారక 11

సీ శ్రీ భారతీ సతుల్ చేరి కెలంకుల
మణి హేమదండ చామరలు వెట్ట
శచి యాదిగా సురసతు లెల్ల దర్పణాం
బర భూషణాదులు వట్టి రాఁగ
ధర్మచారిణి యరుంధతి యాదిగాఁ బేరఁ
టాండ్రయి మునిపత్ను లడరి నడవ
సురవరకిన్నర గరుడాసురోరగ
స్త్రీ లర్థితోఁ గొల్చి మ్రోల రాఁగ

ఆ శారదేందురుచులు సౌదామనులు మృదు
లతలు మణిగణములు సతుల రూపుఁ
దాల్చి వచ్చిరనఁగఁ, ద్రైలోక్య లావణ్య
రసముఁ గామరసము రాగరసము 21

ఆ పొంగి మేర దప్పి శృంగారవార్ధియై
కువలయమున వెల్లిగొనియె ననఁగ
వచ్చె నర్థితో వివాహమండపమున
వలయ నచలచక్రవర్తి తనయ 22

అర్థము. శ్రీ - భారతీ - సతుల్ = లక్ష్మీ సరస్వతీ దేవులు, కెలంకులన్= పార్శ్వములందు, చేరి, మణి - హేమ - దండ - చామరలు = మణిమయములు, స్వర్ణమయములునైన దండములుగల వింజామరములు, పెట్టన్ = వీవఁగా,

శచి - ఆదిగాన్ = శచీదేవి మొదలుగా, సుర -సతులు + ఎల్లన్ = దేవతాస్త్రీలందఱును, దర్పణ + అంబర - భూషణ + ఆదులు = అద్దము, వస్త్రములు, అలంకారములు మున్నగునవి, పట్టి - రాఁగన్ = తీసికొని రాఁగా,

ధర్మచారిణి = ధర్మము నాచరించునది అగు, అరుంధతి, ఆదిగాన్, ముని-పత్నులు = మునుల భార్యలు, పేరఁటాండ్రు + అయి = ముత్తయిదువలయి, అడరి = ఒప్పి, నడవన్ = నడవఁగా,

సుర - వర - కిన్నర - గరుడ + అసుర + ఉరగ - స్త్రీలు = దేవతాస్త్రీలు, కిన్నరాంగనలు, గరుడభామినులు, రాక్షసస్త్రీలు, నాగభామలు, అర్థితోన్ = కోరికతో, కొల్చి = సేవించి, మ్రోలన్ - రాఁగన్ = సమీపమున రాఁగా,

శారద + ఇందు - రుచులున్= శరచ్చంద్రకాంతులును, సౌదామనులున్= మెఱపులును, మృదు - లతలున్ = కోమలములైన తీఁగలును, మణి - గణములున్ = మణుల సమూహములును, సతుల - రూపున్ = స్త్రీల యాకారమును, తాల్చి = ధరించి, వచ్చిరి, అనఁగన్, త్రైలోక్య - లావణ్య - రసమున్ = ముల్లోకములందలి లావణ్య రసమును, కామరసమున్ = శృంగారరసమును, రాగ - రసమున్ = ప్రేమరసమును, పొంగి, మేరన్ + తప్పి = హద్దునుదాఁటి, శృంగార - వార్ధి + ఐ = శృంగార సముద్రమయి, కువలయమునన్= భూమండలమున, వెల్లి+ కొనియెన్ = ప్రవాహము కట్టెనో, అనఁగన్, అచల - చక్రవర్తి - తనయ = కొండలఱేని కూఁతురు - పార్వతి, అర్థితోన్ = కోరికతో, వివాహ - మండపమునన్ = పెండ్లి మండపమునందు, వలయన్ = సువాసన కలుగఁగా (?), వచ్చెన్

తాత్పర్యము . లక్ష్మీ నరస్వతీ దేవులు పార్శ్వములందు మణిమయస్వర్ణమయదండములుగల వింజామరములు వీవఁగా, శచి మొదలుగా దేవతాస్త్రీలందఱును అద్దము, వస్త్రములు ఆభరణములు మున్నగునవి పట్టుకొని రాఁగా, ధర్మచారిణియగు అరుంధతి మున్నుగా మునిపత్నులు ముత్తయిదువలఱు నడవఁగా, దేవతాస్త్రీలు, కిన్నరాంగనలు, గరుడభామినులు, నాగభామలు కోరి కొలిచి రాఁగా, శరచ్చంద్రకాంతులు, విద్యుత్తులు మృదులతలు, మణులు, స్త్రీ రూపములు ధరించి వచ్చిరనఁగా, ముల్లోకములందలి లావణ్యరసము, కామరసము, అనురాగరసము పొంగి హద్దుదాఁటి శృంగారసముద్రమై భూమండలమునఁ బ్రవాహముకట్టె ననఁగా, పార్వతి కోరికతో వివాహమండపమున సువాసన కలుగఁగా వచ్చెను

విశేషములు . 22 వ పద్యమునఁ జివరి పాదము 'అర్థి నచల చక్రవర్తి తనయ' అని సాహిత్య అకాడమీ ప్రతిలోఁ గలదు అర్థి అనఁగా ఆర్తి పార్వతి ఆర్తితో వచ్చెనన నర్థము లేదు మానవల్లివారి పత్రిలో 'వలయ నచల చక్రవర్తి'తనయ' అను పారము గలదు వలయన్ అనఁగా సువాసన కలుగఁగా అను నర్థమును వారే యిచ్చిరి అందుచే నదియే స్వీకరింపఁబడినది అలంకార ముత్ప్రేక్ష

వ ఇట్లు చనుదెంచి వివాహమందిరానూనమణికనకాంబరోద్గతానేక వర్ణంబుల కాత్మీయాంగప్రభ వన్ను వెక్కించుచును నుచితాస్థానంబగు నిజజనకు నూరుపీరంబున నుండె నంత నిటలతటాంబకు నభ్యంజనోద్వర్తన స్నానానంతరంబున

అర్థము ఇట్లు, చనుదెంచి = వచ్చి, వివాహ వర్ణంబులకున్, వివాహ-మందిర = పెండ్లియింటియందలి, అనూన = తక్కువకాని, మణి - కనక + అంబర = మణులనుండి, బంగారమునుండి వస్త్రములనుండి, ఉద్గత = బయలువెడలిన, అనేక - వర్ణంబులకున్ = పెక్కు రంగులకు, ఆత్మీయ + అంగ-ప్రభ = తనదైన అవయవముల కాంతి, వన్నువు = వర్ణము, ఎక్కించుచును = అతిశయింపఁజేయుచును, ఉచిత + ఆస్థానంబు + అగు = తగిన స్థానమైన, నిజ-జనకు + ఊరు - పీఠంబునన్ - తన తండ్రి ఒడిలో, ఉండెన్, అంతన్, నిటల - తట + అంబకు + అభ్యంజన + ఉద్వర్తన - స్నాన + అనంతరంబునన్ = ఫాలాక్షుని తలంటు, నలుగువెట్టుటలతోఁ గూడిన స్నానమునకుఁ బిమ్మట

తాత్పర్యము. ఇట్లు వచ్చి పెండ్లి యింటి అనల్ప మణి కనక వస్త్రముల నుండి వెలువడు పెక్కు వర్ణములకుఁ దన యవయవములనుండి వెలువడు పెక్కు వర్ణములకుఁ దన యవయవముల కాంతివర్ణమతిశయింపఁజేయుచు, ఉచితాస్థానమైన తన తండ్రి యొడిలో నుండెను అంత నిటలాక్షుని తలంటు నలుగువెట్టుటలతోఁ గూడిన స్నానమునకుఁ బిమ్మట తరువాతి పద్యముతో నన్వయము

పెండ్లి కొడుకగు నీశ్వరుని వర్ణన

సీ స్ఫటికాద్రిమీఁద విభ్రాజిల్లు వస్తు శృం
గంబు నా రత్నజూటంబు పూన్చి
శారదాభ్రంబుపైఁ జంద్రిక పర్వె నా
నునుపారు మేనఁ జందన మలంది
హైమాద్రితటమున నౌషధీలతికలు
నవిచె నా మణిభూషణములు దొడిపి
రజతాద్రి కెలఁకుల రాజార్కబింబంబు
లెలసె నా వజ్రకుండలయుగంబు

గీ. చెవుల నిడి శీతనగమున శిశిరపటల
మావహిల్లె నా విమలదివ్యాంబరములు
భావముగఁ గట్టి పెండిలి పసదనంబు
సేసె నమరేంద్రుఁ డా చంద్రశేఖరునకు 24

అర్థము. స్ఫటిక + అద్రి - మీఁదన్ = మేరుపర్వతముమీఁద, విభ్రాజిల్లు = ప్రకాశించునట్టి, వస్తు - శృంగంబు - నాన్ = బంగారు శిఖరమనఁగా, రత్న - జూటంబు = మణిమయమైన జడముడిని, పూన్చి = తాల్పఁజేసి,

శారద + అభ్రంబుపైన్ = శరత్కాలమేఘముపై, చంద్రిక = వెన్నెల, పర్వెన్ + నాన్ = వ్యాపించెననఁగా, నునుపారు = నున్ననైన, మేనన్ = శరీరమునందు, చందనము = మంచి గంధము, అలంది = పూసి,

హైమ + అద్రి - తటమునన్ = హిమవత్పర్వతపుఁజటియయందు, ఔషధీ - లతికలు = ఓషధులతీవలు, ననిచెన్ + నాన్ = పూచెననఁగా, మణి - భూషణములు = రత్నాలంకారములు, తొడిపి = ధరింపఁజేసి,

రజత + అద్రి - కెలఁకులన్ = వెండికొండ పార్శ్వములందు, రాజ + అర్క - బింబంబులు = చంద్రసూర్యమండలములు, ఎలసెన్ + నాన్ = ఉండెననఁగా, వజ్ర - కుండల - యుగంబు = వజ్రమయములైన కుండలముల జంట, చెవులన్, ఇడి = పెట్టి

శీత - నగమునన్ = మంచుకొండపై, శిశిర - పటలము = మంచు సమూహము, ఆవహిల్లెన్ + నాన్ = కలిగెననఁగా, విమల - దివ్య + అంబరములు = నిర్మలములు, దివ్యములునైన వస్త్రములు, భావముగన్ = అందముగా, కట్టి, అమర + ఇంద్రుఁడు = దేవేంద్రుఁడు, ఆ - చంద్రశేఖరునకున్ = చంద్రుఁడు శిరోభూషణముగాఁ గలవానికి - శివునకు, పెండిలి - పసదనంబు = వివాహాలంకారము, చేసెన్

తాత్పర్యము : మేరుపర్వతముపైఁ బ్రకాశించు బంగరుశిఖరమనఁగా మణిమయమైన జడముడిని ధరింపఁజేసి, శరత్కాలమేఘముపై వెన్నెల వ్యాపించెననఁగా నున్ననైన శరీరమున మంచిగంధమును బూసి, హిమవత్పర్వతపుఁజటియయందు ఓషధుల తీవలు పూచెననఁగా రత్నాలంకారములు ధరింపఁజేసి, కైలాసము పార్శ్వములఁ జంద్రసూర్యమండలము లుండెననఁగా వజ్రమయకుండలద్వయమును జెవులఁ బెట్టి, మంచుకొండపై హిమసమూహము కలిగె ననఁగా నిర్మలములు, దివ్యములు నైన వస్త్రము లందముగఁ గట్టి దేవేంద్రుఁడు ఆ చంద్రశేఖరునకు వివాహాలంకారము చేసెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

వ మఱియు ననేక సర త్రిసరపద కరాంగుళీయ కోదరబంధక కటిసూత్ర శింజినికాద్యనేకాలంకారాలంకృతుఁజేసి పసిండి యాయగంబున సురియ సురంగంబుగాఁ దొంగలిపట్టియం గట్టి చెన్నుమిగులం గైసేసిన 25

అర్థము. మఱియున్, అనేక సర - త్రిసర = ఆ పేర్లుగల హార విశేషములు, ఉదర బంధక = ఉదరమును బంధించు ఆభరణ విశేషము (ఒడ్డాణము), కటి - సూత్ర = మొలత్రాడు, శింజినికా = అందె, ఆది = మొదలగు, అనేక =పెక్కు, అలంకార = భూషణములచే, అలంకృతున్ = అలంకరింఁబడినవానినిగా, చేసి, పసిండి-ఆయగంబునన్ = బంగారు చిత్రకంబళమునందు, సురియ = చురకత్తి, సురంగంబు + కాన్ = ప్రకాశముగా, తొంగలి -। పట్టియన్ = వ్రేలాడుడాలున, కట్టి,, చెన్ను = అందము, మిగులన్ = అతిశయింపఁగా, కైనేసినన్ = అలంకరింపఁగా

తాత్పర్యము : మఱియు అనేక సరములు, త్రిసరములు అనుహార విశేషములు, పదములయు, హస్తములయు అంగుళీయకములు, ఉదరబంధకము, కటిసూత్రము, అందెయు మున్నగు పెక్కు భూషణములచే భూషితునిఁగావించి, బంగారుచిత్రకంబళమునందు చురకత్తి ప్రకాశమగునట్లు వ్రేలాడుడాలునఁగట్టి అంద మతిశయించునట్లు అలంకరింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క మేరకు నగ్గల మగు శృం
గారానూనానురాగకామరసంబుల్
చారుతరలీలఁ బురుషా
కారముఁ దాల్చె నన నీలకంరుం డొప్పెన్ 26

అర్థము. మేరకున్ + అగ్గలము + అగు = మితిమీఱినట్టి, శృంగార + అనూన + అనురాగ - కామరసంబుల్ - శృంగారరసము, తక్కువకాని ప్రేమరసము, కామరసము, చారుతరలీలన్ = మిక్కిలి చక్కనైన విధమున, పురుష + ఆకారమున్= పురుషరూపమును, తాల్చెన్ + అనన్ = ధరించె ననఁగా, నీలకంరుండు = నల్లని కంరముగలవాఁడు - శివుఁడు, ఒప్పెన్

తాత్పర్యము : హద్దుమీఱిన శృంగార ప్రేమ కామరసములు మిక్కిలి చక్కనైన విధమునఁ బురుషరూపమును ధరించెనా యనునట్లు శివుఁ డొప్పెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

వ అంత బృహస్పతి ముకుళితకరకమలుం డగుచు దేవా ! లగ్నం బాసన్నం బయ్యె విజయంచేయు మనిన సురగురుం గారుణ్యదృష్టి వలోకించుచు.

అర్థము . అంతన్, బృహస్పతి, ముకుళిత - కర - కమలుండు = ముడువఁబడిన హస్త పద్మములు గలవాఁడు - హస్తపద్మములు జోడించిన వాఁడు, అగుచున్, దేవా !, లగ్నంబు = ముహూర్తము, ఆసన్నంబు + అయ్యెన్= సమీపించెను, విజయంచేయుము = రమ్ము, అనినన్, సుర - గురున్ = దేవగురుని - బృహస్పతిని, కారుణ్య - దృష్టిన్ = దయతోడి చూపుతో, అవలోకించుచున్ = చూచుచు

తాత్పర్యము అంత బృహస్పతి హస్తపద్మములు జోడించుచు 'దేవా ! ముహూర్తము సమీపించినది రమ్ము' అనఁగా బృహస్పతిని శివుఁడు దయాదృష్టితోఁ జూచుచు - తరువాతి పద్యముతో నన్వయము

సీ మానితంబైన హోమద్రవ్యములు గొని
వేలిమియొజ్జయై వేధ రాఁగ
హరి సురవల్లభు లిరుగెలంకుల డాసి
మణిహేమదండచామరలు వెట్ట
దిగధీశు లున్నతస్థిరభక్తియుక్తి నా
తత మౌక్తికాతపత్రంబు లూఁద
వాతపూరణములుఁ గేతనంబులుఁ బట్టి
సురవర కిన్నరుల్ వరుస రాఁగ

ఆ గణపుఁ డాదిగాఁగ గణముఖ్యు లందఱుఁ
గలసి బలసి వరుసఁ గొలిచి రాఁగ
మహిమతో వివాహమంటపమునకు స
ర్వేశ్వరుండు వచ్చె నిచ్చ మెచ్చి 28

అర్థము. వేధ = బ్రహ్మ, మానితంబు + ఐన = గౌరవింపఁబడిన, హోమ-ద్రవ్యములు = హోమార్థమైన వస్తువులు, కొని, వేలిమి + ఒజ్జ + ఐ = పురోహితుఁడయి, రాఁగన్,

హరి - సురవల్లభులు = విష్ణువు, ఇంద్రుఁడు, ఇరు + కెలంకులన్ = రెండు ప్రక్కలను, డాసి = సమీపించి, మణి - హేమ - దండ - చామరలు + పెట్టన్ = మణిమయ, స్వర్ణమయ దండములు గల వింజామరములు వీవఁగా,

దిశ్ (క్) + అధి + ఈశులు = దిక్పాలకులు, ఉన్నత - స్థిర - భక్తి - యుక్తిన్ = గొప్పది, స్థిరమైనది అగు భక్తితో, ఆతత - మౌక్తిక + ఆతపత్రంబులు = విశాలమైన ముత్యాల గొడుగులు, ఊఁదన్ = పట్టుకొనఁగా,

సురవర - కిన్నరుల్ = దేవతాశ్రేష్ఠులును, కిన్నరులును, వాత పూరణములున్ = ధ్వజవిశేషములును, కేతనంబులున్ = ధ్వజములును, పట్టి, వరుసన్, రాఁగన్, పేరు గణపుఁడు, ఆది + కాఁగన్ = మొదలుగా, గణ-ముఖ్యులు = గణ ప్రధానులు, అందఱున్, కలసి, బలసి = చుట్టుఁజేరి, వరుసన్, కొలిచి, రాఁగన్,

సర్వ + ఈశ్వరుండు, ఇచ్చన్ = మనసునందు, మెచ్చి, మహిమతోన్ = గొప్పతనముతో,వివాహ - మంటపమునకున్ = పెండ్లిమండపమునకు, వచ్చెన్

తాత్పర్యము . బ్రహ్మ మేలయిన హోమార్థవస్తువులు తీసికొని పురోహితుఁడయి రాఁగా, విష్ణువు, ఇంద్రుఁడు రెండుపార్శ్వములను జేరి మణి హేమ మయదండములు గల వింజామరలు వీవఁగా, దిక్పతులు అధికభక్తియుక్తులై ఆతతములైన ముత్యాలగొడుగులు పట్టుకొనఁగా, సురవరులును, కిన్నరులును వాతపూరణములును, ధ్వజములును బట్టుకొని వరుసగా రాఁగా, గణపుఁడు మున్నుగా గణప్రధాను లందఱును గలిసి చుట్టి వరుసగా సేవించుచు రాఁగా సర్వేశ్వరుఁడు మనస్సున మెచ్చి పెండ్లిమండపమునకు గొప్పతనముతో వచ్చెను

వ ఇట్లు చనుదెంచి తదీయవివాహవేదికాతలోపరి దుకూలాంబరాలంకృత మణిపీఠాసనాసీనుండై యున్నంత హైమవతి దేహార్ధంబు గైకొనం బ్రతినవట్టునట్లు తత్పీఠార్ధంబు నలంకరించుచు మరు నారాధనరత్న పాంచాలికయుంబోలె వెలుంగుచు 29

అర్థము. ఇట్లు, చనుదెంచి, తదీయ సీనుండై, తదీయ = ఆ, వివాహ-వేదికా - తల + ఉపరి = పెండ్లి యరంగుపై, దుకూల + అంబర + అలంకృత= సన్నని వస్త్రముచే నలంకరింపఁబడిన, మణి - పీఠ + ఆసన + ఆసీనుండు + ఐ= రత్నమయమైన పీఠముపైఁ గూర్చున్నవాఁడయి, ఉన్నంతన్ (ఉన్న + అంతన్) = ఉండఁగా, హైమవతి = పార్వతి, దేహ + అర్థంబు = సగము శరీరమును, కైకొనన్= తీసికొనుటకు, ప్రతిన + పట్టునట్లు = ప్రతిజ్ఞ చేసిన విధమున, తద్ + పీఠ + అర్ధంబున్ = ఆ పీఠమునందలి సగమును, అలంకరించుచున్, మరు + ఆరాధన-రత్న - పాంచాలికయున్ + పోలెన్ = మన్మథుని ఆరాధించు రత్నాల బొమ్మవలె, వెలుంగుచున్ = ప్రకాశించుచు

తాత్పర్యము. ఇట్లు వచ్చి ఆ పెండ్లియరఁగుపైఁ గూర్చున్నయంతఁ బార్వతి శరీరార్ధభాగమును గైక్కొనఁ బ్రతిజ్ఞ చేసినట్లు ఆ పీఠమునందు సాఁబాలు నలంకరించుచు మన్మథుని సేవించు రత్నపాంచాలికవలెఁ బ్రకాశించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

పార్వతీశ్వరుల వివాహవర్ణన

చ లలితముఖాబ్జసౌరభవిలంపటషట్పదలీలఁగ్రాలఁ గుఁ
తలములు వానిఁ జోఁప నని తండడి నల్లిన లీల భాసురో
త్పలదలదామకం బనఁగ భాస్వదపాంగవిలోలదృగ్రుచుల్
పొలయఁగఁ జూచెఁ బార్వతి విభుం బ్రణయాతిరసావహంబుగన్ 30

అర్థము . కుంతలములు = శిరోజములు, లలిత లీలన్ లలిత = మనోహరమైన, ముఖ + అబ్జ = తామరవంటి ముఖముయొక్క సౌరభ - పరిమళమునందు, విలంపట = విశేషమైన ఆశగల, షట్పద - లీలన్ = తుమ్మెదల విధమున, క్రాలన్ = ఒప్పఁగా, వానిన్, చోఁపన్ + అని = త్రోలుటకని, తండడిన్= తత్క్షణమే, అల్లిన, నీల - భాసుర + ఉత్పల - దల - దామకంబు = నల్లనిది ప్రకాశించునది అగు కలువరేకుల దండ, అనఁగన్, పార్వతి, భాస్వత్ + అపాంగ-విలోల - దృశ్ (క్) + రుచుల్ + ప్రకాశించుచున్న క్రీఁగన్నుల చంచలములైన చూపులకాంతులు, పొలయఁగన్, వ్యాపించినట్లు, ప్రణయ + అతి - రస + ఆవహంబుగన్ = ప్రేమరసముగలుగునట్లు, విభున్ = భర్తను, చూచెన్

తాత్పర్యము . పార్వతి కుంతలములు ఆమె మనోహరమైన ముఖపద్మ పరిమళమునందు విశేషమయిన ఆశగల తుమ్మెదల విధమున నొప్పఁగా, వానిని ద్రోలుటకయి తత్క్షణమే అల్లిన నల్లనివి, ప్రకాశించెడివి అగు కలువరేకుల దండయనఁ బ్రకాశించు క్రీఁగన్నుల చంచలములైన చూపుల కాంతులు ప్రసరించునట్లు అనురాగరసముగలుగ నామె భర్తను జూచెను

విశేషములు . కుంతలములు షట్పదలీలఁగ్రాల -అలంకార ముపమ అల్లిన నీలభాసురోత్పలదలదామకం బనఁగ భాస్వదపాంగవిలోలదృగ్రుచుల్ పొలయఁగఁ జూచె - అలంకార ముత్ప్రేక్ష తండడి = తత్క్షణము - మా రా కవి యిచ్చిన అర్థము దృశ్ (క్) + రుచుల్ = దృగ్రుచుల్ దృక్కులను నల్లగను, తెల్లగను గూడ వర్ణించుట గలదు

వ అంత బృహస్పతిదత్త సుముహూర్తంబునం బరమేష్ఠి హోమపురస్సరంబుగా విధివిహితవిధానంబున గిరీశుండు గిరిజం బరిణయం బయ్యె నయ్యవసరంబున.

అర్థము. అంతన్, బృహస్పతి - దత్త - సుముహూర్తంబునన్ - బృహస్పతిచేత నీఁబడిన (పెట్టఁబడిన) మంచి ముహూర్తమునందు, పరమేష్ఠి హోమ -

పురస్సరంబుగాన్ = బ్రహ్మ (విహిత) హోమము ముందు నడుచునట్లుగా, విధి - విహిత - విధానంబునన్ = శాస్త్రముచే విధింపఁబడిన విధమున, గిరీశుండు = శివుఁడు, గిరిజన్ = పార్వతిని, పరిణయంబు + అయ్యెన్ = వివాహమాడెను ఆ + అవసరంబునన్ = ఆ సమయమున

తాత్పర్యము అంత బృహస్పతి పెట్టిన సుముహూర్తమున బ్రహ్మకృత హోమపురస్సరముగా శాస్త్రవిహితవిధానమున శివుఁడు పార్వతిని బెండ్లియాడెను ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ సప్తమునీంద్ర ప్రజాపతి ముని విప్ర
గణముల వేదఘోషణము లెసఁగె
బోరనఁ దుంబురు నారద కిన్నర
గంధర్వమంగళగాన మెసఁగె
సురవాద్య నందికేశ్వర వాద్యములు సమ
స్తంబులై పొలుపారి తద్దయడరె
జయఘంట కాహళ శంఖ కాంస్యక వేణు
వీణా నినాదముల్ విస్తరిల్లె

ఆ సంతతమును భక్తజన జయజయ శబ్ద
ములు దిగంత మడరి చెలఁగుచుండె
జలధు లేడుఁ గూడి చంద్రోదయంబున
ముదముతోడఁ బెరిఁగి మ్రోయునట్లు 32

అర్థము: జలధులు = సముద్రములు, ఏడున్ = ఏడును, కూడి, చంద్ర+ ఉదయంబునన్ = చంద్రుని పొడుపువేళ, ముదముతోడ్ = సంతోషముతో, పెరిఁగి = పొంగి, మ్రోయు + అట్లు = ధ్వనించు విధమున,

సప్త - ముని + ఇంద్ర - ప్రజాపతి - ముని - విప్ర - గణముల = ఏడ్వురు మునిశ్రేష్ఠులయు, బ్రహ్మలయు, మునులయు, బ్రాహ్మణులయు సమూహముల యొక్క, వేద - ఘోషణములు = వేదనాదములు, ఎసఁగెన్ = అతిశయించెను

బోరనన్ = అధికముగా, తుంబురు - నారద - కిన్నర - గంధర్వ = తుంబురుని, నారదుని, కిన్నరుల, గంధర్వుల, మంగళ - గానము = శుభమైన గానము, ఎసఁగెన్

సుర - వాద్య - నందికేశ్వర - వాద్యములు = దేవతల వాద్యములు, నందికేశ్వరుని వాద్యములు, సమస్తంబులు + ఐ = మొత్తములయి, పొలుపారి = ఒప్పి, తద్ద = మిక్కిలి, అడరెన్ = అతిశయించెను

జయ - ఘంట - కాహళ - శంఖ - కాంస్యక - వేణు - వీణా - నినాదముల్= జయఘంటల, పెద్ద ఢక్కల, శంఖముల, కంచు వాద్యముల, పిల్లనగ్రోవుల, వీణియల ధ్వనులు, విస్తరిల్లెన్ = వ్యాపించెను

సంతతమును = ఎల్లప్పుడును, భక్త - జన - జయ జయ- శబ్దములు= భక్తులైన జనుల యొక్క జయజయ అను ధ్వనులు, దిశ్ (క్)+ అంతము = దిక్కులకొన, అడరి = అలముకొని, చెలఁగుచున్ + ఉండెన్ = మ్రోయుచుండెను

తాత్పర్యము . సప్తసముద్రములును బొంగి చంద్రోదయసమయమున సంతోషమున నుప్పొంగి మ్రోయువిధమున సప్తమునీశ్వరులయు, ప్రజాపతులయు, మునులయు, బ్రాహ్మణులయు వేదధ్వను లతిశయించెను తుంబురు నారద కిన్నర గంధర్వుల మంగళగాన మధికముగా నతిశయించెను దేవతల వాద్యములు, నందికేశ్వరుని వాద్యములు మొత్తములై ఒప్పి మిక్కిలి విజృంభించెను జయ ఘంటల, పెద్ద ఢక్కల, శంఖముల, కాంస్య వాద్యముల వేణువుల వీణల నాదములు వ్యాపించెను నిరంతరమును భక్తజనుల జయజయశబ్దములు దిక్కుల కొనలవఱకు వ్యాపించెను

చ వరదు వివాహవేళ నభివాంఛితవస్తువు లెల్లవారికిన్
సురభులు బోరనం గురిసె, సూరెలఁ బర్వె రసప్రవాహముల్,
సురతరులిచ్చెఁ గోరికలు, సూచినచోటనె తోఁచె బెన్నిధుల్,
విరిసె మణుల్, మొగిం బరుసవేదులు నిండె జగ్రత్తయంబునన్ 33

అర్థము. వరదు - వివాహ - వేళన్ = వర ప్రదాతయైన ఈశ్వరుని యొక్క, వివాహ - వేళన్ = పెండ్లి సమయమున, ఎల్లవారికిన్ = అందఱికును, అభివాంఛిత - వస్తువులు = కోరిన వస్తువులు, సురభులు = కామధేనువులు, బోరనన్ = శీఘ్రముగా, కురిసెన్, రస - ప్రవాహములు = రసముల ప్రవాహములు, సూరెలన్ = ప్రక్కలందు, పర్వెన్ = వ్యాపించెను, సుర-తరులు = దేవతావృక్షములు, కోరికలు, ఇచ్చెన్, పెన్నిధుల్ (పెను + నిధుల్) చూచిన - చోటన్ + అ = చూచిన చోటనే, తోఁచెన్, మణుల్, విరిసెన్ = వ్యాపించెను, మొగిన్ = పూనికతో,

పరుసవేదులు= స్పర్శవేధులు - ఇనుమును బంగారముగాఁ జేయునట్టివి, జగత్+ త్రయంబునన్ = మూఁడు లోకములందును, నిండెన్

తాత్పర్యము. వరప్రదాతయైన యీశ్వరుని వివాహసమయమున నెల్లరకుఁ గోరినవస్తువులను గామధేనువులు శీఘ్రముగాఁ గురిసెను రస ప్రవాహములు పార్శ్వములఁ బ్రవహించెను కల్ప వృక్షములు కోరికల నిచ్చెను పెన్నిధులు చూచినచోటనే తోఁచెను మణులు వ్యాపించెను పరుపవేదులు ముల్లోకములందును నిండెను

వ తదవసరంబున **34**

అర్థతాత్పర్యములు తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క **సురనది దొలఁకాడ, సుధా**
కరరేఖ చలింప, నమరకాంతల కర చా
మరపవన మభవు జూటాం
తరమున విహరింపఁ దొడఁగెఁ దగు సుఖలీలన్ **35**

అర్థము. అమర - కాంతల - కర - చామర - పవనము = దేవతా స్త్రీల చేతులందలి వింజామరల గాలి, సుర - నది - ఆకాశగంగ, తొలఁకాడన్ (తొలఁకు+ ఆడన్) తొనఁకఁగను, సుధాకర - రేఖ = చంద్రకళ, చలింపన్ అభవు జూట + అంతరమునన్ = శివుని జడముడి లోపల, తగు సుఖ-లీలన్ = తగిన సుఖము గలుగునట్లు, విహరింపన్ + తొడఁగెన్ = వీవ నారంభించెను

తాత్పర్యము. దేవతాస్త్రీల చేతులందలి వింజామరల గాలి శివుని శిరస్సుపైఁ గల ఆకాశగంగ తొనఁకఁగను, చంద్రకళ చలింపఁగను, సుఖమగునట్లు అతని జడముడిలో వీవఁ దొడఁగెను

క **తేనియ ముసురో ? యమృతపు**
వానయొ ? పుండ్రేక్షురసము వఱ్ఱొడి పెల్లో ?
నా నలిఁ దుంబురు నారద
గానరసం బభవు నోలగంబునఁ బర్వెన్ **36**

అర్థము తేనియ - ముసురో = తేనె వానయో, అమృతపు వానయొ (అమృతము + వానయొ), పుండ్రేక్షు రసము = నలుపు గలసిన యెట్టి చెఱకు యొక్క, వల్మీడి = ప్రవాహముయొక్క పెల్లో = ఆధిక్యమో, నాన్ = అనఁగా, నలిన్= ఒప్పుగా, తుంబురు - నారద - గాన - రసంబు = తుంబురు నారదుల గానమనెడి రసము, అభవు + ఓలగంబునన్ = శివుని కొలువుకూటమున, పర్వెన్ = ప్రవహించెను

తాత్పర్యము . తేనెవానయో, అమృతవర్షమో, నలుపు గలసిన యెట్టి చెఱకురసము ప్రవాహము నాధిక్యమో అనఁగాఁ దుంబురునారదుల గానరసము శివుని కొలువుకూటమున నొప్పుగాఁ బ్రవహించెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష సందేహానుప్రాణితము అభవు + ఓలగంబునన్ 'షష్ఠీ సమాసమునం దుకార బుకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు ' బాల సంధి 34

వ అంతం దత వితత ఘన సుషిరాత్మకంబులై మృదు స్ఫుటాది లక్షణ లక్షితంబులై భరత నందికేశ్వరాది వాద్యనికరాతోద్యంబులు హృద్యంబులై చెలంగ నాస్థానంబు సురంగంబుగా రంభ నాట్యారంభంబున 37

అర్థము . అంతన్, తత -వితత - ఘన - సుషిర + ఆత్మకంబులు + ఐ = వీణలోనగువాద్యము, వీణ తంబురా మున్నగు తంత్రీవాద్యములు కంచుతాళము లోనగు వాద్యములు, పిల్లనగ్రోవిలోనగు వాద్యములు అనువానితోఁ గూడినవయి, మృదు-స్ఫుట + ఆది - లక్షణ - లక్షితంబులు + ఐ = మృదువు, స్ఫుటము మున్నగు లక్షణములు గలదయి, భరత - నందికేశ్వర + అది - వాద్య- నికర + ఆతోద్యంబులు = భరతుఁడు, నందికేశ్వరుఁడు మున్నగువారి వాద్యముల సమూహము, తతము, ఆనద్ధము, సుషిరము, ఘనము అనెడి వాద్య చతుష్టయము, హృద్యంబులు + ఐ = హృదయంగమములయి, చెలంగన్ = ధ్వనింపఁగా, ఆస్థానంబు = కొలువు, సురంగంబుగాన్ = మంచి రంగస్థలముగా, రంభ, నాట్య+ ఆరంభంబునన్ = నాట్యము మొదట

తాత్పర్యము: అంత తతము, వితతము, ఘనము, సుషిరము అనువానితోఁ గూడినవయి, మృదువు, స్ఫుటము మున్నగు లక్షణములు గలదయి, భరతుఁడు, నందికేశ్వరుఁడు మున్నగువారి వాద్యచతుష్టయము హృదయంగమమయి

ధ్వనింపఁగా ఆస్థానము మంచిరంగస్థలముగా రంభ నాట్య ప్రారంభమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . వాద్యములు చతుర్విధములు

తతములు . 20 పరివాదిని, చతుర్దశి, ఏకాదశి, త్రయోదశి, మహతి, బృహతి, కళావతి, కచ్ఛపి, వితతము, పినాకిని, పౌర్ణము, రావణహస్తము, ఉదుంబరము, షట్కర్ణము, హస్తభము, సారంగి, ఆలాపిని, రుద్రవీణ, వ్యాళీముఖము, బల- ఇవి కొడుపుతో వాయింపఁబడును

వితతములు . 18 ఝల్లరి, మురజము, భేరి, పటహము, కరక, కుడుక్క, హుడుక్క, ఢక్క, డమరుకము, నిస్సాణము, సోల్లుక, బాణము, తంబురి, దుందుభి, మడ్డువు, డిండిమము, ఝర్ఝరము, పణవము - ఇవి కొట్టి వాయింపఁబడును

సుషిరములు : 10 పాలిక, కాహలి, వాసము, ముసలి, మధుకరి, వంశము, శంఖము, శుకి, శృంగము, సుదుర్లపి ఇవి శ్వాసముతోఁ బూరింపఁబడును

ఘనములు . 6 కాంస్యము, తాళము, ఘంటిక, జయఘంట, కర్మ

చ **అలఁతులు నిల్వ హస్తమున, హస్త విలాసముతోఁ బెనంగఁ జూ**
డ్కులు, దెలిచూడ్కులం దెలమిఁగూడి రమింప మనంబు తన్మనో
బలమున నుల్లసిల్ల నిజభావము, భావ విశేష సంపదల్
వెలయ రసంబులం దభినవించె రసంబులు సాంగకంబుగన్ 38

అర్థము అలఁతులు = ముఖవీణ, తాళము మొదలగు నుపాంగంబులు, హస్తమునన్= చేతియందు, నిల్వన్ = ఉండఁగా, హస్త - విలాసముతోన్ = హస్తములలీలతో, చూడ్కులు = చూపులు, పెనంగన్ = కూడఁగా, మనంబు = మనస్సు, తెలి - చూడ్కులందున్ = తెల్లని చూపులందు, ఎలమిన్ = ప్రీతితో, కూడి రమింపన్ = క్రీడింపఁగా, తద్ + మనస్ (ఃు) + బలమునన్ = ఆ మనశ్శక్తితో, నిజ - భావము = తనదైన భావము, ఉల్లసిల్లన్ = ప్రకాశింపఁగా, భావ - విశేష - సంపదల్ = విశిష్టములైన భావసంపదలు, రసంబులన్ = శృంగారాది రసములందు, వెలయన్ = ప్రకాశింపఁగా, రసంబులు, సాంగకంబుగాన్ = సావయవముగా, అభినవించెన్ = క్రొత్తగాఁ గలిగెను

తాత్పర్యము హస్తమునందుఁ దాళాద్యుపాంగము లుండఁగా, హస్త విలాసముతోఁ జూపులు పెనఁగఁగా, తెలిచూడ్కులతో మనస్సు ప్రీతితోఁ గూడి రమింపఁగా, ఆ మనోబలమున స్వీయభావ ముల్లసిల్లఁగా, భావవిశేషసంపదలు రసములందుఁ బ్రకాశింపఁగా, శృంగారాదిరసములు సావయవములై క్రొత్తగాఁ గలిగెను

మన్మథుఁడు పునర్జీవితుఁ డగుట

వ అయ్యవసరంబున సర్వేశ్వరుండు పార్వతీసమేతుండై పరమసుఖలీలఁ దగిలి ప్రసన్నుండై యున్నకన్నెఱింగి సురవరులు కామోత్పత్తి కిదియ యవసరంబని త్రినయను కరుణ వడసి మనసిజుం బడయ నుద్యుక్తులై భక్తి పూర్వకంబున 39

అర్థము . ఆ + అవసరంబునన్ = ఆ సమయమున, సర్వేశ్వరుండు, పార్వతీ - సమేతుండు + ఐ = పార్వతితోఁగూడినవాఁడయి, పరమ - సుఖ - లీలన్ = మిక్కిలి సుఖమునందు, తగిలి = ఆసక్తి గలవాఁడై, ప్రసన్నుండు + ఐ = అనుగ్రహము గలవాఁడయి, ఉన్న కన్నెఱింగి = ఉన్న జాడ తెలిసి, సురవరులు = దేవతాశ్రేష్ఠులు, కామ + ఉత్పత్తికిన్ = మన్మథోదయమునకు, ఇది + అ = ఇదియే, అవసరంబు + అని = సమయమని, త్రినయన - కరుణ = ముక్కంటి దయ, పడయన్ = పొందుటకు, ఉద్యుక్తులు + ఐ = ప్రయత్నించినవారయి, భక్తి + పూర్వకంబునన్

తాత్పర్యము . ఆ సమయమున సర్వేశ్వరుఁడు పార్వతీసహితుఁడయి మిక్కిలి సుఖమునందాసక్తి గలిగి ప్రసన్నుఁడైయున్న జాడ తెలిసి దేవతలు మన్మథోదయమునకు ఇదియే అదనని ముక్కంటి దయ పొంద నుద్యమించినవారయి, సభక్తికముగా - తరువాతి పద్యముతో నన్వయము

క తనువుల ముత్పులకావలి
దనరఁగ శివుపాదయుగముఁ దల నిడికొని యా
వనజభవాచ్యుతు లొప్పిరి
కనుఁగొనఁ జెందమ్మివిరుల కామల పోలెన్ 40

అర్థము. ఆ - వనజభవ + అచ్యుతులు= ఆ బ్రహ్మ విష్ణువులు,తనువులన్= శరీరములందు, ముద్ + పులక + ఆవలి = సంతోషమువలని గగుర్పాటుల

వరుస, తనరఁగన్ = ఒప్పఁగా, శివు - పాద - యుగమున్ = శివుని అడుగులజంటను,తలన్ = శిరస్సున, ఇడికొని = పెట్టుకొని, కనుఁగొనన్ = చూడఁగా, చెందమ్మి (చెన్ను + తమ్మి) విరుల = ఎఱ్ఱ తామర పువ్వులయొక్క, కామలపోలెన్ = కాడల విధమున, ఒప్పిరి

తాత్పర్యము ఆ బ్రహ్మ విష్ణువులు తమ శరీరములందు సంతోషమువలని గగుర్పాటులు కలుగఁగా శివుని పాదముల జంటను శిరస్సులపైఁ బెట్టుకొని యెఱ్ఱతామరపూల కాడల వలె నొప్పిరి

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష శివుని పాదములను బ్రహ్మ విష్ణువులు శిరములఁ బెట్టుకొని యెఱ్ఱ తామరకాడలవలె నొప్పిరనుటచే, శివుని పాదము లెఱ్ఱతామరలవలె నున్న వను విషయము భంగ్యంతరమున గమ్యమానమగుచున్నది కావున పర్యాయోక్తాలంకారమును గలదు "పర్యాయోక్తం తు గమ్యస్య వచో భఙ్గ్యన్తరాశ్రయమ్'- చంద్రా

వ అంత సురగురుండు కరకమలంబులు మొగిడ్చి సంస్తుతి పూర్వకంబుగ నభవు నభిముఖుం జేసికొని 41

అర్థము అంతన్, సుర-గురుండు = దేవతల గురువు - బృహస్పతి, కర-కమలంబులు = హస్తపద్మములు, మొగిడ్చి = ముడిచి (నమస్కరించి), సంస్తుతి - పూర్వకంబుగన్ = స్తోత్రపురస్సరముగా, అభవున్ = శివుని, అభిముఖున్= సుముఖుని, చేసికొని

తాత్పర్యము అంత దేవగురుఁడైన బృహస్పతి హస్తపద్మములు జోడించి స్తోత్రపూర్వకముగా శివుని సుముఖునిఁజేసికొని - తరువాతి పద్యముతో నన్వయము

గీ దేవకార్యంబుగా మహాదేవితోడ
మీకు సంగతి గావించి మెచ్చువడయ
వచ్చెఁగా కంగభవుఁడు ని న్నిచ్చ నెఱిఁగి
యెఱిఁగి పైనెత్తి రా నెన్ని యెడలు గలవు ? 42

అర్థము అంగభవుఁడు = అంగజుఁడు - మన్మథుఁడు, దేవ-కార్యంబు+ కాన్ = దేవతల ప్రయోజనమగునట్లు, మహాదేవితోడన్ = పార్వతితో, మీకున్,

సంగతి = కలయిక, కావించి, మెచ్చు + పడయన్ = మెప్పు పొందుటకు, వచ్చెన్+ కాక = వచ్చెనుగాని, నిన్నున్ + ఇచ్చన్= నిన్ను మనస్సునందు, ఎఱిఁగి+ఎఱిఁగి = తెలిసితెలిసి, పైన్ + ఎత్తి - రాన్ = పైకి దండెత్తివచ్చుటకు, ఎన్ని + ఎడలు + కలవు = ఎన్ని గుండెలు గలవు ?

తాత్పర్యము. మన్మథుఁడు దేవతల కార్యమునకయి మహాదేవి(పార్వతి)తో నిన్నుఁగూర్చి మెప్పు పొందుటకు వచ్చెనుగాని నిన్నుఁ గూర్చి మనసునఁ దెలిసితెలిసి నీపైకి దండెత్తి వచ్చుట కతని కెన్ని గుండెలు గలవు ?

విశేషములు. నిన్నిచ్చన్ = అనుచో 'నిన్ + ఇచ్చన్' అనిగాక నిన్నున్ + ఇచ్చన్ అని విభజించుట = 'జడ్డక్కరంబుతోఁ బదాదిస్వరంబు గూడుచో జడ్డకు లోపంబు లేదు' బాల ప్రకీర్ణ 9 అనుటచే నిన్నున్ + ఇచ్చన్ = నిన్నిచ్చన్ 'ప్రథమేతరవిభక్తి శత్రర్థచువర్ణకంబులందున్న యుకారంబునకు సంధివైకల్పికముగా నగును' బాల సంధి 2

వ ఆదియునుంగాక - తరువాతి పద్యముతో నన్వయము 43

క కడుకొనక తప్పఁజూచినఁ
జెడు లోకము లనుట యిది ప్రసిద్ధము జగతిన్
మృడ ! నీవు చక్కఁజూచినఁ
జెడియె మనోభవుఁ డిదియు విచిత్రము గాదే ?" 44

అర్థము: కడుకొనక = ఉత్సహింపక, తప్పన్ + చూచినన్ = కోపముతోఁ జూడఁగా, లోకములు, చెడున్, అనుట, ఇది, జగతిన్, ప్రసిద్ధము, మృడ = ఓయి శివా ! నీవు, చక్కన్ + చూచినన్ = మంచి చూపుతోఁ జూడఁగా - ఋజువుగాఁ జూడఁగా, మనోభవుఁడు = మన్మథుఁడు, చెడియెన్, ఇదియున్, విచిత్రము + కాదే = వింతకాదా ?

తాత్పర్యము. క్రోధముతోఁ జూచినచో లోకములు చెడుననుట లోకమునఁ బ్రసిద్ధము కాని ఓయి శివా ! నీవు మంచిగాఁ జూచినను మన్మథుఁడు చెడెను ఇది వింతకదా !

వ. అని వెండియు నిరతిశయతపఃక్లేశం బెఱింగించి మదను దయ సేయవలయునని మ్రొక్కియున్న సురగురు ప్రముఖాఖిల సురవరులకు వరదుండు కరుణించి యంగజుండు జగంబుల కనంగుఁడై రతికిం బ్రాక్తన

స్వరూపుండై ప్రవర్తించునని వరంబిచ్చి యతని పూర్వనియోగంబును దయసేసిన నక్షణంబ

అర్థము అని, వెండియున్ = మరల, నిరతిశయ - తపస్ (ఃు) + క్లేశంబు = అత్యధికమైన తపస్సు యొక్క కష్టము, ఎటింగించి,మదనున్= మన్మధుని, దయ + చేయవలయున్ = కరుణింపవలయును, అని, మ్రొక్కి + ఉన్నన్ = నమస్కరించి యుండఁగా, సుర-గురు-ప్రముఖ + అఖిల - సురవరులకున్= బృహస్పతిమున్నగు నెల్లదేవతాశ్రేష్ఠులకును, వరదుండు = ఈశ్వరుఁడు, కరుణించి= దయఁజూచి, అంగజుండు = మన్మథుఁడు, జగంబులకున్, అనంగుండు + ఐ = అంగము లేనివాఁడయి, రతికిన్, ప్రాక్తన - స్వరూపుండు + ఐ = పూర్వస్వరూపము గలవాఁడయి, ప్రవర్తించున్, అని, వరంబు, ఇచ్చి అతని - పూర్వ - నియోగంబును= అతనియొక్క పూర్వపుటధికారమును, దయ + చేసినన్ = అనుగ్రహింపఁగా, అక్షణంబ = వెంటనే

తాత్పర్యము అని మఱియును అత్యధికమైన తపఃకష్టము నెఱింగించి, మన్మథుని దయఁజూడవలయునని నమస్కరించియున్న బృహస్పతి మున్నగు నెల్ల దేవతాశ్రేష్ఠులను శివుఁడనుగ్రహించి "మన్మథుఁడు లోకముల కనంగుఁడై, రతికిఁ బూర్వస్వరూపుఁడై యుండు" నని వరమిచ్చి యతని పూర్వాధికారమును అనుగ్రహింపఁగా, వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము

సీ మలయుచుఁ బొలుపారు మకరకేతనముతో
నెలరారు గెందలిరెల్లి గ్రాలఁ
దళుకొత్తు నెత్తావి యలరంపపొదులతో
మేలిమ్ము నించువి ల్లేల నమరఁ
జెలరేఁగు నలిపిక కుల నినాదములతో
రాజకీరాలాపరవము లులియ
వేచి సమ్మదలీల వీచు తెమ్మెరలతో
నలి వసంతుఁడు గూడి నడవ నొండ

గీ కామసుఖములతోఁ బూర్వకామకేళి
కామచిహ్నలు మెయి సురంగంబు గాఁగ
నెఱయఁ గైనేసి జవనిక దెఱచి వచ్చు
చెలువుతో వచ్చి రతిమ్రోల నిలిచె మరుఁడు 46

అర్థము . మలయుచున్ = చలించుచు, పొలుపారు = ఒప్పునట్టి, మకర-కేతనముతోన్ = మొసలి ధ్వజముతో, ఎలరారు = ప్రకాశించు, కెందలిరు (కెంపు+ తలిరు) + ఎల్లి = ఎఱ్ఱని చివురుగొడుగు, క్రాలన్ = ఒప్పఁగా

తళుకొత్తు = మిక్కిలి ప్రకాశించు, నెత్తావి (నెఱ + తావి) = నిండు పరిమళము గల, అలరంపపొదులతోన్ = అలరు + అమ్మ + పొదులతోన్ = చివురుటమ్ముల పొదులతో, మేలిల్లు = శ్రేష్ఠమైన, ఇంచువిల్ = చెఱకువిల్లు, కేలన్= చేతియందు, అమరన్= ఒప్పఁగా

చెలరేఁగు = విజృంభించు, అలి - పిక - కుల - నినాదములతోన్ = తుమ్మెదల, కోకిలముల సమూహముల ధ్వనులతో, రాజకీర + ఆలాప - రవములు = రాచిలుకల మాటల ధ్వనులు, ఉలియన్ = మ్రోయఁగా,

వేచి = ప్రతీక్షించి, సమ్మద - లీలన్ = సంతోషపురీతితో, వీచు = వీచునట్టి, తెమ్మెరలతోన్ = మందమారుతముతో, నలిన్ = ఉత్సాహముతో, వసంతుఁడు, కూడి, ఒండ (ఒండు + అ) = ఒక్కడే, నడవన్

కామ సుఖములతోన్ = మన్మధసౌఖ్యములతో, పూర్వకామకేళి = పూర్వపు మన్మధక్రీడ, కామచిహ్నాలు = వలపు గుఱుతులు, మెయిన్ = శరీరమునందు, సురంగంబు + కాఁగన్ = ప్రకాశముగా

నెఱయన్ = వెలయునట్లు, కైసేసి = అలంకరించి, జవనిక = తెర, తెఱచి, వచ్చు, చెలువుతోన్ = అందముతో, వచ్చి, రతి, మ్రోలన్ = రతియెదుట, మరుఁడు = మన్మధుఁడు, నిలిచెన్

తాత్పర్యము . చలించుచు ఒప్పునట్టి మకరధ్వజముతోఁ బ్రకాశించు కెంజివురుగొడుగు ఒప్పఁగా, మిక్కిలి ప్రకాశించు నిండు పరిమళముగల చివురుటమ్ములపొదులతో శ్రేష్ఠమైన చెఱకువిల్లు చేత నొప్పఁగా, విజృంభించు తుమ్మెదల, కోకిలముల సమూహముల ధ్వనులతో రాచిలుకల మాటల ధ్వనులు మ్రోయఁగా, లేచి సంతోషమగునట్లు వీచు మందమారుతముతో వసంతుఁడు కూడి నడవఁగా, మన్మధ సౌఖ్యములతోఁ బూర్వపు మన్మధక్రీడ, వలపుగుఱుతులు శరీరమునఁ బ్రకాశముగా వెలయునట్లు అలంకరించి తెర తెఱచుకొని వచ్చునందముతో వచ్చి మన్మధుఁడు రతియెదుట నిలిచెను.

విశేషములు అలంకారము సహోక్తి

మ తళుకొత్తెం దరహాస మాననమునం, దట్టూర్చిపో మేన ము
త్పులకల్ గ్రక్కునఁ బర్వె, లోలనయనాంభోజాతపత్రంబులన్
వెలరెన్ బోరన సమ్మదాశ్రుజల, ముద్వేగంబు రాగంబుగా
నెలమెం జిత్తము, తత్క్షణంబ రతి కాత్మేశావతారంబునన్ 48

అర్థము. తత్ + క్షణంబు + అ = ఆ క్షణమే, రతికిన్ = రతిదేవికి, ఆత్మ+ ఈశ + అవతారంబునన్ = తన భర్త ఆగమనముతో, ఆననమునన్ = ముఖమునందు, దరహాసమ = చిఱునవ్వు, తళుకొత్తెన్ = మిక్కిలి ప్రకాశించెను, మేనన్ = శరీరమునందు, తట్టూర్చిపోన్ = నిండుకొనునట్లు, ముద్ + పులకల్ = సంతోషమువలని గగుర్పాటు, క్రక్కునన్ = వెంటనే, పర్వెన్ = వ్యాపించెను, లోల-నయన + అంభోజాత - పత్రంబులన్ = చలించు కనుదమ్ముల రేకులందు, సమ్మద +అశ్రు - జలము = సంతోష బాష్పజలము, బోరన = శీఘ్రముగా, వెలరెన్= వెడలెను, ఉద్వేగంబు = వ్యాకులత, రాగంబుగాన్ = అనురాగముగా, చిత్తము = మనస్సు, ఎలమెన్ = సంతోషించెను - వికాసమునొందెను

తాత్పర్యము . ఆ క్షణమే రతిదేవికి భర్త్రాగమనముతో ముఖమునఁ జిఱునగవు మిక్కిలి ప్రకాశించెను శరీరమున నిండుగా సంతోషమువలని గగుర్పాటు వెంటనే వ్యాపించెను చలించు కనుదమ్ముల రేకులందు ఆనందబాష్పములు శీఘ్రముగా వెడలెను వ్యాకులత అనురాగమయి మనస్సు వికాసము నొందెను

సీ ఎలమిఁ బ్రాణేశున కెదురేఁగె నుగ్మలి
ప్రాణంబు లన మేను మ్రానువడియెఁ
దనరు శోకాబ్ధిలో మునిఁగి లేచిన భంగి
నొడలఁ బేర్చిందు లొండొండ పర్వెఁ
బ్రియుఁ బాసి కంటకశయనవ్రతము దన
సలుపుటఁ దెలిపె నాఁ బులక లడరెఁ
బతిఁ గాంచి కన్నుల పాప లుత్సవమున
నాడెనో నలి నాఁగ హర్షవారి

గీ గ్రమ్మెఁ గనుఁగవ నంత నక్కొమ్మ దేవ
దేవు నుగ్రాక్ష శిఖి నిజజీవితేశుఁ
డతనుఁడైన విధమ్మును నాత్మ విరహ
భరముఁ గల కన్న కరణి విస్మరణఁ బొందె. 49

అర్థము. ఉగ్మలి - ప్రాణంబులు = ఇంతి (రతి) ప్రాణములు, ఎలమిన్= సంతోషముతో, ప్రాణ + ఈశునకున్ = ప్రాణనాథునకు - మన్మథునకు,

ఎదురేఁగెన్ + అనన్ = ఎదురువెడలెనా యన, మేను = శరీరము, మ్రాను + పడియెన్ = కొయ్యఁబాతెను

తనరు - శోక + అబ్ధిలోన్ = పొంగెడి దుఃఖసముద్రములో, మునిఁగి, లేచిన - భంగిన్ = లేచిన విధమున, ఒడలన్ = మేన, పేర్చిందులు = చెమటబొట్టులు, ఒండొండ = క్రమక్రమముగా, పర్వెన్ = వ్యాపించెను

ప్రియున్ = భర్తను, పాసి = విడిచి, కంటక - శయన-వ్రతమున్ = ముండ్లపాన్పుపైఁ బరుండు వ్రతమును, తన - సలుపుటన్ = తాను జేయుటను, తెలిపెన్ + నాన్ = తెలిపెనా యనునట్లు, పులకలు = గగుర్పాటు, అడరెన్ = అతిశయించెను

పతిన్ = భర్తను, కాంచి, కన్నుల - పాపలు, ఉత్సవమునన్ = వేడుకతో, నలిన్ = ఉత్సాహముతో, ఆడెనో - నాఁగన్ = ఆడెనా యనునట్లు, హర్ష - వారి= ఆనందాశ్రుజలము, కనుఁగవన్ = కనుదోయియందు, క్రమ్మెన్

అంతన్ = తరువాత, అక్కొమ్మ (ఆ + కొమ్మ) = ఆయింతి - రతి, దేవ-దేవు + ఉగ్ర + అక్ష - శిఖిన్ = దేవతలకు దేవుఁడైన శివునియొక్క, భయంకరమైన, కంటి మంటచే, నిజజీవిత + ఈశుఁడు = తన ప్రాణేశ్వరుఁడు - మన్మథుఁడు, అతనుఁడు = అనంగుఁడు, ఐన - విధమ్మునున్, ఆత్మ - విరహ - భరమున్ = తనదైన యెడఁబాటుయొక్క అతిశయమును, కలన్ + కన్న - కరణిన్ = కలఁగనిన విధమున, విస్మరణన్ + పొందెన్ = మఱచెను

తాత్పర్యము : ఇంతి ప్రాణములు సంతోషముతోఁ బ్రాణేశ్వరున కెదురేఁగె ననునట్లు శరీరము కొయ్యఁబాతెను పొంగెడి దుఃఖసముద్రమున మునిఁగి లేచినరీతిని మేనఁ జెమరుబిందువులు క్రమముగా వ్యాపించెను భర్తను విడిచి ముండ్లపానుపుపైఁ బరుండు వ్రతమును దానుజేయుటను దెలిపెనా యనునట్లు గగుర్పా టతిశయించెను భర్తను జూచి కంటిపాప లుత్సవముతో, నుత్సాహముతో నాడెనా యనునట్లు ఆనందాశ్రుజలము కనుదోయిఁ గ్రమ్మెను అంత నాయింతి దేవదేవుని భయంకరమైన కంటిమంటచేఁ దన ప్రాణేశ్వరుఁడు అనంగుఁడైన విధమును, దనయెడఁబాటుభరమును ఒక స్వప్న వృత్తాంతమువలె మఱచిపోయెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష - శోకాబ్ధి - రూపకము

కంటక శయన వ్రతము - 'రోమాఞ్చ నికుచ యుగళే శ్వాస గళిత మఙ్కుశం నిదధానా త్వత్పాణిగ్రహణతృష్ణయా కణ్టకశయనవ్రతలీలా మివ దక్షిణం కరకమల మనుభావయతి' కాదంబరి

వ తదవసరంబున నుమామహేశ్వర వివాహంబుతోడ మనసిజు పునరవతరణోత్సవం బగుట నఖిలజనంబులు నానందంబున నగరు మృగమద కాశ్మీర ఘనసార హరిద్రాచందన కర్దమ జలకలశానేక పుష్పపల్లవాదులు తత్పురి రథ్యా కురథ్యా పూర్ణంబులు సేసినం దదుత్సవాలోకనపరులై హరగిరిజ లఖిలామరపరివృతులై చనుదెంచి రంత 50

అర్థము: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, ఉమా - మహేశ్వర- వివాహంబుతోడన్ = పార్వతీపరమేశ్వరుల పెండ్లితో, మనసిజు - పునరవతరణ + ఉత్సవము + అగుటన్ = మన్మథుని పునర్జన్మోత్సమగుటచే, అఖిల - జనంబులున్ = ఎల్లజనులును, ఆనందంబునన్, అగరు - మృగమద - కాశ్మీర- ఘనసార - హరిద్రా - చందన - కర్దమ - జలకలశ + అనేక + పుష్ప - పల్లవ + ఆదులు = అగురును, కస్తూరియును, కుంకుమమును, కర్పూరమును, పసుపును, మంచిగంధపుఁబంకమును, జలకుంభములు, పెక్కుపూలును, చివురులు మున్నగునవి, తద్ + పురి - రథ్యా - కురథ్యా + ఆపూర్ణంబులు = ఆ నగర వీధుల ఉపవీధుల నిండినవిగా, చేసినన్ = చేయఁగా, తద్ + ఉత్సవ + ఆలోకనపరులు+ ఐ = ఆ వేడుకను జూచుటయం దాసక్తి గలవారయి, హర - గిరిజలు = శివుఁడును, పార్వతియు, అఖిల + అమర - పరివృతులు + ఐ = ఎల్లదేవతలతోఁ జుట్టుబడిన వారయి, చనుదెంచిరి = వచ్చిరి, అంతన్

తాత్పర్యము. ఆ సమయమున పార్వతీపరమేశ్వరుల వివాహముతో పాటు మన్మథుని పునర్జన్మోత్సవ మగుటచే నెల్లజనులును ఆనందముతో అగురు, కస్తూరి, కుంకుమము, పసుపు, మంచిగంధపుఁబంకము, పెక్కు పూలు, చివురులు మున్నగునవి ఆ నగర వీధులందును, సందులందును నింపఁగా, నా యుత్సవమును జూచుటయం దాసక్తిగలవారయి శివుఁడును పార్వతియును ఎల్లదేవతలతోఁ గూడి వచ్చిరి అంత - తరువాతి పద్యముతో నన్వయము

పార్వతీశ్వరుల వివాహోత్సవమును జూచిన పౌరుల వేడుకలు

సీ. కనకంపుఁగ్రోళులు గొని ముంచి కాశ్మీర
జలము లొండొరులపైఁ జల్లువారుఁ
గరయంత్రమాదిగాఁగల జలయంత్రాలి
నోలి నొండొరులపై నొత్తువారు
మెలుపారు తలిరులఁ గల కంపుఁబువ్వుల
వలగొని యొండొరు వైచువారుఁ
గర్పూర చందన కస్తూరి మృగపంక
ములు గొని యొండొరుఁ బూయువారుఁ

ఆ బట్టి పెనఁగువారుఁ బట్టీక రయమునఁ
బాఱువారు నెగిచి పట్టువారుఁ
బ్రణయభావ మెసఁగఁ బౌరు లుత్సవమునఁ
గూడి నీరుపోఁత లాడి రొప్ప 51

అర్థము. కనకంపుఁగ్రోళులు (కనకము + క్రోళులు) బంగారుక్రోవులు, కొని = తీసికొని, ముంచి, కాశ్మీర - జలములు = కుంకుమపూవుతోడి నీరు (వసంతము), ఒండొరులపైన్ = ఒకరిపై నొకరు, చల్లువారున్

కరయంత్రము = నీటిని జిమ్ము చేతియంత్రము, ఆదిగాన్ = మొదలుగా, కల, జలయంత్ర + ఆలిన్ = నీటిని జిమ్ము యంత్రముల వరుసను, ఓలిన్ = క్రమముగా, ఒండొరులపైన్ = ఒకరిపై నొకరు, ఒత్తువారున్ = చిమ్మువారును,

మెలుపారు = మృదువులైన, తలిరులన్ = చివురులను, కల = ఉన్న, కంపు + పువ్వులన్ = పరిమళవంతములైన పువ్వులతో, వలగొని = చుట్టి, ఒండొరున్ = ఒకరినొకరు, వైచువారున్ = కొట్టువారును,

కర్పూర - చందన - కస్తూరి మృగపంకములు = కర్పూరము, మంచిగంధము, కస్తూరి మృగమునుండి వచ్చు మృగమదమును, కొని, ఒండొరున్ = ఒకరినొకరు, పూయువారున్,

పట్టి - పెనఁగువారున్ = ఒకరినొకరు పట్టుకొని లాగువారును, పట్టు + ఈక = పట్టునకు దొరకక, రయమునన్ = వేగముగా, పాఱువారున్ = పరువెత్తువారును, ఎగిచి - పట్టువారున్ = తఱిమి పౌరులు పట్టువారును, పురజనులు, ప్రణయ - భావము = ప్రేమభావము, ఎసఁగన్ = అతశయింపఁగా, ఉత్సవమునన్ = వేడుకతో, కూడి, ఒప్పన్ = ఒప్పునట్లు, నీరు - పోఁతలు = ఒకరిపైనొకరు నీరుచిమ్ముకొనుటలు ఆడిరి

తాత్పర్యము : బంగరుచిమ్మనగ్రోవులు కొని ముంచి ఒకరిపై నొకరు వసంతము చల్లువారును, కరయంత్రము మొదలగు జలయంత్రముల నొకరి మీఁద నొకరు ప్రయోగించువారును, మృదువైన చివురులను సువాసనగల పూవులతోఁ జుట్టి ఒకరినొకరు కొట్టువారును, కర్పూరము, చందనము, కస్తూరి ఒకరికొకరు పూయువారును, ఒకరినొకరు పట్టుకొని పెనఁగువారును, పట్టునకు దొరకక వేగముగాఁ బరువులిడువారును, ఒకరినొకరు తఱిమి పట్టువారును అయి

పురజనులు ప్రేమభావ మతిశయింప నుత్సవమునందుఁగూడి యొప్పునట్లు నీరు చిమ్ములాట లాడిరి

విశేషములు అలంకారము స్వభావోక్తి

చ విరినెఱివేనలుల్ తడిసి వ్రేలఁ, గచాంతరపుష్పమాలికల్
దొరఁగఁగ, వల్వు లంగములతోఁ గదియన్, నునుఁబూఁత లిమ్ముగాఁ
దెరల, విభూషణౌఘమణిదీప్తులు గ్రాల మహోత్సవంబునం
బురజను లర్ధిమైఁ జెలఁగి బోరన ముట్టటలాడి రెల్లెడన్ 52

అర్థము పుర-జనులు = పౌరులు, విరి- నెఱి - వేనలుల్ = చెదరిన, వెండ్రుకలు గల కొప్పులు, తడిసి, వ్రేలన్ = వ్రేలాడఁగా, కచ + అంతర + పుష్ప - మాలికల్ = శిరోజములలోని పూలదండలు, తొరఁగఁగన్ = రాలఁగా, వల్వులు = వస్త్రములు, అంగములతోన్ = అవయవములతో, కదియన్ =అంటుకొనఁగా, నునుఁబూఁతలు = నున్నని పూఁతలు, ఇమ్ముగాన్ = బాగుగా, తెరలన్ = కలిసిపోఁగా, విభూషణ + ఓఘ - మణి - దీప్తులు = అలంకారముల సమూహముయొక్క రత్నముల కాంతులు, క్రాలన్ = ప్రకాశింపఁగా, మహా (మహత్) + ఉత్సవంబునన్ = గొప్ప వేడుకతో, అర్థిమైన్ = కోరికతో, చెలఁగి = ఉత్సహించి, బోరనన్ = శీఘ్రముగా, ఎల్ల + ఎడన్ = అంతటను, ముట్టటలు + ఆడిరి = చిమ్మన గొట్టముతో నీరు చల్లుకొనుటలు ఆడిరి

తాత్పర్యము . పురజనులు గొప్ప వేడుకలతో, కోరి ఉత్సహించి చెదరిన వెండ్రుకలు గల కొప్పులు తడిసి వ్రేలుచుండఁగా, శిరోజములలోని పూలదండలు రాలఁగా, వలువలు శరీరావయములకు అంటుకొనఁగా, శరీరపు నున్నని పూఁతలు బాగుగా గలిసిపోఁగా, అలంకారములైన మణుల కాంతులు ప్రకాశింపఁగా శీఘ్రముగాఁ జిమ్మన గొట్టముతో నీరు చల్లుకొనునాటల నాడిరి

విశేషములు : అలంకారము స్వభావోక్తి ముట్టట - (రూపాం) ముట్టాట వలువు - (రూపాం) వలువ

వ అయ్యవసరంబున బాలసఖు లగజతోఁ గూడి యాడందలంచి
నెమ్మనంబున నుసురుకొనుచు 53

అర్థము : ఆ + అవసరంబునన్ = ఆ సమయమున, బాలసఖులు, అగజతోన్ = పార్వతితో, కూడి, ఆడన్ + తలంచి = క్రీడింపనెంచి, నెమ్మనంబునన్ (నెఱ + మనంబునన్) = నిండుమనసునందు, ఉసురుకొనుచున్ = ఉత్సహించుచు

తాత్పర్యము. ఆ సమయమున చిన్ననాటి చెలులు పార్వతితో గలిసియాడ నెంచి నెమ్మనమున నుత్సహించుచు - తరువాతి పద్యముతో నన్వయము

శా దేవేశుండు పరిగ్రహించుట నుమాదేవిన్ సఖుల్ దగ్గఱం
బోవంజూడగ నోడి రోట దగదే పాల్పొందగా బుత్రికల్
దేవార్థంబుగ జేసియున్న గని బుద్ధిందేక నా వేల్పునం
దావాహించిన మీద నెవ్వరికి డాయన్ ముట్టగా వచ్చునే ? 54

అర్థము. దేవేశుండు (దేవ + ఈశుండు) = దేవతల ప్రభువైన ఈశ్వరుడు, పరిగ్రహించుటన్ = స్వీకరించుటచేత - పెండ్లియాడుటచేత, ఉమా- దేవిన్ = పార్వతీదేవిని, సఖుల్ = చెలికత్తెలు, దగ్గఱన్ - పోవన్ + చూడగన్ = దగ్గఱకుబోవుటకును, చూచుటకును, ఓడిరి = జంకిరి, ఓట = జంకు, తగదే = తగదా ? తగు ననుట, పాల్పు + ఒందగాన్ = ఒప్పుగా, పుత్రికల్= బొమ్మలు, దేవ + అర్థంబుగన్ =దేవతనిమిత్తము, చేసి + ఉన్నన్ = నిర్మించియుండగా, కని = చూచి, బుద్ధిన్ + తేక = (ఆ మాట) మనస్సునకుదేక - మఱచి యనుట, ఆ - వేల్పునందున్ = ఆ దేవతయందు, ఆవాహించిన - మీదన్= ఆవాహనచేసిన పిమ్మట, ఎవ్వరికిన్ = ఎవరికైనను, డాయన్ = సమీపించుటకును, ముట్టగాన్ = తాకుటకును, వచ్చునే = సాధ్యపడునా ? - సాధ్యపడ దనుట

తాత్పర్యము. పరమేశ్వరుడు పరిగ్రహించుటచే నుమాదేవిని జెలికత్తెలు సమీపించుటకును, జూచుటకును జంకిరి అట్లు జంకుట తగును. దేవతా నిమిత్తముగా బ్రతిమలను జేయుట చూచి, అది మఱచి, యా దేవతయం దావాహన చేసినపిమ్మట నెవ్వరికైనను, సమీపించుటకును, దాకుటకును సాధ్యమా?

విశేషములు. ఈ పద్యభావ మస్పష్టముగా నున్నది బుద్ధిం దేక నా వేల్పునం దావాహించినమీద 'తేక అనువ్యతిరేకక్ష్యార్థము కళ గదా ! దానిపై 'నా వేల్పు' అనురీతిని నుగాగమ మెట్లు వచ్చెనో ! అలంకార మర్థాంతరన్యాసము తేక - తెచ్చు ధాతువు 'కజి వ్యతిరేకక్ష్యార్థమునందగు ' బాల క్రి 39 తెచ్చు + కజి 'ముజ్జీత్తులు ముత్తు నాబడు ' బాల క్రి 86 'తే తేరులు తెచ్చున కగు ' బాల క్రియ 93 - తేక

వ అంత నట సలిలక్రీడ నంగలిగొనక నీరుపోత లాడుచున్న యవసరంబున. 55

అర్థము అంతన్, అటన్, సలిలక్రీడన్ = జలక్రీడయందు, అంగలి + కొనక = తృప్తిపడక, నీరుపోఁతలు + ఆడుచున్ + ఉన్న - అవసరంబునన్ = ఒకరిపై నొకరు నీరుచల్లుకొనుటలాడుచున్నసమయమున

తాత్పర్యము . అంత నచ్చట జలక్రీడయందుఁ దృప్తిఁగాంచక ఒకరిపై నొకరు నీరుచల్లుకొనునాట లాడుచున్న సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క హర గిరిజల మనమున న
త్యురురాగరసంబు నిండి యుత్కటమై త
త్పురిమీఁద వెల్లిసూపిన
పరుసునఁ గాశ్మీరవారి పౌరులఁ గప్పెన్ 56

అర్థము : హర - గిరిజల - మనమునన్ = శివపార్వతుల మనస్సునందు, అతి + ఉరు - రాగరసంబు = మిక్కిలి యధికమైన ప్రేమరసము, నిండి, ఉత్కటము + ఐ = అధికమయి, తద్ + పురిమీఁదన్ = ఆ నగరము మీఁద, వెల్లి+ చూపిన - పరుసునన్ = వఱదయై ప్రవహించెనా యనువిధమున, కాశ్మీర - వారి కుంకుమపూవు నీరు, పౌరులన్ = పురజనులను, కప్పెన్ = ముంచెను

తాత్పర్యము . శివపార్వతుల మనస్సునందు మిక్కిలి యధికమైన ప్రేమరసము నిండి అధికమయి ఆ నగరమున వఱదలై ప్రవహించెనా యను విధమునఁ గుంకుమపూల జలము పౌరులను గప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

వ తదవసరంబున 57

అర్థతాత్పర్యములు : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

ఆ రాజితముగ వితవిటీజన వదనాంబు
జంబు లలరు ఘుస్పణజలములాడి
తరుణ తరణి కిరణతతి రాగభాతిపై
నొనరి పొల్చు వనజ వనము పోలె 58

అర్థము . రాజితముగన్ = ప్రకాశించునట్లు, విట - విటీ - జన - వదన+ అంబుజంబులు = వితుల (స్త్రీ పురుషుల) ముఖపద్మములు, ఘుస్పణ -

జలములు = కుంకుమపువ్వు నీరులు, ఆడి, తరుణ - తరణి - కిరణ - తతి - రాగ-భాతి = బాలభానుని కిరణ సమూహముయొక్క యెఱ్ఱనికాంతి, పైన్ = మీఁద ఒనరి = కలిగి, పొల్చు = ప్రకాశించునట్టి, వనజ - వనము + అ + పోలెన్ = తామరతోఁపువలెనే, అలరున్ = ఒప్పును

తాత్పర్యము . విటుల ముఖపద్మములు కుంకుమపువ్వు జలము లాడి, బాలభానుని కిరణముల యెఱ్ఱని కాంతి పైని బ్రసరించి, ప్రకాశించు తామరతోఁపువలె నొప్పెను

విశేషములు . అలంకార ముపమ

తే. ఓలిఁ దనరారు క్రోళ్లను నొత్తు కుంకు
మారుణాకీర్ణజలధార లమరెఁ జూడ
వీఁక నతనుండు విటవిటీ వితతి నేయు
విపులతపనీయనారాచవృష్టి వోలె. 59

అర్థము . ఓలిన్ = క్రమముగా, తనరారు = ఒప్పునట్టి, క్రోళ్ళను = క్రోవులతో, ఒత్తు = కొట్టునట్టి - చల్లునట్టి, కుంకుమ + ఆకీర్ణ - జల - ధారలు= కుంకుమములతోఁ గూడిన నీటిధారలు, చూడన్ = చూడఁగా, అతనుండు = మన్మథుఁడు, వీఁకన్ = పరాక్రమముతో, విట - విటీ- వితతిన్ = విటులసమూహమును, ఏయు = కొట్టునట్టి, విపుల - తపనీయ - నారాచ - వృష్టి+ పోలెన్ = విరివియైన బంగారు బాణముల వర్షమువలె, అమరెన్ =ఒప్పెను

తాత్పర్యము. క్రోవ్వులతో నొకరిపై నొకరు చల్లుకొనునట్టి కుంకుమముతోఁ గూడిన జలధారలు చూడఁగా, మన్మథుఁడు పరాక్రమముతో విటులను గొట్టు విపులమైన బంగరుటంపవానవలె నొప్పెను

విశేషములు : అలంకార ముపమ

క వరచందనపంకంబులఁ
దిరముగ ముట్టాటలాడి తెలుపెసఁగిరి త
త్పుర జను లీశ్వరుతో సహ
చరులై విమలాత్ములైన చాడ్పును బోలెన్ 60

అర్థము . తద్ + పుర - జనులు = ఆ నగరమునందలి జనులు, వర - చందన - పంకంబులన్ = మేలయిన గంధపుబురదలతో, తిరముగన్ =

స్థిరముగా, ముర్ఖాటలు + ఆడి = జలక్రీడలాడి, ఈశ్వరుతోన్ = శివునితో, సహచరులు + ఐ = కూడి తిరుగువారయి, విమల - ఆత్ములు + ఐన = నిర్మల స్వరూపులయిన, చాడ్పును + పోలెన్ = విధమువలె, తెలుపు + ఎసఁగిరి = తెల్లనై యొప్పిరి

తాత్పర్యము: ఆ నగరమునందలి జనులు మేలయిన చందన పంకములతో జలక్రీడలాడి, యీశ్వరునితోఁ గూడఁ దిరిగినవారయి నిర్మలాత్ములైన విధమునఁ దెల్లనైరి

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క మడఁది ముఖ మండలముఁ బ్రియుఁ
డడరఁగఁ గస్తూరిపంక మలఁదిన, శశిపై
వెడసీరమొయిలు గప్పిన
విడువక లో వెలుఁగుచున్నవిధమున నొప్పెన్ 61

అర్థము . మడఁది = స్త్రీ (పార్వతియొక్క), ముఖ - మండలమున్ = ముఖబింబమును, ప్రియుఁడు = భర్త(శివుఁడు), అడరఁగన్ = అతిశయించునట్లు, కస్తూరి - పంకము = కస్తురి బురద, అలఁదినన్ = పూయఁగా, శశిపైన్ = చంద్రుని మీఁద, వెడసీర - మొయిలు = తెరయైన మేఘము, కప్పినన్ = కప్పినను, విడువక= మానక, లోన్ = లోపల, వెలుఁగుచున్ + ఉన్న = ప్రకాశించుచున్న, విధమునన్ = విధమున, ఒప్పెన్

తాత్పర్యము పార్వతి ముఖబింబమునకు శివుఁడు అధికముగాఁగస్తురి పంకమును బూయఁగాఁ, నది తెరవలె మబ్బు కప్పినను జంద్రబింబము మానక లోపలఁ బ్రకాశించుచుండువిధమున నొప్పెను

విశేషములు . అలంకార ముపమ మడఁది = మడఁతి (రూపాం)

తే ప్రియుఁడు రాగోత్కటంబునఁ బెరిఁగి పూయ
మెలుఁత ముఖమండలమునఁ గాశ్మీరరాగ
మెలసి కరమొప్పె వినుతోదయేందుబింబ
మరుణదీధితులం బొలుపారునట్లు 62

అర్థము . ప్రియుఁడు = భర్త (శివుఁడు), రాగ + ఉత్కటంబునన్ = అనురాగాతిశయమున, పెరిఁగి = పూని, పూయన్ = అలఁదఁగా, మెలుఁత = ఇంతి (పార్వతి) యొక్క, ముఖ -మండలమునన్ = ముఖబింబమునందు, కాశ్మీర - రాగము = కుంకుమపుటెఱుపు, ఎలసి = వ్యాపించి, వినుత + ఉదయ + ఇందు

- బింబము = పొగడఁబడిన ఉదయించు చంద్రబింబము, అరుణ -దీధితులన్ = ఎఱ్ఱని కాంతులతో, పొలుపారు + అట్లు = ఒప్పారు విధమున, కరము = మిక్కిలి, ఒప్పెన్

తాత్పర్యము. శివుఁడు అనురాగాతిశయమునఁ బూయఁగా, పార్వతి వదన బింబమునందుఁ గుంకుమపుటెఱుపు వ్యాపించి ఉదయించు చంద్రబింబము ఎఱ్ఱనికాంతులతో నొప్పువిధమున మిక్కిలి ఒప్పెను

విశేషములు. అలంకార ముపమ మెలుఁత = మెలఁత (రూపాం)

ఆ మృగమదంబుఁ దరుణి మొగమునఁ బ్రియుఁ డర్థిఁ
బూయఁబూయఁ ద్రోచిపోవనేర
కొక్క వలన యైన నువిద మో మర్ధోప
రాగచంద్రబింబరమణ నొప్పె 63

అర్థము. ప్రియుఁడు = భర్త (శివుఁడు) అర్థిన్ = కోరికతో, తరుణి - మొగమునన్ = భార్య (పార్వతి) ముఖమున, మృగమదంబున్ = కస్తూరి, పూయన్ + పూయన్ = పూయఁగాఁ బూయఁగా, త్రోచి పోవన్ +నేరక = తొలఁగిపోఁజాలక, ఒక్క - వలను + అ + ఐనన్ = ఒకదిక్కే కాఁగా, ఉవిద - మోము = స్త్రీ (పార్వతి) ముఖము, అర్ధ + ఉపరాగ - చంద్రబింబ - రమణన్ = సగము గ్రహణము పట్టిన చంద్రబింబము విధమున, ఒప్పెన్

తాత్పర్యము. శివుఁడు పార్వతి ముఖమునఁ గస్తూరిని గోరికతోఁ బూయఁగా బూఁయఁగా నామె తొలఁగిపోవఁజాలక ఒక్క దిక్కే కాఁగా, నామె ముఖము సగము మాత్రమే గ్రహణముపట్టిన చంద్రబింబము వలె నొప్పెను

విశేషములు. అలంకార ముపమ

ఆ చందనంబుఁ గలయ సఖి బల్మిఁ బూసిన
పాలిఁతి వదనలీల పాలిచెఁ దెరలు
వుచ్చి బెరయఁ గల్లు పూసిన యద్దంబు
భంగివోలె నిజవిభాతిఁ దఱఁకి 64

అర్థము. సఖి = చెలికత్తె, చందనంబున్ = మంచిగంధమును, కలయన్= అంతటను, బల్మిన్ = అధికముగా, పూసిన = అలఁదినట్టి, పాలిఁతి - వదన - లీల = ఇంతి (పార్వతి) ముఖ విలాసము, తెరలు + పుచ్చి = కలఁచి, బెరయన్ =

వ్యాపించునట్లు, కల్లు, పూసిన, అద్దంబు -। భంగి - పోలెన్ = అద్దము విధముగ, నిజ - విభాతిన్ = తనదైన కాంతిని, తఱకి = వదలి, పొలిచెన్ = ఒప్పెను

తాత్పర్యము. చెలికత్తె చందనము నంతటను అధికముగాఁ బూయఁగాఁ బార్వతి ముఖవిలాసము అంతటను వ్యాపించునట్లు కల్లుపూసిన అద్దమువలె నిజకాంతిని విడిచి యొప్పెను

విశేషములు. అలంకార ముపమ

క నీరేరుహోదరుఁడు కా
శ్మీరోదక కనకరుచి విమిశ్రితుఁడై పా
ల్పారె నసితాంబుదము సం
ధ్యా రాగము గలయఁ గప్పినట్టుల పోలెన్ 65

అర్థము. నీరేరుహ + ఉదరుఁడు - పద్మనాభుఁడు - విష్ణువు, కాశ్మీర+ ఉదక - కనక - రుచి - విమిశ్రితుఁడు + ఐ = కుంకుమపూవునీటి యొక్క బంగారు కాంతితోఁ గలిసినవాఁడయి, అసిత + అంబుదమున్ = నీలమేఘమును, సంధ్యా - రాగము = సంజయెఱుపు, కలయన్ = అంతటను, కప్పిన + అట్టుల - పోలెన్ = కప్పిన విధమున, పొల్పారెన్ (పొల్పు +ఆరెన్ + ప్రకాశించెను

తాత్పర్యము. విష్ణువు కంకుమ పువ్వునీటి బంగరుకాంతితోఁ గూడిన వాఁడయి, నీలమేఘమును,సంజయెఱు పంతటను గప్పినవిధమునఁ బ్రకాశించెను

విశేషములు. అలంకార ముపమ

క అన్నువలు పితామహుఁ డని
మన్నింపక పట్టి పూయ మలయజమున సు
చ్ఛన్నుఁడయి కనకగిరిపై
వెన్నెల తెలు పడరినట్లు వేధ వెలింగెన్ 66

అర్థము. అన్నువలు = స్త్రీలు, పితామహుఁడు + అని = తాత యని, మన్నింపక = గౌరవింపక, పట్టి, పూయన్ = పూయఁగా, మలయజమునన్ = చందనముచే, సుచ్ఛన్నుఁడు (సు+ఛన్నుఁడు) + అయి = బాగుగాఁ గప్పఁబడినవాఁడయి, వేధ = బ్రహ్మ, కనక -। గిరిపైన్ = మేరుపర్వతముపై, వెన్నెల - తెలుపు = వెన్నెలయొక్క తెలుపు, అడరిన + అట్లు = అలముకొనునట్లు, వెలింగెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము . స్త్రీలు తాతయని గౌరవింపక పట్టుకొని పూయఁగాఁ జందనముచే మిక్కిలి కప్పఁబడినవాఁడయి, బ్రహ్మ మేరుపర్వతముపై వెన్నెల తెలు పలముకొనునట్లు ప్రకాశించెను

విశేషములు . అలంకార ముపమ, అన్నువ = అన్ను (రూపాం) ను + ఛన్నుఁడు - హ్రస్వమునకు పరమైన ఛకారమునకు ద్విత్వము వేధ - వేధ శబ్ద తత్సమరూపము - 'వేధ పురోధ పురోధసుఁడు ' బాల తత్సమ 82

తే హరుఁడు గనుగీట సురసతు లావనీరు
లప్పు డింద్రుపైఁ జల్లిన తెప్ప లెల్ల
వ్రాల విడిచి సురేంద్రుఁడు వానఁ బురులు
వొదియఁబడియున్న పురినమ్మిఁ బోలియుండె 67

అర్థము . హరుఁడు = ఈశ్వరుఁడు, కనుగీటన్ = కనుసన్నచేయఁగా, సుర - సతులు = దేవతాస్త్రీలు, అప్పుడు, ఇంద్రుపైన్, ఆవనీరులు, చల్లినన్ = చల్లఁగా, సుర + ఇంద్రుఁడు = దేవేంద్రుఁడు, తెప్పలు + ఎల్లన్ = కన్నుల తెప్పలన్నియు, వ్రాలన్ = వ్రాలునట్లు, విడిచి, వానన్ = వానచేత, పురులు = ఊకలు, పొదియఁబడి + ఉన్న = మూయఁబడియున్న, పురి - నమ్మిన్ = మగనెమిలిని, పోలి + ఉండెన్

తాత్పర్యము . ఈశ్వరుఁడు కనుసన్న చేయఁగా దేవతాస్త్రీలు దేవేంద్రునిపై ఆవనీరు చల్లిరి అప్పు డింద్రుఁడు వేయికన్నుల తెప్పలును వ్రాల్చి, వానచే నీకలు మూయఁబడియున్న మగనెమిలిని బోలియుండెను

విశేషములు : అలంకార ముపమ

తే కీలు ప్రిదిలినఁ బడి మొలనూలు గాలఁ
దగిలి రా వచ్చె నోర్తు సుందరుల కెల్ల
రూపసౌభాగ్యసంపద రూఢిఁ దాన
మిగిలి నిగళంబు లెట్టిన పగిది వోలె 68

అర్థము: కీలు= సీల, ప్రిదిలినన్ = ఊడిపోవఁగా, పడి = జాఱి, మొలనూలు = మొలత్రాడు, కాలన్ = కాలియందు, తగిలి = తగులుకొని, రాన్ = రాఁగా, ఓర్తు = ఒకతె, సుందరులకున్ + ఎల్లన్ = సౌందర్యవతులకెల్లను, రూప- సౌభాగ్య -

సంపదన్ = ఆకారసుభగత్వసంపదయందు, రూఢిన్ = నిశ్చయముగా, తాను + అ = తాన = తానే, మిగిలి = అతిశయించి, నిగళంబు + పెట్టిన - పగిది + పోలెన్ = సంకెలవైచినరీతివలె వచ్చెన్

తాత్పర్యము. సీల ఊడిపోఁగా జాఱి మొలనూలు కాలియందుఁ దగులుకొని రాఁగా, ఒకతె సౌందర్యవతుల కెల్ల ఆకారసంపదయందు రూఢిగాఁ దానే అతిశయించినట్లు సంకెలవైచెనా యన వచ్చెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

స్త్రీల జలక్రీడావర్ణన

క. నుత విట ఘన కరయంత్ర
చ్యుత ధారాపాతసిక్త సుందర తను ని
ర్గత నవ ముత్పులకాంకుర
తతిఁ దాల్చి వరాంగనాకదంబము లొప్పెన్ 69

అర్థము. నుత తతిన్, నుత = పొగడఁబడిన, విట = విటులనెడి, ఘన = మేఘములయొక్క, కర - యంత్ర = చేతియంత్రములనుండి, చ్యుత = జాఱిన, ధారా - పాత = జలధారలయొక్క పాటుచే, సిక్త = తడిసిన, సుందర = అందమయిన, తను = శరీరములందు, నిర్గత = బయల్వెడలిన, నవ = క్రొత్త, ముద్ + పులక + అంకుర - తతిన్ = ఆనందమువలని గగుర్పాటు మొలకల సమూహమును, తాల్చి = ధరించి, వర + అంగనా - కదంబములు = మేలిజాతి స్త్రీల సమూహములు అనెడి కడిమిచెట్లు, ఒప్పెన్

తాత్పర్యము. విటులనెడి మేఘములయొక్క చేతులందలి జలయంత్రములనుండి జాఱిన జలధారాపాతములచేఁ దడిసిన అందమైన శరీరములందుఁ బొడమిన క్రొత్త గగుర్పాటు అనెడి మొలకలను దాల్చి మేలిజాతి స్త్రీల సమూహములనెడి కడిమిచెట్లు ఒప్పెను

విశేషములు. అలంకారము రూపకము అంగనా కదంబము లనుచో శ్లిష్ట రూపకము విట ఘన = విటులనెడి మేఘ, పులకాంకుర - పులకలనెడి అంకుర అంగనా - కదంబములు = అంగనల సమూహములనెడి కడిమిచెట్లు, శ్లిష్టరూపకము మేఘము ధ్వనింపఁగనే కడిమిచెట్లు పూయును

ఉ నీరదముల్ కచాతిరుచి, నెమ్మొఱఁగుల్ నవకంపుమేను లా
సారము లోలిఁ జల్లు జలసంకులమై తగ సద్విటేంద్ర కే
దారములందుఁ జాలుకొన దర్పకబీజము లంకురింపఁ గ్రొ
క్కారునుబోలెఁ గ్రమ్మి వరకాంతలు ముష్టటలాడి రిమ్ములన్ 70

అర్థము కచ + అతి -రుచి = శిరోజములయొక్క అధికమైన కాంతి, నీరదముల్ = మేఘములు నవకంపుమేనులు (నవకము + మేనులు) = మృదువులైన శరీరములు, నెమ్మొఱఁగుల్ (నెఱి + మెఱఁగుల్) = రమ్యములైన మెఱుపులు, ఓలిన్ = క్రమముగా, చల్లు = చల్లునట్టి, జల - సంకులముల్ = నీరుల సమూహములు, ఆసారములు = జడివానలుగా, తగన్ = ఒప్పఁగా, సత్ + విట + ఇంద్ర - కేదారముల + అందున్ = మంచి విటశేఖరులనెడి వరిమడులలో, చాలుకొనన్ వరుసగట్టునట్లు, దర్పక - బీజములు = మన్మథుఁడనెడి విత్తులు, అంకురింపన్ = మొలకెత్తఁగా, క్రొక్కారును + పోలెన్ (క్రొత్త + కారు) = తొలకరియో యన, క్రమ్మి = వ్యాపించి, వర - కాంతలు - శ్రేష్ఠరాండ్రయిన స్త్రీలు, ఇమ్ములన్ = ప్రీతితో, ముష్టటలు + ఆడిరి = జలక్రీడలాడిరి

తాత్పర్యము . శ్రేష్ఠరాండ్రయిన స్త్రీలు శిరోజముల అధికమైన నల్లని కాంతి వర్షామేఘములును, మృదువులైన శరీరములు రమ్యములయిన మెఱుఁగులును, ఒండొరులపైఁ జల్లుకొను నీరుల సమూహములు జడివానలును అయి యొప్పఁగా విటశేఖరులనెడి వరిమడులలో మన్మథు డనెడి విత్తులు మొలకెత్తఁగాఁ దొలకరియో యన వ్యాపించి సంతోషముతో జలక్రీడలాడిరి

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష నీరదముల్ - నీటినిచ్చునవి కనుకనే నైల్యమునఁ గచములతోఁ బోలిక, నెమ్మొఱఁగుల్ = నెఱి + మెఱఁగుల్ 'నెన్నడాదులన్ నెఱి దగు ' ప్రౌఢ సంధి 14 నవకంపుమేనులు = నవకము + మేనులు = 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు ' బాల సంధి 32 క్రొక్కారు - క్రొత్త + కారు ప్రాఁతాది సంధి - బాల సంది 36 క్రొ + కారు 'క్రొత్త శబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మోఁదిహల్లునకు ద్విత్వంబు నగు ' బాల సంధి 38

వ. ఇట్లు పెద్దయుంబ్రొద్దు నీరుపోఁతలాడి విటవిటీజనంబు లలసిన ఘనసమయాసారధారాపాతంబున కలసి మానససరోవరకేళీలాల సులై చను మరాళంబులుం బోలె హరగిరిజ లమరపరివృతులై యనేకవర్ణాకీర్ణ కమలాకరంబున కరుగుదెంచు నవసరంబున 71

అర్థము. ఇట్లు, పెద్దయున్ + ప్రొద్దు = చాలసేపు, నీరుపోఁతలు + ఆడి= జలక్రీడలాడి, విట - విటీ - జనంబులు = విటుల సమూహములు, అలసినన్ = బడలువడఁగా, ఘన - సమయ + ఆసార -ధారా - పాతంబునకున్ = వర్షాకాలమునందలి జడివానల జలధారలపాటునకు, అలసి, మానస - సరోవర - కేళీ - లాలసులు + ఐ = మానససరోవరములోఁ గ్రీడలందు ఆసక్తిగొన్నవయి, చను = పోవునట్టి, మరాళంబులున్ + పోలెన్ = హంసల విధమున, హర - గిరిజలు = శివపార్వతులు, అమర - పరివృతులు + ఐ = దేవతలతోఁ జుట్టఁబడినవారయి, అనేక - వర్ణ + ఆకీర్ణ - కమల + ఆకరంబునకున్ = పెక్కు రంగులతో నిండిన తామర కొలనికి, అరుగుదెంచు + అవసరంబునన్ = వచ్చు సమయమున

తాత్పర్యము. ఈ రీతిగాఁ జాలసేపు జలక్రీడలాడి విటజనులును, విటీజనులును బడలి మానస సరస్సునఁ గ్రీడింపఁగోరిచను హంసలవలె శివపార్వతులు దేవతలతోఁగూడి పలురంగులతో సంకీర్ణమైన తామరకొలనికి వచ్చు సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ అరుగుదెంచు 'తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తంబగు నగుచో నుత్వంబుపయిని దాని తకారంబు దకారం బగు' బాల క్రి 110 'అభ్యాగతి నరుగ్వాదుల కయ్యది యనుప్రయుక్తంబగు నగుచో గువర్ణంబు విభాషను లోపించు' బాల క్రి 111 అరుగుదెంచు - రూపాం అరుదెంచు, అరుగుదెంచు + అవసరంబునన్ - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' బాల సంధి 33 అరుగుదెంచు నవసరంబునన్ హరిగిరిజ లమరపరివృతులై - 'నలదమయంతు లిద్దఱు, దహ్యమానులై' నన్నయ - వంటిది

సీ॰ చెదరి తోఁ బఱతెంచు చెందమ్మి రేకులు
కెడగొని మొగుపుఁగెంగేలు గాఁగ
నెలమి లేఁదరఁగల నెలయు తుంతుర్వని
సదమలమౌక్తికాక్షతలు గాఁగ
మలియ నానావిధజలపక్షి కుల కల
రవ మించు సంస్తుతిరవము గాఁగ
జలజాత కౌరవోత్పల కలహారాది
గంధంబు లోలి సద్గంధములుగ

తే నర్థిఁ దన యాదిమూర్తికి ననిలుఁ డర్చ
లీ ముదంబున వచ్చిన ట్లీశ్వరునకు
నెదురువచ్చి పథిశ్రమమెల్లఁ బాచె
గారవమున సరోవరమారుతంబు 72

అర్థము సరోవర - మారుతంబు = సరస్సుపైనుండి వీచు గాలి, చెదరి, తోన్ + పటతెంచు = కూడవచ్చునట్టి, చెందమ్మి (చేన్ను + తమ్మి) రేకులు= ఎఱ్ఱతామర దళములు కెడగొని = జోడుఁగూడి, మొగుపుఁగెంగేలు (మొగుపు + కెంపు + కేలు) = ముడిచిన యెఱ్ఱని చేతులు, కాఁగన్ = కాఁగా

ఎలమిన్ = అతిశయముతో, లేఁదరఁగలన్ (లేఁత + తరఁగలన్) = చిన్న యలలయందు, ఎలయు = పుట్టు, తుంతుర్వని = తుంపర, సదమల (సత్ + అమల) - మౌక్తిక + అక్షతలు = మిక్కిలి నిర్మలములయిన ముత్యాల అక్షతలు, కాఁగన్

ఉలియు - ధ్వనిచేయు, నానా - విధ - జల - పక్షి - కుల - కల - రవము = అనేకరీతులైన నీటిపక్షుల సమూహముయొక్క అవ్యక్తమధురధ్వని, ఇంచు = ఇంపయిన, సంస్తుతి - రవము = స్తోత్రధ్వని, కాఁగన్

జలజాత - కైరవ + ఉత్పల - కలహార + ఆది - గంధంబులు = పద్మములు, తెల్లగలువలు, కలువలు, సౌగంధికములు, మున్నగువాని వాసనలు, ఓలిన్ = బాగుగా, సత్ + గంధములు + కన్ = మేలి గంధములు కాఁగా,

అనిలుఁడు = వాయువు, అర్థిన్ = కోరికతో, తన + ఆదిమూర్తికిన్ = తమ మూల స్వరూపమైన శివునకు, అర్చలు = పూజలు, ఈన్ = ఇచ్చుటకు, ముదంబునన్ = సంతోషముతో, వచ్చు + అట్లు = వచ్చురీతిని, ఈశ్వరునకున్, ఎదురువచ్చి, పథి - శ్రమము + ఎల్లన్ = మార్గశ్రమమంతయు, గారవమునన్ = ఆదరముతో, పాచెన్ = పోఁగొట్టెను

తాత్పర్యము : చెదరి కూడవచ్చునట్టి యెఱ్ఱతామరరేకులు జతఁగూడి ముడిచిన యెఱ్ఱనిచేతులు కాఁగా, చిన్నయలలందుఁబుట్టు - శీకరములు నిర్మలములయిన ముత్యాలసేసలు కాఁగా, దొరచేయు పలురీతులయిన నీటి పక్షుల గుంపుల అవ్యక్త మధుర ధ్వని ఇంపయిన స్తోత్ర ధ్వని కాఁగా, పద్మములు, తెల్లఁగలువలు, కలువలు, సౌగంధికములు మున్నగువాని పరిమళములు మంచి

గంధములు కాఁగా, వాయువు తన మూలస్వరూపమైన ఈశ్వరునకుఁ గోరికతో నర్చలిచ్చుటకు సంతోషముతో వచ్చునట్లు సరస్సునుండి వీతెంచు గాలి ఆదరముతో నెదురువచ్చి శివుని మార్గాయాసమునెల్ల అపనయించెను

విశేషములు : అలంకారము రూపకము కలహార - కల్హార చెందమ్మి రేకులు, లేఁదరఁగల తుంతుర్వని, జలపక్షులు, జలజాతాదులు - అన్నియు సరోవరములోనివే అందుచేతనే సరోవరమారుత మర్చించె ననుట నమస్కారము సేసలు చల్లుట, స్తుతించుట, గంధము లిచ్చుట -ఇవి అర్చాభాగములు వాయువు శివుని అష్టమూర్తులలో నొకటి కావున వాయువున కాదిమూర్తి ఈశ్వరుఁడు పాచెన్ - పాయుధాతు ప్రేరణార్థక రూపము 'అట్లు చుక్కుగాగమంబు లడంగ్వాది మాయ్వాదుల కగు నగుచో వాని కడవ్రాలు లోపించు' బాల క్రి 76 పాచు రూపాం పాపు లేఁదరఁగలు - లేత + తరఁగలు - చెందమ్మి - చెన్ను + తమ్మి ప్రాఁతాది సంధి బాల సంధి 36, 37, ద్రుతకార్యము - బాల సంధి 16 17

వ. తదనంతరంబ వారిజాకర తీరంబు చేరంజనుదెంచిన. 73

అర్థము: తద్ + అనంతరంబు + అ = ఆ పిమ్మట, వారిజాకర - తీరంబు = తామరకొలని యొడ్డు, చేరన్ + చనుదెంచినన్ = పమీపింపఁగా

తాత్పర్యము . ఆ పిమ్మటనే పద్మాకరతీరము చేరఁగనే - తరువాతి పద్యముతో నన్వయము

మ. మతి నీశుండు తలంచి వచ్చెనట చూ మమ్మంచు నాహ్లాద సం
యుతమై తజ్జలదేవతల్ శివున కభ్యుత్థానలైనట్టు లా
శతపత్రాకరకేళిలాలస వధూ సంభూసితాంగోల్లస
త్ప్రతిబింబంబులు తోఁచె రత్నమయసోపానంబు లం దందమై.74.

అర్థము: ఈశుండు = ఈశ్వరుఁడు, మమ్మున్, మతిన్ - మనస్సునందు, తలంచి, వచ్చెన్ + అట + చూ = వచ్చెనట సుమా, అంచున్, తద్ + జల - దేవతల్ = ఆ జలదేవతలు, ఆహ్లాద - సంయుతము + ఐ - సంతోషముతోఁ గూడుకొని, శివునకున్, అభ్యుత్థానలు + ఐన + అట్టులు + ఎదురేఁగిన వారయిన విధముగా, ఆ - శత ప్రతిబింబంబులు ఆ - శత్రపత్ర + ఆకర = ఆ తామరకొలనిలోని, కేళి= క్రీడయందు, లాలస = ఆసక్తి గలిగిన, వధూ = స్త్రీల యొక్క, సంభూషిత = బాగుగా అలంకరింపఁబడిన, అంగ = శరీరములయొక్క, ఉల్లసత్ =

ప్రకాశించుచున్న, ప్రతిబింబంబులు, రత్నమయ - సోపానంబులందున్ = రత్నములతో నిర్మింపఁబడిన మెట్లయందు, అందము + ఐ, తోఁచెన్ - కననయ్యెను

తాత్పర్యము. ఈశ్వరుఁడు మమ్ము మనస్సునందుఁ దలఁచి వచ్చెనట సుమా యని సంతోషముతో నా జలదేవత లతనికి ఎదురేఁగిన విధమున ఆ తామరకొలనియందుఁ గ్రీడించుట యం దాసక్తిగల స్త్రీల అలంకృతములైన శరీరముల ప్రకాశించు ప్రతిబింబములు మణినిర్మితములై సోపానములందు సుందరములయి కననయ్యెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష తజ్జల తద్ + జల 'సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము 75

క కొలని దరిఁ దన్ని చెలువలు
నిలిచిన నా వారి వారినీడలు తోఁచెన్
బొలు పెసఁగఁ గ్రొవ్వి సుదతులు
తలకెడవైనట్లు మదన దర్పోన్నతలై. 76

అర్థము. చెలువలు = స్త్రీలు, కొలని - దరిన్ = కొలని తీరమున, తన్ని = ఊఁదుకొని, నిలిచినన్, ఆ - వారిన్ = ఆ నీటియందు, వారి - నీడలు = వారి ప్రతిబింబములు, సుదతులు = స్త్రీలు, మదన - దర్ప + ఉన్నతలు + ఐ = మన్మథగర్వముచే ఉన్నతలయి, పొలుపు + ఎసఁగన్ = ఒప్పు అతిశయించునట్లు, క్రొవ్వి = మదించి, తలకెడవు + ఐన + అట్లు = తలక్రిందులయిన విధమున, తోఁచెన్ = కనఁబడెను

తాత్పర్యము. కొలని తీరమున నూఁదుకొని స్త్రీలు నిలఁబడఁగా, ఆ కొలని నీటియందు వారి ప్రతిబింబములు, ఆ స్త్రీలు మదనగర్వాతిశయమున మిక్కిలి క్రొవ్వి తలక్రిందులయిరా యనువిధమునఁ గననయ్యెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష వస్తువు ప్రతిబింబము నీలఁ దలక్రిందులుగా నగపడును నీటి దరి నిలిచిన స్త్రీల ప్రతిబింబములు నీటఁ దలక్రిందులుగాఁ గననగుట, వారు మన్మథగర్వమునఁ గ్రొవ్వి తలక్రిందు లయినట్లు ఉత్ప్రేక్షింపఁబడెను

వ అయ్యవసరంబున హరగిరిజలు తత్సరోజాకర తీర పారిజాత లతా మంటపాంతర మణివేదికాసీనులై జలక్రీడావలోకన తత్పరు లగుచుండి రంత వితవిటీజనంబు లొండొరుఁ గడవ ననురాగిల్లుచు 77

అర్థము : ఆ + అవసరంబునన్ = ఆ సమయమున, హరగిరిజలు, తద్+ సరోజ + ఆకర - తీర - పారిజాత - లతా - మంటప + అంతర + మణివేదికా+ ఆసీనులు + ఐ = తామరకొలని దరియందలి పారిజాతలతల మంటపములోని, మణిమయ వేదికయందుఁ గూర్చున్నవారయి, జల-క్రీడా + అవలోకన - తత్పరులు= జలక్రీడలను జూచుటయం దాసక్తిగలవారు, అగుచున్ + ఉండిరి, అంతన్, విట-విటీ - జనంబులు, ఒండొరున్ = ఒకరినొకరు, కడవన్ = అతిశయించునట్లు, అనురాగిల్లుచున్ = ప్రేమించుచు

తాత్పర్యము : ఆ సమయమున శివపార్వతులు ఆ తామరకొలని తీరమునందలి పారిజాతపుఁదీవల మండపములోని మణిమయవేదికయందుఁ గూర్చుండి జలక్రీడలను జూచు నాసక్తిగలవా రగుచుండిరి అంత వితులు ఒకరినొకరు అతిక్రమించి ప్రేమించుచు - తరువాతి పద్యముతో నన్వయము

తే లీల నొక్కటఁ జని జలకేళి సలుపఁ
గొలనిఁ జొచ్చుడు వీరిపైఁ గలయ నెగసెఁ
దరఁగ లోలిన జలదేవతలును నెదిరి
చల్లుఁబోరాడఁ జేతులు సాఁచినట్లు 78

అర్థము : లీలన్ = విలాసముతో, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, చని, జల-కేళి = జలక్రీడ, సలుపన్ = చేయుటకు, కొలనిన్ = సరస్సును, చొచ్చుడున్ = ప్రవేశించినంతనే, వీరిపైన్ = ఈ స్త్రీలపై, జలదేవతలును = జలదేవతలుగూడ, ఎదిరి, చల్లు + పోరు + ఆడన్ = మాఱు నీరిచల్లులాట నాడుటకు, చేతులు, చాఁచిన + అట్లు = చాఁచిన విధముగా, తరఁగలు = అలలు, ఓలిన్ + అ = క్రమముగా, కలయన్ = అంతటను, ఎగసెన్ = లేచెను

తాత్పర్యము: స్త్రీలు విలాసముతో నొక్కమాఱుగా వెడలి జలక్రీడలాడుటకు సరస్సును ప్రవేశింపఁగనే వారిపై జలదేవతలుగూడ మాఱునీరిచల్లులాట నాడుటకుఁ జేతులు చాఁచిరా యనునట్లు అలలు క్రమముగా అంతటను లేచెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

వ తదవసరంబున 79

అర్థతాత్పర్యములు. ఆ సమయమున -తరువాతి పద్యముతో నన్వయము

పీ కర మొప్పఁ గాముకకామినీతతి ప్రీతిఁ
గూడి జలక్రీడలాడఁ దొడఁగి
పంకజాకరములోఁ గ్రుంకి యాడెడువారు
వేడుకఁ జల్లుఁబోరాడువారు
ననురాగమున నీఁది యాడెడు వారు నా
హ్లాదంబుతో నోలలాడువారుఁ
బెనఁగి యొండొరుఁ బట్టుకొని ముంచువారు నొం
డొరులపై జలధార లొత్తువారుఁ

ఆ గమల మృదుబిసములు కల్హారకుముదోత్ప
లములుఁ బెటికికొని నయమునఁ బ్రణయ
మొదవ సంకులముగ నొండొరుతో వాదు
లాడువారుఁ దన్నులాడువారు 80

అర్థము . కాముక - కామినీ - తతి = ప్రేమికులైన పురుషుల స్త్రీల సమూహము, కరము + ఒప్పన్ = మిక్కిలి ఒప్పునట్లు, ప్రీతితోన్ = సంతోషముతో, కూడి, జల-క్రీడలు + ఆడన్, తొడఁగి = పూని,

పంకజ + ఆకరములోన్ = తామరకొలనిలో, క్రుంకి = మునిఁగి, ఆడెడువారున్, వేడుకన్ = వేడుకతో, చల్లు + పోరు + ఆడువారున్ = ఒకరిపై నొకరు నీరుచల్లుకొనునాట ఆడువారును

అనురాగమునన్ = ఇష్టముతో, ఈఁది, ఆడెడువారున్, ఆహ్లాదంబుతోన్= సంతోషముతో, ఓలలాడువారున్ = జలక్రీడలాడువారును,

పెనఁగి = పోరి, ఒండొరున్ = ఒకరినొకరు, పట్టుకొని, ముంచు - వారున్, ఒండొరులపైన్ = ఒకరి మీఁద నింకొకరు, జల-ధారలు = నీటిధారలు, ఒత్తువారున్= కొట్టువారును

కమల - మృదు - బిసములు = తామరల మెత్తని తూఁడులు, కల్హార - కుముద - ఉత్పలములున్ = సౌగంధికములు, తెల్లకలువలు, కలువలును, పెటికికొని = పెల్లగించి, నయమునన్ = బాగుగా, ప్రణయము = ప్రేమము,

ఒదవన్ = కలుగఁగా, సంకులముగన్ = క్రమములేకుండ, ఒండొరుతోన్ = ఒకరితో నొకరు, వాదులు + ఆడువారున్ = వాదించుకొనువారును, తన్నులు + ఆడువారున్ తన్నుకొనువారును

తాత్పర్యము . వివిధజీవులు ప్రీతితోఁగూడి జలక్రీడలాడఁ బూని పద్మాకరములో మునిఁగి ఆడువారును, వేడుకతో నీరు చల్లుకొను ఆటలాడువారును, ఇష్టముతో నీఁదియాడువారును, ఆహ్లాదముతో ఓలలాడువారును, పోరి ఒకరి నొకరు పట్టుకొని ముంచువారును, ఒకరిపై నొకరు జలధారలు పోసికొనువారును, తామరతూండ్లు, సౌగంధికములు, తెల్లకలువలు, కలువలు పీఁకి ప్రేమము కలుగునట్లు ఒకరితో నొకరు బాగుగా వాదించుకొనువారును, ఒకరినొకరు తన్నుకొనువారును

విశేషములు : అలంకారము స్వభావోక్తి

క వరసతులుఁ బతులుఁ గడలడి
పురుడునఁ దమలోనఁ జల్లుఁబోరాడ సరో
వరజలము లోడి దివి కు
ప్పర మెగసిన కరణిఁ గొలను బయలుగ నెగసెన్ 81

అర్థము. వరసతులన్ - శ్రేష్ఠురాండ్రయిన స్త్రీలును, పతులున్ = భర్తలును, కడలడి = అలల సమూహము, పురుడునన్ = సమముగా, తమలోనన్ = చల్లుఁబోరాడన్ = నీరుచల్లుకొను ఆటలాడఁగా, సరోవర - జలములు = కొలని నీరములు, ఓడి, దివికిన్ = ఆకాశమునకు, ఉప్పరము + ఎగసిన - కరణిన్ = మీఁది కెగిరిన విధమున, కొలను = సరస్సు, బయలుగన్ = శూన్యప్రదేశము అగునట్లు, ఎగసెన్ = ఎగిరెను

తాత్పర్యము : స్త్రీలును దత్పతులును, అలల సమూహమును దమలోఁ దాము సమముగా ఒకరిపై నొకరు నీరుచల్లుకొను ఆటలాడఁగా, సరస్సు జలములు ఓడి ఆకాశమునమీఁది కెగిరెనా యన సరస్సు శూన్యప్రదేశమగునట్లు, ఎగిరెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

చ గురుకుచ వక్త్ర నేత్ర గతి కుంతల బాహులతాధరంబులన్
బరువడిఁ బోలియున్కిఁ గని బాలిక లల్గి యడంచి రొక్కొ నా
నురుతర చక్రవాక జలజోత్పల మత్తమరాళి కాలి భా
సుర బిస బంధుజీవ తతి చూడ నదృశ్యము లయ్యె నయ్యెడన్ 82

అర్థము : బాలికలు = స్త్రీలు, (తమ) గురు = పెద్దవియగు, కుచ = స్తనములను, వక్త్ర = ముఖమును, నేత్ర = కన్నులను, గతి = నడకను, కుంతల = శిరోజములను, బాహు - లతా = తీవలవంటి చేతులను, అధరంబులన్ = క్రింది పెదవులను, పరువడిన్ = క్రమముగా, పోలి + ఉన్కిన్ = పోలియుండుటను, కని = చూచి, అల్గి = కోపించి, అడంచిరి + ఒక్కొ - నాన్ = అణఁచివైచిరా యనునట్లు, ఉరుతర = పెద్దవియగు, చక్రవాక = జక్కవల, జలజ = పద్మముల, ఉత్పల = కలువల, మత్త - మరాళికా= మదించిన హంసంల, అలి = తుమ్మెదల, భాసుర = ప్రకాశించు, బిప = తామర తూండ్ల, బంధుజీవ = మంకెన పూవుల, తతి = సమూహము, చూడన్ = చూడఁగా, అయ్యెడన్ (ఆ + ఎడన్) = ఆ సమయమున, అచ్చట, అదృశ్యములు = మాయమైనవి, అయ్యెన్

తాత్పర్యము . కొలనిలో జలక్రీడలాడు బాలికలు తమ పెద్ద స్తనములను, కేలుఁదీవలను, క్రింది పెదవులను, క్రమముగాఁ బోలి యుండుటఁ జూచి, కోపించి, అణఁచివైచిరా యన, పెద్దవియగు చక్రవాకములు, పద్మములు, కలువలు, మదించిన అంచలు, తుమ్మెదలు, తామరతూండ్లు, మంకెన పూలు అనువాని సమూహము అచ్చో మాయమయ్యెను

విశేషములు : అలంకారము యథాసంఖ్యము, ఉత్ప్రేక్ష బంధుజీవము జలపుష్పమని దీనివలనఁ దెలియుచున్నది

చ. నెలఁతలు కొంద ఱక్కొలని నీరులలోపలఁ గ్రుంకి పోయి మై
బలసిన భూషణద్యుతులు పర్వఁగ నొక్కట లేచి రక్కడన్
వెలుఁగుచు నాగకన్యకలు వేడుకతో జలకేళి సల్పఁగా
నొలసి రయంబున న్నెగసిరో యని చూపఱు మెచ్చి చూడఁగన్ 83

అర్థము : నెలఁతలు - కొందఱు స్త్రీలు కొంతమంది, అక్కొలని (ఆ + కొలని) - నీరుల - లోపలన్ = ఆ సరస్సు నీరములలో, క్రుంకి - పోయి = మునిఁగిపోయి, మైన్ = శరీరమున, బలసిన = చుట్టుకొన్న, భూషణ- ద్యుతులు

అలంకారముల కాంతులు, పర్వఁగన్ = వ్యాపింపఁగా, అక్కడన్, వెలుఁగుచున్ = ప్రకాశించుచు, నాగ-క్యకలు = పాఁపపడుచులు, వేడుకతోన్, జల - కేళి = జలక్రీడ, సల్పఁగాన్ = చేయుటకు, ఒలసి = ప్రవేశించి, రయంబునన్ = శీఘ్రముగా, నెగసిరో + అని = లేచిరోయని, చూపఱు = చూచువారు, మెచ్చి చూడఁగన్, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, లేచిరి

తాత్పర్యము . కొంతమంది స్త్రీలు ఆ కొలని నీరములలో మునిఁగి శరీరములందుఁ జుట్టుకొన్న అలంకారముల కాంతులు వ్యాపింపఁగా నచ్చటఁ బ్రకాశించుచు, పాఁపపడుచులు వేడుకతో జలక్రీడలాడఁజొచ్చి వెంటనే లేచిరో యని చూచువారు మెచ్చి చూడఁగా, నొక్కమాఱుగా లేచిరి

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క స్తనములు సకుంతలాస్యము
వనములపైఁ దోఁప వికచవనజంబును మూఁ
గు నళులఁ గవచక్కవ తో
కొనుక్రియ వెల్లీఁత యీఁదెఁ గోమలి కొలనన్ 84

అర్థము : స్తనములున్ = చన్నులును, సకుంతల + ఆస్యమున్ = శిరోజములతోఁగూడిన ముఖమును, వనములపైన్ = నీరులపై, తోఁపన్ = కనఁబడఁగా, వికచ - వనజంబును = వికసించిన పద్మమును, మూఁగు + అళులన్ = మూఁగు తుమ్మెదలను, కవ - చక్కవ = (కవ జక్కవ ?) = చక్రవాకముల జంట, తోకొను - క్రియన్ = తోడుకొను విధమున, కోమలి = స్త్రీ, కొలనన్ = సరస్సునందు, వెల్లీఁత = వెల్లికిలఁబరుండి యీఁదుట, ఈఁదెన్

తాత్పర్యము . స్తనములను, శిరోజములతోఁ గూడిన ముఖమును నీటిపైఁ గనఁబడఁగా, వికసించిన పద్మమును మూఁగెడి తుమ్మెదలను జక్కవ కవ తోడుకొనులాగున నొక కోమలి కొలనియందు వెల్లకిలఁబరుండి యీఁదెను

విశేషములు . ఈ పద్యమున 'మూఁగు నళులఁగవ చక్కవ చేకొను క్రియ' నను భాగము వావిళ్లవారి ప్రతిలోఁ గుండలీకరణములలో నున్నది మా రా ప్రతిలో మొదలే లేదు చక్కవ శబ్దము విఘంటువుల లేదు అది జక్కవ యయి యుండునని వ్యాఖ్యానింపఁబడినది అలంకారము ఉత్ప్రేక్ష వనము = (నానా) నీరు, తోఁట, మూఁగునళులన్ = మూఁగు + అళులన్ 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు ' బాల సంధి 33

క అలి రణితాబ్జముఁ గని చెలి
పిలిచెనొ యని దాసి యెటిఁగి, పిఱుసని, చెలి తన్
బిలిచిన నెఱుఁగుదు నప్పటి
జలజమ వని యీఁది ముగ్ధ చని దరి యెక్కెన్ 85

అర్థము ముగ్దర్థ = ఒక గోల - అమాయకురాలు, అలి - రణిత + అబ్జమున్ = తుమ్మెదల రొదతోఁగూడిన పద్మమును, కని = చూచి, చెలి = సఖి, పిలిచెనొ + అని = పిలిచెనేమోయని, దాసి = డాసి = సమీపించి, ఎటిఁగి = అది చెలి పిలుచుట కాదు, తుమ్మెదల రొదతోడి పద్మము అని తెలిసి, పిఱు + చని = వెనుకకుఁబోయి, చెలి = సఖి, తన్ = తన్ను, పిలిచినన్ = పిలువఁగా, ఎఱుఁగుదున్, అప్పటి - జలజమవు = మునుపటి తామరవు, అని, ఈఁది, చని, దరి = ఒడ్డు, ఎక్కెన్

తాత్పర్యము . ఒక ముద్దరాలు తుమ్మెదలరొదతోడి పద్మమును జూచి తన్నుఁ జెలి పిలిచినదా యని, సమీపించి, అది చెలి పిలుచుట కాదు, తుమ్మెదల రొదతోడిపద్మమనునిజమునెటిఁగి వెనుకకుఁ బోయి, చెలి తన్ను నిజముగాఁ బిలిచినప్పుడు నాకుఁ దెలియునులే నీవు మునుపటి పద్మమవే' అని వెడలి ఒడ్డునెక్కెను

విశేషములు . అలంకారము భ్రాంతిమంతము ఆమె ముగ్ద కావుననే అట్టి భ్రాంతికి లోనయినది ముగ్దా శబ్దము (విశేష్యము - సాభిప్రాయము గావున నలంకారము పరికరాంకురము

క జలజంబులలో నీలో
త్పలములు పూచె నని ముగ్దభావన దృగ్దీ
ప్తులు గల యొండొరులు మొగం
బులు కౌతుకలీలఁ బుడుకఁబోదురు తమలోన్ 86

అర్థము . దృశ్ (క్) + దీప్తులు = చూపుల కాంతులు, కల = ఉన్న, ఒండొరులు = ఒకరొకరు, ముగ్ద - భావనన్ = అమాయకత్వముతో, జలజంబులలోన్= పద్మములలో, నీల + ఉత్పలములు = నల్ల కలువలు, పూచెన్, అని, తమలోన్ = పరస్పరము, కౌతుక - లీలన్ = వేడుకతో, మొగంబులు = ముఖములు, పుడుకన్ + పోదురు = పట్టకొనఁబోవుదురు

తాత్పర్యము. కన్నుల కాంతులు గల ఒక్కరొకరు అమాయకపు టూహతో బద్మములలో నల్లకలువలు పూచెనని పరస్పరము కుతూహలముతో తమతమ ముఖములను పట్టుకొనఁబోవుదురు

విశేషములు . ఆ స్త్రీల ముఖములు పద్మములవలెను, వారి కన్నులు (చూపులు) నల్ల కలువల వలెను నున్నవని భావము అలంకారము భ్రాంతిమంతము వారికి ముఖములందుఁ బద్మభ్రాంతి, దృక్కులయందు నీలోత్పలభ్రాంతి, ఒండొరుల మొగంబులు' అను వావిళ్ల, మా రా ప్రతులలోని పారమును వీడి, సాహిత్య అకా ప్రతిలోని 'ఒండొరులు' అనుపారమును గ్రహించుట 'పుడుకఁబోదురు' అనుక్రియకుఁ గర్త సిద్ధించుటకు

'బాలే తమ ముఖామ్భోజే దృష్ట కాళిన్దీవరద్వయమ్ ' కాళి

తే తమ ముఖంబులు దళితాంబుజములు సావి
మూవు తేఁటులఁ గని నవ్వు నా విలాస
వతుల దరహాసరుచి మధువ్రతము లెఱిఁగి
వెల్లనై పద్మషండంబు వెలరి చనియె. 87

అర్థము . తమ - ముఖంబులు, దళిత + అంబుజములు సావి = వికసించిన పద్మములు అను భ్రాంతితో, మూవు = మూఁగునట్టి, తేఁటులన్ = తుమ్మెదలను, కని = చూచి, నవ్వు, ఆ - విలాసవతుల = ఆ యొయ్యారుల యొక్క, దర -హాస '- రుచిన్ = చిఱునవ్వు కాంతిని, మధువ్రతములు= తుమ్మెదలు, ఎఱిఁగి = తెలిసి, వెల్లనై (వెల్లన + ఐ) = వెలవెలఁబాఱి, వెలరి = వెలువడి, చనియెన్ = పోయెను

తాత్పర్యము . కమలసమూహములోనున్న తుమ్మెదలు ఆ యింతుల ముఖములను జూచి వికసించిన పద్మములని భ్రాంతిఁజెంది మూఁగినవి వానిని జూచి ఆ విలాసవతులు చిన్నగా నవ్విరి అప్పుడు తుమ్మెదలు అది పద్మవికాసము కాదు చిఱునగవుకాంతియని తెలిసికొని వెలవెలఁబాఱి తామరతోఁపునుండి వెలువడి యేఁగెను

విశేషములు : అలంకారము భ్రాంతిమంతము దరహాసరుచితోఁ గూడిన ఆ స్త్రీల ముఖములందుఁ దుమ్మెదలకు దళితాంబుజభ్రాంతి ముఖములు పద్మములవలెను, చిఱునవ్వు తద్వికాసము వలెను ఉన్నవని భావము 'వెల్లనై' =

తెల్లనై పద్మషండములో నున్న తుమ్మెదలకుఁ దద్రజస్సు అంటుకొని తెల్లనగుటను దాము తలఁచినట్లుకామికి వెలవెలఁబోవుటగాఁ గవి చమత్కరించినాఁడు

చ తన ముఖ మంబుజాత మని తండడి మూవు నలివ్రజంబుతోఁ
బెనఁగు విదగ్ధ మ్రోల నొక బేలుసతిం గని యోలఁబెట్టి పి
ల్చిన నది తన్నుఁ బట్టనని చేరినఁ దేఁటులదాని మూవి కొం
డనుచును గ్రుంకి పోయి చదురాలయి నవ్వుచు లేచె నొక్కెడన్ 88

అర్థము. ఒక్కెడన్ = ఒక్క+ ఎడన్ = ఒక చోట, తన - ముఖము, అంబుజాతము + అని = పద్మమని, తండడిన్ = దండడిన్ (?) = తఱుచుగా, మూవు = మూఁగునట్టి, అలి-వ్రజంబుతోన్ = తుమ్మెదల గుంపుతో, పెనఁగు = పోరునట్టి, విదగ్ధ = నేర్పరి, మ్రోలన్ = చేరువను, ఒక, బేలు - సతిన్ =ముగ్ధయైన స్త్రీని, కని, ఓలన్ + పెట్టి = కేకవైచి, పిల్చినన్ = పిలువఁగా, అది = ఆ ముగ్ధ, తన్నున్ = ఆ పిలిచిన యామెను, పట్టన్ + అని = పట్టుకొనుటకని, చేరినన్ = చేరఁగా, తేఁటులన్ = తుమ్మెదలను, దానిన్ = ఆ వచ్చిన యామెను, మూవికొండు = మూఁగికొనుఁడు, అనుచును, క్రుంకి = మునిఁగి, పోయి, చదురాలు + అయి (చదురు + ఆలు + అయి) = నేర్పు గలది యయి, గడుసుదయి, నవ్వుచున్, లేచెన్

తాత్పర్యము. ఆ కొలనిలో నొకచోటఁ దన ముఖము పద్మమని భ్రాంతిపడి తఱుచుగా మూఁగెడి తుమ్మెదల గుంపుతోఁ బోరాడు నొక నేర్పరియైన యింతి తనకుఁ జేరువనున్న మఱియొక ముగ్ధను జూచి ఓలయని పిలిచెను ఆ ముగ్ధ ఆమెను రక్షించుటకుఁ జేరెను అప్పు డావిదగ్ధ తేఁటులతో 'దానిని మూఁగికొనుఁ' డని తాను నీట మునిఁగి నేర్పుగలదయి నవ్వుచు లేచెను

విశేషములు. తుమ్మెదలకు విదగ్ధ ముఖమునందుఁ బద్మభ్రాంతి కావున నలంకారము భ్రాంతిమంతము మోసగించుటకే మఱియొకతెను బిలుచుటయే ఆమె విదగ్ధత పిలువఁగనే చేరి మోసగింపఁబడుటయే మఱియొకతె బేలుతనము మూఁగు - మూవు 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు' బాల ఆచ్చిక 27 చదురాలు - చదురు + ఆలు 'పేదాదులలో వలె రుగాగమము కాకుండుట విశేషము

చ అలికలితాంబుజంబు ప్రియునానన మన్వగ హస్తయంత్రధా
రలు మొగిఁబేర్చు ముగ్ధఁగని రాగమునం బతి నవ్వుడుం దదు
జ్జ్వలతర దంత దీధితులు వచ్చుటఁ గాంచి నిజేశుపేర్చుని
ర్మల జలధార లొక్కొయని మానిని త్రిప్పె ముఖాబ్జ మక్కడన్ 89

అర్థము అక్కడన్ = ఆ కొలనిలో, అలి - కలిత + అంబుజంబు = తుమ్మెదలతోఁగూడిన పద్మము, ప్రియు + ఆననము = తన ప్రియుని యొక్క ముఖము, అన్వగన్ (అను+వగన్) = అనెడి తలఁపుతో, హస్త - యంత్ర - ధారలు = చేతి చిమ్మన గ్రోవిజలధారలు, మొగిన్ = పూనికతో, పేర్చు = వ్యాపింపఁజేయు, ముగ్ధన్ = అమాయకురాలిని, కని, పతి = భర్త, రాగమునన్ = ప్రేమముతో, నవ్వుడున్ = నవ్వినంతనే, తద్ + ఉజ్వలతర - దంత-దీధితులు= అతని మిక్కిలి ప్రకాశవంతములయిన పలు కాంతులు, వచ్చుటన్, కాంచి, నిజ + ఈశు = తన భర్తయొక్క, పేర్చు = విజృంభించు, నిర్మల - జల - ధారలు + ఒక్కొ + అని, = నిర్మలములయిన నీటిధారలా యని, మానిని = స్త్రీ, ముఖాబ్జము (ముఖ + అబ్జము) = తామరవంటి మోము, త్రిప్పెన్

తాత్పర్యము. ఆ కొలనిలోఁ దుమ్మెదలతోఁ గూడిన పద్మమును జూచి తన ప్రియుని ముఖ మను భ్రాంతితోఁ జేతి చిమ్మన గ్రోవితో జలధారలను జిమ్ము ముగ్ధను జూచి తత్పతి ప్రేమముతో నవ్వినంతనే, అతని ఉజ్జ్వలతరములయిన దంతకాంతులు ప్రసరించుటఁ జూచి అవి తన భర్త తనపైఁ జిమ్ము నిర్మలజలధారలా యని భ్రాంతిపడి, ఒక స్త్రీ తన మోముఁదమ్మిని ద్రిప్పుకొనెను

విశేషములు ఆమె ముగ్ధ కావుననే అలికతాంబుజమునందు ఆమెకుఁ బ్రియాననభ్రాంతి మఱియు నతని దంతకాంతులందు నిర్మల జలధారా భ్రాంతి ప్రియునాననము - ప్రియు + ఆననము - 'షష్ఠీసమాసమునం దుకార ముకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు ' బాల సంధి 34 అన్వగ + అను + వగ 'అను కొను లోనగు ధాతుజవిశేషణముల యంత్యోకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు ' ప్రౌఢ సంధి 13

వ ఇట్లనేకు లనేకప్రకారంబులం గ్రీడాసక్తులై విహరించుచుండి రంత 90

అర్థము ఇట్లు అనేకులు = పెక్కండ్రు, అనేక - ప్రకారంబులన్ = పెక్కు రీతుల, క్రీడా + ఆసక్తులు + ఐ = జలక్రీడలందుఁ గోరిక గలవారయి, విహరించుచున్ + ఉండిరి = క్రీడించు చుండిరి, అంతన్

తాత్పర్యము ఈ విధముగాఁ బెక్కురు పెక్కురీతుల జలక్రీడలయందుఁ గోరిక గలవారయి క్రీడించుచుండిరి అంత - తరువాతి పద్యముతో నన్వయము

సీ సంధిల్లి మేనుల బంధూక దలములు
పద్మరాగాకల్పభాతి గాఁగ
మెఱుఁగారు తనువులఁ దఱఁకిన జలబిందు
లమల ముక్తాభూషణములు గాఁగఁ
బొలయు లేఁదరఁగల జలజపరాగంబు
గురుకుచాగ్రముల కుంకుమము గాఁగ
సహజాంగపరిమళసక్తాలిమాలిక
లమరేంద్రనీలహారములు గాఁగఁ

తే బడఁతు లేపునఁ బద్మిని యొడమి యెల్లఁ
జూఱఁగొని పేర్చి మనమునఁ జొక్కు మిగిలి
విటజనంబులపైఁ బరి వెడలునట్లు
కొలను వెడలిరి జలకేళివలనఁ దనిసి 91

అర్థము . బంధూక - దలములు = మంకెనపూలరేకులు, మేనులన్= శరీరములందు, సంధిల్లి = కూడి, పద్మరాగ + ఆకల్ప - భాతి = పద్మరాగమణుల ఆభరణముల విధము, కాఁగన్

మెఱుఁగారు = ప్రకాశించు, తనువులన్= శరీరములందు, తఱఁకిన = వ్యాపించిన, జల - బిందులు=నీటిబిందువులు, అమల - ముక్తా - భూషణములు = నిర్మలములయిన ముత్యాల ఆభరణములు, కాఁగన్

పొలయు = ఒప్పునట్టి, లేఁదరఁగలన్ (లేఁత + తరఁగలన్) = చిఱుత అలలందలి, జలజ - పరాగంబు = పద్మములు రజస్సు, గురు - కుచ + అగ్రముల కుంకుమము = పెద్దవియగు స్తనముల కొనలందలి కుంకుమము, కాఁగన్

సహజ + అంగ - పరిమళ - సక్త +అలి - మాలికలు = స్వాభావికమైన శరీర సువాసనయందుఁ గోరిక గల తుమ్మెదల బారులు, అమర + ఇంద్రనీల హారములు = ఇంద్రనీలమణుల హారములు, కాఁగన్

పడఁతులు = ఇంతులు, ఏపునన్ = విజృంభణముతో, పద్మిని + ఒడమి + ఎల్లన్ = పద్మలత సంపద యంతయు, చూఱగొని = కొల్లగొట్టి, పేర్చి = విజృంభించి, మనమునన్ = మనసునందు, చొక్కు = పారవశ్యము, మిగిలి = అధికమయి, విట - జనంబులపైన్ = విటకాండ్రపై, పరివెడలు + అట్లు =

దండువెడలిన విధమున, జల-కేళి-వలనన్ = జలక్రీడయందు, తనిసి = తృప్తిచెంది, కొలను - వెడలిరి = కొలని నుండి వెలువడిరి

తాత్పర్యము. మంకెనపూల రేకులు శరీరములందు అంటిపద్మరాగమణుల ఆభరణముల రీతి కాఁగా, ప్రకాశించు శరీరముల వ్యాపించిన జలకణములు నిర్మలములైన ముత్యాల అలంకారములుగాఁగా, లేయలలందలి పద్మముల పుప్పొడి పెద్ద స్తనముల కొనలందలి కుంకుమము కాఁగా, స్వాభావికమైన శరీరపరిమళమునందుఁ గోరిక గల తుమ్మెదల బారులు ఇంద్రనీల మణుల హారములు కాఁగా, స్త్రీలు పద్మలత సంపదయంతయును గొల్లగొట్టి విజృంభించి మనస్సునఁ బారవశ్య మతిశయింప వీటులపై దండువెడలునట్లు జలక్రీడయెడఁ దృప్తినొంది కొలను వెలువడిరి

విశేషములు : అలంకారము రూపకము, ఉత్ప్రేక్ష కొలను వెడలిరి 'అపాయ భయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లెద్దాననగు దానికి వలన వర్ణకంబగు ' బాల కారక 9 కొలను వలన వెడలిరి 'ఉండి పదం బొకానొకచో వలనవర్ణకంబున కనుప్రయుక్తంబగు' బాల కారక 10 కొలను వలన నుండి వెడలిరి ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు ' బాల కారక 11 కొలని నుండి వెడలిరి 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తముల మీఁది యండికి లోపంబు బహుళంబుగా నగు ' ప్రౌఢ కారక 11 కొలను వెడలిరి జలకేళి వలనఁ దనిసి - జలకేళి వలనఁ దగిలి యను పారముకంటె నీ పారము మేలుగాఁ గనిపించుటచే నది స్వీకరింపఁబడినది తనిసిన పిమ్మటనే గదా కొలను వెలువడుట !

వ తదవసరంబున **92**

అర్థతాత్పర్యములు : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

ఉ అంబర నామధేయ ముచితార్థముగా జలసిక్తమై దుకూ
లంబు లదృశ్య మయ్యెఁ గడు లజ్జఁ జలింప, సతుల్ వీటాలి మో
హంబునఁ జూడ, గాలిఁ దడియాఱి త దంబరముల్ కటి ప్రదే
శంబునఁ బొల్చెఁ దత్సతులు సంతసమందఁ వీటాలి వందఁగన్ 93

అర్థము అంబర - నామ ధేయము = వస్త్రమునకు అంబరము (ఆకాశము) అనుపేరు, ఉచిత + అర్థము + కాన్ = తగిన అర్థమగునట్లు - సార్థకమగునట్లు, దుకూలంబులు = సన్నని వస్త్రములు, జల-సిక్తము + ఐ = నీటఁదడిసినవయి, సతుల్ = స్త్రీలు, కడున్ = మిక్కిలి, లజ్జన్ = సిగ్గుతో, చలింపన్ = కదలఁగా, విట + ఆలి = విటుల సమూహము, మోహంబునన్ = వలపుతో, చూడన్ = చూడఁగా, అదృశ్యము + అయ్యెన్ = కనఁబడకపోయెను సన్ననివి కావునఁ దడిసి వస్త్రములు లేనియట్లే యుండెను గాలిన్ = గాలిచే, తడి + అఱి =తడి ఆఱిపోయి - పొడివి అయి, తద్ + అంబరములల్ = ఆ వస్త్రములు, తద్ + సతులు = ఆ స్త్రీలు, సంతసము + అందన్ - సంతోషింపఁగా, విట + ఆలి = విటుల సమూహము, వందఁగన్ = దుఃఖింపఁగా, కటి - ప్రదేశంబులన్ = జఘన స్థలములందు, పొల్చెన్ = ఒప్పెను

తాత్పర్యము : స్త్రీలు కొలనిలో స్నానము చేసినప్పుడు వారు ధరించిన సన్నని వస్త్రములు శరీరమున కంటుకొనిపోయి లోపలి అవయవములు పైకిఁ గనఁబడుచు వస్త్రములు లేని యట్లే యుండెను అందుచే అంబరమునకు (వస్త్రమునకు) ఆకాశము (శూన్యము) అను మఱియొక అర్థము సార్థకమయినది లోపలి యవయవములు కనవచ్చుటచే స్త్రీలు సిగ్గుతోఁ జలించిరి విటులు కామముచే సంతోషించిరి ఆ వస్త్రములు గాలికాఱి వారి జఘనప్రదేశముల నొప్పఁగనే, తమ కవయవ గోపనము జరుగుచున్నది గదా యని స్త్రీలు సంతోషించిరి అవయవదర్శనలాభము పోయెనే యని విటులు దుఃఖించిరి

విశేషములు . అలంకారము శ్లేషము - స్వభావోక్తి

వ. అంతం బరమేశ్వరావలోకనాజ్ఞాప్రేరితుండై ధనేశ్వరుండు త దఖిల జనాభిమతాంబరానులేపనాభరణాదు లొసఁగె నయ్యవసరంబున నుమామహేశ్వరు లారామక్రీడావలోకనాసక్తులై లీలోద్యానంబున కరుగుదెంచి రంతకుమున్న వసంతసమయంబున 94

అర్థము : అంతన్, పరమేశ్వర + అవలోకన + ఆజ్ఞా - ప్రేరితుండు + ఐ = ఈశ్వరునియొక్క చూపుఅనెడి ఆజ్ఞచేఁ బ్రేరేపింపఁబడినవాఁడయి, ధన + ఈశ్వరుండు = ధనపతి - కుబేరుఁడు, తద్ + అఖిల - జన + అభిమత + అంబర + అనులేపన + ఆభరణ + ఆదులు = ఆ యెల్ల జనుల కిష్టములైన వస్త్రములు, పూఁతలు, అలంకారములు మున్నగునవి, ఒసఁగెన్ = ఇచ్చెను, అయ్యవసరంబునన్

(ఆ+అవసరంబునన్) ఆ సమయమున, ఉమా - మహేశ్వరులు = పార్వతీ పరమేశ్వరులు ఆరామ - క్రీడా + అవలోకన + ఆసక్తులు + ఐ = వన విహార దర్శనమునందుఁ గోరిక గలవారయి, లీలా + ఉద్యానంబునకున్ = విలాసవనమునకు, అరుగుదెంచిరి = వచ్చిరి, అంతకున్ -మున్ను + అ = అంతకు మునుపే, వసంత - సమయంబునన్

తాత్పర్యము. అంత నీశ్వరుని చూపనెడి ఆనచేఁ బ్రేరితుఁడయి కుబేరుఁడు అచ్చటి జనులకు వలయు వస్త్రములు, అనులేపనములు, ఆభరణములు మున్నగునవి యిచ్చెను అప్పుడు పార్వతీపరమేశ్వరులు వనవిహారదర్శనమునం దాసక్తి గలవారయి విలాసవనమునకు విచ్చేసిరి అంతకుమునుపే వసంత సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

పార్వతీశ్వరుల వనవిహారము

క మలయానిలంబు సోఁకినఁ
జలిమిరి సొగయించి భూమిజంబుల యొడళుల్
పులకించినట్లు విడి గుము
రులు గొని యీరికలు గడు మురువుగా నెగసెన్ 95

అర్థము. మలయ + అనిలంబు = దక్షిణపు గాలి, సోఁకినన్ = తగులఁగా, చలిమిరిన్ = చల్లఁదనముచే, సొగయించి = సుఖించి - పారవశ్యము చెంది, భూమి జంబుల + ఒడళుల్ = చెట్ల మేనులు, పులకించిన + అట్లు = గగుర్పాటు చెందినవిధమున, విడి = ఎఱ్ఱనయి, గుమురులు + కొని = గుంపులు కట్టి, ఈరికలు = అంకురములు, కడున్ = మిక్కిలి, మురువుగాన్ = చక్కఁగా, ఎగసెన్ = లేచెను - పాటమరించెను

తాత్పర్యము దక్షణిపు గాలి సోఁకఁగాఁ జల్లఁదనము గలిగి పారవశ్యము చెంది చెట్ల మేనులు గగుర్పొడిచెనా యనునట్లు, అంకురములు ఎఱ్ఱనివయి, గుంపులు గట్టి మిక్కిలి చక్కఁగాఁ బొటమరించెను

విశేషములు. అలంకార ముత్రేక్ష

క వలరాజున కెత్తిన కెం
దలిరుగొడుగులనఁ దనర్చెఁ దరు లతఁడు వియో
గుల నేయ నమర్చినశర
ముల పాదులన ముకులగుచ్ఛములు పాలు పెసఁగెన్ 96

అర్థము తరులు = చెట్లు, వలరాజునకున్ = మన్మథునకు, ఎత్తిన = పట్టిన, కెందలిరుగొడుగులు (కెంపు + తలిరు) + గొడుగులు = ఎఱ్ఱని చివురు గొడుగులు, అనన్, తనర్చెన్ = ఒప్పెను అతఁడు = మన్మథుఁడు, వియోగులన్ = విరహులను, ఏయన్ = కొట్టుటకు, అమర్చిన = ఏర్పఱిచిన,, శరముల - పొదులు = అంపపొదులు, అనన్, ముకుల - గుచ్ఛములు = మొగ్గల గుత్తులు, పొలుపు + ఎసఁగెన్ = ఒప్పు అతిశయించెను - మిక్కిలి యొప్పెను

తాత్పర్యము . చెట్లు మన్మథునకుఁ బట్టిన కెంజివురుగొడుగులోయన నొప్పెను అతఁడు వియోగులను గొట్టుట కమర్చిన యంపపొదులో యన మొగ్గల గుత్తులు మిక్కిలి యొప్పెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

ఉ ఆ వనిమధ్యసంస్థితకుజావలిలో నొకపిన్నపొన్న తొ
ల్పూవులు పుట్టి యక్షణమ భూరుహసంతతి మీఁద నెల్ల నె
త్తావి రయంబునన్ నెగసి తందడిఁ గప్పిన ఘ్రానఘ్రానికిం
బూవులు లేకయున్ సుడిసెఁ బుష్పలిహాలి సుగంధలుబ్ధమై 97

అర్థము . ఆ - వని - మధ్య - సంస్థిత - కుజ + ఆవలిలోన్ = ఆ వనము నడుమనున్న చెట్లవరుసలో, ఒక - పిన్న - పొన్న = ఒక చిన్న పొన్నచెట్టు, తొల్ + పూవులు = మొదటిపూఁత, పుట్టి, అక్షణము + అ = వెంటనే, భూరుహ - సంతతి= మీఁదన్ = చెట్ల సమూహముపై, ఎల్లన్ = అంతటను, నెత్తావి (నెఱ + తావి) = నిండు పరిమళము, రయంబునన్ = వేగముగా, నెగసి = లేచి, తందడిన్ = దందడిన్ = అధికముగా, కప్పినన్ = క్రమ్మఁగా, ఘ్రానఘ్రానికిన్ = చెట్టు చెట్టునకు, పూవులు - లేకయున్ = పూవులు లేకున్నను, పుష్పవిహాలి (పుష్పలిహా + ఆలి) = తుమ్మెదలవరుస) సుగంధ - లుబ్ధము + ఐ = పరిమళమునందు లోభము గలదియై, సుడిసెన్ = తిరిగెను

తాత్పర్యము . ఆ వనమునడుమనున్న చెట్ల వరుసలో నొకచిన్న పొన్నచెట్టు మొదటిసారిగాఁ బూసి వెంటనే పరిమళము పుట్టి చెట్ల సమూహముపై నెల్ల అధికముగాఁ గ్రమ్ముకొనఁగాఁ దుమ్మెదలగుంపు పరిమళమునందు లోభము గలదయి చెట్టు చెట్టునకును బూవులు లేకున్నను భ్రమించెను

విశేషములు అలంకారము విభావన 'విభావనా వినాపి స్యాత్ కారణం కార్యజన్మచేత్' చంద్రా కారణములేకుండఁగనే కార్యము గలిగినట్లు చెప్పుదుమేని విభావనాలంకార మగును ఇచ్చటఁ బూవు లను కారణములేకున్నను తుమ్మెదలు భ్రమించుట అనుకార్యము జరిగెను నెత్తావి - నెఱ + తావి 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి' బాల సంధి 39 మ్రానుమ్రానికిన్ - 'వీప్సయందును గాలపరిమితియందును నామంబులకుఁ గువర్ణకం బగు' ప్రౌఢ కారక 14 'పుష్పలిట్' శబ్దము హకారాంతముగానే కాక, అకారాంతముగాఁ గూడఁ గలదని సూ ని హకారాంత మయినచో - పుష్పలిట్ + ఆలి = పుష్పలిడాలి యనియు, అకారాంత మయినచో పుష్పలిహాలియనియు నగును

వ అంత ననంత తరు గుల్మ లతానీకంబు లొండొంటికి మీఱిన ట్లనూన ప్రసూనవికాసప్రసవాభిరామంబులైన **98**

అర్థము. అంతన్, అనంత - తరు - గుల్మ - లతా + అనీకంబులు = అంతములేని చెట్లు, పొదలు, తీఁగల సమూహములు, ఒండొంటికిన్ = ఒకదానినొకటి, మీఱిన + అట్లు = మించిన విధమున, అనూన - ప్రసూన - వికాస - ప్రసవ + అభిరామంబులు + ఐనన్ = తక్కువకాని (అధికమైన), ప్రసూన = పూలయొక్క, వికాస = వికసించుటచేతను, ప్రసవ = పండ్లచేతను, అభిరామంబులు = మనోహరములు, ఐనన్ = కాఁగా

తాత్పర్యము : అంత అంతులేని చెట్లు, పొదల, తీవల సమూహములు ఒకదాని నొకటిమించినవిధమున నధికమైన పూల వికాసముచేతను, పండ్ల చేతను మనోహరములు కాఁగా - తరువాతి పద్యముతో నన్వయము

ఉ. ఆ యవనీరుహోద్గత లతాంత వినిర్గత సౌరభ ప్రవా
హాయతి సాంద్రమై ఫలితమై మొగిఁ బర్విన డాయఁబోవనుం
బాయను రాక చుట్టి మధుపవ్రజమాలిక లుండె నొప్పి పు
ష్పాయుధశాల చుట్టు మధుఁ డాయసవ్రము వెట్టినట్టిదై **99**

అర్థము : ఆ హాయతి ఆ, అవనీరుహ + ఉద్గత = చెట్లనుండి పుట్టిన,లతాంత = పూవులనుండి, వినిర్గత = బయలువెడలిన, సౌరభ = పరిమళముయొక్క, ప్రవాహ = వెల్లువయొక్క, ఆయతి =నిడుపు, సాంద్రము + ఐ = దట్టమయి, ఫలితము +ఐ = ఫలించినదయి, మొగిన్ = ఎదుట, పర్వినన్ =

వ్యాపింపఁగా, మధుప - వ్రజ - మాలికలు = తుమ్మెదల గుంపుల బారులు, డాయన్+ పోవనున్ = సమీపింపఁబోవుటకును, పాయనున్ = తొలఁగిపోవుటకును, రాక = అలవికాక, చుట్టి, మధుఁడు = వసంతుఁడు, పుష్ప + ఆయుధ - శాల - చుట్టున్ = పూవుటమ్ముల శాల చుట్టును, ఆయస - వప్రము = ఇనుపకోటగోడ, పెట్టిన + అట్టిది + ఐ = నిర్మించినదానివంటిదయి, ఒప్పి, ఉండెన్

తాత్పర్యము ఆ చెట్ల పూలనుండి బయలువెడలిన పరిమళ ప్రవాహము దట్టమయి, ఫలించినదయి యెదుట వ్యాపింపఁగాఁ దుమ్మెదల బారులు సమీపింపలేక, తొలఁగిపోవలేక, చుట్టి, వసంతుఁడు తన పూవుటమ్ముల శాల చుట్టును ఇనుపకోటగోడను పెట్టెనా యనునట్లు ఒప్పియుండెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష తుమ్మెదలు సమాపింపఁజాలమికిఁ గారణము అది పరిమళపువెల్లువ చాల నిడుపుగలది పువ్వు లెచ్చటనో యున్నవి పాయఁజాలమికిఁ గారణము పువ్వులు ఎప్పటికైన లభింపకుండునా యను నాశ తుమ్మెదలు నలుపుగావుననే వప్రము ఆయస మనుట చెట్లు మన్మథుని పుష్పాయుధశాల పుష్పములు మన్మథుని ఆయుధములు గదా ! ఆ శాల కధిపతి వసంతుఁడు దానిలోని కితరులు రాకుండునట్లు వసంతుఁడు దానిచుట్టును ఇనుపకోట పెట్టినట్లు తుమ్మెదలు పూలచెట్టును జుట్టియుండెను

వ మఱియు తరువాతి పద్యముతో నన్వయము **100**

సీ అగరు లలాట కాలాగరు తిలకంబు
కోమల మల్లికా రోమరాజి
మాధవీ హరినీలమణి హారయష్టిక
పాటలీ మృగమద పత్రరేఖ
పున్నాగ వల్లరీ భ్రూలతా నటనంబు
నవమాలికాలోల నయన భాతి
సహకారమంజరీ చామరాటోపంబు
కేసర వల్లీ సుకేశ పాశ

తే. మనఁ గుజము లెన్ని యన్నింట ననలు నెలసి
పాలిచె, నట కొన్ని పైఁ దూలు నల్కులములు
నొప్పె, వనదేవతలు వసంతోత్సవమునఁ
దనర నెత్తిన మేచకధ్వజము లనఁగ **101**

అర్థము అగరు తిలకంబు అగరు = అగరు వృక్షమనెడు, లలాట = నుదుటి యందలి, కాల + అగరు - తిలకంబు = నల్ల అగులు బొట్టు, కోమల రాజి, కోమల = సుందరమైన, మల్లికా = మల్లెలనెడి, రోమ - రాజి = వెండ్రుకల వరుస,

మాధవీ యష్టిక మాధవీ = బండిగురివెంద యనెడు, హరి నీల - మణి - హార - యష్టిక = ఇంద్రనీలమణుల పేరు పేట, పాటలీ రేఖ , పాటలీ = కలిగొట్టు అనెడి, మృగమద - పత్ర -రేఖ = కస్తూరి మకరికాపత్రము,

పున్నాగ నటనంబు, పున్నాగ - వల్లరీ = సురపొన్న తీఁగయనెడు, భ్రూ - లతా - నటనంబు = బొమతీవ నాట్యము, నవ భాతి, నవమాలికా = నవమల్లిక యనెడు, లోల = చలించు, నయన = కన్నుల, భాతి = కాంతి

సహకార పంబు, సహకార - మంజరీ = తీయ మామిడి పూలగుత్తి యనెడు, చామర = వింజామరల యొక్క, ఆటోపంబు = సంరంభము, కేసర పాశము, కేసర - వల్లీ = పొగడతీఁగ యనెడు, సుకేశ - పాశము =మంచి కేశ సమూహము,

అనన్ = అనునట్లు, కుజములు = చెట్లు, ఎన్ని = ఎన్నికలవో, అన్నింటన్ = అన్నిటియందును, ననలు = పువ్వులు, నెలసి = ఉండి, పొలిచెన్ = ప్రకాశించెను, అట - కొన్ని = అక్కడ, కొన్నిపూలు, పైన్ + తూలు = మీఁదఁ జలించు, అలి - కులములన్ = తుమ్మెదల గుంపులతో, వన - దేవతలు, వసంత + ఉత్సవమునన్, తనరన్ = ఒప్పునట్లు, ఎత్తిన, మేచక - ధ్వజములు + అనఁగన్ = నల్లని జెండాలో యనునట్లు, ఒప్పెన్

తాత్పర్యము . అగరువృక్షమనెడు నుదుటి నల్లని అగులు బొట్టు, కోమలములైన మల్లికలనెడు రోమావళి, బండి గురివెందయనెడి ఇంద్రనీలమణుల పేరు పేట, కలిగొట్టు అనెడు కస్తూరీ పత్రభంగము, నవమల్లికయనెడు చలించు కన్నుల కాంతి, తీయమామిడి గుత్తు లనెడు వింజామరల సంరంభము, పొగడతీఁగ యనెడు కేశపాశము అనురీతిగా నెన్ని చెట్లు గలవో అన్ని చెట్లను పూవులు ప్రకాశించెను అక్కడ కొన్ని పూలు పైనిఁ జలించు తుమ్మెదగుంపులతో వన దేవతలు వసంతోత్సవమున నెత్తిన నల్లనిపతాకలో యనునట్లు ఒప్పెను

విశేషములు : అలంకారము రూపకము, ఎత్తుగీతిలో ఉత్ప్రేక్ష

ఉ ఆడుచు, మీఁదఁ బిండుగొని యాదటఁ గ్రొవ్విరు లెక్కి చిఱ్ఱుము
ఱ్ఱాడుచు, వంత పోవఁ గుసుమాసవ మానుచుఁ గ్రమ్మితావి నో
లాడుచుఁ బుప్పొడిం బొదలి యాడుచు, గుత్తుల మూవి మట్టిమ
ల్లాడుచు నన్ని యాడె సమదాలికులం బెలమావి మోఁకలన్ 102

అర్థము. స - మద + అలి - కులంబు = మదముతోఁ గూడిన తుమ్మెదల సమూహము, ఎల - మావి - మోఁకలన్ = లేఁత మామిడి మొక్కలందు, ఆడుచున్, మీఁదన్ = పైని, పిండు + కొని, గుమిగూడి, ఆదటన్ = ఆసక్తితో, క్రొవ్విరులు (క్రొత్త + విరులు) = క్రొంబూలు, ఎక్కి, చిఱ్ఱుముఱ్ఱాడుచున్ = దొమ్మిలాడుచు, వంత = దుఃఖము, పోవన్ = పోవునట్లు, కుసుమ + ఆసవము = పూఁదేనె, ఆనుచున్ = త్రాగుచు, క్రమ్మి = వ్యాపించు, తావిన్ = పరిమళమునందు, ఓలాడుచున్ = విహరించుచు, పుప్పొడిన్, పొదలి= ఒప్పి, ఆడుచున్, గుత్తులన్ = పూలగుత్తులను, మూవి = మూఁగి, మట్టి మల్లాడుచున్ = త్రొక్కి పెనఁగులాడుచు, అన్ని = మదించి, ఆడెన్

తాత్పర్యము . మదించిన తుమ్మెదల సమూహము లేఁతమామిడి మొక్కలందు ఆడుచు,పైని గుంపుగట్టి ఆసక్తితోఁ గ్రొవ్విరు లెక్కి దొమ్మిలాడుచు, దుఃఖ ముపశమించునట్లు పూఁదేనె త్రావుచు, వ్యాపించు పరిమళమునందు విహరించుచు, పుప్పొడియందు విహరించుచు, పూలగుత్తులపై మూఁగి త్రొక్కిపెనఁగులాడుచు, మదించి విహరించెను

విశేషములు . అలంకారము స్వభావోక్తి క్రొవ్విరులు = క్రొత్త+ విరులు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమోఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు ' బాల సంధి 36 'క్రొ + విరులు. 'క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబునుం గొన్నియెడల మోఁదిహల్లునకు ద్విత్వంబు నగు ' బాల సంధి 38

క మదనోత్సవ మద్రువ మని
సదమలమతి బంధుజీవసంఘం బచిరా
స్పదమని యన్నిటి నొక యలి
వదలి జపాసక్తి నిలిచె వర మునివోలెన్ 103

అర్థము . ఒక + అలి = ఒక తుమ్మెద, మదన + ఉత్సవము = పొగడచెట్టునందలి వేడుక - వసంతోత్సవము, అధ్రువము + అని = అనిశ్చయమని, సత్ + అమల - మతిన్ = నిర్మలమైన మనస్సుతో, బంధుజీవ - సంఘంబు = మంకెనపూల సమూహము - బంధువుల సమూహము, అచిర + ఆస్పదము + అని = చిరకాల ముండునది కాదని, అన్నిటిన్, వదలి, వర - ముని + పోలెన్ = శ్రేష్ఠుడయిన మునివలె, జపా + ఆసక్తినన్ = దాసన పుష్పము నందలి - కోరికతో, జప + ఆసక్తిన్ = జపమునందలి కోరికతో, నిలిచెన్

తాత్పర్యము. ఒక తుమ్మెద పొగడచెట్టు నందలి వేడుక - వసంతోత్సవము - అనిశ్చయమని, మంకెన పూలగుంపు - బంధు సమూహము - అస్థిరమని, వానినన్నిటిని విడిచి శ్రేష్ఠుడైన ముని విధమున దాసన పుష్పమునందలి కోరికతో - జపము నందలి కోరికతో - నిలిచెను

విశేషములు . అలంకారము శ్లేషానుప్రాణితోపమ

క నెఱి నలి గోరక మదిలో ఁ
గొఱ యగు రస మానలేమిఁ గోరక మదిలోఁ
గఱచుచు వావిరి యైనను
వఱలఁగఁ దమకించు రసము వావిరి యైనన్ **104**

అర్థము : అలి = తుమ్మెద, కొఱ + అగు = తక్కువగు, రసము = మకరందరసమును, ఆనన్ - లేమిన్ = త్రాగలేకపోవుటచే, నెఱిన్ = పూర్ణముగా, మదిలోన్ = మనస్సునందు, కోరక = వాంఛింపక, కోరకము + అది = ఆ మొగ్గను, లోన్ = లోపల, కఱచుచున్ = కొఱుకుచు, వావిరి + ఐనను = వికసించినది కాగాఁ రసము, వావిరి + ఐనన్ = అధికము కాఁగా, వఱలఁగన్ = ఒప్పుటకు, తమకించున్ = యత్నించును

తాత్పర్యము: తుమ్మెద మొగ్గయందలి మకరందమును ద్రావలేకపోవుటచే దానిని బూర్ణముగాఁ గోరక, లోనుండి దానిని గఱచుచు నది వికసించిన పిమ్మట నందు మకరందరస మధికము కాఁగా నొప్పుటకుఁ దొందరపడును

విశేషములు . ఇది యింకను విచార్యము ఇందుఁ 'గోరక మదిలో' 'వావిరియైనను' అనువాని యందలి సభంగశ్లేషము గమనింపఁదగినది

వ. తదవసరంబున - తరువాతి పద్యముతో నన్వయము 105

క వనమాలాలంకృతి నురు
మనసిజభవహేతు వగుట మనమునఁ గమలా
త్యనురక్తి సుపర్ణాసన
మున హరినీలరుచి నలులు మురహరుఁ బోలెన్ 106

అర్థము . అలులు = తుమ్మెదలు, వన + మాలా + అలంకృతిన్ = తోఁటలయొక్క వరుస అనెడి అలంకారముచేతను - వనమాలా + అలంకృతిన్ = తోమాలె అనెడి అలంకారముచేతను, ఉరు - మనసిజ - భవ - హేతువు + అగుటన్ = అధికమైన మన్మథోద్రేకము యొక్క పుట్టుకకుఁ గారణమగుటచేతను, గొప్పవాఁడైన మన్మథునియొక్క పుట్టుటకుఁగారణ మగుటచేతను, మనమునన్ = మనస్సునందు, కమల + అతి + అనురక్తిన్ = పద్మమునందు మిక్కిలిప్రీతిచేతను - కమలా + అతి + అనురక్తిన్ = లక్ష్మీ దేవియందు మిక్కిలి అనురాగముచేతను, సుపర్ణ + ఆసనమునన్ = మంచి ఆకులనెడి ఆసనముచేతను, గరుత్మంతుఁడనెడి ఆసనము చేతను, హరినీల - రుచిన్ = ఇంద్రనీల కాంతిచేతను, మురహరున్ = మురుఁడను రాక్షసునిఁ జంపిన వానిని - విష్ణువును, పోలెన్

తాత్పర్యము . తుమ్మెదలు వనమాల (వనముల యొక్క మాల - వరుస) అలంకారముగాఁ గలవి యగుటచేతను, - వనమాల (తో మాలె) అలంకారముగాఁ గలవి యగుటచేతను, అధికమైన మన్మథోద్రేకమునకుఁ గారణ మగుటచేతను - గొప్పవాఁడైన మన్మథుని పుట్టుటకుఁ గారణమగుట చేతను, మనసునఁ బద్మముల యెడఁ బ్రీతి చేతను - లక్ష్మీదేవి యందలి అధికమైన అనురాగము చేతను, మంచిపర్ణము అనెడి ఆసనముచేతను - గరుత్మంతుఁడనెడి ఆసనము చేతను, ఇంద్రనీలమణుల కాంతివంటి దేహకాంతిచేతను విష్ణువును బోలెను

విశేషములు . వనమాలాలంకారము, మనసిజభవహేతుత్వము, కమలానురక్తి సుపర్ణాసనత్వము, హరినీలరుచిత్వము అనునవి మురహరుని లక్షణములు కావుననే యివి గల అలులు మురహరుని బోలె ననుట అలంకారము
శ్లేషాను ప్రాణితోపమ

వ ఇ ట్లనూనప్రసూనాభిరామంబై మధుకర నికర క్రీడాకరంబగు నారామంబునం దా రామాసమూహం బభిరామకేళీలాలసలై విహరింపం దొడంగి 107

అర్థము . ఇట్లు, ఆ - రామా - సమూహంబు = ఆ స్త్రీల సమూహము, అనూన - ప్రసూన+ అభిరామంబు + ఐ = తక్కువకాని పూలచే మనోహరమయి, మధుకర - నికర - క్రీడా -ఆకరంబు = తుమ్మెదల సమూహము యొక్క విహారమునకు స్థానము, అగు, ఆరామంబునందున్ = ఉద్యానమునందు, అభిరామ - కేళీ - లాలసలు + ఐ = మనోహరములైన క్రీడలయందు ఆసక్తి గలవారయి, విహరింపన్ + తొడంగి = క్రీడింప నారంభించి

తాత్పర్యము . ఇట్లు ఎక్కువ పూలచే మనోహరమయి, తుమ్మెదల గుంపుల క్రీడలకు స్థానమయిన ఉద్యానమునందు మనోహరక్రీడలయందాసక్తి గలవారయి ఆ స్త్రీల సమూహము విహరింపనారంభించి - తరువాతి పద్యముతో నన్వయము

చ. మెలు పొదలించి తీవలకు మేనులఁ, గెం పొదవించి మోవులం
దలిరుల, కోలి మొగ్గలకు దంతరుచి న్మెఱుఁగూన్చి, నవ్వులన్
మలరుల కిచ్చి హాస్యరస, మన్నుల చె న్నమరంగఁ బెక్కు రే
ఖలఁ దమతోడ నాడు గెడకత్తియ కాఁ గయినేసి రామనిన్ 108

అర్థము : అన్నులు = స్త్రీలు, మేనులన్ = శరీరములతో, తీవలకున్, మెలుపు = సౌకుమార్యము, ఒదవించి = కలుగఁజేసి, మోవులన్ = పెదవులతో, తలిరులకున్ = చివురులకు,కెంపు = ఎఱుపు, ఒదవించి, ఓలిన్ = క్రమముగా, దంత - రుచిన్ = పండ్ల కాంతితో, మొగ్గలకున్, మెఱుఁగు = ప్రకాశము, ఊన్చి = కలిగించి, నవ్వులన్ = నవ్వులతో, మలరులకున్ = పువ్వులకు, హాస్య -రసము, ఇచ్చి, చెన్ను + అమరంగన్ + అందము కలుగునట్లు, పెక్కు - రేఖలన్ = పలురీతుల, తమతోడన్, ఆడు = విహరించు, గెడకత్తియ + కాన్ = చెలికత్తెగా, ఆమనిన్ = వసంతమును, కయిసేసిరి = అలంకరించిరి

తాత్పర్యము : స్త్రీలు తమ శరీరములచేఁ దీవలకు సౌకుమార్యమును గలిగించి, తమ పెదవులచేఁ జివురులకు నెఱుపు గలిగించి, తమ దంతకాంతిచే మొగ్గలకు మెఱుఁగు గలిగించి, తమ నవ్వులతోఁ బూవులకు హాస్యరసము నిచ్చి అందము గలుగునట్లు పలురీతుల వసంతమును దమతో నాడు చెలికత్తెగా నలంకరించిరి

విశేషములు . తీవలకంటె స్త్రీల మేనులే సుకుమారము లైనవనియు, తలిరులకంటె వారి మోవులే యెఱ్ఱనివనియు, మొగ్గలకంటె వారి దంతములే మెఱుపు గలవనియు, పువ్వులకంటె వారి నవ్వులే హాస్యరసవంతములనియు గ్రహింపనగును

వ తదనంతరంబ 109

అర్థతాత్పర్యములు. తద్ + అనంతరంబు + అ - తరువాతనే - తరువాతి పద్యముతో నన్వయము

చ అలరులతోడ నవ్వుచు నయంబున మొగ్గలతోడ నాడుచున్
దలిరులతోడ సోలుచు మదభ్రమరంబులతోడఁ బాడుచున్
నెలమిఁ బికాలితోడ నెలుఁగించుచుఁ జిల్కలతోడఁ బల్కుచున్
నలి వనకేళి సల్పి రెలనాఁగలు తీఁగలతోఁ బెనంగుచున్ 110

అర్థము : ఎలనాఁగలు = యువతులు, అలరులతోడన్ = పూవులతో, నవ్వుచున్, మొగ్గలతోడన్, నయంబునన్ = అందముతో, ఆడుచున్, తలిరులతోడన్ = చిగురులతో, సోలుచున్ = పారవశ్యముచెందుచు, మద - భ్రమరంబుల తోడన్, = మదించిన తుమ్మెదలతో, పాడుచున్, ఎలమిన్ = ప్రీతితో, పిక + ఆలితోడన్ = కోకిలముల వరుసతో, ఎలుఁగించుచున్ = కూయుచు, చిల్కలతోడన్, పల్కుచున్, తీఁగలతోన్, పెనంగుచున్ = కూడుచు, నలిన్ = ఉత్సాహముతో, వనకేళి = ఉద్యానవిహారము, సల్పిరి

తాత్పర్యము. స్త్రీలు పువ్వులతో నవ్వుచు, మొగ్గలతో అందముగా నాడుచు, చివురులతోఁ బరవశించుచు, మించిన తుమ్మెదలతో పాడుచు, కోకిలలతోఁ ప్రీతితోఁ గూయుచు, చిల్కలతోఁ బల్కుచు, తీఁగలతోఁ గూడుచు నుత్సాహముతో వనవిహారము చేసిరి

విశేషములు: అలంకారము స్వభావోక్తి పాడుచు న్నెలమి - 'కొన్ని యెడలఁ బ్రామాణిక ప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగునచో ద్విత్వంబు చూపట్టెడి' ప్రౌఢ సంధి 3 ఎలమిఁ బికాలితోడ నెలుఁగించుచు - అప్పకవి ఈ యతి నొప్పుకొనలేదు ' ఎలుఁగిచ్చుచు' అను పారమున యతిమైత్రి కుదురును

వ తదవసరంబున 111

అర్థ తాత్పర్యములు . తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

ఉ భావజు పంచసాయక విభాతి మనోహరలీలఁగ్రాలు తొ
ల్పూవుల పాల్పుఁగాంచి తనివోవక కోసిరి కొంద ఱంగనల్
గ్రోవులు, బొండుమల్లియలు, గోఁగులుఁ బొన్నలుఁ, జంపకంబులున్
దావియుఁ,దెల్పు, వన్నువునుఁ, దన్పు మెఱుంగు సముల్లసిల్లఁగాన్ 112

అర్థము . కొందఱు + అంగనల్ = కొంతమంది స్త్రీలు, భావజు = మన్మథునియొక్క, పంచ - సాయక - విభాతి = అయిదుబాణముల విశేషకాంతి, మనోహర- లీలన్ = హృద్యమైన రీతిగా, క్రాలు = ఒప్పునట్టి, తొల్ + పూవుల - పాల్పున్ = మొదటి పూవుల ఒప్పును, కాంచి = చూచి, తనివోవక = తృప్తి పడక, క్రోవులున్ = ఎఱ్ఱ గోరంటలును, బొండుమల్లియలున్, గోఁగులున్, పొన్నలున్, చంపకంబులున్ - సంపెఁగలును, (క్రమముగా), తావియున్ = పరిమళమును, తెల్పున్ = తెల్లఁదనమును, వన్నువునున్ = వన్నెయును, తన్పున్ = శైత్యమును, మెఱుంగున్ = కాంతియును, సముల్లసిల్లఁగాన్ = మిక్కిలి ప్రకాశింపఁగా, కోసిరి

తాత్పర్యము . కొందఱు స్త్రీలు మన్మథుని బాణ పంచక కాంతి రమ్యముగా నొప్పు తొలి పూవుల అందమును జూచి తృప్తిపడక ఎఱ్ఱ గోరంటలు పరిమళమును, బొండు మల్లెలు తెలుపును, గోఁగులు వన్నెయును, పొన్నలు శైత్యమును, సంపెఁగలు మెఱుఁగును మిక్కిలి ప్రకాశింపఁగాఁ గోసిరి

విశేషములు : అలంకారము యథాసంఖ్యము అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము అనునవి మన్మథుని అయిదు బాణములును

క నెవ్వలి చన్నుల వ్రేఁగునఁ
జివ్వంకలు వంగఁ గౌను సే సాఁపుచు లే
మవ్వంపుఁ బొఱల మామిడి
క్రొవ్విరులం దొక్క కుసుమకోమలి కోసెన్ 113

అర్థము : అందున్ = వారిలో, ఒక్క - కుసుమ కోమలి - ఒక పూబోడి, నెవ్వలి (నెఱ + వలి) చన్నుల - వ్రేఁగునన్ = మిక్కిలి చల్లనివైన చన్నుల బరువుచే, కౌను = నడుము, చివ్వంకలు = చిఱు + వంకలు = కొంచెపాటి వంకరలు, వంగన్, చే + చాఁపుచున్ = చేయి చాఁపుచు, లేమవ్వంపుఁబొఱల మామిడి క్రొవ్విరులు - (లేఁత + మవ్వము - పొఱల) మామిడి - క్రొత్త - విరులు= లేఁతవియు, మృదువయినవియు నగు చివురులుగల మామిడి క్రొంబూలు, కోసెన్

తాత్పర్యము. వారిలో నొక పూబోఁడి మిక్కిలి చల్లనైన చన్నుల బరువుచే నడుమించుక వంగఁగాఁ జేయి చాఁపుచు లేఁతవియు, మృదువయినవియు నగు చిగురులు గల మామిడిక్రొవ్విరులు కోసెను

విశేషములు. అలంకారము స్వభావోక్తి నెవ్వలి - నెఱ + వలి, క్రొవ్విరులు - క్రొత్త + విరులు మవ్వంపుఁబొఱలు - మవ్వము + పొఱలు మువర్ణకమునకుఁ బుంప్వాదేశము - బాల సంధి 32, పిమ్మట నుగాగమము - బాల సంధి 25 పిమ్మట ద్రుతకార్యము - బాల సంధి 16,17

క నలికపు మేనులు తిగిచిన
యెలదీఁగలు నమరఁ బెనఁగి రింతులు తుది పు
వ్వులకును మృదులతతోఁ దమ
బలములు తలపోయఁ బెనఁగు పగిది నయమునన్ 114

అర్థము. నలికపు మేనులు - (నలికము + మేనులు) = సన్నని శరీరములు, తిగిచిన = లాగిన, ఎల - తీఁగలున్ = లేఁదీవలును, అమరన్ = ఒప్పఁగా, ఇంతులు = స్త్రీలు, తుది - పువ్వులకును = చివరిపూలకు, మృదు-లతతోన్ = సుకుమారమైన తీవతో, తమ - బలములు, తలపోయన్ = చింతింపఁగా, పెనఁగు - పగిదిన్ = పెనఁగులాడు విధమున, నయమునన్ = బాగుగా, పెనఁగిరి = పెనఁగులాడిరి

తాత్పర్యము. స్త్రీలు చిటారుకొమ్మల పూలకై లేఁదీవలను లాగుచుండిరి అది సన్ననిశరీరములనెడి తమ బలములు కొసనున్న పూవులకొఱకు మృదువైన లతతోఁ బెనఁగులాడు చున్నవా యనునట్లు ఒప్పెను

విశేషములు. అలంకారముత్ప్రేక్ష స్త్రీల నలికపు మేనులు మృదులతలవలె నున్నవని భావము నలికపుమేనులు= నలికము + మేనులు 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బు ంపులగు ' బాల సంధి 32

క కరశాఖలఁ దరుశాఖలు
పరువడి నూదికొని నిలిచి పడఁతులు శోభా
కర మైరి తత్కుజంబుల
భరితంబై యున్న క్రమనఁ బండుల పోలెన్. 115

అర్థము. పడఁతులు - స్త్రీలు, కర-శాఖలన్ = శాఖలవంటి కరములతో, పరువడిన్ = క్రమముగా, తరు - శాఖలు = చెట్ల శాఖలు, ఊదికొని = ఆనుకొని,

నిలిచి, తద్ +ఁ కుజంబులన్ = ఆ చెట్ల యందు, భరితంబు + ఐ = నిండినదయి, ఉన్న, మ్రానన్ = చెట్టునందు, పండుల - పోలెన్ = పండ్లవలె, శోభా + ఆకరము = చక్కఁదనమునకు స్థానము, ఐరి = అయిరి

తాత్పర్యము. శాఖలవంటి కరములతో స్త్రీలు చెట్ల శాఖలు ఆనుకొని నిలిచి ఆ చెట్లయందు నిండియున్న చెట్టునందుఁ బండ్లవలెఁ జక్కఁదనమునకు స్థానమై యొప్పిరి

విశేషములు ఇందు 'తత్కుజంబుల' అనుదానిబదులు 'తత్కుచంబుల' అని యుండునా ? అప్పుడు 'పడఁతులు తత్కుచములతో కరశాఖలఁ దరుశాఖ లూదికొని నిలిచి భరితంబైయున్న మ్రానఁ బండుల పోలె శోభాకరమైరి' అని యన్వయింపనగును ఆ పక్షమున వారి కుచములు మ్రాని పండుల వలె నుండెననుసాగసు పొసఁగును అలంకార ముపమ

క ఎనసి నిజాసిత దృగ్రుచిఁ
గనుఁగొనఁ గప్పిన మల్లికా ప్రసవంబుల్
తనరారు నల్లమల్లియ
లని కోసిరి కొంద ఱుత్పలాక్షులు ప్రీతిన్. 116

అర్థము : కొందఱు + ఉత్పల + అక్షులు = కొందఱు కలువకంటులు, ఎనసి = కూడి, నిజ + అసిత - దృశ్ (క్) + రుచిన్ = తమదైన నల్లని చూపు కాంతితో, కనుఁగొనన్ = చూడఁగా, కప్పు + ఐన = నల్లనైన, మల్లికా - ప్రసవంబుల్ = మల్లెపూలు, తనరారు = ఒప్పునట్టి, నల్ల - మల్లియలు + అని = నల్లని మల్లెపూలని, ప్రీతిన్ = సంతోషముతో, కోసిరి

తాత్పర్యము : కొందఱు కలువకంటులు కూడుకొని తమనల్లని చూపుల కాంతితోఁ జూచుటచే నల్లనైన మల్లెపూలను అవి యేవో నల్లని మల్లెపూవులని ప్రీతితోఁ గోసిరి

విశేషములు . అలంకారము భ్రాంతిమంతము ఉత్పలమ్ = నల్లకలువ A blue lotus (Apte) ఇచ్చట స్త్రీల కుత్పలాక్షు లను విశేషణము సాభిప్రాయ మగుటచేఁ బరికరాలంకారమును

చ చెలువలు మట్టిమ్రానిపయిఁ జిల్కలు మూవి రమింప వాని ము
క్కులు గని మట్టిపండు లని కోయఁగఁ బోయిన వారిహస్తముల్
దలిరులు సావి కీరములు దందడిఁ గుట్టిన ముగ్ధ లందఱున్
గలగొనఁ బాఱి రోరి యిది గాటులమ్రా ననుచున్ భయంబునన్ 117

అర్థము: మట్టి - మ్రాని పయిన్ = మట్టిచెట్టు మీఁద, చిల్కలు, మూవి = మూఁగి, రమింపన్ = క్రీడించుచుండఁగా, చెలువలు = స్త్రీలు, వాని- ముక్కులు + కని= ఎఱ్ఱనైన వానిముక్కులు చూచి, మట్టి - పండులు + అని, కోయఁగన్ + పోయినన్= కోయఁబోఁగా, వారి - హస్తముల్ = వారి చేతులు, తలిరులు - సావి చిగురులని, కీరములు = చిలుకలు, దందడిన్ =అధికముగా, కుట్టినన్ = కుట్టఁగా, ముగ్ధలు+ అందఱున్ = ఆ ముద్దరాం డ్రందఱును - ఆ అమాయిక లందఱును, ఓరి = ఆశ్చర్య సూచకము - ఔరవంటిది, ఇది, కాటుల - మ్రాను = కాట్ల చెట్టు, అనుచున్, భయంబునన్, కలగొనన్ = నలుదెసలకు, పాఱిరి = పరువెత్తిరి

తాత్పర్యము : మట్టిచెట్టుమీఁదఁ జిలుకలు మూఁగి క్రీడించుచుండఁగా స్త్రీలు వాని యెఱ్ఱని ముక్కులను జూచి మట్టిపండ్లని కోయఁబోఁగా, చిలుకలు వారి చేతులు చివురులని మిక్కిలి కుట్టెను అంత నా ముద్దరాండ్రు ఇది యేదో కాట్ల చెట్టు బాబో యని భయముతో నలుదెసలకుఁ బరువెత్తుకొనిపోయిరి

విశేషములు . అలంకారము భ్రాంతిమంతము చెలువలకు చిలుక ముక్కులందు ఫలభ్రాంతి చిలుకలకు స్త్రీ హస్తములందుఁ బల్లవభ్రాంతి స్త్రీలకు ముగ్ధా విశేషణము సాభిప్రాయ మగుటచేఁ బరికరాలంకారమును పాఱిరోరి యిది - పాఱిపోయిదియ - అని మా రా ప్రతి పారము

చ. తమకు వియోగవేళఁ బరితాపముగా మరుఁ డల్క నేయు బా
ణము లని ముట్టిపట్టి మృదునారులు పువ్వులు గోయుచో మద
భ్రమరము లంగజాధిపతి పంచిన దండులపోలె వచ్చి సం
భ్రమమున మూవెఁ దద్వదనపంకరుహాసవగంధలుబ్ధలై 118

అర్థము: తమకున్, వియోగ - వేళన్ = విరహసమయమున, పరితాపము+ కాన్ = బాధగలుగునట్లు, మరుఁడు = మన్మథుఁడు, అల్కన్ = కోపముతో, ఏయు = ప్రయోగించు, బాణములు + అని = అమ్ములని, మృదు - నారులు = సుకుమారలయిన స్త్రీలు, ముట్టి - పట్టి = చుట్టుకొని పట్టుకొని - గట్టిగాఁ బట్టుకొని,

పువ్వులు, కోయుచోన్ = కోయునప్పుడు, మద - భ్రమరములు = మదించిన తుమ్మెదలు, అంగజ + అధిపతి = మన్మథుఁ డనురాజు, పంచిన = పంపిన, దండుల + పోలెన్ = సైన్యములవలె, తద్ + వదన - పంకరుహ + ఆసవ - గంధ - లుబ్ధులు + ఐ = వారి (స్త్రీల) ముఖ పద్మముల తేనెయందును, పరిమళమునందును లోభముగలవై, వచ్చి, సంభ్రమమునన్ = వేగిరపాటుతో, మూవెన్ = మూఁగెను

తాత్పర్యము. తమకు విరహము గలిగినప్పుడు పరితాపము గలుగునట్లు మన్మథుఁడు కోపముతోఁ బ్రయోగించు బాణములని సుకుమారలైనస్త్రీలు గట్టిగాఁబట్టుకొని పూలు గోయునప్పుడు మదించిన తుమ్మెదలు మన్మథుఁ డను రాజు పంపిన సైన్యములో యన, ఆ స్త్రీల ముఖపద్మముల తేనెయందును, పరిమళమునందును లోభము గలవయి, వచ్చి సంభ్రమముతో మూఁగెను

విశేషములు. అంగజాధిపతి - రూపకము తదనుప్రాణితమైన ఉత్ప్రేక్ష

తే **వాసితాననరుచిరనిశ్శ్వాసములకు**
ముసరి కారించు నెలదేఁటిముసురఁ జోపి
చోపి పోఁజోపనోపక సుదతి పదువ
లలసి వెలిపుచ్చనోడి యూర్వాఁగుచుండె 119

అర్థము. వాసిత + ఆనన- రుచిర - నిశ్శ్వాసములకున్ = పరిమళితమైన ముఖముల యొక్క మనోహరములయిన - మధురములయిన, నిశ్శ్వాసములకున్= నిట్టూర్పులకు, ముసరి = మూఁగి, కారించు = బాధించునట్టి, ఎలదేఁటి - ముసురన్ = కొదమతుమ్మెదల నిరంతరవృష్టిని - తుమ్మెదల సమూహమును, చోపి - చోపి = త్రోలి త్రోలి, పోన్ + చోపన్ + ఓపక = వెడలఁగొట్టఁజాలక, సుదతి - పదువలు = స్త్రీల వరుసలు (పదువులు), అలసి = బడలి, వెలు-పుచ్చన్, ఓడి = బయటికి విడువ జంకి - (వెలికూర్చనోడి యని పాఠాంతరము - బయటికి నిట్టూర్చుటకు జంకి), ఊర్పు - ఆఁగుచున్ + ఉండెన్ = ఊపిరి ఆఁపుచుండెను

తాత్పర్యము. పరిమళితమైన ముఖములనుండి వచ్చునిట్టూర్పులకు మూఁగి బాధపెట్టు కొదమతుమ్మెదల సమూహమును ద్రోలిత్రోలి వెడలఁగొట్టలేక స్త్రీల సమూహము బడలి బయటికి శ్వాసమును విడుచుటకు జంకి ఆఁపుచుండెను

విశేషములు. అలంకార మతిశయోక్తి

క ఆ వనితలు చంపక పు
ష్పావలి చేఁ బట్టుకొనుచు నతిరయమునఁ గై
దీవియలు పట్టికొని చను
భావనఁ జని రుద్గతాలిపటలములోనన్ 120

అర్థము. ఆ - వనితలు = ఆ స్త్రీలు, ఉద్గత + అలి - పటలము లోనన్= బయలువెడలిన తుమ్మెదలయొక్క సమూహములో, అతి - రయమునన్ = మిక్కిలి వేగముతో, కై- దీవియలు = చేతి దివ్వెలు, పట్టికొని, చను - భావనన్ = వెడలు భావముతో, చంపక - పుష్ప + ఆవలి = సంపెఁగపూల సమూహము, చేన్= చెతితో, పట్టుకొనుచున్, చనిరి

తాత్పర్యము. ఆ స్త్రీలు బయలు వెడలిన తుమ్మెదల గుంపులోనుండి చేదివ్వెలు పట్టుకొని వెడలునట్లు సంపెఁగపూలను జేతఁబట్టుకొని మిక్కిలి వేగముతోఁ జనిరి

విశేషములు: అలంకార ముపమ

వ మఱియుం గొన్ని మహీరుహంబుల నాత్మీయ క్రియా విశేషంబులం
బుష్పోద్గమంబు లొనరించుచు 121

అర్థము. మఱియున్, కొన్ని - మహీరుహంబులన్ = కొన్ని చెట్లను, ఆత్మీయ - క్రియా - విశేషంబులన్ = తమవైన ప్రత్యేకములయిన పనులచే, పుష్ప ఉద్గమంబులు + ఒనరించుచున్ = పూచునట్లు చేయుచు

తాత్పర్యము మఱియును గొన్నిచెట్లను దమవిశిష్టక్రియలచేఁ బూచునట్లు చేయుచు తరువాతి పద్యముతో నన్వయము

ఉ తన్నినఁ బూచె నెందుఁ గడుదైన్య మశోకము బాహుపీడనం
గ్రన్ననఁబూచె నీ కురువకంబును, నెంగిలికల్లు సల్లినన్
మన్ననతప్పి పూచె దొర మాయఁగఁ గేసర, మేము సూచుడుం
గన్నుల సన్నఁ బూచెఁ దిలకం బని దానికి మెచ్చి రంగనల్ 122

అర్థము: అశోకము = అశోక వృక్షము, తన్నినన్ = తన్నఁగనే, పూచెన్ = పుష్పించెను, ఎందున్ = ఎందయినను, కడున్ = మిక్కిలి, దైన్యము = దయనీయ స్థితి, ఈ - కురువకంబునున్ = ఈ యెఱ్ఱగోరంటయును, బాహు - పీడనన్ =

చేతి చఱపుచే, క్రన్ననన్ = శీఘ్రముగా, పూచెన్, కేసరము = పొగడచెట్టు, ఎంగిలి - కల్లు = ముఖమద్యము, చల్లినన్, మన్నన - తప్పి = గౌరవము తప్పి, దొర - మాయఁగన్ = విధము చెడఁగా, పూచెన్, తిలకంబు = బొట్టుగు చెట్టు, ఏము = మేము చూచుడున్ =చూచినంతనే, కన్నుల - సన్నన్ = కంటిసంజ్ఞ చేతనే, పూచెన్, అని అంగనల్ = స్త్రీలు, దానికిన్ = ఆ బొట్టుగునకు, మెచ్చిరి

తాత్పర్యము . 'అశోకము తన్నినంతనే పూచెను ఎంత దైన్యము ! ఈ యెట్టగోరంటయును జేతిచఱపుచే శీఘ్రముగాఁ బూచెను పొగడచెట్టు ముఖ సీధువుచే గౌరవము తప్పి - విధముచెడి పూచెను కాని తిలకవృక్షము మేము చూచినంతనే కనుసంజ్ఞచేఁ బూచెను ' అని ఆ స్త్రీలు తిలకమును మెచ్చుకొనిరి

విశేషములు వృక్షముల దోహదవిధులు

"స్త్రీణాం స్పర్శా త్ప్రియఙ్గు ర్వికసతి వకుళ: సీధుగణ్డూషసేకా
త్పాదాఘాతా దశోక స్తిలకకురవకౌ వీక్షణాలిఙ్గనాభ్యామ్,
మన్దారో నర్మవాక్యా త్పటుమృదుహసనా చ్చమ్పకో వక్త్రవాతా
చ్చూతో గీతా న్నమేరు ర్వికసతి చ పురోనర్తనా త్కర్ణికార:"

కురువక - (రూపాం) కురవక 'ఆలిఙ్గనా త్కురవక:' అనియున్నను ఇట బాహుపీడన మనుట తన్న్యూనతార్థము

వ మఱియుం గొందఱు చతురసతులు చూతపోతకవ్రాతకంబుఁగని హర్షించి రోమాంచకంచుకితశరీరలై మెచ్చి శిరఃకంపంబు సేయుచు 123

అర్థము . మఱియున్, కొందఱు, చతుర - సతులు = నేర్పరులైన స్త్రీలు, చూత - పోతక - వ్రాతకంబున్ = గున్నమామిడుల సమూహమును, కని = చూచి, హర్షించి = సంతోషించి, రోమాంచకంచుకిత - శరీరలు + ఐ = గగుర్పాటుచే అవిక గలవిగాఁ జేయఁబడిన మేనులు గలవారయి, మెచ్చి, శిరఃకంపంబు - శిరస్ + కంపంబు = తలయూఁచుట, చేయుచున్

తాత్పర్యము . మఱియును గొందఱు ప్రౌఢాంగనలు గున్నమామిడుల సమూహమును జూచి సంతోషించి మేనులు గగుర్పొడువ మెచ్చి తలలూఁచుచు- తరువాతి పద్యముతో నన్వయము

తే అలిగి విరహుల నలరమ్ము లాడనేసి
కాక కను చూడ్కిఁ దన పాడగన్న తెప్ప
వెట్టకుండంగ ముందఱి బిట్టు నొంప
మదనుఁ డోపున తలిరాకుమావిఁ బోలె 124

అర్థము. మదనుఁడు = మన్మథుఁడు, అలిగి = కోపించి, విరహులన్ = వియోగులను, అలరమ్ములు = (అలరు + అమ్ములు) = పుష్పబాణములు, ఆడన్ = గ్రుచ్చుకొనునట్లు, ఏసికాక = ప్రయోగించికాకుండ, తలిరాకు - మావిన్ + పోలెన్ = తలిరు + ఆకు - మావిన్ + పోలెన్ = చిగురుటాకుల మామిడివలె, కనుచూడ్కిన్ = కంటిచూపులో, తెప్ప + పెట్టక + ఉండంగన్ = తెప్పపాటు లేకుండ - తదేక దృష్టితో ననుట, తన - పాడగన్నన్ = తన్నుఁజూచినచో, ముందఱన్ = ఎదుట, బిట్టు = అధికముగా, నొంపన్ = బాధించుటకు, ఓపున + ఓపున్ + అ = సమర్థుఁడగునా ? కాఁడనుట

తాత్పర్యము. మన్మథుఁడు కోపించి వియుక్తులపైఁ బుష్పబాణములను గ్రుచ్చుకొనునట్లు ప్రయోగించి బాధించును అంతేకాని చివురుటాకుల మామిడివలెఁదన్ను తెప్పపాటు లేకుండఁ జూచిన వారిని మిక్కిలి బాధింపఁజాలఁడు విరహులను బాధించుటలో మన్మథునికంటెఁ జివురించిన మామిడిదే పైచేయి యని భావము

విశేషములు. పూవుటమ్ములు ప్రయోగించికాని మన్మథుఁడు చేయఁజాలని విరహతాపనకార్యమును జిగిర్చిన మామిడి తన్నుఁజూచినంత మాత్రముననే చేయఁగలుగుటచే మన్మథుని కంటె మామిడియే మిన్నయని సహేతుకముగా సమర్థించుటచే నలంకారము కావ్యలింగము 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్' చంద్రా

వ అని యనేకప్రకారంబుల వర్ణించుచుం గామరసావేశంబునం గాముక కామినీజనంబులు తగిలి హిందోళాందోళితలతాందోళంబులం బరిమళాక్రాంతానందలతాంతమందిరాంతరంబుల జలవిహంగారవాఘూర్ణిత సరోవరంబులఁ జంద్రకాంతమణిసోపానదీర్ఘికాతటంబులం గనకవాలుకాభిరామ నిర్ఝరపులినతటంబులఁ గాంచనమణిగణాలంకృతవిచిత్రకృత్రిమాచల గుహాగహ్వరంబుల వాదిగా ననేకవిధవినోదస్థానంబుల నభిరామక్రీడానిరతులై విహరించి తదనంతరంబ 125

అర్థము అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, వర్ణించుచున్, కామ - రస + ఆవేశంబునన్ = ప్రేమరసమావేశించుటచే, కాముక - కామినీ - జనంబులు = వలపు కాండ్రును, వలపుకత్తెలును, తగిలి = ఆసక్తి గలిగి, హిందోళ + ఆందోళిత - లతా + ఆందోళంబులన్ = హిందోళరాగముతో నూఁపఁబడిన తీవె యూయలలందు, పరిమళ + ఆక్రాంత + ఆనంద - లతాంత - మందిర + అంతరంబులన్ = సువాసనచే నాక్రమింపఁబడిన ఆనందముతోడి పూవుటిండ్లలోపలను, జల - విహంగ + ఆరవ - ఆఘూర్ణిత - సరోవరంబులన్ = నీటిపక్షులకూఁతలచేఁ గలగుండుపడిన సరస్సులందును, చంద్రకాంత - మణి - సోపాన - దీర్ఘికా - తలంబులన్ = చంద్రకాంతమణిమయములైన మెట్లుగల దిగుడుబావుల ప్రదేశములందును, కనక - వాలుకా + అభిరామ - నిర్ఝర - పులిన - తటంబులన్ = బంగరుటిసుకచే మనోహరములైన సెలయేఱుల ఇసుకతిన్నెలందును, కాంచన - మణి - గణ + అలంకృత - విచిత్ర - కృత్రిమ + అచల - గుహా - గహ్వరంబులన్ = బంగారము చేతను, మణుల సమూహముచేతను అలంకరింపఁబడి నానావర్ణములు గల క్రీడాపర్వతపు గుహలయందును పొదరిండ్లయందును, ఆదిగా = మున్నుగా, అనేక - విధ - వినోద - స్థానంబులన్ = పలురీతులైన వేడుకచోటులందు, అభిరామ - క్రీడా - నిరతలు + ఐ = మనోహరములైన ఆటలయందు ఆసక్తిగలవారయి, విహరించి = క్రీడించి, తద్ + అనంతరంబ = ఆ పిమ్మట

తాత్పర్యము : అని పెక్కురీతుల వర్ణించుచుఁ బ్రేమావేశమున వలపు కాండ్రును, వలపుకత్తెలును ఆసక్తి గలిగి హిందోళ రాగముతో నూఁపఁబడిన తీవ యుయ్యాలలందును, సువాసనతోఁ గూడిన ఆనందమును గూర్చు పూవుటిండ్లలోను, జలపక్షుల కూఁతలచేఁ గలగుండు పడిన సరస్సులందును, జంద్రకాంతమణిమయములయిన సోపానములు గల దిగుడుబావులందును, బంగరు టిసుకచే మనోహరములైన సెలయేఱుల యిసుకతిన్నెలందును, బంగారు చేతను, మణుల సమూహముచేతను అలంకరింపఁబడి నానావర్ణములు గల క్రీడా పర్వతముల గుహలందును, పొదరిండ్లయందును, ఇంకను అనేకవిధములయిన వినోదస్థానములందును మనోహరములయిన క్రీడలయందు ఆసక్తిగలవారయి విహరించిన పిమ్మట - తరువాతి పద్యముతో నన్వయము

సీ అలి కలభములు పైఁ దులతెంచు తనిరేకు
లలకలఁ జిన్నిపు వ్వై వెలుంగ
నలిఁ గోయిలలు రాల్చు నెలమావితలిరులు
వీనుల కవతంసవిభవ మొసఁగ
మలయానిలాహతి వెలడిన పుప్పొడి
పొదివి మేనుల వింతపూఁత గాఁగఁ
దొడిరారఁ జిలుకల త్రొక్కున డుల్లు కా
రాకులు విరియువేనలులఁ దగిలి

తే పుష్పమాలావిభూతిగాఁ బుష్పహరణ
కేలిఁ దొంటిశృంగారముల్ దూలియుండ
మగువలకు వనదేవత మగుడ నొప్పు
చేసెనో యన వేఱొండు చెన్ను మిగిలె 126

అర్థము . అలి - కలభములు = కొదమతుమ్మెదలు, పైన్ = మీఁద, తులతెంచు = రాల్చు, తనిరేకులు = చిన్నరేకులు, అలకలన్ = ముంగురులందు, చిన్ని - పువ్వు + ఐ, వెలుంగన్ = ప్రకాశింపఁగను,

నలిన్ = వేడుకతో, కోయిలలు = కోకిలములు, రాల్చు ఎలమావి తలిరులు = లేఁతమామిడి చివురులు, వీనులకున్ = చెవులకు, అవతంస విభవము = ఆభరణసంపద, ఒసఁగన్,

మలయ + అనిల + ఆహతిన్ = దక్షిణపుగాలిదెబ్బచే, వెలడిన = వెడలిన, పుప్పొడి, పొదివి = క్రమ్మి, మేనులన్ = శరీరములందు, వింత - పూఁత, కాఁగన్

తొడిరారన్ = తాఁకునట్లు, చిలుకల - త్రొక్కునన్ = చిలుకల త్రొక్కుడుచేత, డుల్లు = రాలుచున్న, కారాకులు = పండుటాకులు, విరియు = చెదరిన, వేనలులన్ = కొప్పులందు, తగిలి = అంటుకొని,

పుష్ప - మాలా - విభూతి + కాన్ = పూలదండల సంపద అగుటకు, పుష్ప-హరణ - కేలిన్ = పూలుగోయు క్రీడచే, తొంటి - శృంగారముల్ = మునుపటి అలంకారములు, తూలి + ఉండన్ = తొలఁగఁగా, మగువలకున్ = స్త్రీలకు, వనదేవత, మగుడన్ = మరల, ఒప్పు = శృంగారము, చేసెనో, అనన్, వేఱు + ఒండు = మఱియొక, చెన్ను = అందము, మిగిలెన్ = అతిశయించెను

తాత్పర్యము పిల్లతుమ్మెదలు మీఁదరాల్చు చిన్నరేకులు ముంగురులందుఁ జిన్నిపువ్వయి యొప్పఁగను, కోకిలములు వేడుకతో రాల్చు లేఁత మావిచివురులు

చెవులకు ఆభరణసంపదఁ గూర్చఁగను, మలయవాయుహతిచేత వెడలిన పుప్పొడి క్రమ్మి శరీరములందు వింతపూఁతకాఁగా, చిలుకల త్రొక్కుడుచేత రాలు పండుటాకులు విచ్చిన కొప్పులపై నంటుకొని, పుష్పమాలాసంపద గలుగఁ బూలుగోయుక్రీడచే మునుపటి యలంకారములు తొలఁగఁగా, స్త్రీలకు వనదేవత మరల నలంకారముచేసెనో యనఁ గ్రొత్తయంద మతిశయించెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష సీసపద్య చతుర్థపాదమున - 'కా - రాకులు విరియు వేనలులఁదగిలి' అనుచో యతిమైత్రి కుదురలేదు నేను జూచిన ప్రతుల నన్నిట నిట్లేయున్నది

మదుపానగోష్ఠి

వ అంత వనకేళి సాలించి హరగిరిజల నపరిమితవాసంతికానంత లతాంతాలంకారాలంకృతులం జేయుచుండి రంత నంద కొందఱు మధుపానగోష్ఠికిం జొచ్చి మండలార్చనఁ దీర్చి మూలజవృక్షజ గుడ మధుపిష్ట కుసుమవికారంబులగు సుగంధాసవంబులు కనకమణిమయానేక కరక చషకాదుల నించి హర్షించి. 127

అర్థము: అంతన్, వన - కేళి = వన విహారము, చాలించి = మాని, హర - గిరిజలన్, అపరిమిత - వాసంతికా + అనంత - లతాంత + అలంకార + అలంకృతులన్ = అధికమైన వసంత ఋతూద్భూత పుష్పాలంకారములచే అలంకరింపఁబడినవారిని, చేయుచున్ + ఉండిరి, అంతన్, అందున్ + అ = అందే, కొందఱు, మధు - పాన - గోష్ఠికిన్ + చొచ్చి = మద్యపానమునకుఁబూని, మండల + అర్చనన్ = శ్రీచక్రపూజను, తీర్చి, మూలజ - వృక్షజ - గుడ - మధుపిష్ట - కుసుమ- వికారంబులు + అగు = వేరుల నుండి పుట్టిన చెట్లనుండి పుట్టిన బెల్లము, తేనెపట్టు (?) పూలు అనువాని రూపములు, అగు, సుగంధ + ఆసవంబులు = పరిమళముగల మద్యములు, కనక - మణిమయ + అనేక - కరక - చషక + ఆదులన్ = బంగారు, రత్నాల పెక్కు కమండలువులు, పానపాత్రములు మున్నగువానియందు, నించి = నింపి, హర్షించి = సంతోషించి

తాత్పర్యము: అంత వనవిహారము చాలించి పార్వతీశ్వరులను వసంతకాలపు పెక్కు పుష్పాలంకారములచే నలంకృతులను జేయుచుండిరి అంత అందే కొందఱు మద్యపానమునకుఁ బూని శ్రీచక్రపూజ గావించి వేరుల నుండి చెట్ల నుండి, బెల్లము మధుపిష్టము అనువానినుండి పుట్టిన పరిమళవంతము లయిన మద్యములను బంగారపు, రత్నాల కమండలువులవంటి పానపాత్రములందు నింపి సంతోషించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . మధుషిష్ట - శబ్దము నిఘంటువులఁ గానరాదు మద్యపానమునకుఁ బూని మండలార్చనఁ దీర్చుటేమో ?

మ **శివు గౌరీసహితంబు సన్మనములం జింతించి, మైతెంచి, భై**
రవు యోగీంద్రులఁ గొల్చి, యోగినుల వీరవ్రాతముం దన్ని, యా
నవనాధాదుల కాదిసిద్ధులకు నానందించి, విం దిచ్చి, యా .
సవపాత్రల్ సతు లర్థి నెత్తికొని యాస్వాదించి మోదించుచున్ 128

అర్థము . సతులు = స్త్రీలు, శివున్ = శివుని, గౌరీ - సహితంబు = పార్వతీదేవితోఁగూడ, సత్ + మనములన్ = మంచి మనస్సులతో, చింతించి = ధ్యానించి, మైతెంచి = సమ్మతించి, భైరవున్ = కాలభైరవుని,యోగి + ఇంద్రులన్ = యోగిశ్రేష్ఠులను, కొల్చి = సేవించి, యోగినులన్ = శివపరిచారికలను, వీర - వ్రాతమున్ = వీరుల సమూహమును, తన్ని = తృప్తిపఱిచి, సిద్ధులకున్ = మొదటి సిద్ధులగు, ఆ - నవనాధ + ఆదులకున్ = ఆ నవనాధులు మున్నగువారికి, ఆనందించి = సంతోషించి, విందు + ఇచ్చి = విందుచేసి, ఆసవ - పాత్రల్ = పానపాత్రములు, అర్థిన్ = కోరికతో, ఎత్తికొని, ఆస్వాదించి = త్రావి, మోదించుచున్= సంతోషించుచు

తాత్పర్యము . స్త్రీలు, గౌరీ సమేతుఁడగు శివునిఁ దమ మంచిమనస్సులతో ధ్యానించి, సమ్మతించి, భైరవుని, యోగిశ్రేష్ఠులను సేవించి శివపరిచారికలను వీరశ్రేష్ఠులను తృప్తిపఱిచి, ఆదిసిద్ధులైన ఆ నవనాధులు మున్నగువారికి ఆనందమును గూర్చి, విందుచేసి, పానపాత్రముల నెత్తికొని త్రావి సంతోషించుచు - తరువాతి పద్యముతో నన్వయము

క **ముంచినఁ జప్పుడు విని కం**
పించు శరీరములు దీనిఁ బ్రీతిగఁ బైఁ జి
ల్కించినఁ జొక్కగు నటు సే
వించిన సంభ్రమము గాదె వేల్పులకైనన్ ? 129

అర్థము. ముంచినన్ = ముంపఁగా, చప్పుడు, విని, శరీరములు, కంపించున్ = చలించును, దీనిన్ = ఈ మద్యమును, ప్రీతిగన్ = సంతోషమగునట్లు, పైన్ = మీఁద, చిల్కించినన్ = చల్లినచో, చొక్కు + అగున్ = పారవశ్య మగును, అటు = ఆ విధముగా, సేవించినన్ = త్రావినచో, వేల్పులకున్ + ఐనన్ = దేవతలకయినను, సంభ్రమము + కాదె = వేగిరపాటు - సంక్షోభము, కాదె

తాత్పర్యము . పానపాత్రమును మద్యమున ముంచిన చప్పుడు వినుట తోడనే మేనులు కంపించును దీనిని సంతోషమగునట్లు మీఁదఁ జిలికినచోఁ బారవశ్యము గలుగును ఇఁక సేవించినచో దేవతలకైనను సంక్షోభము కాదా ? అగు ననుట

చ అమరులు త్రావుచో సమ్మతమందురు దీని, నహివ్రజం బజ
స్రముఁ గొని యానుచో నిది రసాయనమందురు, భూసురౌఘ మా
గమవిధి సోమపాన మని గైకొని యానుదు, రెందుఁ జక్రయా
గమునెడ వస్తు వందు రిది కౌళికు, లీ సుర పేర్మి వింతయే ? 130

అర్థము దీనిన్ = ఈ మద్యమును, అమరులు = దేవతలు, త్రావుచోన్, అమృతము + అందురు, అహి - వ్రజంబు = నాగుల సమూహము, అజస్రమున్ = ఎల్లప్పుడును, కొని, అనుచోన్ = త్రావుచో, ఇది, రసాయనము = జీవనౌషధము, అందురు, భూసుర + ఓఘము = బ్రాహ్మణుల సమూహము, ఆగమ - విధిన్ = శాస్త్రవిధిని, సోమ - పానము = యజ్ఞమునందలి సోమరసపానము, అని, కైకొని = సమ్మతించి, ఆనుదురు = త్రావుదురు, ఎందున్, చక్రయాగము + ఎడన్ = చక్రయాగవిషయమున - శ్రీ చక్రార్చనమునందు, కౌళికులు = శాక్తేయులు - రసవాదులు, ఇది = ఈ సురను, వస్తువు + అందురు, ఈ - సుర - పేర్మి = ఈ మద్యము గొప్పతనము, వింతయే = ఆశ్చర్యకరమా ?

తాత్పర్యము. ఈ మద్యమును దేవతలు త్రావుచో నమృత మందురు నాగసమూహము త్రావుచో దీనిని రసాయనమందురు బ్రాహ్మణులు శాస్త్ర విధానమున దీనిని సోమరసమని సమ్మతించి త్రావుదురు శాక్తేయులు - రసవాదులు దీనిని శ్రీ చక్రార్చనమునందు వస్తువందురు ఈ సుర గొప్పతన మాశ్చర్యకరము

విశేషములు . రసాయనము- దేహము నజరామరముగాఁ జేయఁజాలిన దివ్యౌషధము, ఇది సిద్ధౌషధుల రసము, లేక అష్టాదశ సంస్కార పూతమగు పాదరసము

అహివ్రజంబు అందురు, భూసురౌఘము ఆనుదురు - 'మహత్స మూహార్థకశబ్దం బమహత్కార్యయుక్తంబయ్యుఁ దద్విశేషణ క్రియలు మహత్కార్య యోగ్యంబులు విభాష నగు ' ప్రౌఢ శబ్ద పరి 17

క సురలకు దీనన యజరా
మర మయ్యెంగాక యమృతమధనమునకు ము
న్నెరియరె తెరలరె మృతిఁబొం
దరె యని సుర వొగడిపాగడి తరుణులు ప్రీతిన్ 131

అర్థము. సురలకున్ = దేవతలకు, దీనన్ + అ = దీనన = దీని చేతనే, అజరా + అమరము = ముసలితనము, మరణము లేకపోవుట, అయ్యెన్ + కాక= అయ్యెను గాని, అమృత - మధనమునకున్ + మున్ను = అమృతముకొఱకుఁ బిలుకుటకు ముసుపు, ఎరియరె = కాలిపోవరా ?, తెరలరె = వేఁగరా ? మృతిన్= పొందరె, అని, తరుణులు = యువతులు (యువకులును ?), ప్రీతిన్ = సంతోషముతో, సుర = కల్లు, పొగడి - పొగడి = మిక్కిలి పొగడి

తాత్పర్యము. 'దేవతలకు దీనిచేతనే ముసలితనము, మరణము లేకపోవుట జరగెను అట్లుకానిచో నమృతమధనమునకు ముందు వారు కాలిపోవరా ? వేఁగరా? మరణింపరా ?' అని యువతీయువకులు ప్రీతితో కల్లును మిక్కిలిపొగడి - తరువాతి పద్యముతో నన్వయము

వ. అని యనేకవిధమాంసోపదంశకంబు లాస్వాదించుచు మనోహృద్యంబు లగు మద్యరసంబులు సద్యంబ సిద్ధరసంబునుం బోలె. శరీరంబులం గలయ వేధించిన 132

అర్థము. అని, అనేక - విధ - మాంస + ఉపదంశకంబులు = పెక్కురీతులయిన మాంసము,ఊరుఁగాయలు, ఆస్వాదించుచున్= రుచి చూచుచు-తినుచు, మనస్ (:) + హృద్యంబులు = మనసునకు సంతోషమును గూర్చునవి, అగు, మధ్యరసంబులు = కల్లు, సద్యంబ = వెంటనే, సిద్ధ - రసంబునున్ + పోలెన్= పాదరసము వలె, శరీరంబులన్, కలయన్ = అంతటను, వేధించినన్ = బాధింపఁగా

తాత్పర్యము. అని పెక్కురీతు లయిన మాంసము, ఊరుఁగాయలు తినుచు, మనస్సునకు సంతోషమును, గూర్చు కల్లు - వెంటనే పాదరసమువలె శరీరములను అంతటను బాధింపఁగా తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు సిద్ధరసము - సిద్ధౌషధుల రసము ఇది దేహమునఁ బ్రవేశించినంతఁ జొక్కును, మనోదేహభ్రమములును, జర్మస్ఫోటనమును, నఖకేశపతనమును గలిగించి పద్యోజాతత్వమును దయసేయును

సీ అసితోత్పలములపై నరుణేందుదీధితు
లెలసె నా గనుగవ లెట్టనయ్యె
దొనలపై బ్రాలేయలవములు తనరె నా
మొగములఁ బేర్చిందు లెగయుఁదెంచె
గలహంస పదువులు గాళ్ళందుఁ దొడరె నా
మట్టంపు నడపులు మందటిల్లె
దరుణవల్లరులపైఁ బురినమ్ము లూఁగె నా
వెన్నులఁ గ్రొవ్వెదల్ విరిసి వ్రేలె

తే బరభృతావలి దొలుమొల్ల పండ్లరసముఁ
ద్రావె నన ముద్దుఁబలుకులు తడుమనయ్యె
మధుమదాసక్తి నిజరూప మహిమ లెడసి
యభినవాంగప్రభాసిత లైరి సతులు 133

అర్థము. అసిత + ఉత్పలములపైన్ =నల్లని కలువలమీఁద, అరుణ + ఇందు - దీధితులు = సూర్యచంద్రకాంతులు, ఎలసెన్ = వ్యాపించెను, నాన్ = అనఁగా, కనుఁగవలు (కను +కవలు) = కన్నులజంటలు, ఎట్టన + అయ్యెన్ = ఎఱుపెక్కెను

తొవలపైన్ = కలువలపై, ప్రాలేయ - లవములు = మంచుబొట్టులు, తనరెన్ = ఒప్పెను, నాన్, మొగములన్ = ముఖములందు, పేర్చిందులు = చెమట బొట్టులు, ఎగయుఁదెంచెన్ = ఏర్పడెను

కలహంస -పదువులు = రాయంచల గుంపులు, కాళ్ళందున్ (కాళ్ళ + అందున్), తొడరెన్ + నాన్ = తగులుకొనెనా యన, మట్టంపునడపులు (మట్టము+ నడపులు) = సమానమునైన నడకలు, మందటిల్లెన్ = మందగించెను

తరుణ వల్లరులపైన్ = లేఁదీవలపై, పురి - నమ్ములు = మగనెమలులు, ఊఁగెన్ + నాన్, వెన్నులన్ = వెన్నులందు, క్రొవ్వెదల్ = కొప్పులు, విరిసి = విడిపోయి, వ్రేలెన్

పరభృత + ఆవలి = కోకిలముల వరుస, తొలు - మొల్ల - పండ్ల - రసమున్

= మొదటి మొల్ల పండ్లరసమును, త్రావెన్ + ఆనన్, ముద్దుఁబలుకులు= ముద్దులుగులుకు మాటలు, తడుమన్ + అయ్యెన్ + తడవుకొననయ్యెను

మధు - మద + ఆసక్తికిన్ = కల్లు మత్తు గలుగుటచే, నిజ - రూప - మహిమలు = తమవైన ఆకార ప్రభావములు, ఎడసి = కోల్పోయి, సతులు, అభినవ + అంగ - ప్రభాసితలు = క్రొత్త శరీరములచేఁ బ్రకాశించువారు, ఐరి

తాత్పర్యము . నల్లకలువలపై సూర్యచంద్రకాంతులు వ్యాపించెనా యన సతులకుఁ గనుఁగవ లెఱుపెక్కెను కలువలపై మంచుబిందువు లొప్పెనా యన ముఖములందుఁ జెమటబొట్టు లేర్పడెను రాయంచల గుంపులు కాళ్ళ కడ్డపడెనా యన సమానములైన గమనములు మందగించెను లేఁదీఁగెలపైఁ బురిగలనెమలు లూఁగెనా యన వెన్నులపైఁ గొప్పులు వీడి వ్రేలెను కోకిలముల సమూహము తొలుతటి మొల్లపండ్లరసముఁ ద్రావెనాయన ముద్దుఁబలుకులు తడఁబాటు నందెను కల్లుక్రెపుచేఁ దమ యాకారములు పోయి వారు క్రొత్త మేనులతో నొప్పిరి

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష నమ్మి - నమలి - నెమలి, నమిలి, నెమిలి, నెమ్మి, నెమ్మలి, నమ్మలి (రూపాం) క్రొవ్వేద - కబరికిఁ దుఱుము, గీ కొప్పు క్రొవ్వేద మూల నా నొప్పుఁ బేళ్లు ఆం భా 2145

క ముదితలు తొల్లియ యౌవన
మదమున మే యెఱుఁగ రింత మఱి దానిపయిన్
మదిరోన్మాదిత లై రఁట
యెదురన తా రెఱుఁగ రేమి యెఱుఁగుదు రింకన్ ? 134

అర్థము : ముదితలు - స్త్రీలు, తొల్లి + అ = మొదటనే, యౌవన - మదమునన్ - పడుచుఁదనమువలని గర్వమున, మే = శరీరము, ఇంత - ఎఱుఁగరు = కొంచెముగూడ నెఱుఁగరు, మఱి, దాని పయిన్ = యౌవనమదముపై, మదిరా + ఉన్మాదితలు = కల్లుచే మత్తెక్కినవారు, ఐరి + అఁట, ఎదురన్ + అ = ఎదురనే, తారు= వారు, ఎఱుఁగరు, ఇంకన్, ఏమి + ఎఱుఁగుదురు ?

తాత్పర్యము . ఆ స్త్రీలు మొదటనే పడుచుఁదనమువలని గర్వమున దమ మేను లింతయే నెఱుఁగరు ఇఁక దానిపైఁ గల్లుక్రెపు గలవారయిరఁట వారు ఎదుటనున్న వానినే యెఱుఁగరు ఇఁక నేమి యెఱుఁగుదురు ?

విశేషములు అలంకారము కావ్యార్థాపత్తి మే - (రూపాం) మెయి, మై

తరువోజ అన నక్కజంబుగా నన్ని మే యెఱుఁగ
కాడుచు శంకరు నంకమాలికలు
పనిగొన సాహురి ఫలమంజరులను
బౌరాలి నాందోలి భైరవి నాట
నునుపార నాలతుల్ నూల్కొనఁ జేసి
విన నింపుగాఁ బెక్కువిధములఁ బాడి
వినుతించి రింతు లా విశ్వేశు నీశు 135

అర్థము. అనన్ = అనుటకు, అక్కజంబుగాన్ = ఆశ్చర్యముగా, అన్ని = మదించి, మే + ఎఱుఁగక = ఒడలు తెలియక, శంకరు + అంకమాలికలు = ఈశ్వరుని బిరుదులు చెప్పి స్తుతిచేయుగానములు, ఆడుచున్, పనిగొనన్ = యత్నింపఁగా, సాహురిన్ - ఫలమంజరులను - పౌరాలిన్ + ఆందోలిన్ - భైరవిన్ - నాటన్ = సాహురి మున్నగు రాగభేదములను, నునుపారన్ = మృదువుగా, ఆలతుల్ = ఆలాపములు, నూల్కొనన్ + చేసి = చక్కఁబఱిచి, నును - రీతితోడన్ = మృదువుగా, మనోరాగలీలన్ = మనస్సునందలి అనురాగముతో, వినన్ = వినుటకు, ఇంపుగాన్ = మధురముగా, పెక్కు - విధములన్, పాడి, ఇంతులు = స్త్రీలు, ఆ - విశ్వ + ఈశున్ - ఈశున్ = ఆ లోకేశ్వరుఁడైన ఈశ్వరుని, వినుతించిరి = స్తుతించిరి

తాత్పర్యము: స్త్రీలు ఆశ్చర్యకరముగా మదించి ఒడలు తెలియక ఆడుచు ఈశ్వరుని బిరుదులు చెప్పి స్తుతించుచు, సాహురి, ఫలమంజరి, పౌరాలి ఆందోలి, భైరవి, నాట అనెడి రాగభేదములతో మృదువుగా నాలాపములు చేయుచు, మనోనురాగముతో వినుట కింపుగాఁ బెక్కురీతుల ఆ విశ్వేశ్వరుఁడైన యీశ్వరుని స్తుతించుచు గానము చేసిరి

వ. అంతం బరమేశ్వరుండు తద్వినోద ప్రవర్తకాద్యఖిల జనంబుల కనేక విధాంబరాభరణాది విశేషవస్తువు లొసఁగి మహానురాగంబున 136

అర్థము. అంతన్, పరమేశ్వరుండు, తద్ + వినోద - ప్రవర్తక + ఆది + అఖిల - జనంబులకున్ = ఆ వేడుకలందుఁ బ్రవర్తించువారు మున్నగు నెల్లజనులకు, అనేక -విధ + అంబర + ఆభరణ + ఆది - విశేష - వస్తువులు =

పెక్కుఁరీతులయిన వస్త్రములు, అలంకారములు మున్నగు ప్రత్యేకవస్తువులు, ఒసఁగి = ఇచ్చి, మహత్ (మహా) + అనురాగంబునన్ = గొప్ప ఇష్టముతో -

తాత్పర్యము అంతఁ బరమేశ్వరుఁడు ఆ వేడుకలందుఁ బాల్గొనిన ఎల్లజనులకుఁ బలురీతులైన వస్త్రములు, అలంకారములు మున్నగు విశేషవస్తువుల నొసఁగి మహానురాగమతో - తరువాతి పద్యముతో నన్వయము

మ కమలాధీశ్వరభారతీశ్వరులు దిక్పాలాదిగీర్వాణ వ
ర్గములన్ సూరెలఁ గొల్చిరాఁగ మునిసంఘం బర్థిఁ గీర్తింపఁ బం
చ మహాశబ్దములుం జెలంగ ధవళచ్ఛత్రాది సామ్రాజ్య చి
హ్నములన్ వచ్చి రుమామహేశులు మహోక్షారూఢులై పేర్మితోన్ 137

అర్థము ఉమా - మహేశులు = పార్వతీపరమేశ్వరులు, మహోక్ష + ఆరూఢులు + ఐ = ఎద్దునెక్కినవారయి, కమలా +అధి + ఈశ్వర - భారతీ + ఈశ్వరులు = లక్ష్మీపతియగు విష్ణువును, సరస్వతీభర్తయగు బ్రహ్మయును, దిశ్(క్) + పాల + ఆది - గీర్వాణ - వర్గములన్ = దిక్పాలకులు మున్నగు దేవతల సమూహములును, సూరెలన్ = పార్శ్వములందు, కొల్చి = సేవించి, రాఁగన్ = రాఁగా, ముని - సంఘంబు = మునుల సమూహము, అర్థిన్ = కోరికతో, కీర్తింపన్ = స్తుతింపఁగా, పంచ - మహా - శబ్దములున్ = అయిదు విధములైన ధ్వనులును, చెలంగన్ = ధ్వనింపఁగా ధవళ+ ఛత్ర + ఆది - సామ్రాజ్య - చిహ్నములన్ = వెల్లగొడుగు మున్నగు సామ్రాజ్యపు గుఱుతులతో, పేర్మితోన్ = గొప్పతనముతో, వచ్చిరి

తాత్పర్యము ఇట్లు సర్వలోకచక్రవర్తి యగు నీశ్వరుఁడు నగరమునకు వచ్చి పరమైశ్వర్యాది సంపదలతో నొప్పుచు పార్వతీ సమేతుఁడై, పరమసౌఖ్యముతోఁ బ్రవర్తిల్లు చుండెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

క కతిపయ దినముల కా నగ
పతి సకళత్రాప్తమిత్రబాంధవరాజ్యో
న్నత నుత విభవైశ్వర్యా
న్వితముఁ ద న్నరణమిచ్చె విశ్వేశునకున్ 139

అర్థము. కతిపయ - దినములకున్ = కొన్ని దినములకు, ఆ - నగ - పతి = ఆ కొండలఱేఁడు - హిమవంతుఁడు, స-కళత్ర + ఆప్త - మిత్ర - బాంధవ -

రాజ్య + ఉన్నత - నుత - విభవ + ఐశ్వర్య + అన్వితముగన్ = భార్యతో, ప్రియమిత్రులు, బంధువులు, రాజ్యము, ఉన్నతమైన, పొగడఁబడిన, సంపద, ఐశ్వర్యము అనువానితోఁ గూడుకొనునట్లుగా, తన్నున్, విశ్వ + ఈశునకున్ =జగత్పతియైన ఈశ్వరునకు, అరణము + ఇచ్చెన్ = సమర్పించుకొనెను

తాత్పర్యము. క్రొన్ని దినములకుఁ బర్వతరాజగు హిమవంతుఁడు భార్యతో, ఆప్తమిత్రులతో, బంధువులతో, రాజ్యముతో, ఉన్నతము, సన్నుతము అయిన విభవైశ్వర్యముతో విశ్వేశ్వరునకుఁ దన్ను సమర్పించుకొనెను

వ ఇట్లు గిరిశుండు గిరిపతి నరణంబు గొని హరి పరమేష్ఠి పురందరాద్యఖిల సురవరోరగాధీశ్వర పరివృతుండై. 140

అర్థము. ఇట్లు, గిరిశుండు = ఈశ్వరుఁడు, గిరి-పతిన్ = కొండలఱేనిని-హిమవంతుని, అరణంబు + కొని = కానుకగాఁ బరిగ్రహించి, హరి - పరమేష్ఠి - పురందర + ఆది + అఖిల - సుర - వర + అధి + ఈశ్వర - పరివృతుండు + ఐ = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు నెల్లదేవతాశ్రేష్ఠుల ప్రభువులతోఁ జుట్టఁబడినవాఁడయి

తాత్పర్యము . ఇట్లు పరమేశ్వరుఁడు హిమవంతుని గానుకగాఁగొని, విష్ణుబ్రహ్మేంద్రాది సకలదేవతాప్రభువులతోఁ గూడినవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము

సీ పింఛాతపత్రముల్ పెనఁగి మరుద్వీథిఁ
గార్కొను నీలమేఘములు గాఁగ
వివిధభూషారత్నవిధాంశుజాలముల్
సదమ లాఖండల చాపములుగ
ఘనవీథిఁ బొలసాడు ఖచరాంగనాపాంగ
తరళాక్షరుచులు సౌదామనులుగ
సింధురోన్నత కర శీకరాసారముల్
ధారుణిఁ గురియు నాసారములుగ

ఆ. సంచితంబు లైన పంచమహాశబ్ద
రవము లులియు మేఘరవము లనఁగ
హరుఁడు వచ్చె రజతగిరి కుమాన్వితము క్రొ
క్కారులీలఁ గరము గౌరవమున 141

అర్థము పించ + ఆతపత్రములన్ = నెమలిపురుల గొడుగులు, పెనఁగి= కూడి, మరుత్ + వీధిన్ = ఆకాశమున, కొన్కొను = క్రమ్ముకొను, నీల - మేఘములు = నల్లని మేఘములు, కాఁగన్

వివిధ - భూషా - రత్న - వివిధ + అంశు - జాలములన్ = పెక్కురీతులైన ఆభరణములందలి మణుల పలురీతులైన కిరణముల సమూహములు, సత్ + అమల + ఆఖండల - చాపములుగన్ = మిక్కిలి నిర్మలములయిన ఇంద్రధనుస్సులుగను,

ఘన వీధిన్ = ఆకాశమున, పొలసాడు = పొలసి + ఆడు = సంచరించు, ఖచర + అంగనా + అపాంగ - తరళ - అక్ష - రుచులు = దేవతాస్త్రీల క్రీఁగన్నుల చంచలములయిన కన్నుల కాంతులు, సొదామనులుగన్ = మెఱపులుగను,

సింధుర + ఉన్నత - కర - శీకర + ఆసారములన్ = ఏనుఁగుల ఎత్తయిన తొండముల తుంపరల జల్లులు, ధారుణిన్ = భూమియందు, కురియు = వర్షించునట్టి, ఆసారములుగన్ = జడివానలుగను

సంచితంబులు + ఐన = కూర్పఁబడిన, పంచ మహాశబ్ద - రవములు = భేరికాహళాదులైన అయిదు విధములగు ధ్వనులు ఉలియు = మ్రోయునట్టి, మేఘరవములు = ఉఱుములు, అనఁగన్ = అనఁగను

హరుఁడు = శివుఁడు, ఉమా + అన్వితముగన్ = పార్వతీ సమేతముగా, క్రొక్కారు (క్రొత్త + కారు) లీలన్ = తొలకరివలె, రజత - గిరికిన్ = వెండికొండకు - కైలాసమునకు, కరమున్ = మిక్కిలి, గారవమునన్ = గౌరవముతో, వచ్చెన్

తాత్పర్యము. నెమలి పురుల గొడుగులు కూడి ఆకాశమునఁ గ్రమ్ముకొను నల్లని మేఘములు కాఁగా, వివిధాభరణములందలి రత్నముల వివిధ కిరణముల సమూహములు నిర్మలములయిన ఇంద్రచాపములు కాఁగా, ఆకాశమున సంచరించు దేవతా స్త్రీల క్రీఁగన్నుల చంచలములయిన కన్నుల కాంతులు మెఱపులు గాఁగా, ఏనుఁగు ఎత్తయిన తొండముల నుండి వచ్చు తుంపరల జల్లులు భూమియందు వర్షించు జడివానలు కాఁగా, భేరీకాహళాదుల పంచమహాశబ్దరవములు మ్రోయునట్టి ఉఱుములు అనఁగను శివుఁడు పార్వతీసమేతముగాఁ దొలకరివలె వెండికొండకు మిక్కిలి గౌరవముతో వచ్చెను

విశేషములు . రూపకానుప్రాణితోత్ప్రేక్ష క్రొక్కారు = క్రొత్త + కారు, పంచమహాశబ్దములు - భేరి, కాహళము, పటహము, శంఖము, జయఘంట - తత, ఆనద్ధ, సుషిర, ఘన ఆతోద్యముల ధ్వనులు అక్ష - ఈ కవి అక్షిన్ శబ్దమునకు బదులుగా అక్ష శబ్దమును వాడుట పెక్కుచోట్లఁ గలదు గౌరవము (వి) - గౌరవము(ప్ర)

వ ఇట్లనంతవిభవైశ్వర్యాబ్ధిఁ దనరుచు గౌరీసమన్వితుండై చనుదెంచి హరిపరమేష్ఠిపురందరాద్యఖిలభువన భవనాధీశ్వర మునీశ్వరాదుల కభిమతంబు లొసంగి హిమవంతున కజరామరత్వాఖిలనగచక్రవర్తిత్వానంత విభవైశ్వర్యంబులు తోన దయనేసి వీడుకొలిపె నట మేనకయు నుమాదేవియును

అర్థము . ఇట్లు, అనంత - విభవ + ఐశ్వర్య + అబ్ధిన్ = అంతులేని సంపద ఐశ్వర్యము అనెడి సముద్రమునందు, తనరుచున్ = ఒప్పుచు, గౌరీ - సమన్వితుండు + ఐ = పార్వతీసహితుఁడై, చనుదెంచి = వచ్చి, హరి - పరమేష్ఠి - పురందర + ఆది + అఖిల - భువన - భవన + అధి + ఈశ్వర -ముని + ఈశ్వర + ఆదులకున్ = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నుగాఁ గల యెల్లలోకము లనెడి భవనముల ప్రభువులు, మునిశ్రేష్ఠులు మున్నగు వారికి, అభిమతంబులు= కోరిన కోరికలు, ఒసంగి = ఇచ్చి, హిమవంతునకున్, అజర + అమరత్వ + అఖిల - నగ - చక్రవర్తిత్వ + అనంత - విభవ + ఐశ్వర్యంబులు = ముసలితనములేమి, మరణము లేమి, సకలపర్వతచక్రవర్తిత్వము, అంతులేని సంపద, ఐశ్వర్యములు, తోన్ + అ = వెంటనే, దయ + చేసి = ప్రసాదించి, వీడుకొలిపెన్ = పంపెను, అటన్, మేనకయున్, ఉమాదేవియును

తాత్పర్యము : ఇట్లు అంతులేని సంపదైశ్వర్యములనెడి సముద్రమునందు ఓలలాడుచు, పార్వతీసహితుఁడై వచ్చి విష్ణువు, బ్రహ్మ,ఇంద్రుఁడు మున్నుగాఁగల సకల భువన భవన ప్రభువులు, మునీశ్వరులు మున్నగువారికి వరములొసఁగి హిమవంతునకు ముసలితనము లేమి, మరణము లేమి, సకలపర్వతచక్రవర్తిత్వము, అంతులేని సంపద, ఐశ్వర్యము వెంటనే ప్రసాదించి పంపెను అట మేనకయును, పార్వతియును -తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అనంత విభవైశ్వర్యాబ్ధి - రూపకము విభవైశ్వర్య - విభవ + ఐశ్వర్య - వృద్ధిసంధి

తే ఉరు కుచాగ్రంబు ఒండొంటి నొత్తుదేర
నెదురు కొఁగిలింపఁగ నను వెట్లుఁగాక
కెలని కొఱఁగుచుఁ గుచతటుల్ బలిమినొత్త
నదిమి కేలెటకేనియు నందికొనిరి 143

అర్థము. ఉరు - కుచ + అగ్రంబులు = పెద్దవియగు స్తనముల కొనలు, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, ఒత్తుదేరన్ = ఒత్తుకొనఁగా, ఎదురు = ఎదురుగా, కొఁగిలింపఁగన్ = కొఁగిలించుకొనుటకు, ఎట్లున్ = ఏవిధముగను, అనువు - కాక = వీలుగాక, కెలనికిన్ = ప్రక్కకు, ఒఱఁగుచున్, కుచ- తటుల్ = స్తన ప్రదేవములు, బలిమిన్ = అధికముగా, ఒత్తన్, అదిమి = నొక్కి, ఎటకేనియున్ = ఎట్టకేలకు, కేలు = చేయి, అందుకొనిరి

తాత్పర్యము. మేనకాపార్వతులు తమ గొప్పవియగు స్తనముల కొనలు పరస్పరము ఒత్తుకొనుటచే ఎదురుగాఁ గొఁగిలించుకొనుట కెట్లును వీలుగాక ప్రక్కకొదుగుచు స్తనప్రదేశములు బలముగా నొత్తుకొనుట్లు నొక్కి ఎట్టకేలకు చేతుల నందిపుచ్చుకొనిరి

విశేషములు. అలంకారము స్వభావోక్తి

వ ఇట్లు పుష్ప స్తబక భరానమ్ర కల్పతిక లొండొంటిఁ బెనంగు న ట్లన్నువ కొఁదీఁగలు సోపులాడ నొండొరుల నందంద కొఁగిలించుకొని మేనక మనో రాగంబున నిజతనయ వీడుకొని చనియె నంత నక్కడ 144

అర్థము: ఇట్లు, పుష్ప - స్తబక - భర + ఆనమ్ర - కల్ప - లతికలు = పూలగుత్తుల బరువుచే మిక్కిలి వంగిన కల్పలతలు, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, పెనంగు + అట్లు = కూడునట్లు, అన్నువ - కొఁదీఁగలు (కొను + తీఁగ) = సన్నని తీఁగలవంటి నడుములు, చోపులు + ఆడన్ = త్రోపాడుచుండఁగా, ఒండొరులన్ = ఒకరి నొకరు, అందంద = మఱిమఱి, కొఁగిలించుకొని, మేనక, మనస్ (ఃన) + రాగంబునన్ = హృదయానురాగముతో, నిజ - తనయన్ = తన కూఁతును, వీడుకొని - చనియెన్ = విడిచివెడలెను అంతన్, అక్కడన్

తాత్పర్యము. ఇట్లు పూలగుత్తుల బరువుచే మిక్కిలి వంగిన కల్పలతలు ఒకదాని నొకటి పెనఁగునట్లు సన్నని తీఁగల వంటి నడుములు త్రోపాడుచుండఁగా

ఒకరి నొకరు మటిమటి కొఁగిలించుకొని మేనక హృదయానురాగమునఁ దనకూఁతును విడిచి వెడలెను అంత నక్కడ - తరువాతి పద్యముతో నన్వయము

పార్వతీశ్వరుల రతివర్ణన

క లీలోద్యాన వనంబులఁ
గేలీ సదనములఁ, బుష్పగేహముల లతాం
దోలముల, సరోవర తీ
రాలి నిజేచ్ఛావిహారులై హరగిరిజల్ 145

అర్థము హర - గిరిజల్, లీలా + ఉద్యాన -వనంబులన్ = క్రీడోద్యానవనములందును, కేలీ - సదనములన్ = క్రీడా భవనములందును, పుష్ప - గేహములన్ = పూవుటిండ్లయందును, లతా + ఆందోలములన్ = తీవెయూయలలందును, సరోవర - తీర + ఆలిన్ = సరస్తీరముల వరుసయందును, నిజ + ఇచ్ఛా - విహారులు + ఐ = తమ యిచ్ఛవచ్చునట్లు విహరించువారయి

తాత్పర్యము . పార్వతీ పరమేశ్వరులు క్రీడోద్యానవనములందును, క్రీడాభవనములందును, పూవుటిండ్లయందును, తీవెయూయలల యందును, సరస్తీరములందును దమయిచ్ఛవచ్చినట్లు విహరించుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ నయమున భీతి వాపి, మది నన్పునఁ దేఁకువ వాపి, మాటలం
బ్రియ మొనరించి, పొంతనల బేటము వెంచుచు, సమ్మదంబునం
బయిపడి గుహ్యముల్ బయలు పర్చుచుఁ జెయ్వుల లజ్జ వాపుచున్,
మెయివడి గౌరి నీశ్వరుఁడు మేకొలిపెన్ రతికిం గ్రమంబునన్ 146

అర్థము: ఈశ్వరుఁడు, నయమునన్ = నేర్పుతో, భీతి = భయము, పాపి= పోఁగొట్టి, మది - నన్పునన్ = మనసునందలి ప్రేమముతో, తేఁకువ + పాపి= బింకము - బెట్టు, పోఁగొట్టి, మాటలన్ = మాటలతో, ప్రియము = ప్రీతి, ఒనరించి= చేసి, పొంతనలన్ = లాలనములతో, బేటము = అనురాగము, పెంచుచున్ = వృద్ధిపఱుచుచు, సమ్మదంబునన్ = సంతోషముతో, పయిపడి = రతియందుఁగూడి, గుహ్యముల్ = రహస్యావయవములు, బయలుపర్చుచున్ = బహిరంగపఱుచుచు, చెయ్వులన్ = చేష్టలతో, లజ్జ = సిగ్గు, పాపుచున్ = పోఁగొట్టుచు, మెయివడిన్ = సమ్మతితో, గౌరిన్ = పార్వతిని, క్రమంబునన్, రతికిన్ = సంభోగమునకు, మే కొలిపెన్ = అంగీకరింపఁజేసెను

తాత్పర్యము . ఈశ్వరుఁడు నేర్పుతో భయమును బోగొట్టి, మాటలతో సంతోషముఁ గలిగించి, బుజ్జగింపులతో వలపుఁ బెంచుచు, సంతోషముతో రతియందుఁ గూడి రహస్యాంగములను బహిరంగపఱుచుచుఁ, జేష్టలతో సిగ్గుపోఁగొట్టుచు, సమ్మతితో గౌరిని గ్రమముగా సంభోగమునకు సమ్మతింపఁజేసెను

సీ నిడువాలుఁజూడ్కులు నిగిడించు మగిడించుఁ
బతి కన్నుఁగవ పాలపంబు తెఱపిఁ
బొరిఁబొరి మైఁదీఁగ పొందించు నెడలించుఁ
జోఁకాసఁ బ్రియు మేను సుడియునెడల
వెడఁదొక్కుఁబలుకుల వినుపించుఁ గొదవించుఁ
గలయ వల్లభు పల్కుపలుకు పొంత
దరహాసరుచి మోవి దళుకించుఁ దఱకించు
విభుపరిహాసోక్తి వెరవుఁ గఱవ

ఆ సెరవు సేయ కధిపు చెయువల మెయివడి
నడరుఁ దాను గానియదియ పోలెఁ
దరుణి నెమ్మనమునఁ దమకంబు లజ్జయు
నలఁతి కగ్గలింప నాఁకగొనక 147

అర్థము . తరుణి = యువతి - పార్వతి, నెమ్మనమునన్ = (నెఱ + మనమునన్) నిండు మనసున, తమకంబున్ = వేగిరపాటును, లజ్జయున్ = సిగ్గును, అలఁతికిన్ + అగ్గలింపన్ = మితిమీఱఁగా, ఆఁక + కొనక = అడ్డగింపక,

పతి = భర్తయైన ఈశ్వరునియొక్క, కన్నుఁగవ (కన్ను + కవ) = కనుదోయి యొక్క, పాలపంబు -ఱు,తెఱపిన్ = ప్రసారముయొక్క వ్యవధిలో, నిడు - వాలు + చూడ్కులు = నిడుదలైన ఓరచూపులు, నిగిడించున్ = వ్యాపింపఁజేయును, మగిడించున్ = మరలునట్లుచేయును

చోఁకు + ఆసన్ = తాఁకు నాశతో, ప్రియు - మేను = పతిశరీరము, సుడియు + ఎడలన్ = డాయుసమయములందు, పొరిఁబొరిన్ = క్రమముగా, మైఁదీఁగ = తీఁగవంటి మేను, పొందించున్ = కూర్చును, ఎడలించున్ = తొలఁగించును

కలయన్ = బాగుగా, వల్లభు - పల్కు - పలుకు - పొంతన్ = ప్రియుఁడు

పలుకు పలుకుచెంత, వెడన్ = అల్పముగా, లొక్కుఁబలుకులన్ (లొక్కు + పలుకులన్) = అవ్యక్తమధురములయిన మాటలను, వినుపించున్, కొదవించున్ = తగ్గించును

విభు = భర్తయొక్క,పరిహాస + ఉక్తిన్ = పరియాచకపు మాటచే, వెరవున్ = నేర్పును, కటివన్ = నేర్పఁగా, దర- హాస- రుచిన్ = చిఱునవ్వుకాంతితో, మోవిన్ = పెదవిని, తళుకించున్ = ప్రకాశింపఁజేయును, తఱకించున్ = తొలఁగించును

సెరవు + చేయక = హానిచేయక, అధిపు - చెయ్వులన్ = ప్రియుని చేష్టలను, మెయివడిన్ = సమ్మతితో, తాను, కాని + అది + అ + పోలెన్ = సమ్మతింపనిస్త్రీ వలె , అడరున్ = పూనును

తాత్పర్యము. పార్వతి నెమ్మనమున వేగిరపాటును, సిగ్గును మితిమీఱఁగా నడ్డుపెట్టక భర్త చూపుల వ్యవధిలోఁ దననిడుదలైన ఓరచూపులను బ్రసరింపఁజేయును, మరలించును తాఁకవలయుననుకోరికతో భర్త శరీరము డాయు సమయమున ఆమె క్రమముగాఁ దన మైఁదీవను దగ్గఱకుఁ జేర్చును, తొలఁగించును ప్రియుని మాటలకు ఆమె స్వల్పముగాఁ దన అవ్యక్త మధురములయిన మాటలను వినిపించును, తగ్గించును భర్త పరిహాసోక్తిచే నేర్పుగలుగఁగాఁ జిఱునవ్వుకాంతితోఁ బెదవిని బ్రకాశింపఁ జేయును, తొలఁగించును హాని చేయక భర్త చేష్టలను సమ్మతితోఁ దాను సమ్మతింపని స్త్రీ వలెఁ బూనును

విశేషములు : అలంకారము స్వభావోక్తి ఇందు బార్వతిని కవి లజ్జా మన్మథమధ్యస్థయు, ఉదితయౌవనయునైన నాయికనుగా వర్ణించెను

క తరతర మంజిక దఱకఁగఁ
బరువడి మృదుతరరతములఁ బరిణతులై యా
హర గిరితనయలు సురతా
తురు లగుచుం గాయ్వు మిగిలి తోడ్తోన మదిన్. 148

అర్థము. ఆ - హర - గిరి - తనయలు = ఆ శివుఁడును బార్వతియును, తరతరము = క్రమముగా, అంజిక = భయము, తఱఁకగన్ = తొలఁగఁగా, పరువడిన్ = శీఘ్రముగా, మృదుతర - రతములన్ = మిక్కిలి మృదువులైన సంభోగములందు, పరిణతులు +ఐ = పండినవారయి, సురత + ఆతురులు =

సంభోగమునందు, వేగిరపాటు గలవారు, అగుచున్, మదిన్ = మనస్సునందు తోడ్తోన్ + అ = వెంటనే, కాయ్వు = అనురాగము, మిగిలి = అధికమయి

తాత్పర్యము ఆ పార్వతీశ్వరులు క్రమముగా భయము తొలఁగ్గఁగా, శీఘ్రముగా మిక్కిలి మృదువైన సంభోగములందు పరిణతిఁజెంది, సంభోగమునకుఁ ద్వరపడుచు మదిలో ననురాగమధికమయి - తరువాతి పద్యముతో నన్వయము

సీ కరలత లందంద కామపాశంబుల
నదిమి బంధించుచున్నట్లు బిగియ
నొదవుఁబేర్చిందులఁ బదనైనపూఁత లం
గమునకు వజ్రలేపములు గాఁగఁ
బులక లొండొరుల మేనుల నుచ్చిపోయి డ
గ్గఱ మొలలిచ్చిన కరణి గాఁగఁ
గనకంపుఁబ్రతిమలు గాఁచి యంటించిన
ట్లొడఁగూడి తనువు లొండొంటిఁ గదియఁ

ఆ దగఁగ నొక్కతలకు మొగములు రెండైన
పగిదిఁ దలలు మాఱుమొగము వడఁగ
గీఱి మేను మేనఁ దూఱ గాఢాలింగ
నంబు సేసి రంగనయుఁ బ్రియుండు 149

అర్థము . కామ - పాశంబులన్ = మన్మథపాశములతో, అందంద = మిక్కిలి, అదిమి = నొక్కి, బంధించుచున్ + ఉన్న + అట్లు = కట్టివైచుచున్న విధమున, కర-లతలు = తీఁగలవంటి చేతులు, బిగియన్ = బిగిసికొనఁగా,

ఒదవు + పేర్ + బిందులన్ = కలిగెడు చెమటబొట్టులచే, పదను + ఐన = తడియైన, పూఁతలు = అంగలేపములు, అంగమునకున్ = శరీరమునకు, వజ్ర-లేపములు = వజ్రపుఁబూఁతలు, కాఁగన్

పులకలు = గగుర్పాటులు, ఒండొరుల = ఒకరొకరి, మేనులన్ = శరీరములందు, ఉచ్చిపోయి = భేదించి, డగ్గఱన్ = చేరువను, మొలలు + ఇచ్చిన కరణి + కాఁగన్ = చీలలు బిగించిన విధము కాఁగా,

కనకంపుఁ బ్రతిమలు (కనకము + ప్రతిమలు) = బంగారు బొమ్మలు,

కాఁచి = కాల్చి, అంటించిన + అట్లు = అంటించిన విధమున, తనువులు = శరీరములు, ఒడఁగూడి = జతఁగూడి, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, కదియన్ = కూడఁగా,

తగఁగన్ = ఒప్పునట్లు, ఒక్క తలకున్, మొగములు = ముఖములు, రెండు + ఐన - పగిదిన్ = రెండయిన విధమున, తలలు, మాఱుమొగము + పడఁగన్,

గీఱి = భేదించి, మేను = ఒకరి శరీరము, మేనన్ = ఇంకొకరి శరీరమున, తూఱన్ = ప్రవేశింపఁగా, అంగనయున్ = స్త్రీయు (పార్వతియు), ప్రియుండున్ = భర్తయును (శివుఁడును), గాఢ + ఆలింగనంబు -ఁ చేసిరి = ధృఢముగా గౌఁగిలించుకొనిరి

తాత్పర్యము: మన్మథపాశములతో మిక్కిలి నొక్కి కట్టివైచుచున్న విధమునఁ దీఁగలవంటి చేతులు బిగియఁగను, చెమటబొట్టులచేఁ దడియైన అంగలేపములు శరీరమునకు వజ్రపుఁబూఁతలు కా గా, గగుర్పాటులు ఒకరొకరి శరీరములను భేదించి చేతువను చీలల బిగించిన విధము కాఁగా, బంగారు బొమ్మలను గాల్చి అంటించినట్లు శరీరములు జతగూడి ఒకదానినొకటి కూడఁగను, ఒక్కతలకు ముఖములు రెం డయినట్లు తలలు మార్మొగము పడఁగను, ఒకరి శరీరము మఱియొకరి శరీరమును భేదించి ప్రవేశింపఁగను పార్వతీపరమేశ్వరులు గాఢాలింగనము చేసికొనిరి

విశేషములు : అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష స్వభావోక్తి కనకంపుఁబ్రతిమలు - కనకము + ప్రతిమలు మువర్ణకమునకుఁ బుంప్వాదేశము బాల సంధి 32 నుగాగమము బాల సంధి 25 ద్రుతకార్యము - బాల సంధి 16,17

క. అనవరతము నవకరణా
సన చుంబన భూషణాదిసంగమ గతు లో
లిన నూల్కొనఁ బెనఁగిరి కా
య్యున బహుతరగతుల నింపు పొంపిరివోవన్ **150**

అర్థము: అనవరతమున్ = ఎల్లప్పుడును, నవకరణ + ఆసన - చుంబన+ భూషణ + ఆది - సంగమ - గతులు = నవకరణము, ఆసనము, చుంబనము, భూషణము మున్నగు సంభోగరీతులు, ఓలిన్ + అ = క్రమముగానే, నూల్కొనన్

= కలుగఁగా, కాయ్వునన్ = ప్రేమముతో, బహుతర - గతులన్ = అనేక విధముల, ఇంపు = ఆనందము, పొంపిరి + పోవన్ = అతిశయింపఁగా, పెనఁగిరి= కూడిరి

తాత్పర్యము నిరంతరమును నవకర ణాసన చుంబనభూషణాదులైన సంభోగరీతులు క్రమముగాఁగలుగ వారు అనురాగముతో ననేకవిధముల ఆనంద మతిశయింపఁ గూడిరి

వ తదవసరంబున **151**

అర్థతాత్పర్యములు . తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ రతిలోలురై బాహ్యరతియు నాభ్యంతర
రతియు నుత్తమ సమరతియు నీచ
రతియు సలలితోచ్చరతియుఁ బొల్పగు చిత్ర
రతియు సన్నుత మూలరతియు నుపరి
రతియు నింపగు మృదురతియుఁ బ్రచండోరు
రతియు నెంతయు గూఢరతియఁ బ్రకట
రతియును నాఁ బెక్కురతములు పరువడి
రతిపతిశాస్త్రచోదితము గాఁగ
ఆ. సతికిఁ దెలియఁ జూపెఁ బతి వాని నన్నియు
మగువ వరుసఁ బతికి మగుడఁజూపె
సతియుఁ బతియు నేర్పు రతి భక్తిఁ దలపోయ
రతులు నవములయ్యెఁ బ్రతిదినంబు **152**

అర్థము : రతి - లోలురు + ఐ = సంభోగమునం దాసక్తి గలవారయి, బాహ్య - రతియున్, ఆభ్యంతర - రతియున్, ఉత్తమ - సమ -రతియున్ = శ్రేష్ఠమయిన సమరతియును,

నీచ - రతియున్, సలలిత + ఉచ్చ - రతియున్, పొల్పు + అగు = ఒప్పయిన, చిత్ర రతియున్, సన్నుత - మూల - రతియున్, ప్రచండ + ఉరు - రతియున్, ఎంతయున్, గూఢ - రతియున్, ఉపరి - రతియున్, ఇంపు + అగు, మృదు - రతియున్, ప్రచండ + ఉరు - రతియున్, ఎంతయున్, గూఢ రతియున్,

ప్రకట - రతియును, నాన్ = అన, పెక్కు రతములు, పరువడిన్ = క్రమముగా, రతి - పతి - శాస్త్రచోదితము = కామశాస్త్ర ప్రేరితము, కాఁగన్,

పతి = భర్త (శివుఁడు), సతికిన్ = స్త్రీ (పార్వతి)కి తెలియన్ + చూపెన్, వానిన్, అన్నియున్, మగువ = స్త్రీ వరుసన్ = వరుసతో, పతికిన్ = భర్తకు, మగుడన్ = మరల, చూపెన్

ప్రతిదినంబున్, సతియున్, పతియున్, నేర్పు, రతి, భక్తిన్, తలపోయన్, రతులు, నవములు = క్రొత్తవి, అయ్యెన్

తాత్పర్యము సంభోగమునం దాసక్తి గలవారయి, బాహ్యారతియు, ఆభ్యంతర రతియు, ఉత్తమమైన సమరతియు, నీచరతియు, సలలితమైన ఉచ్చరతియు, ఒప్పయిన చిత్రరతియు, సన్నుతమైన మూలరతియు, ఉపరిరతియు, ఇంపయిన మృదురతియు, ప్రచండరతియు, ఎంతయును గూఢరతియు, ప్రకటరతియును అనఁగాఁ బెక్కురతులు క్రమముగాఁ గామశాస్త్రప్రేరితములు కాఁగా, పతియగు నీశ్వరుఁడు సతియైన పార్వతికిఁ దెలియఁజూపెను పార్వతి వానినన్నిటిని వరుసగా భర్తకు మరలఁ జూపెను సతీపతులు నేర్పురతిని భక్తితోఁ దలపోయఁగాఁ బ్రతిదినమును రతులు క్రొత్తవి యయ్యెను

ఉ. కోరికపాం దెఱింగి రతి గూఢపు నిక్క మెఱింగి చెయ్వులన్
వారణలేక చిత్తముల వంచన లేక రమించె నీశుఁ డిం
పార ననేకకాలముల నప్పటికప్పటి కొక్కభంగి నా
గౌరియుఁదాను నొండొరులకంటె మనోభవకేళిలోలురై 153

అర్థము : ఈశుఁడు, ఆ - గౌరియున్, తానున్, ఒండొరుల కంటెన్ = ఒకరికంటె నొకరు, మనోభవ - కేళి -లోలురు + ఐ = మన్మధక్రీడయం దాసక్తిగలవారయి, కోరిక - పొందు + ఎఱింగి, రతి - గూఢపు - నిక్కము = రతియొక్క గూఢమైన వాస్తవము, ఎఱింగి, చెయ్వులన్ = చేష్టలందు, వారణ - లేక = అడ్డు లేక, చిత్తములన్ = మనస్సులందు, వంచన = మోసము, లేక, ఇంపు + ఆరన్ = ఆనందము గలుగఁగా, అనేక - కాలములన్ = పెక్కుసమయములందు, అప్పటికిన్ + అప్పటికిన్ = ఆయా సమయమునకు, ఒక్క - భంగిన్ = ఒక విధముగా, రమించెన్ = సంభోగించెను

తాత్పర్యము: పార్వతియును దానును ఒకరికంటెనొకరు మన్మధక్రీడయం దాసక్తిగలవారయి, ఈశ్వరుఁడు కోరిక తెలిసికొని రతిలో గూఢమైన, నిజము

తెలిసి, చేష్టలలో అడ్డులేక, చిత్తములందు మోసములేక, ఇంపుగలుగ, పెక్కుసమయములం దాయాకాలమున కొక్కరీతిగా రమించెను

వ ఇ ట్లయ్యుమామహేశ్వరులు మదనసుఖపరవశు లగుచు ననవరత నిరతులై రమియించు నవసరంబున 154

అర్థము. ఇట్లు, ఆ + ఉమా - మహేశ్వరులు, మదన - సుఖ - పరవశులు = మన్మధసౌఖ్యముచే నొడలు తెలియనివారు, అగుచున్, అనవరత - నిరతులు + ఐ = ఎల్లప్పుడును ఆసక్తిగలవారయి, రమియించు + అవసరంబునన్ = సంభోగించునప్పుడు

తాత్పర్యము. ఇట్లు ఆ పార్వతీపరమేశ్వరులు మన్మధసౌఖ్యపరవశులగుచు ఎల్లప్పుడు ఆసక్తిగలవారయి సంభోగించు సమయమున -తరువాతి పద్యముతో నన్వయము

**చ అమితసువీర్యవార్ధు లిల నప్పటికప్పటి కుద్భవించుడుం
గ్రమమున నుర్విలోఁ గులనగంబులు దెప్పలువోలె నుండి మే
ఘము లనయంబుఁ దెట్టువులు కట్టి కెలంకులఁ జేరెఁ బై విమా
నములు వహిత్రసంఘమున నల్లగ నోలిన తేలి పాఱఁగన్ 155**

అర్థము. అమిత - సువీర్య - వార్ధులు = మిక్కిలి పరాక్రమముగల సముద్రములు, ఇలన్ = భూమియందు, అప్పటికిన్ + అప్పటికిన్ = అప్పటికప్పుడు, ఉద్భవించుడున్ = పుట్టినంతనే, పై - విమానములు = ఆకాశమునందలి విమానములు, వహిత్ర - సంఘము = ఓడల సమూహము, అనన్, నల్లడన్ = నాలుగువైపులను, ఓలిన్ + ఆ = క్రమముగనే, తేలి - పాఱఁగన్ - తేలిపోవుచుండఁగా, క్రమమునన్, ఉర్విలోన్ = భూమిలో, కుల - నగంబులు = కులపర్వతములు, తెప్పలు + పోలెన్ = తెప్పల విధమున, ఉండెన్, మేఘములు, అనయంబున్ = మిక్కిలి, తెట్టువులు + కట్టి = తెట్టెలుకట్టి, కెలంకులన్ = పార్శ్వములందు, చేరెన్

తాత్పర్యము. మిక్కిలి వీర్యవంతములైన సముద్రములు భూమిపై అప్పటికప్పటికిఁ బుట్టినంతనే ఆకాశమునందలి విమానములు ఓడలసమూహమున నాలుగువైపులను దేలిపోవఁగాఁ గ్రమమున భూమిలోఁ గులపర్వతములు తెప్పల విధమున నుండెను మేఘములు మిక్కిలి తెట్టెలు కట్టి పార్శ్వములందుఁ జేరెను

విశేషములు . అలంకార మతిశయోక్తి, ఉత్ప్రేక్ష

వ ఇ ట్లఖిలభువనభవనాధీశ్వరుండగు పరమేశ్వరుం డనవరత రత నిరతుండై జగద్వ్యాపారం బారయమికి నింద్రాదిదేవత లుద్వేగించి విరించి పాలికిం జని **156**

అర్థము ఇట్లు, అఖిల - భువన - భవన + అధి + ఈశ్వరుండు = సకలలోకములనెడి భవనములకుఁ బ్రభువు, అగు, పరమేశ్వరుండు, అనవరత - రత - నిరతుండు + ఐ = నిరంతరము సంభోగమునం దాసక్తి గలవాఁడయి, జగత్ + వ్యాపారంబు = లోక వ్యవహారము, ఆరయమికిన్ = చూడకుండుటకు, ఇంద్ర + ఆది - దేవతలు = ఇంద్రుఁడు మొదలైన వేల్పులు, ఉద్వేగించి = కలఁత జెంది, విరించి - పాలికిన్ = బ్రహ్మకడకు, చని = వెడలి

తాత్పర్యము . ఇట్లు ఎల్లలోకములనెడి భవనములకుఁ బ్రభువైన పరమేశ్వరుఁడు నిరంతరసంభోగమునం దాసక్తి గలవాఁడయి లోకవ్యవహారము చూడకుండుటకు ఇంద్రుఁడు మున్నుగాఁగల వేలుపులు కలఁగి బ్రహ్మకడకు వెడలి- తరువాతి పద్యముతో నన్వయము

ఉ క్రొవ్విరితమ్మి తావిఁ గొని క్రోలి మదంబునఁ దేలు తేఁటి కొం డెవ్విరి పువ్వుకంపు సొగయింపని భంగి మహేశుఁ డయ్యుమా యవ్వన వారి పూర్ణ సురతాబ్ధి వివర్ధితుఁడై మదించి మైఁ దివ్వఁడ లోకవర్తనకు దేవత లెంత విహీనభాగ్యులో **157**

అర్థము: క్రొవ్విరి (క్రొత్త + విరి) - తమ్మి - తావిన్ = క్రొత్తగా వికసించిన తామర పూవుపరిమళమును, కొని, క్రోలి = త్రావి - (ఆఘ్రాణించి) = మదంబునన్ = క్రొవ్వుతో, తేలు = ఆనందించు, తేఁటికిన్ = తుమ్మెదకు, ఒండు = మఱియొక్క, ఎవ్విరి (ఏ + విరి) + పువ్వు - కంపున్ = ఏ వికసించిన పూవు పరిమళమును, సొగయింపని - భంగిన్ = చొక్కుసేయని - ఆసక్తి పుట్టింపని విధమున, మహేశుఁడు = పరమేశ్వరుఁడు, ఆ + ఉమా - యవ్వన - వారి - పూర్ణ - సురత + అబ్ధి - వివర్ధితుఁడు + ఐ = ఆ పార్వతియొక్క - జవ్వనమనెడి - నీటితో - నిండిన సంభోగమనెడి సముద్రముచేత, వివర్ధితుఁడు + ఐ = విశేషముగా వృద్ధి పొందింపఁబడినవాడయి, మదించి = క్రొవ్వి, లోక - వర్తనకున్ = లోక వృత్తికి, మైన్ = శరీరమును, తివ్వఁడు + అ = లాగికొనఁడు (త్రిప్పఁడు), దేవతలు, ఎంత విహీన - భాగ్యులు + ఓ = దురదృష్టవంతులో !

తాత్పర్యము. క్రొత్తగా వికసించిన తామర పరిమళమును ఆఘ్రాణించి మదమున నానందించు తుమ్మెదకు మఱి యే వికసిత పుష్ప పరిమళమును ఆసక్తి పుట్టింపని విధమునఁ, బరమేశ్వరుఁడు ఆ పార్వతీ యౌవనమనెడు నీటితో నిండిన సంభోగ మనుసముద్రముచే విజృంభించినవాఁడయి మదించి లోక వ్యవహారమునకు శరీరమును ద్రిప్పనే త్రిప్పకుండెను దేవతలు ఎంత దురదృష్టవంతులో కదా !

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోపమ అర్థాంతరన్యాసము ఇందు 'యౌవన' అనుటకు బదులు 'యవ్వన' అను అపరూపము ప్రయుక్తమయినది ప్రాచీనకవితలో నిది సాధువేమో! అనంతుఁడును తన భోజరాజీయమున - 'నవ్వుచుఁ జెక్కు మీటి నలినస్ఫుటలోచన మాటవేల నీ యవ్వన లక్ష్మికిన్ భటుఁడ నైతి' నని ప్రయోగించెను 'మహేశ్వరుండు నా- జవ్వని యౌవనంబనెడు చంద్రికఁ గ్రోలు చకోరభంగిమైఁ - దివ్వఁడ' అని దీనికి మా రా ప్రతిలోఁ బారాంతరము గలదు 'మహేశ్వరుఁడును ఆ జవరాలి యౌవనమనెడు వెన్నెలను గ్రోలు వెన్నెలపులుఁగు విధమున' నని దాని తాత్పర్యము 'మహేశ్వరుండు మా - యవ్వనవారిపూర్ణసురతాభివివర్ధితుఁడై' యను పారము వావిళ్ళ వారి ప్రతిలోఁ గలదు 'మహేశ్వరుండు మా అవ్వన్ = మా తల్లిని, అవారి = అడ్డులేని, పూర్ణమైన సురతముచే, అభివివర్ధితుఁడై' యని విభజింపనగునా ?

వ అని నిర్వేదించి విన్నవించు సురవరులకు విరించి కరుణించి తదుపాయంబు విచారించి యనలాంబకుపాలికి ననలుం బంచినంతన భవదీయకార్యసిద్ధియగుం బనుపుండని హితోపదేశంబుసేసినం గైకొని చనుదెంచి సురపతి పరమాత్మమాహాత్మ్యంబుఁ దలంచి చంచలించుచు 158

అర్థము. అని, నిర్వేదించి = దుఃఖించి, విన్నవించు = మనవి చేయు, సుర-వరులకున్ = దేవతాశ్రేష్ఠులకు, విరించి - బ్రహ్మ, కరుణించి = దయఁజూపి, తద్+ ఉపాయంబున్ = దాని యుపాయమును, విచారించి = ఆలోచించి, అనల + అంబకు - పాలికిన్ = అగ్నినేత్రుని (శివుని) కడకు, అనలున్ = అగ్నిని, పంచిన+ అంతన్ + అ = పంపిన వెంటనే, భవదీయ- కార్య - సిద్ధి = మీదయిన పని నెఱవేఱుట, అగున్, పనుపుండు = పంపుఁడు, అని, హిత + ఉపదేశంబు = మేలు నుపదేశించుట, చేసినన్, కైకొని = స్వీకరించి, చనుదెంచి = వచ్చి, సుర -

పతి = దేవతల ప్రభువు - ఇంద్రుఁడు, పరమాత్ము - మాహాత్మ్యంబు = పరమాత్ముఁడైన శివుని గొప్పతనమును, తలంచి, చంచలించుచున్ = మిక్కిలి చలించుచు

తాత్పర్యము . అని దుఃఖించి విన్నపముచేయు దేవతాశ్రేష్ఠులను బ్రహ్మ దయఁజూచి దాని కుపాయము నాలోచించి శివునికడకు నగ్నిని బంపినంతనే మీ కార్యము సిద్ధించును పంపుఁడని హితము నుపదేశింపఁగా దానిని జేకొని వచ్చి ఇంద్రుఁడు ఈశ్వరుని మాహాత్మ్యమును దలఁచి మిక్కిలి చలించుచు - తరువాతి పద్యముతో నన్వయము

ఆ **రతి యొనర్పఁబోయి రతిపతి పడ్డ పా**
టెఱిఁగియెఱిఁగి వారి కింక విరతి
సేయఁ బూని విలయశిఖినేత్రుకడ కగ్ని
యేల పోవుఁ బంపు డేమి తగవు ? 159

అర్థము : రతి = (పార్వతీశ్వరులకు) సంగమము, ఒనర్పన్ + పోయి = చేయఁబూని, రతి - పతి = రతిభర్తయైన మన్మథుఁడు, పడ్డ - పాటు = పడిన కష్టము, ఎఱిఁగి + ఎఱిఁగి = తెలిసి తెలిసి, వారికిన్ = ఆ పార్వతీపరమేశ్వరులకు, ఇంకన్ = ఇటుపై, విరతి = ఎడఁబాటు, చేయన్ + పూని, విలయ - శిఖి - నేత్రు - కడకున్ = ప్రళయాగ్ని కన్నుగాఁ గలవాని (శివుని) యొద్దకు, అగ్ని, ఏల-పోవున్, పంపుడు = పంపుట, ఏమి, తగవు = న్యాయము ?

తాత్పర్యము . పార్వతీశ్వరులకు సంగమము చేయఁబోయి మన్మథుఁడు పడినపాటు తెలిసితెలిసి, ఇప్పు డిఁక వారికి ఎడఁబాటు చేయఁబూని ప్రళయాగ్ని నయనుఁడైన శివుని కడకు అగ్ని యేలపోవును ? అగ్నిని బంపుట యేమి న్యాయము?

వ **అనిన సురపతిని బృహస్పతి కనుంగొని** 160

అర్థము . అనినన్, సుర - పతిన్ - ఇంద్రుని, బృహస్పతి, కనుంగొని

తాత్పర్యము : ఇంద్రుఁ డట్లనఁగనే బృహస్పతి యతనిని జూచి - తరువాతి పద్యముతో నన్వయము

దేవతలు పార్వతీశ్వరుల కడ కగ్నినిఁబంపుట

సీ హేమాబ్జినీ కేళి కెలసి మరాళంబు
మానససరసి నెమ్మనమునందు
మఱచి క్రొక్కారు బిట్టఱగని చుడుమఱఁ
దెలిసి వచ్చిన తావు దలఁచు పగిదిఁ
బార్వతీ రతికేళి పరవశుఁడై జగ
ద్వ్యాపార మంతయు వదలియున్న
ధూర్జటి నిజమూర్తి ధూమధ్వజుం గని
తన కాచు లోకవర్తనయు తలఁచుఁ

ఆ గాన వహ్ని కలుగఁగా నేరఁ డనలాక్షుఁ
డలిగె నేని ననలుఁ డనలుఁ గలిసి
వెలసి వెలుఁగుఁగాని మలుగఁ డీశ్వరు పాలి
కనలుఁ బంచు డుచిత మగు సురేంద్ర ! 161

అర్థము. హేమ + అబ్జినీ - కేళికిన్ = బంగారు పద్మిని తోడి క్రీడకు, ఎలసి = ఇచ్చగించి, మరాళంబు= హంస, మానస - సరసిన్ = మానసమనెడు సరసిని, నెమ్మనము + అందున్ (నెఱ + మనము) = నిండుమనసులో, మఱచి, క్రొక్కారున్ (క్రొత్త + కారున్) తొలకరిని, బిట్టఱగని = శీఘ్రముగఁ జూచి (?) చుడుము + అఱన్ = మాంద్యము నశింపఁగా (?), తెలిసి, వచ్చిన - తావున్ = వచ్చినచోటిని, తలఁచు - పగిదిన్ = తలంచు విధమున,

పార్వతీ - రతి - కేళి - పరవశుఁడు + ఐ = పార్వతీ సంభోగక్రీడయందు ఒడలుమఱచినవాఁడయి, జగత్ + వ్యాపారము + అంతయున్ = లోకవ్యవహార మంతయు, వదలి + ఉన్న = విడిచియున్న, ధూర్జటి = శివుఁడు - (బరువైన జడలు గలవాఁడు), నిజ- మూర్తిన్ = తనవి యగునెఎనిమిది మూర్తులలో నొకటి యగు మూర్తిని, ధూమ - ధ్వజున్ = అగ్నిని (ధూమము ధ్వజముగాఁ గలవానిని), కని, తన - కాచు = తాను రక్షించు, లోక - వర్తన + అ = లోకవ్యాపారమే, తలఁచున్

కానన్, అనల + అక్షుఁడు + అగ్ని నయనుఁడు - శివుఁడు, వహ్నికిన్ = అగ్నికి, అలుగఁగాన్ - నేరఁడు = కోపింపఁ జాలఁడు, అలిగెన్ + ఏనిన్ = కోపించినను, అనలుఁడు = అగ్ని, అనలున్ = శివుని నిటలాగ్నిని, కలిసి = కూడి, వెలసి - వెలుఁగున్ + కాని =అతిశయించి ప్రకాశించును గాని, మలుగఁడు = నశింపఁడు

(కావున), సుర+ఇంద్ర = దేవేంద్రా ! ఈశ్వరు - పాలికిన్ = ఈశ్వరుని యొద్దకు, అనలున్ = అగ్నిని, పంచుడు = పంపుట, ఉచితము + అగున్ = తగును

తాత్పర్యము . బంగరు పద్మినితోడి క్రీడకు ఇచ్చగించి హంసము మానససరసిని నెమ్మనమున,మఱచి తొలకరిని శీఘ్రముగాఁ జూచి మాంద్యము నశింపఁ దెలిసి తాను వచ్చిన చోటిని దలఁచు విధమునఁ, బార్వతితోడి సంభోగక్రీడచేఁ బరవశుఁడై లోకవ్యాపారమునంతను మఱచియున్న ఈశ్వరుఁడు తన యెనిమిది మూర్తులలో నొక మూర్తియైన అగ్నిని గని తాను రక్షించులోకముల వ్యవహారము తలఁచును కావున అగ్నినయనుఁడైన శివుఁడు అగ్నియెడఁ గోపము వహింపఁజాలఁడు అలిగినను అగ్ని శివుని నిటలాగ్నిని గూడి అతిశయించి ప్రకాశించును గాని నశింపఁడు అందుచే నో దేవేంద్రా ! ఈశ్వరుని యొద్ద కగ్నిని బంపుట ఉచితమగును

విశేషములు : అలంకార ముపమ అబ్జిని = ఒకనాయిక సరసి = మొదటినాయిక మరాళము - నాయకుఁడు నెమ్మనము - నెఱ + మనము క్రొక్కారు - క్రొత్త + కారు బిట్టఱగని చుడుమఱ - అనునది దుర్బోధముగా నున్నది అయినను ప్రకరణమును బట్టియు, పూర్వటీకను బట్టియు వ్యాఖ్యానింపఁబడినది జగద్వాపారము - జగత్ + వ్యాపారము, హళ్ళు పరమగుచుండఁగా తకారమునకు దకారము అనలాక్షుఁడు - బహువ్రీహి సమాసాంతమున అక్షిన్ శబ్దమునకు అకారంతత పంచుడు = పంచుట ఈ కవి భావార్థక ట వర్ణకమునకు బదులుగా డువర్ణకమును బ్రయోగించుట పెక్కుచోట్లఁగలదు తన కాచు - తాను గాచు 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యహిత కర్తృపద ప్రథమకుఁ దఱుచుగ యొక్కషష్ఠి యగు ' ప్రౌఢ - కారక 15 తనయొక్కకాచు 'యొక్కకు లోపంబు బహుళంబు' ప్రౌఢ కారక 16 తన కాచు వహ్ని కలుగఁగా నేరఁడు 'షష్ఠీ స్థానికంబగు కువర్ణకం బొక్కొకచో, ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి ' 'ప్రౌఢ కారక 13 ఇచ్చటఁ జతుర్థ్యర్థమునఁ గువర్ణకము వహ్నియే న కువ్యతి' అని యర్థము ఇది సంస్కృతకారక విధానము తెలుఁగున వహ్నిపై నలుగఁగా నేరఁడు అనియుండును

వ అనిన నొడంబడి కార్యనిశ్చయంబుసేసి దేవేంద్రుండు పావకు రావించి తద్వృత్తాంతం బెఱిఁగించి నియమించినం గైకొని మహాప్రసాదంబని వీడుకొని నిజాంతర్గతంబున 162

అర్థము : అనినన్, ఒడంబడి = అంగీకరించి, కార్య - నిశ్చయంబు + చేసి= చేయఁదగిన దానిని నిశ్చయించి, దేవ + ఇంద్రుండు, పావకున్ = అగ్నిని, రావించి

= రప్పించి, తద్ + వృత్తాంతంబు, ఎఱిఁగించి, నియమించినన్ = ఆజ్ఞాపింపఁగా, కైకొని = స్వీకరించి, మహాప్రసాదంబు + అని, వీడుకొని = సెలవు పుచ్చుకొని, నిజ +అంతర్గతంబునన్ = తన మనస్సునందు - తరువాతి ఆశ్వాసము నందలి 2 వ వచనముతో నన్వయము

అశ్వాసాంతము

చ పురహరమూర్తిఁ గీర్తిపరు బుణ్యు నగణ్యు నసేవ్యు భవ్యుఁ బం
కరుహజగోత్రుఁ బాత్రు నవికారు గభీరు ముముక్షు దక్షు నీ
శ్వరపదభక్తు ముక్తు గుణవంతు ననంతు వదాన్యు మాన్యు వా
గ్వరకృతకృత్యు నిత్యు మునివంద్యు ననింద్యు విచారపారగున్ 163

అర్థము . పురహర - మూర్తిన్ = ఈశ్వరుని మూర్తివంటి మూర్తి గల వాఁడును, కీర్తి పరున్ = కీర్తియం దాసక్తి గలవాఁడును, పుణ్యున్ = పవిత్రుఁడును, అగణ్యున్ = గణించుటకు శక్యముగానివాఁడును, అసేవ్యున్ = సేవింపఁదగినవారు లేనివాఁడును, భవ్యున్ = శుభుఁడును, పంకరుహజ - గోత్రున్ = బ్రహ్మవంశము వాఁడును - బ్రాహ్మణుఁడును, పాత్రున్ = అర్హుఁడును, అవికారున్ = వికృతిలేనివాఁడును, గభీరున్ = గంభీరుఁడైనవాఁడును, ముముక్షున్, = మోక్షమును గోరువాఁడును, దక్షున్ =సమర్థుడైనవాఁడును, ఈశ్వర పదభక్తున్ = ఈశ్వరుని పాదములందు భక్తిగలవాఁడును, ముక్తున్ = మోక్షమునొందినవాఁడును, గుణవంతున్, అనంతున్ = అంతములేనివాఁడును, వదాన్యున్ = ఉదారుఁడును,మాన్యున్ = గౌరవింపఁదగినవాఁడును, వాచ్ (క్) + వర + కృతకృత్యు = విద్వాంసులలోఁ గృతార్థుఁడును, నిత్యున్ = శాశ్వతుఁడును, ముని-వంద్యున్ = మునులచే నమస్కరింపఁదగినవాఁడును, అనింద్యున్ = నిందింపఁదగనివాఁడును, విచార - పారగున్ = ఆలోచనమందుఁ బారమును ముట్టినవాఁడును - అగు కృతిభర్తను జంగమమల్లికార్జునదేవుని

తాత్పర్యము . శివుని మూర్తివంటె మూర్తిగలవాఁడును, కీర్తియం దాసక్తి గలవాఁడును, పుణ్యుఁడును, గణింపశక్యముగాని వాఁడును, సేవింపఁదగినవారు లేనివాఁడును, భవ్యుఁడును, బ్రాహ్మణవంశుఁడును, పాత్రుఁడును, అవికారుఁడును, గంభీరుఁడును, ముముక్షువును, దక్షుఁడును, ఈశ్వర పదభక్తుఁడును, ముక్తుఁడును, గుణ-వంతుఁడును, అనంతుఁడును, వదాన్యుఁడును, మాన్యుఁడును, విద్వద్వరులలోఁగృతార్థుఁడును, నిత్యుఁడును, మునివంద్యుఁడును, అనింద్యుఁడును, ఆలోచనమునఁ బారమును ముట్టినవాఁడును - అగు కృతిభర్తను శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

విశేషములు . అలంకార మంత్యాను ప్రాసము

క పరమపరుఁ బరమ దురితే
తరు గురుఁ గరుణామృతాంబుధారావర్షో
త్కర తర్పిత భక్తాంతఃకరణోర్వరు దివ్యమునిశిఖామణి నఘఘున్ 164

అర్థము :పరమ - పరున్ = మిక్కిలి యుత్కృష్టుని, పరమ - దురిత + ఇతరున్ = గొప్ప పాపములకు వేఱయినవానిని, గురున్, కరుణా ణోర్వరున్, కరుణా = దయయనెడి, అమృత + లంబు - ధారా = అమృతజలధారలయొక్క, వర్ష = వానలయొక్క, ఉత్కర = సమూహముచేత, తర్పిత = తృప్తిపఱుపఁబడిన, భక్త = భక్తులయొక్క, అంతఃకరణ + ఉర్వరున్ = మనస్సులనెడు భూమి గలవానిని, దివ్య - ముని - శిఖామణిన్ = దివ్యులయిన మునులలోఁ దలమానికమైనవానిని, అనఘున్ = పాపరహితుని - శ్రీజంగమ మల్లికార్జునుని

తాత్పర్యము : మిక్కిలి యుత్కృష్టుఁడును, పరమ పుణ్యుఁడును, గురుఁడును, దయయనెడు అమృతధారల వర్షముచేఁ దృప్తిపఱుపఁబడిన భక్త జనమనస్సులనెడి కేదారములు గలవాఁడును, దివ్యమునులలోఁ దలమానికమయినవాఁడును, పాపరహితుఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

విశేషములు : అలంకారము రూపకము

చ అనఘుచరిత్రుఁ బాత్రు నియతాత్ము మహోత్ము ననింద్యు వంద్యు స
జ్జన హిత కాంతుఁ గాంతు మితజల్పు ననల్పుఁ గవీంద్రు రుంద్రుభూ
వినుతు నపారు ధీరుఁ గృతవేది ననాది ననంతుఁ గంతు బా
ణనికరముక్తు నుక్తు మునినాథు ననాథు వరేణ్యుఁ బుణ్యునిన్.165

అర్థము : అనఘ - చరిత్రున్ = పాపరహితమైన చరిత్రము గలవాఁడును, పాత్రున్ = తగినవాఁడును, నియత + ఆత్మున్= నియమములతోఁ గూడిన మనస్సుగలవాఁడును, మహోత్మున్ = గొప్పవాఁడును, అనింద్యున్ = నిందింపఁదగనివాఁడును, వంద్యున్ = నమస్కరింపఁదగినవాఁడును, సత్ + జన+ హిత - కాంతున్ = మంచివారి మేలు గోరువాఁడును, కాంతున్ = ఇష్టుఁడును, మిత - జల్పున్ = తక్కువగా మాటలాడువాఁడును, అనల్పున్ = అల్పుఁడు గానివాఁడును, కవి + ఇంద్రున్ = కవిశ్రేష్ఠుఁడును, రుంద్రున్ - విరివియైనవాఁడును, భూ- వినుతున్ = భూమి (జనులు) చేఁ బొగడఁబడువాఁడును, అపారున్ = ఆవలిదరి లేనివాఁడును, ధీరున్ = ధైర్యవంతుఁడును, కృత - వేదిన్ = కృతజ్ఞుఁడును,

అనాదిన్ = ఆది లేనివాఁడును, అనంతున్ = అంతములేనివాఁడును, కంతు - బాణ - నికర - ముక్తున్ = మన్మథబాణసమూహముచే విడువఁబడినవాఁడును, ఉక్తున్ = చెప్పఁబడినవాఁడును, ముని - నాథున్ = మునిపతియును, అనాథున్= నాథుఁడు (ప్రభువు) లేనివాఁడును - తా నెల్లవారికిఁ బ్రభుఁడుగాని తనకెవ్వరును బ్రభువనువాఁడు లేఁడనుట, వరేణ్యున్ = శ్రేష్ఠుఁడును, పుణ్యునిన్ = పుణ్యుఁడైనవాఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

తాత్పర్యము . పుణ్యచరిత్రుఁడును, పాత్రుఁడును, నియతాత్ముఁడును, మహాత్ముఁడును, అనింద్యుఁడును, వంద్యుఁడును, అనల్పుఁడును, కవీంద్రుఁడును, విరివియైనవాఁడును, భూజనసన్నుతుఁడును, పారము లేనివాఁడును, ధీరుఁడును, కృతజ్ఞుఁడును, అనాదియును, అనంతుఁడును, మన్మథబాణజాలముచే ముక్తుఁడును, ఉక్తుఁడును, మునిప్రభువును, అనాథుఁడును, శ్రేష్ఠుఁడును, పుణ్యాత్ముఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

విశేషములు . అలంకారము అంత్యానుప్రాసము

క మానమహార్ణవు సంతత
దాని శివజ్ఞాని రాజధరమూర్తి సుధీ
దీనజనాభీష్టద క
ల్పానోకహ సదృశు మల్లికార్జునదేవున్ **166**

అర్థము : మాన - మహత్ (మహా) + అర్ణవున్ = గౌరవమునకు సముద్రమైనవాఁడును, సంతత - దానిన్ = ఎడతెగని దానముగలవాఁడును, శివ - జ్ఞానిన్ = శివునిగూర్చిన జ్ఞానము గలవాఁడును, రాజ - ధర - మూర్తిన్ = చంద్రుని దాల్చినవాని (శివుని) మూర్తివంటి మూర్తిగలవాఁడును, సుధీ సదృశున్, సుధీ = పండితులును, దీన = దీనులును, అగు, జన = జనులయొక్క, అభీష్టద = కోరికలనిచ్చు, కల్ప + అనోకహ = కల్పవృక్షముతో, సదృశున్ = సమానుఁడైనవాఁడును, మల్లికార్జునదేవున్

తాత్పర్యము. మానమునందు మహాసముద్రుఁడును, ఎల్లప్పుడును దానము చేయువాఁడును, శివసంబంధిజ్ఞానము గలవాఁడును, శివమూర్తియు, విద్వాంసులు, దీనులునైన జనుల కోరికలను దీర్చు కల్పవృక్షముతో సమానుఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

విశేషములు : అలంకారము రూపకము, ఉపమ

లలితగతి పరమపరు లోకగురుఁ బాత్రు సుచరిత్రున్
దురితహరు దుర్జనవిదూరు సువిచారున్
వరదు శుభమూర్తి మునివర్యు జగదార్యున్
ధరణిధరధీరు గుణధాము జితకాముఁ 167

అర్థము. పరమ - పరున్ = మిక్కిలి యుత్కృష్టుఁడైనవాఁడును, లోక - గురున్ = జగద్గురుఁడును, పాత్రున్ = తగినవాఁడును, సుచరిత్రున్ = మంచిచరిత్ర గలవాఁడును, దురిత - హరున్ = పాపములను హరించువాఁడును, దుర్జన - విదూరున్ = చెడ్డవారికి మిక్కిలి దూరమైనవాఁడును, సువిచారున్ = మంచి ఆలోచనలు గలవాఁడును, వరదున్ = వరముల నిచ్చువాఁడును, శుభ - మూర్తిన్ = మంగళకరమైన ఆకారము గలవాఁడును, మునివర్యున్ = మునిశ్రేష్ఠుఁడును, జగత్ + ఆర్యున్ = జగత్పూజ్యుఁడును, ధరణిధర - ధీరున్ = పర్వతమువలె ధైర్యము గలవాఁడును, గుణ-ధామున్ = సుగుణములకు నివాసమయిన వాఁడును, జిత - కాముఁ = జయింపఁబడిన మన్మథుఁడు గలవాఁడును, అగు, శ్రీ జంగమమల్లికార్జునదేవుని

తాత్పర్యము. మిక్కిలి యత్కృష్టుఁడైనవాఁడును, జగద్గురుఁడును, పాత్రుఁడును, సుచరిత్రుఁడును, పాపహరుఁడును, దుర్జన విదూరుఁడును, సువిచారుఁడును, శుభమూర్తియును, మునిశ్రేష్ఠుఁడును, జగత్పూజ్యుఁడును, పర్వతధీరుఁడును, సుగుణధాముఁడును, కాముని జయించినవాఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

గద్యము.

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జున దేవ దివ్య శ్రీ పాద పంకజ
భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నె
చోడదేవ ప్రణీతంబైన కుమారసంభవం
బను కథయందు నవమాశ్వాసము

అర్థతాత్పర్యములు: పూర్వాశ్వాసాంత గద్య వ్యాఖ్యలకు వలెనే

మ ఇది శ్రీ జొన్నలగడ్డవంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్య దధీశోత్తము శాబ్దికార్ధ వివిధ స్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్ను విలసత్ సంజీవనీవ్యాఖ్య యౌ

కుమార సంభవము

దశమాశ్వాసము

క శ్రీ రమణీ రమణీయ త
రోరస్థలు ననఘు ననుదినోదయవిద్యా
పారగు మునిముఖముకురు ద
యారససంపూర్ణు మల్లికార్జునదేవున్ 1

అర్థము . శ్రీ స్థలున్ శ్రీ - రమణీ = లక్ష్మియను స్త్రీ చేత, రమణీయతర = మిక్కిలి సుందరమయిన, ఉరన్ + స్థలున్ = వక్షస్స్థలము గలవాఁడును, అనఘున్ = పాపరహితుఁడును, అనుదిన + ఉదయ - విద్యా - పారగున్ = ప్రతిదినము వృద్ధిపొందు విద్యయొక్క పారమును బొందినవాఁడును, ముని - ముఖ - ముకురున్ = మునులముఖములకు అద్దమైనవాఁడును, దయా - రస - సంపూర్ణున్ = దయారసముచేత సంపూర్ణుఁడైనవాఁడును, మల్లికార్జునదేవున్

తాత్పర్యము . శ్రీ దేవిచే సుందరతరమైన వక్షఃప్రదేశము గలవాఁడును - విష్ణుస్వరూపుఁడు ననుట, పాపరహితుఁడును, ప్రతిదినాభ్యుదయవిద్యయందు పారమును ముట్టినవాఁడును, మునుల ముఖములకు అద్దమైనవాఁడును, దయారసముతో నిండినవాఁడును అగు శ్రీ మల్లికార్జునదేవుని

విశేషములు . అలంకారము రూపకము

అగ్ని రతిక్రీడాపరులైయున్న పార్వతీశ్వరుల కడకు వచ్చుట

వ దహనాంబకుం దలంచి దహనుండు సంచలించుచుఁ
గైలాసపర్వతంబునకుం జనుదెంచి 2

అర్థము : దహన+ అంబకున్ = అగ్నినేత్రుని (శివుని), తలంచి, దహనుండు= అగ్ని, సంచలించుచున్ = కలఁగుచు,. కైలాసపర్వతంబునకున్, చనుదెంచి

తాత్పర్యము: శివునిఁ దలఁచి అగ్ని కలఁతచెందుచుఁ గైలాసపర్వతమునకు వచ్చి - తరువాతి పద్యముతో నన్వయము

క ఉరునేత్రవహ్ని దనికిన
నెరియుచు మార్కొనఁగఁబోలునేనియు మోఁదన్
సురనదిజలములు చల్లును
హరుఁ డని పావకుఁడు మది భయాతురుఁ డగుచున్ 3

అర్థము. ఉరు - నేత్ర - వహ్ని = గొప్పదియగు కంటి మంట, తనికినన్= తాఁకినచో, ఎరియుచున్ = మండుచు, మార్కొనఁగన్ + పోలున్ + ఏనియున్ = ఎదురుకొనఁగలిగినప్పటికిని, హరుఁడు = శివుఁడు, సుర-నది- జలములు = గంగానదినీరులు, మోఁదన్ + చల్లును = మోఁదఁజల్లి ఆర్పివేయును, అని, పావకుఁడు = అగ్ని, మదిన్ = మనస్సునందు, భయ + ఆతురుఁడు = వెఱపుచే బాధింపఁబడినవాఁడు,అగుచున్

తాత్పర్యము : 'తీక్ష్ణమైన కంటిమంట తాఁకినచో మండుచు నెదిరింపఁగలిగినప్పటికిని శివుఁడు ఆకాశగంగానదీజలములు నా మోఁద జల్లి నన్ను శాంతింపఁజేయు' నని అగ్ని భయముచే బాధనొందినవాఁడగుచు - తరువాతి వచనముతో నన్వయము

వ. పరమేశ్వరు రతిక్రీడాప్రదేశంబునకుం జనుదెంచి నిజ రూపంబుఁ జూపిన నయ్యుమామహేశ్వరులు కని లజ్జాకలిత సంచలిత హృదయులై పరిధానంబులు సవరించుచు రతి విఘ్నం బగుటకు విరూపాక్షుండు కోపించి చూచుడు. 4

అర్థము : పరమేశ్వరు - రతి - క్రీడా - ప్రదేశంబునకున్ = ఈశ్వరుని సంభోగక్రీడాస్థలమునకు, చనుదెంచి = వచ్చి, నిజ - రూపంబున్ = స్వస్వరూపమును, చూపినన్= చూపఁగా, ఆ + ఉమా - మహేశ్వరులు, కని, లజ్జా + కలిత - సంచలిత- హృదయులు + ఐ = సిగ్గుతోఁగూడిన, కలఁతఁజెందిన మనస్సులు గలవారయి, పరిధానంబులు = వస్త్రములు, సవరించుచున్ = సరిచేసికొనుచు, రతి = సంభోగము, విఘ్నంబు = చెడినది, అగుటకున్, విరూపాక్షుండు = శివుఁడు, కోపించి, చూచుడున్ = చూచినంతనే

తాత్పర్యము . పరమేశ్వరుఁడు క్రీడించుచున్న చోటికి వచ్చి యగ్ని స్వస్వరూపమును జూపఁగా, నా పార్వతీపరమేశ్వరులు చూచి సిగ్గుపడి హృదయములు

సంచలింప వస్త్రములు సరిచేసికొనుచు సంభోగక్రియ విఘ్నమగుటకు ముక్కంటి కోపించి చూచినంతనే - తరువాతి పద్యముతో నన్వయము

ఆ నుదుటి కంటి మట చదలంటి పర్వుచుఁ
గవిసి తరతరంబ కప్పికొనఁగ
బెదర కెదిరి నిల్చి పేర్చి రవిప్రభ
మాన కగ్ని మాఱు మండుచుండె 5

అర్థము నుదుటి - కంటి - మంట, చదలు + అంటి = ఆకాశమంటి, పర్వుచున్ = వ్యాపించుచు, కవిసి = ఆక్రమించి, తరతరంబ = క్రమక్రమముగా కప్పికొనఁగన్ = క్రమ్ముకొనఁగా, బెదరక = భయపడక, ఎదిరి = ఎదురుకొని, నిల్చి, రవి - ప్రభన్ = సూర్యునికాంతివంటి కాంతితో, పేర్చి = విజృంభించి, మానక = వదలక, మాఱు మండుచున్ + ఉండెన్ - దానికిఁ బ్రతిగా మండుచుండెను

తాత్పర్యము. నొసటి కంటి మంట ఆకాశమంటి వ్యాపించుచు ఆక్రమించి క్రమక్రమముగాఁ గ్రమ్ముకొనఁగా, అగ్ని భయపడక ఎదురుకొని నిలిచి సూర్యకాంతివంటి కాంతితో విజృంభించి వదలక దానికిఁ బ్రతిగా మండుచుండెను

వ అంత నీశ్వరుండు వైశ్వానరుండగుట యెఱింగి కోపావేశంబున
ననివార్యంబగు నిజవీర్యం బెత్తికొని పైఁ జల్లిన 6

అర్థము: అంతన్, ఈశ్వరుండు, వైశ్వానరుండు = అగ్ని, అగుట, ఎఱింగి, కోప + ఆవేశంబునన్ = కోపోద్రేకముతో, అనివార్యంబు = నివారింపరానిది, అగు, నిజ - వీర్యంబు = తనదైన వీర్యము, ఎత్తికొని, పైన్ = మీఁద, చల్లినన్ = చల్లఁగా

తాత్పర్యము అంత నీశ్వరుఁడు అతఁడగ్నియగుట తెలిసి క్రోధోద్రేకముతో నివారింపరాని తన వీర్యమును ఎత్తికొని మీఁదఁజల్లఁగా - తరువాతి పద్యముతో నన్వయము

చ కలుషముతోడ లోకములు గాల్చు మహాప్రళయానలంబుపైఁ
గలగొని సప్తవారిధులు కప్పినభంగి మహేశువీర్య మ
గ్గలముగ నమ్మహోదధిని గ్రక్కున ముంచిన నాఁటె నాఱుచోఁ
గొలఁదికి మీఱి, నేయి పయిఁగూర్చిన నాఱిన దీపికాకృతిన్ 7

అర్థము . కలుషముతోడన్ = కోపముతో, లోకములు, కాల్చు, మహత్ (మహా) + ప్రళయ + అనలంబుపైన్ = గొప్ప ప్రళయాగ్ని మీఁద, కలగొని = క్షోభించి, సప్త- వారిధులు = ఏడుసముద్రములు, కప్పిన - భంగిన్ = కప్పిన విధమున మహా + ఈశు - వీర్యము = పరమేశ్వరుని వీర్యము, అగ్గలముగన్ = అధికముగా, ఆ + మహత్ (మహా) + ఉదయునిన్ = ఆ మహానుభావుఁడైన అగ్నిని, గ్రక్కునన్ = శీఘ్రముగా, ముంచినన్, మిాఱి = మితిమిాఱి, నేయి, పయిన్+ కూర్చినన్ = మిాఁదఁబోయఁగా, ఆఱిన, దీపికా + ఆకృతిన్ = దివ్వెవిధమున, ఆఱెన్ = ఆఱిపోయెను

తాత్పర్యము . కోపముతో లోకములను గాల్చు మహాప్రళయాగ్నిపైఁ గలఁతనొంది యేడు సముద్రములు కప్పిన విధమునఁ బరమేశ్వరుని వీర్యము అధికముగ ఆ మహానుభావుఁడైన అగ్నిని శీఘ్రముగా ముంపఁగా, ఆఱిపోవునప్పుడు మితిమిాఱి నేయి పయిని బోయఁగా ఆఱిపోవు దీపము విధమున, ఆఱిపోయెను

విశేషములు . అలంకార ముపమ

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము 8

క శివు వీర్యము పెలుకుఱఁ బైఁ
గవిసిన నిజశిఖ లడంగి గ్రక్కున నా హ
వ్యవహుఁడు హోమానలమున
నవతారం బైనపురుషునాకృతి నొందెన్ 9

అర్థము: శివు - వీర్యము = శివుని వీర్యము, పెలుకుఱన్ = భయమగునట్లు, పైన్ = మీఁద, కవిసినన్ = ఆక్రమింపఁగా, నిజ - శిఖలు = తనవైన జ్వాలలు, అడంగి = అణఁగిపోయి, గ్రక్కునన్ = శీఘ్రముగా, ఆ - హవ్యవహుఁడు = ఆ హోమద్రవ్యమును మోయువాఁడు - అగ్ని, హోమ + అనలమునన్ = హోమాగ్నిలో, అవతారంబు + ఐన = ప్రత్యక్షమైన, పురుష + ఆకృతిన్= పురుషుని ఆకారమును, ఒందెన్

తాత్పర్యము శివుని వీర్యము భయమగునట్లు మీఁద నాక్రమింపఁగా, తన జ్వాల లడఁగి, శీఘ్రముగా నా అగ్ని హోమాగ్నిలో నవతరించుపురుషుని ఆకారము నొందెను

విశేషములు . పురుషునాకృతి - పురుషునియొక్క + ఆకృతి షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు ' బాల సంధి 34

వ ఇ ట్లనలుం డీశ్వరవీర్యాపహృతతేజస్కుండై తత్ప్రతిహతజీవుండై మూర్ఛిల్లి పడి పెద్దయుంబ్రొద్దున కెట్టకేనియుం దెప్పిటి తదీయాతిభరంబుఁ దాల్పనోపక పితామహుపాలికిం జని తద్వృత్తాంతం బెఱింగించిన వరదుండు కుమారోత్పత్తికిం బ్రసాదించెనని విధి ముదితహృదయుం డగుచు 10

అర్థము ఇట్లు, అనలుండు = అగ్ని, ఈశ్వర - వీర్య + అపహృత - తేజస్కుండు + ఐ = ఈశ్వరునియొక్క వీర్యముచే నపహరింపఁబడిన తేజస్సు గలవాఁడయి, తద్ + ప్రతిహత - జీవుండు + ఐ = దానిచేఁ గొట్టఁబడిన ప్రాణము గలవాఁడయి, మూర్ఛిల్లి - పడి, పెద్దయున్ + ప్రొద్దునకున్ = చాలసేపటికి, ఎట్టకేనియున్ = ఎట్లో, తెప్పిటి = తేఱి, తదీయ + అతి - భరంబున్ = ఆ యధికమైన బరువును, తాల్పన్ + ఓపక = మోయలేక, పితామహు - పాలికిన్ = బ్రహ్మకడకు, చని, తద్ + వృత్తాంతంబు, ఎఱింగించినన్ = తెలుపఁగా, వరదుండు = వరముల నిచ్చువాఁడు - శివుఁడు, కుమార + ఉత్పత్తికిన్ = కుమారస్వామి పుట్టుకకు, ప్రసాదించెన్ + అని = అనుగ్రహించెనని, విధి = బ్రహ్మ, ముదిత - హృదయుండు = సంతోషించిన హృదయము గలవాఁడు, అగుచున్

తాత్పర్యము : ఇట్లు అగ్ని యీశ్వరుని వీర్యముచే నపహరింపఁబడిన తేజస్సు గలవాఁడయి, దానిచేఁ గొట్టఁబడిన ప్రాణము గలవాఁడయి, సొమ్మసిలిపడి, చాల సేపటికి ఎట్లో తేఱుకొని ఆ యధికభారమును మోయలేక బ్రహ్మకడకు వెడలి ఆ వృత్తాంతముఁ దెలుప 'ఈశ్వరుఁడు కుమారస్వామి జననమున కనుగ్రహించె' నని బ్రహ్మ సంతోషించి, - తరువాతి పద్యముతో నన్వయము

క పురహరు నమోఘ వీర్యము
సురనది గొని తాల్చు నాశుశుక్షణి వడి నీ
భరమందుఁ బెట్టు మనఁ జని
హరవీర్యం బనలుఁ డా సురాపగఁ గలపెన్. 11

అర్థము : ఆశుశుక్షణి =ఓ అగ్నీ, పురహరు + అమోఘ - వీర్యమున్ = ఈశ్వరుని వ్యర్థముగాని వీర్యమును, సుర - నది = ఆకాశగంఁగ, కొని, తాల్చున్

= భరించును, వడిన్ = వేగముగా, ఈ - భరము = ఈ బరువు, అందున్ = గంగానదియందు, పెట్టుము + అనన్, చని, అనలుఁడు = అగ్ని, ఆ - హర - వీర్యంబు = ఆ శివుని వీర్యము, ఆ - సుర + ఆపగన్ = ఆ ఆకాశగంగయందు, కలపెన్

తాత్పర్యము . 'అగ్నీ ! శివుని వ్యర్థముకాని వీర్యమును ఆకాశగంగ భరించును కావున నీవు వేగముగా ఈ బరువు అందుఁ బెట్టు' మనఁగా, అగ్ని వెడలి హరుని వీర్యము నాకాశగంగయందుఁ గలిపెను

విశేషములు. ఆశుశుక్షణి 'లోహితాశ్వో వాయుసఖ శ్శిఖావా నాశుశుక్షణిః' - అమరము 'ఆ సమన్తాత్ శోషయితు మిచ్ఛ తీత్యాశుశుక్షణిః' అంతట శోషింపఁజేయ నిచ్ఛగలవాఁడు - అగ్ని

వ అంత - తరువాతి పద్యముతో నన్వయము **12**

క హరువీర్యముఁ దాల్పఁగఁ గడు
భరమై వడి నడుమ దిగ్గఁబడి కడపళ్లం
బరముదెస నిల్చి పొల్చెను
సురవాహిని బాలుఁడున్న జోలియ పోలెన్ **13**

అర్థము . హరు - వీర్యమున్ = శివుని వీర్యమును, తాల్పఁగన్, కడున్ = మిక్కిలి, భరము + ఐ = బరువయి, వడిన్ = వేగముగా, నడుమన్ = మధ్యభాగమున, డిగ్గఁబడి = పల్లమయి, కడపళ్ళు = చివరిభాగములు, అంబరము - దెసన్ = ఆకాశమువైపు, నిల్చి, సుర-వాహిని = ఆకాశగంగ, బాలుఁడు, ఉన్న, జోలియ + పోలెన్ = ఊయలవలె, పొల్చెను = ఒప్పెను

తాత్పర్యము: శివుని వీర్యమును దాల్చుటకు మిక్కిలి బరువయి వేగముగా నడిమిభాగము దిగఁబడి చివరి భాగములు ఆకాశమువైపు నిలిచి, ఆకాశగంగ బాలుఁడున్న తొట్టివలె నొప్పెను

విశేషములు . అలంకార ముపమ

వ. ఇట్లీశ్వర వీర్యం బనిమిషాపగయోని డిగ్గంబడిన నగ్గంగలగ్గ బెగ్గలించి నిజభరంబు తనపైఁ బెట్టిపోవు ననలున కడ్డంబు వచ్చి 'యిది యేమి మాయ వన్ని' తని తత్రపంచం బనలువలన నెఱింగి **14**

అర్థము ఇట్లు, ఈశ్వర వీర్యంబు, అనిమిష + ఆపగ - యోనిన్ = గంగానది యోనియందు, డిగ్గంబడినన్ = దిగఁబడఁగా, ఆ + గంగ, లగ్గన్ = అధికముగా, బెగ్గలించి = భయపడి, నిజ-భరంబున్ = స్వభారమును, తనపైన్, పెట్టి, పోవు, అనలునకున్ = అగ్నికి, అడ్డంబు - వచ్చి, ఇది, ఏమి, మాయ, పన్నితి (వి) + అని, తద్ + ప్రపంచంబు = ఆ వృత్తాంతము, అనలువలనన్ = అగ్నివలన, ఎఱింగి

తాత్పర్యము . ఇట్లు ఈశ్వరుని వీర్యము గంగానదియోనియందు, దిగఁబడఁగా, ఆ గంగ మిక్కిలి భయపడి, స్వభారమును దనపైఁ బెట్టిపోవుచున్న అగ్ని కడ్డము వచ్చి, 'ఇది యేమి మాయ పన్నితి ?' వని ఆ వృత్తాంత మగ్నివలన నెఱిఁగి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. పోవు ననలునకున్ - పోవు + అనలు నకున్ 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు' బాల సంధి 33 అనలు వలనన్ - గ్రహణార్థమునఁ బంచమి బాల కారక 9

ఉ **'నీ వఖిలామరేంద్రమహనీయుఁడ వోపనిదానిఁ దాల్పఁగా**
నా వశమయ్య భూరిభువనత్రయ దుర్వహభార మమ్మహా
దేవు నవార్యవీర్యమని దివ్యతరంగిణి తెచ్చి క్రమ్మఱం
బావకు మ్రోల నిల్పెఁ గని ప్రాణము ఝల్లని తల్లడిల్లఁగాన్. 15

అర్థము . అఖిల + అమర + ఇంద్ర - మహనీయుఁడవు = ఎల్ల దేవతాశ్రేష్ఠులలో ఘనుఁడవు, (అగు), నీవు ఓపనిదానిన్ = మోయలేని దానిని, తాల్పఁగాన్, నా - వశమయ్య ? = నా తరమా ? ఆ + మహాదేవు + అవార్య - వీర్యము = ఆ మహాదేవుని వారింపరాని వీర్యము, భూరి - భువన - త్రయ - దుర్వహ - భారము = ముల్లోకములకు మోయరాని పెద్దబరువు, అని, దివ్య - తరంగిణి = గంగానది, తెచ్చి, క్రమ్మఱన్ = మరల, కని = చూచి, ప్రాణము, ఝల్లు + అని, తల్లడిల్లఁగాన్ కలఁతఁజెందఁగా, పావకు - మ్రోలన్ = అగ్ని యెదుట, నిల్పెన్

తాత్పర్యము. దేవతాశ్రేష్ఠులందఱిలో ఘనుఁడవైన నీవు మోయలేనిదానిని దాల్ప నా తరమా ? ఆ మహాదేవుని వీర్యము ముల్లోకములకును దుర్వహము ' అని గంగానది అగ్ని ప్రాణము ఝల్లుమని కలఁతఁజెంద దానిని మరల నతని మ్రోలఁ బెట్టెను

వ అంత నద్దివ్యవీర్యంబు 16

అర్థము. అంత నా గొప్ప వీర్యము - తరువాతి పద్యముతో నన్వయము

క పఱతెంచి మగుడఁ బెట్టిన
నటిముటి వలిగ్రాము వట్టిన ట్లనలుఁడు మై
మఱచి పడియున్న సఖుఁ దె
ప్పఱ నొయ్యన వీచె నపుడు పవనుఁడు నెమ్మిన్. 17

అర్థము. పఱతెంచి = వచ్చి, మగుడన్ = మరల, పెట్టినన్ = పెట్టఁగా, అనలుఁడు = అగ్ని, అటిముటిన్ = సంభ్రమముతో, వలి - గ్రాము + పట్టిన + అట్లు = చలిగ్రహము సోఁకినట్లు, మైన్ + మఱచి = ఒడలు మఱచి, పడి + ఉన్న= పడియుండఁగా, సఖున్ = మిత్రుని, తెప్పఱన్ = తేఱునట్లు, పవనుఁడు = వాయువు, అపుడు , నెమ్మిన్ = ప్రీతితో, ఒయ్యనన్ = మెల్లఁగా, వీచెన్

తాత్పర్యము : వచ్చి మరలఁ బెట్టఁగా నగ్ని కలఁగి చలిగ్రహము సోఁకిన విధమున నొడలు మఱచి పడియుండఁగా నపుడు వాయువు మిత్రుఁడు తేఱుకొనునట్లు ప్రీతితో మెల్లఁగా వీచెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

శివుని వీర్యముం దాల్చిన యగ్ని శరవణసరసి కరుగుట.

వ ఇ ట్లెట్టకేనియు సచేతనుండై మగుడం బరమేష్ఠి పాలికిం జనుదెంచి తద్వృత్తాంతం బెఱింగించి వీర్యభరంబున నిశ్చేష్టితుండై యున్నదహనుంగని విరించి కరుణించి తన్నుం జొచ్చిన సకలపదార్థంబుల నశ్రమంబున ధరియించునట్టిశక్తి వరంబునం బడసె శరవణం బందుల కరుగు' మనిన మహాప్రసాదం బని ధూమధ్వజుండు శరవణసరసి కరుదెంచె. నది యనిమిషాస్పదం బగుట నమృతాన్వితం బగుచు ఖరదండసహితంబగుటం గముదాన్వితం బగుచు సద్విజావాసం బగుటం గుశాన్వితంబగుచు హంసాశ్రయం బగుటం గూర్మాసనాన్వితం బగుచు

అర్థము. ఇట్లు, ఎట్టకేనియున్ = ఎట్లో, సచేతనుండు + ఐ = స్పృహ వచ్చినవాఁడయి, మగుడన్ = మరల, పరమేష్ఠి - పాలికిన్ = బ్రహ్మకడకు, చనుదెంచి = వచ్చి , తద్ + వృత్తాంతంబు = ఆ వృత్తాంతము, ఎఱింగించి =

తెలిపి, వీర్య - భరంబునన్ = వీర్యము బరువుచే, నిశ్శేష్టితుండు + ఐ = చేష్టలు దక్కి, ఉన్న, దహనున్ = అగ్నిని, కని, విరించి = బ్రహ్మ, కరుణించి = దయదలఁచి, శరవణంబు = తెల్లువనము, తన్నున్, చొచ్చిన = ప్రవేశించిన, సకల - పదార్థములన్= ఎల్లవస్తువులను, అశ్రమంబునన్ = శ్రమములేకుండ, ధరియించు + అట్టి = తాల్చునట్టి, శక్తి, వరంబునన్ = వరముచే, పడసెన్, పొందెను, అందులకున్ = అక్కడకు, అరుగుము = పొమ్ము, అనినన్, మహాప్రసాదంబు + అని, ధూమధ్వజుండు= పొగ కేతనముగాఁ గలవాఁడు - అగ్ని, శరవణ - సరసికిన్ = తెల్లువనముగల సరస్సునకు, అరుదెంచెన్ = వచ్చెను, అది, అనిమిష + ఆస్పదంబు + అగుటన్ = చేఁపలకు (నిమిషము = తెప్పపాటు లేనివానికి) చోటు అగుటచే, దేవతలకు ఆవాసమగుటచే అని అర్థాంతరము, అమృత + అన్వితంబు= నీటితోఁగూడినది, అమృతముతోఁగూడినది - అని అర్థాంతరము, అగుచున్, ఖర-దండ - సహితంబు = పరుసని కామ గలవి, పద్మములతోఁగూడినది, క్రూరదండనముతోఁ గూడినదని అర్థాంతరము, అగుటన్, కుముద + అన్వితంబు= కలువలతోఁ గూడినది, కుముద + అన్వితంబు = సంతోషహీనులతోఁ గూడినదియని యర్థాంతరము, సత్ + ద్విజ + ఆవాసంబు = మంచి పక్షులకుఁ జోటయినది, - సద్బ్రాహ్మణులకుఁ జోటయినది, అని అర్థాంతరము, అగుటన్, కుశ + అన్వితంబు = జలముతోఁగూడినది - దర్భలతోఁ గూడినది అని అర్థాంతరము, అగుచున్, హంస + ఆశ్రయంబు = అంచల కాశ్రయ మయినది -యోగుల కాశ్రయమయినదని అర్థాంతరము, అగుటన్, కూర్మ + అసన + అన్వితంబు= తాఁబేళ్ళు, వేఁగిసపూలు అనువానితోఁ గూడినది, కూర్మాసనము అను ఆసనభేదముతోఁ గూడినది యని అర్థాంతరము, అగుచున్,

తాత్పర్యము. ఇట్లు ఎట్లో స్పృహ వచ్చినవాఁడయి మరల బ్రహ్మ కడకు వచ్చి ఆ వృత్తాంత మెఱిఁగించి, వీర్యము బరువుచేఁ జేష్టలుడిగియున్న అగ్నిని జూచి బ్రహ్మదయఁబూని శరవణము తన్నుఁజొచ్చిన యెల్ల పదార్థములను అనాయాసముగా ధరించు శక్తిని వరముచేఁ బొందెను 'నీ వచ్చటి కరుగు'మన 'మహాప్రసాద' మని అగ్ని శరవణసరసికి వచ్చెను అది అనిమిషములకు (చేఁపలకు) ఆవాసమగుటచే అమృతముతోఁ (జలముతో) గూడినది యగుచు,, అనిమిషులకు (దేవతలకు) ఆవాసమగుటచే అమృతముతోఁ గూడినది యగుచు, ఖర దండ సహితము (కఱకు కాఁడగలవి = పద్మములు - వానితోఁగూడినది) అగుటచే కుముదములతోఁ (తెల్లకలువలతోఁ) గూడినది యగుచు, ఖర - దండ (క్రూర దండనము)తోఁ గూడినది అనుటచే కుముద + అన్వితము = సంతోషహీనులతోఁ

గూడినది, అగుచు, అంచలకు ఆశ్రయమైనది అగుటచే (కూర్మ + అసన+ అన్వితంబు) కూర్మములు, అసన పుష్పములు అను వానితోఁగూడినది అగుచు, హంస + ఆశ్రయంబు = యోగులకు ఆశ్రయము అగుటచే, కూర్మ + ఆసన + అన్వితంబు = కూర్మాసనముతోఁ గూడినది అగుచు తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు · అలంకారము శ్లేషము

క కమలాభిశోభితము హరి
రమణీయము విద్రుమాభిరామము శుకర
మ్యమునై గగనాబ్ధులతో
సమమై వనమధ్యజలజషండం బొప్పెన్ 19

అర్థము వన - మధ్య - జలజ - షండంబు = నీటి నడిమి తామరల సమూహము, (ఇది గగనాబ్ధులతో సమమయినది అనుచున్నాఁడు గావున దీనిని ఒక్కొక్క విశేషణమునకు గగనపరముగను, అబ్ధిపరముగను అర్థద్వయము చెప్పవలయును కమల + అభిశోభితము = సారసపక్షులచేఁ బ్రకాశించునది - గగనపరము, కమలా + అభిశోభితము = లక్ష్మితోఁ బ్రకాశించునది - అబ్ధిపరము, హరి - రమణీయము = సూర్యచంద్రులతో మనోహరమయినది - (గగనపరము) విష్ణువుచే సుందరమయినది - (అబ్ధి పరము), వి-ద్రుమ + అభిరామము = చెట్ల అభావముచే సుందరము అయినది - (గగనపరము), పగడపుఁజెట్లచే మనోహరమయినది - (అబ్ధిపరము), శుక - రమ్యమున్ = చిలుకలచే రమణీయమయినదియు - (గగనపరము) దిరిసెనపుఁజెట్టుచే రమ్యమయినదియు, (అబ్ధిపరము), అయి, గగన + అబ్ధులతోన్, = ఆకాశము, సముద్రము అనువానితో, సమము + ఐ = సమానమయి, ఒప్పెన్

తాత్పర్యము . ఆ శరవణసరసి నడిమి పద్మములసమూహము గగనాబ్ధులతో సమానమయి యొప్పెను ఎట్లన - కమలములచే = సారసపక్షులచేఁ బ్రకాశించి గగనముతోను, కమలా = లక్ష్మిచేఁ బ్రకాశించి అబ్ధితోను సమానమయినది హరిచే - సూర్యుఁడు, చంద్రుఁడు అనువారిచే రమణీయమై గగనముతోను, విష్ణువుచే రమణీయమై అబ్ధితోను సమానమయినది విద్రుమమగుటచే = విగతద్రుమమగుటచే అభిరామమయి గగనముతోను, పగడపుఁజెట్లచే అభిరామమయి అబ్ధితోను సమానమయినది శుకములచే (చిలుకలచే

రమ్యమయి గగనముతోను, శుకములచే (దిరిసెనపుఁజెట్లచే) రమ్యమయి అబ్ధితోను సమానమయినది

విశేషములు అలంకారము శ్లేషము

క **వారక కలహంసావలి**
బోరన నక్కొలని కెఱఁగి పాలు పమరె మహాం
భోరాశి కెలమి నెఱఁగెడు
శారదనీరదసమూహి చాడ్పునఁ బోలెన్ 20

అర్థము వారక = తప్పక, కలహంస + ఆవలి = రాయంచలవరుస, బోరనన్ = శీఘ్రముగా, ఆ + కొలనికిన్ = ఆ శరవణ సరస్సునకు, ఎఱఁగి - = వ్రాలి, మహత్ (మహా) అంభస్ (ః) + రాశికిన్ = మహాసముద్రమునకు, ఎలమిన్ = ప్రీతితో, ఎఱఁగెడు = దిగునట్టి, శారద = శరత్సంబంధమయిన, నీరద = మేఘములయొక్క, సమూహి - చాడ్పునన్ + పోలెన్ = గుంపువలె, పాలు పమరెన్ (పాలుపు + అమరెన్) = ఒప్పారెను

తాత్పర్యము . రాజహంసముల సమూహము తప్పక శీఘ్రముగా ఆ శరవణసరస్సునకు వ్రాలి, మహాసముద్రమునకుఁ బ్రీతితో దిగునట్టి శరత్కాల మేఘముల సమూహమువలె నొప్పారెను

విశేషములు. అలంకార ముపమ కలహంసములు తెలుపు, అందుచేతనే 'శారద' అని నీరదములకు విశేషణము శరత్కాల మేఘములు తెలుపు

క **బిట్టెగసి మీఁదఁ గెలఁకులఁ**
జుట్టి సితచ్ఛదసమూహి సుడియుట కడుఁ గ
న్పట్టు సరోవరలక్ష్మికిఁ
గట్టిన వెంబట్టు మేలుకట్టుంబోలెన్ 21

అర్థము: సితచ్ఛద (సిత + ఛద) - సమూహి = తెల్లని రెక్కలుగలవాని (హంసములయొక్కగుంపు మీఁదన్ = పైని, బిట్టు = వేగముగా, ఎగసి = ఎగిరి, కెలఁకులన్ = పార్శ్వములందు, చుట్టి, సుడియుట = తిరుగుట, సరోవర - లక్ష్మికిన్= సరసియనెడు లక్ష్మికి, కట్టిన, వెంబట్టు (వెల్ల+పట్టు) = తెల్లపట్టు, మేలుకట్టున్ + పోలెన్ = చాందిని వలె, కడున్ = మిక్కిలి, కన్పట్టున్ = చూపట్టును

తాత్పర్యము . రాయంచల సమూహము పైని వేగముగా నెగిరి, పార్శ్వములందుఁ జుట్టి తిరుగుట, సరసియనెడు లక్ష్మికిఁ గట్టిన తెల్లపట్టు చాందినియో యనఁ జూపట్టును

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష కెలఁకులన్ (కెలను + లన్) 'కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల ఆచ్చిక 18 కెలను + కుఱ్ + లన్, 'జిత్తు బిందు పూర్వంబగు' బాల తత్సమ 19 కెలఁకులన్ వెంబట్టు - వెల్ల + పట్టు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమోఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు' బాల సంధి 36 వె + పట్టు 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు' బాల సంధి 37 వె + ను + పట్టు ద్రుతకార్యము బాల సంధి 16,17 వెంబట్టు సితచ్ఛద - సిత + ఛద - హ్రస్వమునకుఁ బరమైన ఛకారమునకు ద్విత్వము

తరువోజ (తరువద)

జలనిధి దమకెల్లఁజాలదు త్రావం
జాలిన నదియేల చవిగాని లవణ
జలమని మెచ్చక సంవర్తకాది
జలదముల్ ప్రీతి నజ్జలజాకరంబు
జలము లక్షయములు చని సుధారసము
చవియని మెచ్చి నిచ్చలు నీరి కేఁగు
పాలుపున నెప్పుడుఁ బురి మదహస్తి
పులు సొచ్చుచుండు నాపోవక కొలన 22

అర్థము. సంవర్తక + ఆది + జలదముల్ = సంవర్తకములు మున్నగు మేఘములు, జలనిధి = సముద్రము, తమకున్ + ఎల్లన్ = తమకంతకును, త్రావన్ = త్రాగుటకు, చాలదు = సరిపోదు, చాలినన్ = ఒకవేళ చాలినప్పటికిని, చవి + కాని = రుచి కాని, లవణ జలము = ఉప్పునీరు, అది, ఏల, అని మెచ్చక, ప్రీతిన్ = సంతోషముతో, ఆ + జలజ + ఆకరంబు - జలములు = ఆ తామరకొలని నీరులు, అక్షయములు = క్షీణింపనివి, చని, సుధారసము - చవి అమృతపు రుచి, అని, మెచ్చి, నిచ్చలున్ = ఎల్లప్పుడును పురిన్ = పురమునందు, మద -హస్తిపులు = మత్తగజరాజములు, ఆపోవక = తృప్తినొందక, కొలనన్ = కొలనియందు, చొచ్చుచున్ + ఉండున్= ప్రవేశించుచుండును

తాత్పర్యము. సంవర్తకములు మున్నగు మేఘములు 'సముద్రము తమకంతకును ద్రావుటకు సరిపోవదు - ఒక వేళ సరిపోయినను రుచింపని ఉప్పునీరు అది యెందుల ? కని మెచ్చక, ప్రీతితో, 'ఆ శరవణ సరస్సు జలములు

అక్షయములు' అని వెడలి అందలి నీరు అమృతపు రుచి గలది యని మెచ్చి, యెల్లప్పుడును నీటికై వెడలు విధమున నెప్పుడును మదగజరాజములు తనివిసనక కొలనియందుఁ జొచ్చుచుండును

విశేషములు. అలంకార ముపమ

తరువోజ తరువద - నాలుగుపాదము లుండును ప్రతిపాదమునను మూఁడింద్రగణములు, ఒక సూర్యగణము ఉండును మొదటి గణము మొదటి యక్షరమునకు, మూఁడవ గణము మొదటి యక్షరమునకు, అయిదవ గణము మొదటి యక్షరమునకు, ఏడవ గణము మొదటి యక్షరమునకు యతిమైత్రి ప్రాసనియమము గలదు

క భంగిగఁ దనపైఁ దేరు మ
తంగజ కర శీకరముల దానజలములన్
గంగాయమునా తత జల
సంగమదేశంబు వోలె శరవణ మొప్పెన్ 23

అర్థము. భంగిగన్ = తీరుగా - అందముగా, తనపైన్ = తనమీఁద, తేరు= కలుగునట్టి, మతంగజ - కర - శీకరములన్ = ఏనుఁగులయొక్క తొండముల తుంపరలచేతను, దాన - జలములన్ = మదజలములచేతను, శరవణము, గంగా - యమునా - తత - జలసంగమ - దేశంబు + పోలెన్ = గంగా యమునా నదుల విరివియైన జలముల కూటమి స్థలమువలె, ఒప్పెన్

తాత్పర్యము. తనపైఁ గలుగు మదగజముల తొండముల తుంపరల చేతను, మదజలములచేతను, శరవణము గంగాయమునానదుల సంగమ ప్రదేశమువలె నొప్పెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష గంగానదీ జలములు తెలుపు మతంగజ కరశీకరములును దెలుపు యమునానదీజలములు నలుపు దానజలములును నలుపు

సీ. ఖచరాంగనల కుచ కాశ్మీర పంకంబు
వనజ పరాగంబు నొనరి తనర
సురకన్యకల కచ సురదారు కుసుమముల్
రమణీయ హేమాంబుజములుఁ బెనఁగ

నపరకామినుల ముఖ పరిమళశ్వాసంబు
మెలుపారు కొలనితెమ్మెరలు నెనయ
నహిసుందరుల కంరహారముల్ కరయంత్ర
గళితాంబుధారలుఁ గలసి వెలుఁగఁ

తే తమ విలాసముల్ జలదేవతా విలాస
భాతితోఁ గూడి పరభాగపదవిఁ గ్రాల
నర్థి జలకేళి సలుపుదు రఖిల భువన
వర నితంబిను లా సరోవరములందు 24

అర్థము . ఖచర + అంగనల = గగనచరలైన స్త్రీలయొక్క, కుచ = స్తనములయందలి, కాశ్మీర - పంకంబున్ = కుంకుమపు బురదయును, వనజ - పరాగంబున్ = పద్మముల పుప్పొడియును, ఒనరి = కూడి, తనరన్ = ఒప్పఁగా,

సుర - కన్యకల = దేవతా స్త్రీలయొక్క కచ = శిరోజములయందలి, సురదారు - కుసుమముల్ = దేవదారు పుష్పములును, రమణీయ = సుందరములయిన, హేమ + అంబుజములున్ = బంగారుఁదామరలును, పెనఁగన్ = కూడఁగను,

నర - కామినుల= మానవస్త్రీలయొక్క, ముఖ - పరిమళ - శ్వాసంబు= ముఖమునందలి సువాసనగల ఊర్పును, మెలుపారు = సుందరములయిన, కొలని - తెమ్మెరలున్ = సరోవర వాయువును, ఎనయన్ = కూడఁగా,

అహి - సుందరుల = నాగ సుందరాంగుల, కంర - హారముల్ = కంరములందలి ముత్యాలపేరులును, కర -యంత్ర - గళిత + అంబుధారలున్ = చేతి యంత్రములనుండి జాఱిన జలధారలును, కలసి = కూడి, వెలుఁగన్ = ప్రకాశింపఁగను,

అఖిల - భువన - వర - నితంబినులు = ఎల్లలోకములందలి శ్రేష్ఠురాండ్రయిన స్త్రీలు, తమ- విలాస - భాతితోన్ = జలదేవతల సౌందర్యపుఁగాంతితో, కూడి,పరభాగ -పదవిన్ = అతిశయమైనమార్గమున, క్రాలన్ = ప్రకాశింపఁగా, అర్థిన్ = కోరికతో, ఆ - సరోవరము నందున్ = ఆ సరస్సునందు, జల - కేళి + చలుపుదురు= జలక్రీడలాడుదురు

తాత్పర్యము. గగనచరస్త్రీల స్తనములందలి కుంకుమ పంకమును పద్మ పరాగమును గూడి యొప్పఁగా, దేవతాస్త్రీల శిరోజములందలి దేవదారు పుష్పములును, సుందరములయిన బంగారుఁదామరులును గూడఁగా, మానవాంగనల ముఖ పరిమళ శ్వాసమును అందమయిన సరోవరవాయువులును గూడఁగా, నాగ సుందరాంగుల కంఠములందలి ముత్యాల పేరులును జేతియంత్రముల నుండి చిమ్మఁబడిన జలధారలును గలిసి వెలుఁగఁగా ఇట్లు ఎల్ల భువనములందలి స్త్రీలును దమ సౌందర్యములు జలదేవతసౌందర్యముతోఁ గూడి యతిశయించి ప్రకాశింపఁగా నా కొలనియందుఁ గోరికతో జలక్రీడలాడుదురు

విశేషములు. స్వర్గమర్త్యపాతాళములందలి స్త్రీలు చెప్పఁబడిరి కావుననే 'అఖిల భువన వరనితంబినులనుట ఉపమాధ్వని ఖచరాంగనల కుచకాశ్మీరపంకము వనపరాగమువలె నున్నదని ధ్వని ఇట్లు నాలుగు పాదములందును గ్రహింపవలయును

మహాప్రగ్ధర అరుణాంభోజాతవర్గం బతిలసితవిభాసాబ్జరాగాలి, నీలాం బురుహవ్రాతంబు నీలంబులు, విమలనవాంభోజముల్ శంఖముల్, శీ కరముల్ ముక్తాఫలానీకములుగఁ దగ విఖ్యాతమై భూరిరత్నా కరమో నా నొప్పు నబ్జాకర మధికజలౌఘప్రపూర్ణాభివృద్ధిన్ 25

అర్థము అరుణ + అంభోజాత -వర్గంబు = ఎఱ్ఱతామరల సమూహము, అతి - లసిత - విభాస + అబ్జరాగ + ఆలి = మిక్కిలి ప్రకాశించిన కాంతితోడి పద్మరాగమణుల వరుసయును, నీల + అంబురుహ - వ్రాతంబు = నల్లని పద్మముల సమూహము, నీలంబులు = నీలమణులు, విమల - నవ + అంభోజముల్ = తెల్లని క్రొత్తతామరలు, శంఖముల్, శీకరముల్ = నీటిబిందువులు, ముక్తా ఫల + అనీకములు = ముత్యాల సమూహములు, కన్ = అగునట్లు, తగన్ = ఒప్పఁగా, విఖ్యాతము + ఐ = ప్రసిద్ధమయి అబ్జాకరము = తామరకొలను, అధిక - జల + ఓఘ - ప్రపూర్ణ + అభివృద్ధిన్ = ఎక్కువనీటిప్రవాహములచే మిక్కిలి నిండిన అభివృద్ధిచేత, భూరి + రత్నాకరమో = గొప్ప సముద్రమో (రత్నములకు ఆకరమో) నాన్ = అనఁగా, ఒప్పున్

తాత్పర్యము. ఎఱ్ఱని పద్మముల సమూహము మిక్కిలి ప్రకాశించు పద్మరాగములును, నల్లని పద్మములు నీలమణులును, తెల్లని పద్మములు శంఖములును, నీటి బిందువులు ముత్యాలును అగునట్లు ఒప్పఁగాఁ బ్రసిద్ధిఁ జెంది తామరకొలను అధికమైన జలసమృద్ధిచే మహారత్నాకరమో యన నొప్పును

విశేషములు. అలంకారము కావ్యలింగము, ఉత్ప్రేక్ష సముద్రమునకు రత్నాకర శబ్దమును సాభిప్రాయముగాఁ బ్రయోగించుటచే పరికరాంకురమును మహాస్రగ్ధరాలక్షణమునకు పూర్వవ్యాఖ్య నరయునది 1-68, 1-115

క. ఎలమెడు జలజాతంబులు
మెలరారెడు జలచరములు మేలిల్లెడు ని
క్కొల నుండ నెందుఁ బోయెనొ
జల మను నాశంకఁ జేయు జల మమలరుచిన్ 26

అర్థము. ఎలమెడు = చూపట్టు, జలజాతంబులున్ = పద్మములును, మెలరారెడు = త్రుళ్లు, జలచరములున్ = నీట సంచరించు చేపలు మున్నగునవియు, మేలిల్లెడు = శ్రేష్ఠమగు, ఈ + కొలను = ఈ సరస్సు, ఉండన్ = ఉండఁగా, జలము = నీరు, అమల - రుచిన్ = స్వచ్ఛమైన కాంతితో, జలము = నీరు, ఎందున్ + పొయెనొ = ఎచ్చటికిఁ బొయెనో, అను, ఆశంకన్ = సందేహమును, చేయున్ = కలిగించును

తాత్పర్యము. ఇందు జలము అతి నిర్మలమైయుండి ఉన్నట్లు కనుపట్టక, పద్మములును, త్రుళ్ళెడి జలచరములును, శ్రేష్ఠమైన ఈ కొలనును ఉండఁగా జల మెచ్చటికిఁబోయెనో యను సందియమును గలిగించును

విశేషములు ఆ కొలనియందు జలము లేదేమో అనిపించునంత నిర్మలముగా నుండె ననుట అలంకార ముత్ప్రేక్ష

చ జలనిధు లేడు నీక్జొలని జా లవుఁ గా వది యేటి మాట యీ
జల మగునేని మున్ జవియుఁ జాయయు వానికి నేల వేఱుగా
వలసె నెఱుంగరే నెలవు వన్నువనీ, రని వాదుసేయుపే
రుల వనఁ బెల్లునం జెలఁగుచుండు మదాళివిహంగసంఘముల్ 27

అర్థము. జలనిధులు + ఏడున్ = సముద్రము లేడును, ఈ - కొలని - జాలు = ఈ సరస్సు ప్రవాహము, అవున్ = అగును, కావు, అది, ఏటి మాట = ఏమిమాట, ఈ - జలము + అగున్ + ఏనిన్ = సప్తసముద్రములందలి జలము ఈ సరస్సునందలి జలము అగుచో, మున్ = ముందు, చవియున్ = రుచియును, చాయయున్ = రంగును, వానికిన్ = ఆ సముద్రజలములకు, ఏల = ఎందులకు, వేఱు + కావలసెన్ = భిన్నము కావలసివచ్చెను ? నెలవు = స్థానము, వన్నువ -

నీరు = రంగు నీరు, ఎఱుంగరే = తెలియరా ?, అని, వాదు + చేయు = వాదములాడు, పేరు + ఉలివ = పెద్దధ్వని, అనన్, మద + అళి - విహంగమ - సంఘముల్ = మదించిన తుమ్మెదల పక్షుల గుంపులు, పెల్లునన్ = అధికముగా, చెలఁగుచున్ + ఉండున్ = రొదచేయుచుండును

తాత్పర్యము 'ఏడు సముద్రముల జలములును ఈ కొలని ప్రవాహ మగును - గావు అనునది యేమి మాట ? అవి యిందలి జలమే యగుచో, వానికి రుచియు, వర్ణము నెందులకు భిన్నము గావలసివచ్చెను? (సముద్రజలము లుప్పగను, నీలముగను ఉండును ఈ కొలని జలములు మధురములుగను, వర్ణరహితముగను నుండును అవియే యివి యనుచో వానికిఁ బరస్పర మిట్టి భేదమేలయుండును?) జలముల స్థానమును, వర్ణము నెఱుఁగరా ?' యని వాదములాడునప్పటి పెద్దధ్వనియా యన మదించిన తుమ్మెదలయుఁ, బక్షులయు గుంపులు అందు రొదచేయుచుండును

విశేషములు . అలంకారము ఉత్ప్రేక్ష సందేహానుప్రాణితము

వ అని వర్ణింపందగిన వర్ణనలకుంజాలి మేలిల్లుచు 28

అర్థము . అని, వర్ణింపన్ + తగిన, వర్ణనలకున్, చాలి = సరిపడి, మేలిల్లుచున్ = శ్రేష్ఠమగుచు

తాత్పర్యము . అని వర్ణింపఁదగిన వర్ణనలకు సరిపడి బాగుగా నొప్పుచు- తరువాతి పద్యముతో నన్వయము

సీ లోలాంబుజాలముల్ నీలాలకములుగా
బాలమృణాలముల్ కేలు గాఁగ
దళితాంబుజాతంబు తెలిమోముగా నుత్ప
లములు విశాలనేత్రములు గాఁగ
జక్కవ కవ నిండు చనుఁగవ గాఁ బులి
నస్దల మురుజఘనంబు గాఁగ
మొలచు లేఁదరఁగలు ముత్తరంగలు గాఁగ
శోభిల్లు సుడి నిమ్ననాభి గాఁగ

తే నబ్జవనలక్ష్మి శంభువీర్యమునఁ గొడుకుఁ
బడసి దివిజుల కీఁబూని పావకునకు
నొలసి తనరూపు చూపున ట్లొప్పుదోఁచె
శ్రీకరంబగు నా కమలాకరంబు 29

అర్థము. శ్రీకరంబు = శోభాకరము, అగు, ఆ - కమల + ఆకరంబు = ఆ తామర కొలను,

లోల + అంబు - జాలములో = చంచలములయిన నీటి సమూహములు, నీల + అలకములు + కాన్ = నల్లని శిరోజములు కాఁగా, బాల - మృణాలములో= లేఁదామరతూండ్లు, కేలు = చేతులు, కాఁగన్

దళిత + అంబుజాతంబు = వికసించిన తామర, తెలి - మోము + కాన్= నిర్మలమైన ముఖము కాఁగా, ఉత్పలములు = కలువలు, విశాల - నేత్రములు = పెద్దకన్నులు, కాఁగన్,

జక్కవ - కవ = చక్రవాకముల జంట, నిండు - చనుఁగవ + కాన్ = నిండైన స్తనముల జంట కాఁగా, పులిన - స్థలము = ఇసుక తిన్నె, ఉరు - జఘనంబు = పెద్ద కటిప్రదేశము, కాఁగన్,

మొలచు - లేఁదరఁగలు (లేఁత + తరఁగలు) = పుట్టు లేఁత అలలు, ముత్తరంగలు (మూఁడు + తరంగలు), పొట్టమీఁది మూడు ముడుతలు (త్రివళులు) కాఁగన్, శోభిల్లు = ప్రకాశించు, సుడి, నిమ్న - నాభి = లోఁతయిన నాభి, కాఁగన్ అబ్జ - వన - లక్ష్మి = తామరతోఁపు అనెడు లక్ష్మి, శంభు - వీర్యమునన్ = శివుని వీర్యముచే, కొడుకున్, పడసి = పొంది, దివిజులకున్ = దేవతలకు, ఈన్ + పూని = ఇచ్చుటకుఁబూని, పావకునకున్ = అగ్నికి, ఒలసి = సమీపించి, తన - రూపున్ = తన రూపమును, చూపు + అట్లు + ఒప్పు + తోఁచెన్ = చూపునట్లు ఒప్పెను

తాత్పర్యము: శోభాకరమగు ఆ పద్మాకరము చంచలములయిన నీరుల సమూహములు నల్లని కురులుగను, లేఁదూండ్లు చేతులుగను, వికసితపద్మము నిర్మలమయిన ముఖముగను, కలువలు విశాలనయనములుగను, చక్రవాకద్వయము నిండుస్తనద్వయముగను, ఇసుకతిన్నె గొప్ప కటిస్థలముగను,

లేయలలు త్రివళులుగను, నుడి లోఁతయిన నాభిగను గాఁగా, అబ్జవనమనెడు లక్ష్మి శివుని వీర్యమునఁ గొడుకును బడసి దేవతల కొసఁగఁబూని అగ్నికిఁ దన రూపమును జూపుచున్నదా యన నొప్పెను

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష లేఁదరఁగలు = లేఁత + తరఁగలు ప్రాఁలాది సంధి - బాల సంధి 36, నుగాగమము - బాల సంధి 37 ద్రుతకార్యము - బాల సంధి 16,17 ముత్తరంగలు - మూఁడు + తరంగలు, 'సమానాధికరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడు శబ్దము డువర్ణంబునకు లోపంబును మూఁదిహల్లునకు ద్విత్వంబు నగు ' బాల సమాస 17 మూ + త్తరంగలు - 'ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్చికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు ' బాల సమాస 13 ముత్తరంగలు

క్రౌంచపదము చంచుల నాస్వాదించుచు లేఁదూం
డ్లకరువు ప్రియులకు నలఁదుచు మై రో
మాంచము లోలిం గంచుకితంబై
పొడమఁగ నడరుచుఁ బులినములం గ్రీ
డించుచు సంభాషించుచుఁ బ్రీతిం
బొలుచుచుఁ జెలఁగుచుఁ బొలయు సముద్య
త్క్రౌంచగతుల్ వీక్షించుచు భాస్వ
జ్జ్వలనుఁడు శరవణసరసికి వచ్చెన్ 30

అర్థము . చంచులన్ = ముక్కులతో, లేఁదూండ్లు (లేఁత + తూఁడు + లు) ఆస్వాదించుచున్ = తినుచు, అకరువు = కేసరము(లు), ప్రియులకున్ = తమ ప్రియురాండ్రకు, అలఁదుచున్ = పూయుచు, మైన్ = శరీరమున, రోమాంచములు = గగుర్పాటులు, ఓలిన్ = బాగుగా, కంచుకితంబు + ఐ = అవికెగా - కవచముగా నయి, పొడమఁగన్ = పుట్టఁగా, అడరుచున్ = విజృంభించుచు, పులినములన్ = ఇసుకతిన్నెలందు, క్రీడించుచున్ = ఆడుచు, సంభాషించుచున్ = మాటలాడుచు, ప్రీతిన్ = సంతోషముతో, పొలుచుచున్ = ఒప్పుచు, చెలఁగుచున్ = ధ్వనిచేయుచు, పొలయు = తిరుగు, సముద్యత్ + క్రౌంచ - గతుల్ = పూనుకొన్న క్రౌంచపక్షుల గమనములు, వీక్షించుచున్ = చూచుచు, భాస్వత్ + జ్వలనుఁడు = ప్రకాశించుచున్న అగ్ని, శరవణ - సరసికిన్= శరవణసరస్సునకు, వచ్చెను

తాత్పర్యము. లేఁదామరతూండ్లను ముక్కులతోఁ గొఱుకుచు, తామరల కేసరములను పెంటులకుఁ బూయుచు, శరీరమున గగుర్పాటు కంచుకమయి యేర్పడఁగా విజృంభించుచు, సైకతములఁ గ్రీడించుచు, సంభాషించుచు, ప్రేమముతో నొప్పుచు, ధ్వనిచేయుచు, సంచరించు క్రౌంచముల గమనములను జూచుచు అగ్ని శరవణసరసి తెంచెను

విశేషములు . అలంకారము స్వభావోక్తి క్రౌంచగతులను, క్రౌంచపదవృత్తముననే వర్ణించుట గమనింపఁదగినది లేఁదూండ్లు - పూర్వ పద్యమునందలి లేఁదరఁగల వలెనే తూండ్లు - తూఁడు + లు 'బహువచనంబు పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు' బాల ఆచ్చిక 12 తూఁడ్ + లు 'సమానపదంబునందు సంయోగంబు పరంబగునపు డెల్లచో ఖండబిందునకుం బూర్ణంబగు' బాల ఆచ్చిక 15 తూండ్లు భాస్వజ్జ్వలనుఁడు = భాస్వత్ + జ్వలనుఁడు అనునాసికాంతస్థవర్ణములు తప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (ఱుల్లులకు) మృదుహల్లులు (హళ్ళులు) కాని అచ్చులుకాని పరమగునపుడు ఆ హల్లుల వర్ణమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును 'భాస్వద్ + జ్వలనుఁడు 'సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణచవర్గ వర్ణము లాదేశమగును' భాస్వజ్జ్వలనుఁడు

పంచ శరాభా ! సంచితపుణ్యా ! భ మ స భ న న న య పరిమితమైనన్
క్రౌంచపదాఖ్యం బంచిత మయ్యెన్ గ్రమయతి దశవసు కలితముగాన్

క్రౌంచపదము నాలుగు పాదము లుండును ప్రతిపాదమునను భ, మ, స, భ, న, న, న, య అనుగణములుండును మొదటియక్షరమునకును పదునొకండవ యక్షరమునకును, పందొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు లక్షణ మిట్లుండఁగా, నన్నెచోడుఁడు క్రౌంచపదమును దద్భిన్నముగా రచించినాఁడు ఇతఁడు కందమును వలె దీనిని రెండు భాగములుగా విభజించి మొదటి భాగమునఁ బ్రాసయతిని, రెండవ భాగమున యతి మైత్రిని బాటించినాఁడు

అగ్ని సప్తర్షుల భార్యలతోఁ గ్రీడించుట

వ తదవసరంబున సప్తర్షుల ధర్మపత్ను లరుంధతీసహితంబు నిరంబరలై జలక్రీడలాడుచున్న వారి నక్కడం గని 31

అర్థము : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, సప్తర్షుల = సప్త+ ఋషుల = ఏడుగురు ఋషులయొక్క, ధర్మపత్నులు = భార్యలు, అరుంధతీ -

సహితంబు = అరుంధతితోఁగూడి, నిరంబరలు + ఐ = వస్త్రవిహీనలయి, జలక్రీడలు, ఆడుచున్ + ఉన్న - వారిన్, అక్కడన్, కని

తాత్పర్యము. ఆ సమయమున సప్తర్షుల భార్యలను అరుంధతితోఁ గూడి వస్త్రవిహీనలయి జలక్రీడలాడుచున్నవారిని అచ్చటఁజూచి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు సప్తర్షులు - సప్త + ఋషులు - గుణసంధి

మ **తన భండారువుఁ జూఱపుచ్చెనొకొ కందర్పుండు నేఁడంచుఁ గ**
న్గొనియెం బావకుఁ డర్థి నూరుయుగముల్, గుహ్యప్రదేశమ్ములున్
దనుమధ్యంబులు ముత్తరంగలు సముద్యత్పూర్ణవృత్తోన్నత
స్తనకుంభంబులు వక్త్రపంకజములున్ ధమ్మిల్లభారంబులున్. 32

అర్థము. నేఁడు, కందర్పుండు = మన్మథుఁడు, తన - భండారువున్ = తన భండారమును - తన బొక్కసమును, చూఱపుచ్చెన్ + ఒకొ = కొల్లపెట్టెనా, అంచున్, పావకుఁడు = అగ్ని, అర్థిన్ = కోరికతో, ఊరు - యుగముల్ = తొడలజంటలు, గుహ్య - ప్రదేశమ్ములున్ = రహస్యావయవముల చోటులును, తను - మధ్యంబులున్ = సన్నని నడుములును ముత్తరంగలున్ - మూఁడు తరంగలున్ = వళిత్రయమును, సముద్యత్ + పూర్ణ - వృత్త + ఉన్నత - స్తన - కుంభంబులున్ = మిక్కిలి విజృంభించుచున్న, నిండైన, గుండ్రని, ఎత్తయిన కుండలవంటి చన్నులును, వక్త్ర - పంకజములున్ = పద్మములవంటి ముఖములును, ధమ్మిల్ల - భారంబులున్ = కొప్పుల బరువులును, కన్గొనియెన్ = చూచెను

తాత్పర్యము. నేఁడు మన్మథుఁడు తన బొక్కసమును గొల్లపెట్టెనా ? యనుచు నగ్ని సప్తర్షుల భార్యల తొడల జంటలను, రహస్యావయవములను, సన్నని నడుములను, ముఖపద్మములను,కొప్పులను గోరికతోఁ జూచెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష వారియవయవములను అగ్ని ఊరువులనుండి క్రమముగాఁ బైవఱకుఁ జూచినట్లు వర్ణించుట గమనింపఁదగినది భండారువు - భండార శబ్దమునకు వికృతియగునా ? లేక అర్వాదులలోఁ జేర్చి అర్వువు వలెఁ దత్సమముగా సాధింపనగునా ? ప్రౌఢ శబ్ద - 21

వ ఇట్లు కనుంగొని కనుబేటం బేటంబైన ననలుండు తన డెందంబునం దనరు మనసిజానలంబు వెలిపేర్చి వెలుంగునట్లు తత్ప్రదేశంబునం బొలయుచున్న నరుంధతి గని వహ్నిఁ బరపురుషుండని భయంబున నిజవస్త్రావకుంఠితయై తొలంగి నిలిచెం దక్కిన యార్వురు నెఱుంగక నిక్కము వనవహ్ని కాఁదలంచి శీతాతరలై చనుదెంచి ముగ్ధభావంబున వివృత జఘనలై యున్నభంగిన తన్ను బలసినం గని యనలుం డనురాగంబున 33

అర్థము ఇట్లు, కనుంగొని = చూచి, కనుబేటంబేటంబు + ఐనన్ = చూడ్కివలన ననురాగాతిశయము గలుగఁగా, అనలుండు = అగ్ని, తన - డెందంబునన్ = తన హృదయమున, తనరు = ఒప్పు, మనసిజ + అనలంబు = మన్మథాగ్ని, వెలి-పేర్చి = పైకి వచ్చి, వెలుంగు + అట్లు = వెలుఁగువిధమున, తద్+ ప్రదేశంబునన్ = ఆ చోట, పొలయుచున్ + ఉన్నన్ = వర్తిలుచుండఁగా, అరుంధతి= వసిష్ఠునిభార్య, కని, వహ్నిన్ = అగ్నిని, పర - పురుషుండు + అని, భయంబునన్ = శీఘ్రముగా, నిజ - వస్త్ర + అవకుంఠిత + ఐ = తనదైన వస్త్రముతోఁ గప్పుకొన్నదయి, తొలంగి, నిలిచెన్, తక్కిన + ఆర్వురున్, ఎఱుంగక, నిక్కము + అ = నిజముగనే, వన-వహ్ని = అడవినిప్పు, కాన్ + తలంచి = అని యెంచి, శీత + ఆతురలు + ఐ = చలిచే బాధపడువారయి, చనుదెంచి = వచ్చి, ముగ్ధ - భావంబునన్ = అమాయకతచే, వివృత + జఘనలు + ఐ = తెలువఁబడిన కటి ప్రదేశములు గలవారయి, ఉన్న - భంగిన్ + అ = ఉన్నవిధముగనే, తన్నున్, బలసినన్ = చుట్టఁగా, కని, అనలుండు, అనురాగంబునన్ = ప్రేమముతో

తాత్పర్యము . ఇట్లు చూచి, చూడ్కివలనఁగలిగిన యనురాగ మతిశయింపఁగా, అగ్ని తన హృదయమున నొప్పు మన్మథాగ్ని బయటికి వచ్చి వెలుఁగునట్లు ఆ చోట వర్తిలుచుండఁగా, అరుంధతి చూచి అగ్నిని పరపురుషుడని తలఁచి వెంటనే బట్ట చుట్టఁబెట్టుకొని తొలఁగి నిలిచెను తక్కిన ఆర్వురు మునిపత్నులును అతఁడు అగ్నియని తెలియక, నిజముగనే అడవినిప్పనియెంచి, చలిచే బాధపడువారై వచ్చి అమాయకముగా కటిప్రదేశములు కప్పక ఉన్నట్లుగనే తన్నుఁజుట్టఁగాఁ జూచి అగ్ని అనురాగముతో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార మీక్షే

క కరలతలఁ బెనఁగి మైవడి
గురుకుచములమీఁద వ్రాలి కోర్కులు ముట్టన్
వర జఘనంబులఁ బొందుచు
సురతసుఖం బందె నాశుశుక్షణి ప్రీతిన్ 34

అర్థము. ఆశుశుక్షణి = అగ్ని, కర-లతలన్ = తీవలవంటి చేతులతో, పెనఁగి = పట్టుకొని, మైవడిన్ = సమ్మతితో, గురు-కుచముల మీఁదన్ = గొప్పవియగు స్తనములపై, వ్రాలి, కోర్కులు, ముట్టన్ = నిండఁగా, వర - జఘనంబులన్ = మేలయిన కటిస్థలములను, పొందుచున్, ప్రీతిన్ = సంతోషముతో, సురత -సుఖంబు = సంభోగసౌఖ్యము, అందెన్ = పొందెను

తాత్పర్యము. అగ్ని సమ్మతితో లతలవంటికరములతోఁ బెనంగి గొప్పవియగు స్తనముల మీఁద వ్రాలి కోర్కులు ఫలింపఁగా, మేలైన కటి ప్రదేశములను బొందుచుఁ బ్రీతితో సంభోగసౌఖ్యము నందెను

విశేషములు. అలంకారము స్వభావోక్తి

వ తదనంతరంబున వహ్నియం దంతర్హితంబైన హరువీర్యంబు మానవతుల యోనిముఖంబు ప్రవేశించిన నెఱనుముట్టిన సరసభావంబున మే యలరుచు 35

అర్థము తద్ + అనంతరంబునన్ = ఆ పిమ్మట, వహ్ని + అందున్ = అగ్నియందు, అంతర్హితంబు + ఐన = మఱుఁగుపడినది అఘిన, హరు - వీర్యంబు = శివుని శుక్లము, మానవతుల = మునిపత్నులయొక్క, యోని-ముఖంబు = భగద్వారము, ప్రవేశించినన్, నెఱను - ముట్టిన = మర్మమును దాఁకిన, సరస - భావంబునన్ = శృంగారప్రభావమున, మే = మేను, అలరుచున్ = సంతోషించుచు

తాత్పర్యము. ఆ పిమ్మట అగ్నియందు మఱుఁగుపడిన శివుని శుక్లము మునిపత్నుల భగద్వారమును బ్రవేశింపఁగా మర్మమును దాఁకిన శృంగారభావమున మేను పొంగుచు - తరువాతి పద్యముతో నన్వయము

ఉ అక్కిలి మాయఁ గన్నుఁగవ, లాననముల్ విలసిల్లఁ బెంజెమర్
క్రెక్కొని పర్వ, మానములు కీడ్పడఁ జెయ్వుల కుచ్చలించి, క
ర్కెక్కఁ దనూలతల్, ధృతికి నేడ్తెఱ లల్కఁ, శిఖిప్రసంగతిం
జొక్కి మహీసురాంగనలు సోలి రపూర్వరతిప్రమత్తలై 36

అర్థము మహీసుర + అంగనలు = బ్రాహ్మణస్త్రీలు - మునిపత్నులు, శిఖి - ప్రసంగతిన్ = అగ్నితోడి సంగమముచేత, అపూర్వ - రతి - ప్రమత్తలు + ఐ = అపురూపమైన సంభోగముచే మిక్కిలి మదించినవారయి, అక్కిలిన్ = కలఁతచే, కన్నుఁగవలు = కన్నులజంటలు, మూయన్ = మూయఁగను, ఆననముల్ = ముఖములు, విలసిల్లన్ = ప్రకాశింపఁగను, పెంజెమర్ - పెను + చెమర్ = అధికమయిన చెమట, క్రెక్కొని = దట్టమయి (?), పర్వన్ = వ్యాపింపఁగను, మానములు = (ప్రణయ) కోపములు, కీడ్పడన్ = చెడఁగా, చెయ్వులకున్ = చేష్టలకు, ఉచ్చలించి = మిక్కిలి చలించి, తనూ-లతల్ = మైఁదీవలు, కర్కెక్కన్ = పులకరింపఁగా, ధృతికిన్ = ధరించుటకు, ఏడ్తెఱలు = సామర్థ్యములు, అల్కన్ = వెనుదీయఁగా, చొక్కి = పారవశ్యముచెంది, సోలిరి = వ్రాలిరి

తాత్పర్యము . మునిపత్నులు అగ్నితోడి సంగమముచే అపూర్వమైన సురతక్రీడచే మిక్కిలి మదించినవారయి, కలఁతచేఁ గన్ను లజంటలు మూయఁగా, ముఖములు ప్రకాశింపఁగా, అధికమైన చెమట దట్టముగా వ్యాపింపఁగా, కోపములు పోఁగా, చేష్టలకు మిక్కిలి చలించి, మైఁదీవలు పులకింపఁగా, ధరించుటకు శక్తి చాలకపోఁగా, పారవశ్యముఁజెంది మైమఱచిరి

విశేషములు: మొదటి పాదమున 'అక్కిలిమాయ' అనుపారము గలదు దానికి అక్కిలి = కలఁత, మాయన్ = నశింపఁగను, కన్నుఁగవలు + ఆననముల్ = కనులజంటలు, ముఖములు, విలసిల్లన్ = ప్రకాశింపఁగా - అని అర్థము చెప్పవలయును ధృతికి నేడ్తెఱ లల్కన్ = అగ్నిని పైని దాల్చుటకు శక్తి చాలక అలంకారము స్వభావోక్తి

వ అంత ననలుం డీశ్వరవీర్యంబుతోన నిజభరంబునుం బాసి రతిపరితోషితుండై స్వేచ్ఛావిహారియయ్యె నిట మునిపత్ను లల్లన పరిధానావృతలై రంతకుమున్న 37

అర్థము . అంతన్, అనలుండు, ఈశ్వర - వీర్యంబుతోన్ + అ = ఈశ్వరుని వీర్యముతోపాటే, నిజ-భరంబునున్ = తనదైన బరువును గూడ, పాసి=

విడిచి, రతి - పరితోషితుండు + ఐ = సంభోగముచేఁ దృప్తినొందినవాఁడయి, స్వేచ్ఛా - విహారి = స్వేచ్ఛగా విహరించువాఁడు, అయ్యెన్, ఇటన్, ముని-పత్నులు = మునుల భార్యలు, అల్లనన్ = మెల్లఁగా, పరిధాన + ఆవృతలు + ఐరి = బట్టలు కప్పుకొన్నవారయిరి - ధరించినవారయిరి, అంతకున్ + మున్ను + అ = అంతకుమునుపే

తాత్పర్యము అంత అగ్ని ఈశ్వరుని వీర్యముతోపాటే తనదైన వీర్యభారమును గూడ విడిచి రతిక్రీడచేఁ దృప్తినొందినవాఁడయి స్వేచ్ఛగా విహరించుచుండెను ఇక్కడ ముని భార్యలు మెల్లఁగా వస్త్రములు ధరించిరి అంతకుమునుపే - తరువాతి పద్యముతో నన్వయము

అగ్నిసాంగత్యమున సప్తర్షుల భార్యలు గర్భవతులగుట

సీ పరమేశు వీర్యంబు భరియింప వ్రేఁగైన
విధమునఁ దనులతల్ వ్రేఁకనయ్యె
నన్యు లెఱుఁగఁ గష్ట మని వెల్లఁబాఱిన
పగిది మేతీఁగలు పలఁకఁబాఱెఁ
దనుమధ్య లోప రీ స్తనభారమని విధి
దల మిచ్చె నాఁ గృశోదరము లెసఁగె
వరపుత్రలాభోత్సవంబు పర్వినభంగి
మనములఁ దనరె సమ్మదరసంబు

తే గురుకుచంబులపైఁ బచ్చసెరలు వాఱి
తుదలఁ గప్పిరి పాలుపారఁ గదిసి వలిసెఁ
దనరె నాభులు విరిసె ముత్తరఁగ లారు
లొనరి గర్భంబు లడరె నక్షణములోన 38

అర్థము పరమేశు - వీర్యంబు = ఈశ్వరుని వీర్యము, భరియింపన్ = వహించుటకు, వ్రేఁగు + ఐన - పగిదిన్ = బరువైన విధమున, తను-లతల్ = మైఁదీవలు, వ్రేఁకన + అయ్యెన్ = బరువెక్కెను

అన్యులు = ఇతరులు, ఎఱుఁగన్ = తెలియఁగా - ఇతరులకుఁదెలియుచో, కష్టము + అని, వెల్లఁబాఱిన - పగిదిన్ = తెల్లఁబోయిన విధమున, మే-తీఁగలు = తీఁగలవంటి మేనులు, పలఁకఁబాఱెన్ = తెల్లనయ్యెను

తను - మధ్యలు = సన్నని నడుములు గలవారు, - స్త్రీలు, ఈ - స్తన - భారము = ఈ కుచముల బరువు, ఓపరు = చాలరు - మోయఁజాలరు, అని, విధి = బ్రహ్మ, దలము = గొప్పతనము, అధిక్యము, లావు, ఇచ్చెన్ + నాన్ = ఇచ్చెనోయన, కృశ + ఉదరములు = కృశించిన నడుములు, ఎసఁగెన్ = అతిశయించెను

వర - పుత్ర - లాభ + ఉత్సవంబు = మంచి కొడుకు గలుగుటవలని వేడుక, పర్విన - భంగిన్ - వ్యాపించిన విధమున, మనములన్ = మనసులందు, సమ్మదరసంబు = సంతోషరసము, తనరెన్ = ఒప్పెను

గురు - కుచంబులపైన్ = గొప్పవియగుస్తనములమీఁద, పచ్చసెరలు = పచ్చని రేఖలు, పాఱి = ఏర్పడి, తుదలన్ = చివరలందు, కప్పిరి = నలుపు, పాలుపారన్ = ఒప్పఁగా, కదిసి = కూడి, వలిసెన్ = సుడిసెను - చుట్టుకొనెను

నాభులు = బొడ్డులు, తనరెన్ = ఎత్తయ్యెను, ముత్తరఁగలు - మూఁడు+ తరఁగలు =వళిత్రయము, నిరిసెన్ = అదృశ్య మయ్యెను, ఆరులు = రోమావళి - నూఁగారు, ఒనరి = కలిగి, అక్షణములోన్ + అ = వెంటనే, గర్భంబులు = చూలులు, అడరెన్ = అతిశయించెను

తాత్పర్యము. పరమేశ్వరుని వీర్యమును వహించుటకు బరువైన విధమున ఆ మునిపత్నులకు మైఁదీవలు బరువెక్కెను ఇతరులకుఁ దెలిసినచోఁ గష్టమని తెల్లఁబోయిన విధమున మేతీవలు తెల్లనయ్యెను సన్నని నడుములుగలవారు ఈ చన్నుల బరువును మోయఁజాలరని బ్రహ్మ లావుఇచ్చెనా యనఁ జిక్కిన నడుము లతిశయించెను మంచికొడుకు గలుగునను వేడుక వ్యాపించెనా యన వారి మనస్సులలో సంతోషరసము నిండెను గొప్పవియగు కుచములమీఁదఁ బచ్చని రేఖలు గలిగి కొనలందు నలుపు ఒప్పి సుడిసెను బొడ్లు ఎత్తయ్యెను వళిత్రయము అదృశ్యమయ్యెను నూఁగారు ఏర్పడి ఆ క్షణములోనే వారికిఁ జూలు లతిశయించెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష స్వభావోక్తి

వ ఇ ట్లీశ్వరవీర్యంబున సద్యోగ్భంబులైనం గని వెలవెలఁబాఱుచు నొండొరుల మొగంబులు సూచుచు నందఱు నరుంధతిం గనుంగొని నీ వెఱుంగుదు మా చేసిన దోషంబు లేదు నిర్నిమిత్తంబు గర్భంబులయ్యె నిదియేమి మాయ' యనిన 'మీరు యౌవనమదంబున నతిక్రమించి యగ్నిఁ బరపురుషుం డనక నగ్నంబుతోడం జేరితి రిది తన్నిమిత్తం' బని వారలఁ బదరుచు

అర్థము ఇట్లు, ఈశ్వర - వీర్యంబునన్ = ఈశ్వరుని వీర్యముచే, సద్యస్ (ఃన్) + గర్భంబులు + ఐనన్ = తత్క్షణ గర్భములు కాఁగా, కని = చూచి, వెలవెలన్+ పాఱుచున్ = తెల్లఁబోవుచు, ఒండొరుల = మొగంబులు = ఒకరొకరి ముఖములు, చూచుచున్, అందఱున్, అరుంధతిన్, కనుంగొని, నీవు + ఎఱుంగుదు (వు), మా-చేసిన = మేము చేసిన, దోషంబు, లేదు, నిర్నిమిత్తంబు = కారణము లేకయే, గర్భంబులు + అయ్యెన్, ఇది, ఏమి, మాయ, అనినన్, మీరు, యౌవన - మదంబునన్ = పడుచుఁదనపుఁగ్రొవ్వున, అతిక్రమించి, అగ్నిన్, పర-పురుషుండు, అనక, నగ్నంబు-తోడన్ = వస్త్రవిహీనతతో, చేరితిరి, ఇది, తద్ + నిమిత్తంబు = అది కారణముగాఁగలది, అని, వారలన్, పదరుచున్ = ఆక్షేపించుచు

తాత్పర్యము : ఇట్లు ఈశ్వరుని వీర్యముచేఁ దత్క్షణ గర్భములుకాఁగాఁ జూచి తెల్లఁబోవుచు ఒకరొకరి ముఖములు చూచుకొనుచు అందఱును అరుంధతిని జూచి 'నీ వెఱుఁగుదువు గదా ! మేము చేసిన దోషము లేదు, నిష్కారణముగా గర్భము లాయెను ఇది యేమి మాయయో,' అనిన 'మీరు పడుచుఁదనపుగర్వముచే నతిక్రమించి అగ్నిని బరపురుషుఁడనక దిగంబరలయి చేరితిరి దీనికి హేతు వదియే' యని వారిని నిందించుచు - తరువాతి పద్యముతో నన్వయము

క దోషుల సంగతి నగుదురు
దోషాత్మకు, లిదియ సంగదోషము, మీతో
భాషింపఁగ నగునే యని
రోషించుచుఁ గింకతో నరుంధతి యరిగెన్ 40

అర్థము . దోషుల - సంగతిన్ = దుష్టుల సాంగత్యముతో, దోష + ఆత్మకులు = దుష్టస్వభావులు, అగుదురు, ఇదియ = ఇదియే, సంగ - దోషము= సాంగత్యమువలని దోషము, మీతోన్, భాషింపఁగన్ + అగునే = మాటలాడవచ్చునా, అని, రోషించుచున్ = కోపపడుచు, కింకతోన్ = కోపముతో, అరిగెన్ = వెడలెను

తాత్పర్యము. 'దుష్టసాంగత్యముచే దుష్టాత్ములగుదురు ఇదే సాంగత్యము వలనఁ గలుగు దోషము మీతో మాటలాడరాదు ' అని అరుంధతి కోపించుచుఁ గోపముతో నరిగెను

విశేషములు . కింక, కినుక, కిన్క, కింక (రూపాం)

వ అంత మునికాంత లనంతచింతాక్రాంతలై యరుంధతిఁ బాసి యలసి
క్రౌముదిఁ బాసిన కుముదవనంబునుంబోలె లగ్గ విన్నంబారి 41

అర్థము . అంతన్, ముని - కాంతలు = మునిపత్నులు, అనంత - చింతా+ ఆక్రాంతలు + ఐ = అంతులేని దుఃఖముతో ఆక్రమింపఁబడినవారయి, అరుంధతిన్, పాసి = విడిచి, అలసి = బడలి, కౌముదిన్ = వెన్నెలను, పాసిన = విడిచిన, కుముద - వనంబునున్ + పోలెన్ = కలువతోఁపు విధమున, లగ్గన్ = మిక్కిలి, విన్నంబారి = చిన్నఁబుచ్చుకొని

తాత్పర్యము . అంత మునిపత్నులు అంతులేని దుఃఖముచే నాక్రమింపఁబడినవారయి అరుంధతినివిడిచి, బడలి వెన్నెలను విడిచిన కలువతోఁపు విధమున మిక్కిలి చిన్నఁబోయి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకార ముపమ

మ గళితోచ్ఛ్వాసము, శోకపావకశిఖాక్రాంతాంతరంగంబు, నిర్గళితాశ్రుప్రచయోదకాంకితలసద్గండప్రదేశంబు, సంచలితాంగప్రకరం, బరాలవదనాబ్జం బా మునీంద్రాంగనాకుల మత్యాకులవృత్తి నుండె వనటం గుందిల్లి చింతించుచున్ 42

అర్థము . గళిత + ఉచ్ఛ్వాసము = జాఱిన నిట్టూర్పులు గలది, శోక - పావక - శిఖా + ఆక్రాంత + అంతరంగంబు= దుఃఖాగ్నిజ్వాలలచే నాక్రమింపఁబడిన మనస్సులు గలది, నిర్గళిత + అశ్రు - ప్రచయ + ఉదక + అంకిత - లసత్ + గండ-ప్రదేశంబు = జాఱిన బాష్పముల సమూహమునందలి నీటిచే గుఱుతులు గలదిగాఁ జేయఁబడిన ప్రకాశించుచున్న చెక్కిళ్ళు గలది, సంచలిత + అంగ - ప్రకరంబు = మిక్కిలి చలించిన అవయవముల సమూహము గలది, అరాల - వదన + అబ్జంబు = కుటిలములైన ముఖపద్మములు గలది, (అగు) ఆ - ముని+ ఇంద్ర + అంగనా - కులము = ఆ మునిశ్రేష్ఠుల భార్యల సమూహము, వనటన్= దుఃఖముతో, కుందిల్లి = క్రుంగిపోయి, చింతించుచున్ = విచారించుచు, అతి + ఆకుల - వృత్తిన్ = మిక్కిలి కలఁగిన వర్తనముతో, ఉండెన్

తాత్పర్యము . ఆ మునిపత్నుల సమూహము నిట్టూర్పులుపుచ్చుచు, దుఃఖాగ్నిజ్వాలలచే నాక్రాంతమైన అంతరంగములు గలదయి, జాఱిన బాష్పజలములచేఁ జిహ్నితములైన చెక్కిళ్లు గలదయి, మిక్కిలి చలించిన అవయవముల సమూహము గలదయి, కుటిలములైన ముఖపద్మములతో శోకమునఁ గ్రుంగి మిక్కిలి కలఁతఁజెంధియుండెను

విశేషములు అలంకారము స్వభావోక్తి

వ ఇట్లు దలంబగు నడలడింబడి కదలుచు 'నింకం దడయు డుచితంబు గాదు మునివరు లెఱుంగకుండ నిజగర్భపిండంబులం బుచ్చి నివాసంబుల కరుగవలయు' నని విచారించి యక్షణంబ 43

అర్థము ఇట్లు, దలంబు + అగు = అధికమగు, అడలడిన్ = దుఃఖమున, పడి, కదలుచున్, ఇంకన్, తడయుడు = ఆలస్యము చేయుట, ఉచితంబు + కాదు = మంచిది కాదు, మునివరులు = మునిశ్రేష్ఠులు, ఎఱుంగక + ఉండన్, నిజ - గర్భ - పిండంబులన్ = మనవైన కడుపులలోని పిండములను, పుచ్చి = తీసివైచి, నివాసంబులకున్ = ఇండ్లకు, అరుగన్ + వలయును, అని, విచారించి, అక్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము. ఇట్లు అధికమైన దుఃఖమునొంది చలించుచు 'ఇక నాలస్యము చేయఁదగదు మునిపతు లెఱుఁగకుండ మన కడుపులందలి పిండములను దీసివైచి యిండ్లకుఁబోవలయునని ఆలోచించి వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము

క **సాహసులై మునిపత్నులు**
మోహం బఱి గర్భపిండములు వుచ్చి గతో
త్సాహమునఁ బద్మపత్ర స
మూహంబునఁ బొదిగి సేమమునఁ బెట్టి రొగిన్ 44

అర్థము ముని - పత్నులు = మునులభార్యలు, సాహసులు + ఐ = తెంపరులయి, మోహంబు + అఱి = ప్రేమముపోయి, గర్భ-పిండములు = కడుపులందలి పిండములు, పుచ్చి = తీసి, గత + ఉత్సాహమునన్ = పోయిన ఉత్సాహముతో, పద్మ - పత్ర- సమూహంబునన్ = తామరపాకుల సమూహముచే, పొదిగి = కప్పి, సేమమునన్ = క్షేమముతో, ఒగిన్ = చక్కఁగా, పెట్టిరి

తాత్పర్యము . మునుల భార్యలు తెగువరులయి మోహము విడిచి గర్భస్థపిండములను దీసి ఉత్సాహములేక పద్మపత్రసమూహముచేఁ గప్పి క్షేమముగాఁ జక్కఁగాఁ బెట్టిరి

విశేషములు . సాహసీ శబ్ద తత్సమరూపము సాహసి

వ ఇట్లు నిజగర్భంబులు పుచ్చి సరోవరలక్ష్మీగర్భంబునంబెట్టిన మనసుపట్టక నిర్దోషలుంబోలె నిజేశ్వరులకుం బరిచర్యసేయ నుపక్రమింపుడు 45

అర్థము. ఇట్లున్, నిజ - గర్భంబులు = తమవైన చూలులు, పుచ్చి = తీసివైచి, సరోవర - లక్ష్మీ - గర్భంబునన్ = సరస్సునెడి లక్ష్మియొక్క కడుపులో, పెట్టినన్, మనసు పట్టక = ఎన్నకుండక, నిర్దోషలున్ + పోలెన్ = నిరపరాధినులవలె, నిజ + ఈశ్వరులకున్ = తమ భర్తలకు, పరిచర్య + చేయన్ = సేవలు చేయుటకు, ఉపక్రమింపుడున్ = ప్రారంభించినంతనే

తాత్పర్యము. ఇట్లు తమ చూలు తీసివైచి సరస్సునెడి లక్ష్మి గర్భమునఁబెట్టి, ఊరకుండక, నిరపరాధినులవలెఁ దమ భర్తలకు సేవలుచేయఁ బ్రారంభించినంతనే- తరువాతి పద్యముతో నన్వయము

క ఆ రమణుల దోషయుతా
కార వికారములుగాంచి కలుషించి మునుల్
వారి విసర్జించిరి దో
షారంభులు వర్జనీయులగు డది యరుదే ? 46

అర్థము. మునుల్, ఆ - రమణుల = ఆ స్త్రీలయొక్క, దోష + యుత+ ఆకార - వికారములు = అపరాధముతోఁ గూడిన రూపముల మార్పులు, కాంచి= చూచి, కలుషించి = కోపించి, వారిన్, విసర్జించిరి = విడిచిరి, దోష + ఆరంభులు= దోషముల ప్రయత్నముగలవారు - దోషులనుట, వర్జనీయులు = విడువఁదగినవారు, అగుడు = అగుట, అది, అరుదే = ఆశ్చర్యమా ?

తాత్పర్యము : మునులు ఆ స్త్రీల అపరాధముతోఁ గూడిన ఆకారముల వికారములను జూచి కోపించి వారిని విడిచిరి దోషులు త్యాజ్యులగుట ఆశ్చర్యమా? - కా దనుట

విశేషములు. అలంకారము అర్థాంతరన్యాసము

వ ఇట్లు ధర్మచారిణులు నిజాధీశ్వరులచేతం బరివర్జితలై మాఱువలుక నోడి పరమేష్ఠిపాలికింజని 'యకామ కృత దోషంబులం బతులచేతం బరిభవింపఁబడితి' మని విజ్ఞాపించినం జతురాననుండు తద్వృత్తాంతం బెఱింగి 'పతివ్రతావృత్తియందు వ్రతభ్రష్టలైనను నీశ్వరవీర్యంబు

ధరియించిన పుణ్యఫలంబున జ్యోతిర్లోకంబునం గృత్తిక లనం బ్రవర్తింపుం' డని వరంబుగా విరించి కరుణించి నియమించిన మహాప్రసాదంబని పుణ్యగతికి నరిగి రట౮ గమలలక్ష్మిగర్భంబునందున్న పిండంబులన్నియు నొక్కండై యక్షణంబ పక్వంబునకు వచ్చి

అర్థము . ఇట్లు, ధర్మచారిణులు = ధర్మపత్నులు, నిజ + అధి = ఈశ్వరులచేతన్ = తమపతులచే, పరివర్జితలు + ఐ = విడిచిపెట్ట౮బడినవారయి, మాఱు + పలుకన్ + ఓడి= మాఱుమాటాడ జంకి, పరమేష్ఠి - పాలికిన్ = బ్రహ్మయొద్దకు, చని, అకామ - కృత - దోషంబులన్= కోరి చేయని అపరాధములచే, పతుల చేతన్ = భర్తలచే, పరభవింప౮బడితిమి = తిరస్కరింప౮బడితిమి, అని, విజ్ఞాపించినన్ = విన్నవింప౮గా, చతురాననుండు = నలువ - బ్రహ్మ, తద్ + వృత్తాంతంబు = వారి వృత్తాంతము ఎఱింగి, పతివ్రతా - వృత్తి - అందున్ = పాతివ్రత్యమునందు, , వ్రత - భ్రష్టలు = నియమమునుండి జాఱినవారు, ఐనను, ఈశ్వర - వీర్యంబున్, ధరియించిన - పుణ్య - ఫలంబునన్ = తాల్చిన పున్నెమునకు ఫలముగా, జ్యోతిస్ (.) + లోకంబునన్ = నక్షత్రలోకమునందు, కృత్తికలు = అనన్, ప్రవర్తింపుండు, అని, వరంబుగాన్, విరించి = బ్రహ్మ, కరుణించి = దయ౮దల౮చి, నియమించినన్ = నియోగింప౮గా, మహాప్రసాదంబు+ అని, పుణ్య - గతికిన్, అరిగిరి, అటన్, కమల - లక్ష్మి - గర్భంబునందున్ = తామరతోఁపు అనెడి లక్ష్మి యొక్క కడుపునందు, ఉన్న, పిండంబులు + అన్నియున్, ఒక్కండు + ఐ = ఒక్కటయి, అక్షణంబు + అ = వెంటనే పక్వంబునకున్ - వచ్చి = పరిణతమయి - పండి

తాత్పర్యము . ఇట్లు ధర్మపత్నులు తమ భర్తలచే విడువ౮బడిన వారయి మారుపలుక జంకి బ్రహ్మయొద్ద కరిగి 'కోరిచేయని దోషములకు మేము భర్తలచే౮ దిరస్కృతలమైతి' మని విన్నవింప౮గా, బ్రహ్మ వారి వృత్తాంతమెఱిగి 'పాతివ్రత్యమున నియమ భ్రష్టలైనను ఈశ్వరుని వీర్యమును దాల్చిన పుణ్యమునకు ఫలముగా జ్యోతిర్లోకమునందు౮ గృత్తికలను పేర౮ బ్రవర్తింపుఁడని వరమిచ్చి దయతో నియమింప౮గా, వారు మహాప్రసాదమని పుణ్యగతికి౮బోయిరి అక్కడ౮ గమలవనలక్ష్మి గర్భమునందున్న పిండములు అన్నియు నేకమయి వెంటనే పండి - తరువాతి పద్యముతో నన్వయము

కుమారోత్పత్తి

సీ ఎలుఁగెత్త నోడి ము న్నెందేని డాఁగిన
వేదనాదంబులు విస్తరిల్ల
వాయెత్తనోడి పర్వతములు సొచ్చిన
కిన్నర గంధర్వ గీతు లెసఁగఁ
దలలెత్త నోడి భూతలమునం దడఁగిన
నిధు లడుగడుగున నెఱయఁ దెఱవ
మొగమెత్తనోడి దిఙ్ముఖంబులైయున్న
యాశాననాబ్జంబు లలరి పొలయ,

ఆ బలిమి మిన్ను ముట్టి వెలిఁగెడి తారక
ప్రభ యడంగఁ, బొందు వాసి నవయు
దివిజచక్ర మెల్లఁ గవగూడి చన, నిన
పదవితోఁ గుమారుఁ డుదయమయ్యె. 48

అర్థము. ఎలుఁగు + ఎత్తన్ + ఓడి = (తారకాసురుని విజృంభణముచే) కంఠమెత్తుటకు జంకి, మున్ను + పూర్వము, ఎందున్ + ఏనిన్ = ఎచ్చటనో ఒకచోట, డాఁగిన = దాఁగుకొనిన, వేద - నాదంబులు = వేదధ్వనులు, విస్తరిల్లన్= వ్యాపింపఁగను,

వా + ఎత్తన్ + ఓడి = నోరెత్తుటకు వెనుకాడి, పర్వతములు + చొచ్చిన, కిన్నర - గంధర్వ - గీతులు = కిన్నరులయు, గంధర్వులయు గీతులు, ఎసఁగన్= అతిశయింపఁగను

తలలు + ఎత్తన్ + ఓడి = తలలుపయికెత్తవెనుదీసి, భూతలమునందున్, అడఁగిన = దిగిన, నిధులు, అడుగు + అడుగునన్ = మాటిమాటికి, నెఱయన్ = సంపూర్ణముగా, తెఱవన్ = తెఱచుకొనఁగా,

మొగము + ఎత్తన్ + ఓడి = ముఖము పయికెత్తుటకు సంకోచించి, దిశ్ (క్) + మూఢంబులు + ఐ = దిక్కుతోఁచని వయి, ఉన్న, ఆశా + ఆనన + అబ్జంబులు= దిక్కులు (అనెడి స్త్రీల), ముఖపద్మములు, అలరి = వికసించి, పొలయన్ = ప్రకాశింపఁగా,

బలిమిన్ = బలముతో, మిన్ను - ముట్టి = ఆకాశమునంటి, వెలిఁగెడి = ప్రకాశించు, తారక - ప్రభ = తారకాసురుని ఉద్దతి - నక్షత్రముల కాంతి, అడంగన్= నశింపఁగా

పొందు + పాసి = కలయిక విడిచి - విడిపోయి, నవయు = బాధపడు, దివిజ - చక్రము = దేవతల సమూహము అనెడి చక్రవాకములు, ఎల్లన్, కవఁగూడి= జతఁగూడి, చనన్ = ఒప్పఁగా,

ఇన - పదనితోన్ = ప్రభుత్వముతో, సూర్యుని విధముతో, కుమారుఁడు = కుమారస్వామి, ఉదయము + అయ్యెన్ = పుట్టెను

తాత్పర్యము . తారకాసురుని ఔద్దత్యముచేఁ గంరమెత్తుటకు జంకి మును పెచ్చటనో యొకచో డాఁగికొన్న వేదధ్వనులు వ్యాపించినట్లును, నోరెత్తుటకు వెనుకాడి కొండలలోఁ బ్రవేశించిన కిన్నరులయు, గంధర్వులయు గీతులు అతిశయింపఁగను తలలు పైకెత్తుటకు వెనుదీసి భూతలమునం దడఁగిన నిధులు అడుగడుగునను పూర్తిగాఁదెఱచుకొనునట్లును, ముఖ మెత్తుటకు ఓడి దిక్కుతోఁచకున్న దిగంగనల ముఖపద్మములు వికసించి ప్రకాశించునట్లును, శక్తితోనాకాశమునంటి ప్రకాశించు తారక ప్రభ (తారకుని ఔద్దత్యము - నక్షత్రముల కాంతి) అడఁగునట్లును, ఎడఁబాసి బాధపడు దివిజులనెడి చక్రవాకములు సర్వమును జతఁగూడి చనునట్లును ఇనపదవితో (రాజాధికారముతో - సూర్యుని విధమున కుమారస్వామి ఉదయించెను

విశేషములు . అలంకారము రూపకము, శ్లేషము

వ ఇ ట్లీశ్వరు నురులింగాకారంబు పురుషాకారంబుఁ దాల్చినట్లు, నిజజనకుండగు పంచవక్త్రు నగ్గలింప నెత్తునట్లు, షడ్వక్త్రుండై ద్వాదశ రవి ప్రకరంబున నవయవంబులు సేకొని నిజావయవంబు దాల్చినట్లు, ద్వాదశకరపంకజశోభితుండై కమలగర్భునొత్తరించి కమలాసనంబు గైకొనినయట్లు కమలనిలయుఁడై వెలుంగుచుండె నంత 49

అర్థము . ఇట్లు, ఈశ్వరు + ఉరులింగాకారంబు = ఈశ్వరుని యొక్క గొప్ప లింగము యొక్క ఆకారము, పురుష + ఆకారంబు = పురుషుని ఆకృతిని, తాల్చిన + అట్లు = ధరించిన విధమున, నిజ - జనకుండు + అగు = తన తండ్రియైన, పంచ-వక్త్రున్ = అయిదు ముఖములు గలవానిని - శివుని, అగ్గలింపన్ = మించుటకు, ఎత్తు + అట్లు = పూనునట్లు, షష్ (ట్) + వక్త్రుండు+ ఐ = ఆఱుముఖములు గలవాఁడయి, ద్వాదశ - రవి - ప్రకరంబునన్ = పండ్రెండుగురు సూర్యుల సమూహమున, అవయవంబులు, చేకొని = గ్రహించి, నిజ + అవయవంబు = తన అంగము, తాల్చిన + అట్లు, ద్వాదశ - కర - పంకజ-

శోభితుండు + ఐ = పండ్రెండు హస్తపద్మములతోఁ బ్రకాశించినవాఁడయి, కమలగర్భున్ = తమ్మిచూలిని - బ్రహ్మను, ఒత్తరించి = మించి, కమల + ఆసనంబు = పద్మాసనము, కైకొనిన + అట్లు = గ్రహించిన విధమున, కమల - నిలయుఁడు + ఐ = పద్మము స్థానముగాఁ గలవాఁడయి, వెలుంగుచున్ + ఉండెన్= ప్రకాశించుచుండెను అంతన్

తాత్పర్యము ఇట్లు శివుని గొప్పలింగముయొక్క ఆకారము పురుషుని ఆకృతి ధరించినట్లు, తన తండ్రియైన పంచముఖు నతిక్రమింపఁబూనునట్లు ఆఱుముఖములు గలవాఁడయి, పండ్రెండుగురు సూర్యులందలి యంగములు స్వీకరించి తన శరీరమును దాల్చినట్లు, పండ్రెండుకేలుఁదమ్ములచేఁ బ్రకాశించువాఁడయి, పద్మగర్భునతిశయించి పద్మాసనమును స్వీకరించునట్లు పద్మనిలయుఁడయి ప్రకాశించుచుండెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

ఉత్సాహ -ఆ హరాద్రిసుతల కతులహర్ష మెసఁగె, దేవ సం
దోహమునకు వీరలక్ష్మితోడ వేడ్కలొందెఁ, బు
ణ్యాహఘోష మెసఁగె, మునిజనాశయమ్ముల న్మహో
త్సాహమయ్యె నక్కుమారసంభవంబునం దిలన్ 50

అర్థము . ఆ + కుమార - సంభవంబునందున్ = ఆ కుమారస్వామి పుట్టుకయందు, ఆ - హర - అద్రిసుతలకున్ = ఆ శివునకును, పార్వతికిని, అతుల- హర్షము = సాటిలేని సంతోషము, ఎసఁగెన్ = అతిశయించెను దేవ + సందోహమునకున్ = దేవతల సమూహమునకు, వీర-లక్ష్మితోడన్ = పరాక్రమశ్రీతో, వేడ్కలు + ఒందెన్ = వేడుకలయ్యెను, ముని - జన + ఆశయమ్ములన్ = మునిజనముల ఆశ్రమములందు, పుణ్య + అహ - ఘోషము = పుణ్యదినమునఁజేయు మంగళధ్వని, ఎసఁగెన్ = ఒప్పెను, ఇలన్ = భూమియందు, మహత్ (మహా) + ఉత్సాహము = గొప్పవేడుక, అయ్యెన్

తాత్పర్యము . ఆ కుమారస్వామి జననమున ఆ పార్వతీశ్వరులకు సాటిలేనిసంతోష మతిశయించెను దేవతలకుఁ బరాక్రమశ్రీతో వేడుకలయ్యెను మునుల యాశ్రమములందు పుణ్యాహమంగళధ్వను లొప్పెను భూమియందు గొప్ప వేడుక గలిగెను

విశేషములు కుమారస్వామి పుట్టుకవలనఁ గలుగు నుత్సాహమునకు సూచకముగా ఉత్సాహవృత్తమును ప్రయోగించుట గమనింపఁ దగినది గ్రంథనామమైన కుమారసంభవమును పద్యమున నిక్షేపించుటయు గమనార్హము ఉత్సాహ వృత్తమున - నాలుగు పాదములుండును ప్రతిపాదమునను ఏడు సూర్యగణములు, ఒక గురువు ఉండును మొదటి గణము మొదటి యక్షరమునకును, అయిదవగణముమొదటి యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు

ఉత్సాహ సురమహీరుహాలి వండె, సురభు లోలిఁ జేపె నా
సురగజంబు మదముసేసె, సురసమూహి కెద భయా
తురత వాసెఁ, బెరిఁగె దేవదుందుభుల్, సెలంగె నీ
ధరణి సస్యవృద్ధిఁ బొందె ధర్మచరిత మిగులఁగాన్ 51

అర్థము. సుర - మహీరుహ + ఆలి = దేవతావృక్షముల వరుస, పండెన్= ఫలించెను, సురభులు = కామధేనువులు, ఓలిన్ = బాగుగా, చేపెన్ ⇨ పాలు స్రావోన్ముఖముగఁజేసెను ఆ - సుర - గజంబు = ఆ దేవతలయేనుఁగు, మదము+ చేసెన్ = మదించెను, సుర - సమూహికిన్ = దేవతల సమూహమునకు, ఎదన్ = హృదయమునందు, భయ + ఆతురత = భయమువలని బాధ, పాసెన్= పోయెను, దేవ - దుందుభుల్ = దేవతల భేరులు, పెరిఁగెన్ = వృద్ధిపొందెను, ఈ - ధరణి = ఈ భూమి, సస్యవృద్ధిన్ = పంటల పెంపుచే, చెలఁగెన్ = అతిశయించెను, ధర్మ - చరిత = ధర్మయుక్తమైన నడవడి, మిగులఁగాన్ = అధికముగా, పొందెన్

తాత్పర్యము. కల్పవృక్షములు ఫలించెను కామధేనువులు పాలుచేపెను ఆ దేవగజము మదించెను దేవతలకు హృదయముల భయము తొలఁగెను దేవతల భేరులు వృద్ధిపొందెను ఈ భూమి పంటల పెంపుతో నొప్పెను ధర్మయుక్తమైన నడవడి మిక్కిలి కలిగెను

నారదాగమనము

వ తదవసరంబునం గలహభోజనుండైన నారదమహాముని కలహావలోకనార్థంబు లోకంబులఁ బరిభ్రమించువాఁడు తత్కాంతారాంతరంబునం జని చని 52

అర్థము . తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, కలహ - భోజనుండు + ఐన = కయ్యములు ఆహారముగాఁగలవాఁడైన, నారద - మహత్ (మహా) - ముని = నారదుఁడను పేరుగల గొప్పముని, కలహ + అవలోకన + అర్థంబు = కయ్యములను జూచు నిమిత్తము, లోకంబులన్, పరిభ్రమించువాఁడు=

సంచరించువాఁడు, తద్ + కాంతార + అంతరంబునన్ = ఆ వనములోపలచని = పోయి పోయి

తాత్పర్యము. ఆ సమయమునఁ గలహాశనుఁడైన నారదుఁడను మహాముని కలహమెక్కడ లభించునా యని లోకముందుఁ దిరుగుచు నా వనములోపలఁ బోయిపోయి - తరువాతి పద్యముతో నన్వయము

తే అరుణ కిరణ సహస్రోదయంబు కంటె
మిగిలి గుహు తేజ మడర సమీప మెల్ల
సలలితద్యుతిఁ గాంచనాచలమ పోలె
సురుచిరంబగు నా సరోవరముఁ గనియె 53

అర్థము. గుహు - తేజము = కుమారస్వామి తేజస్సు, అరుణ - కిరణ-సహస్ర + ఉదయంబుకంటెన్ = వేయి వేవెలుఁగుల పుట్టుకకంటెను, మిగిలి = అతిశయించి, సమీపము + ఎల్లన్ = దగ్గఱి ప్రదేశమంతయు, అడరన్ = వ్యాపింపఁగా, స-లలితద్యుతిన్ = మనోహరమైన కాంతితో, కాంచన + ఆచలము+ అ = మేరుపర్వతమే, పోలెన్ = అనులాగున, సురుచిరంబు + అగు = మిక్కిలి సుందరమగు, ఆ - సరోవరమున్ = ఆ సరస్సును, కనియెన్ = చూచెను

తాత్పర్యము. కుమారస్వామితేజస్సు వేయి వేవెలుఁగుల కంటెను అధికమై దగ్గఱి ప్రదేశమంతయు వ్యాపింపఁగా మనోహరమైన కాంతితో మేరుపర్వతమేయన సుందరమైన ఆ సరస్సును నారదుఁడు చూచెను

విశేషములు : అలంకార ముపమ

వ. కని యిది యేమి తేజోవిశేసం బని కొలనుగలయం బరికించి చూచునప్పుడు.

అర్థము : కని = చూచి,ఇది, ఏమి, తేజస్ (3) + విశేషంబు = కాంతి విశేషము,అని, కొలను = సరస్సు, కలయన్ = అంతయును, పరికించి = పరీక్షించి, చూచు + అప్పుడు = చూచు సమయమున

తాత్పర్యము : చూచి ఇదియేమి కాంతి విశేషమని కొలనంతయును పరీక్షించి చూచు సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క. నలినాకరంబులోఁ దను
విలసితరుచు లలర గుహుఁడు వెలుఁగుచునుండెన్
జలరాశిలోన నెలకొని
వెలిఁగెడు నౌర్వాగ్రజాతవేదుఁడ పోలెన్ 55

అర్థము జలరాశిలోనన్ = సముద్రములో, నెలకొని = ఉండి, వెలిఁగెడు= ప్రకాశించెడి, ఔర్వ + ఉగ్ర - జాత వేమఁడు + అ + పోలెన్ = బడబాగ్నియనెడి భయంకరమైన అగ్నియే యనునట్లు, నలిన + ఆకరంబులోన్ =తామరకొలనిలో, తను - విలసిత - రుచులు = దేహముయొక్క ప్రకాశించుకాంతులు, అలరన్ = ఒప్పఁగా, గుహుఁడు = కుమారస్వామి, వెలుఁగుచున్ + ఉండెన్ = ప్రకాశించుచుండెను

తాత్పర్యము సముద్రములోనుండి ప్రకాశించు బడబాగ్నియను భయంకరాగ్నివలె, తామరకొలనిలో శరీరకాంతులొప్పఁగా గుహుఁడు ప్రకాశించుచుండెను

విశేషములు. అలంకార ముపమ

సీ వినువీధి నడయాడి విసివి తా నిచ్చలో
నిలఁ దావగొనియున్న వెలుఁగుతేఁడొ
లవణాబ్ధి వెలడు మైచవుడు వోఁ దియ్య నీ
రాడంగఁ జొచ్చిన యమృతకరుఁడొ
ముదిమివో నిందుల యుదకంబు సేవించి
యెలఁబ్రాయమై యున్న నలువ యొక్కొ
ఈ నేల గిరిమీఁద మే నొత్తునని తమ్మి
విరులపై నెనసిన గిరిశుఁడొక్కొ

ఆ యబ్జనిలయమైన యమ్మతో నరిమిలిఁ
దగిలియున్న తమ్మి దాల్పుఁడొక్కొ
యనుచు నుత్తరోత్తరైశ్వర్యుఁడగు బాలు
గారవించి చూచె నారదుండు 56

అర్థము. విను - వీధిన్ = ఆకాశవీధిలో, నడయాడి = సంచరించి, తాను ఇచ్చలోన్ = మనసులో, విసివి = విసువు చెంది, ఇలన్ = భూమిలో, తావగొని + ఉన్న = నెలకొనియున్న, వెలుఁగుతేఁడొ = సూర్యుఁడో,

లవణ + అబ్ధిన్ + ఉప్పుసంద్రమునుండి, వెలడు = వెలువడునట్టి, మై - చవుడు = ఒడలియుప్పుమట్టి, పోన్ = పోవునట్టు, తియ్య - నీరు + ఆడంగన్ = తియ్యని నీట స్నానమాడ, చొచ్చిన= ప్రవేశించిన, అమృతకరుఁడొ = చంద్రుఁడో

ముదిమి + పోన్ = ముసలితనము పోవుటకు, ఇందుల + ఉదకంబున్= ఇందలి నీటిని, సేవించి = త్రాగి, ఎలఁ బ్రాయము + ఐ + ఉన్న = లేఁతవయస్సుగలిగియున్న, నలువ - ఒక్కొ - బ్రహ్మయో,

ఱా - నేలన్ = ఱాతినేల మీఁద, గిరిమీఁదన్ = (కైలాస) పర్వతముపై, మేను = శరీరము, ఒత్తున్ + అని = గ్రుచ్చుకొనునని, తమ్మి - విరులపైన్ = తామరపూలపై, ఎనసిన = కూడిన, గిరిశుఁడు + ఒక్కొ = శివుఁడో

అబ్జ - నిలయ = తామరపూవు స్థానముగాఁ గలది, ఐన, అమ్మితోన్ = స్త్రీ (లక్ష్మి)తో, అరిమిలిన్ = ప్రేమముతో, తగిలి+ ఉన్న = కూడియున్న, తమ్మిదాల్పుఁడు + ఒక్కొ = పద్మనాభుఁడో - విష్ణువో,

అనుచున్, ఉత్తర + ఉత్తర + ఐశ్వర్యుఁడు = పోనుపోను ఐశ్వర్యవంతుఁడు, అగు, బాలున్ = పిల్లవానిని - కుమారస్వామిని, నారదుండు, గారవించి = ఆదరించి, చూచెన్

తాత్పర్యము. ఆకాశమున సంచరించి మనస్సున వినువుఁజెంది భూమిలో నెలకొనియున్న సూర్యుఁడో, ఉప్పునీటి సముద్రమునుండి వెలువడు ఒడలియుప్పు మట్టిపోవఁ దియ్యని నీట స్నానమాడుటకుఁ బ్రవేశించిన చంద్రుఁడో, ముసలితనము పోవ నీ సరస్సులోని జలమును ద్రావఁగా లేఁతవయసువాఁడైన బ్రహ్మయో, ఱాతినేలపైఁ కొండమీఁద మేను ఒత్తునని తామరపూలపైఁ గూడిన శివుఁడో, తామరపూవు నివాసస్థానముగాఁగల లక్ష్మితోఁ బ్రేమమునఁ గూడియున్న విష్ణువో అనుచు ఉత్తరోత్తరముగా నైశ్వర్యముగల బాలుని నారదుఁ డాదరముతోఁ జూచెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష పర్యాయోక్తము గిరిశుఁడు = గిరిపైఁబరుండువాఁడు - శివుఁడు అరిమిలి - అర్మిలి (రూపాం) ఉత్తరైశ్వర్యుఁడు - ఉత్తర + ఐశ్వర్యుఁడు వృద్ధి సంధి ఱా నేల ఱాయి + నేల - సమాసమున ఱాయిశబ్దము నంత్యాక్షరమునకు లోపము బాల ఆచ్చిక 21

వ మఱియునుం గమలబంధుండు బంధుభావంబునం గమలలక్ష్మి యింటికి విందు వచ్చినట్లు తేజోవిరాజితుండై సరోవరంబు నలంకరించుచున్న బాలకుం గని విస్మితుండై 'వీఁడు ప్రకృతిపురుషుం డన్యుల కజేయుం డమరేంద్రుం దెచ్చి పోరించి నేఁటి యాహారంబు గానగు నేనిం జూతు' నని యక్షణంబ సురపతిపాలికింజని తద్వృత్తాంతం బద్భుతంబుగా విశేషించి యెఱింగించి వెండియు

అర్థము. మఱియునున్, కమలబంధుండు = తమ్మిచుట్టము - సూర్యుఁడు, బంధు - భావంబునన్ = చుట్టటికముతో, కమల - లక్ష్మి + ఇంటికిన్= తామరయనెడి లక్ష్మి యింటికి, వచ్చిన + అట్లు, తేజస్ (ఃు)+ విరాజితుండు + ఐ = తేజస్సుతోఁ బ్రకాశించువాఁడయి, సరోవరంబున్ = సరస్సును, అలంకరించుచున్ + ఉన్న, బాలకున్, కని, విస్మితుండు + ఐ = ఆశ్చర్యపడినవాఁడయి, వీఁడు, ప్రకృతి - పురుషుండు = సహజపురుషుఁడు, అన్యులకున్ = ఇతరులకు, అజేయుండు = గెలువరానివాఁడు, అమర + ఇంద్రున్= దేవేంద్రుని, తెచ్చి, పోరించి = పోరునట్లు చేసి, నేఁటి + ఆహారంబు = ఈనాఁటి భోజనము, కానన్ + అగున్ + ఏనిన్ + చూతున్ = పొందవచ్చునేమో చూచెదను, అని, అక్షణంబు + అ = వెంటనే, సురపతి - పాలికిన్ = దేవేంద్రుని యొద్దకు, చని, తద్+ వృత్తాంతంబు, అద్భుతంబుగాన్ = ఆశ్చర్యకరముగా, విశేషించి = వివరించి, ఎఱింగించి= తెలిపి, వెండియున్ = మఱియును

తాత్పర్యము మఱియును సూర్యుఁడు బంధుత్వముతోఁ దామరయనెడి లక్ష్మి యింటికి వచ్చిన విధమునఁ దేజస్సుచేఁ బ్రకాశించువాఁడయి సరస్సు నలంకరించుచున్న బాలునిఁ జూచి ఆశ్చర్యపడి, 'వీఁడు సహజపురుషుఁడు ఇతరులకు గెలువరానివాఁడు దేవేంద్రునిఁ దెచ్చి వీనితోఁ బోరునట్లు, చేసి యీనాఁటి భోజనమును పొందవచ్చునేమో చూచెద' నని వెంటనే దేవేంద్రునికడకు వెడలి, యా వృత్తాంత మాశ్చర్యకరముగా వివరించి చెప్పి మఱియును - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

క దనుజారికంటె వీరుఁడు
దినవల్లభుకంటె నధికతేజుఁడు, పద్మా
సనుకంటె మహాత్ముఁడు, త్రిన
యనుకంటె విశేషుఁ డురుతరైశ్వర్యమునన్. 58

అర్థము. దనుజ + అరి - కంటెన్ = రాక్షసుల శత్రువగు విష్ణువు కంటెను, వీరుఁడు= పరాక్రమవంతుఁడు, దిన- వల్లభుకంటెన్ = దినపతియైన సూర్యుని కంటెను, అధిక - తేజుఁడు = ఎక్కువ తేజస్సుగలవాఁడు, పద్మ + ఆసనుకంటెన్= పద్మము పీఠముగాఁ గల బ్రహ్మకంటెను, మహాత్ముఁడు= గొప్పవాఁడు, ఉరుతర+ ఐశ్వర్యమునన్ = మిక్కిలి గొప్ప ఐశ్వర్యమునందు, త్రినయనుకంటెన్ = ముక్కంటి కంటెను, విశేషుఁడు = అధికుఁడు

తాత్పర్యము. ఆ బాలుఁడు విష్ణువుకంటెను వీరుఁడు సూర్యుని కంటెను అధికమైన తేజస్సుగలవాఁడు బ్రహ్మకంటెను మహాత్ముఁడు మిక్కిలి గొప్పయైశ్వర్యమునందు శివునికంటెను అధికుఁడు

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము 59

చ హరునకు నెద్ది పేర్మి, దనుజారికి నెద్ది రమావిభూతి, భా
స్కరునకు నెద్ది తేజము దిశాపతి సంహతి కెద్ది నిల్పు, చం
దురునకు నెద్ది కాంతియుఁ, జతుర్దశలోకవిభుత్వ మెద్ది నీ
కిరవుగ నా కుమారుఁ డిల నింకొక యించుక సేపు నిల్చినన్? 60

అర్థము. ఆ - కుమారుఁడు = ఆ బాలుఁడు, ఇరవుగన్ = స్థిరముగా, ఇలన్ = భూమియందు, ఇంకన్ + ఒక + ఇంచుక - సేపు = ఇఁక నొకింత సేపు, నిల్చినన్ = నిలిచినచో, హరునకున్ = ఈశ్వరునకు, పేర్మి = గొప్పతనము, ఎద్ది= ఏది ? లేదనుట, దనుజ + అరికిన్ = రాక్షసశత్రువగు విష్ణువునకు, రమా - విభూతి= అక్ష్మి - సంపద, - ఎద్ది ? భాస్కరునకున్ = సూర్యునకు, తేజము, ఎద్ది, దిశా - పతి - సంహతికిన్ = దిక్పతుల సమూహమునకు, నిల్పు = నిలుకడ, ఎద్ది? చందురునకున్ = చంద్రునకు, కాంతియున్, ఎద్ది, నీకున్, చతుర్ + దశ - లోక-విభుత్వము = పదునాలుగు లోకముల ప్రభుత్వము ఎద్ది ?

తాత్పర్యము . 'ఆ బాలుఁడు స్థిరముగ భూమియందు ఇంకొక యించుకసేపు నిలిచినచో ఈశ్వరునకు గొప్పతన మేది ? విష్ణువునకు లక్ష్మి సంపద యేది ? సూర్యునకుఁ దేజ మెక్కడ ? దిక్పాలకులకు నిలుకడ యెక్కడ ? చంద్రునకుఁ గాంతి యెక్కడ ? నీకుఁ బదునాలుగుభువనముల ప్రభుత్వము ఎక్కడ ?

సురపతి కుమారునిపై నెత్తివచ్చుట

వ అని యమ్మునిపతి సురపతికి నేలతలఁ గాలు నిలువకుండునట్టి భయంపువార్త చెప్పిన విని యదరిపడి యక్షణంబ వజ్రి వజ్రాయుధాద్యనేక దివ్యాయుధంబులు గొని యైరావతగజేంద్రారూఢుఁడై యతిరయంబునఁ దత్సరోవరంబునకుఁ జనుదెంచి యబ్బాలకుం గనుంగొని మేను కఱకెక్కి వెక్కసం పడి శిరఃకంపంబు సేయుచు 61

అర్థము అని, ఆ + ముని - పతి = ఆ మునీశ్వరుఁడు - నారదుఁడు, సుర - పతికిన్ = దేవేంద్రునకు, నేలతలన్ = నేలమీఁద, కాలు - నిలువక - ఉండు + అట్టి, భయంపు - వార్త (భయము + వార్త) = భయంకరమైన వార్త, చెప్పినన్, విని, అదరిపడి, అక్షణంబు = వెంటనే, వజ్రి = ఇంద్రుఁడు (వజ్రాయుధము గలవాఁడు, వజ్ర + ఆయుధ + ఆది + అనేక - దివ్య + ఆయుధంబులు = వజ్రాయుధము మున్నగు పెక్కు దివ్యములైన ఆయుధములు, కొని, ఐరావత - గజ+ఇంద్ర + ఆరూఢుండు + ఐ = ఐరావత మనెడి గజశ్రేష్ఠమును ఎక్కినవాఁడయి, అతి - రయంబునన్ = మిక్కిలి వేగముతో, తద్ + సరోవరంబునకున్ = ఆ సరస్సునకు, చనుదెంచి = వచ్చి, ఆ + బాలకున్, కనుంగొని, మేను = శరీరము, కఱకు + ఎక్కి = గగురుపొడిచి, వెక్కసంపడి - (వెక్కసము + పడి) = ఆశ్చర్యపడి శిరస్ (.) + కంపంబు +చేయుచున్ = తల యూఁచుచు

తాత్పర్యము అని ఆ మునిశ్రేష్ఠుఁడైన నారదుఁడు దేవేంద్రునకు నేలపైఁ గాలు నిలువకుండునట్టి భయంకరవార్తను జెప్పఁగా విని అదరిపడి వెంటనే ఇంద్రుఁడు వజ్రాయుధము మున్నగు పె క్కాయుధములు గొని యైరావతమునెక్కి మిక్కిలివేగమున నా సరస్సునకు వచ్చి ఆ బాలునిఁ జూచి మేను గగుర్పొడువ ఆశ్చర్యపడి తల యూఁచుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ వెలుఁగు కుమారతేజమున వేఁడిమి తాఁకినయంత వేయుఁగ
న్నులు మిఱుమిట్లువోయినఁ గనుంగొన నేరక మూసికొన్న ఱె
ప్పలు కమరంగవిచ్చె నురుభాస్కరతీవ్రకరప్రభాతికి
న్నులికి రయంబున న్మొగిడియున్న కుముద్వతివోలె భీతితోన్ 62

అర్థము. పూర్వవచనము నందలి వజ్రి ఇందుఁ గర్త

ఉరు - భాస్కర - తీవ్ర - కర - ప్రభాతికిన్ = గొప్ప సూర్యుని తీక్ష్ణమైన కిరణములయొక్క అధికకాంతికి, ఉలికి = భయపడి, రయంబునన్ = శీఘ్రముగా, మొగిడి+ ఉన్న = ముడుచుకొనియున్న, కుముద్వతి + పోలెన్ = తెల్లకలువలుగల సరస్సువలె, వెలుఁగు = ప్రకాశించునట్టి, కుమార - తేజమున - వేఁడిమి = బాలుని తేజస్సు నందలి వేఁడి, తాఁకిన + అంతన్ = తగులఁగానే, వేయున్ + కన్నులున్ = వేయి కన్నులును, మిఱుమిట్లు + పోయినన్, భీతితోన్ = భయముతో, కనుంగొనన్ + నేరక = చూడఁజాలక, మూసికొన్న = మూసికొన్నట్టి, ఱెప్పలు, కమరంగన్ = కాలఁగా, విచ్చెన్ = విప్పెను

తాత్పర్యము . అధికమైన సూర్యతీక్ష్ణ కిరణముల ప్రకృష్టమైనకాంతికి భయపడి శీఘ్రముగా ముడుచుకొనియున్న తెల్లకలువలకొలని విధమునఁబ్రకాశించు బాలుని తేజస్సునందలి వేఁడిమి తగులఁగనే తనవేయికన్నులును మిఱుమిట్లు గొలుపఁగా నింద్రుఁడు భయమునఁ జూడఁజాలక మూసికొనిన తెప్పలు కాలఁగా వెలసెను

విశేషములు . అలంకార ముపమ స్వభావోక్తి 'ఉరు భాస్కర తీవ్రకర ప్రభాతిఁ గన్నులికి' అని పారము గలదు దానికి ఉరు భాస్కరతీవ్ర కర ప్రభాతిచే, కన్ను + ఉలికి = కన్నుచెదరి - యని యర్థము చెప్పవలసియుండును ' ప్రభాతికి న్నులికి = ప్రభాతికిన్ + ఉలికి -'కొన్నియెడలఁ బ్రామాణికప్రయోగంబులం ద్రుతంబున కచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి ' ప్రౌఢ సంధి 3 కుముద్వతి - తెల్లకలువల తీఁగ, తెల్ల కలువల సరస్సు - అను రెండర్థములలో ఇంద్రుని కుపమానముగా రెండవయర్థమే గ్రహింపఁబడినది

వ ఇట్లనిమిషేశ్వరుండు వెక్కసంపడి యుక్కుడించి తన వచ్చినతప్పునకు దూరభీతుండై పోవనేరక కుమారుమీఁద నభ్రగజంబుం గొలిపినఁ దెరలం బఱతెంచు వెల్లేనుఁగుం గని హరుపట్టి పట్టి యాడ నగునని పట్టికొనం బఱతెంచుటం గని పర్జన్యుండు ప్రళయ కాల పర్జన్యుండునుంబోలె నబ్బాలకుపై ననేకాస్త్రవర్షంబులు గురిసిన 63

అర్థము : ఇట్లు, అనిమిష + ఈశ్వరుండు = దేవాధిపతి, వెక్కసంపడి - వెక్కసము + పడి = దుస్సహత్వమునంది, ఉక్కుడించి = బలము తగ్గి, తన - వచ్చిన - తప్పునకున్ = తాను వచ్చిన తప్పునకు, దూర - భీతుండు + ఐ = దవ్వులనుండియే భయపడినవాఁడయి, పోవన్ + నేరక = పోఁజాలక, కుమారుమీఁదన్, అభ్రగజంబున్ = ఐరావతమును, కొలిపినన్ = పురికొలుపఁగా, తెరలన్ + పఱతెంచు = బయలుదేఱివచ్చు, వెల్లేనుఁగున్ (వెల్ల+ ఏనుఁగున్) = తెల్ల యేనుఁగును - ఐరావతమును, కని, హరు - పట్టి = శివుని కుమారుఁడు - కుమారస్వామి, పట్టి + ఆడన్ + అగును + అని = పట్టుకొని ఆడుకొనవచ్చునని, పట్టుకొనన్ + పఱతెంచుటన్ - కని = పట్టుకొనుటకు వచ్చుటను జూచి, పర్జన్యుండు = ఇంద్రుఁడు, ప్రళయ - కాల - పర్జన్యుండునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి మేఘమువలె, ఆ + బాలకుపైన్ = ఆ బాలుని మీఁద, అనేక + అస్త్ర - వర్షంబులు = పెక్కు అస్త్రముల వానలు, కురిసినన్ = కురియఁగా

తాత్పర్యము. ఇట్లు దేవేంద్రుఁడు దుస్సహత్వమును బొంది బలము తగ్గి, తాను వచ్చిన తప్పునకు దూరమునుండియే భయపడినవాఁడయి, పోఁజాలక, కుమారుని మీఁది కైరావతమును బురి కొల్పఁగా బయలుదేటివచ్చు నైరావతమును జూచి కుమారస్వామి దానిని బట్టుకొని ఆడుకొనవచ్చునని పట్టుకొనవచ్చుట చూచి ఇంద్రుఁడు ప్రళయకాలమేఘమువలె ఆ బాలునిపైఁ బెక్కు అంపవానలు గురియఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకార ముత్ప్రేక్ష

తే అలిగి దేవేంద్రుఁ డేయు నుగ్రాస్త్రములు కు
మారు భేదింపనోపక మగిడె వీత
రాగియైయున్న నిర్వాణయోగిఁ దూఱఁ
గొనక క్రమ్మఱు సతుల చూడ్కులను బోలె 64

అర్థము అలిగి = కోపించి, దేవ + ఇంద్రుఁడు, ఏయు = ప్రయోగించు, ఉగ్ర + అస్త్రములు = భయంకరములయిన బాణములు, కుమారున్ = కుమారస్వామిని, భేదింపన్ + ఓపక = భేదింపలేక, వీత- రాగి + ఐ = పోయిన అనురాగము గలవాఁడు - అనురాగము లేనివాఁడు, అయి, ఉన్న, నిర్వాణ - యోగిన్= మోక్షము కొఱకు యోగియైన వానిని, తూఱఁగొనక = తూఱుకొనక = ప్రవేశింపక, క్రమ్మఱు = మరలిపోవునట్టి, సతుల = స్త్రీలయొక్క, చూడ్కులను + పోలెన్ = చూపులవలె, మగిడెన్ = మరలెను

తాత్పర్యము. కోపముతో దేవేంద్రుఁడు ప్రయోగించు భయంకరాస్త్రములు కుమారుని భేదింపఁజాలక, అనురాగవిహీనుఁడైన మోక్షయోగిని జేరలేక మరలిపోవు స్త్రీల చూపులవలె మరలెను

విశేషములు : అలంకార ముపమ వీతరాగి - బహువ్రీహి సమాసము నంతమున 'ఇన్' ప్రత్యయము వచ్చుట విశేషము - వీతరాగుఁడై అని యుండనగును

వ ఇట్లు నిజాస్త్రహతి నక్షతదేహుండును ననివార్యశౌర్యుండును నై పఱతెంచు బాలకుం గని హరి కరి నలిగించి కొలిపిన 65

అర్థము: ఇట్లు, నిజ + అస్త్ర - హతిన్ = తనవైన అస్త్రముల దెబ్బచే, అక్షత - దేహుండును = గాయపడని శరీరముగలవాఁడును, అనివార్య - శౌర్యుండునున్

+ ఐ - అడ్డగింపరాని పరాక్రమముగలవాఁడును నయి, పఱతెంచు = వచ్చు, బాలకున్ = బాలుని, కని, హరి = ఇంద్రుఁడు,కరిన్ = ఏనుఁగును, అలిగించి = కోపగింపఁజేసి, కొలిపినన్ = పురికొలుపఁగా

తాత్పర్యము . ఇట్లు తన యస్త్రములదెబ్బచే గాయపడని శరీరముగలవాఁడును, నివారింపరాని శౌర్యము గలవాఁడును అయి వచ్చు బాలుని జూచి ఇంద్రుఁడు ఐరావతమును గోపింపఁజేసి పురికొల్పఁగా - తరువాతి పద్యముతో నన్వయము

సీ బలభేదికరి దొడ్కిపట్టఁ జేసాఁచుడు
శివసూతి పెనఁచి చేసేతఁబట్టి
కుదిసి రాఁ దిగుచుడు మదమఱి కాల్కొన
కొఱలుచు నేలఁ గొ మ్మ్రోఁది మ్రొగ్గె
నంత దృఢాసీనుఁడై వజ్రి నిజకరిఁ
దడయ కంకుశమునఁ బొడిచి యెత్తి
కోపించి గుహుమీఁదఁ గొలిపినఁ బైఁబెట్ట
కది మొగతిరుగుడు నమరనాథుఁ

ఆ డంకుశమున మడమనార మంగుటమున
నాఁక గొనుచుఁ గొలుప నరుగ నెదుర
నలవి గాక కరి రయంబున జిఱ్ఱున
సారివోలె నొక్క గోరఁ దిరిగె 66

అర్థము . బలభేది -కరి= బలుఁడనువానిని జంపిన వాని (ఇంద్రుని) 'యేనుఁగు -ఐరావతము, తొడ్కి -పట్టన్ = ఒడిసిపట్టుకొనుటకు, చే + చాఁచుడున్= చేయి (తొండము) చాఁచినంతనే, శివ -ి సూతి = శివుని కొడుకు - కుమారస్వామి, పెనఁచి = మెలిపెట్టి, చేసేతన్ + పట్టి = స్వయముగాఁ బట్టి, కుదిసి - రాన్ = క్రుంగి వచ్చునట్లు, తిగుచుడున్ = లాగినంతనే, మదము + అఱి = క్రొవ్వు అడఁగి, కాల్కొనక (కాలు + కొనక) = కాలూనక,, ఒఱలుచున్ = అఱచుచు, నేలన్, కొమ్మ్ + ఊఁది = దంతమును ఆన్చి, మ్రొగ్గెన్ = మోఁకరిల్లెను

అంతన్, వజ్రి = ఇంద్రుఁడు, దృఢ + ఆసీనుఁడు + ఐ = గట్టిగా గూర్చున్నవాఁడయి, నిజ - కరిన్ = తనయేనుఁగును,తడయక = ఆలస్యముచేయక,

ఆంకుశమునన్ = ఆంకుశముతో, పొడిచి, ఎత్తి, కోపించి, గుహు - మోఁదన్ = కుమారస్వామి మోఁద, కొలిపినన్ = పురికొల్పఁగా, అది = ఆ యేనుఁగు, పైన్ + పెట్టక = మోఁదఁబడక, మొగతిరుగుడున్ = పెడమొగము పెట్టినంతనే, అమర - నాథుఁడు = దేవేంద్రుఁడు అంకుశమునన్, మడమనారన్, అంగుటమునన్ = అంగుష్ఠముతో, ఆఁక + కొనుచున్ + ఆఁగుచు, కొలుపన్ + అరుగన్ = పురికొల్పవెడలఁగా, ఎదురన్ + అలవి - కాక = ఎదిరింపశక్తి లేక, కరి = ఏనుఁగు, రయంబునన్ = వేగముతో, జిఱ్ఱనన్ = జిఱ్ఱయను ధ్వని కలుగునట్లుగా, సారి + పోలెన్ = కుమ్మరి చక్రము వలె, ఒక్క- గోరన్ = ఒక్కగోరిపై, తిరిగెన్

తాత్పర్యము . ఐరావతము కుమారుని ఒడిసిపట్టుటకుఁ దొండమును ఊఁచినంతనే, కుమారస్వామి మెలిపెట్టి స్వయముగాఁ బట్టి క్రుంగివచ్చునట్లు లాగెను అంత నది మదమును గోలుపోయి నిలువలేక అఱచుచు నేలపై దంతమునాని మోఁకరిల్లెను అంత నింద్రుఁడు బాగుగాఁ గూర్చున్నవాఁడయి తన యేనుఁగును ఆలసింపక అంకుశముతోఁ బొడిచి యెత్తి కుమారస్వామి పైకిఁ బురికొల్పెను అప్పుడది వీనిపైఁ బడక పెడమొగముపెట్టఁగా నింద్రుఁడంకుశమున బొటనవ్రేలితో నాఁగుచుఁ బురికొలుపఁగా నేనుఁగు ఎదురఁజాలక వేగముతో జిఱ్ఱయనుధ్వని కలుగునట్లు కుమ్మరిసారివలె ఒక్కగోరిపైఁ దిరిగెను

విశేషములు అలంకారము స్వభావోక్తి ఉపమ

వ త దవసరంబున ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము **67**

క సురపతి కోపించి భయం
కరముగ వజ్రమున వైచెఁ గని గుహుఁడు బిసాం
కురమునఁ దట్టుడు నది గత
సరభసగతిఁ దూలిపాఱి శరనిధిఁ బడియెన్ **68**

అర్థము : సురపతి = ఇంద్రుఁడు, కోపించి, భయంకరముగన్ = వెఱపుగొలుపునట్లు, వజ్రమునన్, వైచెన్ = కొట్టెను, గుహుఁడు = కుమారస్వామి, కని, బిస + అంకురమునన్ = తామరతూఁటి మొలకతో, తట్టుడున్ = తాఁకినంతనే, అది = వజ్రము, గత - సరభస - గతిన్ = వేగ గమనముపోయి, తూలి = చలించి, పాఱి, శరనిధిన్ = సముద్రమున, పడియెన్

తాత్పర్యము . ఇంద్రుఁడు కోపముతో భయంకరముగా వజ్రముతోఁ గొట్టెను అది చూచి కుమారస్వామి తామరతూఁటిమొలకతో దానిని దాఁకెను అంత నా వజ్రము మెల్లఁగాఁ జలించి పాటి సముద్రమునఁ బడెను

క నుత బిందుబిసము లీశ్వర
సుతు చేతిని నిల్చి బలిమి సురవల్లభు నా
శతధార నోర్చె నల్పులు
నతిసత్త్వులఁ గూడి బలియు లగు డది యరుదే ? 69

అర్థము . నుత - బిందు - బిసములు = పొగడఁబడిన లవము లైన తామరతూండ్లు - తామరతూండ్ల లేశములు, ఈశ్వర - సుతు - చేతినిన్ = ఈశ్వరుని కొడుకైన కుమారస్వామి చేత, నిల్చి, బలిమిన్ = బలముతో, సుర - వల్లభు + ఆ - శతధారన్ = దేవేంద్రుని ఆ వజ్రాయుధమును, ఓర్చెన్ = ఓడించెను, అల్పులున్ = హీనులు సైతము, అతి - సత్త్వులన్ = మహాబలవంతులను, కూడి, బలియులు = బలవంతులు, అగుడు = అగుట, అది, అరుదే = ఆశ్చర్యమా?

తాత్పర్యము . తామరతూండ్ల లేశములు కుమారస్వామి చేత నిలిచి బలముతో నింద్రుని వజ్రాయుధము నోడించెను అల్పులు సైతము మహాబలవంతులను గూడుచో బలవంతులగుట ఆశ్చర్యమా ? కా దనుట

విశేషములు : అలంకార మర్థాంతరన్యాసము ఓర్చు ఓడు ధాతువు 'చుగాగమం బాచ్ఛికంబున కసంయుక్త న ల డ రాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు ' బాల క్రియ 73 ఓడు + చు 'ఆ డోడు కూడుల డకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫంబగు ' బాల క్రియ 80 ఓరుచు 'ఆచ్ఛికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు ' బాల ప్రకీర్ణ 17 ఓర్చు

వ ఇట్లు వజ్రి దివ్యాయుధంబైన యవ్వజ్రాయుధంబు తప్పిన నెవ్వెఱఁగు వడి యున్నంతఁ గుమారుచేతి బిసప్రహతి కబ్బగింపక 70

అర్థము : ఇట్లు, వజ్రి = ఇంద్రుఁడు, దివ్య + ఆయుధంబు + ఐన, ఆ+ వజ్ర + ఆయుధంబు, తప్పినన్, నెవ్వెఱఁగు + పడి +ఉన్న + అంతన్ = మిక్కిలి ఆశ్చర్యపడియున్నంత, కుమారుచేతి = కుమారునిచేతనున్న, బిస - ప్రహతికిన్ = తామరతూఁటి దెబ్బకు, అబ్బగింపక = ఓర్వక

తాత్పర్యము . ఇట్లు ఇంద్రుఁడు దివ్యాయుధమైన ఆ వజ్రాయుధము తప్పిపోవుటకు మిక్కిలి అచ్చెరువందియున్నంతఁ గుమారునిచేతి తామరతూఁటి దెబ్బ కోర్వక - తరువాతి పద్యముతో నన్వయము

క ఆ నాకపతిగజంబు ష
డాననుఁ గని వెఱచి పఱచె నది చోద్యమె పం
చాననున కోడు కరులు ష
డానన విపరీత గతి భయంపడకున్నే ? 71

అర్థము . ఆ - నాక - పతి - గజంబు = ఆ స్వర్గాధిపతియగునింద్రుని యేనుఁగు- ఐరావతము, షష్ (ట్) + అననున్ = ఆఱుమొగముల వానిని (కుమారస్వామిని), కని, వెఱచి = భయపడి, పఱచెన్ = పాఱిపోయెను అది = అట్లుపాఱిపోవుట, చోద్యమె = వింతయా ? పంచ + ఆననునకున్ = విస్తృతమైన ముఖము గలదానికి- సింహమునకు - అయిదు ముఖములు గలదానికని అర్థాంతరము, ఓడు = భయపడు, కరులు = ఏనుఁగులు, షష్ (ట్) + ఆనను - విపరీత -గతిన్ = ఆఱుమొగములు గలవాని (కుమారస్వామియొక్క) ప్రతికూలమైన గతిచేత, భయంపడక (భయము + పడక)+ ఉన్నే = భయపడకుండునా ?

తాత్పర్యము . ఆ యింద్రుని యేనుఁగగునైరావతము ఆఱుమొగములవానిని జూచి వెఱచి పాఱిపోయెను అది ఏమి వింత ? పంచాననమును (విస్తృతమైన ముఖముగలదానికి - సింహమునకు) అయిదు ముఖములు గలదాని కని అర్థాంతరము భయపడు నేనుఁగులు ఆఱుమొగములు గలవాని ప్రతికూలగతికి భయపడకుండునా ?

విశేషములు అయిదు మొగముల గలదానికే భయపడు నేనుఁగు ఆఱుమొగములవానికి భయపడుననుటలో ఆశ్చర్యమేమున్నదని స్వారస్యము అలంకార మర్థాంతరన్యాసము శ్లేషము కావ్యార్థాపత్తి భయంపడు - భయము + పడు - 'పడ్వాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోపపూర్ణబిందులు విభాష నగు బాలసంధి 46 ఉన్నే ఉండును + ఏ - 'ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు, చను, చేరుకొనులు ప్రశ్నార్థకై కారపరకంబులగునపుడు వానికడయచ్చులకు లోపంబు విభాష నగు అగుచో నుండు డకారంబునకు నకారంబగు ' ప్రౌఢ క్రియ 2

చ హరికరి యోడి పాఱెడు రయంబున ఘంటలు రెండు ప్రక్కలం
దరమునఁ జాగఁ గట్టిన విధంబున వారక మ్రోయకుండెఁ ద
త్పురవరపార్శ్వదృష్ట హరపుత్రక తీవ్రతరప్రభాతి భీ
కరశిఖిఁ గ్రాఁగి పేరఁబడు ఘంటలొకో యనఁ దద్ద పొల్పుగాన్ 72

అర్థము. హరి - కరి = ఇంద్రుని యేనుఁగు - ఐరావతము, ఓడి, పాఱెడు-రయంబునన్ = పరువెత్తిపోవు వేగమున, ఘంటలు = గంటలు, రెండు ప్రక్కలన్, తరమునన్ = క్రమముగా, చాగన్ = సాగునట్లు, కట్టిన విధంబునన్ = కట్టినరీతిగా, తద్ + పుర - వర = ఆ పురశ్రేష్ఠముయొక్క, పార్శ్వ = ప్రక్కలందు, దృష్ట = చూడఁబడిన,హర - పుత్రక = శివుని కొడుకు (కుమారస్వామి) యొక్క, తీవ్ర-తర = మిక్కిలి తీక్ష్ణమైన, ప్రభాతి = కాంతియనెడు, భీకర - శిఖిన్ = భయంకరమైన అగ్నిచేత, క్రాఁగి = తపించి, పేరఁబడు = ముద్దయైన, ఘంటలు+ ఒకో = గంటలా, అనన్, తద్ద - పొల్పుగాన్ = మిక్కిలి యొప్పుగా, వారక = తప్పక, మ్రోయక + ఉండెన్

తాత్పర్యము. ఐరావతము ఓడిపోయి పాఱిపోవువేగమున, క్రమముగా రెండు ప్రక్కలను గంటలు సాగునట్లు కట్టిన రీతిగా, ఆ పురము పార్శ్వములఁ జూడనగు కుమారస్వామి తీక్ష్ణమయిన తేజస్సనెడు భయంకరాగ్నిచేఁ గ్రాఁగి కరఁగి ముద్దయైన గంటలా యన మిక్కిలి యొప్పుగా తప్పక మ్రోయకుండెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

క. త్రినయనపుత్రకుఁ డట వెను
కొన సురపతి పఱచె మఱువుకొన నజుని హరిం
గని యెందు శరణు గానక
చనియె మహాదేవ నీవ శరణను భాతిన్ 73

అర్థము: త్రినయన - పుత్రకుఁడు = ముక్కంటి కొడుకు - కుమారస్వామి, అటన్ = అక్కడ, వెనుకొనన్ = వెంబడింపఁగా, సుర - పతి = దేవేంద్రుఁడు, మఱువుకొనన్ = దాఁగుకొనుటకు, పఱచెన్ = పరువెత్తెను, అజునిన్ = బ్రహ్మను, హరిన్ = విష్ణువును, కని = చూచి ఎందున్, శరణు, కానక, మహాదేవ = ఓయి శివా, నీవు + అ = నీవే, శరణు + అను - భాతిన్ = శరణనువిధమున, చనియెన్

తాత్పర్యము. కుమారస్వామి వెంబడింపఁగా నింద్రుఁడు దాఁగికొనుటకుఁ బరువెత్తెను అతఁడు బ్రహ్మను విష్ణువును జూచి యెందును శరణుగానక ఓయి మహాదేవా! నీవే శరణనువిధమునఁ జనెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ ఇ ట్లనిమిషపతి నిమిషార్ధంబునకుం జతుర్దశభువనంబులకుం గుమారుం డెయిది వెనుకొన మనోవేగంబునం బఱచి యెందును శరణుగానక శరణాగతవజ్రప్రాకారుండైన పరమేశ్వరు మఱువు సొరం బఱతెంచునప్పుడు 74

అర్థము. ఇట్లు, అనిమిష - పతి = దేవేంద్రుఁడు, నిమిష + అర్ధంబునకున్= ఱెప్పపాటు కాలములో సగమునకు, చతుర్దశ - భువనంబులకున్ = పదునాలుగులోకములకును, కుమారుండు, ఎయిది = సాగి, వెనుకొనన్ = వెంబడింపఁగా, మనస్ (ఃసు) + వేగంబునన్, పఱచి, ఎందును, శరణు + కానక, శరణ + ఆగత - వజ్ర - ప్రాకారుండు = శరణుకొఱకు వచ్చిన వారికి వజ్ర నిర్మిత ప్రాకారమైన వాఁడు, ఐన, పరమేశ్వరు - మఱువు = ఈశ్వరుని మఱుఁగు, చొరన్= చొచ్చుటకు, పఱతెంచు + అప్పుడు = వచ్చుసమయమున

తాత్పర్యము ఇట్లు దేవేంద్రుఁడు అర్ధ నిమిషములోఁ బదునాలుగు లోకములకును గుమారస్వామి వెంబడింపఁగా మనోవేగమునఁ బరువెత్తి యెచ్చటను శరణుగానక శరణాగతులకు వజ్రమయప్రాకారమయిన పరమేశ్వరుని మఱుఁగుచొచ్చుటకు వచ్చు సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

తే బలసి తేజంబు దిక్కులఁ బ్రజ్విల్ల
దిగ్గజేంద్రంబు వెనుదెంచెఁ దెరలి గుహుఁడు
శరధిఁ జొరఁబాఱు ధారుణీధరము పిఱుఁద
నంటఁదగులు మహాశనియట్లు వోలె 75

అర్థము గుహుఁడు = కుమారస్వామి, బలసి = చుట్టుకొని, తేజంబు = తేజస్సు, దిక్కులన్, ప్రజ్వరిల్లన్ = వెలుఁగఁగా, దిశ్ (క్) + గజ + ఇంద్రంబున్ = దిగ్గజశ్రేష్ఠమును - ఐరావతమును, శరధిన్ = సముద్రమును, చొరఁబాఱు = ప్రవేశించు, ధారుణీధరము - పిఱుఁదన్ = కొండవెంట, అంటన్ + తగులు =

తఱుము నట్టి, మహాత్ (మహా) + అశని + అట్లు + పోలెన్ = గొప్ప వజ్రాయుధమువలె, తెరలి = బయలుదేఱి, వెనుదెంచెన్ = వెంబడించెను

తాత్పర్యము. కుమారస్వామి తేజస్సు చుట్టుకొని దిక్కులందు వెలుఁగఁగా నైరావతమును, సముద్రమునఁ జొచ్చుటకుఁ బరువెత్తు కొండవెనుకఁ దఱుమునట్టి వజ్రాయుధము విధమున వెంబడించెను

విశేషములు . అలంకార ముపమ

వ ఇట్లు శరణు వేఁడుచు నైరావతగజారూఢుండై పఱతెంచు సురేంద్రు వెనుదెంచు కుమారుం జితమారుండు కని గిరిసుతకు నీ సుతుండని తద్వృత్తాంతం బెఱింగించునంతన వచ్చి తన మఱువు సొచ్చిన సురేశ్వరున కభయహస్తం బిచ్చి కుమారుం గనుంగొని కరతలాస్ఫాలనంబు చేసి చేతులు పచరింపుచున్న జననీజనకులం గని 76

అర్థము : ఇట్లు, శరణు - వేఁడుచున్, ఐరావత - గజ + ఆరూఢుండు + ఐ = ఐరావతమను ఏనుఁగు నెక్కినవాఁడయి, పఱతెంచు = వచ్చు, సుర + ఇంద్రున్ = దేవేంద్రుని, వెనుదెంచు = వెంబడించు, కుమారున్ = కుమారస్వామిని, జిత-మారుండు = జయింపఁబడిన మన్మథుఁడు గలవాఁడు - శివుఁడు, కని, గిరి-సుతకున్ = కొండకూఁతునకు - పార్వతికి, నీ - సుతుండు + అని = నీ కొడుకని, తద్ + వృత్తాంతంబు, ఎఱింగించు + అంతన్ + అ = తెలిపినంతనే, వచ్చి, తన-మఱువు + చొచ్చిన, సుర + ఈశ్వరునకున్, అభయ - హస్తంబు + ఇచ్చి = భయము లేదని చెప్పి, కుమారున్, కనుంగొని, కర - తల + ఆస్ఫాలనంబు + చేసి= చేతితోఁదట్టి, చేతులు, పచరించుచున్ + ఉన్న = చాఁచుచున్న, జననీ - జనకులన్ = తల్లిదండ్రులను, కని

తాత్పర్యము: ఇట్లు శరణువేఁడుచు నైరావతగజము నెక్కి వచ్చు నింద్రుని వెంబడించు కుమారుని శివుఁడు చూచి పార్వతికి నీ కొడుకని ఆ వృత్తాంతమును దెలిపినంతనే వచ్చి తన మఱుఁగు చొచ్చిన యింద్రున కభయహస్తమిచ్చి కుమారుని జూచి చేతితోఁ దట్టి చేతులు చాఁచు తల్లిదండ్రులను జూచి - తరువాతి పద్యముతో నన్వయము

క ఆ హరి విడిచి నిసర్గ
స్నేహంబునఁ బాఱుదెంచెఁ జెచ్చెర సుమనో
దోహలమున వరపుత్రో
త్సాహంబున గుహుఁడు తల్లిదండ్రుల కడకున్ 77

అర్థము: గుహుఁడు = కుమారస్వామి, ఆ - హరిన్ = ఆ ఇంద్రుని, విడిచి, నిసర్గ - స్నేహంబునన్ = సహజమైన ప్రేమముతో, చెచ్చెరన్ = శీఘ్రముగా, సుమనస్ (ఃఁ) + దోహలమునన్ = మంచి మనస్సునందలి ఉత్సాహముతో, వర - పుత్ర + ఉత్సాహంబునన్ = సత్పుత్రుని ఉత్సాహముతో, తల్లి + తండ్రుల - కడకున్,పాఱుదెంచెన్ = పరువెత్తి వచ్చెను

తాత్పర్యము . కుమారస్వామి ఆ యింద్రుని విడిచి సహజప్రేమముతో సన్మానమునందలి ఉత్సాహముతో సత్పుత్రోత్సాహముతోఁ దల్లిదండ్రుల కడకుఁ బరువెత్తి వచ్చెను

వ ఇట్లు పఱతెంచు కొడుకు నెత్తికొని త్రినయనుం డందంద డెందంబున
నదిమికొని మూర్ధాఘ్రాణంబు సేయుడు 78

అర్థము ఇట్లు, పఱతెంచు = వచ్చు, కొడుకున్, ఎత్తికొని, త్రినయనుండు= ముక్కంటి, అందంద = మటి మటి, డెందంబునన్ = హృదయమున, అదిమికొని = హత్తుకొని, మూర్ధ + ఆఘ్రాణంబు + చేయుడున్ = శిరస్సు మూర్కొనినంతనే

తాత్పర్యము ఇట్లు వచ్చు కొడుకు నెత్తుకొని ముక్కంటి మటిమటి గుండె కత్తుకొని శిరస్సు మూర్కొనినంతనే - తరువాతి పద్యముతో నన్వయము

చ పులకలు పొడ్మె నంగమున, బోరన సమ్మదవారి కన్నుల
న్నలిఁ దలఁకాడె శంభునకు, నాఁటె ముదంబు మనంబునందు, మో
మలరెఁ దదుత్సవంబు గని యంబిక కర్మిలి పాలు సేఁపెఁ జ
న్నులు, సీఱునవ్వు మోవినిఁ, దనూలతికం జెమరుం గడల్కొనన్ 79

అర్థము. శంభునకున్ = శివునకు, అంగమునన్ = శరీరమున, పులకలు= గగుర్పాటు, పొడ్మెన్ = పొడమెన్ = పుట్టెను, కన్నులన్, సమ్మదవారి = సంతోషబాష్పములు, బోరనన్ = శీఘ్రముగా, నలిన్ = ప్రేమముతో, తలఁకాడెన్ = కాఱెను, మనంబునందున్ = మనస్సునందు, ముదంబు = సంతోషము,

నాఁటెన్ = నెలవుకొనెను, మోము = ముఖము, అలరెన్ = వికసించెను అంబికకున్ = పార్వతికి, తద్ + ఉత్సవంబు = ఆ వేడుక, కని, మోవినిన్ = పెదవిపై, చిఱు - నవ్వున్, తనూ-లతికన్ = తీవవంటి మేన, చెమరున్ = చెమటయు, కడల్ + కొనన్= అతిశయింపఁగా, అర్మిలిన్ = ప్రీతితో, చన్నులు, పాలు + చేఁపెన్

తాత్పర్యము . శివునకు మేనఁబులకలు పొడమెను కన్నులలో సంతోషబాష్పములు వెంటనే తొలఁకొడెను మనస్సులో సంతోషము గలిగెను ముఖము వికసించెను పార్వతికి ఆ వేడుకను జూడఁ బెదవిపైఁ జిఱునవ్వును, మ్రేఁదీవయందుఁ జెమటయు నతిశయింపఁ బ్రీతితోఁ జన్నులు చేఁపెను

వివేషములు అలంకారము స్వభావోక్తి

వ అంత గిరిసుత పతిచేత నున్న సుతు నందికొని ముఖావలోకనంబు సేయుచు మెత్తమెత్తనఁ గొఁగిలించుచు మెయ్యలరి వృద్ధాంగనాప్రబోధిత క్రమంబునం జన్నిచ్చుచు 80

అర్థము . అంతన్, గిరి - సుత = కొండ కూఁతురు - పార్వతి, పతి - చేతన్= భర్తచేతియందు, ఉన్న, సుతున్ = కొడుకును, అందికొని = పుచ్చుకొని, ముఖ + అవలోకనంబు + చేయుచున్ = మొగముఁజూచుచు, మెత్తమెత్తనన్ = మృదువుగా, కొఁగిలించుచున్, మెయ్యలరి = మేనుప్పొంగి, వృద్ధ + అంగనా - ప్రబోధిత - క్రమంబునన్ = ముదుసలిస్త్రీలచేఁ బ్రబోధింపఁబడిన విధమున, చన్ను+ ఇచ్చుచున్ = చన్నులు గుడుపుచు

తాత్పర్యము . అంతఁ బార్వతి పతిచేతనున్న కొడుకునందికొని మొగము చూచుచు, మృదువుగాఁ గొఁగిలించుచు మే నుప్పొంగి ముదుసలి స్త్రీలు చెప్పిన విధమునఁ జన్నులు గుడుపుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ తరమునఁ గన్గవల్ పాలయఁ దల్లి ముఖాబ్జము సూచు, నెమ్మనం బరలఁ గుచాగ్ర మొయ్యన ముఖాబ్జమునం గబళించి పీల్చు, మై గురువులువాఱఁ గేలఁ బుడుకుం, బెరమోవుల నవ్వు నింపుఁ బొం పిరిగొనఁ గార్తికేయుఁడు కుభృత్సుత కుల్లము పల్లవింపఁగన్ 81

అర్థము . కార్తికేయుఁడు = కుమారస్వామి, కుభృత్ + సుతకున్ = కొండకూఁతునకు - పార్వతికి, ఉల్లము = మనస్సు, పల్లవింపఁగన్ = చిగురింపఁగా - సంతోషము గలుగఁగా, తరమునన్ - క్రమముగా, కన్గవల్ = (కన్ను + కవల్) =

కన్నుల జంటలు, పొలయన్ = ప్రసరింపఁగా, తల్లి - ముఖ + అబ్జము = తల్లియొక్క ముఖపద్మము, చూచున్ నెమ్మనంబు (నెఱ - మనంబు) = నిండుమనస్సు, అరలన్ = వ్యాపింపఁగా, కుచ + అగ్రము = చనుమొన, ఒయ్యనన్= మెల్లఁగా, ముఖ + అబ్జమునన్ = ముఖపద్మముతో, కబళించి - పీల్చున్ = గ్రహించి పీల్చును, మై = శరీరము, గురువులు వాలున్ = హర్షముచే నుప్పొంగఁగా, కేలన్ = చేతితో, పుడుకున్ = నిమురును, పెరమోవులన్ = తీయని పెదవులందు, పొంపిరిగొనన్ = అతిశయింపఁగా, నవ్వు, నింపున్ = నిండించును

తాత్పర్యము కుమారస్వామి తల్లియైన పార్వతికి హృదయమానందింపఁగా జూపులు ప్రసరింపఁజేసి యామె ముఖపద్మమును జూచుచు నెమ్మనము వ్యాపించునట్లు ఆమె చనుమొనను దన ముఖాబ్జముతో గ్రహించి పీల్చును ఆమె శరీరము హర్షముచే నుప్పొంగఁగాఁ జేతితో నిమురును తీయని పెదవులందు మిక్కిలిగా నవ్వు నింపును

విశేషములు అలంకారము స్వభావోక్తి

గీ **అగ్నిగర్భుఁడై కృత్తికలందుఁ బుట్టి**
కొలన విడువఁబడి మగిడి గుహుఁడు వచ్చి
పార్వతీదేవి చన్నుల పాలు గుడిచెఁ
బాలు గల వారి నెమ్మొయిఁ బాపనగునె ? 82

అర్థము. గుహుఁడు = కుమారస్వామి, అగ్ని - గర్భుండు + ఐ = అగ్ని యొక్క గర్భము కలవాఁడై - అగ్ని గర్భమునందుఁ గలవాఁడయి, కృత్తికల + అందున్ = కృత్తికలయందు, పుట్టి, కొలనన్ = కొలనియందు, విడువఁబడి, మగిడి- వచ్చి = మరలివచ్చి, పార్వతీ - దేవి, చన్నుల-పాలు, కుడిచెన్ = త్రావెను పాలు - కలవారిన్ = భాగ్యము గలవారిని - అదృష్టవంతులను, ఎమ్మొయిన్ (ఏ + మెయిన్) = ఏ విధముగానైనను, పాపన్ + అగునె = నశియింపఁజేయ శక్యమా ?

తాత్పర్యము. కుమారస్వామి అగ్నిగర్భుడయి, కృత్తికలందు జననమంది, కొలనిలో విడువఁబడి, మరల వచ్చి పార్వతీదేవి చనుఁబాలు త్రావెను ఇన్ని కష్టములు పడినను అతని కేమియుఁగాలేదు అదృష్టవంతులను ఏ విదముగను జెఱుప శక్యముగాదు

విశేషములు . అలంకార మర్థాంతరన్యాసము

వ అంత నంత వృత్తాంతంబునుం గని సురేశ్వరుండు పరమేశ్వరునకు దండప్రణామంబు సేసి 83

అర్థము. అంతన్, అంత - వృత్తాంతబునున్, కని, సుర + ఈశ్వరుండు= దేవేంద్రుఁడు, పరమేశ్వరునకున్, దండ - ప్రణామంబు + చేసి = సాష్టాంగ నమస్కారము చేసి

తాత్పర్యము అంత నంతవృత్తాంతమును గని దేవేంద్రుఁడు పరమేశ్వరునకు సాష్టాంగ నమస్కారము చేసి - తరువాతి పద్యముతో నన్వయము

చ శరణు ! మహేశ ! భూరితర సార సుఖప్రద ! కామ కాల సం
హార ! భవరోగదారణ ! సురాసురవంద్య ! శరీర దుఃఖ దు
స్తర కమలాపహార హిమధామ ! సమస్తగ ! సోమదేవ ! వి
స్తరిత రమాదయారసయుతా యురులబ్ధవిభావనామయా ! 84

అర్థము. మహేశ, భూరితర = మిక్కిలి అధికము, చారు = మనోహరము అగు, సుఖ - ప్రద = సౌఖ్యము నిచ్చువాఁడా !, కామ - కాల - సంహార = మన్మథుని, యముని, సంహరించినవాఁడా !, భవ - రోగ - దారణ = సంసారమనెడి వ్యాధిని జీల్చువాఁడా !, సుర + అసుర - వంద్య = దేవతలచేతను, రాక్షసులచేతను నమస్కరింపఁదగినవాఁడా !, శరీర - దుఃఖ - దుస్తర - కమల + అపహార - హిమధామ = శరీరదుఃఖములనెడు దాఁటశక్యముకాని పద్మములను నశింపఁజేయు చంద్రుఁడా !, సమస్తగ = అన్నిటిని బొందువాఁడా !, సోమదేవ = ఈశ్వరదేవా !, విస్తరిత - రమా - దయా - రస - యుతా = అధికమైన సంపదతో, దయారసముతోఁ గూడినవాఁడా, ఉరు - లబ్ధ - విభావనా - మయా = అధికముగా పొందఁబడిన స్పష్టజ్ఞానముతో నిండినవాఁడా ! శరణు

తాత్పర్యము . మహేశ్వరా ! మిక్కిలి అధికము శ్రేష్ఠమునైన సౌఖ్యము నిచ్చువాఁడా ! మన్మథుని, యముని సంహరించినవాఁడా ! సంసారమనెడి రోగమును నశింపఁజేయువాఁడా ! దేవతలచేతను, రాక్షసులచేతను నమస్కరింపఁబడువాఁడా ! శరీరదుఃఖములనెడు పద్మములను నశింపఁజేయు చంద్రుఁడా !, అన్నిటిని బొందువాఁడా !, సోమదేవా ! విస్తృతమైన సంపదతో,

దయారసముతోఁగూడినవాఁడా ! బాగుగాఁ బొందఁబడిన స్పష్ట జ్ఞానము గలవాఁడా! శరణు

విశేషములు ఈ పద్యమున నాగాదిబంధములలో నొకచిత్రము గలదని తోఁచుచున్నది 86 వ వచనములో 'నాగబంధ మురజబంధంబులం బ్రస్తుతించి' - యని కవియే చెప్పియున్నాఁడు కమలా విహార - లక్ష్మీదేవి విహరించునవి - పద్మములు

నాగ మురజబంధములు

క స్థిరమతి ! శుభసితమూర్తీ !
వర సుర నర దనుజ దురిత వనధి సుకీర్తీ !
హరదతి శుభయుతమూర్తీ !
స్మర పురహర తను భిదురిత జవన సుకీర్తీ ! 85

అర్థము. స్థిర - మతి = స్థిరమైన మతిగలవాఁడా , శుభ - సిత - మూర్తీ = మంగళకరమైన తెల్లని ఆకారము గలవాఁడా ! వర - సుర - నర - దనుజ - దురిత - వనధి - సుకీర్తీ = శ్రేష్ఠులయిన దేవతలయు, నరులయు, రాక్షసులయు, పాపములనెడు సముద్రమునకు మంచి బురదయైనవాఁడా ! అనఁగా వారి పాపసముద్రమును ఇంకింపఁజేయువాఁడా ! అనుట, హరత్ + అతి - శుభ - యుత - మూర్తీ = హరించుచున్న = గ్రహించుచున్న, మిక్కిలి శుభములతోఁ గూడిన ఆకారముగలవాఁడా !, స్మర - పుర - హర - తను - భిదురిత - జవన - సుకీర్తీ = మన్మథుని, త్రిపురములను హరించునట్టి (నశింపఁజేయునట్టి), శరీరముచే వజ్రముగాఁ జేయఁబడిన వేగము సత్కీర్తిగలవాఁడా !

తాత్పర్యము . స్థిరమయిన మతిగలవాఁడా ! మంగళకరమైన తెల్లని ఆకారము గలవాఁడా ! దేవతలయు, మానవులయు, దానవులయు పాపములనెడి సముద్రమును ఇంకింపఁజేయువాఁడా ! మిక్కిలి శుభములతోఁగూడిన ఆకారము గలవాఁడా ! మన్మథుని, త్రిపురములను హరించునట్టి శరీరముచే వజ్రముగాఁజేయఁబడిన వేగము, సత్కీర్తి గలవాఁడా !

విశేషములు : దురిత వనధి సుకీర్తీ - అలంకారము రూపకము

వ అని నాగాభరణు నాగబంధ మురజబంధంబులం బ్రస్తుతించి యక్కుమారుండు తన్నేలినవాఁడని యెఱుంగక యజ్ఞానభావంబున నా

చేసిన యపరాధంబు సహింపవలయునని భయస్థుండై వడవడ వడఁకుచున్న సురపతికి నుమాపతి కరుణించి యభయహస్తం బిచ్చినంత నంత వృత్తాంతంబు నెఱింగి 86

అర్థము. అని, నాగ + ఆభరణున్ = పాములు అలంకారములుగాఁ గలవానిని - శివుని, నాగబంధ - మురజ బంధంబులన్ = నాగబంధము, మురజబంధము అను చిత్రకవితావిశేషములచే, ప్రస్తుతించి = పొగడి, ఆ + కుమారుండు, తన్నున్ + ఏలినవాఁడు + అని = తన్ను రక్షించువాఁడని, ఎఱుఁగక, అజ్ఞాన - భావంబునన్ = తెలివిలేమిచే, నా - చేసిన - అపరాధంబున్ = నేనుజేసిన తప్పును, సహింపవలయును + అని, భయస్థుండు + ఐ, వడవడ, వడఁకుచున్ = ఉన్న - సురపతికిన్, ఉమా - పతి = పార్వతీభర్త = శివుఁడు, కరుణించి, అభయ-హస్తంబు + ఇచ్చెన్, అంతన్, అంత - వృత్తాంతంబున్, ఎఱింగి

తాత్పర్యము. అని శివుని నాగబంధ మురజబంధములచేఁ బ్రస్తుతిచేసి, 'ఆ కుమారుఁడు 'నన్ను రక్షించువాఁడని యెఱుఁగక అజ్ఞానముచే నేను జేసిన తప్పును సైఁపవలయు' నని భయముతో వడవడ పడఁకుచున్న దేవేంద్రున కీశ్వరుఁడు కరుణించి అభయహస్త మొసఁగెను అంత అంత వృత్తాంతము నెఱిఁగి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. నా చేసిన - నేను జేసిన - నా యొక్క చేసిన - ప్రౌఢ కారక 15 నా చేసిన - ప్రౌఢ కారక 16

మ గరుడాండస్ఫురితేంద్రచాప, మతి చక్రద్యోతి విద్యుద్గణం,
బురుశంఖారవ గర్జనం బులియ, వాయుప్రేరితం బొప్పుతో
హరి నీలాభ్రము వచ్చి నిల్చె రజతోద్యత్పర్వతోత్తుంగశృం
దర. భాగంబునఁదత్తటస్థమదవేదండంబొ నా నందమై 87

అర్థము: గరుడాండ - స్ఫురిత + ఇంద్రచాపము = గరుత్మంతుఁడనెడి ప్రకాశించు ఇంద్రధనుస్సు గలది, అతి - చక్ర - ద్యోతి - విద్యుత్ + గణంబు = అధికమయిన సుదర్శనచక్రాయుధకాంతులనెడి మెఱుపుల గుంపు గలది, ఉరు-శంఖ + ఆరవ - గర్జనంబు = గొప్ప పాంచజన్య శంఖ ధ్వనియనెడి ఉఱుము గలది, వాయు - ప్రేరితంబు = గాలిచేఁ బురికొల్పఁబడినది (అగు), హరి - నీల + అభ్రము= విష్ణువనెడి నల్లని మేఘము, ఒప్పుతోన్, ఉలియన్ = ధ్వనింపఁగా,

రజత+ ఉద్యత్ + పర్వత + ఉత్తుంగ - కందర - భాగంబునన్ = వెండికొండ (కైలాసము) యొక్క ఎత్తయిన కనుమ ప్రదేశమునందు, తచ్ + తటస్థ - మద - వేదండంబొ = ఆ కొండచటియయందున్న మత్తేభమా, నాన్ = అనఁగా, అందము+ ఐ = సుందరమయి, వచ్చి, నిల్చెన్

తాత్పర్యము గరుత్మంతుఁడనెడి ఇంద్రధనుస్సు గలది, అధికమగు సుదర్శనచక్రకాంతియనెడు మెఱుపుల గుంపు గలది, గొప్ప పాంచజన్యశంఖధ్వని యనెడు ఉటుముగలది అగు విష్ణువనెడి నల్లనిమేఘము కైలాసపర్వతమునందలి ఎత్తయిన గుహాప్రదేశమున ఆ కొండచటియయందుండు మదగజమా యన వాయుప్రేరితమై ధ్వనింపఁగా వచ్చి నిలిచెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష వేదండ - వేద + అండ - పరరూపసంధి శకంధ్వాది గణములోనిది పూర్వపదాంతస్వరమునకు లోపము వచ్చినది

మ శతపత్రోత్త విమానవేగ కలహంసవ్రాత వాగ్వల్లకీ
శ్రుతిగేయాది సమస్తవేదవిధి సంస్తోత్రాదిరాగంబుతో
నతిరాగాత్మ తనుప్రభాసమున బ్రహ్మాండోదరంబెల్లఁ బూ
రితమై మ్రోసి వెలుంగ వచ్చె నుతనీరేజాసనుం డర్థితోన్. 88

అర్థము నుత - నీరేజాసనుండు = పొగడఁబడిన పద్మాసనుఁడు (బ్రహ్మ), శత రాగంబుతోన్, శతపత్ర = తామరపూలనుండి, ఉత్థ = లేచినట్టియు, విమాన - వేగ = విమానముయొక్క వేగము గలట్టియు, కలహంస - వ్రాత = రాయంచల సమూహము యొక్కయు, వాచ్ (క్) = సరస్వతీదేవి యొక్క, వల్లకీ = వీణయొక్కయు, శ్రుతి = సుతియొక్కయు, గేయ + ఆది = గేయములు మున్నగు వానియొక్కయు, సమస్త = ఎల్ల, వేద - విధి = వేదవిధానము, సంస్తోత్ర + ఆది = సంస్తుతులు మున్నగువానియొక్క, రాగంబుతోన్ = సంగీతముతో, అతి - రాగ + ఆత్మ - తను - ప్రభాసమునన్ = అధికమైన యెఱుపుగల తనయొక్క శరీరముయొక్కకాంతితోను, బ్రహ్మాండ + ఉదరంబు + ఎల్లన్ = బ్రహ్మాండ గర్భమంతయు, పూరితము + ఐ = నిండినదయి, మ్రోసి = ధ్వనించి, వెలుంగన్= ప్రకాశింపఁగా, అర్థితోన్ = కోరికతో, వచ్చెన్

తాత్పర్యము. తామరపూలనుండి లేచినట్టియు, విమానవేగము గలట్టియు రాజహంసముల సమూహముయొక్కయు, సరస్వతి వీణయొక్క సుతి, గేయములు

మున్నగువానియొక్కయు, ఎల్లవేదవిహితములయిన సంస్తుతులు మున్నగువానియొక్కయు రాగముతోను, మిక్కిలి యెట్టనైన తన శరీరకాంతితోను బ్రహ్మాండగర్భమెల్లనిండి ప్రకాశింపఁగాఁ గోరికతో బ్రహ్మ వచ్చెను

వ ఇట్లంబుజనాభాంబుజాసనప్రముఖాఖిలభువనభవనాధీశ్వరులు పరమేశ్వరాచలంబునకుం జనుదెంచి మహోత్సాహంబునఁ బుత్రోత్సవంబు సేసి రంతం బరమేశ్వరుం డనురాగంబునం దనకుఁ బ్రత్యక్షంబైయున్న కన్నెఱింగి హరి పరమేష్ఠి పురందర ప్రబోధితుండై సురగురుం డఖిలజగద్గురునకుం గృతాంజలియై 89

అర్థము. ఇట్లు, అంబుజ - నాభ ---ధీశ్వరులు అంబుజ - నాభ = తామరపూవు నాభియందుఁగలవాఁడు - విష్ణువు, అంబుజ + ఆసన = తామరపువ్వు పీఠముగాఁగలవాఁడు - బ్రహ్మ ప్రముఖ = మున్నగు, అఖిల = ఎల్ల, భువన - భవన= లోకములనెడి భవనములకు, అధి + ఈశ్వరులు = అధిపతులు, పరమేశ్వర + అచలంబునకున్= ఈశ్వరుని కొండకు -కైలాసమునకు, చనుదెంచి= వచ్చి, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = మిక్కిలి ఉత్సాహముతో, పుత్ర = ఉత్సవంబు = కొడుకుపుట్టినప్పటి పండువు, చేసిరి అంతన్, పరమేశ్వరుండు అనురాగంబునన్ = ప్రేమముతో, తనకున్, ప్రత్యక్షంబు + ఐ, ఉన్న, కన్నెఱింగి = జాడతెలిసి, హరి - పరమేష్ఠి - పురందర - ప్రబోధితుండు + ఐ = విష్ణు బ్రహ్మేంద్రులచే మేలుకొలుపఁబడినవాఁడయి (పురికొలుపఁబడినవాఁడయి), సుర - గురుండు = దేవతల గురువు (బృహస్పతి), అఖిల - జగత్ + గురునకున్= ఎల్లలోకముల గురువు అగు శివునకు, కృత + అంజలి + ఐ = నమస్కరించినవాఁడయి

తాత్పర్యము. ఇట్లు విష్ణువు, బ్రహ్మ మున్నగు నెల్లలోకముల ప్రభువులు కైలాసమునకు వచ్చి మహోత్సాహముతోఁ బుత్రోత్సవము చేసిరి అంత నీశ్వరుఁ డనురాగముతోఁ దనకుఁ బ్రత్యక్షమయియున్న జాడతెలిసి విష్ణు బ్రహ్మేంద్రులచేఁ బురికొలుపఁబడిన వాఁడయి బృహస్పతి సకలలోకగురు వగుశివునకు నమస్కరించి - తరువాతి పద్యముతో నన్వయము

బృహస్పతికృత దారిద్ర్యవిద్రావణ స్తవము

శా శ్రీరామేశ కవీశ్వరాదు లెద నీ శ్రీపాదముల్ భక్తితో
నారాధించి సమస్తలోకసముదాయాధీశులైరన్న సం
సారుల్ దుఃఖనివారణార్థ మభవున్ సర్వేశు లోకత్రయా
ధారున్ నిన్ మదిఁ గొల్వకున్కి యుఱవే దారిద్ర్యవిద్రావణా ! 90

అర్థము దారిద్ర్య - విద్రావణా + = లేమిని దటిమివేయువాఁడా ! శ్రీ - రామా + ఈశ - కవి + ఈశ్వర + ఆదులు = లక్ష్మీదేవి భర్తయగు విష్ణువు, ప్రభువైన బ్రహ్మ మున్నగువారు - శ్రీరామేశుఁ డనుకవీశ్వరుఁడు సూచింపఁబడియెనా?, ఎదన్ = హృదయమునందు, నీ - శ్రీ - పాదముల్ = నీ దివ్యములైన పాదములు, భక్తితోన్, ఆరాధించి = పూజించి, సమస్త - లోక సముదాయ + అధి + ఈశులు = సకలలోకముల సమూహమునకుఁ బ్రభువులు, ఐరి, అన్నన్ = అనఁగా, సంసారుల్ = గృహస్థులు, దుఃఖ -నివారణ + అర్థము = దుఃఖము పోవుటకొఱకు, అభవున్ = పుట్టుకలేనివాఁడును, సర్వ + ఈశున్ = సర్వేశ్వరుఁడును, లోక - త్రయ + ఆధారున్ = ముల్లోకములకు ఆధారమయినవాఁడును, అగు, నిన్ = నిన్ను, మదిన్ = మనస్సునందు, కొల్వక+ ఉన్కి = కొలువకుండుట, ఉఱవే = ఉచితమా ?

తాత్పర్యము . దారిద్ర్యమును దటిమివేయువాఁడా ! ఈశ్వరా ! విష్ణువు, బ్రహ్మ మున్నగువారు హృదయమున నీ దివ్యపాదములను భక్తితో ఆరాధించి యెల్ల లోకముల సమూహమునకును బ్రభువులయి రనఁగా, సంసారులు తమ దుఃఖములు పోఁగొట్టుకొనుటకు అభవుఁడవును, సర్వేశ్వరుఁడవును, ముల్లోకములకు ఆధారభూతుఁడవును అగు నిన్ను మనసులో సేవింపకుండుట యుచితమా ?

మ మలినుండై కడు డస్సి క్రుస్సి మది నున్మత్తాకృతిం దేజముం
దలయుం జీరయుఁ దోడు వీడ జడుఁడై దైన్యంబునంబొంది దు
ర్బలుఁడై మెచ్చనివారి వేఁడఁజను దుర్భాగ్యాత్ముఁడున్ ని న్నెదం
దలఁపంగాంచి సురేంద్రుఁడై వెలయఁడే దారిద్ర్యవిద్రావణా ! 91

అర్థము . దారిద్ర్యవిద్రావణా ! మలినుండు + ఐ = పాపుఁడయి, కడున్ = మిక్కిలి, డస్సి = అలసి, క్రుస్సి = కృశించి, మదిన్ = మనస్సునందు, ఉన్మత్త+ ఆకృతిన్ = గర్వించినవానివిధమున, తేజమున్, తలయున్ = ధైర్యమును, చీరయున్ = వస్త్రమును, తోడున్ = సహాయుఁడును, వీడన్ = విడువఁగా, జడుఁడు+ ఐ = మందుఁడయి, దైన్యంబునన్ + పొంది = దుఃఖమును బొంది, దుర్బలుఁడు +ఐ = బలహీనుఁడయి, మెచ్చని - వారిన్ = ఇష్టములేనివారిని, వేఁడన్ + చను = వేఁడుటకుఁబోవు, దుర్భాగ్యాత్ముఁడున్ = దౌర్భాగ్యుఁడును, నిన్నున్, ఎదన్ = హృదయమునందు, తలఁపన్ + కాంచి = తలఁపఁగని, సుర + ఇంద్రుఁడు+ ఐ= దేవపతియై, వెలయఁడే = ప్రకాశింపఁడా !

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా - శివా ! పాపాత్ముఁడయి, మిక్కిలి బడలి, కృశించి, గర్వితుఁడై, దైన్యమును బొంది, బలహీనుఁడై, ఇష్టములేనివారిని

వేఁడఁబోవు దౌర్భాగ్యుఁడు కూడ నిన్ను హృదయమునఁ దలఁపఁగని దేవేంద్రుఁడై ప్రకాశింపఁడా ?

మ భయరోగార్తిమహాతురౌఘచయమున్ బాయున్ ముదంబొందు ని
ర్భయకల్యాణసుశాంతి సంపద సుఖప్రాప్తుండగున్ దుఃఖసం
క్షయమై కర్మనిబంధనాపహరమై సౌఖ్యాత్ముఁడై ముక్తుఁడౌ
దయ నీవెవ్వనిఁజూతు వాఁడు భువిలో దారిద్ర్యవిద్రావణా ! 92

అర్థము . దారిద్ర్యవిద్రావణా ! నీవు, దయన్ = దయతో, ఎవ్వనిన్ = ఎవనిని, చూతు = చూతువు, వాఁడు, భువిలోన్ = భూమియందు, భయ - రోగ+ ఆర్తి - మహత్ (మహా) + ఆతుర + ఓఘ - చయమున్ = భయము, వ్యాధి, బాధ, గొప్ప పీడల సమూహమును, పాయున్ = వీడును, ముదంబు + ఒందున్ = సంతోషమును బొందును, నిర్భయ - కళ్యాణ - సుశాంతి - సంపదన్ = భయములేమి, శుభములు, మంచిశాంతి అను సంపదచే, సుఖ - ప్రాప్తుండు = సౌఖ్యమునందినవాఁడు, అగున్ = అగును, దుఃఖ-సంక్షయము + ఐ = దుఃఖనాశనమయి, కర్మ - నిబంధన + అపహరము + ఐ = కర్మబంధనములు నాశనమయి, సౌఖ్య + ఆత్ముఁడు + ఐ = సుఖియైు, ముక్తుఁడు = మోక్షమునందినవాఁడు, ఔన్ = అగును

తాత్పర్యము : దారిద్ర్యవిద్రావణా ! ఈశ్వరా !, నీవు దయతో నెవ్వనిని జూతువో వాఁడు భువిలో భయము, రోగము, బాధ, పీడ అనువాని సమూహమును వీడును దుఃఖనాశనమయి కర్మబంధములు నశించి సుఖియైు మోక్షమును బొందును

మ వరదుం డీశుఁడు భక్తవత్సలుఁడు దేవవ్రాతసేవ్యుండు శం
కరుఁ డానందుఁ డనాథనాథుఁడని లోకంబెల్ల సద్భక్తిత
త్పరులై సార్థకనామధేయ మహిమోద్దామస్థితున్ నిన్ను దు
స్తరదుఃఖాపనయార్థ మర్థిఁ గొలుతుర్ దారిద్ర్యవిద్రావణా ! 93

అర్థము : దారిద్ర్యవిద్రావణుఁడవగు నో శివా !, వరదుండు = వరములనొసఁగువాఁడు, ఈశుఁడు = ప్రభువు, భక్త - వత్సలుఁడు = భక్తులయెడ వాత్సల్యము గల్గువాఁడు, దేవ - వ్రాత - సేవ్యుండు = దేవతల సమూహముచే సేవింపఁదగినవాఁడు, శంకరుఁడు = శుభములను జేయువాఁడు, ఆనందుఁడు = ఆనందము గలవాఁడు, ఆనాథ - నాథుఁడు = దిక్కులేనివారికి దిక్కు, అని, లోకంబు + ఎల్లన్ = జను లందఱును సత్ + భక్తి - తత్పరులు + ఐ = మంచి

భక్తి పరులయి, సార్థక - నామధేయ - మహిమ + ఉద్దామ - స్థితున్ = శంకర - శివ అను అర్థవంతములైన పేరులు గలిగి మహిమముచే ఉత్తమస్థితియందున్న వానిని, నిన్నున్, దుస్తర - దుఃఖ + అపనయ + అర్థము = దాఁటరాని దుఃఖములు పోవు నిమిత్తము, అర్థిన్ = కోరికతో, కొలుతుర్ = సేవింతురు

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణుఁడవైన శివా ! వరదాయి, ఈశుఁడు, భక్తవత్సలుఁడు, దేవతాసేవ్యుఁడు, శంకరుఁడు, ఆనందుఁడు, అనాథనాథుఁడు అని జనులందఱు సద్భక్తిపరులయి సార్థకనాముఁడవును, మహిమముచే నుద్దాముఁడవును, అగు నిన్ను దుస్తరదుఃఖములు పోవుకొఱకుఁగోరి కొలుతురు

విశేషములు . కొలుతుర్ - కొలుతురు - 'పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు ' బాల ప్రకీర్ణక 16

మ **మనమారంగఁ ద్రుటిక్షణంబయిన నిన్ మర్త్యుండు భావించి దు**
ర్జనుఁడున్ సజ్జనుఁ డౌను, దుఃఖపరుఁడున్ సౌఖ్యాత్ముఁడై
ఘనుఁడౌ, మూర్ఖును బండితుం డగు, మహాకష్టుండు శిష్టుం డగున్,
ధనహీనుండు ధనేశుఁడౌ జగమునం దారిద్ర్యవిద్రావణా ! 94

అర్థము . దారిద్ర్యవిద్రావణా!, ఓ శివా ! జగమునన్ = లోకమున, మనము+ ఆరంగన్ = మనఃపూర్తిగా, త్రుటి - క్షణంబు + అయినన్ = అత్యల్పకాలమయినను, నిన్ = నిన్ను, మర్త్యుండు = మనుష్యుఁడు, భావించి = తలఁచి, (తలఁచినచో), దుర్జనుఁడున్ = దుష్టుఁడును, సత్ + జనుఁడు + ఔను= మంచివాఁడగును, దుఃఖ - ఎరుఁడున్ = శోకాత్ముఁడును, సౌఖ్య + ఆత్ముఁడు + ఔన్ = సుఖవంతుఁ డగును, అల్పుఁడును = హీనుఁడును, ఘనుఁడు + ఔన్ = అధికుఁ డగును, మూర్ఖును = మూర్ఖుఁడును, పండితుండు + అగున్ = విద్వాంసుఁ డగును, మహత్ (మహా) + కష్టుండున్ = గొప్ప పాపియును, శిష్టుండు+ అగున్= పుణ్యాత్ముఁ డగును, ధనహీనుండున్ = డబ్బులేనివాఁడును, ధన + ఈశుఁడు + ఔన్= కుబేరుఁ డగును

తాత్పర్యము: దారిద్ర్యవిద్రావణుఁడవయిన ఓ శివా ! జగమున మనఃపూర్తిగా అత్యల్పకాలమయినను నిన్ను మనుష్యుఁడు భావించినచో, దుర్జనుఁడైనను సజ్జనుఁ డగును దుఃఖితుఁడును సుఖితుఁ డగును, అల్పుఁడును ఘనుఁ డగును

మూర్ఖుఁడును విద్వాంసుఁడగును, మహాపాపియును పుణ్యాత్ముఁడగును, ధనహీనుఁడును గుబేరుఁడగును

విశేషములు . మూర్ఖ (రూపాం) మూర్ఖుఁడు 'వృద్ధాదుల డుఙ్ఞునకు లోపము విభాషనగు ' బాల తత్సమ 56 అగును - అవును - ఔను 'పదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు ' బాల ఆచ్చిక 27 అవును 'ఆచ్చికంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు ' బాల క్రియ 103 ఔను త్రుటిక్షణంబయిన - ఇది మా రా ప్రతిపారము తక్కిన ప్రతులలో 'ఒక్క క్షణంబయిన' అని కలదు అందు 'క్ష' పూర్వాక్షరమును గురువెట్లు చేయునో తెలియదు అందుచే 'త్రుటిక్షణంబయిన' అనుపారమే స్వీకరింపఁబడినది కాని త్రుటి - క్షణము ఇంచుమించు సమానార్థకములే సజ్జన - సత్ + జన

మ నిధిసంఘంబు నిధానముల్ మణిగణానీకంబు మంత్రంబు లౌ
షధముల్ భూరిరసాయనంబు రస మా స్పర్శాదివేధుల్ సకా
మధుగోఘంబులు కల్పవృక్షములు తన్మాహాత్మ్య మూహింపఁ జం
ద్రధరా ! మీ కరుణాబ్ధిఫేనలవముల్ దారిద్ర్యవిద్రావణా ! 95

అర్థము: దారిద్ర్య విద్రావణా ! చంద్ర - ధరా = చంద్రుని దాల్చినవాఁడా, శివా ! నిధి - సంఘంబు= నిధుల సమూహము, నిధానముల్ = బొక్కసములు, ముని - గణ + అనీకంబు = మణుల సమూహముల గుంపులు, మంత్రంబులు, ఔషధముల్, భూరి - రసాయనంబు = అధికమయిన జీవనౌషధములు, రసము, ఆ - స్పర్శ + ఆది - వేధుల్ = ఇనుమును బంగారము చేయు రసశిలా విశేషములు, స- కామధుక్ + ఓఘంబులు = కామధేనువుల సమూహములోఁ గూడిన, కల్పవృక్షములు, తద్ + మాహాత్మ్యము = వానిగొప్పతనము, ఊహింపన్ = తలఁపఁగా, మీ - కరుణా + అబ్ధి - ఫేన - లవముల్ = మీ దయ యనెడి సముద్రమునందలి నురుఁగు లేశములు

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా ! శివా! నిధుల సమూహము, కోశాగారములు, మణుల సమూహము, మంత్రములు, ఔషధములు, గొప్ప జీవనౌషధము, రసము, పరుసవేదులు, కామధేనువుల సమూహములు, కల్పవృక్షములు - అనువాని మాహాత్మ్యమూహింపఁగా మీ దయా సముద్రమునందలి నురువులేశములు

విశేషములు . అలంకారము రూపకము

మ నలి నాత్మవ్యవ సాయవాదులును, గన్యావాదులున్, మంత్రవా
దులు, దివ్యౌషధవశ్యధాతు రసవాదుల్ మోహులై తద్దయా
కులతం బొందుదు రెల్ల, నె ట్లివియ కోర్కుల్ కూర్చు మున్ భక్తవ
త్సల ! సర్వేశ్వర! నిన్నుఁ గొల్వ కెదలో దారిద్ర్యవిద్రావణా ! 96

అర్థము . దారిద్ర్యవిద్రావణా !, భక్త వత్సల = భక్తులయెడ వాత్సల్యము గలవాఁడా !, సర్వేశ్వర ! నలిన్ = ఉత్సాహముతో, ఆత్మ - వ్యవసాయ - వాదులును = తామే ముఖ్యమనువారును - కపట వేదాంతులును, వ్యవసాయమున నపూర్వమార్గముల నుపదేశించి ఫలాధిక్యముఁ జూపుదుమనెడు కపటదేశికులును, కన్యావాదులున్ = కన్యలఁదెచ్చి వివాహము చేయించి ద్రవ్యమునుగొనువారును మంత్రవాదులున్ = మంత్రములచే నన్నిటిని సాధింతుమనువారును, దివ్య + ఔషధ - వాదులు = రసాయనౌషధములచేఁ జిరంజీవులుగాఁ జేయుదు మనువారును, వశ్యవాదులు = ఇతరులను వశీకరింతుమనువారును, ధాతు వాదులున్ = తాళక హింగుళాది ధాతువుల రూపాంతరములఁ గల్పించువారును, రసవాదుల్ = పాదరసమును కట్టి బంగారమును జేయుదుమనువారును, ఎల్లన్ = అందఱును, మోహులు + ఐ = అజ్ఞానులయి, తద్ద = మిక్కిలి, ఆకులతన్ = కలఁతను, పొందుదురు, మున్ = ముందు, నిన్నున్, ఎదలోన్ = హృదయమున, కొల్వక = సేవింపక, ఇవి + అ = ఇవియ = ఇవియే, ఎట్లు, కోర్కుల్, కూర్చున్

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా ! భక్తవత్సలా, సర్వేశ్వరా ! ఆత్మవాదులును, వ్యవసాయవాదులును, కన్యావాదులును, మంత్రవాదులును, దివ్యౌషధవాదులును, వశ్యవాదులును, ధాతువాదులును, రసవాదులును అందఱును అజ్ఞానులయి మిక్కిలి కలఁతఁజెందెదరు ముందు నిన్ను హృదయమున సేవింపక ఇవియే యెట్లు కోరికలు దీర్చును ? తీర్ప వనుట

శా **కారుణ్యాత్మకు నిన్ను మానవుఁ డెదం గామించి సేవించి దు**
ర్వారాపారసుఖంబు, నుత్తమగుణవ్రాతంబు సత్కీర్తియుం
బారావార పరీత భూతలము నిర్బాధంబుగా నేలు వి
స్తా రైశ్వర్యముఁ బొందు నీ దయ మహిన్ దారిద్ర్యవిద్రావణా! 97

అర్థము. దారిద్ర్య విద్రావణా !, కారుణ్య + ఆత్మకున్ = దయాస్వరూపుని, నిన్నున్, మానవుఁడు, ఎదన్ = హృదయమున, కామించి = కోరి, సేవించి,

దుర్వార+ అపార - సుఖంబున్ = అడ్డగింపరాని, అధికసుఖమును, ఉత్తమ - గుణ - వ్రాతంబున్ = శ్రేష్ఠములయిన సద్గుణముల సమూహమును, సత్ + కీర్తియున్ = మంచి కీర్తియును, పారావార - పరీత - భూతలమున్ = సముద్రము చేఁ జుట్టఁబడిన భూతలమును, నిర్బాధంబుగాన్ = బాధలేకుండ, ఏలున్ = పాలించును, నీ - దయన్ = నీ దయచే, మహిన్ = భూమియందు, విస్తార + ఐశ్వర్యమున్ = అధికమయిన సంపదను, పొందున్

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా ! దయామయుఁడవయిన నిన్ను మనుష్యుఁడు హృదయములోఁ గోరి సేవించి అడ్డగింపరాని అధికసుఖమును, శ్రేష్ఠములయిన సద్గుణముల సమూహమును, సద్యశమును, సముద్రముచేఁ జుట్టఁబడిన భూతలమును, నిర్బాధముగా నేలును నీ దయచేత భూమియందు అధికైశ్వర్యము నందును

శా **సారాచారవిచారదక్షు లమలజ్ఞానక్షణోద్వీక్షణ**
ప్రారంభాత్మకు లాత్మ నిన్ను నెనయన్ భావించి దుర్వారసం
సారాంభోనిధి పారమెయ్ది సుమహత్సౌఖ్యాత్ములై మర్త్యు లా
ధారాధేయ విముక్తియుక్తు లగుదుర్ దారిద్ర్యవిద్రావణా ! 98

అర్థము . దారిద్ర్యవిద్రావణా !, సార + ఆచార - విచార - దక్షులు = శ్రేష్ఠములయిన నడవడులను గూర్చిన ఆలోచనమందు సమర్థులును, అమల - జ్ఞాన - క్షణ + ఉత్ + వీక్షణ - ప్రారంభ + ఆత్మకులు = నిర్మలమైన జ్ఞానముతో క్షణములో విమర్శించి చూచు ప్రయత్నము గలవారు, ఆత్మన్ = మనసునందు, నిన్నున్, ఎనయన్ = పొందుటకు, భావించి = తలఁచి, దుర్వార - సంసార + అంభోనిధి - పారము = అడ్డులేని సంసారసముద్రము నావలియొడ్డును, ఎయ్ది = పొంది, మర్త్యులు = మనుష్యులు, సుమహత్ + సౌఖ్య + ఆత్ములు + ఐ = మిక్కిలి గొప్ప సౌఖ్యమునందువారయి, ఆధార + ఆధేయ - విముక్తి - యుక్తులు = దేహజీవాత్మరూపసంబంధము వదలి, పరమాత్మను బొందుదురు

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా !, సారములైన ఆచారములను గూర్చి ఆలోచించుటలో సమర్థులైనవారును, నిర్మలజ్ఞానముచే క్షణములో విమర్శించి చూచు ప్రయత్నము చేయువారును, నిన్నుఁబొందుటకు ఆత్మలో భావించి దుర్వారమైన సంసారసముద్రము నావలియొడ్డును బొంది, మిక్కిలి గొప్ప సౌఖ్యమునంది, దేహాత్మ రూప సంబంధమును వదలి, పరమాత్మను బొందుదురు

విశేషములు అలంకారము రూపకము

మ భువి నీ రాజ్యవిభూతు లున్నతులు సద్భోగోపభోగావళుల్
శివలోకాది విశేషలోక సుఖముల్ సేవ్యంబుగాఁ బార్వతీ
ధవ కారుణ్యము సేయు భక్తిపరులై దారిద్ర్యవిద్రావణ
స్తవ మర్థిం బరియించు మానవులకున్ దారిద్ర్యవిద్రావణా ! 99

అర్థము . దారిద్ర్యవిద్రావణా ! పార్వతీ - ధవ = పార్వతీపతి యగు శివునియొక్క, కారుణ్యము = దయ భక్తి - పరులు + ఐ = భక్తియం దాసక్తి గలవారయి, దారిద్ర్య - విద్రావణ - స్తవము = దారిద్ర్యవిద్రావణస్తోత్రము, అర్థిన్= కోరికతో, పరియించు = చదువునట్టి, మానవులకున్ = మనుష్యులకు, భువిన్ = భూమియందు, ఈ - రాజ్య - విభూతులు = ఈ రాచటికపు సంపదలు, ఉన్నతులు= ఔన్నత్యములు, సత్ + భోగ + ఉపభోగ + అవళుల్ = ఉత్తమ భోగములు ఉపభోగములు అనువాని సమూహాములు, శివ - లోక + ఆది - విశేష-లోక - సుఖముల్ = శివునిలోకము మున్నగు విశిష్టలోకముల సౌఖ్యములు, సేవ్యంబుగాన్ = సేవింపఁదగినట్లుగా, చేయున్

తాత్పర్యము . దారిద్ర్యవిద్రావణా ! శివా ! భక్తితో దారిద్ర్యవిద్రావణ స్తవమును గోరి పఠించు మానవులకు నీ యనుగ్రహము భూలోకమున నీ రాచటికపు సంపదలు, ఔన్నత్యములు, సద్భోగములు ఉపభోగములును శివలోకము మున్నగు విశేషలోకముల సౌఖ్యములును సేవింపఁదగినవిగాఁ జేయును

వ అని స్తుతియించిన నమరేంద్రునకుం గరుణించి వరదుండు నీ కోరిన వరంబ యిచ్చెద వేఁడికొమ్మనిన మహాప్రసాదంబని 100

అర్థము . అని, స్తుతియించినన్ = స్తోత్రముచేయఁగా, అమర + ఇంద్రునకున్ = దేవేంద్రునకు, కరుణించి = దయఁజూపి, వరదుండు = వరదాత - శివుఁడు, నీ - కోరిన - వరంబు + అ = నీవు కోరిన వరమే, ఇచ్చెదన్, వేఁడికొమ్ము, అనినన్, మహాప్రసాదంబు + అని

తాత్పర్యము. అని స్తోత్రము చేయఁగా నీశ్వరుఁడు దేవేంద్రుని అనుగ్రహించి 'నీవు కోరిన వరము నొసఁగెదను కోరుకొను' మనిన నింద్రుఁడు 'మహాప్రసాద' మని తరువాతి పద్యముతో నన్వయము

క కలహమున సురలు తారకు
ప్రళయానలరూప ముదరిపడి యొక్కొ కమా
ర్దలఁచిన మీసలు గడ్డము
నులివాళులు వాడుచుండు నొందిన భీతిన్ 101

అర్థము కలహామునన్ = యుద్ధమునందు, సురలు = దేవతలు తారకు- ప్రళయ + అనల - రూపము = తారకాసురునియొక్క ప్రళయకాలపు అగ్నివంటి రూపు, ఉదరిపడి = భయపడి, ఒక్క + ఒక - మాట్ = ఒక్కొక్కసారి, తలఁచినన్ = తలఁపఁగా, ఒందిన - భీతిన్ = కలిగిన భయముచే, మీసలున్ = మీసములును, గడ్డమున్, ఉలివాళులు - వాడుచున్ + ఉండున్ = ఇంచుక వాడుచుండును

తాత్పర్యము . యుద్ధమున దేవతలు తారకాసురుని ప్రళయ సమయానలమువంటి ఆకారమును ఒక్కొక్కమాఱు తలఁప నులికిపడి భయమునొందఁగా మీసములును గడ్డమును ఇంచుకవాడుచుండును

విశేషములు. మీసలు - మీసము + లు 'బహువచనంబు పరంబగునపుడావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాష నగు బాల ఆచ్చిక 22 (రూ) మీసములు

వ అని యనేకప్రకారంబులం దారకాపరాధంబు విజ్ఞాపించి తన్నిమిత్తంబు మాచేసిన యత్నంబుగా నిక్కుమారుం డుదయించె నింక మీ రిక్కుమారు నమరసేనాధీశ్వరుంజేసి తారకు నిర్జింపం బంపవలయునని పరమేష్ఠి పురందరసహితంబుగా సాష్టాంగంబెఱఁగియున్నం గని కరుణించి గిరిజానుమతంబునం బరమేశ్వరుండు వారికోరినవరంబు దయచేసిన మహాప్రసాదంబని. 102

అర్థము . అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, తారక + అపరాధంబు = తారకాసురుని నేరము, విజ్ఞాపించి = విన్నవించి, తద్ + నిమిత్తంబు = దాని కొఱకు, మా - చేసిన = మే మొనర్చిన, యత్నంబుగాన్, ఇక్కుమారుండు (ఈ + కుమారుండు), ఉదయించెన్ = పుట్టెను, ఇంకన్, మీరు, ఇక్కుమారున్, అమర - సేనా + అధి + ఈశ్వరున్ = దేవతల సేన యొక్క నాయకునిగా, చేసి, తారకున్ = తారకుని, నిర్జింపన్ = ఓడించుటకు, పంపవలయున్, అని, పరమేష్ఠి - పురందర - సహితంబుగాన్ = బ్రహ్మేంద్రులతోఁగూడ, సాష్టాంగంబు + ఎఱఁగి + ఉన్నన్ = సాష్టాంగనమస్కారము చేసియుండఁగా, కని, కరుణించి = దయఁజూచి, గిరిజా + అనుమతంబునన్ = పార్వతీ దేవి సమ్మతితో, పరమేశ్వరుండు, వారి - కోరిన - వరంబు = వారు కోరిన వరంబు,-దయచేసినన్= ఁనుగ్రహింపఁగా, మహాప్రసాదంబు + అని

తాత్పర్యము . అని పెక్కు విధములఁ దారకుని నేరమును విన్నవించి, 'అందుకొఱకు మేము చేసిన యత్నముగా నీ కుమారుఁ డుదయించెను ఇంక మీరు ఈ కుమారుని దేవసేనానాయకునిగాఁ జేసి తా నోడించుటకుఁ బంపవలయు' నని బ్రహ్మేంద్రులతోఁ గూడ సాష్టాంగనమస్కారము చేసియుండఁగాఁ జూచి దయఁబూని పార్వతీదేవి సమ్మతితోఁ బరమేశ్వరుఁడు,వారు కోరిన వర మనుగ్రహింప మహాప్రసాదమని - తరువాతి పద్యముతో నన్వయము

కుమారుని యువరాజ పట్టాబిషేకము

తే కామధు క్కల్పవృక్ష చింతామణులును
వగవఁగా నిచ్చుఁ దముఁ బొందువారి కెల్ల
నొనరఁ దన్నాశ్రయించిన జనులకెల్ల
వగవఁగా నిచ్చునే భక్తవత్సలుండు 103

అర్థము కామధుహ్ (క్) + కల్పవృక్ష - చింతామణులును = కామధేనువును, కల్పవృక్షమును, చింతామణియును, తమున్ + పొందువారికిన్ + ఎల్లన్ = త మ్మాశ్రయించినవారి కందఱికును, వగవఁగాన్ = దుఃఖింపఁగా, ఇచ్చున్, భక్త - వత్సలుండు = భక్తులయెడ వాత్సల్యము గలవాఁడు - శివుఁడు, ఒనరన్ = ఒప్పుగా, తన్నున్ + ఆశ్రయించిన, జనులకున్ + ఎల్లన్ = జనుల కందఱికును, వగవఁగాన్ + ఇచ్చునే = దుఃఖింపనిచ్చునా ?

తాత్పర్యము.కామధేనువు, కల్పవృక్షము, చింతామణి త మ్మాశ్రయించిన వారి కందఱికును వేఁడికొనఁగా - దుఃఖింపఁగా నిచ్చును భక్తవత్సలుఁడైన శివుఁడు తన్నాశ్రయించిన జనుల నందఱను దుఃఖింపనీఁడు

విశేషములు అలంకారము శ్లేషము

తే అనుచు రాగిల్లి జయజయధ్వనులు చెలఁగఁ
బొంగి ముట్టట లాడిరి, పుష్పవృష్టి
కురిసె, సురపురముల నెల్ల గుళ్ళుగట్టి
యొనర వాయించి రమరు లత్యుత్సవమున 104

అర్థము . అనుచున్, అమరులు = దేవతలు, అతి + ఉత్సవమునన్ = మిక్కిలి వేడుకతో, రాగిల్లి = ఆనందించి, జయజయధ్వనులు, చెలఁగన్ =

మ్రోయఁగా, పొంగి, ముట్టుటలు + ఆడిరి = జల్లులాడిరి, పుష్ప - వృష్టి = పూలవాన, కురిసెన్, సుర - పురములన్ + ఎల్లన్ = దేవతల నగరములందంతటను, గుళ్ళు+ కట్టి = శిబిరములు కట్టి, గుంపులుకట్టి, ఒనరన్ = ఒప్పుగా, వాయించిరి = వాద్యములు మ్రోయించిరి

తాత్పర్యము. అని పలుకుచు దేవతలు మిక్కిలి వేడుకతో నానందించి జయజయధ్వనులు మ్రోయఁగాఁ బొంగి జల్లులాడిరి పూలవాన కురిసెను దేవతల పత్తనములందంతటను శిబిరములు వేసికొని వాద్యములు మ్రోయించిరి

వ తదవసరంబున విష్ణుప్రముఖాఖిలసురు లీశ్వరానుమతంబున **105**

అర్థము. తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, విష్ణు - ప్రముఖ + అఖిల సురులు = విష్ణువు మున్నగు నెల్ల సురలును, ఈశ్వరు + అనుమతంబునన్ ఈశ్వరుని సమ్మతితో

తాత్పర్యము ఆ సమయమున విష్ణువు మున్నగు దేవతలందఱును ఈశ్వరుని సమ్మతితో - తరువాతి పద్యముతో నన్వయము

సీ **మణికుట్టిమ ప్రభామంజరు లెలరారు**
పల్లవతోరణప్రతతిఁజెనయ
శశికాంతవేదికాసద్రుచు లవదాత
వప్రవితానకావలిఁ బెనంగ
వరశాలి రోపితాంకుర పాలికలు వాత
పూరణ నికర విస్ఫురణఁ దనరఁ
గర్పూర పాళీ ప్రకర రంగవల్లీ వి
లాసముల్ మౌక్తిక లంబనములఁ

ఆ **బొనరఁ దనరి భూనభోభాగ మంబర**
భాగలీల నొలసి బలసి వెలుఁగ
రత్నదీపికాదిరమణీయ మగుచున్న
మానితాభిహేమమంటపంబు **106**

అర్థము. మణి - కుట్టిమ - ప్రభా - మంజరులు = రత్నమయములైన నెలకట్టుల కాంతుల సమూహములు, ఎలరారు = వికసించు, పల్లవ - తోరణ -

ప్రతతిన్ = చివురుల తోరణముల సమూహమును, చెనయన్ = ప్రతిఘటింపఁగను,

శశికాంత - వేదికా - సత్ + రుచులు = చంద్రకాంతమణిమయములైన అరఁగుల మేలికాంతులు, అవదాత - వప్ర - వితానక + ఆవలిన్ = తెల్లని కోటల యందలి చాందినుల యొక్క వరుసతో, పెనఁగన్ = కూడఁగను,

వర- శాలి - రోపిత + అంకుర - పాలికలు = శ్రేష్ఠములైన వరుల మొలకెత్తిన మొలకల మట్టిపాత్రములు, వాత - పూరణ - నికర - విస్ఫురణన్ = గాలిబుట్టల సమూహముయొక్క ప్రకాశముతో, తనరన్ = ఒప్పఁగను,

కర్పూర - పాళీ - ప్రకర - రంగవల్లీ - విలాసముల్ = కప్పురముల సమూహముతోడి ముగ్గుల అందములు, మౌక్తిక - లంబనములన్ = ముత్యాలకోవలను, పొనరన్ = పొందఁగా, తనరి = ఒప్పి,

భూ - నభస్ (ం) + భాగము = భూమ్యాకాశ మధ్య ప్రదేశము, అంబర - భాగ - లీలన్ = వస్త్రభాగముల విలాసమును, ఒలసి = వ్యాపించి, బలసి = చుట్టి, వెలుఁగన్ = ప్రకాశింపఁగా,

రత్న - దీపికా + ఆది - రమణీయము = రత్న దీపములు మున్నగువానిచే సుందరము, అగుచున్ + ఉన్న, మానిత + అభి - హేమ - మంటపంబు = పొగడఁబడిన బంగారు మండపము

తాత్పర్యము. రత్నమయములైన నెలకట్టుల కాంతుల సమూహములు వికసించు చివురుల తోరణముల సమూహమును బ్రతిఘటింపఁగను, చంద్రకాంత మణిమయములైన అరఁగుల మేలికాంతులు తెల్లని కోటలచాందినుల వరుసతోఁ గూడఁగను, వరి మొలకల పాత్రములు గాలిబుట్టల విధమున నొప్పఁగను, కప్పురపు ముగ్గుల యందములు ముత్యాల కోవలను బొందియొప్పి, భూమ్యాకాశమధ్యప్రదేశము వస్త్రముల విలాసమును బొంది ప్రకాశింపఁగా రత్న దీపములు మున్నగువానిచే సుందరమగుచున్న బంగారు మండపము

వ మఱియుం జిత్రితానేక సువర్ణ కుంభ మణిప్రకర ముకుర కస్తూరీ మలయజాగరుసుగంధద్రవ్య గంధతైలామల కోద్వర్తన కషాయాది సముచితద్రవ్య హంసోదక తీర్థోదక పుణ్యోదకాది సమస్తపరిశోభితంబగు నభిషేకమంటపంబునకుం దోడ్కొని చనుదెంచి కార్తికేయు విధిచోదిత

న్యాయంబునం గనకద్రోణజలావగాహానానంతరంబునం జంద్రకాంత మణి పీఠాసనాసీనుం జేసి 107

అర్థము. మఱియున్, చిత్రిత = చిత్రింపఁబడిన, అనేక = పెక్కు, సువర్ణ-కుంభ = బంగారు ఘటములు, మణి - ప్రకర - ముకుర = మణుల సమూహము అనెడి అద్దములు, కస్తూరీ - మలయజ + అగరు - సుగంధ - ద్రవ్య = చందనము, అగరు, అనెడి పరిమళ ద్రవ్యములు, గంధ - తైల + అమలక + ఉద్వర్తన - కషాయ+ ఆది - సముచిత - ద్రవ్య = వాసనగల నూనెలు, ఉసిరికపొడి, కషాయ+ ఆది = ఎఱుపు గలిసిన పసుపు మున్నగు సముచిత - ద్రవ్య = తగిన వస్తువులు, హంసోదక - తీర్థ + ఉదక - పుణ్య + ఉదక + ఆది - సమస్త - పరిశోభితంబు= హంసోదకము (ఎండకు వేఁడెక్కి, వెన్నెలకుఁ జల్లనగుజలము), తీర్థోదకము, పుణ్యోదకము మున్నగు నెల్లవానిచేఁ బ్రకాశించినది, అగు, అభిషేక - మంటపంబునకున్, తోడ్కొని - చనుదెంచి = తీసికొనివచ్చి, కార్తికేయున్ = కుమారస్వామిని, విధి - చోదిత - న్యాయంబునన్ = శాస్త్రోక్త ప్రకారమున, కనక-ద్రోణ - జల + అవగాహన + అనంతరంబునన్ = బంగరు పాత్రములందలి నీటిచే స్నానమునకుఁ బిమ్మట, చంద్రకాంత - మణి - పీఠ + ఆసన + ఆసనున్ + చేసి = చంద్రకాంతమణియమైన పీఠమునందుఁ గూర్చుండఁజేసి

తాత్పర్యము . మఱియును జిత్రితములైన పెక్కు రంగుల బంగరు కుండలు, మణిసమూహములనెడి అద్దములు, కస్తూరి, చందనము, అగరు అను పరిమళద్రవ్యములు, పరిమళతైలములు ఉసిరికపొడి, కషాయము మున్నగు తగిన ద్రవ్యములు, హంసోదకము, తీర్థోదకము, పుణ్యోదకము మున్నగు నెల్లవానిచేఁ బ్రకాశించినది యగు అభిషేకమంటపమునకుఁ దీసికొనివచ్చి కుమారస్వామిని శాస్త్రోక్తపద్ధతిని బంగరుపాత్రములందలి జలముచే స్నానము చేయించిన పిమ్మటఁ జంద్రకాంత = మణిపీఠమునందుఁ గూర్చుండఁజేసి - తరువాతి పద్యముతో నన్వయము

క. జలదములఁ బాసి మెఱుఁగులు
జలధారలు గురియునట్లు శైలాగ్రములన్
నలి నమరసతులు నిర్మల
జలధారలు గురిసి రోలి షణ్ముఖమీఁదన్ 108

అర్థము. మెఱుఁగులు = మెఱుపులు, జలదములన్ = మేఘములను, పాసి = విడిచి, శైల + అగ్రములన్ = కొండకొనలందు, జల - ధారలు = నీటి

ధారలు, కురియు + అట్లు = కురియు విధమున, అమర - సతులు = దేవతాస్త్రీలు, నలిన్ = ఉత్సాహముతో, షణ్ముఖు - మోఁదన్ (షష్ (ట్) + ముఖు) = ఆఱుమొగములవాని (కుమారస్వామి) మోఁద, ఓలిన్ = బాగుగా, జలధారలు, కురిసిరి = వర్షించిరి

తాత్పర్యము మెఱుఁగులు మేఘములను విడిచి కొండల కొనల మోఁద జలధారలు వర్షించునట్లు, దేవతాస్త్రీలు ఉత్సాహముతోఁ గుమారస్వామిపై బాగుగా జలధారలు వర్షించిరి

విశేషములు : అలంకార ముపమ

మ స్తనకుంభంబులు పూర్ణకుంభములు, ముక్తాహారవిస్తారలం
బనహారమ్ములు వారిధారలు, రుచిప్రౌఢంబుగాఁ బేర్మిఁ బూ
నిన భూషామణిదీప్తులున్ వెలుఁగు తన్నీరాజనద్యోతు, లం
గన లోలిం గవగూడి సేసి రభిషేకం బంబికానందనున్ 109

అర్థము . అంగనలు = స్త్రీలు, స్తన - కుంభంబులు = కుండలవంటి కుచములు, పూర్ణ - కుంభములు = నిండుకుండలు, ముక్తా - హార - విస్తార - లంబన - హారమ్ములు = ముత్యాలపేరులనెడి అధికముగా వ్రేలాడు హారములు, వారి - ధారలు = జలధారలు, రుచి - ప్రౌఢంబుగాన్ = కాంతిచేత గొప్పదిగా, పేర్మిన్ = ప్రీతితో, పూనిన = ధరించిన, భూషా - మణి - దీప్తులున్ = అలంకారములందలి మణుల కాంతులును, వెలుఁగు = ప్రకాశించునట్టి, తద్ + నీరాజన - ద్యోతులు = ఆ హారతుల కాంతులు, ఓలిన్ = క్రమముగా, కవ + కూడి= జతగూడి, అంబికా - నందనున్ = పార్వతి కుమారుని - కుమారస్వామిని, అభిషేకంబు + చేసిరి = అభిషేకించిరి

తాత్పర్యము స్త్రీలు కుంభముల వంటిస్తనములు పూర్ణ కుంభములును, ముత్యాల పేరులు జలధారలును, అలంకారములందలి మణుల కాంతులు ప్రకాశించు నారతుల కాంతులును గాఁగా జత గూడి కుమారస్వామి నభిషేకించిరి

విశేషములు . అలంకాము రూపకము తన్నీరాజన = తద్ + నీరాజన - అనునాసిక సంధి

వ తదవసరంబున సముచితాసనతాంబూలానులేపనాంబర మాల్యాలంకృతుంజేసి కుమారు మణిమయవేదికాసీనుం జేసి మంగళ పారక పరన గీతాతోద్యంబులు దిగ్బధిరీకృతంబై జెలంగ హరి పురాణముని పురందర ప్రముఖాఖిల సురవరు లాగమ (ప్రచోదితక్రమంబున సేనాధిపాభిషేకంబు సేసి యువరాజపట్టంబుఁగట్టిన 110

అర్థము. తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, సముచిత + ఆసన - తాంబూల + ఒనులేపన + అంబర - మాల్య + అలంకృతున్ + చేసి = తగిన పీఠము, తాంబూలము, మైపూఁత, వస్త్రములు మాలలు అనువానిచే నలంకరింపఁబడినవానినిగాఁ జేసి, మంగళ - పారక - పరన - గీత + ఆతోద్యంబులు= మంగళపారమునుజదువువారి పరనము, సంగీతము, తతము, ఆనద్ధము, సుషిరము, ఘనము అను వాద్యచతుష్టయము, దిశ్ (క్) + బధిరీకృతంబు + ఐ= దిక్కులు చెవుడుపడినవిగాఁ జేయఁబడినవయి, చెలంగన్ = ధ్వనింపఁగా, హరి - పురాణముని - పురందర - ప్రముఖ + అఖిల - సురవరులు = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు నెల్ల దేవతాశ్రేష్ఠులు, ఆగమ - ప్రచోదిత - క్రమంబునన్ = శాస్త్రములచేఁ బురికొల్పఁబడిన విధమున, సేనా + అధిప + అభిషేకంబు + చేసి= సేనా నాయకాభిషేకము చేసి, యువరాజ - పట్టంబున్ + కట్టినన్ = యువరాజ పట్టాభిషిక్తునిఁ జేయఁగా

తాత్పర్యము . ఆ సమయమున సముచితములయిన ఆసనము, తాంబూలము, మైపూఁత, వస్త్రములు, మాల్యములు అనువానిచే నలంకరించి కుమారస్వామిని మణిమయమైన వేదికయందు ఆసీనుని గావించి మంగళపారకుల పరనము, గీతము, వాద్యములు అనువానిచే దిశలు చెవుడుపడునట్లు మ్రోయఁగా, విష్ణు బ్రహ్మేంద్రాది సకలదేవతా శ్రేష్ఠులు, శాస్త్రోక్తప్రకారమున సైన్యాధిపతి పట్టాభిషేకము చేసి యువరాజపట్టమును గట్టిన - యువరాజపట్టాభిషిక్తుని గావించిన - తరువాతి పద్యముతో నన్వయము

మహాస్రగ్ధర

అభిషేకానంతరం బా హరసుతుఁ డురుసింహాసనాసీనుఁడై
యత్యభిరామంబయ్యె నారాయణకమలభవేంద్రాది దేవార్చితుండై
ప్రభతోఁ బూర్వాబ్ధిలో వెల్వడి రవి మణిరుగ్బాసమానోదయాద్రి
ప్రభు శృంగం బెక్కిన ట్లప్రతిహతవిభవాపారతేజోమయుండై 111

అర్థము ఆ - హర - సుతుండు = ఆ శివకుమారుఁడు - కుమారస్వామి, అభిషేక + అనంతరంబు = అభిషేకమయిన పిమ్మట, ఉరు-సింహాసన + ఆసీనుఁడు+ ఐ = గొప్ప సింహాసనమునందుఁగూరుచున్నవాఁడయి, నారాయణ - కమలభవ + ఇంద్ర + ఆది - దేవ + అర్చితుండు + ఐ = ఎప్పుడు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతలచేఁబూజింపఁబడినవాఁడయి, రవి = సూర్యుఁడు, ప్రభతోన్ = కాంతితో, పూర్వ + అబ్ధిలోన్ = తూర్పు సముద్రములోనుండి, నెల్వడి = బయలుదేఱి, మణి- రుచ్ (క్) + భాసమాన + ఉదయ + అద్రి - ప్రభు - శృంగంబు = మణుల యొక్క కాంతులలోఁ బ్రకాశించుచున్న తూర్పు కొండటేని శిఖరము, ఎక్కు + అట్లు = ఎక్కు ఎఱమున, అప్రతిహత - ఏభవ + అపార - తేజస్ (ం) + మయుండు + ఐ= అడ్డులేని సంపదతో అధికమైన తేజస్సుతో నిండినవాఁడయి, అతి + అభిరామంబు+ అయ్యెన్ = మిక్కిలి మనోహరుఁడయ్యెను

తాత్పర్యము : ఆ కుమారస్వామి అభిషేకమైన పిమ్మట గొప్ప సింహాసన మధిరోహించినవాఁడయి, విష్ణుబ్రహ్మేంద్రాది దేవతల చేఁ బూజితుఁడై, సూర్యుఁడు కాంతితో మణుల కాంతులతోఁ బ్రకాశించుచున్న తూర్పుకొండటేని శిఖరము నధిరోహించునట్లు అడ్డులేని విభవముతో అపారమైన తేజస్సుతో నిండినవాఁడయి మిక్కిలి మనోహరుఁడయ్యెను

విశేషములు అత్యభిరామంబయ్యె - అత్యభిరాముం డయ్యెనని యుండనగునా ? అలంకారము ఉపమ మహాస్రగ్ధర లక్షణమునకు పూర్వవ్యాఖ్య (1-68) నరయునది

వ ఇ ట్లతిరమణీయమణిమయోత్తుంగసింహాసనాసీనుండై నిజజననీజనకులగు నుమామహేశ్వరుల పురోభాగంబునం బరభాగిల్లుచు నఖిలామరపరివృతుండై పేరోలగంబుండి మహానురాగంబున. 112

అర్థము. ఇట్లు, అతి - రమణీయ - మణిమయ + ఉత్తుంగ - సింహాసన+ ఆసీనుండు + ఐ = మిక్కిలి రమ్యము, మణిమయము, ఎత్తయినది అయిన సింహాసనమునందుఁ గూరుచున్నవాఁడయి, నిజ -। జననీ జనకులు = తన తల్లి దండ్రులు, అగు, ఉమా - మహేశ్వరుల - పురస్ (ః) + భాగంబునన్ = పార్వతీ పరమేశ్వరుల ఎదుట, పరభాగిల్లుచున్ = అతిశయిల్లుచు, అఖిల + అమర - పరివృతుండు + ఐ = సకల దేవతలచేఁ జుట్టఁబడిన వాఁడయి - కూడిన వాఁడయి, పేరోలగంబు + ఉండి (పేరు + ఓలగంబు) నిండు సభలో నుండి, మహత్ (మహా) అనురాగంబునన్ = అధికమైన ప్రీతితో -

తాత్పర్యము ఇట్లు మిక్కిలి రమ్యము, మణిమయము, ఉత్తుంగమునైన సింహాసనమునందుఁ గూరుచున్నవాఁడయి తనతల్లిదండ్రులగు పార్వతీ పరమేశ్వరుల యెదుట నతియిల్లుచు, సమస్తదేవతలతోఁ గూడిన వాఁడయి నిండుసభఁదీర్చి మిక్కిలి ప్రీతితో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. పేరోలగము - పేరు + ఓలగము 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు' బాల సంధి 29 ఇది టుగాగమము రాని రూపము 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు' బాల సంధి 1

మ జయఘంటారవ, రాజవక్త్ర, లసితాబ్జగ్రీవఁ, తూణీరక
ద్వయ జంఘం, గరికుంభపూర్ణకుచఁ, దోర్దండోచ్చలద్భ్రూలతన్,
హయవర్మాంబర, వజ్రదంత, గుహుఁ డీశాజ్ఞన్ శితాస్త్రోల్లస
న్నయనం, బ్రీతిఁ బరిగ్రహించె సురసేనాకన్య నత్యున్నతిన్ 113

అర్థము. గుహుఁడు = కుమారస్వామి జయ -ఘంటా + ఆరవన్ = జయఘంటల ధ్వని యనెడు ధ్వని గలది, రాజ - వక్త్రన్ = ప్రభువు (సేనా) ముఖమందుఁ గలది - చంద్రుఁడు ముఖముగాఁ గలది, లసిత + అబ్జ - గ్రీవన్ = ప్రకాశించు శంఖము కంఠముగాఁగలది, తూణీరక - ద్వయ - జంఘన్ = అమ్ములపొదుల జంటయనెడు పిక్కలు గలది, కరి - కుంభ - పూర్ణ - కుచన్ = ఏనుఁగుల కుంభస్థలములనెడు నిండుచన్నులు గలది, కోదండ + ఉత్ + చలత్+ భ్రూలతన్ = ధనుస్సులవంటి పైకిఁ జలించు బొమతీవలు గలది, హయ - వర్మ + అంబరన్ = గుఱ్ఱముల కవచములనెడు వస్త్రము గలది, వజ్ర - దంతన్ = వజ్రములనెడు దంతములు గలది, శిత + అస్త్ర + ఉల్లసత్ + నయనన్ = వాఁడిబాణములనెడు మిక్కిలి ప్రకాశించు కన్నులు (చూపులు) గలది, అగు, సుర-సేనా - కన్యన్ = దేవసేన యనెడు కన్యను, ఈశాజ్ఞన్ = ఈశ + ఆజ్ఞన్= ఈశుని ఆనతిచే, అతి + ఉన్నతిన్ = మిక్కిలి ఔన్నత్యముతో, పరిగ్రహించెన్= స్వీకరించెను

తాత్పర్యము. కుమారస్వామి జయఘంటల ధ్వనియనెడు ధ్వని కలది, రాజు (చంద్రుఁడు) ముఖముగాఁ గలది, ప్రకాశించు శంఖము కంఠముగాఁ గలది, తూణీరక - ద్వయ - జంఘన్ = అమ్ములపొదుల జంటయనెడు పిక్కలు గలది, కరి- కుంభ - పూర్ణ - కుచన్ - ఏనుఁగుల కుంభస్థలము లనెడు నిండుచన్నులు గలది, హయ -వర్మ + అంబరన్ = గుఱ్ఱముల కవచములనెడు వస్త్రముగలది,

వజ్ర - దంతన్ = వజ్రములనెడు దంతములు గలది, శివ + అస్త్ర + ఉల్లసత్ + నయనన్ = వాఁడి బాణములనెడు మిక్కిలి ప్రకాశించు కన్నులు (చూపులు) గలది, అగు, సుర - సేనా - కన్యన్ = దేవసేన యనెడు కన్యను, ఈశాజ్ఞన్ = ఈశ + ఆజ్ఞన్ = ఈశ్వరుని ఆనతిచే, అతి + ఉన్నతిన్ = మిక్కిలి ఔన్నత్యముతో, పరిగ్రహించెన్ = స్వీకరించెను

తాత్పర్యము . కుమారస్వామి జయఘంటల ధ్వని యనెడు ధ్వని కలది, రాజు (ప్రభువు) సేనాముఖముగాఁ గలది, ప్రకాశించు శంఖము కంఠముగాఁ గలది, అమ్మల పాదుల జంట యనెడు పిక్కలు గలది, ఏనుఁగుల కుంభస్థలము లనెడు పూర్ణ స్తనములు గలది, ధనుస్సులనెడు పైకిఁ జలించు బొమతీవలు గలది, గుట్టముల కవచము లనెడు వస్త్రములు గలది, వజ్రములనెడు దంతములు గలది, వాఁడిబాణములనెడు మిక్కిలి ప్రకాశించు చూపులు గలది అగు సురసేన యనెడు కన్యను శివుని యానచే మిక్కిలి ఉన్నతితో స్వీకరించెను

విశేషములు: అలంకారము రూపకము రాజ వక్త్ర అనుచో శ్లిష్టరూపకము ఉల్లసన్నయన - ఉల్లసత్ + నయన - అనునాసిక సంధి అత్యున్నతి - అతి + ఉన్నతి - యణాదేశ సంధి

వ ఇ ట్లవయవంబునం దారకు నిర్జించి తమ్ము నిఖిలభువనసామ్రాజ్య పదవియందు సుప్రతిష్ఠులం జేయంబూని మహేశ్వరానుమతంబున మహాసేనుండు సేనాధిపత్యంబు సేకొనుడు నత్యుత్సవంబున 11

అర్థము ఇట్లు, అవయవంబునన్ = జయఘంటాదిసేనాంగములతో, తారకున్, నిర్జించి = జయించి, తమ్మున్, నిఖిల - భువన - సామ్రాజ్య - పదవియందున్ = ఎల్లలోకముల సామ్రాజ్యపుటధికారమునందు, సుప్రతిష్ఠులన్ = బాగుగా స్థిరపడినవారిని, చేయన్ + పూని, మహేశ్వర + అనుమతంబునన్ = పరమేశ్వరుని ఆజ్ఞచే, మహాసేనుండు = కుమారస్వామి, సేనా + ఆధిపత్యంబు = సేనా నాయకత్వము, చేకొనుడున్ = స్వీకరించినంతనే, అతి + ఉత్సవంబునన్ = మిక్కిలి వేడ్కతో

తాత్పర్యము . ఇట్లు జయఘంటాదిసేనాం గములచేఁ దారకాసురు నోడించి తమ్ము సకల భువన సామ్రాజ్యాధిపత్యమునందు బాగుగా స్థిరపడిన వారినిగాఁ జేయఁబూని పరమేశ్వరుని ఆజ్ఞచేఁ గుమారస్వామి సేనానాయకత్వమును స్వీకరించినంతనే, మిక్కిలి వేడుకతో - తరువాతి పద్యముతో నన్వయము

సీ కులజుఁడై విక్రమబలవంతుఁడగు రాజుఁ
బడసిన దేశంబు ప్రజయుఁబోలె
సదమల సంపూర్ణ చంద్రోదయంబున
రమణీయమగుచున్న రాత్రివోలె
నురుసత్త్వుఁడగు మహాయూథాధిపతిఁ గూడి
తనరు వన్యేభబృందంబు వోలె
నాయకద్యుతిఁగ్రాలు నాయకమణితోడ
నొడఁగూడి పొలుపారు తొడవపోలె

తే నా మహేశ్వరనందను ననుపమాన
శక్తిసంపన్ను ననివార్యశౌర్యుఁ దనకుఁ
దగిన సేనానిఁగని పేర్మి మిగిలి వెలిఁగె
నమరవల్లభుఁ డాదిగా నమరగణము 115

అర్థము అమర - వల్లభుఁడు = దేవేంద్రుఁడు, ఆదిగాన్ = మొదలుగా, అమర - గణము = దేవతల సమూహము

కులజుఁడు + ఐ = ఉత్తమకులమునందుఁబుట్టినవాఁడయి, విక్రమ - బలవంతుఁడు = పరాక్రమము, బలముగలవాఁడు, అగు, రాజున్ = నృపుని, పడసిన = పొందిన, దేశంబున్ = దేశమును, ప్రజయున్ = ప్రజలును, పోలెన్ = వలెను

సత్ + అమల - సంపూర్ణ - చంద్ర + ఉదయంబునన్ = మిక్కిలి నిర్మలము, సంపూర్ణము అయిన చంద్రుని పుట్టుకచే, రమణీయము = సుందరము, అగుచున్ + ఉన్న, రాత్రి + పోలెన్ = రాత్రి వలెను

ఉరు - సత్త్వుఁడు = గొప్ప బలము గలవాఁడు, అగు, మహత్ (మహా) + యూథ + అధిపతిన్ = గొప్ప గజసమూహపు నాయకుని, కూడి, తనరు = ఒప్పునట్టి, వన్య + ఇభ - బృందంబు + పోలెన్ = అడవి యేనుఁగుల సమూహమువలెను

నాయక -ద్యుతిన్ = శ్రేష్ఠమైన కాంతితో, క్రాలు = ప్రకాశించు, నాయక - మణితోడన్ - హారమధ్యమణితో, ఒడఁగూడి = కలిసి, పొలుపారు - సుందరమగు, తొడవు + అ + పోలెన్ = ఆభరణమువలెనే

అనుపమాన - శక్తి - సంపన్నున్ = సాటిలేని బలముతో గూడినవాడును, అనివార్య - శౌర్యున్ = అడ్డగింపరాని పరాక్రమము గలవాడును, అగు, ఆ - మహేశ్వర - నందనున్ = ఆ పరమేశ్వరుని కొడుకును - కుమారస్వామిని, తనకున్, తగిన, సేనానిన్ = సేనానాయకునిగా, కని = పొంది, పేర్మి = గొప్పతనము, మిగిలి = అతిశయించి, వెలిగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము దేవేంద్రుడు మొదలుగా గల దేవతల సమూహము - కులీనుడయి బలపరాక్రమములు గలవాడగురాజును బొందిన దేశము, ప్రజలు వలెను, నిర్మలము, సంపూర్ణము అయిన చంద్రుని ఉదయముచే సుందరమయిన రాత్రివలెను, గొప్పబలము గల గజరాజుతోగూడి ఒప్పు వనగజసమూహము వలెను, శ్రేష్ఠమయిన కాంతితో ప్రకాశించు హారమధ్యమణితో గూడి అందమగు ఆభరణము వలెను, నిరుపమానశక్తిసంపన్నుడును, అనివార్యశౌర్యుడును అగు ఆ పరమేశ్వరనందనుడైన కుమారస్వామిని బొంది గొప్పతన మతిశయింప ప్రకాశించెను

విశేషములు అలంకారము మాలోపమ

వ తదవసరంబునం బరమేశ్వరుండు శక్త్యాద్యనేకరాజచిహ్నంబులు, దివ్యశస్త్రాస్త్రంబులు, హస్త్యశ్వరథపదాతిచతుర్బలంబులు దయసేసె మఱియుం బార్వతి వజ్రమయవర్మ భర్మమయమయూరవాహకుక్కుటధ్వజ ధవళాతపత్ర పంచమహాశబ్దాద్యనేకరాజచిహ్నంబులు దయసేసె నంతం బరమేశ్వరుండు లక్ష్మీశ్వరగణేశ్వరుల సహాయులుంగా నియమించి తారకు నిర్జించి సురల రక్షించునది యని యనేకప్రకారంబులం గుమారు వీడుకొలిపిన మహాప్రసాదం బని హరగిరిజల వీడ్కొని సురసేనలం గైకొని 116

అర్థము: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, పరమేశ్వరుండు, శక్తి + ఆది + అనేక - రాజ - చిహ్నంబులు = శక్తిమున్నగు పెక్కు రాచఱికపు గుఱుతులు, దివ్య - శస్త్ర - అస్త్రంబులు = దేవతాసంబంధములైన శస్త్రములు, అస్త్రములు, హస్తి, అశ్వ - రథ - పదాతి - చతుర్ + బలంబులు = ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములు, కాల్బంటులు అను నాలుగు విధములైన సేనలు, దయ+ చేసెన్ = ఇచ్చెను, మఱియున్, పార్వతి, వజ్రమయ = వజ్రముతో నిర్మింపఁబడిన, వర్మ = కవచము, భర్మమయ = బంగారుతో నిర్మింపఁబడిన, మయూరవాహ- = నెమలి వాహనము, కుక్కుట - ధ్వజ = కోడి పడగ, ధవళ + ఆతపత్ర =

వెల్లగొడుగు, పంచ - మహా - శబ్ద + ఆది + అనేక - రాజ - చిహ్నంబులు = అయిదు విధములైన శబ్దములు మున్నగు పెక్కు రాచటికపు గుఱుతులు, దయచేసెన్ = అనుగ్రహించెను అంతన్, పరమేశ్వరుండు లక్ష్మీ + ఈశ్వర - గణ+ ఈశ్వరులన్ = విష్ణువును, ప్రమధగణాధిపతులను, సహాయులన్ + కాన్= తోడుగా, నియమించి తారకున్ నిర్జించి = జయించి, సురలన్ = దేవతలను రక్షించునది = రక్షింపుము, అని, అనేక - ప్రకారంబులన్, కుమారున్, వీడుకొలిపినన్= పంపఁగా, మహాప్రసాదంబు + అని, హర - గిరిజలన్ = శివుని, పార్వతిని, వీడ్కొని= వీడి, సుర - సేనలన్ = దేవసేనలను, కైకొని = స్వీకరించి

తాత్పర్యము ఆ సమయమునఁ బరమేశ్వరుఁడు శక్తి మున్నగు పెక్కు రాచటికపుగుఱుతులు, దివ్యములయిన శస్త్రములు, అస్త్రములు, ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములు, కాలిబంటులు అను నాలుగు విధములైన సేనలు దయచేసెను మఱియును పార్వతి వజ్రమయకవచము, సువర్ణమయమయూర వాహనము, కోడి పడగ, వెల్ల గొడుగు, పంచ మహాశబ్దములు మున్నగు పెక్కు రాచటికపు గుర్తుల దయచేసెను అంతఁ బరమేశ్వరుఁడు విష్ణువును, ప్రమధ గణ నాయకులను సహాయులనుగా నియమించి, తారకునోడించి దేవతలను రక్షింపుమని పెక్కు విధములఁ గుమారస్వామిని వంవఁగా మహాప్రసాదమని పార్వతీపరమేశ్వరులను వీడుకొని దేవసేనలను గైకొని - తరువాతి పద్యముతో నన్వయము

చ హరి సురవల్లభాది దివిజావలి సూరెలఁ గొల్చిరా వియ
చ్చర వరకామినుల్ కనకచామర లోలిన పట్టుచుండఁ గి
న్నరతతి పాడఁ బారకులు నల్గడఁ బేర్కొనఁ దద్ద పేర్మితో
సురపురి కేఁగుదెంచె శివసూతి మహావిభవాభియుక్తుఁడై 117

అర్థము. శివ - సూతి = శివుని కొడుకగు కుమారస్వామి, హరి - సుర - వల్లభ + ఆది - దివిజ + ఆవలి = విష్ణువు, ఇంద్రుఁడు మొదలగు దేవతల వరుస, సూరెలన్ = ప్రక్కలందు, కొల్చి - రాన్ = సేవించి వచ్చుచుండఁగా, వియత్ + చర - వర - కామినుల్, గగనచరలైన స్త్రీలు, కనక - చామరలు = బంగరు వింజామరులు, ఒలిన్ + అ = బాగుగా, పట్టుచున్ + ఉండన్, కిన్నర - తతి = కిన్నరుల సమూహము, పాడన్ = పాడుచుండఁగా, పారకులు = స్తోత్రములను బరించువారు, నల్గడన్ = నాలుగు దిక్కులను, పేర్కొనన్ = స్తుతింపఁగా, తద్ద -

పేర్మితోన్ = మిక్కిలి గొప్పతనముతో, మహత్ (మహా) + విభవ + అభియుక్తుఁడు + ఐ = గొప్ప సంపదతోఁ గూడినవాఁడయి, సుర - పురికిన్ = దేవతల నగరమునకు - అమరావతికి, ఏఁగుదెంచెన్ = వచ్చెను

తాత్పర్యము కుమారస్వామి విష్ణువు, దేవేంద్రుఁడు మున్నగు దేవతలు పార్శ్వముల సేవించిరాఁగా, గగనచరస్త్రీలు బంగరు వింజామరలు పట్టుచుండఁగా, కిన్నరులు పాడుచుండఁగా, స్తోత్రపాఠకులు స్తుతింపఁగా మిక్కిలి గొప్పతనముతో మహాసంపదతోఁ గూడినవాఁడయి అమరావతి కరుదెంచెను

వ ఇట్లు చనుదెంచి చతుర్దశభువనాధీశ్వరుండు భువనంబులవారికిం బడినేసి కూర్చుకొనుచుం గతిపయదినంబులు సుఖ సంకథావినోదంబులం బ్రవర్తించుచుండె నంత నొక్కనాఁడు క్రౌంచాసురు మాహాత్మ్యంబు సురగురుండు కుమారునకు విశేషించి విజ్ఞాపించి 118

అర్థము . ఇట్లు, చనుదెంచి =వచ్చి, చతుర్ + దశ - భువన + అధి + ఈశ్వరుండు = పదునాలుగులోకముల యధిపతి - కుమారస్వామి, భువనంబుల - వారికిన్ = లోకములందలివారికి, పడినేసి = ఆజ్ఞచేసి, కూర్చుకొనుచున్, కతిపయ - దినంబులు = కొన్ని దినములు, సుఖ - సం - కథా - వినోదంబులన్ = సుఖముతోఁగూడిన కథల వేడుకలతో, ప్రవర్తించుచున్ + ఉండెన్, అంతన్, ఒక్కనాఁడు, క్రౌంచ + అసురు - మాహాత్మ్యంబు = క్రౌంచాసురుని గొప్పతనము, సుర - గురుండు = దేవగురువైన బృహస్పతి, కుమారునకున్, విశేషించి = అధికముగా, విజ్ఞాపించి = విన్నవించి

తాత్పర్యము . ఇట్లు వచ్చి పదునాలుగు లోకముల ప్రభువయిన కుమారస్వామి లోకములందలివారికి ఆనపెట్టి సమకూర్చుకొనుచుఁ గొన్ని దినములు సుఖముగాఁ గథావినోదములతో బ్రవర్తించుచుండెను అంత నొకనాఁడు క్రౌంచాసురుని మాహాత్మ్యమును బృహస్పతి కుమారస్వామికి విశేషముగా విన్నవించి - తరువాతి పద్యముతో నన్వయము

కుమారస్వామి కృత క్రౌంచభేదనము

క గిరుల నటె గెల్చునని నా
సురమునఁ బవిధారగెల్పు సూతంబని తా
గిరియై వజ్రము నోర్చిన
బిరు దీతఁడు క్రౌంచుఁడన నభేద్యుఁడు పోరన్ 119

అర్థము అనిన్ = యుద్ధమున, గిరులన్ + అటె = కొండలనా, గెల్చున్ = గెలుచును, ఆసురమునన్ = రాక్షసమున, పవి - ధార - గెల్పు = వజ్రాయుధమునంచు గెలుపు, చూతంబు + అని = చూచెదము గాక యని, తాన్ = తాను, గిరి + ఐ= కొండయయి, ఈతఁడు, వజ్రమున్ = వజ్రాయుధమును, ఓర్చిన = ఓడించిన, బిరుదు = సమర్థుఁడగు, క్రౌంచుఁడు + అనన్, పోరన్ = యుద్ధమున, అభేద్యుఁడు= భేదింపరానివాఁడు

తాత్పర్యము యుద్ధమున వజ్రాయుధము కొండలనా గెలుచును! రాక్షసమున దాని గెలుపు చూచెదముగాక యని తాను గొండయై వజ్రాయుధము నోడించిన సమర్థు డీతఁడు యుద్ధమునఁ గ్రౌంచుఁడన నభేద్యుఁడు

విశేషములు చూతంబని - చూతంబు + అని చూతంబు = చూతము, ఇది చూచు ధాతువు నుభయ ప్రార్థన రూపము చూచుదము - చూతము ఇందలి మువర్ణకము తిఙ్తు సుప్పు అగు మువర్ణకమునకు విధింపఁబడిన పూర్ణబిందుపూర్వక బువర్ణము దీనికెట్లు వచ్చునో ! 'చూచెదమని' యన్నచో నిర్బాధము

వ అని హంసగతినిరోధంబై రోదసీకుహరాంతరాపూరితంబై తనరు క్రౌంచపర్వతంబు చూపి వీని జయించినం దారకు నశ్రమంబున జయింపనగు నని సిద్ధాదేశంబునుం గల దనినం గుమారుండు కోపించి తన దివ్యశక్తి యెత్తికొని

అర్థము అని, హంస - గతి - నిరోధంబు + ఐ = అంచల గమనమునకు అడ్డు అయి, రోదసీ - కుహర + అంతర + ఆపూరితంబు + ఐ = గుహవంటి భూమ్యాకాశమధ్యప్రదేశము లోపలి విభాగము నిండినదయి, తనరు = ఒప్పునట్టి, క్రౌంచపర్వతంబు, చూపి, వీనిన్ = ఈ క్రౌంచుని, జయించినన్ = గెలుచుచో, తారకున్, అశ్రమంబునన్ = అనాయాసముగా, జయింపన్ + అగున్ + అని = గెలువవచ్చునని, సిద్ధ + ఆదేశంబునున్ = సిద్ధుల ఆజ్ఞయు, కలదు, అనినన్, కుమారుండు, కోపించి, తన - దివ్య శక్తి = తన దివ్యమైన శక్త్యాయుధమును, ఎత్తికొని

తాత్పర్యము . అని, అంచల గమనమును నిరోధించునదియై భూమ్యాకాశముల మధ్య ప్రదేశము నిండినదయి యొప్పు క్రౌంచపర్వతమును జూపి, వీనిని జయించినచోఁ దారకాసురుని అనాయాసముగా జయింపనగు నని సిద్ధుని ఆదేశము కూడఁ గల దనఁ గుమార స్వామి కోపించి తన దివ్యమైన శక్త్యాయుధము నెత్తికొని - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . హంసములు వర్షపునీటి కోర్వఁజాలక వర్షర్తువున భూమి నుండి మానసమునకుఁ బోవునప్పుడు క్రౌంచపర్వత మడ్డుపడి మార్గనిరోధ మొనరించెను

చ ఉరుతరశౌర్యముం బృథుబలోన్నతి యుండఁగఁ బట్టి వైచుడున్
హరసుతుశక్తి ఘోరదహనార్చులు పర్వఁగఁ బోరి తాఁకి పె
ట్టిరు మెయి నుచ్చి క్రౌంచు నొకయించుక సేపున గెల్చె వేల్పు ల
చ్చెరువడి పిచ్చలింప భుజశక్తియు షణ్ముఖునుగ్రశక్తియున్ 121

అర్థము . ఉరుతర - శౌర్యమున్ = మిక్కిలి గొప్ప పరాక్రమమును, పృథు- బల + ఉన్నతియున్ = అధికమైనబలముయొక్క ఔన్నత్యమును, తగన్ = ఒప్పునట్లు, పట్టివైచుడున్ = పట్టివైచినంతనే, హర - సుతు - శక్తి = కుమారస్వామి శక్త్యాయుధము, ఘోర - దహన = అర్చులు = భయంకరములయిన అగ్నిజ్వాలలు, పర్వఁగన్ = వ్యాపింపఁగా, పోరి, తాఁకి, పెట్టు = ఆహతి, ఇరు - మెయిన్ = రెండు ప్రక్కలను, ఉచ్చి = భేదించి, క్రౌంచున్, వేల్పులు = దేవతలు, అచ్చరువడి = ఆశ్చర్యపడి, భుజ - శక్తియున్ = భుజపరాక్రమమును, షణ్ముఖ+ ఉగ్ర - శక్తియున్ = కుమారస్వామి యొక్క భయంకరమైన శక్తియను నాయుధమును, పిచ్చలింపన్ = ప్రశంసింపఁగా, ఒక + ఇంచుక - సేపునన్ = ఒకింత కాలమున, గెల్చెన్

తాత్పర్యము: మిక్కిలి గొప్ప పరాక్రమమును, అధికమైన బలోన్నత్యమును దగునట్లు పట్టివైచినంతనే కుమారస్వామి శక్త్యాయుధము భయంకరాగ్నిజ్వాలలు వ్యాపించునట్లు పోరి, తాఁకి ఆహతి రెండు ప్రక్కలను భేదించి క్రౌంచుని ఒకింత కాలముననే దేవత లాశ్చర్యపడి కుమారస్వామి భుజశక్తిని, శక్త్యాయుధమును బ్రశంసింపఁగా గెలిచెను

విశేషములు : అచ్చెరువు, అచ్చరువు (వికృతి) - ఆశ్చర్యము, షష్ + ముఖ - షట్ + ముఖ = షణ్ముఖ షణ్ముఖునుగ్రశక్తి - షణ్ముఖ + ఉగ్రశక్తి - 'షష్ఠీసమాసముం దుకార బుకారంబుల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు ' బాల సంధి 34

వ ఇ ట్లభేద్యంబైన క్రౌంచపర్వతంబుం గుమారుం డశ్రమంబున
నిజభుజశక్తిచేతం జెటిచి సురవరుల మెచ్చించి యక్షణంబు తారకాసురుపై

నెత్త నిశ్చయించినం జక్రపాణి వాని నెఱింగించి పంపక పైఁ జను డనుచితంబనిన దాని కొడంబడి 122

అర్థము. ఇట్లు, అభేద్యంబు + ఐన= భేదింపశక్యముగానిదయిన, క్రౌంచ పర్వతంబున్, కుమారుండు, అశ్రమంబునన్ = అనాయాసముగా, నిజ - భుజ - శక్తి చేతన్ = తనదైన భుజబలముచే, చెఱిచి = నశింపఁజేసి, సుర -వరులన్ = దేవతాశ్రేష్ఠులను, మెచ్చించి = మెప్పించి, అక్షణంబు + అ = వెంటనే, తారక + అసురుపైన్, ఎత్తన్ = దండెత్తుటకు, నిశ్చయించినన్, చక్రపాణి = సుదర్శన మనుచక్రము చేతియందుఁ గలవాఁడు - విష్ణువు, వానిన్ = కుమారస్వామిని, ఎఱింగించి = తెలిపి, పంపక, పైన్ + చనుడు = దండెత్తుట, అనుచితంబు = తగనిది, అనినన్, దానికిన్ = ఆ మాటకు, ఒడంబడి = అంగీకరించి

తాత్పర్యము. ఇట్లు భేదింప నశక్యమగు క్రౌంచపర్వతమును గుమారస్వామి అనాయాసముగాఁ దన భుజశక్తిచేత భేదించి, దేవతలను మెప్పించి, వెంటనే తారకాసురునిపై దండెత్త నిశ్చయింపఁగా, విష్ణువు ముందుగాఁ గుమారస్వామి, నెఱిఁగించి పంపక పై నెత్తుట ఉచితముగాదని పలుకఁగా, దాని కంగీకరించి తరువాతి పద్యముతో నన్వయము

క. పతిహితుఁ గుల విప్రోత్తముఁ
జతురు, సదాశుద్ధుఁ గార్యసంవేదిఁ, బరేం
గిత విదు, ధైర్యాన్వితు, నిర్
ఋతమతియుతు, రాయబారిగాఁ బంపనగున్. 123

అర్థము : పతి - హితున్ = రాజుమేలుగోరువానిని, కుల -విప్ర + ఉత్తమున్ = కుల బ్రాహ్మణ శ్రేష్ఠుని, చతురున్ = నేర్పరిని, సదా - శుద్ధున్ = నిత్య పరిశుద్ధుఁడైనవానిని, కార్య - సంవేదిన్ = కర్తవ్యము నెఱిఁగిన వానిని, పర + ఇంగిత -విదున్ = ఇతరుల అభిప్రాయము నెఱిఁగినవానిని, ధైర్య + అన్వితున్ = ధైర్యముతోఁగూడినవానిని, నిర్ఋత - మతి - యుతున్ = ఉద్ఋతమైన తెలివితోఁ గూడినవానిని, రాయబారిగాన్ = దూతగా, పంపన్ + అగున్ = పంపుటొప్పును

తాత్పర్యము : రాజుమేలు గోరువాఁడును కులబ్రాహ్మణోత్తముఁడును, నేర్పరియైనవాఁడును, నిత్యపరిశుద్ధుఁడైనవాఁడును, కర్తవ్య మెఱిఁగినవాఁడును, ఇతరుల యభిప్రాయము నెఱిఁగినవాఁడును, ధైర్యముతోఁ గూడినవాఁడును, బయల్వడిన తెలివిగలవాఁడును అగు వానిని రాయబారిగాఁ బంపుటొప్పును

విశేషములు . కులవిప్రోత్తమున్ -తన కులబ్రాహ్మణు -నన్నయ ఈ రెండును నొక్కటియా ?

కుమారుఁడు సుమతిని దారకునికడకు రాయబారిగాఁబంపుట

వ అని విచారించి బృహస్పతిపౌత్రు సుమతి యనువాని రావించి తత్కార్య ప్రయోజనం బెఱింగించి ప్రార్థించి తన్నియోగంబునకు నియోగించి 124

అర్థము . అని, విచారించి = ఆలోచించి, బృహస్పతి - పౌత్రున్ = బృహస్పతి మనుమని, సుమతి - అను - వానిన్ = సుమతియను పేరుగలవానిని, రావించి, తద్ + కార్య -ప్రయోజనంబు = ఆ దూత కార్యమువలని ఫలమును, ఎఱింగించి = తెలిపి, ప్రార్థించి, తద్ + నియోగంబునకున్ = ఆ దూత కార్యమునకు, నియోగించి = నియమించి

తాత్పర్యము. అని ఆలోచించి బృహస్పతి పౌత్రుడైన సుమతి యనువానిని రప్పించి ఆ దౌత్యమువలని ఉపయోగము నెఱిఁగించి, ప్రార్థించి, ఆ పనికి నియమించి - తరువాతి పద్యముతో నన్వయము

క తొల్లిటి దోషములైనవి
యెల్లను సైరించితిమి మాకు నిం కిటఁ దానే
వల్లె యని నడచి మదిఁ దన
వాల్లభ్యముఁదక్కి చూడవచ్చినఁ జాలున్ 125

అర్థము. తొల్లిటి -దోషములు = తాను బూర్వము చేసిన అపరాధములు, ఐనవి = అయినవేవోఅయినవి, ఎల్లను = వాని నన్నిటిని, సైరించితిమి = సైఁచితిమి, మాకున్, ఇంకన్, ఇటన్, తానే, వల్లె + అని = సమ్మతించి, నడచి, మదిన్, తన - వాల్లభ్యమున్ + తక్కి = తన ప్రభుత్వమును విడిచి, చూడన్ + వచ్చినన్ = చూడవచ్చుచో, చాలున్

తాత్పర్యము : పూర్వము తాను జేసిన అపరాధములైనవేవో అయినవి వాని నన్నిటిని సైఁచితిమి ఇఁక దానే యంగీకరించి వచ్చి మనసులోఁ దన ప్రభుత్వమును విడిచి మమ్మఁ జూడవచ్చినఁ జాలును

క అఱకొనక కొన్న వృత్తులఁ
జెఱలఁ గలర్థములు నశ్వసింధురములుఁ గ్ర
మ్మఱ నిచ్చి మాకుఁ దనయం
దురు సెఱలును నిచ్చి మనుట యుఱ వను తనకున్ 126

అర్థము . అఱ - కొనక = ధర్మమును గైకొనక, కొన్న = తీసికొనిన, వృత్తులున్ = మాన్యములును, చెఱలన్ = కారాగారములందు, కల + అర్థములున్ = ఉన్న వస్తువులును, అశ్వ - సింధురములున్ = గుఱ్ఱములును, ఏనుఁగులును, క్రమ్మఱన్ = మరల, ఇచ్చి, మాకున్, తనయందున్ - ఉరుసెఱలును = తనయధీనమునన్నున్న బందీలను, ఇచ్చి మనుట = బ్రదుకుట, తనకున్, ఉఱవు = ఉచితము, అను (ము)

తాత్పర్యము . ధర్మమును గైకొనక తీసికొనిన మాన్యములును చెఱసాలలందున్న అర్థములు, గుఱ్ఱములును, ఏనుఁగులును మరల నిచ్చి మాకుఁ దన యధీనము నున్న బందీలను ఇచ్చి బ్రదుకుట తన కుచితమని పలుకుము

క దాని కొడఁబడక మనమున
దానవుఁ డేమేని బెట్టిదము లాడిన సే
నానిభుజశక్తిహతుఁడవు
గా నని కేతెమ్ము లెమ్ము ! కల నను మతనిన్ 127

అర్థము : దానికిన్ = ఆ మాటకు, మనమునన్ = మనస్సునందు, ఒడఁబడక - అంగీకరింపక, దానవుఁడు =రాక్షసుఁడు - తారకుఁడు, ఏమి + ఏనిన్ = ఏమయనను, బెట్టిదములు = పరుషములు, ఆడినన్ = పలికినచో, అతనిన్ = అతనితో, సేనాని - భుజ - శక్తి - హతుఁడవు = కుమారస్వామియొక్క భుజపరాక్రమముచే - భుజమునందలి శక్త్యాయుధముచేఁ గొట్టఁబడినవాఁడవు, కాన్ = అగునట్లు, అనికిన్ = యుద్ధమునకు, ఏతెమ్ము = రమ్ము, కలను = యుద్ధము, లెమ్ము, అనుము

తాత్పర్యము . ఆ మాట మనసునందు అంగీకరింపక తారకుఁడేమయిన బరుషవాక్యము లాడినచో నీవు కుమారస్వామి భుజమునందలి శక్త్యాయుధముచే హతుఁడవగునట్లు యుద్ధమునకు రమ్ము లెమ్ము అని అతనితోఁ బలుకుము

విశేషములు : బెట్టిదములాడి - 'విశేషణంబులు కొన్నియెడల విశేష్యలక్ష్యకంబులగు ప్రౌఢ శబ్ద 12 బెట్టిదములు =బెట్టిదపు మాటలు

వ. అని యనేకప్రకారంబుల సంధివిగ్రహోక్తుల లతివ్యక్తంబుగా శిక్షించి పంచిన మహాప్రసాదంబని వీడుకొని తారకాసురపురంబునకుం జని

నిజాగమనం బెఱింగించి పంచి తత్ప్రతిహారిపురస్కృతుండై దానవాధీశ్వరాస్థాన రంగంబు దయం జొత్తించి 128

అర్థము. అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కురీతుల, సంధి - విగ్రహ+ ఉక్తులు = సంధికి, యుద్ధమునకు సంబంధించిన మాటలు, అతి-వ్యక్తంబుగాన్ = మిక్కిలి స్పష్టముగా, శిక్షించి = బోధించి, పంచినన్ = పంపఁగా, మహాప్రసాదంబు + అని, వీడుకొని = సెలవుపుచ్చుకొని, తారక + అసురు - పురంబునకున్ = తారకాసురుని నగరమునకు, చని, నిజ + ఆగమనంబు = తనదైన రాకను, ఎఱింగించి, పంచి, తద్ + ప్రతిహారి - పురస్కృతుండు + ఐ = ఆతని ద్వారపాలకునిచే ముం దిడఁబడినవాఁడయి, దానవ + అధి + ఈశ్వర + ఆస్థాన - రంగంబు = రాక్షస రాజు (తారకు) నాస్థాన ప్రదేశము, తఱియన్ + చొత్తెంచి = సమీపింపఁజొచ్చి

తాత్పర్యము: అని పెక్కు విధముల సంధిని, విగ్రహమును గూర్చిన పలుకులు మిక్కిలి స్పష్టముగా బోధించి పంపఁగా మహా ప్రసాదమని సెలవుపుచ్చుకొని తారకాసురుని పురమునకు వెడలి తన రాక యెఱిఁగించి ద్వారపాలకుఁడు ముందు నడవ రాక్షసరాజు నాస్థానప్రదేశమును సమీపింపఁజొచ్చి-తరువాతి పద్యముతో నన్వయము

మ స్ఫురితాంగాసితదీప్తి లోలిన తమఃపుంజంబొ నాఁ బర్వ, న
త్యురుదంష్ట్రామలరోచి లంబుధర విద్యుల్లేఖలో నాఁ దగన్
సరసాకల్పమణుల్ మహారజని నక్షత్రౌఘమో నాఁ జనం
గర మొప్పం గొలువున్నధన్యుఁ గనియెం గాలోపముం దారకున్ 129

అర్థము. కుమారస్వామి దూతయగు సుమతి కర్త స్ఫురిత + అంగ + అసిత - దీప్తులు = ప్రకాశించిన అవయవములయొక్క నల్లని కాంతులు, ఓలిన్+ అ = బాగుగా, తమస్ (ః) + పుంజంబు - నాన్ = చీఁకటులగుంపో యన, పర్వన్= వ్యాపింపఁగా, అతి + ఉరు - దంష్ట్రా + అమల - రోచులు = మిక్కిలి అధికమైన కోఱలయొక్క నిర్మలములయిన కాంతులు, అంబుధర - విద్యుత్ + లేఖలో - నాన్ + తనర్పన్ = మేఘమునందలి మెఱుపులో యన నొప్పఁగా, సరస + ఆకల్ప- మణుల్ = అందమయిన ఆభరణములందలి మాణిక్యములు, మహారజని - నక్షత్ర + ఓఘమో - నాన్ + చనన్ = అర్ధరాత్రి నక్షత్రముల గుంపో యన నొప్పఁగా, కరము + ఒప్పన్ = మిక్కిలి యొప్పునట్లు, కొలువు + ఉన్న = సభదీర్చియున్న,

ధన్యున్ = అదృష్టవంతుని, కాల + ఉపమున్ = యముని వంటివానిని, తారకున్, కనియెన్

తాత్పర్యము . అవయవముల నల్లని కాంతులు చీఁకటుల గుంపులా యన వ్యాపింపఁగా, మిక్కిలి పెద్దవియగు కోఱల నిర్మలములయిన కాంతులు మేఘమునందలి మెఱు లోయన నొప్పఁగా, సుందరములయిన ఆభరణములందలి మణులు అర్ధరాత్రి యందలి నక్షత్రములగుంపో యన మిక్కిలి యొప్పి సభ దీర్చిన ధన్యుని, యమునితో సమానుఁడగు తారకాసురుని సుమతి చూచెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష ఉపమ అత్యుక్తి - అతి + ఉక్తి - యణాదేశసంధి నక్షత్రౌఘము - నక్షత్ర + ఓఘము - వృద్ధి సంధి విద్యుల్లేఖ - విద్యుత్ + లేఖ 'తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణము ఆదేశమగును' విద్యుల్లేఖ కాలోపము - కాల + ఉపము - గుణసంధి

వ కని తదీయ విభవంబున కాశ్చర్యహృదయుండగుచుఁ బ్రతిహారి నియమితస్థానంబునందున్నట్టి దేవదూతం గనుంగొని తారకానుమతంబున దనుజకులవర్ధిష్ణుం డగుధిష్ణ్యుండు 'నీ వెవ్వెరిపని కెందుండి వచ్చితి ? నిజాగమన ప్రయోజనం బేమి ?' యని యడిగిన నమరదూత భార్గవున కభిముఖుండై 130

అర్థము : కని, తదీయ - విభవంబునకున్ = ఆతని దైవ సంపదకు, ఆశ్చర్య - హృదయుండు + అగుచున్ = అచ్చెరువొందిన హృదయము గలవాఁడగుచు, ప్రతిహారి - నియమిత - స్థానంబునందున్ = ద్వారపాలకునిచే నేర్పఱుపఁబడిన స్థానమునందు, ఉన్న + అట్టి, దేవ - దూతన్ = దేవతల రాయబారియగు సుమతిని, కనుంగొని = చూచి, తారక + అనుమతంబునన్ = తారకుని అనుమతితో, దనుజ - కుల వర్ధిష్ణుండు - రాక్షసవంశమును వృద్ధిపొందించువాఁడు, అగు, ధిష్ణ్యుండు = శుక్రాచార్యుఁడు, నీవు, ఎవ్వరిపనికిన్, ఎందున్ + ఉండి, వచ్చితి(వి), నిజ + ఆగమన - ప్రయోజనంబు = నీ రాక ప్రయోజనము ఏమి ? అని అడిగినన్, అమర - దూత = దేవతల రాయబారి, భార్గవునకున్ = శుక్రునకు, అభిముఖుండు + ఐ = ఎదురయినవాఁడయి

తాత్పర్యము : చూచియాతని సంపద కచ్చెరువొందుచు ద్వారపాలకుఁడు చూపిన స్థానమున నున్న దేవదూతను సుమతిని జూచి తారకుని అనుమతితో రాక్షసవంశవర్ధకుఁడగు శుక్రాచార్యుఁడు 'నీ వెవరి పనికయి, ఎచ్చటి నుండి వచ్చితివి ? నీ రాకకుఁ బ్రయోజనమేమి ?' యని యడిగిన సుమతి శుక్రునివైపు తిరిగి తరువాతి పద్యముతో నన్వయము

క "ఏ నమరదూత హరిసే
నానియు సురపతియు దనుజనాయకుతో సం
ధానమునకుఁ బుత్తెంచిన
దానికిఁ జనుదెంచితిం బ్రధానుఁడ నెందున్" 131

అర్థము ఏను, అమర - దూతన్ = దేవదూతను హరి - సేనానియున్ = ఇంద్రుని సైన్యాధిపతియును, కుమారస్వామియు, సుర - పతియున్ = దేవేంద్రుఁడును, దనుజ - నాయకుతోన్ = రాక్షసరాజగు తారకునితో, సంధానమునకున్ = సంధికి, పుత్తెంచిన - దానికిన్ = పంపినందులకు, చనుదెంచితిన్ = వచ్చితిని, ఎందున్, ప్రధానుఁడన్ = ముఖ్యుఁడను

తాత్పర్యము: నేను దేవతల రాయబారిని ఇంద్రుని సేనానాయకుఁడగు కుమారస్వామియును, దేవేంద్రుఁడును, రాక్షసరాజగు తారకునితో సంధి చేయఁ బంపఁగా వచ్చితిని అన్నిటను నేను ముఖ్యుఁడను ''

వ అనిన విని హరిసురేశ్వరులతోడం గూడ నీ యెన్నుచున్న సేనాని యనువాఁ డెవ్వండు మి మ్మెవ్విధంబునంగూడె ననిన నుమామహేశ్వరుల వీర్యంబున నగ్ని గంగా కృత్తికా శరవణంబులయందు షడానన ద్వాదశభుజంబులతో నుదయించెం గుమారుం డక్కుమారకు నమరవరప్రార్థితుండై 132

అర్థము . అనినన్, విని, హరి - సుర + ఈశ్వరులతోడన్ = విష్ణు దేవేంద్రులతో, కూడి, నీ + ఎన్నుచున్ + ఉన్న = నీవు పరిగణించుచున్న, సేనాని, అనువాఁడు, ఎవ్వండు, మిమ్మున్, ఏ + విధంబునన్, కూడెన్, అనినన్, ఉమా మహేశ్వరుల - వీర్యంబునన్ = పార్వతీపరమేశ్వరుల వీర్యముచే, అగ్ని - గంగా- కృత్తికా - శరవణంబుల + అందున్ = అగ్ని, గంగ, కృత్తికలు, తెల్లువనము అనువానియందు, షష్ (ట్) + ఆనన - ద్వాదశ - భుజంబులతోన్ = ఆఱుమొగములతో, పండ్రెండు భుజములతో, కుమారుండు = కుమారస్వామి, ఉదయించెన్ = పుట్టెను ఆ + కుమారకున్ = ఆ కొమరుని, అమర - వర - ప్రార్థితుండు + ఐ = దేవతాశ్రేష్ఠులచేఁ గోరఁబడినవాఁడయి,

తాత్పర్యము: అనిన విని విష్ణు దేవేంద్రులతో నీవు గణించుచున్న సేనాని యనువాఁడెవ్వఁడు ? మిమ్ము ఏ రీతిగాఁ గూడెను ' అనిన, 'పార్వతీపరమేశ్వరుల వీర్యముచే అగ్ని, గంగ, కృత్తికలు, శరవణము, అనువానియందు ఆఱుమొగములు

పండ్రెండు భుజములు గలిగి కుమారస్వామి పుట్టెను ఆ కొమరుని దేవతలు ప్రార్థింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

ఉ ఆ పరమేశ్వరుండు దివిజావలికిం గరుణించి పంచె సే
నాపతిగాఁగఁ బూన్చి నిజనందను, నాతనితోడఁగూడ ల
క్ష్మీపతిఁ బంచె, వా రనుపమేయపరాక్రమశక్తియుక్తులై
మా పగఁ దీర్పఁబూని రహిమండను పంపునఁ దద్దఁ బెంపునన్ 133

అర్థము. ఆ - పరమ + ఈశ్వరుండు, దివిజ + ఆవలికిన్ = దేవతల వరుసకు, కరుణించి = దయఁదలఁచి, నిజ - నందనున్ = తన కుమారుని, సేనా - పతి + కాఁగన్ = సేనా నాయకునిగా, పూన్చి = నియమించి,పంచెన్ = పంపెను, అతనితోడన్ = ఆ కుమారునితో,లక్ష్మీ - పతిన్ = లక్ష్మి భర్తను - విష్ణుని, పంచెన్, వారు, అనుపమేయ పరాక్రమ - శక్తి - యుక్తులు + ఐ = సాటిలేని పరాక్రమము, బలము అనువానితోఁ గూడినవారయి, అహి-మండను - పంపునన్ = భుజగభూషణుని ఆజ్ఞచే, తద్ద(యు)న్ = మిక్కిలి, పెంపునన్ గొప్పతనముతో, మా-పగన్ = మా వైరమును, తీర్పన్ = తీర్చుకొనుటకు, పూనిరి = ఉద్యమించిరి

తాత్పర్యము : 'ఆ పరమేశ్వరుఁడు దేవతలపైఁ దయఁబూని తన కుమారుఁడైన కుమారస్వామిని వారికి సేనానాయకునిగా నియమించి పంపెను ఆతనితో విష్ణువును పంపెను వారు సాటిలేని పరాక్రమ శక్తియుక్తులయి శివుని యాజ్ఞచొప్పున మిక్కిలి గొప్పతనముతో మా పగను దీర్పఁబూనిరి

క అన విని కావ్యుఁడు తన మన
మునఁ గడు భయ మంది కలహమున నీశ్వరనం
దనుచేత నిలుగుఁ దారకుఁ
డను నాదేశంబు నిక్క మగునొకొ యనుచున్ 134

అర్థము : అనన్ = రాయబారియగు సుమతి చెప్పఁగా, విని, కావ్యుఁడు=శుక్రుఁడు, తన - మనమునన్ = తన మనస్సునందు, కడున్ = మిక్కిలి , భయము + అంది = భయపడి, కలహమునన్ = యుద్ధమున, ఈశ్వర - నందనుచేతన్ = ఈశ్వరుని కుమారుఁడైన కుమారస్వామిచేత, తారకుఁడు,

నిలుగున్ = చచ్చును, అను, ఆదేశంబు = ఆజ్ఞ, నిక్కము, అగున్ + ఒకొ = అగునా, అనుచున్

తాత్పర్యము అని రాయబారి యగు సుమతి చెప్పఁగా విని శుక్రుఁడు తన మనస్సునందు మిక్కిలి భయమంది 'యుద్ధమునఁ గుమారస్వామి చేతఁ దారకుఁడు చచ్చునను మాట నిజమగునా ? యనుచు - తరువాతి పద్యముతో నన్వయము

వ అని చింతించుచుండె నంత హరిసేనానీ సహితులై సురవరు లుద్దవడి నెత్తుదెంచుటయు, నెఱింగించుచున్న దేవదూతం గని తారకుండు కోపోద్దీపితాంతరంగుండై 135

అర్థము . అని, చింతించుచున్ + ఉండెన్ = విచారించుచుండెను అంతన్, హరి - సేనానీ - సహితులు + ఐ = విష్ణుకుమారస్వాములతోఁ గూడినవారయి, సుర -వరులు = దేవతాశ్రేష్ఠులు, ఉద్దవడిన్ = శీఘ్రముగా, ఎత్తుదెంచుటయున్ = దండెత్తి వచ్చుటయు, ఎఱింగించుచున్ + ఉన్న = తెలుపుచున్న, దేవదూతన్ + కని, తారకాసురుఁడు, కోప + ఉద్దీపిత + అంతరంగుండు + ఐ = క్రోధముచేత మిక్కిలి ప్రకాశించిన - మండిన, అంతరంగము గలవాఁడయి

తాత్పర్యము : అని విచారించుచుండెను అంత విష్ణు కుమారస్వాములతోఁగూడినవారయి దేవతలు శీఘ్రముగా దండెత్తి వచ్చుట తెలుపుచున్న దేవతల రాయబారిని జూచి తారకుఁడు కోపముతో నెరియుచున్న మనస్సుగలవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము

మ పని యేమేనియుఁ గల్గెనేని సుమనఃపాలుండు తా వచ్చి యొ
య్యన నా ముందట నిల్చి విన్నపము చేయంబోయి కంపించు ని
న్న, నిలింపాధిపుఁ డింతవేళక సమానస్కంధుఁడుంబోలె నై
తన కార్యస్థితి చెప్పి నా కడకు దూతం బూన్చి పుత్తెంచెనే ? 136

అర్థము . నిన్న = నిన్నటి వఱకు, పని - ఏమి + ఏనియున్ + కల్గెన్ + ఏనిన్= పనియేమయిన నున్నచో, సుమనన్ (ఃపాలుండు = దేవతల రాజు - ఇంద్రుఁడు, తాన్, వచ్చి, ఒయ్యనన్ = మెల్లఁగా, నా - ముందటన్, నిల్చి + చేయన్

+ పోయి= మనవిచేయఁబోయి, కంపించున్ = వడఁకును, నిలింప + అధిపుఁడు = దేవతల రాజు - ఇంద్రుఁడు, ఇంత - వేళకున్ + అ = ఇంత స్వల్పకాలములోనే, సమాన - స్కంధుఁడున్ + పోలెన్ + ఐ = సమానమైన భుజపరాక్రమము గలవాని విధమునయి, తన - కార్య - స్థితి = తన పని ఉండుట, చెప్పి, నా - కడకున్ = నా యొద్దకు, దూతన్ = పూన్చి = దూతను బంపి, పుత్తెంచెనే ? = పంపెనా ?

తాత్పర్యము . నిన్నటివఱకు దేవేంద్రుఁడు పని యేమయిన నున్నచో తాను వచ్చి మెల్లఁగా నా యెదుట నిలిచి విన్నవింపఁబోయి వడఁకెను ఇంతలోనే నాతో సాటివానివలె నింద్రుఁడు తన కార్యస్థితి చెప్ప నా కడకు దూతను నియమించి పంపెనా ?

వ అని కోపరసాపూరితాంతఃస్మేరవదనారవిందుం డగుచును 137

అర్థము : అని, కోప - రస + ఆపూరిత + అంతః + స్మేర - వదన + అరవిందుండు + అగుచును = కోపరసముతో మిక్కిలి నిండిన మనస్సు, నవ్వుతోడి ముఖపద్మము గలవాఁడు అగుచును

తాత్పర్యము: అని కోపరసముతో మిక్కిలి నిండిన మనస్సును, నవ్వుతోడి ముఖపద్మమును గలవాఁ డగుచును - తరువాతి పద్యముతో నన్వయము

శా ఏమేమీ మది నోటకండ సెడి దేవేంద్రాదు లుద్వత్తులై
నామీఁదం జనుదెంచిరే, నిఁక మెయిన్ నాకేశబృందారక
స్తోమం బెన్నఁడు దొల్లి మార్బలసి? రెచ్చోఁ దొల్లి పోటొగ్గి సం
గ్రామోద్యోగము చేసి ? రిప్పు డెదురంగాఁ గారణం బేమియో! 138

అర్థము : ఏమీ + ఏమీ, దేవ + ఇంద్ర + ఆదులు = దేవేంద్రుఁడు మున్నగువారు, మదిన్ = మనస్సునందు, ఓటకండ = భయము, చెడి = నశించి, ఉద్వత్తులు + ఐ = గర్వించినవారయి, నా మీఁదన్ = నా పైకి, చనుదెంచిరేన్ = దండెత్తి వచ్చిరేని, ఇఁకన్ = ఇంక, మెయిన్ = భూమియందు, నాక + ఈశ, బృందారక - స్తోమంబు = దేవేంద్రుఁడు, దేవతల సమూహము, తొల్లి = పూర్వము, ఎన్నఁడు = ఎప్పుడు, మార్బలసిరి = శత్రువులై చుట్టుముట్టిరి ? ఎచ్చోన్ (ఏ + చోటన్) ఎచ్చట, తొల్లి = పూర్వము, పోటొగ్గి = యుద్ధమునకు సిద్ధపడి, సంగ్రామ + ఉద్యోగము = యుద్ధప్రయత్నము, చేసిరి ? ఇప్పుడు, ఎదురంగాన్ = ఎదిరించుటకు, కారణంబు + ఏమియో ? = ఏమి కారణమో ?

తాత్పర్యము ఏమేమి! మనసున భయపడక దేవేంద్రుఁడు మున్నగువారు గర్వితులై నాపై దండెత్తి వచ్చిరా ? ఇఁక భూమిలో ఇంద్రుఁడు, దేవతలు ఎన్నఁడైనను బూర్వము శత్రువులయి చుట్టిముట్టిరా ? పూర్వము ఎచ్చట యుద్ధసన్నద్ధులై యుద్ధమునకుఁ బూనుకొనిరి ? ఇప్పుడు ఎదిరించుటకుఁ గారణమేమో ?

చ దురమున నోడి దానవులతోడి విరోధము వీడి భక్తితో
సురపతి వచ్చి నా శరణు చొచ్చి తగం జెఱ లిచ్చియున్న నేఁ
గరుణయ పుట్టి తమ్ముఁ బొడఁగట్టి శమించితి, నట్టి నాకుఁ దా
. నిరవుగఁ బూని మార్కొనియెనేని సహింతునె వాని నెల్లెడన్ 139

అర్థము: సుర - పతి = ఇంద్రుఁడు, దురమునన్ = యుద్ధమున, ఓడి, దానవులతోడి - విరోధము - వీడి = రాక్షసులతోడి శత్రుత్వమును విడిచి, భక్తితోన్, వచ్చి, నా - శరణు - చొచ్చి, తగన్, చెఱలు + ఇచ్చి + ఉన్నన్ = దాస్యము ఒసఁగియున్నచో, నేన్ = నేను, కరుణ + అ = దయయే, పుట్టి, తమ్మున్, పొడఁగట్టి = చూచి, శమించితిన్ = శాంతము వహించితిని, అట్టి నాకున్, తాను, ఇరవుగన్ = అనుకూలముగా, పూని, మార్కొనియెన్ + ఏనిన్ = ఎదుర్కొనెనేని, వానిన్, ఎల్ల + ఎడన్ = అంతటను, సహింతునె = సైఁతునా ?

తాత్పర్యము. 'ఇంద్రుఁడు యుద్ధమున నోడి రాక్షసులతోడి శత్రుత్వమును విడిచి భక్తితో వచ్చి నన్ను శరణుచొచ్చి తగునట్లు దాస్యము నెఱపియుండ నేను కరుణతోఁ దమ్ముఁజూచి శాంతించితిని అట్టినాతోఁ దాను మార్కొనినచో వానిని సైఁతువా?

వ అనిన విని దేవతాదూత తారకాసురుం గనుంగొని. 140

అర్థము. అనినన్, విని, దేవతా - దూత = దేవతల రాయబారి -సుమతి, తారక + అసురున్, కనుంగొని = చూచి

తాత్పర్యము. తారకుఁ డట్లనఁగా విని దేవతల రాయబారియగు సుమతి తారకునిఁజూచి - తరువాతి పద్యముతో నన్వయము

మ త్రిదేశేంద్రాదులు స్రుక్క కాజి కెదు రేతే నెంత నీ కోడరే ?
యది లే దంటిమె ? తొంటివేల్పులని నీ కా దర్పముల్ పల్కఁ బ
ట్టదుసు మ్మింకఁ, బురారినందనుఁడు షడ్వక్త్రుండు తోతెంచి బ
ల్లిదుఁడై ని న్నని నోర్చి దేవతల నేలించున్ త్రిలోకంబులన్ 141

అర్థము. త్రిదశ + ఇంద్ర + ఆదులు = దేవేంద్రుఁడు మున్నగువారు, స్రుక్కక= వెనుదీయక, ఆజికిన్ = యుద్ధమునకు, ఎదురు + ఏతేన్ = దండెత్తిరాఁగా, ఎంత, నీకున్ , ఓడరే = నీచేత నోడిపోరా ? అది - లేదు + అంటిమె ? తొంటి వేల్పులు = పూర్వదేవతలు, రాక్షసులు, అని, నీకున్, ఇంకన్ = ఇఁకమీఁదట, ఆ-దర్పముల్=ఆ గర్వోక్తులు, పల్కన్, పట్టదుసుమ్ము = సాగదు సుమా, పుర + అరి - నందనుఁడు = ఈశ్వరుని కొడుకు అగు, షష్ (ట్) వక్త్రుండు = ఆఱుమొగముల వాఁడు - కుమారస్వామి, తోఁతెంచి = వచ్చి, బల్లిదుఁడు + ఐ = శూరుఁడయి, నిన్నున్, అనిన్ = యుద్ధమునందు, ఓర్చి = ఓడించి, దేవతలన్ = దేవతలను, త్రిలోకంబులన్ = ముల్లోకములను, ఏలించున్ = ఏలునట్లు చేయును

తాత్పర్యము : దేవేంద్రుఁడు మున్నగువారు వెనుదీయక యుద్ధమునకు దండెత్తి రాగా నీచే నోడిపోవరా ? ఆ మాట కాదంటిమా ? పూర్వదేవతలని నీకు ఇంక ఆ గర్వోక్తులాడ సాగదు సుమా ! ఈశ్వరసుతుఁడగు కుమారస్వామి వచ్చి శూరుఁడయి నిన్ను యుద్ధమున నోడించి దేవతలచే ముల్లోకములను ఏలించును

విశేషములు. తొంటి దేవతలు - పూర్వదేవతలు - రాక్షసులు షడ్వక్త్రుఁడు - షష్ (ట్) + వక్త్రుఁడు తోఁతెంచు - తోఁచు + తెంచు - 'తెంచు ధాతు వగ్వాదుల కనుప్రయుక్తం బగు, బాల క్రి 110 తోఁచు + తెంచు, 'అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు ' బాల క్రి 112 తోఁతెంచు పురారినందనుఁడు, షడ్వక్త్రుఁడు, అను శబ్దములు సాభిప్రాయములు కుమారస్వామిపరాక్రమసూచకములు

తే **'భక్తిఁ గీడ్పడి సేనాని పనువు సేసి**
నడవు మొండేనిఁ, గలనికి నడువు మొండె
సెరవు సేయక దివిజుల చెఱలు లేక
విడువు మొండేని మన్నాస విడువు మొండె.' 142

అర్థము: భక్తిన్ = భక్తితో, కీడ్పడి = వశమయి, సేనాని = కుమారస్వామి యొక్క, పనుపు+చేసి = ఆజ్ఞ చేసి, నడవుము = నడచుకొనుము, ఒండేనిన్ =

ఒండెన్ + ఏనిన్ = లేదా, కలనికిన్ = యుద్ధమునకు, నడవుము + ఒండెన్ = నడవనైన నడువుము, సెరవు + చేయక = సెరగు = ఆపద, చేయక, దివిజుల = దేవతలయొక్క, చెఱలు - లేక = నిర్బంధములు లేక, విడువుము + ఒండేనిన్ = విడువనైన విడువుము, మన్ను + ఆస = భూమిపై ఆశ, బ్రదుకుపైఁ గోరిక విడువుము + ఒండెన్ = విడువనైన విడువుము

తాత్పర్యము 'భక్తితో వశమయి కుమారస్వామి ఆజ్ఞ నిర్వర్తించి నడుచుకొనుము లేదా యుద్ధమునకు బయలుదేరుము దేవతలకు ఆపదగలిగింపక వారి నిర్బంధములు తొలఁగించి విడిచిపెట్టుము లేదా భూమిపై నాశ బ్రదుకుపైఁ గోరిక విడిచిపెట్టుము '

వ అనిన విని తారకాసురుండు కోపించి **143**

అర్థతాత్పర్యములు అనిన విని తారకుఁడు కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

క చెఱలు విడు మనిన పలు కెడఁ
గొఱవింగొని చూఁడినట్లు గొని కాలఁగ బి
ట్టఱఁ గోపవహ్నిఁ జూచెం
జుఱచుఱ మదకరికి సిళ్లు చూపిన భంగిన్ **144**

అర్థము: చెఱలు - విడుము = నిర్బంధములు తొలఁగింపుము, అనిన-పలుకు = అనుమాట, ఎడన్ = హృదయమున, కొఱవిన్ + కొని, చూఁడిన + అట్లు = కాల్చిన విధమున కొని కాలఁగన్, బిట్టఱవ్ - బిట్టు + అఱన్ = ధైర్యము నశింపఁగా, మద-కరికిన్ = మదించిన యేనుఁగునకు, సిళ్లు = అంకుశములు, చూపిన - భంగిన్ = చూపినట్లు, కోప - వహ్నిన్ = కోపాగ్నితో, చుఱచుఱ + చూచెన్

తాత్పర్యము . నిర్బంధములు తొలగింపు మనిన పలుకునకు మనసు కొఱవితోఁ గాల్చినట్లు మండుచుండఁగా ధైర్యమును గోలుపోయి, మత్తేభమునకు అంకుశములు చూపిన విధమునఁ గోపాగ్నితోఁ జుఱచుఱఁజూచెను

విశేషములు . అలంకారము ఉపమ, రూపకము సిళ్లు - సిడి + లు 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' బాల తత్వము 45 సిడులు 'బహువచనము పరంబగునపుడు డ - ల -టు - ర ల యుత్వంబునకు

లోపంబు బహుళంబుగా నగు 'బాల ఆచ్చిక 12 సిడ్ + లు'బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబు లయిన డకారలకారంబుల కలఘులకారంబు బహుళంబుగ నగు ' బాల ఆచ్చిక 14 సిళ్లు

ఉ **'న న్నుఱ కేపునం జెఱల నాకిపకాంతలఁ దేరఁబంచెనే ?**
పన్నగ యక్ష సిద్ధ సురపాలకు లాదిగ వేల్పులెల్ల నే
నన్న భయంబుఁనొంది కలహంబున కెక్కరు, నిన్నఁబుట్టి తా
నెన్నఁడు భ్రాతియయ్యె ? మఱి యెన్నఁడు నేర్చెను వెక్కిరింపఁగా 145

అర్థము నన్నున్, ఉఱుక = లక్ష్యపెట్టక, ఏవునన్ = అతిశయముతో, చెఱలన్ = కారాగృహములనుండి, నాకిప - కాంతలన్ =దేవేంద్రుని స్త్రీలను, తేరన్+ పంచెనే = తెచ్చుట కాజ్ఞాపించెనా ?, పన్నగ - యక్ష - సిద్ధ - సుర-పాలకులు= నాగులు, యక్షులు, సిద్ధులు, దేవతల ప్రభువులు ఆదిగన్ = మొదలుగా, వేల్పులు + ఎల్లన్ = దేవతలందఱును, నేను + అన్నన్, భయంబున్ + పొంది, కలహంబునకున్ + ఎక్కరు = యుద్ధమున కుత్సహింపరు, నిన్నఁబుట్టి = నిన్న పుట్టి,, తాను, ఎన్నఁడు = ఎప్పుడు, భ్రాతి + అయ్యెన్ = గొప్పవాఁడయ్యెను?, మఱి, వెక్కిరింపఁగాన్ = అపహాస్యము చేయఁగా, ఎన్నఁడు, నేర్చెను ?

తాత్పర్యము. 'నన్ను లక్ష్యపెట్టక అతిశయముతోఁ గారాగృహములనున్న దేవేంద్రునిస్త్రీలను దీసికొనిరమ్మని పంపెనా ? పన్నగ యక్ష సిద్ధ దేవతా ప్రభువులు మున్నుగా దేవత లందఱును నే ననిన భయపడి నాతో యుద్ధమున కుత్సహింపరు నిన్న పుట్టి తా నెప్పుడు ఇంతగొప్పవాఁడయ్యెను ? మఱి యెప్పుడు మమ్ము వెక్కిరింపనేర్చెను?'

ఆ. **చెనసి కలహభీతి చేతుల తీఁట వోఁ**
బొడువఁజాలునేని మృడుఁడ కాక
నిరత మిగురుగుట్టి నెత్తురు త్రాగిన
భంగి కాక నాకు బాలుఁ డెదురె ? 146

అర్థము : కలహ - భీతి = యుద్ధమువలని భయము(ను), చెనసి = ప్రతిఘటించి, అనఁగా యుద్ధభయములేక యని భావము, చేతుల - తీఁట + పోన్= చేతుల దురదపోవునట్లు, పొడువన్ + చాలున్ + ఏనిన్ = పొడువ సమర్థుఁడేని, మృడుఁడు + అ - కాక = శివుఁడే తప్ప, నిరతము = ఎల్లప్పుడును, ఇగురు + కుట్టి = దంతముల చిగురును గుట్టి, నెత్తురు - త్రాగిన - భంగి - కాక= రక్తమును త్రాగిన విధముగాక, నాకున్, బాలుఁడు, ఎదురె ? = ప్రతియా ?

తాత్పర్యము . యుద్ధభయములేక చేతుల దురద పోవునట్లు పాడువ సమర్థుడేని శివుడే తప్ప, ఎల్లప్పుడును పండ్ల చిగురును గుట్టి నెత్తురు త్రాగినట్లు నాకుఁ గుట్టువాఁడు ప్రతియా ?

విశేషములు . పండ్ల చిగురును గుట్టి నెత్తురు త్రాగు టెంత సులభమో, బాలు నెదిరించుట తన కంత సులభ మనుట చేతుల తీఁట పోవునట్లు యుద్ధమున శివుఁడే నన్ను మార్కొనవలయును గాని, బాలుఁడు నాకేపాటి ? యనుట అలంకార ముపమ

క బహుముఖ మటె తన రాజ్యము
బహుదోషాఢ్యుఁ డటె తాను బాలుండటె వాఁ
డు హరుండైనను నీతి వి
రహితం బిది యిట్టి పతికి రణజయమగునే ? 147

అర్థము . తన - రాజ్యము, బహు - ముఖము + అటె = ఒక్కనికిఁ గాక అనేకులకు సంబంధించిన దఁట, తాను = ఇంద్రుఁడు, బహు - దోష + ఆఢ్యుఁడు+ అటె = పెక్కు దోషములుగల వాఁడఁట, వాఁడు = సేనాధిపతి, బాలుండు + అటె = పిల్లవాఁడఁట, హరుండు + ఐనన్ = ఈశ్వరుఁడయినను, ఇది, నీతి - విరహితంబు = నీతిమాలినది, ఇట్టి - పతికిన్ = ఇట్టి రాజునకు, రణ-జయము = యుద్ధమున గెలుపు, అగునే = అగునా ?

తాత్పర్యము · 'తన (ఇంద్రుని) రాజ్యము పెక్కురకు సంబంధించిన దఁట, తాను పెక్కు దోషములు గలవాఁడఁట వాఁడు ఆ సేనాధిపతి కుట్టువాఁడఁట హరుఁడే యగుఁగాక ఇది నీతిమాలినది ఇటువంటి రాజునకు యుద్ధమున జయము గలుగదు '

చ విడుమని వేఁడ నావలన వేల్పులు ముందఱ వీరిఁదెచ్చి యి
ల్లడ యిడివోయిరే ? భుజబలంబున నెమ్మొయి నాఁచికొంటినే
నడరఁగఁ దారు నమ్మొయి రయంబునఁ గ్రమ్మఱఁ గొంట యొప్పుఁగా
కడుగుట యొప్పునే ? యడిగినంతన యిచ్చుట నాకు నొప్పునే ? 148

అర్థము . విడుము + అని - వేఁడన్ = బంధితులను విడువు మని ప్రార్థించుటకు, వేల్పులు = దేవతలు, ముందఱన్ = పూర్వము, వీరిన్ = ఈ

బంధితులను, తెచ్చి, నావలనన్ = నా దగ్గఱ, ఇల్లడ + ఇడి + పోయిరే ? = న్యాసముగా నుంచి పోయిరా ?, నేను, అడరఁగన్ = అతిశయించునట్లు, భుజ - బలంబునన్ = బాహు పరాక్రమముచే, ఎమ్మెయిన్ - ఏ + మెయిన్ = ఏ విధముగ, నాఁచికొంటిన్ = అపహరించితినో, తారున్ = వారును, అమ్మెయిన్ - ఆ + మెయిన్ = ఆ విధముగనే, రయంబునన్ = శీఘ్రముగా, కొంట = కొనుట, ఒప్పున్ + కాక = తగును గాని, అడుగుట, ఒప్పునే ? అడిగిన + అంతన్ + అ=అడిగిన వెంటనే, ఇచ్చుట, నాకున్, ఒప్పునే

తాత్పర్యము . నా దగ్గఱ బంధితులై యున్నవారిని విడిచిపెట్టుమని వేల్పులు వేఁడుటకు వారు మునుపు వారిని దెచ్చినా కడ ఇల్లడపెట్టి పోయిరాయేమి? నేను విజృంభించి నా బాహుపరాక్రమమున వారి నెట్లు అపహరించితెచ్చితినో, వారును అట్లే వీరిని శీఘ్రముగా గ్రహించుట యొప్పును అంతేగాని వా రడుగుట యొప్పుగాదు అడిగిన వెంటనే యిచ్చుట నాకును ఒప్పుగాదు

ఉ **బాలకుఁబట్టియే సురలు బల్విడి నాపయి నెత్తి రింత యే**
నేలిదమైతినే తమకు నెన్నఁడు మద్భుజవిక్రమక్రమా
భీల కరాళ ఖడ్గవరభీషణవేషము చూచి నేలపైఁ
గాలిడి నిల్తురే యనికిఁ గ్రమ్మఱ వత్తురె ? వృత్తి సొత్తురే ? 149

అర్థము . సురలు = దేవతలు, బాలకున్ + పట్టియే = బాలకుని కారణముననే, బల్విడి =బలవంతముగా, నా - పయిన్ = నాపై, ఎత్తిరి = దండెత్తిరి ఏను = నేను, తమకున్, ఇంత - ఏలిదము + ఐతినే = ఇంత చులుకన ఐతినా ?, ఎన్నఁడు = ఎప్పుడు, మత్ + భుజ - విక్రమ - క్రమ + ఆభీల - కరాళ - ఖడ్గ - వర - భీషణ - వేషము = నాయొక్క బాహుపరాక్రమము యొక్క క్రమముచే భయంకరమయిన శ్రేష్ఠమైన కత్తిచే వెఱపుగొలుపు వేసము (రూపము), చూచి, నేలపైన్, కాలు + ఇడి = కాలు పెట్టి, నిల్తురే, అనికిన్ = యుద్ధమునకు, క్రమ్మఱన్ = మరల, వత్తురె, వృత్తి + చొత్తురే = జీవింతురా ?

తాత్పర్యము . బాలుని కారణముననే దేవతలు బలవంతముగా నాపై దండెత్తి వచ్చుటకు వారికి నేనంత చులుకన అయితినా ? ఎప్పుడైనను నా బాహు పరాక్రమముచే భయంకరమై, శ్రేష్ఠమైన కత్తిచే భయంకరమైన రూపమును జూచి నేలమీఁదఁ గాలుమోపి నిలుతురా ? మరల యుద్ధమునకు వత్తురా ? బ్రదుక నేర్తురా ?

విశేషములు. నిల్తురే, వత్తురె, చొత్తురే - నిలుచు + దు + రు + ఏ, వచ్చుదురు + ఏ, చొచ్చుదురు + ఏ - 'చువర్ణంబుతోడ దుగ్గకారంబు', తకారంబగు ' బాల క్రి 108

వ అనిన సుమతి కుమతి యగుతారకాసురు దురాలాపంబులు విని కోపించి 150

అర్థము. అనినన్, సుమతి, కుమతి = దుర్బుద్ధి, అగు, తారక + అసురు = తారకుఁడను రాక్షసుని యొక్క, దురాలాపంబులు = దుర్భాషలు, విని, కోపించి

తాత్పర్యము . అని తారకుఁడనఁగా, సుమతి దుర్బుద్ధియగు వాని దుర్భాషలు విని కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

**చ వడిఁ ద్రిదశాలి నోర్చు డొక వావిరి బీరము కాఁగ రజ్జు దె
ప్పుడు, నది నీవు చేసిన తపోవిభవంబున నబ్జగర్భుచేఁ
బడసిన విద్య గాక నిజబాహుబలంబని చూతె ? పుట్టిన
ప్పుడు భుజశక్తి మా గుహుఁడువోలె సురాధిపుఁ బోరనేర్చితే? 151**

అర్థము వడిన్ = వేగముతో, - శౌర్యముతో, త్రిదశ + ఆలిన్ = దేవతల వరుసను - సమూహమును, ఓర్చుడు = ఓడించుట, ఒక - వావిరి = గొప్ప, బీరము - కాఁగన్= పరాక్రమముగా, ఎప్పుడున్, రజ్జుదు (వు) = ఆత్మస్తుతి చేసికొందువు, అది = ఆ ఓడించుట, నీవు - చేసిన, తపస్ (ః) + విభవంబునన్ = తపస్సంపదచే, అబ్జ - గర్భుచేన్ = బ్రహ్మవలన, పడసిన = పొందిన, విద్య + కాక = నేర్పు గాక, నిజ - బాహు - బలంబు + అని = స్వీయభుజపరాక్రమమని, చూతె = చూతువా, పుట్టిన + అప్పుడు, భుజ-శక్తిన్ = బాహుబలముతో, మా - గుహుఁడు + పోలెన్ = మా కుమారస్వామి వలె, సుర + అధిపున్ = దేవేంద్రునితో, పోరన్ + నేర్చితే = యుద్ధముచేయఁగలిగితివా ?

తాత్పర్యము. శౌర్యముతో దేవతల నోడించు టొక గొప్పపరాక్రమముగా నాత్మస్తుతి చేసికొందువు అది నీవు చేసిన తపస్సంపదకు బ్రహ్మవలనఁ బొందిన నేర్పుగాక స్వీయబాహుబలమని తలంతువా ? పుట్టఁగనే బాహుపరాక్రమముతో మా కుమారస్వామివలె దేవేంద్రునితోఁ బోరఁగలిగితివా ?'

విశేషములు. తపోవిభవము - తపస్ + విభవము - తపః + విభవము- తపోవిభవము రజ్జుదువు= 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు' బాల క్రియ 24 రజ్జుదు + ఉ 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు ' బాల సంధి 11 రిజ్జుదు చూతె- చూచుదువు+ ఎ, 'చువర్ణంబుతోడ దుగ్దకారంబు తకారంబగు ' బాల క్రియ 108 చూతువు + ఎ 'లాడ్వకారలోపము - బాల క్రియ 24 చూతు + ఎ అపదాదిస్వర సంధి బాల సం 11 చూతె ఇట్లే నేర్చితే - నేర్చితివి + ఏ - లిడ్వకారలోపము బాల క్రి 24 నేర్చితి + ఇ+ ఏ - అపదాదిస్వర సంధి బాల సం 11

క. ఇనుఁ డుదయింపక ముందఱ
ఘనముగ వర్తించుఁ దారకప్రభ గా క
య్యినుఁ డుదయించిన పిమ్మటఁ
గనుఁగొన లోకమునఁ దారకప్రభ కలదే 152

అర్థము. ఇనుఁడు = సూర్యుఁడు = ప్రభువు, ఉదయింపక - ముందఱన్ = ఉదయించుటకు ముందు, తారక - ప్రభ = నక్షత్రముల కాంతి - తారకాసురుని దీప్తి, ఘనముగన్ = అధికముగా, వర్తించున్ + కాక = ఉండునుగాని, అయ్యినుఁడు = ఆ + ఇనుఁడు = ఆ సూర్యుఁడు - ఆ ప్రభువు, ఉదయించిన - పిమ్మటన్ = ఉదయించిన తరువాత, కనుఁగొనన్ = చూడఁగా, లోకమునన్, తారక - ప్రభ = నక్షత్రముల కాంతి, తారకాసురుని దీప్తి, కలదే = ఉండునా ?

తాత్పర్యము. 'ఇనుఁడు '(సూర్యుఁడు, రాజు) ఉదయించుటకుముందు తారకముల (నక్షత్రముల) కాంతి - తారకాసురుని దీప్తి అధికముగా నుండును గాని, ఆ ఇనుఁడు (సూర్యుఁడు, రాజు) ఉదయించిన తరువాత లోకమునఁ దారక ప్రభ - నక్షత్రములకాంతి, తారకుని దీప్తి ఉండదు '

విశేషములు. అలంకారము అర్థాంతరన్యాసము - శ్లేషానుప్రాణితము

క తారకవిరచితకృతియుం
దారక విరచిత సుకృతియుఁ దా నడఁగు సదా
చారక విబుధాళికి సువి
చారక విబుధాధినాథు షణ్ముఖఁ గనినన్ 153

అర్థము సువిచారక - విబుధ + అధినాథున్ = మంచి ఆలోచనగల దేవతానాయకుని, షణ్ముఖున్ - షష్ (ట్) + ముఖున్ = ఆఱుమొగముల వానిని- కుమారస్వామిని - సువిచార - కవి - బుధ + అధినాథున్ = మంచి ఆలోచన గల కవులకుఁ, బండితులకుఁ బ్రభువైనవానిని, షణ్ముఖున్ = షణ్ముఖుఁ డనువానిని, కనినన్ = చూచినచో, సత్ + ఆచారక - ఎబుధ + ఆళికిన్ = సత్ప్రవర్తనముగల దేవతల సమూహమునకు, సత్ + ఆచార - కవి - బుధ + ఆళికిన్ = మంచి ఆచారము - సంప్రదాయముగల కవులయుఁ బండితులయు సమూహమునకు, తారక - విరచిత - కృతియున్ = తారకాసురునిచేఁ జేయఁబడిన పనియును, తార - కవి - రచిత - సుకృతియున్ = తారుఁడను కవిచే రచింపఁబడిన సత్కావ్యమును, తాను, అడఁగున్ = నశించును

తాత్పర్యము . సత్ప్రవర్తనము గల దేవతలసమూహమునకు మంచి ఆలోచనము గల దేవతానాయకుఁడైన షణ్ముఖుని - కుమారస్వామిని జూచినచో, తారకాసురుఁడు గావించిన పని యడఁగును సత్సంప్రదాయముగల కవులయుఁ, బండితులయు సమూహమునకు మంచియాలోచనగల కవిపండితులలో శ్రేష్ఠుఁడగు షణ్ముఖుఁ డను కవిని జూచినచో తారుఁడను కవిచే రచింపఁబడిన సత్కావ్యమును అడఁగును

విశేషములు . అలంకారము శ్లేషము 'నన్నెచోడుని కాలమునఁ బ్రఖ్యాతులగు తార కవియు, షణ్ముఖ కవియు నుండిరని తోఁచుచున్నది ' మా రా కవి

వ అని యనేకప్రకారంబులం గుమారకు విశేషించి తారకు నిరాకరించి పలుకుచున్న దేవదూతంగని కోపించి వీని వధియింపుఁడనుడు దనుజనాయకు లొండొరులం గడవ సంక్షోభించిన, శుక్రుండు వక్రంబై యందఱ కెడసొచ్చి **154**

అర్థము. అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, కుమారకున్= కుమారస్వామిని, విశేషించి = అధికము చేసి, తారకున్ = తారకాసురుని, నిరాకరించి = త్రోసిపుచ్చి, పలుకుచున్ + ఉన్న, దేవ - దూతన్ = దేవతల రాయబారియగు సుమతిని, కని, కోపించి, వీనిన్ = దూతను, వధియింపుఁడు = చంపుఁడు, అనుడున్ = అనినంతనే, దనుజ - నాయకులు = రాక్షస శ్రేష్ఠులు, ఒండొరులన్ = ఒకరినొకరు, కడవన్ = అతిక్రమించుటకు, సంక్షోభించినన్ =

తొట్రుపడఁగా, శుక్రుండు, వక్రంబు + ఐ = అడ్డమయి, శుక్రగ్రహము వక్రించి అందఱికున్, ఎడ + చొచ్చి = నడుమువచ్చి

తాత్పర్యము అని పెక్కుగీతులఁ గుమారస్వామిని గొప్పచేసి, తారకాసురుని ద్రోసిపుచ్చి పలుకుచున్న దేవతల రాయబారియగు సుమతిని జూచి కోపమూని వీనిని జంపుఁ డనినంతనే రాక్షసశ్రేష్ఠ లొకరినొక రతిక్రమింపఁ దొట్రువడఁగా శుక్రాచార్యుఁడు నడుమ వచ్చి - శుక్రగ్రహము వక్రించి - తరువాతి పద్యముతో నన్వయము

క వీం డేమిసేయుఁ బంచిన
వాం డుండంగ ? నిక్కమునకు వధ్యుఁడుగా నా
ఖండలుఁడు గాక, యేసిన
వాం డుండఁగ నేమిసేయు వరశర మనిలోన్ 155

అర్థము . పంచినవాండు + ఉండఁగన్ = పంపినవాఁడు ఉండఁగా, నిక్కమునకున్ = నిజమునకు, వధ్యుడు + కాన్ = వధింపఁదగినవాఁడుగా, ఆఖండలుఁడు + కాక = ఇంద్రుఁడు కాక, వీండు = వీఁడు = ఈ రాయబారి, ఏమి + చేయున్ ? ఏలిన - వాండు = ప్రయోగించినవాఁడు, ఉండఁగన్, వర - శరము = మేలయిన బాణము, అనిలోన్ = యుద్ధములో, ఏమి + చేయున్ ?

తాత్పర్యము . ఈ రాయబారిని బంపినవాఁ డుండఁగా నితఁడేమి చేయును? నిజమున కీతనిని బంపిన యింద్రుఁడు వధార్హుఁడు గాని యితఁడు వధ్యుఁడా ? యుద్ధములోఁ బ్రయోగించినవాఁ డుండఁగా బాణమేమి చేయును ?

విశేషములు. అలంకారము దృష్టాంతము వీఁడు, వాఁడు అను శబ్దములు పూర్ణానుస్వారయుక్తములుగాఁ బ్రయుక్తములగుట నన్నెచోడని ప్రాచీనతకు నిదర్శనము

క గురులను, మునులను, సుకవుల,
నరిదూతలఁ బూతలగు వరాంగనల, మహీ
సురులను, మిత్రుల, బాలుర
నిరతముఁ జంపఁదగ దెంతనేరకయున్నన్ 156

అర్థము. గురులను, మునులను, సుకవులన్, అరి - దూతలన్ = శత్రువుల రాయబారులను, పూతలు + అగు = పవిత్రురాండ్రయిన, వర + అంగనలన్ = శ్రేష్ఠురాండ్రయిన స్త్రీలను, = పతివ్రతలను, మహీసురులను = బ్రాహ్మణులను, మిత్రులన్ = స్నేహితులను, బాలురన్ = పిల్లలను, ఎంత - నేరక+ ఉన్నన్ = ఎంత తప్పు చేసిన వారయినను, నిరతమున్ = ఎప్పుడును, చంపన్ + తగదు = చంపరాదు

తాత్పర్యము గురువులను, మునులను, సత్కవులను, శత్రుదూతలను, పవిత్రులగు స్త్రీలను బ్రాహ్మణులను, మిత్రులను, బాలురను - వారెంత తప్పు చేసినను ఎప్పుడును జంపరాదు '

విశేషములు. ఈ పద్యము మా రా కవి ప్రతిలో లేదు

వ అనిన దనుజగురు వచనంబుల దనుజవరులు మన్నించి వానిం బరిభవింపక వెలువడఁ ద్రోపించి రంతఁ దారకాసురుండు నిజాప్తచరు నస్మదీయ భుజావష్టంభా విక్రయంబులు శక్ర చక్రధర కుమారాద్యమర చక్రంబునకు విశేషించి వర్ణించి హిమవంతంబు నుత్తరదిగ్భాగంబునం గలను సెప్పి రమ్మనిన వాఁడును మహాప్రసాదంబని వీడుకొని చనియె నంత నక్కడ 157

అర్థము. అనినన్, దనుజ - గురు - వచనంబులన్ = రాక్షసగురువగు శుక్రుని మాటలను, దనుజ - వరులు = రాక్షస శ్రేష్ఠులు, మన్నించి = ఆదరించి, వానిన్ = ఆ దూతను, పరిభవింపక = అవమానింపక, వెలువడన్ = ఆవలికిఁ బోవునట్లు, త్రోపించిరి = గెంటించిరి, అంతన్, తారక + అసురుండు, నిజ + ఆప్త - చరున్ = తన ఇష్టుఁడగు చారుని, అస్మదీయ - భుజ + అవష్టంభ +అవక్ర - విక్రమంబులు = నావయిన బాహులు గర్వమును, వంకరలేని - సరియైన పరాక్రమమును, శక్ర - చక్రధర - కుమార +ఆది + అమర - చక్రంబునకున్ = ఇంద్రుఁడు, విష్ణువు, కుమారస్వామి మున్నగు దేవతల సమూహమునకు, విశేషించి= అధికముగా, వర్ణించి, హిమవంతంబు + ఉత్తర - దిశ్ (క్) + భాగంబునన్ = హిమవత్పర్వతమునకు ఉత్తర దిశాభాగమందు, కలను = యుద్ధము, చెప్పి, రమ్ము అనినన్, వాఁడును, మహత్ (మహా) ప్రసాదంబు + అని, వీడుకొని = సెలవు పుచ్చుకొని, చనియెన్, అంతన్, అక్కడన్

తాత్పర్యము . అనిన శుక్రుని పలుకులను రాక్షసశ్రేష్ఠులు ఆదరించి వానిని అవమానింపక బయటికి గెంటించిరి అంతఁ దారకుఁడు తన హితుఁడగు చారునితో నా బాహుగర్వమును అవక్రపరాక్రమమును అధికముగా వర్ణించి హిమవత్పర్వతమున కుత్తర = భాగమున యుద్ధమని చెప్పి రమ్మన వాఁడును మహాప్రసాదమని సెలవు పుచ్చుకొని యేఁగెను అంతనక్కడ - తరువాతి పద్యముతో నన్వయము

క సురదూత మగుడఁ జని సుర
వరపరివృతుఁడగు మయూరవాహనునకుఁ దా
నరిగిన దెస కార్యము వి
స్తరముగ నెఱిఁగించుచున్న తదవసరమునన్ 158

అర్థము సుర - దూత = దేవతల రాయబారి - సుమతి, మగుడన్ = మరల, చని, సుర - వర - పరివృతుఁడు + అగు = దేవశ్రేష్ఠులచేఁ గూడికొన్నవాఁడగు, మయూర - వాహనునకున్ = నెమలి వాహనముగాఁ గలవానికి - కుమారస్వామికి, తాను, అరిగిన - దెస = వెడలిన చోటి, కార్యము = పని, విస్తరముగన్ = విపులముగ, ఎఱిఁగించుచున్ + ఉన్న - తద్ + అవసరమునన్ = తెలుపుచున్న ఆ సమయమున

తాత్పర్యము. దేవతల రాయబారియగు సుమతి మరలిచని దేవతలతోఁ బరివేష్టితుఁడైన కుమారస్వామికిఁ దానువెడలిన చోటి పనిని విపులముగఁ జెప్పుచున్న ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

తారకుని దూత కుమారస్వామి కడకు వచ్చుట

వ పడిహారి చనుదెంచి దానవదూత శివద్వారంబున నున్నవాఁడని విన్నపంబుచేసి కుమారానుమంతంబునం దోడ్కొని రాఁ జనుదెంచి హరి పురందర ప్రముఖాఖిల సురవర దిగధీశ్వర పరిశోభితంబై నవరత్న నికర మేఖలా కలాపంబు చేసినట్లనేకపురుషరత్నాకీర్ణంబై వెలుంగుచున్న 159

అర్థము. పడిహారి = పణిహారి - ద్వారపాలకుఁడు, చనుదెంచి, దానవ - దూత = రాక్షసుల రాయబారి, శివ - ద్వారంబునన్, ఉన్నవాఁడు, అని, విన్నపంబు + చేసి, కుమార + అనుమతంబునన్ = కుమారస్వామి సమ్మతితో, తోడ్కొని - రాన్ = తీసికొని రాఁగా, చనుదెంచి, హరి - పురందర - ప్రముఖ + అఖిల - సురవరదిశ్ (క్) + అధి + ఈశ్వర - పరిశోభితంబు + ఐ = విష్ణువు, ఇంద్రుఁడు

మున్నగు నెల్ల దేవశ్రేష్ఠులతోను, దిక్పాలకులతోను ప్రకాశించినదయి, నవరత్న నికర - మేళలా - కలాపంబు = తొమ్మిది రత్నముల సమూహము గల మొలనూలి ఆభరణము, చేసిన + అట్లు, అనేక - పురుష - రత్న + ఆకీర్ణంబు + ఐ = శ్రేష్ఠులగు పురుషులతోఁ గూడినదయి, వెలుఁగుచున్ + ఉన్న = ప్రకాశించుచున్న

తాత్పర్యము. ద్వారపాలకుఁడు వచ్చి తారకుని రాయబారి శివద్వారము కడ నున్నవాఁడని విన్నవించి కుమారస్వామి అనుమతితోఁ దీసికొని రాఁగా వచ్చి విష్ణువు, ఇంద్రుఁడు మున్నగు నెల్లదేవశ్రేష్ఠులతోను, దికాల్పకులతోను ప్రకాశించినదయి, నవరత్నస్థగితమైన మొలనూలి ఆభరణము చేసినట్లు పెక్కండ్రు పురుషశ్రేష్ఠులతో - పెక్కు మగఱాలతో - వ్యాప్తమయి ప్రకాశించుచున్న - తరువాతి పద్యములోని సభలో అనుదానితో నన్వయము

మ సభలో దానవదూత గాంచె విలసజ్జాజ్వల్యమానంబులై
యభిరామాంగరుచుల్ సురప్రకర వక్త్రాబ్జాలి కుజ్జృంభ సౌ
రభముల్ దిక్కుల గ్రిక్కొనంగ నెలమిన్ రంజించు బాలార్కస
న్నిభుఁ గాంతాకరచామరానిలచలన్నీలాలకున్ బాలకున్ 169

అర్థము: సభలోన్, దానవ - దూత = రాక్షసుఁడగు తారకుని రాయబారి, అభిరామ + అంగ - రుచుల్ = మనోహరములయిన దేహకాంతులు, విలసత్ + జాజ్వల్యమానంబులు + ఐ = మిక్కిలి ప్రకాశించుచున్నవయి, సుర - ప్రకర - వక్త్ర+ అబ్జ + ఆలికిన్ = దేవతల సమూహము యొక్క ముఖ పద్మముల వరుసకు, ఉత్ + జృంభ - సౌరభముల్ = సంపూర్ణ వికాసము, పరిమళము, దిక్కులన్ = దిశలందు, గ్రిక్కొనంగన్ = గిరికొనఁగా - వ్యాపింపఁగా, ఎలమిన్ = ప్రీతితో, రంజించు = రంజిల్లునట్లు చేయు, బాల + అర్క - సన్నిభున్ = లేఁత సూర్యునితో సమానుఁడును, కాంతా - కర - చామర + అనిల - చలత్ + నీల + అలకున్ = స్త్రీల చేతులందలి వింజామరలగాలిచేఁ జలించుచున్న నల్లని ముంగురులు గలవాఁడును, అగు బాలకున్ = పిల్లవానిని - కుమారస్వామిని, కాంచెన్ = చూచెను

తాత్పర్యము. సభలో తారకాసురుని రాయబారి మనోహరములయిన దేహకాంతులు మిక్కిలి ప్రకాశించుచున్నవయి, దేవతల ముఖపద్మములను వికాస పరిమళములు దిక్కులందు వ్యాపించునట్లు ప్రీతితో రంజిల్లఁజేయు లేఁత

సూర్యునితో సమానుఁడును, స్త్రీల చేతుల వింజామరల గాలికిఁ జలించు ముంగురులు గలవాఁడును అగు బాలుని - కుమారస్వామినిఁ జూచెను

విశేషములు అలంకారము ఉపమ అనుప్రాసము చలన్నీల = చలత్ + నీల - అనునాసిక సంధి

వ ఇ ట్లఖిల సురావళి విభూతియుం గుమారు నైశ్వర్యావష్టంభ తేజోభివృద్ధియుంగని విస్మితుండగుచుం గుమారు నాస్థానరంగంబు దటియంజొత్తెంచి త్రినయనతనయు సభావిభవంబు తృణంబకాఁ గైకొని సురవరులం గనుంగొని

అర్థము : ఇట్లు, అఖిల - సుర + ఆవలి = సకల దేవతల సమూహము యొక్క, విభూతియున్ సంపదయును, కుమారు + ఐశ్వర్య = అవష్టంభ - తేజస్ (ఃఁ) + అభివృద్ధియున్ = కుమారస్వామియొక్క, ఐశ్వర్యగర్వముతేజస్సుయొక్క పెంపును, కని, విస్మితుండు + అగుచున్ = ఆశ్చర్యపడినవాఁడగుచు, కుమారు+ ఆస్థాన - రంగంబు = కుమారస్వామియొక్క సభాప్రదేశమును, తటియన్ + చొత్తెంచి = ప్రవేశించి, త్రినయన - తనయు = ముక్కంటి కుమారుఁడైన కుమారస్వామియొక్క, సభా - విభవంబు = సభా సంపద, తృణంబు + అ = గడ్డిపోచయే, కాన్ = అగునట్లు, కైకొని = తలఁచి, సురవరులన్ = దేవతా శ్రేష్ఠులను, కనుంగొని

తాత్పర్యము : ఇట్లు ఎల్ల సురల సంపదయును, కుమారస్వామి యైశ్వర్యగర్వమును తేజోవృద్ధిని జూచి ఆశ్చర్యపడుచుఁ గుమారుని ఆస్థాన ప్రదేశమును బ్రవేశించి, కుమారస్వామి సభాభవనమును తృణప్రాయముగా నెంచి దేవతలను జూచి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. తేజోభివృద్ధి - తేజస్ + అభివృద్ధి = పదాంతసకారమునకు విసర్గాదేశము - తేజః + అభివృద్ధి - హ్రస్వ ఆకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ ఆకారము పరమగుచుండఁగా విసర్గమునకు ఉకార మాదేశమయి తత్పూర్వ అకారముతో గుణసంధి యగును తేజోభివృద్ధి కుమారు + ఆస్థాన - 'షష్ఠీ సమాసమునం దుకార ముకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు ' బాల సంధి 34

సీ కాలంబు కూడ జగంబు లేర్చుట యెంత
యల వని హరులోచనాగ్ని నుఱడు
వనరాశిదగు మెత్తఁదన మెర్గి యేచుటే
బలమని బాడబానలముఁ దెగడు
మార్పెట్ట నోపని మ్రాఁకు లేర్చుట యెంత
వాలగు నని వనవహ్ని నవ్వుఁ
గలితనం బెఱుఁగని కులగిరు లేర్చు టే
వాఁడిమి యని పవిజ్వలనుఁ బలుకు

తే నెలమిఁ గోమల మగు తొవ లేర్చుడెంత
తనదు తీవ్రత్వమని తీవ్రధాము నొత్తుఁ
దనకుఁ బ్రతిలేక దిక్కులు దాఁకి వెలుఁగు
తారకాసురు ఘోరప్రతాపవహ్ని 162

అర్థము ఁనకున్, ప్రతి - లేక = మాఱులేక, దిక్కులు, తాఁకి, వెలుఁగు= ప్రకాశించునట్టి తారక + అసురు = తారకాసురునియొక్క, ఘోర - ప్రతాప - వహ్ని = భయంకరమైన పరాక్రమ మనెడి అగ్ని

కాలంబు - కూడన్ = కాలము కూడఁగా, జగంబులు = లోకములు, ఏర్చుట = దహించుట, ఎంత + అలవు + అని = ఏపాటి సామర్థ్యమని, హరు - లోచన + అగ్నిన్ = ఈశ్వరుని కంటి మంటను, ఉఱఁడు = సరకుసేయఁడు

వన - రాశిది + అగు = సముద్రముయొక్క, మెత్తఁదనము = మృదుత్వము, ఎర్గి = తెలిసి, ఏచుట = విజృంభించుట, ఏ - బలము + అని = ఏమిశక్తియని, బాడబ + అనలమున్ = బడబాగ్నిని, తెగడున్ = తిరస్కరించును

మార్పెట్టన్ + ఓపని = మాఱు + పెట్టన్ + ఓపని = ఎదురు తిరుగ లేని, మ్రాఁకులు = చెట్లు (చెట్లను), ఏర్చుట = దహించుట, ఎంత - వాలు + అగున్ + అని = ఎంత తీక్ష్ణత అగునని, వన - వహ్నిన్ = అడవినిప్పును - దావాగ్నిని, నవ్వున్ = పరిహసించును

కలితనంబు = శౌర్యము, ఎఱుఁగని, కుల - గిరులు = కులపర్వతములు (లను), ఏర్చుట= కాల్చుట, ఏమి - వాఁడిమి + అని = ఏమి పరాక్రమ మని, పవి-జ్వలనున్ = వజ్రాయుధపుటగ్నిని, పలుకున్ = ఆక్షేపించును

ఎలమిన్ = వికాసమున, కోమలము + అగు = మృదువులగు, తొవలు= కలువలు (లను), ఏర్చుడు = కాల్చుట, ఎంత - తనదు - తీవ్రత్వము + అని = తన తీక్ష్ణతయని, తీవ్ర -ధామున్ = సూర్యుని, ఒత్తున్ = నిందించును

తాత్పర్యము . తనకు మాఱులేక దిక్కులు ముట్టి వెలుఁగునట్టి తారకాసురుని భయంకరమైన ప్రతాపమనెడి అగ్ని కాలముకూడఁగా లోకములను గాల్చుట యేపాటి సామర్థ్యమని ముక్కంటి కంటిమంటను సరకుసేయఁడు సముద్రము మృదుత్వ మెఱిఁగి దహించుట ఏమి బలమని బడబాగ్నిని దిరస్కరించును ఎదిరింపఁజాలని చెట్లను దహించుట యెంత తీక్ష్ణతయని దావాగ్నిని బరిహసించును శౌర్యము నెఱుఁగని కులపర్వతములను దహించుట ఏమి పరాక్రమమని వజ్రాయుధపుటగ్నిని ఆక్షేపించును వికాసమున మృదువులగు కలువలను దహించుట ఎంతటి తీక్ష్ణతయని సూర్యుని నిందించును

విశేషములు . అలంకారము కావ్యలింగము ఇందలి యెత్తుగీతిలోని వెలుఁగు అనుదానిని క్రియగాఁగాక, అన్వయసౌలభ్యమునకయి చివరి అరసున్నను దీసివైచి క్రియావిశేషణముగాఁ జేయునది అన్ని పాదములందును 'నేర్చు' ధాతువుండఁగా, రెండవ పాదమున మాత్రము 'ఏచు' ధాతువుండుట విచారణీయము అది కూడ 'ఏర్చు' అనియే యుండనోపును మ్రాఁకులు = మ్రాను + లు 'కలన్వాదుల సువర్ణంబు కుజ్జగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగును ' బాల తత్సమ 19 మ్రాఁకులు తనదు- తీవ్రత్వము - 'యుష్మదస్మదాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాషనగు ' వనరాశిఁ దగు మెత్తఁదనము అనియుండుటకంటె వనరాశి దగు (వనరాశిది + అగు) మెత్తఁదన మనియుండుట లెస్సయని అరసున్నను దొలఁగించుటయైనది వనరాశి + అది 'అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు' మార్పెట్టు - మాఱు + పెట్టు - 'అలఘురేఫము లుప్తాచ్చమగుచో లఘురేఫం బగు ' ప్రౌఢ ము ల వి ప్రతాపవహ్ని - అనుచో నలంకారము రూపకము

వ అట్టి దనుజాధీశ్వరు నెఱింగి యెఱింగి యుక్కుడింపక పై నెత్తి వత్తుమను నింత సాహసం బున్నయునికిన మీ కెందుండి వచ్చె. 163

అర్థము · అట్టి, దనుజ + అధి + ఈశ్వరున్ = రాక్షస శ్రేష్ఠుడగు తారకుని, ఎఱింగి + ఎఱింగి = తెలిసి తెలిసి, ఉక్కుడింపక = పొగరు విడువక,

పైన్ + ఎత్తి - వత్తుము = పైకి దండెత్తి వత్తుము, అను, ఇంత - సాహసంబు = ఇంతటి తెగువ, ఉన్న + ఉనికిన్ + అ = ఉన్నట్లుండి - ఆకస్మికముగా, మీకున్, ఎందున్ + ఉండి = ఎచ్చటినుండి, వచ్చెన్

తాత్పర్యము. అట్టి తారకుని దెలిసితెలిసి పాగరు విడువక పై దండెత్తి వత్తమను నింతటి తెగువ ఉన్నటులుండి మీ కెచ్చటినుండి వచ్చెను ?

ఉ **దండుగులిచ్చి వేలగొని దానిపయిం జెఱలిచ్చి కన్న నిం**
దుండఁగ నిచ్చెఁగాక దనుజోత్తముఁ డల్గినఁ జంపఁ బెద్దయే ?
యుండితిరే సహింపఁ గని యున్నవిధంబున నుండ కిప్పు డీ
కొండికవాని నమ్మి పగగో లిది కార్యమె ? మీకు శౌర్యమే ? 164

అర్థము చండుగులు + ఇచ్చి = నష్టపరిహారము లిచ్చి, వేల + కొని = దాస్యముచేసి, దాని పయిన్ = ఆ పయి, చెఱలు + ఇచ్చి - కన్నన్ = బందెల నీఁగాంచఁగా, ఇందున్ = ఈ స్వర్గమున, ఉండఁగన్ + ఇచ్చెన్ + కాక = ఉండనిచ్చెను గాని, దనుజ + ఉత్తముఁడు = రాక్షస శ్రేష్ఠుఁడు = తారకుఁడు, అల్గినన్ = కోపించినచో, చంపన్ + పెద్దయే = చంపుట కష్టమా ? సహింపన్ + కని= అతఁ డోర్చుకొనఁగాఁ జూచి, ఉండితిరే + మీరు ఉంటిరా ? ఉన్న - విధంబునన్+ఉండక = ఉన్నరీతి నుండక, ఇప్పుడు, ఈ - కొండిక వానిన్ = ఈ చిఱుతవానిని, నమ్మి, పగ + కోలు = పగఁగొనుట, ఇది,' కార్యమె = చేయఁదగినదియా? మీకున్, శౌర్యమే = శూరత్వమా ?

తాత్పర్యము. 'తారకునకు మీరు నష్టపరిహారములు చెల్లించి దాస్యము నొనరించి, ఆ పై బందెల నీఁగాంచఁగా అతఁడు మిమ్ము ఈ స్వర్గమున నుండనిచ్చెను గాని యతఁ డలిగినచో మిమ్ముఁ జంపు టొక కష్టమా ? అతఁ డిటులోర్చుకొనఁగా మీరు చూచియుంటిరా ? ఉన్నటులుండక మీరు ఇప్పుడు ఈ చిఱుతవానిని నమ్ముకొని వైరమును వహించుట మీకుఁ జేయఁదగినదా ? ఇది శౌర్యమగునా ?

విశేషములు. పగగోలు - అనుప్రయుక్తమైన కొనుధాతువునకు భావార్థక రూపము కోలు 'భావంబునం దనుప్రయుక్తంబగు కొనుటకుం గోలు విభాష నగు' ప్రౌఢ క్రి 13

చ మరుఁ బరిమార్చి శంభునభిమాన మడంచి గృహస్థుఁజేసి యా
తరుణుల యీలువుల్ చెఱిచి తాపసులం బెడఁబాచి యింత దు
ర్భరమున నీతనిం బడసెఁ బాఱుఁడు బుద్ధుల ప్రోఁగ నాఁగ నీ
సురగురుఁ డింతచేసె నిది చూచినఁ గ్రాఁగఁడె తారకుం డనిన్ 165

అర్థము. పాఱుఁడు = బ్రాహ్మణుఁడు (బృహస్పతి), మరున్ = మన్మథుని, పరిమార్చి = చంపి, శంభు + అభిమానము = శివుని గర్వము, అడంచి = అణఁచి, గృహస్థున్ + చేసి = సంసారిగాఁజేసి, ఆ - తరుణుల = ఆ యువతులైన మునిపత్నులయొక్క, ఈలువుల్ =పాతివ్రత్యములు, చెఱిచి = పాడుచేసి, తాపసులన్ = సప్తమహర్షులను, పెడఁబాచి = విడువఁజేసి, ఇంత - దుర్భరమునన్= ఇంత కష్టముతో, ఈతనిన్ = ఈ కుమారస్వామిని, పడసెన్ = పొందెను బుద్ధుల- ప్రోఁగ - నాఁగన్ = బుద్ధుల రాశియే యనునట్లు, ఈ - సుర - గురుఁడు= ఈ దేవ గురువు - బృహస్పతి, ఇంత - చేసెన్, ఇది - చూచినన్, తారకుఁడు, అనిన్ =యుద్ధమునందు క్రాఁగఁడె = మండిపడఁడా ?

తాత్పర్యము . 'బ్రాహ్మణుఁడైన బృహస్పతి మన్మథునిఁ జంపి శివుని యాత్మగౌరవమును అణఁచి, సంసారిని జేసి, ఆ ముని పత్నుల పాతివ్రత్యములను జెఱిచి, సప్తమహర్షులను విడువఁజేసి - ఇంత శ్రమపడి యీ కుమారస్వామిని బడసెను ఈ బృహస్పతి బుద్ధులరాశియే యన నింతచేసెను ఇది చూచినచో దారకుఁడు యుద్ధమున మండిపడఁడా ?

క చా నెత్తికొంటి రక్కల
నేనియుఁ దలమాసువోని నెత్తురు కుదుమున్
సేనానిఁ జేసి రజ్జున
దానవపతిమీఁద నడవఁ దగునే మీకున్ 166

అర్థము . అక్కల = అయ్యో, తలమాసు నేనియున్ + పోని = తలమావియైనను పోవని, నెత్తురు - కుదుమున్ = నెత్తురు ముద్దను, సేనానిన్ + చేసి = సేనాధిపతిని గావించి, చాన్ + ఎత్తికొంటిరి = చావఁబూనుకొంటిరి, రజ్జునన్ = దురభిమానమున, మీకున్, దానవ - పతి- మీఁదన్ = రాక్షసరాజు మీఁదికి, నడవన్ + తగునే = దండెత్తనగునా ?

తాత్పర్యము . అయ్యో ! తలమావియైనను వీడని నెత్తురుముద్దను సేనాపతినిగాఁ జేసి చావఁబూనుకొంటిరి దురభిమానమున మీకు రాక్షసరాజగు తారకునిపై దండెత్తనగునా ?

విశేషములు తలమాసువోని నెత్తురు కుదుము అప్పుడు పుట్టినవాఁడు లానెత్తికొంటిరి అను మా రా కవి ప్రతిలోని పారము కంటె, 'చానెత్తి కొంటిరి ' అను సా అ వా ప్రతులలోని పారము మేలు చాన్ = చచ్చు + నుజి 'చావు నోవులు చచ్చు నొచ్చుల కగు ' బాల క్రి 94 చావు + నుజి 'జీత్తు పరంబగునపుడు వాని వువర్ణంబువిభాషను లోపించు ' బాల క్రి 95 చా + నుజి = చాను(న్) + చావు + నుజి 'జీత్తుపరంబగునపు డుత్వంబున కత్వంబగు ' బాల క్రి 20 చావను - (చావన్), నేని - హలాది నెత్తురు అనుదానిలోని నె'తో యతిమైత్రి 'నీవును జూచి తట్టి సభనేని ఎనంబడ దేయుగంబులన్ నన్నయ భా సభా ద్వి 'నీకున్' అనుదానికంటె 'మీకున్' అను బహువచనరూపమే లెస్స 'చానెత్తి కొంటిరి' అనుదాన బహువచనక్రియయే కలదు గదా

ఆ **పాలపాపనోటు బంటుగా సేనానిఁ**
జేసి యతని మీరు సేతఁబట్టి
యసురనాథుఁ జెనయు డామును గొలపట్టు
కాఁగ గజముఁ జెనయు కరణి గాదె ! 167

అర్థము పాలపాపన్ + ఓటు = చంటి పిల్లవానినా, బంటు + కాన్ = వీరుఁడుగా, సేనానిన్ = సేనాపతిని, చేసి, అతనిన్, మీరు, చేతన్ + పట్టి = నమ్ముకొని, అసుర - నాథున్ = రాక్షసరాజును - తారకుని, చెనయుడు = ఎదిరించుట, ఆమును = మదమును, కొలపట్టు - కాఁగన్ = కొలమానముగా, గజమున్ = ఏనుఁగును, చెనయు - కరణి - కాదె = ఎదిరించు విధము గాదా ?

తాత్పర్యము : పాలుత్రాగు చంటిపాపనినా వీరునిగా నెంచి సేనాధిపతిని జేయుట, అతనిని మీరు నమ్ముకొని రాక్షసరాజును ఎదిరించుట, మదము ప్రమాణమును బట్టి యేనుఁగు నెదిరించు విధము కాదా ?

విశేషములు : అలంకారము ఉపమ

వ **అని యనేక ప్రకారంబుల సురలను నురలంబలికి దనుజదూత త్రినయనతనయుం గనుంగొని** 168

అర్థము . అని, అనేక - ప్రకారంబులన్, సురలను = దేవతలను, ఉరలన్ + పలికి= నశింపఁబలికి, దనుజ - దూత = రాక్షసుల రాయబారి, త్రినయన - తనయున్ = ముక్కంటి కొడుకును - కుమారస్వామిని, కనుంగొని

తాత్పర్యము . అని పెక్కు విధముల దేవతలను పడఁబలికి తారకుని రాయబారి కుమారస్వామిని జూచి - తరువాతి పద్యముతో నన్వయము

క ఈ యింద్రుఁ డీ కృశానుం
డీ యముఁ డీ దనుజనాథుఁ డీ వరుణేశుం
డీ యనిలుఁ డీ కుబేరుం
డీ యీశానుండు నీవు నెదిరెడి వారే ? 169

అర్థము. ఈ + ఇంద్రుఁడు, ఈ - కృశానుండు = ఈ అగ్ని, ఈ - యముఁడు, ఈ - దనుజనాథుఁడు = ఈ రాక్షసప్రభువు - నిర్ఋతి, ఈ - వరుణ + ఈశుండు = ఈ వరుణదేవుఁడు, ఈ + అనిలుఁడు = ఈ వాయువు, ఈ - కుబేరుండు, ఈ + ఈశానుఁడు, నీవున్, ఎదిరెడివారే = ప్రతిఘటించువారా ?

తాత్పర్యము. 'ఈ యింద్రుఁడు, ఈ యగ్ని, ఈ యముఁడు, ఈ నిర్ఋతి, ఈ వరుణుఁడు, ఈ వాయువు, ఈ కుబేరుఁడు, ఈ యీశానుఁడు నీవు తారకుని ప్రతిఘటింపఁగలవారా ?'

చ తమతము వృత్తు లొత్తికొని దైత్యుల నిల్పినఁ దూలియాడు నే
మములఁ బయోధికిం జనియె మాధవుఁ డద్రికిఁ జేరె నీశుఁ డ
బ్జమునకుఁ బోయె వాక్పతి, దిశాపతు లేఁగిరి భీతులై దిగం
తములకు నీవ గెల్చె దనిఁ దారకు వైరిబలప్రహారకున్ 170

అర్థము. తమ తమ వృత్తులు = తమతమ పదవులు, ఒత్తి = తప్పించి, కొని = (వానిని) గ్రహించి, దైత్యులన్ = రాక్షసులను, నిల్పినన్ = నిల్పఁగా, తూలియాడు - నేమములన్ = చలించునట్టి విధులతో, మాధవుఁడు = విష్ణువు, పయోధికిన్ = సముద్రమునకు, చనియెన్, ఈశుఁడు, అద్రికిన్ = పర్వతమునకు - కైలాసమునకు, చేరెన్, వాచ్(క్)() + పతి = సరస్వతి, భర్త - బ్రహ్మ, అబ్జమునకున్ = తామరపువ్వునకు, పోయెన్, దిశా-పతులు = దిక్పాలకులు, భీతులు + ఐ = భయపడినవారయి, దిశ్(క్) + అంతములకున్ = దిక్కుల కొనలకు, ఏఁగిరి, నీవు + అ = నీవ = నీవే, వైరి - బల - ప్రహారకున్ = శత్రుబలమును హరించువాఁడు, అగు, తారకున్, అనిన్ = యుద్ధమునందు, గెల్చెదు = జయింతువు

తాత్పర్యము: తమ తమ పదవులను లాగివైచి వానియందు రాక్షసులను నిలుపఁగాఁ జలించు విధులతో విష్ణువు సముద్రమునకుఁ జనెను శివుఁడు కొండను జేరెను బ్రహ్మ తామరను బ్రవేశించెను దిక్పాలకులు భయపడి దిక్కుల కొనకుఁ బోయిరి శత్రుబలములను హరించు తారకుని యుద్ధమున నీవే జయింతువు

సీ కమలజు పాశంబు గాలాపుఁద్రాడుగాఁ
గాలోగ్రదండంబు గడయుఁగాఁగ
దనుజారి చక్రంబు గొనివచ్చి గాలంబు
గాఁ బవమాను మృగంబు కొమ్మ్ము
బలుబడిఁగొని ధాత్రి పాతాళమునఁ బడఁ
గ్రొచ్చి నాగేంద్రునిఁ దెచ్చి తలలు
చిదిమి యం దెఱ గ్రుచ్చి యుదధిలోపలవైచి
మహదాదిమత్స్యకూర్మములఁ దిగిచి

తే హరు లలాటాగ్ని లోపల నెరియఁబెట్టి
నములు నిజభుజభూరివిక్రమము మెఱయ
వాని బలువిడి యెఱుఁగవయేని నీవు,
తారకాసురు నెఱుఁగరె వీరు తొల్లి 171

అర్థము తారకుఁడు - కర్త నిజ - భుజ - భూరి - విక్రమము = తనదైన బాహువులయొక్క అధికమైన పరాక్రమము, మెఱయన్ = ప్రకాశింపఁగా, కమలజు - పాశంబు = బ్రహ్మ యొక్క (వరుణుని యొక్క?) పాశము, గాలాపుఁద్రాడు + కాన్ (గాలాము+త్రాడు + కాన్) = గాలమునకుఁ గట్టు త్రాడుకాఁగా, కాల + ఉగ్ర - దండంబు = యమునియొక్క భయంకరమైన దండము, గడయున్ + కాఁగన్ = గాలపుఁగఱ్ఱ కాఁగా,

దనుజ + అరి - చక్రంబు = రాక్షసవైరియగు విష్ణునియొక్క చక్రము, కొని - వచ్చి, గాలంబు + కాన్ = చేపలను బట్టు సాధనముగా -బడిశముగా, పవమాను - మృగంబు - కొమ్ము = వాయువుయొక్క జింకయొక్క కొమ్ము, బలువిడిన్ = బలాత్కారముగా, కొని, ధాత్రి = భూమి (ని), పాతా ళమునన్, పడన్ + గ్రొచ్చి = పడునట్లు త్రవ్వి, నాగ + ఇంద్రుని = భుజగశ్రేష్ఠుని - శేషుని, తెచ్చి, తలలు, చిదిమి = నలఁగఁగొట్టి, అందున్ = ఆ గాలమునందు, ఎఱ= ఆహారము, గ్రుచ్చి, ఉదధి లోపలన్ = సముద్రములో, వైచి, మహత్ + ఆది - మత్స్య - కూర్మములన్ = గొప్పవియగు ఆదిమత్స్యమును, ఆదికూర్మమును, తిగిచి = ఆకర్షించి, పట్టి

హరు - లలాట + అగ్నిలోపలన్ = ఈశ్వరుని నొసటి (కంటి) మంటలో, ఎరియన్ + పెట్టి = మండఁబెట్టి - కాల్చి, నములున్

నీవు, వాని, బలువిడి = శౌర్యము, ఎఱుఁగవు + అ+ ఏనిన్ = ఎఱుఁగనిచో, వీరు, తొల్లి = పూర్వము, తారక + అసురున్, = ఎఱుఁగరె ?

తాత్పర్యము. తారకుఁడు తనబాహుపరాక్రమము మెఱయునట్లు బ్రహ్మ (వరుణుని?) పాశమును గాలపుఁద్రాడుగను, యముని భయంకరమైన దండము గాలపు గడగను, విష్ణుని సుదర్శనము గాలముగా, వాయువు వాహనమైనజింక కొమ్ము బలాత్కారముగాఁ గొని భూమిని పాతాళమునఁబడఁద్రవ్వి నాగరాజయిన శేషునిఁ దెచ్చి తలలు చిదుకఁగొట్టి ఆ గాలమునకు ఎఱగా గ్రుచ్చి సముద్రములోఁబడవైచి గొప్పవియగు ఆదిమత్స్యమును ఆదికూర్మమును బట్టి, శివుని నొసటి కంటిమంటలోఁ గాల్చి నమలును వాని పరాక్రమమును బాలుఁడవైన నీ వెఱుఁగకున్నను, ఈ విష్ణ్వాది దేవతలు పూర్వము తారకాసురు నెఱుఁగరా ?

క దనుజేంద్రుఁ జెఱలు విడుమని
పెనఁగెదు పులిగొన్న మృగము పెట్టునఁబడునే ?
చనుఁద్రావు బాలుఁడవు నీ
వని కలవడి చక్కఁద్రోవ నలవియె నీకున్ ? 172

అర్థము దనుజ + ఇంద్రున్ = రాక్షసశ్రేష్ఠుని - తారకుని, చెఱలు - విడుము + అని = బంధితులను విడిచిపెట్టుమని, పెనఁగెదు = పట్టుఁబట్టెదవు, పులి+ కొన్న = పులి పట్టుకొనిన, మృగము = లేడి, పెట్టునన్ + పడునే = దెబ్బకుఁబడునా ? నీవు, చనున్ + త్రావు - బాలుఁడవు = చనుఁబాలు గుడుచు చంటివాఁడవు, అనికిన్ = యుద్ధమునకు, అలవడి = అలవాటుపడి, చక్కన్ + త్రోవన్ = బాగుగా మించుటకు, నీకున్, అలవియె = శక్యమా ?

తాత్పర్యము . తారకుని బంధితులను విడువుమని పట్టుఁబట్టెదవు పులివాతఁబడిన లేడి దెబ్బకుఁ గ్రిందఁబడునా ? నీవు చనుఁబాలు గుడుచు పిల్లవాఁడవు యుద్ధమున కలవాటుపడి బాగుగా మించుటకు నీకు శక్యమగునా ?

విశేషములు . అలంకారము దృష్టాంతము

సీ భూరితరోగ్ర గంభీరాబ్ధి లడఁగించు
నౌర్వాగ్ని కెంత నీహారకణము ?
ఘోరకాంతార సంహారకారణ మగు
కార్చిచ్చునకు నెంత గడ్డిపఱక ?

గురుతరోన్నతధరాధర భేదియగు శత
ధార కేటిది సికతాకణంబు
సురనర గరుడ కిన్నర వరదర్పాప
హారకుం డనఁజను తారకునకు

ఆ నమలి మ్రింగఁ గేలఁ జమరి మొగంబునఁ
బూసికొనఁగ రాచి బొట్టు వెట్టఁ
బట్టి పిసుకలేని పసుఁబాప వతనికి
నలిగి చూడనైనఁ దలమె తలఁప 173

అర్థము. భూరితర + ఉగ్ర - గంభీర + అబ్ధులు = మిక్కిలి పెద్దవియు, భయంకరమయినవియు, లోఁతయినవియు అగు సముద్రములు, అడఁగించు = నశింపఁజేయు, ఔర్వ + అగ్నికిన్ = బడబాగ్నికి, నీహార -కణము = మంచుబిందువు, ఎంత ?

ఘోర - కాంతార - సంహార - కారణము = భయంకరమైన అడవియొక్క నాశమునకుఁ గారణము, అగు, కార్చిచ్చునకున్ = దావాగ్నికి, గడ్డిపఱక, ఎంత ?

గురుతర + ఉన్నత - ధరాధర - భేది = మిక్కిలి గొప్పవియు, ఎత్తయినవియు అగు కొండలను భేదించునది, అగు, శత - ధారకున్ = నూఱుంచులు గల కత్తికి - వజ్రాయుధమునకు, సికతా - కణంబు = ఇసుక రేణువు, ఏటిది = ఏ పాటిది ?

సుర - నర - గరుడ - కిన్నర - వర - దర్ప + అపహారకుండు = దేవతల, మనుష్యుల, గరుడుల, కిన్నరుల, శ్రేష్ఠమయిన గర్వమును అపహరించువాఁడు, అనన్ + చను = అననొప్పు, తారకునకున్, నమలి - మ్రింగన్ = నమలిమ్రింగుటకును, కేలన్ = చేతితో, చమరి = నలఁచి, మొగంబునన్, పూసికొనఁగన్, రాచి, బొట్టు + పెట్టన్, పట్టి - పిసుకన్, లేని = చాలని, పసుఁబాపవు = పసిపిల్లవాఁడవు, తలఁపన్, అతనికిన్ = తారకునకు, అలిగి - చూడన్ + ఐనన్ + తలమె కోపముతోఁ జూచుటకైన సాధ్యమా ?

తాత్పర్యము. మిక్కిలి గొప్పవియు, భయంకరములు, లోఁతయినవియు నైన సముద్రముల నడఁచు బడబాగ్నికి మంచుబిందు వెంత ? భయంకరములైన అడవుల నాశమునకుఁ గారణమయిన దావాగ్నికి గడ్డిపఱక యేపాటి ? గురుతరము, ఉన్నతమునైన పర్వతమును భేదించు వజ్రాయుధమునకు ఇసుకరేణువెంత ?

సురల, నరుల, గరుడుల, కిన్నరవరుల గర్వము నడఁగించు తారకునకు, నమలి మ్రింగుటకుఁగాని, చేతితో రాచి మొగమునఁబూసికొనుటకుఁగాని, రాచి బొట్టు పెట్టుకొనుటకుఁ గాని, పట్టి పిసుకుటకుఁగాని చాలని పసిపాపఁడవు తలఁపఁగా నా తారకుఁ డలిగి చూచుటకైనను నీవు చాలవు

విశేషములు . అలంకారము దృష్టాంతము

మ **ఘనసంఘంబు ప్రభంజనున్, శశికళాఖండంబు రాహుం, బయో**
జిని హస్తిం, దిమిరంబు భానుఁగని యాక్షేపించి నిర్జింప నొ
య్యన పైనెత్తినభంగి నర్భకుఁడ వీ వల్పుండ వీ రూపునం
జనుదెంతే చెనయంగఁ బోరఁ ద్రిజగత్సంహారకుం దారకున్ 174

అర్థము ఘన-సంఘంబు = మేఘముల సమూహము, ప్రభంజనున్ = వాయువును, శశి - కళా - ఖండంబు = చంద్రకళముక్క రాహున్ = రాహువును, పయోజిని = పద్మలత, హస్తిన్ = ఏనుఁగును, తిమిరంబు = చీఁకటి, భానున్ = సూర్యుని, కని = చూచి, ఆక్షేపించి = తిరస్కరించి, నిర్జింపన్ = జయించుటకు, ఒయ్యనన్ = బాగుగా, పైన్ + ఎత్తిన - భంగిన్ = మీఁద దండెత్తిన విధమున, అర్భకుఁడవు = బాలుఁడవు, ఈవు, అల్పుండవు = చిన్నవాఁడవు, ఈ - రూపునన్ = ఈ యాకారముతో, త్రి - జగత్ + సంహారకున్ = ముల్లోకములను సంహరించువాఁడగు, తారకున్, పోరన్ = యుద్ధమున, చెనయంగన్ = ఎదిరించుటకు, చనుదెంతే = చనుదెంచు + దు+వు+ఏ = వత్తువా ?

తాత్పర్యము : మేఘముల గుంపు వాయువును, చంద్రకళాశకలము రాహువును, పద్మలత ఏనుఁగును, చీఁకటి సూర్యునిఁ జూచి తిరస్కరించి జయింప దండెత్తిన విధమున, అర్భకుఁడవు, చిన్నవాఁడవు అయిన నీవు ఈ ఆకారమున ముల్లోకములను సంహరించువాఁడైన తారకుని యుద్ధమున నెదిరింపవత్తువా ?

విశేషములు : అలంకారము మాలోపమ రాహు - 'రాహు బాహు శబ్దంబుల కంతటవువర్ణక లోపంబు వైకల్పికంబు ' ప్రౌఢ శబ్ద 26 శశికళాఖండంబు- శశికళయనఁజాలియుండఁగా ఖండమనుట తదల్పిష్టతను సూచించుటకు, చనుదెంతే - చను ధాతువు 'అభ్యాగతి నరుగ్వాదుల కయ్యది (తెంచు) యను ప్రయుక్తం బగు ' బాల క్రి 111 'ఉత్వంబు పయిని, దాని తకారంబు దకారం బగు.' 'బాల క్రి 110 చనుదెంచు 'తద్దర్మాదులందు లాట్టగు' చనుదెంచు + లాట్టు బాల క్రి 5 'లకారంబునకు డుత్రువురునుముష్ణగు ' బాల క్రియ 8

చనుదెంచు + వు 'లాట్టు రుఇ్ఞపరంబగునపుడు దుగాగమంబగు ' బాల క్రి 22 చనుదెంచు + దు+ వు 'చువర్ణంబుతొడ దుగ్దకారంబు తకారంబగు ' బాల క్రి 108 చనుదెంతువు 'తద్ధర్మభూతక్రియ లార్థ్యార్థపరకంబులయి ప్రశ్నార్థకంబులగు ' ప్రౌఢ క్రి 3 చనుదెంతువు + ఏ 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు ' - 'బాల క్రి 24 చనుదెంతు + ఉ + ఏ 'అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు ' బాల సంధి 11 చనుదెంతే

వ అని యనేకప్రకారంబులం దన్నుఁ దృణీకరించి నిజాధీశ్వరుండును దనుజేశ్వరుండునగు తారకు వర్ణించుచున్న వినిి కోపించి 175

అర్థము అని, అనేక - ప్రకారంబులన్, తన్నున్, తృణీకరించి = నిరాకరించి, నిజ + అధి + ఈశ్వరుండును = తన ప్రభువును, దనుజ + ఈశ్వరుండును = రాక్షసశ్రేష్ఠుడును, అగు, తారకున్, వర్ణించుచున్ + ఉన్నన్, విని, కోపించి

తాత్పర్యము . అని పెక్కుకారీతులఁ దన్ను నిరాకరించి, తన ప్రభువును రాక్షసరాజును అగు తారకాసురుని ప్రశంసించుచుండఁగా విని కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

క అనలసుతుఁ డనలకణములు
పెనఁగొన నమరారిదూత ప్రిదిలిపడంగాఁ
గనుఁగొని 'పొగడెదె వా దై
త్యుని మమ్ము నెఱుఁగ నగు మహోగ్రాజి మొనన్ 176

అర్థము. అనల - సుతుఁడు = అగ్ని కుమారుఁడు - కుమారస్వామి, అనల - కణములు = అగ్ని కణములు, పెనఁగొనన్ = కలుగఁగా, అమర + అరి - దూత = రాక్షసుల రాయబారి, ప్రిదిలిపడంగాన్ = వెనుదీయఁగా, కనుఁగొని = చూచి, ఆ దైత్యునిన్ = ఆ రాక్షసుని - తారకుని, పొగడెదవా ? మమ్మున్, మహత్ (మహా) + ఉగ్ర + ఆజి - మొనన్ = గొప్పదియు, భయంకరమయినదియునగు యుద్ధముఖమున, ఎఱుంగన్ + అగున్

తాత్పర్యము . అగ్నికుమారుఁడగు కుమారస్వామి అగ్నికణము లురుల రాక్షసదూత వెనుదీయఁగాఁ గనుఁగొని 'ఆ దైత్యుని ప్రశంసింతువా ? భయంకరమైన యుద్ధముఖమున మా సంగతి తెలియనగును '

విశేషములు . అనలసుతుఁడు గనుకనే అవలకణములు పెనఁగొనఁ గనుఁగొనఁ గలుగుట 'అనల సుతుఁ డను విశేష్యము సాభిప్రాయముగాన నలంకారము పరికరాంకురము

వ 'మా యెత్తివచ్చునంతకుం జిక్కనై నిలు మను మంతియ చాలు' నని వానిం బరిభవింప నెత్తిన గణముఖ్యుల నచ్యుతప్రార్థితుండై వారించి సత్కృతుంజేసి వీడుకొలిపిన దనుజదూతయు హిమవంతంబు నుత్తరంబునం గలను సెప్పి చని దనుజాధీశ్వరుంగని వినయావనతాననుండై మహాదేవు నియోగంబున మహాసేనుండు సేనానియై సురవరులం గైకొని నెత్తుదెంచుచున్న వాఁ డనిన విని కోపాగ్రహావేశంబునం దావగొనక 177

అర్థము . మా + ఎత్తి వచ్చు + అంతకున్ = మేము దండెత్తి వచ్చువఱకును, చిక్కన + ఐ = స్థైర్యముతో, నిలుము, అనుము, అంతియ, చాలును, అని, వానిన్ = ఆ రాక్షస దూతను, పరిభవింపన్ + ఎత్తిన = పరాభవింపఁబూనిన, గణ - ముఖ్యులన్ = గణాధిపులను, అచ్యుత - ప్రార్థితుండు + ఐ = విష్ణువుచేఁ బ్రార్థింపఁబడినవాఁడయి, వారించి = అడ్డగించి, సత్కృతున్ + చేసి = సమ్మానించి, వీడుకొలిపినన్ = పంపఁగా, దనుజ - దూతయున్ = రాక్షసుల రాయబారియు, హిమవంతంబు + ఉత్తరంబునన్ = హిమవత్పర్వతముయొక్క ఉత్తర దిక్కున, కలను = యుద్ధము, చెప్పి, చని, దనుజ + అధి + ఈశ్వరున్ = రాక్షస ప్రభువును - తారకుని, కని, వినయ + అవనత + ఆననుండు + ఐ = అడఁకువచే వంపఁబడిన ముఖము గలవాఁడై, మహాదేవు - నియోగంబునన్ = ఈశ్వరుని ఆదేశముచే, మహాసేనుండు = కుమారస్వామి, సేనాని + ఐ = సేనానాయకుఁడయి, సుర-వరులన్ = దేవతాశ్రేష్ఠులను, కైకొని = గ్రహించి, తెరలన్ + ఎత్తుదెంచుచున్ + ఉన్నవాఁడు = దండెత్తి రాఁబూనుచున్నవాఁడు, అనినన్, విని, కోప + ఆగ్రహ + ఆవేశంబునన్ = క్రోధము, పట్టుదల ఆవేశింపఁగా, తావగొనక = నిలువక

తాత్పర్యము: మేము దండెత్తివచ్చువఱకును స్థైర్యముతో నిలువుమనుము అంతే చాలును' అని వానిని అవమానింపఁబూనిన గణనాయకులను విష్ణువుచేఁ బ్రార్థింపఁబడినవాఁడయి వారించి సమ్మానించి పంపెను రాక్షసదూతయు హిమవత్పర్వతోత్తరదిక్కున యుద్ధమని చెప్పి వెడలి రాక్షసరాజగు తారకునిఁ జూచి వినయమున ముఖము వంచి 'మహాదేవునాదేశమున మహాసేనుఁడు సేనాధిపతియై దేవతలను దీసికొని దండెత్తనున్నవాఁడనిన విని కోపావేశముతో నిలువక - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు మాయెత్తి వచ్చునంతకు - మేమెత్తి వచ్చునంతకు - దాతుజ విశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్మపదప్రథమకుఁ దఱుచుగ యొక్క షష్ఠియగు ' ప్రౌఢ కారక 15 మాయొక్క ఎత్తివచ్చునంతకు 'యొక్కకు లోపంబు బహుళంబు' ప్రౌఢ కారక 16 యడాగమము బాల సంధి 3 మా యెత్తి వచ్చునంతకు

క రయమున దానవపతి దు
ర్నయమున వినయములు లంఘనము సేయు మదో
దయమున కెత్తుగతిని సుర
చయముపయిం దెరలనెత్త సమకట్టుటయున్ 178

అర్థము దానవ - పతి = రాక్షసరాజు - తారకుఁడు, రయమునన్ = శీఘ్రముగా, దుర్నయమునన్ = దుర్నీతితో, వినయములు = అడఁకువలు, లంఘనము + చేయు = అతిక్రమించు, మద + ఉదయమునకున్ = మదముయొక్క ఉదయమునకు, ఎత్తు - గతిని = పూనువిధమున, సుర - చయముపయిన్ = దేవతలసమూహముమీఁద, తెరలన్ + ఎత్తన్ + సమకట్టుటయున్ = దండెత్తఁబూనుటయును

తాత్పర్యము . రాక్షసరాజగు తారకుఁడు శీఘ్రముగా దుర్నీతితో అణఁకువ నతిక్రమించు మదోదయమునకు దండెత్తు విధమున దేవతలపై దండెత్తఁబూనుటయును - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

క కరి మదగర్వంబునఁ గే
సరిపై నుఱు కురవడింప సమకట్టుటయున్
బొరిఁబొరి నంకుశఘట్టన
నరుదుగఁ గుది యించు నమ్మహామాత్రు క్రియన్ 179

అర్థము . కరి = ఏనుఁగు, మద - గర్వంబునన్ = మదము వలని గర్వముతో, కేసరిపైన్ = సింహముమీఁద, ఉఱుక = లక్ష్యపెట్టక, ఉరవడింపన్ = విజృంభించుటకు, సమకట్టుటయున్ = పూనుటయును, పొరిఁబొరిన్ = మాటిమాటికి, అంకుశ - ఘట్టనన్ = అంకుశముతోఁ బొడుచుటచే, అరుదుగన్ = ఆశ్చర్యముగా, కుదియించు = క్రుంగఁజేయు, ఆ + మహామాత్రు - క్రియన్ = ప్రధానుఁడైన మావటివాని విధమున

తాత్పర్యము . ఏనుఁగు మదగర్వముతో సింహముపై లక్ష్యపెట్టక విజృంభింపఁబూనఁగా, మాటిమాటికి అంకుశముతోఁ బొడిచి ఆశ్చర్యకరముగాఁ గ్రుంగఁజేయు నా మావటివాని విధమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

తారకునకు శుక్రుఁడు రాజనీతి నుపదేశించుట

వ శుక్రుండు వక్రంబై తత్కాలోచిత నయాలాపంబుల ననునయించి మెల్లన కార్యధారకు నూలుకొలిపి 180

అర్థము . శుక్రుండు, వక్రంబు + ఐ = అడ్డపడి, తద్ + కాల + ఉచిత-నయ + ఆలాపంబులన్ = ఆ సమయమునకుఁ దగిన నీతి భాషణములతో, అనునయించి = బతిమాలి, మెల్లన, కార్యధారకున్ = కార్యపరంపరకు, నూలు కొలిపి = ప్రోత్సహించి

తాత్పర్యము . శుక్రుఁడు అడ్డమయి ఆ కాలమున కుచితమైన నీతి వాక్యములతో బతిమాలి మెల్లఁగాఁ గార్యపరంపరకుఁ బ్రోత్సహించి - తరువాతి పద్యముతో నన్వయము

క తానేల వచ్చు భూసతి
మానవపతి చరిత నీతిమార్గం బైనన్
తానేల వచ్చు భూసతి
మానవపతి చరిత నీతిమార్గంబైనన్ 181

అర్థము . మానవ - పతి - చరిత = రాజు నడవడి, నీతి - మార్గంబు + ఐనన్ = నీతికి మార్గమయినది అయినచో, తాను, భూసతిన్ = భూమియను స్త్రీని, ఏలన్ + వచ్చున్ = పరిపాలింపవచ్చును మానవపతి - చరితన్ = రాజు నడవడియందు, ఈతి = బాధ, మార్గంబు + ఐనన్ = పద్ధతియైనచో, భూసతి, తాను, ఏల - వచ్చున్ = ఎందులకు వచ్చును ?

తాత్పర్యము రాజు నడవడి నీతికిఁ ద్రోవయైనది అయినచో నతఁడు భూసతిని బాలింపవచ్చును రాజు నడవడి ఈతికి (బాధకు) మార్గమయిన దయినచో, భూసతి యెందులకు వచ్చును ?

విశేషములు : అలంకారము శ్లేషము - రూపకము

క ఆయతమతి నుత సప్తో
పాయంబులు నెఱిఁగవలయుఁ బతి సామము భే
దాయతి దానము దండము
మాయోపేక్షేంద్రజాలమార్గము లోలిన్ 182

అర్థము. పతి = రాజు, ఆయత - మతిన్ = అధికమయిన తెలివితో, ఓలిన్ = క్రమముగా, సామము, భేద + ఆయతి = భేదమను ఉపాయముయొక్క ప్రాప్తి, దానము, దండము, మాయ, ఉపేక్ష + ఇంద్రజాల - మార్గములు = ఉపేక్ష, ఇంద్రజాలము అనుమార్గములు - ఇట్లు, నుత - సప్త + ఉపాయంబులున్ = పొగడఁబడిన ఏడు ఉపాయములును, ఎఱిఁగవలయున్

తాత్పర్యము : రాజు మంచి తెలివిగలిగి సామ దాన భేద దండ మాయో పేక్షేంద్రజాలములు అను ఏడు ఉపాయములను క్రమముగాఁ దెలియవలయును

క చన వెఱిఁగి నడవవలయును
వినయోచితవృత్తి సంధి విగ్రహ యానా
సన సంశ్రయణ ద్వైధము
లను నీ షాడ్గుణ్యములు నిజామాత్యులతోన్ 183

అర్థము రాజు - కర్త చనవు + ఎఱిఁగి = ఔచిత్యము తెలిసి, వినయ + ఉచిత - వృత్తిన్ = విశిష్టమైన నీతికిఁదగిన వర్తనముతో, సంధి, విగ్రహ, యాన, ఆసన - సంశ్రయణ - ద్వైధములు, అను, ఈ, షాడుణ్యములున్ = ఆఱుగుణములును, నిజ + అమాత్యులతోన్ = తన మంత్రులతో, నడవవలయున్

తాత్పర్యము. రాజు ఔచిత్యము తెలిసి వినయమున కుచితమైన వర్తనము ఎఱిఁగి, సంధి, విగ్రహ, యాన, ఆసన, సంశ్రయణ, ద్వైధములు, అను ఈ ఆఱుగుణములును దన మంత్రులతో నడవవలయును

క స్త్రీ పా నాక్ష మృగవ్య ధ
నాపహ పరదండ నిష్ఠురాలాపము లన్
పాపగ సప్త వ్యసన
వ్యాపారము లుడుగవలయు వసుధేశునకున్ 184

అర్థము. వసుధా + ఈశునకున్ = భూనాథునకు - రాజునకు, స్త్రీ, పాన = త్రాగుడు, అక్ష = జూదము, మృగవ్య = వేఁట, ధన + అపహ = అర్థ దూషణము,

పరదండ = దండపారుష్యము, నిష్కర + ఆలాపములు = పరుషభాషణములు - వాక్పారుష్యము, అన్ = అను, పాపగ = పాపమును బొందించు, సప్త - వ్యసన - వ్యాపారములు = ఏడు వ్యసనములైన పనులు, ఉడుగన్ + వలయున్ = మానవలయును

తాత్పర్యము . రాజు స్త్రీ, పానము, జూదము, వేఁట,అర్థపారుష్యము, దండపారుష్యము, వాక్పారుష్యము అను పాపకారణములయిన యేడు వ్యసనములను విడువలయును

క సప్తవ్యసనేతరుఁడై
సప్తోపాయజ్ఞుఁడైన జనపతి పేర్మిన్
సప్తాంగరాజ్యవృద్ధిగ
సప్తాబ్ధి పరీత ధాత్రి సకలము నేలున్ 185

అర్థము . సప్త - వ్యసన + ఇతరుఁడు + ఐ = ఏడు వ్యసనములకు వేఱయినవాఁడయి - సప్త వ్యసనములు లేనివాఁడయి, సప్త + ఉపాయజ్ఞుఁడు = ఏడు ఉపాయములు తెలిసినవాఁడయి, జన - పతి = రాజు, పేర్మిన్ = గొప్పతనముతో, సప్త + అంగ - రాజ్య - వృద్ధిగన్ = సప్తాంగములతోడిరాజ్యము అభివృద్ధి యగునట్లు, సప్త + అబ్ధి - పరీత - ధాత్రిన్ = ఏడు సముద్రములచేఁ జుట్టఁబడిన భూమిని, సకలమున్ = అంతను, ఏలున్ = పాలించును

తాత్పర్యము . రాజు సప్తవ్యసనరహితుఁడై సప్తోపాయములను దెలిసినవాఁడయి గొప్పతనముతో సప్తాంగములతో రాజ్య మభివృద్ధిచెందునట్లు ఏడు సముద్రములచేఁ జుట్టఁబడినభూమినంతను ఏలును

విశేషములు . సప్తోపాయములు - సామ, దాన,భేద, దండ, మాయోపేక్షేంద్రజాలములు సప్తాంగములు - స్వామి, అమాత్యుఁడు, సుహృత్తు, కోశము, రాష్ట్రము, దుర్గము, బలము - అను ఏడు రాజతంత్రములు సప్తాబ్ధులు - లవణ, ఇక్షు, సురా, సర్పిస్ (నేయి), దధి (పెరుఁగు) క్షీర, జల సముద్రములు

క అరిషడ్వర్గజయిత నన
వరత శమావాప్తి లోకవంద్యత విషయో
త్కర రక్ష సక్షమాగమ
పరిపాలన సదృశు లవనిపతులును వ్రతులున్. 186

అర్థము. అవని - పతులును = రాజులును, వ్రతులున్ = మునులును, అరి - షష్ (ట్) + వర్గ - జయితన్ = ఆఱుగురు శత్రువుల సమూహమును జయించుటయందును, అనవరత - శమ + అవాప్తిన్ = నిరంతరమైన శాంతి ప్రాప్తియందును, లోక - వంద్యతన్ = లోకముచే నమస్కరింపఁదగియుండుటయందును, విషయ + ఉత్కర - రక్షన్ = (రాజ ప) దేశముల సమూహముయొక్క రక్షణము నందును, (వ్రతి ప)విషయముల (ఇంద్రియముల) సమూహముయొక్క రక్షణమునందును, సక్షమా + ఆగమ - పరిపాలనన్ = (రాజ ప)భూమియొక్క ఆదాయముతోడి పాలనమునందును, (వ్రతి ప)ఓరిమితో శాస్త్రములను రక్షించుటయందును, సదృశులు = సమానులు

తాత్పర్యము రాజులును మునులును అరిషడ్వర్గజయమునందును, నిరంతర శాంతి గుణ ప్రాప్తియందును, లోకవంద్యతయందును, విషయ (ధేశ)ముల రక్షణమునందును విషయములనుండి రక్షణము నందును, భూమి ఆదాయముతోడి పాలనమునందును, సహనముతో నాగమములను బాలించుటయందును సమానులు

విశేషములు అరిషడ్వర్గము - కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములు అలంకారము శ్లేషము

క తగుఁదగదని మనమున మును
వగవఁగ నొడఁబడఁగ వగవ వగవఁగఁబడయున్
దగుఁ దగ దని వగ వని వగ
వగవఁగఁ బని గలదె తనకు వగ మఱి జగతిన్ 187

అర్థము. తగున్ = ఇది చేయఁదగును, తగదు = ఇది చేయఁదగదు, అని, మనమునన్ = మనస్సునందు, మును = ముందుగా, వగవఁగన్ = విచారింపఁగా, వగవన్ + వగవఁగన్ = మఱి మఱి ఆలోచింపఁగా, ఒడఁబడఁగన్ = అంగీకరించుటకు, పడయున్ = (చేయఁదగినదానిని) పొందును, తగున్, తగదు + అని, వగవని - వగ = (ముందుగా) ఆలోచింపని విధము, తనకున్, జగతిన్ = లోకమునందు, మఱి = అత్యంతము, వగ = దుఃఖము, వగవఁగన్ = (పిమ్మట) విచారించుటకు, పని + కలదె = ప్రయోజనముండునా ? - ఉండదనుట

తాత్పర్యము . 'ఈ పని చేయఁదగును, ఈ పని చేయఁదగదు' అని మనస్సునందు ముందుగా విచారింపవలయును అట్లు ఆలోచింపఁగా ఆలోచింపఁగా కర్తవ్యమును బొందును 'ఇది తగును, ఇది తగదు' అని ముందుగా ఆలోచింపని విధము తనకు లోకమున మిక్కిలి దుఃఖమును గలిగించును - పిమ్మట విచారించి ప్రయోజనము లేదు

క తన కధికుల కతిభక్తియు
మనమున నెయ్యంబుఁ దన సమానులకును, హీ
నునియందుఁ గృపయుఁ, జేకొని
మను జనునకు వగయుఁ గలదె మదిఁబరికింపన్ 188

అర్థము . తనకున్ + అధికులకున్ = తనకంటె గొప్పవారికి, అతి - భక్తియున్ = మిక్కిలి భక్తియును, తన - సమానులకును = తనతో సమానమైనవారికి, మనమునన్ = మనస్సునందు, నెయ్యంబున్ = స్నేహమును, హీనునియందున్ = తనకంటెఁ దక్కువ వానియందు, కృపయున్ = దయయును, చేకొని = స్వీకరించి - చూపి, మను= జీవించు, జనునకున్ = మనుష్యునకు, మదిన్ + పరికింపన్ = మనస్సునందు ఆలోచింపఁగా, వగయున్ = దుఃఖము, కలదె = ఉన్నదా ?

తాత్పర్యము. తనకంటె గొప్పవారియెడ అధికభక్తియు, తనతో సమానులైన వారియెడ స్నేహమును, తనకంటె హీనులగు వారియెడ దయయుఁ బూని బ్రదుకుజనునకు మనసున నాలోచింపఁగా దుఃఖముండునా ?

చ మునుకొని దేశకాలబలముం, దగు దైవబలంబుఁ గల్లఁగా
మొనసి విశేషమూలబలమున్ నిజబాహుబలంబుఁ దీర్చి పైఁ
జని రిపులన్ జయింతు రని శత్రుల కిన్నియుఁ గల్గియున్నచోఁ
జెనయక సామదానములఁజేసి జయింతురు నీతివిత్తముల్ 189

అర్థము . నీతి - విద్ + తముల్ = రాజనీతిజ్ఞులలో గొప్పవారు, మునుకొని= పూని, దేశ - కాల - బలమున్ = దేశకాలముల బలమును, తగు = ఒప్పునట్టి, దైవ - బలంబున్, కల్గఁగాన్, మొనసి = మార్కొని, విశేష-మూల-బలమున్ = అధికమైన ప్రధానసేనయును, నిజ-బాహు-బలంబున్ = తనదైనభుజబలమును, తీర్చి, పైన్ + చని = దండెత్తి, అనిన్ = యుద్ధమునందు,

రిపులన్ = శత్రువులను, జయింతురు, శత్రులకున్, ఇన్నియున్ = ఇనియన్నియును - దేశకాలబలములు, దైవబలము, మూలబలము, బాహుబలము అనునవి, కల్గి + ఉన్నచోన్, చెనయక = ఎదిరింపక, సామ - దానములన్ + చేసి = సామదానములచేత జయింతురు

తాత్పర్యము రాజనీతివేత్తలలో శ్రేష్ఠులు దేశకాలముల బలము, దైవ బలము, అధిక మూలబలము, భుజబలమును దీర్చి దండెత్తి శత్రువులను యుద్ధములో జయింతురు ఈ బలములన్నియును శత్రువులకున్నచో వారిని బ్రతిఘటింపక సామదానములలో జయింతురు

ఉ **దారుణకార్యవృత్తిఁ దుదిఁదాఁకినవారును దొల్లి దుర్దశల్**
చేరినచో నొకొం డొకనిచేఁ జెడరైరె ? కుమారుతో నహం
కారము దక్కి కూడి మనఁగాదె ? దురాగ్రహమేటి ? కెల్లచో
బీరము సన్నె పెద్దలకుఁ? బెద్దలు లేరె ధరాతలంబునన్ 190

అర్థము దారుణ - కార్య -వృత్తిన్ = దారుణమైన కార్యమునందు వర్తిలుటయందు - యుద్ధము చేయుటయందు, తుదిన్ + తాఁకిన వారును = పారము ముట్టినవారును - గొప్పవారును, తొల్లి = పూర్వము, దుర్దశల్ = దుస్థితులు = కష్టములు, చేరినచోన్ = వచ్చినచో, ఒకండు + ఒకనిచేన్ = ఒకఁడింకొకనిచే, చెడరు + ఐరె = నశింపలేదా ? కుమారుతోన్ = కుమారస్వామితో, అహంకారము + తక్కి = గర్వము విడిచి, కూడి = కలిసి, మనన్ + కాదె = బ్రదుకుట ఒప్పదా ? దురాగ్రహము = దుష్టమైన పట్టుదల, ఏటికి = ఎందులకు? పెద్దలకున్ = గొప్పవారికి, ఎల్లచోన్ = అన్ని చోటులను, బీరము - చన్నె = పరాక్రమము తగునా ? ధరా - తలంబునన్ = భూతలము నందు, పెద్దలు, లేరె?

తాత్పర్యము దారుణకార్యమైన యుద్ధమునందుఁ బారముముట్టిన వారు సైతమును పూర్వము కష్టములు సంభవించినప్పుడు ఒక రొకరిచేఁ జెడలేదా? గర్వమును విడిచి కుమారస్వామితో కలిసి బ్రదుకుట యొప్పదా ? దురాగ్రహ మెందులకు ? పెద్దలకు పరాక్రమ మన్నిచోట్లను దగునా ? భూమియందు మనకంటెఁ బెద్దలు లేరా ?

విశేషములు . చన్నె - చనునె - 'ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు, చను, చేరుకొనులు ప్రశ్నార్థకైకారపరంబు లగునపుడు వానికడ యచ్చులకు లోపంబు విభాషనగు అగుచో నుండు డకారంబునకు నకారం బగు ' ప్రౌఢ క్రియ 2

సీ శివుఁ డాత్మసుతు నభిషేకంబు సేయుడు
దిగధీశు లుండిరి ధిక్కరించి
పను లడ్గ రాఁడ జంభారి, బానసమున
కనలుండు రాఁడ, కృతాంతకుండు
నరమాంసములు దేఁడ, నైఋతి తళియకు,
జలధీశ్వరుఁడు రాఁడ జలక మార్ప
మలయానిలుండు పువ్వులు దేఁడ, ధనదుండు
తొడవులు గొనిరాఁడ, మృడుఁడు రక్ష

తే పెట్టరాఁడయ్యె , వీ రెల్ల బిట్టు నీకు
మరలి రిది మున్ను, సాధ్యమె పరిభవములు
పడి భయార్తులై కూడిన పగఱఁ దమకుఁ
దోడుగని పగ సాధింపఁదొడరు డరుదె ? 191

అర్థము. శివుఁడు, ఆత్మ - సుతున్ = తన కొడుకును, అభిషేకంబు + చేయుడున్ = అభికింపఁగనే, దిశ్ (క్) + అధి + ఈశులు = దిక్పతులు, ధిక్కరించి=ఎదిరించి, ఉండిరి

జంభ + అరి = జంభ రాక్షసునకు శత్రువు - ఇంద్రుఁడు, పనులు + అడ్గన్ (అడుగన్) = ఏమి చేయవలయునని యడుగుటకు, రాఁడు + అ = రానేరాఁడు, అనలుండు = అగ్ని, బానసమునకున్ = వంటయింటికి, రాఁడు + అ,

కృత + అంతకుండు = యముఁడు, నైఋతి - తళియకున్ =నిర్ఋతిచేయువంటకు, నర-మాంసములు = మనుష్యులమాసంములు, తేఁడు + అ = తేనేతేఁడు.

జలధి + ఈశ్వరుఁడు = సముద్రములకుఁ బ్రభువు - వరుణుఁడు, జలకము + ఆర్పన్ = స్నానమాడించుటకు, రాఁడ,

మలయ + అనిలుండు = దక్షిణవాయువు, పువ్వులు, తేఁడు + అ, ధనదుండు = కుబేరుఁడు, తొడవులు = ఆభరణములు, కొనిరాఁడు + అ, మృడుఁడు = ఈశానుఁడు, రక్ష - పెట్టన్ + రాఁడు + అయ్యెన్

వీరు + ఎల్లన్ = ఈ దిక్పాలకులందఱును, బిట్టు = శీఘ్రముగా, నీకున్ = నీ పక్షమునకు, మరలిరి = తిరిగిరి, ఇది = ఈ వ్యవహారము, మున్ను = పూర్వము, సాధ్యమె = సాధ్యమే అయ్యెను

పరిభవములు - పడి = అవమానములు అనుభవించి, భయ + ఆర్తులు + ఐ = వెఱపుచేఁ బీడితులయి, కూడిన - పగలన్ = కూడిన శత్రువులను, తమకున్, తోడు = సాయము, కని, పగన్, సాధింపన్ = తీర్చుటకు, తొడరుడు= పూనుట, అరుదె = ఆశ్చర్యమా ?

తాత్పర్యము శివుఁడు తన కొడుకైన కుమారస్వామిని అభిషేకించినంతనే దిక్పాలకులు వాని నెదిరించి యుండిరి ఇంద్రుఁడు ఏమి పని యున్నదని యడుగుటకు రానేరాఁడు అగ్ని వంటయింటికి రాఁడు, యముఁడు నిర్ఋతి చేయు వంటకు నరమాంసములు తేనే తేఁడు వరుణుఁడు స్నానమాడింప రాఁడు మలయవాయువు పువ్వులు తేఁడు కుబేరుఁడు ఆభరణములు తీసికొని రానేరాఁడు ఈశానుఁడు రక్షపెట్టుటకు రాఁడయ్యెను ఈ దిక్పాలకులందఱును శీఘ్రముగా నీ వైపు తిరిగిరి ఇది మునుపు సాధ్యమే అయ్యెను ఇట్లు పరిభవము లనుభవించి భయపీడితులయి శత్రువులను గూడి, తమకు సాహాయ్యమును గాంచి వారిపైఁ బగసాధింపఁబూనుట ఆశ్చర్యమా ? అప్పుడు వానిని ధిక్కరించి నిన్నుఁజేరిన దిక్పాలకులందఱును, ఇప్పుడు తమకుఁ గుమారునితోడు గలుగుటచే నీపయిఁ బగ సాధింపఁబూనుదురని భావము

విశేషములు: అలంకారము అర్థాంతరన్యాసము 'పనులడ్డరాఁడు జంభారి' ఇచ్చట యతిమైత్రి చింత్యము జంభారి శబ్దమును అఖండముగా భావించుచో అఖండయతి యనవచ్చును

క **బలహీనులయ్యు నేమగుఁ**
బలువురు తమలోనఁగూడి బలియుని నైనన్
గెలుతురు చూడఁగ నీహా
రలవంబులు గూడి తీవ్రరశ్మిన్ గప్పున్ **192**

అర్థము. బల-హీనులు + అయ్యున్ = దుర్బలులైనను, ఏమి + అగున్ = ఏమగును ? ఏమి నష్టము ? పలువురు = అనేకులు, తమలోనన్ + కూడి =

తమలోఁదాము కూడి, బలియునిన్ + ఐనన్ = బలవంతునైనను, గెలుతురు, చూడఁగన్, నీహార - లవంబులు + కూడి = మంచు బిందువులు కూడి, తీవ్ర - రశ్మిన్ = సూర్యుని, కప్పున్

తాత్పర్యము . బలములేని వారయిన నేమి ? అట్టివారు పెక్కండ్రు తమలోఁదాము కూడి బలవంతునైనను గెలుతురు చూడఁగా మంచుబొట్టులు పెక్కు కలిసి సూర్యుని గప్పును గదా !

విశేషములు. అలంకారము అర్థాంతరన్యాసము సామాన్యము విశేషముచే సమర్థింపఁబడుచున్నది

క ఇ మ్మెడపున నిజసర్వ
స్వమ్ముఁ గళత్రంబు నైనఁ జను నీఁగఁ బర
స్వమ్ముఁ గళత్రముఁ బరులకుఁ
గ్రమ్మఱ నొప్పించి మనుట కార్యము గాదే ! 193

అర్థము . ఇమ్ము + ఎడపునన్ = అనుకూల్యములేని యప్పుడు, నిజ - సర్వస్వమ్మున్ = తనదైన యెల్లధనమును, కళత్రంబున్ + ఐనన్ = (స్వ) భార్యనైనను, ఈఁగన్ +చనున్ = ఈ నొప్పును, (అట్టిచో) పర - స్వమ్మున్ = ఇతరుల ధనమును, కళత్రమున్ = (పర) భార్యను, పరులకున్ = ఇతరులకు, క్రమ్మఱన్ = మరల, ఒప్పించి = అర్పించి, మనుట = జీవించుట, కార్యము + కాదే = చేయఁదగినపని కదా !

తాత్పర్యము . ఆనుకూల్యము లేనప్పుడు స్వధనమును, స్వభార్యను అయినను ఈ నొప్పును అట్టిచోఁ బరధనమును, పరభార్యను పరులకు మరల నర్పించి బ్రదుకుట చేయఁదగినది కదా !

విశేషములు . అలంకారము కావ్యార్థాపత్తి

వ అని యనేకప్రకారంబుల రాజనీతి రహస్యంబు లుపదేశించి 'పరుల చెఱలు వృత్తులు నర్థంబులు మగుడ నిచ్చి నిజవృత్తియంద వర్తింపు, పరమేశ్వరనందనుంగని విధేయుండవై నిర్వహించు డుచితం, బది యెట్లనిన నీశ్వరవీర్యసంభవుండైన కుమారుచేతం దారకుండు పరాజితుండగునని పురాణమునిం యాదేశంబు గల, దని యెఱింగించి వీక్షించుచున్న దనుజ గురుం గనుంగొని దనుజవరుం డిట్లనియె 194

అర్థము అని, అనేక - ప్రకారంబులన్, రాజ - నీతి - రహస్యంబులు ఉపదేశించి, పరుల = ఇతరులయొక్క, చెఱలు = బందెలు, వృత్తులున్ = జీవనోపాయములు, అర్థంబులున్ = ధనములును, మగుడన్ = మరల, ఇచ్చి, నిజ - వృత్తి + అందున్ + అ = నీదయిన వృత్తియందే, వర్తింపు(ము) = నడవుము, పరమేశ్వర - నందనున్ = ఈశ్వరుని కొడుకగు కుమారస్వామిని, కని, విధేయుండవు + ఐ, నిర్వహించుడు = నిర్వహించుట, ఉచితంబు = తగినది, అది, ఎట్లు + అనినన్, ఈశ్వర - వీర్య - సంభవుండు + ఐన = ఈశ్వరుని వీర్యమువలనఁ బుట్టినవాఁడగు, కుమారుచేతన్ = కుమారస్వామి చేత, వారకుండు, పరాజితుండు = ఓడింపఁబడినవాఁడు, అగున్, అని, పురాణ-ముని = నారదునియొక్క, ఆదేశంబు = ఆజ్ఞ, కలదు, అని, ఎఱింగించి, వీక్షించుచున్ + ఉన్న = చూచుచున్న, దనుజ - గురున్ = రాక్షసగురువైన శుక్రుని, దనుజ - వరుండు = రాక్షసరాజు - తారకుఁడు, ఇట్లు + అనియెన్

తాత్పర్యము . అని పెక్కువిధముల రాజనీతిరహస్యము లుపదేశించి 'శత్రువుల బందెలను, వృత్తులను, సామ్ములను దిరిగి యిచ్చి నీ వృత్తియందు నీవు వర్తింపుము పరమేశ్వరునికుమారునిఁజూచి విధేయుఁడవయి వ్యవహరించుట మంచిది ఏలన ఈశ్వరవీర్యసంభవుఁడగు కుమారస్వామిచేఁ దారకుఁడు జయింపఁబడునని నారదుని ఆదేశము గలదు ' అని చెప్పి చూచుచున్న శుక్రునిఁ జూచి తారకుఁ డిట్లు పలికెను

శుక్రుని వాక్యములకుఁ దారకుని ప్రత్యాఖ్యానము

క **కరదండాహత పరనృప**
ధరణీతలవిషయభోగి దగు నధిపతి గాఁ,
బరదండాహత నిజభుజ
పరిపాలిత విషయ భోగపరుఁ డధిపతియే **195**

అర్థము కర - దండ = దండమువంటి కరముచే, ఆహత = కొట్టఁబడిన, పర-నృప = శత్రురాజులయొక్క, ధరణీ - తల = భూతలమునందలి, విషయ = దేశమును, భోగి = అనుభవించువాఁడు, అధిపతి = ప్రభువు, కాన్ + అగుటకు, తగున్, పర = శత్రువులయొక్క దండ = దండముచే - శిక్షచే, ఆహత = కొట్టఁబడిన, నిజభుజ = బాహుపరాక్రమముచే, పరిపాలిత = పరిపాలింపఁబడిన, విషయ = దేశముయొక్క, భోగ-పరుఁడు = సుఖమునందాసక్తి గలవాఁడు, అధిపతియే = ప్రభువా ?

తాత్పర్యము తన బాహుదండముచే శత్రురాజుల భూభాగమును గొట్టి అనుభవించువాఁడు రాజుగాని, శత్రువుల దండముచేఁ దన రాజ్యభోగమును గోల్పోయినవాఁడు ప్రభువా ?

వ అదియునుంగాక తరువాతి పద్యముతో నన్వయము 196

క పురుషుఁడు పురుషున కని న
స్థిర జీవిత లోభయుత మతిని వినమితుఁడై,
స్మరకలహకుపితఁ బ్రాణే
శ్వరి నాయుధసమితిఁ దెలచువాఁ డటమీఁదన్ 197

అర్థము పురుషుఁడు= మగవాఁడు (శూరుఁడు), పురుషునకున్, అనిన్ = యుద్ధమున, అస్థిర - జీవిత - లోభ-యుత - మతినిన్ = అశాశ్వతమైన జీవితమునందలి ఆశతోఁ గూడిన బుద్ధితో, వినమితుఁడు + ఐ = మిక్కిలి ఁంగినవాఁడయి = మిక్కిలి లొంగిపోయినవాఁడయి, అట-మీఁదన్ = ఆపైని, స్మర - కలహ - కుపితన్ = మన్మథయుద్ధమునందుఁ గోపించినది - ప్రణయకలహమునఁ గోపించినది, అగు, ప్రాణ + ఈశ్వరిన్ = ప్రియురాలిని, ఆయుధ - సమితిన్ = ఆయుధముల సమూహముచే, తెలచువాఁడు = కోపమును దేర్చువాఁడు

తాత్పర్యము . పురుషుఁడు (శూరుఁడు) యుద్ధమున మతియొక పురుషునకు అశాశ్వతమైన జీవితమునందలి ఆశతో లొంగిపోయి, ప్రణయకలహమునఁ గుపితయైన ప్రాణేశ్వరిని ఆయుధములతోఁ దేర్చువాఁడగును

విశేషములు : యుద్ధమున వీరు నెదిరింపలేక జీవితమునందలి యాశచే నతనికి లొంగిపోవు వీరుఁడు ప్రణయకుపితయగు ప్రియురాలిపైఁ దన ప్రతాపమును జూపి ఆయుధములతో నామెను దేర్చువాఁడగును అలంకారము రూపకము ?

ఉ మంచిగఁ బ్రీతిఁబాయక సమస్తజనంబులుఁ దన్నుఁ గొల్వ జీ
వించిన ధన్యుఁ డా మహిమ వీడిన జీవము మేన నిల్వ నా
పించి విభుండు తానొకట సేవకుఁడై మనుకంటె ముంద ఆ
ర్జించిన కీర్తి నిల్వ గతి సేకుఱఁగా ననిఁ జావు సేగియే ? 198

అర్థము. విభుండు = ప్రభువు, మంచిగన్, ప్రీతిన్ = ఇష్టమును, పాయక= విడువక, సమస్త - జనంబులున్ = ఎల్ల జనులును, తన్నున్, కొల్వన్ = సేవింపఁగా,

జీవించిన - ధన్యుఁడు = బ్రదికిన కృతార్థుఁడు, - అదృష్టవంతుఁడు, ఆ - మహిమ= ఆ గొప్పతనము, వీడినన్ = పోఁగా, జీవము = ప్రాణము, మేనన్ = శరీరమున, నిల్పన్= నిలుపుటకు, ఆసించి, తాను, ఒకటన్ = ఒకచోట, సేవకుఁడు + ఐ = దాసుఁడయి, మను-కంటెన్ = బ్రదుకుటకంటె, ముందటి = పూర్వకాలము, ఆర్జించిన = సంపాదించిన, కీర్తి = మంచిపేరు, నిల్పన్ = నిలుచుటకు, గతి = మార్గము, చేకుఱఁగాన్ = లభింపఁగా, అనిన్ = యుద్ధమునందు, చావు, సేగియే= కీడా ?

తాత్పర్యము మంచిగాఁ బ్రీతితోఁ ద న్నెల్ల జనులును గొలువఁగా జీవించిన ధన్యుఁడైన ప్రభువు, ఆ మహిమ నశింపఁగా, మేనఁ బ్రాణములు నిలుపుట కాసించి, వేఱుప్రభువుకడ సేవకుఁడై జీవించుటకంటెఁ బూర్వ మార్జించినకీర్తి నిల్చుమార్గము లభింప, యుద్ధమునఁ జచ్చుట నష్టమా ?

విశేషములు మనుట కంటె - మను + కంటె = 'కొఱకు కంటె పొంటెలు పరంబులగునపుడు భావార్థక టవర్ణకంబునకు లోపంబు విభాషనగు ' ప్రౌఢ క్రి 14

వ అని మంత్రనిశ్చయంబు సేసి సమరోద్యుక్తుండయ్యె నంత నక్కడ మృగవైరింజొచ్చు మృగవ్యుండునుంబోలెఁ దారకుపైఁబెట్ట నబ్బకింపక చలించుచున్న సురేశ్వరుం బరమేశ్వరనందనుండు గనుంగొని 199

అర్థము అని, మంత్ర - నిశ్చయంబు + చేసి = అని ఆలోచనము నిశ్చయించి, సమర + ఉద్యుక్తుండు + అయ్యెన్ = యుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను, అంతన్, అక్కడన్ = సురలోకమున, మృగ-వైరిన్ + చొచ్చు = సింహమును గూర్చి వచ్చు, మృగవ్యుండునున్ + పోలెన్ = వేఁటకాని విధమున, తారకుపైన్ = తారకుని మీఁదికి, పెట్టన్ = దండెత్తుటకు, అబ్బగింపక = సహింపక, చలించుచున్ + ఉన్న = వడఁకుచున్న, సుర + ఈశ్వరున్ = ఇంద్రుని, పరమేశ్వర - నందనుండు= పరమేశ్వరుని కొడుకు - కుమారస్వామి, కనుంగొని

తాత్పర్యము . అని మంత్రమును నిశ్చయించి యుద్ధసన్నద్ధుఁడయ్యెను అంత సురలోకమున సింహముమీఁదికిఁబోవు వేఁటకానివిధమున, తారకునిపైకి దండెత్తుటకు సహింపక వడఁకుచున్న(భయపడుచున్న) ఇంద్రునిఁ గుమారస్వామి కనుఁగొని - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

చ సుజనజనైకభూషణము శూరత, దుర్జనదూషణంబు, స
ద్విజవిబుధాశ్రితప్రతతి వేడుకఁబ్రోపును రాజ్యచిహ్న గా
క జలమహాభిషేకమునఁ గట్టిన పట్టము వీజనంబు భూ
భుజులక కాక యన్నియును బుంటికి నైనను లేవె చూడఁగాన్ ? 200

అర్థము . చూడఁగాన్, సుజన - జన + ఏక - భూషణము = సజ్జనుల సమూహమునకు ముఖ్యమైన అలంకారము, అగు, శూరత = శౌర్యము, దుర్జన - దూషణంబున్ = దుష్టులను నిందించుటయును, సత్ – ద్విజ - విబుధ + ఆశ్రిత-ప్రతతిన్ = మంచివారయినబ్రాహ్మణులును, పండితులునైన ఆశ్రితుల సమూహమును, వేడుకన్ = వేడుకతో, ప్రోపును = రక్షించుటయును, రాజ్య - చిహ్న - కాక = రాజ్యమునకు గుఱుతు గాక, జల - మహాభిషేకమునన్ = నీట నభిషేకించుటయందు, కట్టిన - పట్టమున్ = పట్టెయును, (పుండనునర్థమున) నీటఁగడిగికట్టు కట్టుటయు, వీజనంబున్ = వింజామరయును - విసరుటయును, భూ - భుజులకున్ + అ = రాజులకే, కాక, అన్నియును = పైనిఁజెప్పిన - నీటఁగడుగుట, కట్టుగట్టుట, విసరుట అనునవి యన్నియును, పుంటికిన్ + ఐనను = వ్రణమునకైనను, లేవె = లేవా ? - ఉన్నవి యనుట

తాత్పర్యము . చూడఁగా మంచివారికిఁ బ్రధానమైన అలంకారము అగు శౌర్యమును దుష్టశిక్షణము, సద్బ్రాహ్మణులు, పండితులునైన ఆశ్రితుల సమూహమును రక్షించుటయును, రాజ్యలాంఛనముగాని, జలాభిషేకము, పట్టము గట్టుట, వింజామరము అనునవి యన్నియును రాజులకే కాక వ్రణమునకు సైతముఁ గలవు గదా !

విశేషములు సుజనరక్షణ దుర్జనశిక్షణములు రాజ్యచిహ్నములు గాని జలాభిషేకము, పట్టము గట్టుట, వింజామరము అనునవి యన్నియును రాజచిహ్నములే కాక వ్రణమునకు సైత ముండును వ్రణమును గూడ నీటఁగడిగి, కట్టు కట్టి, మంటపోవుటకు విసనకఱ్ఱతో విసరుదురు

వ. **కావున నఖిలకంటకుండైన తారకు నిర్జింపక మనచేయు రాజ్యం బేమి యొప్పు నదియునుంగాక** 201

అర్థము . కావునన్, అఖిల - కంటకుండు + ఐన = ఎల్లజనులకుఁ గీడొనరించువాఁడయిన, తారకున్, నిర్జింపక = జయింపక, మన - చేయు -

రాజ్యంబు = మనము పరిపాలించు రాజ్యము, ఏమి + ఒప్పును, అదియునున్ + కాక

తాత్పర్యము. కావున నెల్ల జనులకు బాధకుఁడైన తారకాసురుని జయింపక మనము పాలించు రాజ్యమేమి యొప్పును ? అదియును గాక - తరువాతి యేకాదశాశ్వాసమునందలి 2 వ గద్యముతో నన్వయము

అశ్వాసాంతము

మ పరమానందుఁ డమందుఁ, డక్షజయుఁ, డభ్రాంతుండు, శాంతుండు, స
ద్గురుఁ, డాత్మజ్ఞుఁడు, ప్రజ్ఞుఁ, డస్ఖలితుఁ, డక్రూరుం, డుదారుండు, వి
స్తరిత శ్లోకుఁ, డశోకుఁ, డాగమ చయాచార్యుం, డవార్యుండు, సా
గరగంభీరుఁ డభీరుఁ డక్షయశుభాకారుండు, ధీరుం డెడన్ 202

అర్థము : పరమ + ఆనందుఁడు - మిక్కిలి ఆనందము గలవాఁడు, అమందుఁడు = మందుఁడు గాని వాఁడు, అక్ష - జయుఁడు = ఇంద్రియములను జయించినవాఁడు, అభ్రాంతుండు = భ్రాంతి నొందని వాఁడు, శాంతుండు = శమము గలవాఁడు, సత్ + గురుఁడు = మంచి గురువయినవాఁడు, ఆత్మజ్ఞుఁడు = ఆత్మజ్ఞానము గలవాఁడు, ప్రజ్ఞుఁడు = ప్రకృష్టమయిన జ్ఞానము గలవాఁడు, అస్ఖలితుఁడు = చలింపనివాఁడు, అక్రూరుండు = క్రూరుఁడు గానివాఁడు, ఉదారుండు = వదాన్యుఁడు, విస్తరిత - శ్లోకుఁడు = విస్తరించిన కీర్తి గలవాఁడు, అశోకుఁడు = శోకము లేనివాఁడు, ఆగమ - చయ + ఆచార్యుండు = శాస్త్రముల సమూహమునందు ఆచార్యుఁడైనవాఁడు, అవార్యుండు = అడ్డగింపరానివాఁడు, సాగర - గంభీరుఁడు = సముద్రమువలె గంభీరుఁడైనవాఁడు, అభీరుఁడు = పిఱికి వాఁడు గానివాఁడు, అక్షయ - శుభ + ఆకారుండు = నశింపని శుభకరమైన ఆకారము గలవాఁడు, ఎడన్ = హృదయమునందు, ధీరుండు = ధైర్యము గలవాఁడు - అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

తాత్పర్యము. పరమమైన ఆనందము గలవాఁడు, అమందుఁడు, ఇంద్రియ జయుఁడు, భ్రాంతిలేనివాఁడు, శమము గలవాఁడు, సద్గురుఁడు, ఆత్మజ్ఞానము గలవాఁడు, ప్రకృష్ట జ్ఞానముగలవాఁడు, చలింపనివాఁడు, క్రూరుఁడు గానివాఁడు, ఉదారుఁడు, విస్తరించిన కీర్తి గలవాఁడు, శోకములేనివాఁడు, శాస్త్ర సమూహమునం దాచార్యుఁడు, వారింపరానివాఁడు, సముద్రమువలె గంభీరుఁడు, భీరుఁడు గానివాఁడు, అక్షయములైన శుభములు గల ఆకారము గలవాఁడు, ఎడఁదలో ధైర్యము గలవాఁడు అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

క మదన మదనాస్త్ర నిభ శుభ
మదనవతీ లోల దృష్టి మార్గణ నికరా
భిదురిత హృదయాంభోజుఁడు
మదనారిపదాబ్జమత్తమధుకరుఁ డెలమిన్ 203

అర్థము. మదన భోజుఁడు మదన = మన్మథుని యొక్క, మదన + అస్త్ర = మదము గలిగించు బాణములతో, నిభ = సమానమయిన, శుభ = శుభమైన, మదనవతీ = స్త్రీలయొక్క, లోల = చలించునట్టి, దృష్టి - మార్గణ = చూపులనెడి బాణముల యొక్క, నికర = సమూహముచేత, అభిదురిత = పగులఁగొట్టఁబడని, హృదయ + అంభోజుఁడు = పద్మమువంటి హృదయము గలవాఁడు, ఎలమిన్ = ప్రీతితో, మదనారి మధుకరుండు మదన + అరి = మన్మథశత్రువైన శివునియొక్క, పద + అబ్జ = పాదపద్మములకు, మత్త = మదించిన, మధుకరుఁడు = తుమ్మెదయైనవాఁడు

తాత్పర్యము. మన్మథుని మత్తు గలిగించు అస్త్రముల వంటి స్త్రీల చలించు దృగ్బాణములచేఁ బగులఁగొట్టఁబడని హృదయపద్మము గలవాఁడు, ఈశ్వరుని పాదపద్మములకుఁ దుమ్మెదయైనవాఁడు - అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

మ **సకలాధారుఁడు ధీరుఁ డుత్తమగుణాసక్తుండు ముక్తుండు రా**
జకళాకల్పుఁ డనల్పుఁ డర్థిసురభూజాతుం డజాతుండు బ్ర
హ్మకులాధీశుఁ డుమేశుఁ డూర్జితుఁడు ధీమంతుం డనంతుండు సూ
రి కవిస్తుత్యుఁడు నిత్యుఁ డాదిమునిచారిత్రుండు పాత్రుం డిలన్ 204

అర్థము : సకల + ఆధారుఁడు = అన్నిటికి ఆధారమయిన వాఁడు, ధీరుఁడు, ఉత్తమ - గుణ + ఆసక్తుండు = మంచి గుణములందు ఆసక్తి గలవాఁడు, ముక్తుండు = విడువఁబడినవాఁడు, రాజ - కళా + కల్పుఁడు = చంద్రకళ ఆభరణముగాఁ గలవాఁడు, అనల్పుఁడు = అల్పుఁడు గానివాఁడు, అర్థి - సుర- భూజాతుండు = యాచకులకుఁ గల్పవృక్షమయినవాఁడు, అజాతుండు = అభవుఁడు, బ్రహ్మ - కుల + అధి + ఈశుండు = బ్రాహ్మణవంశమునకు అధిపతియైనవాఁడును, ఉమా + ఈశుఁడు = పార్వతికి భర్తయైనవాఁడును, ఊర్జితుఁడు = గొప్పవాఁడును, ధీమంతుండు = బుద్ధిమంతుఁడును, అనంతుండు = అంతములేనివాఁడును, సూరి - కవి - స్తుత్యుఁడు = పండిత కవులచే

స్తుతింపఁదగినవాఁడును, నిత్యుఁడు = శాశ్వతుఁడును, ఆది - ముని - చారిత్రుండు = ఆదిముని చరిత్రము వంటి చరిత్రము గలవాఁడును, ఇలన్ = భూమియందు, పాత్రుండు = తగినవాఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

తాత్పర్యము అన్నిటికి నాధారమయిన వాఁడును, ధీరుఁడును, ఉత్తమ గుణములందాసక్తి గలవాఁడును, ముక్తుఁడును, చంద్రకళావతంసుఁడును, అనల్పుఁడును, అర్థిజనకల్పవృక్షుఁడును, అభవుఁడును, బ్రాహ్మణ వంశశ్రేష్ఠుఁడును, ఉమాపతియును, ఊర్జితుఁడును, ధీమంతుఁడును, అనంతుఁడును, పండిత కవిస్తుత్యుఁడును, నిత్యుఁడును, ఆదిమునిచరిత్రమువంటి చరిత్రము గలవాఁడును, భూమిలోఁ బాత్రుఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

క తరుణతర తరణి కిరణో
త్కర సంస్పర్శ ప్రభానికర వికసిత వా
రిరుహ దళ కలిత శోభా
హర దవదాతాక్షుఁ డూర్జితైశ్వర్యుఁ డొగిన్ **205**

అర్థము. తరుణ - తర మిక్కిలి లేతయైన, తరణి = సూర్యుని యొక్క, కిరణ +ఉత్కర = బాణ సమూహముయొక్క, సంస్పర్శ = సంబంధమైన, ప్రభా = కాంతులయొక్క, నికర = సమూహముచేత, వికసిత = వికసింపఁ జేయఁబడిన, వారిరుహ - దళ = పద్మదళములందు, కలిత = కూడిన, శోభా = సౌందర్యమును, హరత్ = హరించుచున్న, అవదాత + అక్షుఁడు = మనోజ్ఞము లయిన కన్నులు గలవాఁడు, ఊర్జిత + ఐశ్వర్యుఁడు = గొప్ప ఐశ్వర్యము గలవాఁడు, ఒగిన్ - ఇది వాక్యాలంకారముగాఁ బ్రయుక్తమయినది

తాత్పర్యము. బాలభానుని కిరణముల కాంతిచే వికసించిన పద్మదళముల శోభను హరించు మనోజ్ఞములయిన కన్నులు గలవాఁడును, గొప్ప యైశ్వర్యము గలవాఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

భుజంగ మహాయోగిముఖ్యుండు మాన్యుండు ధన్యుం
డహార్నాథతేజుం డనంతుండు శాంతుం
డహింసారతుం డంబుజాక్షుండు దక్షుం
డిహాముత్రభోగాద్యనిష్టుండు సృష్టిన్ **206**

అర్థము . మహాయోగి ముఖ్యుండు = గొప్ప యోగులలో శ్రేష్ఠుడు, మాన్యుడు = మన్నింపఁదగినవాఁడు, ధన్యుండు, అహస్ (ఃు) (ర్) + నాథ - తేజుండు = సూర్యుని తేజస్సువంటి తేజస్సు గలవాఁడును, అనంతుండు = అంతము లేనివాఁడును, శాంతుండు, అహింసా - రతుండు = అహింసయం దాసక్తి గలవాఁడును, అంబుజ + అక్షుండు = పద్మములవంటి కన్నులు గలవాఁడును, దక్షుండు = సమర్థుఁడును, సృష్టిన్ = సృష్టియందు, ఇహ + అముత్ర - భోగ + ఆది + అనిష్టుండు = ఇహలోకమునందలి, పరలోకము నందలి సౌఖ్యములు మున్నగువాని యం దిష్టము లేనివాఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

తాత్పర్యము . గొప్ప యోగులలోఁ బ్రధానుఁడును, మాన్యుఁడును, ధన్యుఁడును, సూర్యుని తేజస్సు వంటి తేజస్సు గలవాఁడును, అనంతుఁడును, శాంతుఁడును, అహింసయం దాసక్తి గలవాఁడును, పద్మనేత్రుఁడును, దక్షుఁడును, సృష్టిలో ఇహపరలోకసౌఖ్యములం దిష్టము లేనివాఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

విశేషములు . భుజంగ ప్రయాత వృత్త లక్షణము నాలుగు పాదములుండును ప్రతిపాదమునను నాలుగు యణములుండును మొదటి యక్షరమునకు నెనిమిదవ యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు

గద్యము

ఇది శ్రీ మజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీ పాద
పంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి
నన్నెచోడదేవ ప్రణీతంబైన
కుమారసంభవంబను కథయందు దశమాశ్వాసము
దీని వ్యాఖ్యకుఁ బూర్వాశ్వాసాంత గద్యల వ్యాఖ్యల నరయునది

మ ఇది శ్రీ జొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీ మన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధ స్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్ననఁ బ్రవిలసత్ సంజీవనీవ్యాఖ్య యౌ

కుమార సంభవము

ఏకాదశాశ్వాసము

క శ్రీ రమణుఁ, డఖిల సుజనా
ధారుండు, కవి గమకి బుధ నిధానుఁడు, భవకాం
తార దవానలుఁ, డఘ సం
హారుఁ, డుదారుండు, మల్లికార్జునుఁ డెలమిన్ 1

అర్థము శ్రీ రమణుఁడు = లక్ష్మీదేవి భర్తయును, అఖిల- సుజన + ఆధారుండు = ఎల్లమంచిజనుల కాధారమయినవాఁడును, కవి - గమకి - బుధ - నిధానుఁడు = కవులకు, గాయకులకు, బుధులకు నిధియైనవాఁడును, భవ - కాంతార-దవ + అనలుఁడు = సంసారమనెడి అడవికిఁ గార్చిచ్చు అయిన వాఁడును, అఘ - సంహారుఁడు = పాపములను బోకార్చువాఁడును,ఉదారుండున్ = గొప్పవాఁడును, అగు, మల్లికార్జునుఁడు, ఎలమిన్

తాత్పర్యము . లక్ష్మీదేవి భర్తయును, - విష్ణువును, ఎల్ల సజ్జనులకు ఆధారభూతుఁడైనవాఁడును, కవులకు, గాయకులకు, బుధులకు నిధియైనవాఁడును, సంసారమనెడి అడవికిఁ గార్చిచ్చు అయినవాఁడును, పాపములను నశింపఁజేయువాఁడును, ఉదారుఁడును అగు జంగమమల్లికార్జునుఁడు

వ **సర్వేశ్వరుండు శర్వాణీసహితుండై నన్ను వీరాభిషేకంబు సేసి సేనాని పట్టంబు గట్టి తారకాద్యఖిల కంటక లుంటాక నికరంబు నిర్జించి సురవరుల నిఖిలభువనసామ్రాజ్యపదవియందు సుప్రతిష్ఠలం జేయుమని నియమించినం గైకొని వచ్చి వచ్చిన ముష్టి నా పూనికి నెఱపకుండు డేమి పురుషార్థంబని విజృంభించి కోపావేశంబునం దావగొనక ప్రస్తానభేరి సఱవంబంచిన** 2

అర్థము . సర్వేశ్వరుండు = శివుఁడు, శర్వాణీ - సహితుండు + ఐ = పార్వతితోఁగూడినవాఁడయి, నన్నున్, వీర + అభిషేకంబు + చేసి = వీరునిగా నభిషేకించి, సేనాని - పట్టంబు + కట్టి = సేనాధిపతిపట్టమును గట్టి, తారక +

ఆది+ అఖిల - కంటక - లుంటాక - నికరంబున్=తారకుఁడు మున్నగు నెల్లపాపుల చోరుల సమూహమును, నిర్జించి = జయించి, సుర-వరులన్ = దేవతాశ్రేష్ఠులను, నిఖిల - భువన - సామ్రాజ్య - పదవి + అందున్ = సకలలోకముల సామ్రాజ్య స్థానమందు, సుప్రతిష్ఠులన్ = నెలకొలుపఁబడినవారిని, చేయుము, అని, నియమించినన్ = ఆజ్ఞాపింపఁగా, క్రైకొని వచ్చి = సమ్మతించి వచ్చి, వచ్చిన - ముష్టిన్ = వచ్చిన వెంబడి, నా - పూన్కి = నా ప్రయత్నము, నెఱవేఱక + ఉండుడు = ఫలింపకుండుట, ఏమి - పురుష + అర్థంబు = ఏమి పౌరుషము ?, అని, విజృంభించి, కోప + ఆవేశంబునన్, తావకొనక = నిలువక, ప్రస్థాన - భేరి = ప్రయాణభేరి, చలువన్ + పంచినన్ = మ్రోయింప నాజ్ఞాపింపఁగా

తాత్పర్యము . పరమేశ్వరుఁడు పార్వతీసమేతుఁడై నన్ను వీరునిగా నభిషేకించి, సేనాపతిపట్టము గట్టి, 'తారకుఁడు మున్నగు నెల్లకంటకులను జోరులను జయించి దేవతలను సకలలోకసామ్రాజ్యపదవియందు సుప్రతిష్ఠితులను జేయు' మని యాజ్ఞాపింపఁగా నంగీకరించి వచ్చి, వచ్చిన వెంబడి నా ప్రయత్నము ఫలింపకుండుట యేమిపౌరుషమని విజృంభించి కోపావేశమున నిలువక ప్రయాణభేరి మ్రోయింపఁబంపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు ముష్టి = వెంబడి - అని మా రా కవి వ్యాఖ్య

కుమారస్వామి సేన యుద్ధ ప్రస్థానము

సీ. అమృతాబ్ధి సాచ్చు యాదము నిద్రవోయిన
పీతాంబరుఁడు బిట్టు బెదరి లేవఁ
దలకొన్న ధారుణీస్థలి మెడవంపులఁ
బడ నుల్కిపడి మ్రొగ్గిపడ నహీంద్రుఁ
డహిమాంశురథ మిక్కడక్కడ వడ మావు
లుప్పర మెగసి క్రేళ్లుటికి పాఱఁ,
జీఁదఱి రేఁగి గర్జించి గోపతి మేను
వెంచి చుట్టు నుఱుమకించి చూడ,

తే దిగ్గజేంద్రంబు లుక్కుఱి మ్రొగ్గఁ, దార
కములు డుల్లంగ, బ్రహ్మాండ ఖండ మద్రువ,
భీషణధ్వనిఁ బ్రస్థానభేరి చెలఁగె
మాన కందంద దిక్కులు మాఱుచెలఁగ

అర్థము అమృత + అబ్ధి = అమృత సముద్రము - క్షీరసముద్రము, చొచ్చి= ప్రవేశించి, యాదము = గాఢముగా, నిద్ర + పోయిన, పీత + అంబరుఁడు - పచ్చని వస్త్రముగలవాఁడు - విష్ణువు, బిట్టు = శీఘ్రముగా, బెదరి = భయపడి, లేవన్ = లేవఁగను,

తలకొన్న = తలయందు ఉన్న, ధాత్రిణీ - స్థలి = భూమీస్థలి, మెడ - వంపులన్ = మెడవంపులందు, పడన్, అహి + ఇంద్రుఁడు = నాగరాజు - శేషుఁడు, ఉల్కిపడి, మ్రొగ్గిపడన్ = వ్రాలిపడఁగను

అహిమ + అంశు - రథము = సూర్యుని రథము, ఇక్కడ + అక్కడ, పడన్, మావులు = గుఱ్ఱములు, ఉప్పరము+ ఎగసి = మింటి కెగిరి, క్రేళ్ళుటికి - పాటన్ = పర్వులువాఁఁగను,

గో - పతి = వృషభరాజము - నంది, చీఁదఱన్ - రేఁగి = రెచ్చిపోయి, గర్జించి = అంకెపెట్టి, మేను + పెంచి = శరీరమును, బెంచి, చుట్టున్, ఉఱుమకించి - చూడన్ = ఉఱిమి చూడఁగను

దిశ్(క్) + గజ + ఇంద్రంబులు = దిక్కులందలి శ్రేష్ఠములైన యేనుఁగులు, ఉక్కు + అటి = బలము చెడి, మ్రొగ్గన్ = వ్రాలఁగను, తారకములు = నక్షత్రములు డుల్లంగన్ = రాలఁగను, బ్రహ్మాండ - ఖండము = బ్రహ్మాండ భాగము, అద్రువన్ = అదరఁగను, దిక్కులు, మానక = ఉడుగక, అందంద = మిక్కిలి, మాఱు - చెలఁగన్ = ప్రతిధ్వనింపఁగా, ప్రస్థాన - భేరి = ప్రయాణపుభేరి, భీషణ - ధ్వనిన్ = భయంకరమయిన చప్పుడుతో, చెలఁగెన్ = మ్రోసెను

తాత్పర్యము క్షీరసముద్రమునఁ బ్రవేశించి గాఢముగా నిద్రవోయిన విష్ణువు శీఘ్రముగా బెదరి లేవఁగను, తలయందలి భూస్థలి మెడవంపులలోఁ బడఁగా శేషుఁడులికిపడి వ్రాలి పడఁగను, సూర్యుని రథము ఇక్కడక్కడ పడఁగా, గుఱ్ఱములు మింటి కెగిరి పర్వులువాఁఁగను, నంది రెచ్చిపోయి అంకెవైచి మేను పెంచి చుట్టును ఉఱిమి చూడఁగను, దిగ్గజరాజములు బలముచెడి వ్రాలఁగను, చుక్కలు రాలిపడఁగను, బ్రహ్మాండభాగము అదరఁగను, దిక్కులు ఉడుగక మిక్కిలి ప్రతిధ్వనింపఁగను, యుద్ధప్రయాణభేరి భయంకరధ్వనితో మ్రోసెను

విశేషములు : ఇది సామాన్యముగా నైనచో అతిశయోక్తి యనఁదగును గాని కుమారస్వామి యుద్ధభేరి ధ్వని గావున స్వభావోక్తియే యన నొప్పును

యాదము = గాఢముగా (సూ ని), అద్రువ - అద్రుచు + నుజి 'చుక్పరక రువర్ణంబునకు ముందటి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు నగుచో దత్పూర్వంబు గురువు గాదు' బాల ప్ర 20 'తుమర్థభావలక్షణంబులందు నుజి యగు', బాల క్రియ 40 'ముజ్జీత్తులు ముత్తు నాబడు' బాల క్రి 86 'ఆగమాన్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తుపరంబగునపుడు ప వ లగు' బాల క్రి 88 అద్రువు + నుజి 'జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు' బాల క్రి 20 అద్రువను

వ అమ్మహాధ్వని విని నవఘనాఘనధ్వని విని విజృంభించు మయూర సంఘంబునుంబోలెఁ జెలంగి కలఁగొనంబాఱు నమరకటకంబు చంద్రోదయంబునం దనరి మ్రోయు మహాసముద్రంబునుంబోలెఁ బెరిఁగి ఘూర్ణిల్లుచు 4

అర్థము. ఆ + మహత్ (మహా) + ధ్వని = ఆ గొప్ప చప్పుడు, విని, నవ - ఘనా - ఘన - ధ్వని = క్రొత్త వర్షాకాలపు మేఘముల ధ్వని, విని, విజృంభించు = చెలరేఁగునట్టి, మయూర - సంఘంబునున్ + పోలెన్ = నెమళ్లగుంపువలె, చెలంగి = కేఁకలు వేసి, కలఁగొన్ + పాఱు = కలఁగిపాఱునట్టి, అమర - కటకంబు = దేవతల సైన్యము, చంద్ర + ఉదయంబునన్, చంద్రోదయమందు, తనరి = ఒప్పి, మ్రోయు, మహత్ (మహా) + సముద్రంబునున్ + పోలెన్, పెరిఁగి = ఉప్పొంగి, ఘూర్ణిల్లుచున్ =ధ్వనించుచు

తాత్పర్యము. ఆ మహాధ్వనిని విని క్రొక్కారు మొయిళ్ల ధ్వని విని విజృంభించు నెమళ్లగుంపువలె మ్రోసి కలఁగి పాఱునట్టి దేవతల సైన్యము చంద్రోదయమున నొప్పి ధ్వనించు మహాసముద్రమువలె నుప్పొంగి ధ్వనించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

ఉ ధారలు వట్టఁబంపు, తలతంత్రముఁ దా వడి నంపు,రత్నభాం డారముతోడ గుట్టపుదడంబులు ముంగలివంపు, సందడిం జేరఁగనీకు మేనుఁగులఁ, జిందములన్ మొరయింపు, మొక్కఁడే వారువ మందు వంపు సహవాసుల నంతిపురంబు కాపుగాన్ 5

అర్థము ధారలు = సైన్యపు మొనలో ముందటి భాగములు, పట్టన్ = పట్టునట్లు, పంపు = పంపుము, తలతంత్రమున్ = యుద్ధభూమిలో మొదట సవరణఁజేయఁదగిన నాయకుల సమూహమును, తాన్, వడిన్ = వేగముగా, అంపు పంపుము, రత్న - భండారముతోడన్ = రత్నాల బొక్కసముతో, గుట్టపు - దడంబులు (గుట్టము + దడంబులు) అశ్వసైన్యములు, ముంగలి + పంపు = ముందు పంపుము ఏనుఁగులన్, సందడిన్ = గుంపుగా, చేరఁగన్ + ఈకుము = కూడనీకుము, చిందములన్ = శంఖములను, మొరయింపుము = ఒత్తింపుము, ఒక్కఁడే - వారువమందున్ = ఒకే గుట్టమునందు, సహవాసులన్ = కుబ్జక్లీబాద్యంతఃపురరక్షకులను, అంతిపురంబు - కాపుగాన్ = అంతఃపురరక్షణమగునట్లు, పంపు = పంపుము

తాత్పర్యము . సైన్యపు మొనలో ముందటి భాగములు పట్టునట్లు పంపుము యుద్ధభూమిలో మొదట సవరణఁజేయఁదగిన నాయకుల సమూహమును వేగముగాఁ బంపుము రత్నముల బొక్కసముతో అశ్వసైన్యములు ముందు పంపుము ఏనుఁగులను గుంపుగాఁ జేరనీకుము శంఖముల నొత్తింపుము ఒకే గుట్టమునందు అంతఃపురపుఁగావలివాండ్రను అంతఃపురరక్షణమునకుఁ బంపుము

విశేషములు . ఒక్కఁడే వారువమందు వంపు - ద్రుతప్రకృతికమయిన 'అందు' పయి పకారమునకు వకార మె ట్లాదేశమైనది? ఒక్కఁడే వారువ మందుఁబంపు' అని యుండవలయును గదా !

ఉ **ఏనుఁగుఁ బంపు, వారువము లీఁదగు, నిందుల సేన వేసరెన్,**
గానవె ? సోవతంబునకుఁ గందల మెత్తు, రథంబు పూన్పు, పం
చాననపుత్రుఁ డెత్తికొను డత్తల మందవు ముట్టు దారికిన్
రా నవు వచ్చినన్ సడగరం బవులె మ్మొగి వీలు లెత్తఁగాన్ 6

అర్థము . ఏనుఁగున్ = ఏనుఁగును, పంపు = పంపుము, వారువములు, ఈన్+తగున్ = గుట్టముల నీఁదగును, ఇందుల - సేన = ఇచ్చటి సేన, వేసరెన్ = అలసెను కానవె = చూడవా ?, సోవతంబునకున్ = గుట్టమునకు (?), కందలము = జీను, ఎత్తు = పెట్టుము, రథంబు, పూన్పు = సిద్ధము చేయుము, పంచానను - పుత్రుఁడు = శివకుమారుఁడు - కుమారస్వామి, ఎత్తికొనుడు = దండెత్తుట, అత్తలము + అందున్ + అవు = ఆ స్థలమునందగు, ముట్టువారికిన్ = ఎదిరించువారలకు, రాన్ + అవున్ = వచ్చుటకగును, వచ్చినన్ = వచ్చినచో,

ఒగిన్ = క్రమముగా, వీళులు + ఎత్తఁగాన్ = శిబిరములు నిర్మించుటకు, సడగరంబు = సంభ్రమము, అవున్ + లెమ్ము = అగునులెమ్ము

తాత్పర్యము ఏనుఁగులను బంపుము గుట్టముల నీఁదగును ఇచ్చటిసేన బడలెను చూడవా ? గుట్టమునకు జేను గట్టుము రథమును సిద్ధపఱుపుము కుమారస్వామి దండెత్తుటచే ఆ స్థలముననున్న ఎదిరించువారలు వచ్చుటకగును వారు వచ్చుచో శిబిరములు నిర్మించుటకు సంభ్రమమగును

విశేషములు. ఇందలి 'సోవత' మను శబ్దము నిఘంటువులఁ గానరాలేదు వావిళ్లవారి ప్రతిలోని లఘుటీకననుసరించి వ్యాఖ్యానింపఁబడినది వీళులు - వీడు + లు - 'బహువచనముపరంబగునపు డసంయుక్తబులయి యుదంతంబులయిన డ ల ర ల కలఘులకారంబు బహుళంబుగా నగు ' బాల ఆచ్చిక 13 పంపు, ఎత్తు, పూన్పు - అనువానిలో మువర్ణక లోపమునకు - 'మధ్యమ పురుషమువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు' బాల సంధి 47

వ ఇట్టి సంక్షోభంబునం బ్రయాణోన్ముఖుండై 7

అర్థము . ఇట్టి, సంక్షోభంబునన్ = సంచలనముతో, ప్రయాణ + ఉన్ముఖుండు + ఐ = పయనమునకు ఉద్యుక్తుఁడయి

తాత్పర్యము. ఇటువంటి సందడిలో యుద్ధప్రయాణమున కుద్యుక్తుఁడయి - తరువాతి పద్యముతో నన్వయము

మ చెలఁగన్ నిర్జరదుందుభుల్ మునిగణాశీర్వాదనాదంబుతోఁ,
జెలువొందన్ సురపుష్పవృష్టి గురియన్ శేషాక్షతౌఘంబుతో,
నలి నీశాత్మజుఁ డెక్కె బృంహిత రవానందాశ్రు దానంబు స
ల్లలి తేభంబు దినేశ్వరుండుదయశైలం బెక్కునట్లున్నతిన్ 8

అర్థము. ముని - గణ + ఆశీర్వాద నాదంబుతోన్ = మునుల సమూహము యొక్క దీవెనల ధ్వనితో, నిర్జర - దుందుభుల్ = దేవతల భేరులు, చెలఁగన్ = ధ్వనింపఁగను, చెలువు + ఒందన్ = మనోహరముగా, శేష + అక్షత + ఓఘంబుతోన్ = సేసఁబ్రాలసమూహముతో, సుర - పుష్ప - వృష్టి = దేవతల పూలవాన, కురియన్ = కురియఁగను, ఈశ + ఆత్మజుఁడు = ఈశ్వరుని కొడుకైన కుమారస్వామి, దిన + ఈశ్వరుండు = దిననాథుఁడు = సూర్యుఁడు,

ఉదయ - శైలంబు = తూర్పుగొండను, ఎక్కు + అట్లు = ఎక్కు విధమున, బృంహిత - రవ + ఆనంద + అశ్రు - దానంబు = ఘీంకారధ్వనితోడి సంతోషబాష్పములనెడి మదజలము గలది, అగు, సత్ + లలిత + ఇభంబున్ = మిక్కిలి మనోహరమయిన యేనుగును, ఉన్నతిన్ = గొప్పతనముతోను, ఉల్లాహముతోను, ఎక్కెను

విశేషములు అలంకార ముపమ

వ తదవసరంబున 9

అర్థతాత్పర్యములు. తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క **గరుడేభాజ మహిష నర**
వర ఋష మృగ తురగ వృషభవాహనులై శ్రీ
ధర సుర పాగ్ని య మాసుర
వరుణానిల ధనద హరులు వచ్చిరి నెమ్మిన్ 10

అర్థము. శ్రీధర = విష్ణువు, సురప = ఇంద్రుడు, అగ్ని, యమ, అసుర = నిర్ఋతి, వరుణ = వరుణుడు, అనిల = వాయువు, ధనద = కుబేరుడు, హరులు = ఈశానుడు అనువారు, (క్రమముగా), గరుడ = గరుత్మంతుడు, ఇభ = ఏనుగు - ఐరావతము, అజ = మేక పోతు, మహిష = దున్న, నర - వర = మనుజ శ్రేష్ఠుడు, ఋష = చేప, మృగ = లేడి, తురగ = గుఱ్ఱము, వృషభ - వాహనులు + ఐ = ఎద్దు వాహనములుగా గలవారయి, నెమ్మిన్ =ప్రీతితో, వచ్చిరి

తాత్పర్యము: విష్ణువు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్ఋతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, ఈశానుడు అనువారు క్రమముగా గరుత్మంతుడు, ఐరావతము, మేకపోతు, దున్న, నరవరుడు, చేప, లేడి, గుఱ్ఱము, ఎద్దు అనునవి వాహనములుగా గలవారయి ప్రీతితో వచ్చిరి

విశేషములు. అలంకారము యథాసంఖ్యము ఇందు అగ్నికి అజము అసురునకు నరుడు, ధనదునకు దురగము వాహనములుగా జెప్పుట విశేషము ధనదుడు నరవాహనుడు

వ మఱియును - తరువాతి పద్యముతో నన్వయము 11

సీ అశ్వాశ్వతర శిబికాందోళ కరి కరి
ణీకర భార దానీక వాహ
నంబులు నిజవిభవంబులు వెలయంగఁ
గర మర్థి నెక్కి భూచరులు నడవ
మానితానేక విమాన సహస్రముల్
పరువడి నెక్కి ఖేచరులు నడవ
నాతపత్ర ధ్వజ వాతపూరణములుఁ
దనరి బ్రహ్మాండంబు దాఁకి తూల

ఆ భూనభోంతరప్రపూరితంబై దశ
దిశల నడుమ నెఱయ దీఁటు కట్టి
జగము లెల్ల నిమ్ము సాలక మల్లడి
గొనియె గుహు బలంబు కొలఁదిమిగిలి 12

అర్థము అశ్వ నంబులు అశ్వ = గుఱ్ఱములు, అశ్వతర = కంచర గాడిదలు, శిబికా = పల్లకీలు, ఆందోళ = అందలములు, కరి = ఏనుఁగులు, కరిణీ = పిడియేనుఁగులు, కరభ = ఒంటెలు, అరద = రథముల, అనీక = సమూహములు, వాహనంబులు, నిజ - విభవంబులు = తమ వైభవములు, వెలయంగన్ = ఒప్పఁగా, కరము = మిక్కిలి, అర్థిన్ = కోరికతో, ఎక్కి, భూచరులు = కాల్బలములు, నడవన్ = నడవఁగా,

మానిత + అనేక - విమాన - సహస్రముల్ = గొప్పవియగు పెక్కు విమానముల సహస్రములు, పరువడిన్ = క్రమముగా, ఎక్కి, ఖేచరులు = గగనచరులు, నడవన్,

ఆతపత్ర = గొడుగు, ధ్వజ = కేతనములు, వాత - పూరణములున్ = గాలిబుడగలును, తనరి = ఒప్పి, బ్రహ్మాండంబు, తాఁకి = ముట్టి, తూలన్ = చలింపఁగను,

భూ -నభస్(ః) + అంతర - ప్రపూరితంబు + ఐ = భూమ్యాకాశముల నడిమి ప్రదేశము నిండినదయి, దశ - దిశల - నడుమన్ = పదిదిక్కుల నడుమను, నెఱయన్ = నిండుగా, దీటు - కట్టి = నిండి, జగములు + ఎల్లన్, గుహు - బలంబు

= కుమారస్వామి సైన్యము కొలఁది - మిగిలి = పరిమితి నతిక్రమించి, మల్లడి + కొనియెన్ = అతిశయించెను

తాత్పర్యము గుట్టములు, కంచర గాడిదలు,పల్లకీలు, లంచలములు, ఏనుఁగులు ఆఁడేనుఁగులు, ఒంటెలు, రథములు అనువాని సమూహము, వాహనములు తమ వైభవము లొప్పఁగా ఎక్కిలి కోరికతో నెక్కి కాలిబంటులు నడవఁగను, గొప్పవియగు పెక్కువేల విమానములు ఎక్కి గగనచరులు నడవఁగను, గొడుగులు, కేతనములు, వాయుపూరణములును ఒప్పి బ్రహ్మాండము ముట్టి చలింపఁగను, భూమ్యాకాశముల నడిమి ప్రదేశము నిండినదయి పదిదిక్కుల నడుమను మిక్కిలి నిండి జగములన్నియుఁ జోటుచాలక గుహుని సైన్యము మితిమీఱి అతిశయించెను

విశేషములు . రథ శబ్దభవమైన'అరద' మిందుఁ దత్సమపదముగాఁ బ్రయుక్తమైనది

చ నలుగడ నింత యంత యని నాలుకఁజెప్పఁగఁ బెద్ద, యమ్మెయిం
గల నిజ మింత యంత యని కన్నులఁ జూడఁగఁ బెద్ద, తద్దయుం
జెలువుగ నింత యంత యని చిత్తమునం దలపోయఁ బెద్ద నాఁ
బొలిచె మహేశుపేర్మియునుబోలెఁ గుమారుబలం బనంతమై 13

అర్థము . కుమారు - బలంబు = కుమారస్వామి సైన్యము, నలుగడన్ = నాలుగు దిక్కులందును, ఇంత + అంత + అని, నాలుకన్ = నాలుకతో, చెప్పఁగన్ = చెప్పుటకు, పెద్ద = ఎక్కువ, అమ్మెయిన్ = (ఆ + మెయిన్) = ఆ విధముగా, కల - నిజము = ఉన్న నిజము, ఇంత + అంత + అని, కన్నులన్ + చూడఁగన్, పెద్ద, తద్దయున్, చిత్తమునన్ = మనసునందు, చెలువుగన్ = అందముగా, తలపోయన్= భావింపఁగా, పెద్ద, నాన్ = అనునట్లు, మహేశు - పేర్మియును + పోలెన్ = మహేశ్వరుని గొప్పతనమువలె, అనంతము + ఐ = అంతులేనిదయి, పొలిచెన్ = ఒప్పెను

తాత్పర్యము . కుమారస్వామి సైన్యము నాలుగుదిక్కులను ఇంత అంత అని నోటితోఁ జెప్పుట కెక్కువ ఇంతయని చెప్పలేమనుట ఆ రీతిగనే ఉన్ననిజ మింత యంత యని కన్నులతోఁ జూడ నలవి కాదు దాని యందము నింత యంత యని మనసుతో నూహించుటకును బెద్ద అట్లు అది మహేశ్వరుని గొప్పతనమువలె అంతులేనిదయి ఒప్పెను

విశేషములు. అలంకార ముపమ చెప్పుటకు అలవి కానిది ఒకపాటిదయి యుండును చూచుటకు వీలుకానిది మఱి కొంచెము పెద్దదయియుండును మనసులో నూహించుటకుఁ గూడ నలవికానిది యెంత పెద్దదో చెప్పుట కష్టమని ఉత్తరోత్తరముగా దాని అభివృద్ధి సూచింపఁబడియెను

క ధరణీధరశోభితమై
నిరుపమమై, యమరవాహినీసంయుతమై,
హరిభూషితమై పరమే
శ్వరు, నంబుధిఁబోలి గుహుని వాహిని నడచెన్ 14

అర్థము. గుహుని - వాహిని = కుమారస్వామి సేన, ధరణీధర - శోభితము + ఐ = విష్ణువుచేఁ బ్రకాశించినదయి - నాగములతోఁ బ్రకాశించునదయి, పరమేశ్వరున్ = శివుని, పోలి, పర్వతములతోఁ బ్రకాశించి, అంబుధిన్ = సముద్రమును, పోలి, నిరుపమము + ఐ = సాటిలేనిదయి, నడచెన్, అమర - వాహినీ - సంయుతము + ఐ = దేవతల సేనతోఁ గూడినదయి - ఆకాశగంగానదితోఁ గూడినదయి, పరమేశ్వరున్, పోలి, గంగానదితోఁ గూడినదయి, అంబుధిన్, పోలి, హరి - భూషితము + ఐ = ఇంద్రునిచే నలంకరింపఁబడినదయి చంద్రునిచే నలంకరింపఁబడినదయి, పరమేశ్వరున్, పోలి, విష్ణువుచే నలంకరింపఁబడినదయి, అంబుధిన్, పోలి, నడచెన్

తాత్పర్యము. కుమారస్వామి సైన్యము ధరణీధర శోభితమై - విష్ణువుచేఁ బ్రకాశించినదయి -నాగములతోఁ బ్రకాశించినదయి పరమేశ్వరుని, పర్వతములతోఁ బ్రకాశించి సముద్రమును బోలి నడచెను అది సాటిలేనిదయి యుండెను అది అమరవాహినీసంయుతమయి = దేవసేనతోఁ గూడినదయి - ఆకాశగంగతోఁ గూడినదయి పరమేశ్వరుని, గంగానదితోఁ గూడి సముద్రమును బోలి నడచెను అది హరిభూషితమై - ఇంద్రునిచే నలంకరింపఁబడినదయి, చంద్రునిచే నలంకరింపఁబడినదై పరమేశ్వరుని, విష్ణువుచే నలంకరింపఁబడినదయి సముద్రమును బోలి నడచెను

విశేషములు. అలంకారము శ్లేషానుప్రాణితోపమ

క. భూరితరవారి వారిరు
హారావానంత నాగ హరి భూధర ల
క్ష్మీ రమణీ శోభితుఁడై
నీరధిపతిఁబోలె వాహినీవిభుఁ డచటన్ 15

అర్థము అచటన్ = అచ్చట, వాహినీ - విభుఁడు = సేనానాయకుఁడు - కుమారస్వామి, భూరి శోభితుఁడై, భూరి = ఎక్కిలి యెక్కువయిన, తరవారి = కత్తుల యొక్కయు, వారిరుహ = శంఖముల యొక్కయు, ఆరావ = ధ్వనులచేతను, అనంత-నాగ = అనంతములయిన ఏనుఁగుల చేతను, హరి = గుఱ్ఱముల చేతను, భూధర = రాజుల చేతను, లక్ష్మీ - రమణీ = సంపదధిష్ఠానదేవతచేతను, శోభితుఁడు + ఐ = ప్రకాశించినవాఁడయి

భూరితర = మిక్కిలి అధికమయిన, వారి = నీటి యొక్కయు, వారిరుహ = శంఖములయొక్కయు, ఆరావ = ధ్వనులతోను, అనంత-నాగ = అనంతుఁడను సర్పముతోను, హరి = విష్ణువుతోను, భూధర = కొండలతోను, లక్ష్మీ - రమణీ = లక్ష్మీదేవితోను, శోభితుఁడై = ప్రకాశించినవాఁడయి, నీరధి-పతిన్ = సముద్రుని, పోలెన్

తాత్పర్యము కుమారస్వామి అధికములయిన కత్తులయు, శంఖములయు ధ్వనులతోను, అనంతములయిన ఏనుఁగులతోను, గుఱ్ఱములతోను, రాజులతోను, సంపదధిష్ఠాన దేవతతోను బ్రకాశించినవాఁడయి, అధికమైన నీటి యొక్కయు శంఖముల యొక్కయు ధ్వనిచేతను, అనంతుఁడను సర్పముతోను విష్ణువుతోను, పర్వతములతోను, లక్ష్మీదేవితోను బ్రకాశించినవాఁడగు సముద్రుని బోలెను

విశేషములు అలంకారము శ్లేషానుప్రాణితోపమ

వ తత్ప్రస్తవంబున 16

అర్థతాత్పర్యములు. తద్ + ప్రస్తవంబునన్ = ఆ సందర్భమునందు - తరువాతి పద్యముతో నన్వయము

చ ఎలమిఁ గుమారు ముంగలి సురేంద్రుఁడు రా, నుదధీశ్వరుండు పిం
గలి నడవం, గుబేరుఁడును గాలుఁడు నేర్పడఁ బన్ని ప్రీతితోఁ
గెలఁకుల రాఁగ, మీఁదఁ దగు ఖేచరనాథులు రా, నహీంద్రు ల
ర్గల గతిఁ గ్రింద రాఁగఁ ద్రిజగద్భరితంబయి త్రోచె వాహినుల్ 17

అర్థము. సుర + ఇంద్రుఁడు = దేవేంద్రుఁడు, ఎలమిన్ = ప్రీతితో, కుమారు - ముంగలిన్ = కుమారస్వామి ముందు, రాన్ = రాఁగా, ఉదధి + ఈశ్వరుండు = సముద్రాధిపతి - వరుణుఁడు, పింగలిన్ = వెనుక, నడవన్ =

నడవఁగా, కుబేరుఁడును, కాలుఁడున్ = యముఁడును, ఏర్పడన్ = స్పష్టముగా, పన్ని = సిద్ధపడి, ప్రీతితోన్ = సంతోషముతో, కెలఁకులన్ = పార్శ్వములందు, రాఁగన్, తగు = ఒప్పునట్టి, ఖేచర - నాథులు = గగనచర శ్రేష్ఠులు, మీఁదన్ = పైని - ఆకాశమున, రాన్ = రాఁగా, అహి + ఇంద్రులు = నాగశ్రేష్ఠులు, అర్గల - గతిన్ = పెద్ద అలలవలె, క్రిందన్ = దిగువను, రాఁగన్, వాహినుల్ = సేనలు, త్రి - జగత్ + భరితంబు + అయి = ముల్లోకములు నిండినవయి, త్రోచెన్ = నడచెను

తాత్పర్యము . దేవేంద్రుఁడు ప్రీతితోఁ గుమారస్వామిముందుఁ రాఁగా, వరుణుఁడు వెనుక నడవఁగా, కుబేరుఁడును, యముఁడును సిద్ధపడి సంతోషముతో పార్శ్వముల రాఁగా, గగనచరులు ఆకాశమున రాఁగా, నాగశ్రేష్ఠులు పెద్దయలలవలెఁ గ్రింద రాఁగాఁ గుమారస్వామిసేనలు నడచెను

సీ గంధసింధురములు కందంబులుగ మహా
వ్యాళ సమూహముల్ మూలములుగ
నస్త్రశస్త్రానీక మంకురోద్గమముగా
వరకేతుతతి పల్లవములు కాఁగ
చదలంది క్రాలెడు చామరచ్ఛత్రదం
డమ్ములు శాఖాచయమ్ము కాఁగ
మణిభూషణతతి కుట్మలగుచ్ఛములు కాఁగ
వివిధాతపత్రముల్ విరులు కాఁగ

ఆ మానితాప్సరో విమానమాలిక లోలిఁ
బొలయ మ్రానఁ బండుఁగొలలు కాఁగ
బలసి త్రిభువనములుఁ బందిరిగా దేవ
దేవ తనయు వాఁగుఁదీవ వఱచె 18

అర్థము : దేవ దేవు - తనయు - వాఁగుఁదీవ = పరమేశ్వరుని కుమారుఁడగు కుమారస్వామి సేన యనుతీఁగ,

గంధ - సింధురములు = మదపుటేనుఁగులు, కందంబులుగన్ = దుంపలుగను, మహత్ (మహా) + వ్యాళ - సమూహముల్ = గొప్పపాముల గుంపులు, మూలములుగన్ = వేరులుగను,

అస్త్ర - శస్త్ర + అనీకము = అస్త్రములయు, శస్త్రములయు సమూహము, అంకుర + ఉద్గమము + కాన్ = మొలకల ఉదయముకాఁగా, వర - కేతు - తతి = మేలయిన టెక్కెముల సమూహము, పల్లవములు - కాఁగన్ = చివురులు కాఁగా,

చదలు + అంది = ఆకాశము నంటి క్రాలెడు = చలించెడు, చామర + ఛత్ర - దండమ్ములు = ఎంజామరములయు, గొడుగులయు దండములు, శాఖా - చయమ్ము + కాఁగన్ = కొమ్మల సమూహము కాఁగా,

మణి - భూషణ - తతి = రత్నాలంకారముల సమూహము, కుట్మల - గుచ్ఛములు + కాఁగన్ = మొగ్గల గుత్తులు కాఁగా, వివిధ + ఆతపత్రముల్ = వివిధములైన గొడుగులు, విరులు = పువ్వులు, కాఁగన్

మానిత + అప్సరస్ (ఃు) + విమాన - మాలికలు = గొప్పవియగు అచ్చరల విమానముల వరుసలు, ఓలిన్ = బాగుగా, పొలయన్ = ఒప్పఁగా, మ్రానన్ = చెట్టునందు, పండుఁగొలలు + కాఁగన్ = పండ్ల గుత్తులు కాఁగా,

బలసి = చుట్టి, త్రిభువనములు = ముల్లోకములు, పందిరి + కాన్, పఱచెన్ = వ్యాపించెను

తాత్పర్యము సర్వేశ్వరతనయుఁడగు కుమారస్వామిసేన యను తీఁగ మదపుటేనుఁగులు దుంపలుకాఁగా, గొప్పపాముల గుంపులు వేరులు కాఁగా, అస్త్రశస్త్రముల సమూహము అంకురోదయము కాఁగా, మేలయిన టెక్కెముల సమూహము చివురులు కాఁగా, ఆకాశమంటి చలించు చామరములయు, ఛత్రములయు దండములు కొమ్మల సమూహము కాఁగా, రత్నాలంకారముల సమూహము మొగ్గల గుత్తులు కాఁగా, పలురీతులయిన గొడుగులు పువ్వులు కాఁగా, అప్సరసల విమానమాలికలు చెట్టునందలి పండ్లగుత్తులు కాఁగా చుట్టుకొని ముల్లోకములు పందిరిగా వ్యాపించెను

విశేషములు . అలంకారము రూపకము వ్యాళమునకు మూలముతోడి సామ్యము కొఱకు పాము అని అర్థము చెప్పఁబడినది చామరచ్ఛత్ర - చామర + ఛత్ర హ్రస్వమునకుఁబరమైన ఛకారమునకు ద్విత్వము వాఁగుఁదీవ - వాఁగు + తీవ' 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకుం, బు ంపులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు ' బాల సం 25 వాఁగు + ను + తీవ' ద్రుతకార్యము - బాల సంధి 16,17 వాఁగుఁదీవ

మ ఉరుహేతిప్రకరోల్లసద్ద్యుతులు విద్యుల్లేఖ, లుత్తుంగ సిం
ధురముల్ నీలఘనాఘనంబులు, మహాతూర్యధ్వనుల్ గర్జన
స్వరముల్, భూషణరత్నదీప్తులు మరుచ్చాపంబులై క్రాల భీ
కరమై నిర్జరవాహినుల్ నడచెఁ గ్రొక్కారో యనం బేర్మితోన్ 19

అర్థము. ఉరు- హేతి - ప్రకర + ఉల్లసత్ + ద్యుతులు = పెద్దకత్తుల సమూహముయొక్క మిక్కిలి ప్రకాశించుకాంతులు, విద్యుత్ + లేఖలు = మెఱుపుఁదీఁగలు, ఉత్తుంగ - సింధురముల్ = ఎత్తయిన ఏనుఁగులు, నీల - ఘనా - ఘనంబులు = నల్లని వర్షాకాలపు మేఘములు, మహత్ (మహా) + తూర్య-ధ్వనుల్ = గొప్పపటహాది వాద్యముల ధ్వనులు, గర్జన - స్వరముల్ = ఉఱుముల చప్పుడులు, భూషణ - రత్న - దీప్తులు = అలంకారములందలి మణుల కాంతులు, మరుత్ + చాపంబులు = ఇంద్రధనుస్సులు, ఐ క్రాలన్ = ఒప్పఁగా, భీకరము + ఐ = భయంకరమయి, నిర్జర - వాహినుల్ = దేవతల సేనలు, క్రొక్కారో + అనన్ = (క్రొత్త + కారో) అనన్ = వర్షాకాలమో యనఁగా, పేర్మితోన్ = గొప్పతనముతో, నడచెన్

తాత్పర్యము. పెద్దఖడ్గముల ప్రకాశించు కాంతులు మెఱుపుఁదీఁగలును, ఎత్తయిన యేనుఁగులు నల్లని వర్షాకాలపు మేఘములును, గొప్ప పటహాది వాద్యముల ధ్వనులు ఉఱుముల చప్పుడులును, అలంకారములందలి మణుల కాంతులు ఇంద్రధనుస్సులును అయి ఒప్పఁగా భయంకరములయి దేవతల సేనలు వర్షాకాలమో యనఁగా గొప్పతనముతో నడచెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష క్రొక్కారు - క్రొత్త+కారు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు 'బాల సం 36 క్రొ + కారు 'క్రొత్త శబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁది హల్లునకు ద్విత్వంబు నగు ' బాల సం 38 క్రొక్కారు మరుచ్చాపము- మరుత్ + చాపము - సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గవర్ణము లాదేశమగును

మ తరుగుల్మాదులు పిండి పించుగ, మహోధాత్రీధరిత్రీధరో
త్కరముల్ పెంపఱి నుగ్గునూఁచముగ, నుద్యద్వాహినీ వాహినీ
శ్వర వర్గంబులు దుమ్ముధూళిగఁ, దదాశానాగనాగాళి జ
ర్జరితంబై పడ, దేవసేన నడచెన్ సర్వంసహాసహ్యమై 20

అర్థము తరు - గుల్మ + ఆదులు = చెట్లు పొదలు మున్నగునవి, పిండి పించుగన్ = మిక్కిలి నలఁగఁగొట్టఁబడినవిగా, మహత్ (మహా) +ధాత్రీ - ధరిత్రీ ధర + ఉత్కరముల్ = గొప్పభూమియు, పర్వతముల సమూహములును, పెంపు + అటి = గొప్పతనమును గోలుపోయి, నుగ్గునూఁచముగన్ = పొడిపొడిగా, ఉద్యత్ + వాహినీ - వాహినీ + ఈశ్వర - వర్గంబులు = గొప్పనదులయు, సముద్రములయు సమూహములు, దుమ్ము - ధూళిగన్, తద్ + అశా - నాగ - నాగ + ఆళి = ఆ దిగ్గజములయు, పాములయు వరుస, జర్జరితంబు + ఐ = తూఁటులు పడినవయి, పడన్ = పడఁగా, దేవ - సేన = దేవతల సేన, సర్వంసహా + అసహ్యము + ఐ = భూమికి భరింపరానిదయి, నడచెన్

తాత్పర్యము. చెట్లు పొదలు మున్నగునవి మిక్కిలి నలఁగఁగొట్టఁబడినవిగా, గొప్ప భూమియు, పర్వతముల సమూహములును పొడిపొడిగా, గొప్ప నదులును, సముద్రముల సమూహములును దుమ్ముదుమ్ముగా, ఆ దిగ్గజములయు, పాములయు వరుస తూఁటులుపడి పడిపోఁగా దేవతల సేన భూమికి దుర్భరమయి నడచెను

చ బలపదఘట్టనం దెరలి పాంసుమయంబయి భూమి యవ్వియ
త్తలమునకోడి పాతిన విధంబున ధూళి దివంబు నిండె, దో
ర్బలమునఁ దత్పతాకిని నభంబునఁ బాఱెడు ధాత్రిఁబట్టి తే
గలయఁగఁ జేతులెత్తె ననఁ గప్పె మరుద్గతిఁ గేతనావలుల్ 21

అర్థము బల -పద - ఘట్టనన్ = సైనికుల పాదముల త్రొక్కిడిచే, తెరలి = పైకివచ్చి, పాంసు - మయంబు + అయి = దుమ్ముతో నిండినదయి, భూమి, ఆ + వియత్ + తలమునకున్ = ఆ ఆకాశప్రదేశమునకు, ఓడి, పాతిన - విధంబునన్ = పాతిపోయిన రీతిగా, ధూళి = దుమ్ము, దివంబు = ఆకాశము, నిండెన్, తద్ + పతాకిని = ఆ సేన, నభంబునన్ = ఆకాశమునందు, పాఱెడు = పరువెత్తునట్టి, ధాత్రిన్ = భూమిని, దోస్ (ఃబ) + బలమునన్ = భుజశక్తిచే, పట్టి, తేన్ = తెచ్చుటకు, కలయఁగన్ = కలయునట్లు, చేతులు, ఎత్తెన్, అనన్, కేతన + ఆవలుల్ = ధ్వజముల వరుసలు,మరుద్గతిన్ = మరుత్ + గతిన్ = వాయుమార్గమును = ఆకాశమును, కప్పెన్

తాత్పర్యము సైనికుల పాదముల త్రొక్కిడిచేఁ బైకి లేచిన దుమ్ముతో నిండినదయి భూమి ఆకాశమునకోడిపోయి పాతిపోయిన విధమున దుమ్ము

ఆకాశమున నిండెను ఆ సేన ఆకాశమునఁ బరువెత్తునట్టి భూమిని దన భుజబలమునఁబట్టి తెచ్చుటకుఁ జేతు లెత్తెనాయనునట్లు ధ్వజసమూహము లాకాశమును గప్పెను

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష

క ఉరుబల పదహతి నెగసిన
ధరణీతలభవరజోవితానముపై సు
స్థిరగతి నడచుచుఁ దత్తే
చరులును భూచరులతోడి సరియై రచ్చోన్ 22

అర్థము ఉరు - బల - పద - హతిన్ = గొప్పదియగు సేనయొక్క పాదముల దెబ్బచే, ఎగసిన = లేచిన, ధరణీ - తల - భవ - రజస్ (ః) + వితానముపైన్ = భూమినుండి పుట్టిన ధూలి సమూహము మీఁద, తద్ + ఖేచరులును = ఆ గగనచరులును, సుస్థిర - గతిన్ = మంచి నిలుకడగల గమనముతో, నడచుచున్, అచ్చోన్ (ఆ + చోటన్) = అచ్చట, భూచరులతోడి = భూమియందుఁ జరించువారితోడి - మానవులతోడి, సరి + ఐరి = సాటిగలవారయిరి

తాత్పర్యము గొప్పదియగు సేన పాదముల త్రొక్కిడిచే లేచిన భూమియందలి ధూళి సమూహముమీఁద ఆ గగనచరులు మంచి నిలుకడగల గమనముతో నడచుచు అచ్చట భూచరులతో - మానవులతో సమానమైరి

విశేషములు. అలంకారము అతిశయోక్తి

తే పుడమి నిజసేన కొక్కట నడవ నిమ్ము
చాలదని గుహుఁ డబ్ధులు సమతలముగఁ
గప్పఁబంచె నా బలపదఘట్టనముల
నెగయు కెంధూళి వారాసులేడుఁ గప్పె 23

అర్థము. పుడమి = భూమి, నిజ - సేనకున్ = తనసైన్యమునకు, ఒక్కటన్ = ఒక్కసారిగా, నడవన్ = నడచుటకు, ఇమ్ము - చాలదు + అని = చోటు సరిపోదని, గుహుఁడు = కుమారస్వామి, అబ్ధులు = సముద్రములు, సమతలముగన్ = సమప్రదేశముగా - భూతలముగా, కప్పన్ = కప్పునట్లు, పంచెన్ + నాన్ = పంపెనను నట్లు, బల - పద - ఘట్టనములన్ = సైనికుల పాదముల త్రొక్కిడిచే,

ఎగయు = లేచునట్టి, కెందూళి (కెంపు + ధూళి) = ఎఱ్ఱని దుమ్ము, వారాసులు = సముద్రములు, ఏడున్ = ఏడును, కొప్పెన్

తాత్పర్యము తన సేన ఒక్కసారిగా నడచుటకు భూమిఁజోటుసరిపోవదని కుమారస్వామి సముద్రములను భూతలమగునట్లు పంపెనాయన సైనికుల పాదముల త్రొక్కిడిచేఁ బైకి లేచిన యెఱ్ఱని దుమ్ము ఏడు సముద్రములను గొప్పెను

విశేషములు. అలంకారము ఉత్ప్రేక్ష - అతిశయోక్తి కెందూళి - కెంపు + ధూళి 'సమాసంబునం బ్రాఁతాదుల తొలి యచ్చుమోఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగానగు ' బాల సం 36 కె + ధూళి ఇట లుప్తవేషమునకుఁ బరుషముగాక స్థిరము పరమగుచున్నను నుగాగమమగుట విశేషము కె + ను + ధూళి 'వర్గయుక్తరళములు పరములగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువును గానంబడియెడి ' బాల సం 19 కెందూళి

క కరిమద హయ లాలాజల
పరిపూర్ణంబగు పదాతి పద హతి నొగిఁ జె
చ్చెర ధూళి నెగయు భువిఁ బొరిఁ
బొరిఁగొనియెడు ఘర్మయుగము పోరాడు క్రియన్ 24

అర్థము భువిన్ = భూమియందు, పొరిఁబొరిన్ = మాటిమాటికి, కొనియెడు = కొనునట్టి, ఘర్మ - యుగము = ఉక్కుల జంట - మద స్రావముల జంట, పోరాడు - క్రియన్ = కలహించు విధమున, కరిమద = ఏనుఁగుల మదజలము, హయ - లాలాజల = గుఱ్ఱముల చొంగనీరు - అనువానితో, పరిపూర్ణంబు + అగు = నిండినదగు, పదాతి - పద - హతిన్ = కాల్బంటుల అడుగుల దెబ్బచే, ధూళి = దుమ్ము, ఒగిన్ = లెస్సగా, చెచ్చెరన్ = శీఘ్రముగా, నెగయున్ = ఎగురును

తాత్పర్యము. భూమియందు మదస్రావముల జంట ఒకదానితో నొకటి పోరాడుచున్నదా యనునట్లు ఏనుగుల మదజలము, గుఱ్ఱముల లాలాజలము అనువానితో నిండిన కాల్బంటుల పాదముల దెబ్బచే దుమ్ము పైకి లేచును

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

చ పుడమి పదాతి వాజి గజ పూరితమై తనరంగ, వానిపై
గొడుగులుఁ బీలి తొంగళులఁ గుంచెలుఁ గ్రిక్కిటియంగ, వానిపైఁ
బడగలు నోజ రాజిలఁగఁ, బద్మభవాండము నిండి క్రాలఁగా
నడచెఁ గుమారు వాఁగు భువనంబు సమస్తము నొక్కపాయగాన్ 25

అర్థము పుడమి = భూమి, పదాతి - వాజి - గజ - పూరితము + ఐ = కాల్బంటులు, గుఱ్ఱములు, ఏనుఁగులు అనువానితో, నిండినదయి, తనరంగన్ = ఒప్పఁగా, వానిపైన్ = ఆ పదాతివాజిగజములమీఁదఁ గ్రమముగా, గొడుగులున్, పీలితొంగళులున్ = నెమలి యీఁకల కుచ్చులును, కుంచెలున్ = కుచ్చెలును, క్రిక్కిఱియంగన్ = నిండఁగా, వానిపైన్ = ఆ గొడుగులు మున్నగువానిమీఁద, పడగలున్ = పతాకములును, ఓజన్ = క్రమముగా, రాజిలఁగన్ = ప్రకాశింపఁగా, పద్మభవ + అండము = బ్రహ్మాండము, నిండి, క్రాలఁగాన్ = ఒప్పఁగా, కుమారు - వాఁగు = కుమారస్వామి సేన,భువనంబు- సమస్తమున్ = లోకమెల్ల, ఒక్కపాయ + కాన్ = ఒకే ఖండముగా నడచెన్

తాత్పర్యము. భూమి కాల్బంటులు, గుఱ్ఱములు ఏనుఁగులు అనువానితో నిండి యొప్పఁగా, ఆ పదాత్యాదులపై గొడుగులును, నెమలి యీఁకల కుచ్చులును, నిండఁగను, వానిపైఁ బతాకములును ప్రకాశింపఁగను, బ్రహ్మాండము నిండి ఒప్పఁగాఁ గుమారస్వామి సేన లోకమంతయు నొక్క ఖండముగా నడచెను

విశేషములు. అలంకారము అతిశయోక్తి, ఉత్ప్రేక్ష

క అన్నుల తిన్నని నవ్వులఁ
బ్రన్నిన ముఖచంద్రరుచులు పర్వఁగఁ దమపై
వెన్నెలఁ బయనము నడచిన
చెన్నున సుఖలీల నమరసేనలు నడచెన్ 26

అర్థము. అన్నుల = స్త్రీలయొక్క, తిన్నని = మనోజ్ఞములైన, నవ్వులన్ =నవ్వులచేత, ప్రన్నిన =ప్రన్నని? = అందమైన, ముఖ - చంద్ర - రుచులు = చంద్రునివంటి ముఖములయొక్క కాంతులు, తమపైన్, పర్వఁగన్ = వ్యాపింపఁగా, అమర - సేనలు = దేవతల సైన్యములు, వెన్నెలన్ = వెన్నెలయందు, పయనము - నడచిన - చెన్నునన్ = ప్రయాణమై నడచిన విధమున, సుఖ -లీలన్ = సుఖముగా, నడచెన్

తాత్పర్యము స్త్రీల మనోజ్ఞములైన నవ్వులచే సుందరములయిన ముఖ చంద్రకాంతులు తమపైఁ బ్రసరింపఁగా, దేవతల సైన్యములు వెన్నెలయందుఁ బయనించుచు నడచిన విధమున సుఖముగా నడచెను

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష

సీ భాషామృతంబులఁ బతుల చేతోభూమి
ననురాగబీజంబు లంకురింప
వదనేందుదీప్తుల వరుల మనోగత
స్నేహరసాబ్ధులు నిట్టగ్రమ్మ
రుచిరారుణాధరరుచుల నాత్మేశుల
హృత్ప్రణయాబ్జంబు లెలమి నమర
నిశ్శ్వాసదక్షిణానిలములఁ బ్రియచిత్త
గత మోహలత తిలకితము గాఁగ

ఆ ఘనపథశ్రమాంబుకణతతి రెట్టించె
ననఁగ భావసురతజనితఘర్మ
జలము వల్లభాంగముల నొప్ప నమరీ స
మేత మమరసేన ప్రీతి నడచె 27

అర్థము · భాషా + అమృతంబులన్ = వాక్కులనెడి అమృతములతో, పతుల = భర్తలయొక్క, చేతస్(ఃఁ) +భూమిన్ = మనస్సనెడి భూమియందు, అనురాగ - బీజంబులు = ప్రేమమనెడి విత్తనములు, అంకురింపన్ = మొలకలెత్తఁగను,

వదన + ఇందు - దీప్తులన్ = ముఖములనెడు చంద్రుల కాంతులచే,వరుల = భర్తలయొక్క మనస్(ఃఁ) + గత - స్నేహ - రస + అబ్ధులు = మనస్సునందలి ప్రేమరసమనెడి సముద్రములు, నిట్ట + క్రమ్మన్ = ఉప్పొంగఁగను

రుచిర + అరుణ + అధర - రుచులన్ = మనోహరములయిన ఎఱ్ఱని పెదవుల కాంతులచే, ఆత్మ + ఈశుల = తమ భర్తల, హృద్ + ప్రణయ + అబ్జంబులు = హృదయములందలి ప్రేమములనెడి తామరలు, ఎలమిన్ = వికాసముతో, అమరన్ = ఒప్పఁగను

నిశ్శ్వాస - దక్షిణ + అనిలములన్ - ఊర్పులనెడి దక్షిణపు గాలులచే, ప్రియ - చిత్త - గత - మోహ - లత = భర్తలయొక్క మనస్సులను బొందిన వలపనెడి తీఁగ, తిలకితము + కాఁగన్= పుష్పింపఁగను

ఘన - పథశ్రమ + అంబు -కణ - తతి = గొప్పదియగు మార్గాయాసము వలని చెమటబిందువుల సమూహము, రెట్టించెన్ + అనఁగన్ = రెట్టింపాయెననఁగా, భావ - సురత - జనిత - ఘర్మ - జలము = మానసికమైన రతివలనఁబుట్టిన చెమటనీరు, వల్లభ + అంగములన్ = భర్తల శరీరములందు, ఒప్పన్ = ఒప్పఁగా, అమరీ - సమేతము = దేవతాస్త్రీలతోఁ గూడినది అగు, అమర - సేన = దేవసేన, ప్రీతితోన్ = సంతోషముతో, నడచెన్

తాత్పర్యము వాక్కులనెడి అమృతములచే భర్తల మనస్సులనెడి భూమియందు ప్రేమబీజములు మొలకలెత్తఁగను, ముఖములనెడి చంద్రుల కాంతులచే భర్తల మనస్సులందలి ప్రేమరసమనెడి సముద్రము లుప్పొంగఁగను మనోహరములయిన యెల్లనిపెదవుల కాంతులచేఁ దమ భర్తల హృదయములందలి ప్రేమములనెడి తామరలు వికాసముతో నొప్పఁగను, ఊర్పులనెడి దక్షిణపు గాలులచే భర్తల మనోగతమైన వలపుఁదీఁగ తిలకితము కాఁగను, అధిక మార్గాయాసము వలని చెమటబిందువుల సమూహము రెట్టింపాయెననఁగా మానసికమైన రతి వలనఁ బుట్టిన చెమటనీరు భర్తల శరీరములందు ఒప్పఁగా దేవతాస్త్రీలతోఁగూడిన దేవసేన ప్రీతితో నడచెను

విశేషములు అలంకారము రూపకము, ఉత్ప్రేక్ష

క ఈ విధమున నుత్సాహము
తో వచ్చి సురారిదూత తొలి చెప్పిన యు
ద్ధావనిఁ గైకొని విడిసెను
దేవపతాకిని మహానదీతీరమునన్ 28

అర్థము. ఈ - విధమునన్, దేవ - పతాకిని = దేవసేన, ఉత్సాహముతోన్, వచ్చి, సుర+ అరి - దూత = రాక్షసుల రాయబారి, తొలి - చెప్పిన = మునుపుచెప్పిన, యుద్ధ + అవనిన్ = యుద్ధభూమిని, కైకొని = అంగీకరించి, మహానదీ - తీరమునన్ = గొప్పనదియొడ్డున, విడిసెను

తాత్పర్యము ఈ రీతిగా దేవసేన ఉత్సాహముతో వచ్చి రాక్షసదూత పూర్వము చెప్పిన యుద్ధభూమి నంగికరించి మహానది తీరమున విడిసెను

వ తదవసరంబున - తరువాతి పద్యముతో నన్వయము 29

సీ వాహనంబులు డిగ్గువారును, బన్నులు
విడుచువారును, దమ వీళు లెఱుఁగఁ
దమతమ చిహ్నాముల్ దనరఁగఁ బట్టించు
వారు, నొండొరుఁ బిల్చువారుఁ, జెలఁగి
గుళ్లు మండియలును గూడారములును బం
దిళ్లును గలయ నెత్తించువారు,
మడుగుల పొందుల మ్రోఁకుల నీడల
వెరవులఁ గనికని విడియువారుఁ,

తే బిఱుఁదఁ జిక్కినవారలఁ బిలువఁబోవు
వారు, నెడఁగని తోడ్కొని వచ్చువారు
వీళు లెఱుఁగక దెస దప్పి వెదకువారు,
నెటిఁగి తమతమ వీళ్లకు నేఁగువారు 30

అర్థము వాహనంబులు, డిగ్గు - వారును = దిగువారును, పన్నులు = ఎక్కుటకు సిద్ధము చేయునప్పటి రథాశ్వాదుల సవరణలు, విడుచువారును, తమ - వీళులు = తమ విడుదులు, ఎఱుఁగన్ = ఎఱుఁగుటకు, తమ - తమ, చిహ్నాముల్ = గుఱుతులు, తనరఁగన్ = ఒప్పునట్లు, పట్టించువారున్

ఒండొరున్ = ఒకరి నొకరు, పిల్చువారున్, చెలఁగి= ఒప్పి, గుళ్ళు = ఒక విధమైన గుడారములు, మండియలును = దుకాణమునకై వేసిన పాకలును, గూడారములును = గుడారములును, పందిళ్లును, కలయన్ = అంతటను, ఎత్తించువారున్ = వేయించువారును

మడుఁగుల - పొందులన్ = చెఱువులుండుచోట్లను, మ్రోఁకుల - నీడలన్ = చెట్ల నీడలందును, వెరవులన్ = ఆనుకూల్యములను, కనికని, విడియువారున్

పిఱుఁదన్ = వెనుక, చిక్కినవారలన్ = ఉండిపోయిన వారిని, పిలువన్ + పోవు - వారున్ = పిలుచుటకుఁ బోవువారును, ఎడన్ + కని = సమయము చూచి,

తోడ్కొని - వచ్చువారున్ = తీసికొని వచ్చువారును, వీళులు = శిబిరములు, ఎఱుఁగక = తెలియక, దెస + తప్పి = తప్పిపోయి, వెదకువారున్, ఎటిఁగి, తమతమ వీళ్లకున్, ఏఁగువారున్ = పోవువారును

తాత్పర్యము . ఆ సైనికులలోఁ గొంతమంది వాహనములనుండి దిగుచుండిరి కొందఱు ఏధాశ్వాదుల సవరణలు విడుచుచుండిరి తమ శిబిరములను గుఱుతించుటకై కొందఱు తమ తమ చిహ్నములను ఒట్టించుచుండిరి కొందఱు ఒకరి నొకరు పిలుచుచుండిరి గుడులు, మండియలు, గుడారములు, పందిరులు అంతటను వేయించువారు కొందఱు చెఱువులుండుచోటులను చెట్ల నీడలను వీలు చూచుకొని కొందఱు విడియుచుండిరి వెనుకఁబడినవారిని బిలుచుటకుఁ బోవువారు కొందఱు సమయము చూచి తీసికొని వచ్చువారు కొందఱు తమ శిబిరములు తెలియక తప్పిపోయి వెదకువారు కొందఱు ఎటిఁగి తమతమ శిబిరముల కరుగువారు కొందఱును - తరువాతి వచనముతో నన్వయము

వ అగుచు నవనీతలంబున నాకంబుఁ గట్టినట్లు నెరసి క్రిక్కిఱిసి విడిసి నిజేచ్ఛావిహారు లగుచుండి రట్టి యవసరంబున 31

అర్థము అగుచున్, అవనీ - తలంబునన్ = భూతలమునందు, నాకంబున్ = స్వర్గమును, కట్టిన + అట్లు = నిర్మించిన విధమున, నెరసి = వ్యాపించి, క్రిక్కిఱిసి, విడిసి, నిజ + ఇచ్ఛా - విహారులు = తమ యిష్టము వచ్చినట్లు విహరించువారు, అగుచున్ + ఉండిరి, అట్టి + అవసరంబునన్ = అట్టి సమయమున

తాత్పర్యము. అగుచు భూతలమునందు స్వర్గమును నిర్మించిన విధమున వ్యాపించి, క్రిక్కిఱిసి, విడిసి, స్వేచ్ఛగా విహరించుచుండిరి ఆ సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

సూర్యాస్తమయము

క శివుతనయు బల పదాహతిఁ
గవిసిన మెయి ధూళి పోవఁగడిగికొనంగాఁ
దివిరిచను కరణి నిజమతి
రవి రయమునఁ బశ్చిమాంబురాశికిఁ జనియెన్ 32

అర్థము. శివు - తనయు - బల - పద + ఆహతిన్ = ఈశ్వరుని కొడుకగు కుమారస్వామి యొక్క సైన్యముయొక్క పాదముల త్రొక్కిడిచే, కవిసిన =

క్రమ్మిన, మెయి - ధూళి = మేని దుమ్ము, పోవన్ = పోవునట్లు, కడిగికొనంగాన్ = కడిగికొనుటకై, నిజ-మతిన్ = తన మనస్సుతో, తివిరి = పూని, చను - కరణిన్ = పోవు విధమున, రవి = సూర్యుఁడు, రయమునన్ = శీఘ్రముగా, పశ్చిమ + అంబురాశికిన్ =పడమటి సముద్రమునకు, చనియెన్ = ఏఁగెను

తాత్పర్యము కుమారస్వామి సైన్యమునందలి సైనికుల కాలి త్రొక్కిడిచేఁ గ్రమ్మిన మేనిదుమ్మును బోవఁగడిగికొనుతలఁపుతో పూనిపోవు విధమున సూర్యుఁడు శీఘ్రముగాఁబడమటి సంద్రమున కేఁగెను

విశేషములు . మా రా కవి గారి ప్రతిలోను, వావిళ్ల వారి ప్రతిలోను గల 'నిజమతి' అను పాఠము సా ఱ ప్రతిలోని 'నిజగతి' అను పాఠముకంటె అన్వయయోగ్యముగా నుండుటచే నది గ్రహింపఁబడినది అలంకార ముత్ప్రేక్ష

వ అంత ననంతశయన సురాధీశ్వర దిగధీశ్వరాది భువనభవనాధీశ్వరులు తారకప్రభ నగ్గలించి వెలుంగు చంద్రప్రభాపటలంబులుం బోలెఁ గరదీపికా సహస్రంబుల నగ్గలించి మణిగణ భూషణ భూషితాంగప్రభా పటలంబులు వెలుంగు ననంత మండలిక మహాసామంత దండనాయకామాత్య భృత్యా ద్యఖిజన పరివృతులై రత్నాభరణంబుల మధ్యస్థితనాయకరత్నంబులునుం బోలె నిజైశ్వర్యప్రభావంబులం దేజరిలి తమ వేలంబులం బేరోలగంబుండి రట్టియవసరంబున సుభట కటకంబులం దంత వీర పురుషులు నిజాధీశ్వరులకు నుత్సాహంబుగా మహోత్సాహంబులు పలుక నభిముఖులై సభాక్షోభంబు వారించి 33

అర్థము . అంతన్, అనంతశయన - సుర + అధి + ఈశ్వర - దిశ్ (క్) అధి + ఈశ్వర + ఆది - భువన - భవన + అధి + ఈశ్వరులు = విష్ణువు, దేవేంద్రుఁడు, దిక్పాలురు మున్నగు లోకములనెడి యిండ్ల అధిపతులు, తారక - ప్రభన్ = నక్షత్రముల కాంతిచే, అగ్గలించి = అతిశయించి, వెలుంగు = ప్రకాశించునట్టి, చంద్ర - ప్రభా - పటలంబులన్ + పోలెన్ = చంద్రకాంతుల సమూహములవలె, కర - దీపికా - సహస్రంబులన్ = చేతి దివ్వెల వేలచే, అగ్గలించి = అధికమయి, మణి - గణ - భూషిత + అంగ - ప్రభా - పటలంబులు = రత్నముల సమూహముచే నలంకరింపఁబడిన మేని కాంతులు ప్రకాశించు, అనంత - మండలిక - మహాసామంత - దండనాయక + అమాత్య - భృత్య + ఆది - అఖిల - జన - పరివృతులు + ఐ = పెక్కండ్రు మండలాధీశులు, మహాసామంతులు,

సేనాధిపతులు, మంత్రులు, సేవకులు మున్నగునెల్లజనులచేఁ జుట్టఁబడినవారయి, రత్న + ఆభరణంబులన్ = రత్నాలంకారములందు, మధ్య - స్థిత - నాయక రత్నంబులునున్ + పోలెన్ = నడుమనున్న నాయకమణుల విధమున, నిజ + ఐశ్వర్య - ప్రభావంబులన్ = తమ సంపదల గొప్పతనములచే తేజరిల్లి = ప్రకాశించి, తమ - వేలంబులన్ = తమ శిబిరములందు, పేరు + ఓలగంబు + ఉండిరి = నిండుసభఁదీర్చిరి, అట్టి + అవసరంబునన్ = ఆ సమయమునందు, సుభట - కటకంబులందున్ = మంచి వీరుల శిబిరములందు, అంతన్, వీర - పురుషులు, నిజ + అధి + ఈశ్వరులకున్ = తమ నాయకులకు, ఉత్సాహంబు + కొన్ = ఉత్సాహము గలుగునట్లు, మహత్ (మహా) + ఉత్సాహంబులు = గొప్పఉత్సాహవాక్యములు, పలుకన్ = పలుకుటకు, అభిముఖులు + ఐ = అభిముఖులయి, సభాక్షోభంబు = సభయందలి కలకలమును, వారించి = ఆఁపి

తాత్పర్యము అంత విష్ణువు, దేవేంద్రుఁడు దిక్పాలురు మున్నగు జగత్ప్రభువులు నక్షత్రముల కాంతి నతిశయించిరి ప్రకాశించు చంద్రకాంతుల సమూహములవలె వేలకొలఁది చేతిదివ్వెలచే నధికమయి రత్నసముదాయము తోడి అలంకారములచేత నంకరింపఁబడిన శరీరముల కాంతిపుంజములు వెలుఁగు పెక్కురు మండలాధిపతులు, మహాసామంతులు, సేనాధిపతులు మంత్రులు, సేవకులు మున్నగు నెల్లవారిచేఁ జుట్టఁబడినవారయి మణిమయ భూషణముల నడుమనున్న నాయకమణులవలెఁ దమయైశ్వర్యమహిమలతోఁ బ్రకాశించి, తమ శిబిరములందు నిండుసభ దీర్చిరి అట్టి సమయమున సద్భటుల శిబిరములందు వీరపురుషులు తమ ప్రభువులకు ఉత్సాహము అగునట్లు మహోత్సాహవాక్యములు పలుకుట కున్ముఖులై సభ కలకలమును ఆఁపి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

కుమారస్వామి సేనయందలి వీరుల యుత్సాహవాక్యములు

భర్గుం డంతక వాహినుల్ శరహతిన్ భంజించునట్లమ్మొయిన్
దర్గంగా రధపత్రములో, విఱుగ వేదండాంకురానీకముల్,
నుర్గాడన్ భట కోరకంబు, లలరన్ నూత్నాశ్వపుష్పౌఘముల్
మర్గింతున్ బరసైన్యపద్మవనముల్ మద్బాణవర్షంబునన్ 34

అర్థము . భర్గుండు - శివుఁడు, అంతక - వాహినుల్ = యముని సేనలను, శర - హతిన్ = బాణముల దెబ్బచే, భంజించు + అట్లు = సంహరించు

ఎధమున, - వాహిని యనఁగా నది, శర = జలముల, హతిచే = నాశనముచే, ఒంజింపఁబడు నను స్వారస్యమును గ్రహించినది అమ్మెయిన్ = ఆ + మెయిన్ = ఆ రీతిగా, రథ - పత్రములన్ = రథము లనెడి ఆకులు, తర్గంగాన్ = తఱుగఁగా, వేదండ + అంకుర + అనీకములన్ = ఏనుఁగులనెడి మొలకల సమూహములు, ఎఱుగన్ =ఎఱుగఁగా, భట - కోటకంబులు = భటులనెడి మొగ్గలు, నుర్గాడన్ = నుగ్గాడఁగా - నుగ్గుకాఁగా, నూత్న + అశ్వ - పుష్ప + ఓఘములన్ = క్రొత్తనైయగు గుఱ్ఱములనెడి పూల సమూహములు, అలరన్, విరియఁగా, - పిచ్చిపోఁగా, మత్ + బాణ - వర్షంబునన్ = నా బాణములనెడి వర్షముచే, పర - సైన్య - పద్మ - వనముల్ = శత్రువుల సైన్యములనెడి తామరతోఁపులను, మ్రగ్గింతును - నశింపఁజేయుదును

తాత్పర్యము శివుఁడు యముని సైన్యములను బాణముల దెబ్బచే నశింపఁజేయునట్లు రథములనెడి ఆకులను దఱుగఁగా, ఏనుఁగులనెడి మొక్కల గుంపులు ఎఱుగఁగా, భటులనెడి మొగ్గలు నూగు కాఁగా, నూత్నాశ్వము లనెడి పూలు విరియఁగా నా బాణము లనెడి వర్షముచే శత్రుసైన్యములనెడి తామరతోఁపులను మ్రగ్గింతును

విశేషములు అలంకారము రూపకము వేదండ - వేద +అండ - సామవేదమునుండి పుట్టినది - ఏనుఁగు ఇది శకంధ్వాదుల లోనిది పరరూపసంధి 'వేద' లోని చివరియచ్చు లోపించును తర్గు - తఱుగు, - నుర్గు - నుగ్గు మర్గింతున్ - మ్రగ్గింతున్ - వర్ణవ్యత్యయము వలపలగిలకవ్రాత సంప్రదాయముచే భర్గుండు - భగ్గుండు, తర్గంగా - తగ్గంగా మాఱి కేవల ద్విత్వ గకారముతోఁగూడిన 'నుగ్గాడన్', మ్రగ్గింతు' అనువానితోఁ బ్రాసమైతి కుదిరినది ఇట్టి ప్రాసము శివకవి సాంప్రదాయికము పాల్కుఱికి సోమనాధాదులు దీనిని బ్రయోగించిరి పుష్పౌఘ - పుష్ప + ఓఘ - వృద్ధి సంధి

మ **మదనాగంబులు చేతులెత్తి పఱవన్, మార్పెట్ట కాపన్నులై**
యెదురం గాల్కొని నిల్వ కుక్కడఁగి వెన్నీఁ గాల్వ రుగ్రాశ్వికుల్
బెదరంగా, రథికుల్ విభిన్నమతి మద్భీతాత్ములై క్రమ్మఱన్
గుదియింతుం బరసేన నొక్కమెయి మత్కుంతాహతిం బోరిలోన్ 35

అర్థము. మద - నాగంబులు = మదించిన యేనుఁగులు, చేతులు + ఎత్తి, తొండములు పయికెత్తి, పఱవన్ = పరువులెత్తఁగా, కాల్వరు = కాలిబంటులు,

మార్పెట్టక = ప్రతిఘటింపక, ఆపన్నులు + ఐ = ఆపద నొందినవారయి, కాల్కొని = కాలు + కొని = కాలూని, ఎదురన్ = మార్కొనుటకు, నిల్వక = నిలువక, ఉక్కు + అడఁగి = బలము నశించి, వెన్నీన్ - వెన్ను+ ఈన్ = వెన్నీఁగా - వెన్ను చూపఁగా, ఉగ్ర + ఆశ్వికుల్ = భయంకరులైన రౌతులు, బెదరంగాన్ = భయపడఁగా, రథికుల్ = రథమునందుండి యుద్ధము చేయువారు, విభిన్నమతిన్ = విఱిగిన మనస్సుతో - ధైర్యమును గోలుపోయి, మత్ + భీత + ఆత్ములు + ఐ = నావలన భయపడినవారయి, క్రమ్మఱన్ = మరలిపోఁగా, పర - సేనన్ = శత్రుసేనను, పోరిలోన్ = యుద్ధములో, మత్ + కుంత + ఆహతిన్ = నా బల్లెపు దెబ్బచే, ఒక్క మెయిన్ = ఒక్క విధముగా, ఒక్కమాఱుగా, కుదియింతున్ = అణఁచివైతును

తాత్పర్యము మదగజములు తొండములెత్తుకొని పరువులిడఁగా కాల్బంటులు ప్రతిఘటింపక ఆపదనొందినవారయి కాలూని యెదిరింప నిలువక బలముచెడి వెన్నుచూపఁగా భయంకరులైన ఆశ్వికులు బెదరఁగా, రథికులు ధైర్యమును గోలుపోయి నా వలన భయపడినవారయి మరలిపోఁగా, నేను యుద్ధములో నా కుంతాయుధపు చెబ్బచే నొక్కపెట్టున శత్రుసేనను అణఁచివైతును

క తల లెన్ని యరయుచుం బ్రతి
బల మంతయు మర్ది బయలువడఁ బొలికల న
గ్గలముగ జీరము నుఱిపిన
కల నున్నట్లుండఁ బొడుతుఁ గడికండలుగాన్ 36

అర్థము: తలలు, ఎన్ని =లెక్కించి, అరయుచున్ = చూచుచు, ప్రతి - బలము + అంతయున్ = శత్రుసేన యంతయును, మర్ది = మ్రగ్గి, పొలికలను = యుద్ధభూమి, అగ్గలముగన్ = అధికముగా, జీరమున్ + ఉఱిపిన -కలన్ =కత్తితో ఖండించిన విధమున, బయలు + పడన్ = కనఁబడఁగా, ఉన్న + అట్లు + ఉండన్ = ఒక్కసారిగా, కడికండలు + కాన్ = ముక్కలు ముక్కలుగా, పొడుతున్

తాత్పర్యము. శత్రుసైన్యమున నున్న వీరులను లెక్కించి వా రందఱును మ్రగ్గి యుద్ధభూమి కత్తితో ఖండించిన విధమునఁ గనఁబడ నున్నటులుండఁగా ముక్కలుముక్కలుగాఁ బొడుతును

విశేషములు: జీరము నుఱిపిన కలన్ = కత్తితో ఖండించిన విధమున - 'జడంబు తృతీయాసప్తములకు ద్వితీయ బహుళంబుగానగు' బాల కాగ్రక 22 కాని జీరము ఉదంతమగుటచే దాని తృతీయకు ద్వితీయ బహుత్వమందె

కావలయును 'బాహుళకముచే నిక్కార్యం బుదంతంబునకు బహుత్వమందె యగు కాని యిట ఏకవచనముననే యగుట విశేషము ఉఱుపు ధాతువుగూడ సూ ని లో లేదు కల = విధము?

తే పోరఁ బాఁ కుదల్చి నీరు గొన్నటు ప్రతి
బలము నెల్లఁ బాయవడఁగఁ దోలి
గొడుగు క్రింది రూపుఁ బొడిచి జయంబు నీ
కిత్తు నధిప! నన్ను నింత నమ్ము 37

అర్థము .అధిప = ప్రభూ! పోరన్ = యుద్దమునందు, పాఁకున్ = నాఁచును, ఉదల్చి = విడిచి, నీరు + కొన్న + అటు = నీటిని గ్రహించినట్లు, ప్రతి - బలమున్ + ఎల్లన్ = శత్రుసైన్యమునంతను, పాయ + పడఁగన్ = విచ్చిపోవునట్లు, తోలి, గొడుగు - క్రింది - రూపున్ = గొడుగు క్రింద నున్నవానిని - సేనాపతిని, పొడిచి, జయంబున్ = గెలుపును, నీకున్, ఇత్తున్, నన్నున్, ఇంత, నమ్ము = నమ్ముము

తాత్పర్యము ప్రభూ! యుద్దమున నాఁచును వదలి నీటిని గొనిన విధమున శత్రుసైన్యమంతయు విచ్చిపోవునట్లు తోలి, సేనాపతిని వధించి నీకు జయమును గూర్తును నన్ను ఇంత నమ్ముము

విశేషములు గొడుగు క్రింది రూపు - గొడుగును ధరించుట జయ చిహ్నము గొడుగు క్రింది వాఁడు - సేనాపతి నమ్ము - నమ్ముము - 'మధ్యమపురుష ముపవర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు ' బాల సంధి 47

ఈ పద్యము శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంస్కరణము ననుసరించి వ్యాఖ్యానింపఁబడినది 'శైవలం కిల విహాయ నిర్మలం కేవలం కిల జలం ను పీయతే' అను యోగవాసిష్ఠశ్లోకము ననుసరించినది

చ అలఘువిరోధిసైన్యవిపులాబ్ధి మహత్పరిఘాగ్రమందరా
చలవృతమద్భుజాహిపతి సంతతనిర్మథనప్రభూత స
ల్లలిత విభాతి నాజి జయలక్ష్మి నిజంబుగ నీకు నిత్తు దో
ర్బలమున నింత నమ్ముమని వల్కె భటుం డొకరుండు దండియై 38

అర్థము. అలఘు - విరోధి - సైన్య - విపుల + అబ్ధిన్ = తక్కువ కాని, శత్రుసైన్యమనెడి మహా సముద్రమును, మహత్ + పరిఘా + అగ్ర - మందర + అచల - వృత - మత్ + భుజ + అహి-పతిన్ = గొప్పదియగు, ఇనుపగుదియ యొక్క కొన అనెడి మందరపర్వతమును జుట్టుకొన్న నా భుజ మనెడి సర్పరాజుతో - వాసుకితో, సంతత - నిర్మథన - ప్రభూత - పల్లలిత - విభాతిన్= ఎడతెగని త్రచ్చుట వలనఁ బుట్టిన మనోహరమైన విశేషకాంతి గలదానిని, ఆజి - జయ - లక్ష్మిన్ = యుద్ధజయమనెడి లక్ష్మిని, దోస్ (ఃస) + బలమునన్ = భుజశక్తిచే, నిజంబుగన్, నీకున్, ఇత్తున్, ఇంత, నమ్ముము, అని, భటుండు, ఒకరుండు, దండి+ఐ = శూరుఁడయి, పల్కెన్

తాత్పర్యము. 'అధికమైన శత్రుసైన్యమనెడి మహాసముద్రమును గొప్ప పరిఘాయుధపుఁగొన యనుమందరపర్వతమును జుట్టుకొన్న నా భుజమనెడి వాసుకితో నిరంతరము మథించుటవలనఁ బుట్టిన విశేషకాంతిగల యుద్ధజయమనెడి లక్ష్మిని నిజముగా నా భుజశక్తిచే నీకుఁ గూర్తును నమ్ము' మని యొక భటుఁడు శూరుఁడయి పలికెను

విశేషములు. అలంకారము రూపకము దోర్బలము - దోస్ + బలము - పదాంత సకారమునకు విసర్గము దోఃస + బలము - అ, ఆలు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుగాని మృదుహల్లులుగాని పరములగునపుడు రేఫ మాదేశమగును అమృతముకొఱకు దేవదానవులు క్షీరసముద్రమును మందరపర్వతమును గవ్వముగాఁజేసికొని మథింపఁగా నందుండి లక్ష్మి యుద్భవించిన వృత్తాంత మిట అనుసంధేయము

క. మాటల యట్టిది యగునే
పో టను లోకంబు పలుకు బొంకించెద నే
మాటలకంటెను నని నా
పో టగ్గల మింత నమ్ము భూభుజ నన్నున్ 39

అర్థము. భూ - భుజ = ఓ రాజా!, పోటు = దెబ్బ, మాటల + అట్టి + అది + అగునే = మాటలవంటిది యగునా? అను, లోకంబు - పలుకు = లోకోక్తిని, ఏన్ = నేను, బొంకించెదన్ = అసత్యము గావింతును, అనిన్ = యుద్ధమునందు, మాటలకంటెను, నా -పోటు, అగ్గలము = అధికము, నన్నున్, ఇంత, నమ్ము(ము)

తాత్పర్యము ఓ రాజా ! పోటు మాటలవంటిది కాదు అను లోకములోని మాటను నే నసత్యము గావింతును యుద్ధమున నా పోటు మాటలకంటెను అధికము నన్ను ఇంత నమ్ముము

విశేషములు. అట్టిది - అట్టి + అది = 'అది యవి' శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు బాల సం 45 నమ్ము భూభుజ - హల్లుపరమగుచుండఁగా మధ్యమపురుష ముపవర్ణకమునకు లోపము బాల సంధి 47

సీ కనుచూడ్కిఁ దునియలుగా నేయు విలుకానిఁ
గవిదలఁ బడవైచు సవడికానిఁ
గొని మిట్టిపడవైచు కొంతంబుకాని బి
ట్టెడ లుచ్చిపోవైచు నీఁటెకానిఁ
గడిఖండముగఁ జేయు గడితలవాని జ
ర్జరితంబుగాఁ బొడ్చు చురియవాని
నెంప నుర్వుడుసేయు నేనికకాని ము
క్కోయ్యలు వడ వ్రయ్యుగుంటుకాని

ఆ మిగుల నిన్ను నన్ను మిగులుదు మనువారి
మిగిలి మాఱు వీట మిగిలి వచ్చు
మగల నెల్ల నేను మగిడింతు నెక్కటి
వీరుఁ డనఁగ రెండు వీల్లయందు 40

అర్థము. కనుచూడ్కిన్ = కంటిచూపులో, తునియలు + కాన్ = ముక్కలుగా, ఏయు = కొట్టునట్టి, విలుకానిన్, కవిదలన్ = తాఁకుచే, పడన్ + వైచు = పడవేయునట్టి, సవడి - కానిన్ = సవడి అను ఆయుధవిశేషముగలవానిని

కొని = పట్టుకొని, మిట్టిపడన్+ వైచు = ఎగిరిపడఁగొట్టునట్టి, కొంతంబుకానిన్ = కుంతమనెడి ఆయుధముగలవానిని, బిట్టు = శీఘ్రముగా, ఎడలు + ఉచ్చి - పోన్ + వైచు = గుండెలు దూసికొనిపోవఁగొట్టు, ఈఁటెకానిన్ = ఈఁటెగలవానిని,

కడిఖండముగన్ = ముక్కలు ముక్కలుగాఁ జేయు, గడితలవానిన్ = పొడిచెడు నాయుధవిశేషముగలవానిని, జర్జరితంబు + కాన్ = తూఁటులు పడునట్టులుగా, పొడ్చు = పొడుచునట్టి, చురియకానిన్ = చురకత్తి గలవానిని

ఎంపన్ + ఉర్వుడు + చేయు = ఎముకను పిండిగొట్టునట్టి, ఏనిక కానిన్= ఏనిక అనునాయుధవిశేషముగలవానిని, ముక్కొయ్యలు + పడన్ = మూఁడుముక్కలగునట్లు, వ్రయ్యు = చీల్చునట్టి, గుంటుకానిన్ = గుంటు అనునాయుధమును దాల్చిన వానిని

మిగులన్ = అతిశయించునట్లు నిన్నున్, నన్నున్, మిగులుదుము = అతిశయింతుము, అనువారిన్, మిగిలి = అతిశయించి, మాఱు - వీటన్ =శత్రు శిబిరమునందు, మిగిలి - వచ్చు = అతిశయించివచ్చునట్టి, మగలన్ + ఎల్లన్ = శూరుల నందఱను, నేను, రెండు - వీళ్లయందున్ = రెండు శిబిరములందును, ఎక్కటి వీరుఁడు + అనఁగన్ = అసహాయశూరుఁడనునట్లు, మగిడింతున్ = మరలింతును

తాత్పర్యము. కంటిచూపుతోనే ముక్కలుగా నేయు విలుకానిని, తాఁకుచేఁ బడఁగొట్టు సవడి అను ఆయుధము గలవానిని, పట్టుకొని యెగిరిపడవైచు కుంతాయుధము గలవానిని, శీఘ్రముగా గుండెలు దూసికొని పోవునట్లు కొట్టు ఈఁటె గలవానిని, ముక్కలు ముక్కలుగాఁ జేయు గడితల అను నాయుధభేదము గలవానిని, తూఁటులుపడునట్లు పొడుచు చురకక్తి గలవానిని, ఎముకలను బిండిగొట్టు ఏనిక అను ఆయుధవిశేషము గలవానిని, మూఁడుముక్కలగునట్లు చీల్చు గుంటు అను ఆయుధము గలవానిని, అతిశయింప నిన్నును నన్నును అతిశయింతు మనువారి నతిశయించి, శత్రుశిబిరమున నతిశయించి వచ్చు శూరుల నందఱను రెండు శిబిరములందును అసహాయశూరుఁడనునట్లు నేను మరలింతును

వ అని యనేకప్రకారంబులం బలుకుచుండి రంత నందుఁ గొందఱు వీరభటోత్తము లాత్మీయాంతరంగాపూరితాపారవీరరసంబు వెల్లిగొలుపునట్లు వీరఘోషంబునఁ దమతము నిశ్చయించిన వీరవృత్తిఁ బ్రకటించుచు 41

అర్థము: అని, అనేక -ప్రకారంబులన్, పలుకుచున్ + ఉండిరి, అంతన్, అందున్, కొందఱు, వీర - భట +ఉత్తములు = వీరులైన భటశ్రేష్ఠులు, ఆత్మీయ + అంతరంగ + ఆపూరిత + అపార వీరరసంబు = తమవైన మనస్సులందు నిండిన అధికమైన వీరరసము, వెల్లి + కొలుపు +అట్లు = ప్రవాహము కట్టించునట్లు, వీర - ఘోషంబునన్ = వీర ప్రకటనమున, తమ - తమ - నిశ్చయించిన = తాము తాము నిశ్చయించిన, వీర - వృత్తిన్ = వీర వర్తనమును, ప్రకటించుచున్

తాత్పర్యము అని పెక్కురీతులఁ బలుకుచుండిరి అంత అందుఁ గొందఱు వీరభటశ్రేష్ఠులు తమ అంతరంగములందు నిండిన అపారమైన విరసమును ప్రవాహము కట్టించునట్లు వీరఘోషమునఁ దాము నిశ్చయించి విక్రవర్తనమును బ్రకటించుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ మునుమిడి వైరివాహినుల ముట్టి విడల్పడ వ్రేసినట్టి క్రైఁ
పునఁ బయికెత్తు వాహకుల పొంక మఱంద కొంత గోసి ము
న్కొని వడిఁ బాఱు పందలను గోవెల సూరెలఁ దోలి మార్చుపే
ర్పునఁ బతికెత్తి కేల్గలన జొన్నలు గొన్న ఋణంబు నీఁగుదున్ 42

అర్థము మునుమిడి = మార్కొని, వైరి - వాహినులన్ = శత్రుసేనలను, ముట్టి = పట్టుకొని, విడల్పడన్ = విడిచిపోవునట్లు, వ్రేసిన + అట్టి - క్రైపునన్ = కొట్టినయుద్రేకమున, పయికిన్ + ఎత్తు = మీఁదికి దండెత్తునట్టి, వాహకుల - పొంకము = వాహనములపైనుండువారి గర్వము, అఱన్ = నశించునట్లు, తల, కొంత, కోసి, మున్కొని (మును + కొని) = ముందయి, వడిన్ = వేగముగా, పాఱు = పాఱిపోవు, పందలను = పిఱికివారిని, కోవెల - సూరెలన్ = గుడిప్రక్కలను, తోలి, నూర్చు = నలఁగఁగొట్టు, పేర్చునన్ = అతిశయమున, పతికిన్, యజమానుని కొఱకు - రాజుకొఱకు, ఎత్తి = దండెత్తిపోయి, కేల్గలనన్ (కేలు + కలనన్) =చేతియుద్దమున, జొన్నలు, కొన్న ఋణంబున్, ఈఁగుదున్ = తీర్చెదను

తాత్పర్యము రాజుకొఱకు శత్రుసేనలను జేతియుద్దమున మార్కొని పట్టుకొని విడిచిపోవునట్లు కొట్టిన కోపమునఁ బైపైకి వచ్చు వాహకుల గర్వము నశింపఁ దలను గొంత కోసి ముందుగా వేగముగాఁ బాఱిపోవు పిఱికిపందలను గుడి ప్రక్కలకుఁ దోలి నలఁగఁగొట్టి జొన్నలుగొన్న అప్పును దీర్తును

విశేషములు . ఈ పద్యభావ మంత సుగమముగా లేదు రాజులు సైనికులకు జొన్నలను ఋణముగా నిచ్చుట యానాఁటి యాచార మయియుండవచ్చును

క ఒడ లోమి పెద్దకాలం
బడవులఁబడి కాయగూర లాహారముగా
నడిపిన తపఃఫలం బొక
గడియం గొందు రదె యెదిరికదనములోనన్ 43

అర్థము. ఒడలు = శరీరము, ఓమి = రక్షించి, పెద్ద - కాలంబు = ఎంతో కాలము, అడవులన్ + పడి, కాయ + కూరలు, ఆహారము + కాన్, నడపిన, తపస్ (ః) + ఫలంబు, అదె, ఎదిరి - కదనములోనన్ = శత్రువులతోడి యుద్ధమున, ఒక - గడియన్, కొందురు

తాత్పర్యము . శరీరమును రక్షించుకొనుచు ఎంతో కాలము అడవులందుండి కూరగాయలు ఆహారముగాఁ జేసిన తపస్సువలని ఫలమును శత్రువులతోడి యుద్ధమున నొక గడియలోఁ గొందురు

చ పుడమిపుఁడున్, ధనాఢ్యుఁడును, భూరిబలుండును, శౌర్యవంతుఁడన్
గడు దృఢపాణియు న్నయినఁగాని యెడంబడఁ డశ్వమేధ మెం
దడరఁగఁజేయఁ దన్మఖమునందుల పుణ్య ఫలంబులందఁగా
నడుగడు గశ్వమేధ మగు నాజిమొనం జని చావుసేగియే? 44

అర్థము. పుడమిపుఁడున్ = భూపుఁడును - రాజును, ధన + ఆఢ్యుఁడును, ధన సమృద్ధుఁడును, భూరి - బలుండును = అధికమయిన బలము గలవాఁడును, శౌర్యవంతుఁడున్ = పరాక్రమవంతుఁడును, కడున్ - దృఢపాణియున్ = మిక్కిలి దృఢమైన చేతులు గలవాఁడును - మిక్కిలి భుజబలము గలవాఁడును, అయినన్ + కాని = అయిననే తప్ప, ఎందున్ = ఎక్కడనైనను, అడరఁగన్ = అతిశయించునట్లు, అశ్వమేధము = అశ్వమేధయాగము, చేయన్ = చేయుటకు, ఒడఁబడఁడు = అంగీకరింపఁడు, తద్ + మఖమునందుల = ఆ అశ్వమేధ యాగము నందలి, పుణ్య-ఫలబులు, అందఁగాన్ = అందుటకు, అడుగడుగు = మాటిమాటికి, అశ్వమేధము, అగు + అజి - మొనన్ + చని - చావు = అశ్వమేధమగునట్టి యుద్ధముఖమున మరణించుట, సేగియే = నష్టియా ?

తాత్పర్యము . రాజును, ధనసమృద్ధుఁడును మిక్కిలి బలవంతుఁడును, పరాక్రమవంతుఁడును బాహుబలసంపన్నుఁడును అయిననే కాని ఎచ్చట నైనను అశ్వమేధయాగము చేయుటకు సమ్మతింపఁడు యుద్ధమరణము ఆ అశ్వమేధ యాగ పుణ్యఫలము నడుగడుగునను ఇచ్చును అందుచే దానివలన నష్టమా? లే దనుట

విశేషములు . పుడమిపుఁడు - శైవకవులు ఇట్టి వైరిపదములను వాడిరి దృఢపాణియున్ + అయిన - 'కొన్నియెడలఁ బ్రామాణికప్రయోగంబులం ద్రుతంబునకచ్చు పరంబగుచో ద్విత్వంబు చూపట్టెడి' ప్రౌఢ సంధి 3 తన్మఖము - తద్ + మఖము - అనునాసిక సంధి అందుల = అందున్న, అందుఁగల

క ఈ వలయు నర్థ మిచ్చియు
సేవకు మన్నింపవలయు జితమతి విభుఁ డా
యీవికి మన్ననకుం దగఁ
జావలయు భటుండు పతికి జయముగఁ బోరన్ 45

అర్థము. జితమతి - విభుఁడు = జయింపఁబడిన [illegible] అగు రాజు, ఈ - వలయు + అర్థము = ఒసఁగవలసిన ధన[illegible]యున్ = ఇచ్చియున్, సేవకున్ = సేవకుని, మన్నింపవలయిన్ = ఆదరింపవలయును, ఆ + ఈవికిన్ = ఆ ఔదార్యమునకును, మన్ననకున్ = ఆదరమునకును, తగన్ = తగునట్లు, భటుండు = సేవకుఁడు, పతికిన్ = రాజునకు, జయముగన్ = జయమగునట్లు, పోరన్ = యుద్ధమునందు, చావలయున్ = మరణింపవలయును

తాత్పర్యము. మెప్పింపఁబడిన మనస్సు గలరాజు తా నీ వలసిన ధనమునిచ్చి సేవకు నాదరింపవలయును సేవకుఁడును ఆ యౌదార్యమునకు, ఆదరమునకుఁ దగినట్లు ప్రభువునకు జయము అగునట్లు యుద్ధమునఁ జావవలయును

విశేషములు చావలయు - చాన్ + వలయు' - చచ్చు + నుజి +వలయు (ముత్తు పరంబగునపుడు) 'చావు నోవులు చచ్చు నొచ్చులికగు' బాల క్రి 94 చావు + నుజి - వలయు 'జీత్తు పరంబగునపుడు వాని వువర్ణంబు విభాషను లోపించు' బాల క్రి 95 చావలయు, చావ వలయు

ఆ పాడవు చూడ మగల పొల్లలు నాళుల
పొల్లలును నిజంబుపోలె నుండుఁ
గలనఁ దూఱి నెత్తఁగాఁ బోరు నప్పుడ
కాని చూచి యెఱుఁగఁ గాదు మున్ను 46

అర్థము. పాడవు - చూడన్ = స్వరూపము చూడఁగా, మగల - పొల్లలున్ = శూరులలోఁ బనికిమాలినవారును, ఆళుల - పొల్లలును = సేవకులలోఁబనికి మాలినవారును, నిజంబు +అ + పోలెన్ = నిజమయిన వారే అనునట్లు, ఉండున్ = ఉందురు, కలనన్ = యుద్ధముఏనందు, తూఱన్ + ఎత్తఁగాన్ = మిక్కిలి ఎత్తఁగా, శత్రువులు దండెత్తఁగా, పోరు + అప్పుడు + అ + కాని = యుద్ధము చేయునప్పుడే కాని, మున్ను = ముందు, చూచి, ఎఱుఁగన్ + రాదు = తెలియరాదు

తాత్పర్యము శూరులలోఁ బనికిరానివారును, సేవకులలోఁ బనికి రానివారును స్వరూపమును జూడఁగా నిజమైన వారుగానే కనఁబడుదురు యుద్ధమున శత్రువులు దండెత్తి రాఁ బోరునపుడేకాని ముందుగాఁ జూచి తెలియరాదు

విశేషములు. పెల్ల - పెల్లు (రూ) కలనన్ -కలను+అందున్ 'ఔప విభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు 'బాల ఆచ్చిక 38 కలను + అన్ - అంద్వవవగాగమ సంధి (బాల సం 11) చే కలనన్

చ తన కని దాఁప కర్థికి సుధామయపక్వఫలంబు లిచ్చు, నో
లినఁ కొను దావవహ్నికి జలింపక మార్కొని నిల్చి కాలు, నీ
మనుజులు కొంద ఱా యడవిమ్రాఁకులకంటెను గష్ట, మర్థి వే(
డిన ఫలమీయఁజాల, రరి డీకొని తాఁకిన నిల్వఁజాలరున్ 47

అర్థము. అడవి మ్రాను - కర్త అధ్యాహార్యము తనకున్ + అని = తన కొఱకని, దాఁపక = దాఁచుకొనక, అర్థికిన్ = యాచకునకు, సుధా - మయ - పక్వ-ఫలంబులు = అమృతమయములయిన పండిన పండ్లు, ఇచ్చున్, ఓలిన్ + అ - కొను = క్రమముగా నాక్రమించు, దావ -వహ్నికిన్ = కార్చిచ్చునకు, చలింపక = కదలక, మార్కొని = ఎదురుకొన, నిల్చి కాలున్, ఈ - మనుజులు - కొందఱు, ఆ + అడవి - మ్రాఁకులకంటెను = ఆ అడవి చెట్ల కంటెను, కష్టము = నికృష్టులు, అర్థి = యాచకుఁడు, వేఁడినన్ = వేఁడుకొన్నను, ఫలము, ఈయన్ + చాలరు = ఈ లేరు, అరి = శత్రువు, డీకొని = తాఁకినన్ ఎదిరించి దండెత్తినను, నిల్వన్ + చాలరున్ = నిలువఁజాలరు కూడ

తాత్పర్యము. అడవిలోని చెట్లు తమ కొఱకని దాఁచికొనక యాచకునకు అమృతమయములైన పక్వఫలము లిచ్చును క్రమముగా నాక్రమించు కార్చిచ్చునకుఁ జలింపక ఎదుర్కొని నిలిచి కాలును కొందఱు మనుష్యులు ఆ అడవిచెట్ల కంటెను నికృష్టులు వారు యాచకుఁడు వేఁడినను ఫలము నొసఁగఁజాలరు యుద్ధమున శత్రువు దండెత్తి నప్పుడు నిలువఁజాలరును

విశేషములు. అలంకారము కావ్యలింగము ఉపమేయమైన మనుజులకంటెను, ఉపమానమైన అడవిమ్రాఁకుల కాధిక్యము చెప్పఁబడినది కావున వ్యతిరేకమును మ్రాను + లు = మ్రాఁకులు 'కలన్వాదుల ను వర్ణంబు కుజ్జగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల ఆచ్చిక 18 మ్రా + కుజ్ + లు 'జిత్తు బిందు పూర్వంబగు' మ్రాఁకులు బాల తత్సమ 19

క ఈ ననియె తలఁచుఁ జాగియు
నీన నియ తలంచు లోభి యెప్పుడు ననికిన్
జా ననియ తలఁచు వీరుఁడు
జా ననియ తలంచుఁ బంది సరి యెట్లగునో ? 48

అర్థము. ఎప్పుడున్ = ఎప్పుడును, చాగియున్ = త్యాగియును, ఈన్ + అనియె = ఇచ్చుటకొఱకు అనియే, తలఁచున్, లోభి, ఈను + అనియ = నేను ఈను (ఒసఁగను), అనియ = అని + అ = అనియె, తలంచున్, విరుఁడు, అనికిన్ = యుద్ధమునకు, చాన్ + అని + అ = చచ్చుట కొఱకనియే, తలఁచున్, పంద = పిటికివాఁడు, చాను + అని + అ = చావను అనియే, తలంచున్, సరి= సమానము, ఎట్లు + అగునో = ఏ విధముగా నగునో?

తాత్పర్యము. ఎప్పుడును త్యాగి ఇచ్చుటకొఱకే తలఁచును లోభి నేను ఈను అనియే తలఁచును వీరుఁడు యుద్ధమునఁ జచ్చుటకనియే తలఁచును పిటికివాఁడు 'నేను చావను' అనియే తలఁచును అట్టిచో వారు ఒకరొకరికి సరియెట్లగుదురు?

విశేషములు ఇచ్చు ధాతువు 'తుమర్థ భావలక్షణంబులందు నుజి యగు ' బాల క్రి 40 ఇచ్చు + నుజి 'ఇచ్చునకు సర్వంబున కీ యగు ' బాల క్రి 92 ఈను = ఇచ్చుట కొఱకు ఇచ్చు ధాతువు 'వ్యతిరేకంబున లజి యగు' బాల క్రి 7 ఇచ్చు + లజి 'లకారంబునకు డుడ్రువురును ముష్ణగు ' బాల క్రి 8 ఇచ్చు + ను 'ఇచ్చునకు సర్వంబున కీ యగు ' బాల క్రి 92 ఈను = ఈయను (నేను ఒసఁగను) ఇట్లే 'చచ్చు' నకు 'నుజి' పరముచేసియు, లజి పరము చేసియు రూపములను సాధింపనగును

చ అరిబల మంటఁదాఁకిన రయంబున నాత్మబలంబు వీఁగుచోఁ
దెరలఁగనీక త్రోచి పయిఁ దేఁకువ వచ్చు విరోధిసేనలన్
మరలఁగఁ దోలుచో నిలిచి మార్కొను వీరులఁదాఁకి వీఁక జ
ర్జరితముగాఁ బడంబొడిచి చంపక చిత్తముకైపు పోవునే ? 49

అర్థము అరి - బలము = శత్రుసేన, అంటన్ + తాఁకినన్ = ముట్ట నెదిర్చినచో, రయంబునన్ = శీఘ్రముగా, ఆత్మ - బలంబు = మనోబలము -

ధైర్యము, వీఁగుచోన్ = చలించినచో, తెరలఁగన్ + ఈక = చెదరనీక, త్రోచి = ప్రోత్సహించి, పయిన్ = మీఁద, తేఁకువన్ = సాహసముతో, వచ్చు, విరోధిసేనలన్ = శత్రు సేనలను, మరలఁగన్ + తోలుచోన్ = మరలిపోవునట్లు తోలునప్పుడు, నిలిచి, మార్కొను - వీరులన్ = ఎదుర్కొను వీరులను, తాఁకి = ముట్టి, వీఁకన్ = పరాక్రమముతో, జర్జరితము + కాన్ = తూఁటులుపడునట్లు, పడన్ = పడునట్లు, పొడిచి, చంపక, చిత్తము - కైఁపు =కోపోద్రేకము పోవునే?

తాత్పర్యము : శత్రుబలము దండెత్తి వచ్చినప్పుడు మనోధైర్యము చలించుచోఁ జెదరనీక, మీఁదికి సాహసముతో వచ్చు శత్రుసేనలను మరలిపోవఁదోల నిలిచి, ఎదిరించు వీరులను దాఁకి పరాక్రమముతోఁ దూఁటులుపడునట్లు పొడిచి చంపకున్నచో కోపోద్రేకము ఆఁగునా?

వ అని యనేకప్రకారంబుల శౌర్యాటోపంబులు సేసి వితర్కించుచుండి రట్టి యవసరంబున **50**

అర్థము . అని, అనేక - ప్రకారంబులన్, శౌర్య + ఆటోపంబులు = పరాక్రమ విజృంభణములు, చేసి, వితర్కించుచున్ + ఉండిరి, = ఊహించుచుండిరి, అట్టి + అవసరంబునన్ = అట్టి సమయమున

తాత్పర్యము . అని పెక్కురీతుల పరాక్రమముచే విజృంభించి వితర్కించుచుండిరి అట్టి సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ సన్నుతత్యాగధ్వజంబులతోడన
సంధిల్లి వీరధ్వజములు క్రాలెఁ
బటుగతిఁ జను గాలిపడగలతోడన
కడు వేగమునను బెందడిగ లెగసెఁ
జిఱుతమెఱుంగుల కొఱవివాటులతోన
నీరాజనద్యోతినికర మడరె
వఱుడియల్ వెలువడు వరభటావలితోన
వీరసన్న్యాసులున్ వెడలి రుగ్ర

తే భటుల మంగళపారకపరనరవము
తోన వీణాంకమాలికాగానరవము
సమర సంగీత వివిధ వాద్యములతోన
కలయ విడిదిలో వీరమద్దెలలు నులిసె **51**

అర్థము సన్నుత - త్యాగ - ధ్వజంబులతోడన్ + అ = పొగడఁబడిన త్యాగచిహ్నములతోనే, సంధిల్లి = కూడి, వీర - ధ్వజములు = వీరుల పతాకలు క్రాలెన్ = ఒప్పెను

పటు - గతిన్ = మిక్కిలి వేగముతో, చను, గాలి - పడగల తోడన్ + అ = వీరధ్వజములతోనే, కడు వేగమునన్ = మిక్కిలి వేగముతో, పెందడిగలు = పెను + దడిగలు = పెడ్డడాలులు, ఎగసెన్ = ఎగిరెను

చిఱుత - మెఱుంగుల - కొఱవి - వాటులతోన్ + అ = అల్పకాంతుల కొఱకచ్చులతోపాటే, నీరాజన - ద్యోతి - నికరము = యుద్ధమునకుఁ బోవుటకు ముందు వీరులకిచ్చు హారతుల కాంతుల సమూహము, అడరెన్ = అతిశయించెను

వఱిడియల్ = కరదీపికలు, వెలువడు, వర - భట + ఆవలితోన్ + అ = శ్రేష్ఠులయిన భటుల వరుసతోపాటే, వీర - సన్న్యాసులున్, వెడలిరి

ఉగ్ర - భటుల = భయంకరులైన భటులయొక్క, మంగళ - పారక - పరన - రవము - తోన్ + అ = శుభములను పరించువారి పరనధ్వనితోపాటే, వీణాంకమాలికా - గాన - రవమున్ = వీణలపైఁబాడు స్తోత్రముల సంగీత ధ్వనియు, సమర - సంగీత - వివిధ - వాద్యములతోన్ + అ = యుద్ధ సంగీతము నందలి వివిధవాద్యములు అనువానితోపాటే, విడిదిలోన్, కలయన్ = అంతటను, వీర మద్దెలలున్ = బిరుదందెలును, ఉలిసెన్ = ధ్వనించెను

తాత్పర్యము . త్యాగధ్వజములతోపాటే వీరధ్వజము లొప్పెను అమిత వేగముతోఁ జను గాలిపడగలతోనే పెద్దడాలులు ఎగిరెను అల్పకాంతుల కొఱకచ్చులతోపాటే నీరాజనములకాంతులును అతిశయించెను కరదీపికలతోడి భటుల సమూహముతోనే వీరసన్న్యాసులును వెడలిరి భటులను స్తోత్రము చేయువారి పరనధ్వనితోపాటే వీణలపైఁ బాడు స్తోత్రముల సంగీత ధ్వనియు, యుద్ధ సంగీతములోని వివిధవాద్యములు అనువానితోపాటే విడిదిలో నంతటను బిరుదందెలును ధ్వనించెను

విశేషములు . అలంకారము సహోక్తి

వ ఇట్లు సమరాంగణ నర్తకీనర్తనస్థానంబునుంబోలె నతిమనోహరం బైన స్కందు స్కందావారంబునందు 52

అర్థము. ఇట్లు, సమర + అంగణ - నర్తకీ - నర్తన స్థానంబునున్ + పోలెన్ = యుద్ధరంగమనెడి నట్టువరాలి నాట్యరంగమువలె, అతి - మనోహరంబు = మిక్కిలి సుందరమయినది, ఐన, స్కందు = కుమారస్వామియొక్క, స్కంధావారంబునందున్ = సేనా నివేశమునందు

తాత్పర్యము. ఇట్లు నట్టువకత్తె నాట్య రంగమువలె మిక్కిలి సుందరమైన కుమారస్వాని సేనా నివేశమునందు - తరువాతి పద్యముతో నన్వయము

ఉ ఆయము లిచ్చు, టాజిమొన కాయము పెంచుట, పెక్కు మన్ననల్
సేయుట, పోరికిన్ మొనసి చేయుటగా మది నిశ్చయించుచున్,
నాయకు కోర్కిఁ దీర్తునని నా యెద నూఱడినట్లు తొమ్మునం
జేయిడి నిద్రవోయిరి నిశిన్ సుభటుల్ సమరంబ కోరుచున్ 53

అర్థము: ఆయములు + ఇచ్చుట = రాబడు లిచ్చుట, ఆజి - మొనకున్ = యుద్ధ సైన్యమునకు, ఆయము = ఆదాయము, పెంచుట, పెక్కు - మన్ననల్, చేయుట, పోరికిన్ = యుద్ధమునకు, మొనసి = పూని, చేయుట + కాన్, మదిన్, నిశ్చయించుచున్, నాయకు - కోర్కిన్, తీర్తున్, అని, నా + ఎదన్ = నా హృదయమున, ఊఱడిన + అట్లు = ఊఱడిల్లిన విధమున, తొమ్మునన్, చేయి + ఇడి = చేయిపెట్టుకొని, సుభటుల్ = సద్వీరులు, సమరంబు + అ = యుద్ధమునే, కోరుచున్, నిశిన్ = రేయి, నిద్ర + పోయిరి = నిదురించిరి

తాత్పర్యము: రాబడు లిచ్చుట, యుద్ధ సైన్యమున కాదాయము పెంచుట, పెక్కు మన్ననలు చేయుట, యుద్ధమునకుఁ బూనుటగా మనస్సునందు నిశ్చయించుచు యజమానుని కోరికను దీర్తునని మానసమున నూఱడిల్లిన విధమున సుభటులు యుద్ధమునే కోరుచు రేయి తొమ్మునఁ జేయిడుకొని నిదురించిరి

యుద్ధ వీరుల బార్యల పరితాపము

తే పాలునేయును గూడిన భంగి వోలె
నొనరి వియ్యంబుతోఁ గూడియున్న భటుఁడు
వీరసన్న్యాసవిధిఁ దన్ను విడుచు టెటిఁగి
వనిత నిట్టూర్పుతోన జీవంబు విడిచె 54

అర్థము. పాలున్, నేయునున్ = నేయియును, కూడిన - భంగి - పోలెన్= కూడిన విధమున, ఒనరి = ఒప్పి, వియ్యంబుతోన్ = ఐక్యముతో, కూడి + ఉన్న=

కలిసియున్న, భటుఁడు, వీర - సన్న్యాస-ఎఱిన్ = వీరుని సన్న్యాసక్రమమున, తన్నున్, ఎడుచుట, ఎఱిఁగి, వనిత = స్త్రీ, నెట్టూర్పు (నిడు + ఊర్పు) + తోన్ + ఆ = నిశ్శ్వాసముతోనే, జీవంబు = ప్రాణము, విడిచెన్

తాత్పర్యము. పాలును నేయియును గూడిన విధమునఁ దనతో నైక్యమునఁ గూడియున్న భటుఁడు వీరుని సన్న్యాసక్రమమునఁ దన్ను ఎడుచుట యెఱిఁగి వనిత నిశ్శ్వాసముతోనే ప్రాణము విడిచెను

ఉ **ఓలము లేదు కూర్చునని యూఱడియుండితిఁ గూర్మియెల్ల నేఁ**
డాలము నేసి నన్నుఁ బెడయాకులఁబెట్టి మనఃప్రియుండు త
న్నాలములోనఁ బెట్టి దివిజాంగనలం గలయంగ నెత్తె నే
నాలనె బేలఁగాక చెలియా యని యల్లన వ్రాలె సోలుచున్ 55

అర్థము. ఓలము - లేదు = దాఁపటికము లేదు, కూర్చును + అని = ఇష్టపడునని, ఊఱడి + ఉండితిన్ = ఊఱటఁజెందియుంటిని, కూర్మి + ఎల్లన్ = ప్రేమమంతయును, నేఁడు, ఆలము + చేసి = ఉపేక్షించి, నన్నున్, పెడ + ఆకులన్ + పెట్టి = విడిచిపెట్టి (?), మనస్(ః) + ప్రియుండు = మనోనాథుఁడు, తన్నున్, ఆలములోనన్ + పెట్టి = యుద్ధమునందుఁబెట్టి, దివిజ + అంగనలన్ = దేవతాస్త్రీలను,కలయంగన్ = కూడుటకు, ఎత్తెన్ = దండెత్తెను, చెలియా! నేను, బేలన్ + కాక = తెలివితక్కువదానను గాక, ఆలనె = స్త్రీనా? అని, సోలుచున్ = మూర్ఛిల్లుచు, అల్లనన్ = మెల్లఁగా, వ్రాలెన్ = ఒఱిగెను

తాత్పర్యము. 'దాఁపటికము లేదు న న్నిష్టపడునని యూఱట చెందియుంటిని, నేఁడు న న్నుపేక్షించి విడిచిపెట్టి నా మనోవిభుఁడు తాను యుద్ధమున కేఁగి దేవతాస్త్రీలను గూడుటకు దండెత్తెను చెలీ! నేను తెలివిమాలిన దానను గాక స్త్రీనా?" అని మూర్ఛిల్లుచు మెల్లఁగా నొఱిగెను

చ **అనిమొన నిల్చి వీరగతి నందు ఫలం బిదియెల్ల దేవతాం**
గనల ముదంబునన్ గవయఁగాన్న నిజం బిది నన్ను దేవకా
మిని ననురక్తిగైకొని రమించుచునుండియు నింక నాజి నే
మని యొకొ త్రెవ్వఁజూచెఁ బ్రియుఁ డంచుఁ జలించె లతాంగి నెమ్మదిన్ 56

అర్థము: అని - మొనన్ = యుద్ధముఖమున,నిల్చి, వీర - గతిన్ = వీరుని విధమున, అందు = పొందెడు, ఫలంబు, ఇది + ఎల్లన్ = ఇది యంతయు, దేవతా + అంగనలన్ = దేవతా స్త్రీలను, ముదంబునన్ = సంతోషముతో,కవయన్ +

కాన్పు + అ = పొందఁజూచుటయే, ఇది, నిజంబు, దేవ - కామినిన్ = దివ్యాంగనను, నన్నున్, అనురక్తిన్ = అనురాగముతో, కైకొని = స్వీకరించి, రమించుచున్ + ఉండియున్ = సంభోగించుచుండియు, ప్రియుఁడు, ఇంకన్, ఆజిన్ = యుద్ధమున, ఏమి + అని + ఒకొ = ఏ కారణమునఁనో, త్రెవ్వన్ + చూచెన్ = నశింపఁజూచెను, అంచున్, లతా + అంగి = తీవబోఁడి - స్త్రీ, నెమ్మదిన్ (నెఱ + మదిన్) = మనస్సునందు, చలించెన్ = దుఃఖించెను

తాత్పర్యము . 'యుద్ధరంగమున నిల్చి వీరుఁడుగా నుండుటకు ఫల మంతయు దేవతాస్త్రీలను సంతోషముతోఁ గూడఁగలుగుటయే ఇది నిజము దివ్యాంగనైన నన్ను అనురాగముతో స్వీకరించి సంభోగించుచుండియు నా ప్రియుఁ డింకను యుద్ధమున నశింపఁజూచుట కేమి కారణము?' అని యొక తీవబోఁడి మనసులో దుఃఖించెను

ఉ **వాడిన వక్త్రపంకజము, వందిన హృద్దళితాంబుజాతమున్,**
గూడిన కన్ను నీరుఁ, దనుకంపమునం బ్రభవించి మైవడిన్
వీడిన వేణియుం, దగఁగ, వీరసతిం బతి గూడియున్నఁ,దా
మాఁడిన జీవితాశ నొక మానిని యుండె నచేతనస్థితిన్ 57

అర్థము . వీర - సతిన్ = వీరమనెడి స్త్రీని, పతి = భర్త, కూడి + ఉన్నన్= కూడియుండఁగా, ఒక - మానిని = ఒక మానవతి - స్త్రీ, వాడిన - వక్త్ర - పంకజమున్ = వాడిపోయిన ముఖపద్మమును, వందిన = దుఃఖించిన, హృద్ + దళిత + అంబుజాతమున్ = వికసించిన పద్మమువంటి హృదయమును కూడిన = కాఱిన (?), కన్ను - నీరున్, తను - కంపమునన్ = శరీరపువణఁకుచే, ప్రభవించి = పుట్టి, మైవడిన్ = ఆనుకూల్యముతో, వీడిన = విరిసిన, వేణియున్ = జడయును, తగఁగన్ = ఒప్పఁగా, తాన్ = తాను, మాఁడిన - జీవిత + ఆశన్ = మాఁడిపోయిన బ్రదుకు మీఁది కోరికతో, అచేతన - స్థితిన్ = చైతన్యరహితమైన స్థితితో, ఉండెన్

తాత్పర్యము . తన భర్త వీర మనెడి స్త్రీని గూడియుండఁగా, నొక మానవతి వాడువాఱిన ముఖపద్మమును, దుఃఖించిన హృదయకమలమును, కాఱిన కన్నీరును, శరీరకంపముచే విరిసిన వేణియును ఒప్పఁగా జీవితాశ మాఁడిపోయి చైతన్యరహితయై యుండెను

విశేషములు : అలంకారము రూపకము

మ అనయంబై కొని వీచు తెమ్మెరలచే నల్లాడు లేఁదీఁగ క్రొ
న్నన లల్లల్లన డుల్లు భంగిఁ గడగానన్ రాని దుఃఖాబ్ధి నం
గన డిందంబడి వంది నెవ్వగపుతోఁ గంపించు మేఁదీఁగ నో
లిన పేర్చిందులు రాలఁ జూచె రణకేళీలోలు నాత్మేశ్వరున్ 58

అర్థము అనయంబు + ఐ = అధికమయి, కొని - వీచు, తెమ్మెరలచే = వాయువుచే, అల్లాడు = చలించునట్టి, లేఁదీఁగ (లేత + తీఁగ) యొక్క, క్రొన్నలు (క్రొత్త + నలు) = క్రొత్తవియగు పూలు, ఒల్లల్లనన్ = మెల్లమెల్లఁగా, డుల్లు - భంగిన్ = రాలువిధమున, కడ + కానన్ - రాని = అంతము గానరాని, దుఃఖ + అబ్ధిన్ = దుఃఖమనెడి సముద్రమునందు, డిందన్ + పడి = మునిఁగి, వంది = దుఃఖించి, నెవ్వగపుతోన్ (నెఱ + వగపుతోన్) = మిక్కిలి ఎచారముతో, కంపించు = వణఁకు, మేఁదీఁగన్ (మే + తీఁగన్) = తీఁగవంటి మేనినుండి,ఓలిన్ = బాగుగా, పేర్చిందులు = చెమటబిందువులు, రాలన్ = రాలుచుండఁగా, అంగన, రణ - కేళీలోలున్ = యుద్ధక్రీడయందాసక్తి గలవానిని, ఆత్మ + ఈశ్వరున్ = తన భర్తను, చూచెన్

తాత్పర్యము అధికముగా వీచు గాలిచేఁ జలించు లేఁదీఁగ నుండి క్రొంబూలు రాలు విధమున, అంతము గనరాని దుఃఖసముద్రమున మునిఁగి, దుఃఖాతిశయముచేఁ గంపించు మేఁదీఁగనుండి చెమటబిందువులు రాలుచుండఁగా ఒక యుద్ధక్రీడాపరుఁడైన తన భర్తను జూచెను ,

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోపమ లేఁదీఁగ - లేత - తీఁగ ప్రాఁతాదిసంధి బాల సంధి 36 లే + తీఁగ నుగాగమము-బాల సంధి 37 లే + ను + తీఁగ ద్రుతకార్యము - బాల సంధి 16,17 లేఁదీఁగ నెవ్వగపు - నెఱ + వగపు 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి ' బాల సంధి 39

వ ఇట్లు పుణ్యసతులు రణమరణపరిచ్ఛేదు లైన పతులతోడన మరణ పరిచ్ఛేదలగుచు నుండి రంత విరాగాన్వితులైన సుభటోత్తములు "కः కేనార్థ కోదరిద్ర"యని గోసనంబులు పుచ్చి పర్యస్యదాను లగుచుండి రట్టి యవసరంబున 59

అర్థము: ఇట్లు, పుణ్య - సతులు = పతివ్రతలయిన స్త్రీలు, రణ - మరణ - పరిచ్ఛేదులు = యుద్ధమృతియందు నిశ్చయము గలవారైన, పతుల తోడన్ +

అ = భర్తలతోపాటే, మరణ - పరిచ్ఛేదలు - మరణ నిశ్చయముగలవారు, అగుచున్, ఉండిరి, అంతన్, విరాగ + అన్వితులు = విరక్తితోఁగూడినవారు, ఐన, సుభట + ఉత్తములు = భటశ్రేష్ఠులు, కః = ఎవఁడు, కేన = దేనిచేత, అర్థీ = కోరువాఁడు = ఎవఁడు దేనిని గోరును ? కః + దరిద్రః = ఎవఁడు దేనిచే దరిద్రుఁడు - ఎవని కేది లేదు? అని, గోసనంబులు + పుచ్చి = చాటించి, సర్వస్వ - దానులు= ఎల్లసొమ్మును దానము చేసినవారు, అగుచున్ + ఉండిరి, అట్టి - అవసరంబునన్

తాత్పర్యము . ఇట్లు పతివ్రతలైన స్త్రీలు రణమరణనిశ్చయులైన భర్తలతోపాటే తామును మరణనిశ్చయ లగుచుండిరి అంత విరక్తులైన వీరశ్రేష్ఠులు 'ఎవనికేది కావలయును? ఎవని కేది లేదు ' అని ప్రకటించి తమకున్న సొమ్మంతయు దానము చేయుచుండిరి అట్టి సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . కో దరిద్ర యని - కః + దరిద్ర . + అని 'విస్సరంబున కనుకరణంబున లోపంబగు ' బాల సంధి 50 కో దరిద్ర + అని - యడాగమము - బాల సంధి 3

చ **'బలువిడిఁ దాఁకి వైరిజనపాలుర కండలు గోసి పేర్చుతోఁ**
దలరక భూతకోటులను దన్పుదు మెమ్మొయి నాజి నంచు దో
హలమతు లిచ్చి రుత్తమభటావలి కుంకుమ కింకిరాతకో
జ్జ్వల శిఖి బంధుజీవ సమవర్ణ సువర్ణము లర్థికోటికిన్ 60

అర్థము . దోహల - మతులు = ఉత్సాహముతోఁ గూడిన మనస్సులు గలవారు, అగు, ఉత్తమ - భట + ఆవలి = శ్రేష్ఠులయిన వీరుల సమూహము, బలువిడిన్ = పరాక్రమముతో, తాఁకి = ముట్టి, వైరి - జనపాలుర = శత్రురాజులయొక్క, కండలు, కోసి, పేర్చుతోన్ = విజృంభణముతో, తలరక = చలింపక, భూత - కోటులను = ప్రాణి సమూహములను, ఆజిన్ = యుద్ధమునందు, ఎమ్మొయిన్ (ఏ + మెయిన్) = ఏ విధముగానైనను, తన్పుదుము = తృప్తిపఱుతుము, అంచున్, అర్థి - కోటికిన్ = యాచకుల సమూహమునకు, కుంకుమ 'సువర్ణములు కుంకుమ = కుంకుమముతోను, కింకిరాతక = రక్తాశోకముతోను, ఉజ్జ్వల - శిఖి = ప్రకాశించునగ్నితోను, బంధుజీవ = మంకెనపువ్వుతోను, సమ = సమానమయిన, వర్ణ = రంగుగల, సువర్ణములు = బంగారములు, ఇచ్చెన్

తాత్పర్యము : ఉత్సాహవంతులైన వీరశ్రేష్ఠులు 'పరాక్రమముతోఁ దాఁకి శత్రురాజుల కండలు గోసి విజృంభించి, చలింపక, యుద్ధమున నెట్లయినను

బ్రాణుల సమూహమును దృప్తిపఱుతు' మనుచు, కుంకుమము, రక్తాశోకము, ఉజ్జ్వలాగ్ని, మంకెన అనువానితో సమానమయిన సువర్ణములు యాచకుల సమూహమునకు ఇచ్చిరి

విశేషములు . ఉత్తమ భటాలికి అనుపారము కంటె ఉత్తమ భటావలి అను రా అ కృశర్మ గారి పారము మేలుగానుండుటచే నది స్వీకరింపఁబడినది అప్పుడు ఉత్తమ భటావలి ఇచ్చిరి అని యేర్పడును 'మహత్సమూహార్థకశబ్దం బమహత్కార్య యుక్తంబయ్యెఁ దద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు విభాష నగు ' ప్రౌఢ శబ్ద 17

వ ఇట్లనేకు లనేకప్రకారంబుల దీనానాథవిద్వజ్జనంబుల నపారవసుధారా సారంబులం దేల్చుచుండి రంతఁ గుమార హరి పురందరాది ప్రముఖ నిఖిల సురవరోత్తములు సమస్త భువన భవనాధీశ్వరులు నిజవాహనాయుధాదులకు నీరాజనాదిక్రియావిధు లొనర్చుచుం బరమేశ్వరారాధనతత్పరు లగుచుండి రట్టి యవసరంబున 61

అర్థము : ఇట్లు, అనేకులు = పెక్కురు వీరులు, అనేక - ప్రకారంబులన్= పెక్కు విధముల, దీన + అనాథ - విద్వత్ + జనంబులన్ = దీనులను, దిక్కులేనివారిని, పండితులను, అపార - వసు - ధారా + ఆసారంబులన్ = పారము లేని ధనముల (రత్నముల) యొక్క, ప్రవాహములయొక్క జడులచే, తేల్చుచున్ + ఉండిరి = సంతోషపెట్టుచుండిరి, అంతన్, కుమార - హరి - పురందర + ఆది - ప్రముఖ - నిఖిల - సుర - వర + ఉత్తములు = కుమారస్వామి, విష్ణువు, ఇంద్రుఁడు మున్నగు ముఖ్యులైన ఎల్లదేవతాశ్రేష్ఠులు, సమస్త - భువన - భవన + అధి + ఈశ్వరులు = ఎల్లలోకములనేడి యిండ్ల ప్రభువులు, నిజ - వాహన + ఆయుధ + ఆదులకున్ = తమ వాహనములు, ఆయుధములు, మున్నగువానికి, నీరాజన + ఆది - క్రియా - విధులు = హారతులు మున్నగు క్రియావిధానములు, ఒనర్చుచున్ = చేయుచు, పరమేశ్వర + ఆరాధన - తత్పరులు = ఈశ్వరునియొక్క పూజయందు ఆసక్తి గలవారు, అగుచున్ + ఉండిరి అట్టి - అవసరంబునన్

తాత్పర్యము . ఇట్లు పెక్కండ్రు వీరులు పెక్కుర్తుల దీనులను, అనాథులను, పండితులను అపారములైన ధనముల వర్షములచేఁ దృప్తిపఱుచుచుండిరి అంతఁ గుమారుఁడు, విష్ణువు, ఇంద్రుఁడు మున్నగు ముఖ్యులైన దేవతాశ్రేష్ఠులెల్లరును ఎల్ల లోకపాలకులును దమ వాహనములు, ఆయుధములు

మున్నగువానికి హారతులు మున్నగు విధానములు చేయుచు నీశ్వరునారాధించుటయం దాసక్తిగలవారగుచుండిరి అట్టి సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సూర్యోదయము

క 'తారక తేజం బడఁపఁ గు
మారక! నీ వేల? పంపు మహిఁ దారక సం
హారకు న' న్నను గతిఁ దిమి
రారాతి ప్రతాపయుక్తుఁడై యుదయించెన్ 62

అర్థము . కుమారక = ఓయి కుమారస్వామీ! తారక - తేజంబు = తారకాసురుని తేజస్సును, అడఁపన్ = అణఁచుటకు, నీవు, ఏల, తారక - సంహారకున్ = నక్షత్రముల సంహారకుని, నన్నున్, మహిన్ = భూమిని (గూర్చి), పంపు = పంపుము, అను - గతిన్ = అనువిధమున, తిమిర + అరాతి = చీఁకటి యొక్క శత్రువు - సూర్యుఁడు, ప్రతాప - యుక్తుఁడు + ఐ = తేజస్సుతోఁ గూడినవాఁడయి, ఉదయించెన్

తాత్పర్యము . 'కుమారస్వామీ! 'తారకాసురుని అడఁచుటకు నీవు పోవలయునా? తారక సంహారకుఁడనైన - (నక్షత్రముల నుడుపువాఁడనైన) నన్ను భూమికిఁ బంపుము ' అను విధమున సూర్యుఁడు తేజోయుక్తుఁడై యుదయించెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష - శ్లేషము

వ. **త దవసరంబునం గుమారుండు సుప్రభాతోచితక్రియలు నిర్వర్తించి సమరోద్యుక్తుండై సన్నాహభేరి చఱువంబంచిన** 63

అర్థము : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, కుమారుండు, సుప్రభాత + ఉచిత - క్రియలు = ఉదయకాలమునకుఁ దగిన పనులు, నిర్వర్తించి = చేసి, సమర + ఉద్యుక్తుండు + ఐ = యుద్ధమునకుఁ బూనినవాఁడయి, సన్నాహ - భేరి = సంసిద్ధతను దెలుపు వాద్యము, చఱువన్ + పంచినన్ = మ్రోయింప నాజ్ఞాపింపఁగా -

తాత్పర్యము . ఆ సమయమునఁ గుమారస్వామి ప్రాంతఃకాలమునకుఁ దగిన పనులు చేసి యుద్ధమునకుఁ బూనినవాఁడయి సన్నాహభేరిని మ్రోయింప నాజ్ఞాపింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

స్రగ్ధర భువనీచక్రాచలేంద్రాంబుధికుహరదిశాపూర్ణమై, దేవసేనో
త్సవమై, బ్రహ్మాండభాండోదర ఘనపద పాతాళముల్ పెల్లగిల్లన్,
దివిజావాసంబు లోలిం దిరుగ దినకరాదిత్యు లుల్కన్, మహా భై
రవమై, సన్నాహభేరీరవ మహితకులత్రాసకంబై చెలంగెన్ 64

అర్థము. సన్నాహ -భేరీ - రవము = యుద్ధసన్నద్ధతను దెలుపు భేరుల ధ్వని, భువనీ పూర్ణమై, భువనీ -చక్ర = లోకముల సమూహము, అచల + ఇంద్ర = పర్వతశ్రేష్ఠములు, అంబుధి - కుహర = సముద్రాంతర్భాగము, దిశా + దిక్కులు, ఆపూర్ణము + ఐ = అంతటను నిండినదయి, దేవ - సేనా + ఉత్సవము + ఐ = దేవతలసేనకుఁ బండువయి, బ్రహ్మాండ పెల్లగిల్లన్ = బ్రహ్మాండ - భాండ + ఉదర = భాండమువంటి బ్రహ్మాండముయొక్క గర్భము, ఘనపద = ఆకాశము, పాతాళముల్, పెల్లగిల్లన్ = కలఁగఁగా, దివిజ + ఆవాసంబులు = దేవతల నివాసస్థానములు, ఓలిన్ = క్రమముగా, తిరుగన్, దినకర = సూర్యుఁడు, ఆదిత్యులు = దేవతలు, ఉల్కన్ = భయపడఁగను, మహాభైరవము + ఐ = మిక్కిలి భయంకరమయినదయి, అహిత - కుల - త్రాసకంబు + ఐ = శత్రువుల సమూహమునకు భయము గలిగించునదయి, చెలంగెన్ = మ్రోసెను

తాత్పర్యము. లోకములు, పర్వతరాజములు, సముద్రములు, దిక్కులు అంతటను నిండినదయి, దేవతల సేనకుఁబండువయి, బ్రహ్మాండభాండగర్భము, ఆకాశము, పాతాళము కలఁగఁగను, దేవతల నివాస స్థానములు క్రమముగాఁదిరుగఁగను, సూర్యుఁడు దేవతలు భయపడఁగను, మిక్కిలి భయంకరమయినదయి, యుద్ధసన్నద్ధతను దెలుపు భేరుల ధ్వని శత్రు సమూహమునకు వెఱపుగొలుపునదయి మ్రోసెను

వ అంతం గుమారప్రేరితులై యక్షణంబ. 65

అర్థము అంతన్, కుమార - ప్రేరితులు + ఐ = కుమారస్వామి చేతఁబురికొల్పఁబడినవారయి, అక్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము. అంతఁ గుమారస్వామిచేఁ బురికొల్పఁబడినవారయి వెంటనే తరువాతి పద్యముతో నన్వయము

ఉ 'బలముల వేగమై కదలఁబంపుఁడు పన్నుఁడు పన్నుఁ' డంచు న
ల్వలఁకులఁ బాటిపాటి పడవాళులు సిద్ధులలోనఁ జాటు పే
రులి వొగిఁ బర్వఁ దత్ప్రధుతరోరుతరాహితి సేన మారుతా
కుల చలదంబురాశిపటుఘోషము వోలెఁ జెలంగెఁ బెల్లుతోన్ 66

అర్థము. బలములన్ = సైన్యములను, వేగమై = వేగముతో, కదలన్ = కదలునట్లు, పంపుఁడు, పన్నుఁడు = మిక్కిలి సిద్ధపఱుపుఁడు, అంచున్, నల్వలఁకులన్ (నలు + వలఁకులన్) = నాలుగు దిక్కులందును, పాటి - పాటి, పడవాళులు = సేనాధిపతులు, సిద్ధులలోనన్, చాటు, పేరులివు (పేరు + ఉలివు) = పెద్ద ధ్వని, ఒగిన్ = క్రమముగా, పర్వన్ = వ్యాపింపఁగా, తద్ + పృథుతర + ఉరుతర +ఆహతిన్ = దాని మిక్కిలి పెద్ద, మిక్కిలి గొప్ప దెబ్బచే, సేన = సైన్యము,మారుత + ఆకుల - చలత్ + అంబురాశి - పటు -ఘోషము + పోలెన్ = గాలిచేఁ గలఁగి చలించు సముద్రముయొక్క తీవ్రమైన ధ్వని విధమున, పెల్లుతోన్ = ఆధిక్యముతో, చెలంగెన్ = మ్రోసెను

తాత్పర్యము. 'సేనలను వేగముగాఁ గదలఁబంపుఁడు, మిక్కిలి సిద్ధపఱుపుఁడు' అనుచు నాలుగుదిక్కులకును బరువెత్తి పరువెత్తి సేనాధిపతులు సిద్ధులలోఁ జాటు పెద్దధ్వని క్రమముగా వ్యాపింపఁగా దాని గొప్పదెబ్బచే సైన్యము గాలిచేఁ గలఁగి చలించు సముద్రముఘోషము విధమున మ్రోసెను

విశేషములు. అలంకారముపమ వలఁకులు - వలను + లు 'కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల ఆచ్చిక 18 వల + కుఙ్ + లు 'జిత్తు బిందుపూర్వంబగు' బాల తత్సమ 19

వ. తదవసరంబున **67**

అర్థతాత్పర్యములు. ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

కుమారస్వామి సేనలోఁ జతురంగబలముల యుద్ధసన్నాహము

చ కమలజు నీవిఁ బక్షములు క్రమ్మఱ నద్రులు గాంచి వజ్రితో
సమరము సేయ నెత్తుగతి సంభృతహేమకుధావిభాసితాం
గముల వరాస్పదం బడర గంధగజంబులు పన్నివచ్చె వే
గమునఁ గడంగుచున్ బ్రళయకాల సముద్ధ ఘనాఘనాకృతిన్ 68.

అర్థము. అద్రులు = కొండలు, కమలజు నీవిన్ (కమలజు + ఈవిన్) = బ్రహ్మ ఔదార్యముతో, క్రమ్మఱన్ = మరల, పక్షములు = ఱెక్కలు, కాంచి = ఒంది, వజ్రితోన్= వజ్రముగలవానితో - ఇంద్రునితో, సమరము + చేయన్ = యుద్ధము చేయుటకు, ఎత్తు - గతిన్ = దండెత్తు విధమున, సంభృత - హేమ - కుధా - విభాసిత + అంగములన్ =కూర్పఁబడిన, బంగారు, చిత్రకంబళములచేఁ

బ్రకాశించిన శరీరములలో, వర + ఆస్పదంబు = శ్రేష్ఠమైన స్థానము, అడరన్ = అతిశయింపఁగా, గంధ - గజంబులు = మదపుటేనుఁగులు, ప్రళయ - కాల - సముత్థ - ఘనా - ఘన + ఆకృతిన్ = ప్రళయసమయమునందు లేచిన వర్షాకాలపు మేఘముల ఆకారముతో, వేగమునన్ = శీఘ్రముగా, కడంగుచున్ = పూనుచు, పన్నివచ్చెన్ = వ్యూహమయి వచ్చెను

తాత్పర్యము : కొండలు బ్రహ్మ ఔదార్యముచే మరల తెక్కలు పొంది యింద్రునితో యుద్ధముచేయుటకు దండెత్తు విధమున బంగారు చిత్ర కంబళములతోఁ బ్రకాశించు మేనులతో నా స్థాన మతిశయింప మదపుటేనుఁగులు ప్రళయసమయవర్షాకాలమేఘముల ఆకారముతో శీఘ్రముగా వ్యూహమయి వచ్చెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష ఉపమ

చ అవి వివిధాస్త్రశస్త్రనికరాన్వితులై తనరంగ సారథుల్
పవనజవంబునం బొలయు భద్రహయంబులఁ బన్ని తేర నా
హవజయకాంక్షతో రథికు లంగతలత్రసమేతులై మహో
త్సవగతి నెక్కి రా నమితజైత్రరథంబులు వచ్చెఁ బెల్లుతోన్ 69

అర్థము : సారథుల్ = రథము నడపువారు, అవిన్ = కాంతితో (?), వివిధ + అస్త్ర - శస్త్ర - నికర + అన్వితులు + ఐ = పలురీతులయిన అస్త్రములు శస్త్రములు అనువానితోఁగూడినవారయి, తనరంగన్ = ఒప్పఁగా, పవన - జవంబునన్ = వాయువేగముతో, పొలయు = ఒప్పునట్టి, భద్ర - హయంబులన్ = మేలుజాతి గుఱ్ఱములను, పన్నితేరన్ = కట్టి తీసికొనిరాఁగా, రథికులు = రథములపై నుండి యుద్ధము చేయువారు, ఆహవ - జయ - కాంక్షతోన్ = యుద్ధవిజయమునందుఁ గోరిక గలవారయి, అంగతలత్ర - సమేతులు + ఐ = కవచములతోఁ గూడినవారయి, మహత్ (మహా) + ఉత్సవ - గతిన్ = గొప్పవేడుకతో, ఎక్కిరాన్, అమిత - జైత్ర - రథంబులు = మితిలేని జయశీలములైన రథములు, పెల్లుతోన్ = ఆధిక్యముతో, వచ్చెన్

తాత్పర్యము . సారథులు వివిధాస్త్రశస్త్రముల సమూహముతోఁ గూడి వాయువేగముతో నొప్పు మేలుజాతిగుఱ్ఱములను గట్టి తేఁగా, రథికులు యుద్ధ విజయమునందలి కోరికతోఁ గవచధారులయి గొప్పవేడుకతో నెక్కిరాఁగాఁ బెక్కు జయశీలములగు రథము లధికముగా వచ్చెను

విశేషములు. పద్యారంభమున మా రా కవి ప్రతిలో 'అని' అని కలదు అనిన్ = యుద్ధమునందు అని అర్థము చెప్పవచ్చును కాని తక్కిన మూఁడు పాదములందును బ్రాసస్థానముల వకారము గలదు కావునఁ బ్రాసమైత్రి చెడును వావిళ్ల ప్రతిలోను, సోఅ ప్రతిలోను 'అవి' యని కలదు అవి యను పదమునకు అర్థములు పెక్కు గలవు కాని ఒక్కటియు ప్రకరణోపయోగిగాఁగనవచ్చుట లేదు ఏదో కొంత మేలని 'కాంతి' యనునర్థము గ్రహింపఁబడినది

చ కరువలి రూపు చేకొనియెఁ గంధి తరంగలు మూర్తిఁ దాల్చె నా
వరుస జవాతిరేకముల వల్లన ధావన లంఘనంబులన్
దరణి రథాశ్వసంహతికిఁ దా రధికం బనఁ జాలి చాల భీ
కరగతిఁ బన్ని వచ్చెఁ దురగంబులు నల్దెస లేఁగి మెట్టుచున్ 70

అర్థము. తురగంబులు = గుఱ్ఱములు, కరువలి = గాలి, రూపు - చేకొనియెన్ = ఆకారముఁదాల్చెను కంధి -। తరంగలు = సముద్రపుటలలు, మూర్తిన్ = రూపమును, తాల్చెన్ = ధరించెను, నాన్ = అనఁగా, వరుసన్ = క్రమముతో, జవ + అతిరేకములన్ = వేగాతిశయములందును, వల్గన - ధావన - లంఘనంబులన్ = దౌడుతీయుట, పరువెత్తుట, దుముకుట అనువానియందును, తరణి - రథ + అశ్వ - సంహతికిన్ = సూర్యుని రథము యొక్క గుఱ్ఱముల సమూహము కంటె, తారు = తాము, అధికంబు + అనన్ + చాలి = ఎక్కువ యనఁ జాలి, నల్దెసలు = నాలుగు దిక్కులును, ఏఁగి, మెట్టుచున్ = తిరుగుచు, చాలన్ - భీకర - గతిన్ = మిక్కిలి భయంకరమగు విధమున, పన్ని - వచ్చెన్ =సిద్ధపడివచ్చెను

తాత్పర్యము. వాయువు రూపుఁదాల్చెనా, సముద్రపుటలలు ఆకారము ధరించెనా యన వేగాతిశయమునను, వల్గనము, ధావనము, లంఘనము అనువానియందును సూర్యరథాశ్వములను మించెననఁజాలి గుఱ్ఱములు మిక్కిలి భయంకరముగ నాలుగు దిక్కులను సంచరించుచు సిద్ధపడివచ్చెను

విశేషములు: అలంకారముత్ప్రేక్ష అతిశయోక్తి నల్దెసలు -ద్విగుసమాసము 'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగ నగు మిశ్రంబునకుఁగాదు' బాల సమాస 18 అయినను ఇట బహువచనమగుట విశేషము

క పలకలు నొడ్డనములుఁ, గ
త్తలములు నసి శక్తి కుంతతతియుంగొని భూ
తల మెల్లఁ గప్పికొని కా
ల్బలములు చనుదెంచెఁ గాలు బలముల పోలెన్ 71

అర్థము : పలకలున్ = డాలులును, ఒడ్డనములున్ = కేడెములును, కత్తలములున్ = కవచములును, అసి - శక్తి - కుంత -- తతియున్ = కత్తులయు, శక్త్యాయుధములయు, ఈఁటెలయు సమూహమును, కొని, భూతలము + ఎల్లన్ = భూమి యంతయును, కప్పికొని = ఆక్రమించుకొని, కాల్బలము = కాలి బంటులసేన - పదాతి సైన్యము, కాలు - బలములు + అ - పోలెన్ = యముని సైన్యములే యను విధమున, చనుదెంచెన్

తాత్పర్యము. పదాతి సైన్యము పలకలును, కేడెములును, కవచములును, కత్తులు, శక్తులు, ఈఁటెలు ధరించి భూమియంతయు నాక్రమించుకొని కాలుని బలములవలె వచ్చెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

కుమారుఁడు గజము నారోహించుట

వ ఇట్లమరశిబిరంబులం గల చతురంగబలంబులు రణరఁ జయోద్యుక్తులై పన్ని నడచి రంతం గుమారుం డుమామహేశ్వర చరణ స్మరణ పరిణతాంతఃకరణుండై యుద్ధసన్నద్ధుం డగుటయు మున్ను సన్నాహంబు సేసి మహామాత్రపుత్రు లతిశుభలక్షణలక్షితులై రణ జయా భీష్ట చేష్టలం దనరు భద్రగజంబుఁ దెచ్చి నిలిపిన 72

అర్థము . ఇట్లు, అమర - శిబిరంబులన్ = దేవతల గుడారములలో, కల= ఉన్న, చతురంగ బలంబులు = రథములు, ఏనుఁగులు, గుఱ్ఱములు, కాల్బంటులు అను నాలుగువిధములయిన సేనలును, రణ - రంగ - జయ + ఉద్యుక్తులు + ఐ = యుద్ధరంగవిజయమునకుఁ బూనినవారయి, పన్ని = సిద్ధపడి, నడచిరి, అంతన్, కుమారుండు, ఉమా - మహేశ్వర - చరణ - స్మరణ - పరిణత + అంతఃకరణుండు + ఐ = పార్వతీశ్వరుల పాదముల స్మరణముచేఁ బండిన మనస్సుగలవాఁడయి, యుద్ధసన్నద్ధుండు + అగుటయున్ = యుద్ధ సంసిద్ధుఁడగుటయును, మున్ను = ముందు, సన్నాహము + చేసి = సిద్ధము చేసి, మహామాత్ర - పుత్రులు = ప్రధానులైన మావటివారి పుత్రులు, అతి - శుభ - లక్షణ - లక్షితులు + ఐ = మిక్కిలి మంగళకరములయిన లక్షణములచేఁ జూడఁబడినవారయి, రణ - జయ + అభీష్ట - చేష్టలన్ = యుద్ధవిజయముచేఁ గోరఁబడిన పనులతో - యుద్ధమున గెలుచుటకు వలయు పనులతో, తనరు = ఒప్పునట్టి, భద్ర - గజంబున్ = మదపుటేనుఁగును, తెచ్చి, నిలిపినన్ = నిలుపఁగా

తాత్పర్యము . ఇట్లు దేవతల స్కంధావారములందుఁ గల చతురంగ బలములు యుద్ధమున గెలుపుసాధింపఁబూని సిద్ధపడి నడచెను అంతఁ గుమారస్వామి పార్వతీశ్వరుల పాదధ్యానముచేఁ బండిన మనస్సు గలవాఁడయి యుద్ధసంసిద్ధుఁడగుటయును, మున్ను సిద్ధపఱిచి ప్రధానులైనమావటివారి పుత్రులు మిక్కిలి శుభలక్షణములచే నొప్పినవారయి యుద్ధజయమునకు వలయు చేష్టలతో నొప్పు భద్రగజమును దెచ్చి నిలుపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క **వికసితపుష్కరయుతమై**
ప్రకటితవంశాఢ్యమై విభాసితశృంగా
ధికమై విలసితమునఁ దఱు
గక షణ్ముఖుమ్రోల నిలిచెఁ గరి గిరివోలెన్ 73

అర్థము వికసిత - పుష్కర - యుతము + ఐ = వికసించిన తుండాగ్రముతోఁ గూడినదయి (కరి), వికసించిన పద్మములతోఁ గూడినదయి (గిరి), ప్రకటిత - వంశ + ఆఢ్యము + ఐ = ప్రసిద్ధమయిన జాతితో (కరి) వెదురులతో సంపన్నమయి (గిరి), విభాసిత - శృంగ + అధికము + ఐ = కొమ్ములతో (దంతములతో) గొప్పదయి (కరి), ప్రకాశించిన శిఖరముతో గొప్పదయి (గిరి), విలసితమునన్ = ప్రకాశమున, తఱుగక = తగ్గక, కరి = ఏనుఁగు, గిరి + పోలెన్ = కొండ విధమున, షణ్ముఖ (షష్ + ట్ + ముఖు) - మ్రోలన్ = కుమారస్వామి యెదుట, నిలిచెన్

తాత్పర్యము: వికసించిన పుష్కరముతోఁ (తుండాగ్రముతో)ఁగూడినదయి ప్రసిద్ధమయిన వంశముచే (జాతిచే) సంపన్నమయి, విభాసితములయిన శృంగములతో (దంతములతో) గొప్పదయి, (కరి) వికసించిన పుష్కరములతోఁ (తామరపూలతో) గూడినదయి, ప్రసిద్ధమయిన వంశముచే (వెదురుచే) సంపన్నమయి, విభాసితములయిన శృంగములతో (శిఖరములతో) గొప్పదయి, ప్రకాశమున క్షీణింపక గిరి వలె కుమారస్వామి యెదుర నిలిచెను

విశేషములు . అలంకారము శ్లేషమూలకోపమ

వ త దవసరంబునం గుమారుం డనేకమునిగణాశీర్వాద వేదనాద జయజయధ్వనులతో రణజయాతోద్యంబులు చెలంగ జయావిజయాది సురాంగనా దత్త పంచమణి శేషాక్షతాకలిత లలితోత్తమాంగుం డగుచుం జనుదెంచి. 74

అర్థము తద్ + అవసరంబునన్, కుమారుండు, అనేక ముని - గణ + ఆశీర్వాద - వేద - నాద - జయజయ -ధ్వనులతోన్ = పెక్కురు మునుల సమూహముయొక్క దీవెనలయు, వేదనాదములయు, జయజయ అనువాని యొక్కయు ధ్వనులతో, రణ - జయ + ఆతోద్యంబులు = యుద్ధవిజయమునకైన వాద్యములు, చెలంగన్ = ధ్వనింపఁగా, జయా - విజయా + ఆది - సుర + అంగనా - దత్త - పంచ - మణి - శేష + అక్షత + ఆకలిత - లలిత + ఉత్తమాంగుండు = జయ, విజయ మున్నగు దేవతాస్త్రీలచే నీఁబడిన నీల, వజ్ర, పద్మరాగ, మౌక్తిక ప్రవాళము లనెడి అయిదుమణులతోడి సేసఁబ్రాలతోఁ గూడి మనోహరమైన శిరస్సు గలవాఁడు, అగుచున్, చనుదెంచి = వచ్చి

తాత్పర్యము . ఆ సమయమునఁ గుమారస్వామి పెక్కుండ్రు మునుల ఆశీర్వాదనాదములు, వేదనాదములు, జయజయనాదములు అనువానితో యుద్ధ విజయవాద్యములు మ్రోయఁగా, జయ, విజయ యనెడి దేవతా స్త్రీ లొసఁగిన నీలాది పంచమణుల సేసఁబ్రాలతోఁ గూడిన శిరస్సు గలవాఁడగుచు వచ్చి- తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . 'జయ, విజయ' అంగనలు గావున 'జయా విజయాది' అని యుండవలయునని తోఁచెడిని కాని యెల్ల ప్రతులలోను 'జయవిజయాది' అనియే యున్నది

చ గళితమదప్రవాహములు క్రమ్మెడు నిర్ఝరవాఃప్రవాహసం
కులముగ, భూషణోరుమణికోటినిజాంగమణిప్రభాతిగా,
నలి గజరూపకామగమనంబులు గైకొని క్రాలు రోహణా
చల గతిఁ బొల్చు భద్రకరి షణ్ముఖుఁ డెక్కె మహోత్సవంబునన్ 75

అర్థము. గళిత - మద - ప్రవాహములు = కాఱిన మదజల ప్రవాహములు, క్రమ్మెడు = వ్యాపించునట్టి, నిర్ఝర - వార్ (ఃు) + ప్రవాహ - సంకులము + కన్ = సెలయేఱుల నీటిప్రవాహముల సమూహము కాఁగా, భూషణ + ఉరు - మణి - కోటి = అలంకారములందలి పెద్దమణుల సమూహము, నిజ + అంగ - మణి - ప్రభాతి + కాన్ = తన శరీరమునందలి మణుల విశేషకాంతి కాఁగా, నలిన్ = ఉత్సాహముతో, గజ - రూప - కామ - గమనంబులు = గజముయొక్క ఆకారముతో నిచ్చవచ్చినపోకడలు, కైకొని = స్వీకరించి, క్రాలు = ఒప్పునట్టి, రోహణ + అచల - గతిన్ = రోహణమనెడి కొండ విధమున, పొల్చు = ఒప్పునట్టి,

భద్ర-కరిన్ = మదగజమును, షణ్ముఖుఁడు (షష్ + ట్ + ముఖుఁడు)= కుమారస్వామి, మహత్ (మహా) + ఉత్సవంబునన్ = గొప్ప వేడుకతో, ఎక్కెన్

తాత్పర్యము కాఁచిన మదజలప్రవాహములు వ్యాపించు సెలయేఱుల జలప్రవాహ సమూహములు కాఁగా, అలంకారములందలి గొప్ప మణుల సమూహము తనమేనియందలి మణుల విశేషకాంతి కాఁగా, నుత్సాహముతో గజాకార కామగమనములను గైకొనిన రోహణాచలమువలె నొప్పు మదగజమును గుమారస్వామి మహోత్సవముతో నధిరోహించెను

విశేషములు. అలంకారము ఉపమ రూపకానుప్రాణితము

వ త దవసరంబున హరి పురందర దిగధీశ్వరాది సురవరులు నఖిల భువనభవనాధీశ్వరులు సమరసన్నద్ధులై తమతమ వాహనంబు లెక్కి కుమారు ముందఱ గడచి జయచూళిం జేకొని యొడ్డనంబులం దీర్చుచుండి రంత నంతకమున్న తద్వృత్తాంతం బంతయు నెఱింగి యుగాంత కృతాంతకుండునుం బోలెం గోపానలోద్దీపితాంతరంగుండై తారకాసురుం డనంత దానవ సామంతాన్వితాహవసన్నద్ధుండై సురవరులపైఁ దెరలనెత్త నుద్యుక్తుండగుడు నక్షణంబ 76

అర్థము. తద్ + అవసరంబునన్ = ఆ సమయమునహరి - పురందర - దిశ్ (క్) + అధి + ఈశ్వర + ఆది - సుర - వరుల = విష్ణువు, ఇంద్రుఁడు, దిక్పాలురు మున్నగు దేవతాశ్రేష్ఠులు, అఖిల - భువన - భవన + అధి + ఈశ్వరులు = ఎల్ల లోకముల ప్రభువులు, సమర - సన్నద్ధులు + ఐ = యుద్ధమునకు సిద్ధపడినవారయి, తమ తమ వాహనంబులు + ఎక్కి, కుమారు - ముందఱ, కడచి = అతిక్రమించి, జయచూళిన్ = జయచూళియను పేరుగల వ్యూహమును జయము గలిగించు చాపాగ్రమును (?), కైకొని = స్వీకరించి, ఒడ్డనంబులన్ = వ్యూహములను, తీర్చుచున్ + ఉండిరి, అంతన్, అంతకున్ + అ - మున్ను+ అ = అంతకు మునుపే, తద్ + వృత్తాంతంబు + అంతయున్, ఎఱింగి, యుగ + అంత - కృతాంతకుండునున్ + పోలెన్ = ప్రళయకాలయమువి విధమున, కోప + అనల + ఉత్ + దీపిత + అంతరంగుండు + ఐ = కోపమనెడి అగ్నిచేత, మిక్కిలి ప్రకాశింపఁజేయఁబడిన మనస్సుగలవాఁడయి, తారక + అసురుండు, అనంత - దానవ - సామంత + అన్విత + ఆహవ - సన్నద్ధుండు + ఐ = అంతులేని రాక్షస సామంతరాజులతోఁ గూడిన యుద్ధమునకు సిద్ధపడినవాఁడయి, సుర -వరుల

పైన్ = దేవతాశ్రేష్ఠులపై, తెరలన్ + ఎత్తన్ = దండెత్తుటకు, ఉద్యుక్తుండు = పూనినవాఁడు, అగుడున్ = అయినంతనే, అక్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము ఆ సమయమున విష్ణువు, ఇంద్రుఁడు దిక్పాలురు మున్నగు దేవశ్రేష్ఠులును, ఎల్ల లోకముల ప్రభువులును యుద్ధ సంసిద్ధులయి తమతమ వాహనము లెక్కి కుమారస్వామి ముందటిభాగ మతిక్రమించి, జయచూళిని స్వీకరించి వ్యూహములు తీర్చుచుండిరి అంత అంతకుమునుపే, ఆ వృత్తాంతమంతయు నెటిఁగి ప్రళయకాలయమునిఁ విధమునఁ గ్రోధమనెడి అగ్నిచే వెలిఁగిన మనస్సు గలవాఁడయి, తారకాసురుఁడు పెక్కండ్రు రాక్షస సామంత రాజులతోఁగూడి యుద్ధసంసిద్ధుఁడై దేవతాశ్రేష్ఠులపయి దండెత్త నుద్యమించి నంతనే - తరువాతి పద్యముతో నన్వయము

తారకుని యుద్ధ సన్నాహము

సీ కరులపై మేఘుడంబరములో? సంధ్యాను
రాగ మేఘూడంబరమ్ము లొక్కొ?
కరులపైఁ గేతనోత్కరములో? సాద్భుతో
ద్భూతోగ్ర కేతు సంఘాత మొక్కొ?
కరులపై వరధరాధర ధర ముకుటాగ్ర
మణిగణములో? యుడుగణములొక్కొ?
కరికరముక్తశీకరములో? ఘనవీధి
వాహినీ విమల ప్రవాహ మొక్కొ?

ఆ యనఁగఁ గరులు నభము నరదాశ్వ భట తతి
ధరణితలముఁ గప్పి సురవిరోధి
బలము లిట్లు పన్ని వచ్చెనొ పటురజ
స్తమయుతప్రదోషతా విభాతి 77

అర్థము . కరులపైన్ = ఏనుఁగుల మీఁద, మేఘుడంబరములొ = గొడుగులో, సంధ్యా + అనురాగ - మేఘ - ఆడంబరములు + ఒక్కొ = సంధ్యననుసరించి ఎఱ్ఱనైన మేఘముల విజృంభణములో

కరులపైన్, వర - ధరాధర - ధర - ముకుట + అగ్ర - మణి - గణములొ = శ్రేష్ఠులైన రాజులు ధరించు కిరీటముల కొనలందలి రత్నముల సమూహములో,

కరి - కర - ముక్త - శీకరములో = ఏనుఁగుల తొండములచే, విడువఁబడిన తుంపరలో, ఘనవీధి- వాహినీ = ఆకాశగంగయందలి, నిమల - ప్రవాహము + ఒక్కొ = స్వచ్ఛమైన ప్రవాహమో,

అనఁగన్, కరులున్ = ఏనుఁగులును, నభమున్ = ఆకాశమును, అరద + అశ్వ - భట - తతిన్= రథములయు, గుఱ్ఱములయి, భటులయు, సమూహమును, ధరణి - తలమున్ = భూతలమును, కప్పి, పటురజస్ + తమ + యుత - ప్రదోషతా -విభాతిన్= తీవ్రమైన, ధూళివలని, చీఁకటితోఁ గూడిన మునిమాపుయొక్క కాంతితో (విధమున) - తీవ్రమైన రజోగుణ తమోగుణములతోఁ గూడిన గొప్ప తప్పు విధమున అని యర్థాంతరము, సుర - విరోధి - బలములు = రాక్షసుని (తారకుని) సేనలు, ఇట్లు, పన్ని = యుద్ధ సన్నద్ధములయి, వచ్చెనొ

తాత్పర్యము ఏనుఁగులపై ఛత్రములా? సంజచే నెఱ్ఱనైన మేఘములా? ఏనుఁగులపైఁ బతాకములా? ఆశ్చర్యకరముగాఁ బొడిచిన తోఁకచుక్కలా? ఏనుఁగులపై రాజశ్రేష్ఠులు ధరించిన కిరీటముల కొనలందలి రత్నములా? చుక్కల గుంపులా? ఏనుఁగుల తొండములు చిమ్మిన తుంపరలా? ఆకాశగంగ నిర్మల ప్రవాహమా? అనునట్లు ఏనుఁగులును, ఆకాశమును రథతురగభటుల సమూహమును, భూతలమును గప్పి అధికమైన ధూళివలని చీఁకటితోడి మునిమాపు విధమున అధికమైన రజస్తమోగుణములతోడి గొప్ప తప్పు విధమున - తారకుని సేనలు యుద్ధసన్నద్ధములయి వచ్చెను

విశేషములు . అలంకారము సందేహము, ఉపమ, శ్లేషము, అరద, శబ్దము తద్భవమయ్యి నీకవిచేఁ దత్సమముగాఁ బలుచోట్లఁ బ్రయుక్తమయినది నీకలిచేఁ దత్సమ తమ యుత - 'తమఃʼ అను అకారాంతశబ్దముగూడఁ గలదు చూడు సూ ని

క నయమున నల వలవులతో
రయమునఁ దెగ రాసి క్రింద రాఁబొడి రాలం
బయి నదరు లెగయఁ ద్రిజగ
ర్భయదములై దానవేంద్రుబలములు నడచెన్ 78

అర్థము. నయమునన్ = బాగుగా, అలవు + అలవులతోన్ = బలములు బలములతో, రయమునన్ = శీఘ్రముగా, తెగన్ + రాసి = మిక్కిలి ఒరసికొని, క్రిందన్, రాఁబొడి = రాతిపొడి, రాలన్ = రాలఁగా, పయిన్ = మీఁద, అదరులు

= మిడుఁగుఱులు - నిప్పుకణములు, ఎగయన్ = ఎగురఁగా, దానవ + ఇంద్రు - బలములు = రాక్షసరాజయిన తారకాసురుని సేనలు, త్రిజగత్ + భయదములు + ఐ = ముల్లోకములకును వెఱపు గలిగించునవియై, నడచెన్

తాత్పర్యము. రాక్షసరాజగు తారకుని సేనలు ఒకదానితో నొకటి బాగుగా వేగముతో రాసికొని క్రింద ఆయుధాదుల టాతిపాడి రాలఁగా, మీఁదికి మిడుఁగుఱు లెగురఁగా మూఁడులోకములకును వెఱపు గలిగించునవియై నడచెను

వ ఇట్లు తారకాసురుం డపార చతురంగ బల సమన్వితుండై యాసుర భావంబునం దెరల నెత్తివచ్చి సంగరంబునం బ్రతిఘటించి యొడ్డణంబులు దీర్చినం దత్క్షణంబ 79

అర్థము. ఇట్లు, తారక + అసురుండు, అపార - చతురంగ - బల - సమన్వితుండు + ఐ = అధికములయిన, రథగజతురగపదాతులనెడి నాలుగు విధములయిన సేనలతోఁ, గూడినవాఁడయి, ఆసుర - భావంబునన్ = రాక్షసత్వముతో, తెరలన్ + ఎత్తి వచ్చి = అతిశయింప దండెత్తివచ్చి, సంగర - రంగంబునన్ = యుద్ధరంగమునందు, ప్రతిఘటించి = ఎదిర్చి, ఒడ్డణంబులు = వ్యూహములు, తీర్చినన్ = తీర్పఁగా, తత్ + క్షణంబు + అ = ఆ క్షణమే

తాత్పర్యము : ఇట్లు తారకాసురుఁడు అపారము లయిన చతురంగ బలములతోఁ గూడినవాఁడయి రాక్షసత్వముతో దండెత్తి వచ్చి యుద్ధరంగమున నెదిర్చి వ్యూహములు పన్నఁగా నాక్షణమే - తరువాతి పద్యముతో నన్వయము

సీ భువనంబు లన్నియుఁ బొలియింప హరుచేతఁ
బనివడి గర్జిల్లు ప్రమథగణమొ
జగమెల్ల నొక్కుట సమయింప నెత్తెడు
సంవర్తసమవర్తి సంకులంబొ
నిఖిల విష్టపములు నిమిషార్ధమున మ్రింగఁ
గవియు సంహారభైరవ చయంబొ
యఖిలలోకముల నేకాహుతిఁ గొన నెత్తు
కాలాగ్ని రుద్ర సంఘాత మొక్కొ

ఆ యనఁగ నతిభయంకరాకారమై కనుఁ
గొనఁగ దృష్టి కధికగోచరంబు
కాఁగఁ బన్ని నిలిచెఁ గాయ్యుతో దానవ
కులబలంబు నేల కొడివడంగ 80

అర్థము భువనంబులు + అన్నియున్ = లోకములన్నియును, పాలియింపన్ = సంహరించుటకు, హరుచేతన్ = హరునిచే, పనివడి = నియమింపఁబడి, గర్జిల్లు = ఉఱుమునట్టి, ప్రమథగణమొ = ప్రమథుల సమూహమో

జగము + ఎల్లన్ = లోకమంతయు, ఒక్కటన్ = ఒక్కసారిగా, సమయింపన్ = నశింపఁజేయుటకు, ఎత్తెడు = పూనెడు, సంవర్త - సమవర్తి - సంకులంబొ = ప్రళయసమయ యముల సమూహమో

నిఖిల - విష్టపములు = ఎల్లలోకములు, నిమిష + అర్ధమునన్ = అర నిమిసములో, మ్రింగన్ = మ్రింగుటకు, కవియు = ఆక్రమించు, సంహార - భైరవ - చయంబొ = సంహరించు భైరవుల (శివగణాధిపుల) సమూహమో

అఖిల -లోకములన్ = ఎల్లలోకములను, ఏక + ఆహుతిన్ = ఒక్క వేలిమితో, కొనన్ = గ్రహించుటకు, ఎత్తు = పూను, కాల + అగ్ని - రుద్ర - సంఘాతము + ఒక్కొ = ప్రళయకాలమునందలి అగ్నులవంటి రుద్రుల సమూహమో

అనఁగన్, దానవ - కుల - బలంబు = రాక్షసవంశుఁడైన తారకు సేన, అతి - భయంకర + ఆకారము + ఐ = మిక్కిలి వెఱపుగొలుపు రూపుగలదయి, కనుఁగొనఁగన్ = చూచుటకు, దృష్టికిన్ = కంటికి, అధిక - గోచరంబు + కాఁగన్ = దుర్భరమయిన కాన్పు (చూపు) కాఁగా, కాయ్యుతోన్ = ఇచ్ఛతో, నేల = భూమి, కొడివడంగన్ = క్రుంగఁగా, పన్ని = యుద్ధమునకు సిద్ధపడి, నిలిచెన్

తాత్పర్యము. లోకముల నన్నిటిని సంహరింప హరునిచే నియమింపఁబడి యుఱుము ప్రమథగణమో, లోకమంతయు నొక్కసారిగా సంహరింపఁబూను ప్రళయకాలయముల సమూహమో, ఎల్ల లోకములను అరవిముసములో మ్రింగుట కాక్రమించు సంహారకులైన శివగణాధిపుల సమూహమో, అన్ని లోకములను ఒకే వేలిమిని గొనుటకుఁబూను ప్రళయాగ్నులవంటి రుద్రుల సమూహమో అనఁగా మిక్కిలి వెఱపుగొలుపు రూపు గలదయి, చూడ దుర్భరమయి దానవకులుఁడైన తారకుని సైన్యము నేల క్రుంగిపోవఁగా యుద్ధసన్నద్ధమయి కోరికతో నిలిచెను

విశేషములు : అలంకారము సందేహము

స్రగ్ధర కరు లా గోత్రాచలేంద్రౌఘములుగ, హయసంఘాతముల్ భూరి నీరా
కరసందోహంబుగా, భీకర రథతతి వృక్షప్రకీర్ణాటవుల్ గా
వరుసన్ వీరాగ్రగణ్యావలి దనరు మహావాహినుల్ కాగ, విశ్వం
భరయెల్లం దానమై తద్బల మిరుగడలన్ బన్ని ఘూర్ణిల్లుచుండెన్ 82

అర్థము. కరులు = ఏనుగులు, ఆ - గోత్ర + అచల + ఇంద్ర + ఓఘములు + కన్ = ఆ కులపర్వతరాజముల సమూహములు కాగా, హయ - సంఘాతముల్ = గుట్టముల సమూహములు, భూరి - నీర + ఆకర - సందోహంబు + కాన్ = మహా సముద్రముల సమూహము కాగా, భీకర - రథ-తతి = భయంకరములయిన రథముల సమూహము, వృక్ష - ప్రకీర్ణ + అటవుల్+ కాన్ = చెట్లచే విరివియైన అడవులు కాగా, వరుసన్ = క్రమముగా, వీర + అగ్ర-గణ్య + ఆవలి = వీరశ్రేష్ఠుల సమూహము, తనరు = ఒప్పునట్టి, మహత్ (మహా) వాహినుల్ + కాగన్ = గొప్పనదులు కాగా, తద్ + బలము = వారి సైన్యము, విశ్వంభర + ఎల్లన్ = భూమియంతయును, తాను + అ + ఐ = తానే యయి, ఇరు+ కడలన్ = రెండు పక్షములను, పన్ని = యుద్ధసన్నద్ధమయి, ఘూర్ణిల్లుచున్ + ఉండెన్ = తిరుగుడుపడుచుండెను

తాత్పర్యము. ఏనుగులు ఆ కులపర్వతముల సమూహములు కాగా, గుట్టముల సమూహములు మహాసముద్రముల సమూహము కాగా, భయంకరములయిన రథముల సమూహము చెట్లచే విరివియైన అడవులు కాగా, వీరశ్రేష్ఠుల సమూహము గొప్ప నదులు కాగా భూమియంతయు దానేయయి నిండి ఆ కుమారతారకుల సైన్యములు రెండు పక్షములందును యుద్ధసన్నద్ధమయి తిరుగుడుపడుచుండెను

విశేషములు: అలంకారము రూపకము

వ. **మఱియును - తరువాతి పద్యముతో నన్వయము** 83

శా ఆ తుంగద్విరదారదాశ్వభట దేహత్రాణ భూషామణీ
శాతాస్త్రప్రకరాతిభీషణరుచుల్ జాజ్వల్యమానంబుగా
జ్యోతిర్లోకము కాపువచ్చెనొకొ నా శోభిల్లఁ గాదేని వి
ఖ్యాతిం దద్బలభాతి వొల్చె నసుహృత్కాలాగ్నిపుంజంబొ నాన్ 84

అర్థము. ఆ రుచుల్ ఆ, తుంగ = ఎత్తయిన, ద్విరద = ఏనుఁగుల యొక్క, అరద = రథములయొక్క, అశ్వ = గుఱ్ఱములయొక్క, భట = భటుల యొక్క, దేహ - త్రాణ = కవచములయొక్క, భూషా = అలంకారములందలి, మణీ = మణులయొక్కయు, శాత + అస్త్ర - ప్రకర = వాఁడియైన బాణములయొక్క, సమూహముయొక్కయు, అతి - భీషణ - రుచుల్ = మిక్కిలి భయంకరములయిన కాంతులు, జ్యోతిస్ (ఃస) + లోకము = నక్షత్రముల సమూహము, కాఁపువచ్చెన్ + ఒకొ = నివసింపవచ్చెనా? నాన్ = అనునట్లు, జాజ్వల్యమానంబు + కాన్ = ప్రకాశమానముగా, శోభిల్లున్ = ప్రకాశించును కాదు + ఏనిన్ = లేదా, తద్ + బల - భాతి = వారి బలముల కాంతి, అసు - హృత్ + కాల + అగ్ని - పుంజంబొ - నాన్ = ప్రాణములను హరించు ప్రళయసమయాగ్నుల సమూహమో అనఁగా, విఖ్యాతిన్ = ప్రసిద్ధితో, పొల్చెన్ = ప్రకాశించెను

తాత్పర్యము. ఆ ఎత్తయిన ఏనుఁగులయు, రథములయు, గుఱ్ఱములయు, భటులయు కవచములయు, అలంకారములందలి మణులయు, వాఁడియైన బాణ సమూహములయు మిక్కిలి భయంకరములయిన కాంతులు నక్షత్రలోకము భూమికిఁ గాఁపురమువచ్చెనా యనునట్లు ప్రకాశమానముగా శోభిల్లును లేదా వారి సైన్యముల కాంతి ప్రాణహరమైన ప్రళయకాలాగ్నిపుంజమా యనఁ బ్రసిద్ధితోఁ బ్రకాశించెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష 'అరద' అను రథ తద్భవరూపమును ఈ కవి తత్సమముగాఁ బ్రయోగించుచున్నాఁడు అసుహృత్కాలాగ్ని పుంజంబొ - నాన్ - శత్రువులకుఁ బ్రళయసమయాగ్ని సమూహమోయనఁగా - అనియును నర్థము చెప్పవచ్చును

వ ఇ ట్లఖిల భువన సామ్రాజ్య విభవైశ్వర్య శౌర్యాధిదేవతా కేళీరత్న కుత్కీలంబులుం బోలెఁ దేజరిల్లుచు నుభయబలంబులుం బన్ని ఘూర్ణిల్లుచుండె నట్టి యవసరంబునం దారకాసురుండు సురవరోరగ గరుడ గంధర్వ సిద్ధ విద్యాధరాద్యఖిల భువన భవనాధీశ్వరులు పూర్వ పరిచయంబులైనం దదీయానంతైశ్వర్య ప్రభావాతిశయంబుల భేదింప నేరక, విభ్రాంతాంతరంగుం డగుచు నీ పన్నినిలిచిన గీర్వాణానంతసామంతు లెవ్వరెవ్వ రిందుధరనందనుండగు కుమారుం డెవ్వండని దనుజగురు నడిగినం గని వారి భావించి చూచి

అర్థము ఇట్లు, అఖిల కుత్కీలంబులున్ + పోలెన్, అఖిల + ఎల్ల , భువన =లోకములయొక్క, సామ్రాజ్య - విభవ + ఐశ్వర్య - శౌర్య + అధిదేవతా= సామ్రాజ్యవైభవము, ఐశ్వర్యము, శౌర్యము అనువానియొక్క, అధిదేవతా = అధిష్ఠానదేవతయొక్క, కేళీ - రత్న - కుత్కీలంబులున్ + పోలెన్ = రత్నమయమైన క్రీడాపర్వతముల విధమున, తేజరిల్లుచున్ = ప్రకాశించుచు, ఉభయ - బలంబులున్ = ఇరువురి సైన్యములును, పన్ని = యుద్ధసన్నద్ధములయి, ఘూర్ణిల్లుచున్ + ఉండెన్ = తిరుగుడువడుచుండెను, అట్టి + అవసరంబునన్ = అట్టి సమయమున, తారక + అసురుండు, సుర - వర - ఉరగ - గరుడ - గంధర్వ - సిద్ధ - విద్యాధర + ఆది + అఖిల - భువన - భవన + అధి + ఈశ్వరులు = దేవతాశ్రేష్ఠులు, నాగులు, గరుడులు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగు నెల్లలోకముల ప్రభువులు, పూర్వపరిచయంబులు + ఐనన్ = ముందు తెలిసిన వారయినను, తదీయ + అనంత + ఐశ్వర్య - ప్రభా - విభవ + అతిశయంబులన్ = వారి అంతులేని ఐశ్వర్యముయొక్కయు, కాంతుల యొక్కయు, వైభవముల యొక్కయు ఆధిక్యములను, భేదింపన్ + నేరక = వేర్పఱుపఁజాలక, విభ్రాంత + అంతరంగుండు + అగుచున్ = విశేషముగా భ్రాంతి నొందిన మనస్సు గలవాఁడు అగుచు, ఈ - పన్ని - నిలిచిన = ఈ యుద్ధసన్నద్ధమయి నిలిచిన, గీర్వాణ + అనంత - సామంతులు = దేవతల అంతులేని సామంతులు, ఎవ్వరు + ఎవ్వరు ? ఇందు ధర - నందనుండు = ఈశ్వరుని కుమారుఁడు అగు, కుమారుండు = కుమారస్వామి, ఎవ్వండు ? అని దనుజ - గురున్ = రాక్షస గురువైన శుక్రుని, అడిగినన్, కని, వారిన్, భావించి - చూచి = పరిశీలించి చూచి

తాత్పర్యము . ఇట్లు ఎల్లభువనముల సామ్రాజ్యవైభవములయు, ఐశ్వర్యములయు, శౌర్యములయు అధిష్ఠానదేవత రత్నమయక్రీడా పర్వతములోయనఁ బ్రకాశించుచు నిరువురి సైన్యములును యుద్ధసన్నద్ధములయి తిరుగుడువడుచుండెను అట్టి సమయమునఁ దారకాసురుఁడు దేవతాశ్రేష్ఠులు, నాగులు, గరుడులు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు మున్నగు నెల్లలోక ప్రభువులు మునుపు తెలిసినవారయినను వారి అంతులేని యైశ్వర్యములయుఁ దేజస్సులయు, విభవములయు నతిశయములచే వేర్పఱుపఁజాలక, విశేషభ్రాంతి నొందినవాఁడగుచు, ' ఈ యుద్ధసంసిద్ధులయి నిలిచిన దేవతల అసంఖ్యాక సామంతు లెవరెవరు? ఈశ్వరుని కొడుకగు కుమారస్వామి యెవఁడు?' అని రాక్షసగురువగు శుక్రు నడుగఁగా అతఁడు వారిని బరిశీలించి చూచి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు · అలంకార ముత్ప్రేక్ష

శుక్రుఁడు తారకునకు అమరవీరులను నిరూపించుట

శా వీ రేకాదశరుద్రు, లష్టవసువుల్ వీ, రాదిశౌర్యోన్నతుల్
వీ, రయ్యిద్దఱు నశ్వినుల్, దినకరుల్ వీ రెన్నఁ బన్నిద్దఱున్,
ధీరుల్ సన్ముఖహవ్యముఖ్యులు త్రయస్త్రింశాదిదేవాలి నా
వీరుల్ సు, మ్మమరేంద్రవైరి! సుమహద్విఖ్యాతకీర్తీశ్వరా? 86

అర్థము అమర + ఇంద్ర - వైరి = దేవేంద్రునకు శత్రువయినవాఁడా! సుమహత్ + విఖ్యాత - కీర్తి + ఈశ్వరా = మిక్కిలి గొప్పదియు, ప్రసిద్ధమయినదియునైన కీర్తికి ప్రభువైనవాఁడా - తారకుఁడా!, వీరు, ఏకాదశ - రుద్రులు = పదునొకండ్రు రుద్రులు, వీరు, అష్ట - వసువుల్ = ఎనమండ్రు వసువులు, వీరు, ఆదిశౌర్య + ఉన్నతుల్ = ప్రమాణమయిన శౌర్యముచే నధికులు, అయ్యిద్దఱున్ (ఆ + ఇద్దఱున్), అశ్వినుల్, ఎన్నన్ = గణింపఁగా, వీరు, పన్నిద్దఱున్ = పండ్రెండుగురును, దినకరుల్ = సూర్యులు, ధీరుల్ = ధైర్యవంతులు, సత్ + ముఖ - హవ్య - ముఖ్యులు = ఉత్తమ యాగ హవిస్సునకుఁ బ్రధానమైనవారు, త్రయస్త్రింశ + ఆది - దేవ + ఆలి - నాన్ = ముప్పదిమువ్వురు ముఖ్యదేవతల వరుస అనఁగా, వీరుల్ సుమ్ము

తాత్పర్యము . ఓయి దేవేంద్రవిరోధీ! మిక్కిలి గొప్పదియు, ప్రసిద్ధమయినదియు నగు కీర్తికి ప్రభువైన వాఁడా! తారకుఁడా!, వీరు పదునొకండ్రు రుద్రులు, వీరు ఎనమండ్రు వసువులు, వీరు ప్రామాణికమైన శౌర్యముచే నున్నతులు, ఆ యిరువురును అశ్వినీదేవతలు వీరు పండ్రెండుగురు సూర్యులు, వీరు ధీరులు, యజ్ఞహవిస్సునకు ముఖ్యులు అగు ముప్పదిమూవురుదేవతలును వీరులు సుమీ!

క ఉద్యోగనిరతు లాయుధ
విద్యాగమకోవిదులు సవిస్తరకీర్తుల్
ప్రద్యోతనోరుతేజులు
విద్యాధరు లతులబలులు వీరులు ధీరుల్ 87

అర్థము .(వీరు), ఉద్యోగ - నిరతులు = పూనికయందు ఆసక్తి గలవారు, ఆయుధ - విద్యా + ఆగమ - కోవిదులు = అస్త్రవిద్యయను శాస్త్రమునందు పండితులు, సవిస్తర - కీర్తుల్ = బాగుగా వ్యాపించిన కీర్తిగలవారు, ప్రద్యోతన +

ఉరు - తేజులు = సూర్యుని అధికమయిన తేజస్సు గలవారు, అతుల - బలులు = సాటిలేని పరాక్రమము గలవారు, వీరులు, ధీరుల్, అగు విద్యాధరులు

తాత్పర్యము . పూనికియందు ఆసక్తి గలవారు, అస్త్రవిద్యయం దారితేఱినవారు, బాగుగా వ్యాపించిన కీర్తిగలవారు, సూర్యుని అధికమైన తేజస్సుగలవారు, సాటిలేని బలముగలవారు, వీరులు, ధీరులు అగు విద్యాధరులు వీరు

క ఈతఁడు నైఋతి, దహనుం
డాతఁడు, వనధీశుఁ డీతఁ, డాతఁడు పవనుం,
డీతండు కిన్నరేశ్వరుఁ,
డాతం డురగాధినాథుఁ డమరవిరోధీ! 88

అర్థము అమర - విరోధీ = దేవవైరీ - తారకా! ఈతఁడు, నైఋతి, ఆతఁడు, దహనుండు = అగ్ని, ఈతఁడు, వనధి + ఈశుఁడు = సముద్రాధిపతియగు వరుణుఁడు, ఆతఁడు, పవనుండు = వాయువు, ఈతఁడు, కిన్నర + ఈశ్వరుఁడు = యక్షరాజు అగు కుబేరుఁడు, ఆతండు, ఉరగ + అధినాథుఁడు = సర్పరాజు.

తాత్పర్యము . తారకాసురా ! ఇతఁడు నైఋతి అతఁడు అగ్ని, ఇతఁడు వరుణుఁడు, అతఁడు వాయువు, ఇతఁడు కుబేరుఁడు, అతఁడు సర్పరాజు

క. అంతకు మును నినుఁ దలపడు
నంతకుఁ గ్రూరోగ్రదండ మంకించుచుఁ జీ
మంతకుఁ గైకొనఁ డసుర భ
టాంతక విక్రాంతి దేవతాంతక కంటే! 89

అర్థము . దేవతా + అంతక = దేవాంతకా! తారకా! మును = ముందు, నినున్ = నిన్ను, తలపడు + అంతకున్ = ఎదిరించువఱకును, క్రూర + ఉగ్ర - దండము = క్రూరము, భయంకరమునైన దండము, అంకించుచున్ = త్రిప్పుచు, చీమ + అంతకున్ + కైకొనఁడు = ఇంచుకైనను లక్ష్యపెట్టఁడు, (అట్టి), అసుర-భట + అంతక - విక్రాంతిన్ = రాక్షస వీర నాశకమైన పరాక్రమము గలవానిని, అంతకున్ = యమునిని, కంటే = కంటివి + ఏ = చూచితివా?

తాత్పర్యము . ఓయి దేవాంతకా! తారకా! పూర్వము నిన్ను మార్కొనునంతవఱకును గ్రూరము, ఉగ్రమునైన దండమును త్రిప్పుచు నించుకైనను గణింపఁడు అట్టి రాక్షస వీరనాశక పరాక్రముని యమునిఁ జూచితివా?

విశేషములు అలంకార మనుప్రాసము

క గోపతి కారుణ్యంబున
గోపతి సారూప్యవృత్తిఁగొని సురతతిలో
గోపతిపైఁ బొలు పమరిన
గోపతి నీశానుఁ గంటె గోపతివైరీ! 90

అర్థము: గోపతి - వైరీ = ఇంద్ర విరోధీ - తారకా!, గోపతి = పశుపతియైన ఈశ్వరుని యొక్క, కారుణ్యంబునన్ = దయచేత, గోపతి - సారూప్య - వృత్తిన్ = ఈశ్వరునితో సమానమగు రూపముయొక్క వర్తనమును, కొని = స్వీకరించి, సుర - తతిలోన్ = దేవతా సమూహములో, గోపతిపైన్ = వృషభముపై, పొలుపు + అమరిన = చక్కఁగా నొప్పిన,గోపతిన్ = దిక్పాలకుని, ఈశానున్ = ఈశాన్యదిగధిపతియగు ఈశానుని, కంటె? = చూచితివా?

తాత్పర్యము. ఓయి యింద్రవిరోధీ! తారకా! పశుపతి దయచే నీశ్వరునితో సదృశమైన రూపమును బొంది, దేవతలలో వృషభముపైఁ జక్కఁగా నొప్పిన దిక్పాలకుఁడగు ఈశానునిఁ జూచితివా?

విశేషములు : అలంకారము శ్లేషము, అనుప్రాసము

సీ. జంగమనగముల భంగి నత్యున్నతి
నింగితో రాయు మాతంగఘటలు
ధరణీతలం బొక్క పరువడి నెగసె నా
రమణఁ గ్రిక్కిఱిసిన రథచయంబుఁ
దనరారు వారాశి తరఁగల ఘటన నాఁ
గర మొప్పఁ బొలయు నత్తురగదళముఁ
బొలుపొందఁగా రెల్లు పూచిన విధమున
మునుకొను కొంతంపు మొగ్గరంబుఁ

తే దవర ముప్పొంగు గతిఁ గడితలల పిండుఁ
బొలయు దుప్పుల కదుపులు విలుబలంబుఁ
గలిగి సురలకై తొల్లి ఎఱ్ఱఁ ఁఁములఁ
నీకు మార్కొన్న వీరుఁ డిక్ష్వాకుఁడితఁడు 91

అర్థము. జంగమ - నగముల - భంగిన్ = నడగొండలవిధమున, అతి + ఉన్నతిన్ = మిక్కిలి ఎత్తుచే, నింగితోన్ = ఆకాశముతో, రాయు = ఒరయునట్టి, మాతంగ - ఘటలున్ = ఏనుఁగులగుంపులును,

ధరణీ -తలంబు = భూతలము, ఒక్క - పరువడిన్ = ఒక్క వరుసను, ఎగసెన్ + నాన్ = ఎగిరెనా యనునట్లు, రమణన్ = ఒప్పుగా, క్రిక్కిఱిసిన = ఎడములేకయున్న, రథ - చయంబున్ = రథముల సమూహమును,

తరచారు = ఒప్పునట్టి, వారాశి (వార్ + రాశి) = సముద్రముయొక్క, తరఁగల = అలలయొక్క, ఘటన - నాన్ = కూర్పు అనునట్లు, కరము + ఒప్పన్ = మిక్కిలి ఒప్పునట్లు, పొలయు = సంచరించు, ఆ + తురగ - దళమున్ = ఆ గుట్టముల దండును,

పొలుపు + ఒందఁగాన్ = చక్కఁగా, రెల్లు, పూచిన - విధమునన్, మునుకొను = అతిశయించు, కొంతంపు మొగ్గరంబున్ (కొంతము + మొగ్గరంబున్) = కుంతాకారముగా నుండు వ్యూహమును,

తవరము = లక్క, ఉప్పొంగు - గతిన్= ఉప్పొంగు విధమున, కడితలల - పిండున్ = ఆయుధవిశేషముల గుంపును, పొలయు - దుప్పుల - కడుపులున్ = సంచరించు దుప్పుల గుంపులును, విలు-బలంబున్ = ధనుర్బలమును, కలిగి, సురలకై = దేవతలకై, తొల్లి = పూర్వము, పెక్కులు - రణములన్ = పలు యుద్ధములందు, నీకున్ = నీతో, మార్కొన్న = ఎదురుకొన్న, వీరుఁడు, ఇతఁడు, ఇక్ష్వాకుఁడు

తాత్పర్యము : నడగొండల విధమున మిక్కిలి ఎత్తయి ఆకాశముతో రాయు నేనుఁగుల గుంపులును, భూతల మొక్కపెట్ట నెగసె ననువిధమునఁ గ్రిక్కిఱిసిన రథసమూహమును, ఒప్పెడు సముద్రపుటలల కూర్పు అనునట్లు మిక్కిలి ఒప్పు గలిగి సంచరించు గుట్టముల దండును, అందముగా రెల్లు పూచిన విధమున నతిశయించు కుంతాకారవ్యూహమును, లక్క ఉప్పొంగు విధమున ఆయుధవిశేషములగుంపును, సంచరించు దుప్పుల గుంపులును, ధనుర్బలమును గలిగి దేవతలకొఱకు పలుయుద్ధముల నీతో మార్కొనిన ఇక్ష్వాకుఁడనెడి వీరుఁడితఁడు

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష తవర ముప్పొంగుగతిన్ - ఉపమ నీకు మార్కొన-నీతో మార్కొన 'షష్ఠీస్థానికంబగు కువర్ణకం బొక్కకచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి' ప్రౌఢ కారక 13 కడితలల పిండుఁ బొలయు దుప్పుల కదుపుల విలుబలంబు తృప్తికరముగా అర్థము కాలేదు

ఉ. వాలిన దాయవారిదొరవారి ననేకులఁ గూర్చుకొన్నఁ గా
కేల జయింపవచ్చునని యేర్పడనీ కని మాఱువన్నెనో
నా లలితామితోరునయనవ్ర జతారకసంయుతాంగుఁడై
క్రాలు సహస్రలోచనుఁడు కౌశికుఁ డీతఁడు తారకాహ్వయా! 92

అర్థము. తారక + ఆహ్వయా = తారకుఁడను పేరుగలవాఁడా ! వాలిన = అతిశయించిన, దాయవారి - దొరవారిన్ = శత్రుపక్షపుఁబ్రభువులను, అనేకులన్ = పెక్కండ్రను, కూర్చుకొన్నన్ + కాక = కూర్చుకొనిననే కాని, ఏల - జయింపన్ - వచ్చున్ + అని =ఎట్లు గెలువవచ్చునని, ఏర్పడన్ = స్పష్టముగా, నీకున్, అనిన్ = యుద్ధమునందు, మాఱు + పన్నెనో - నాన్ = ప్రతివ్యూహమును పన్నెనా అనునట్లు, లలిత + అమిత + ఉరు - నయన - వ్రజ - తారక - సంయుత + అంగుఁడు + ఐ = మనోహరములైన, అపరిమితములైన, గొప్ప కన్నుల సమూహముయొక్క, నల్లగ్రుడ్డులతోఁగూడిన శరీరముగలవాఁడయి, క్రాలు = ఒప్పునట్టి, సహస్రలోచనుఁడు = వేయి కన్నులు గలవాఁడు, కౌశికుఁడు = ఇంద్రుఁడు, ఈతఁడు

తాత్పర్యము. ఓయి తారకనామఁడా ! అతిశయించిన శత్రు పక్షపుఁబ్రభువుల ననేకులను గూర్చుకొననిదే యెట్లు గెలువవచ్చునని నీకు యుద్ధమునఁ బ్రతివ్యూహమును బన్నెనా యనునట్లు, లలితములయిన పెక్కు కన్నుల తారకములతోఁ గంటినల్లగ్రుడ్డులతోఁగూడిన శరీరముగలవాఁడయి యొప్పు వేయికన్నులు గల ఇంద్రుఁ డీతఁడు

విశేషములు. ప్రతిపక్షరాజైన నీవు తారకుఁడవు గావున నట్టి పేరుగలవారిని బెక్కండ్రను అలంకారము శ్లేషోత్థాపితోత్ప్రేక్ష తారకాహ్వయా యను సంబుద్ధి యిట సార్థకము

మ. హరభాలాంబకజాతకోపశిఖి ధూమానీకసంభూత 'భీ
కర శూలాసి విలగ్న హస్త, సుమహత్కంకాళి'హుంకార ని
ష్ఠురదంష్ట్రాగ్రవిభాసితాస్య, విలయాటోపోగ్ర పూర్వామరే
శ్వర రక్తాసవపానమత్త యిది తచ్ఛాముండి దైత్యేశ్వరా ! 93

అర్థము. దైత్య + ఈశ్వరా = రాక్షసప్రభూ - తారకా! ఇది = ఈమె, హర హస్త, హర = ఈశ్వరునియొక్క, భాల = నొసటియందలి,అంబక = కంటినుండి, జాత = పుట్టిన, కోప = కోపమనెడి, శిఖి =అగ్నియొక్క, ధూమ + అనీక = పొగల గుంపునుండి, సంభూత = పుట్టిన, భీకర = భయంకరమయిన , శూల + అసి = శూల ఖడ్గములతో, విలగ్న= అనుసంధింపఁబడిన, హస్త = చేతులు గలది, సుమహత్ = మిక్కిలి గొప్పదియగు, కంకాళి = అస్థిపంజరము, గలది, హుంకార - నిష్ఠుర - దంష్ట్రా + అగ్ర = హుమ్మను ధ్వనిచే, పరుషమైన కోఱల కొనలచే, విభాసిత = ప్రకాశించిన,ఆస్య=ముఖముగలది, విలయ + ఆటోప + ఉగ్ర = ప్రళయసమయమునందలి విజృంభణముచే భయంకరమయినది, పూర్వామర + ఈశ్వర - రక్త + ఆసవ - పాన - మత్త = రాక్షసరాజుల రక్తమనెడి మద్యముయొక్క త్రావుటచే మదించినది, తత్ + చాముండి + ఆ చాముండి

తాత్పర్యము: ఓ రాక్షస ప్రభూ! తారకా! ఈశ్వరుని ఫాలలోచనమునుండి వుట్టిన క్రోధాగ్నిధూమనమూహమువలనఁ బుట్టిన భయంకర శూలఖడ్గములతోఁగూడిన చేతులు గలది, మిక్కిలి పెద్ద అస్థిపంజరము గలది, హుంకారముచే నిష్ఠురమైన కోఱలకొనలచేఁ బ్రకాశించు ముఖము గలది, ప్రళయ సమయమునందలి విజృంభణముచే భయకంరమైనది, రాక్షసరాజుల రక్తమనెడి మద్యమును త్రావుటచే మదించినది అగు నీమె ఆ చాముండి

విశేషములు . అలంకారము - కోపశిఖి, రక్తాసవ -రూపకములు తచ్చాముండి - తద్ + చాముండి

శా భాలాభీలవిలోచనానలరుచిభ్రాజిష్ణు, లుగ్రాహికా
పాలాకల్పు, లనల్పు, లుజ్జ్వల జటా భస్మాజినేందూద్వహుల్,
శూలాసిప్రముఖాఖిలాయుధధరుల్, శూరుల్, మహావిగ్రహుల్,
నీలగ్రీవులు, వీరు, రుద్రు, లనిలో నిర్భేద్యు, లాద్యుల్ మహిన్. 94

అర్థము. వీరు, భాలా జిష్ణులు, భాల= నొసటి, ఆభీల = భయంకరమైన విలోచన= కంటి, అనల= మంటల యొక్క, రుచి = కాంతిచే, భ్రాజిష్ణులు = ప్రకాశించువారు, ఉగ్ర + అహి - కాపాల + ఆకల్పులు = భయంకరములయిన, పాములు, పుట్టెలు అలంకారములుగాఁగలవారు, అనల్పులు = అల్పులు గానివారు - అధికులు, ఉజ్జ్వల - జటా - భస్మ + అజిన + ఇందు + ఉద్వహుల్ = ప్రకాశించు జడలను, బూదిని, చర్మమును, చంద్రుని ధరించినవారు, శూల +అసి - ప్రముఖ

+ అఖిల + ఆయుధ - ధరుల్ = శూలము, ఖడ్గముమున్నగునెల్ల ఆయుధములను దాల్చినవారు, శూరుల్, మహత్ (మహా)- విగ్రహుల్ + గొప్ప శరీరములు గలవారు, నీల-గ్రీవులు = కాలకంఠములు గలవారు, అ ెలోన్ = యుద్ధములో, నిర్భేద్యులు = భేదింపశక్యము గానివారు, మహిన్ = భూమియందు, ఆద్యుల్ = మొదటివారు

తాత్పర్యము . నొసటికంటిమంటల కాంతిచే ప్రకాశించువారు, భయంకరములైన పాములు, పుట్టెలు ఆభరణములుగా గలవారు, అనల్పులు, ఉజ్జ్వలములయిన జడలు, భస్మము, చర్మము, చంద్రుడు అనువానిని ధరించిన వారు, శూలము కత్తి మున్నగు ఆయుధములను దాల్చినవారు, శూరులు గొప్ప శరీరము గలవారు, కాలకంఠులు, యుద్ధమున భేదింపరానివారు, మహిలో ఆద్యులు అగు వీరు రుద్రులు

సీ హరుఁడు లోకములు సంహారంబు చేయఁగఁ
దలఁచుటకంటె ముందఱఁ గడంగి
బ్రహ్మాండములు మ్రోల వ్రాలి మ్రక్కిడు భంగి
మొగిఁ జెఱలందుల మ్రుక్కువారు
విన్ననువులు చూపు వేడుక నట కొంద
ఱణిమాదిగుణముల నలవరించి
బ్రహ్మాండములు కొన్ని పట్టి గ్రక్కున మ్రింగి
కొనియుండు బ్రహ్మాండకుహరములకు

ఆ ననువు చేసి యవియును నవియకుం
డంగ దొంతి వెట్టి మ్రింగునట్టి
గణములోన నగ్రగణ్యుండు కాలాగ్ని
రుద్రమూర్తి వీరభద్రుఁ డితఁడ 95

అర్థము: హరుఁడు = ఈశ్వరుఁడు, లోకములు, సంహారంబు, చేయంగన్, తలఁచుటకంటెన్, ముందఱన్, కడంగి = పూని,

బ్రహ్మాండములు, మ్రోలన్ = ఎదుర, వ్రాలన్, మ్రక్కిడు - భంగిన్ = బాధపెట్టు విధమున, మొగిన్ = పూనికతో, చెఱలందులన్ = చెఱసాలలలో, మ్రుక్కువారు = తోయువారు

విన్ననువులు - చూపు - వేడుకన్ = నేర్పులు చూపు వేడ్కతో, అట కొందఱు, అణిమ + ఆది - గుణములన్ = అణిమమున్నగు గుణములను, అలవరించి = చేసి

బ్రహ్మాండములు, కొన్ని, పట్టి, గ్రక్కునన్ = శీఘ్రముగా, మ్రింగికొని + ఉండు, బ్రహ్మాండ - కుహరములకున్ = గుహలవంటి బ్రహ్మాండములకు, అనువు చేసి = వీలుచేసి, అవియున్ = అవియును, అవియుక + ఉండంగన్ పగులకుండులాగున, దొంతి - పెట్టి = వరుసగాఁబెట్టి, మ్రింగు +అట్టి, గణములోనన్ = ప్రమధుల గణములో, అగ్రణ్యుండు = మొదట లెక్కపెట్టఁదగినవాఁడు, కాల + అగ్ని - రుద్ర - మూర్తి = ప్రళయసమయమునందలి అగ్నివలె భయంకరమైన ఆకారము గలవాఁడు, (అగు), వీరభద్రుఁడు, ఇతఁడు + అ = ఇతఁడే

తాత్పర్యము ఈశ్వరుఁడు లోకములను సంహరింపనెంచుటకు ముందే పూని బ్రహ్మాండములు ఎదుర వ్రాలఁగా బాధపెట్టు విధమునఁ జెలఁరేగిన వారు, నేర్పులు ప్రదర్శించు వేడుకతోఁ గొందలు అణిమము మున్నగు గుణములను జేసి, బ్రహ్మాండములు కొన్నిటిని పట్టి వెంటనే మ్రింగ బ్రహ్మాండ కుహరముల ననుకూలపఱిచి, అవి యన్నియుఁ బగులకుండులాగున వరుసగాఁ బెట్టి మ్రింగునట్టి గణములలో మొదట లెక్కిడఁదగినవాఁడు, ప్రళయసమయాగ్ని భయంకరాకారము గలవాఁడు అగు వీరభద్రుఁ డితఁడే

చ బలిఁ జెఱఁబెట్టి, రాహుతల పందల యెత్తి, సుధారసంబు వే
ల్పుల కశనంబుగా నొసఁగి, పూర్వసురావళి నొంపకుండఁగాఁ
గలహములోన నోర్చి, త్రిజగంబు సుఖస్థితిఁ గాచుచుండు న
త్యలఘుపరాక్రముండు దనుజాంతకుఁ డాతఁడు దేవతాంతకా! 96

అర్థము. దేవతా + అంతకా = దేవతలను నాశనముచేయు తారకుఁడా!, ఆతఁడు, బలిన్ = బలిచక్రవర్తిని, చెఱన్ + పెట్టి = బంధించి, రాహు-తల -పందల + ఎత్తి = రాహువు తల పుట్టై ఎత్తి, సుధా - రసంబున్ = అమృతరసమును, వేల్పులకున్ = దేవతలకు, అశనంబుగాన్ = ఆహారముగా, ఒసఁగి = ఇచ్చి, పూర్వ - సుర + ఆవళి = రాక్షసుల వరుస, నొంపక + ఉండఁగాన్ = బాధింపకుండునట్లు, కలహములోనన్ = యుద్ధములో, ఓర్చి = ఓడించి, త్రిజగంబున్ = ముల్లోకములను, సుఖ -స్థితిన్ = సుఖముగా, కాచుచున్ + ఉండు = రక్షించుచుండు, అతి + అలఘు - పరాక్రముండు = మిక్కిలి అధికమైన పరాక్రమము గలవాఁడు (అగు) దనుజ + అంతకుఁడు = రాక్షసనాశకుఁడు - విష్ణువు

తాత్పర్యము. ఓయి దేవాంతకా! తారకా! అతఁడు బలిచక్రవర్తిని బంధించి, రాహువు తల పుట్టెనెత్తి సుధారసమును దేవతల కాహారముగా నిచ్చి, రాక్షసులు బాధింపకుండునట్లు వారిని యుద్ధమున నోడించి ముల్లోకములను సుఖముగా రక్షించుచుండు మహాపరాక్రమవంతుఁడగు రాక్షసాంతకుఁడు విష్ణువు

సీ నీలాద్రిపై నీలనీరదం బొఱఁగిన
కరణి మహామూషకంబు నెక్కి
తన మదగంధంబు తాఁకినఁ బెలుకుటి
మన వీటి గజములు మదము డింపఁ
దన కర్ణచలనాభిజనితానిలాహతి
నోలి రాక్షససేన తూలుచుండఁ
దన రౌద్రవేషంబుఁగని భీతి నసురలు
వడి నిల్చునిల్వ జీవములు వోవఁ

ఆ గింకఁ బరశుఖండ మంకించి రిపువంశ
ఖండనంబు సేయఁ గడఁగు చున్న
షణ్ముఖాగ్రజన్మ సామజముఖ గణ
నాథు నఖిలదనుజనాథ! కంటె? 97

అర్థము: అఖిల - దనుజ - నాథ = ఎల్ల రాక్షసులకుఁ బ్రభువైన వాఁడా! తారకా!, నీల + అద్రిపైన్ = కాటుక కొండపై, నీల - నీరదంబు = నల్లని మేఘము, ఒఱఁగిన - కరణిన్ = వ్రాలిన విధమున, మహత్ (మహా) + మూషకంబున్ = పెద్దయెలుకను, ఎక్కి,

తన - మద - గంధంబు = తన మదపువాసన, తాఁకినన్ = వేయఁగా, పెలుకుటి = భయపడి, మన - వీటి - గజములు =మన నగరమునందలి యేనుఁగులు, మదము డింపన్ = మత్తు వీడఁగా

తన - కర్ణ - చలన + అభిజనిత + అనిల + ఆహతిన్ = తన చెవుల కదలికవలనఁ బుట్టిన గాలిదెబ్బచే, రాక్షస - సేన, ఓలిన్ = బాగుగా, తూలుచున్ + ఉండన్ = చలించుచుండఁగా

తన - రౌద్ర - వేషంబున్ = తన భయంకరాకారమును, కని, భీతిన్ = భయముతో, అసురలు = రాక్షసులు, వడిన్ = వేగముగా, నిల్చు - నిల్వన్ = నిట్టనిలువునను, జీవములు + పోవన్ = ప్రాణములు పోఁగా - కోలుపోఁగా

కింకన్ = కోపముతో, పరశు - ఖండము = పరశువు (గండ్రగొడ్డలి) అనునాయుధశకలమును, అంకించి, = జళిపించి, రిపు - వంశ - ఖండనంబు = శత్రువంశముయొక్క నఱకుట, చేయన్ = చేయుటకు, కడఁగుచున్ + ఉన్న = పూనుచున్న, షష్(ట్) ముఖ + అగ్రజన్మున్ = కుమారస్వామి అన్నను, సామజ - ముఖున్ = గజముఖుని, గణ - నాథున్ = ప్రమథగణనాయకుని, కంటె (కంటివి +ఎ) = చూచితివా !

తాత్పర్యము. ఓయి, సర్వరాక్షసరాజా! తారకా! కాటుక కొండపై నల్లని మేఘము వ్రాలిన విధమున మహామూషికమునెక్కి, తన మదపువాసన వేయఁగా భయపడి మన నగరమునందలి యేనుఁగులు మదము వీడఁగా, తనచెవుల కదలికవలనఁబుట్టిన గాలిదెబ్బకు రాక్షససేన చలింపఁగా, తన భయంకర రూపమును జూచి భయముతో వేగముగా రాక్షసుల ప్రాణములు నిట్టనిలువునను పోఁగా, కోపముతో పరశుఖండమును జళిపించి శత్రుఖండనమును జేయుటకుఁ బూనుచున్న కుమారస్వామిఅన్నయు, గజముఖుఁడును, ప్రమథ గణ నాయకుఁడును అగు వినాయకునిఁ జూచితివా?

విశేషములు నీలాద్రిపై నీలనీరదం బొఱఁగిన కరణి - అలంకార ముపమ

మ. **ఉదయోత్తుంగనగంబుపై వెలుఁగు నత్యుగ్రాంశుఁడుం బోలె నై**
మదనాగేంద్రముపై నిజోరుతనుధామస్ఫూర్తిఁ బొల్పొందుచున్
ద్రిదశాచార్యుఁడు చూప నిన్నుఁ గలుషోద్రేకంబుతోఁ జూచు ష
డ్వదనుం గంటె కుమారు వీరు నతదేవవ్రాతరక్షామణిన్ 98

అర్థము. ఉదయ + ఉత్తుంగ - నగంబుపైన్ = ఉదయమనెడి యెత్తయిన పర్వతముమీఁద, వెలుఁగు = ప్రకాశించు, అతి + ఉగ్ర+అంశుఁడున్ + పోలెన్ + ఐ = సూర్యునివలె నయి, మద- నాగ + ఇంద్రము + పైన్ = మత్తేభరాజముమీఁద నిజ + ఉరు - తను - ధామ - స్ఫూర్తిన్ = తనదైన గొప్ప శరీరకాంతియొక్క ప్రకాశముతో, పొల్పు + ఒందుచున్ = అందము నందుచు, త్రిదశ + ఆచార్యుఁడు = దేవగురుఁడు - బృహస్పతి, చూపన్ = చూపఁగా, నిన్నున్, కలుష + ఉద్రేకంబుతోన్ = కోపావేశముతో, చూచు , షష్ (ట్) + వదనున్ = ఆఱుమొగముల వానిని, వీరున్ = వీరుఁడైనవానిని, నత - దేవ - వ్రాత - రక్షా - మణిన్ = నమస్కరించిన దేవతల సమూహముయొక్క రక్షణము నందు శ్రేష్ఠుని, కుమారున్ = కుమారస్వామిని, కంటె = కంటివి +ఎ = చూచితివా?

తాత్పర్యము. ఎత్తయిన ఉదయ పర్వతముపై వెలుఁగు సూర్యునివలెనయి మత్తేభరాజముపైఁ చన గొప్ప శరీరకాంతిచే నందగించుచు, దేవగురుఁడైన బృహస్పతి చూపఁగా నిన్నుఁ గోసావేశమునఁ జూచు నాలుమొగములవాఁడను, వీరుఁడును, నమస్కరించిన దేవతలను రక్షించువాఁడును అగు కుమారస్వామిని జూచితివా?

విశేషములు. అలంకారము ఉపమ

క రయమునఁ జని షణ్ముఖునకుఁ
బ్రియమునఁ జామరలు డాసి పెట్టుచు నిన్నుం
గయికొనక పాసిపోయిన
జయ విజయులఁ జూచితే నిశాచరనాథా! 99

అర్థము. నిశాచర- నాథా = రాక్షసరాజా! తారకా! రయమునన్ = వేగముగా, చని, షణ్ముఖునకున్ = కుమారస్వామికి, ప్రియమునన్ = ప్రీతితో, చామరలు = వింజామరలు, డాసి = సమీపించి, పెట్టుచున్, నిన్నున్, కయికొనక = లెక్క చేయక, పాసిపోయిన = విడిచిపెట్టిపోయిన, జయవిజయులన్ = జయుని, విజయుని, చూచితే? = చూచితివి + ఏ

తాత్పర్యము. ఓయి రాక్షసరాజా, తారకా!, వేగముగా వెడలి కుమారస్వామికిఁ బ్రీతితో వింజామరలు వీచుచు నిన్ను లెక్కచేయక విడిచిపెట్టిపోయిన జయుని, విజయునిఁ జూచితివా?

వ అని యనేకామరవరులం బ్రత్యేకంబు చూపుచుండె నిటఁ గుమారుండు నమరగురుం గనుంగొనిన 'యీ పన్ని నిల్చిన దనుజసామంతవరు లెవ్వ రెవ్వ రిందుం దారకాసురుం డెవ్వ డెఱిఁగింపు' మనిన మహాప్రసాదంబని 100

అర్థము. అని, అనేక - అమర - వరులన్ = పెక్కండ్రు దేవశ్రేష్ఠులను, ప్రత్యేకంబు + అ = ఒక్కొక్కరినే, చూపుచున్ + ఉండెన్, ఇటన్ = ఇక్కడ, కుమారుండున్, అమర - గురున్ = దేవగురుఁడైన బృహస్పతిని, కనుంగొని, ఈ, పన్నినిల్చిన = ఈ యుద్ధసన్నద్ధులయి నిలిచిన, దనుజ - సామంతవరులు = రాక్షస సామంతరాజ శ్రేష్ఠులు, ఎవ్వరు + ఎవ్వరు, ఇందున్ = వీరిలో, తారక+ అసురుండు, ఎవ్వండు, ఎఱిఁగింపుము అనినన్, మహాప్రసాదంబు + అని

తాత్పర్యము: అని పెక్కురు దేవశ్రేష్ఠుల వేఱువేఱుగాఁ జూపుచుండెను ఇక్కడఁ గుమారస్వామి, బృహస్పతిని జూచి, ఈ యుద్ధసన్నద్ధులయి నిల్చిన

రాక్షసుని సామంతరాజశ్రేష్ఠులెవరెవరు? నీరిలోఁ దారకాసురుఁ డెవ్వఁడు? తెలుపు మనఁగా, 'మహాప్రసాద' మని - తరువాతి పద్యముతో నన్వయము

బృహస్పతి కుమారస్వామికి రాక్షసవీరులను నిరూపించుట

సీ దేవాసురోగ్రాజిఁ ద్రిదశులఁ బలుమాటు
నిర్జించె ననుఁ కాలనేమి యితఁడు
దనుజారి నెక్కటిఁ దలపడి దిక్కులు
దురములఁ జేకొను మరులఁ డితఁడు
వరుణు చేఁ గల మేలివస్తువు లెల్లను
బరువిడిఁ గొను మహాబాహుఁ డీతఁ
డుగ్రుఁడై జమునికి నొరగట్టి తనకెందు
మాటులేదను కేతుమాలి యితఁడు

ఆ కులధనంబులెల్లఁ గొనీ ధననాథు ని
ర్దనునిఁజేయు నుగ్రదంష్ట్రు డితఁడు
తారకునకుఁ దానె ఘోరాజిలో వజ్ర
కవచుఁడగు సహస్రకవచుఁ డితఁడు 101

అర్థము. ఇతఁడు, దేవ + అసుర + ఉగ్ర + ఆజిన్ = దేవతల రాక్షసుల భయంకరమైన యుద్ధమునందు, త్రిదశులన్ = దేవతలను, పలుమాటు = పెక్కు పర్యాయములు, నిర్జించెన్ = ఓడించెను, అను = అనునట్టి, కాలనేమి,

ఇతఁడు, దనుజ + అరిన్ = రాక్షసులవైరియగు ఇంద్రుని, ఎక్కటిన్ = ఒంటరిగా, తలపడి = ఎదురుకొని, దురములన్ = యుద్ధములందు, దిక్కులు, చేకొను = ఆక్రమించు, మరులఁడు = పిశాచము (?)

ఈతఁడు, వరుణు - చేన్ + కల = వరుణుని చేతనున్న, మేలి - వస్తువులు + ఎల్లను = మంచి వస్తువుల నన్నిటిని, బలువిడిన్ = బలాత్కారముగా, కొను, మహాబాహుఁడు,

ఇతఁడు, ఉగ్రుఁడు +ఐ = భయంకరుఁడయి, జమునికిన్ = యమునకు, ఒరగట్టి = అడ్డుకట్టి, తనకున్, ఎందున్, మాటు = ఎదురు, లేదు + అను కేతుమాలి

తాత్పర్యము ఎత్తయిన ఉదయ సర్వతముపై వెలుఁగు సూర్యునివలెనయి, మత్తేభరాజముపైఁ దన గొప్ప శరీరకాంతిచే నందగించుచు, దేవగురుఁడైన బృహస్పతి చూపఁగా నిన్నుఁ గోపావేశమునఁ జూచు నాలుమొగములవాఁడను, వీరుఁడును, నమస్కరించిన దేవతలను రక్షించువాఁడును అగు కుమారస్వామిని జూచితివా?

విశేషములు అలంకారము ఉపమ

క రయమునఁ జని షణ్ముఖునకుఁ
బ్రియమునఁ జామరలు డాసి పెట్టుచు నిన్నుం
గయికొనక పాసిపోయిన
జయ విజయులఁ జూచితే నిశాచరనాథా! 99

అర్థము. నిశాచర- నాథా = రాక్షసరాజా! తారకా! రయమునన్ = వేగముగా, చని, షణ్ముఖునకున్ = కుమారస్వామికి, ప్రియమునన్ = ప్రీతితో, చామరలు = వింజామరలు, డాసి = సమీపించి, పెట్టుచున్, నిన్నున్, కయికొనక = లెక్క చేయక, పాసిపోయిన = విడిచిపెట్టిపోయిన, జయవిజయులన్ = జయుని, విజయుని, చూచితే? = చూచితివి + ఏ

తాత్పర్యము. ఓయి రాక్షసరాజా, తారకా!, వేగముగా వెడలి కుమారస్వామికిఁ బ్రీతితో వింజామరలు వీచుచు నిన్ను లెక్కచేయక విడిచిపెట్టిపోయిన జయుని, విజయునిఁ జూచితివా?

వ అని యనేకామరవరులం బ్రత్యేకంబు చూపుచుండె నిటఁ గుమారుండు నమరగురుం గనుంగొనిన 'యీ పన్ని నిల్చిన దనుజసామంతవరు లెవ్వ రెవ్వ రిందుం దారకాసురుం డెవ్వ డెటిఁగింపు' మనిన మహాప్రసాదంబని 100

అర్థము. అని, అనేక - అమర - వరులన్ = పెక్కండ్రు దేవశ్రేష్ఠులను, ప్రత్యేకంబు + అ = ఒక్కొక్కరినే, చూపుచున్ + ఉండెన్, ఇటన్ = ఇక్కడ, కుమారుండున్, అమర - గురున్ = దేవగురుఁడైన బృహస్పతిని, కనుంగొని, ఈ, పన్నినిల్చిన = ఈ యుద్ధసన్నద్ధులయి నిలిచిన, దనుజ - సామంతవరులు = రాక్షస సామంతరాజ శ్రేష్ఠులు, ఎవ్వరు + ఎవ్వరు, ఇందున్ = వీరిలో, తారక+ అసురుండు, ఎవ్వండు, ఎఱిఁగింపుము అనినన్, మహాప్రసాదంబు + అని

తాత్పర్యము. అని పెక్కురు దేవశ్రేష్ఠుల వేఱువేఱుగాఁ జూపుచుండెను ఇక్కడఁ గుమారస్వామి, బృహస్పతిని జూచి, ఈ యుద్ధసన్నద్ధులయి నిల్చిన

రాక్షసుని సామంతరాజశ్రేష్ఠులెవరెవరు? వీరిలోఁ దారకాసురుఁ డెవ్వఁడు? తెలుపు మనఁగా, 'మహాప్రసాద' మని - తరువాతి పద్యముతో నన్వయము

బృహస్పతి కుమారస్వామికి రాక్షసవీరులను నిరూపించుట

సీ దేవాసురోగ్రాజిఁ ద్రిదశులఁ బలుమాఱు
నిర్జించె ననుఁ కాలనేమి యితఁడు
దనుజారి నెక్కటిఁ దలపడి దిక్కులు
దురములఁ జేకొను మరులఁ డితఁడు
వరుణు చేఁ గల మేలివస్తువు లెల్లను
బరువిడిఁ గొను మహాబాహుఁ డీతఁ
డుగ్రుఁడై జమునికి నొరగట్టి తనకెందు
మాఱులేదను కేతుమాలి యితఁడు

ఆ కులధనంబులెల్లఁ గొనీ ధననాథు ని
ర్జనునిఁజేయు నుగ్రదంష్ట్రి డితఁడు
తారకునకుఁ దానె ఘోరాజిలో వజ్ర
కవచుఁడగు సహస్రకవచుఁ డితఁడు 101

అర్థము. ఇతఁడు, దేవ + అసుర + ఉగ్ర + ఆజిన్ = దేవతల రాక్షసుల భయంకరమైన యుద్ధమునందు, త్రిదశులన్ = దేవతలను, పలుమాఱు = పెక్కు పర్యాయములు, నిర్జించెన్ = ఓడించెను, అను = అనునట్టి, కాలనేమి,

ఇతఁడు, దనుజ + అరిన్ = రాక్షసులవైరియగు ఇంద్రుని, ఎక్కటిన్ = ఒంటరిగా, తలపడి = ఎదురుకొని, దురములన్ = యుద్ధములందు, దిక్కులు, చేకొను = ఆక్రమించు, మరులఁడు = పిశాచము (?)

ఈతఁడు, వరుణు - చేన్ + కల = వరుణుని చేతనున్న, మేలి - వస్తువులు + ఎల్లను = మంచి వస్తువుల నన్నిటిని, బలువిడిన్ = బలాత్కారముగా, కొను, మహాబాహుఁడు,

ఇతఁడు, ఉగ్రుఁడు +ఐ = భయంకరుఁడయి, జమునికిన్ = యమునకు, ఒరగట్టి = అడ్డుకట్టి, తనకున్, ఎందున్, మాఱు = ఎదురు, లేదు + అను కేతుమాలి

ఇతఁడు, కుల - ధనంబులు + ఎల్లన్ = ఇంటిసొమ్ములన్నియును, కొని, ధననాథున్ = కుబేరుని, నిర్ధనునిన్ = ధనహీనుని చేయు నుగ్రదంష్ట్రుఁడు

ఇతఁడు, తారకునకున్, ఘోర + ఆజిలోన్ = భీకరయుద్ధములో, వజ్ర - కవచుఁడు = వజ్రమయకవచమైనవాఁడు, అగు, సహస్రకవచుఁడు

తాత్పర్యము . ఇతఁడు దేవాసురుల భయంకరయుద్ధములో దేవతలను బెక్కుమాఱు లోడించెననెడి కాలనేమి ఇతఁడు ఇంద్రుని ఒంటరిగా నెదురుకొని యుద్ధములందు దిక్కు లాక్రమించు మరులఁడు ఇతఁడు వరుణుని చేతనున్న ఎల్ల మంచివస్తువులను బలాత్కారముగాఁగొనిన మహాబాహుఁడు ఇతఁడు భయంకరుఁడయి యము నడ్డగించి తనకెందును ఎదురులేదనిపించుకొన్న కేతుమాలి ఇతఁడు ఇంటనున్న ధనముల నన్నిటిని గొని కుబేరుని ధనహీనునిగాఁ జేయు ఉగ్రదంష్ట్రుఁడు ఇతఁడు తారకాసురునకు భీకరయుద్ధములో వజ్రమయకవచుఁడయిన సహస్రకవచుఁడు

విశేషములు కాలనేమి , కేతుమాలి రాక్షసుల పేరులయినట్లే మహా బాహుఁడు, ఉగ్రదంష్ట్రుఁడు కూడ పేరులయి యుండును మరులఁడుకూడ నొక రాక్షసుని నామమయి యుండవచ్చును

ఉ. **వారణ దానవాహినుల వఱ్ఱొడిఁ దేలుచునున్నవాఁడు మం**
దారుఁడు; వాని దాపలి రథంబుల ధారుణిఁ గప్పుచున్నవా
డారణి, వాని తూర్పున హయప్రకరాయుతకోటివాఁడు దు
ర్వారుఁ, డపార పాదచరవర్గుఁడు వాఁడు చిరుండు షణ్ముఖా! 102

అర్థము : షణ్ముఖా = కుమారస్వామీ!, వారణ - దాన - వాహినుల - వఱ్ఱొడిన్ = ఏనుఁగుల మదజలనదీప్రవాహమునందు, తేలుచున్ + ఉన్నవాఁడు, మందారుఁడు, వాని- దాపలి - రథంబులన్ = వానియెడమవైపు ఉన్న రథములచే, ధారుణిన్ = భూమిని, కప్పుచున్ + ఉన్నవాఁడు, ఆరణి, వాని - తూర్పునన్, హయ - ప్రకర + అయుత - కోటివాఁడు = గుఱ్ఱములయొక్క సమూహములయొక్క పదివేలకోట్లు గలవాఁడు, దుర్వారుఁడు, అపార - పాద-చర-వర్గుఁడు = అధికమైన కాల్బంటుల సమూహము గలవాఁడు, వాఁడు, చిరుండు

తాత్పర్యము ఓ కుమారస్వామీ!, ఏనుఁగుల మదజల నదీ ప్రవాహమునందుఁ దేలుచున్నవాఁడు మందారుఁడు వాని యెడమవైపున నున్న రథములతో భూమిని గప్పుచున్నవాఁడు ఆరణి వానికిఁ దూర్పువైపునఁ బదివేలకోట్ల గుఱ్ఱములవాఁడు దుర్వారుఁడు అపార పదాతి సైన్యము గల యాతఁడు చిరుఁడు

సీ అంధకాసురవైరి యని తన కల్గునో
యని రుద్రుఁ డోడి మహాద్రి యెక్కె
దనుజారియన విని తనఁ మోఁద బరిగొను
నోయని హరి భీతి నుదధిఁజొచ్చెఁ
బాడ నేర్తని తన్నుఁ బట్టి తేఁబనుచునో
యని వేధ బ్రహ్మాండమునకుఁ జనియె
నమరులు తత్ప్రతాపానల హతి కోడి
పోయిరి తమ పుట్టుఁబొడవు లేక

ఆ కానఁ బోర నెదురుగానక చేతుల
తీఁట నిలుపరాక త్రిభువనముల
రేవుచున్నవాఁడు సూవె వీఁ డురు శౌర్య
భాసురుండు తారకాసురుండు 103

అర్థము: అంధక+ అసుర - వైరి = అంధకుఁడను రాక్షసునకుశత్రువు, అని, తనకున్ + అల్గునో + అని = తనపైఁ గోపించునేమోయని, రుద్రుఁడు =శివుఁడు, ఓడి = భయపడి, మహత్ (మహా) + అద్రి = పెద్దకొండ, ఎక్కెన్

దనుజ + అరి = రాక్షసులకు శత్రువు, అనన్, విని, తనమోఁదన్, పరిగొనునో + అని= దండెత్తునేమోయని, హరి = విష్ణువు, భీతిన్ = భయముతో, ఉదధిన్ =సముద్రమును, చొచ్చెన్ = ప్రవేశించెను

పాడన్ + నేర్తు (వు) + అని = పాడఁగలవని, తన్నున్, పట్టి - తేన్ = పట్టి తెచ్చుటకు, పనుచునో + అని = ఆజ్ఞాపించునోయని, వేధ = బ్రహ్మ, బ్రహ్మాండమునకున్, చనియెన్

అమరులు = దేవతలు, తద్ + ప్రతాప + అనల - హతికిన్ = ఆతని పరాక్రమమనెడి అగ్నియొక్క దెబ్బకు, తమ -పుట్టు + పాడవు -లేక = తమ నామరూపములు లేక, ఓడిపోయిరి

కానన్ = కావున, పోరన్ = యుద్ధమునందు, ఎదురు - కానక = ప్రతిఘటించువాఁడు లేక, చేతుల - తీఁట = చేతుల దురద, నిలుపన్ + రాక, త్రిభువనములన్ = ముల్లోకములందును, రేవుచున్ + ఉన్న-వాఁడు = ఏజృంభించుచున్నవాఁడు, వీఁడు, ఉరు - శౌర్య - భాసురుండు =గొప్పదియగు పరాక్రమముచేఁ బ్రకాశించువాఁడు, అగు, తారక + అసురుండు + చూవె = తారకుఁడను రాక్షసుఁడు సుమీ

తాత్పర్యము . తాను అంధకాసురునకు శత్రువుగదాయని తనపైఁ గోపించునేమో యని శివుఁడు భయపడి కైలాసము నెక్కెను తాను రాక్షసులకు శత్రువని విని తనపై దండెత్తునేమోయని విష్ణువు భయముతో సముద్రమును జొచ్చెను పొడఁగలవాఁడవని తన్నుఁబట్టి తెమ్మని పంచునోయని బ్రహ్మ బ్రహ్మాండమున కరిగెను దేవతలు వాని పరాక్రమమనెడి అగ్ని దెబ్బకు నామ రూపములు లేక ఓడిపోయిరి కావున యుద్ధమునఁ దనకెదురులేక, చేతుల దురద తీఱక, ముల్లోకములందును విజృంభించుచున్న యీతఁడు గొప్పశౌర్యముచేఁ బ్రకాశించు తారకాసురుఁడు సుమా!

విశేషములు . పాడనేర్తని - పాడనేర్తువు + అని = లాట్టు వకారమునకు లోపము - బాల క్రి 24 పిమ్మట సంధి బాల సం 11, 1 బ్రహ్మ వేదములను గానము చేయును

వ అని చూపినం దారక కుమారు లొండొరులంగని కోపరసాపూరితాంతరంగులై విజృంభించి **104**

అర్థము . అని, చూపినన్, తారక - కుమారులు, ఒండొరులన్ = ఒకరినొకరు, కని, కోప -రస + ఆపూరిత + అంతరంగులు + ఐ = కోపరసముతో బాగుగా నిండిన మనస్సులు గలవారయి, విజృంభించి

తాత్పర్యము . అని చూపఁగాఁ దారక కుమారు లొకరినొకరు చూచి కోపరసముచే నిండిన మనస్సులు గలవారయి విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము

యుద్ధారంభము

క జలధులపై వీచు లయా
నిలములగతి షణ్ముఖుఁడు ననిమిషారియుఁ జే
తులు వీచిరి తమతమ బల
జలధుల కొండొండ పెరిఁగి సంక్షోభింపన్ 105

అర్థము. జలధులపైన్ = సముద్రములమీఁద, వీచు, లయ + అనిలముల - గతిన్ = ప్రళయసమయవాయువుల విధమున, షణ్ముఖుఁడున్ = కుమారస్వామియును, అనిమిష + అరియున్ = దేవతల శత్రువగు తారకుఁడును, తమ తమ, బల - జలధులకున్ = సైన్యములనెడి సముద్రములకు, ఒండొండ = క్రమక్రమముగా, పెరిఁగి, సంక్షోభింపన్ = కలఁగునట్లు, చేతులు - వీచిరి

తాత్పర్యము . సముద్రములపైకి వీచు ప్రళయసమయవాయువులట్లు కుమారుఁడును, తారకుఁడును తమతమ సైన్యములకు - అవి క్రమక్రమముగాఁ బొంగి కలఁగునట్లు చేతులు వీచిరి

విశేషములు . అలంకార ముపమ రూపకానుప్రాణితము

క కరిఁ గరి, భటు భటుఁ, డరదం
బరదంబు, హయంబు హయము, నని మొత్తములై
గిరి గిరి, జము జముఁ, డిల నిల
శరనిధి శరనిధియుఁ దాఁకు చాడ్పునఁ దాఁకెన్ 106

అర్థము. అనిన్ = యుద్ధమునందు, మొత్తములు + ఐ = గుంపులయి, కరిన్ - కరి = ఏనుఁగును ఏనుఁగు, భటున్ - భటుఁడు, అరదంబు - అరదంబు = రథమును, రథము, హయంబున్ - హయమున్ = గుఱ్ఱమును గుఱ్ఱము, గిరిన్ - గిరి = కొండను కొండ, జమున్ - జముఁడు = యముని యముఁడును, ఇలన్ - ఇల = భూమిని భూమి, శరనిధిన్ = సముద్రమును, శరనిధియున్ = సముద్రమును, తాఁకు - చాడ్పునన్ = ఎదిరించు విధమున, తాఁకెన్ = ఎదిరించెను

తాత్పర్యము : యుద్ధమున గుంపులయి ఏనుఁగును ఏనుఁగు, భటుని భటుఁడు, రథమును రథము, గుఱ్ఱమును గుఱ్ఱము - కొండను కొండ, యముని యముఁడు, భూమిని భూమి, సముద్రుని సముద్రము తాఁకువిధమునఁ దాఁకెను

విశేషములు.అలంకార ముత్ప్రేక్ష ఉపమానుప్రాణితము అతిశయోక్తి, యథాసంఖ్యము

మ రణతూర్యంబులు బోరనం దివిరెఁ, దద్రావంబుతోడన్ ధను
ర్గుణ ఘోషంబులు వెల్లునం జెలఁగెఁ, దద్ఘోషంబుతో సద్భటా
గ్రణి హుంకారనినాదముల్ దనరెఁ, దద్గంభీరనాదంబుతోఁ
బ్రణుతాస్త్రాహతి భీషణధ్వను లనిం బర్వెన్ దిశాఘాటమై 107

అర్థము:అనిన్ = యుద్ధమునందు, రణ - తూర్యంబులు = యుద్ధభేరులు, బోరనన్ = అధికముగా, తివిరెన్ = మ్రోసెను, తద్ + రావంబుతోడన్ = ఆ ధ్వనితో, ధనుస్ (ః) + గుణ - ఘోషంబులు = విండ్ల త్రాళ్ల ధ్వనులు, పెల్లునన్ = అధికముగా, చెలఁగెన్ = ధ్వనించెను, తద్ + ఘోషంబుతోన్ = ఆ ధ్వనితో, సత్ + భట + అగ్రణి - హుంకార - నినాదముల్ = సద్వీరశ్రేష్ఠుల హుంకృతి ధ్వనులు, తనరెన్ = అతిశయించెను, తద్ + గంభీర - నాదంబుతోన్ = ఆ పెను చప్పుడుతో, ప్రణుత + అస్త్ర + ఆహతి - భీషణ - ధ్వనులు = మిక్కిలి నుతింపఁబడిన బాణముల దెబ్బల భయంకరములైన ధ్వనులు, దిశా + ఆఘాటము + ఐ = దిక్కులు సరిహద్దులుగాఁ గలవయి, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము : యుద్ధమున యుద్ధభేరు లధికముగా మ్రోసెను ఆ ధ్వనితో విండ్ల త్రాళ్ల ధ్వనులుమిక్కిలి మ్రోసెను ఆ ధ్వనితో సద్భటశ్రేష్ఠుల హుంకారధ్వనులు అతిశయించెను ఆ గంభీరధ్వనితో బాణముల దెబ్బల భయంకరధ్వనులు దిక్కులే సరిహద్దులుగా వ్యాపించెను

మ. నలి ఘూర్ణిల్లె గుణధ్వనిస్తనితముల్ నానాప్రకారంబులన్,
వెలిఁగెన్ సన్మణిబద్ధ కార్ముక లస ద్విత్రాసకృద్బాణముల్,
జలజాప్తద్యుతిరోధమై మహిఁ దమిస్రం బొందెఁ గోదండభృ
జ్జలదంబుల్ కురిసెన్ నిశాతవిశిఖాసారంబు ఘోరంబుగాన్ 108

అర్థము . గుణ - ధ్వని - స్తనితముల్ = వింటి నారుల ధ్వనియనెడు ఉఱుములు, నానా - ప్రకారంబులన్ = అనేక విధముల, నలిన్ = ఉత్సాహముతో, ఘూర్ణిల్లెన్ = మ్రోఁగెను సత్ + మణి - బద్ధ - కార్ముక - లసత్ + విత్రాసకృత్ + బాణముల్ = మంచి మణులతోఁ గట్టఁబడిన విండ్ల ప్రకాశించు, విశేష

భయమును గలిగించు బాణములు, వెలిఁగెన్ = ప్రకాశించెను, మహిన్ = భూమియందు, తమిస్రంబు = చీఁకటి, జలజ + ఆప్త - ద్యుతి - రోధము + ఐ =సూర్యుని కాంతిని అడ్డునదియై, ఒందెన్ = కలిగెను, కోదండ - భృత్ + జలదంబుల్ = విండ్ల తాల్పులు - ధామష్కులు అనెడి మేఘములు, నిశాత - విశిఖ + ఆసారంబున్ = వాఁడి బాణములనెడి జడిని, ఘోరంబుగాన్ = భయంకరముగా, కురిసెన్

తాత్పర్యము . వింటినారుల ధ్వనులనెడి యుఱుము లనేకరీతులుగా ఉత్సాహముతో మ్రోఁగెను మణులు కట్టిన విండ్ల భయంకరబాణములు ప్రకాశించెను భూమియందుఁ జీఁకటి సూర్యకాంతి నడ్డునదియై వ్యాపించెను ధానుష్కులనెడి మేఘములు వాఁడి బాణములనెడి జడివానను భయంకరముగాఁ గురిసెను

విశేషములు అలంకారము రూపకము

వ **మఱియును - తరువాతి పద్యముతో నన్వయము. 109**

చ **సవళులు భిండివాలములు శక్తులు శంఖులుఁ దోమరంబులున్**
బవినివహంబుఁ జక్రములు బాణసమూహముతోన పెల్లునం
గవిసి రణాంధకార మిలగ్రక్కున గ్రిక్కొనఁ బర్వె రోదసీ
వివరము నిండ దీఁటుకొని విశ్వలయానలధూమధూమ్రమై 110

అర్థము : సవళులున్(సవడి + లు), భిండివాలములున్, శక్తులున్, శంఖులున్, తోమరంబులున్, పవి - నివహంబున్ = వజ్రాయుధముల సమూహమును, చక్రములున్, బాణ - సమూహముతోన్ + అ = బాణములసమూహముతోనే, పెల్లునన్ = అధికముగా, కవిసి = క్రమ్మి, రణ + అంధకారము= యుద్దపుఁజీఁకటి, ఇలన్ = భూమియందు, రోదసీ - వివరము = భూమ్యాకాశమధ్యభాగము, నిండన్ = నిండునట్లు, దీటుకొని = వ్యాపించి, విశ్వలయ - అనల - ధూమ - ధూమ్రము + ఐ = జగత్ప్రళయాగ్ని ధూమముచేవలె ధూమ్రవర్ణముగలదయి, గ్రక్కునన్ = శీఘ్రముగా, గ్రిక్కొనన్ = చుట్టుకొనునట్లు, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము . సవడులు, భిండివాలములు, శక్తులు, శంఖులు, తోమరములు, వజ్రాయుధములు, చక్రములు అను ఆయుధవిశేషములు బాణ నమూహముతోనే అధికముగా వ్యాపించి యుద్ధాంధకారము భూమ్యాకాశమధ్యభాగమునిండి జగత్ప్రళయాగ్ని ధూమముచే వలె ధూమ్రవర్ణమగల దయి శీఘ్రముగాఁ జుట్టుకొని వ్యాపించెను

విశేషములు . అలంకార ముపమ సవళులు - సవడి + లు 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు ' బాల తత్సమ 45 సవడు + లు 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన డ ల రల కలఘులకారంబు బహుళంబుగా నగు ' బాల ఆచ్చిక 13 సవళులు

వ ఇట్లు దృష్టిరోధంబగు సమరతిమిరంబున నొండొరుల రూపులు గానరాకయుం గోపోద్రేకంబునం దావగొనక 111

అర్థము . ఇట్లు, దృష్టి - రోధంబు = చూపునడ్డగించునది, అగు, సమర - తిమిరంబునన్ = యుద్ధాంధకారముచే, ఒండొరుల - రూపులు = ఒకరొకరి యాకారములు, కానన్ + రాకయున్ = చూడవీలుగాకయును, కోప+ ఉద్రేకంబునన్ = క్రోపావేశముచే, తావగొనక = నిలువక

తాత్పర్యము : ఇట్లు చూపు నడ్డగించు యుద్ధాంధకారముచే ఒకరినొకరి ఆకారములు చూడవీలుగాకయును క్రోధావేశముచే నిలువక - తరువాతి పద్యముతో నన్వయము

క. కరిబృంహిత రధభీత్కృత
హరిహేషిత వీరహుంకృతారవముల నా
సుర వృత్తి ముట్టి పాడిచి
హరకోపులు శబ్దభేదులై సుభటు లనిన్ 112

అర్థము. అనిన్ = యుద్ధమునందు, హర-కోపులు = హరుని కోపమువంటి కోపము గలవారు, (అగు) సుభటులు = మంచి వీరులు, శబ్ద - భేదులు +ఐ = ధ్వని ననుసరించి శత్రువులను భేదించువారయి, కరి - బృంహిత రవములన్, కరి - బృంహిత = ఏనుఁగుల ఘీంకృతులయు, రధ - భీత్కృత = రథముల భీకరములయు, హరి - హేషిత = గుఱ్ఱముల సకిలింతలయు, వీర - హుంకృత = వీరుల హుంకారములయు, ఆరవములన్ = ధ్వనులతో, ఆసుర - వృత్తిన్ = రాక్షస వర్తనముతో, ముట్టి = తాఁకి, పాడిచిరి

తాత్పర్యము. యుద్ధమునందు హరుని కోపమువంటి కోపముగలవారగు సుభటులు, శబ్దముననుసరించి శత్రువులను భేదించు వారయి, ఏనుఁగుల ఘీంకారధ్వనులచేతను, రథముల భీకర ధ్వనులచేతను, గుఱ్ఱముల హేషిత ధ్వనులచేతను, వీరుల హుంకారధ్వనులచేతను రాక్షసముగఁ దాఁకి పొడిచిరి

వ అట్టియెడ **113**

అర్థతాత్పర్యములు అట్టి సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము

తే ఉగ్రశస్త్రాస్త్రనికర మొండొంటిఁ దాఁకి
పాఱి చెదర నట్లొండొండఁ బర్వుఁ జదల
నమితవిలయాగ్నివిస్ఫులింగములు వోలె
రవినిఁ గప్పు మహాంధకారంబుఁ బాచి **114**

అర్థము : ఉగ్ర - శస్త్ర + అస్త్ర - నికరము = భయంకరములైన శస్త్రములయు, అస్త్రములయు సమూహము, అమిత - విలయ + అగ్ని - విస్ఫులింగములు + పోలెన్ = అధికమైన ప్రళయాగ్నియొక్క మిడుఁగురులవలె, రవినిన్ = సూర్యుని, కప్పు = కప్పునట్టి, మహత్ (మహా) + అంధకారంబున్= గొప్పచీఁకటిని, పాచి = తొలఁగించి, ఒండొంటిన్ = ఒకదానినొకటి, తాఁకి, పాఱి, చెదరన్ = చెదరఁగా, అట్లు = ఆ రీతిగా, ఒండొండ = క్రమక్రమముగా, చదలన్ = ఆకాశమునందు, పర్వున్ = వ్యాపించును

తాత్పర్యము . భయంకరములయిన శస్త్రాస్త్రముల సమూహము ఒకదానినొకటిఁదాఁకి, అధికమైన ప్రళయసమయాగ్ని మిడుఁగురుల విధమున, సూర్యుని గప్పు మహాంధకారమును దొలఁగించి, పాఱి చెదరునట్లు క్రమక్రమముగా నాకాశమున వ్యాపించును

విశేషములు. ఈ పద్యమున కెన్నియో పారాంతరములు గలవు 'పాఱి సేరద రొండొండఁ బర్వి జలద' అనుపారము సా అ ప్రతిలోనిది అర్థముగాలేదు 'ఒండొండఁబర్వుఁజదల' అను పారము రా అ శర్మగారిది అది యించుక అర్థవంతముగా నుండుటచే స్వీకరింపఁబడినది అలంకార ముపమ

వ అంత నొండొంటిఁ గను సూర్యుండు సూర్యకాంతాచలంబులుంబోలె సురాసురవీరు లొండొరులం గని కైపు మిగిలి మహాఘోరయుద్ధంబు చేయందొడంగిన 115

అర్థము . అంతన్, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, కను= చూచు, సూర్యుండున్ సూర్యకాంత పర్వతములును, పోలెన్= వలె, సుర + అసుర - ఎములు = దేవరాక్షసవీరులు, ఒండొరులన్ = ఒకరినొకరు, కని, కైపు - మిగిలి = ఉద్రేక మతిశయించి, మహత్ (మహా) + ఘోర - యుద్ధంబు = మిక్కిలి భయంకరమైన యుద్ధము, చేయన్ + తొడంగినన్ = చేయనారంభింపఁగా

తాత్పర్యము అంతఁ బరస్పరము చూచు సూర్య సూర్యకాంత పర్వతముల వలె దేవరాక్షసవీరులు ఒకరినొకరు చూచి ఉద్రేకము మతిశయించి మహా భయంకర యుద్ధము చేయనారంభింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : దేవ వీరులు సూర్యునివలెను, అసురవీరులు సూర్యకాంతశిలలవలెను ఉన్నారనుట సూర్యరశ్మి సోఁకగనే సూర్యకాంతములు కరఁగిపోవునట్లు దేవవీరులు తాఁకఁగనే రాక్షసవీరులు రూపుమాయుచున్నారని భావము అలంకార ముపమ

తే ఉభయబలభటకోపోజ్జ్వలోగ్రవహ్నిఁ
బొగలు మునుముట్టి మఱి మంట లెగయునట్లు
పాదఘట్టనమున ధూళి పర్వి చదల
నస్త్రఘట్టన మఱి లోహితాగ్ను లెగసె 116

అర్థము. ఉభయ వహ్నిన్ ఉభయ - బల = రెండు సైన్యములందలి, భట = వీరులయొక్క, కోప = కోపమనెడి ఉజ్వల = ప్రకాశించు, ఉగ్ర = భయంకరమైన, వహ్నిన్ = అగ్నిచే, పొగలు, మునుముట్టి = ముందు వ్యాపించి, మఱి = పిమ్మట, మంటలు, ఎగయు + అట్లు = లేచువిధమున, పాద - ఘట్టనమునన్ = కాళ్ల త్రొక్కిడిచే, ధూళి = దుమ్ము, పర్వి = వ్యాపించి, చదలన్ = ఆకాశమున, అస్త్ర - ఘట్టనన్ = అస్త్రముల రాయిడిచే, మఱి = పిమ్మట, లోహిత + అగ్నులు = ఎఱ్ఱని నిప్పులు, ఎగసెన్ = లేచెను

తాత్పర్యము : రెండుసైన్యములందలి వీరుల కోపమనెడి ప్రకాశించు భయంకరమైన అగ్నిచేఁ బొగలు ముందు వ్యాపించి, తరువాత మంటలు లేచునట్లు,

వీరుల పాదముల త్రొక్కిడిచే ఆకాశమున దుమ్ము వ్యాపించి, పిమ్మట వారి అస్త్రముల ఒరయికచే నెట్టినిమంటలు లేచెను

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోపమ

వ **ఇ ట్లతిభయంకరంబైన సంకులయుద్ధంబున** **117**

అర్థము. ఇట్లు, అతి - భయంకరంబు + ఐన, సంకుల - యుద్ధంబునన్ = దొమ్మి యుద్ధమునందు

తాత్పర్యము: ఇట్లు మిక్కిలి భయము గలిగించు దొమ్మి యుద్ధమునందు తరువాతి పద్యముతో నన్వయము

క **ముంచిరి శరవర్షంబుల**
జించిరి దృఢకవచసమితి, జేడ్వడ రిపులం
ద్రుంచిరి నిజతరవారుల,
నించిరి తమకీర్తి దిశల నెఱయఁగ సుభటుల్ **118.**

అర్థము: సుభటుల్ = మంచి వీరులు, శర - వర్షంబులన్ = అంపవానలచే, ముంచిరి, దృఢ - కవచ - సమితిన్ = గట్టి కవచముల సమూహమును, చించిరి, చేడ్వడన్ (చేటు + పడన్) = నశించునట్లు, రిపులన్ = శత్రువలను, నిజ - తరవారులన్ = తమ ఖడ్గములచే, త్రుంచిరి = వధించిరి, తమ - కీర్తి, దిశలన్ = దిక్కులందు, నెఱయఁగన్ = పూర్ణముగా, నించిరి = నింపిరి

తాత్పర్యము. సుభటులు అంపవానలచే ముంచిరి దృఢములయిన కవచముల సమూహమును జించిరి తమ ఖడ్గములచే శత్రువులను నశించునట్లు వధించిరి తమ కీర్తి దిక్కులందు సంపూర్ణముగా నింపిరి

క **అడిచిరి ముద్గరముల వడిఁ**
బొడిచిరి కొంతములఁ దూఁటి బోరన గాఁడన్
విడిచిరి వాహకు లాజిన్,
మడిసిరి రిపుబలములకును మార్కొని వీరుల్. **119**

అర్థము : వీరుల్ = వీరులు , ముద్గరములన్ = ముద్గరములనెడి అస్త్రములతో, వడిన్ = వేగముగా, అడిచిరి = కొట్టిరి, కొంతములన్ = కుంతములతో,

తూఁటి = రంధ్రములుచేసి, బోరన = అధికముగా, కాఁడన్ = గ్రుచ్చుకొనునట్లు, పాడిచిరి వాహకులు = సారథులు, ఆజిన్ = యుద్ధమును, విడిచిరి మార్కొని = ఎదురుకొని, రిపు - బలములకును = శత్రుబలములకు, మడిసిరి = చచ్చిరి

తాత్పర్యము . వీరులు ముద్గరములనెడి అస్త్రములతో వేగముగాఁ గొట్టిరి కుంతములతో రంధ్రమయి మిక్కిలి గ్రుచ్చుకొనునట్లు పాడిచిరి సారథులు యుద్ధరంగమును విడిచిరి ఎదురుకొని శత్రుబలములచేఁ జచ్చిరి

క త్రోచిరి కరిఘట లాజిని,
వీచిరి వివిధాయుధములు వెలుఁగఁగ, రధికుల్
కాచిరి నిజసారథులను
బాచిరి నోఁ బోట్లు వడు సుభటహారికరులన్ 120

అర్థము . ఆజిని = యుద్ధమునందు కరి - ఘటలు = ఏనుఁగుల గుంపులను, త్రోచిరి = పడవైచిరి, వివిధ + ఆయుధములు = పలురీతులయిన ఆయుధములు, వెలుఁగన్ = ప్రకాశించునట్లు వీచిరి = విసిరిరి, రధికుల్ = రథమున నుండు వీరులు, నిజ - సారథులను = తమ సారథులను, కాచిరి =రక్షించిరి, నోన్ = నొచ్చునట్లు, పోట్లు + పడు - పోటులు పడునట్టి ,సుభట - హరి - కరులన్ = మంచి వీరులను, గుఱ్ఱములను, ఏనుఁగులను, పాచిరి = తొలఁగించిరి

తాత్పర్యము : యుద్ధమునందు ఏనుఁగుల గుంపులను బడవైచిరి పలురీతుల ఆయుధములు ప్రకాశించునట్లు విసిరిరి రధికులు తమ సారథులను రక్షించిరి నొవ్వఁ బోటులుపడు సుభటులను గుఱ్ఱములను, ఏనుఁగులను తొలఁగించిరి

విశేషములు . నోన్ - నొచ్చు ధాతువు 'తుమర్థ భావలక్షణంబులందు నుజి యగు' బాల క్రి 40 నొచ్చు + నుజి 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు' బాల క్రి 86 'చావు నోవులు చచ్చునొచ్చుల కగు' బాల క్రి 94 నోవు + నుజి 'జీత్తు పరంబగునపుడు వాని వువర్ణంబు విభాషను లోపించు' బాల క్రి 95 నోను - నోన్

సీ శరహతిఁ దెగి నేలఁ దొరుఁగ శిరంబులు
శక్తిపాతముల వక్షములు వ్రయ్యఁ
జక్రఘట్టనఁ గటిచక్రముల్ మురియఁ దో
మర బర్హణంబున బరులు విఱుగ

బాణాసిఘాతన బాహులు ద్రెవ్వ ము
ద్గర తాడనముల మొగమ్ము లవియఁ
గుంత భేదన నెఱుకులు దూఱఁ బరశుప్ర
హరణ నంగములు జర్జరితములుగ

తే మఱియు నిఖిలాస్త్రశస్త్రాభిమారణముల
నవయవములెల్లఁ గడికండ లగుచునుండ
నుభయ బలములుఁ గడిమి నొండొంటిఁ దాఁకి
పెరిఁగి పోరాడె నతిభయంకరము గాఁగ 121

అర్థము. శిరంబులు = తలలు, శర - హతిన్ = బాణముల దెబ్బచే, తెగి, నేలన్,తొరుఁగన్ = పడఁగా, వక్షములు = ఱొమ్ములు, శక్తి - పాతములన్ = శక్తియను నాయుధములపాటులచే, వ్రయ్యన్ = బ్రద్దలు కాఁగా,

చక్ర - ఘట్టనన్ = చక్రాయుధముల రాపుచే, కటిచక్రముల్ = చక్రముల వంటి పిఱుఁదులు, మురియన్ = తెగఁగా, తోమర - బర్ష్ణంబునన్ = తోమరముల ప్రహారముచే, బరులు = ప్రక్కలు విఱుగన్

బాణ + అసి = ఘాతనన్ = బాణములయు, కత్తులయు దెబ్బచే, బాహులు = చేతులు, త్రెవ్వన్ = త్రెగిపోఁగా, ముద్గర - తాడనములన్ = ముద్గరముల దెబ్బలచే, మొగమ్ములు = ముఖములు, అవియన్ = పగులఁగా,

కుంత - భేదనన్ = బల్లెముల పోటుచే, నెఱుకులు = మర్మస్థానములు, తూఱన్ = ప్రవేశింపఁగా, పరశు - ప్రహరణ = గండగొడ్డళ్ల దెబ్బచే, అంగములు = శరీరములు, జర్జరితములు + కన్ = తూంట్లు పడఁగా,

మఱియున్, నఖిల + అస్త్ర -। శస్త్ర + అభిమారణములన్ = ఎల్ల అస్త్రములయు శస్త్రములయు దెబ్బలచే, అవయవములు + ఎల్లన్, కడికండలు + అగుచున్ + ఉండన్ = ముక్కలు ముక్కలగుచుండఁగా, ఉభయ - బలంబులున్ రెండు సైన్యములు, కడిమిన్ =× పరాక్రమముతో, ఒండొంటిన్ = ఒకదానినొకటి, తాఁకి, పెరిఁగి = ఉత్సహించి, అతి - భయంకరము + కాఁగన్ = మిక్కిలి వెఱపు గలుగునట్లుగా, పోరాడెన్

తాత్పర్యము : బాణముల దెబ్బచే శిరస్సులు నేలపైఁబడఁగా, శక్త్యాయుధముల పాటులచే ఱొమ్ములు బ్రద్దలు కాఁగా, చక్రముల రాయిడిచే

చక్రములవంటి పిఱుఁదులు తెగఁగా, తోమరముల రాపుచేఁ బ్రక్కలు విఱుగఁగా, బాణములయు, కత్తులయు దెబ్బచేఁ జేతులు తెగఁగా, ముద్గరముల దెబ్బచే ముఖములు పగులఁగా, బల్లెముల దెబ్బచే మర్మములు విరియఁగా, పరశువుల దెబ్బచే అవయవములు తూంట్లుపడఁగా, మఱియును ఎల్ల అస్త్రములయు శస్త్రములయు చావు దెబ్బలచే అవయవములన్నియు ముక్కలు ముక్కలగు చుండఁగా రెండు బలములును పరాక్రమముతో నొకదాని నొకటి తాఁకి ఉత్సహించి మిక్కిలి భయము గలుగునట్లు యుద్ధము చేసెను

వ తదవసరంబున 122

అర్థతాత్పర్యము . తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

క తలలు తెగిపడిన నట్టలు
సలమున మును నడచుచున్న చక్కటిఁ జని మా
ర్బల మడలఁగఁబడిన తలల
సలరేవం బొడిచె నుగ్రసమరాగ్రమునన్ 123

అర్థము: తలలు, తెగిపడినన్, అట్టలు = మొండెములు, చలమునన్ = పట్టుదలతో, మును = ముందు, నడచుచున్ + ఉన్న -చక్కటిన్ = నడచుచున్న విధమున, చని, మార్బలము = శత్రుసైన్యము, అడలఁగన్ = భయపడఁగా, పడిన - తలలన్ = పడిపోయిన తలలను, ఉగ్ర - సమర + అగ్రమునన్ = భయంకరయుద్ధ ప్రదేశమునందు, సలరేవన్ = చెలరేఁగునట్లు, పొడిచెన్

తాత్పర్యము: తలలు తెగిపడఁగా మొండెములు పట్టుదలతో ముందు నడచుచున్న విధమునఁ జని, శత్రుసైన్యము భయపడఁగాఁ బడిన తలలను భయంకరయుద్ధమునఁ జెలరేఁగునట్లు పొడిచెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క తమ చేతుల యాయుధములు
సమసిన మై నాటియున్న శస్త్రాస్త్ర సమూ
హముఁ బెరికి పట్టుకొని యు
ద్ధము చేసిరి భటులు శౌర్యదర్పోన్నతికిన్ 124

అర్థము తమ - చేతుల + ఆయుధములు = తమ చేతులందలి ఆయుధములు, సమసినన్ =నశింపఁగా, మైన్ = శరీరమునందు, నాటి + ఉన్న= గ్రుచ్చుకొనియున్న, శస్త్ర + అస్త్ర - సమూహమున్ = శస్త్రములయు, అస్త్రములయు సమూహమును, పెరికి = ఊడఁదీసి, పట్టుకొని, భటులు, శౌర్య - దర్ప + ఉన్నతికిన్ = శౌర్యమువలని గర్వాధిక్యముతో, యుద్ధము చేసిరి

తాత్పర్యము . తమ చేతులందలి ఆయుధములు నశింపఁగా, దమ శరీరములందు గ్రుచ్చికొనియున్న శస్త్రాస్త్రముల సమూహమును ఊడఁదీసి పట్టుకొని భటులు శౌర్యగర్వాధిక్యముతో యుద్ధము చేసిరి

విశేషములు శౌర్యదర్పోన్నతికిన్ అను పర్యంతమున కన్వయమెట్లు ఘాసఁగునో!

సీ గఱిగాన నొడళుల విఱిగెడు నస్త్రముల్
దొలఁగు సంధుల కిచ్చు మొలలు గాఁగ
బలువిడియైఁ గట్టు పాశముల్ దెగిపాయు
నంగములకుఁ గట్టులై పెనంగ
నెసకంబుతోఁ దాఁకు నీఁటెలు గుమిసిన
పలువోటులకుఁ జల్పు సలలు గాఁగఁ
బెడులు గంటులఁ దూఱు భిండివాలంబులు
క్రమమున నిడు నౌషధములు గాఁగ

ఆ నలువు లెన్ని గొనిన నప్పటికప్పటి
కలవు బలముఁ జలము నగ్గలింప
నుభయబలములందు సుభటోత్తములు పోరి
రాహవమున విజయదోహలమున 125

అర్థము. గఱి = బాణపుంఖములకుఁగట్టుతెక్క, కానన్ = కనఁబడునట్లు, ఒడళులన్ = శరీరములందు, విఱిగెడు + అస్త్రముల్ = విఱుగునట్టి అస్త్రములు, తొలఁగు - సంధులకున్ = సడలు కీళ్లకు, ఇచ్చు, మొలలు + కాఁగన్ = చీలలు కాఁగా,

బలువిడిన్ =బలాత్కారముగా, మైన్ = శరీరమునందు, కట్టు, పాశముల్ = త్రాళ్లు, తెగి, పాయు + అంగములకున్ = తొలఁగునవయవములకు, కట్టులు + ఐ = కట్లయి, పెనంగన్ = కూడఁగా

ఎసకంబుతోన్ = అతిశయముతో, తాఁకు, ఈఁటెలు = బల్లెములు, గుమిసిన = గుమికట్టిన(?), పలు + పోటులకున్ = పెక్కు గాయములకు, చల్పు = చేయునట్టి, సలలు + కాఁగన్ = వత్తులుకాఁగా,

పెడులు = పెట్టునట్టి, గంటులన్ = గాయములందు, తూఱు = ప్రవేశించు, భిండివాలంబులు = అస్త్రవిశేషములు, క్రమమునన్, ఇడు = ఇచ్చునట్టి, ఔషధములు, కాఁగన్,

అలువులు = బాణములు, ఎన్ని - కొనినన్ = ఎన్ని గ్రహించినను, అప్పటికిన్ + అప్పటికిన్ = నానాఁటికి, అలవున్ = సామర్థ్యమును, బలమున్, చలమున్ = పట్టుదలయు, అగ్గలింపన్ = అధికము కాఁగా, ఉభయ - బలములందున్ = రెండు సైన్యములందును (గల)

సుభట + ఉత్తములు = వీరశ్రేష్ఠులు, విజయదోహాలమునన్ = విజయోత్సాహముతో, ఆహవమునన్ = యుద్ధమునందు, పోరిరి

తాత్పర్యము. ఱెక్క గనవచ్చునట్లు మేనుల వెఱుగు నస్త్రములు సడలిన కీళ్లయందుఁ బెట్టు చీలలు కాఁగను, బలాత్కారముగా మేనఁ గట్టు పాశములు ఖండితమై వీడు నవయవములకుఁ గట్లుకాఁ గను, అతిశయముతోఁదాఁకు బల్లెములు గుమికూడిన పలుపోటులకుఁబెట్టు వత్తులు కాఁగను, పెట్టునట్టి గాయములందుఁ బ్రవేశించు భిండివాలములనెడి అస్త్రములు క్రమముగా నిచ్చు నౌషధములు కాఁగను, బాణములెన్ని గ్రహించినను నానాఁటికి సామర్థ్యము, బలము, పట్టుదల అధికముకాఁగా రెండు సైన్యములందును సుభటశ్రేష్ఠులు గెలుపునందలి యుత్సాహముతో యుద్ధమొనర్చిరి

విశేషములు. అలంకారము రూపకము

వ ఇ ట్లతిభీమంబగు సంగ్రామంబున **126**

అర్థము. ఇట్లు, అతి - భీషణంబు + అగు = మిక్కిలి భయంకరమైన, సంగ్రామంబునన్ = యుద్ధమునందు

తాత్పర్యము: ఇట్లు మిక్కిలి భయంకరమైన యుద్ధమునందు - తరువాతి పద్యముతో నన్వయము

క సురబలము నసురబలముం
బొరిఁబొరి వడిఁ దఱిమి పెనఁగి పొడువ రయమునన్
నెరసి యెడఁ డొట్రుకొని కె
డ్బెరలై పీనుఁగులు పడువుఁబేకయుఁబడియెన్ 127

అర్థము. సుర-బలమున్ = దేవతల సైన్యమును, అసుర - బలమున్ = రాక్షసుల సైన్యమును, పొరిఁబొరిన్ = మాటిమాటికి, వడిన్ = వేగముగా, తఱిమి, పెనఁగి, పొడువన్ = పొడువఁగా, రయమునన్ = శీఘ్రముగా, నెరసి = వ్యాపించి, ఎడన్ = నడిమి ప్రదేశమున, తొట్రుకొని = తడఁబడి, కెడ్బెరసు + ఐ = కలిసినదయి, పీనుఁగులు, పడువున్ + పేకయున్ + పడియెన్ = నిలువుగను, అడ్డముగను పడెను

తాత్పర్యము : దేవతల బలమును, రాక్షసుల బలమును మాటిమాటికి వడిగాఁ దఱిమి పెనఁగి పొడువఁగా, పీనుఁగులు శీఘ్రముగా వ్యాపించి నడిమి ప్రదేశమునఁ బడుగుపేకలుగాఁ బడెను

విశేషములు : కెడ్బెరసు - కెడ + బెరసు - బెరసు = కూడిక (కన్న) పడువు - పడుగు (రూపాం) పడుగు - నేఁతలో నిలువునూలు, పేక - నేఁతలో అడ్డనూలు

క స్రుక్కిరి కరములు త్రెస్సినఁ,
గ్రక్కిరి రుధిరములు కలయఁ గదనములోనన్,
నెక్కిరి శవ సంకులమున,
వెక్కిరి కొఱ ప్రాణులైన వీరులు కలనన్. 128

అర్థము : కదనములోనన్ = యుద్ధములో, కలయన్ = అంతటను, కరములు = చేతులు, త్రెస్సినన్ = తెగఁగా, స్రుక్కిరి = దుఃఖించిరి, రుధిరములు = నెత్తురులు, క్రక్కిరి, శవ - సంకులమునన్ = పీనుఁగుల సమూహమునందు, నెక్కిరి = క్రిక్కిఱిసిరి, కొఱ - ప్రాణులు + ఐన - వీరులు = కొనయూపిరితోనున్నవీరులు, కలనన్ = యుద్ధమున, వెక్కిరి = దుఃఖించిరి

తాత్పర్యము : యుద్ధములో నంతటను చేతులు తెగిపోఁగా దుఃఖించిరి నెత్తురులు గ్రక్కిరి పీనుఁగుల సమూహములోఁ గ్రిక్కిఱిసిరి యుద్ధమునఁ గొనయూపిరి గలవీరులు దుఃఖించిరి

క వ్రేలిరి కడగొంతంబులఁ,
గూలిరి గడిదలల దాఁకి కుంభిని మీఁదన్,
దేలి రస్పృగ్బలరాశిన్
వాలిరి శరఘట్టనముల వడి నిరువాగున్ 129

అర్థము. ఇరు - వాగున్ = రెండు సైన్యములును, కడ - కొంతంబులన్ = బల్లెముల చివర, వ్రేలిరి = వ్రేలాడిరి, గడి - తలలు + తాఁకి = గడిదల లనెడి ఆయుధములు, తగిలి, కుంభిని మీఁదన్ = నేలపై, కూలిరి, అస్పుఙ్ (క్) + జలరాశిన్ = నెత్తుటి సంద్రములో, తేలిరి, వడిన్ = వేగముగా, శర - ఘట్టనములన్ = బాణముల దెబ్బలచే, వాలిరి = పడిపోయిరి.

తాత్పర్యము. రెండు సైన్యములును బల్లెముల చివర వ్రేలాడిరి గడిదల లనెడి ఆయుధములు తాఁకి నేలపైఁ గూలిరి నెత్తుటిసంద్రమునందుఁ దేలిరి బాణముల దెబ్బలచే వేగముగాఁ బడిపోయిరి

క ముక్తాముక్తాయుధములు
ముక్తాముక్తాయుధౌఘములుఁ దగు సుభటుల్
ముక్తాముక్తాసులుఁ బర
ముక్తాముక్తాసుబంధములు నగుచు ననిన్ 130

అర్థము. అనిన్ = యుద్ధమునందు, ముక్త + అముక్త + ఆయుధములున్ = ముక్తములును, అముక్తాయుధములును, ముక్తాముక్తాయుధ + ఓఘములున్ = ముక్తాముక్తాయుధముల, సమూహములును, తగు = ఒప్పునట్టి, సుభటుల్ = వీరవరులు, ముక్త + అముక్త + అసులున్ = విడిచిపెట్టఁబడిన, విడిచిపెట్టఁబడని ప్రాణములు గలవారును, పర - ముక్త + అముక్త + అసుబంధములున్ = శత్రువులచే విడిచిపెట్టఁబడిన, విడిచిపెట్టఁబడని ప్రాణసంబంధములు గలవారు, అగుచున్

తాత్పర్యము . యుద్ధమునందు ముక్తములును, అముక్తములును, ముక్తాముక్తాయుధముల సమూహములును ఒప్పునట్టి వీరవరులు ప్రాణములు విడిచిన, విడువని వారును, శత్రువుల ప్రాణములు తీసిన తీయనివారు నగుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : ఆయుధములు ముక్తకములు, అముక్తాయుధములు, ముక్తాముక్తాయుధములు యంత్రముక్తములు అని నాలుగు విధములు ముక్తము

లనఁగా చక్ర, వజ్ర, వలయ, శక్తి, తోమర, కుంత, పాషాణాదికములు 2 అముక్తము లనఁగా - అంకుశ, పాశ, క్షురికా, అసి, గదా, ముసల, దండాధికములు, 3 ముక్తాముక్తములనఁగా - పాశ, వాగురా, రజ్జు, వలయాదికములు 4 యంత్రముక్తములు - చాప, శతఘ్ని, శల్యక, మంజూషార్కవర్ణాదికము

చ **మురిసెడి రూపులున్, మురిసి మ్రొగ్గెడి రూపులు, మ్రొగ్గి జిఱ్ఱునం**
దిరిగెడి రూపులుం, దిరిగి త్రెళ్లెడు రూపులుఁ, ద్రెళ్లి నేలపైఁ
బొరలెడు రూపులుం, బొరలి పోయెడి రూపులుఁ బోయి క్రమ్మఱన్
మరలెడు రూపులుం, మరలి మ్రగ్గెడి రూపులు నయ్యె నయ్యనిన్ 131

అర్థము అయ్యనిన్ (ఆ + అనిన్) = ఆ యుద్ధమున, మురిసెడి - రూపులున్ = తెగిన దేహములును, మురిసి = తెగి, మ్రొగ్గెడి = మోఁకరిలఁబడు, రూపులున్, మ్రొగ్గి, జిఱ్ఱునన్ = జిఱ్ఱయనుధ్వనితో, తిరిగెడి - రూపులున్, తిరిగి, త్రెళ్లెడు = కూలు, రూపులున్, త్రెళ్లి, నేలపైన్, పొరలెడు = దొరలు, రూపులున్, పొరలి, పోయెడి, రూపులున్, పోయి, క్రమ్మఱన్ = మరల, మరలెడు రూపులున్, మరలి, మ్రగ్గెడి = చచ్చెడు, రూపులున్, అయ్యెన్

తాత్పర్యము: ఆ యుద్ధమునఁ దెగిన దేహములును, తెగి మోఁకరిలఁబడు దేహములును, మోఁకరిలఁబడి జిఱ్ఱయను ధ్వనితోఁ దిరుగు దేహములును, కూలి నేలపైఁ బొరలు దేహములును, పొరలి పోవు దేహములును, పోయి తిరిగి మరలు దేహములును, మరలి చచ్చు దేహములును అయ్యెను

విశేషములు . ముక్తపదగ్రస్త చ్ఛాయ

ఉ. **వెక్కెడి రూపులున్, విఱిగి వెండిక వెండిక వ్రాలు రూపులున్**
నిక్కెడి రూపులున్, మురిసి నీల్గెడు రూపులు, తోలి నెత్తురుల్
గ్రక్కెడి రూపులుం, దలరి కాళులు కొట్టెడు రూపులుం, గడున్
స్రుక్కెడి రూపులుం గలనఁ జూడ భయంకర మయ్యె నయ్యెడన్ 132

అర్థము : అయ్యెడన్ (ఆ + ఎడన్) = ఆ ప్రదేశమున, వెక్కెడి - రూపులున్= వెక్కిళ్లు విడిచిన దేహములును, విఱిగి, వెండిక వెండిక = మఱి మఱి, వ్రాలు - రూపులున్, నిక్కెడి - రూపులున్ = లేచెడి దేహములును, మురిసి = తెగి, నీల్గెడు = చచ్చు దేహములును, తోలి = బాధచే నఱచి, నెత్తురుల్, క్రక్కెడి - రూపులున్, తలరి = చలించి, కాళులు - కొట్టెడు - రూపులున్ = కాళ్లు కొట్టుకొను దేహములును, కడున్ = మిక్కిలి, స్రుక్కెడి - రూపులున్ = మూర్ఛిల్లెడి దేహములును, కలనన్ = యుద్ధమునందు, చూడన్, భయంకరము + అయ్యెన్

తాత్పర్యము . ఆ యుద్ధరంగమున వెక్కిళ్లు విడిచిన దేహములును, విఱిగి మాటిమాటికి వ్రాలు దేహములును, లేచెడి దేహములును, తెగి చచ్చు దేహములును, బాధచే నఱచుచు నెత్తురు గ్రక్కు దేహములును, చలించి కాళ్లు కొట్టుకొను దేహములును, మిక్కిలి మూర్ఛిల్లు దేహములును, జూడ భయంకరముగా నుండెను

చ విఱిగెడు రూపులున్, విఱిగి వ్రేలెడు రూపులుఁ, దల్లడిల్లి వా
చఱచెడు రూపులుం, గలయఁజాల్పడు రూపులు, నొచ్చి నేలపై
నొఱగెడు రూపులుం, జెలఁగ నూర్చెడు రూపులు, నస్త్రఘట్టనన్
నఱుమగు రూపులుం, బృథురణంబున నగ్గల మయ్యె నయ్యెడన్ 133

అర్థము : విఱిగెడు - రూపులున్ = విఱిగి పోవు మేనులను, విఱిగి, వ్రేలెడు= వ్రేలాడు, రూపులున్, తల్లడిల్లి = చలించి, వా- చఱచెడు - రూపులున్ = మొఱపెట్టుకొనుమేనులును, కలయన్ = అంతటను, చాల్పడు - రూపులున్ = ప్రోగుపడు దేహములును, నొచ్చి = బాధపడి, నేలపైన్, ఒఱగెడు - రూపులున్, చెలఁగన్ = ధ్వనించునట్లు, ఊర్చెడు = ఊర్పులుపుచ్చు, రూపులున్, అస్త్ర-ఘట్టనన్ = బాణముల దెబ్బచే, నఱుము + అగు - రూపులున్ = పొడియగు మేనులును, అయ్యెడన్ (ఆ + ఎడన్) = ఆ సమయమున, పృథు - రణంబునన్= మహాయుద్ధములో, అగ్గలము + అయ్యెన్ = అధికమయ్యెను

తాత్పర్యము: విఱిగిపోవు శరీరములును, విఱిగి వ్రేలాడు శరీరములును, చలించి మొఱపెట్టుకొను రూపులును, అంతటను ప్రోగుపడు మేనులును, నొచ్చి నేలమీఁద నొఱగు మేనులును, ధ్వనించునట్లు ఊర్పులు పుచ్చు మేనులును, అస్త్రముల దెబ్బచే పొడియగు మేనులును అప్పుడు మహాయుద్ధమున నధికమయ్యెను

వ ఇ ట్లతిదారుణంబగు నపారఘోరయుద్ధంబున 134

అర్థము: ఇట్లు, అతి - దారుణంబు + అగు = మిక్కిలి ఘోరమైన, అపార - ఘోర - యుద్ధంబునన్ = అంతులేని భయంకర యుద్ధమునందు

తాత్పర్యము. ఇట్లు మిక్కిలి ఘోరమైనదియు, అపారము భయంకరము నైనదియు అగు యుద్ధమున తరువాతి పద్యముతో నన్వయము

సీ కడఁబెక్కు పోటులఁబడి రక్త మిమ్ముగా
వడిసి సొమ్మలువోయి వ్రాలు చోట
బరులపైఁ గ్రమ్మెడు నరుణధారలు తమ
మేని క్రొంగంటులలోనఁజొచ్చి
తెప్పిటి లా వెక్కి యప్పటికంటెను
గాయ్వునఁ బోరాడఁ గడఁగి యీడఁ
బోవక నెత్తురు పొత్తెంత గలిగిన
వారెంత ప్రాణోపకారులైనఁ,

ఆ బతుల ప్రస్తవంబు బంట్లకుఁ దీర్పంగ
వలయు ననుటఁ దెలుపువారపోలె
నిరు బలంబులందుఁ బెరిఁగి పోరాడిరి
విజయదోహలమున వీరభటులు 135

అర్థము: కడున్ = మిక్కిలి, పెక్కు - పోటులన్ + పడి = పలుపోటులుపొంది, రక్తము, ఇమ్ముగాన్ = ఎక్కువగా, వడిసి = కాఱి, సొమ్మలు + పోయి = మూర్ఛపోయి, వ్రాలు చోటన్

బరులపైన్ = ప్రక్కలపై, క్రమ్మెడు = ఆక్రమించు, అరుణ - ధారలు = రక్తప్రవాహములు, తమ - మేని- క్రొంగంటులలోనన్ (క్రొత్త + గంటులలోనన్) = తమ దేహమునందలి క్రొత్తగాయములలో, చొచ్చి = ప్రవేశించి, (ప్రవేశించుటచే)

తెప్పిటి = తేఱుకొని, లావు + ఎక్కి = బలము గలిగి, అప్పటికంటెను, కాయ్వునన్ = ఇచ్ఛతో, పోరాడన్ + కడఁగి = యుద్ధముచేయఁబూని, ఈడఁబోవక = వెనుదీయక, నెత్తురు - పొత్తు = రక్తసంబంధము, ఎంత + కలిగినన్ = ఎంతయున్నను, వారు, ఎంత - ప్రాణ + ఉపకారులు + ఐనన్ = ఎంతటి మహోపకారము చేసినవారయినను,

పతుల - ప్రస్తవంబు = ప్రభువుల విషయము, బంట్లకున్ = భటులకు, తీర్పంగన్+వలయున్, అనుటన్, తెలుపువారు + అ, పోలెన్, ఇరు - బలంబులందున్= రెండు సైన్యము లందును, పెరిఁగి = విజృంభించి, వీర - భటులు, విజయ - దోహలమునన్ = విజయోత్సాహముతో, పోరాడిరి

తాత్పర్యము మిక్కిలి యెక్కువ పోట్లు పడి రక్త మధికముగాఁ గాటి మూర్ఛపోయి వ్రాలుచోట, ప్రక్కలపై వ్యాపించు రక్తప్రవాహములు తమ దేహమునందలి క్రొత్త గాయములలోఁ జొచ్చి, తేఱుకొని, బలము గలిగి, అప్పటికంటెను గోరికతో యుద్ధముఁ జేయఁబూని, వెనుదీయక, వారితో నెంత రక్త సంబంధము గలిగినను, వారెంత మహోపకారము చేసినవారయినను ప్రభువుల విషయము భటులు తీర్పవలయుననుటను దెలుపుచున్నారా యను విధమున రెండు సైన్యములందలి వీరభటులును విజృంభించి విజయోత్సాహముతోఁ బోరిరి

మ ఇరువా గున్నతి నార్చియార్చి వడిఁ బై నెత్తుండు గొం డంచు నొం
డొరుకంటెన్ బలముం జలంబు మదదర్పోత్సాహముల్ శౌర్యభీ
కర భావంబులు నగ్గలంబగుచు వీఁకం దాఁకి పోరాడి రా
సురలీలన్ ధర పెల్లగిల్ల దిగధీశుల్ భీతిఁ గంపింపఁగన్ 136

అర్థము. ఇరువాగు = రెండు సైన్యములును, ఉన్నతిన్ = అధికముగా, ఆర్చి - ఆర్చి= మిక్కిలి ఆర్చి, వడిన్ = వేగముతో, పైన్ = మీఁదికి, ఎత్తుండు= దండెత్తుఁడు, కొండు = పట్టుకొనుఁడు, అంచున్, ఒండొరుకంటెన్ = ఒకరికంటెనొకరు, బలమున్, చలంబున్ = పట్టుదలయు, మద - దర్ప + ఉత్సాహముల్= మదము, గర్వము, ఉత్సాహము, శౌర్య - భీకర - భావంబులున్= పరాక్రమభయంకరత్వములును, అగ్గలంబు + అగుచున్ = అధికమగుచు, వీఁకన్ = పరాక్రమముతో, తాఁకి, ఆసుర- వీలన్ = రాక్షసముగ, ధర = భూమి, పెల్లగిల్లన్ = పెకలఁగా, దిశ్(క్) + అధి + ఈశుల్ = దిక్పాలకులు, భీతిన్ = భయముతో, కంపింపఁగన్ = వడఁకఁగా, పోరాడిరి

తాత్పర్యము: రెండు సైన్యములును మిక్కిలి ఆర్చి వేగముతో మీఁదికి దండెత్తుఁడు పట్టుకొనుఁడు అనుచు ఒకరికంటె నొకరు బలము, చలము, మదము, దర్పము, ఉత్సాహము, అధికముగా పరాక్రమముతోఁ దాఁకి రాక్షసముగా, భూమి పగులఁగా, దిక్పాలురు భయమునఁ గంపింపఁగాఁ బోరాడెను

వ **తదవసరంబున సంయాది పంచవిధాంతర్మదంబుల, సంజాత తిలకాది సప్తవిధ బాహ్యమదంబులఁ, ద్రిగండ గళితంబులైన మదాంధగంధ సింధురంబుల నారోహణవిధిజ్ఞులైన యారోహకు లెక్కి మృగ మంద భద్ర సంకీర్ణజాతుల నప్రకృష్టోత్కృష్ట మధ్యమ స్వేచ్ఛాసనంబులం జొచ్చి యెక్కి తలభ్రమణాది చతుర్విధచారణల నంకుశంబులు పాలయించుచు వాగాది**

త్రివిధ ప్రణిధులం బ్రచోదించుచుం గార్ముకాది త్రిప్రాయుధంబులం
బ్రవీణులైన యోధవీరులెక్కి యుద్ధసన్నద్ధులై గజంబుల మొగవడంబు లెత్తించి
ప్రతిబలంబునకుం జూపి యిచ్చి మహారభసంబున 137

అర్థము. తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, సంయ + ఆది-పంచ - విధ + అంతః + మదంబులన్ = సంయముమున్నగు అయిదు విధములైన లోపలి మదములుగలట్టియు, సంజాత - తిలక + ఆది -సప్త - విధ + బాహ్యామదంబులన్ = పుట్టిన తిలకము మున్నగు ఏడు రీతులైన వెలుపలి మదములు గలట్టియు త్రిగండ - గళితంబులు + ఐన = మూఁడు గండముల (ఏనుఁగు చెక్కిళ్ల) నుండి జాటినవి యైన, మద + అంధ - గంధ - సింధురంబులన్ = మదముచే గ్రుడ్డివియైన మదగజములను, ఆరోహణ - విధిజ్ఞులు + ఐన = ఎక్కు విధమును దెలిసిన వారయిన, ఆరోహకులు = ఎక్కువారు, ఎక్కి, మృగ - మంద - భద్ర సంకీర్ణజాతులన్ = మృగము, మందము, భద్రము, వీని మిశ్రము అను నాలుగు విధములైన జాతులైన ఏనుఁగులను, అప్రకృష్ట + ఉత్కృష్ట - మధ్యమ - స్వేచ్ఛా + ఆసనంబులన్ = ఆప్రకృష్టము, ఉత్కృష్టము, మధ్యమము, అను మూఁడు విధములైన తమ యిచ్చవచ్చిన ఆసనములను, చొచ్చి, ఎక్కి, తలభ్రమణ + ఆది - చతుర్విధ - చారణలన్ = తలభ్రమణము మున్నగు నాలుగు విధములయిన అంకుశచారణలతో, అంకుశంబులు, పొలయించుచున్ = కదల్పుచు, వాచ్ (క్) + ఆది - త్రివిధ - ప్రణిధులన్ = వాక్కు మున్నగు మావటీని ఆజ్ఞఁ దెలుపు మార్గములచేతను, ప్రబోధించుచున్ = తోలుచు, కార్ముక + ఆది - తిస్ర + ఆయుధంబులన్ = కార్ముకమున్నగు మూఁడు విధములయిన ఆయుధములందును, ప్రవీణులు + ఐన = నేర్పరులయిన, యోధ - వీరులు, ఎక్కి, యుద్ధ - సన్నద్ధులు + ఐ = యుద్ధమునకు సిద్ధపడినవారయి, గజంబులన్ = ఏనుఁగులందు, మొగ వడంబులు = ముఖ కవచములు, ఎత్తించి, ప్రతి - బలంబునకున్ = శత్రు సైన్యమునకు, చూపి, ఇచ్చి, మహత్ (మహా) + రభసంబునన్ = గొప్పవేగముతో

తాత్పర్యము : ఆ సమయమున సంయము మున్నగు అయిదు విధములయిన అంతర్మదములుగలట్టియు, తిలకము మున్నగు నేడువిధములయిన బాహ్య మదములు గలట్టియు మూఁడు గండములనుండి జాఱు మదముచేనంధము లైనట్టియు గంధగజములను ఎక్కువిధమునెఱిఁగిన ఆరోహకులు ఎక్కి, మృగము, మందము, భద్రము, సంకీర్ణము అను నాలుగు విధములైన జాతుల ఏనుఁగులను,

అప్రకృష్టము, ఉత్కృష్టము, మధ్యమము అను మువ్విధములైన తమ యిచ్చవచ్చిన ఆసనములను జొచ్చి, ఎక్కి, తలభ్రమణాదులైన నాలుగు విధములయిన అంకుశ చారణలతో అంకుశములు కదల్పుచు, వాక్కు మున్నగు మూఁడు విధములైన ప్రణిధుల చేతను దోలుచు, కార్ముకము మున్నగు మూఁడు విధములైన ప్రణిధులచేతను దోలుచు, కార్ముకము మున్నగు మువ్విధములయిన ఆయుధములందును నేర్పరులయిన యోధవీరులెక్కి, యుద్ధసన్నద్ధులై యేనుఁగుల ముఖకవచము లెత్తించి శత్రుసైన్యమునకుఁ జూపి గొప్పవేగముతో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు గజజాతులు మూఁడు - 'భద్రమంద మృగ భేదత స్త్రిధా జాతి రత్ర కరిణాం పురోదితా 'వీని మిశ్రము సంకీర్ణజాతి ఆసనములు మూఁడు 'క్రమా త్త్రీ ణ్యాసనాని స్యు ర్ముఖమధ్యాధమాని హి ఏకఃప్రసారితః పాద స్తదన్యో నత జానుకః పాశ్చాత్య మాసనం జ్ఞేయ మేకం జానుగతం బుధైఃʼ అంకుశ చారణలు నాలుగు విధములు ప్రణిధులు మూఁడు 'వాక్పాదాంజ్ఞుశచోదనాప్రణిధి రిత్యుక్తా

మ మణి కోదండము లింద్రచాపములుగా, మత్తిల్లి గర్జిల్లు వా
రణముల్ లీల ఘనాఘనంబులుగ, వీరవ్రాతముల్ గార్చు మా
ర్గణవర్షం బతివర్షమై కురియ, నాకాశాంతరాళంబు ధా
రుణియుం గప్పుచుఁద్రోచి రోలిఁ దొలుకారుంబోలె నాధోరణుల్ 138

అర్థము : మణి - కోదండములు = మణిమయములైన విండ్లు, ఇంద్రచాపములు + కాన్ = ఇంద్రధనుస్సులుగా, మత్తిల్లి = - గర్జిల్లు - వారణముల్= మదించి ఘీంకరించు ఏనుఁగులు, లీలన్ = విలాసముతో, ఘనా - ఘనంబులు+ కన్ = వర్షాకాలపు మేఘములుగను, వీర - వ్రాతముల్ = వీరుల సమూహములు, కార్చు, మార్గణ - వర్షంబు = బాణముల వాన, అతి - వర్షము + ఐ = పెనువానయై, కురియన్, ఆధోరణుల్ = మావటీండ్రు, తొలుకారున్ + పోలెన్ = తొలుకారువలె, ఓలిన్ = క్రమముగా, ఆకాశ + అంతరాళంబున్ - ధారుణియున్ = మింటినడిమి ప్రదేశమును, భూమియును, కప్పుచున్, త్రోచిరి

తాత్పర్యము : మణిమయధనుస్సులు ఇంద్రచాపములుగను, మదించి గర్జిలునేనుఁగులు వర్షాకాలపు మేఘములుగను, వీరుల సమూహములు విడుచు అంపవాన అధికవర్షమయి కురియఁగను, మావటివాండ్రు తొలుకారువిధమున ఆకాశమధ్యప్రదేశమును భూమియుఁ గప్పుచుఁ ద్రోచిరి

విశేషములు అలంకారము రూపకానుప్రాణితోపమ

వ అంత - తరువాతి పద్యముతో నన్వయము **139**

సీ కరిఘట లొండొంటిఁ గని కొండ కొండతోఁ
దాఁకిన గతి మిన్నుఁదాఁకి పోరి,
రవి బింబములు గప్పు రాహు మండలములో
యన హేమరథసమూహములు గప్పి
జలధి లేఁదరఁగలు జలములఁ గబళించు
కరణి నశ్వంబులఁ గమిచి చమరి,
వన లులాయము లిక్షువనము నుగ్గాడిన
పగిదిఁ గాల్వుర నేలపాలు చేసి,

ఆ మాఱు లేక మదము మీఱి మదాంధ సిం
ధురము లొక్కమొగిఁ జతుర్బలముల
బారిసమరి రుధిరవారిధి నోలాడు
చుండె ధాతునగములొక్కొ యనఁగ **140**

అర్థము: కరి - ఘటలు = ఏనుఁగుల గుంపులు, ఒండొంటిన్ = ఒకదాని నొకటి, కని = చూచి, కొండ, కొండతోన్, తాఁకిన-గతిన్ = తాఁకిన విధమున,మిన్నున్ = ఆకాశమును, తాఁకి, పోరి

రవి - బింబములు = సూర్యమండలములు, కప్పు, రాహు - మండలములో + అనన్, హేమ - రథ - సమూహములు = బంగారు రథముల సమూహములను, కప్పి

జలధి - లేఁదరఁగలు (లేఁత + తరఁగలు) = సముద్రమునందలి లేఁత యలలు, జలములన్ = నీరును, కబళించు - కరణిన్ = మ్రింగు విధమున, అశ్వంబులన్ = గుఱ్ఱములను, కమిచి = ఆక్రమించి, చమరి = కొట్టి,

వన - లులాయములు = అడవిదున్నలు, ఇక్షువనమున్ = చెఱకు తోఁటను, నుగ్గాడిన - పగిదిన్ = పొడిగాఁజేసిన విధమున, కాల్వురన్ = కాల్బంటులను, నేలపాలు చేసి,

మాఱులేక = ఎదురులేక, మదము -మీఱి = మద మతిశయించి, మద + అంధ - సింధురములు= మదముచేఁగన్నులుగానని ఏనుఁగులు, ఒక్క-మొగిన్ = ఒక్కపెట్టున, చతుఃర్ + బలములన్ = నాలుగు విధములైన సైన్యములను, బారిసమరి = హింసించి, ధాతు - నగములు + ఒక్కొ + అనఁగన్ = గైరికాది ధాతువులతోడి కొండలా యనునట్లు, రుధిర - వారిధిన్ = రక్త సముద్రమున, ఓలాడుచున్ + ఉండెన్ = విహరించుచుండెను

తాత్పర్యము. ఏనుఁగులగుంపు లొకదానినొకటి చూచి కొండ కొండతో ఢీకొనునట్లు మిన్నంటి పోరి, సూర్యబింబములను గప్పు రాహుమండలములో యనునట్లు బంగరురధముల సమూహములను కప్పి, సముద్రపు లేయలలు జలములను మ్రింగులాగున గుఱ్ఱముల నాక్రమించి కొట్టి, అడవిదున్నలు చెఱకుతోటను బొడిచేసిన విధమునఁ గాలిబంటులను నేలపాలు చేసి, ఎదురులేక మద మతిశయించి మదాంధములైన యేనుఁగులు ఒక్కపెట్టునఁ జతుర్విధబలములను హింసించి గైరికాదిదాతువులతోడి యెఱ్ఱనికొండలా యనునట్లు రక్తసముద్రమున విహరించుచుండెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ మఱియు ద్రమ్యాది నవవిధ దంతవధలనుం, బ్రహృతాద్యష్టవిధ హస్తవధలను, బ్రోక్తాది పంచవిధ గాత్రవధలను, బృహదాది చతుర్విధరాతాది వధలను, సంయోగాద్యనేకాశీతివధలను, వైహాయసాద్యనేకవిధఘూత వధలను జతుర్బలంబు నిట్లు వ్రచ్చి వధావధసేయుచుండె నట్టి యవసరంబునం బ్రళయానలంబులం గప్పునట్లు రధసమూహంబు లొండొంటిం గప్పుకొనుచు 141

అర్థము. మఱియున్, ద్రమ్య + ఆది - నవ - విధ - దంత - వధలనున్= ద్రమ్యము మున్నగు తొమ్మిది విధములైన దంత వధలచేతను, ప్రహృత + ఆది + అష్ట - విధ - హస్త - వధలను = ప్రహృతము మున్నగు ఎనిమిది విధములైన హస్తవధల చేతను ప్రోక్త + ఆది - పంచ - విధ - గాత్ర - వధలను = ప్రోక్తము మున్నగు అయిదువిధములైన గాత్రవధలచేతను, బృహత్ + ఆది - చతుర్విధ-రాత + ఆది - వధలను = బృహత్తుమున్నగు నాలుగు విధములైన రాతాదివధలచేతను, సంయోగ + ఆది + ఏక + ఆశీతి + వధలను = సంయోగము మున్నగు ఎనుబది యొక్క వధలచేతను, వైహాయస + ఆది + అనేక - విధ = ఘాత + ఆది - వధలను= వైహాయసము మున్నగు పలువిధములైన ఘాతాదివధలచేతను, చతుః + బలంబున్ = నాలుగువిధములైన సైన్యమును, ఇట్లు, వ్రచ్చి = వధించి,

వధావధ + చేయుచున్ + ఉండెన్ = చిత్రవధచేయుచుండెను, అట్టి + అవసరంబునన్= అట్టి సమయమున, ప్రళయ + అనలంబులన్ = ప్రళయ సమయమునందలి అగ్నులను, కప్పు + అట్లు, రధ - సమూహంబులు, ఒండొంటిన్, కప్పుకొనుచున్

తాత్పర్యము మటియును ద్రవ్యము మున్నగు తొమ్మిదివిధములైన దంత వధలచేతను, ప్రభృతము మున్నగు నెనిమిది విధములైన హస్తవధలచేతను ప్రోక్తము మున్నగు నైదువిధములైన గాత్రవధలచేతను, బృహత్తు మున్నగు నాలుగువిధములైన రాతాది వధలచేతను, సంయోగము మున్నగు ఎనుబది యొక్క విధములయిన వధలచేతను, వైహాయసము మున్నగు పలువిధములయిన ఘాతాదివధలను, నాలుగువిధములైన బలమును ఇట్లు వధించి చిత్రవధ చేయుచుండెను అట్టిసమయమున౧బ్రళయాగ్నులను గప్పునట్లు రధసమూహము లొకదాని నొకటి కప్పుకొనుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . ఈ గద్యము నందలి వధల విధములు మహావీరైకవేద్యములు రాజగు నన్నెచోడుని యుద్ధక్రీడావిజ్ఞానము గొప్పది

చ పృధుభుజశక్తి సారధుల౧ బెట్టి శరాహతి౧ దార సారధుల్
రధికులునై పెనంగి మఱి రధ్యములం బడనేసి, కాయ్యుతో
రధముల డించి, వాలుల దురంబు రయంబున౧జేసి, వాలులున్
వృధ యగుడున్ భటాగ్రణులు వీ౧గక చేసిరి ముష్టియుద్ధముల్ 142

అర్థము . పృధు - భుజ - శక్తిన్ = గొప్ప బాహుపరాక్రమముతో, సారధులన్, పెట్టి = విడిచిపెట్టి, శర + ఆహతిన్ = బాణముల దెబ్బతో, తారు + అ = తార = తామే, సారధుల్ - రధికులున్ + ఐ = సారధులును రధికులునయి, పెనంగి = పోరి, మఱి, రధ్యములన్ = గుఱ్ఱములను, పడన్ + ఏసి = పడ౧గొట్టి, కాయ్యుతోన్ = కోరికతో , రధములన్, డించి = విడిచి, వాలులన్ = కత్తులతో, రయంబునన్ = వేగముతో, దురంబు + చేసి = యుద్ధముచేసి, వాలులున్ = కత్తులుగూడ, వృధ + అగుడున్ = వ్యర్థమయినంతనే, భట + అగ్రణులు = భటశ్రేష్ఠులు, వీ౧గక = వెనుదీయక, ముష్టి - యుద్ధముల్ = పిడికిలులతోడి యుద్ధములు, చేసిరి

తాత్పర్యము. వీరశ్రేష్ఠులు గొప్ప బాహుబలముతో సారధులను, విడిచిపెట్టి తామే సారధులును రధికులునయి బాణహతితో౧ బోరి గుఱ్ఱములను గూల్చి,

కోరికతో రథములను విడిచి, కత్తులతో శీఘ్రముగా యుద్ధము చేసి, కత్తులు గూ డ వ్యర్థము కాఁగా వెనుదీయక ముష్టియుద్ధములు చేసిరి

క త్రిభువనములపైఁ బెల్లున
గభీరవిలయాబ్ధు లోలిఁ గప్పినగతి న
య్యిభ రథ పదాతితతిపై
రభసంబునఁ గప్పె బహు తురంగ దళంబుల్ 143

అర్థము. గభీర - విలయ + అబ్ధులు = గంభీరములయిన ప్రళయకాలపు సముద్రములు, పెల్లునన్ = ఆధిక్యముతో, త్రిభువనముల పైన్ = ముల్లోకముల మీఁదను, ఓలిన్ = బాగుగా - నిండుగా, కప్పిన - గతిన్ = కప్పిన విధమున, బహు - తురంగ - దళంబుల్ = పెక్కు గుఱ్ఱముల దండులు, ఆ + ఇభ - రథ - పదాతి - తతిపైన్ = ఆ యేనుఁగుల, రథముల, కాలిబంటుల సమూహముపై, రభసంబునన్ = వేగముగా, కప్పెన్

తాత్పర్యము. గంభీరములయిన ప్రళయకాల సముద్రములు ఆధిక్యముతో ముల్లోకములపై నిండుగాఁ గప్పిన విధమున, పలు గుఱ్ఱముల దండులు ఆ గజరథపదాతి సమూహముపై వేగముగాఁ గప్పెను

విశేషములు : అలంకార ముపమ

వ. ఇ ట్లపార తౌరంగికవీరు లొండొరులం దాఁకి మహాఘోరయుద్ధంబు చేయుచు. 144

అర్థము. ఇట్లు, అపార - తౌరంగిక - వీరులు = పారములేని రౌతులైన వీరులు, ఒండొరులన్ = ఒకరినొకరు, తాఁకి, మహత్ (మహా) - ఘోర - యుద్ధంబు = మిక్కిలి భయంకరమైన యుద్ధము, చేయుచు

తాత్పర్యము. ఇట్లు అసంఖ్యాకులైన రౌతువీరులు ఒకరి నొకరు తాఁకి మిక్కిలి భయంకరమైన యుద్ధము చేయుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ కరులు కరంబులున్ రదనగాత్రములుం దెగి తొల్లి తూలఁగాఁ
నరదము లశ్వసూతరథికాన్విత ముక్కుటి నుగ్గునూఁచగాఁ,
దురగ రథంబు లాశ్వికులతోడన - నడ్మలు త్రెవ్వి ధారుణిం
దొరఁగఁ, బదాతి వర్మములతోఁ గడిఖండములై బడల్వడన్ 145

అర్థము. కరులు = ఏనుఁగులు, కరంబులున్ = తొండములును, రదన - గాత్రములున్ = దంతములును శరీరములును, తెగి, తొల్లి = మొదట, తూలఁగాన్ = కూలఁగా, అరదములు = రథములు, అశ్వ - సూత - రథిక + అన్వితము = గుఱ్ఱములు, సారథులు, రథికులు అనువారితోఁగూడి, ఉక్కటి (ఉక్కు = అటి) = బలము నశించి, నుగ్గునూఁచ + కాన్ = పిండిపిండి కాఁగా, తురగ - రథంబులు = గుఱ్ఱములును, రథములును, ఆశ్వికులతోడన్ + ఆ = రౌతులతోపాటే, నడ్మిలు = నడుములు, త్రెవ్వి = తెగి, ధారుణిన్ = నేలపై, తొరుఁగన్ = పడఁగా, పదాతి = కాల్బంటులు, వర్మములతోన్ = కవచములతో, కడిఖండములు + ఐ = ముక్కలు ముక్కలయి, బడల్వడన్ (బడలు + పడన్) = చావఁగా,

తాత్పర్యము. ఏనుఁగులు తొండములును, దంతములును, శరీరములును దెగి మొదటఁగూలఁగా, రథములు గుఱ్ఱములతోను, సారథులతోను, రథికులతోను గూడి బలము నశించి పిండిపిండి కాఁగా, గుఱ్ఱములును, రథములును రౌతులతోపాటే నడుములు తెగి నేలఁగూలఁగా, కాల్బంటులు కవచములతో ముక్కలుముక్కలయి చావఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క ఆసురముగ నాశ్వికుల న
రాసులు మునుమిడి భయంకరాకారముతో
వ్రేసి రవి నాకు లురిపము
చేసిన క్రియ నొడ్డనముల శిరములు డొల్లెన్ 146

అర్థము . అనిన్= యుద్ధమున, నరాసులు (నర + అశి + లు) మనుష్యులను దినువారు - రాక్షసులు, ఆసురముగన్ = రాక్షసముగ = క్రూరముగా, మునుమిడి (మునుము + ఇడి) = వరుసపెట్టి, భయంకర + ఆకారముతోన్ = భీకర రూపముతో, ఆశ్వికులన్ = రౌతులను, వ్రేసిరి = కొట్టిరి, నాకులు (నాకి + లు) = నాకముగలవారు - దేవతలు, ఉరిపము - చేసిన - క్రియన్ = కోఁతకోసిన విధమున, ఒడ్డనములన్ = (శత్రు) వ్యూహములందు, శిరములు = తలలు, డొల్లెన్= రాలెను

తాత్పర్యము : యుద్ధమున రాక్షసులు క్రూరముగా వరుసపెట్టి భయంకరాకారముతో ఆశ్వికులను గొట్టిరి దేవతలు కోఁతకోసిన విధమున శత్రు వ్యూహములందుఁ దలలు రాలెను

వ అంత ననంత పదాతి బలంబులు పరమసంరభంబునం బేర్చి యుగాంతాంతకసంతానంబునుం బోలెఁ గోపోద్రేకంబునం గోలుమసంగి 147

అర్థము · అంతన్, అనంత - పదాతి - బలంబులు = అంతులేని కాల్బంటుల సైన్యములు, పరమ- సంరంభంబునన్ = మిక్కిలి కోపముతో, పేర్చి = విజృంభించి, యుగ + అంత + అంతక - సంతానంబునున్ + పోలెన్ = ప్రళయ సమయమునందలి యముల సమూహమువలె, కోప + ఉద్రేకంబునన్ = కోపాతిశయముచే, కోలుమసంగి = అతిశయించి

తాత్పర్యము: అంత అనంతములయిన కాల్బంటుల సైన్యములు మిక్కిలి కోపముతో విజృంభించి ప్రళయసమయ యమ సమూహమువలెఁ గోపాతిశయముచే నతిశయించి - తరువాతి పద్యముతో నన్వయము

చ **తురగదళంబు లొండవిసి తూల, రథంబులు పెల్లగిల్ల, సిం**
ధురఘట లోడఁ, గాల్బలముఁ ద్రోచి చలింపక మార్బలంబు ల
త్తురగదళంబు లొండవిసి తూల, రథంబులు పెల్లగిల్ల, సిం
ధురఘట లోడిపాఅ ననిఁ దోలుచుఁ గాల్వురు దాఁకి రత్తలన్ 148

అర్థము. తురగ - దళంబులు = గుఱ్ఱముల దండులు, ఒండు = ఒకటి, అవిసి = చెదరి, తూలన్ = చలింపఁగా, రథంబులు, పెల్లగిల్లన్ = పగులఁగా, సింధుర - ఘటలు = ఏనుఁగుల గుంపులు, ఓడన్ = పాఱిపోఁగా, కాల్బలమున్ = కాల్బంటులను, త్రోచి = పడవైచి, మార్బలంబులు = శత్రుసేనలు, చలింపక, అత్తలన్ (ఆ + తలన్) = ఆ వైపున, ఆ + తురగ - దళంబులు = ఆ గుఱ్ఱముల సేనలు, ఒండు, అవిసి, తూలన్ = చలించునట్లు, రథంబులు, పెల్లగిల్లన్ = పగులునట్లు, సింధుర - ఘటలు, ఓడి, పాఅన్ = పాఱిపోవునట్లు, అనిన్ = యుద్ధమునందు, తోలుచున్, కాల్వురు = కాల్బంటులు, తాఁకిరి = మార్కొనిరి

తాత్పర్యము. శత్రుసేనలు గుఱ్ఱముల దండు చెదరిపోఁగా, రథములు పగులఁగా, ఏనుఁగుల గుంపులు పాఱిపోఁగా, కాల్బంటులను ద్రోచి చలింపకుండఁగా, రెండవ పక్షమునఁ గాల్బంటులు గుఱ్ఱముల సేనలు చెదరి చలించునట్లును రథములు పెల్లగిల్లునట్లును, ఏనుఁగుల గుంపులు పాఱిపోవునట్లును, యుద్ధమునఁ దోలుచు మార్కొనిరి

విశేషములు. రెండుపక్షములవారును ఒకరి కొకరు తీసిపోకుండునట్లు యుద్ధముచేసిరని భావము

వ అంత - తరువాతి పద్యముతో నన్వయము **149**

మత్తకోకిల ఒండొరుం గడవంగ నార్చుచు నుగ్రబాణసమూహ మొ
క్కండుఁ దప్పక గెల్వ నెమ్మెయిఁ గోలగోలకుఁజొచ్చి కో
దండకౌశల మేర్పడన్ రథ దంతి వాజి భటావళిన్
బుండుమాఁగుడుగాఁగ నేసిరి భూరివీరధనుర్ధరుల్ 150

అర్థము భూరి - వీర - ధనుర్ధరుల్ = మిక్కిలి వీరులైన విలుకాండ్రు, ఒండొరున్ = ఒకరినొకరు, కడవంగన్ = మించుటకు, ఆర్చుచున్, ఉగ్ర-బాణ - సమూహము= భయంకరబాణసమూహము, ఒక్కండున్ = ఒక్కటియు, తప్పక, ఎమ్మెయిన్ (ఏ+మెయిన్) = ఏ విధముగా నయినను, గెల్వన్ = గెలుచుటకు, కోల - కోలకున్= బాణబాణమునకు, చొచ్చి = పూని, కోదండ - కౌశలము = వింటి నేర్పు, ఏర్పడన్= స్పష్టపడునట్లు, రథ - దంతి - వాజి - భట + ఆవలిన్ = రథములయు, ఏనుఁగులయు, గుఱ్ఱములయు వరుసను, పుండు-మాఁగుడు + కాఁగన్ = పుండు మిగుల నలఁగునట్లు, ఏసిరి = కొట్టిరి

తాత్పర్యము మిక్కిలి వీరులైన విలుకాండ్రు ఒకరినొకరు మించ నార్చుచు ఉగ్రబాణ సమూహ మొక్కటియుఁదప్పక, ఏ విధముగానైనను గెలుచుటకు బాణబాణమునకుఁ బూని వింటినే ర్పేర్పడ రథగజతురగపదాతివర్గమును పుండుమిగులనలఁగునట్లు కొట్టిరి

విశేషములు మత్తకోకిలకు నాలుగు పాదములుండును ప్రతి పాదమునను ర,స,జ,జ,భ,ర అను గణములుండును మొదటి యక్షరమునకును పదునొకండవ అక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు

ఉ బిట్టఱ నెమ్మెయిం గెలువఁ బెల్కుఱ లేచియు, మెట్టిలేచినం
బట్టియు, నడ్డనంబుల నపారభుజాబలగర్వ మేర్పడన్
గిట్టిన బల్విడిన్ బొడిచి గీటడఁగించియుఁ బేర్చియార్చుచున్
జెట్టిగ వీరులై దురముసేసిరి కైపున నీఁటెకా అనిన్ 151

అర్థము. అనిన్ = యుద్ధమునందు, ఈఁటెకాఱు = బల్లెముల వారు, బిట్టఱన్ (బిట్టు + అఱన్) = ఔద్ధత్యము నశించునట్లు, ఎమ్మెయిన్ (ఏ +

మెయిన్) = ఏ విధముగానైనను, గెలువన్ = గెలుచుటకు, పెల్కుఱన్ = భయపడునట్లు, లేచియున్, మెట్టి - లేచినన్ = వచ్చిలేచినచో, పట్టియున్, అడ్డనంబులన్ = డాలులతో, అపార - భుజా - బల గర్వము = అధికమైన బాహుపరాక్రమమువలని గర్వము, ఏర్పడన్ = స్పష్టపడునట్లు, కిట్టినన్ = సమీపించినచో, బల్విడిన్ = బలాత్కారముగా, పొడిచి, గీటడఁగించియున్ = చంపియు, పేర్చి= అతిశయించి, ఆర్చుచున్ = బొబ్బలువెట్టుచు, జెట్టిగ వీరులు + ఐ = మల్లయుద్ధవీరులయి, కైపునన్ = కోపముతో, దురము + చేసిరి = యుద్ధ మొనరించిరి

తాత్పర్యము యుద్ధమునందు బల్లెములవారు ఔద్ధత్యము నశించునట్లు ఏ విధముగానైనను గెలుచుటకు భయపడునట్లు లేచియును, వచ్చి లేచినచో బంధించియు, డాలులతో అధికబాహుపరాక్రమగర్వము స్పష్టపడునట్లు సమీపింపఁగా బలాత్కారముగాఁ బొడిచి చంపియు అతిశయించి ఆర్చుచు మల్లయుద్ధవీరులయి కోపముతో యుద్ధ మొనరించిరి

విశేషములు. ఈఁటెకాఱు ఈఁటెకా + లు 'కాప్రత్యయంబు మీఁది బహువచనలకారంబునకు లఘ్వులఘురేఫంబులును లఘురేఫంబునకు ముందు పూర్ణబిందుపూర్వకడకారంబు నగు ' బాల ఆచ్చిక 7 ఈఁటెకాఱు ఈఁటెకాండ్రు (రూపాం)

క కడకొంతంబులఁ గొని వడిఁ
బొడిచిరి కుంతధరు లుగ్ర భూరిబలం బే
ర్పడ హయగజభటతతి సా
ల్వడి పడి మ్రొగ్గఁబడి మిట్టిపడ రభసమునన్ 152

అర్థము. కుంత - ధరులు = బల్లెములను ధరించువారు, ఉగ్ర - భూరి - బలంబు= భయంకరమైన అధికబలము, ఏర్పడన్ = స్పష్టపడఁగా, హయ-గజ-భట-తతి = గుఱ్ఱములయు, ఏనుఁగులయు, భటులయు సమూహము, చాల్వడి = ప్రోగుపడి, పడి, మ్రొగ్గఁబడి = ముందునకుఁబడి, రభసమునన్ = కోపముతో, మిట్టిపడన్ = ఎగిరిపడఁగా, కడ - కొంతంబులన్ = కొనబల్లెములను, కొని, వడిన్ = వేగముగా, పొడిచిరి

తాత్పర్యము: బల్లెములను దాల్చువారు భయంకరమైన అధికపరాక్రమము స్పష్టపడ గుఱ్ఱములయు, ఏనుఁగులయు, భటులయు సమూహము ప్రోగుపడి

ముందునకుఁబడి కోపముతో నెగిరిపడునట్లు కొనబల్లెములను దీసికొని వేగముగాఁ బొడిచిరి

క కడితల యుద్దంబులు నెర
విడి నొండొరు నంటఁదాఁకి వ్రేసిరి పెలుచన్
గడికండము లడగొని చ
క్కడఁచిన క్రియ నుర్గునూచమై పడఁ బోరన్ 153

అర్థము . పోరన్ = యుద్ధమునందు, కడికండములు = ముక్కలు, ముక్కలు, అడగొని = అట్టకట్టి, చక్కఁడచిన - క్రియన్ = ముక్కలు చేసిన విధమున, నుర్గునూచము + ఐ= పిండిపిండియై, పడన్ = పడునట్లు, కడితల - యుద్ధంబులు = కడితల అను ఆయుధములతోడి యుద్ధములు, నెరవిడిన్ = వ్యాపించునట్లుగా, ఒండొరున్ = ఒకరినొకరిని, అంటన్ + తాఁకి = మిక్కిలి తాఁకి, పెలుచన్ = అధికముగా, వ్రేసిరి = కొట్టిరి

తాత్పర్యము : యుద్ధమునందు ముక్కలుముక్కలు అట్టకట్టి ముక్కలు చేసిన విధమునఁ బొడిపొడియై పడునట్లు కడితల (గడిదల - సూ ని) అను ఆయుధములతోడి యుద్ధములు వ్యాపించునట్లు ఒకరినొకరు మిక్కిలి తాఁకి అధికముగాఁ గొట్టిరి

వ. ఇ ట్లతిభయంకరమైన దేవాసురయుద్ధంబున. 154

అర్థము : ఇట్లు, అతి - భయంకరము + ఐన, దేవ + అసుర-యుద్ధంబునన్

తాత్పర్యము. ఇట్లు మిక్కిలి భయంకరమైన సురరాక్షస యుద్ధమునందు - తరువాతి పద్యముతో నన్వయము

చ. అనయముఁ జక్కుచక్కనఁగ నాడెడు రూపులు, నోలి ఝుమ్మ ఝు
మ్మని కలయంగఁబాఱు వివిధారుణధారలు పాఱ, గుప్పగు
ప్పనఁ బడు మస్తకంబులును, నక్కడ నిక్కడ మ్రోసి డిబ్బుడి
బ్బనఁ బడు నట్టలున్, గడుభయావహమయ్యె మహాహవంబునన్ 155

అర్థము . అనయమున్ = మిక్కిలి, చక్కు చక్కనఁగన్ = ముక్కలు ముక్కలుగా, ఆడెడు, రూపులున్, ఓలిన్ = బాగుగా, ఝుమ్మ ఝుమ్మ + అని,

కలయఁగన్ = అంతటను, పాఱు = ప్రవహించు, వివిధ+ అరుణ - ధారలు = వివిధములైన రక్తప్రవాహములు, పాఱన్ = ప్రవహింపఁగను, గుప్పు గుప్పు + అనన్, పడు, మస్తకంబులును = తలలును, అక్కడన్ - ఇక్కడన్, మ్రోసి, డిబ్బుడిబ్బు+ అనన్, పడు, అట్టలున్ = మొండెములును, మహత్ (మహా) + ఆహవంబునన్ = గొప్పయుద్ధమున, కడున్ = మిక్కిలి, భయ + ఆవహము + అయ్యెన్ = భయంకర మయ్యెను

తాత్పర్యము మిక్కిలి ముక్కలై ఆడెడు రూపులును, బాగుగా ఝుమ్మ్ ఝుమ్మని అంతటను పాఱు వివిధ రక్తప్రవాహములు ప్రవహింపఁగను, గుప్పుగుప్పనఁ బడు తలలును, అక్కడను ఇక్కడను ధ్వనించుచు డిబ్బుడిబ్బనఁ బడు మొండెములును మహాసంగ్రామమున మిక్కిలి భయంకరమయ్యెను

వ అట్టి తుములయుద్ధంబున **156**

అర్థతాత్పర్యములు . అట్టి తుముల - యుద్ధంబునన్ = దొమ్మియుద్ధమునందు - తరువాతి పద్యముతో నన్వయము

చ. శరహతి బాహుమూలములు చక్కనఁ ద్రెవ్విన మాన కాదిసూ
కరముల పోలెఁ గోల్మసఁగి కైపునఁ గొన్ని మదాంధగంధసిం
ధురములు తీవ్రదంతములు దూఱ రయంబున నొత్తియెత్తి జ
ర్జరితముగా వడిం బొడిచి చంపె మహాజి భయంకరాకృతిన్ 157

అర్థము . శరహతిన్ = బాణముల దెబ్బచే, బాహు మూలములు = (శత్రువీరుల) చంకలు,చక్కనన్ = ముక్కలుగా, త్రెవ్వినన్ = తెగఁగా, మానక = వదలక, ఆది - సూకరముల-పోలెన్ = ఆదివరాహములవలె, కోల్మసఁగి = మిక్కిలి విజృంభించి, కైపునన్ = కోపముతో, కొన్ని, మద + అంధ - గంధ - సింధురములు = మదముచేఁ గన్నులుగానని గంధగజములు, మహత్ (మహా) + ఆజిన్ = మహాయుద్ధమున, భయంకర + ఆకృతిన్ = భయంకరాకారముతో, తీవ్ర - దంతములు = తీక్ష్ణములైన దంతములు, తూఱన్ = చొరఁగా, రయంబునన్ వేగముగా, ఒత్తి = గ్రుచ్చి, ఎత్తి, జర్జరితము + కాన్ = తూఁటులుపడునట్లు, వడిన్ = వేగముగా, పొడిచి, చంపెన్,

తాత్పర్యము : బాణముల దెబ్బచే శత్రువీరుల చంకలు ముక్కలుగాఁ దెగఁగా, మదముచేఁ గన్నులుగానని కొన్ని మత్తేభములు మహాయుద్ధమున

భయంకరాకారముతో వదలక ఆదివరాహములవలె మిక్కిలి విజృంభించి కోపముతోఁ దీక్ష్ణములైన దంతములు చొచ్చునట్లు వేగముగా గ్రుచ్చియెత్తి తూంట్లుపడునట్లు వడిగాఁ బొడిచి చంపెను

విశేషములు అలంకారము ఉపమ

క వడినెయిది యిభము ప్రతిముఖ
మడరఁగ నొకఁ డాడ నేయ నది మొగఁదిరుగం
బడుటయుఁ బెడకమునన వెలు
వడి శర మొగి నేసి యార్చువానిన తాఁకెన్ 158

అర్థము. ఒకఁడు = ఒక వీరుఁడు, వడిన్ = వేగముగా, ఎయిది = చేరి, ఇభము = ఏనుఁగు, ప్రతిముఖము + అడరఁగన్ = అభిముఖమై విజృంభించునట్లు, ఆడన్ = గ్రుచ్చుకొనునట్లు, ఏయన్ = బాణముతోఁ గొట్టఁగా, అది = ఆ యేనుఁగు, మొగఁదిరుగన్ + పడుటయున్ = పెడమొగము పెట్టునట్లు పడఁగా, పెడకమునన్+ అ = పృష్ఠభాగముననుండియే, వెలువడి, శరము = బాణము, ఒగిన్ = లెస్సగా, ఏసి = ప్రయోగించి, ఆర్చువానిన్ + అ = ఆర్చువానినే, తాఁకెన్

తాత్పర్యము. ఒక వీరుఁడు వేగముగాఁ జేరి ఒక యేనుఁగును అభిముఖమై విజృంభించునట్లు బాణముతో గ్రుచ్చుకొనునట్లు కొట్టెను ఆ యేనుఁగు పెడమొగము పెట్టునట్లు పడఁగా నా బాణము దాని పృష్ఠభాగమునుండియే వెలువడి ప్రయోగించి ఆర్చువానినే తాఁకెను

క. కోలగతి నడచి యెత్తిన
కే లొగిఁ దెగి యలుగుతోన కే లెగసి వడిన్
దూలె జలవాయసం బా
వాలువుఁ గఱచికొని దివికి వడి నెగయు క్రియన్ 159

అర్థము: కోల - గతిన్ = బాణ మార్గమున, నడచి, ఎత్తిన - కేలు = ఎత్తినచేయి, ఒగిన్ = బాగుగా, తెగి, అలుగుతోన్ + అ = బాణముతోనే, కేలు, ఎగసి = ఎగిరి, జల-వాయసంబు = నీటి కాకి, ఆ -వాలువున్ = ఆ చేపను, కఱచికొని, దివికిన్ = ఆకాశమునకు, వడిన్ = వేగముగా, ఎగయు - క్రియన్ = ఎగురు విధమున, వడిన్ = వేగముగా, తూలెన్ = చలించెను

తాత్పర్యము . బాణము పోవు మార్గమున నడచి ఎత్తినచేయి బాగుగాఁ దెగి, బాణముతోనే చేయి ఎగిరి నీటికాకి వాలుగును నోటఁ గఱచికొని ఆకాశమునకు వేగముగా నెగురువిధమున వడిగాఁ జలించెను

విశేషములు . అలంకార ముపమ

క కరములు ద్రెవ్వినఁ బండులఁ
గరాసిఁ గఱచుకొని రౌద్రగతి ననిమేషో
త్కరము దెగఁబఱచె నొక్కఁడు
సురవాహిని దటియు కొమ్మ్రిచోఱయుఁ బోలెన్ 160

అర్థము . ఒక్కఁడు = ఒక రాక్షసవీరుఁడు, కరములు = చేతులు, త్రెవ్వినన్ = తెగఁగా, పండులన్= పండ్లతో - దంతములతో, కర + అసిన్ = చేతి కత్తిని, కఱచుకొని, రౌద్ర - గతిన్ = భయంకరమైన రీతిని,అనిమేష + ఉత్కరము = దేవతల సమూహము - చేఁపల సమూహము, తెగన్ = తెగునట్లు, సుర - వాహినిన్ = దేవతల సేనను - ఆకాశగంగను, తటియు = దాఁటు, కొమ్మ్ర - చోఱయున్ + పోలెన్ = ముఖభాగమున అంపము వంటి అవయవముగల చొఱచేఁపవలె, పఱచెన్ = పరువెత్తెను

తాత్పర్యము ఒక రాక్షసవీరుఁడు చేతులు తెగిపోఁగా, చేతికత్తిని దంతములతోఁ గఱచుకొని, భయంకరమైన రీతిని దేవతాసమూహము తెగునట్లు దేవతలసేనను - చేఁపల సమూహము తెగునట్లు ఆకాశగంగను దాఁటు కొమ్మ్ర చొఱచేఁపవలె దాఁటి పరుగెత్తెను

విశేషములు : అలంకారము శ్లేషానుప్రాణితోపమ

ఆ అమ్మ్రఁ దిగిచి యేసి యది ప్రతివీరు మై
తాఁకకుండ మున్న వీఁకఁ జూరియ
వెటికికొని రయమునఁ బఱచి రిపుఁ బొడిచె
నమ్మ్రకంటె మున్నయలువు దాఁక 161

అర్థము : అమ్మ్రన్ = బాణమును, తిగిచి = లాగి, ఏసి = ప్రయోగించి, అది, ప్రతివీరు - మై = శత్రువీరుని శరీరమును, తాఁకక + ఉండన్ - మున్ను +

అ = తాఁకక మునుపే, వీఁకన్ = ఉత్సాహముతో, చురియ = చురకత్తి, పెఱికికొని= లాగికొని, రయమునన్ = వేగముగా, పఱచి = పరువెత్తి, అమ్ముకంటెన్ - మున్ను+ అ = బాణముకంటె ముందే, అలువు + తాఁకన్ = కత్తి తాఁకఁగా, రిపున్ = శత్రువును, పొడిచెన్

తాత్పర్యము. ఒకఁడు బాణము నాకర్షించి ప్రయోగించి, అది శత్రువీరుని శరీరమును దాఁకుటకు మునుపే ఉత్సాహముతోఁ జురకత్తి పెఱికికొని వేగముగాఁ బరువెత్తి, అమ్ముకంటె ముందే కత్తి తాఁకునట్లు, శత్రువును బొడిచెను

విశేషములు. చురి - చురియు - (రూపాం)

తే కడఁగి - కోదండధరుఁ డేయఁ గదనభూమిఁ
గరిహయానీకభటకోటి తరతరంబ
నెఱయ సాయకములు దాఁకి గఱులు దోఁచె
మద్దికాయలు మాఁటిడ్డ మాడ్కివోలె 162

అర్థము: కడఁగి= పూని, కోదండ - ధరుఁడు = విలుకాఁడు, ఏయన్ = కొట్టఁగా, కదన - భూమిన్ = యుద్ధభూమియందు, కరి - హయ + అనీక - భట - కోటి = ఏనుఁగులయు, గుఱ్ఱములయు సమూహము, భటుల సమూహము, తరతరంబ = క్రమక్రమముగా, నెఱయన్ = నిండుగా, సాయకములు = బాణములు, తాఁకి = తగిలి, మద్దికాయలు = చెవితమ్మినగలు, మాఁటు + ఇడ్డ - మాడ్కి + పోలెన్ - తగిలించిన విధమువలె, గఱులు = బాణముల తొక్కలు, తోఁచెన్

తాత్పర్యము . విలుకాడు పూని బాణములు ప్రయోగింపఁగా యుద్ధభూమిలో నేనుఁగుల, గుఱ్ఱముల సమూహము, భటుల సమూహము క్రమక్రమముగా నిండుగా బాణములు తగిలి మద్దికాయలు తగిలించిన విధమున బాణముల తొక్కలు తోఁచెను

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష

క కరిఘటలమీఁద నలుగడ
వరుసన వడిఁదాఁకి భిండివాలము లొప్పెన్
గిరివరతటముల నోలిన ·
పురినమఱులు గలయ నెఱఁగు పాలుపును బోలెన్. 163

అర్థము : భిండివాలములు = వడిసెల వలెనుండు నస్త్రవిశేషములు - భిందిపాలములు, కరి - ఘటలమీఁదన్ = ఏనుఁగుల గుంపులపై, నలుగడన్ = నాలుగు దిక్కుల నుండి, వరుసన్ + అ = వరుసగా, వడిన్ = వేగముగా, తాఁకి= గ్రుచ్చుకొని, గిరి - వర - తటములన్ = శ్రేష్ఠములయిన కొండలచఱియలందు, ఓలిన్ + అ = క్రమముగా, పురి - నమళులు = పురివిప్పిన నెమళ్లు, కలయన్ = అంతటను, ఎఱఁగు, పాలుపును + పోలెన్ = ఎగయు విధమున, ఒప్పెన్

తాత్పర్యము: భిండివాలములనెడు అస్త్రవిశేషములు ఏనుఁగుల గుంపులపై నాలుగుదిక్కులనుండి వరుసగా వేగముగాఁదాఁకి కొండచఱియలందుఁ గ్రమముగా పురివిప్పిన నెమళ్లు అంతటను నెగయు విధమును బోలి యొప్పెను

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష

తే. **కుంతములు బిట్టు నెఱఁకులు గొన్నఁ గొంద**
ఱొదరి బిట్టేసి రుడుగణపదవి దాఁక
సెరవు లే కని నటిమి చచ్చిన ఫలమున
బొంది తోడన దివికేఁగు పాలుపు వోలె. **164**

అర్థము : కుంతములు = బల్లెములు, బిట్టు = గాఢముగా, నెఱఁకులు=మర్మములు, కొన్నన్ = కనఁగా - తాఁకఁగా, కొందఱు, ఒదరి = విజృంభించి, సెరవు - లేక = ఆపదలేక, అనిన్ = యుద్ధమున, అటిమి = ఎదురుకొని, చచ్చిన - ఫలమునన్ = చచ్చిన ఫలముగా, బొంది - తోడన్ +ఆ = శరీరముతోనే, దివికిన్ = స్వర్గమునకు, ఏఁగు - పాలుపు + పోలెన్ = వెడలు విధమువలె, ఉడు - గణ - పదవి - తాఁకన్ = నక్షత్రరాశిమార్గమును - ఆకాశమును, తాఁకునట్లు, ఏఁగు = వెడలు, పాలుపు + పోలెన్ = విధమువలె, బిట్టు + ఏసిరి = మిక్కిలి ప్రయోగించిరి

తాత్పర్యము : కుంతములు గాఢముగా మర్మస్థానములు తాఁకఁగాఁ గొందఱు విజృంభించి, ఆపదలేక, యుద్ధమున నెదురుకొని చచ్చినదానికి ఫలముగా బొందితోనే స్వర్గమునకేఁగు విధమును బోలి, ఆకాశమును దాఁకునట్లు మిక్కిలి యేసిరి

విశేషములు : అలంకార్ ముత్ప్రేక్ష

క తాలగతిఁ బొడిచి యిరువురు
నోలములే కలువు లుచ్చి యురమునఁ గదియం
గీలించి యున్న భంగిన
వ్రాలిరి మును పెక్కులెంచి వచ్చిన వీరుల్ 165

అర్థము. మును = ముందు, పెక్కులు = అనేకములు, ఎంచి = ఎన్ని - పెక్కు బీరములు పలికి, వచ్చిన, వీరుల్, ఇరువురున్, తాల - గతిన్ = తాళమనెడి మల్లబంధవిశేషముతో, పొడిచి, ఓలము - లేక = మఱుఁగు లేక, అలువులు + ఉచ్చి బాణములు భేదించి, ఉరమునన్ = ఱొమ్మున, కదియన్ = కూడునట్లు, కీలించి = తగిలించి, ఉన్న - భంగిన్ + అ = ఉన్నవిధముగనే, వ్రాలిరి = ఒఱఁగిరి

తాత్పర్యము: ముందు పెక్కుమాటలు పలికి వచ్చిన వీరు లిరువురును తాళమనెడి మల్లబంధవిశేషముతోఁ బొడిచి మఱుఁగులేక బాణములు భేదించి ఱొమ్మునఁ గూడునట్లు తగిలించి ఉన్నవా రున్నట్లుగనే నేలవ్రాలిరి

తే గ్రుయిలతోడన పొదినట్లు గూడినట్లు
పొడిచి కడకొంతములతోన పడిరి భటులు
పక్షములతోన గిరు లుర్విఁ బడిన కరణిఁ
గరులు ఘోరాజిఁ బడియెఁ బక్కెరల తోన 166

అర్థము. ఘోర + ఆజిన్ = భయంకరమయిన యుద్ధమున, గ్రుయిల తోడన్ + అ = గ్రుచ్చు సాధనములతోనే, పొదినట్లు = పొది స్థానములు, కూడిన + అట్లు = కూడిన విధమున, పొడిచి, భటులు = వీరులు, కడకొంతములతోన్ + అ = కొనబల్లెములతోనే, పడిరి, గిరులు = కొండలు, పక్షములతోన్ + అ = తెక్కలతోనే, ఉర్విన్ = నేలపై, పడిన - కరణిన్ = పడిన విధమున, కరులు = ఏనుఁగులు, పక్కెరలతోన్ + అ = తొడుగులతోనే, పడియెన్

తాత్పర్యము : ఆ భయంకరయుద్ధమున గ్రుచ్చు సాధనములతోనే పొదులును గూడిన విధమునఁ బొడిచి భటులు కొనబల్లములతోనే పడిరి తెక్కలతోనే కొండలు నేలపైఁబడిన విధమున నేనుఁగులు తొడుగులతోనే నేలఁబడెను

విశేషములు: అలంకారములు - ఉపమలు

క భోరనఁగ నెగయు నిభ కుం
భారుణధారాలి మౌక్తికావలితోడన్
దారక గణ యుత సంధ్యా
ధారాధర భాతి గగనతలమునఁ బర్వెన్ 167

అర్థము. భోరనఁగన్ = భోరుమను ధ్వనితో, నెగయు = పైకి లేచునట్టి, ఇభ - కుంభ + అరుణ - ధారా + ఆలి = ఏనుఁగుల కుంభస్థలములందలి రక్తధారల వరుస, మౌక్తిక + ఆవలితోడన్ = ముత్యముల వరుసతో, తారక-గణ-యుత - సంధ్యా -ధారాధర - భాతిన్ = నక్షత్రముల సమూహముతోఁ గూడిన సంధ్యాకాలపు మేఘమువిధమున, గగన - తలమునన్ = ఆకాశ ప్రదేశమున, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము. భోరుమని పైకి లేచు ఏనుఁగుల కుంభస్థలములందలి రక్త ప్రవాహముల వరుస ముత్యముల వరుసతోఁ గూడి, నక్షత్రముల సమూహముతోఁ గూడిన సంధ్యాకాలపు మేఘము విధమున ఆకాశమందు వ్యాపించెను

విశేషములు. అలంకార ముపమ

క దురమునఁ బటు చక్రాహతిఁ
గర సహితము శిరము త్రెవ్వి గ్రక్కున నెగసెన్
గరములను రాహువు దివా
కరుఁ బట్టఁగ నభము కెగయుగతిఁ బొలు పెసఁగెన్ 168

అర్థము. దురమునన్ = యుద్ధమునందు, పటు - చక్ర + ఆహతిన్ = తీవ్రమయిన చక్రముయొక్క దెబ్బచే, కర - సహితము = చేతులతోఁగూడ, శిరము = తల, త్రెవ్వి = తెగి, గ్రక్కునన్ = శీఘ్రముగా, నెగసెన్ = ఎగిరెను, కరములను = చేతులతో, రాహువు, దివాకరున్ = సూర్యుని, పట్టఁగన్ = పట్టుటకు, నభముకున్ = ఆకాశమునకు, ఎగయు - గతిన్ = ఎగురువిధమున, పొలుపు + ఎసఁగెన్ = ఒప్పు మిగిలెను

తాత్పర్యము. యుద్ధమునఁ దీవ్రమైన చక్రాహతిచేఁ జేతులతోఁ గూడ శిరస్సు తెగి శీఘ్రముగా నెగురుట, చేతులతో రాహువు సూర్యునిఁ బట్టుకొనుట కాకాశమున కెగురునట్లు ఒప్పెను

విశేషములు . అలంకార ముపమ నభము కెగయు - నభముకున్ + ఎగయుఁ 'కువర్ణకంబు పరంబగునపు డుకారబుకారంబులకు నగాగమం బగు' బాల తత్సమ 28 అను సూత్రముచే నగాగమము రావలసియుండఁగా - 'కువర్ణకంబు పరంబగునపుడు కవిత్రయము వారి ప్రయోగంబులం దక్కఁదక్కిన మహాకవి ప్రయోగంబులందునుం గొన్నియెడల నుగాగమంబు చూపట్టదు ' అని ప్రౌఢ శబ్ద 19

క శరహతి శిరములు తెగితెగి
పారిఁబోరి దివి కెగసియెగసి భువిఁదొరఁగె భయం
కరలీల డాకినులు నృ
త్య రతిం దలలూఁచ నట్ట లాడిన భంగిన్ 169

అర్థము డాకినులు = పిశాచులు, నృత్య-రతిన్ = నాట్యమునందలి ఆసక్తితో, తలలు + ఊఁచన్ = తలలు ఊఁగఁజేయఁగా, అట్టలు = మొండెములు, ఆడిన - భంగిన్ = ఆడిన విధమున, శర-హతిన్ = బాణముల దెబ్బచే, శిరములు = తలలు, తెగి-తెగి = మిక్కిలి తెగి, పారిఁబోరిన్ = మాటిమాటికి, దివికిన్ = ఆకాశమునకు, ఎగసి + ఎగసి = మిక్కిలి యెగిరి, భయంకర - లీలన్ = భయము గలిగించు విధమున, భువిన్ = భూమియందు, తొరఁగెన్ = పడెను

తాత్పర్యము . పిశాచస్త్రీలు నృత్యమునందలి ఆసక్తితో తల లూఁచఁగా మొండెములాడిన విధమున, బాణముల దెబ్బచే శిరస్సులు తెగితెగి మాటిమాటికి ఆకాశమున కెగిరియెగిరి భూమిపైఁ బడెను

విశేషములు . అలంకార ముపమ

క శరహతిఁ దల తెగి పడి యం
బరమున కెగయుటయుఁ దత్కబంధము నెగసెన్
శిరము తెగిపోక కోపక
బరవసమునఁ బట్టుకొనఁగఁ బాఱిన భంగిన్ 170

అర్థము : శర - హతిన్ = బాణము దెబ్బచే, తల, తెగి - పడి, అంబరమునకున్ = ఆకాశమునకు, ఎగయుటయున్ = ఎగురుటయును, తద్ + కబంధమున్=ఆ మొండెముకూడ, శిరము, తెగిపోకకున్ = తెగిపోవుటకు, ఓపక = సహింపక, బరవసమునన్ = పట్టుదలతో, పట్టుకొనఁగన్ = పట్టుకొనుటకు, పాఱిన = పరువెత్తిన, భంగిన్ = విధమున, ఎగసెన్ = ఎగిరెను

తాత్పర్యము : బాణము దెబ్బచేఁ దలతెగిపోయి ఆకాశమున కెగురఁగా, ఆ మొండెము కూడ - శిరస్సు తెగిపోవుటకు సహింపక పట్టుదలతో దానిని బట్టు కొనుటకుఁ బరువెత్తిన విదమున నెగిరెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

క ఎగయు శిరంబులు నభమున
కొగిఁ గ్రమ్మెడు రక్తజలము లొలుకుచు భువిపై
మగుడఁబడుఁ జూడఁ గడు రం
గుగ ఓలిన రాటనమున గుండ్రల పోలెన్ 171

అర్థము . ఎగయు - శిరంబులు = ఎగురునట్టి తలలు, నభమునకున్ = ఆకాశమునకు, ఒగిన్ = బాగుగా, క్రమ్మెడు = వ్యాపించు, రక్త - జలములు = రక్తపు నీరులు, ఒలుకుచున్ = కార్చుచు, ఓలిన్ + అ = బాగుగా, రాటనమునన్ = రాట్నమునందు - గానుఁగ యందు, గుండ్రల - పోలెన్ = రాట్నము కోలలవలె (సూ ని.) రాట్నమును ద్రిప్పెడు గుండువలె, చూడన్ = చూడఁగా, కడున్ = మిక్కిలి, రంగునన్= సొంపుగా, భువిపైన్ = భూమిమీఁద, మగుడన్ = మరల, పడున్

తాత్పర్యము : తెగిపోయి యెగురు తలలు ఆకాశమునకు బాగుగా వ్యాపించు రక్తపు నీరులు కార్చుచు, బాగుగా రాట్నమునందలి రాట్నపు గుండుల వలెఁ జూడ మిక్కిలి సొంపుగా భూమిపై మరలఁబడును

విశేషములు : అలంకార ముపమ

క. విఱిగిన యలువుల తునియలు
మెఱచుచు దివి కెగయఁదొడఁగె మింటికి వడిఁ బొం
గెఱఁగెడు వీరుల వెనుచని
యెఱకలు గొని క్రమ్మఱింప నెగయు విధమునన్ 172

అర్థము : విఱిగిన - అలువుల - తునియలు = విఱిగిపోయిన బాణముల ముక్కలు, మెఱచుచున్ = మెఱయుచు, మింటికిన్ = ఆకాశమునకు, వడిన్ = వేగముగా, పొంగి + ఎఱఁగెడు = పొంగి ఎగయునట్టి, వీరులన్, వెనుచని = వెంబడించి, ఎఱకలు + కొని = తెక్కలు పట్టుకొని, క్రమ్మఱింపన్ = మరలించుటకు, ఎగయు - విధమునన్ = ఎగురు విధమున, దివికిన్ = ఆకాశమునకు, ఎగయన్ + తొడఁగెన్ = ఎగురనారంభించెను

తాత్పర్యము . విఱిగిపోయిన బాణముల ముక్కలు మెఱయుచు ఆకాశమునకు వేగముగాఁ బొంగి యెగసెడు వీరులను వెన్నాడి తెక్కలు పట్టుకొని మరలింప నెగురు విధమున ఆకాశమున కెగురఁదొడఁగెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష పొంగెఱఁగెడు -। పొంగి + ఎఱఁగెడు - 'క్ష్వార్థంబైన యిత్తునకు సంధి లేదు' బాల సంధి 8 ఇట సంధియైనది 'ఇప్రత్యయాంతావ్యయవంబునకు సంధియుఁ జూపట్టెడు' ప్రౌఢ సంధి 2 అలుగు - అలువు (రూపాం) 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు నకారంబు విభాష నగు' బాల ఆచ్చిక 27

ఆ బరులు రెండు త్రెవ్వి పార్శ్వంబులకుఁ దీరఁ
బాఱి చూడ నొప్పె భటుఁడు దివికి
నింద్రసతులఁ గూడ నెఱకలతోడన
యెఱఁగిపోవ నున్న తెఱఁగ పోలె 173

అర్థము. భటుఁడు = వీరుఁడు, బరులు - రెండు = రెండు ప్రక్కలును, త్రెవ్వి = తెగి, పార్శ్వంబులకున్ = ప్రక్కలకు, తీరఁబాఱి = నిలిచి పోయి, ఇంద్ర - సతులన్ = ఇంద్రుని స్త్రీలను, కూడన్ = పొందుటకు, ఎఱకల తోడన్ + అ = తెక్కలతోనే, దివికిన్ = స్వర్గమునకు, ఎఱఁగిపోవన్ + ఉన్న - తెఱఁగు + అ + పోలెన్ = ఎగిరిపోవుచున్న విధమున, చూడన్ + ఒప్పెన్ = చూడఁగా నొప్పెను

తాత్పర్యము ఒక భటుఁడు రెండు ప్రక్కలును దెగి, అవి రెండు వైపులను నిలిచిపోయి, యింద్రుని స్త్రీలను బొందుటకు తెక్కలతోనే స్వర్గమునకు ఎగిరి పోవనున్న విధమునఁ జూడ నొప్పెను

విశేషములు : తీరు = నిలుచు. తీరు, నినఁగను నల్చనం చని పల్కఁగాఁదగు .' ఆం భా 3 58 అలంకార ముత్ప్రేక్ష

ఉ. **తోలును నెత్తురు న్నెఱచితోన శరాహతిఁబోయి మేను గం**
కాలమ త్రిక్కి చేత నసిఖండమ కత్తిగఁ బట్టి నల్గడన్
వ్రేలెడు ప్రేవులెత్తి పయి వ్రేలుట దా నటు వ్రాలవైచి వే
తాలుఁడు వోలె నిల్చె నొక దండి మహాజి భయంకారకృతిన్. 174

అర్థము: ఒక - దండి = ఒక గొప్ప వీరుఁడు, మహాత్ (మహా) + ఆజిన్= గొప్పయుద్ధమున, తోలును, నెత్తురున్ = రక్తమును, ఎఱచి - తోన్ + అ =

మాంసముతోనే, శర + ఆహతిన్ = బాణముల దెబ్బచే, పోయి = నశించి, మేను= శరీరము, కంకాలము + అ = అస్థి పంజరము మాత్రమే, త్రిక్కి = మిగిలి, చేతన్-చేతియందు, అసి - ఖండము = కత్తి ముక్క, కత్తిగన్ = కత్తిగా, పట్టి = పట్టుకొని నల్గడన్ =(నలు + కడన్) = నాలుగు దిక్కులను, వ్రేలెడు = వ్రేలాడునట్టి, ప్రేవులు = ప్రేగులు, ఎత్తి, పయిన్, వ్రేలుట, తాన్, అటు, వ్రాలన్ + వైచి = వ్రాలునట్లుచేసి, వేతాలుఁడు + పోలెన్ = పిశాచమువలె, భయంకర + ఆకృతిన్ = వెఱపుగొలుపు నాకారముతో, నిల్చెన్

తాత్పర్యము. ఒక గొప్పవీరుఁడు మహాయుద్ధమున బాణముల దెబ్బచేఁ దోలును, నెత్తురును మాంసముతోపాటే నశించి, శరీరము, అస్థిపంజరము మాత్రమే మిగిలి కత్తిముక్కను జేతఁ గత్తిగాఁ బట్టి, నాలుగు దిక్కులను వ్రేలాడు ప్రేవుల నెత్తి వ్రాలవైచి పిశాచము వలె భయంకరాకారముతో నిలిచెను

విశేషములు : అలంకార ముపమ వేతాలుఁడు = ఒకజాతి పిశాచము, శవము నాశ్రయించి యుండు భూతము - సూ ని

తే. **తఱిమి పెనఁచిన నిడుదకొంతముల మీఁద**
శర విఖండిత యోధమాంసములు నిండి
యొప్పెఁ బందిరిపైఁబచ్చి యుప్పుఁగండ
లెండఁబెట్టిన విధమున భండనమున 175

అర్థము: భండనమునన్ = యుద్ధమున, తఱిమి (తఱిమి) = శత్రువులపైఁ బడి, పెనఁచిన = మెలివేసిపట్టుకొనిన, నిడుద = కొంతముల మీఁదన్ = పొడవైన బల్లెముల మీఁద, శర - విఖండిత - యోధ - మాంసములు = బాణములచే ముక్కలు చేయఁబడిన వీరుల మాంసములు, నిండి, పందిరిపైన్, పచ్చి = ఆర్ద్రమైన, ఉప్పుగండలు - ఉప్పు + కండలు = ఉప్పులో ఊరవేసిన మాంసపు ముక్కలు, ఎండన్ + పెట్టిన - విధమునన్, ఒప్పెన్

తాత్పర్యము : యుద్ధములో శత్రువులపైఁబడి మెలివేసి పట్టుకొనిన పొడవైన బల్లెముల మీఁద అమ్మిలచే ముక్కలు చేయఁబడిన వీరుల మాంసములు నిండి, ఉప్పులో నూరవేసిన పచ్చిమాంసపుముక్కలు పందిరిపైనెండబెట్టిన విధమున నొప్పెను

విశేషములు : అలంకార ముపమ

తే నెగసియాడు - కబంధముల్ నింగిఁ గప్పఁ
బడిన కుణపంబు లోలిన పుడమిఁగప్ప
నెఱయ నిరువాఁగుఁ బొరిఁబొరి నఱిమి పాడువ
దివియు భువియును శవముల తిట్టలయ్యె 176

అర్థము . ఇరు - వాఁగున్ = రెండుపక్షములవారును, నెఱయన్ = నిండునట్లు, పొరిఁబొరిన్ = మాటిమాటికిని, అఱిమి = విజృంభించి, పాడువన్ = పాడువఁగా, నెగసి + ఆడు = ఎగిరియాడెడి, కబంధముల్ = మొండెములు, నింగిన్ = ఆకాశమును, కప్పన్ = కప్పఁగను, పడిన = క్రిందఁబడిన, కుణపంబులు = శవములు, ఓలిన్ + అ = బాగుగా, పుడమిన్ = భూమిని, కప్పన్ = కప్పఁగను, దివియున్ = ఆకాశమును, భువియును = భూమియును, శవముల - తిట్టలు = శవముల ప్రోగులు, అయ్యెన్

తాత్పర్యము రెండు పక్షముల వారును నిండుగా మాటిమాటికిని విజృంభించి పాడుచుకొనఁగా - నెగిరియాడు మొండెములు ఆకాశమును గప్పఁగను, క్రిందఁబడిన శవములు భూమిని గప్పఁగను, ఆకాశమును, నేలయును శవముల ప్రోవులయ్యెను

క క్రిక్కిఱిసిన శవములలో
నొక్కెడ నడియఁబడియుండ నోపక వడిఁ బ
ల్దిక్కులకు నెగసెనో యన
నక్కజమున నెగసి యట్ట లాడుచునుండెన్ 177

అర్థము : క్రిక్కిఱిసిన - శవములలోన్, ఒక్క + ఎడన్ = ఒకచోట, నడియఁబడి + ఉండన్ + ఓపక = నడుమఁబడియుండఁజాలక (?), వడిన్ = వేగముగా, పల్దిక్కులకున్ (పలు + దిక్కులకున్) = పలు దెసలకు, ఎగసెనో + అనన్ = ఎగిరెనా యనునట్లు, అట్టలు = మొండెములు, అక్కజమునన్ = ఆశ్చర్యకరముగా, ఎగసి = ఎగిరి, ఆడుచున్ + ఉండెన్

తాత్పర్యము : క్రిక్కిఱిసిన శవములలో నొకచోట నడుమఁబడి యుండఁజాలక వేగముగాఁ బెక్కుదిక్కులకు ఎగిరెనో యనునట్లు మొండెములు ఆశ్చర్యకరముగా నెగిరి ఆడుచుండెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

ఆ సిరము ద్రెస్సివడిన సురియ మార్చిన ముష్టి
విడువ కాడె నొక్క వీరభటుఁడు
ఈల గ్రద్ద నోర నోలగాలు వితిగి
యంబరమున కెఱిగి యాడినట్లు 17

అర్థము. ఈలగ్రద్ద - నోరన్ = ఒకవిధమైన గ్రద్ద నోటియందు, ఓలగాలు = కొలుచు, వితిగి, అంబరమునకున్ = ఆకాశమునకు ఎఱిగి = ఎగిరి, ఆడిన + అట్లు = ఆడిన విధమున, ఒక్క - వీర - భటుఁడు = వీరుఁడైన ఒక సైనికుఁడు, సిరము = శిరస్సు, త్రెస్సి - పడినన్ = త్రెగిపడినను, సురియన్ = చుఱుకత్తితో, మార్చిన = ప్రతిఘటించిన, ముష్టి = పిడికిలి, విడువక = విడిచిపెట్టక, ఆడెన్

తాత్పర్యము . నోటఁ గాలు వితిగిన యీలగ్రద్ద ఆకాశమున కెగిరి యాడిన విధమున వీరుఁడైన యొక సైనికుఁడు శిరస్సు త్రెగిపడినను జుఱుకత్తితోఁ బ్రతిఘటించిన పిడికిలి విడిచిపెట్టక యాడెను

విశేషములు . అలంకార ముపమ ఈ పద్యము నందలి సురియ మార్చిన ముష్టి 'ఓలగాలు' అనునవి యింకను విచార్యము ముష్టి = తత్క్షణము అను మానవల్లివారి ప్రతిలోని యర్థ మెట్లు సుసంగతమో!

క ఉరుతరతనుఁడగు సద్భట
వరునట్ట నిభంబు శిరము వడి నదికి బలో
త్కరమునఁ బ్రతివీరభయం
కరుఁడై యుద్ధంబు చేసె గణపతి వోలెన్ 179

అర్థము: ఉరుతర - తనుఁడు = మిక్కిలి పెద్ద శరీరముగలవాఁడు, అగు, సత్+భట - వరు+ అట్టన్ = మంచివీరశ్రేష్ఠుని మొండెమునందు, ఇభంబు - శిరము = ఏనుఁగు తల, వడిన్ = వేగముగా, అదికి = అతుకుకొని, బల + ఉత్కరమునన్ = బల సమూహముచే - బలాధిక్యముచే, గణపతి + పోలెన్ = గజాననునివలె, ప్రతి-వీర -భయంకరుఁడు + ఐ = శత్రువీరులకు వెఱపు గలిగించువాఁడయి, యుద్ధంబు - చేసెన్

తాత్పర్యము : మిక్కిలి పెద్ద శరీరముగలవాఁడగు నొక వీరశ్రేష్ఠుని మొండెముపై నేనుఁగు తల వెంటనే అదుకుకొని బలాధిక్యముచే గజాననుని వలె శత్రువీరభయంకరుఁడై యుద్ధముచేసెను •

విశేషములు . అలంకార ముపమ

క తురగంబు నట్టపై నరు
శిరమును, నరునట్టఁ దురగశిర మదికె వడిన్
బురుషమృగంబులతోఁ గి
న్నరు లొగిఁ బోరాడు క్రియ రణంబున నొప్పెన్ 180

అర్థము . తురగంబు + అట్టపైన్ = గుఱ్ఱము మొండెము మీఁద, నరు -శిరమును = మనుష్యుని తలయు, నరు+అట్టన్ =మనుష్యుని మొండెముపై, తురగ - శిరము = గుఱ్ఱముతల, వడిన్ = వేగముగా అదకెన్ = అదుకుకొనెను, కిన్నరులు = నరముఖమును అశ్వశరీరమును గల దేవయోని విశేషములు అట్లే అశ్వముఖమును, నర శరీరమును గల దేవయోని విశేషములు, పురుష - మృగంబులతోన్ = పురుషులతోను, గజతురగాది మృగములతోను, పోరాడు - క్రియన్ = పోరాడు విధమున, రణంబునన్ = యుద్ధమునందు, ఒప్పెన్

తాత్పర్యము : గుఱ్ఱము మొండెముపై నరుని శిరమును, నరుని మొండెముపై గుఱ్ఱము తలయు వెంటనే అదికికొని అశ్వముఖము నరశరీరము, నరముఖము అశ్వశరీరము గల కిన్నరులనెడి దేవయోనివిశేషములవలె పురుషుల తోను, గజతురగాది మృగముల తోను బోరాడు విధమున యుద్ధమునం దొప్పెను

విశేషములు : అలంకార ముపమ

క. ముక్తక బంధములగు భూ
ముక్త కబంధములవలన మొగిఁ గ్రమ్మ మహా
రక్తార్ద్రాంబరతలమున
రక్తాఆర్ద్రాంబరతనుండు రణరతుఁ డాడెన్ 181

అర్థము: ముక్తక - బంధములు = విడువఁబడిన సంసారాది బంధములు గలవి, అగు, భూ-ముక్త - కబంధముల వలనన్ = భూమియందు విడువఁబడిన మొండెములనుండి, మొగిన్ = అధికముగా, క్రమ్మ = వ్యాపించు, మహత్ (మహా) + రక్త + ఆర్ద్ర + అంబర - తలమునన్ = అధికమైన రక్తముచేఁ దడిసిన ఆకాశ ప్రదేశమున, రక్త+ ఆర్ద్ర + అంబర - తనుండు = రక్తముచేఁ దడిసిన వస్త్రములు శరీరము గలవాఁడు, అగు, రణ - రతుఁడు = యుద్ధమునం దాసక్తిగలవాఁడు, ఆడెన్

తాత్పర్యము. విడిచిపెట్టఁబడిన సంసారాదిబంధములు గల నేలఁబడిన మొండెములనుండి అధికముగాఁ గాఱిన రక్తముచేఁ దడిసిన ఆకాశప్రదేశమున రక్తముచేఁ దడిసిన వస్త్రములు దేహము గల యుద్ధప్రియుఁ డాడెను

వ తత్ప్రస్తవంబున 182

అర్థతాత్పర్యములు. తద్ + ప్రస్తవంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ ఉరు పాశములు మృదు కర పాశములు కాఁగఁ
జక్రముల్ పృథుకటిచక్రములుగ,
బాణముల్ నుత దృష్టిబాణంబులుగఁ, గార్ముఁ
కమ్ములు భ్రూకార్ముకములు కాఁగ,
మండలాగ్రము లాస్యమండలమ్ములుగఁ, గుంభి
కుంభముల్ గురుకుచకుంభములుగ
వజ్రముల్ సితదంతవజ్రములుగఁ, దత్ప్ర
ఘట్టన పటురతిఘట్టనముగ

ఆ విక్షతములు బహునఖక్షతములు కాఁగ,
రక్తరసము పొడము రాగరసము
కాఁగ, సుభటవరులఁ గలిసి రణాంగన
ప్రౌఢి మెఱసి చేసెఁ బరవశులుగ 183

అర్థము. ఉరు - పాశములు = గొప్ప పాశములు (పాశములనెడి ఆయుధములు), మృదు-కర-పాశములు - కాఁగన్ = మృదువులైన పాశముల వంటి కరములుకాఁగా, చక్రముల్ = చక్రాకారాయుధములు, పృథు-కటి-చక్రములుగన్ = పెద్ద మండలములవంటి పిఱుఁదులు కాఁగా,

బాణముల్, నుత - దృష్టి - బాణములుగన్ = పొగడఁబడిన బాణముల వంటి చూపులు కాఁగా, కార్ముకమ్ములు = విండ్లు, భ్రూ-కార్ముకములు - కాఁగన్ = విండ్లవంటి కనుబొమలు కాఁగా,

మండలాగ్రములు = కత్తులు, ఆస్యమండలమ్ములగన్ = మండలాకారముఖము కాఁగా, కుంభి - కుంభముల్ = ఏనుఁగుల కుంభస్థలములు, గురు - కుచ - కుంభములుగన్ = పెద్ద కుండలవంటి స్తనములు కాఁగా,

వజ్రములన్ = వజ్రాయుధములు, సిత-దంత-వజ్రములుగన్ = తెల్లని వజ్రముల వంటి దంతములు కాఁగా, తద్ + ప్రఘట్టన = వాని అధికమగు త్రొక్కిడి, పటు - రతి - ఘట్టనముగన్ = తీవ్రమయిన సంభోగపు రాయిడికాఁగా,

విక్షతములు = గాయములు, బహు -నఖ-క్షతములు - కాఁగన్ = అనేకములయిన గోటినొక్కులు కాఁగా, రక్త - రసము = రక్తమనెడి రసము, పొడము = పుట్టునట్టి, రాగ - రసము - కాఁగన్ = ప్రేమరసము కాఁగా,

రణ + అంగన = యుద్దమనెడి స్త్రీ, సుభట - వరులన్ = భటశ్రేష్ఠులను, కలిసి = కూడి, ప్రౌఢి = నేర్పు, మెఱసి = ప్రకాశించి, పరవశులుగన్ = ఒడలు తెలియని వారినిగా, చేసెన్

తాత్పర్యము . పెద్ద పాశాయుధములు మృదువులయిన పాశాకార హస్తములు కాఁగా, చక్రాయుధములు పెద్దకటిమండలములు కాఁగా, బాణములు పొగడఁబడిన ద్భగ్బాణములు కాఁగా, విండ్లు బొమవిండ్లు కాఁగా, కత్తులు ముఖ మండలము కాఁగా, ఏనుఁగుల కుంభస్థలములు గురుకుచకుంభములు కాఁగా, వజ్రాయుధములు తెల్లని వజ్రములవంటి దంతములు కాఁగా, వాని అధికమగు త్రొక్కిడి తీవ్రమైన సంభోగపు రాయిడికాఁగా, గాయములు పెక్కు గోటి నొక్కులు కాఁగా, రక్త రసము ప్రేమరసముకాఁగా యుద్దమనెడి స్త్రీ సుభటశ్రేష్ఠులను గూడి నేర్పుమెఱసి మైమఱచినవారినిగాఁ జేసెను

విశేషములు . అలంకారము రూపకము

క మృతులైన వీరులందఱు
నతివీరులు వీరికెల్ల నడుగిడ నమరా
వతిఁ బట్టులేదు వర సుర
సతులందఱఁ జిదిమిపెట్టఁజాలరు వరుసన్ 184

అర్థము . మృతులు + ఐన - వీరులు + అందఱున్ = చచ్చిన వీరులందఱును, అతి - వీరులు = గొప్పవీరులు, వీరికిన్ + ఎల్లన్ = వీరికందఱికును, అడుగు + ఇడన్ = అడుగుపెట్టుటకు, అమరావతిన్ = అమరావతియందు, పట్టు = స్థానము - చోటు, లేదు, వర - సుర - సతులు = శ్రేష్ఠురాండ్రయిన దేవత్రాస్త్రీలు, వరుసన్ = వరుసగా, అందఱన్ = అందఱను, చిదిమిపెట్టన్ + చాలరు = పంచుకొనుటకుఁ జాలరు

తాత్పర్యము . చచ్చిన వీరులందఱును గొప్పవారు వీరులందఱును అమరావతిలో అడుగుపెట్టుటకుఁ జోటు చాలదు దేవతాస్త్రీలు వరుసగా వీరినందఱను పంచుకొనుటకుఁ జాలరు

విశేషములు : యుద్ధమరణము నొందిన వీరులు వీరస్వర్గము నొంది అమరావతి కరుగుదు రనుట వీరి సంఖ్య అధికము దేవవేశ్యలసంఖ్య అల్పమగుటచే దేవవేశ్యలు వీరిని బంచుకొనుట కష్టమనుట అలంకార మతిశయోక్తి

వ. **అట్టి కదనంబున** **185**

అర్థతాత్పర్యములు : అట్టి - కదనంబునన్ = అట్టి యుద్ధమునందు - తరువాతి పద్యముతో నన్వయము

మ **'అది నా వల్లభు నుత్తమాంగ, మిది నా యాత్మేశు వక్షస్స్థలం**
బది నా నాథు పదద్వయం, బది మదీయాధీశు బాహుద్వయం,
బది నా తేని కటిప్రదేశ మని తా రంతంత నొక్కొక్కెడన్
గదనాగ్రంబున నేఱి తెచ్చి పొడవుల్ గావింతు రోలిన్ సతుల్.186

అర్థము . అది, నా - వల్లభు + ఉత్తమాంగము = నా భర్త శిరస్సు, ఇది, నా + ఆత్మ + ఈశు - వక్షస్ + స్థలంబు = నా ప్రాణేశ్వరుని తొమ్ము, అది, నా - నాథు-పద-ద్వయంబు = నా భర్త అడుగుదోయి, అది, మదీయ + అధి + ఈశు-బాహు-ద్వయంబు = నా హృదయేశ్వరుని కేలుదోయి, అది, నా - తేని - కటి - ప్రదేశము = నా ప్రభువు మొలప్రదేశము, అని, తారు = తాము, అంతంతన్ = అక్కడక్కడ, ఒక్క + ఒక్క + ఎడన్ = ఒక్కొక్కచోట, సతుల్ = స్త్రీలు, ఓలిన్ = క్రమముగా, కదన = అగ్రంబునన్ = అనిమొనయందు, ఏఱి-తెచ్చి, పొడవుల్ = రూపములు, కావింతురు = చేయుదురు

తాత్పర్యము . 'అది నా భర్త శిరస్సు ఇది నా ప్రాణేశ్వరుని వక్షస్స్థలము, అది నా భర్త అడుగుదోయి, అది నా జీవితేశ్వరుని బాహుయుగము, అది నా ప్రభువు కటి ప్రదేశము, అని అక్కడక్కడ నొక్కొక్కచోట యుద్ధభూమిలో స్త్రీలు వరుసగా నేఱి తెచ్చి రూపముల నేర్పఱుతురు

విశేషములు : వల్లభునుత్తమాంగము - వల్లభు + ఉత్తమాంగము 'షష్ఠీ సమాసమునం దుకార ఱుకారముల కచ్చుపరమగునపుడు నుగాగమంబగు' బాలసం 34, 'పొడవుల్గాఁ జేతు రోలిన్' అని సాఅ ప్రతి పారము అది

'పాడవుల్‌గాఁ జూతు రోలిన్' అయియుండునని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి యభిప్రాయము చూడు వా ప్రతి పీరిక

వ మఱియుం గొందఱు డెందంబులం దఱలేని తియ్యంబుల పెక్కువ నిక్కువంబు చేయుచు 187

అర్థము . మఱియున్, కొందఱు, డెందంబుల + అందున్ = హృదయములందు, అఱలేని = కపటములేని, తియ్యంబుల - పెక్కువ = అనురాగముల ఆధిక్యమును, నిక్కువంబు = చేయుచున్ = నిజము చేయుచు

తాత్పర్యము . మఱియును గొందఱు స్త్రీలు హృదయములందలి నిష్కపటములైన అనురాగముల ఆధిక్యమును నిజము చేయుచు - తరువాతి పద్యముతో నన్వయము

క దురమున నిశితాస్త్రహతిం
బురుషులు హతులైన మదనపుష్పాస్త్రహతిం
దరుణులు మృతలై తమతమ
పురుషులతో నరిగి రమరపురి కనురక్తిన్ 188

అర్థము : పురుషులు = మగలు, దురమునన్ = యుద్ధమున, నిశిత + అస్త్ర - హతిన్ = వాఁడియైన బాణముల దెబ్బచే, హతులు + ఐనన్ = చంపఁబడినవారు కాఁగా, మదన - పుష్ప + అస్త్ర - హతిన్ = మన్మథుని పూవుటమ్ముల దెబ్బచే, తరుణులున్ = వారి భార్యలును, మృతలు + ఐ = మరణించినవారయి, తమ - తమ - పురుషులతోన్ = తమతమ భర్తలతో, అమర - పురికిన్ = అమరావతికి, అనురక్తిన్ = అనురాగముతో, అరిగిరి

తాత్పర్యము: భర్తలు యుద్ధమున వాఁడిబాణముల దెబ్బచే మరణింపఁగా, వారి భార్యలును మన్మథుని పూవుటమ్ముల దెబ్బలచే మరణించి తమతమ భర్తలతో ననురాగముతో నమరావతి కరిగిరి

వ తదవసరంబున. 189

అర్థతాత్పర్యములు : ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

చ. అరగొన కాజి నీల్గి సుభటాలి విమానము లెక్కి దేవతా
వరపురి కేఁగుచో నిజకబంధము లభ్రపథంబు ముట్టి భీ
కరగతి నాడు లీలఁ దమకంబునఁ గన్గొనుచున్ సురాంగనా
స్ఫురదురునృత్యవిభ్రమము చూడరు వీరరసప్రమత్తులై. 190

అర్థము. అర-కొనక = వెనుదీయక, ఆజిన్ = యుద్ధమునందు, ఈల్గి = చచ్చి, సు-భట + ఆలి = సద్వీరుల వరుస, విమానములు, ఎక్కి, దేవతా - వర - పురికిన్ = దేవతాశ్రేష్ఠుల పురమునకు - అమరావతికి, ఏఁగుచోన్ = పోవునప్పుడు, నిజ - కబంధములు = తమవైన మొండెములు, అభ్ర - పథంబు = ఆకాశ మార్గమును, ముట్టి = చేరి, భీకర - గతిన్ = భయంకరమైన విధమున, ఆడు-లీలన్ = ఆడు రీతిని, తమకంబునన్ = ఆసక్తితో, కన్గొనుచున్ = చూచుచు, వీర - రస - ప్రమత్తులు + ఐ = వీరరసముచే మిక్కిలి మదించిన వారయి, సుర + అంగనా - స్ఫురత్ + ఉరు - నృత్య - విభ్రమము = దేవతాస్త్రీల ప్రకాశించుచున్న గొప్ప నృత్యము యొక్క విలాసమును, చూడరు

తాత్పర్యము. సుభటులు వెనుదీయక యుద్ధమునఁ జచ్చి విమానములెక్కి అమరావతికిఁ బోవునప్పుడు, తమ మొండెములు ఆకాశమును జేరి భయంకరముగా ఆడురీతిని ఆసక్తితోఁ జూచుచు వీరరసముచే మిక్కిలి మదించినవారయి దేవతాస్త్రీల గొప్ప నృత్యవిలాసమును జూడరు

విశేషములు. అన్ని ప్రతులలోను 'స్ఫురదురు నిత్య విభ్రమము' అని యుండగా రా అ శర్మగారు దీనిని 'నృత్య'గా మార్చిరి అది సమంజసముగా నున్నదని తోఁచుటచే స్వీకృతమయినది సుభటాలి చూడరు 'మహత్సమూర్థకశబ్దం బమహత్కార్యయుక్తంబయ్యుఁ దద్విశేషణక్రియలు మహత్కార్యయోగ్యంబులు విభాషనగు ' ప్రౌఢ సం 17

వ **ఇట్టి సాంపరాయరభసంబున** **191**

అర్థము. ఇట్టి, సాంపరాయ - రభసంబునన్ = యుద్ధసంరంభమునందు

తాత్పర్యము : ఇట్టి యుద్ధసంరంభమునందు - తరువాతి పద్యముతో నన్వయము

ఉ **ఆడెడి రూపులున్, గలయ నాడెడి గ్రద్దలుఁ జప్పలించి పో**
రాడు పిశాచముల్, నెగసి యాడెడు నట్టలు, వానిఁ జిఱ్ఱుము
ఱ్ఱాడెడు భూతసంకులము, నంగద నిల్పక చుట్టుముట్టుగా
నాడెడు జంబుకాలిఁ గలహోవని భీకరమయ్యెఁ జూడఁగాన్. **192**

అర్థము. ఆడెడి - రూపులన్ = ఆడునట్టి రూపములును, కలయన్ = అంతటను, ఆడెడి, గ్రద్దలున్, చప్పలించి = చప్పరించి, పోరు + ఆడు = కలహించు, పిశాచముల్, నెగసి = ఎగిరి, ఆడెడు, అట్టలున్ = మొండెములును వానిన్ = ఆ అట్టలను, చిట్టు-ముట్టు + ఆడెడు = చీల్చెడు, భూత - సంకులమున్ = భూతముల సమూహమును, అంగదన్ + ఆఁకటిని, నిల్పక = ఆఁపుకొనలేక, చుట్టు-ముట్టుగాన్, ఆడెడు, జంబుక + ఆలి(యు)న్ = నక్కల సమూహమును, కలహ+అవనిన్ = యుద్ధభూమియందు, చూడఁగాన్, భీకరము + అయ్యెన్ = భయంకర మయ్యెను

తాత్పర్యము. ఆడునట్టి రూపములును, అంతటను జరించు గ్రద్దలును, చప్పరించి కలహించు పిశాచములును, ఎగిరియాడుమొండెములున్ను, వానిని జీల్చు భూతసమూహమును ఆఁకలి నిలుపక చుట్టును ఆడెడు నక్కల గుంపును యుద్ధభూమిలోఁ జూడ భయంకరమయ్యెను

విశేషములు : జంబుకాలిన్ - 'నామపదమునకుఁ గడపల సముచ్చయార్థమునందు యువర్ణవిరహితముగా నుశబ్ద మయ్యెను' ప్రౌఢ శబ్ద 116

చ కడితలకాఱు వ్రేయఁ గడికండములై పడి వండఁదర్గిన
ట్లడగొనియుండె, ముత్తునియలై పడ నల్గడలందుఁ గాలఁ గో
ల్మొడిచినయట్ల యుండె, నడుముల్ తెగిపోయినఁ బన్నిదం బొగిం
బొడిచినయట్ల యుండె, రణభూమి కృతాంతకు బానసంబొ నాన్ 193

అర్థము. రణ - భూమి = యుద్ధభూమి, కృతాంతకు - బానసంబొ-నాన్- యముని వంటయిల్లో యనునట్లు, కడితలకాఱు = డాలుగలవారు, వ్రేయన్ = కొట్టఁగా, కడికండములు + ఐ = ముక్కలుముక్కలయి, పడి, వండన్ = వండుటకు, తర్గిన + అట్లు = తఱిగిన విధమున, అడగొని + ఉండెన్ = అట్టకట్టియుండెను, ముత్తునియలు (మూఁడు + తునియలు) + ఐ = మూఁడుముక్కలయి, పడన్ = పడఁగా, నల్గడల + అందున్ = నాలుగువైపులను, కాలన్ = కాలుటకు, కోల్మొడిచిన + అట్లు+ అ = విజృంభించిన విధముననే, ఉండెన్, నడుముల్, త్రెగిపోయినన్ = ముక్కలు కాఁగా, ఒగిన్ = క్రమముగా, పన్నిదంబు = పందెము, పొడిచిన + అట్లు + అ = ఒడ్డినట్లే, ఉండెన్

తాత్పర్యము . యుద్ధభూమి యముని వంటయిల్లా యనినట్లు డాలుగలవారు కొట్టఁగా ముక్కలుముక్కలయిపడి వండుటకుఁదటిగిన విధమున నట్టకట్టియుండెను మూఁడు ముక్కలయి పడఁగా నాల్గువైపులను గాలుటకు విజృంభించినట్లే యుండెను నడుములు తెగి పోఁగాఁ బండెము నొడ్డినట్లే యుండెను

విశేషములు. 'నడుముల్ తెగిపోయినఁ బన్నిదం బొగిన్ బొడిచిన యట్ల యుండె' ననునది కృతాంతుని బానసమా యన నున్నదనుట కె ట్లుపకకరించునో విచార్యము అలంకార ముత్ప్రేక్ష

క దురమున మెడ తొడ తల మొల
బరి శిర ముర మక్కు ప్రక్క బడుమములుం గె
డ్బెరపై యేర్పడ కతి భీ
రమయ్యె జముండు కుడిచి క్రక్కిన భంగిన్ 194

అర్థము. దురమునన్ = యుద్ధమునందు, మెడ, తొడ, తల, మొల, బరి = పార్శ్వము, శిరము, ఉరము = ఱొమ్ము,, అక్కు = గుండె, ప్రక్క = ప్రక్క, బడుమములున్ = కెడ్బెరసు + ఐ = కలిసిపోయి, ఏర్పడక = వేఱుగాక, జముండు = యముఁడు, కుడిచి = తిని, క్రక్కిన - భంగిన్ = క్రక్కినవిధమున, అతి-భీకరము = మిక్కిలి భయంకరము, అయ్యెన్

తాత్పర్యము. యుద్ధమునందు మెడ, తొడ, తల, మొల, బరి, శిరస్సు, ఉరస్సు,అక్కు, ప్రక్క, బడుమములు - కలిసిపోయి విభజింపఁబడక, యముఁడు తిని క్రక్కిన విధమున మిక్కిలి భయంకరమయ్యెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష బడుమములు - తెలియలేదు కెడ + బెరసు = కెడ్బెరసు (కన్న) = కలిసినది

సీ. గర్జిల్లి తోఁతెంచు కరిఘటాభ్రావలి
వెలిఁగెడు శాతాసి విద్యుదాలిఁ
దివిరెడు రణతూర్యరవగర్జనంబునఁ
బైఁగ్రమ్మి కురిసెడు బాణవృష్టి
నిండి బోరనఁ బాఱు నెత్తురుటేఱులఁ
గరఁగి పేరిమాంసకర్దమమున
వడిఁదాఁకు నానాస్త్రవజ్రసంఘట్టనఁ
బైఁదూలు కేతన బక సమూహి

ఆ బలసియాడు నురు కబంధ బర్హిణములఁ
బ్రీతిఁ బొలయు భూత చాతకముల
నులియు జంబుకోత్కరోరుభేకములఁ గ్రొ
క్కారుఁ బోలి తనరెఁ బోరుభూమి 195

అర్థము. గర్జిల్లి = ఘీంకరించి - ఉఱిమి, తోఁతెంచు = వచ్చు, కరి -ఘటా + అభ్ర + ఆవలిన్ = ఏనుఁగుల గుంపు అనెడి మేఘముల వరుసచేతను, వెలిఁగెడు = ప్రకాశించునట్టి, శాత + అసి - విద్యుత్ + ఆలిన్ = వాఁడియైన కత్తులనెడి మెఱుపుల వరుసచేతను,

తివిరెడు = మ్రోసెడు, రణ - తూర్య - రవ - గర్జనంబునన్ = యుద్ధభేరుల ధ్వనియనెడు మేఘధ్వనిచేతను, పైన్ + క్రమ్మి = పైని వ్యాపించి, కురిసెడు = వర్షించు, బాణ - వృష్టిన్ = బాణములనెడు వర్షముచేతను,

నిండి, బోరనన్ = అధికముగా, పాఱు = ప్రవహించు, నెత్తురు + ఏఱులన్ = రక్తమనెడి నదులచేతను, కరఁగి, పేరిన = పేరుకొన్న, మాంస - కర్దమమునన్ = మాంసమనెడు బురదచేతను,

వడిన్ = వేగముగా, తాఁకు = తగులునట్టి, నానా + అస్త్ర - వజ్ర - సంఘట్టనన్ = అనేకబాణములనెడి పిడుగుల రాపిడిచేతను, పైన్ + తూలు = మీఁదఁజలించు, కేతన - బక - సమూహిన్ = ధ్వజములనెడు కొంగలగుంపుచేతను,

బలసి + ఆడు = చుట్టి ఆడునట్టి, ఉరు - కబంధ - బర్హిణములన్ = పెద్ద మొండెములనెడి నెమళ్ళచేతను, ప్రీతిన్ = సంతోషముతో, పొలయు = సంచరించు, భూత - చాతకములన్ = భూతములనెడు వానకోయిలలచేతను,

ఉలియు = అఱచునట్టి, జంబుక + ఉత్కర + ఉరు - భేకములన్ = నక్కల సమూహమనెడి పెద్దకప్పలచేతను,

పోరు - భూమి = యుద్ధభూమి, క్రొక్కారున్ (క్రొత్త + కారున్) = వర్షాకాలమును పోలి, తనరెన్ = ఒప్పెను

తాత్పర్యము: గర్జిల్లి వచ్చు ఏనుఁగుల గుంపనెడు మేఘసమూహముచేతను, ధ్వనించు యుద్ధభేరుల ధ్వనియనెడు మేఘధ్వనిచేతను, పైని వ్యాపించి వర్షించు బాణవర్షముచేతను, నిండి అధికముగాఁబాఱు రక్తప్రవాహములచేతను, కరఁగి

పేరుకొన్న మాంసమనెడి బురదచేతను, వడిగాఁ దగులునట్టి అనేకబాణములనెడి పిడుగుల రాపిడిచేతను, పైని జలించు ధ్వజములనెడి కొంగల గుంపుచేతను, చుట్టుకొని ఆడు పెద్ద మొండెములనెడి నెమళ్లచేతను, ప్రీతితో సంచరించు భూతములనెడు వానకోయిలలచేతను అఱుచు నక్కల గుంపనెడు పెద్దకప్పలచేతను, యుద్ధభూమి వర్షాకాలమును బోలియొప్పెను

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితోపమ

చ ఉరు తరవారి చక్రకుముదోత్పల భూరిశిలీముఖౌఘ భీ
కర ఖర దండ రక్త రుచి కంజదళోత్కర పుండరీక వి
స్తరిత హరీశ్వర ప్రకర సద్గుణ కేతన భాతితో సరో
వరమును బోలియొప్పె శిఖివాహను సంగరరంగ మున్నతిన్ 196

అర్థము శిఖి - వాహను = నెమలి వాహనముగాఁ గలవాని - కుమారస్వామి యొక్క, సంగర - రంగము = యుద్ధభూమి, ఉన్నతిన్ = అతిశయముతో, ఉరు-తరవారి = పెద్దకత్తియనెడు, ఉరుతర - వారి = మిక్కిలి అధికమైన నీటితోను, చక్ర = చక్రాయుధములనెడు చక్రవాకములతోను, కుముద = శంఖములనెడు తెల్ల కలువలతోను, ఉత్పల = ఒక శస్త్ర(?) మనెడు కలువలతోను, భూరి - శిలీముఖ + ఓఘ = అధికమైన బాణముల సమూహమనెడు తుమ్మెదల గుంపుతోను, భీకర - ఖర - దండ = భయంకరమయిన తీక్ష్ణదండమనెడు పద్మముతోను, రక్తరుచి = రక్తము యొక్క కాంతియనెడు ఎఱ్ఱని కాంతితోను, కంజ = బ్రహ్మయనెడు పద్మముతోను, దళ +ఉత్కర = సైన్యముల సమూహమనెడు పూలరేకుల సమూహముతోను, పుండరీక = వెల్లగొడుగులనెడి తెల్లదామరలతోను, విస్తరిత = వ్యాప్తమైన, హరి + ఈశ్వర = విష్ణుశంకరులనెడి నాగరాజుల యొక్క (శ్రేష్ఠములైన కప్పలయొక్క), ప్రకర= సమూహముతోను, సత్ + గుణ - కేతన - భాతితోన్ = మంచి అల్లెత్రాటితోడి విం డ్లనెడు మంచి గుణముల ఇంటియొక్క కాంతితో, సరోవరమును = సరస్సును, పోలి, ఒప్పెన్

తాత్పర్యము: కుమారస్వామి యుద్ధభూమి ఉన్నతితో - గొప్ప ఖడ్గములనెడి మిక్కిలి అధికమైన నీటితోను, చక్రాయుధములనెడి చక్రవాకములతోను, శంఖములనెడు తెల్లకలువలతోను, ఉత్పలశస్త్రమనెడు కలువలతోను అధికమైన బాణముల సమూహమనెడు తుమ్మెద గుంపుతోను భయంకరమైన తీక్ష్ణదండమనెడు పద్మములతోను, రక్తకాంతియనెడు ఎఱ్ఱనికాంతితోను,

బ్రహ్మయనెడు పద్మములతోను, సైన్యముల సమూహమనెడు పూలరేకులతోను, వెల్ల గొడుగులనెడి తెల్లదామరలతోను, హరిహరులనెడి నాగ (భేక) రాజులతోను, మంచి అల్లె త్రాడులతోడి విండ్లనెడు మంచి గుణముల ఆకరము యొక్క కాంతితోను సరస్సును బోలియొప్పెను

విశేషములు . అలంకారము శ్లేషానుప్రాణితోపమ శ్లిష్టరూపకము

మహాస్రగ్ధర క్షతజాతాపాతతోయోత్కరముఁ, గరికులక్ష్మాధరాకీర్ణ, మశ్వో
ద్గత కల్లోలాకులం, బస్థలితవరభటగ్రాహ సందోహ, మస్త్రా
యత పారీనాతిభీమం, బరదకమర, మాశాత్మజేందూదయక్షో
భితమై, సంగ్రామరంగోత్పుధిజలధి మహాభీకరం బయ్యెఁ జూడన్ 197

అర్థము. క్షతజాత + ఆ పాత - తోయ + ఉత్కరమున్ = రక్తపాతమనెడి జలసమూహము గలదియు, కరి - కుల-క్ష్మాధర + ఆకీర్ణము = ఏనుఁగుల గుంపనెడు పర్వతములచే వ్యాప్తమయినదియు, అశ్వ+ఉద్గత - కల్లోల +ఆకులంబు= గుఱ్ఱములనెడు పైకి లేచిన తరంగములచేఁ గలఁగినదియు, అస్థలిత - వర - భట - గ్రాహ -సందోహము = జాఱిపోవని - వెనుదిరుగని శ్రేష్ఠులయిన భటులనెడు మొసళ్ల సమూహము గలదియు, అస్త్ర + ఆయత - పారీన + అతి - భీమంబు = అస్త్రములనెడు - పొడవయిన గొప్పచేఁపలచే మిక్కిలి భయంకరమయినదియు, అరద - కమరము = రథములనెడు తాఁబేళ్లుగలదియు, ఈశ + ఆత్మజ + ఇందు + ఉదయ - క్షోభితము = ఈశ్వరుని కొడుకగు కుమారస్వామియనెడు చంద్రునియొక్క ఉదయముచేఁ గలఁతపెట్టఁబడినది, ఐ, సంగ్రామ - రంగ + ఉత్ + ప్పధు - జలధి = యుద్ధభూమియనెడి మిక్కిలి పెద్ద సముద్రము, చూడన్ = చూచుటకు, మహత్ (మహా) - భీకరంబు = మిక్కిలి భయము గలిగించునది, అయ్యెన్

తాత్పర్యము . రక్తపాతమనెడి జలసమూహము గలదియు, ఏనుఁగుల గుంపనెడు కొండలచే వ్యాప్తమయినదియు, గుఱ్ఱములనెడు పైకెగురు తరంగములచేఁ గలఁగినదియు, వెనుదిరుగని భటశ్రేష్ఠులనెడు మొసళ్ల సమూహము గలదియు, అస్త్రములనెడు పెద్ద చేఁపలచే మిక్కిలి భయంకరమయినదియు, రథములనెడు తాఁబేళ్లు గలదియు, కుమారస్వామియనెడు చంద్రుని ఉదయముచేఁ గలఁతపెట్టఁబడినదియు నయి యుద్ధరంగమనెడి మిక్కిలి పెద్దసముద్రము చూడ మిక్కిలి భయంకరమయ్యెను

విశేషములు. అలంకారము రూపక్కము ఛందస్సునకు 1-68, పద్యవాఖ్య నరయునది

తే మండనానీక విగళిత మణిగణములఁ
గలను సంఛన్నమై నిండి వెలుఁగుచుండెఁ
గలయ జగములు ప్రళయాగ్నిఁ గాలి మండి
యుడిగి యంగారశేషమై యున్న భంగి 198

అర్థము. మండన + అనీక - విగళిత - మణి - గణములన్ = అలంకారముల సమూహమునుండి విశేషముగా జాఱిన మణుల సమూహములచే, కలను = యుద్ధభూమి, సంఛన్నము + ఐ = బాగుగాఁ గప్పఁబడినదయి, నిండి, కలయన్ = అంతటను, జగములు, ప్రళయ + అగ్నిన్ = ప్రళయసమయమునందలి అగ్నిచే, కాలి, మండి, ఉడిగి = ఆఱిపోయి, అంగార - శేషము+ఐ = బొగ్గులు మిగిలినవయి, ఉన్న - భంగిన్= ఉన్నవిధమున వెలుఁగుచున్ + ఉండెన్ = ప్రకాశించుచుండెను

తాత్పర్యము. వీరుల ఆభరణముల సమూహమునుండి బాఱిపడిన మణుల సమూహములచే యుద్ధభూమి కప్పఁబడినదయి, నిండి, లోకములు అంతటను ప్రళయాగ్నిచేఁ గాలి మండి ఆఱిపోయి బొగ్గులు మిగిలినవయి ఉన్నరీతిని వెలుఁగుచుండెను

విశేషములు: అలంకార ముపమ

వ అని యనేకప్రకారంబులం దగిన వర్ణనలకు నెక్కి సురంగంబగు సంగరరంగంబు సొత్తెంచి భూత వేతాళ యాతుధాన దానవ శాకినీ ఢాకినీ పిశాచ నిశాచ రాద్యనేకవిధాపారగణంబులు లోదసీకుహరాంత రాపూరితంబగుచు నానావిధ పిశితాద్యనేక పుంజంబులు నిశ్శేషంబుగా భక్షించి విలయార్ణవపూరితంబునుంబోలె నిఖిలజలంబులు నేకోదకంబై పర్వు కీలాలజలంబులు తనియంద్రావి పరమానందంబునం గార్తికేయుం గీర్తించుచు మహోత్సాహంబున 199

అర్థము: అని, అనేక - ప్రకారంబులన్, తగిన - వర్ణనలకున్, ఎక్కి, సురంగంబు + అగు = ప్రకాశించునది యగు, సంగర - రంగంబు = యుద్ధరంగము, చొత్తెంచి (చొచ్చు + తెంచి) = ప్రవేశించి, భూత వేతాళ =

యాతుధాన - దానవ - శాకినీ - ఢాకినీ - పిశాచ - నిశాచర + ఆది + అనేక - విధ + అపార - గణంబులు = భూతములు, బేతాళములు రాక్షసులు దానవులు, శాకినులు, ఢాకినులు, పిశాచములు, నిశాచరులు మున్నగు పెక్కు విధములైనవారి అంతులేని సమూహములు, రోదసీ - కుహర + అంతర + ఆపూరితంబు= గుహవంటి భూమ్యాకాశ మధ్యభాగములోపలి ప్రదేశము నిండినది, అగుచున్, నానా - విధ - పిశిత + ఆది + అనేక - పుంజంబులు = అనేక రీతులయిన మాంసము మున్నగు పెక్కింటి సమూహములు, నిశ్శేషంబుగాన్ = మిగులులేకుండ, భక్షించి = తిని, విలయ + అర్ణవ - పూరితంబునున్ + పోలెన్ = ప్రళయమునందలి సముద్రపు నింపు వలె, నిఖిల - జలంబులన్ = ఎల్ల జలములచే, ఏక + ఉదకంబు + ఐ = ఒకే నీరయి, పర్వు = ప్రవహించు, కీలాల - జలంబులు = రక్తమనెడి నీరులు, తనియన్ + త్రావి = తృప్తిగాఁ ద్రాగి, పరమ + ఆనందంబునన్ = మిక్కిలి సంతోషముతో, కార్తికేయున్ = కుమారస్వామిని, కీర్తించుచున్ = ప్రశంసించుచు, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = గొప్ప ఉత్సాహముతో

తాత్పర్యము . అని పెక్కు రీతుల సముచిత వర్ణనలకుఁదగి ప్రకాశించునదియగు యుద్ధభూమిని బ్రవేశించి భూతములు, బేతాళములు, రాక్షసులు, దానవులు, శాకినులు, ఢాకినులు, పిశాచులు, నిశాచరులు మున్నగు పెక్కు విధములైనవారి అంతములేని సమూహములు భూమ్యాకాశమధ్య భాగములోపలిప్రదేశము నిండి, పెక్కువిధములైన మాంసములు మున్నగు పెక్కింటి సమూహములు మిగులులేకుండఁదిని, ప్రళయసముద్రపు నింపువలె ఎల్లజలములచే నొకే నీరయి ప్రవహించు రక్తజలములు తృప్తితీఱఁద్రావి పరమానందముతోఁ గుమారస్వామిని బ్రశంసించుచు మహోత్సాహముతో - తరువాతి పద్యముతో నన్వయము

చ **సరసకరోటి తామ్రకళశంబుల, వారణ లూనహస్త భీ**
కర జలయంత్ర పంక్తి, మద కస్తురి లోహిత కుంకుమాంబువుల్
పారిఁబోరి ముంచుకొంచు, నలి భోరన ముట్టలాడె నాహవా
జిరమున భూతకోటి సురసింధుతనూజ జయోత్సవంబునన్ 200.

అర్థము . భూతకోటి = దయ్యముల సమూహము, సుర -సింధు - తనూజ - జయ + ఉత్సవంబునన్ = గంగాకుమారుఁడైన కుమారస్వామి యొక్క గెలుపు వేడుకయందు, ఆహవ + అజిరమునన్ = యుద్ధరంగపుముంగిట, సరస - కరోటి - తామ్ర - కలశంబులన్ = తడిగల పుట్టిలనెడి రాగిపాత్రములతో, వారణ

- లూన - హస్త - భీకర - జల - యంత్ర - పంక్తిన్ = ఏనుఁగుల తెగిన తొండములనెడి భయంకరములయిన చిమ్మన గొట్టములవరుసతో, మద-కస్తురి - లోహిత - కుంకుమ + అంబువుల్ = ఏనుఁగుల మదజలముతోడి కస్తూరి అనెడి ఎఱ్ఱని కుంకుమ జలములు, పారిఁబోరిన్ = మాటిమాటికిని, ముంచుకొంచున్ = ముంచుకొనుచు, నలిన్ = ఉత్సాహముతో, భోరనన్ = శీఘ్రముగా, ముట్టటలు + ఆడెన్ = చిమ్మన గొట్టములతో జలక్రీడలాడెను

తాత్పర్యము. దయ్యముల సమూహము గంగాపుత్రుఁడైన కుమారస్వామి విజయోత్సవమునందు యుద్ధరంగపు ముంగిట క్రొత్త పుట్టిలనెడి రాగి పాత్రములతో, ఏనుఁగుల తెగిన తొండములనెడి భయంకరములయిన చిమ్మటగొట్టముల పంక్తితో, మదజలముతోడి కస్తూరి అనెడి ఎఱ్ఱని కుంకుమ జలములను మాటిమాటికి ముంచుకొనుచు ఉత్సాహముతో శీఘ్రముగా జలక్రీడలాడెను

విశేషములు . అలంకారము రూపకము ఇందలి మూఁడవ పాదమున మదకస్తురి లోహిత అను సిద్ధసమాసములో 'కస్తురి' యను వికృతి పదమును వాడుట విశేషము

వ మఱియు నరుణ జల పూర్ణ సరోవరంబుల జలక్రీడయుం గరివర కళేబరాగ్రంబులఁ గృత్రి మాచల క్రీడయుఁ బ్రఖండ చండ ధ్వజ పతాకానేక దండంబుల వనక్రీడయుం జలుపుచు ననురాగరసపూరితహృదయులై మదనరసోద్రేకంబున **201**

అర్థము . మఱియున్, అరుణ - జల - పూర్ణ - సరోవరంబులన్ = రక్తమనెడి జలముతో నిండిన సరస్సులందు, జలక్రీడయున్ = జలవిహారమును, కరి - వర - కళేబర + అగ్రంబులన్ = శ్రేష్ఠములయిన యేనుఁగుల శవములపైని, కృత్రిమ + అచల - క్రీడయున్= క్రీడా పర్వత విహారమును, ప్రఖండ - చండ - ధ్వజ - పతాకా + అనేక - దండంబులన్ = మిక్కిలి ముక్కలైన తీక్ష్ణమైన ధ్వజములయు, పతాకలయు పెక్కు కఱ్ఱలందు, వన - క్రీడయున్ = వనవిహారమును, చలుపుచున్ = చేయుచు, అనురాగ - రస - పూరిత - హృదయులు + ఐ = ప్రేమరసముతో నిండిన హృదయములు గలవారయి, మదన - రస + ఉద్రేకంబునన్ = శృంగారరసావేశముతో

తాత్పర్యము : మఱియును భూతములు రక్తమనెడి జలముతో నిండిన సరస్సులందు జలక్రీడయును, ఏనుఁగుల శవములపైఁ గ్రీడాపర్వత విహారమును,

ముక్కలైన ధ్వజముల పతాకల దండములపై వనవిహారమును జేయుచు ప్రేమరసముతో నిండిన హృదయములు గలవారయి (గలవియై) శృంగార రసావేశముతో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకారము రూపకము

చ అరుణజలంబు లాడి, తురగాజినవస్త్రము లర్థిఁ గట్టి, భీ
కర కరి దాన కర్దమము కస్తురిగాఁగ నలంది, వీర హృ
త్సరసిరుహంబు లోలి నవతంసవిభూతిగఁ దాల్చి, చాల న
చ్చరువుఁ బిశాచకాంతలు పిశాచములం దవిలించి రొప్పులన్ 202

అర్థము. పిశాచ - కాంతలు = పిశాచ స్త్రీలు, అరుణ - జలంబులు + ఆడి = రక్తమనెడి నీరులతో జలకమాడి, తురగ + అజిన - వస్త్రములు = గుఱ్ఱపు చర్మములనెడి వస్త్రములు, అర్థిన్ = కోరికతో, కట్టి, భీకర - కరి - దాన - కర్దమము = భయంకరమైన యేనుఁగుల మదమనెడి బురద, కస్తురి - కాఁగన్ = కస్తూరిగా, అలంది = పూసి, వీర - హృద్ + సరసిరుహంబులు = వీరుల హృదయములనెడి పద్మములు, ఓలిన్ = బాగుగా, అవతంస - విభూతిగన్ =శిరోభూషణ - సంపదగా, తాల్చి = ధరించి, పిశాచములన్ = మగపిశాచములందు, చాలన్ + అచ్చరువున్ = మిక్కిలి ఆశ్చర్యమును, ఒప్పులన్, తవిలించిరి = కలిగించిరి

తాత్పర్యము : పిశాచములు రక్తమనెడి జలములందు జలక్రీడలాడి గుఱ్ఱపు చర్మములనెడి వస్త్రములు కట్టి భయంకరములయిన యేనుఁగుల మదమనెడి బురద క స్తూరిగాఁ బూసి, వీరుల హృదయములనెడి పద్మములు శిరోలంకారములుగా ధరించి మగపిశాచముల కాశ్చర్యమును గలిగించిరి

విశేషములు : అలంకారము రూపకము అచ్చరువు - అచ్చెరువు (వి) - ఆశ్చర్యము (ప్ర)

వ త దవసరంబున నఖిల భూత గణ పరివృతయైన మహాకాళి పేరోలగంబున. 203

అర్థము: తద్ + అవసరంబునన్ =ఆ సమయమునందు, అఖిల - భూత - గణ - పరివృత = ఎల్ల దయ్యముల సమూహముతోఁ జుట్టఁబడినది, ఐన = అయిన, మహాకాళి, పేరు+ ఓలగంబునన్ = నిండుసభయందు

తాత్పర్యము ఆ సమయమున ఎల్లదయ్యముల సమూహముతో జుట్టఁబడిన మహాకాళి నిండుసభయందు - తరువాతి పద్యముతో నన్వయము

సీ భటవాజిరుండముల్ పటహాముల్గాఁ దీర్చి
రమణ వేతాళ వాద్యములు చెలఁగ
దళిత కపాలముల్ తాలముల్గా జంబు
కముల సంకీర్ణరాగములు మొరయ
సరసాజినంబులు సల్లడంబులు గట్టి
నెనకుల కంచెల లొనరఁబెట్టి
హాస్య బీభత్స భయానకరసము లా
యత్తంబుగా నోలి నభినయించి

ఆ సంగరాంగణంబు రంగంబుగా భూత
గణము పిచ్చలింపఁగాఁ బిశాచ
నర్తకీ చయంబు నర్తించెఁ గంకాలి
చిత్త మలరి యంగచిత్ర మెసఁగ 204

అర్థము: పిశాచ - నర్తకీ - చయంబు = నట్టువకత్తెలయిన పిశాచస్త్రీల సమూహము

భట - వాజి -రుండముల్ = భటులయు, గుఱ్ఱములయు కపాలములు, పటహముల్ + కాన్ = తప్పెటలుగా, తీర్చి = చేసి, రమణన్ = ఒప్పుగా, వేతాళ - వాద్యములు =బేతాళుర వాద్యములు, చెలఁగన్ = మ్రోయఁగా,

దలిత - కపాలముల్ = చీల్పఁబడిన పుఱ్ఱెలు, తాలముల్ + కాన్ = తాళములుగా, జంబుకముల = నక్కల, సంకీర్ణ - రాగములు = మిశ్రరాగములు, మొరయన్ = మ్రోయఁగా

సరస + అజినంబులు = పచ్చితోళ్లు, చల్లడంబులు - కట్టి = సగము తొడవఱకునుండు లాఁగులుగాఁ గట్టి, నెనకుల - కంచెలలు = ఱవికెలు, ఒనరన్ + పెట్టి = ఒప్పుగా ధరించి,

హాస్య - బీభత్స - భయానక - రసములు = హాస్యము, బీభత్సము, భయానకము అను రసములు, ఆయత్తంబుగాన్ = జాగరూకముగా, అభినయించి,

సంగర + అంగణంబు = యుద్దభూమి, రంగంబు + కాన్ = రంగస్థలముగా, భూత - గణము = భూతముల సమూహము, పిచ్చలింపఁగాన్ = ఆనందింపఁగా, కంక + ఆలి = రాబులుఁగుల సమూహము యొక్క, చిత్తము = మనస్సు, అలరి = సంతోషించి, అంగ -చిత్రము + ఎసఁగన్ = శారీరకమైన చిత్తరువు(?) అతిశయింపఁగా , నర్తించెన్ = నాట్యము చేసెను

తాత్పర్యము. నట్టువరాండ్రయిన పిశాచస్త్రీల సమూహము, భటులయు, గుట్టములయు కపాలములు తొప్పటలుగాఁ దీర్చి, బేతాళుర వాద్యములు మ్రోయఁగను, చీల్పఁబడిన పుట్టెలు తాళములుగా, నక్కల మిశ్రరాగములు ధ్వనింపఁగా, పచ్చితోళ్లు సగముతొడవఱకునుండు లాఁగులుగాఁ గట్టి, ఱవికె లొప్పుగా ధరించి, హాస్యము, బీభత్సము, భయానకము అసురసములను జాగరూకముగా అభినయించి, యుద్దరంగము రంగస్థలముగా, భూతగణము ఆనందింపఁగా, రాబులుఁగుల చిత్త మలరి శారీరకమైన చిత్తరు వతిశయింపఁగా నాట్యము చేసిరి

విశేషములు. అలంకారము స్వభావోక్తి 'నెనకుల' శబ్దము నిఘంటువులలోఁ గానరాలేదు

వ **తత్ప్రస్తవంబున** **205**

అర్థతాత్పర్యములు. తద్ + ప్రస్తవంబునన్ = ఆ సందర్భమునందు - తరువాతి పద్యముతో నన్వయము

సూర్యాస్తమయము

క. **తనరు నరుణాంబుధారల**
ననవరతముఁ దొప్పఁదోఁగి యరుణాంగుండై
తన మేను గడిగికొన నని
చనుగతి దిననాథుఁ డపరజలధికిఁ జనియెన్ **206**

అర్థము. దిన - నాథుఁడు = సూర్యుఁడు, తనరు +అరుణ + అంబు - ధారలన్ = ఒప్పునట్టి రక్త జల ప్రవాహములందు, తొప్పఁదోఁగి = మిగుల మునిఁగి, అరుణ + అంగుండు + ఐ = ఎఱ్ఱని శరీరము గలవాఁడయి, తన - మేను = తన శరీరము, కడిగికొనన్ + అని = కడిగికొనుట కని, చను-గతిన్ = వెడలు విధమున,అపర - జలధికిన్ = పడమటి సముద్రమునకు, చనియెన్

తాత్పర్యము సూర్యుఁడు రక్తమునెడి జలప్రవాహములందు మిగుల మునిఁగి యెఱ్ఱనైన శరీరముగలవాఁడయి తన మేనుకడుగుకొనుటకుఁ బోవుచున్నాఁడోయనఁ బడమటిసంధ్రమున కరిగెను సూర్యాస్తమయ మయ్యెనని భావము

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ అంత నుభయబలంబులుం గైనీఁగి నిజశిబిరంబుల కరుగునవసరంబునఁ దమతమ నెమ్మనంబుల భృత్యబంధువర్గంబులం దడవు నతిసంభ్రమంబున 207

అర్థము. అంతన్, ఉభయ - బలంబులున్ = రెండు సైన్యములును, కైనీఁగి= విరమించి (?), నిజ - శిబిరంబులకున్ = తమ గుడారములకు, అరుగు+ అవసరంబునన్ = పోవు సమయమున, తమ - తమ - నెమ్మనంబులన్ (నెఱ + మనంబులన్) = తమతమ మనస్సులదు, భృత్య - బంధు - వర్గంబులన్ = సేవకులయు, చుట్టములయు సమూహములను, తడవు + అతి సంభ్రమంబునన్= తలఁచు గొప్ప వేగిరపాటునందు

తాత్పర్యము. అంత రెండు సైన్యములును విరమించి తమ గుడారములకుఁ బోవు సమయమునఁ దమతమ మనస్సులందు భృత్యులయు, బంధువులయు సమూహములను స్మరించు గొప్ప వేగిరపాటులో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. కైనీఁగి - నిఘంటువులందు లేదు ప్రకరణానుగుణముగా నర్థము చెప్పఁబడినది

చ పాలికల నెల్ల రోసి కొనిపోయెడు వారును, బోయి పోటులన్
సల లిడువారు, మందులు భృశంబుగఁ బెట్టెడువారుఁ, గొంద ఱి
ట్టలముగ మంత్రతంత్రము లెడన్ సవరించుచు నుండువారునై
కలయఁగ వీరు వారు నిటుగైకొని యుత్సవ మందుచుండఁగాన్ 208

అర్థము: పాలికలను + ఎల్లన్ = యుద్ధభూమియంతయును, రోసి = వెదకి, కొనిపోయెడు వారును = తీసికొని పోవువారును, పోయి, పోటులన్ = గాయములందు, సలలు + ఇడువారున్ = వత్తులు పెట్టువారును, మందులు,

భృశంబుగన్ = అధికముగా, మత్రతంత్రములు, ఎడన్ = సమయమున, సవరించుచున్ + ఉండు - వారున్ + ఐ = కూర్చువారును అయి, కలయఁగన్ = బాగుగా, వీరున్ - వారున్, ఇటు = ఈ విధముగా, గైకొని = ఆచరించి, ఉత్సవము + అందుచున్ + ఉండఁగాన్ = వేడుక నొందుచుండఁగా

తాత్పర్యము యుద్ధరంగమంతయు వెదకి తీసికొని పోవువారును,పోయి గాయములందు వత్తు లిడువారును, మందు లధికముగాఁ బెట్టువారును, గొందఱు మెక్కిలిగా మంత్రతంత్రములను సమయమున కాచరించువారును అయి ఇరువాఁగువారును బాగుగాఁగైకొని వేడ్కనందుచుండఁగా - తరువాతి వచనముతో నన్వయము

వ ఇట్లుభయబలంబులందు ననేకు లనేకప్రకారంబుల దివ్యౌషధ ప్రకారంబుల నా రాత్రియంద విక్షత వేదనా విముక్తులగుచుండి రంత సమర సన్నాహంబు చేయింపం జనుదెంచునట్లు కమలవనంబుతోన సురాసుర చిత్తకమలనయనప్రబోధకుండగుచు నినుం డుదయశిఖరిశిఖరారూఢుం డగుడుం గుమారుండు తత్కాలోచితక్రియాప్రవర్తనుం డగుచు 209

అర్థము. ఇట్లు, ఉభయ -బలంబుల + అందున్, అనేకులు, అనేక - ప్రకారంబులన్, దివ్య + ఔషధ - ప్రకారంబులన్ = దివ్యములయిన ఔషధరీతులచే, ఆ - రాత్రి + అందున్ + అ, విక్షత - వేదనా - విముక్తులు = గాయముల వలని బాధనుండి విడువఁబడినవారు, అగుచున్ + ఉండిరి, అంతన్, సమర - సన్నాహంబు= యుద్ధసంసిద్ధత,చేయింపన్ + చనుదెంచు + అట్లు =చేయించుటకు, వచ్చుచున్నాఁడా యనునట్లు, కమల - వనంబుతోన్ + అ = తామరతోఁపుతోపాటే, సుర + అసుర - చిత్త + కమల - నయన - ప్రబోధకుండు = దేవతలయు, రాక్షసులయు, రాక్షసులయు పద్మములవంటి మనస్సులను, కన్నులను మేలుకొలుపువాఁడు, అగుచున్, ఇనుండు = సూర్యుఁడు,ఉదయ - శిఖరి - శిఖర + ఆరూఢుండు = పొడుపుఁగొండ కొమ్ము నెక్కినవాఁడు, అగుడున్, కుమారుండు, తద్ + కాల + ఉచిత - క్రియా - ప్రవర్తనుండు = ఆ సమయమునకుఁ దగిన పనులయందు ప్రవర్తించినవాఁడు, అగుచున్

తాత్పర్యము. ఇట్లు రెండు సైన్యములందును పెక్కండ్రు పెక్కురీతుల దివ్యౌషధములచే ఆ రాత్రియందే గాయములవలని బాధతగ్గినవా రగుచుండిరి అంత యుద్ధసన్నద్ధులుగాఁ జేయింప వచ్చుచున్నాఁడా యనునట్లు పద్మవనముతో

పాటే దేవరాక్షసులమనఃపద్మములను కన్నులను మేలుకొలుపుచు సూర్యుఁడు పొడుపుఁగొండ కొమ్మెక్కినంతనే కుమారస్వామి ఆ సమయమునకుఁ దగిన పనులందుఁ బ్రవర్తించుచు - తరువాతి యాశ్వాసమునందలి మొదటి గద్యముతో నన్వయము

అశ్వాసాంతము

చ పరసిరుహాక్షు మోక్షు మితజల్పు ననల్పు వరున్ వరేణ్యు ప
ద్ధురుఁ గృతకృత్యు నిత్యు గతదోషు నరోషు ననంతు శాంతు వా
గ్వరజనసేవ్యు భవ్యు మునివంద్యు ననింద్యు వదాన్యు మాన్యు శం
కర పద భక్తియుక్తున వికారి నఘారి విచారపారగున్ 210

అర్థము నరసిరుహ + అక్షున్ = పద్మములవంటి కన్నులు గలవాఁడును, మోక్షున్ = మోక్షస్వరూపుఁడును, మిత - జల్పున్ = తక్కువగా మాటలాడువాఁడును, అనల్పున్ = అల్పుఁడు కానివాఁడును, వరున్ = ప్రభుఁడును, వరేణ్యున్ = శ్రేష్ఠుఁడును, సత్ + గురున్ = మంచి గురువును, కృత - కృత్యున్ = కృతార్థుఁడును, నిత్యున్ = శాశ్వతుఁడును, గత - దోషున్ = పోయిన దోషములు గలవాఁడును, అరోషున్ = రోషములేనివాఁడును,అనంతున్ = అంతము లేనివాఁడును, శాంతున్ = శాంతము గలవాఁడును, వాగ్వర -జన - సేవ్యున్ = బ్రాహ్మణ జనులచే సేవింపఁదగినవాఁడును, భవ్యున్ = యోగ్యుఁడును, ముని-వంద్యున్ = మునులచే నమస్కరింపఁదగినవాఁడును, అనింద్యున్ = నిందింపఁదగనివాఁడును, వదాన్యున్ = ఉదారుఁడును, మాన్యున్ = మన్నింపఁదగినవాఁడును, శంకర - పద - భక్తి - యుక్తున్ = శంకరుని పదములందలి భక్తితోఁగూడినవాఁడును, అవికారిన్ = నిర్వికారుఁడును, అఘ + అరిన్ = పాపములకు శత్రువైనవాఁడును, విచార - పారగున్ = ఆలోచనయొక్క పారమును బొందినవాఁడును అగు జంగమమల్లికార్జునదేవుని -

తాత్పర్యము: పద్మాక్షుఁడును, మోక్షస్వరూపుఁడును, మితభాషణుఁడును, అనల్పుఁడును, వరుఁడును, వరేణ్యుఁడును, సద్గురుఁడును, కృతార్థుఁడును, నిత్యుఁడును, దోషరహితుఁడును, రోషరహితుఁడును, అనంతుఁడును, శాంతుఁడును, బ్రాహ్మణ జన సేవ్యుఁడును, భవ్యుఁడును, మునివంద్యుఁడును, అనింద్యుఁడును, వదాన్యుఁడును, మాన్యుఁడును, శివపదభక్తియుక్తుఁడును,

నిర్వికారుఁడును, అఘనాశకుఁడును, విచార పారంగతుఁడును అగు కృతిభర్తను - శ్రీ జంగమమల్లికార్జున దేవుని

విశేషములు : అలంకార మనుప్రాసము

క ప్రణుతామలసద్గుణగణ
మణిభూషణభూషితాంగు మారామితమా
ర్గణ తాపరహిత హృదయాం
గణు సజ్జనకల్పవృక్షకల్పు ననల్పున్ 211

అర్థము ప్రణుతా తాంగున్ ప్రణుత = మిక్కిలి నుతింపఁబడిన, అమల = నిర్మలములైన, సత్ + గుణ = మంచిగుణములయొక్క, గణ = సమూహము అనెడి, మణి = మణిమయములైన, భూషణ = అలంకారములచే, భూషిత + అంగున్ = అలంకరింపఁబడిన శరీరము గలవాఁడును, మారా గణున్ మార = మన్మథుని యొక్క, అమిత = అధికములయిన, మార్గణ = బాణములవలని, తాప - రహిత = తాపములేని, హృదయ + అంగణున్ = హృదయ ప్రదేశము గలవాఁడును, సత్ + జన - కల్పవృక్ష - కల్పున్ = మంచి జనులకు కల్పవృక్షముతో సమానుఁడును, అనల్పున్ - అగు శ్రీ జంగమమల్లికార్జున దేవుని

తాత్పర్యము . నుతింపఁబడిన నిర్మలములయిన సద్గుణగణములనెడి రత్నాలంకారములచే నలంకరింపఁబడిన శరీరముగలవాఁడును, మన్మథుని అధిక బాణముల తాపములేని హృదయాబ్జము గలవాఁడును, సజ్జనులకుఁ గల్పవృక్షప్రాయుఁడును, అనల్పుఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

విశేషములు · అలంకారము రూపకము, అనుప్రాసము

చ **కలిమల దూరు, ధీరు, నవికారు, నుదారు, నముహ్యు, సహ్యు, నిశ్చల మతి, దివ్యు, భవ్యు, నభిజాతు, నజాతు, నమూఢు, గూఢు, నిష్కలు, నభిమాని, దాని, మునిశక్రు, నవక్రు, నభేద్యు, నాద్యు, నిర్మల సుచరిత్రుఁ, బాత్రు, జితమారు, నభీరు, సుమేరుసారునిన్** 212

అర్థము : కలి - మల - దూరున్ = కలియుగపాపములకు దూరమైనవాఁడును, ధీరున్, అవికారున్ = నిర్వికారుఁడును, ఉదారున్, అముహ్యున్ = మోహములేనివాఁడును, సహ్యున్ = శక్తిమంతుఁడును, నిశ్చల - మతిన్ =

చలింపని బుద్ధిగలవాఁడును, దివ్యున్, భవ్యున్ = యోగ్యుఁడును, అభిజాతున్ = సద్వంశమునఁ బుట్టినవాఁడును, అజాతున్ = పుట్టనివాఁడును, అమూఢున్ = మూఢుఁడుగానివాఁడును, గూఢున్ = రహస్యమైనవాఁడును, నిష్కలున్ = కలహరహితుఁడును, అభిమానిన్ = అభిమానవంతుఁడును, దానిన్ = దాతయును, ముని - శక్రున్ = మునీంద్రుఁడును, అవక్రున్ = వక్రుఁడు గానివాఁడును, అభేద్యున్ = భేదింపరానివాఁడును, ఆద్యున్ = మొదటివాఁడును, నిర్మల - సుచరిత్రున్ = స్వచ్ఛమైన మంచి చరిత్ర గలవాఁడును, పాత్రున్ = తగినవాఁడును, జిత - మారున్ = మన్మథుని జయించినవాఁడును, అభీరున్ = భీరువు కానివాఁడును, సుమేరు - సారునిన్ = మేరువుసారమువంటి సారము గలవాఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జునదేవుని

తాత్పర్యము. కలియుగ పాపములకు దూరమైనవాఁడును, ధీరుఁడును, నిర్వికారుఁడును, ఉదారుఁడును, నిర్మోహుఁడును, సహ్యుఁడును, నిశ్చల మనస్కుఁడును, దివ్యుఁడును, భవ్యుఁడును, సద్వంశజాతుఁడును, అభవుఁడును, అమూఢుఁడును, గూఢుఁడును, కలహరహితుఁడును, అభిమానవంతుఁడును, దాతయును, మునీంద్రుఁడును, అవక్రుఁడును, అభేద్యుఁడును, ఆద్యుఁడును, నిర్మల సచ్చరిత్రుఁడును, పాత్రుఁడును, జితమన్మథుఁడును, అభీరుఁడును మేరు సమాన సారుఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

విశేషములు. అలంకార మనుప్రాసము

క. పరపరివాద పరాఙ్ముఖుఁ,
బరహితరతుఁ బరమ ముని, నపరిమిత విద్యా
పరిణతుఁ, బరిజన సజ్జన
పరిపాలనపరు, విచారపరుఁ, బరమపరున్ **213**

అర్థము : పర - పరివాద - పరాఙ్ముఖున్ = పరనిందకుఁ బెడ మొగమైనవాఁడును, పర - హిత - రతున్ = ఇతరులకు మేలు సేఁతయం దాసక్తి గలవాఁడును, పరమ - మునిన్ = గొప్పమునియు, అపరిమిత - విద్యా - పరిణతున్= అధికమైన విద్యయందుఁబండినవాఁడును, పరిజన - సత్ + జన - పరిపాలన - పరున్ = పరిజనుల, సుజనుల పరిపాలనమందు ఆసక్తిగలవాఁడును, విచార-పరున్ = ఆత్మ విచారమునం దాసక్తి గలవాఁడును, పరమ - పరున్ = పరాత్పరుఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

తాత్పర్యము అన్యనిందాపరాఙ్ముఖుఁడును, పరిహితపరుఁడును, పరమ మునియు, అపరిమిత విద్యా పరిణతుఁడును, పరిజన సజ్జన రక్షణ పరాయణుఁడును, విచారపరుఁడును, పరాత్పరుఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

విశేషములు . అలంకార మనుప్రాసము

కవిరాజవిరాజితము

మను నిభ చారు చరిత్రుఁ, బవిత్రు, నమానుష పౌరుషవర్తి, జగ
జ్జన నుత నిర్మల కీర్తి, రమావిభు, శాశ్వత యోగ పద స్థిరు, స
న్మని జన ముఖ్యు, శివాగమవేది, నమోఘవచో నిధి, ధీనిధిఁ బా
వనతరమూర్తి, సమస్త జగద్గురు వంద్యు, నవింద్యు, సదాత్మవిదున్ 214

అర్థము : మను - నిభ - చారు - చరిత్రున్ = మనువుతో సమానమైన మనోహర చరిత్రము గలవాఁడును, పవిత్రున్, అమానుష-పౌరుష-వర్తిన్ = మానవాతీతమైన పౌరుషమునందు వర్తించువాఁడును, జగత్ + జన - నుత - నిర్మల - కీర్తి - రమా - విభున్ = లోకజనులచేఁ బొగడఁబడిన నిర్మలమైన కీర్తియనెడు లక్ష్మికి భర్తయైనవాఁడును, శాశ్వత - యోగ - పద - స్థిరున్ = శాశ్వతమైన యోగమనెడి పదమునందు నిశ్చలుఁడైనవాఁడును, సత్ + ముని - జన - ముఖ్యున్ = మంచి మునులలోఁ బ్రధానుఁడును, శివ + ఆగమ - వేదిన్= శివాగమములు తెలిసినవాఁడును, అమోఘవచస్ (ఃు) + నిధిన్ = వ్యర్థము కాని మాటలకు నిధియైనవాఁడును, ధీనిధిన్ = బుద్ధికి నిధియైనవాఁడును, పావనతర= మూర్తిన్ = మిక్కిలి పవిత్రమైన ఆకారము గలవాఁడును, సమస్త - జగత్ + గురు-వంద్యున్ = ఎల్లలోకగురువులచే నమస్కరింపఁదగినవాఁడును, అనింద్యున్ = నిందింపఁదగనివాఁడును, సత్ + ఆత్మ - విదున్ = సద్బ్రహ్మజ్ఞానము గలవాఁడును అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

తాత్పర్యము : మనువుతో సమానమైన సచ్చరిత్రము గలవాఁడును పవిత్రుఁడును, మానవాతీతపౌరుషమందు వర్తిల్లువాఁడును, జగజ్జనులచే నుతింపఁబడిన నిర్మలకీర్తియందు విష్ణువైనవాఁడును, శాశ్వత యోగ పదమునందు నిశ్చలుఁడును, సన్మునిజనులలోఁ బ్రధానుఁడును, శివాగమము లెఱిఁగినవాఁడును, అమోఘములైన వచస్సుల కు నిధియైనవాఁడును, ధీనిధియును, పావనతరమూర్తియును, సమస్తజగద్గురువులచే నమస్కరింపఁదగినవాఁడును,

అనింద్యుఁడును, మంచి ఆత్మ జ్ఞానముగలవాఁడును - అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

విశేషములు ఛందస్సు కవిరాజవిరాజితమునందు నాలుగు పాదములుండును ప్రతి పాదమునను న, జ, జ, జ, జ, జ, జ, వ అనుగణములుండును మొదటి యక్షరమునకు, ఎనిమిదవ అక్షరమునకును, పదునాల్గవ అక్షరమునకును, ఇరువదియవ అక్షరమునకును యతిమైత్రి ప్రాస నియమము గలదు కాని యీ పద్యమున మూఁడుయతులు గాక, మొదటి అక్షరమునకును, పదునాల్గవ అక్షరమునకును మాత్రమే యతిమైత్రి చెల్లించుట విశేషము

గద్యము

ఇది శ్రీ మజ్జంగమమల్లికార్జునదేవ దివ్య శ్రీ పాద పంకజ
భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవ
ప్రణీతంబైన కుమారసంభవంబను కథయందు
ఏకాదశాశ్వాసము
సమాప్తము.

దీని వ్యాఖ్యకుఁ బూర్వాశ్వాసాంత గద్యముల వ్యాఖ్యల నరయునది

మ ఇది శ్రీ బొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీ శోక్తము శాబ్దికార్థ వివిధ స్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్ను విలసత్ సంజీవనీవ్యాఖ్య యౌ.

కుమార సంభవము

ద్వాదశాశ్వాసము

క శ్రీ రామా కేళీ నీ
రేరుహ పరిగళిత లలిత రేణు ప్రకరా
సారాపూరిత భూరిత
రోరస్థల మందరాచలోరుప్రస్థున్ 1

అర్థము. శ్రీ ప్రస్థున్! శ్రీ - రామా = లక్ష్మీదేవి యొక్క, కేళీ - నీరేరుహ = లీలాపద్మమునుండి, పరిగళిత = జాఱిన, లలిత = మనోహరములైన, రేణు - ప్రకర = పుప్పొడి రేణువుల సమూహమనెడి, ఆసార = జడిచేత, ఆపూరిత = నింపఁబడిన, భూరితర + ఉరస్ + స్థల - మందర + అచల + ఉరు - ప్రస్థున్ = మందరపర్వతముయొక్క గొప్పనెత్తమువంటి మిక్కిలి విశాలమైన వక్షస్స్థలము గలవాఁడు - అగు శ్రీ జంగమ మల్లికార్జున దేవుని

తాత్పర్యము . లక్ష్మీదేవి లీలాపద్మము నుండి జాఱిన లలితములైన పుప్పొడిరేణువుల సమూహమనెడి జడివానచే నింపఁబడిన మందరాచలప్రస్థము వంటి విశాలవక్షస్స్థలముగలవాఁడు అగు శ్రీ జంగమమల్లికార్జున దేవుని

విశేషములు అలంకార ముపమ

వ **పరమేశ్వరు నతులభక్తియుక్తి నారాధించి క్రౌంచారి సమరోద్యుక్తుండై సన్నాహభేరి చఱువంబంచె నంత సురాసుర బలజలధు లొండొండ పెరిఁగి సంక్షోభించుచు** 2

అర్థము: పరమేశ్వరున్, అతుల - భక్తి - యుక్తిన్ = సాటిలేని భక్తి యొక్క కూడికతో, ఆరాధించి = పూజించి, క్రౌంచ + అరి = క్రౌంచ శత్రువు - కుమారస్వామి, సమర + ఉద్యుక్తుండు + ఐ = యుద్ధమునకుఁ బూనినవాఁడయి,

సన్నాహ-భేరి = సంసిద్ధతను దెలుపుభేరి, చఱువన్ + పంచెన్ = మ్రోయింప నాజ్ఞాపించెను అంతన్, సుర - అసుర - బల - జలధులు = దేవతల రాక్షసుల సైన్యములనెడి సముద్రములు, ఒండొండ = క్రమక్రమముగా, పెరిగి, సంక్షోభించుచున్ = కలతఁజెందుచు

తాత్పర్యము పరమేశ్వరుని సాటిలేని భక్తితోఁ బూజించి కుమారస్వామి యుద్ధమునకుఁ బూనినవాఁడయి సన్నాహభేరిని మ్రోయింప నాజ్ఞాపించెను అంత దేవాసుర సైన్యములనెడి సముద్రములు క్రమక్రమముగాఁ బెరిగి కలఁత చెందుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము రూపకము

సీ పసిఁడి యాయగములు పన్ని యాయితముగా
గజవాజితతికిఁ బక్కరలు నెరయఁ
బెట్టి, రథంబులు మెట్టి కందియనలు
పూసి గుఱ్ఱంబులు పూన్చి మీఁద
నాయుధంబులు నించి యాధోరణాశ్వికుల్
రథికులు నెక్కి సారథులతోడఁ
గవదొనల్ విండ్లును గత్తలంబులుఁ గుంత
ములుఁ గరవాలముల్ పలక లీఁటె

ఆ లడ్డనములుఁగొని రయంబునఁ గాల్వురు
పన్ని నిలిచి రుభయబలములందుఁ
బర్వె నొక్కపెట్టఁ బంచ మహాశబ్ద
రవము ప్రళయజలధిరవమ పోలె 3

అర్థము: పసిఁడి + ఆయగములు = బంగారు చిత్రకంబళములు, పన్ని = వైచి, ఆయితముగాన్ = సిద్ధముగా, గజ - వాజి - తతికిన్ = ఏనుఁగుల, గుఱ్ఱముల సమూహమునకు, పక్కరలు = పక్కెరలు - ఏనుఁగులు, గుఱ్ఱములు మొదలుగువానికిఁ దొడుగు కవచములు, నెరయన్ = నిండుగా, పెట్టి,

రథంబులు, మెట్టి, కందియనలు = కందెనలు, పూసి, గుఱ్ఱంబులు, పూన్చి = రథములకుఁగట్టి మీఁదన్ = పైని, ఆయుధంబులు, నించి, ఆధోరణ + ఆశ్వికుల్ = మావటీండ్రు, రౌతులు, రథికులున్, సారథులతోడన్, ఎక్కి,

కవచొనల్ = అంపపొదులును, విండ్లును, కత్తలంబులున్ = కవచములును, కుంతములున్ = బల్లెములును, కరవాలముల్ = కత్తులు, పలకలున్ = డాలులును, ఈఁటెలు = బల్లెములు, అడ్డనములున్ = వేత్రాదికృతములగు డాలులును, కొని, కాల్వురు = కాలిబంటులు, రయంబునన్ = శీఘ్రముగా, పన్ని =సిద్ధపడి, నిలిచిరి

ఉభయ - బలముల + అందున్ = రెండు సైన్యములందును, పంచ - మహత్ (మహా) - శబ్ద - రవము = అయిదు విధములయిన వాద్యముల ధ్వని, ప్రళయ - జలధి - రవము + అ - పోలెన్ = ప్రళయ కాల సముద్రఘోషమే యనునట్లు, ఒక్క - పెట్టున్ = ఒక్కమాఱుగా, పర్వెన్ = వ్యాపించెను

తాత్పర్యము ఏనుఁగుల, గుట్టముల సమూహమునకు బంగారు చిత్రకంబళములువైచి సిద్ధముగాఁ బక్కెరలు నిండుగాఁ బెట్టి, రథములు చొచ్చి, కందెనలు పూసి, గుట్టములు పూన్చి, పైని ఆయుధములు నించి మావటీండ్రును, రౌతులును సారథులతో నెక్కి అంపపొదులును, విండ్లును, కవచములును, కుంతములును, కరవాలములును, పలకలును, ఈఁటెలును, అడ్డనములును గొని కాల్బంటులు శీఘ్రముగా సిద్ధపడి నిలిచిరి రెండు సైన్యములందును పంచవిధవాద్యముల ధ్వని ప్రళయకాల సముద్రఘోషమేయన నొక్క పెట్ట వ్యాపించెను

విశేషములు . అలంకారము ఉపమ

వ అంతకు మున్న యుద్దసన్నద్ధులై పట్టవర్ధనగజంబుల నెక్కి చనుదెంచి కుమారతారకులు తమతమ బలంబులకుం జేయు వీచినం బ్రళయానిలంబు వీచినం దనరి సుడివడు కాలానల శిఖా కలాపంబులుం బోలెం గోపానలోద్దీపితాంతరంగులై సురాసురవీరు లొండొరులఁ దాఁకి మహాఘోరయుద్ధంబు సేయునవసరంబున 4

అర్థము . అంతకున్ + మున్న + అ = అంతకు మునుపే, కుమార - తారకులు, యుద్దసన్నద్ధులు + ఐ = యుద్ధమునకు సిద్ధపడినవారయి, పట్టవర్ధన-గజంబులన్ = పట్టపుటేనుఁగులను, ఎక్కి, చనుదెంచి = వచ్చి, తమ - తమ - బలంబులకున్, చేయు - వీచినన్ = చేయి ఊఁపఁగా, ప్రళయ + అనిలంబు = ప్రళయకాల వాయువు, వీచినన్, తనరి = విజృంభించి, సుడివడు = గిరగిరఁదిరుగు, కాల + అనల - శిఖా - కలాపంబులున్ + పోలెన్ = ప్రళయసమయాగ్నిజ్వాలల సమూహములవలె, కోప + అనల + ఉద్దీపిత + అంతరంగులు + ఐ = కోపమనెడి అగ్నిచే మిక్కిలి వెలిఁగింపఁబడిన మనస్సులు గలవారయి, సుర + అసుర - వీరులు

= దేవరాక్షసవీరులు, ఒండొరులన్ = ఒకరినొకరు, తాఁకి, మహత్ (మహా) - ఘోర-యుద్ధంబు = మిక్కిలి భయంకరమైన యుద్ధము, చేయు + అవసరంబునన్ = చేయు సమయమున

తాత్పర్యము. అంతకు మునుపే కుమారస్వామియు, తారకాసురుఁడును యుద్ధసంసిద్ధులయి పట్టపుటేనుఁగుల నెక్కి వచ్చి తమ తమ సైన్యములకుఁ జేయివీవఁగా, ప్రళయసమయవాయువు వీవఁగా విజృంభించి గిరగిరఁదిరుగు ప్రళయకాలాగ్నిజ్వాలల సమూహములవలెఁ గోపాగ్నిచే వెలిఁగింపఁబడిన మనస్సులు గలవారయి దేవరాక్షసవీరులు ఒకరినొకరు తాఁకి మిక్కిలి భయంకరమైన యుద్ధమొనరించు సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము ఉపమ చేయు నవసరము - చేయు + అవసరము - 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' బాల సంధి 33

చ పరశులు, కొంతముల్, గదలు, భల్లము, లమ్ములు, విండ్లు, కంకటుల్, సురియలు, వజ్రముష్టులుఁ, ద్రిశూలము, లీఁటెలు, మండలాగ్రముల్, పరిఘులు, చక్రముల్, పవులు, పాశము, లంకుశముల్, సబళ్లు, ముద్గరములు, తోమరంబు, లెడగత్తులు, శంఖులు, భిండివాలముల్ 5

అర్థము: పరశులు = గండగొడ్డళ్లు, కొంతముల్ = కుంతములు, గదలు, భల్లములు, అమ్ములు, విండ్లు, కంకటుల్ = ఆయుధ విశేషములు, సురియలు = చురకత్తులు, వజ్రముష్టులున్, త్రిశూలములు, ఈఁటెలు, మండలాగ్రముల్ = ఖడ్గములు, పరిఘలు = ఇనుపకట్ల గుదియలు, చక్రముల్, పవులు = వజ్రాయుధములు, పాశములు, అంకుశముల్, సబళ్లు = (సబడి + లు) = ఆయుధవిశేషములు, ముద్గరములు = అస్త్రవిశేషములు, తోమరంబులు = చిల్లకోలలు, ఎడగత్తులు = ఆయుధవిశేషములు, శంఖులు = ఆయుధవిశేషములు, భిండివాలముల్ = భింది పాలములు - వడిసెల వలె నుండు ఆయుధ విశేషములు

తాత్పర్యము: పరశులు, కుంతములు, గదలు, భల్లములు, అమ్ములు, విండ్లు, కంకటులు, సురియలు, వజ్రముష్టులు, త్రిశూలములు, ఈఁటెలు, మండలాగ్రములు, పరిఘలు, చక్రములు, పవులు, పాశములు, అంకుశములు, సబడులు, ముద్గరములు, తోమరములు, పడగత్తులు, శంఖులు, భిండివాలములు - అను వివిధాయుధవిశేషములు - తరువాతి పద్యముతో నన్వయము

వ అను ననేకాయుధవర్షంబు ప్రళయకాలఘనాఘనవర్షంబునుంబోలె నొక్కపెట్టి భోరనఁ గురియం దొడంగినం దత్ప్రతిహతి నుభయబలంబులును మదకరిభగ్నసల్లకీవనంబునుం బోలె విక్షతిమయంబై మహాభయంకరంబయ్యె నయ్యవసరంబున 6

అర్థము అను, అనేక + ఆయుధ - వర్షంబు = పెక్కు ఆయుధము లనెడి వర్షము, ప్రళయ - కాల - ఘనా - ఘన - వర్షంబునున్ + పోలెన్ = ప్రళయ సమయ వర్షాకాలపు మేఘములు కురియువానవలె, ఒక్క - పెట్టున్ = ఒక్కమాఱుగా, భోరనన్ = అధికముగా, కురియన్ + తొడంగినన్ = కురియ మొదలిడఁగా, తత్ + ప్రతిహతిన్ = ఆ దెబ్బచే, ఉభయ - బలంబులును = రెండు సైన్యములును, మద - కరి - భగ్న - పల్లకీ - వనంబునున్ + పోలెన్ = మదగజముచే విఱుగఁగొట్టఁబడిన అందుగుచెట్లతోఁటవలె, విక్షతి - మయంబు + ఐ = గాయములతో నిండినదయి, మహత్ (మహా) - భయంకరంబు + అయ్యెన్, అయ్యవసరంబునన్ (ఆ + అవసరంబునన్) = ఆ సమయమున

తాత్పర్యము . పయి పరశ్వాదు లనెడి పెక్కు ఆయుధముల వర్షము ప్రళయ కాల వర్షాకాల మేఘములు కురియు వర్షమువలె, ఒక్కమాఱుగా అధికముగాఁ గురియ నారంభింపఁగా, ఆ దెబ్బచే రెండు సైన్యములును మత్తేభభగ్నమైన అందుగుచెట్లతోఁటవలె గాయములతో నిండినదయి మిక్కిలి భయంకరముగా నుండెను ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : అలంకార ముపమ

చ ఉదుట రణోత్సవం బొదవ నూఱట నార్వఁగ నొక్కనోరు చా
లదు తమకంచు సద్భటకులంబు రయంబున దేహమంతయున్
వదనము లోలిఁ దెచ్చికొని వారక భోరన నార్వఁజొచ్చె నా
వదలక తొమ్మి పాట్టల రవం బనయంబుఁ జెలంగెఁ బెల్లుతోన్ 7

అర్థము . ఉదుటన్ = ఉద్ధతితో, రణ + ఉత్సవంబు = యుద్ధపు వేడుక, ఒదవన్ = కలుగఁగా, ఊఱటన్ = స్వాస్థ్యముతో, ఆర్వఁగన్ = ఆర్భటకు, తమకున్, ఒక్క - నోరు, చాలదు, అంచున్, సత్ + భట - కులంబు = ఉత్తమ వీరుల సమూహము, రయంబునన్ =వేగముగా, దేహము + అంతయున్ = శరీరమంతయు, వదనములు = నోరులు, ఓలిన్ = బాగుగా, తెచ్చికొని, వారక =

ఉడుగక, భోరనన్= అధికముగా, ఆర్వన్ + చొచ్చెన్ + నాన్ = ఆర్వఁజొచ్చెనా యనునట్లు, వదలక = మానక, తొమ్మ్ - పాట్టల - రవంబు = తొమ్మ్మయొక్కయు, పాట్టల యొక్కయు ధ్వని, అనయంబున్ = మిక్కిలి, పెల్లుతోన్ = ఆధిక్యముతో, చెలంగెన్ = మ్రోసెను

తాత్పర్యము. ఉద్దతితో యుద్ధోత్సవము కలుగఁగా ఆర్చుటకుఁదమకొక్క నోరు చాలదని సద్వీరుల సమూహము వేగముగా దేహమంతయును నోర్లు తెచ్చికొని ఉడుగక ఆర్వఁజొచ్చెనా యనునట్లు మానక తొమ్మ్ పాట్టల ధ్వని మిక్కిలి అధికముగా మ్రోసెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష

విరూపాక్ష కుంజరాక్షుల యుద్ధము

వ త దవసరంబున నమర వీర కరయంత్ర ముక్తాముక్తాద్యాయుధ ప్రహతి కసురబలంబు లబ్బగింపక 8

అర్థము తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, అమర - వీర - కరయంత్ర - ముక్త + అముక్త + ఆది - ఆయుధ - ప్రహతికిన్ = దేవవీరుల కరయంత్రముల నుండి, ముక్త = విడువఁబడిన, అముక్త + ఆది - ఆయుధ - ప్రహతికిన్ = అముక్తము మున్నగు ఆయుధముల యొక్క దెబ్బకు, అసుర - బలంబులు = రాక్షససైన్యములు, అబ్బగింపక = సహింపక

తాత్పర్యము . ఆ సమయమున దేవవీరుల కరయంత్రముల నుండి విడువఁబడిన అముక్తము మున్నగు ఆయుధముల దెబ్బకు రాక్షససైన్యములు సహింపక - తరువాతి పద్యముతో నన్వయము

క విఱిగె నరదంబు, లలుగులు
విఱిగె, మదేభంబు లొఱఁగె, వెస నాశ్వికులుం
దొరఁగిరి, శూన్యాసనములఁ
బఱచెఁ దురంగమము, లోడి పఱచిరి దనుజుల్. 9

అర్థము . అరదంబులు = రథములు, విఱిగెన్, అలుగులు = బాణములు,విఱిగెన్, మద + ఇభంబులు = మద గజములు, ఒఱఁగెన్ = వ్రాలెను వెసన్ = శీఘ్రముగా, ఆశ్వికులున్ = గుఱ్ఱపురౌతులును, తొఱఁగిరి = విడిచిరి, తురంగమములు = గుఱ్ఱములు, శూన్య + ఆసనములన్ = ఆశ్విక

రహితాసనములతో, పఱచెన్ = పరువెత్తెను, దనుజుల్ = రాక్షసులు, ఓడి, పఱచిరి = పరువెత్తిరి

తాత్పర్యము రథములు విఱిగెను, బాణములు ముక్కలయ్యెను మత్తేభములు వ్రాలెను, గుఱ్ఱపురౌతులును శీఘ్రముగా విడిచిరి గుఱ్ఱములు ఆశ్వికశూన్యములైన ఆసనములతోఁబరువెత్తెను రాక్షసులు ఓడిపోయి పరువెత్తిరి

వ ఇట్లు మహాసముద్రంబులు కట్టవిసిన ట్లొక్కపెట్ట సురవరులకు వెన్నిచ్చి తెరలం బఱతెంచు ననురవాహినీప్రవాహంబునకు వజ్రసేతుబంధనంబుగ నాఁకఁగొని కుంజరాక్షుండు కుంజరారిభీతాతురకుంజరపోతయూథంబులం గైకొని సవరించు మహాయూథాధిపతియునుంబోలె నిజబలంబుం గనుంగొని 10

అర్థము. ఇట్లు, మహత్ (మహా) + సముద్రంబులు, కట్టవిసినట్లు (కట్ట + అవిసిన+ అట్లు) = గట్టు తెగిన విధమున, ఒక్కపెట్టున్ = ఒక్కమాఱుగా, సుర-వరులకున్ = దేవతా శ్రేష్ఠులకు, వెన్నిచ్చి (వెన్ను + ఇచ్చి) = ఓడిపోయి, తెరలన్+ పఱతెంచు = ఉప్పొంగివచ్చు, అసుర - వాహినీ - ప్రవాహంబునకున్ = రాక్షససేనయనెడునదియొక్కప్రవాహమునకు, వజ్ర - సేతు - బంధనంబుగన్ = వజ్రనిర్మితమైన ఆనకట్టగా, ఆఁకన్ + కొని = అడ్డగించి, కుంజరాక్షుండు = కుంజరాక్షుఁడను పేరుగల రాక్షసుఁడు, కుంజర + అరి - భీత + ఆతుర - కుంజర - పోత = యూథంబులన్ = గజవిరోధి (సింహము) వలన భయపడి బాధపడిన గున్నయేనుఁగుల గుంపులను, కైకొని = గ్రహించి, సవరించు = చక్కఁబఱుచు, మహత్ (మహా) + యూథ + అధిపతియునున్ + పోలెన్ = గొప్ప గజసమూహనాయకునివలె, నిజ -బలంబున్ = తన సైన్యమును, కనుంగొని = చూచి

తాత్పర్యము. ఇట్లు మహాసముద్రములు గట్టుతెగినట్లు ఒక్కపెట్టున దేవతాశ్రేష్ఠులకు వెన్నిచ్చి పాఱిపోయివచ్చు రాక్షస సేనయనెడు నదీ ప్రవాహమునకు వజ్రనిర్మితసేతుబంధనముగ అడ్డగించి కుంజరాక్షుఁడను రాక్షసవీరుఁడు సింహమునకు భయపడిన ఏనుఁగుగున్నలను స్వీకరించి చక్కఁబఱుచు గజ సమూహ నాయకుని వలెఁ దన బలమును జూచి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకారము శ్లిష్టరూపకము, ఉపమ

క ప్రళయాభ్రరసము నా సుర
బలములనన్నింటి నుగ్రబాణాసారం
బుల ముంచికొంచు వచ్చెం
దలర సురాధీశుఁ డార్వఁ దారకుఁ డెలమిన్ 11

అర్థము సుర + అధి + ఈశుఁడు = దేవాధిపతి - ఇంద్రుఁడు, తలరన్= కంపింపఁగా, తారకుడు, ఎలమిన్ = సంతోషముతో, ఆర్వన్, ప్రళయ + అభ్ర-రసము - నాన్ = ప్రళయకాలమేఘముల జలమో యనునట్లు, సుర - బలములన్+ అన్నింటిన్ = దేవ సైన్యములనన్నింటిని, ఉగ్ర - బాణ + ఆసారంబులన్ = భయంకరములయిన బాణములనెడి జడివానలందు, ముంచికొంచున్, వచ్చెన్, పఁ గద్యమునందలి కుంజరాక్షుఁడు కర్త

తాత్పర్యము . కుంజరాక్షుఁడు - ఇంద్రుఁడు చలింపఁగను, తారకుఁడు సంతోషముతో నార్వఁగను దేవసైన్యములనన్నింటిని జడివానలందు ముంచికొనుచు వచ్చెను

విశేషములు : అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష

వ త దవసరంబున నీశానుండు విలయకాలస్వరూపుండగు నీశానుండు
నుంబోలెఁ గోపానలోద్దీపితాంతరంగుండై విజృంభించి 12

అర్థము: తద్ + అవసరంబునన్, ఈశానుండు = ఈశాన్యదిక్పాలకుఁడు, విలయకాలస్వరూపుండు + అగు + ఈశానుండునున్ + పోలెన్ =ప్రళయకాలస్వరూపుఁడైన యీశ్వరునివలె, కోప + అనల + ఉత్ + దీపిత + అంతరంగుండు + ఐ = కోపమనెడి అగ్నిచేత మిక్కిలి మండింపఁబడిన మనస్సుగలవాఁడయి, విజృంభించి

తాత్పర్యము . ఆ సమయమున ఈశాన్యదిగధిపతియగు ఈశానుఁడు ప్రళయకాలస్వరూపుఁడగు ఈశ్వరునివలెఁ గోపమనెడి అగ్నిచే మిక్కిలి మండింపఁబడిన మనస్సుగలవాఁడై విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష - రూపకము

క రాక్షసబలములకెల్ల మ
హోక్షోభముగా భయంకరాకారుండై
యాక్షేపముతోడ విరూ
పాక్షుఁడు కోపించి కుంజరాక్షునిఁ దాకెన్ 13

అర్థము విరూప + అక్షుఁడు = ముక్కంటి - ఈశానుఁడు, రాక్షస - బలములకున్ + ఎల్లన్, మహత్ (మహా) + క్షోభము + కాన్ = గొప్పకలఁతకాఁగా, భయంకర + ఆకారుండు + ఐ = భయము గలిగించు రూపము గలవాఁడయి, ఆక్షేపముతోడన్ = ఆదల్పుతో, కోపించి, కుంజరాక్షునిన్, తాఁకెన్

తాత్పర్యము ఏరూపాక్షుఁడు - ముక్కంటి - ఈశానుఁడు రాక్షసబలములకెల్ల మహాక్షోభము గలుగునట్లు భయంకరాకారుఁడై అదల్పుతోఁ గోపించి కుంజరాక్షునిఁ దాఁకెను

వ ఇ ట్లతిభయంకరాకారంబునం బఱతెంచు కులాచలంబునకు మార్కొను దంభోలియుంబోలెఁ గుంజరాక్షునకు ననలాక్షుండు మార్కొని 14

అర్థము. ఇట్లు, అతి -భయంకర + ఆకారంబునన్ = భయము గలిగించు రూపముతో, పఱతెంచు = పాఱివచ్చు, కుల + అచలంబునకున్ = కులపర్వతమునకు, మార్కొను = ఎదురుకొను, దంభోలియున్ + పోలెన్ = వజ్రాయుధమువలె, కుంజరాక్షునకున్, అనల + అక్షుండు = ఈశానుఁడు, మార్కొని

తాత్పర్యము . ఇట్లు మిక్కిలి భయంకరమైన రూపముతోఁబాఱివచ్చు కులపర్వతముతో మార్కొను వజ్రాయుధమువలెఁ గుంజరాక్షునితో నీశానుఁడు మార్కొని - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకారము ఉపమ కులాచలంబునకు మార్కొను షష్ఠీ స్థానికంబగు కువర్ణకం బొక్కొకచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్త దర్థంబులం జూపట్టెడి ' ప్రౌఢ కారక 13 ఇచ్చటఁ దృతీయార్థమునఁ గువర్ణకమయినది

ఉ ఏసిన బాణముల్ విఱుగ నేసియు, వైచిన శక్తులన్నియుం
బాసిచనంగఁ దప్పియును, బాహుబలోన్నతి వచ్చి బల్విడిన్
వ్రేసియు, మండలాగ్రములు, వీకునఁ దాఁకియుఁ బోరి రాజి దే
వాసురవీరు లార్వ సమమై విషమాక్షుఁడుఁ గుంజరాక్షుఁడున్. 15

అర్థము. ఏసిన - బాణముల్ = ప్రయోగించిన బాణములు, విఱుగన్ + ఏసియున్ = విఱుగునట్లు ప్రయోగించియును, వైచిన = ప్రయోగించిన, శక్తులు + అన్నియున్, పాసి - చనంగన్ + తప్పియును = వీడిపోయి వ్యర్థమయియును,

బాహు - బల + ఉన్నతిన్ = భుజబలముయొక్క ఔన్నత్యముతో, వచ్చి, బల్విడిన్ = శౌర్యముతో, మండలాగ్రములు = ఖడ్గములు, వ్రేసియున్ = ప్రయోగించియును, వీకునన్ = పరాక్రమముతో, తాఁకియున్, ఆజిన్ = యుద్ధమునందు, దేవ + అసుర - వీరులు = దేవ రాక్షసవీరులు, ఆర్వన్ = ఆర్వఁగా, విషమాక్షుఁడును = ఈశానుఁడును, కుంజరాక్షుఁడున్, సమము + ఐ = సమానమయి

తాత్పర్యము ఒకఁడు ప్రయోగించిన బాణములు ఇంకొకఁడు విియుగఁగొట్టియు, ప్రయోగించిన శక్తులన్నియును వొలఁగి వ్యర్థమయియును, భుజ పరాక్రమోన్నత్యముతో వచ్చి శౌర్యముతో ఖడ్గములు ప్రయోగించియును, పరాక్రమముతోఁ దాఁకియు, దేవరాక్షసవీరులు ఆర్వఁగా, ఈశానకుంజరాక్షులు సమానముగా యుద్ధమునఁ బోరిరి

వ ఇట్లు సమ బలపరాక్రమాయుధవిద్యాపరిణతులై పెద్ద ప్రొద్దు మహాయుద్ధంబు సేసి కోపావేశంబునం గుంజరాక్షుండు దావగొనక విరూపాక్షుం బట్టుకొనఁదలంచి పయికి లంఘించినం గని యీశానుం డీశానదత్త మహాత్రిశూలాయుధంబెత్తి మీఁదికి మీఁదఁ గుంజరాక్షుబంధురకంధరం బిరుమై నుచ్చిపోవం బొడిచి యెత్తిన. 16

అర్థము : ఇట్లు, సమ - బల - పరాక్రమ -+ ఆయుధ - విద్యా - పరిణతులు + ఐ = సమానమయిన బలపరాక్రమములు, ఆయుధవిద్యా పరిపాకములు గలవారయి, పెద్ద - ప్రొద్దు = చాలసేపు, మహత్ (మహా) + యుద్ధంబు, చేసి, కోప + ఆవేశంబునన్ = కోపోద్రేకముతో, కుంజరాక్షుండు, తావగొనక = నిలువక, విరూపాక్షున్ = ఈశానుని, పట్టుకొనన్ + తలంచి, పయికిన్, లంఘించినన్ = దూఁకఁగా, కని, ఈశానుండు, ఈశాన - దత్త - మహత్ (మహా) + త్రిశూల + ఆయుధంబు = ఈశ్వరునిచే నీఁబడిన మహా త్రిశూలాయుధమును, ఎత్తి, మీఁదికిన్ - మీఁదన్ = పై పయికి, కుంజరాక్షు - బంధుర - కంధరంబు = కుంజరాక్షుని యొక్క విషమమైన మెడ, ఇరుమైన్ = రెండు ప్రక్కలను, ఉచ్చిపోవన్ = దూసికొనిపోవునట్లు, పొడిచి, ఎత్తినన్

తాత్పర్యము : ఇట్లు సమానమైన బలపరాక్రమములు, ఆయుధ విద్యా పరిపాకములు గలవారయి చాలసేపు మహాయుద్ధము చేసి కోపావేశముతోఁ గుంజరాక్షుఁడు నిలువక ఈశానునిఁ బట్టుకొననెంచి మీఁదికి దుముకఁగాఁ జూచి ఈశానుఁడు ఈశ్వరదత్తమైన మహాత్రిశూలాయధమునెత్తి పయిపయికిఁ

గుంజరాక్షుని విషమమైన కంరమును రెండువైపుల దూసికొనిపోవునట్లు పొడిచి ఎత్తఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క **వినుతారుణ జల విగళిత**
ఘన మనఁ గ్రొన్నెత్తు రొలుకఁగా శూలాగ్రం
బునఁ దగిలి తూలుచుండెను
దనుజుం డీశాను జయపతాకయుఁబోలెన్ 17

అర్థము వినుత + అరుణ - జల - విగళిత - ఘనము = పొగడఁబడిన ఎఱ్ఱని నీరు కార్చిన మేఘము, అనన్ = అనఁగా, క్రొన్నెత్తురు (క్రొత్త + నెత్తురు) ఒలుకఁగాన్ = కాఱుచుండఁగా, దనుజుండు = రాక్షసుఁడు - కుంజరాక్షుఁడు, శూల + అగ్రంబునన్ = శూలముకొనను, తగిలి = తగులుకొని, ఈశాను - జయపతాకయున్ + పోలెన్ = ఈశానుని విజయధ్వజమువలె, తూలుచున్ + ఉండెను = చలించుచుండెను

తాత్పర్యము . ఎఱ్ఱనినీటిని గార్చు మేఘమోయనఁ గ్రొన్నెత్తురు కాఱుచుండఁగా రాక్షసుఁడు - కుంజరాక్షుఁడు శూలముకొనను దగులుకొని ఈశానుని విజయధ్వజమోయనఁ జలించుచుండెను

విశేషములు అలంకారము ఉత్ప్రేక్ష క్రొన్నెత్తురు (క్రొత్త + నెత్తురు) ప్రాఁతాది సూత్రము(బాల సంధి 36) చే క్రొ + నెత్తురు (బాల సంధి 38)చే క్రొన్నెత్తురు

చ **అనిమొనఁ గుంజరాక్షుఁ డసమాక్షు నమర్షరసాంబురాశిలో**
మునుఁగుట చూచి దైత్యబలముల్ తమ కెందును బొందులేక క
న్కనిఁ జననున్నచో సమరఘస్మరుఁ డోడకుఁడంచు వచ్చి కై
కొనియె మహోగ్రదంష్ట్రుఁ డతికోపనుఁ డాహవదోహలంబునన్ 18

అర్థము . అని - మొనన్ = యుద్ధాగ్రమునందు, కుంజరాక్షుఁడు, అసమ + అక్ష = ఈశానుని యొక్క, అమర్ష - రస + అంబు రాశిలోన్ = కోపరసమనెడి సముద్రమునందు, మునుఁగుట, చూచి, దైత్యబలమున్ = రాక్షససేనలు, తమకున్, ఎందును, పొందు - లేక = ఆశ్రయములేక, కన్కనిన్ = సంభ్రమముతో, చనన్+ ఉన్నచోన్ = పోవనుండఁగా, అమర - ఘస్మరుఁడు = దేవతలను దినువాఁడు - రాక్షసుఁడు - అతి - కోపనుఁడు = మిక్కిలి కోపముగలవాఁడు - అగు - మహత్

(మహా) + ఉగ్ర - దంష్ట్రుఁడు = ఉగ్రదంష్ట్రుఁడు, ఆహవ-దోహలంబునన్ = యుద్ధోత్సాహముతో, ఓడకుఁడు + అంచున్ = భయపడకుఁడు, అనుచు, వచ్చి, కైకొనియెన్ = స్వీకరించెను

తాత్పర్యము : యుద్ధమునందుఁ గుంజరాక్షుఁడు ఈశానుని కోపరససముద్రములో మునుగుఁట చూచి రాక్షససైన్యములు తమ కెందును ఆశ్రయములేక సంభ్రమములోఁ బోవనుండఁగా, అమరఘస్మరుఁడును, అతి కోపనుఁడును అగు ఉగ్రదంష్ట్రుఁడు యుద్ధోత్సాహముతో భయపడకుఁడనుచు వచ్చి స్వీకరించెను

విశేషములు అలంకారము రూపకము

వ ఇ ట్లసురబలంబులంగైకొని సురబలంబులం బడల్పఁడ నెగుచుచు నీశానుపై నురలం బఱతెంచు నుగ్రదంష్ట్రంగని 'పగ చొప్పడియె' ననుచు నెడసొచ్చి ధననాథుండు దనుజనాథునకుం బ్రతిఘటించి నిలిచినం గుబేరారి కోపహాసవిలసితాననుండగుచు 19

అర్థము . ఇట్లు, అసుర - బలంబులన్ = రాక్షససేనలను, కైకొని = స్వీకరించి, సుర - బలంబులన్ = దైవసైన్యములను, బడల్పఁడన్ = బడలుపడునట్లు - శ్రమము పొందునట్లు, ఎగుచుచున్ = తఱుముచు, ఈశానుపైన్, ఉరలన్ + పఱతెంచు = దండెత్తవచ్చు, ఉగ్రదంష్ట్రున్ = ఉగ్రదంష్ట్రుఁ డను రాక్షసవీరుని, కని, పగ - చొప్పడియెన్ = విరోధి చిక్కెను, అనుచున్, ఎడ+చొచ్చి = నడుమవచ్చి, ధననాథుండు = కుబేరుఁడు, దనుజ - నాథునకున్ = రాక్షసరాజునకు - ఉగ్రదంష్ట్రునకు, ప్రతిఘటించి = ఎదిరి, నిలిచినన్, కుబేర + అరి = కుబేర శత్రువు - ఉగ్రదంష్ట్రుఁడు, కోప - హాస - విలసిత + ఆననుండు + అగుచున్ = కోపముచేతను, నవ్వుచేతను బ్రకాశించు ముఖము గలవాఁడు అగుచు

తాత్పర్యము : ఇట్లు రాక్షససైన్యములను స్వీకరించి దేవసైన్యములను శ్రమపడునట్లు తఱుముచు, ఈశానుపై నెత్తివచ్చు ఉగ్రదంష్ట్రునిం జూచి 'విరోధి చిక్కె' ననుచు నడుమవచ్చి కుబేరుఁడు, రాక్షసరాజయిన ఉగ్రదంష్ట్ర నెదిరించి నిలువఁగాఁ గుబేరశత్రువగు నుగ్రదంష్ట్రుఁడు కోపహాసములచేఁ బ్రకాశించు ముఖము గలవాఁడగుచు - తరువాతి పద్యముతో నన్వయము

కుబేరోగ్రదంష్ట్రులు యుద్ధము

క కనువడి నీవును బోటరి
వనియే దానవులఁ జెనసె దౌనౌ నీ పో
టును జూతము రమ్మా యని
ధననాథు నదల్చి యుగ్రదంష్ట్రుఁడు తాఁకెన్ 20

అర్థము కనువడి = ఎదుటఁబడి, నీవును, పోటరివి = వీరుఁడవు, అనియే, దానవులన్ = రాక్షసులను, చెనసెదు = మార్కొందువు, ఔన్ + ఔన్ = అవునవును, నీ - పోటును, చూతము, రమ్మా, అని ఉగ్రదంష్ట్రుఁడు, ధననాథున్ = కుబేరుని, అదల్చి = బెదరించి, తాఁకెన్

తాత్పర్యము ఎదుటఁబడి 'నీవును ఒక పోటరిననియే రాక్షసుల నెదిరించెదవు ఔనౌను! ఏదీ నీ పోటును జూతమురమ్మా' యని యుగ్రదంష్ట్రుఁడు కుబేరుని బెదరించి ఎదిరించెను

విశేషములు చూతము - చూచు ధాతువు 'తద్ధర్మాదులందు లాట్టగు' బాల క్రి 5 చూచు + లాట్ 'లకారంబునకు డుఱ్ఱువురునుము ఱ్ఱగు' బాల క్రి 8 చూచు + ము 'లాట్టు రుఱ్ఱు పరంబగునపుడు దుగాగమంబగు' బాల క్రి 22 చూచు + దు + ము 'ఉభయప్రార్థనంబున దుగాగమంబున కత్వంబగు' బాల క్రి 30 చూచు + ద + ము 'చువర్ణంబుతోడ దుగ్దకారంబు తకారంబగు' బాల క్రి 108 చూతము

వ ఇట్లు ముట్ట మూదలించి తాఁకిన ముష్టిన నిలింపబలజలధి నిజాయుధానేకజలచరాకీర్ణంబు సేయుచుఁ దన్నుఁ గైకొనక బాహుబల గర్వంబున నురవడించి 21.

అర్థము. ఇట్లు, ముట్ట మూదలించి = తాఁకునట్లు ఎత్తిపొడుపు మాటలాడి, తాఁకిన -ముష్టిన్ + అ = తాఁకిన వెంబడి, నిలింప - బల - జలధి = దేవతల సైన్యమనెడి సముద్రము, నిజ + ఆయుధ + అనేక - జలచర + ఆకీర్ణంబు = తమ ఆయుధములనెడి జలచరములచే వ్యాప్తమయినది, చేయుచున్, తన్నున్, కైకొనక = లక్ష్యపెట్టక, బాహు-బల-గర్వంబునన్ = భుజపరాక్రమము వలని గర్వముచే, ఉరవడించి = రేఁగి

తాత్పర్యము. ఇట్లు తాఁకునట్లు ఎత్తిపొడుపుమాటలాడి తాఁకిన వెంబడి దేవతల సేన యను సముద్రము తమ ఆయుధములనెడి పెక్కు జలచరములచే

వ్యాపించినదిగాఁ జేయుచుఁ దన్ను లక్ష్యపెట్టక బాహుబలగర్వమున విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము రూపకము

తే బలిమిఁ దోతెంచు దానవబలముతోన
రాజరా జొక్క ముష్టిన రథము విఱుగ
నేసి రయున వెండియు నేసె వాని
వింటి తోడన తారకు వెన్ను విఱుగ 22

అర్థము. రాజరాజు = కుబేరుఁడు, బలిమిన్ = బలముతో, తోతెంచు = వచ్చు, దానవ - బలముతోన్ + అ = దానవుని సైన్యముతోనే, ఒక్కముష్టిన్ + అ = వెంటనే, రథమున్, విఱుగన్ + ఏసి = విఱుగఁగొట్టి, రయమునన్ = శీఘ్రముగా, వాని - వింటి - తోడన్ + అ = వాని వింటితోపాటే, తారకు - వెన్ను, విఱుగన్, వెండియున్ = మరల, ఏసెన్

తాత్పర్యము. కుబేరుఁడు పరాక్రమముతో వచ్చు రాక్షససైన్యముతోనే వెంటనే రథమును విఱుగఁగొట్టి వేగముగా వానివింటితోపాటే తారకుని వెన్ను విఱుగఁగొట్టెను

క ధనదుండు విల్లు దెగ నే
సిన గదగొని వ్రేయ నసుర చెచ్చెర వచ్చెం
జనునెడ ధర్మవిహీనుఁడు
ధనపతి దండహతుఁజేయఁదలఁపకయున్నే ? 23

అర్థము : ధనదుండు = కుబేరుఁడు, విల్లు, తెగన్ + ఏసినన్ = తెగఁగొట్టఁగా, అసుర = రాక్షసుఁడు, గద + కొని = గదను దీసికొని, వ్రేయన్ = కొట్టుటకు, చెచ్చెరన్ = శీఘ్రముగా, వచ్చెన్, చను + ఎడన్ = పోవునప్పుడు, (?), ధర్మ-విహీనుఁడు = విల్లులేనివాఁడు, ధర్మములేనివాఁడు - అధర్మపరుఁడు, ధనపతిన్ = కుబేరుని, కోశాధ్యక్షుని, దండ-హతున్ = కట్టుచేఁగొట్టఁబడిన వానినిగా, చేయన్ + తలఁపక + ఉన్నే ? = చేయనెంచకుండునా?

తాత్పర్యము. కుబేరుఁడు విల్లు తెగఁగొట్టఁగా, రాక్షసుఁడు గదను గైకొని శీఘ్రముగా వచ్చెను ధర్మవిహీనుఁడు - విల్లు లేనివాఁడు, అధర్మపరుఁడు, ధనపతిని - కుబేరుని, కోశాధ్యక్షుని దండముతోఁ గొట్ట నెంచకుండునా?

విశేషములు . అలంకారము అర్థాంతరన్యాసము, శ్లేషానుప్రాణితము

వ ఇట్లకాండబ్రహ్మాండఖండలయదండంబునుంబోలె రోదసీ కుహరాంతరాపూరితోన్నతశరీరుండై ప్రళయనిర్ఘాతంబునుం బోలె దిగంతరాళంబు చెలంగ నదల్చుచు 24

అర్థము ఇట్లు, అకాండ - బ్రహ్మాండ - ఖండ - లయ - దండంబునున్+ పోలెన్ = ఆకస్మికమైన బ్రహ్మాండభాగనాశమునకైన దండమువలె, రోదసీ- కుహర + అంతర + ఆపూరిత + ఉన్నత - శరీరుండు + ఐ = గుహవంటి భూమ్యాకాశమధ్యభాగమునం దంతట నింపఁబడిన ఎత్తయిన శరీరముగల వాఁడయి, ప్రళయ - నిర్ఘాతంబునున్ + పోలెన్ = ప్రళయ సమయమునందలి పిడుగువలె, దిశ్(క్) + అంతరాళంబు = దిక్కుల నడిమిభాగము, చెలంగన్= ప్రతిధ్వనింపఁగా, అదల్చుచున్ = భయపెట్టుచు

తాత్పర్యము ఇట్లు, ఆకస్మికమైన బ్రహ్మాండనాశకదండమువలె భూమ్యాకాశమధ్య ప్రదేశమంతయు నిండిన శరీరము గలవాఁడయి ప్రళయకాలపుఁ బిడుగువలె దిఙ్మధ్యభాగము మాఱుమ్రోయ నదలించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకార ముత్ప్రేక్ష, ఉపమ

క గదగొని పోరికి మది నం
గద గొని చనుదెంచువానిఁగని ధనపతి బి
ట్టదరిపడ వేసె దానవుఁ
డుదరిపడన్ ధాత్రి దనుజు లుల్లల నుడుకన్ 25

అర్థము. గద + కొని, పోరికిన్ = యుద్ధమునకు, మదిన్ = మనస్సునందు, అంగద + కొని = ఆఁకలిగొని, చనుదెంచువానిన్ = వచ్చువానిని, కని, ధనపతి = కుబేరుఁడు, బిట్టు = మిక్కిలి, అదరిపడన్ = ఎగిరిపఁడఁగా, దానవుఁడు = రాక్షసుఁడు, ఉదరిపడన్ = భయపడఁగా, ధాత్రిన్ = భూమియందు, దనుజులు = రాక్షసులు, ఉల్లలన్ + ఉడుకన్ = ఉల్లలమని పరితపింపఁగా, ఏసెన్ = కొట్టెను

తాత్పర్యము గదనుగైకొని యుద్ధమునకు ఆఁకటితోవచ్చు రాక్షసునిఁ జూచి కుబేరుఁడు మిక్కిలి ఎగిరిపడఁగా, రాక్షసుఁ డదరిపడఁగా, భూమిని రాక్షసులు ఉల్లలమని పరితపింపఁగాఁ గొట్టెను .

వ ఇ ట్లయ్యుగ్రదంష్ట్ర నంగవల్లి సంగరరంగాంగణంబునకు రంగవల్లియైన నాక్షణంబ 26

అర్థము : ఇట్లు, ఆ + ఉగ్రదంష్ట్ర + అంగ-వల్లి = ఆ ఉగ్రదంష్ట్రుని తీఁగవంటి శరీరము, సంగర - రంగ + అంగణంబునకున్ = యుద్ధభూమి ముంగిటికి, రంగ-వల్లి = ముగ్గు, ఐనన్ = కాఁగా, ఆ - క్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము . ఇట్లు ఆ ఉగ్రదంష్ట్రుని మైఁదీఁగ యుద్ధభూమి ముంగిటికి ముగ్గుకాఁగా ఆక్షణమే - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకారము రూపకము

పవన సందారకుల యుద్ధము

సీ తారకసుతుఁడు మందారకుండను మహా
వీరుఁడు గసి వెస వేయుఁగోటు
లుత్తుంగ మాతంగ యూథాలితో సుర
వాహినిలో నవగాహమనుపఁ
జనుదెంచుగతి నిజసామజవ్రజపాద
తలహతి ధారుణీతలము గోడి
వడ నెత్తివచ్చి మార్బలముల నురువడి
ముప్పిరివడఁదోలి కప్పికొనుచు

ఆ గాత్ర వాల దంత చిత్రాదివధల సం
యోగవధలఁ జంపుచుండె నుగ్ర
యోధవరులు కురిసి రురువడి శస్త్రాస్త్ర
వృష్టి నమరవరులు వీకు దఱఁక 27

అర్థము: తారక - సుతుఁడు = తారకుని కొడుకు, (అగు) మందారకుండు, అను, మహత్ (మహా) + వీరుఁడు = గొప్పవీరుఁడు, కసిన్ = పగతో, వెసన్ = శీఘ్రముగా, వేయు + కోటులు = వేయి కోటులు, ఉత్తుంగ = మిక్కిలి యెత్తయిన, మాతంగ - యూథ + ఆలితోన్ = ఏనుఁగుల గుంపుల వరుసతో, సుర - వాహినిలోన్ = దేవసేనలో - గంగానదిలో, అవగాహము + అనుపన్ = ప్రవేశపెట్టింప స్నానము చేయింప - చనుదెంచు - గతిన్ = వచ్చు విధమున

నిజ - సామజ - వ్రజ - పాద - తల - హతిన్ = తన ఏనుఁగుల గుంపుయొక్క అడుగుల దెబ్బచే, ధారుణీ - తలము = భూతలము, గోడి + పడన్ = ఒకప్రక్క క్రిందికొఱగి రెండవ ప్రక్క పైకి లేచునట్లు, ఎత్తి-వచ్చి = దండెత్తివచ్చి,

మార్బలములన్ = శత్రుసైన్యములను, ఉరువడిన్ = మిక్కిలి వేగముతో, ముప్పిరి + పడన్ = మూఁడు పిరులుగాఁ బెనఁగొనునట్లు, తోలి, కప్పికొనుచున్ = ఆక్రమించుచు,

గాత్ర - వాల - దంత - చిత్ర + ఆది - వధలన్ = గాత్ర వధ, వాలవధ, దంతవధ, చిత్రవధ మున్నగు వధల చేతను, సంయోగ - వధలన్ = అన్నియుఁ గూడిన వధలతోను, చంపుచున్ + ఉండెన్, అమర - వరులు = దేవతాశ్రేష్ఠులు, వీకు = ఔద్ధత్యము, తఱఁకన్ = నశింపఁగా, ఉగ్ర - యోధ - వరులు = భయంకరులైన యోధశ్రేష్ఠులు, ఉరువడిన్ = మిక్కిలి వేగముతో, శస్త్ర + అస్త్ర - వృష్టిన్ = శస్త్రములయు అస్త్రములయు వర్షమును, కురిసిరి = కురియించిరి

తాత్పర్యము తారకుని కొడుకగు మందారకుఁడను మహావీరుఁడు కసితో శీఘ్రముగా వేయికోటుల మిక్కిలి యెత్తయిన ఏనుఁగుల గుంపులలో సురవాహినియందు - దేవసేనలో - గంగానదిలో స్నానము చేయింప వచ్చు విధమునఁ దన యేనుఁగుల అడుగుల త్రొక్కిడిచే భూతలము ఒక్కప్రక్క కొఱగఁగా, దండెత్తివచ్చి, శత్రుసైన్యమును మిక్కిలి వేగముతో ముప్పిరివడునట్లు తోలి ఆక్రమించుచు గాత్ర వాల దంత చిత్రాది వధలతోను, సంయోగవధలతోను జంపుచుండెను దేవశ్రేష్ఠులు ఔద్ధత్యము గోలుపోవ భయంకరయోధశ్రేష్ఠులు మిక్కిలి వేగముతో శస్త్రాస్త్రవర్షము కురియించిరి

విశేషములు ·సురవాహినిలో - శ్లిష్ట రూపకము, అతిశయోక్తి ఉత్ప్రేక్ష

వ ఇట్లు దేవబలంబు హల్లకల్లోలంబుగాఁ జంపుచు వచ్చుచున్నంగని కోపించి 28

అర్థము: ఇట్లు, దేవ - బలంబున్ = దేవ సైన్యమును, హల్లకల్లోలంబుగాన్= సంక్షుభితమగునట్లు, చంపుచున్, వచ్చుచున్ + ఉన్నన్, కని, కోపించి

తాత్పర్యము . ఇట్లు దేవసేనను సంక్షుభితమగునట్లు చంపుచు వచ్చుచుండఁగాఁ జూచి కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

క అతివేగంబున నరికరి
తతి నెక్కటిఁ దాఁకె భూరి దారుణ బల ద
ర్పితుఁడై పవనుఁడు లయ మా
రుతము కులాచలములం దిరుగవీచుక్రియున్ 29

అర్థము పవనుఁడు = వాయువు, లయ - మారుతము = ప్రళయ సమయవాయువు,కుల + అచలములన్ = కులపర్వతములను, తిరుగన్ = తిరుగునట్లు, వీచు -క్రియన్ = వీచు విధమున, భూరి - దారుణ - బల - దర్పితుఁడు + ఐ = అధికము, భయంకరమునైన పరాక్రమముచే గర్వించినవాఁడయి, అతి-వేగంబునన్ = మిక్కిలి వేగముతో, అరి-కరి-తతిన్ = శత్రుగజసమూహమును, ఎక్కటిన్ = ఒంటరిగా, తాఁకెన్

తాత్పర్యము . వాయువు - ప్రళయానిలము కులపర్వతములను దిరుగునట్లు వీచు విధమున మిక్కిలి భయంకరమైన బలముచే గర్వించినవాఁడయి మిక్కిలి వేగముతో శత్రుగజసమూహమును ఒంటరిగాఁ దాఁకెను

విశేషములు . అలంకార ముపమ

క **వీచియు నొత్తియు నెత్తియుఁ**
ద్రోచియుఁ జఱచియును ద్రిప్పి తూలిపడంగా
వైచియు గజయూథంబులఁ
బాచియుఁ బవనుండు చంపెఁ బ్రతిగజబలమున్ 30

అర్థము : పవనుండు = వాయువు, వీచియున్, ఒత్తియున్, ఎత్తియున్, త్రోచియున్, చఱచియును, త్రిప్పి, తూలిపడంగాన్ = కదలిపడునట్లు, వైచియున్, గజ - యూథంబులన్ = ఏనుఁగుల గుంపులను పాచియున్, = తొలఁగించియు, ప్రతి - గజ - బలమున్ = శత్రు గజసైన్యమును, చంపెన్

తాత్పర్యము . వాయుదేవుఁడు వీచియు, ఒత్తియు, ఎత్తియుఁ, ద్రోచియుఁ, జఱచియును, ద్రిప్పి, తూలిపడునట్లు వైచియు, ఏనుఁగుల గుంపులను దొలఁగించియు శత్రువుల గజసైన్యమును జంపెను

వ **ఇట్లనేకప్రకారంబుల భంజించు మహాప్రభంజనహతికిఁ గుంజరఘట లబ్బగింపక** 31

అర్థము ఇట్లు, అనేక - ప్రకారంబులన్, భంజించు = సంహరించు, మహత్ (మహా) + ప్రభంజన - హతికిన్ = పెద్దగాలిదెబ్బకు, కుంజర - ఘటలు = ఏనుఁగుల గుంపులు, అబ్బగింపక = తాళలేక

తాత్పర్యము ఇట్లు పెక్కుఁరీతుల భంగపఱుచు పెనుగాలిదెబ్బకు ఏనుఁగుల గుంపు తాళలేక - తరువాతి పద్యముతో నన్వయము

తే ధార కులికెడు మదజలధార లుడిగి
గర్జసెడి పుట్టుఁబొడ వెందుఁ గానకుండ
మారుతాహతి నిలువక పోర నభ్ర
పటలి గతిఁ దూలి మదకరిఘటలు పాఱె 32

అర్థము ధార = ప్రవాహము, కులికెడు = ఒప్పునట్టి, మద - జల - ధారలు = మదజల ప్రవాహములు, ఉడిగి = పోయి, గర్జ = ఘీంకృతి, చెడి = నశించి, పుట్టున్ + పొడవు = పుట్టుకయు, రూపు, ఎందున్, కానక +ఉండన్ = కనరాకుండ, మద - కరి-ఘటలు = మదగజసమూహములు, మారుత + ఆహతిన్ = వాయువు దెబ్బచే, పోరన్ = యుద్ధమునందు, నిలువక, అభ్ర-పటలి - గతిన్ = మేఘముల గుంపు విధమున, తూలి = చలించి, పాఱెన్ = పరువెత్తెను

తాత్పర్యము. ధార ఒప్పునట్టి మదజల ప్రవాహములు పోయి, ఘీంకారము నశించి పుట్టుక, రూపము ఎందును గనరాకుండ మత్తేభసమూహములు వాయు దేవుని దెబ్బచే యుద్ధరంగమున నిలువక మేఘసమూహమువలెఁ బరువెత్తెను

విశేషములు. అలంకార ముపమ

వ అంత మందారుండు కోమల మందార మహీరుహంబునుంబోలెం బ్రచండానిలాహతి నిహతుండైనం గని కోపించి. 33

అర్థము. అంతన్, మందారుండు, కోమల - మందార - మహీరుహంబునున్ + పోలెన్ = లేఁత మందార వృక్షమువలె, ప్రచండ + అనిల + ఆహతిన్ = తీవ్రమయిన వాయువు దెబ్బచే, నిహతుండు = చచ్చినవాఁడు, ఐనన్, కని, కోపించి

తాత్పర్యము. అంత మందారుఁడు లేఁత మందార వృక్షము విధమునఁ దీవ్ర వాయు హతిచేఁ జచ్చినం జూచి కోపించి - తరువాతిపద్యముతో నన్వయము

విశేషములు .అలంకార ముపమ

ఉ ఆహవదోహలుండు సుభటాగ్రణి దానవసేన కెల్ల ను
త్సాహము కాఁగఁ బేర్చి నిజ సామజ వాజి వరూధ పత్తి సం
దోహముతో నవార్యరణతూర్యము లొక్కట మ్రోయఁగా మహా
బాహుఁడు వచ్చి తాఁకె సురపాలవరూధిని పల్లటిల్లఁగాన్ 34

అర్థము. ఆహవ - దోహలుండు = యుద్ధోత్సాహము గలవాఁడు, సుభట + అగ్రణి = వీరాగ్రేసరుఁడు (అగు), మహాబాహుఁడు = మహాబాహుఁ డను పేరుగలవాఁడు, దానవ - సేనకున్ + ఎల్లన్ = రాక్షససేన కంతకును, ఉత్సాహము, కాఁగన్ = అగునట్లు, పేర్చి = విజృంభించి, నిజ - సామజ - వాజి - వరూధ - పత్తి - సందోహముతోన్ = తనవైన ఏనుఁగుల, గుఱ్ఱముల, రథముల, కాల్బంటుల సమూహముతో, అవార్య - రణ - తూర్యములు = వారింపరాని యుద్ధ వాద్యములు, మ్రోయన్ = ధ్వనింపఁగా, సుర - పాల - వరూధిని - ఇంద్రుని సేన, పల్లటిల్లఁగాన్ = చలింపఁగా, వచ్చి, తాఁకెన్

తాత్పర్యము. యుద్ధోత్సాహము గలవాఁడును, వీరాగ్రేసరుఁడును అగు మహాబాహుఁడు రాక్షససేనకంతకును ఉత్సాహము గలుగ విజృంభించి తన గజతురగరథపదాతి వర్గముతో యుద్ధవాద్యములు మ్రోయుచుండ, ఇంద్రుని సేన చలింపఁగా వచ్చి తాఁకెను

విశేషములు: పంక్తికి బదులుగా పత్తియనునది రా అ శర్మగారి పారము

వరుణ మెహాబాహుల యుద్ధము

వ ఇ ట్లమరపతాకినీకాంతారాంతరంబునం బర్వు మహాబాహు చతురంగబలదావానలంబుఁగని వరుణుం డపార వరుణాస్త్రసారంబున నశ్రమంబున నుపశాంతిఁబొందించి విజృంభించి మహాబాహుం దాఁకిన 35

అర్థము. ఇట్లు, అమర - పతాకినీ - కాంతార + అంతరంబునన్ = దేవసేనయను అడవిలోపల, పర్వు = వ్యాపించు, మహాబాహు = మహాబాహుని యొక్క, చతురంగ - బల - దావ + అనలంబున్ = రథ గజ తురగ పదాతి సైన్యమనెడి కార్చిచ్చును, కని, వరుణుండు, అపార - వరుణ + అస్త్ర + ఆసారంబునన్ = పారములేని వారుణాస్త్రములనెడి జడివానచే, అశ్రమంబునన్ = అనాయాసముగా, ఉపశాంతిన్ = ఉపశమమును - ఆఱుటను, పొందించి, విజృంభించి, మహాబాహున్, తాఁకినన్

తాత్పర్యము. ఇట్లు దేవసేనయనెడి అడవిలోపల వ్యాపించు మహాబాహుని చతురంగబలమనెడి కార్చిచ్చును జూచి వరుణుఁడు అపారవారుణాస్త్రములనెడు జడివానచే అనాయాసముగా ఆర్పివైచి విజృంభించి మహాబాహుని దాఁకఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము రూపకము

క ఆహవభూమి సురాసుర
వాహిను లొగిఁ దగిలి పొగడ వరుణుండు మహా
బాహుఁడుఁ దాఁకిరి పటు సమ
బాహుపరాక్రములు విశ్వభయజనకముగాన్ 36

అర్థము ఆహవ - భూమిన్ = యుద్ధభూమియందు, సుర + అసుర - వాహినులు = దేవతల రాక్షసుల సేనలు, ఒగిన్ = క్రమముగా, తగిలి = ఆసక్తి వహించి, పొగడన్ = పొగడఁగా, పటు -సమ - బాహు - పరాక్రములు = తీవ్రమయిన సమానమైన భుజపరాక్రమము గలవారు, (అగు), వరుణుండున్, మహాబాహుఁడున్ = వరుణ మహాబాహులు, విశ్వ - భయ - జనకము + కాన్ = లోకభీకరముగా, తాఁకిరి

తాత్పర్యము . యుద్ధభూమిలో దేవరాక్షససేనలు క్రమముగా నాసక్తి వహించి పొగడఁగా, సమానమైన తీవ్ర భుజ పరాక్రమము గలవారు అగు వరుణమహాబాహులు లోకభీకరముగాఁ దాఁకిరి

వ తదనంతరంబ = ఆ పిమ్మటనే - తరువాతి పద్యముతో నన్వయము 37

ఆ అలిగి వరుణుపై మహాబాహుఁడేసిన
యమ్ము లెల్లఁ దప్పి వమ్ములయ్యె
నట్ల పసిఁడియమ్ము లని నీర నేసిన
వారి తప్పుగాక వారి తప్పె 38

అర్థము : మహాబాహుఁడు, అలిగి = కోపించి, వరుణుపైన్, ఏసిన = ప్రయోగించిన, అమ్ములు + ఎల్లన్ = బాణములన్నియు, వమ్ములు+ అయ్యెన్ = వ్యర్థములయ్యెను అట్లు + అ = అది అట్లే, పసిఁడి + అమ్ములు + అని = బంగారు

బాణములని, నీరన్ + ఏసినన్ = నీటిలోఁ బ్రయోగించినచో, వారి తప్పు + కాక = ఏసినవారి తప్పుగాక, వారి - తప్పె = నీటి తప్పా? నారి - తప్పె అనుపార మున్నది అప్పుడు - నారి - తప్పె = వింటిఅల్లె త్రాటి తప్పా?

తాత్పర్యము మహాబాహుఁడు కోపముతో వరుణునిపైఁ బ్రయోగించిన బాణములన్నియు వ్యర్థము లయ్యెను అది యట్లే బంగారు బాణములని నీటఁ బ్రయోగించినచో ప్రయోక్తల తప్పుగాని, నీటి తప్పా? లేక వింటిత్రాటి తప్పా?

విశేషములు . అలంకారము దృష్టాంతము

వ ఇట్లు మహాబాహుండు తారకాసుర బలంబు విలయంబైనట్ల కాలాలయ నిలయుండ య్యె నంత 39

అర్థము . ఇట్లు, మహాబాహుండు, తారక + అసుర - బలంబు = తారకాసురుని సైన్యము, విలయంబు + ఐన + అట్లు + అ = నాశమునొందినట్లే, కాల + ఆలయ - నిలయుడు = యముని ఆలయము నిలయముగాఁగలవాఁడు, చచ్చినవాఁడు, అయ్యెన్, అంతన్

తాత్పర్యము . ఇట్లు మహాబాహుఁడు తారకాసురుని సైన్యము నాశనమొందినట్లే, యముని ఆలయము నిలయముగాఁగలవాఁడు - చచ్చినవాఁడు అయ్యెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు 'కలహాలయ నిలయుండు' - అను దానికి 'కాలాలయ నిలయుండు' అని రా అ కృ శర్మ గారి పారము

నిర్ఋతి అరణి దుర్వారులతో యుద్ధము చేయుట

క ఆరణిదుర్వారులు దు
ర్వార పరాక్రములు దివిజవర వారణ కం
ఠీరవులు వచ్చి తాఁకి ర
పారబలుల్ చాతురంగబలసంయుతులై. 40

అర్థము. దుర్వార - పరాక్రములు = వారింపశక్యముగాని పరాక్రము గలవారు, దివిజ - వర - వారణ - కంఠీరవులు = దేవతాశ్రేష్ఠులనెడి ఏనుఁగులకు సింహములైనవారు, అపార - బలుల్ = పారములేని బలము గలవారు అగు, ఆరణి - దుర్వారులు = ఆరణియును, దుర్వారుఁడును, అనువారు, చాతురంగ - బల - సంయుతులు + ఐ = చతురంగబలముతోఁ గూడినవారయి, వచ్చి, తాఁకిరి

తాత్పర్యము. దుర్వార పరాక్రములును, దేవతాశ్రేష్ఠులనెడి ఏనుఁగులకు సింహములైనవారును, అపారబలులును, అగు ఆరణి, దుర్వారుఁడు అనువారు, చతురంగబలములతోఁ గూడి వచ్చి తాఁకిరి

విశేషములు : అలంకారము రూపకము

క ఆ యిరువురు బహు రాక్షస
మాయా విదులగు టెటింగి మార్కొనుమని నా
రాయణుఁడు పంచె నిర్ఋతి ను
పాయజ్ఞు ననేక సమర పరిణతు నజితున్ 41

అర్థము ఆ + ఇరువురున్ = ఆ యిద్దటును = ఆరణి దుర్వారులు, బహు - రాక్షస - మాయా - విదులు = పెక్కు రాక్షసమాయలు తెలిసినవారు, అగుట, ఎటింగి, మార్కొనుము = వారి నెదురుకొనుము, అని నారాయణుఁడు = విష్ణువు, ఉపాయజ్ఞున్ = ఉపాయము తెలిసివాఁడును, అనేక - సమర - పరిణతున్= పలుయుద్ధములచే పరిపక్వత నొందిన వాఁడును, అజితున్ = జయింపఁబడనివాఁడును అగు, నిర్ఋతిన్, పంచెన్ = పంపెను

తాత్పర్యము ఆ ఆరణిదుర్వారు లను వీరు లిరువురును పలు రాక్షస మాయ లెటిఁగిన వారగుట యెటిఁగి వారి నెదుర్కొనుమని నారాయణుఁడు ఉపాయజ్ఞుఁడును, పెక్కుయుద్ధములందు పరిపక్వత నందినవాఁడును, ఓర్వరానివాఁడును అగు నిర్ఋతిని బంపెను

చ నిర్ఋతియు వారిమాయల కనిం బ్రతిమాయ లొనర్చిపేర్చి సం
గర మొనరింపఁబూని కడుఁగైపున మార్కొని తాఁకి వీఁక నా
యిరువుర మీఁద నొక్కట ననేక శిలీముఖ వృష్టి భోరనం
గురిసె సురారివాహినులకున్ లయకాలఘనాఘనాభమై 42

అర్థము. నిర్ఋతియున్, వారి - మాయలకున్, అనిన్ =యుద్ధమునందు, ప్రతిమాయలు = మాటుమాయలు, ఒనర్చి = చేసి, పేర్చి = విజృంభించి, సంగరము = యుద్ధము, ఒనరింపన్ + ఊని = చేయఁబూని, కడున్ = మిక్కిలి, కైపునన్ = కోపముతో, మార్కొని = ఎదురుకొని, వీఁకన్ = పరాక్రమముతో, ఆ + ఇరువుర - మీఁదన్ = ఆ యిద్దఱమీఁదను, ఒక్కటన్ = ఒక్కసారిగా, సుర + అరి -వాహినులకున్ = రాక్షససేనలనెడి నదులకు, లయ - కాల - ఘనా + ఘన

+ ఆభము + ఐ = ప్రళయసమయమునందలి వర్షాకాలపు మేఘముతో సమానమయి, అనేక - శిలీముఖ - వృష్టిన్ = పెక్కు బాణములనెడి వర్షమును, భోరనన్ = శీఘ్రముగా, కురిసెన్ = కురియించెను

తాత్పర్యము: నిర్ఋతియును వారి మాయలకు యుద్ధమునఁ బ్రతిమాయలు చేసి విజృంభించి యుద్ధమొనరింపఁబూని మిక్కిలి కోపమున ఎదురుకొని తాఁకి పరాక్రమముతో ఆ యిరువురిమీఁదను ఒక్కసారిగా రాక్షససేనలనెడి నదులకుఁ బ్రళయసమయవర్షామేఘసమానమయి పెక్కుబాణములనెడి వర్షమును బోరనఁ గురిసెను

విశేషములు . అలంకారము శ్లిష్టరూపకము, ఉపమ ఇందు మొదటి పాదమున 'నిరుబుతి' యనుపారముండెననియు, నది నన్నెచోడుని ప్రాచీనతకు నిదర్శనమనియు వీరరాజపంతులుగారి వాదము కాని 'నిర్ఋతియు' ననునదియే సరియైన పారమని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారి నిర్ణయము

వ అంత నారణిదుర్వారులు నిర్ఋతితో ననేకాయుధముద్దంబు చేసి జయింపనోపక రాక్షసవిద్యాబలంబున నితరజనసాధారణుండు కాఁడుగాఁ దలంచి మాయాయుద్ధంబు చేయ నుపక్రమించి 43

అర్థము . అంతన్, ఆరణిదుర్వారులు, నిర్ఋతితోన్, అనేక + ఆయుధ-యుద్ధంబు = పెక్కాయుధములతోడి యుద్ధము, చేసి, జయింపన్ + ఓపక = గెలువఁజాలక, రాక్షస - విద్యా - బలంబునన్, ఇతర - జన - సాధారణుండు - కాఁడు+ కాన్ + తలంచి = అన్యజనులవంటివాఁడుకాఁడని, యెంచి, మాయా - యుద్ధంబు, చేయన్, ఉపక్రమించి = ఆరంభించి

తాత్పర్యము: అంత నారణిదుర్వారులు నిర్ఋతితో పెక్కాయుధములతోడి యుద్ధమొనరించి, గెలువఁజాలక, రాక్షసవిద్యాబలమునందు ఇతరజనులవంటి వాఁడుకాఁడని యెంచి మాయాయుద్ధ మొనరింపఁబూని - తరువాతి పద్యముతో నన్వయము

క గిరులైన వజ్రమై, జల
ధరపటలములైన మారుతంబై, వడిఁ గే
సరులైనను శరభమ్మై
యురగము లగుటయు విహంగమోత్తముఁ డగుచున్ 44

అర్థము. గిరులు = కొండలు, ఐనన్ = అయినచో, వజ్రము + ఐ = వజ్రాయుధమయి, జలధర - పటలములు + ఐనన్ = మేఘముల గుంపయినచో, మారుతంబు + ఐ = వాయువయి, జలధర - పటలములు + ఐనన్ = మేఘముల గుంపయినచో మారుతంబు + ఐ = వాయువయి, వడిన్ = వేగముగా, కేసరులు + ఐనన్ = సింహములయినచో, శరభమ్ము + ఐ = శరభమృగమయి, ఉరగములు = పాములు, అగుటయున్, విహంగమ + ఉత్తముఁడు = పక్షిశ్రేష్ఠుఁడు - గరుత్మంతుఁడు, అగుచున్

తాత్పర్యము. అరణిదుర్వారులు కొండలైనచో నిర్భతి వజ్రమయి, వారు మేఘముల గుంపులయినచోఁ దాను వాయువయి, వారు సింహములయినచోఁ దాను శరభమృగమయి, వారు పాములయినచోఁ దాను గరుత్మంతుఁ డగుచు - తరువాతి గద్యముతో నన్వయము

వ ఇట్లు తమ మాయోపాయంబుల కగ్గలించుచున్న నిర్భతి నద్దనుజులు జయింపనోపక నిజస్వరూపంబులు గైకొని ఖడ్గ చర్మ ధరులై యొక్కటఁ బైకి లంఘించి సమకట్టివచ్చిన 45

అర్థము. ఇట్లు, తమ, మాయా + ఉపాయంబులకున్, అగ్గలించుచున్ + ఉన్న = విజృంభించుచున్న, నిర్భతిన్, ఆ + దనుజులు = ఆ రాక్షసులు, జయింపన్ + ఓపక = గెలువలేక, నిజ - స్వరూపంబులు, కైకొని, ఖడ్గ - చర్మ - ధరులు + ఐ = కత్తి, డాలు ధరించినవారయి, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, పైకిన్, లంఘించి = దూఁకి, సమకట్టి - వచ్చినన్ = పూనిరాఁగా

తాత్పర్యము. ఇట్లు తమ మాయోపాయములకు విజృంభించుచున్న నిర్భతిని ఆ రాక్షసులు గెలువఁజాలక స్వస్వరూపములు గైకొని కత్తులను డాలులను ధరించి, ఒక్కమాఱుగాఁ బైకి దూఁకి సిద్ధపడిరాఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క అరుదుగ రెండమ్ములు దొడి
యిరువుర వక్షములు వ్రయ్యనేసిన నార్చెన్
సురబలము లసురపుత్రులు
నిర్భతికి వెన్నిచ్చి రెదిరి నిల్వక భీతిన్ 46

అర్థము. అరుదుగన్ =ఆశ్చర్యముగా, రెండు + అమ్ములు = రెండు బాణములు, తొడి = తొడిగి, ఇరువుర - వక్షములున్ = ఇద్దఱ యొమ్ములును, వ్రయ్యన్ + ఏసినన్ = ముక్కలగునట్లు కొట్టఁగా, సుర - బలములు = దేవతల

సైన్యములు, ఆర్చెన్, అసుర - పుత్త్రులు = రాక్షసుని కుమారులు, భీతిన్ = భయముతో ఎదిరి = మార్కొని, నిల్వక, నిర్ఋతికిన్, వెన్నిచ్చిరి (వెన్ను + ఇచ్చిరి) = వెన్ను చూపిరి - పాటిపోయిరి

తాత్పర్యము నిర్ఋతి రెండుబాణములు తొడిగి ఇరువురు రాక్షసుల వక్షములను బ్రద్దలుగొట్టఁగా దేవసైన్యము లార్చెను రాక్షసపుత్త్రులు భయముతో మార్కొని నిలువక నిర్ఋతికి వెన్నుచూపిరి

యదు కేతుమాలుల యుద్ధము

వ ఇ ట్లారణిదుర్వారు లొక్కట నిర్ఋతి కోపాగ్నికిం బూర్ణాహుతు లగుటంగని కోపించి కేతుమాలి విలయకేతుమాలావలియుంబోలె దనుజ బలంబుతో నురుల కెత్తి ప్రళయ జలధర పటలంబు జలధిఁగప్పిన ట్లమరజలధిఁ గప్పిన నంతకుండు గని యుగాంత్యకాలాంతకుండునుంబోలెఁ గోపానలోద్దీపితాంతరంగుండై విజృంభించిన 47

అర్థము ఇట్లు, ఆరణిదుర్వారులు, ఒక్కటన్, నిర్ఋతి - కోప + అగ్నికిన్ = నిర్ఋతియొక్క కోపమనెడి అగ్నికి, పూర్ణ + ఆహుతులు = సంపూర్ణహోమములు = పూర్తిగా నశించినవారు, అగుటన్, కని, కోపించి, కేతుమాలి, విలయ - కేతు - మాలా + ఆవలియున్ + పోలెన్ = ప్రళయసమయధూమకేతువుల వరుసవలె, దనుజ - బలంబుతోన్ = రాక్షససేనతో, ఉరులన్ + ఎత్తి = పైనెత్తి, ప్రళయ - జలధర - పటలంబు = ప్రళయ కాలమేఘ సమూహము, జలధిన్ = సముద్రమును, కప్పిన + అట్లు, అమర - జలధిన్ = దేవతలనెడి సముద్రమును, కప్పినన్, అంతకుండు = యముఁడు, కని, యుగ + అంత్య - కాల + అంతకుండునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి యమునివలె, కోప + అనల +ఉత్ + దీపిత + అంతరంగుండు + ఐ = కోపమనెడి అగ్నిచే మిక్కిలి మండింపఁబడిన మనస్సుగలవాఁడయి, విజృంభించి

తాత్పర్యము . ఇట్లు, ఆరణియును దుర్వారుఁడును ఒక్కమాఱుగా నిర్ఋతి కోపాగ్నికి నశించుటఁజూచి కోపించి కేతుమాలి ప్రళయసమయమునందలి ధూమకేతుసమూహమువలె రాక్షస సైన్యముతోఁ బైనెత్తి ప్రళయమేఘసమూహము సముద్రమును గప్పిన విధమున దేవతలనెడి సముద్రమును గప్పఁగా, యముఁడు చూచి ప్రళయ కాలయమునివలె కోపమనెడి అగ్నిచే మండింపఁబడిన మనస్సు గలవాఁడయి విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకారము రూపకము, ఉత్ప్రేక్ష

చ దనుజబలంబుఁ దాఁకి, నిజదారుణభూరితరాస్త్రఘట్టనం
దునియలువాఱ నేసి, పటుదోర్బలగర్వవిగుర్వణంబులం
దనరి, వెలుంగుచుండె, నురుధామ బలంబున లోకమెల్లఁ గ
ప్పిన తిమిరంబు బిట్టడఁచి పేర్చి వెలుంగునినుండుపోలెనై 48

అర్థము. ఇందలి వెలుంగుచుండె నను క్రియకు పయి పద్యమునందలి అంతకుఁడు కర్త దనుజ - బలంబున్ = రాక్షస సైన్యమును, తాఁకి, నిజ - దారుణ - భూరి తర + అస్త్ర - ఘట్టనన్ = తనదైన భయంకరమైన మిక్కిలి గొప్ప అస్త్రహతిచే, తునియలు + పాఱన్ + ఏసి = ముక్కలగునట్లు కొట్టి, పటు - దోస్(ం) బల - గర్వ -విగుర్వణంబులన్ = తీవ్రమయిన భుజబలము వలని గర్వముయొక్క విజృంభణములచే, తనరి = ఒప్పి, ఉరు-ధామ - బలంబునన్ = గొప్ప తేజస్సు యొక్క బలముచే - ఉరు - దామ - బలంబునన్ అయి యుండునేమో -అప్పుడు ఉరు = గొప్పదియగు త్రాటి-పాశము యొక్క బలముచే నని అర్థము చెప్పవచ్చును లోకము + ఎల్లన్ = లోకమునంతను, కప్పిన, తిమిరంబున్ =చీఁకటిని, బిట్టు + అడఁచి = మిక్కిలి అణఁచివైచి, పేర్చి = విజృంభించి, వెలుంగు, ఇనుండు - పోలెన్ + ఐ = సూర్యునివలెనయి, వెలుంగుచున్ + ఉండెన్ = ప్రకాశించుచుండెను

తాత్పర్యము. (అంతకుఁడు) రాక్షస సైన్యమును దాఁకి, తన భయంకరము, భూరితరమునైన అస్త్రహతిచే ముక్కలుగా నేసి తీవ్రమయిన భుజబల గర్వవిజృంభణములచే నొప్పి గొప్ప తేజోబలమున - గొప్ప పాశబలమున లోక మంతయుఁ గప్పిన చీఁకటిని మిక్కిలి అణఁచివైచి విజృంభించి సూర్యుని వలె నయి, ప్రకాశించుచుండెను

విశేషములు. అలంకార ముపమ

**వ ఇట్లు కేతుమాలి బలంబు మహేంద్రజాలమాయాబలంబునుంబోలెఁ
జూడఁజూడ నదృశ్యంబైనఁ గని నిజబాహుబలసహాయుండై 49.**

అర్థము . ఇట్లు, కేతుమాలి- బలంబు, మహేంద్రజాల మాయాబలంబునున్ + పోలెన్ = మహేంద్రజాలమునందలి మాయాబలము వలె, చూడన్ + చూడన్, అదృశ్యంబు +ఐనన్ + కని= మాయముకాఁగాఁ జూచి, నిజ-బాహు-బల-సహాయుండు + ఐ = తన భుజబలము సహాయముగాఁగలవాఁడై

తాత్పర్యము ఇట్లు కేతుమాలి బలము మహేంద్రజాలమునందలి మాయాబలమువలె చూడఁగాఁ జూడఁగా మాయము కాఁగాఁ జూచి తన భుజబలము సహాయముగాఁ గలవాఁ డయి

విశేషములు. అలంకారము ఉపమ - తరువాతి పద్యముతో నన్వయము

క అయుతాశ్వవాహ్యము, మనో
రయ రవినిభ రుచిర రమణరధ మెక్కి జగ
ద్భయదాకారుండై యుగ
లయ భైరవ సదృశ విలయ లాలస బుద్ధిన్ 50

అర్థము. అయుత + అశ్వ - వాహ్యము = పదివేల గుట్టములచే లాగఁదగినది, మనస్(:) + రయ - రవి - నిభ -రుచిర - రమణ - రధము = మనోవేగము, సూర్యసదృశము, మనోహరము, ఒప్పినది అగు రధము, ఎక్కి జగత్ + భయద + ఆకారుండు = లోకములకు భయము గలిగించు రూపము గలవాఁడు, ఐ, యుగ-లయ-భైరవ-సదృశ - విలయ - లాలస - బుద్ధిన్= యుగాంతకాల భైరవునితో సమానమైన నాశనమునందు ఆసక్తిగల బుద్ధితో

తాత్పర్యము : పదివేల గుట్టములచే లాగఁదగినది, మనోవేగముగలది, సూర్యసదృశమయినది, రుచిరము, రమణము అగు రధమునెక్కి లోకభీకర రూపుఁడై ప్రళయ కాల భైరవ సదృశమైన - వినాశకరబుద్ధితో - తరువాతి పద్యముతో నన్వయము

వ తెరల నెత్తివచ్చి దండధరునిం దాఁకిన ముష్టిన కణయ కంపన ముసుంరి భిండివాల తోమర శూల చక్ర శక్తి ప్రముఖాఖిలాయుధవర్షంబు గురియుచున్న కేతుమాలింగని మహిషకేతుండు రౌద్ర వృషభకేతుండునుంబోలె నా దర్పించి 51

అర్థము. తెరలన్ + ఎత్తి - వచ్చి = పైకి దండెత్తివచ్చి, దండధరునిన్ = యముని, తాఁకిన - ముష్టిన్ + అ = తాఁకిన వెంటనే, కణయ - కంపన - ముసుంరి - భిండివాల - తోమర - శూల - చక్ర - శక్తి - ప్రముఖ + అఖిల + ఆయుధ - వర్షంబు = కణయము, కంపనము, ముసుంరి, భిండివాలము, తోమరము, శూలము, చక్రము, శక్తి మున్నగు నెల్ల ఆయుధముల వర్షము, కురియుచున్ + ఉన్న కేతుమాలిన్ + కని, మహిషకేతుండు = మహిషము (దున్న) ధ్వజముగాఁ

గలవాఁడు - యముఁడు, రౌద్ర - వృషభ-కేతుండునున్ + పోలెన్ = భయంకరుఁడైన వృషభధ్వజుని (శివుని) వలె, నాన్ = అనఁగా, దర్పించి = గర్వించి

తాత్పర్యము పైనెత్తివచ్చి యమునిఁ దాఁకినవెంటనే కణయము, కంపనము, ముసుంరి, భిండివాలము, లోమరము, శూలము, చక్రము శక్తి మున్నగు నెల్ల ఆయుధముల వాన కురియుచున్న కేతుమాలినిఁజూచి యముఁడు రుద్రునివలె గర్వించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

తే వాని కురియు ననేకాస్త్రవర్షమెల్ల
నశ్రమమున విఖండించి యరద సూత
రధ్య కోదండ కేతన రాజితోన
వర కిరీటంబు దెగి నేల నురల నేసె 52

అర్థము . వాని - కురియు = అతఁడు కురియించునట్టి, అనేక + అస్త్ర - వర్షము + ఎల్లన్ = పెక్కు బాణముల వానయెల్ల, అశ్రమమునన్ = అనాయాసముగా, విఖండించి = ముక్కలు చేసి, అరద - సూత - రధ్య - కోదండ - కేతన - రాజి-తోన్ + అ = రధముల, సారధుల ,గుఱ్ఱముల విండ్ల, ధ్వజముల వరుసతోపాటే, వర-కిరీటంబు = శ్రేష్ఠమైన కిరీటము, తెగి, నేలన్ = భూమిమీఁద, ఉరలన్ + ఏసెన్ = పడఁగొట్టెను

తాత్పర్యము . కేతుమాలి కురియించుచున్న పెక్కు బాణముల వర్షమంతయు అనాయాసముగా ముక్కలు చేసి రధముల, సారధుల, అశ్వముల, ధనుస్సుల, ధ్వజముల సమూహముతోపాటే వానిశ్రేష్ఠమైన కిరీటమును ఖండించి నేలఁబడవైచెను

విశేషములు . వాని - కురియు - వాఁడు కురియు 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యహహితావ్యవహిత కర్తృపద ప్రధమకుఁ దఱుచుగ యొక్క ష్ఠియగు ' ప్రౌఢ కారక 15 వానియొక్క కురియు 'యొక్కకు లోపంబు బహుళంబు' ప్రౌఢ కారక 16

వ ఇట్లు మనోరధారూఢుండై కేతుమాలి విరధుండయ్యును విజయమనోరధారూఢుండై ఖడ్గవర్మంబులు గైకొని మహారభసంబున 53

అర్థము . ఇట్లు, మనోరథ + ఆరూఢుండు + ఐ = మనస్సనెడి రథమునెక్కినవాఁడయి, కేతుమాలి, విరథుండు + అయ్యును = రథవిహీనుఁడయ్యును, విజయ - మనస్(ఃస్) - రథ + ఆరూఢుండు + ఐ = విజయమునందలి కోరిక గలవాఁడయి, ఖడ్గ - వర్మంబులు = కత్తి, కవచము, నైకొని,మహత్ (మహా) - రభసంబునన్ = మిక్కిలి వేగముతో

తాత్పర్యము ఇట్లు మనస్సనెడి రథము నెక్కినవాఁడయి కేతుమాలి రథవిహీనుఁడయ్యును, గెలువవలయుననను కోరికగలవాఁడయి, ఖడ్గము, కవచము నైకొని మిక్కిలి వేగముతో - తరువాతి పద్యముతో నన్వయము

ఏ **ఎయ్యని తనపై కుటికిన**
వ్రయ్యఁగ గద వ్రేసి దనుజు వధియించె జముం
డయ్యెడ దోషాచరుఁ డిల
నయ్యమదండాభిహతుఁ డగు డది యరుదే? 54

అర్థము ఎయ్యని = ఏయని - బాణ ప్రయోగము చేయని (?) తనపైకిన్, ఉటికినన్, వ్రయ్యఁగన్ = వ్రయ్యునట్లు, గద - వ్రేసి, జముండు = యముఁడు, దనుజున్ = రాక్షసుని, వధియించెన్ = చంపెను ఎయ్యెడన్ (ఏ+ఎడన్) = ఎందయినను, దోషా-చరుఁడు = రాత్రి సంచరించువాఁడు - రాక్షసుఁడు, దోష + ఆచరుఁడు = పాపముచేయువాఁడు, ఇలన్ = భూమియందు, ఆ + యమ - దండ + అభిహతుఁడు = ఆ యముని దండముచేఁ గొట్టఁబడినవాఁడు, అగుడు = అగుట, అది, అరుదే = ఆశ్చర్యమా?

తాత్పర్యము . బాణప్రయోగము చేయని తనపై కుఱుకఁగా నతఁడు వ్రయ్యునట్లు గదను బ్రయోగించి యముఁడు రాక్షసుని వధించెను ఎక్కడనైనను దోషా చరుఁడు - రాక్షసుఁడు - దోషము నాచరించువాఁడు యమదండహతుఁడగుట ఆశ్చర్యమా? కాదనుట

విశేషములు . అలంకారము అర్థాంతరన్యాసము - శ్లేషానుప్రాణితము

వ. **ఇట్లు కేతుమాలి సమరకేతనాలంకృతకేతనంబైన నమరులకు వెన్నిచ్చి తెరలంబాఱుచున్న పూర్వామరబలంబులం గనుంగొని** 55

అర్థము . ఇట్లు, కేతుమాలి, సమర - కేతన + అలంకృత - కేతనంబు + ఐనన్ = యుద్ధరంగమునం దలంకరింపఁబడిన ధ్వజము కాఁగా, (?) అమరులకున్ = దేవతలకు, వెన్నిచ్చి, పూర్వామర - బలంబులన్ = రాక్షససేనలను, కనుంగొని

తాత్పర్యము . ఇట్లు కేతుమాలి యుద్ధరంగమున నలంకరింపఁబడిన ధ్వజము కాఁగా, అమరులకు వెన్నిచ్చి పాఱిపోవుచున్న రాక్షసులను జూచి - తరువాతి పద్యముతో నన్వయము

క **ఆయత భుజ విక్రముఁడు గ**
జాయుత బల సులభుఁ డూర్జితైశ్వర్యుఁడు నా
నాయుధకోవిదుఁడు మహా
కాయుఁడు చనుదెంచి సురనికాయముఁ దాఁకెన్ 56

అర్థము ఆయత - భుజ - విక్రముఁడు = గొప్ప భుజపరాక్రమము గలవాఁడు, గజ + అయుత - బల - సులభుఁడు = పదివేల యేనుఁగుల సేనచే సులభుఁడు, ఊర్జిత + ఐశ్వర్యుఁడు = అధికమైన యైశ్వర్యము గలవాఁడు, నానా + ఆయుధ - కోవిదుఁడు = పెక్కు ఆయుధములందుఁ బండితుఁడు(అగు), మహాకాయుఁడు = మహాకాయుఁడను పేరుగల రాక్షసుఁడు, చనుదెంచి = వచ్చి, సుర - నికాయమున్ = దేవతల సమూహమును, తాఁకెన్

తాత్పర్యము గొప్ప భుజపరాక్రమము గలవాఁడును, పదివేల గజముల సేన గలవాఁడును, అధికమైన ఐశ్వర్యము గలవాఁడును అనేకాయుధములందుఁ బండితుఁడును అగు మహాకాయుఁడను రాక్షసుఁడు వచ్చి దేవతలను దాఁకెను

అగ్ని మహాకాయుల యుద్ధము

వ **ఇట్లు తాఁకి సురబలంబును విహతకోలాహలంబుగాఁ జేయుచున్న మహాకాయుంగని యగ్నిదేవుండు కాలాగ్నిరుద్రుండునుంబోలె నమర్షానలోద్దీపితాంతరంగుండై తెరలనెత్తివచ్చి మహాకాయుందాఁకి మహాయుద్ధంబు చేసి వాని రథసారథులతోన కేతుదండకోదండంబు లొక్కట విఱుగనేసినం గోపించి** 57

అర్థము . ఇట్లు, తాఁకి, సుర-బలంబును = దేవసేనను, విహత - కోలాహలంబుగాన్= కొట్టఁబడిన కలకలము గలదానినిగా - కలకలము లేనిదానినిగా, చేయుచున్ + ఉన్న, మహాకాయున్, కని, అగ్నిదేవుండు, కాల + అగ్ని - రుద్రుండునున్ + పోలెన్ = ప్రళయాగ్నివలె భయంకరుఁడైన విధమున, అమర్ష + అనల + ఉత్ + దీపిత + అంతరంగుండు + ఐ= కోపమనెడి అగ్నిచే మిక్కిలి ప్రకాశింపఁజేయఁబడిన మనస్సు గలవాఁడయి, తెరలన్ + ఎత్తి - వచ్చి = చండెత్తివచ్చి, మహాకాయున్, తాఁకి, మహత్(మహా) = యుద్ధంబు, చేసి, వాని -

రథ -సారథులతోన్ + అ = వానియొక్క రథసూతులతోపాటే, కేతు - దండ - కోదండంబులు = ధ్వజదండము, విల్లు, ఒక్కటన్, ఎఱుగన్ + ఏసినన్ = ఎఱుగఁగొట్టఁగా, కోపించి

తాత్పర్యము ఇట్లు తాఁకి దేవతల సైన్యమును సందడి లేనిదానినిగాఁ జేయుచున్న మహాకాయునిఁ జూచి అగ్నిదేవుఁడు ప్రళయసమయాగ్నివలె భయంకరుఁడైన విధమునఁ గోపాగ్నిచే మండింపఁబడిన మనస్సు గలవాఁడయి దండెత్తివచ్చి మహాకాయునిఁ దాఁకి మహాయుద్ధమొనరించి వాని రథసారథులతోనే కేతుదండమును వింటిని ఒక్కమాఱుగా ఎఱుగఁగొట్టఁగా, కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

చ దురమున నా సురారి విరథుండయి వేగమ పాఱుదెంచి దు
ర్భరమున వహ్నిపై కుఱికి పట్టుడు వహ్ని నిజస్వరూప మ
చ్చెరువుగఁ దాల్చి యద్దనుజుఁ జెచ్చెర భస్మముసేసె నెంత భీ
కరబలులయ్యు వహ్నిఁబడి కాలక మైమెయిఁ బోవనేర్తురే? 58

అర్థము. దురమునన్ = యుద్ధమునందు, ఆ - సుర + అరి = ఆ దేవ వైరి - రాక్షసుఁడు - మహాకాయుఁడు, విరథుండు + అయి = రథ విహీనుఁడయి, వేగము + అ = వేగమే, పాఱుదెంచి = పరువెత్తుకొనివచ్చి, దుర్భరమునన్ = దుస్సహముగా, వహ్నిపైకిన్ = అగ్నిమీఁదికి, ఉఱికి - పట్టుడున్ = ఉఱికి పట్టినంతనే, వహ్ని = అగ్ని, నిజ = స్వరూపము- స్వస్వరూపము, అచ్చెరువుగన్ = ఆశ్చర్యముగా, తాల్చి, ఆ + దనుజున్ = ఆ రాక్షసుని, చెచ్చెరన్ = శీఘ్రముగా, భస్మము చేసెన్ = బూడిద చేసెను ఎంత - భీకర - బలులు + అయ్యున్ = ఎంత భయంకరమయిన బలముగలవారైనను, వహ్నిన్ + పడి = అగ్నియందుఁబడి, కాలక, మైమెయిన్ = అనాయాసముగా, పోవన్ + నేర్తురే = పోవఁగలరా ?

తాత్పర్యము : యుద్ధమునందు ఆ రాక్షసుఁడు - మహాకాయుఁడు రథ విహీనుఁడయి వేగమే పరువెత్తుకొనివచ్చి దుస్సహముగా నగ్నిదేవునిపై కుఱికి పట్టుకొనినంతనే, అగ్ని స్వస్వరూపము నాశ్చర్యకరముగాఁ దాల్చి ఆ రాక్షసుని శీఘ్రముగా భస్మీకరించెను ఎంత భయంకరపరాక్రములైనను అగ్నియందుఁబడి కాలక అనాయాసముగాఁ బోఁగలరా?

విశేషములు. అలంకార మర్థాంతరన్యాసము

వ ఇట్లు మహాకాయుండు మహానలంబున కెఱఁగిన శలభంబునుంబోలె ననలు కోపానలాహతి భస్మసాత్కృతుండైనం గోపించి తనముందటం బన్ని నిలిచి సురవరుల కేమేమ చాలుదు మనుచున్న దంభకుంభోదరాది రాక్షసాధీశ్వర శుకచరాది దైత్యవరోత్కర భీకర దుష్కర ముష్కరాది నిశాచరాధినాయకానంత సామంతవరుల నమరవరులపై నొక్కట నెత్తుండని చేయి వీచుచు జంభాసురేంద్రుండు సురేంద్రుపై నురవడించి నడచుటఁ గని సురేంద్రుం డయ్యసురేంద్రునకుం బ్రతిఘటించి నిలిచి మహాఘోరయుద్ధంబు చేయందొడంగినట్టి యవసరంబున 59

అర్థము ఇట్లు మహాకాయుండు, మహత్ (మహా) + అనలంబునకున్ = గొప్ప అగ్నికి, ఎఱఁగిన = దూఁకిన, శలభంబునున్ + పోలెన్ = మిడుతవలె, అనలు - కోప + అనల - ఆహతిన్ = అగ్నిదేవుని కోపమనెడి అగ్నిదెబ్బకు, భస్మసాత్కృతుండు + ఐనన్ = భస్మముతోఁ దాద్రూప్యమునొందింపఁబడినవాఁడు కాఁగా, కోపించి, తన ముందటన్, పన్ని = సిద్ధపడి, నిలిచి, సుర - వరులకున్ = దేవతాశ్రేష్ఠులకు, ఏము + ఏము + అ = మేము మేమే, చాలుదుము, అనుచున్ = ఉన్న, దంభ - కుంభోదర + ఆది - రాక్షస + అధి + ఈశ్వర = దంభుఁడు, కుంభోదరుఁడు మున్నగు రాక్షసరాజుల, శుకచర + ఆది - దైత్యవర + ఉత్కర = శుకచరుఁడు మున్నగు దైత్య శ్రేష్ఠుల సమూహము, భీకర - దుష్కర-ముష్కర + ఆది - నిశాచర + అధినాయక = భీకరుఁడు, దుష్కరుఁడు, ముష్కరుఁడు, మున్నగు రాక్షసప్రభువుల, అనంత సామంత వరులన్ = పెక్కండ్రు సామంతరాజులను అమర - వరులపైన్ = దేవతాశ్రేష్ఠులపై, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, ఎత్తుండు + అని = దండెత్తుఁడని, చేయి - వీచుచున్ = ఉత్సాహపఱుచుచు, జంభ + అసుర + ఇంద్రుండు = జంభుఁడను రాక్షసశ్రేష్ఠుఁడు, సుర + ఇంద్రుపైన్ = దేవేంద్రుని మీఁద,ఉరవడించి = విజృంభించి, నడచుటన్, కని, సుర + ఇంద్రుండు, ఆ + అసుర + ఇంద్రునకున్ = ఆ రాక్షసశ్రేష్ఠునకు, ప్రతిఘటించి = ఎదిరి, నిలిచి, మహత్ (మహా) + ఘోర -యుద్ధంబు = మిక్కిలి భయంకరమైన యుద్ధము, చేయన్ + తొడంగిన + అట్టి + అవసరంబునన్ = చేయఁబూనినట్టి సమయమున-

తాత్పర్యము ఇట్లు మహాకాయుఁడు మహాగ్నియందు దూఁకిన మిడుతవలె అగ్నిదేవుని కోపాగ్నిహతిచే భస్మీకృతుఁడు కాఁగాఁ గోపించి, తన ముందు, సిద్ధపడి నిలిచి, 'దేవతలకు మేమే మేమే చాలుదు' మనుచున్న దంభుఁడు, కుంభోదరుఁడు

మున్నగు రాక్షసప్రభువులను, శుకచరుఁడు మున్నగు దైత్యవరుల సమూహమును, భీకరుఁడు, దుష్కరుఁడు, ముష్కరుఁడు మున్నగు రాక్షసరాజుల పెక్కండ్ర సామంత రాజులను దేవతలపై నొక్కమాఱుగా దెండెత్తుఁడని యుత్సాహపఱుచుచు జంభుఁడను రాక్షసరాజు దేవేంద్రునిపై విజృంభించి నడచుటఁ జూచి దేవేంద్రుఁడు ఆ రాక్షసరాజును మార్కొని నిలిచి మిక్కిలి భయంకరమైన యుద్ధము చేయఁబూనిన సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

సీ అసదృశులై యష్టవసువులు దంభ కుం
భోదర ప్రముఖుల నోర్చి రాజి
నత్యుగ్రులై ద్వాదశాదిత్యు లురు శుక
చర ముఖ్యరిపుల మస్తములు గొనిరి
కైపునఁ దాఁకి యేకాదశరుద్రు లు
త్కల భీకరాఖ్యుల గెలిచి రెదిరి
విశ్వైకహితమూర్తు లశ్విను లిరువురు
ముష్కర దుష్కరుల్ మొదలు గాఁగ

తే బహువిధాసురనాథుల బలిమి మెఱసి
వారి బలములు లోనుగ వాసవునకు
నడ్డమై పోరి నిర్జించి రాసురమున
సురలు ముప్పది మువ్వురుం దెరల నెత్తి. 60

అర్థము. అష్ట - వసువులు = ఎనమండ్రు వసువులు, అసదృశులు + ఐ = సాటిలేనివారయి, దంభ - కుంభోదర - ప్రముఖులన్ = దంభుఁడు కుంభోదరుఁడు మున్నగువారిని, ఆజిన్ = యుద్ధమున, ఓర్చిరి = ఓడించిరి

ద్వాదశ + ఆదిత్యులు = పండ్రెండుగురు సూర్యులు, అతి + ఉగ్రులు + ఐ = మిక్కిలి భయంకరులయి, ఉరు - శుకచర - ముఖ్య - రిపుల = గొప్పవారైన శుకచరుఁడు మున్నగు శత్రువుల యొక్క, మస్తములన్ = శిరస్సులను, కొనిరి = వధించిరి

ఏకాదశ - రుద్రులు = పదునొకండ్రురుద్రులు, కైపునన్ = కోపముతో, తాఁకి, ఉత్కల - భీకర + ఆఖ్యులన్ = ఉత్కలుఁడు, భీకరుఁడు అను పేరులుగల వారిని, ఎదిరి, గెలిచిరి

నిశ్వ + ఏక - హిత - మూర్తులు = లోకమునకు ముఖ్యమైన శ్రేయస్సు రూపుగాఁ గలవారు, అశ్వినులు = అశ్వినీదేవతలు, ఇరువురున్ = ఇద్దఱును, సురలు = దేవతలు, ముప్పది మువ్వురున్, తెఱలన్ - రాఁగా, ఎత్తి = దండెత్తి, ముష్కర - దుష్కరుల్ = ముష్కరుఁడును, దుష్కరుఁడును, మొదలు + కాఁగన్ = మున్నుగా, బహు - విధ + అసుర - నాథులన్ = పెక్కురీతులయిన రాక్షసరాజులను, బలిమి - మెఱసి = పరాక్రమము ప్రకాశించి, వారి - బలములు = వారి సేనలు, లోనుగన్ = వశపడఁగా, వాసవునకున్ = ఇంద్రునకు, అడ్డము + ఐ = పోరి, ఆసురమునన్ = రాక్షసముగా, నెర్జించిరి = జయించిరి

తాత్పర్యము అష్టవసువులు సాటిలేనివారయి దంభుఁడు, కుంభోదరుఁడు మున్నగువారిని యుద్ధమున నోడించిరి ద్వాదశాదిత్యులు మిక్కిలి భయంకరులయి శుకచరుఁడు మున్నగు శత్రువుల శిరస్సులను వధించిరి ఏకాదశరుద్రులు కోపమునఁదాఁకి ఉత్కలుఁడు, భీకరుఁడు అనువారి నెదిరించి గెలిచిరి విశ్వహిత మూర్తులైన అశ్వినీదేవత లిరువురును ముష్కరుఁడు, దుష్కరుఁడు మున్నుగాఁ బెక్కు రీతులయిన రాక్షసరాజులను పరాక్రమము మెఱసి వారి సైన్యములు వశపడఁగా, దేవతలు ముప్పది మువ్వురును దండెత్తిరా, నింద్రునకు అడ్డమయి యుద్ధముచేసి, రాక్షసమున జయించిరి

వ ఇట్లు నిజానంతసామంతసంతానంబంతయు నొక్కటఁ గృతాంత నికేత నాంతర్గతు లగుటం గని కోపించి జంభాసురుం డపారచతురంగబల సమన్వితుండై సురవీరులపై నురులనెత్తి లయకాల నీల ఘనాఘనంబునుంబోలె ననేకాస్త్రవర్షంబులు కురిసినఁ దదీయాతిహేతిప్రహతి కబ్బగిపక వెన్నిచ్చి 61

అర్థము. ఇట్లు, నిజ + అనంత - సామంత - సంతానంబు + అంతయున్ = తనదైన అంతులేని సామంతుల సమూహమంతయును, ఒక్కటన్ = ఒక్కమాటుగా, కృతాంత - నికేతన + అంతర్గతులు = యముని గృహము లోపలికిఁబోయినవారు - చచ్చినవారు, అగుటన్ + కని, కోపించి, జంభ + అసురుండు, అపార -చతురంగ - బల - సమన్వితుండు + ఐ = పారములేని చతురంగబలముతోఁ గూడినవాఁడయి, సుర-వీరులపైన్ = దేవవీరులపై, ఉరులన్ + ఎత్తి = దండెత్తి, లయ-కాల -నీల ఘనా - ఘనంబునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి నల్లని వర్షాకాలపు మేఘమువలె, అనేక + అస్త్ర - వర్షంబులు = పెక్కు అస్త్రములనెడి వానలు, కురిసినన్, తదీయ + అతి - హేతి - ప్రహతికిన్ = వారి మిక్కిలియైన కత్తుల దెబ్బకు, అబ్బగింపక = తాళలేక, వెన్నిచ్చి = పాఱిపోయి

తాత్పర్యము ఇట్లు, తన అంతులేని సామంతుల సమూహమంతయు ఒక్కమాఱే చచ్చుటఁ జూచి కోపించి జంభాసురుండు అపారములైన చతురంగ బలములతోఁ గూడినవాఁడయి దేవవీరులపై దండెత్తి ప్రళయసమయమునందలి నల్లనివర్షాకాలమేఘమువలె పెక్కుబాణములనెడి వర్షములు కురియఁగా వారి అమితమైన కత్తుల దెబ్బకుఁ దాళలేక వెనుదిరిగి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు.లయకాల పోలె అలంకారముపమ అనే కాస్త్రవర్షంబులు - అలంకారము రూపకము

ఉ ఆకుల మంది నిర్జరచయంబు భయంబునఁ దల్లడిల్ల నీ
రాకర మెల్లఁగట్టవిసిన ట్లురులం బఱతెంచుచున్నచోఁ
జేకొని నిల్చె సూర్యకులశేఖరుఁ డాదినరేంద్రవర్యుఁ డి
క్ష్వాకుఁడు వీఁకఁదాఁకె సురవైరిబలంబుల లీలఁ దోలుచున్ 62

అర్థము . నిర్జర - చయంబు = దేవతల సమూహము, ఆకులము + అంది= కలఁతఁజెంది, భయంబునన్, తల్లడిల్లన్ = సంచలింపఁగా, నీరాకరము + ఎల్లన్ = సముద్రమంతయు, కట్ట + అవిసిన + అట్లు = గట్టు తెగిన విధమున, ఉరులన్ + పఱతెంచుచున్ + ఉన్నచోన్ = పరువెత్తివచ్చుచుండఁగా, సూర్య-కుల-శేఖరుఁడు = సూర్యవంశశ్రేష్ఠుఁడు, ఆది-నర+ఇంద్ర-వర్యుఁడు = పూర్వరాజులలో శ్రేష్ఠుఁడు, అగు, ఇక్ష్వాకుఁడు, చేకొని - స్వీకరించి, నిల్చెన్, సుర-వైరి-బలంబులన్=రాక్షససైన్యములను, లీలన్= విలాసముగా, తోలుచున్ = తఱుముచు, వీఁకన్ = పరాక్రమముతో, తాఁకెన్,

తాత్పర్యము . దేవతల సమూహము భయమునఁ గలఁగి తల్లడిల్లి సముద్రమంతయు గట్టు తెగిన విధమునఁ బరువెత్తి వచ్చుచుండఁగా, సూర్యవంశ శ్రేష్ఠుఁడును, ఆదిరాజశ్రేష్ఠుఁడును అగు ఇక్ష్వాకుఁడు వారిని స్వీకరించి నిలిచెను రాక్షససైన్యములను విలాసముగాఁ దఱుముచుఁ బరాక్రమముతోఁ దాఁకెను

విశేషములు : అలంకార ముపమ

ఇక్ష్వాకుఁడు పెక్కండ్రు రాక్షసులను జంపుట

క నరభోజను లి ట్లోటఱి
నరునకు వెన్నిచ్చి తూలినం గని కోపా
తురులగుచు ధూమ్రధుర్దరు
లరగొన కిక్ష్వాకుఁ దాఁకి రతిరభసమునన్. 63

అర్థము నర-భోజనులు = రాక్షసులు, ఇట్లు, ఓటటి = ఓడిపోయి, నరునకున్ = మానవునకు, వెన్నిచ్చి = వెనుదిరిగి, తూలినన్ = చలింపఁగా, కని, ధూమ్ర - ధుర్దరులు = ధూమ్రుఁడు, ధుర్దరుఁడు అనువారు, కోప + ఆతురులు + అగుచున్ = కోపముచే బాధనొందినవారు అగుచు, అరగొనక = జంకక, అతి - రభసమునన్ = మిక్కిలి వేగముతో, ఇక్ష్వాకున్, తాఁకిరి

తాత్పర్యము రాక్షసు లీ ఎఱముగా నోడిపోయి మానవునకు వెన్నిచ్చి పాఱిపోఁగాఁ జూచి, ధూమ్రుఁడు, ధుర్దరుఁడు అనువారు కోపపీడితులగుచు జంకక మిక్కిలి వేగముతో నిక్ష్వాకునిఁ దాఁకిరి

క ఆ యిరువుర రెండమ్ముల
నాయతభుజుఁడేసి పేర్చి యార్చినఁ గని కో
పాయత్తచిత్తుఁడై నర
నాయకుఁ ద్రిశిరుఁ డను దనుజ నాథుఁడు తాఁకెన్. 64

అర్థము ఆయత - భుజుఁడు = అమితమైన భుజబలము గలవాఁడు - అగు ఇక్ష్వాకుఁడు, ఆ + ఇరువురన్ = ఆ ఇద్దఱను - ధూమ్రధుర్దరులను,రెండు + అమ్ములన్ = రెండు బాణములతో, ఏసి =కొట్టి, పేర్చి = విజృంభించి, ఆర్చినన్ = ఆర్వఁగా, కని, త్రిశిరుఁడు, అను, దనుజ - నాథుఁడు = రాక్షసరాజు, కోప + ఆయత్త - చిత్తుఁడు + ఐ = కోపమునకు వశమైన మనస్సు గలవాఁడయి, నర-నాయకున్ = మనుష్యనాథుని, ఇక్ష్వాకున్ = ఇక్ష్వాకుని, తాఁకెన్

తాత్పర్యము . అమితభుజబలముగల ఇక్ష్వాకుఁడు ఆ యిద్దఱను - ధూమ్రధుర్దరులను రెండు బాణములచేఁ గొట్టి విజృంభించి ఆర్వఁగాఁ జూచి త్రిశిరుఁడనెడి రాక్షసరాజు కోపమునకు వశమైన చిత్తముగలవాఁడయి ఇక్ష్వాకురాజును దాఁకెను

వ ఇట్లు తాఁకి మహాఘోరయుద్ధంబు చేయుచున్న త్రిశిరాసురేంద్రు నిక్ష్వాకునరేంద్రుఁడు కని కోపించి వాని కరచరణశిరంబు లొక్కపెట్టఁదెగనేసి మేలువాడి జంభాసురేంద్రుం గిట్టి ముట్టి మూదలించిన నతని కవిదల కబ్బగింపక గుండ్రించి జంభాసురేంద్రుం డమరేంద్రుపైఁ దెరలనెత్తి తన కెదురెత్తు సిద్ధుల నప్రసిద్ధులంజేసి, సాధ్యుల హేలాసాధ్యులం జేసి, విద్యాధరులఁ దృణధరులం జేసి, వియచ్చరుల వియచ్చరులం జేయుచుఁ జనుదెంచి, నానా విధ ప్రహరణ ప్రహతిం గప్పుచున్న తన్నుఁ దృణీకరించి, ప్రతిఘటించి నిల్చిన సురేంద్రు నసురేంద్రుండు కని కోపహాసవిలసనాననుం డగుచు 65

అర్థము. ఇట్లు, తాఁకి, మహత్ (మహా) + ఘోరయుద్ధంబు, చేయుచున్+ ఉన్న, త్రిశిర + అసుర + ఇంద్రున్ = త్రిశిరుఁడను రాక్షసశ్రేష్ఠుని, ఇక్ష్వాకు - నర+ ఇంద్రుఁడు = ఇక్ష్వాకు రాజు, కని, కోపించి, వారి - కర - చరణ - శిరంబులు = వానిచేతులు పాదములు, శిరస్సులు, ఒక్క - పెట్టన్ = ఒక్కమాఱుగా, తెగన్ + ఏసి = తెగఁగొట్టి, మేలువాడి = విజృంభించి (?) జంభ + అసుర + ఇంద్రున్ = జంభరాక్షసశ్రేష్ఠుని, కిట్టి = సమీపించి, ముట్టి - మూదలించినన్ = హెచ్చరింపఁగా, అతని - కవిదలకున్ = అతని ఆక్రమణమునకు, అబ్బగింపక = సహింపక, గుండ్రించి = తిరుగాడి, జంభ + అసుర + ఇంద్రుండు, అమర + ఇంద్రుపైన్ = దేవేంద్రునిమీఁద తెరలన్ + ఎత్తి = దండెత్తి, తనకున్ + ఎదురు + ఒత్తు - సిద్ధులన్ = మార్కొను సిద్ధులను, అప్రసిద్ధులన్ + చేసి = పేరులేనివారినిగాఁ జేసి, సాధ్యులన్, హేలా - సాధ్యులన్ + చేసి, సులభసాధ్యులనుగాఁ జేసి, విద్యాధరులన్, తృణ-ధరులన్ + చేసి = గడ్డికఱచినవారినిగాఁ జేసి, వియచ్చరులన్, వియత్ + చరులన్ = ఆకాశమునందు సంచరించువారినిగా, చేయుచున్, చనుదెంచి = వచ్చి, నానావిధ - ప్రహరణ - హతిన్ = పెక్కు రీతులైన ఆయుధముల దెబ్బచే, కప్పుచున్ + ఉన్న = ఆక్రమించుచున్న, తన్నున్, తృణీకరించి = తిరస్కరించి, ప్రతిఘటించి = ఎదిరించి, నిల్చిన, సురేంద్రున్ = దేవేంద్రుని, అసుర + ఇంద్రుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, కని,కోప - హాస - విలసన + అననుండు = కోపము నవ్వు అనువానిచేఁ బ్రకాశముగల ముఖముగలవాఁడు, అగుచున్

తాత్పర్యము. ఇట్లు తాఁకి మిక్కిలి భయంకరమైన యుద్ధము చేయుచున్న త్రిశిరుఁడను రాక్షసశ్రేష్ఠుని ఇక్ష్వాకురాజుచూచి, కోపించి, వాని చేతులను గాళ్లను, శిరస్సులను ఒక్కమాఱుగా ఖండించి విజృంభించి, జంభరాక్షసుని సమీపించి హెచ్చరింపఁగా, అతని ఆక్రమణమునకు సహింపక, తిరుగాడి జంభాసురుఁడు దేవేంద్రునిపై దండెత్తి, తన్ను ఎదిరించిన సిద్ధులను ఓడించి, సాధ్యులను సులభముగా సాధించి, విద్యాధరులను గడ్డికఱపించి, వియచ్చరులను ఆకాశమున కెగురఁగొట్టి, వచ్చి అనేకవిధములైన బాణములదెబ్బచేఁ గప్పుచున్న తన్నుఁదిరస్కరించి ప్రతిఘటించి నిలిచిన దేవేంద్రుని రాక్షసరాజు చూచి కోపహాసములచే విలసిల్లు ముఖము గలవాఁడగుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. వియచ్చరులు - వియత్ + చరులు - సకారత వర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గవర్ణము లాదేశ మగును

ఇంద్ర జంబాసురల యుద్ధము

ఉ 'ఈ సురరాజు నేఁడు తన కెక్కఁడి బీరము వచ్చెఁ బేర్పుతో
నీసున నాకుఁ జక్కనెదురెత్తి నిజంబున నున్నవాఁ డనిం
జా సమకట్టె నింకఁ దను షణ్ముఖుకాచుట సూతమంచు జం
భాసురుఁ డింద్రుఁ దాఁకెఁ ద్రిదశాలి కదంబు భయంబు పొందఁగాన్ 66

అర్థము ఈ - సుర - రాజు = ఈ దేవేంద్రుఁడు, నేఁడు, తనకున్, ఎక్కఁడి - బీరము - పరాక్రమము, వచ్చెన్, పేర్పుతోన్ = అతిశయముతో, ఈసునన్ = కోపముతో, నాకున్, చక్కన్, తిన్నఁగా, ఎదురు + ఎత్తి, నిజంబునన్ + ఉన్నవాఁడు = నిశ్చయముగా నున్నాఁడు, అనిన్ = యుద్ధమునందు, చాన్ = చావన్ = చచ్చుటకు, సమకట్టెన్ = పూనెను, ఇంకన్, తనున్ = తన్ను, షష్(ట్) + ముఖు-కాచుట = కుమారస్వామి కాచుట, చూతము, అంచున్, జంభ + అసురుఁడు, త్రిదశ + అలి = దేవతల సమూహము, కదంబు = మిక్కిలి, భయంబు +పొందఁగాన్ = భయపడఁగా, ఇంద్రున్, తాఁకెన్

తాత్పర్యము. 'ఈ దేవేంద్రుఁడు - నేఁ డీతని కెక్కఁడి పరాక్రమము వచ్చెను! - అతిశయించి కోపముతో నా కెదురుగా నిల్చియున్నాఁడు ఇతఁడు యుద్ధమునఁ జావ సమకట్టెను ఇంకఁ దన్నుఁ గుమారస్వామి రక్షించుట చూత మనుచు జంభాసురుఁడు దేవతలుమిక్కిలి భయపడఁగా నింద్రునిఁ దాఁకెను

విశేషములు. ఈ సురరాజు నేఁడు తన కెక్కఁడి బీరము వచ్చె - 'కొన్ని యెడల వాక్యంబు వాక్యాంతర గర్భంబు నగు' ప్రౌఢ వాక్య 21 షణ్ముఖుకాచుట - షణ్ముఖుఁడు కాచుట - షణ్ముఖుని యొక్క కాచుట - షణ్ముఖు కాచుట - ప్రౌఢ కారక 15, 16

ఉ **చండతరప్రతాపబలసంయుతు, లూర్జితశక్తియుక్తు, లా**
ఖండల జంభు లొండొరులకంటె బలంబుఁ జలంబుఁ గాయ్వు నొం
డొండ మనంబులోఁ దనర మూఁడ కేసిరి బాణసంహతిన్
రెండు బలంబులం బొరిఁబొరిం గడికండలుగా దురంబునన్ 67

అర్థము. చండతర - ప్రతాప - బల - సంయుతులు = తీవ్రతరమైన ప్రతాపము, పరాక్రమము అనువానితోఁగూడుకొన్నవారు, ఊర్జిత - శక్తి - యుక్తులు గొప్పశక్తితోఁగూడినవారు, (అగు) ఆఖండల - జంభులు = ఇంద్రుఁడును, జంభుఁడును, ఒండొరులకంటెన్ = ఒకరికంటె నొకరు, బలంబున్, చలంబున్ =

పట్టుదలయు, కాయ్యున్ = కోరికయు, ఒండొండ = క్రమక్రమముగా, మనంబులోన్= మనస్సులో, తనరన్ = ఒప్పఁగా, ఊఱడక = శాంతింపక, రెండు - బలంబులన్ = రెండు సైన్యములను, పొరిఁబొరిన్ = మాటిమాటికి, దురంబునన్ = యుద్ధములో, కడికండలు + కాన్ = ముక్కలగునట్లు, బాణ - సంహతిన్ = బాణముల సమూహమును, ఏసిరి = ప్రయోగించిరి

తాత్పర్యము తీవ్రతరమైన ప్రతాపపరాక్రమములు గలవారును, గొప్ప శక్తి గలవారును అగు ఇంద్రజంభులు, ఒకరికంటె నొకరికి మనస్సులోఁ గ్రమముగా బలము,చలము, కోరిక ఒప్పఁగా, యుద్ధములో రెండుసైన్యములను మాటిమాటికి ముక్కలుగా బాణసమూహమును శాంతింపక ప్రయోగించిరి

వ **ఇట్లు ధనుర్విద్యానేకాయుధకౌశలంబులు మెఱసి గజారోహణపరిణతి మెఱయ నుద్యుక్తులై నిజగజంబుల మొగవడంబులెత్తి యొండొంటిం జూపిన** 68

అర్థము ఇట్లు ధనుస్ (ం) + విద్యా + అనేక + ఆయుధ - కౌశలంబులు = విలువిద్యయందు, పె క్కాయుధములందు నేర్పులు, మెఱసి = మెఱయించి, గజ + ఆరోహణ - పరిణతి = ఏనుఁగు నెక్కుటయందు పరిపక్వత, మెఱయన్ = మెఱయించుటకు, ఉద్యుక్తులు + ఐ = పూనినవారయి, నిజ - గజంబుల - మొగవడంబుల = తమయేనుఁగుల ముఖకవచములు, ఎత్తి, ఒండొంటన్ = ఒకదానినొకటి, చూపినన్

తాత్పర్యము. ఇట్లు విలువిద్యయందలి, పెక్కాయుధములందలి నేర్పులు మెఱయించి గజారోహణపాండిత్యము మెఱయింప నుద్యమించినవారయి తమ యేనుఁగుల ముఖకవచము లెత్తి ఒకదానికొకటి చూపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు: మెఱసి - మెఱయించి - 'కరుఁగు తలఁగు మెఱ య్యాదు లంతర్భావితప్రేరణంబులు ' ప్రౌఢ క్రియ 34

క **ఆంక గొన కుభయబలములుఁ**
బొంకం బఱి తలరి పెలర భువి గ్రక్కదలన్
వీంక మదకరులు రెండుం
దాంకె వడిం గొండఁ గొండ తాఁకిన భంగిన్ 69

అర్థము. ఉభయ-బలములున్ = రెండు సైన్యములును, ఆంక - ఆఁక + కొనక = అడ్డులేక, పొంకంబు + అటి = గర్వము నశించి, తలరి = చలించి, పెలరన్ = తొలఁగఁగా, భువి = భూమి, గ్రక్కదలన్ = కంపింపఁగా, వీంకన్ = పరాక్రమముతో, మద - కరులు - రెండున్ = మదపుటేనుఁగులు, రెండును, కొండన్ - కొండను, కొండ, తాఁకిన - భంగిన్ = తాఁకిన విధమున, వడిన్ = వేగముగా, తాంకెన్ = తాఁకెను

అర్థము రెండ సేనలును అడ్డులేక గర్వము నశించి చలించి తొలఁగఁగా, భూమి కంపింపఁగా, మదగజములు రెండును, పరాక్రమముతో కొండను గొండ తాఁకిన విధమున వడిగాఁ దాఁకెను

విశేషములు. అలంకార ముపమ - అర్థానుస్వారయుక్తరూపములను పూర్ణానుస్వారయుక్తములుగాఁ బ్రయోగించుట నన్నెచోడని ప్రాచీనతకు నిదర్శనము

వ అట్లు కోపావేశంబునం దలపడి 70

అర్థము. అట్లు, కోప + ఆవేశంబునన్ = కోపోద్రేకముతో, తలపడి = ఎదుర్కొని

తాత్పర్యము. అట్లు కోపోద్రేకముతో నెదుర్కొని - తరువాతి పద్యముతో నన్వయము

చ ఘనతరదీర్ఘ దంతములు కైపున నూఁతియుఁ, గేలు గేలుతోఁ
బెనఁచియుఁ, బట్టి రాఁదిగిచి పెల్కుఱఁ ద్రోచియు, నెత్తి ద్రోచినన్
వెనుకన నిల్చియుం, గదియ వీఁకున జంగమపర్వతంబులో
యన దివిజేంద్రుదంతి దివిజాహితదంతులు పొల్చెఁ బోరిలోన్ 71

అర్థము. ఘనతర - దీర్ఘ - దంతములు = మిక్కిలి పొడవైన దంతములు, కైపునన్ = కోపముతో, నూఁతియున్, కేలు = తొండము, కేలుతోన్ = తొండముతో, పెనఁచియున్ = పెనవైచియు, పట్టి = పట్టుకొని, రాన్ = వచ్చునట్లు, తిగిచి = లాగి, పెల్కుటన్ = భయపడునట్లు, త్రోచియున్, ఎత్తి, త్రోచినన్ = త్రోయఁగా, వెనుకన్ + అ =వెనుకనే, నిల్చియున్, వీఁకునన్ = పరాక్రమముతో, కదియన్ = సమీపింపఁగా, జంగమ - పర్వతంబులో + అనన్ = చలించు కొండలో యనునట్లు, దివిజ + ఇంద్రు - దంతి - దివిజ + అహిత-దంతులు= దేవేంద్రుని ఏనుఁగు, రాక్షసుని యేనుఁగు, పోరిలోన్ = యుద్ధములో, పొల్చెన్ = ఒప్పెను

తాత్పర్యము: యుద్ధములో దేవేంద్రుని, రాక్షసుని యేనుఁగులు మిక్కిలి పొడవైన దంతములు కోపముతో రాచియు, తొండమును తొండముతోఁ బెనవైచియు ఒకదానినొకటి పట్టివచ్చునట్లు లాగి భయంకరముగాఁ ద్రోచియు, పైకెత్తి త్రోయఁగా వెనుకనే నిలిచియు, పరాక్రమముతోఁ గదియఁగాఁ జలించు పర్వతములో యనఁ బొలిచెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష, స్వభావోక్తి

వ ఇ ట్లనేక ప్రకారంబులం బెద్దప్రొద్దు మహోఘోరయుద్ధంబు సేసి జంభాసురేంద్రుఁ డయ్యమరేంద్రుపై లంఘించి పట్టికొన ననువు సేయుట గని వజ్రి వజ్రాయుధం బెత్తికొని మెట్టివైచిన 72

అర్థము. ఇట్లు, అనేక - ప్రకారంబులన్, పెద్ద- ప్రొద్దు = చాల సేపు, మహత్ (మహా) + ఘోర - యుద్ధంబులు = మిక్కిలి భయంకరములైన యుద్ధములు, చేసి, జంభ + అసుర + ఇంద్రుండు, ఆ + అమర + ఇంద్రుపైన్ = ఆ దేవేంద్రుని మీఁద, లంఘించి = దుమికి, పట్టికొనన్ = పట్టుకొనుటకు, అనువు + చేయుట = సిద్ధపఱుచుట, కని, వజ్రి = ఇంద్రుఁడు, వజ్ర + ఆయుధంబు, ఎత్తికొని, మెట్టివైచినన్ = ప్రూని ప్రయోగింపఁగా

తాత్పర్యము: ఇట్లు పెక్కురీతులఁ జాలసేపు మిక్కిలి భయంకరములైన యుద్ధములు చేసి జంభరాక్షసుఁడు ఆ దేవేంద్రునిపై దుమికి పట్టకొనుటకు సిద్ధపడుట చూచి ఇంద్రుఁడు వజ్రాయుధమునెత్తి ప్రయోగింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

చ బలువిడిఁ దాఁకి వీఁకఁ గులపర్వతసంహతి పక్షమూలముల్ కలుషముతోఁ దగం దునుము గాయమునం బటుజృంభణంబుతో బలు తల ద్రెవ్వఁబాఱియు నుపాయమునన్ సురశత్రు వృత్రు వ్ర య్యలు వడఁ దాఁకు కైపున మహోశని జంభనురంబు దాఁకినన్ 73

అర్థము. బలువిడిన్ = బలాత్కారముగా, తాఁకి, వీఁకన్ = పరాక్రమముతో, కుల - పర్వత - సంహతి - పక్ష - మూలముల్ = కుల పర్వతముల సమూహముయొక్క తెక్కల మొదళ్లు, కలుషముతోన్ = కోపముతో, తెగన్ = తెగునట్లు, తునుము =ఖండించు, కాయమునన్ = లక్ష్యముతో (?), పటు - జృంభణంబుతోన్ = తీవ్రమైన విజృంభణముతో, బలు - తల = గొప్ప శిరస్సు,

త్రెవ్వన్ = తెగునట్లు, పాటియున్ = పడువిడియు, ఉపాయమునన్ = ఉపాయముతో, సుర - శత్రున్ - వృత్రున్ = రాక్షసుఁడైన వృత్రుని, వ్రయ్యలు + పడన్= ముక్కలగునట్లు, తాఁకు - కైవునన్ = తాఁకు నుద్రేకముతో, మహత్ (మహా) + అశని = గొప్ప వజ్రాయుధము, జంభు + ఉరంబు = జంభాసురుని ఱొమ్ము, తాఁకినన్ = తాఁకఁగా

తాత్పర్యము పరాక్రమముతోఁ గులపర్వతముల తెక్కల మొదళ్లు తెగునట్లు నఱుకు లక్ష్యముతో, గొప్ప శిరస్సు తెగునట్లు పరువెత్తియు, ఉపాయముతో ముక్కలగునట్లు వృత్రాసురుని తాఁకు గర్వమున వజ్రాయుధము జంభుని ఱొమ్ముతాఁకఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ కైవు = కైపు 'కైవెక్కిన'

-ఉ హరి 2-150

క కరిమీఁదనుండి జంభా
సురుఁ డుక్కటి నేలఁగూలె సురవల్లభు ను
ద్దుర వజ్రాహత గతి సురు
చిర మగు నీలాచలోరుశిఖరము పోలెన్ 74

అర్థము సుర - వల్లభు + ఉద్దుర - వజ్ర + ఆహత - గతిన్ = దేవేంద్రుని యొక్క, దృఢమైన, వజ్ర = వజ్రాయుధముయొక్క, ఆహత-గతిన్ = దెబ్బచే, సురుచిరము + అగు = మిక్కిలి మనోహరమైన, నీల + అచల + ఉరు - శిఖరము - పోలెన్ = నల్లని కొండయొక్క గొప్ప శిఖరము వలె, కరి-మీఁదనుండి = ఏనుఁగుపై నుండి, జంభ + అసురుఁడు, ఉక్కు + అటి = బలము నశించి, నేలన్, కూలెన్

తాత్పర్యము : దేవేంద్రుని వజ్రాయుధముదెబ్బచే నీలాద్రి మహాశిఖరమువలె నేనుఁగుపై నుండి జంభాసురుఁడు బలము చెడి నేలఁగూలెను

విశేషములు . అలంకార ముపమ

వ ఇట్లు జంభాసురేంద్రు వధియించి సురేంద్రుండు సంగరరంగ జయాంగనాసంగతుం డయ్యె నంత 75

అర్థము . ఇట్లు, జంభ + అసుర + ఇంద్రున్, వధియించి, సుర + ఇంద్రుండు, సంగర - రంగ - జయ + అంగనా - సంగతుండు = యుద్ధవిజయమనెడి స్త్రీతోఁ గూడినవాఁడు, అయ్యెన్ అంతన్

తాత్పర్యము . ఇట్లు జంభాసురుని వధించి దేవేంద్రుఁడు యుద్ధ విజయమనెడి స్త్రీతోఁగూడినవాఁడయ్యెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . సంగరరంగజయాంగనా - అలంకారము రూపకము

గీ **తెరలి పరచక్రములు పాది విరిసి పఱవ**
దనుజవాహినిలోఁ గుముదములు పెరుఁగఁ
దారకప్రభ కధికమై తనరి వెలిఁగె
నాజినభమందు సురరాజు తేజ మడరి 76

అర్థము ఆజి - నభము + అందున్ = యుద్ధరంగమనెడి ఆకాశమందు, సుర - రాజు - తేజము = దేవేంద్రుని తేజస్సు, అడరి = అతిశయించి, పర - చక్రములు = శత్రుసమూహములు, శత్రువులనెడు చక్రవాకములు, తెరలి = కలఁగి, పాది విరిసి = విడిపోయి, పఱవన్ = పరువెత్తఁగా, దనుజ - వాహినిలోన్ - రాక్షససేనయవెడినదిలో, కుముదములు = కు + ముదములు = విచారములు అనెడి కలువలు, పెరుఁగన్ = వృద్ధిపొందఁగా, తారక - ప్రభకున్ - అధికము + ఐ = తారకాసురుని తేజస్సుకంటె గొప్పదయి - నక్షత్రముల కాంతికంటె నెక్కువయి తనరి = ఒప్పి, వెలిఁగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము . యుద్ధభూమియనెడు ఆకాశమున దేవేంద్రుని తేజస్సు అతిశయించి, శత్రుసమూహములనెడు చక్రవాకములు కలఁగి విడిపోయి పరువెత్తఁగా, రాక్షససేనయనెడు నదిలోఁ గుముదములనెడి కలువలు వృద్ధిపొందఁగా, తారకాసురుని తేజస్సుకంటె - నక్షత్రములకాంతికంటె మిన్నయై యొప్పి ప్రకాశించెను

విశేషములు . అలంకారము శ్లిష్టరూపకము

వ **ఇట్లు జంభాసురుండు తారకాసురేంద్రు నఖిలభువనరాజ్యమూల స్తంభంబు విఱిగిపడినట్లు పడినం దారకుండు వెన్ను విఱిగి పడి నిశ్చేష్టితుండై యున్న నిజేశ్వరునకు నుత్సాహముగాఁ బలికి నరకాసురుం డాసురభావంబున** 77

అర్థము : ఇట్లు, జంభ + అసురుండు, తారక + అసుర + ఇంద్రు = తారక రాక్షసశ్రేష్ఠుని యొక్క, అఖిల - భువన - రాజ్య - మూల - స్తంభంబు =

ఎల్లలోకముల రాజ్యముయొక్క ప్రధానస్తంభము, విఱిగి - పడిన + అట్లు, పడినన్, తారకుండు, వెన్ను -విఱిగిపడి = వెన్ను విఱిగిపోయి, నిశ్చేష్టితుండు + ఐ = చేష్టలు దక్కినవాఁడు అయి, ఉన్నన్, నిజ + ఈశ్వరునకున్ = తన ప్రభువునకు, ఉత్సాహంబు + కాన్, పలికి, నరక + అసురుండు, ఆసుర - భావంబునన్ = రాక్షసత్వముతో

తాత్పర్యము ఇట్లు జంభాసురుఁడు తారకుని ఎల్లలోకములనెడి రాజ్యము ప్రధానస్తంభము విఱిగిపడినట్లు పడఁగాఁ, దారకుఁడు వెన్నువిఱిగిపడి చేష్టలు దక్కియుండఁ, దన ప్రభువుననకు ఉత్సాహమగునట్లు పలికి నరకాసురుఁడు రాక్షసభావమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

క ధరణీచక్రము దిద్దిరఁ
దిరుగఁ, బయోనిధులు గలఁగ, దెసదప్పి భయా
తురులై సుర కిన్నర ఫణి
నరవరు లనిఁ దూలిపాఱ నరకుఁడు తాఁకెన్ 78

అర్థము. ధరణీ - చక్రము = భూవలయము, దిద్దిరన్, తిరుగన్, పయోనిధులు = సముద్రములు, కలఁగన్ = కలఁతచెందఁగా, సుర - కిన్నర - ఫణి - నర - వరులు = దేవతలు, కిన్నరులు, నాగులు, మనుష్యశ్రేష్ఠులు, దెస + తప్పి = దిక్కుమాలి, భయ +ఆతురులు + ఐ = భయముచేఁ బీడింపఁబడినవారయి, అనిన్ = యుద్ధమునందు, తూలి - పాఱన్ = చలించిపరువిడఁగా, నరకుఁడు, తాఁకెన్

తాత్పర్యము. భూవలయము గిరగిరమని తిరుగఁగా, సముద్రములు కలఁతచెందఁగా, దేవతలు, కిన్నరులు, నాగులు, మనుజులు, దిక్కుతోఁచక, భయముచేఁ బీడితులై యుద్ధమునఁజలించి పాఱఁగా నరకుఁడు తాఁకెను

వ ఇట్లు విలయకాలరుద్రోద్రేకంబున నఖిలజగజ్జనభయజననంబుగా నరకాసురుఁ డదల్చి తాఁకినం బుణ్యపరులగు సాధుజనంబులు బోలె 79

అర్థము. ఇట్లు, విలయ - కాల - రుద్ర + ఉద్రేకంబునన్ = ప్రళయ సమయమునందలి రుద్రుని ఆవేశమువంటి ఆవేశముతో, అఖిల - జగత్ + జన - భయ - జననంబు + కాన్ = ఎల్లజగములందలి జనులకు వెఱపుపుట్టునట్లుగా,

నరక + అసురుఁడు, అదల్చి = గద్దించి, తాఁకినన్, పుణ్యపరులు + అగు = పుణ్యాత్ములయిన, సాధు - జనంబులున్ + పోలెన్ = సత్పురుషులవలె

తాత్పర్యము. ఇట్లు ప్రళయసమయరుద్రుని ఆవేశము వంటి ఆవేశముతో ఎల్లలోకములందలి జనులకు భయము గలుగునట్లు నరకాసురుఁడు గద్దించి తాఁకఁగాఁ బుణ్యాత్ములగు సజ్జనులవలె - తరువాతి పద్యముతో నన్వయము

విష్ణు నరకాసురుల యుద్ధము

క నరకోగ్రభయాతురులై
సుర లనిఁ దన శరణు వచ్చిచొచ్చిన వారిం
గరుణించి కాచె నా హరి ,
హరి నరకభయాపహారి యగు డది యరుదే ? 80

అర్థము సురలు = దేవతలు, నరక + ఉగ్ర - భయ + ఆతురులు + ఐ = నరకుఁడనెడు ఉగ్రుని వలని భయముచేఁ బీడితులయి, అనిన్ = యుద్ధమున, తన - శరణు - వచ్చి - చొచ్చినన్ = తన్ను శరణుచొరఁగా, ఆ - హరి = ఆ విష్ణువు, వారిన్, కరుణించి = దయఁజూపి, కాచెన్ = రక్షించెను, హరి = విష్ణువు, నరక, భయ + అపహారి = నరకుని వలని భయమును బోఁగొట్టువాఁడు - నరకము వలని భయమును బోఁగొట్టువాఁడు, అగుడు = అగుట, అది , అరుదే = ఆశ్చర్యమా?

తాత్పర్యము నరకుఁడనెడు ఉగ్రునివలని భయముచేఁ బీడితులయి, దేవతలు యుద్ధమునఁ దన్ను శరణు చొరఁగా ఆ విష్ణువు వారిని దయతో రక్షించెను విష్ణువు నరకభయమును బోఁగొట్టువాఁడగుట యేమి ఆశ్చర్యము ?

విశేషములు . అలంకార ముపమ, అర్థాంతరన్యాసము, శ్లేషము

వ ఇ ట్లయ్యమరవరులం గైకొని తన్నుం గైకొనక ప్రతిఘటించి నిలిచిన శార్ఙ్గధరునిం గైకొన కని నరకాసురుం డుగ్ర భావంబున నిలిచి నీలాచలంబుపైఁ గురియు లయకాలనీలమేఘంబునుంబోలె నపారబాణాసారంబునం దేల్చుచున్న దనుజుదెసఁ గని దనుజారి కోపహాసవిలసి తాన నుండగుచు 81

అర్థము : ఇట్లు, ఆ + అమరవరులన్ = ఆ దేవతాశ్రేష్ఠులను, కైకొని = స్వీకరించి, తన్నున్, కైకొనక = లెక్కచేయక, ప్రతిఘటించి = ఎదిరించి, నిలిచిన = నిలిచినట్టి, శార్ఙ్గ ధరునిన్ = శార్ఙ్గమనెడివింటిని దాల్చినవానిని - విష్ణువును, కైకొనక = లక్ష్యపెట్టక, అనిన్ = యుద్ధమున, నరక + అసురుండు, ఉగ్ర-భావంబునన్ = భయంకరత్వముతో, నిలిచి, నీల + అచలంబుపైన్ = నల్లని

కొండపై, కురియు, లయ - కాల - నీల - మేఘంబునున్ + పోలెన్ = ప్రళయ సమయమందలి నల్లని మేఘమువలె, అపార - బాణ + ఆసారంబునన్ = అధికమైన అంపవానయందు, తేల్చుచున్ + ఉన్నన్, దనుజు - దెసన్ + కని = రాక్షసునివైపుచూచి, దనుజ + అరి = రాక్షసవైరి -విష్ణువు, కోప - హాస - విలసిత + ఆననుండు + అగుచున్ = కోపముచేతను, నవ్వుచేతను ప్రకాశించిన ముఖము గలవాఁడగుచు

తాత్పర్యము. ఇట్లు ఆ దేవతాశ్రేష్ఠులను స్వీకరించి తన్ను లక్ష్యపెట్టక ఎదిరించి నిలిచినట్టి విష్ణువును లెక్కచేయక యుద్ధమున నరకాసురుఁడు భయంకరుఁడై నిల్చి నీలాద్రివైఁ గురియు ప్రళయసమయనీలమేఘమువలె అధికమైన అంపవానయందుఁ దేల్చుచుండఁగా, ఆ రాక్షసుని వైపు చూచి విష్ణువు కోపహాసములచే నొప్పు ముఖముగలవాఁడగుచు తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

క వడి నరకుఁడేయు నమ్ములు
నడుమనె తెగనేసి మార్గణము లొం డ్లొగి (వీ
డ్వడకుండఁ బఱపఁదొడఁగెను
బిడుగులపిండువలె శార్ఙి పెనుగోపమునన్) 82

అర్థము. నరకుఁడు, ఏయు + అమ్ములు = ప్రయోగించుబా శార్ఙిములు, వడిన్ - వేగముగా, నడుమన్ + ఎ = నడుమనే, తెగన్ + ఏసి = ముక్కలుచేసి, శార్ఙి- విష్ణువు, మార్గణములు + ఒండ్లు = వేఱుబాణములు, ఒగిన్ = క్రమముగా, వీడ్వడక + ఉండన్ = తడఁబడకుండునట్లు - పిడుగుల - పిండు - వలెన్ = పిడుగుల సమూహమువలె, పెను + కోపమునన్ = మహాక్రోధముతో, పఱపన్ + తొడఁగెను = ప్రయోగింప నారంభించెను

తాత్పర్యము: విష్ణువు నరకుఁడు ప్రయోగించు బాణములను నడుమనే ఖండించి వేఱుబాణములను దడఁబడకుండునట్లు మహాకోపముతోఁ బిడుగుల సమూహమువలెఁ ప్రయోగింప నారంభించెను

(ఈ పద్య మసమగ్రముగా నున్నది కుండలీకరణములలోనున్నది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పూరణము)

విష్ణు మురాసురల యుద్ధము

క (క్రందుకొని ప్రబలసురబల)
మందఱఁ గ్రక్కించు నొంతునచ్యుతు నంచున్
బృందారకతతి బెదర ము
కుందునిఁ దలపడియె నొదరికొని మురుఁ డలుకన్ 83

అర్థము. (ఈ పద్యమునందలి మొదటి మూఁడు గణములు మృగ్యములు కుండలీకరణములలోనిది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి పూరణము) క్రందుకొని = అతిశయించి, ప్రబల -సుర-బలము + అందఱన్ = మిక్కిలి బలవంతులైన దేవతావీరులనందఱను, క్రక్కించున్ = క్రక్కుకొనునట్లు చేయుదును, అచ్యుతున్ = విష్ణువును, నొంతున్ = బాధింతును, అంచున్, బృందారక - తతి = దేవతా సమూహము, బెదరన్ = భయపడఁగా, మురుఁడు = మురుఁడను రాక్షసుఁడు, అలుకన్ = కోపముతో, ఒదరికొని = విజృంభించి, ముకుందునిన్ = విష్ణువును, తలపడియెన్ = ఎదుర్కొనెను

తాత్పర్యము. దేవతావీరుల నందఱను అతిశయముతోఁ గ్రక్కించును విష్ణువును బాధింతుననుచు దేవతలు భయపడఁగా మురాసురుఁడు కోపమున విజృంభించి కోపముతో విష్ణువును మార్కొనెను

వ **ఇట్లు తన్ను ముట్టిమూఁదలించుచు నురులంబఱతెంచు మురుం గని చక్రపాణి కోపించి చక్రంబున వైచుడు** 84

అర్థము: ఇట్లు, తన్నున్, ముట్టి మూదలించుచున్ = తాఁకుచు, ఉరులన్+ పఱతెంచు = మీఁదికి వచ్చు, మురున్, కని, చక్రపాణి = చక్రము చేతియందుఁగలవాఁడు - విష్ణువు, కోపించి చక్రంబునన్ = చక్రాయుధముతో (సుదర్శనముతో), వైచుడున్ = కొట్టినంతనే

తాత్పర్యము. ఇట్లు, తన్నుఁదాఁకుచు మీఁదికి వచ్చు మురాసురునిఁజూచి విష్ణువు కోపించి సుదర్శనముతోఁగొట్టినంతనే - తరువాతి పద్యముతో నన్వయము

క **మురువక్షము నో వ్రచ్చుచు**
హరిచక్రము పిఱుఁద వెడలె నరుణద్యుతితోఁ
దరుణార్కబింబ మసితా
విరళాబ్దమునందు వెడలి వెలుఁగువిధమునన్. 85

అర్థము తరుణ + అర్క - బింబము = బాల సూర్య బింబము, అసిత + అవిరళ + అబ్దమునందున్ = నల్లని దట్టమైన మేఘమునందుండి, వెడలి = వెలికివచ్చి, అరుణ - ద్యుతితోన్ = ఎఱ్ఱని కాంతితో, వెలుఁగు - విధమునన్ = ప్రకాశించువిధమున, హరి - చక్రము = విష్ణుచక్రము - సుదర్శనము, మురు - వక్షమున్ = మురాసురుని తొమ్మును, నోన్ + వ్రచ్చుచున్ = నొచ్చునట్లు చీల్చుచు, అరుణ-ద్యుతితోన్ = రక్తకాంతితో, పిఱుఁదన్ = వెనుకనుండి, వెడలెన్ = వెలికివచ్చెను

తాత్పర్యము బాలసూర్యబింబము నల్లని, దట్టమైన మేఘమునందుండి వెలికివచ్చి ఎఱ్ఱనికాంతితోఁ బ్రకాశించు విధమున విష్ణుచక్రము మురాసురుని తొమ్మును నొచ్చునట్లు భాధించుచు రక్తకాంతితో వెనుకనుండి వెలికివచ్చెను

విశేషములు. అలంకార ముపమ 'అరుణ ద్యుతితోన్' అనుచో శ్లేషము అసితావిరళాబ్దము నందు వెడలి - అసితావిరళాబ్దము వలన వెడలి అపాయార్థమునందు వలనవర్ణకము బాల కారక 9 'ఉండిపదం బొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు' బాల కారక 10 అసితావిరళాబ్దమ్ము వలననుండి వెడలి, 'ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు ' బాల కారక 11 అసితావిరళాబ్దమునందుండి వెడలి 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తముల మీఁదియుండికి లోపంబు బహుళంబుగా నగు ' ప్రౌఢ కారక 11 అసితావిరళాబ్దమునందు వెడలి ఇట్లే పిఱుఁద వలన నుండి వెడలె - పిఱుఁద నుండి వెడలె వలనకు ద్వితీయ పిఱుఁద వెడలె - ద్వితీయమీఁది ఉండికి లోపము ప్రౌఢ కారక 11

నర సహస్రకవచాసురుల యుద్ధము

వ ఇట్లు మురాసురుండు కోమలమృణాలంబునుంబోలె రథాంగ పాణిరథాంగంబునకుం గబళంబైనం గోపించి సహస్రకవచుండు సహస్రముఖుండునుంబోలె మరుత్సమూహంబుం ద్రోవ నప్పళించుచు హరిపై నురులం బఱతెంచుటఁగని నరుండు నారాయణునకు నెడసొచ్చి మార్కొని నిలిచినం గని దనుజుండు విస్మితుండై మందస్మితాననుం డగుచు 86

అర్థము. ఇట్లు, ముర + అసురుండు = మురరాక్షసుఁడు, కోమల = మృణాలంబునున్ + పోలెన్ = మృదువైన తామరతూఁడు విధమున, రథాంగ - పాణి - రథాంగంబునకున్ = విష్ణుచక్రమునకు, కబళంబు + ఐనన్ = ముద్ద (ఆహారము) కాఁగా, సహస్రకవచుండు = సహస్రకవచుఁడను పేరుగల రాక్షసుఁడు, సహస్ర ముఖుండునున్ + పోలెన్ = వేయి ముఖములుగలవాని విధమున, మరుత్

+ సమూహంబున్ = దేవతల సమూహమును, త్రోవన్ = పాఱద్రోలుటకు, అప్పళించుచున్ = ఉత్సహించుచు, హరిపైన్ = విష్ణునిమీఁద, ఉరులన్ + పఱతెంచుటన్ = దండెత్తివచ్చుటను, కని, నరుండు, నారాయణునకున్ = విష్ణునకు, ఎడ + చొచ్చి = నడుమవచ్చి, మార్కొని = ఎదురుకొని, నిలిచినన్ = నిలువఁగా, దనుజుండు = రాక్షసుఁడు (సహస్రకవచుఁడు), విస్మితుండు + ఐ = ఆశ్చర్యపడినవాఁడయి, మంద - సిత్మ +ఆననుండు= చిఱునవ్వుతోడి ముఖము గలవాఁడు, అగుచున్

తాత్పర్యము. ఇట్లు మురాసురుఁడు మృదువైన తామరతూఁడు విధమున విష్ణుచక్రమున కాహారముకాఁగా సహస్రకవచుఁ డను రాక్షసుఁడు కోపించి సహస్రముఖుని విధమున దేవతల సమూహమును బాఱఁద్రోల నుత్సహించుచు, విష్ణునిపై దండెత్తివచ్చుట చూచి నరుఁడు నారాయణునకు నడుమవచ్చి మార్కొని నిలువఁగాఁ, జూచి రాక్షసుఁ డాశ్చర్యమునొంది చిఱునవ్వుతోడి ముఖము గలవాఁడగుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు : అలంకార ముపమ

ఆ నరుఁడ వీవు, నేను నరభోజనుండ, న
న్నెఱిఁగి యెఱిఁగి యిట్టు లీవు రాక
వేఁటకాని యిల్లు వెఱవక కుందెలు
సొచ్చినట్టు లెదిరి వచ్చితీవు 87

అర్థము . ఈవు, నరుఁడవు, నేను, నర - భోజనుండన్ = నరులు ఆహారముగాఁ గలవాఁడను, నన్నున్, ఎఱిఁగి, ఎఱిఁగి, ఇట్టులు, ఈవు, రాక =వచ్చుట, వేఁటకాని - ఇల్లు, వెఱవక = భయపడక, కుందెలు, చొచ్చిన + అట్టులు = ప్రవేశించిన విధముగా, ఈవు, ఎదిరి, వచ్చితి (వి)

తాత్పర్యము . 'నీవు నరుఁడవు నేను నరులను దినువాఁడను, నేను అట్టివాఁడనని తెలిసి తెలిసి, వేఁటకాని యిల్లు భయములేక కుందేలు ప్రవేశించు విధమున నీవు దండెత్తి వచ్చితివి

విశేషములు : అలంకార ముపమ

వ 'చక్కనై నిలువు' మనుచు నపారశరాసారంబు గురియుచున్నంగని కోపించి నరుం డన్నరభోజను శరనికరంబులతోన సహస్రకవచంబులు నొక్కట తెగనేసిన 88

అర్థము చక్కన + ఐ, నిలుము, అనుచున్, అపార - శర + ఆసారంబు = అధికమయిన బాణవర్షము, కురియుచున్ + + ఉన్నన్, కని, కోపించి, నరుండు, ఆ + నర - భోజనున్ = ఆ రాక్షసుని, శర - నికరంబులతోన్ + అ = బాణ సమూహములతోనే, సహస్ర - కవచంబులున్ = వేయి కవచములును, ఒక్కట = ఒక్కమాఱుగా, తెగన్ + ఏసినన్ = ఖండింపఁగా

తాత్పర్యము 'చక్కఁగా నిలువుము' అనుచు అధికమైన అంపవాన కురియుచుండఁగాఁ జూచి నరుఁడు ఆ రాక్షసుని వేయికవచములును బాణ సమూహములతోనే ఒక్కమాఱుగా ఖండింపఁగా - తరువాతి పద్యముతోనన్వయము

చ నరుని నిశాతసాయకగణప్రతతిం దెగి చూడఁజూడ జ
ర్జరితములై సహస్రకవచంబులుఁ బోయిన నిల్చె దానవుం
డురుతరభాతితోఁ బృథు పయోద సమూహము లొక్కపెట్ట దు
ర్భరతరచండవాతహతిఁ బాసిన నీలనగంబుఁ బోలెనై 89

అర్థము. నరుని = నరునియొక్క, నిశాత - సాయక - గణ - ప్రతతిన్ = వాఁడియైన బాణముల సమూహముచే, తెగి, చూడన్ + చూడన్, సహస్ర కవచంబులున్ = వేయి కవచములును, జర్జరితములు + ఐ = తూంట్లుపడినవయి, పోయినన్ = పోఁగా, దానవుండు = రాక్షసుఁడు, ఉరుతర -భాతితోన్ = మిక్కిలి గొప్ప కాంతితో, పృథు - పయోద - సమూహములు = పెద్ద మేఘములగుంపులు, ఒక్కపెట్టన్ = ఒక్కమాఱుగా, దుర్భర - తర - చండ - వాత -హతిన్ = మిక్కిలి భరింపరాని తీవ్రమైన గాలిదెబ్బచే, పాసిన = పోయినట్టి, నీల - నగంబున్ + పోలెన్ +ఐ = నల్లని కొండవలెనయి, నిల్చెన్

తాత్పర్యము: నరుని వాఁడి బాణముల సమూహముచేఁదెగి తూంట్లుపడి వేయి కవచములును బోఁగా నా సహస్రకవచుఁడనెడి రాక్షసుఁడు మిక్కిలి కాంతితో మేఘముల సమూహము లొక్కమాఱుగా దుర్భరము, చండమునైన గాలి దెబ్బచేఁ బోయిన నీలాద్రివలె నయి నిలిచెను

విశేషములు : అలంకార ముపమ గణ - ప్రతతి శబ్దములు సమానార్థకములు ఈ కవి యిట్లు పెక్కుచోట్లఁ బ్రయోగించెను

వ ఇట్లు సహస్రకవచుండు విగతకవచుండై నరశరప్రహతి కబ్బగింపక పలాయనపరాయణుండై చండాశుగప్రహతిం దూలు జలధరంబునుంబోలె వియత్తలంబున నదృశ్యుండయ్యె నంత 90

అర్థము. ఇట్లు, సహస్రకవచుండు, విగత - కవచుండు + ఐ = పోయిన కవచము గలవాఁడయి, నర - శర - ప్రహతికిన్ = నరుని బాణముల దెబ్బకు, అబ్బగింపక = ఓర్వలేక, పలాయన-పరాయణుండు + ఐ = పాఱిపోవుటయం దాసక్తి గలవాఁడై చండ + ఆశుగ - ప్రహతిన్ = తీవ్రములయిన బాణముల దెబ్బచే, తూలు = చలించు, జలధరంబునున్ + పోలెన్ = మేఘమువలె, వియత్ + తలంబునన్ = ఆకాశప్రదేశమున, అదృశ్యుండు = కానరానివాఁడు, అయ్యెన్, అంతన్

తాత్పర్యము. ఇట్లు సహస్రకవచుఁడు కవచరహితుఁడై నరుని బాణముల దెబ్బ కోర్వక పాఱిపోవఁగోరువాఁడయి తీవ్రములయిన బాణముల దెబ్బచేఁ జలించు మేఘమువలె ఆకాశమునఁ గానరాకుండెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

విష్ణు కాలనేముల యుద్ధము

ఆ హరి నదల్చి తాఁకె ధరణీతలమ్ము గ్ర
క్కదల, గిరులు పాఁతు గదలి కూలఁ,
ద్రిదశు లుదిలగొనఁగ, దేవేంద్రుఁ డల్లాడఁ
గాలఁ గరువ పోలెఁ గాలనేమి 91

అర్థము. కాలనేమి = కాలనేమియను రాక్షసుఁడు, ధరణీ - తలమ్ము = భూతలము, గ్రక్కదలన్ = మిక్కిలి కదలఁగా, గిరులు = కొండలు, పాఁతు + కదలి - కూలన్ = మొదలు చలించి కూలఁగా, త్రిదశులు = దేవతలు, ఉదిలగొనఁగన్ = చలింపఁగా, దేవేంద్రుఁడు, కాలన్ - అల్లాడన్ = కాలిచేఁజలింపఁగా (?), కరువ + పోలెన్ = కొండవలె, హరిన్ = విష్ణువును, అదల్చి = గద్దించి,తాఁకెను

తాత్పర్యము. కాలనేమి యను రాక్షసుఁడు భూమి మిక్కిలి చలింపఁగా, కొండలు మొదలు చలించి కూలఁగా, దేవతలు సంచలింపఁగా, దేవేంద్రుఁడు కాలనల్లాడఁగా (?) కొండవలె విష్ణువును గద్దించి తాఁకెను

విశేషములు: అలంకారము ఉపమ

వ ఇట్లు - శతముఖ దశశతకర పరిశోభితుండై యనేక విధాయుధవర్షంబులు గురియుచుం దెరలనెత్తివచ్చుటఁ గని శార్ఙపాణియు వానికిం బ్రతిఘటించి నిలిచిన 92

అర్థము ఇట్లు శత - ముఖ - దశ-శత -కర - పరిశోభితుండు + ఐ = నూఱు మొగములతో, వేయి చేతులతో నొప్పినవాఁడయి, అనేక - విధ + ఆయుధ - వర్షంబులు = పలురీతులయిన ఆయుధముల వానలు, కురియుచున్, తెరలన్ + ఎత్తివచ్చుటన్ + కని = దండెత్తివచ్చుట చూచి, శార్ఙపాణియున్ = విష్ణువును, వానికిన్, ప్రతిఘటించి = ఎదిరి, నిలిచినన్

తాత్పర్యము . ఇట్లు నూఱుముఖములు, వేయిచేతులు గలిగి యొప్పుచున్నవాఁడయి పలురీతులయిన ఆయుధముల వానలు కురియుచు దండెత్తివచ్చుటఁ జూచి విష్ణువు వాని నెదిరి నిలువఁగా - తరువాతి పద్యముతో నన్వయము

ఉ **ఆ హరికాలనేములు శరాసనకౌశల మొప్ప నేసి రు**
గ్రాహవభూమి బాణనికరాగ్ర విఖండిత వారణాశ్వ దే
వాహిత దేవ సద్భటమయంబుగ భిన్నతరాస్త్రశస్త్రసం
దోహముగా నవారుణనదుల్ కుణపాద్రులు ముంచి పాఱఁగాన్ 93

అర్థము ఆ - హరి - కాలనేములు = ఆ విష్ణువును, కాలనేమియు, ఉగ్ర + ఆహవ - భూమి = భయంకరమయిన యుద్ధభూమి, బాణ - నికర + అగ్ర - విఖండిత - వారణ + అశ్వ - దేవ + అహిత - దేవ - సత్ + భట - మయంబుగన్ = బాణముల సమూహముయొక్క కొనలచే ముక్కలు చేయఁబడిన ఏనుఁగులు, గుఱ్ఱములు, రాక్షసులు, దేవతలు, సద్వీరులు అనువారితో నిండినదిగా, భిన్నతర +అస్త్ర - శస్త్ర - సందోహము + కాన్ = భేదింపఁబడిన అస్త్రములయు శస్త్రములయు సమూహము గలదిగా, నవ + అరుణ - నదుల్ = క్రొన్నెత్తుటి నదులు, కుణప + అద్రులు = పీనుఁగులనెడి కొండలు, ముంచి, పాఱఁగాన్ = ప్రవహింపఁగను, శరాసన - కౌశలము = వింటి నేర్పు, ఒప్పన్, ఏసిరి = కొట్టిరి

తాత్పర్యము. ఆ విష్ణువును గాలనేమియును భయంకరమైన యుద్ధభూమి బాణసమూహముచే ముక్కలు చేయఁబడిన ఏనుఁగులతో, గుఱ్ఱములతో, రాక్షసులతో, దేవతలతో, సద్భటులతో నిండినదియగునట్లును, విఱుగఁగొట్టఁబడిన అస్త్ర శస్త్ర సమూహముగలది కాఁగా, క్రొన్నెత్తుటి నదులు శవములనెడి కొండలను ముంచి ప్రవహింపఁగా వింటినేర్పుమెఱయఁ బ్రయోగించిరి

విశేషములు అలంకారము రూపకము

వ ఇట్లిరువురుం బెద్దప్రొద్దు మహాశరాసనకౌశలంబు మెఱయ నసమ సమరంబునం గాలనేమి లయకాల మహాకాలుండునుం బోలెం గోపించి రథాంగపాణి రథ రథ్య సారథుల నొక్కట వికుండించి పేర్చి యార్చినం గని విహగేంద్రవాహనుం డక్షణంబ విహగేంద్రారూఢుండై పాంచజన్యధ్వనితోన శార్ఙగుణధ్వని సెలంగుచుండం దెరలనెత్తి 94

అర్థము. ఇట్లు, ఇరువురన్, పెద్ద - ప్రొద్దు = చాలకాలము, మహత్ (మహా) - శరాసన - కౌశలంబు = గొప్పవింటినేర్పు, మెఱయన్, అసమ - సమరంబునన్ = అసమయుద్ధమునందు, కాలనేమి, లయ- కాల - మహాకాలుండునున్ + పోలెన్ = ప్రళయ సమయమునందలి శివుని విధమున, కోపించి, రథాంగపాణి -రథ - రథ్య - సారథులన్ = విష్ణుని రథమును, గుఱ్ఱములను, సారథులను, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, వికుండించి = ముక్కలు చేసి, పేర్చి = విజృంభించి, ఆర్చినన్, కని, విహగ + ఇంద్ర - వాహనుండు = గరుడవాహనుఁడు, అక్షణంబు + అ = వెంటనే, విహగ + ఇంద్ర + ఆరూఢుండు + ఐ = గరుత్మంతునెక్కినవాఁడయి, పాంచజన్య - ధ్వని - తోన్ + అ = పాంచజన్యమనెడి శంఖనాదముతోనే, శార - గుణ - ధ్వని = శార్ఙమను వింటిలల్లెవప్పుడు, చెలంగుచున్ + ఉండన్ = మ్రోయుచుండఁగా, తెరలన్ + ఎత్తి = దండెత్తి

తాత్పర్యము. ఇట్లు విష్ణుకాలనేము లిద్దఱును వింటినేర్పు మెఱయ నసమయుద్ధమునఁ గాలనేమి ప్రళయసమయమునందలి శివుని విధమునఁ గోపించి విష్ణుని రథమును, గుఱ్ఱములను, సారథిని ఒక్కమాఱుగా ముక్కలు చేసి విజృంభించి ఆర్వఁగాఁ జూచి విష్ణుఁడు వెంటనే గరుడు నారోహించి పాంచజన్యధ్వనితోపాటే శార్ఙ్గ గుణధ్వని మ్రోయుచుండఁగా దండెత్తి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

చ ఉరుభుజసత్ప్రతాపమున నొంది వెలుంగు నిశాచరేంద్రుపై
హరి శరవృష్టి గ్రచ్చఱ రయంబునఁ గొప్ప రణాంతరంబునన్
దరగొని పర్వి కాలు నతిదావహుతాశనుపై మహోపయో
ధర గళితోరు భూరి జలధారలు గప్పినభంగిఁ బెల్కుఱన్ 95

అర్థము. హరి = విష్ణువు, ఉరు - భుజ - సత్ + ప్రతాపమునన్ = గొప్ప భుజబలమును, ఒంది = పొంది, వెలుంగు = ప్రకాశించు, నిశాచర + ఇంద్రుపైన్ = రాక్షస శ్రేష్ఠునిపై, తరగొని (తరము +కొని) = క్రమముగా, పర్వి = వ్యాపించి, కాలు = కాలునట్టి, అతి - దావ - హుతాశనుపైన్ = గొప్ప కార్చిచ్చుపై, మహత్

(మహా) + పయోధర - గళిత + ఉరు - భూరి - జల - ధారలు = పెద్ద మేఘముల నుండి జాఱిన పెను నీటి ధారలు, కప్పిన - భంగిన్ = కప్పిన విధమున, పెల్కుఱన్ = భయపడఁగా, రణ + అంతరంబునన్ = యుద్ధభూమిలో, శర - వృష్టి = అంపవాన, క్రచ్చఱన్ = శీఘ్రముగా, రయంబునన్ = వేగముగా, కప్పెన్

తాత్పర్యము గొప్ప భుజబలముతో నొప్పు రాక్షసునిపై విష్ణువు - క్రమముగా వ్యాపించి దహించు గొప్పకార్చిచ్చుపై మేఘములనుండి జాఱు నీటి ప్రవాహములు కప్పిన విధమున భయపడునట్లు యుద్ధభూమిలో అంపవాన శీఘ్రముగాఁ గప్పెను

విశేషములు అలంకార ముపమ

వ ఇట్లు దృష్టి శీఘ్ర శర సంధాన దూరాపాత లక్ష్యభేదాద్యనేక ధనుర్విద్యారహస్యంబులు మెఱయం బ్రయోగించు మహారభసంబున 96

అర్థము. ఇట్లు, దృష్టి - శీఘ్ర - శర - సంధాన - దూర + ఆపాత - లక్ష్య - భేద + ఆది + అనేక - ధనుస్ (:) + విద్యా - రహస్యంబులు = దృష్టి శీఘ్ర శర సంధానము, దూరాపాత లక్ష్యభేదము మున్నగు పెక్కు ధనుర్విద్యయందలి రహస్యములు, మెఱయన్ = ప్రకాశింపఁగా, ప్రయోగించు, మహత్ (మహా) - రభసంబునన్ = మిక్కిలి వేగమున -

తాత్పర్యము. ఇట్లు దృష్టి శీఘ్రశరసంధానము, దూరపాత లక్ష్యభేదము మున్నగు పెక్కు ధనుర్విద్యారహస్యములు మెఱయునట్లు ప్రయోగించు గొప్ప వేగముతో - తరువాతి పద్యముతో నన్వయము

గీ ఒక్కవింటన శార్ఙిపై నొత్తి యేయు
నమ్ము లేనూఱు విండ్లును నాఁకగొనమిఁ
గలసి యూథంబు బలవంత మను జగంబు
పలుకు బొం కయ్యెనని దైత్యపతి చలించె 97

అర్థము ఒక్క - వింటన్ + అ ఒక్కవింటితోడనే, శార్ఙిపైన్ = శార్ఙమనువిల్లు గలవాఁడు - విష్ణుఁడు, పైన్ + ఒత్తి = పైని గ్రుచ్చి, ఏయు = ప్రయోగించు, అమ్ములు = బాణములు,ఏ నూఱు - విండ్లును = అయిదు నూర్ల

విండ్లను, ఆఁక + కొనమిన్ = అడ్డగింపలేకపోవుటచే, కలసి = కూడి, యూధంబు = సమూహము, బలవంతము = బలము గలది, అను, జగంబు - పలుకు = లోకము మాట, బొంకు + అయ్యెన్ = అసత్యమయ్యెను, అని, దైత్య - పతి =రాక్షసరాజు, చలించెన్

తాత్పర్యము. శార్ఙి (విష్ణువు) శార్ఙమును తన ఒక్కవింటితోడనే మీఁదికి గ్రుచ్చి ప్రయోగించు బాణములు తన అయిదువందలవిండ్లు కూడ అడ్డగింపలేకపోవుటచే, 'కూడి సమూహము బలవంతమయిన దనులోకము మాట అసత్యమయ్యె' నఁ రాక్షసరాజు చలించెను

క హర్షము చెడి శతముఖములు
ధర్షితరుచి నొంది వందఁ దద్బాణ మహా
వర్షమున నుడిగె నురుతర
వర్షాహతి నుడుగు వనజ వనమును బోలెన్ 98

అర్థము. శత - ముఖములున్ = నూఱు మొగములును, హర్షము - చెడి = సంతోషము నశించి, ధర్షిత - రుచిన్ = దూషితమైన - స్పష్టమగు కాంతిని, ఒంది = పొంది, వందన్ = దుఃఖింపఁగా, ఉరుతర - వర్ష + ఆహతిన్ = గొప్పవానదెబ్బచే, ఉడుగు = నశించు, వనజ - వనమును + పోలెన్ = తారలతోఁపువలె, తద్ + బాణ - మహత్ (మహా) - వర్షమునన్ = ఆ విష్ణువుయొక్క బాణములనెడి గొప్పవానచే, ఉడిగెన్ = నశించెను

తాత్పర్యము : కాలనేమి నూటుమొగములును సంతోషములేక కాంతి నశించినవయి దుఃఖించి మిక్కిలి గొప్ప వానదెబ్బచే నశించు తామరతోఁపువలె, విష్ణుని పెన్నంపవానచే నశించెను

విశేషములు. అలంకార ముపమ రూపకానుప్రాణితము

వ ఇట్లు నిజశరఘట్టనం దలరి నిశ్చేష్టితుండైయున్న కన్నెటింగి నారాయణుండు నారాయణాస్త్రంబు దొడిగి రాక్షసేశ్వరు వక్షస్థలంబు వ్రయ్యనేసిన 99

అర్థము. ఇట్లు, నిజ - శర - ఘట్టనన్ = తన బాణముల రాయిడిచే, తలరి = చలించి, నిశ్చేష్టుఁడు + ఐ + ఉన్న - కన్నెటింగి = చేష్టలు దక్కియున్న జాడ తెలిసి, నారాయణుండు, నారాయణ + అస్త్రంబు, తొడిగి, రాక్షస + ఈశ్వరు-

వక్షస్+స్థలంబున్ = రాక్షసరాజు బొమ్మును, వ్రయ్యన్ + ఏసినన్ = బ్రద్దలగునట్లు కొట్టఁగా

తాత్పర్యము ఇట్లు తన బాణముల రాయిడిచేఁ జలించి చేష్టలుడిగియున్న జూడతెలిసి నారాయణుఁడు నారాయణాస్త్రము తొడిగి రాక్షసరాజు బొమ్ము బ్రద్దలగునట్లు కొట్టఁగా - తరువాతి పద్యముతో నన్వయము

తే **కాలుఁడాదిగ దేవసంఘంబు నెల్లఁ**
గాలుకొనకుండ నెగుచు విక్రమధనుండు
కాలవశమున నిజబాహుగర్వ ముడిగి
కాలగోచరుఁడయ్యె నా కాలనేమి 100

అర్థము కాలుఁడు = యముఁడు, ఆదిగన్ = మొదలుగా, దేవ - సంఘంబున్ + ఎల్లన్ = దేవతా సమూహమునంతను, కాలుకొనక + ఉండన్ = నిలువలేకుండునట్లు, ఎగుచు = తఱుమునట్టి, విక్రమ - ధనుండు = పరాక్రమము ధనముగాఁ గలవాఁడు, ఆ+ కాలనేమి = ఆ కాలనేమి, కాల - వశమునన్, నిజ - బాహు-గర్వము + ఉడిగి = తనదైన భుజబలగర్వము కోలుపోయి, కాల - గోచరుఁడు + అయ్యెన్ = మరణించెను

తాత్పర్యము . యముఁడు మున్నగు దేవతల సమూహమునంతను నిలువనీక తఱుము పరాక్రమధనుఁడు అగు ఆ కాలనేమి కాలవశముచేఁ దన భుజ పరాక్రమ గర్వము నశించి మృతిఁజెందెను

వ **ఇట్లు కాలనేమి దుర్వారాక్షీణప్రాణసమీరణంబు దుర్వార నారాయణాస్త్రాపార ఘోర మహోరగంబున కాహారంబైనం దారకబలంబు చంద్రమండలంబు రాహుగ్రస్తంబైనం జలించు తారకబలంబునుం బోలెం జలాచల హృదయులగుచుండె నిట్లసురసామంతవర్గం బంతయు నిజబలపరివార సహితం బయ్యమరజలనిధి నిర్మగ్నంబైనం గని దాని కించుకయుఁ జలింపక తారకాసురేంద్రుండు నిజమూలబలంబునకుం జేయి వీచి సురవరులపై నురవడిం దెరలనెత్తుదెంచె నట్టి సమయంబున** 101

అర్థము . ఇట్లు, కాలనేమి యొక్క, దుర్వార + అక్షీణ -ప్రాణ - సమీరణంబు = వారింపశక్యముకాని, తక్కువకాని ప్రాణమనెడి వాయువు, దుర్వార - నారాయణ + అస్త్ర + అపార - ఘోర - మహత్ (మహా) +

ఉరగంబునకున్ = వారింపరాని నారాయణాస్త్ర-మనెడి మిక్కిలి భయంకరమైన పెను పామునకు, ఆహారంబు + ఐనన్ = ఆహారము కాఁగా - నారాయణాస్త్రముచేఁ గాలనేమి చావఁగా ననుట, తారక-బలంబు = తారకాసురుని సైన్యము, చంద్ర - మండలంబు, రాహు - గ్రస్తంబు + ఐనన్ = రాహువుచే - గ్రసింపఁబడినది కాఁగా, చలించు, తారక - బలంబునున్ + పోలెన్ - నక్షత్రసమూహమువలె, చల + అచల - హృదయులు = చలించునట్టియు, చలింపనట్టియు, హృదయములు గలవారు, అగుచున్ + ఉండెన్, ఇట్లు, అసుర - సామంత - వర్గంబు + అంతయున్ = రాక్షస సామంతుల సమూహమంతయు, నిజ - బల - పరివార - సహితంబు = తమ సైన్య సమూహముతోఁ గూడి, ఆ + అమర - జలనిధి - నిర్మగ్నంబు = ఆ దేవతలనెడి సముద్రమునందు మునిఁగినది, ఐనన్ = కాఁగా, కని, దానికిన్, ఇంచుకయున్ = కొంచెమయినను, చలింపక, తారక + అసుర + ఇంద్రుండు = తారక రాక్షస శ్రేష్ఠుఁడు, నిజ మూల - లంబునకుబన్ = తన మూల బలమునకు, చేయి - వీచి = ఉత్సాహపఱిచి, సుర - వరులపైన్ = దేవతాశ్రేష్ఠులపై, ఉరవడిన్ = మిక్కిలి వేగముతో, తెరలన్ + ఎత్తుదెంచెన్ = దండెత్తెను, అట్టి సమయంబునన్

తాత్పర్యము . ఇట్లు కాలనేమి వారింపరానిప్రాణవాయువు వారింపరాని నారాయణాస్త్రమనెడి పెనుపామున కాహారము కాఁగా, తారకాసురుని సైన్యము చంద్రమండలము రాహుగ్రస్తము కాఁగాఁ జలించు చుక్కల గుంపువలెఁ జలాచల హృదయములు గలది అగుచుండెను ఇట్లు రాక్షసుని సామంతుల సమూహమంతయుఁ దన బలపరివారముతోఁగూడ ఆ దేవతలబలమనెడి సముద్రమునందు మునిఁగినది కాఁగాఁ జూచి దాని కొకింతేనిఁ జలింపక తారకాసురుఁడు తన మూలబలమున కుత్సాహము గలిగించి దేవతలపై వేగముతో దండెత్తెను అట్టి సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకారము రూపకము

క తారక కింకరు లుగ్రా
కారులు శతకోటు లొక్కకవిఁ గవిసిరి దు
ర్వారబలోపేతులు నర
నారాయణ దివిజ దివిజనాథులు వెఱవన్ 102

అర్థము : ఉగ్ర + ఆకారులు = భయంకరములయిన ఆకారములు గలవారు, శత-కోటులు = నూఱుకోటుల సంఖ్య గలవారు, (అగు), తారక -

కింకరులు = తారకాసురుని భటులు, దుర్వార-బల + ఉపేతులు = వారింపరాని బలములోఁగూడినవారు, (అగు) నర - నారాయణ - దివిజ - దివిజ - నాథులు = నరుఁడు, నారాయణుఁడు, దేవతలు, దేవేంద్రుఁడు (అనువారు), వెఱవన్ = భయపడఁగా ఒక్క - కవిన్ = ఒక్కపెట్టున, కవిసిరి = ఆక్రమించిరి

తాత్పర్యము భయంకరాకారులు అగు నూఱుకోటుల సంఖ్యగలవారు, (అగు), తారక - కింకరులు = తారకాసురుని భటులు, దుర్వార-బల +ఉపేతులు = వారింపరాని బలముతోఁ గూడినవారు, (అగు), నర -నారాయణ - దివిజ - దివిజనాథులు = నరుఁడు, నారాయణుఁడు, దేవతలు, దేవేంద్రుఁడు (అనువారు), వెఱవన్ = భయపడఁగా, ఒక్క - కవిన్ = ఒక్కపెట్టున, కవిసిరి = ఆక్రమించిరి

తాత్పర్యము . భయంకరాకారులు అగు నూఱుకోటుల తారకభటులు వారింపరానిబలముగల నరనారాయణులును దేవతలును, దేవేంద్రుఁడును భయపడఁగా నొక్కపెట్టున నాక్రమించిరి

ప్రమథులు రాక్షసులను దాఁకుట

వ ఇ ట్లాదిత్యమండలంబుపై నవయవంబునం గవియు రాహుమండలంబునుంబోలె నాదిత్యమండలంబుపై నురవడిం గవియు నసురకింకరగణంబు గని గణనాథుం డమరగణంబుం గనుంగొని వీరభద్రాది రుద్రగణంబులకుం జేయివీచినం గని హరిణపోతవ్రాతంబుపై లంఘించు కిశోరకేసరియుంబోలెఁ బ్రమథగణం బా యసుర కింకర గణంబులం జుట్టుముట్టుకొని మహారభసంబున

అర్థము . ఇట్లు, ఆదిత్య - మండలంబుపైన్ = సూర్యబింబముపై, అవయవంబునన్ = అంగముతో, కవియు = ఆక్రమించు రాహు - మండలంబునున్ + పోలెన్ = రాహుబింబమువలె, ఆదిత్య - మండలంబు - పైన్ = దేవతల సమూహముపై, ఉరవడిన్ = మిక్కిలివేగముతో, కవియు, అసుర - కింకర - గణంబున్ + కని= రాక్షసభటుల సమూహమును జూచి, గణనాథుండు = ప్రమథ గణనాయకుఁడు, అమర - గణంబున్ = దేవతల సమూహమును, కనుంగొని, వీరభద్ర + ఆది - రుద్ర - గణంబులకున్ = వీరభద్రుఁడు మున్నగు రుద్రుని గణములకు, చేయి - వీచినన్ = ఉత్సాహము గలిగింపఁగా, కని, హరిణ - పోత - వ్రాతంబుపైన్ = లేడిపిల్లల సమూహముపై, లంఘించు = దూఁకు, కిశోర - కేసరియున్ + పోలెన్ = బాల సింహమువలె, ప్రమథ -గణంబు, ఆ +అసుర - కింకర - గణంబులన్ = ఆ రాక్షసుని భటుల సమూహములను, చుట్టుముట్టుకొని, మహత్ (మహా) - రభసంబునన్= గొప్పవేగముతో

తాత్పర్యము : ఇట్లు సూర్యమండలముపై సాంగముగాఁ గనియు రాహు బింబమువలె దేవతాసమూహముపై మిక్కిలి వేగములోఁ గనియు రాక్షసభటుల సమూహమును గని గణనాయకుఁడు దేవతల సమూహమును జూచి వీరభద్రుఁడు మున్నగు రుద్రగణములకు ఉత్సాహము గలిగింపఁగాఁ గని జింకపిల్లల సమూహముపై దూఁకు బాలసింహమువలెఁ బ్రమథగణము ఆ రాక్షస భటులను జుట్టుముట్టికొని మిక్కిలి వేగముతో - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముసమ

సీ వీ రొరుచేఁ దాఁకనీరని పో టుడ్గి
సుర నర కిన్నర వరులు సూడ,
నటిముటిఁ జంపెడుఁ గఱకంరుగణ మని
యాతుధానావలి భీతి పొందఁ,
దనివోవ శవములఁ దినఁగంటి మని భూత
గణ పిశాచాదులు రణము చేర
వేడుకతోఁ బోరు చూడంగఁగంటి నే
నని నారదుఁడు పొంగి గునిసియాడ

ఆ గగనవీధినుండి జగతిపైఁ జుక్కలు
డుల్లఁ, గుల నగములు పెల్లగిల్లఁ
బ్రళయ కాల భాతి నలిరేఁగి చంపెఁ ద
త్సమరభూమి నలిగి ప్రమథగణము 104

అర్థము . వీరు = ఈ ప్రమథులు, ఒరుచేన్ = ఇతరునిచేత, తాఁకన్ + ఈరు + అని = మార్కొననీరని, సుర - నర - కిన్నర -వరులు = దేవతలు, మనుష్యులు, కిన్నరులు అనువారిలో శ్రేష్ఠులు, పోటు + ఉడ్గి = యుద్ధము మాని, చూడన్,

కఱకంరు - గణము = శివుని ప్రమథగణము, అటిముటిన్ = వేగముగా, చంపెడున్ + అని, యాతుధాన + ఆవలి = రాక్షసుల సమూహము, భీతి = భయము, పొందన్

తని + పోవన్ = తృప్తి తీఱునట్లు, శవములన్, తినన్, కంటిమి, అని, భూత - గణ - పిశాచ + ఆదులు = భూతలముల సమూహము, పిశాచములు మున్నగునవి, రణము = యుద్ధభూమి, చేరన్,

వేడుకతోన్, పోరు = యుద్ధము, నేను - చూడంగన్ + కంటిన్ + అని = నేను జూడఁగలిగితి నని, నారదుఁడు, పొంగి, గునిసి + ఆడన్ = కులికియాడఁగా,

చుక్కలు = నక్షత్రములు, గగన - వీధి నుండి = ఆకాశవీధి నుండి, జగతిపైన్ = భూమిమీఁద, డుల్లన్ = రాలఁగా, కుల - నగములు = కుల పర్వతములు, పెల్లగిల్లన్, ప్రమథ - గణము = ప్రమథుల సమూహము, అలిగి కోపించి, ప్రళయ-కాల-భీతిన్ = ప్రళయ సమయమువలె, నలిరేఁగి = విజృంభించి, తద్ + సమర - భూమిన్ = ఆ యుద్ధభూమిలో, చంపెన్

తాత్పర్యము . ప్రమథ లితరులను మార్కొననీరని సురలు, నరులు, కిన్నరులు యుద్ధము మాని చూచుచుండఁగా, శివుని ప్రమథుల సమూహము వేగముతో చంపునని, రాక్షస సమూహము భయపడఁగా, తృప్తి దీఱునట్లు శవములను దినఁగలిగితిమని భూతపిశాచాదులు యుద్ధభూమిని జేరఁగా, వేడుకతోఁ బోరు చూడఁగలిగితినని నారదుఁడు సంతోషముతో నాట్యము చేయఁగా, ఆకాశవీధి నుండి చుక్కలు భూమిపై రాలఁగా, కులపర్వతములు పెల్లగిల్లఁగా, ప్రమథులు కోపించి ఆ యుద్ధభూమిలోఁ బ్రళయసమయమువలెఁ జెలరేఁగి చంపిరి

విశేషములు అలంకారము ఉపమ

తోటకము నలి నార్చుచు రుద్రుగణంబు లొగిం
గలహంబున వాహిని గల్లవడన్
నలుకం బొరిపుచ్చక యచ్చరుగాఁ
దల పుచ్చక మ్రింగిరి దానవులన్ **105**

అర్థము . రుద్ర - గణంబులు = శివుని ప్రమథగణములు, నలిన్ = ఉత్సాహముతో, ఆర్చుచున్ = ఆఱచుచు, ఒగిన్ = క్రమముగా, వాహిని = సేన, కలహంబునన్ = యుద్ధమునందు, కల్లవడన్ (కల్ల+పడన్) = కలఁతఁ జెందఁగా, అలుకన్ = కోపముతో, దానవులన్ = రాక్షసులను, పొరిపుచ్చక = చంపక, తలపుచ్చక = తలతీసివేయక, అచ్చరుగాన్ = ఆశ్చర్యకరముగా, మ్రింగిరి

విశేషములు: ఛందస్సు తోటక వృత్తమునకు నాలుగు పాదములుండును ప్రతి పాదమునను నాలుగు సగణములుండును మొదటి యక్షరమునకును, తొమ్మిదవ యక్షరమునకును యతిమైత్రి ప్రాస నియమము గలదు

సీ గజయూథముల నోలిఁ గబళించి నయగతి
నంగద మునుమిడి మ్రింగువారు
రథ్య సారథి హేతి రథికాలితో నశ్ర
మమున రథంబుల నమలువారు
తురగదళంబులఁ గరతలంబుల నొత్తి
పిడిచి క్రొన్నెత్తురు పీల్చువారు
దనుజులఁ బృథు పాదతలహతి వడిఁజంపి
సారుగా నేలపైఁ జమరువారు

తే నగుచు గణనాథు లసురల కాసురముగ
భూనభోవివరాంతరాపూరితోరు
భీషణాకారములు దాల్చి పెచ్చుపెరిఁగి
చంపి ససియాడి రొకనిమిషమున సమయ 106

అర్థము. గణ - నాథులు = ప్రమథ నాయకులు, గజ - యూథములన్= ఏనుఁగుల గుంపులను, ఓలిన్ = వరుసగా, కబళించి = పట్టుకొని, నయ-గతిన్ = బాగుగా, అంగదన్ = ఆఁకటితో, మునుమిడి (మునుము+ఇడి) = వరుసపెట్టి, మ్రింగువారున్

రథ్య -సారథి - హేతి - రథిక + ఆలితోన్ = గుఱ్ఱముల, సారథుల, కత్తుల రథికుల వరుసతో, అశ్రమమునన్= అనాయాసముగా, రథంబులన్, నమలువారున్,

తురగ - దళంబులన్ = గుఱ్ఱముల దండులను, కర-తలంబులన్ = అరచేతులతో, ఒత్తి = కొట్టి, పిడిచి, క్రొన్నెత్తురు (క్రొత్త + నెత్తురు), పీల్చువారున్

దనుజులన్ = రాక్షసులను, పృథు - పాద - తల - హతిన్ = పెద్ద పాదతలముల దెబ్బచే, వడిన్ = వేగముగా, చంపి, సారుగాన్ = నాట్యభేదముతో, నేలపైన్, చమరువారున్ రాచువారును

అగుచున్, అసురలకున్ = రాక్షసులకు, ఆసురముగన్ = రాక్షసముగా, భూ - నభస్ (ఃవ) + వివర + అంతర + ఆపూరిత + ఉరు - భీషణ + ఆకారములు = భూమ్యాకాశముల లోపల నంతటను నిండిన పెద్ద భయంకరములయిన రూపములు, తాల్చి, పెచ్చుపెరిఁగి = మిక్కిలి అతిశయించి, ఒక - నిమిషమునన్, సమయన్ = చచ్చునట్లు, చంపి, ససియాడిరి = చెల్లాచెదరుగా విసరివేసిరి

తాత్పర్యము ప్రమథనాయకులు ఏనుఁగుల గుంపులను బట్టుకొని ఆఁకటితో వరుసగా ప్రేంగువారును, గుఱ్ఱముల, సారథుల, ఖడ్గముల, రథికుల సమూహముతో అనాయాసముగా రథములను నమలువారును, గుఱ్ఱముల దండులను అరచేతులతోనొత్తి పిడిచి క్రొన్నెత్తురు పీల్చువారును, రాక్షసులను పెద్ద పాదముల దెబ్బచే వడిగాఁ జంపి నాట్యముతో నేలరాచువారును అగుచు రాక్షసులకు రాక్షసముగా రోదసియంతయు నిండిన మిక్కిలి భయంకరములయిన ఆకారములు దాల్చి మిక్కిలి అతిశయించి ఒక నిమిషమునఁ జచ్చునట్లు చంపి విసరివేసిరి

వ త దవసరంబున - తరువాతి పద్యముతో నన్వయము 107

క అతివేగంబునఁ బవి ప
ర్వతములు వ్రచ్చు గతి నొక్కవడి భీకరుఁడై
శతకోటికింకరాసుర
పతుల మహోగ్రాజి వీరభద్రుఁడు చంపెన్ 108

అర్థము అతి - వేగంబునన్ = మిక్కిలి వడిగా, పవి = వజ్రాయుధము పర్వతములు, వ్రచ్చు - గతిన్ = చీల్చువిధమున, వీరభద్రుఁడు, ఒక్కవడిన్ = ఒక్కమాఱుగా, భీకరుఁడు + ఐ = భయంకరుఁడయి, శత - కోటి - కింకర + అసుర - పతులన్ = నూఱుకోట్ల భటులను, రాక్షస రాజులను, మహత్ (మహా) + ఉగ్ర + ఆజిన్ = మిక్కిలి భయంకరమైన యుద్ధమున, చంపెన్

తాత్పర్యము. వజ్రాయుధము మిక్కిలి వేగమున పర్వతములను జీల్చువిధమున నొక్కమాఱుగా భయంకరుఁడయి వీరభద్రుఁడు శతకోటిభటులను, రాక్షసనాయకులను గొప్పయుద్ధమునఁ జంపెను

విశేషములు. అలంకార ముపమ

మహామాయ రక్తబీజునిఁ దాఁకులు

వ ఇ ట్లమరభయంకరాసురకింకరగణంబులు శంకరకింకర గణంబులకుం గంకాళాస్థి కపాలాద్యలంకారంబైనం గొప్పించి తారకాసురేంద్రు సేనాపతి రక్తబీజుం డుద్ధవడిం దెరల నెత్తి కమలవనంబుం గప్పు నీహార పటలంబునుం బోలెం బ్రమథగణంబు బెగడుకొన నిశితాస్త్రవర్షంబునం దేల్చుచున్నం గని మహాకాలాగ్ని రుద్రోద్రేకంబునం బెరిఁగి తదీయాస్త్రజాలంబులతోడ వాని సర్వాంగంబులు జర్జరితంబులుగా నేసినం దదంగసంగతానేకవిక్షతక్షతజాతబిందుసందోహం బవనిపైఁ దొరిఁగి తద్రూపబల

పరాక్రమానేక రక్తబీజ సమూహంబులై నెగసినం గని మహామాయ తదీయ రూక్ష రాక్షస మాయాక్షోభంబు నిరీక్షించి మందస్మితాననారవింద యగుచు నాక్షేపంబున నాక్షణంబ 109

అర్థము. ఇట్లు, అమర - భయంకర - అసుర - కింకర - గణంబులు = దేవతలకు వెఱపు పుట్టించు రాక్షసభటుల సమూహములు, శంకర - కింకర - గణంబులకున్ = శివుని భటులైన ప్రమథగణములకు, కంకాళ + ఆస్థి - కపాల + ఆది + అలంకారంబు + ఐనన్ = అస్థిపంజరము, ఎముకలు, పుఱ్ఱెలు మున్నగు భూషణములు కాఁగా, కోపించి, తారక + అసుర + ఇంద్రు - సేనాపతి = రాక్షసశ్రేష్ఠుఁడైన తారకుని సేనానాయకుఁడు, (అగు), రక్తబీజుండు, ఉద్దవడిన్ = మిక్కిలి వేగముగా, తెరలన్ + ఎత్తి = దండెత్తి, కమల - వనంబున్ = తామరతోఁపును, కప్పు, నీహార - పటలంబునున్ + పోలెన్ = మంచు సమూహమువలె, ప్రమథగణంబు = ప్రమథుల సమూహము, బెగడుకొనన్ = భయపడఁగా, నిశిత + అస్త్ర - వర్షంబునన్ = వాఁడిబాణములవానయందు, తేల్చుచున్ + ఉన్నన్, కని, మహత్ (మహా) +కాల + అగ్ని రుద్ర + ఉద్రేకలంబునన్ = గొప్ప ప్రళయాగ్ని రుద్రుల ఆవేశముతో, పెరిఁగి, తదీయ+అస్త్ర - జాలంబులతోడన్ = వారి బాణ సమూహములతో, వాని - సర్వ + అంగంబులున్ = వానియెల్ల అవయవములును, జర్జరితంబులు + కాన్ = తూంట్లు పడినవిగా, ఏసినన్ = కొట్టఁగా, తద్ + అంగ - సంగత + అనేక - విక్షత - క్షతజాత - బిందు - సందోహంబు = వాని శరీరమునందుఁగూడుకొన్న పెక్కు గాయముల రక్తబిందువుల సమూహము, అవనిపైన్ = భూమిమీఁద, తొరిఁగి = కాఱి, తద్ + రూప - బల - పరాక్రమ + అనేక - రక్త బీజ - సమూహంబులు + ఐ = ఆ రూప బలపరాక్రమములతోడి పెక్కండ్రు రక్తబీజుల సమూహములయి, నెగసినన్ - లేవఁగా, కని, మహామాయ, తదీయ - రూక్ష - రాక్షస - మాయా - క్షోభంబు = ఆ కఠినమైన రాక్షసుల మాయవలని కలఁత, నిరీక్షించి = చూచి, మంద- స్మిత + ఆనన + అరవింద = చిఱునవ్వుతోడి ముఖ పద్మముగలది, అగుచున్, ఆక్షేపంబునన్ = తిరస్కారముతో, ఆక్షణంబు + ఆ = వెంటనే

తాత్పర్యము. ఇట్లు దేవతలకు భయంకరులైన రాక్షస భటసమూహములు శివుని భటులైన ప్రమథులకు అస్థిరపంజరము, ఎమ్ములు, పుఱ్ఱెలు మున్నగు నలంకారములు కాఁగా గోపించి, తారకాసురుని సేనానాయకుఁడగు రక్తబీజుఁడు మిక్కిలి వేగముగా దండెత్తి తామరతోఁపును గప్పు మంచురాశివలెఁ బ్రమథ

గణము భయపడునట్లు వాఁడి యమ్ముల వానలోఁ దేల్చుచుండఁగాఁ జూచి మహాకాలాగ్నిరుద్రుల ఉద్రేకముతోఁ బెరిఁగి వారి అస్త్ర సమూహముతో వాని యెల్ల యవయవములును చూంట్లుపడఁ గొట్టఁగా, ఆతని అవయవములందలి గాయములందలి రక్తబిందువుల సమూహము భూమిపైఁ గాఱి అతని రూపబలపరాక్రమములతోడి పెక్కండ్రు రక్తబీజుల సమూహములై లేచినఁ జూచి మహామాయ ఆతని పరుషమైన రాక్షస మాయా క్షోభముఁ జూచి చిఱునవ్వుతోడి ముఖపద్మము గలదయి తిరస్కారముతో వెంటనే-తరువాతి పద్యముతో నన్నయము

మ అలుకం జండిక పేర్చి యేయు నశితోగ్రాస్త్రాహతిన్ రక్తబీ
జుల దేహౌఘము లోలి వ్రస్సి మహి నెచ్చో నింకెఁ గ్రొన్నెత్తు ర
గ్గలమై యచ్చటఁ బుట్టి భూతలము నాకాశాంతరాళంబు ది
క్కులు బ్రహ్మాండము నిండి రొక్కమొగి రక్షోనాథు లుగ్రాకృతిన్ 110

అర్థము. చండిక, అలుకన్ = కోపముతో, పేర్చి = విజృంభించి, ఏయు = ప్రయోగించునట్టి, నిశిత + ఉగ్ర + అస్త్ర + ఆహతిన్ = వాఁడియ్యైనవి భయంకరములయినవి అగు బాణముల దెబ్బచే, రక్తబీజుల, దేహ + ఓఘములు = శరీర సమూహములు, ఓలిన్ = వరుసగా, వ్రస్సి = చీలి, క్రొన్నెత్తురు (క్రొత్త + నెత్తురు), అగ్గలము + ఐ = అధికమయి, మహిన్ = భూమియందు, ఎచ్చోన్ (ఏ + చోటన్) = ఎచ్చట, ఇంకెన్ = ఇంకెనో,అచ్చటన్, రక్షస్ + నాథులు = రాక్షసనాయకులు, ఉగ్ర + ఆకృతిన్ = భయంకరాకారముతో, పుట్టి, భూతలమున్, ఆకాశ + అంతరాళంబున్ = ఆకాశములోపలి భాగమును, దిక్కులును, బ్రహ్మాండమున్, ఒక్కమొగిన్ = ఒక్కపెట్టున, నిండిరి

తాత్పర్యము: చండిక కోపముతో విజృంభించి ప్రయోగించు వాఁడివియు, ఉగ్రములునైన అస్త్రముల దెబ్బచే రక్తబీజుల శరీరసమూహములు బాగుగాఁజీలి క్రొత్త నెత్తురు అధికమయి భూమియం దెచ్చట నింకెనో, అచ్చట రాక్షసనాథులు భయంకరాకారములతోఁ బుట్టి భూమ్యాకాశముల నడిమిభాగము, దిక్కులు, బ్రహ్మాండము ఒక్కపెట్టున నిండిరి

విశేషములు. క్రొన్నెత్తురు = క్రొత్త + నెత్తురు, దేహౌఘములు = దేహ + ఓఘములు - వృద్ధి సంధి, ఎచ్చోన్ - ఏ + చోటన్ - త్రికసంధిచే - ఎచ్చోటన్ 'ఉత్తరపదంబగు చోట శబ్దము టాక్షరమునకు లోపంబు విభాషనగు' బాల సమాస 16 ఎచ్చో రక్షోనాథులు = రక్షస్ + నాథులు

వ ఇట్లు చండిక వెంగిమసంగినట్లు కడిమి నయ్యసురవరుల నెంతెంత వధించె నంతంత కగ్గలంబైనంగని మహామాయ తదీయమాయకుం బ్రతికారంబు విచారించి యక్షణంబ 111

అర్థము. ఇట్లు చండిక, వెంగి-మసంగిన + అట్లు= వ్యాఘ్రము విజృంభించిన విధమున (?) కడియన్ = పరాక్రమముతో, ఆ + అసుర-వరులన్ = ఆ రాక్షస శ్రేష్ఠులను, ఎంత + ఎంత - వధించెన్ = ఎంతెంతచంపెనో, అంత + అంతకున్, అగ్గలంబు + ఐనన్ = అధికము కాగా, కని, మహామాయ, తదీయ - మాయకున్ = వారి మాయకు, ప్రతికారము = ప్రతిక్రియ = ఆలోచించి, అక్షణంబు + ల = వెంటనే

తాత్పర్యము ఇట్లు చండిక వ్యాఘ్రము విజృంభించిన విధమున పరాక్రమముతో ఆ రాక్షసశ్రేష్ఠులను ఎంతెంత చంపెనో వారు అంతంతకు అధికము కాగా జూచి మహామాయ వాని మాయకు బ్రతిక్రియ ఆలోచించి వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. వెంగిమసంగు = వ్యాఘ్రము విజృంభించు - ఈ యర్థము నిఘంటువులఁ గానరాలేదు వావిళ్లవారి లఘుటీకనుండి గ్రహింపఁబడినది అలంకార ముపమ

గీ కలహభూమిలో నాలుక కలయఁ బఱపి
తావికొని త్రిప్పి చాముండి దేవి కరము
కడఁకఁ బొసిపోవకుండ రాక్షసుల నెల్ల
మ్రింగె వడి నెల్వు చీమల మ్రింగినట్లు 112

అర్థము. చాముండీ దేవి, కలహ - భూమిలోన్ = యుద్ధభూమిలో, నాలుక, కలయన్ = అంతటను, పఱపి = వ్యాపింపఁజేసి, తావికొని = రుచిచూచి, త్రిప్పి, కరము - కడఁకన్ = మిక్కిలి ఉద్ధతితో, పొసి + పోవక + ఉండన్ = తప్పిపోకుండునట్లు, ఎల్వు = ఎలుఁగు - భల్లూకము, చీమలన్, మ్రింగిన + అట్లు, రాక్షసులన్ + ఎల్లన్, వడిన్, మ్రింగెన్

తాత్పర్యము. చాముండీదేవి యుద్ధభూమిలో నాలుకనంతటను వ్యాపింపఁజేసి రుచిచూచి త్రిప్పి మిక్కిలి గర్వముతో తప్పిపోకుండ నెలుఁగుబంటి చీమలను మ్రింగినట్లు రాక్షసులనందఱను మ్రింగెను

విశేషములు: అలంకార ముపమ ఎలుఁగు - ఎలువు- ఎల్వు - రూపాం

వ ఇట్లు లిగ్మకర కరప్రహతి దిఙ్ముఖంబునం దడంగు తమఃపటలంబునుం బోలెఁ జండిక మండలాగ్రాభిహతిని రక్తబీజసమూహంబు మహాకాళి ముఖ గహ్వరంబునం దడంగినం గోపానలోద్దీపితహృదయులై యశిత దుర్మద మంజీర కుంభోదర వికటాక్ష విద్యున్ముఖ ప్రముఖు లొక్కపెట్ట విజృంభించి 113

అర్థము ఇట్లు, తిగ్మకర-కర-ప్రహతిన్ = సూర్యుని కిరణముల దెబ్బచే, దిశ్(క్) + ముఖంబునందున్ = ఉదయసమయమునందు, అడంగు = నశించు, తమస్( ) + పటలంబునున్ + పోలెన్ = చీఁకటుల సమూహమువలె, చండిక (యొక్క), మండలాగ్ర + అభిహతినిన్ = ఖడ్గముయొక్క దెబ్బచే, రక్తబీజ - సమూహంబు = రక్తబీజుల యొక్క గుంపు, మహాకాళి - ముఖ - గహ్వరంబునందున్ = గుహవంటి మహాకాళి ముఖమునందు, అడంగినన్ = నశింపఁగా, కోప + అనల +ఉద్దీపిత - హృదయులు + ఐ = కోపమనెడి అగ్నిచే మిక్కిలి మండింపఁబడిన హృదయములు గలవారయి, అశిత - దుర్మద - మంజీర - కుంభోదర - వికటాక్ష - విద్యున్ముఖ - ప్రముఖులు= అశితుఁడు, దుర్మదుఁడు, మంజీరుఁడు, కుంభోదరుఁడు, వికటాక్షుఁడు, విద్యున్ముఖుఁడు మున్నగువారు, ఒక్కపెట్టన్ = ఒక్కమాఱుగా, విజృంభించి = చెలరేఁగి

తాత్పర్యము. ఇట్లు సూర్యకిరణముల దెబ్బచే నుదయకాలమున నశించు చీఁకటుల సమూహమువలెఁ జండిక కత్తి వ్రేటుచే రక్తబీజుల సమూహము మహాకాళి ముఖగుహయందు నశింపఁగా, కోపాగ్నిచే నుద్దీపితములైన హృదయములుగల అశితుఁడు, దుర్మదుఁడు, మంజీరుఁడు, కుంభోదరుఁడు, వికటాక్షుఁడు, విద్యున్ముఖుఁడు మున్నగువారు ఒక్కమాఱుగా చెలరేఁగి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

క **తారకు ననుజులు ఘోరా**
కారులు పదివేవు రొక్కకవిఁ గవిసిరి, జం
భారి మురారాతులుఁ గ్రౌం
చారియు బడలువడఁ గవిసి రతిరభసమునన్ 114

అర్థము. ఘోర + ఆకారులు = భయంకరములైన ఆకారములు గల వారు, అగు, తారకు + అనుజులు = తారకాసురుని తమ్ములు, పదివేవురు, ఒక్క - కవిన్ = ఒక్కపెట్టున, కవిసిరి = మార్కొనిరి, జంభ + అరి = ఇంద్రుఁడు, ముర + అరాతులున్ = విష్ణువును, క్రౌంచ + అరియున్ = కుమారస్వామియు, బడలు + పడన్ = శ్రమము నొందఁగా, అతి - రభసమునన్ = మిక్కిలి వేగముతో, కవిసిరి = మార్కొనిరి

తాత్పర్యము . భయంకరాకారులైన తారకాసురుని తమ్ములు పదివేవు రొక్కపెట్టున మార్కొనిరి ఇంద్ర విష్ణు కుమారస్వాములును శ్రమమునొందఁగా మిక్కిలి వేగమున వారిని మార్కొనిరి

విఘ్నేశ్వరుఁడు రాక్షసవీరులపై దండెత్తుట

వ ఇట్లు సుతాయుతం బయుతానుజదనుజ వరు లొక్కండై తెరల నెత్తినం గని దంతిముఖుం డంతకు నభిముఖుండై యుగాంత కృతాంతుండునుం బోలెం గోలుమసంగి కరాసిధార నసురుల సిరంబు లురుల సేయుచు 115

అర్థము ఇట్లు, సుత + అయుతంబు = పదివేవురు సుతులు, అయుత + అనుజ - దనుజవరులు = పదివేలమంది తమ్ములు, రాక్షసశ్రేష్ఠులు, ఒక్కండు + ఐ = ఒక్కటయి, తెరలన్ + ఎత్తినన్ = దండెత్తఁగా, కని, దంతి - ముఖుండు = ఏనుఁగు ముఖమువంటి ముఖము గలవాఁడు - వినాయకుఁడు, అంతకున్ = ఆ సేనకంతకును, అభిముఖుండు + ఐ = ఎదురయినవాఁడయి, యుగ + అంత - కృతాంతుండునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి యముని వలె, కోలు మసంగి = మిక్కిలి విజృంభించి, కర + అసి- ధారన్ = చేతికత్తి యంచుతో, అసురుల - సిరంబులు = రాక్షసుల శిరస్సులు, ఉరులన్ + ఏయుచున్ = రాలఁగొట్టుచు

తాత్పర్యము . ఇట్లు పదివేవురు సుతులు పదివేవురు తమ్ములు రాక్షసవర్యులు ఒక్కటయి దండెత్తఁగాఁ, జూచి, విఘ్నేశ్వరుఁడు ఆ సేన కంతకును ఎదురు నిలిచి ప్రళయ సమయ యమునివలె మిక్కిలి విజృంభించి చేతి కత్తి యంచుతో రాక్షసుల శిరస్సులను రాలఁగొట్టుచు - తరువాతి పద్యముతో నన్వయము

చ కరిముఖుఁ డల్గి పట్టుకొని కైపున జిఱ్ఱనఁ ద్రిప్పివేయఁగా
హరికులిశాతిభీతిఁ జను నద్రులపోలెఁ బయోధిఁగూలె స
త్వరగతిఁ గొన్ని, కొన్ని లయవాతవిధూతఘనాలివోలె నం
బరమునఁ దూలుచుండెఁ బృథు బంధుర దైత్య కబంధ సంఘముల్ 116

అర్థము : కరిముఖుఁడు = గజాననుఁడు, అల్గి = కోపించి, పట్టుకొని, కైపునన్ = విజృంభణముతో, జిఱ్ఱనన్ = జిఱ్ఱయను ధ్వనిగలుగులాగున, త్రిప్పి -

వేయఁగాన్, హరి - కులిశ + అతి - భీతిన్ = ఇంద్రుని వజ్రాయుధమువలని మిక్కిలి వెఱపుతో, చను = పోవు, అద్రుల - పోలెన్ = కొండలవలె, కొన్ని = కొన్ని కబంధములు సత్వర -గతిన్ = త్వరలో, పయోధిన్ = సముద్రమునందు, కూలెన్, కొన్ని - పృథు - బంధుర - దైత్య - కబంధ - సంఘముల్ = మిక్కిలి పెద్దవి ఒప్పిదములైనవి అగు రాక్షసుల మొండెముల గుంపులు కొన్ని, లయ - వాత - విధూత - ఘన + ఆలి + పోలెన్ = ప్రళయసమయవాయువుచే విశేషముగా నెగురఁగొట్టఁబడిన మేఘముల వరుసవలె, అంబరమునన్ = ఆకాశమున, తూలుచున్ + ఉండెన్ = ఎగుచుచుండెను

తాత్పర్యము . గజాననుఁడు కోపమునఁ ఒట్టుకొని ఎఱ్ఱంభణములో జిట్టుఁ ద్రిప్పివేయఁగా, మిక్కిలి పెద్దవి, ఒప్పిదములయినవి అగు రాక్షసుల మొండెముల సమూహములు కొన్ని ఇంద్రుని వజ్రాయుధమువలని అమిత భీతితోఁ బోవు కొండలవలె సత్వరముగా సముద్రమునఁ గూలెను కొన్ని ప్రళయ సమయవాయువుచే నెగురఁగొట్టఁబడిన మేఘములవరుసవలె నాకాశమున నెగరుచుండెను

విశేషములు అలంకార ముపమ

వ ఇట్లు మదగజంబు కోఁపలి మదంబున నంగదగొని పెఱికిపెట్టినట్లు గజవదనుండు దనుజవరుల హల్లకల్లోలంబుగాఁ దాఁకి చిత్రవధ సేయుచు 117

అర్థము · ఇట్లు, మద - గజంబు = మత్తేభము, కోఁపలి = కోపించి, మదంబునన్ = మదముతో, అంగద + కొని = ఆఁకలిగొని, పెఱికి పెట్టిన + అట్లు = పెల్లగించిపెట్టిన విధమున, గజ - వదనుండు = కరిముఖుఁడు, దనుజ - వరులన్ = రాక్షసశ్రేష్ఠులను, హల్లకల్లోలంబుగాన్ = అల్లకల్లోలమగునట్లు తాఁకి, చిత్ర-వధ + చేయుచున్

తాత్పర్యము . ఇట్లు మదపుటేనుఁగు కోపించి మదముతో నాఁకలిగొని పెల్లగించిపెట్టిన విధమున గజాననుఁడు రాక్షసశ్రేష్ఠులను అల్లకల్లోలముగాఁ దాఁకి చిత్రవధచేయుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకార ముపమ

**మ పదసంఘట్టనఁ బెట్టి మట్టె నశితున్, బాహాసి నుగ్గాడె దు
ర్మదు, నత్యుగ్రుఁ గురారధారఁ దునిమెన్, మంజీరుఁ గుంభోదరున్
గద వ్రేసెన్, వికటాక్షు శక్తినిహతుం గావించె, విద్యున్ముఖున్
రదనాగ్రంబునఁ జీరె దట్టముగ హేరంబుండు సంరంభణన్ 118**

అర్థము. హేరంబుండు = వినాయకుఁడు, సంరంభణన్ = కోపముతో, అశితున్ = అశితుఁడను రాక్షసుని, పద - సంఘట్టనన్ = కాళ్ళక్రొక్కిడితో, పెట్టి, మట్టెన్ = నేలరాచెను, దుర్మదున్, బాహా + అసిన్ = చేతికత్తితో, నుగ్గాడెన్ = పాడిచేసెను, అత్యుగ్రున్, కురార - ధారన్ = గండ్రగొడ్డటిఅంచుతో, తునిమెన్ = ఖండించెను, మంజీరున్, కుంభోదరున్, గదన్ = గదతో, వ్రేసెన్ = కొట్టెను, వికటాక్షున్, శక్తి - నిహితున్ = శక్తి అను ఆయుధమతోఁ గొట్టఁబడినవానిని, కావించెన్ విద్యున్ముఖున్, రదన + అగ్రంబునన్ = దంతపుఁగొనతో, దట్టమగన్, చీరెన్ = చీర్చెను

తాత్పర్యము వినాయకుఁడు కోపముతో నశితునిఁ గాళ్ల క్రొక్కిడిచే నేలరాచెను దుర్మదునిఁ జేతికత్తితోఁ బొడిచేసెను అత్యుగ్రుని పరశువునంచుతో ఖండించెను మంజీరుని, కుంభోదరుని గదతోఁ గొట్టెను వికటాక్షుని క్ష్తిచే నిహతుని గావించెను విద్యున్ముఖుని దంతాగ్రముతో గట్టిగాఁ జీల్చెను

విశేషములు. వికటోగ్రశక్తి నిహతుం గావించె - అను పారమునకు బదులుగా - వికటాక్షు శక్తి నిహతుంగావించె - అను పారము స్వీకరింపఁబడినది 113 వచనములోఁ బేర్కొనఁబడిన రాక్షసులలో వికటాక్షుఁ డొకఁడని కలదు హేరంబ-హే - రుద్రసమోపేరంబతే తిష్టతీతి హేరమ్బ: - రుద్రుని యొద్ద నుండువాఁడు - అమరము వినాయకుఁడు

వ ఇట్లు దనుజేంద్రుం డయుతతనూజాయుతానుజవరు లొక్కట భూరజ:పటలంబునుం బోలె గజవదను మదజలాసారంబున మ్రగ్గినం గని మహామనస్వి గావున దానికి గహనంబైన మనోబలంబున భుజబలంబ నిజబలంబుగాఁ గైకొని యక్షణంబ 119

అర్థము: ఇట్లు, దనుజ + ఇంద్రుండు = రాక్షసశ్రేష్ఠుఁడు, అయుత - తనూజ +అయుత + అనుజవరులు = పదివేవురు కొడుకులు, పదివేవురు తమ్ములు, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, భూ - రజస్ (:) + పటలంబునున్ + పోలెన్ = నేలయందలి ధూలి సమూహమువలె, గజ - వదను = వినాయకుని యొక్క, మద - జల + ఆసారంబునన్ = మదజలమనెడి జడివానయందు, మ్రగ్గినన్ = అడఁగఁగా, కని, మహత్ (మహా) + మనస్వి = గొప్ప మనస్సు దిటవుగలవాఁడు, కావునన్, దానికిన్ = ఆ మ్రగ్గుటకు, గహనంబు + ఐనన్ = దుఃఖము అయినను, మనస్(:) + బలంబునన్ = మనశ్శక్తిచే, భుజ - బలంబు + అ = బాహుబలమే, నిజ - బలంబు + కాన్ = తన బలముగా, కైకొని, అక్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము ఇట్లు రాక్షసరాజు పదివేవురు సుతులు, పదివేవురు తమ్ములు ఒక్కమాటుగా భూధరాలిరాశివలె గజాననుని దానజలమనెడి జడివానయందు అడఁగఁగాఁ గని గొప్ప ధైర్యశాలి కావున, దానికి వగచియు, మనశ్శక్తిచే బాహుపరాక్రమమే తన బలముగా భావించి వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము రూపకానుప్రాణితోపమ

తారకుఁడు దేవసనఁదాఁకుట

మ అది కాలాగ్ని శిఖాకలాప, మది కల్పాంతాంతకాస్ఫోటకం,
బది లోకత్రయభక్షణక్షమసముద్యద్భైరవాడంబరం
బది సంహారహరోగ్రనేత్రశిఖి, శౌర్యాటోపవీరగ్రహం
బది నాఁ దారకుఁ డెత్తుదెంచె నతిరౌద్రాకారుఁడై పోరికిన్ 120

అర్థము అది, కాల + అగ్ని - శిఖా - కలాపము = ప్రళయ సమయాగ్ని జ్వాలల సమూహము, అది, కల్ప + అంత + అంతక + ఆస్ఫోటకంబు= ప్రళయ సమయమునందలి యముని చఱపు, అది, లోక - త్రయ - భక్షణ - క్షమ - సముద్యత్ + భైరవ + ఆడంబరంబు = ముల్లోకములను దినుటకు సమర్థుఁడై యుద్యమించుచున్న భైరవుని యొక్క విజృంభణము, అది, సంహార - హర + ఉగ్ర - నేత్ర - శిఖి = లయకారుఁడగు శివుని భయంకరమైన కంటిమంట, అది, శౌర్య + ఆటోప - వీర -గ్రహంబు = పరాక్రమము యొక్క విజృంభణము గల వీరగ్రహము, నాన్ = అనఁగా,తారకుఁడు, అతి -రౌద్ర + ఆకారుఁడు + ఐ = మిక్కిలి భయంకరమైన ఆకారముగలవాఁడయి, పోరికిన్ = యుద్ధమునకు, ఎత్తుదెంచెన్ = దండెత్తివచ్చెను

తాత్పర్యము. అది ప్రళయానలజ్వాలాసమూహము, అది యుగాంత సమయయముని చఱపు, అది ముల్లోకములను మ్రింగ సమర్థుఁడైన భైరవుని ఆడంబరము, అది లయకారుఁడైన హరుని భయంకరనేత్రాగ్ని, అది పరాక్రమాటోపముగల వీరగ్రహము అనునట్లు తారకాసురుఁడు మిక్కిలి భయంకరమైన ఆకారముగలవాఁడయి యుద్ధమునకు దండెత్తివచ్చెను

విశేషములు. అలంకార ముత్ప్రేక్ష

వ ఇట్లు జగద్భయంకరాకారుండై తెరలనెత్తి యెత్తిన ముష్టిన మహారభసంబున 121

అర్థము ఇట్లు, జగత్ + భయంకర + ఆకారుండు + ఐ = లోకములకు వెఱపు పుట్టించు రూపము గలవాఁడయి, తెరలన్ + ఎత్తి = దండెత్తి, ఎత్తిన - ముష్టిన్ + అ = దండెత్తిన వెంటనే, మహత్ (మహా) - రభసంబునన్ = గొప్పవేగముతో

తాత్పర్యము ఇట్లు లోకభీకరాకారుఁడై దండెత్తి, దండెత్తిన వెంటనే గొప్ప వేగముతో - తరువాతి పద్యముతో నన్వయము

తే **కరులు గాఁచిన మద్దులుగా, హయంబు**
లొదరు నేదుల కదుపుగా, నుగ్రభటులు
సిట్టవెదుళుల కదుపుగా శీఘ్రమేసె
నమరబలము నమోఘబాణములు నాట 122

అర్థము: కరులు = ఏనుఁగులు కాఁచిన - మద్దులు + కాన్ = కొంచెము కాల్చిన నల్లమద్దుల మ్రాఁకులు కాఁగా, హయంబులు = గుట్టములు, ఒదరు + ఏదుల - కదుపుగా = విజృంభించు ముండ్ల పందుల గుంపుకాఁగా, ఉగ్ర - భటులు = భయంకరులైన వీరులు, చిట్ట - వెదుళుల - కదుపు + కాన్ = చిన్న వెదురుల గుబురుగా, అమర - బలమున్ = దేవతల సేనను, అమోఘ - బాణములు = వ్యర్థముకాని బాణములు, నాటన్ = నాటుకొనునట్లు, శీఘ్రము + ఏసెన్ = వెంటనే ప్రయోగించెను

తాత్పర్యము. (తారకుఁడు) ఏనుఁగులు ఇంచుక కాల్చిన మద్ది మ్రాఁకులు కాఁగను, గుట్టములు విజృంభించు ముండ్ల పందుల మందగాను, భయంకరులైన భటులు పొట్టి వెదురుల గుబురుకాఁగను దేవతల సేవను వ్యర్థము కాని బాణములు నాటుకొనునట్లు వెంటనే ప్రయోగించెను

విశేషములు: అలంకారము రూపకము

ఉ **తారకుఁ డల్క నేయు నతి దారుణ ఘోర శరాలి బల్విడిం**
బోరు నమర్త్యమర్త్యబలముం గొని వెల్వడిపోయి యొక్కెడన్
ధారుణిఁ గాడిపోవ్ఁ గలదాయలఁ జంపి రసాతలంబునం
దారసి నాగసంఘము రయంబునఁ జంపఁగఁ జొచ్చు నట్టిదై 123

అర్థము తారకుఁడు, అల్కన్ = కోపముతో, ఏయు = ప్రయోగించు, అతి - దారుణ - ఘోర - శర + ఆలి = మిక్కిలి క్రూరములు, భయంకరములునైన బాణముల వరుస బల్విడిన్ = పరాక్రమముతో, పోరు = యుద్ధము చేయు, అమర్త్య - మర్త్య - ఒలమున్ = దేవతల, మనుష్యుల సేనను, కొని - వెల్వడి - పోయి = దూసికొని వెలువడిపోయి, కల - దాయలన్ = నేలపై ఉన్న శత్రువులను, చంపి, రసాతలంబునన్ = పాతాళమునందు, ఆరసి = చూచి, నాగ - సంఘమున్ = పాముల సమూహమును, రయంబునన్ = శీఘ్రముగా చంపఁగన్ = చంపుటకు, చొచ్చు + అట్టిది +ఐ = ప్రవేశించునట్టిదయి, ఒక్క + ఎడన్ = ఒకచోట, ధారుణిన్ = భూమిని, కాడిపోవున్ = చీల్చుకొనిపోవును

తాత్పర్యము తారకాసురుఁడు కోపముతోఁ బ్రయోగించు మిక్కిలి క్రూరములు, భయంకరములునైన బాణముల సముదాయము పరాక్రమముతోఁ బోరు దేవతల మనుష్యుల సేనను గొట్టి అటనుండి వెలువడి పోయి ఒకచో - నేలపై నున్న శత్రువులను జంపి పాతాళమునన్నున్న నాగుల సంఘమును శీఘ్రముగాఁ జంపుటకుఁ జొచ్చునదియై, నేలను చీల్చుకొని పోవును

విశేషములు · అలంకార ముత్ప్రేక్ష

వ ఇట్లు విలయకాలనీలఘనాఘనంబునుంబోలె నిరతిశయాతినిశిత శరవర్షంబు గురియందొడంగిన **124**

అర్థము. ఇట్లు, విలయ - కాల - నీల - ఘనా - ఘనంబునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి నల్లని వర్షాకాలపు మేఘమువలె, నిరతిశయ - అతి - నిశిత - శర - వర్షంబు = మిక్కిలి వాఁడియైన బాణముల వాన, కురియన్ = తొడంగినన్ = కురియ నారంభింపఁగా -

తాత్పర్యము · ఇట్లు ప్రళయసమయమునందలి నల్లని వర్షాకాలపు మేఘమువలె మిక్కిలి వాఁడి బాణముల వర్షము కురియ నారంభింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు · అలంకార ముపమ

క అమరారిశిలీముఖహతి
సుమనోగణదర్ప మడఁగె సాలవక కడు వే
గమున శిలీముఖహతిచే
సుమనోదర్పంబు చెడుట చోద్యమె యెందున్? **125**

అర్థము అమర + అరి - శిలీముఖ - హతిన్ = రాక్షసుని (తారకుని) బాణముల దెబ్బచే, సుమనస్(ం) + గణ - దర్పము = దేవతాగణముల గర్వము, సాలవక = విజృంభింపక, కడు - వేగమునన్ = మిక్కిలి వేగముగా, అడఁగెన్ = నశించెను, శిలీముఖ - హతిచేన్ = బాణముల దెబ్బచే - తుమ్మెదల దెబ్బచే, సుమనస్ ( ) + దర్పంబు = దేవతల గర్వము, పువ్వుల శోభ, చెడుట = నశించుట, ఎందున్ = ఎక్కడనైనను, చోద్యమె = ఏంతయా ?

తాత్పర్యము తారకాసురుని బాణముల దెబ్బచే సుమనోగణముల (దేవగణముల) దర్పము విజృంభింపక మిక్కిలి వేగముగా నడఁగెను శిలీముఖ - హతిచే (బాణముల హతిచే) (తుమ్మెదల హతిచే), సుమనోదర్పము (దేవతల దర్పము - పూలశోభ) ఎక్కడనైనను నశించుట ఏంతయా ? కా దనుట

విశేషములు : అలంకారము శ్లేషానుప్రాణితార్థాంతరన్యాసము

వ ఇ ట్లతిదారుణంబగు తారకాసురేంద్రు నంపఱు కబ్బగింపక 126

అర్థము. ఇట్లు, అతి - దారుణంబు + అగు = మిక్కిలి భయంకరమైన, తారక + అసుర + ఇంద్రు + రాక్షసరాజయిన తారకుని యొక్క, అంపఱకున్ = బాణ సమూహమునకు, అబ్బగింపక = ఓర్వలేక

తాత్పర్యము , ఇట్లు మిక్కిలి భయంకరమైన తారకాసురుని బాణ సమూహమునకు నిలువలేక - తరువాతి పద్యముతో నన్వయము

క అని నఱిమి చచ్చిరేనియు
ననిమిషపురి కరుగఁగాంతు రంతియ జను, లో
డిన మాకు దివిక పోనగు
ననుగతిఁ జెడ నోడి పాఱె నమరగణంబుల్ 127

అర్థము జనులు = మనుష్యులు, అనిన్ = యుద్ధమునందు, అఱిమి = ఎదుర్కొని, చచ్చిరి + ఏనియున్ = చచ్చినచో, అనిమిష -పురికిన్ = దేవతల పురమునకు - అమరావతికి, అరుగన్ + కాంతురు = పోవఁగలుగుదురు, అంతియ = అంతే, ఓడినన్ = ఓడిపోయినను, మాకున్ = మాకు, దివికిన్ + అ = స్వర్గమునకే, పోన్ + అగున్ = పోవనగును, అను - గతిన్ = అనువిధమున, అమర - గణంబుల్ = దేవతల సమూహములు, చెడన్ = చెడునట్లు, ఓడి, పాఱెన్ పాఱిపోయెను

తాత్పర్యము 'మనుష్యులు యుద్ధమున ఎఱ్ఱంబించి చచ్చినచో స్వర్గపురమున కరుగఁగలుగుదురు అంతే ఓడిపోయినను మేము స్వర్గమునకే పోనగును అను విధమున చెడునట్లు ఓడి దేవతలు పాటిపోవుచుఁ

విశేషములు అలంకార ముత్ప్రేక్ష

చ **సుర లని నోడి దిక్పతులఁ జొచ్చిరి, దిక్పతులున్ సురాలియున్, సురపతిఁజొచ్చి, రింద్రుఁడును, జుట్టిన దిక్పతులున్, సురౌఘమున్, సరసిజనాభుఁ జొచ్చి, రట చక్రియు, నా సురరాజు, దిక్పతుల్, సురలుఁ గుమారకున్ శరణు సొచ్చిరి తారకుఁ డంటఁ దాఁకినన్ 128**

అర్థము తారకుఁడు, అంటన్ + తాఁకినన్ = ముట్టనెదురుకొనఁగా, సురలు = దేవతలు, అనిన్ = యుద్ధమున, ఓడి, దిశ్(క్) + పతులన్ = దిక్పాలకులను, చొచ్చిరి = కూడిరి, దిశ్(క్) + పతులున్ = దిక్పాలకులును, సుర + ఆలియున్ = దేవతల సమూహమును, సుర - పతిన్ = దేవేంద్రుని, చొచ్చిరి, ఇంద్రుఁడు, చుట్టిన - దిశ్(క్) + పతులున్ = చుట్టుఁజేరిన దిక్పాలకులును, సుర + ఓఘమున్ = దేవతల సమూహమును, సరసిజనాభున్ = పద్మనాభుని - విష్ణుని, చొచ్చిరి, అట, చక్రియున్ = విష్ణువును, ఆ - సుర - రాజున్ = ఆ యింద్రుఁడును, దిశ్(క్) + పతుల్ = దిక్పాలకులును, సురలున్ = దేవతలును, కుమారకున్ = కుమారస్వామిని, శరణు + చొచ్చిరి

తాత్పర్యము. తారకాసురుఁడు అంటఁదాఁకఁగా దేవతలు యుద్ధమున నోడి దిక్పాలకులను గూడిరి దిక్పాలకులును, దేవతలును ఇంద్రునిఁ గూడిరి ఇంద్రుఁడును, దిక్పాలకులును, దేవతలును విష్ణునిఁగూడిరి ఇంద్రుఁడును, దిక్పాలకులును, దేవతలును విష్ణునిఁ జేరిరి విష్ణువును, ఇంద్రుఁడును, దిక్పాలకులును, దేవతలును గుమారస్వామిని శరణుచొచ్చిరి

విశేషములు: అలంకారము ఏకావళి 'గృహీతముక్తరీ త్యార్థశ్రేణి రేకావళీ మతా' చన్ద్రా

వ **ఇట్లు బృందారకబృందంబుఁ గాందిశీకులం జేసి సంక్రందను నాక్రందనుం జేసి నారాయణుం బలాయనపరాయణుం జేసి కరిముఖు సమరవిముఖుం జేసి విజృంభించి 129**

అర్థము. ఇట్లు, బృందారక - బృందంబున్ = దేవతల సమూహమును, కాందిశీకులన్ + చేసి = దిక్కు తెలియనివారిని జేసి, సంక్రందనున్ = ఇంద్రుని,

ఆక్రందనున్ = దుఃఖితుని, చేసి, నారాయణున్ = విష్ణుని, పలాయన - పరాయణున్ = పాఱిపోవుటయం దాసక్తి గలవానిని, చేసి, కరి-ముఖున్ = గజాననుని, సమర-విముఖున్ = యుద్ధవిముఖుని జేసి, విజృంభించి

తాత్పర్యము ఇట్లు దేవతలను గాందిశీకులనుగాఁ జేసి, ఇంద్రుని దుఃఖితునిగాఁ జేసి, విష్ణుని పలాయనపరునిగాఁ జేసి, వినాయకుని యుద్ధవిముఖునిగాఁజేసి విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము

మ అతులోత్సాహముతోడ దానవబలం బార్వంగ దోర్వీర్యద
ర్పితుఁడై బోరన వచ్చి తాఁకె నమరుల్ భేదిల్లి భీతిన్ హతా
హతి మార్వెట్టక పాఱఁ దారకుఁడు కోపాసక్తి వీరాసురా
న్వితుఁడై యెక్కడ నంచు రోయుచు మహావీరుం గుమారున్ వడిన్ 130

అర్థము. అతుల + ఉత్సాహముతోడన్ = మిక్కిలి యుత్సాహముతో, దానవ - బలంబు = రాక్షస సేన, ఆర్వంగన్ = అఱవఁగా, అమరుల్ = దేవతలు, భేదిల్లి = ఓడిపోయి, భీతిన్ = భయముతో, హతా-హతిన్ =అతిత్వరతో, మార్వెట్టక = ఎదిరింపక, పాఱన్ = పరువెత్తఁగా, తారకుఁడు, దోర్(ః) +వీర్య - దర్పితుఁడు + ఐ = భుజపరాక్రమగర్వితుఁడయి, కోప + ఆసక్తిన్ = కోపమునందలి ఆసక్తితో, వీర + అసుర + అన్వితుఁడు + ఐ = వీరులైన రాక్షసులతోఁ గూడినవాఁడయి, ఎక్కడన్ = కుమారుఁ డెక్కడ నున్నాఁడు, అంచున్, రోయుచున్ = వెదకుచు, మహత్ (మహా) - వీరున్ = గొప్పవీరుఁడగు, కుమారున్, వడిన్ = వేగముగా, బోరన = శీఘ్రముగా, వచ్చి, తాఁకెన్

తాత్పర్యము. మిక్కిలి యుత్సాహముతో రాక్షససేన ఆర్వఁగను, దేవతలు ఓడిపోయి భయముతో అతిత్వరతో నెదిరింపక పాఱిపోఁగా, తారకుఁడు కోపముతో వీరులైన రాక్షసులతోఁ గూడి 'కుమారుఁ డెక్కడనున్నాఁ?' డనుచు వెదకుచు వేగముగా శీఘ్రముగా వచ్చి మహావీరుఁడగు కుమారుని మార్కొనెను

కుమార తారకుల యుద్ధము

వ అంత నంతకాంతకసుతుం డంతకుమున్న యుగాంత కృతాంతుండునుంబోలె నత్యంతకోపరసాపూరితాంతరంగుండై ద్వాదశ కర సంభృత ఖర ప్రహరణం బసురవరులకు విలయకాలోదిత ద్వాదశ ఖరకరోగ్రకరప్రకరంబునుంబోలె జాజ్వల్యమానంబై వెలుంగ నంగాం గుళీతలత్రాణబాణపూర్ణతూణీరపరిశోభితుండై మణికనకఖచితవిచిత్ర రధారూఢుండై నిలిచి విజయకోదండం బెత్తికొని గుణాస్ఫాలనంబు సేసిన 131

అర్థము అంతన్, అంతక + అంతక - సుతుండు =యమాంతకుఁడైన శివుని కుమారుఁడు, - కుమారస్వామి, అంతకున్ - మున్ను + అ = అంతకుమునుపే, యుగ + అంత - కృతాంతుండునున్ + పోలెన్ = ప్రళయకాల యముని విధమున, అత్యంత - కోప - రస + ఆపూరిత + అంతరంగుండు + ఐ = మిక్కిలి కోపరసముచే నింపఁబడిన మనస్సు గలవాఁడయి, ద్వాదశ - కర - సంభృత - ఖర-ప్రహరణంబు = పండ్రెండు చేతులందుఁ దాల్పఁబడిన వాఁడిబాణము, అమర - వరులకున్ = దేవతా శ్రేష్ఠులకు, విలయ - కాల + ఉదిత - ద్వాదశ - ఖరకర - ప్ర - కర - ప్రకరంబునున్ + పోలెన్ = ప్రళయసమయమందుఁబుట్టిన పండ్రెండుగురు సూర్యుల భయంకరములైన కిరణముల సమూహమువలె, జాజ్వల్యమానంబు + ఐ = మిక్కిలి ప్రకాశించుచున్నదయి, వెలుంగన్ = ప్రకాశింపఁగా, అంగ + అంగుళీ - తల - త్రాణ - బాణ - పూర్ణ - తూణీర - పరిశోభితుండు + ఐ = శరీర కవచము, వ్రేళ్ల కవచము, బాణములతోనిండిన అమ్ములపొది - అనువానిచే నొప్పినవాఁడు అయి, మణి - కనక - ఖచిత - విచిత్ర - రథ - ఆరూఢుండు + ఐ = రత్నముల చేతను, బంగారముచేతను బొదుగఁబడిన విచిత్రమయిన రథము నెక్కినవాఁడయి, నిలిచి, విజయ - కోదండంబు = జయధనుస్సు, ఎత్తికొని, గుణ + ఆస్ఫాలనంబు + చేసినన్ = వింటినారి మ్రోయింపఁగా

తాత్పర్యము . అంతఁ గుమారస్వామి అంతకుమునుపే ప్రళయకాల యమునివలె మిక్కిలికోపముతోనిండినమనస్సు గలవాఁడయి, పండ్రెండు చేతులందు ధరించిన వాఁడిఆయుధము రాక్షసులకు ప్రళయసమయమం దుదయించిన పండ్రెండుగురుసూర్యుల భయంకరకిరణముల సమూహమువలె మిక్కిలి ప్రకాశింపఁగా, శరీరాంగుళుల కవచములు, అమ్ములతోనిండినపొదులు అనువానిచేఁ బ్రకాశించినవాఁడయి, రత్నసువర్ణఖచితమై విచిత్రమైన రథము నెక్కి నిలిచి విజయధనువు నెత్తికొని అల్లెత్రాటిని మ్రోయింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు · అలంకార ముపమ

మ ధర కంపింపఁ, బయోనిధుల్ కలఁగ, దిగ్దంతుల్ భయంబంద, భూ
ధరముల్ డొల్ల, వియత్తలం బ్రువ, దైత్యశ్రేణి భీతిల్ల, భా
స్కర రథ్యంబులు మ్రొగ్గి మగ్గఁబడ, నాశాచక్రముల్ మ్రోయ, భీ
కరమై, దారుణమై గుణధ్వని మహోగ్రంబై చెలంగన్ వడిన్ 132

అర్థము ధర = భూమి, కంపింపన్ = వడఁకఁగా, పయోనిధుల్ = సముద్రములు, కలఁగన్ = కలఁతచెందఁగా, దిశ్(క్) + దంతుల్ = దిగ్గజములు, భయంబు + అందన్ = భీతిల్లఁగా, భూధరముల్ = కొండలు, డొల్లన్ = ఊడిపడఁగా, వియత్ + తలంబు = ఆకాశ ప్రదేశము, అద్రువన్ = అదరఁగా, దైత్య - శ్రేణి = రాక్షసుల పంక్తి, భీతిల్లన్ = భయపడఁగా, భాస్కర - రథ్యంబులు = సూర్యుని గుఱ్ఱములు, మ్రొగ్గి - మగ్గఁబడన్ =వ్రాలి కూలఁగా, ఆశా - చక్రముల్ = దిగ్వలయములు, మ్రోయన్ = ధ్వనింపఁగా, భీకరము + ఐ = భయంకరమయి, దారుణము + అయి = ఘోరమయి, మహత్ (మహా) + ఉగ్రంబు + ఐ = మిక్కిలి భయంకరమయి, గుణ -। ధ్వని = అల్లెత్రాటి చప్పుడు, వడిన్ = వేగముగా, చెలంగెన్ = మ్రోసెను

తాత్పర్యము . అల్లెత్రాటిధ్వని భూమి వడఁకఁగను, సముద్రములు కలఁగఁగను, దిగ్గజములు భయమందఁగను, కొండలు ఊడిపడఁగను, ఆకాశ మదరఁగను, రాక్షసపంక్తి భయపడఁగను, సూర్యరథాశ్వములు వ్రాలికూలఁగను, దిక్చక్రములు ప్రతిధ్వనింపఁగను, భీకరము, దారుణము, మహోగ్రము నయి వేగముగా మ్రోసెను

విశేషములు. అద్రుచు - తుమున్నంత రూపము అద్రువన్ అద్రుచు లో 'అ' లఘువు 'చుక్పరక రువర్ణంబునకు ముందటి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాష నగు నగుచోఁ దత్పూర్వంబు గురువు గాదు ' బాల ప్ర 20

వ ఇ ట్లఖిలజగద్భయంకరంబై చెలంగ నొక్కట విజృంభించి 133

అర్థము. ఇట్లు, అఖిల - జగత్ + భయంకరంబు + ఐ = ఎల్ల లోకములకు వెఱపు పుట్టించునదియై, చెలంగన్ = మ్రోయఁగా, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, విజృంభించి = చేలరేఁగి

తాత్పర్యము. ఇట్లు ఎల్ల లోకములకు వెఱపు పుట్టించునదియై మ్రోయఁగా ఒక్కమాఱుగాఁ జెలరేఁగి - తరువాతి పద్యముతో నన్వయము

క కాలాగ్నిరుద్రుఁడును లయ
కాలుఁడు నొండొరులఁ దాకుగతిఁ బేర్చి మహా
కాళసుత దితిసుతాగ్రణు
లోలములే కొదరి తాఁకి రొండొరుఁ గడిమిన్. 134

అర్థము కాల + అగ్ని - రుద్రుఁడును = ప్రళయసమయాగ్నివంటి రుద్రుఁడును, లయ - కాలుఁడున్ = ప్రళయసమయ యముఁడును, ఒండొరులన్ = ఒకరినొకరు, తాఁకు - గతిన్ = మార్కొను విధమున, పేర్చి = విజృంభించి, మహాకాళ - సుత - దితి - సుత + అగ్రణులు = కుమారస్వామియు, రాక్షస శ్రేష్ఠుఁడైన తారకుఁడును, ఓలము - లేక - చాటు లేక - బాహాటముగా, ఒదరి= ఎజృంభించి, కడిమిన్ = పరాక్రమముతో, ఒండొరున్ = ఒకరినొకరు తాఁకిరి

తాత్పర్యము ప్రళయాగ్నివంటి రుద్రుఁడును, ప్రళయసమయ యముఁడును ఒకరినొకరు మార్కొనురీతిని అతిశయించి కుమారతారకులు బాహాటముగా విజృంభించి పరాక్రమముతో నొకరితోనొకరు మార్కొనిరి

విశేషములు అలంకార ముపమ

ఉ తారకుమీఁద షణ్ముఖుఁడు తాఁకినముష్టిన ఘోరసాయకా
సారము పెల్లునం గురిసె, సైఁపక దానికి మున్న బల్విడిం
దారకుఁడున్, భుజాబలమదంబున షణ్ముఖుమీఁద నేసె నా
నా రుచిరాస్త్రసంహతి రణంబునఁ గ్రిక్కొని క్రుక్కిదంబుగాన్ 135

అర్థము షష్(ట్) + ముఖుఁడు = ఆఱుమొగములవాఁడు - కుమారస్వామి, తారకుమీఁదన్ = తారకాసురునిపై, తాఁకిన - ముష్టిన్ + అ = మార్కొనిన వెంటనే, ఘోర - సాయక +ఆసారము = భయంకరమైన అంపవాన, పెల్లునన్ = అధికముగా, కురిసెన్ = కురియించెను, తారకుఁడున్ = తారకాసురుఁడును, సైఁపక = సహింపక, దానికిన్ + మున్ను + అ = దానికిముందే, బల్విడిన్ = పరాక్రమముతో, భుజా - బల - మదంబునన్ = భుజపరాక్రమమువలని గర్వమున, రణంబునన్ = యుద్ధమునందు, క్రిక్కొని = నిండి, క్రుక్కిదంబుగాన్ = పూడునట్లుగా, నానా - రుచిర + అస్త్ర - సంహతిన్ = అనేకములయిన మనోహరములయిన బాణముల సమూహమును, షష్(ట్) + ముఖుమీఁదన్ = కుమారస్వామిపై, ఏసెన్ = ప్రయోగించెను

తాత్పర్యము . కుమారస్వామి తారకునితో మార్కొనిన తత్క్షణమే భయంకరమైన అంపవాన అధికముగాఁ గురిసెను తారకుఁడును సహింపక దానికి ముందే భుజబలగర్వమున యుద్ధమున నిండునట్లుగా కుమారస్వామిపైఁ బెక్కుబాణములను బ్రయోగించెను

చ పరువడిఁ బైపయిన్ వివిధబాణచయంబులు గప్పినన్ దినే
శ్వరకరభాతి దూఱ కెడ సంగరభూమి మహాంధకారమై
యురుతరవృత్తిఁ బర్వుటయు నుగ్రశిలీముఖఘట్టనోత్థ భీ
కర వరవిస్ఫులిఙ్గరుచి గ్రక్కునఁ బాచెఁ దదంధకారమున్ 136

అర్థము. వివిధ - బాణ - చయంబులు = వివిధములైన బాణముల సమూహములు, పరువడిన్ = క్రమముగా, పైపయిన్ = అధికముగా, కప్పినన్, దిన + ఈశ్వర - కర - భాతి = సూర్యకిరణకాంతి, ఎడన్ = నడుమ, దూఱక = చొరక, సంగర - భూమి = యుద్ధభూమి, మహత్ (మహా) + అంధకారము + ఐ = గొప్ప చీఁకటియై, ఉరుతర - వృత్తిన్ = మిక్కిలి యెక్కువగా, పర్వుటయున్ = వ్యాపించుటయును, ఉగ్ర - శిలీముఖ - ఘట్టన + ఉత్థ - భీకర - వర - విస్ఫులింగ - రుచి = భయంకరములయిన బాణముల రాయిడిచే లేచిన భీకరము, శ్రేష్ఠమునైన మిడుఁగుఱుల కాంతి, తద్ + అంధకారమున్ = ఆ చీఁకటిని, గ్రక్కునన్ = శీఘ్రముగా, పాఁచెన్ = తొలఁగించెను

తాత్పర్యము. వివిధాస్త్రసమూహములు క్రమముగా అధికముగా వ్యాపింపఁగా సూర్యకిరణములకాంతి నడుమఁ జొరక యుద్ధభూమి మిక్కిలి చీఁకటియై ఎక్కువగా వ్యాపింపఁగా, భయంకరములయిన బాణముల రాయిడిచే లేచిన మిడుఁగుఱుల కాంతి ఆ చీఁకటిని వెంటనే తొలఁగించెను

విశేషములు: అలంకార మతిశయోక్తి

క ఆతతముగ శుక్రుఁడు త
త్స్వాతిగతుండయినఁ గురియు సంతతధారా
పాతమును బోలె దనుజ
వ్రాతముపై గుహుఁడు బాణవర్షముఁ గురిసెన్ 137

అర్థము: శుక్రుఁడు, ఆతతముగన్ = అధికముగా, తద్ + స్వాతి - గతుండు = ఆ స్వాతీనక్షత్రమును బొందినవాఁడు, అయినన్ = కాఁగా, కురియు, సంతత - ధారా - పాతమును + పోలెన్ = ఎడతెగని వర్షపాతమువలె, గుహుఁడు = కుమారస్వామి, దనుజ - వ్రాతముపైన్ = రాక్షసుల సమూహముపై, బాణ - వర్షమున్ = అంపవానను, కురిసెన్

తాత్పర్యము శుక్రుఁడు స్వాతీనక్షత్రగతుఁడు కాఁగాఁ గురియు ఎడతెగని వర్షపాతమువలెఁ గుమారస్వామి రాక్షససమూహముపై అంపవానను గురిసెను

విశేషములు అలంకారము ఉపమ

క హరతనయుఁ డల్గి చూచిన
నరిబలములు రక్తమయములై వడిఁ దోఁచెం
బొరిఁబొరిఁ దత్కోపారుణ
భరితేక్షణరుచులు కలనఁ బట్టిన భంగిన్ 138

అర్థము. హర - తనయుఁడు = శివుని కుమారుఁడు - కుమారస్వామి, అల్గి - చూచినన్ = కోపముతోఁ జూడఁగా, అరి - బలములు = శత్రుసేనలు, పొరిన్ + పొరిన్ = మాటిమాటికి, తద్ + కోప + అరుణ - భరిత + ఈక్షణ - రుచులు - వాని కోపముచే నెఱ్ఱనై నిండిన చూపుల కాంతులు, కలనన్ = యుద్ధమునందు, పట్టిన - భంగిన్ = అలముకొనిన విధమున, వడిన్ = వేగముగా, రక్తమయములు + ఐ = ఎఱ్ఱనివయి, తోఁచెన్ = కనఁబడెను

తాత్పర్యము . కుమారస్వామి కోపముతోఁ జూడఁగా శత్రుసేనలు మాటిమాటికి ఆతని కోపముచే నెఱ్ఱనైన చూపులకాంతులు యుద్ధభూమియం దలముకొనెనా యనునట్లు వేగముగా నెఱ్ఱనివయి తోఁచెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష

క బాహుబలంబున నాహవ
దోహలుఁడై యధిపుఁ డేయు దుర్ధర శర సం
దోహాతివర్షమునఁ బర
వాహిని రక్తోదకప్రవాహము నెగసెన్ 139

అర్థము. అధిపుఁడు = రాజు - కుమారస్వామి, బాహు - బలంబునన్ = భుజపరాక్రమముతో, ఆహవ - దోహలుఁడు + ఐ = యుద్ధోత్సాహము గలవాఁడయి, ఏయు = ప్రయోగించు, దుర్ధర - శర - సందోహ + అతి - వర్షమునన్ = ధరింపశక్యముగాని బాణసమూహముయొక్క అధికమైన వర్షముచే, పర - వాహినిన్ = శత్రుసేనయనెడినదియందు, రక్త + ఉదక - ప్రవాహము = రక్తమనెడి ఎఱ్ఱని నీటి ప్రవాహము, నెగసెన్ = ఏర్పడెను

తాత్పర్యము కుమారస్వామి భుజపరాక్రమముతో యుద్ధోత్సాహము గలవాఁడయి, ప్రయోగించు ధరింపశక్యముగాని బాణముల అధికవర్షముచే శత్రుసేన యనెడినదిలో రక్తమనెడి యెట్టని నీటిప్రవాహము ఏర్పడెను

విశేషములు. శ్లిష్ట రూపకము

క గుహునిపై నట్ల యత్యుగ్రకోపభాతిఁ
దారకాసురుఁ డేసినఁ దత్క్షణంబ
నెఱయ బ్రహ్మాండకుహరంబు దెఱపి యెల్ల
దాన విధంబున నమ్ముల తూఁటు కట్టె 140

అర్థము. అట్లు + అ = ఆ విధముగనే, అతి + ఉగ్ర - కోప - భాతిన్ = మిక్కిలి భయంకరమయిన కోపప్రకారముచే, తారక + అసురుఁడు, గుహునిపైన్ = కుమారస్వామి మీఁద, ఏసినన్ = ప్రయోగింపఁగా, తద్ + క్షణంబు + అ = వెంటనే, బ్రహ్మాండ - కుహరంబు + తెఱపి + ఎల్లన్ = గుహవంటి బ్రహ్మాండము యొక్క సందెల్ల, దాన - విధంబునన్ = అమ్ములపొదివలె, అమ్ముల - తూఁటు - కట్టెన్ = బాణముల రంధ్రము పడెను

తాత్పర్యము ఆ విధముగనే తారకాసురుఁడు మిక్కిలి కోపముతోఁ గుమారస్వామిపై బాణములు ప్రయోగింపఁగా వెంటనే బ్రహ్మాండకుహరము సందెల్ల నమ్ములపొది విధమున బాణముల చిల్లివడెను

విశేషములు. అలంకార మతిశయోక్తి, ఉత్ప్రేక్ష

క ఒండొరు నేయు శరంబు ల
ఖండితభుజశక్తి మెఱసి ఖండింపం ద
త్కాండంబులు నడుమనఁ గడి
ఖండము లగుచున్ సహస్రఖండము లయ్యెన్ 141

అర్థము: ఒండొరున్ = ఒకరినొకరు, ఏయు = కొట్టు, శరంబులు = బాణములు, అఖండిత - భుజ - శక్తిన్ = గొప్ప భుజబలమును, మెఱసి = మెఱయించి, ఖండింపన్ = తెగఁగొట్టఁగా, తద్ + కాండంబులు = ఆ బాణములు, నడుమన్ + అ = నడుమనే, కడిఖండములు = ముక్కలు ముక్కలు, అగుచున్, సహస్ర - ఖండములు + అయ్యెన్ = వేయిముక్కలు అయ్యెను

తాత్పర్యము ఒకరిపై నొకరు ప్రయోగించు బాణములను అధికమయిన భుజబలము మెఱయించి తెగఁగొట్టఁగా, ఆ బాణములు నడుమనే ముక్కలు ముక్కలయి వేయిశకలము లయ్యెను.

చ హరతనయాసురేంద్రుల శరాహతిఁ గూలెడు దానవామరో
త్కర శవరాసు లంబరముఁ దాఁకి తనర్చుచు మాటిమాటి క
క్షరగతిఁ బర్వులోహితరసప్రకరంబునఁ దేలి పాఱె సా
గరములు సొచ్చి మెట్టుకొనఁగా నెడ్రెవ్వ కహార్ణశంబులున్ 142

అర్థము హర - తనయ + అసుర + ఇంద్రుల = కుమారస్వామి తారకుల, శర + ఆహతిన్ = బాణముల దెబ్బచే, కూలెడు = పడిపోవు, దానవ + అమర + ఉత్కర - శవ - రాసులు = రాక్షసులయు, దేవతలయు గుంపుల పీనుఁగుల ప్రోవులు, అంబరమున్ = ఆకాశమును, తాఁకి = ముట్టి, తనర్చుచున్ = ఒప్పుచు, మాటిమాటికిన్, అక్షర - గతిన్ = నాశనములేని విధమున, పర్వు = ప్రవహించు, లోహిత - రస - ప్రకరంబునన్ = రక్త సమూహమునందు, తేలి, సాగరములు + చొచ్చి = సముద్రములు ప్రవేశించి, మెట్టుకొనఁగాన్ = సోపానములుగా ఏర్పడునట్లు, ఎడ + త్రెవ్వక = ఎడతెగక, అహార్ణశంబులున్ = పవళ్లను, రేలును, పాఱెన్ = ప్రవహించెను

తాత్పర్యము . కుమార తారకుల బాణముల దెబ్బచేఁ గూలు రాక్షస దేవతల గుంపుల పీనుఁగుల ప్రోవులు ఆకాశమంటి యొప్పుచు, మాటిమాటికి నాశనములేని విధమునఁ బ్రవహించు రక్తసమూహమునఁ దేలి సముద్రములు ప్రవేశించి మెట్లుగా నేర్పడునట్లు ఎడతెగక రెయుంబవళ్లు ప్రవహించెను.

విశేషములు . అలంకారము అతిశయోక్తి హరతనయుని శరాహతిని గూలు దానవశవరాసులు, అసురేంద్రుని శరాహతిచేఁ గూలు అమరశవరాసులు అని అన్వయము యథాసంఖ్యము.

క ఇరుగడలఁ గలసి క్రమ్మెడు
నరుణాంబుధి మీఁదఁ దేలు హయ నృ గజ కళే
బరతలము మీఁద నెలకొని
చెరలాడిరి కడిమి నుభయ శేష బలంబుల్ 143

అర్థము ఇరు + కడలన్ = రెండు పక్షములందును, కలసి = కూడి, క్రమ్మెడు = వ్యాపించునట్టి, అరుణ + అంబుధిమీఁదన్ = రక్తసముద్రముపై, తేలు, హయ - నృ - గజ -కళేబరతలము మీఁదన్ = గుఱ్ఱముల, నరుల, ఏనుఁగుల శవములపై, నెలకొని = ఉండి, ఉభయ - శేష - బలంబుల్ = రెండు పక్షములందలి మిగులు సేనలు, కడిమిన్ = పరాక్రమముతో, చెరలాడిరి = అధికముగాఁ గ్రీడించిరి

తాత్పర్యము . రెండు పక్షములందును వ్యాపించు రక్తసముద్రముపైఁ దేలు గుఱ్ఱముల, నరుల, ఏనుఁగుల శవములపైఁ గాలూని రెండుపక్షములలోఁ జావఁగా మిగిలిన సేనలు పరాక్రమముతోఁ గ్రీడించిరి

విశేషములు . అలంకారము రూపకము

వ అంతం దారక కుమారు లొండొరు నగ్గలించుచు 144

అర్థము . అంతన్, తారక కుమారులు, ఒండొరున్ = ఒకరినొకరు, అగ్గలించుచున్ = మించుచు

తాత్పర్యము : అంత తారకుఁడును, కుమారుఁడును ఒకరి నొకరు మించుచు - తరువాతి పద్యముతో నన్వయము

ఉ. ఆయతబాహువీర్యము సురాసురముఖ్యులు పిచ్చలింప నా
నాయుధకౌశలంబు వెలయం బటువిక్రమ మొప్ప భూమవై
హాయస చిత్రయుద్ధవిషయజ్ఞ తదజ్ఞులు చూచి మెచ్చ గాం
గేయుఁడుఁ దారకాసురుఁడుఁ గేనము లే కని సేసి రీసునన్ 145

అర్థము: ఆయత - బాహు - వీర్యమున్ = అధికమైన భుజ పరాక్రమును, సుర + అసుర - ముఖ్యులు = దేవతల రాక్షసుల శ్రేష్ఠులు, పిచ్చలింపన్ = ప్రశంసింపఁగా, నానా + ఆయుధ - కౌశలంబు = అనేకాయుధముల నేర్పు, వెలయన్ = ఒప్పఁగా, పటు - విక్రమము = తీవ్రమైన పరాక్రమము, హోమ - వైహాయస - చిత్ర - యుద్ధ - విషయజ్ఞ - తద్ + అజ్ఞులు = భూసంబంధమైన, ఆకాశసంబంధమైన యుద్ధవిషయము నెఱిఁగినవారు, ఎఱుఁగనివారు, చూచి, మెచ్చన్, గాంగేయుఁడున్ = కుమారస్వామియును, తారక + అసురుఁడున్, కేనము - లేక = కొఱఁత లేక, ఈసునన్ = కోపముతో, అని + చేసిరి = యుద్ధమొనరించిరి

తాత్పర్యము అధికమైన భుజబలమును సురలలోను, అసురలలోను ముఖ్యులైనవారు ప్రశంసింపఁగా, వివిధాయుధముల నేర్పు ఒప్పఁగాఁ దీవ్ర పరాక్రమ మొప్పఁగా, భూ సబంధమైన ఆకాశ సంబంధమైన చిత్రయుద్ధవిషయము నెఱిఁగినవారు, ఎఱుఁగనివారు చూచి మెచ్చఁ గాఁ గుమారస్వామియుఁ, దారకాసురుఁడును గొఱఁతలేక కోపముతో యుద్ధము చేసిరి

వ అట్టి విషమసమరంబు సమయంబు గనుంగొని తనివిసనక కలహభోజనుండు మహోత్సాహంబున **146**

అర్థము. అట్టి, విషము - సమరంబు - సమయంబు = ఎషము యుద్ధ సమయమును, కనుంగొని = చూచి, తనివి + చనక = తృప్తి తీఱక, కలహ - భోజనుండు = కయ్య మాహారముగాఁ గలవాఁడు - నారదుఁడు, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = గొప్ప ఉత్సాహముతో

తాత్పర్యము : అట్టి విషమయుద్ధమును జూచి తృప్తితీఱక నారదుఁడు మహోత్సాహముతో తరువాతి పద్యముతో నన్వయము

సీ గుణతాడనధ్వని ఘూర్ణిల్లి తన వీణె
వాయింపకయుఁ బ్రతిధ్వనులు మ్రోయఁ
దూఱఁ గోలలు నాఁటి తుటిగొని తన కుంచి
పాది నమర్చిన కోలపురులు గాఁగ
నస్త్రసంఘట్టన నదరు మెఱుంగులు
తన మణిజపమాల నెనసి వెలుఁగఁ
దనరు క్రొన్నెత్తురు ధారల జొత్తిల్లి
తన కుఱుజడలకెం పినుమడింప

ఆ సంగరాంగణంబు రంగంబుగాఁ దన్ను
బలసియాడు నురు కబంధములకుఁ
దాన మొదలిసూత్రధారుఁడై నాట్యాభి
నయము లెసఁగ నాడె నారదుండు **147**

అర్థము. గుణ - తాడన - ధ్వనిన్ = అల్లెత్రాటిని లాగుటచే నేర్పడు ధ్వనిచే, ఘూర్ణిల్లి = తిరుగుడువడి, తన - వీణె, వాయింపకయున్ = వాయింపకపోయినను, ప్రతిధ్వనులు - మ్రోయన్ = మాఱుమ్రోగఁగా,

కోలలు = అమ్ములు, తూఱన్ - నాఁటి =మిక్కిలి గ్రుచ్చుకొని, తుటి + కొని = గుంపు గూడి, తన - కుంచి - పాదిన్ = గుత్తిగాఁ గట్టిన నెమిలిపురి పాదియందు, అమర్చిన, కోల-పురులు + కాఁగన్ = బాణపు టెక్కలు కాఁగా,

అస్త్ర - సంఘట్టనన్ = బాణముల రాయిడిచే, అదరు - మెఱుంగులు = చలించు కాంతులు, తన - మణి - జప - మాలన్ = తన మణిమయమైన జపమాలను, ఎనసి = పొంది, వెలుఁగన్ = ప్రకాశింపఁగా,

తనరు - క్రొన్నెత్తురు (క్రొత్త + నెత్తురు) - ధారలన్ = ఒప్పునట్టి క్రొన్నెత్తుటి ప్రవాహములచే, జొత్తిల్లి = ఎట్టనయి, తన - కుఱు - జడల -కెంపు = తన జడల కొంచెమైన యెఱుపు, ఇనుమడింపన్ = రెట్టింపుకాఁగా,

సంగర + అంగణంబు = యుద్ధభూమి, రంగంబు + కాన్ = నాట్యస్థలముగా, తన్నున్, బలసి + ఆడు= చుట్టియాడునట్టి, ఉరు - కబంధములకున్ = పెద్ద మొండెములకు, తాను +అ = తానే, మొదలి - సూత్రధారుఁడు + ఐ = ప్రథమసూత్రధారుఁడయి, నారదుండు, నాట్య + అభినయములు = నాట్యమును, అభినయమ్మును, ఎసఁగన్ = అతిశయింపఁగా, ఆడెన్ = నాట్యము చేసెను

తాత్పర్యము . అల్లెత్రాడుల మ్రోఁతచేఁ దిరుగుడువడి తన వీణె వాయింపకయే ప్రతిధ్వనింపఁగను, అమ్ములు నాఁటుకొని గుమిగూడి తన కుంచి పాదియం దమర్చిన బాణపుటెక్కలు కాఁగా, బాణముల రాయిడిచేఁ జలించు కాంతులు తన మణిమయమైన జపమాలను బొంది ప్రకాశింపఁగను, ఒప్పునట్టి క్రొన్నెత్తుటిధారలచే నెట్టనయి తన జడల యించుక యెఱుపు రెట్టింపు కాఁగను, యుద్ధభూమి రంగస్థలముగా, దన్నుఁ జుట్టి యాడెడు పెద్ద మొండెములకుఁ దానే ప్రథమసూత్రధారుఁడయి నారదుఁడు నాట్యాభినయము లొప్పఁగా నాట్యము చేసెను

విశేషములు : అలంకారము స్వభావోక్తి

వ తత్ప్రస్తవంబున **148**

అర్థతాత్పర్యములు . తద్ + ప్రస్తవంబునన్ = ఆ సందర్భమునందు- తరువాతి పద్యముతో నన్వయము

క ఉరగాభ్రానలతామస
గిరిశరములు దనుజుఁ డేసెఁ గినిసి రయమునన్,
గరుడానిలాంబు రవి పవి
శరములు గుహుఁ డేసె నుగ్రసమరాగ్రమునన్ 149

అర్థము ఉగ్ర - సమర + అగ్రమునన్ = భయంకరమైన అసి మొనయందు, దనుజుఁడు = రాక్షసుఁడు - తారకుఁడు, ఉరగ + అభ్ర + అనల - తామస - గిరి - శరములు = నాగ, మేఘ, ఆగ్నేయ తామస (తమస్సంబంధమైన) పర్వతాస్త్రములు, ఏసెన్ = ప్రయోగించెను, గుహుఁడు = కుమారస్వామి, కినిసి = కోపించి, రయమునన్ = శీఘ్రముగా, గరుడ + అనిల + అంబు - రవి - పవి - శరములు = గారుడ, వాయవ్య, జల, సూర్య, వజ్రాస్త్రములు, ఏసెన్ = ప్రయోగించెను

తాత్పర్యము భయంకరమయిన అనిమొనయందుఁ దారకుఁడు నాగ, మేఘ, ఆగ్నేయ, తామస, పర్వతాస్త్రములు ప్రయోగింపఁగాఁ, గుమారస్వామి కోపించి వెంటనే గారుడ,వాయవ్య, వారుణ, సూర్య, వజ్ర శరములు ప్రయోగించెను

విశేషములు . అలంకారము క్రమము

ఆ అసుర యేయు నమ్ము లాఁక సేయున కాని
యతని మగుడ నేయ నవసరంబు
కానఁగాక గుహుఁడు దానవు బలిమియు
విల్లు నేర్పుఁ జూచి వీనిచేత 150

అర్థము . అసుర = రాక్షసుఁడు - తారకుఁడు, ఏయు = ప్రయోగించు, అమ్ములు = బాణములు, గుహుఁడు = కుమారస్వామి, ఆఁక + చేయున్ + అ - కాని = అడ్డుకొనునే కాని, అతనిన్ = వానిని - తారకుని, మగుడన్ = తిరిగి, ఏయన్ + అవసరంబు - కానన్ + కాక = ప్రయోగించు సమయము కానరాక, దానవు - బలిమియున్ = తారకుని పరాక్రమమును, విల్లు-నేర్పున్ = చూచి, వీనిచేతన్ = వీనిచే

తాత్పర్యము తారకుఁడు తనపైఁ బ్రయోగించు బాణములను గుమారస్వామి యడ్డుకొనునే కాని యతనిని మరలఁగొట్టు సమయము కానరాక,

రాక్షసుని పరాక్రమమును వింటినేర్పును జూచి వీనిచే - తరువాతి పద్యముతో నన్వయము

క సురవరులు పెక్కు మాఱులు
పరిభవపడి రనిన నేల పడకుండుదు రీ
శరవరఘట్టన కెదురఁగ
హరిహరులకుఁ బోల దనిన నమరుల వశమే ? 151

అర్థము సుర-వరులు = దేవతాశ్రేష్ఠులు, పెక్కు - మాఱులు, పరిభవపడిరి + అనినన్ = అవమానపడిరనఁగా, ఏల, పడక + ఉండుదురు ? ఈ -శర - వర - ఘట్టనకున్ = ఈ గొప్ప అమ్ములరాయిడిని మార్కొనుటకు, హరి -హరులకున్ = విష్ణువునకును, ఈశ్వరునకును, పోలదు + అనినన్ = శక్యముగాదు అనఁగా, అమరుల - వశము + ఏ = దేవతల తరమా ?

తాత్పర్యము . దేవతలు పలుమాఱులు అవమానితులయి రనిన ఏలకాకుందురు ? ఈ అమ్ముల రాయిడిని మార్కొన హరిహరులకైనను శక్యము గాదనిన, దేవతల తరమగునా ?

విశేషములు . అలంకారము కావ్యార్థాపత్తి పరిభవపడిరి - పరిభవము + పడిరి 'పడ్వాదులు పరంబులగునపుడు మువర్ణకంబునకు లోపపూర్ణబిందులు విభాష నగు' బాల సం 46

వ అని దనుజేంద్రు ధనుర్విద్యా విశేషంబు విశేషించుచుం దదీయ దివ్య శరంబులకుం బ్రతిశరంబులు ప్రయోగించుచున్న కుమారుం గని తావగొనక 152

అర్థము . అని, దనుజ + ఇంద్రు = రాక్షసశ్రేష్ఠుడైన తారకుని యొక్క, ధనుస్ (ఃు) + విద్యా - విశేషంబు = విలువిద్యయొక్క ఆధిక్యము, విశేషించుచున్ = కొనియాడుచు, తదీయ - దివ్యశరంబులకున్ = ఆతని గొప్ప బాణములకు, ప్రతిశరంబులు = మాఱు బాణములు, ప్రయోగించుచున్ + ఉన్న, కుమారున్, కని, తావగొనక = ఓర్వక

తాత్పర్యము : అని తారకుని ధనుర్విద్యాపాటవమును గొనియాడుచు, వాని దివ్యశరములకు మాఱుశరములు ప్రయోగించుచున్న కుమారస్వామినిఁ జూచి నిలువక - తరువాతి పద్యముతో నన్వయము

క దానవపతి మది నతికో
పానలశిఖ లెగయు నంతకాంతకసుతుపై
మానక పుంఖాపుంఖము
గా నేసె నపార ఘోర ఖరవర శరముల్ 153

అర్థము. దానవ - పతి = రాక్షసరాజు - తారకుఁడు, మదిన్ = మనస్సునందు, అతి - కోప +అనల - శిఖలు = అధికమైన కోపాగ్ని - జ్వాలలు, ఎగయు = లేచునట్టి, అంతక + అంతకు-సుతుపైన్ = యమనాశకుని (శివుని) కొడుకు - కుమారస్వామి - మీఁద, మానక = ఉడుగక, అపార - ఘోర - ఖర - వర - శరముల్ = అంతులేనివి, భయంకరములు, మిక్కిలితీక్షములునైన బాణములు, పుంఖాపుంఖముగాన్ = బాణము వెంబడి బాణముగా, ఏసెన్ = ప్రయోగించెను

తాత్పర్యము. తారకుఁడు మనస్సునందు అధికకోపాగ్నిజ్వాల లెగయు కుమారస్వామిపై ఉడుగక అంతులేనివి, భయంకరములు, తీక్షతరములు అగు శరములను ఒకదాని వెంబడి నొకటిగాఁ బ్రయోగించెను

క దనుజుల శరవర్షము కవి
సిన యెడఁ దనుఁగానరాక చేడ్వడి గుహుఁ డొ
ప్పె నవాభ్రాచ్ఛాదితుఁడై
తనప్రభ చెడియున్న తీవ్రధాముఁడు వోలెన్ 154

అర్థము. దనుజులు = రాక్షసులు, శర-వర్షము = అంపవాన, తన్నున్ = తన్ను, కవిసిన + ఎడన్ = ఆక్రమించినప్పుడు, గుహుఁడు = కుమారస్వామి, కానన్ + రాక = కనఁబడక, చేడ్వడి = బాధనొంది, నవ + అభ్ర + ఆచ్ఛాదితుఁడు + ఐ = క్రొమ్మొయిళ్లచేఁ గప్పఁబడినవాఁడయి, తన - ప్రభ = ఆత్మకాంతి, చెడి + ఉన్న = నశించియున్న, తీవ్ర-ధాముఁడు + పోలెన్ = సూర్యునివలె, ఒప్పెన్

తాత్పర్యము: రాక్షసుల అంపవాన తన్ను ఆక్రమించినప్పుడు కుమారస్వామి కానరాక బాధనొంది క్రొమ్మొయిళ్లచేఁ గప్పఁబడిన సూర్యుని విధమున నొప్పెను

విశేషములు. అలంకార ముపమ

వ. ఇ ట్లత్యాసురంబగు తారకాసురాడంబరంబు గని దనుజబలంబు లొక్కపెట్ట వచ్చి చెలంగి యార్చిన. 155

అర్థము ఇట్లు, అతి + ఆసురంబు + అగు = మిక్కిలి క్రూరమైన, తారక + అసుర + ఆడంబరంబు = తారకాసురుని విజృంభణమును, కని = చూచి, దనుజ - బలంబులు = రాక్షససేనలు, ఒక్క-పెట్టన్ = ఒక్కుమ్మడిగా, వచ్చి, చెలంగి = మ్రోసి, ఆర్చినన్ = అఱవఁగా

తాత్పర్యము ఇట్లు మిక్కిలి క్రూరమగు తారకాసురుని విజృంభణమును జూచి రాక్షససేనలు ఒక్కమాఱుగా వచ్చి మ్రోసి అఱవఁగా - తరువాతి పద్యముతో నన్వయము

చ **ఉరగులు స్రుక్కి మ్రక్కఁబడి, రుర్వి వడంకెఁ, బయోధు లింకె, భూ ధరములు డొల్లె, దిక్కరులు తల్లడమై మదమెత్తి కట్టె, భా స్కర రుచి మాసె, దిక్పతులు సంచలులై, రమరేంద్రుఁ డుల్కెఁ, బం కరుహజుఁ డిచ్చ నొచ్చె, హరి కంపముఁ బొందె మహాభయంబునన్ 156**

అర్థము . ఉరగులు = నాగులు, స్రుక్కి = భయపడి, మ్రక్కఁబడిరి = బాధపడిరి, ఉర్వి =భూమి, వడఁకెన్ = కంపించెను, పయోధులు = సముద్రములు ఇంకెన్, భూధరములు = కొండలు, డుల్లెన్ = పడెను, దిశ్ (క్) + కరులు = దిగ్గజములు, తల్లడము + ఐ = కలఁతఁజెంది, మదము, ఎత్తికట్టెన్ = నిలుపుకొనెను భాస్కర - రుచి = సూర్యుని కాంతి, మాసెన్ = నశించెను, దిశ్(క్) + పతులు = దిక్పాలకులు, సంచలులు + ఐరి = చలించిపోయిరి, అమర + ఇంద్రుఁడు = దేవేంద్రుఁడు, ఉల్కెన్= భయమందెను, పంకరుహజుఁడు = పద్మజుఁడు - బ్రహ్మ, ఇచ్చన్ = మనసునందు, నొచ్చెన్ = బాధపడెను, హరి = విష్ణువు, మహత్ (మహా) + భయంబునన్ = గొప్ప భీతితో, కంపమున్ + పొందెన్ = వడఁకెను

తాత్పర్యము. నాగులు భయపడి బాధపడిరి భూమి క్రుంగెను సముద్రము లింకిపోయెను పర్వతములు పడిపోయెను దిగ్గజములు కలఁగి మదము నిలుపుకొనెను సూర్యుని కాంతి నశించెను దిక్పాలకులు చలించిరి దేవేంద్రుఁడు భయపడెను బ్రహ్మ మనసునందు నొచ్చుకొనెను విష్ణువు అధికభీతితోఁ గంపించెను

వ **ఇట్లు తదీయాస్త్రజాలం బశ్రమంబున విఖండించి దృష్టి ముష్టి శీఘ్ర సంధాన దూరాపాత లక్ష్యభేదా ద్యనేకవిధ ధనుర్విద్యాకౌశలంబు మెఱయం దొడంగిన** 157

అర్థము ఇట్లు, తదీయ + అస్త్ర - జాలంబు = వాని బాణముల సమూహమును, అశ్రమంబునన్ = అనాయాసముగా, ఎఱండించి = ముక్కలు చేసి, దృష్టి - ముష్టి - శీఘ్రసంధాన-దూరాపాత - లక్ష్యభేద + ఆది + అనేక విధ - ధను(స్సే) ( ) + ఎద్యా - కౌశలంబు = దృష్టి ముష్టి, శీఘ్రసంధానము, దూరాపాతము లక్ష్యభేదము మున్నగు పెక్కుతేలైన, ధనుర్విద్యానైపుణ్యము, మెఱయన్ + తొడంగినన్ = ప్రకాశింపఁజేయఁబూనఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క దొనఁ గోలఁ గోల వేగం
బున నరిగొల్పుటయుఁ దిగువుఁ బొరిఁబొరి విడుపుం
జనుటయు దనుజులఁ గొనుటయు
ననిమిషులకు నైనఁగాంచు డరుదయ్యె ననిన్ 158

అర్థము . దొనన్ = అమ్ముల పొదియందు, కోలన్ + కోలన్ = ప్రతి బాణమును, వేగంబునన్ = వేగముతో, అరిగొల్పుటయున్ = సంధానము చేయుటయును, తిగువున్ = లాగుటయు, పొరిన్ + పొరిన్ = మాటిమాటికి, విడుపున్ = విడుచుటయు, చనుటయున్ = పోవుటయును, దనుజులన్ = రాక్షసులను, కొనుటయున్ = సంహరించుటయును, అనిమిషులకున్ + ఐనన్ = ఱెప్పపాటులేనివారి (దేవతల)కైనను, కాంచుడు = చూచుట, అనిన్ = యుద్ధమునందు, అరుదు + అయ్యెన్ = ఆశ్చర్యమయ్యెను

తాత్పర్యము. యుద్ధమున అమ్ములపొదినుండి ప్రతిబాణమును వేగముగా వింట సంధించుటయును, లాగుటయును, మాటిమాటికిని విడుచుటయును, పోవుటయు, రాక్షసులను సంహరించుటయు ఱెప్పపాటులేని దేవతలకుఁ గూడఁ జూచు టరుదయ్యెను

విశేషములు . అలంకారము పరికరాంకురము

క. దొనపై గొనయముపై నో
లిన వడి నెడతెగక యంగుళీయక ఖచితో
ర్వనుపమ నవరత్నోజ్జ్వల
వినుతద్యుతు లెసఁగెఁ గొఱవి వీచిన భంగిన్ 159

అర్థము : దొనపైన్ = అమ్ములపొది మీఁదను, గొనయముపైన్ = వింటినారిపై, ఓలిన్ + అ = క్రమముగా, వడిన్ = వేగముగా, ఎడతెగక = అఱుపులేక,

అంగుళీయక - ఖచిత + ఉరు + అనుపమ - నవ - రత్న + ఉజ్జ్వల - వినుత - ద్యుతులు = ఉంగరమునందుఁ బొదుగఁబడిన, గొప్ప, సాటిలేని, క్రొత్త రత్నములయొక్క ప్రకాశించు పొగడఁబడు కాంతులు, కొఱవి - వీచిన -భంగిన్= కొఱకచ్చును ద్రిప్పిన విధమున, ఎసఁగెన్ = అతిశయించెను

తాత్పర్యము . అమ్ములపొది మీఁదను, వింటినారిపైని, క్రమముగా వేగముగా విరామములేక వ్రేలియుంగరమునందుఁ బొదుగఁబడిన పెద్ద, సాటిలేని, క్రొత్త రత్నముల ప్రకాశించు కాంతులు కొఱవిని ద్రిప్పిన విధమున నతిశయించెను

విశేషములు అలంకార ముపమ

వ ఇ ట్లనంతశరసంధానవేగంబునం దారకాసురుని కరి రథ రథ్య సారథుల నొక్కటఁదెగనేసి రయంబున నర్ధచంద్రాస్త్రంబుఁ దొడిగి యేసిన 160

అర్థము . ఇట్లు, అనంత - శర - నికర - రథ - రథ్య - సారథులన్ = అంతులేని బాణ సమూహమును,రథమును, గుఱ్ఱములను, సారథిని, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, తెగన్ + ఏసి = ఖండించి, రయంబునన్ = వేగముగా, అర్ధచంద్ర + అస్త్రంబున్ = అర్ధచంద్రాస్త్రమును, తొడిగి = సంధించి, ఏయుటయున్ = ప్రయోగింపఁగా

తాత్పర్యము . ఇట్లు అంతులేని అమ్ములతొడుగు వేగముచే తారకాసురుని బాణములను, రథమును, గుఱ్ఱములను సారథిని ఒక్కమాఱుగా ఖండించి శీఘ్రముగా అర్ధచంద్రాస్త్రమును సంధించి ప్రయోగింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క. పురహరసుత శరహతి న
చ్చెరువుగఁ దారకునివింటిశింజిని తెగియెన్
దురమున, నట్టిద దోషా
చరుపట్టిన ధర్మగుణము పనఁ దెగు డరుదే ? 161

అర్థము : దురమునన్ = యుద్ధమునందు, పురహర - సుత - శరహతిన్ = శివుని కుమారుని బాణముల దెబ్బచే అచ్చెరువుగన్ = ఆశ్చర్యముగా, తారకుని, వింటి - శింజిని = వింటినారి, తెగియెన్, అట్టిది +అ = అది అట్లే, దోషాచరు -

పట్టిన - దోషా - చరు - పట్టిన, దోష + ఆచరు - పట్టిన = రాత్రించరుఁడు - రాక్షసుఁడు - తారకుఁడు - తప్పుచేసినవాఁడు పట్టిన, ధర్మ - గుణము = వింటిత్రాడు - ధర్మమనెడి గుణము, చనన్ = పోవునట్లు, తెగుడు = తెగుట, అరుదే = ఆశ్చర్యమా ?

తాత్పర్యము యుద్ధమునందుఁ గుమారస్వామి బాణముల దెబ్బచే నాశ్చర్యముగాఁ దారకుని వింటిత్రాడు తెగిపోయెను అది యట్లే దోషాచరుఁడు (రాక్షసుఁడు - తప్పుచేసినవాఁడు) పట్టుకొనిన ధర్మగుణము (వింటిత్రాడు - ధర్మమనెడి గుణము) నశించిపోవుట ఆశ్చర్యమా ? - కా చనుట

విశేషములు శ్లేషానుప్రాణితమైన అర్థాంతరన్యాసము

తే **సురలు గని యార్వఁ దారకాసురుని విల్లు**
విఱిగె, దానవసేనలు విఱిగె నంత,
మగిడి తాఁకిన కడిఁది సామంతు లెల్ల
నస్తమించిరి, రవియును నస్తమించె **162**

అర్థము. సురలు = దేవతలు, కని = చూచి, ఆర్వన్ = అఱవఁగా, తారక + అసురుని - విల్లు, విఱిగెన్, అంతన్, దానవ - సేనలున్ = రాక్షససైన్యములును, విఱిగెన్ = పాఱిపోయెను, మగిడి = మరలి, తాఁకిన - కడిఁది - సామంతులు + ఎల్లన్ = మార్కొనిన శౌర్యవంతులైన సామంతులందఱును, అస్తమించిరి = నశించిరి, రవియును = సూర్యుఁడును, అస్తమించెన్

తాత్పర్యము. దేవతలు చూచి ఉత్సాహముతో నఱవఁగా దారకుని విల్లు విఱిగెను అంత రాక్షససేనలును విఱిగెను - పాఱిపోయెను మరలి తాఁకిన శౌర్యవంతులగు సామంతులందఱును అస్తమించిరి సూర్యుఁడును అస్తమించెను

విశేషములు. అలంకారము సహోక్తి

వ **అంత మహాసేనుండు సంగ్రామవిరామంబు సేసి నిఖిలామర పరివృతుండై నిజశిబిరంబున కరిగి బృందారకబృందనయనేందీవరానంద కరుం డగుచుండె నిటఁ దారకాసురుండు నిజస్వజనసామంతాద్యనంత చతురంగబలంబు సమరజలధినిర్మగ్నం బగుటం జేసి నోసి పరిమితపరివార వృతుండై** **163**

అర్థము అంతన్, మహాసేనుండు = కుమారస్వామి, సంగ్రామ - విరామంబు +చేసి = యుద్ధవిరమణము చేసి, నిఖిల + అమర - పరివృతుండు + ఐ =ఎల్ల దేవతలతోడను గూడినవాఁడయి, నిజ - శిబిరంబునకున్ = తన గుడారమునకు - విడిఁదికి, అరిగి, బృందారక - బృంద - నయన +ఇందివర + ఆనంద - కరుండు = దేవతల సమూహముయొక్క నల్లకలువల వంటి కన్నులకు ఆనందమును గలుగఁజేయువాఁడు, అగుచున్ + ఉండెన్, ఇటన్, తారక + అసురుండు, నిజ - స్వజన - సామంత + ఆది + అనంత - చతురంగ - బలంబు = తన వారైన సామంతులు మున్నగు అంతులేని చతురంగబలము, సమర - జలధి - నిర్మగ్నులు = యుద్ధమనెడి సముద్రమునందు మునిఁగినవారు, అగుటన్ + చేసి =అగుటచేత, నోసి = నొచ్చి, పరిమిత - పరివార - వృతుండు + ఐ = తక్కువ పరివారముతోఁ గూడినవాఁడయి

తాత్పర్యము అంతఁ గుమారస్వామి యుద్ధవిరమణముచేసి ఎల్లదేవతలతోఁ గూడి తన విడిఁది కేఁగి దేవతల నల్లకలువలవంటి కన్నుల కానందమును కలిగించువాఁడగుచుండెను ఇచ్చటఁ దారకుఁడు తన సామంతులు మున్నగు అంతులేని చతురంగబలము యుద్ధమనెడి సముద్రమున మునుఁగుటచే బాధపడి పరిమితమైన పరివారముతోఁ గూడినవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకారము రూపకము

సీ తరల ముక్తాహారతతి వీడి కుచములఁ
గన్నీరు ధారలు కడలుకొనఁగఁ
దాంబూలరాగంబు దఱఁకి కెమ్మోవుల
నురువులు గొని లాల లురులుదేరఁ
బుష్పావతంసముల్ పాలుపఱి కరతలా
బ్జములు శిరోవతంసములు కాఁగఁ
బత్రభంగంబులఁ బాసి కపోలస్థ
లములపై నీలాలకములు చెదర

తే మంజులంబగు తూర్యసమ్మర్ద ముడిగి
తమ మొగంబుల నార్తరావములు చెలఁగ
శోకమగ్నలై సతు లుద్దఁ జూచుచుండఁ
బురము సొత్తెంచెఁ దారకాసురుఁడు మగిడి

అర్థము తరల - ముక్తా - హార - తతిన్ = చంచలమైన ముత్యాల పేరుల సమూహమును, వీడి, కుచములన్ = స్తనములందు, కన్నీరు - ధారలు, కడలు కొనఁగన్ = అతిశయింపఁగను,

తాంబూల - రాగంబు = తమ్మలపు టెఱుపు, తఱఁకి = తొలఁగి, కెమ్మోవులన్ = ఎఱ్ఱని పెదవులందు, లాలలు = లాలా జలములు, నురువులు + కొని = నురుఁగులు గట్టి, ఉరులుదేరన్ =బయల్వెడలఁగను

పుష్ప + అవతంసముల్ = శిరోభూషణములయిన పూలు,పాలుపు + అఱి = ఒప్పు నశించి, కరతల - అబ్జములు= తామరల వంటి కరతలములు, శిరన్( ) + అవతంసములు = శిరోభూషణములు, కాఁగన్,

పత్ర - భంగంబులన్ = మకరికాపత్రరచనలను, పాసి = విడిచి, కపోల - స్థలములపైన్ = చెక్కిళ్లమీఁద, నీల + అలకములు = నల్లని ముంగురులు, చెదరన్,

మంజులంబు + అగు = మనోహరమయిన,తూర్య - సమ్మర్దము + ఉడిగి = వాద్యముల సందడిపోయి, తమ - మొగంబులన్ = తమ ముఖములందు, ఆర్త-రావములు = దీనధ్వనులు, చెలఁగన్ = మ్రోయఁగను,

శోక - మగ్నలు + ఐ = దుఃఖమునందు మునిఁగినవారయి, సతులు = స్త్రీలు, ఉద్దన్ = ఊరక, చూచుచున్ + ఉండన్ = చూచుచుండఁగా,

తారక + అసురుఁడు, మగిడి = మరలి, పురము + చొత్తెంచెన్ = పురము ప్రవేశించెను

తాత్పర్యము. చంచలములయిన ముత్యాలపేరులు వీడి స్తనములందుఁ గన్నీటిధారలు అతిశయింపఁగను, తమ్మలపుటెఱుపు తొలఁగి కెమ్మోవులందు లాలలు నురుఁగులుగట్టి బయలువెడలఁగను, శిరోభూషణము లైనపూలు ఒప్పుచెడి, తామరల వంటి కరతలములు శిరో ఽలంకారములు కాఁగను, మకరికాపత్రరచనలు పోయి చెక్కిళ్లపై నల్లని ముంగురులు చెదరఁగను, మనోహరమయిన వాద్యముల ధ్వని పోయి తమ ముఖములందు ఆర్తారావములు మ్రోయఁగను దుఃఖమునందు మునిఁగినవారయి స్త్రీలు ఊరక చూచుచుండఁగాఁ దారకాసురుఁడు మరలఁ బుర్ప్రవేశము చేసెను

విశేషములు: అలంకారము స్వభావోక్తి

వ ఇట్లు నిర్గతైశ్వర్యప్రభవుండై పురాంగనాంతస్సంతాపానలవివర్ధనానిలుండగుచు

అర్థము : ఇట్లు, నిర్గత + ఐశ్వర్య - ప్రభావుండు + ఐ = పోయిన ఐశ్వర్యము యొక్క మహిమగలవాఁడయి, పుర + అంగనా + అంతః + సంతాప + అనల - వివర్ధన + అనిలుండు = ఊరి స్త్రీల యొక్క మనోదుఃఖమనెడి అగ్ని యొక్క పెంపునకు వాయువయిన వాఁడు, అగుచున్

తాత్పర్యము. ఇట్లు ఐశ్వర్యమహిమ గోలుపోయి ఊరి స్త్రీల మనస్సంతాప మనెడి అగ్ని పెంపునకు వాయువు అగుచు - అనఁగాఁ బురస్త్రీల దుఃఖమును బెంపొందింపఁజేయుచు ననుట - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకారము రూపకము

మ ఉపరాగాకులచంద్రమండలము నా నోప్పేద వక్త్రాంబుజం
బపమానానలధూమధూసరితమై యంగంబు దావాగ్ని ధూ
మ పరీతాసిత భూధరాభముగ, నిర్మంత్రస్థితిం, దారకుం
డపనీతాఖిలలోకరాజ్యవిభవుండై యుండెఁ జింతించుచున్ 166

అర్థము. వక్త్ర + అంబుజంబు = ముఖపద్మము, ఉపరాగ + ఆకుల - చంద్ర - మండలము - నాన్ =గ్రహణముచేఁ గలఁతనొందిన చంద్రబింబ మనఁగా, ఒప్పు + ఏదన్ = అందము చెడఁగా, అంగంబు = శరీరము, అపమాన + అనల - ధూమ - ధూసరితము + ఐ = అవమానములనెడి అగ్నియొక్క పొగచే బూడిదవర్ణము గలదియై, దావ + అగ్ని - ధూమ - పరీత + అసిత - భూధర + ఆభముగన్ = కార్చిచ్చుయొక్క పొగచేఁ జుట్టఁబడి నల్లనైన కొండతో సమానముకాఁగా, తారకుండు = తారకాసురుఁడు, నిర్మంత్ర -స్థితిన్ = ఎట్టి యాలోచనమును లేని స్థితితో, అపనీత + అఖిల - లోక - రాజ్య - విభవుండు + ఐ = పోఁగొట్టఁబడిన ఎల్లలోకముల రాజ్యవైభవము గలవాఁడయి, చింతించుచున్ = దుఃఖించుచు, ఉండెన్

తాత్పర్యము: ముఖపద్మము గ్రహణముచేఁ గలఁగిన చంద్రబింబమువలె ఒప్పుచెడఁగా, శరీరము అవమానములనెడి అగ్ని పొగచే బూడిదవర్ణము గలదయి, కార్చిచ్చు పొగచే నావరింపఁబడి నల్లనైన కొండతో సమానము కాఁగా,

దారకాసురుఁడు ఎట్టి ఆలోచనమును లేనివాఁడయి, ఎల్లలోకముల రాజ్యవైభవమును గోలుపోయి దుఃఖించుచునుండెను

విశేషములు . అలంకారము రూపకానుప్రాణితోపమ

గీ **తారకప్రభ తోడ్తోన తఱుగుచుండఁ**
బేర్మి నాదిత్యతేజంబు పెరిఁగి వెలిఁగె ,
వేగ దైత్యుల కింతన వేవె నను వి
ధమునఁ గ్రౌంచారి కుక్కుటధ్వజము వెలిఁగె 167

అర్థము . తారక - ప్రభ = తారకాసురుని తేజస్సు - నక్షత్రముల కాంతి, తోడ్తోన్ + అ = క్రమక్రమముగా, తఱుగుచున్ + ఉండన్ = తగ్గిపోవుచుండఁగా, పేర్మిన్ = అతిశయముతో, ఆదిత్య - తేజంబు = దేవతల తేజస్సు, సూర్యుని తేజస్సు, పెరిఁగి = వృద్ధిపొంది, వెలిఁగెన్ = ప్రకాశించెను, వేగన్ = తెల్లవాఱఁగా, దైత్యులకున్ = రాక్షసులకు, ఇంతన్ + అ = ఇంతలోనే, వేవెన్ = తెల్లవాటెను, - చేడ్పాటు అయ్యెను, అను - విధమునన్ = అనురీతిని, క్రౌంచ + అరి = క్రౌంచుని శత్రువు - కుమారస్వామియొక్క, కుక్కుట - ధ్వజము =కోడియనెడి పతాక, వెలిఁగెన్ = ప్రకాశించెను

తాత్పర్యము . తారకానురుని తేజస్సు క్రమక్రమముగాఁ దఱిగిపోవుచుండఁగా దేవతల తేజస్సు అధికమై ప్రకాశించెను నక్షత్రముల కాంతి క్రమక్రమముగాఁ దఱిగిపోవుచుండఁగా సూర్యుని తేజస్సు అధికమై ప్రకాశించెను తెల్లవాఱఁగా రాక్షసుల కింతలోనే తెల్లవాటె నను విధమున నశించె నను విధమునఁ గుమారస్వామి కుక్కుటపతాక ప్రకాశించెను

విశేషములు : అలంకారము శ్లేషము, ఉత్ప్రేక్ష తెల్లవాఱుజాముననఁ గుక్కుటములు విజృంభించును

వ **అంత నాదిత్యోదయంబైనం దారకకుమారులు సమరసన్నాహంబుతోఁ బట్టవర్ధనగజేంద్రంబుల నెక్కి సంగరంబునకుం దెరలనెత్తి వచ్చి నిజబలంబులకుం జేయువీచిన.** 168

అర్థము . అంతన్, ఆదిత్య + ఉదయంబు + ఐనన్ = ప్రొద్దుపొడుపు కాఁగా, తారక కుమారులు = తారకాసురుఁడును, కుమారస్వామియు, సమర - సన్నాహంబుతోన్ = యుద్ధప్రయత్నముతో, పట్టవర్ధన - గజ + ఇంద్రంబులన్ =

పట్టపుటేనుఁగులను, ఎక్కి, సంగరంబునకున్ = యుద్ధమునకు, తెరలన్ + ఎత్తి - వచ్చి = దండెత్తి వచ్చి, నిజ - బలంబులకున్ = తమతమ సేనలకు, చేయు-వీచినన్ = ఉత్సాహము గలిగింపఁగా

తాత్పర్యము . అంత సూర్యోదయము కాఁగా దారకాసుర కుమారస్వాములు యుద్ధ ప్రయత్నముతోఁ బట్టపుటేనుఁగుల నెక్కి యుద్ధమునకు దండెత్తి వచ్చి తమ తమ సేనలకు ఉత్సాహము గలిగింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

క ఏసియు వైచియుఁ బొడిచియు
వేసర కొండొరులఁ బట్టి విడువక కేశా
కేశిఁ బెనంగుచుఁ బోర మ
హాసురముగఁ బోరి రా సురాసురవీరుల్ 169

అర్థము. ఏసియున్, వైచియున్, పొడిచియున్, వేసరక = విసువుఁజెందక, ఒండొరులన్ = ఒకరినొకరు, పట్టి, విడువక, కేశాకేశిన్ = ఒకరిజుత్తు ఇంకొకరుపట్టుకొని, పెనంగుచున్ = కలియఁబడుచు, పోరన్ = యుద్ధమున, మహత్ (మహా) + ఆసురముగన్ = మిక్కిలి క్రూరముగా, ఆ - సుర + అసుర-వీరుల్ = ఆ దేవ రాక్షస వీరులు, పోరిరి

తాత్పర్యము : ఆ దేవ దానవ వీరులు, ఒకరినొకరు వేసియు, వైచియుఁ బొడిచియు, విసువుఁజెందక, ఒకరినొకరు పట్టుకొని విడువక జుత్తు జుత్తు పట్టుకొని కలియఁబడుచు యుద్ధమున మహాక్రూరముగాఁ బోరిరి

విశేషములు: కేశాకేశి - కేశేషు కేశేషు గృహీత్వా ఇదం యుద్ధం ప్రవృత్తమ్ - కేశాకేశి - వ్యతిహార లక్షణ బహువ్రీహి సమాసము ఇందు శ సలకుఁ బ్రాసమైత్రి పాటించుట గమనింపఁదగినది

చ దనుజున కొక్కయమ్ము, మదదంతికి నెన్మిది, వాజి కేను గా
ననిఁ బరసేన యెంతగల దంతయు నొక్కట మ్రొగ్గనేసి, నే
ర్చునఁ బ్రతిలేక క్రచ్చు నతిశూరుఁ గుమారు నదల్చి తాఁకె న
త్యనుపమశక్తియుక్తి నసురాగ్రణి తారకుఁ డాసురంబునన్ 170

అర్థము. దనుజునకున్ = రాక్షసునకు, ఒక్క, అమ్ములన్, మద - దంతికిన్ = మత్తగజమునకు, ఎన్మిది = ఎనిమిది అమ్ములును, వాజికిన్ = గుఱ్ఱమునకు,

ఏను + కాన్ = అయిదు అమ్ములును అగునట్లు, అనిన్ = యుద్ధమునందు, పర - సేన = శత్రు సైన్యము ఎంత - కలదు + అంతయిన్, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, మ్రొగ్గన్+ ఏసి = కూలనేసి, నేర్పునన్ = నేర్పుతో, ప్రతి-లేక = ఎదురులేక, క్రచ్చు = కదియునట్టి, అతి-శూరున్ = గొప్పశూరుఁడగు, కుమారున్ = కుమారస్వామిని, అసుర + అగ్రణి = రాక్షసశ్రేష్ఠుఁడగు తారకుఁడు, అతి + అనుపమ - శక్తి - యుక్తిన్ = మిక్కిలి సాటిలేని శక్తితో, ఆసురంబునన్ = రాక్షసముగా, అదల్చి = గద్దించి, తాఁకెన్

తాత్పర్యము రాక్షసుని కొకయమ్ము, మదేభమునకు నేనిమిది అమ్ములు, గుట్టుమున కైదు అమ్ములునుగా యుద్ధమున శత్రు సైన్యము ఎంత గలదో అంతయు నొక్కమాఱుగాఁ గూలనేసి నేర్పుతో నెదురులేక కదియు మహాశూరుఁడగు కుమారస్వామిని రాక్షసశ్రేష్ఠుఁడయిన తారకుఁడు రాక్షసత్వముతో గద్దించి మిక్కిలి సాటిలేని శక్తితోఁ దాఁకెను

విశేషములు గర్జు = గర్జిలు ? 'గర్జు'ను 'క్రచ్చు'గా శ్రీ వేప్ర శాస్త్రి గారు సవరించిరి

లయగ్రాహి

ఆ హరతనూజుఁడు సురాహితుఁడు నొండొరుల
బాహుబలముం జలము సాహసము దర్పో
త్సాహమును నొప్ప నిజ వాహనమున్ దనుజ
వాహినులు నిర్జర సమూహములు పెక్కుల్
వ్యూహులు బయల్పడి హతాహతిఁ జనం బఱపి
రాహవములోనఁ బటుకాహళతతుల్ కో
లాహలముగాఁ జెలఁగఁగా హరియు భార్గవుఁడు
మోహరముఁ జేరి కడు మోహమునఁ జూడన్ 171

అర్థము . ఆ - హర - తనూజుఁడున్ = ఆ శివుని కొడుకును-కుమారస్వామియు, సుర + అహితుఁడున్ = దేవతల శత్రువును, - రాక్షసుఁడును - తారకుఁడును, ఆహవములోనన్ = యుద్ధములో, పటు - కాహళ - తతుల్ = పెద్దబాకాల సమూహములు, కోలాహలముగాన్ = సందడిగా, చెలఁగఁగాన్ = మ్రోయఁగా, హరియున్ = ఇంద్రుఁడును, భార్గవుఁడున్ = శుక్రుఁడును, మోహరమున్ = యుద్ధమును, చేరి, కడున్ + మోహమునన్ = మిక్కిలి కోరికతో, చూడన్ =

చూడఁగా, ఒండొరుల = ఒక్కొక్కరి, బాహు - బలమున్ = భుజబలమును, చలమున్ = పట్టుదలయు, సాహసమున్, దర్ప + ఉత్సాహమును = గర్వము వలని ఉత్సాహమును, ఒప్పన్ = ఒప్పఁగా, నిజ - వాహనములన్ = తమ తమ వాహనములందు, దనుజ - వాహినులున్ = రాక్షససేనలును, నిర్జర - సమూహములున్ = దేవతల సమూహములును, పెక్కుల్ - వ్యూహులున్ = పలు వ్యూహములును, బయల్పడి, హతాహతిన్ = హళాహళితో = అతిత్వరతో, చనన్ = పోవునట్లు, పఱపిరి = తోలిరి

తాత్పర్యము. ఆ కుమారస్వామియును, తారకాసురుఁడును యుద్ధములో గొప్ప బాకాలు సందడిగా మ్రోయఁగా, ఇంద్రుఁడును, శుక్రుఁడును యుద్ధమును జేరి మిక్కిలి కోరికతోఁ జూడఁగా ఒక్కొక్కరి భుజబలమును, పట్టుదలయు, సాహసమును, గర్వమువలని యుత్సాహమును ఒప్పఁగాఁ, దమ వాహనములందు రాక్షససేనలును, దేవతల సేనలును, పలు వ్యూహములును బయలుపడి హళాహళితో వెడలునట్లు తోలిరి

విశేషములు లయగ్రాహి - నాలుగుపాదము లుండును ఒక్కొక్క పాదమున ముప్పదితొమ్మిది మాత్రలుగల ముప్పది యక్షరములుండును ఒక్కొక్క పాదమున భ, జ, స,న, భ, జ, స,న, భ, య అనుగణములుండవలయును 1-9-17-25 అక్షరములకుఁ బ్రాసయతి చెల్లవలయును ప్రాసనియమము గలదు

చ కరులఁ దెమల్చి పట్టికొని కైపున జిఱ్ఱునఁ ద్రిప్పి నుగ్గుగా
నరద సమూహి వైచి తగ నశ్వదళంబులు పట్టి వీచి భీ
కర భట కోటి వైచి తలఁకంగ సురారి చతుర్బలంబులన్
వరుసన ముట్టి చంపెఁ బురవైరితనూజుగజంబు పోరిలోన్ 172

అర్థము: పోరిలోన్ = యుద్ధములో, పుర - వైరి - తనూజ - గజంబు = శివుని కొడుకగు కుమారస్వామియేనుఁగు, కరులన్ = ఏనుఁగులను, తెమల్చి = లాగి, పట్టికొని, కైపునన్ = ఉద్రేకముతో, జిఱ్ఱునన్, త్రిప్పి, అరద - సమూహిన్ = రథసమూహమును, నుగ్గు + కాన్ = పిండియగునట్లు, వైచి, తగన్ = తగునట్లు, అశ్వ - దళంబులు = గుఱ్ఱముల దండులు, పట్టి, వీచి = విసరి, భీకర - భట - కోటిన్ = భయంకరమైన పదాతి సమూహమును, వైచి, తలఁకంగన్ = చలించునట్లు, సుర + అరి - చతుర్ + బలంబులన్ = తారకుని నాలుగు విధములయిన సేనలను, వరుసన్ + అ = క్రమముగానే, ముట్టి = తాఁకి, చంపెన్

తాత్పర్యము కుమారస్వామి యేనుఁగు - ఏనుఁగులను లాగి పట్టుకొని జిట్టినఁ ద్రిప్పి, రథ సమూహమును పిండియగునట్లు వైచి, గుఱ్ఱపు దండులను పట్టుకొని విసరి భయంకరమైన పదాతివర్గమును చలించునట్లు వైచి రాక్షసుని చతుర్విధబలములను గ్రమముగాఁ దాఁకి చంపెను

విశేషములు 'అరద శబ్దమును దత్సమముగా నీ కవి పెక్కుచోట్ల వాడెను

లయగ్రాహి

ముట్టి గజయూథములఁ బట్టి రదనాగ్రములఁ
గుట్టి తెగఁజీరి పలుదట్టములు వెట్టుం
గట్టెదురఁ దాఁకి పడఁ జెట్ట మొగఁపెట్టుఁ బెద
ముట్టుసని వాలములఁ బెట్టికొని వీడున్
బిట్టడరి కేల మెడ సుట్టి తెగ నెత్తువడు
నట్టలు శిరంబులును మెట్టులుగొనం బ్రో
పెట్టుఁ జనఁదట్టుఁ జెడమెట్టు నలి గొట్టుఁ గని
కట్టలుకఁ దారక సురేట్టుకరి పోరన్ 173

అర్థము. పోరన్ = యుద్ధమునందు, సుర + ఈట్టు - కరి = దేవేంద్రుని ఏనుఁగు, తారక = తొలఁగక, కని, కట్టలుకన్ (కడు + అలుకన్) = మిక్కిలి కోపముతో, గజ - యూథములన్ = ఏనుఁగుల గుంపులను, ముట్టి = తాఁకి, పట్టి = పట్టుకొని, రదన + అగ్రములన్ = దంతములకొనలతో, కుట్టి = పొడిచి, తెగన్ = తెగునట్లు, చీరి = చీల్చి, పలు - తట్టములు + పెట్టున్ = పెక్కుబాధలు పెట్టును, కట్టెదురన్ (కడు + ఎదురన్) = ఎట్ట యెదురుగా, తాఁకి, పడన్ = పడునట్లు, చెట్టన్ = దుష్టత్వముతో, మొగఁపెట్టున్ = ఎదురుకొనును, పెదముట్టు + చని = అత్యంతాక్రమణముతోఁబోయి, వాలములన్ = తోఁకలందు, పెట్టికొని = పట్టుకొని, వీడున్ = విసరివేయును, బిట్టు + అడరి = మిక్కిలి విజృంభించి, కేలన్ = తొండముతో, మెడ + చుట్టి, తెగన్ = తెగఁగా, ఎత్తు + పడు = పడిపోవు, అట్టలున్ = మొండెములును, శిరంబులును = తలలును, మెట్టులు + కొనన్ = మెట్లు ఏర్పడునట్లు, ప్రోపెట్టున్ = ప్రోవుపెట్టును, చవన్ = పోవునట్లు, తట్టున్ - చఱచును, చెడన్ = నశించునట్లు, మెట్టున్ = త్రొక్కును, నలి + కొట్టున్ = పిండిగాఁ గొట్టును

తాత్పర్యము. దేవేంద్రుని యేనుఁగు యుద్ధమునందు మిక్కిలి కోపముతోఁ జూచి యేనుఁగుల గుంపులను దాఁకి పట్టుకొని దంతముల కొనలతోఁ బొడిచి, తెగునట్లు చీల్చి పెక్కు బాధలు పెట్టును ఎట్టయెదురుగాఁ దాఁకి పడఁగొట్టును అత్యంత మాక్రమించుకొని తోఁకలను పట్టుకొని విసరివేయును మిక్కిలి విజృంభించి తొండముతో మెడను జుట్టి తెగఁగాఁ బడిపోవు మొండెములును దలలును మెట్లుగా నగునట్లు ప్రోవుపెట్టును చచ్చిపోవునట్లు చఱచును నశించునట్లు త్రొక్కును పిండియగునట్లు కొట్టును

విశేషములు అలంకారము స్వభావోక్తి ఛందస్సునకు 171 వ పద్యమును జూచునది ద్విత్వటకార పునఃపునరావృత్తిచే వృత్త్యనుప్రాసము

క **'హరి యగుఁ గరులం జంపెడు ,**
హరి కెందును నిట్టి దీర్ఘహస్తము గలదే ?
కరియగుఁ గరిచేఁ జచ్చునె
కరు లి ?' ట్లనఁ జంపె గుహునికరి కరిఘటలన్ 174

అర్థము. కరులన్ = ఏనుఁగులను, చంపెడున్ = చంపుచున్నది, హరి + అగున్ = సింహ మగును, హరికిన్ = సింహమునకు, ఎందును, ఇట్టి, దీర్ఘ - హస్తము = పొడవైన తొండము, కలదే ?, కరి + అగున్ =ఏనుఁ గగును, కరిచేన్ = ఏనుఁగుచే, కరులు = ఏనుఁగులు, ఇట్లు, చచ్చునె ?, అనన్, గుహుని - కరి = కుమారస్వామి యేనుఁగు, కరి - ఘటలన్ = ఏనుఁగుల గుంపులను, చంపెన్

తాత్పర్యము. ఇది ఏనుఁగులను జంపుచున్నది కావున సింహ మగును కాని సింహమున కెందైన నిట్టి పొడవైన తొండముండునా ? కాదు - ఇది ఏనుఁ గగును కాని ఏనుఁగుచే ఇట్లు ఏనుఁగులు చచ్చునా ?' అనునట్లు కుమారస్వామి ఏనుఁగు ఏనుఁగుల గుంపులను జంపెను

విశేషములు. అలంకారము హేత్వపహ్నవాలంకారము, ఆక్షేపము

వ. **ఇట్లు దనుజానంత దంతి సంతానంబుం జిత్రవధ సేయు నవసరంబున** 175

అర్థము. ఇట్లు, దనుజ + అనంత - దంతి - సంతానంబున్ = రాక్షసుని (తారకుని) అంతులేని ఏనుఁగుల సమూహమును, చిత్రవధ + చేయు + అవసరంబునన్ = చిత్రవధ చేయు సమయమున

తాత్పర్యము ఇట్లు తారకుని అంతులేని యేనుఁగుల సమూహమును చిత్రవధ చేయునప్పుడు - తరువాతి పద్యముతో నన్వయము

చ కరములు ద్రెవ్వి, పాదములు గాఁడి, శిరంబులు వ్రస్సి, చర్మముల్ సిరిగి, కటంబు లుచ్చి, చెవిచేట లురమ్ములు గూల్చి, దంతముల్ మురిసి పడం కుమారకు నమోఘ శరాహతి మేనులెల్ల జ ర్జరితములై మహిం దొరిఁగె సామజముల్ గడికండలై వడిన్ 176

అర్థము. కరములు = తొండములు, ద్రెవ్వి = తెగి, పాదములు = కాళ్ళు, కాఁడి = గ్రుచ్చుకొని, శిరంబులు = తలలు, వ్రస్సి = బ్రద్దలయి, చర్మముల్ = తోళ్లు, చిరిగి = చినిఁగి, చెవి - చేటలు - చేటలవంటి చెవులు, ఉరమ్ములు = బొమ్ములు, కూలి, దంతముల్, మురిసి = విఱిగి, పడన్ = పడఁగా, కుమారకు + అమోఘ - శర + ఆహతిన్ = కుమారస్వామి - వ్యర్థముకాని బాణముల దెబ్బచే, మేనులు + ఎల్లన్ = శరీరములన్నియు, జర్జరితములు + ఐ = తూంట్లుపడినవయి, సామజముల్ = ఏనుఁగులు, కడికండలు + ఐ = ముక్కలుముక్కలయి, వడిన్ = వేగముగా, మహిన్ = నేలపై, తొరిఁగెన్ = వ్రాలెను

తాత్పర్యము తొండములు తెగి, కాళ్ళు గ్రుచ్చుకొని, శిరస్సులు బ్రద్దలయి, చర్మములు చినిఁగి, గండస్థలములు దూసికొని, చేటలవంటి చెవులును, బొమ్ములును గూలి, దంతములు విఱిగి పడఁగా, కుమారస్వామి అవ్యర్థములైన బాణముల దెబ్బచే శరీరములన్నియుఁ దూంట్లుపడి యేనుఁగులు ముక్కలుముక్కలై వడిగా నేలఁగూలెను

వ ఇట్లుప్రతిహతప్రతాపోన్నతుండై దనుజబలంబు నిశ్శేషంబుగాఁ జిత్రవధ సేయుచున్న కుమారుంగని కోపావేశంబునం దావగొనక 177

అర్థము ఇట్లు, అప్రతిహత - ప్రతాప + ఉన్నతుండు + ఐ = అడ్డులేని పరాక్రమముచే అధికుఁడయి, దనుజ - బలంబున్ = రాక్షససేనను, నిశ్శేషంబు + కాన్ = మిగులు లేకుండ, చిత్రవధ + చేయుచున్ + ఉన్న, కుమారున్, కని, కోప + ఆవేశంబునన్ = కోపోద్రేకముచే, తావగొనక = నిలువక

తాత్పర్యము ఇట్లు అడ్డులేని పరాక్రమముచే నధికుఁడయి, రాక్షస సైన్యమును మిగులు లేకుండునట్లు చిత్రవధచేయుచున్న కుమారస్వామిని జూచి కోపోద్రేకముతో నిలువక - తరువాతి పద్యముతో నన్వయము

మ కర ముద్రేకముతోడఁ దారకుఁడు నిర్ఘాతంబుపైఁ బేర్చి భూ
ధర ముగ్రాకృతిఁ బాఱునట్లు సుమహద్దర్పోరుబాహాబలో
ద్ధురుఁడై షణ్ముఖుమీఁద లీలఁ గురిసెన్ దుర్వార శస్త్రాస్త్ర భీ
కర వర్షంబు కులాద్రిపైఁ గురియు విక్రాంతాసితాబ్జప్రభన్ 178

అర్థము. తారకుఁడు, కరము + ఉద్రేకము తోడన్ = మిక్కిలి ఆవేశముతో, భూధరము = పర్వతము, ఉగ్ర + ఆకృతిన్ = భయంకరమైన ఆకారముతో, నిర్ఘాతంబుపైన్ = వజ్రముమీఁదపేర్చి = విజృంభించి, పాఱు + అట్లు = పరువెత్తు విధమున, సు - మహత్ + దర్ప + ఉరు - బాహా - బల + ఉద్ధురుఁడు + ఐ = మిక్కిలి గొప్పదియగు గర్వముతోడి గొప్ప భుజబలముచే దృఢమైనవాఁడయి, షష్(ట్) + ముఖు-మీఁదన్ = కుమారస్వామిపై, కుల + అద్రిపైన్ = కులపర్వతముమీఁద, కురియు = వర్షించునట్టి, విక్రాంత + అసిత + అబ్జ - ప్రభన్= దట్టమైన నల్లనిమేఘముయొక్క కాంతితో, దుర్వార - శస్త్ర + అస్త్ర - భీకర - వర్షంబు= వారింపరాని శస్త్రములయు అస్త్రములయు భయంకరమైన వాన, లీలన్ = విలాసముగా, కురిసెన్ = కురియించెను

తాత్పర్యము . తారకుఁడు మిక్కిలి ఆవేశముతో, వజ్రాయుధముపై విజృంభించి పర్వతము భయంకరాకారముతోఁ బరువెత్తునట్లు మిక్కిలి గొప్ప గర్వముతోడి అధిక భుజబలముచే దృఢమైనవాఁడయి, కులపర్వతముపైఁ గురియు దట్టమైన నల్లని మేఘము కాంతితోఁ, గుమారస్వామిపై అడ్డులేని శస్త్రాస్త్రములచే భయంకరమయిన వర్షమును విలాసముగాఁ గురియించెను

విశేషములు . అలంకార ముపమ

వ ఇట్లు తారకాసురుండు తన సర్వశక్తియు నెరపి సమస్తాయుధ పరిణతి మెఱసి తన్నుం గిట్టి మహాయుద్ధంబు చేయుచున్నం గని వాని గుంపెఱింగి నగుచుం దదీయాయుధజాలం బశ్రమంబున ఖండించి కోపించి 179

అర్థము. ఇట్లు, తారక + అసురుండు, తన సర్వ - శక్తియున్, నెరపి = చూపి, సమస్త + ఆయుధ - పరిణతి = ఎల్ల ఆయుధముల పాండిత్యము, మెఱసి= మెఱయించి, తన్నున్, (కుమారుని), కిట్టి = సమీపించి, మహత్ (మహా) + యుద్ధంబు, చేయుచున్ +ఉన్నన్, కని, వాని, గుంపు = అతిక్రమణము (?),

ఎఱింగి, నగుచున్ = నవ్వుచు, తదీయ + ఆయుధ + జాలంబున్ = వాని ఆయుధముల సమూహమును, అశ్రమంబునన్ = అనాయాసముగా, ఖండించి = ముక్కలు చేసి, కోపించి

తాత్పర్యము. ఇట్లు తారకాసురుఁడు తన శక్తి యెల్లఁ జూపి సర్వాయుధ పాండిత్యమును మెఱయించి, తన్ను సమీపించి మహాయుద్ధ మొనరించుచుండఁగాఁ జూచి వాని యతిక్రమణము నెఱిఁగి నవ్వుచు వాని ఆయుధసమూహమును అనాయాసముగా ఖండించి కోపించి - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. గుంపించు = అతిక్రమించు అని నూని అందుచే గుంపు= అతిక్రమణము అని యర్థము చెప్పఁబడినది

కం హరసుతుఁ డతులద్వాదశ
కరములఁ జక్రములు దనుజుకరిపైఁ బఱపన్,
దరుణరవిమండలోత్కర
పరివేష్టిత ధాతునగము పరుసున నొప్పెన్ 180

అర్థము: హర-సుతుఁడు = శివుని కొడుకు - కుమారస్వామి, అతుల - ద్వాదశ - కరములన్ = సాటిలేని పండ్రెండు చేతులతో, దనుజ - కరిపైన్ = రాక్షసుని యేనుఁగు మీఁద, చక్రములు = చక్రాయుధములు, పఱపన్ = వ్యాపింపఁజేయఁగా, (అది), తరుణ - రవి - మండల + ఉత్కర - పరివేష్టిత - ధాతు - నగము - పరుసునన్ = బాలసూర్యబింబముల సమూహముచేఁ జుట్టఁబడిన గైరికాదిధాతువులతోడి కొండ విధమున, పొప్పెన్

తాత్పర్యము. కుమారస్వామి తన సాటిలేని పండ్రెండు చేతులతో రాక్షసుని (తారకుని) ఏనుఁగుపైఁ జక్రాయుధములు వ్యాపింపఁజేయఁగా, ఆ యేనుఁగు బాలసూర్యుల బింబముల సమూహముచేఁ జుట్టుకొనఁబడిన గైరికాది ధాతువులతోడి కొండ విధమున నొప్పెను

విశేషములు: అలంకార ముపమ

గీ రెండురెం డుగ్రశరముల రెండు రెండు
గొమ్ములును ద్రెవ్వ నేసిన గుహునిచేతఁ
దారకునకుఁ గోదండంబు దండ మయ్యె
నద్భుతంబుగ ద్విరదంబు నరద మయ్యె 181

అర్థము. రెండు - రెండు - ఉగ్ర - శరములన్ = రెండేసి భయంకర బాణములచే, రెండు - రెండు + కొమ్ములును = వింటి రెండు కొనలును, ఏనుఁగు రెండు దంతములును, త్రెవ్వన్ + ఏసిన = తెగఁగొట్టిన, గుహుని చేతన్ = కుమారస్వామిచే, తారకునకున్, ఆద్భుతముగన్ = ఆశ్చర్యముగా, కోదండంబు = విల్లు, దండము + అయ్యెన్ = వట్టికట్టి యయ్యెను, ద్విరదంబున్ = ఏనుఁగును (రెండు దంతములు గలది), అరదము = దంతములు లేనిది - రథము, అయ్యెన్

తాత్పర్యము. రెండేసి భయంకరములయిన బాణములచే వింటి రెండు కొనలును, ఏనుఁగు రెండు దంతములును దెగఁగొట్టిన కుమారస్వామిచే నాశ్చర్యకరముగాఁ దారకునకు విల్లు వట్టి దండమయ్యెను ఏనుఁగును దంతములు లేనిది - రథము అయ్యెను

విశేషములు: లంకారము శ్లేషము చిత్రము ?

చ కరిశిరమాడ షణ్ముఖుఁడు కైపున వ్రేయుడుఁ గుంభమౌక్తికో
త్కర మసిధారఁ బొల్పెసఁగెఁ దారకు భంగము సూచి నవ్వు సం
గరజయకాంత కాంతరదకాంతియొ కాదన నాఁటుదీఁటి వి
స్ఫురదవదాతఖడ్గలత పూచెనొ నా జయచైత్రసంపదన్ 182

అర్థము. షష్ (ట్) + ముఖుఁడు = కుమారస్వామి, కరి - శిరము + ఆడన్= ఏనుఁగు తల కాఁడునట్లు (గ్రుచ్చుకొనునట్లు), కైపునన్ = కైపుతో, వ్రేయుడున్ = వ్రేసినంతనే, అసి - ధారన్ = కత్తివాదరయందు, కుంభ - మౌక్తిక + ఉత్కరము = కుంభస్థలమునందలి ముత్యముల సమూహము, తారకు - భంగము + చూచి = తారకాసురుని భంగపాటు చూచి, నవ్వు =నవ్వునట్టి - సంగర - జయ - కాంత = యుద్ధజయమనెడి స్త్రీ - జయలక్ష్మి, కాంత = మనోహరమైన, రద - కాంతియొ = దంతముల కాంతియో, కాదు + అనన్ = కాదనుచో, విస్ఫురత్ + అవదాత - ఖడ్గ - లత = ప్రకాశించుచున్న నిర్మలమయిన ఖడ్గమనెడి తీఁగ,, జయ - చైత్ర - సంపదన్ = జయమనెడు వసంతర్తుసంపదచే, నాఁటు - తీఁటి= బాగుగా నాఁటుకొని, పూచెనొ - నాన్ = పుష్పించెనా యన, పాల్పు + ఎసఁగెన్ = మిక్కిలి అందగించెను

తాత్పర్యము. కుమారస్వామి ఏనుఁగుతల కాఁడునట్లు కోపముతో వ్రేసినంతనే, కత్తివాదరయందు ఏనుఁగు కుంభస్థలమునందలి ముత్యముల సమూహము అంటుకొని తారకాసురుని భంగపాటు చూచి నవ్వునట్టి యుద్ధ

జయలక్ష్మి మనోహరమైన చంతముల కాంతియో, కాదనుచో - ప్రకాశించుచున్న నిర్మలమైన ఖడ్గమనెడు తీగ జయమనెడు వసంతర్తు శోభచే బాగుగా నాటుకొని పుష్పించెనో యన మిక్కిలి అందగించెను

విశేషములు అలంకార ముత్ప్రేక్ష - యూపకానుప్రాణితము సందేహము ఆడు = కాడు - నూ ని కాదని - కాదన - రా ంక్ష శర్మగారి పాఠము

వ ఇ ట్లఖిలామరవరమదవారణుండగు తారకాసురమదవారణుండై తదీయ మద వారణ వారణుండై వెలుంగు కుమారుం గని దనుజేంద్రుండు నిజభుజబలాయుధాఖిలవిద్యాబలంబుల నిర్జింపనేరక తన యాపద్ధనం బగు రూక్ష రాక్షస మాయా బలంబుల నిర్జింప నుద్యుక్తుండై యక్షణంబ 182

అర్థము ఇట్లు, అఖిల + అమర - వర - మద - వారణుండు = ఎల్ల దేవతాశ్రేష్ఠుల మదమును వారించువాడు, అగు, తారక + అసుర - మద - వారణుండు + ఐ = తారకాసురుని మదమును వారించు వాడయి, తదీయ - మద - వారణ - వారణుండు + ఐ= ఆతని మదగజమును వారించువాడయి వెలుంగు = ప్రకాశించుచున్న, కుమారున్, కని, దనుజ + ఇంద్రుండు = రాక్షసశ్రేష్ఠుడు, నిజ - భుజ - బల + ఆయుధ + అఖిల - విద్యా - బలంబులన్ = తన భుజబలము చేతను, ఆయుధముల ఎల్ల విద్యాబలముల చేతను, నిర్జింపన్ + నేరక = జయింపజాలక = తన ఆపదకైన ధనమగు, రూక్ష - రాక్షస - మాయా - బలంబుల్ = తీక్ష్ణమైన రాక్షసమాయాబలములచే, నిర్జింపన్ = జయించుటకు, ఉద్యుక్తుండు + ఐ = యత్నించినవాడయి, అక్షణంబు + అ = వెంటనే

తాత్పర్యము . ఇట్లు ఎల్లదేవతాశ్రేష్ఠుల మదము నణచువాడగు తారకాసురుని మదము వారించువాడయి, వాని మదగజము నణచువాడయి ప్రకాశించు కుమారస్వామిని జూచి రాక్షసశ్రేష్ఠుడగు తారకుడు తన భుజబలము చేతను, ఆయుధవిద్యాబలముల చేతను జయింపజాలక తన యాపదకైన ధనమగు కఠిన రాక్షస మాయాబలములచే జయింపయత్నించువాడయి, వెంటనే- తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అఖిలామర వర మద వారణుండగు తారకాసుర మదవారణుండై - 'కొన్నియెడల సిద్ధసమాస మధ్యగతపదంబులతో దద్ధిన్న పదంబుల కన్వయంబు చూపట్టెడి ' ప్రౌఢ సమాస 35 ఇట 'అఖిలా వారణుండు' అనునది 'తారకాసుర వారణుండై' అను సిద్ధసమాసమందలి 'తారకాసుర' అను నేకదేశముతో నన్వయించుచున్నది

క పిడుగులయి తాఁకు, నలుగడ
జడనిధులై ముంచు, గోత్రశైలములై పైఁ
బడుఁ జదియఁ, గారుమొగుళుల
గడనములై కప్పుఁ, బన్నగములై చుట్టున్ 184

అర్థము . పూర్వ పద్యము నందలి 'దనుజేంద్రుండు' కర్త పిడుగులు + అయి, తాఁకున్, నలుగడన్ = నాలుగు దిక్కులను, జడనిధులు + ఐ = సముద్రములయి, ముంచున్, గోత్ర - శైలములు + ఐ = కులపర్వతములయి, చదియన్ = నలఁగిపోవునట్లు, పైన్ + పడున్ = మీఁదఁబడును, కారు మొగుళుల - గడనములు + ఐ = కారుమబ్బుల గుంపులయి, కప్పున్, పన్నగములు + ఐ = పాములయి, చుట్టున్

తాత్పర్యము : తారకుఁడు పిడుగులయి తాఁకును సముద్రములయి నాలుగు దిక్కులను ముంచును కులపర్వతములయి నలఁగునట్లు పైఁబడును కారుమబ్బుల సమూహములయి కప్పును పాములయి చుట్టును

వ ఇట్లు మాయావి నానావిధోపాయ మాయాప్రయోగంబులు ప్రయోగించుచు నలక్ష్యభావంబున దుర్నిరీక్షితుండై యని వారితోపద్రవకరుండగుచున్నం గని కుమారుండు హరచరణస్మరణ పరిణతాంతఃకరణుండై వానికిఁ బ్రతికారంబు గని పరమేశ్వరప్రదత్తంబైన దివ్యశక్తి నభిమంత్రించి యెత్తికొనుడు నక్షణంబ 185

అర్థము . ఇట్లు, మాయావి = మాయలుగలవాఁడు, నానా - విధ + ఉపాయ - మాయా - ప్రయోగంబులు = అనేకరీతులయిన ఉపాయముల, మాయల ప్రయోగములు, ప్రయోగించుచున్, అలక్ష్యభావంబునన్ = లక్ష్యము లేకపోవుటచే, దుర్నిరీక్షితుండు + ఐ = చూడఁబడనివాఁడయి, అనివారిత + ఉపద్రవ - కరుండు = అడ్డగింపఁబడని ఆపద గలిగించువాఁడు, అగుచున్ + ఉన్నన్, కని, కుమారుండు, హర - చరణ - స్మరణ -పరిణత + అంతఃకరణుండు+ ఐ = ఈశ్వరుని పాదముల ధ్యానముచేఁ బండిన మనస్సు గలవాఁడయి, వానికిన్= తారకునకు, ప్రతికారంబు = మాఱుసేఁత, కని, పరమేశ్వర - ప్రదత్తంబు + ఐన= ఈశ్వరునిచేనీఁబడిన, దివ్యశక్తిన్, అభిమంత్రించి, ఎత్తికొనుడున్ = పట్టుకొనినంతనే, అక్షణంబ

తాత్పర్యము . ఇట్లు వంచకుఁడైన తారకుఁడు అనేకవిధములయిన ఉపాయములను, మాయలను బ్రయోగించుచు లక్ష్యములేకపోవుటచేఁ జూడఁబడని వాఁడయి, అడ్డులేక ఆపదగలిగించువాఁడగుచుండఁగాఁ జూచి కుమారుఁడు ఈశ్వరుని పాదధ్యానముచేఁ బండిన మనస్సుగలవాఁడయి తారకునకుఁ బ్రతికారమును గని ఈశ్వరుఁడిచ్చిన దివ్యశక్తి నభిమంత్రించి యెత్తికొనిన వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము

క దనుజేంద్రు మాయలన్నియుఁ
ద్రినయనసుతు శక్తిఁ గని యదృశ్యం బయ్యెన్,
వినుతాత్మజ్ఞానంబునఁ
దనరు మహామాయ చెడు విధంబునఁ బోలెన్ 186

అర్థము దనుజ + ఇంద్రు - మాయలు + అన్నియున్ = రాక్షసశ్రేష్ఠుఁడగు తారకుని మాయలన్నియును, త్రినయన - సుతు - శక్తిన్ = ముక్కంటి కొడుకు అగు కుమారస్వామి శక్త్యాయుధమును, కని, వినుత + ఆత్మ - జ్ఞానంబునన్ = పొగడఁబడిన ఆత్మజ్ఞానముచే, తనరు = ఒప్పునట్టి, మహత్ (మహా) + మాయ = గొప్పదియగు అజ్ఞానము, చెడు - విధంబునన్ + పోలెన్ = నశించురీతిగా, అదృశ్యంబు + అయ్యెన్ = మాయమయ్యెను

తాత్పర్యము తారకుని మాయలన్నియును కుమారస్వామి శక్త్యాయుధమును జూచి, ఆత్మజ్ఞానముచే మహామాయ నశించునట్లు, మాయమయ్యెను

విశేషములు . అలంకార ముపమ

వ ఇట్లు తారకాసురేంద్రుండు నిజమాయాప్రభావంబు ప్రద్యోతన ప్రభావ ప్రతిహతం బైన ఖద్యోతంబునుం బోలెఁ దనయందఁ లీనంబైన నవసానావసరోద్దీపితప్రదీపంబునుం బోలెం గోపానలోద్రేకంబునం బెరిఁగి రోదసీకుహరాంతరాపూరితోన్నతశరీరుండై ఖడ్గచర్మంబులు గొని ప్రళయ నిర్ధూతంబునుంబోలె నఖిల దిగ్వివరంబులం బ్రతిధ్వను లెసఁగం బ్రేలిపడ నదల్చి తాఁకిన. 187

అర్థము . ఇట్లు, తారక + అసుర + ఇంద్రుండు = రాక్షసశ్రేష్ఠుఁడగు తారకుఁడు, నిజ - మాయా - ప్రభావంబు = తనదైన మాయ యొక్క ప్రభావము,

ప్రద్యోతన - ప్రభావ - ప్రతిహతంబు + ఐన = సూర్యుని తేజస్సుచేఁ గొట్టఁబడిన దగు, ఖద్యోతంబునున్ + పోలెన్ = మిడుఁగుఱుఁబురువు వలె, తనయందున్ + అ = తనయందే, లీనంబు + ఐనన్ = లయము కాఁగా, అవసాన + ఒసెసర + ఉద్దీపిత - ప్రదీపంబునున్ + పోలెన్ = ఆటిపోవు సమయమున మిక్కిలి ప్రకాశించు దీపము విధమున, కోప + అనల + ఉద్రేకంబునన్ = కోపమనెడి అగ్ని యొక్క విజృంభణముతో, పెరిఁగి, రోదసీ - కుహర + అంతర + ఆపూరిత + ఉన్నత - శరీరుండు + ఐ = గుహవంటి భూమ్యాకాశమధ్యప్రదేశములో అంతటను నిండిన ఎత్తయిన శరీరముగలవాఁడయి, ఖడ్గ - చర్మంబులు = ఖడ్గమును, డాలుసుకొని, ప్రలయ - నిర్ఘాతంబునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి పిడుగువలె, అఖిల - దిక్(క్) + వివరంబులన్ = ఎల్ల దిక్కుల నడిమి భాగమునందును, ప్రతిధ్వనులు = మాఱుమ్రోఁతలు, ఎసఁగన్ = అతిశయింపఁగా, ప్రేలిపడన్ = ప్రేలిపడునట్లు, అదల్చి = గద్దించి, తాఁకినన్

తాత్పర్యము. ఇట్లు రాక్షసశ్రేష్ఠుఁడగు తారకుఁడు తన మాయా ప్రభావము సూర్యతేజస్సుచే నడ్డగింపఁబడిన మిడుఁగుఱుఁబురువు వలెఁ దనయందే లయించి పోఁగా, ఆటిపోవు సమయమునఁ బ్రకాశించు దీపము విధమునఁ గోపాగ్ని విజృంభణముచేఁ బెరిఁగి, గుహవంటి భూమ్యాకాశమధ్యప్రదేశములోపల నిండిన పెద్ద శరీరముగలవాఁడయి, కత్తిని, డాలును దీసికొని ప్రళయసమయమునందలి పిడుగు విధమున నెల్ల దిక్కుల లోపలి ప్రదేశములందును మాఱుమ్రోఁత లతిశయింపఁబ్రేలి పడునట్లు గద్దించి యెదిరింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు. అలంకార ముపమ

తారకాసుర వధ

చ కని త్రిపురారినందనుఁడు కైపున మార్కొని నిల్చి శక్తి వై
చిన వడిఁ బాటి వజ్రధరుచేతి మహాశని శైలపక్షముల్
తునియఁగఁబాఱునట్లు, హరు దోర్గతశూలము వారణాసురేం
ద్రునిఁ దెగఁబాఱున ట్లఖిలదుస్సహతేజముతో వెలుంగుచున్ 183

అర్థము. కని - చూచి, త్రిపుర + అరి - నందనుఁడు = ఈశ్వరుని కొడుకు - కుమారస్వామి, కైపునన్ = కోపముతో, మార్కొని = ఎదిరి, నిల్చి, శక్తిన్=శక్తి అను ఆయుధమును, వైచినన్ = వేయఁగా, వడిన్ = వేగముగా, పాటి = పరువెత్తి, వజ్ర - ధరు - చేతి = ఇంద్రుని చేతియందలి, మహత్ (మహా) + అశని

= గొప్ప వజ్రాయుధము, శైల - పక్షములన్ = కొండల రెక్కలు, తునియఁగన్ + పాఱు +అట్లు = ముక్కలుగాఁ బరువెత్తు విధమునను, హర = ఈశ్వరుని యొక్క, దోస్ (ఃన్) + గత - శూలము = చేతియందలి శూలము, వారణ + అసుర + ఇంద్రునిన్ = గజ రాక్షస శ్రేష్ఠుని, తెగన్ + పాఱు + అట్లు = వధించుటకుఁ బరువెత్తు విధమునను, అఖిల - దుస్సహ - తేజములోన్ = ఓర్వరాని ఎల్ల తేజస్సుతో, వెలుంగుచున్ = ప్రకాశించుచు

తాత్పర్యము చూచి కుమారస్వామి మదముతో నెదిరి నిల్చి శక్త్యాయుధమును ప్రయోగింపఁగా నది వడిగాఁ బాటి, ఇంద్రునిచేతి గొప్ప వజ్రాయుధము కొండల రెక్కలను ముక్కలు చేయఁ బాఱు విధమునను, ఈశ్వరుని చేతిశూలము గజాసురుని వధింపఁ బాఱు విధమునను సహింపశక్యముగాని యెల్లతేజస్సుతోఁ బ్రకాశించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకార ముపమ

క **హర తనయు శక్తి దోషా**
చర హృదయము వ్రచ్చి మగుడఁ జనియె రయమునన్,
గురుభక్తి లేని ఖలు మెయిఁ
బొరయక వరశక్తి మగుడఁబోవు విధమునన్. 189

అర్థము . హర - తనయు - శక్తి = ఈశ్వరుని కొడుకగు కుమారస్వామి శక్త్యాయుధము, దోషా - చర - హృదయమున్ = రాక్షసుని - తారకుని హృదయమును, వ్రచ్చి = బ్రద్దలు చేసి, గురు - భక్తి - లేని, ఖలు = దుష్టుని, మెయిన్ = శరీరమున, పొరయక = పొందక, వర - శక్తి = శ్రేష్ఠమైన శక్తి, మగుడన్ = మరల, పోవు - విధమునన్, రయమునన్ - వేగముగా, మగుడన్ = మరల, చనియెన్ = పోయెను

తాత్పర్యము : కుమారస్వామి శక్త్యాయుధము తారకాసురుని హృదయమును జీల్చి, గురుభక్తి లేని దుష్టుని శరీరమునఁ బొందక గొప్ప మహిమ మరలఁబోవు విధమున, వేగముగా మరలఁబోయెను

విశేషములు . అలంకార ముపమ

మహాప్రగ్గర

జిత దేవాధీశదర్పోర్జితబలుఁడు మహాసేను శక్త్యాహతుండై
దితిజానీకంబు భీతిన్ ధృతిచెడి పఱవన్, దేవతల్ పొంగి యార్వన్,
గుతలం బల్లాడఁగా, దిక్కులు చెలఁగ, వడింగూలె నుగ్రాజిలోనన్
శతధారాపాతపక్షక్షతవిపులకులక్ష్మాధరాపాతభాతిన్ 190

అర్థము జిత - దేవ + అధి + ఈశ - దర్ప + ఊర్జిత - బలుఁడు = జయింపఁబడిన దేవేంద్రుని గర్వముచే అధికమైన బలము గలవాఁడు - దేవేంద్రుని దర్పాధిక బలమును జయించినవాఁడు - తారకుఁడు - అనుట, మహాసేను = కుమారస్వామి యొక్క, శక్తి + ఆహతుండు + ఐ= శక్త్యాయుధముచేఁ గొట్టఁబడినవాఁడయి, దితిజ + అనీకంబు = రాక్షసుల సమూహము, భీతిన్ = భయముతో, ధృతి + చెడి = ధైర్యము నశించి, పఱవన్ = పాఱిపోఁగా, దేవతల్, పొంగి, ఆర్వన్ = అఱవఁగా, కుతలంబు = భూతలము, అల్లాడఁగాన్ = చలింపఁగా, దిక్కులు, చెలఁగన్ = మ్రోయఁగా, శతధారా + పాత - పక్ష - క్షత - విపుల - కుల - క్ష్మాధర + ఆపాత - భాతిన్ = వజ్రాయుధముయొక్క పాటుచే, గాయపడిన, పెద్దదియైన, కులపర్వతముయొక్క పాటు విధమున, ఉగ్ర + అజి - లోనన్ = భయంకరమైన యుద్ధమున, వడిన్ = వేగముగా, కూలెన్

తాత్పర్యము . దేవేంద్రుని దర్పముతోడి అధికబలమును జయించిన వాఁడగు తారకుఁడు కుమారస్వామి శక్త్యాయుధముచేఁ గొట్టఁబడినవాఁడయి, రాక్షసుల సమూహము భయముతో ధైర్యము నశించి పాఱఁగా, దేవతలు సంతోషముతోనుప్పొంగి యఱవఁగా, భూతలము, చలింపఁగా, దిక్కులు మ్రోయఁగా, వజ్రాయుధము పడుటచే గాయపడిన పెద్ద కులపర్వతము పతనము విధమున భయంకరయుద్ధమున వేగముగాఁ గూలెను

విశేషములు : అలంకార ముపమ

వ ఇట్లప్రతిహతశౌర్యుండును, ననివార్యవీర్యుండును, నఖిలభువన భవనాధీశ్వరుండును, సకలజగద్భయదానియు, నామరణాంతాపరిత్యక్తాభిమానియు నగు తారకాసురునామాక్షరంబులు సకల దిక్తట శిలా పట్టంబుల శక్తిధరుముఖవిజయప్రశస్తి శాసన లిఖితాక్షరంబులయ్యెనంత. 191

అర్థము ఇట్లు, అప్రతిహత - శౌర్యుండును = అడ్డగింపఁబడని శౌర్యము గలవాఁడును, అనివార్య - వీర్యుండును = వారింపరాని వీర్యము గలవాఁడును, అఖిల - భువన - భవన + అధి + ఈశ్వరుండును = ఎల్లలోకములనెడి గృహముల కధిపతియును, సకల - జగత్ + భయ - దానియున్ = ఎల్లలోకములకు భయంకరుఁడును, ఆమరణ + అంత + అపరిత్యక్త + అభిమానియున్ = మరణాంతము వఱకును విడువఁబడని అభిమానము గలవాఁడును, అగు, తారక + అసుర - నామ + అక్షరంబులు = తారక దైత్యుని పేరిలోని వర్ణములు, సకల - దిక్ (క్) + తట - శిలా - పట్టంబులన్ = ఎల్ల దిక్ప్రదేశములనెడు జాతి పలకలందు, శక్తిధరు = కుమారస్వామి యొక్క, ముఖ - విజయ - ప్రశస్తి = ప్రధానమయిన విజయ ప్రశంసతోడి, శాసన - లిఖిత + అక్షరంబులు = శాసనమునందు వ్రాయఁబడిన వర్ణములు, అయ్యెన్ అంతన్

తాత్పర్యము . ఇట్లు అడ్డులేని శౌర్యము గలవాఁడును, వారింపరాని వీర్యము గలవాఁడును, ఎల్లలోకములనెడి భవనముల కధిపతియును, ఎల్లలోకములకు భయంకరుఁడును, చచ్చిపోవువఱకును అభిమానమును విడువని వాఁడును అగు తారకాసురుని పేరి యక్షరములు ఎల్లదిక్ప్రదేశములనెడి శిలాఫలకములందును కుమారస్వామి ప్రధాన విజయ ప్రశంసగల శాసనములందు లిఖింపఁబడిన వర్ణములు అయ్యెను అంత - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు . అలంకారము రూపకము

తారక సంహారకుఁడగు కుమారుని దేవత లభినందించుట

సీ సిద్ధాంగనలు చల్లు శేషాక్షతలతోన
మెలుపారు కమ్మఁదెమ్మెరలు వీచె
సకలజగజ్జన జయ శబ్దములతోన
తొడరాడ దేవదుందుభులు తివిరె
భూదేవ మునిగణ వేదరావములతోఁ
గిన్నర గంధర్వ గీతు లులిసెఁ
ద్రేతాగ్ని లొక్కటఁ దేజరిల్లుట తోన
విమలమై దిఙ్ముఖాబ్జములు వెలిఁగెఁ

తే గల్పకుజములు పండె, దిగ్గజము లోలి
మదము సేసెఁ, బయోనిధుల్ నదులు నిండె,
నఖిలలోకైకకంటకుఁడై రమించు
తారకాసురుఁ డీల్గుడుఁ దత్ క్షణంబ. 191

అర్థము. అఖిల - లోక + ఏక - కంటకుఁడు + ఐ = ఎల్లలోకములకుఁ బ్రధాన బాధకుఁడయి, రమించు = ఆనందించు, తారక + అసురుఁడు, ఈల్గుడున్ = చావఁగా, తత్ + క్షణంబు + అ = వెంటనే

సిద్ధ + అంగనలు = సిద్ధస్త్రీలు, చల్లు, శేష + అక్షతలతోన్ + అ = సేసఁబ్రాలతోపాటే, మెలుపారు = మృదువులైన, కమ్మఁదెమ్మెరలు = పరమళించువాయువులు, వీచెన్

సకల - జగత్ +జన+ జయశబ్దములతోన్ + అ = ఎల్లలోకములందలి జనులయొక్క జయశబ్దములతోపాటే, తొడరాడన్ = అతిశయించునట్లు, దేవదుందుభులు = దేవతల ఢక్కా వాద్యములు, తివిరెన్ = మ్రోసెను

భూదేవ - ముని - గణ - వేద - నాదములతోన్ = బ్రాహ్మణులయు, మునులయు సమూహములయొక్క వేద ధ్వనులతో, కిన్నర - గంధర్వ - గీతులు = కిన్నరులయు, గంధర్వులయు, గీతులు = గీతములు, ఉలిసెన్ = ధ్వనించెను

త్రేతాగ్నులు = గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయము అను మూఁడగ్నులు, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, తేజరిల్లుటతోన్ + అ = వెలుఁగుటతోపాటే, దిశ్(క్) + ముఖ + అబ్జములు = పద్మములవంటి దిక్కుల మొగములు, వెలిఁగెన్ = ప్రకాశించెను

కల్ప- కుజములు = కల్ప వృక్షములు, పండెన్, దిశ్ (క్) + గజములు = దిక్కులందలి యేనుఁగులు, ఓలిన్ = మిక్కిలి, మదము + చేసెన్ = మదించెను, పయోనిధుల్ = సముద్రములు, నదులు, నిండెన్

తాత్పర్యము : అన్ని లోకములకు బాధకుఁడై ఆనందించు తారకాసురుఁడు చచ్చినంతనే సిద్ధవనితలు చల్లెడు సేసఁబ్రాలతోపాటే మృదువులయిన పరిమళముతోడి వాయువులు వీచెను ఎల్లలోకములందలి జనుల జయ జయ ధ్వనులతోపాటే అతిశయించునట్లు దేవదుందుభులు మ్రోఁగెను బ్రాహ్మణులయు, మునులయు సమూహముల వేదనాదములతోపాటే కిన్నరులయు గంధర్వులయు గీతములు మ్రోసెను త్రేతాగ్ను లొక్కమాఱుగా వెలుఁగుటతోనే అబ్జముల వంటి దిఙ్ముఖములు నిర్మలములయి వికసించెను కల్పవృక్షములు ఫలించెను దిగ్గజములు మిక్కిలి మదించెను సముద్రములు, నదులును నిండెను

విశేషములు : అలంకారము సహోక్తి

చ అరుణపరాగ మంబరమునందుఁ గడల్కొనఁ బుష్పవృష్టి పైఁ
గురిసెఁ బురారిసూతికి నగుర్వుగఁ దారకు నోర్చి మాకుఁ దా
నిరతముఁ దారకాహ్వయము నిల్పినవాఁడని రాగభాతి వి
స్తరముగఁ బెల్లుతో నెఱఁగు తారకపంక్తియొ నా వెలుంగుచున్ 193

అర్థము . తారకున్ + ఓర్చి = తారకాసురునోడించి, మాకున్ = తారకములకు, తాన్ = తాను (కుమారస్వామి), నిరతమున్ = ఎల్లప్పుడును, తారక + ఆహ్వయము = తారకుఁడు - తరింపఁజేయువాఁడు - అనుపేరు - తారక నామము, నిల్పిన వాఁడు + అని, రాగ - భాతి = ఎఱ్ఱని కాంతి, విస్తరముగన్ = అధికముగా, పెల్లుతోన్ = ఎక్కువగా, ఎఱఁగు = వ్రాలునట్టి, తారక - పంక్తియొ - నాన్ = నక్షత్రముల వరుసయో యనునట్లు, వెలుంగుచున్ = ప్రకాశించుచు, అరుణ - పరాగము = ఎఱ్ఱని పుప్పొడి, అంబరమునందున్ = ఆకాశమునందు, కడల్కొనన్ = వ్యాపింపఁగా, పుర + అరి - సూతికిన్ = ఈశ్వరుని కొడుకునకు - కుమారస్వామికి, అ గుర్వుగన్ = అధికముగా, పుష్ప - వృష్టి = పూలవాన, పైన్ = మీఁద, కురిసెన్

తాత్పర్యము 'తారకాసురునోడించి మాకుఁ దాను నిరతమును దారకనామము నిలిపినాఁ' డని యెఱ్ఱని కాంతి విస్తరించునట్లు అధికముగా వ్రాలునట్టి తారకపంక్తియో యనఁ బ్రకాశించుచు, నెఱ్ఱని పుప్పొడి ఆకాశమున వ్యాపింపఁగాఁ గుమారస్వామిపైఁ బూలవాన అధికముగాఁ గురిసెను

విశేషములు . అలంకార ముత్ప్రేక్ష శ్లేషానుప్రాణితము

వ తదవసరంబున 194

అర్థతాత్పర్యములు . తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము

సీ బాహుబలోన్నతిఁ బాటించి రాక్షసా
ధీశు పట్టిన చెఱలెల్ల విడిచి
షణ్ముఖు నురుభుజాస్తంభాగ్రమున జయ
శ్రీ పొందె సాలభంజిక విధమున
సురరాజు వేష్టించె సురభూరుహములు కెం
పెలరారు చెందమ్మితలిరు లనఁగ
నవనిధానములుఁ గిన్నరనాథు సూరెల
వెలుఁగొందెఁ దార దీవియల కరణి

తే నమరరమణీ విమానధామములు చదలఁ
గ్రాలె, సౌదామనీలత లోలి వెలిఁగెఁ,
బద్దవనములు దివిరె దిక్పతి పురముల
శక్తిధరు నాజివిజయ ఘోషణముతోన 195

అర్థము. బాహు - బల + ఉన్నతిన్ = భుజపరాక్రమాతిశయమును, పాటించి = చూపి, రాక్షస + అధి + ఈశు - పట్టిన = రాక్షసరాజు అగు తారకుఁడు పెట్టిన, చెఱలు + ఎల్లన్ = బందీలనందఱను, విడిచి = వదలి ('విడిచె' నని యుండనోపును)

షష్(ట్) + ముఖు + ఉరు - భుజా - స్తంభ + అగ్రమునన్ = కుమారస్వామి యొక్క గొప్పదియగు భుజమునెడి కంబము కొనను, జయ - శ్రీ = జయలక్ష్మి, సాలభంజిక - విధమునన్ = ప్రతిమవలె, పొందెన్

సుర - భూరుహములు = దేవతావృక్షములు - కల్ప వృక్షములు, కెంపు+ ఎలరారు = ఎఱుపు అతిశయించునట్టి, చెందమ్మి (చెన్ను + తమ్మి) - తలిరులు+ అనఁగన్ = ఎఱ్ఱతామర చివురులనునట్లు, సుర - రాజున్ = దేవేంద్రుని, వేష్టించెన్ = చుట్టుకొనెను

నవ - నిధానములును = తొమ్మిది నిధులును, కిన్నర - నాథు - సూరెలన్ = కుబేరుని పార్శ్వములందు, తారు + అ = తామే, దీపియల - కరణిన్ = దీపముల విధమున, వెలుఁగొందెన్ = ప్రకాశించెను

అమర - రమణీ - విమాన - ధామములు = దేవతాస్త్రీల విమానముల కాంతులు, చదలన్ = ఆకాశమునందు, క్రాలెన్ = ప్రకాశించెను, సౌదామనీ - లతలు = మెఱుపుఁదీఁగలు, ఓలిన్ = బాగుగా, వెలిఁగెన్

దిశ్(క్) + పతి - పురములన్ = దిక్పాలకుల పత్తనములందు, శక్తిధరు + ఆజి - విజయ - ఘోషణముతోన్ + అ = కుమారస్వామి యుద్ధవిజయ ధ్వనితోపాటే, పద్దవనములు = వాద్య విశేషములు (?), తివిరెన్ = మ్రోసెను

తాత్పర్యము. భుజపరాక్రమాతిశయమును జూపి తారకుఁడు చెఱఁబెట్టిన బందీల నందఱను వదలివైచెను కుమారస్వామి గొప్ప భుజమునెడి కంబము కొనను జయలక్ష్మి ప్రతిమ విధమును బొందెను

కల్పవృక్షములు ఎటు పతిశయించు ఎట్టిదామర చివురులనునట్లు దేవేంద్రుని జుట్టుకొనెను తొమ్మిదినిధులును గుబేరుని పార్శ్వములందుఁ దామె దివ్వెలవలెఁ బ్రకాశించెను మెఱుపుఁదీఁగలు బాగుగాఁ బ్రకాశించెను దిక్పాలకుల పురములందుఁ గుమారస్వామి ఎజయధ్వానముతోపాటే పద్దవనములనెడి వాద్యవిశేషములు మ్రోసెను

విశేషములు అన్ని పాదములందును పొందె, వేష్టించె, వెలుఁగొందె అని భూతకాలసమాపకక్రియలుండుటచే మొదటి పాదమునందుఁను 'నిడిచి' అని కాక, 'నిడిచె' ననే యుండుట లెస్స రాక్షసాధిశుపట్టిన - ప్రథమకు షష్ఠి - ప్రౌఢ కారక 15, 16 షణ్ముఖు నురుభుజా స్తంభాగ్రమున జయశ్రీ పొందె సాలభంజిక విధమున - శ్రీ రాస్తాం మనుమక్షితీశ్వర భుజాస్తమ్భే జగన్మణ్డల - ప్రాసాద స్థిర భారభాజి దధతీ సా సాల భఞ్జీశ్రియమ్' - తిక్కన నిర్వచనోత్తర రామాయమణము 'తన భుజాస్తంభంబు ధరణీవిలాసినీ సాలభంజికకు నాస్పదము గాఁగ' విక్రమార్కచరిత్ర 1 ఆ షణ్ముఖు + ఉరు - షణ్ముఖు నురు, శక్తిధరు + అజి = శక్తిధరునాజి 'షష్ఠీసమాసమునం దుకారమున కచ్చుపరముగా నుగాగమము బాల సంధి 34 పద్దవనములు వాద్యవిశేషములు కానోపును చెందమ్మి - చెన్ను + తమ్మి (ప్రాఁతాది సూత్రములు బాల సంధి 36,37) ద్రుత్వకార్యము - బాల సంధి 16, 17 నవనిధానములు = మహాపద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, ఖర్వము (వరము)

తే **అమరధేనువుల్ సురపురి కరిగి తమకుఁ**
దార యరిమిలితోఁ జేపి తనుపు మిగుల
నభిమతార్థముల్ గురిసె దేవాలిమోఁద
నెలమి నొదకలి యాడెడు చెలువవోలె **196**

అర్థము : అమర - ధేనువుల్ = కామధేనువులు, సుర - పురికిన్ = అమరావతికి, అరిగి = వెడలి, తమకున్ + తారు + అ = తమంతఁదామే, అరిమిలితోన్ = ప్రీతితో, చేపి, తనుపు - మిగులన్ = తృప్తి అతిశయించునట్లు, దేవ + ఆలి - మోఁదన్ = దేవతల సమూహముపై, ఎలమిన్ = సంతోషముతో, ఒదకలియాడెడు - చెలువు + అ + పోలెన్ = అతిశయించువిధమున (?) అభిమత + అర్థముల్ = కోరిన అర్థములు, కురిసెన్

తాత్పర్యము: కామధేనువులు అమరావతి కేఁగి తమంతఁదామే ప్రీతిఁజేపి, తృప్తి అతిశయించునట్లు దేవతలపై సంతోషముతో నభిమతార్థముల నతిశయముగాఁ గురిసెను

విశేషములు. ఒదకలి యాడెడు చెలువవోలె అనునది అర్థము కాలేదు వా ప్రతి లఘు వ్యాఖ్య ననుసరించి వ్రాయఁబడినది

వ అట్టి మహోత్సాహంబున 196

అర్థతాత్పర్యములు: అట్టి, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = గొప్ప ఉత్సాహమునందు - తరువాతి పద్యముతో నన్వయము

చ మురహర పద్మజాదులకు ముక్కున బంటిగఁ బోరు లోక భీ
కరు నజితప్రతాపు సురకంటకు నేఁడొక బాలుఁడట్టె సం
గరమున నోర్చి నంచుఁ ద్రిజగజ్జనులుం జనుదెంచి చూచి రా
దరమున మెచ్చి పేర్కొనుచుఁ దారకమారకు నా కుమారకున్ 198

అర్థము. మురహర - పద్మజ + ఆదులకున్ = విష్ణువు, బ్రహ్మ మున్నగు వారికి, ముక్కున బంటిగన్ = దుస్సహముగా (?), పోరు = యుద్ధము చేయునట్టి, లోక - భీకరున్ = లోకములకు భయము గలిగించువాఁడును, అజిత - ప్రతాపున్ = జయింపఁబడని పరాక్రమము గలవాఁడును (అగు), సుర - కంటకున్ = రాక్షసుని - తారకుని, నేఁడు, ఒక - బాలుఁడు + అట్టె = ఒక పిల్లవాఁడఁట, సంగరమునన్ = యుద్ధమునందు, ఓర్చెన్ = ఓడించెను, అంచున్, త్రి - జగత్ + జనులున్ = ముల్లోకములవారును, చనుదెంచి = వచ్చి, తారక - మారకున్ = తారక సంహారకుని, ఆ - కుమారకున్ = ఆ కుమారస్వామిని, ఆదరమునన్ = ప్రీతితో, మెచ్చి, పేర్కొనుచున్, చూచిరి

తాత్పర్యము విష్ణుబ్రహ్మలకు సైతము దుస్సహముగాఁబోరు జగద్భయం కరుఁడును, అజేయపరాక్రముఁడును అగు తారకాసురుని నేఁడొక బాలుఁడఁట యుద్ధమున నోడించెననుచు ముల్లోకములవారును వచ్చి తారకసంహారకుఁడగు ఆ కుమారస్వామిని ఆదరముతో మెచ్చి పేర్కొనుచుఁ జూచిరి

గీ ఇంత బాహుబలోత్సాహవంతుఁడగుట
గొడుకుఁ దన డెందమార నూఱడినవాఁడు
కాన దనుజుల నోర్చి లోకములఁ గావ
రాజధరుఁ డర్భకుని యువరాజుఁ జేసె 199

అర్థము. ఇంత - బాహు - బల + ఉత్సాహవంతుఁడు + అగుటన్ = ఇంతటి భుజబలము, ఉత్సాహము గలవాఁడగుటచేత, కొడుకున్, తన - డెందమారన్

= మనసార, ఊఱడిన - వాఁడు-కానన్ = ఊఱట చెందినవాఁడు కావున, దనుజులన్ = రాక్షసుల నోడించి లోకములన్, కావన్ = రక్షించుటకు, రాజధరుఁడు = చంద్రునిధరించినవాఁడు - శివుఁడు, అర్భకునిన్ = బాలుని, యువరాజున్, చేసెన్

తాత్పర్యము తన కొడుకు ఇంతటి భుజబలోత్సాహములు గలవాఁడగుట చేత శివుఁడు మనసార ఊఱట చెందెను కావున రాక్షసుల నోడించి లోకములను రక్షించుటకు ఒతఁడు కుమారుని యువరాజుగాఁ జేసెను

వ అని యనేకప్రకారంబుల మెచ్చి పిచ్చలించుచుండి రంత 200

అర్థము అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కువిధముల, మెచ్చి, పిచ్చలించుచున్ + ఉండిరి = ఆనందించుచుండిరి, అంతన్

తాత్పర్యము. అని పెక్కువిధముల మెచ్చి ఆనందించుచుండిరి అంత-తరువాతి పద్యముతో నన్వయము

శా ముక్తా ముక్త ఘనానురాగ, మద సమ్మోదైక సంసేవ్య, సం
త్యక్తా కర్మపద ప్రభేద మతి విద్యా, దేహ శోషైకహా,
భక్తాలంబక, మంత్రతంత్ర మయ, సద్భావ స్థితైకస్పృశా,
శాక్తేయా, మునిచింత్యమాన, భరతా సంతాపహా సద్యశా 201

అర్థము. ముక్త రాగ ముక్త = ముక్తులైన వారియందును, అముక్త = ముక్తులుగానివారియందును, ఘన = గొప్పదైన, అనురాగ = ప్రేమము (ఇష్టము) గలవాఁడా, మద సంసేవ్య మద = పరమానందము చేతను, సమ్మోద = మిక్కిలి సంతోషముతోను, ఏక = ప్రధానముగా, సంసేవ్య = బాగుగా సేవింపఁదగినవాఁడా, సం విద్యా సంత్యక్త = విడిచిపెట్టఁబడిన, అకర్మ = కర్మములు లేనివారియొక్క, పద = స్థానమునుండి, ప్రభేద = మిక్కిలి భేదముగల, మతి - విద్యా = బుద్ధి జ్ఞానములు గలవాఁడా - విడువఁబడిన, నిష్కర్ముల స్థానముకంటె మిక్కిలి భిన్నములైన బుద్ధియు, జ్ఞానము గలవాఁడా !, దేహ - శోష + ఏక + హా = శరీర శోషమును - మరణమును ప్రధానముగాఁ బోఁగొట్టువాఁడా - మృత్యుంజయత్వము నిచ్చువాఁడా, భక్తాలంబక-భక్త+ఆలంబక = భక్తుల కాధారమయిన వాఁడా, మంత్ర - తంత్ర - మయ = మంత్ర తంత్రములతో నిండినవాఁడా, సద్భావ - స్థిత + ఏక - స్పృశా = మంచి భావమునందుండువారి

ముఖ్యమైన స్పర్శము గలవాఁడా మంచి భావము గలవారిని మాత్రమే స్పృశించువాఁడా, శాక్తేయా = శక్తి పుత్రుఁడా - కుమారస్వామీ, ముని - చింత్యమాన = మునులచేఁ జింతింపఁదగినవాఁడా, భరతా - సంతాప - హా = అతిశయత్వముతోడి సంతాపమును నశింపఁజేయువాఁడా సద్యశా - సత్ + యశా = మంచి కీర్తిగలవాఁడా

తాత్పర్యము ముక్తుల యెడను, అముక్తుల యెడను గొప్ప అనురాగము గలవాఁడా, పరమానందముతో సంసేవింపఁదగినవాఁడా, నిష్కర్ములను విడిచి వారి స్థానములో మిక్కిలి భేదము గల బుద్ధి జ్ఞానములు గలవాఁడా, దేహ కోషమును - మృత్యువును - బోఁగొట్టువాఁడా, భక్తుల కాధారభూతుఁడైన వాఁడ మంత్ర తంత్రములతో నిండిన వాఁడా, సద్భావములో నుండు వారి స్పర్శము గలవాఁడా, కుమారస్వామీ, మునులచేఁ జింతింపఁ దగినవాఁడా, అతిశయత్వముతోడి సంతాపమును నశింపఁజేయువాడా, సత్కీర్తి గలవాఁడా

వ అని చక్రిశక్రాద్యమరచక్రంబు చక్రవిద్యాద్యనేకస్తుతిశతంబులం బ్రస్తుతించుచుండి రి ట్లఖిలభువనకంటకుఁడైన తారకాసురు నశ్రమంబున నిర్జించి సకలామరవరుల సామ్రాజ్యపదవి నిష్కంటకంబు చేసి మహాసేనుండు రాకాసుధాకరుండునుంబోలె నిఖిలజనానందకరుండై వెలుంగుచు 202

అర్థము అని, చక్రి -శక్ర + ఆది + అమర - చక్రంబు = విష్ణువు, ఇంద్రుఁడు మున్నగు దేవతల సమూహము,చక్ర - విద్యా + ఆది + అనేక -స్తుతి -శతంబులన్ = చక్రవిద్య (?) మున్నగు పెక్కునూర్ల స్తోత్రములచే, ప్రస్తుతించుచున్ + ఉండిరి, ఇట్లు, అఖిల - భువన-కంటకుఁడు = ఎల్లలోకములకు శత్రువు, ఐన, తారక + అసురున్, అశ్రమంబునన్ = అనాయాసముగా, నిర్జించి = జయించి, సకల + అమర - వరుల = ఎల్ల దేవతాశ్రేష్ఠుల, సామ్రాజ్య - పదవి, నిష్కంటకంబు - చేసి = శత్రువులు లేకుండఁ జేసి, మహాసేనుండు = కుమారస్వామి, రాకా - సుధాకరుండునున్ + పోలెన్ = పున్నమి చంద్రుని విధమున, నిఖిల - జన + ఆనందకరుండు + ఐ = ఎల్ల జనులకు ఆనందమును గలిగించువాఁడయి, వెలుంగుచున్ = ప్రకాశించుచు

తాత్పర్యము. అని విష్ణువు, ఇంద్రుఁడు మున్నగు దేవతల సమూహము చక్రవిద్య మున్నగు పెక్కు నూర్ల స్తోత్రములచేఁ బొగడుచుండిరి ఇట్లు ఎల్ల లోకములకు శత్రువయిన తారకాసురుని అనాయాసముగా జయించి ఎల్ల దేవతాశ్రేష్ఠుల సామ్రాజ్య పదవిని శత్రురహితముగాఁ జేసి కుమారస్వామి పున్నమి

నాఁటి చంద్రుని విధమున జనులకందఱకు ఆనందమును గలిగించువాఁడయి, ప్రకాశించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు అలంకార ముపమ

కుమారుని శివ పుర ప్రవేశము

సీ అందంబులై వేల్పుఁజిందముల్ మొరయ న
ప్సరసల విమలచామరము లొలయఁ
జక్రి శక్రామరచక్రముల్ గొలిచి రా
ముని గణాశీర్వాదములు చెలంగఁ
గిన్నర గంధర్వ గేయంబు లింపార
సిద్ధ విద్యాధర స్త్రీలు లీల
నర్తింపఁగాఁ జండి కీర్తులు కీర్తింప
మణిభూషణద్యుతుల్ మలసి వెలుఁగ

ఆ సకల భువన భవన సామ్రాజ్యలక్ష్మీ ని
వాస మనఁగఁ దగు విలాస మెసఁగ
హరతనూజుఁ డురుతరైశ్వర్యలీలతో
నరుగుదెంచె రజతగిరికిఁ బేర్మి 203

అర్థము అందంబులు + ఐ = ఒప్పుగలిగినవయి, వేల్పు + చిందముల్ = దేవతాశంఖములు, మొరయన్ = ధ్వనింపఁగా, అప్సరసల = దేవవేశ్యల, విమల - చామరములు = నిర్మలములయిన వింజామరలు, ఒలయన్ = వ్యాపింపఁగను

చక్రి - శక్ర + అమర - చక్రముల్ = విష్ణువు,ఇంద్రుఁడు, దేవతా సమూహములు, కొలిచి-రాన్ = సేవించిరాఁగా, ముని - గణ + ఆశీర్వాదములు = మునుల సమూహముల దీవెనలు, చెలంగన్ = ఒప్పఁగా

కిన్నర - గంధర్వ - గెయంబులు = కిన్నరులయు, గంధర్వులయు గీతములు, ఇంపారన్ = (ఇంపు + ఆరన్) = మాధుర్య మతిశయింపఁగా, సిద్ధ - విద్యాధర - స్త్రీలు = సిద్ధాంగనలు, విద్యాధరాంగనలు, లీలన్ = విలాసముగా, నర్తింపఁగాన్ = నృత్యము చేయఁగా,

చండి, కీర్తులు, కీర్తింపన్ = పొగడఁగా, మణి-భూషణ-ద్యుతుల్ = రత్నాలంకారముల కాంతులు, మలసి = వ్యాపించి, వెలుఁగన్ = ప్రకాశింపఁగా,

సకల - భువన - భవన - సామ్రాజ్య - లక్ష్మీ - నివాసము + అనఁగన్ + తగు = ఎల్లలోకముల సామ్రాజ్యలక్ష్మి యొక్క నివాసము అనఁదగు, విలాసము, ఎసఁగన్ = అతిశయింపఁగా,

హర - తనూజుఁడు = శివునికొడుకు - కుమారస్వామి, ఉరుతర + ఐశ్వర్య - లీలతోన్ = మిక్కిలి గొప్ప వైభవము యొక్క విలాసముతో, రజత - గిరికిన్ = వెండికొండకు - కైలాసమునకు, పేర్మిన్ = ప్రీతితో, అరుగుదెంచెన్ = వచ్చెను

తాత్పర్యము దేవతా శంఖములు ఒప్పుగా ధ్వనింపఁగా, అప్సరసల నిర్మలములయిన వింజామరలు వీవఁగను, విష్ణువు, ఇంద్రుఁడు, దేవతల సమూహములు సేవించుచుండఁగా, మునుల ఆశీస్సులు ఒప్పఁగా, కిన్నరులయు గంధర్వులయు గీతములు మధురముగా, సిద్ధవిద్యాధరస్త్రీలు బాగుగా నృత్యము చేయఁగా, చండి కీర్తులు కీర్తింపఁగా, రత్నాలంకారముల కాంతులు వ్యాపించి ప్రకాశింపఁగా, ఎల్లలోకముల సామ్రాజ్య లక్ష్మీ నివాసమనఁదగు విలాస మతిశయింపఁగా, కుమారస్వామి మిక్కిలి గొప్ప వైభవముతో వెండికొండకుఁ బ్రీతితో వచ్చెను

చ నిజవదనామితాసితమణీకచనీలవిభాతి వాహన
ద్విజవరబర్హిబర్హ వితతిం దోడరాడి సముల్లసిల్ల న
త్యజిత విలాసలీల విజయధ్వజ మంబరవీథిఁ గుక్కుట
ధ్వజముఁ బెనంగఁ బొల్పెసఁగి వచ్చె మహేశ్వరసూతి ప్రీతితోన్ 204

అర్థము. నిజ - వదన విభాతి నిజ = తనదైన, వదన = ముఖమునందలి, అమిత = అధికమయిన, అసిత - మణి = నీలమణి యొక్కయు, కచ = వెండ్రుకల యొక్కయు, నీల - విభాతి = నల్లని కాంతి, వాహన - ద్విజ - వర = వాహనమైన పక్షిశ్రేష్ఠమగు, బర్హి-బర్హ - వితతిన్ = నెమలియొక్క పింఛముల యొక్క సమూహమును, తొడరాడి = మించి, సముల్లసిల్లన్ = మిక్కిలి ప్రకాశింపఁగా, అతి + అజిత - విలాస - లీలన్ = మిక్కిలి జయింపఁబడని విలాసము యొక్క లీలతో, అంబర - వీథిన్ = ఆకాశవీథియందు, విజయ - ధ్వజము = విజయపతాక, కుక్కుట - ధ్వజమున్ = కోడిటెక్కెమును, పెనంగన్ = కూడఁగా, పొల్పు + ఎసఁగి = అంద మతిశయించి, మహేశ్వర - సూతి = ఈశ్వరుని కొడుకగు కుమారస్వామి, ప్రీతితోన్ = సంతోషముతో, వచ్చెన్

తాత్పర్యము తన ముఖము నందలి మిక్కిలి నల్లనైన నిలమణి యొక్కయు, ముంగురుల యొక్కయు నల్లనికాంతి తన వాహనమైన నెమలి పురులయొక్క సమూహమును మించి ప్రకాశింపఁగా, జయింపఁబడని విలాసముతో ఆకాశమున గెలుపుటెక్కెమును, కోడి టెక్కెమును బెనఁగులాడఁగా కుమారస్వామి ప్రీతితో ఒప్పు అతిశయింప వచ్చెను

వ శివపురంబు ప్రవేశంబు చేయు నవసరంబున 205

అర్థము. శివ - పురంబు = శివుని పురమైన కైలాసమును, ప్రవేశంబు - చేయు + అవసరంబునన్ = ప్రవేశించు సమయమున

తాత్పర్యము. శివుని పురమైన కైలాసమును ప్రవేశించు సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము

సీ దరహాసదీధితుల్ దళుకొత్తి హార్మ్య మా
లికలు సుధాధవళితలు కాఁగ
నధరారుణద్యుతు లడరి నవాశోక
పల్లవ తోరణ ప్రతతి కాఁగ
సితలోచనద్యుతుల్ చెదరి దిక్కులయందుఁ
బొలయు కల్పడగల పొలుపు కాఁగఁ
బసని మొగంబులు పసిఁడి యద్దములు గా
గురుకుచమ్ములు పూర్ణకుంభములుగ

తే మెఱుఁగుఁదీఁగలు నడపాడఁ గఱచినట్టి
చెన్ను వర్ణన కెక్కంగ శివపురం బ
లంకరించుచు వచ్చి విలాసవతులు
తగిలి చూచిరి తారకాంతకుఁ గుమారు 206

అర్థము. విలాసవతులు = ఒయారులు, దర - హాస - దీధితుల్ = చిఱునవ్వుల కాంతులు, తళుకొత్తి = మెఱసి, హార్మ్య - మాలికలు = మేడల వరుసలు, సుధా - ధవళితలు = సున్నముచేఁ దెల్లనైనవి, కాఁగన్,

అధర + అరుణ - ద్యుతులు = పెదవుల యెఱ్ఱని కాంతులు, అడరి = అతిశయించి, నవ + అశోక - పల్లవ - తోరణ - ప్రతతి = క్రొత్త అశోకపుఁ జివురులతోరణముల సమూహము, కాఁగన్

సిత - లోచన-ద్యుతుల్ = తెల్లని కన్నుల కాంతులు, చెదరి, దిక్కులయందున్, పాలయు = వ్యాపించునట్టి, కల్పడగల - పాలుపు = ఉత్సవాదులందు ధ్వజస్తంభాదులకు వ్రేలఁగట్టెడు కలువపూదండలు, కాఁగన్

పసని - మొగంబులు = ఎఱుపు మించిన పసుపు వర్ణముగల ముఖములు, పసిఁడి + అద్దములు + కాన్ = బంగారుటద్దములుకాఁగా,

గురు - కుచమ్ములు = పెద్దవియగు స్తనములు, పూర్ణ - కుంభములు గన్ = నిండు కుండలు కాఁగా,

మెఱుఁగు + తీఁగలు = విద్యుల్లతలు, నడపాడన్ = సంచరింపఁగా, కలిచిన + అట్టి = అభ్యసించినట్టి, చెన్ను + అందము, వర్ణనకున్ + ఎక్కంగన్ = వర్ణింపఁదగియుండఁగా, శివపురంబు = శివుని నగరమును - కైలాసమును, అలంకరించుచున్, వచ్చి, తారక + అంతకున్ = తారక సంహారకుఁడగు కుమారున్, తగిలి - చూచిరి = ఆసక్తితోఁ జూచిరి

తాత్పర్యము . ఆ యూరియందలి ఒయారుల చిఱునవ్వుల కాంతులు మెఱిసి మేడల వరుసలు సున్నముచేఁదెల్లనయినవి కాఁగా, పెదవుల యెఱ్ఱని కాంతు లతిశయించి క్రొత్త అశోకపుఁ జివురుల తోరణముల సమూహము కాఁగా, తెల్లని కన్నుల కాంతులు చెదరి దిక్కులందు వ్యాపించు కలువపూలదండలు కాఁగా, ఎఱుపు మించిన పసుపు వర్ణముగల ముఖములు బంగరుటద్దములు కాఁగా, పెద్దవియగు స్తనములు పూర్ణకుంభములు కాఁగా, మెఱుఁగుఁ దీఁగలు సంచరింపఁగా నేర్చినట్టి అందము వర్ణనీయము కాఁగా శివపురము నలంకరించుచుఁ దారకసంహారకుఁడగు కుమారస్వామిని ఆసక్తితోఁ జూచిరి

విశేషములు . అలంకారము రూపకము

వ అంత - తరువాతి పద్యముతో నన్వయము 207

దేవత లర్ధనారీశ్వరునిఁ జూచుట

క మనసు లొడఁగూడి కడసనఁ
దనువులు నెఱయంగ వేడ్క దంపతులకు వా
రని సంయోగము గలిగిన
ననిశము నది యర్ధవిరహ మనఁదగు జగతిన్ 208

అర్థము. మనసులు, ఒడఁగూడి = కలిసి, కడ - చనన్ = కొనసాగినను, తనువులు = శరీరములు నెఱయంగన్ = నిండఁగా, వేడ్కన్ = వేడుకతో, దంపతులకున్, వారసి = ఉడుగని, సంయోగము = కలయిక, కలిగినన్ = కలిగినను, అది = ఆ సంయోగము, జగతిన్ = లోకమునందు, అనిశమున్ = ఎల్లప్పుడును, అర్ధ - విరహము = సగము వియోగము, అనన్ + తగున్

తాత్పర్యము దంపతులకు మనసు లెంత కలిసినను, దేహము లెంత యైక్యభావము నందినను, వేఱయై యుండుటచే వారికి లోకమున సగము వియోగ మున్నది అనఁదగును కావుననే పరిపూర్ణానందమునకు మనస్సులేకాక దేహములును ఏకము కావలయుటచే అర్ధనారీశ్వరత్వము కావలసివచ్చె ననుట

వ అని నిశ్చయించి శివ భక్తు లత్యంతానురక్తచిత్తులై నిరంతర సుఖంబునం దనివిపనక 209

అర్థము అని, నిశ్చయించి, శివ - శక్తులు = శివుఁడును, పార్వతియు, అత్యంత + అనురక్త - చిత్తులు + ఐ = మిక్కిలి అనురాగము నందిన మనస్సులు గలవారయి, నిరంతర - సుఖంబునన్ = ఎడతెగని సౌఖ్యమునందు, తనివి + చనక= తృప్తిపడక

తాత్పర్యము అని నిశ్చయించి శివుఁడును శక్తియును, మిక్కిలి అనురాగము నొందిన మనస్సులు గలవారయి, ఎడతెగని సౌఖ్యమునందుఁ దృప్తిపడక - తరువాతి పద్యముతో నన్వయము

సీ పృథుజటాబంధంబుఁ బెన్నెఱివేణియుఁ
గపిలాంబకముఁ గల్కి క్రాలు కన్ను
ఫణి కుండలంబును మణికర్ణపూరంబు
గడ్డంబు జిగిఁ దొలఁకాడు చెక్కు
గురు భుజా దండంబుఁ గోమల హస్తంబుఁ
దనరారు నురమును ఘనకుచంబుఁ
బులితోలు మేలి దువ్వలువు నంచిత పుష్ప
చయ పరాగంబు లాక్షారసంబు

కే మానితముగ నిరంతరమదనసుఖము
పొడవు దాల్చెనో యనఁ బొలుపొందు గాఁగ
నర్ధనారియై యున్న సర్వాత్మఁ గనిరి
తారకారియు నఖిలబృందారకులును 210

అర్థము. పృథు - జటా - బంధంబున్ = పెద్ద జడముడియును, పెన్నెటి పెను + నెటి) - వేణియున్ = పెద్దవెండ్రుకల జడయు, కపిల + అంబకమున్ = కపిల వర్ణపుఁగన్నును - అగ్ని నేత్రమును, కల్కి - క్రాలు - కన్నన్ = మనోజ్ఞమైన చంచలేక్షణమును,

ఫణి - కుండలంబును =నాగకర్ణాభరణమును, మణి - కర్ణ పూరంబున్= మణిమయమైన కర్ణ భూషణమును, గడ్డంబు - జిగిన్ = గడ్డముయొక్క కాంతియును, తొలఁకాడు - చెక్కున్ = ప్రకాశించు ఎక్కిలియును,

గురు - భుజా - దండంబున్ = గొప్ప దండము వంటి వాహువును, కోమల - హస్తంబున్ = మృదువైన చేయియు, తనరారు = ఒప్పునట్టి, ఉరమును= వక్షమును, ఘన-కుచంబున్ = గొప్ప స్తనమును,

పులితోలున్, మేలి - దువ్వలువున్ = మేలయిన సన్నని వస్త్రమును, అంచిత - పుష్ప - చయ - పరాగంబున్ = ఒప్పిన పూల గంపుయొక్క పుప్పొడియును, లక్షారసంబున్ లత్తుకయును,

మానితముగన్ = ఒప్పఁగా, నిరంతర - మదన - సుఖము = ఎడతెగని మన్మధసౌఖ్యము, పొడవు + తాల్చెనో + అనన్ = రూపము ధరించెనో యనునట్లు, పొలుపొందు + కాఁగన్ = ఒప్పఁగా, అర్ధ - నారి + ఐ = సగము స్త్రీయైన వాఁడయి, ఉన్న, సర్వ + ఆత్మున్ = శివుని, తారక + అరియన్ = తారక శత్రువును - కుమారస్వామియును, అఖిల - బృందారకులును = ఎల్ల దేవతలును, కనిరి = చూచిరి

తాత్పర్యము పెద్దదియగు జటాజూటమును, పెద్ద వెండ్రుకల జడయును, అగ్ని నేత్రమును, మనోజ్ఞమైన చంచలేక్షణమును, నాగ కుండలమును, మణిమయ కర్ణ భూషణమును, గడ్డపుఁ గాంతియును, ప్రకాశించు చెక్కిలియును, గొప్ప బాహుదండమును, మృదుకరమును, ఒప్పెడు వక్షమును, గొప్ప స్తనమును, పులితోలును, మేలి సన్న వస్త్రమును, అంచితమైన పూలపుప్పొడియును,

లత్తుకయును, ఒప్పఁగా నిరంతర మన్మథసౌఖ్యము రూపుఁదాల్చెనా యనునట్లు ఒప్పఁగా అర్ధనారియై యున్న శివునిఁ గుమారస్వామియును, ఎల్ల దేవతలును జూచిరి

విశేషములు . గడ్డంబు జిగిన్ - గడ్డంబు జిగియున్ - 'నామ సర్వనామంబులకును గళలగు నవ్యయంబులకును గడపల సముచ్చయార్థవిశేష పాదపూరణంబులయందు ను శబ్దంబు తఱుచుగా నగు కళలగు ననుదంత శబ్దంబులమీఁద నయ్యది యువర్ణపూర్వకంబుగ విభాష నగు ' ప్రౌఢ శబ్ద 116

వ కని పరమానందంబున 211

అర్థతాత్పర్యములు చూచి మిక్కిలి ఆనందముతో - తరువాతి పద్యముతో నన్వయము

క హరి పరమేష్ఠి పురందర
సుర నర ఫణి సహిత మగజసుతుఁ డపు డత్యా
దరమున నీశ్వర పద పం
కరుహంబుల కెఱఁగియున్నఁ గని హర్షముతోన్ 212

అర్థము హరి - పరమేష్ఠి - పురందర - సుర - నర - ఫణి - సహితము = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు, దేవతలు, నరులు, నాగులు అనువారితోఁ గూడుకొని, అగజ - సుతుఁడు = పార్వతి కొడుకు - కుమారస్వామి, అపుడు, అతి + ఆదరమునన్ = మిక్కిలి ప్రీతితో, ఈశ్వర - పద - పంకరుహంబులకున్ = శివుని పాదపద్మములకు, ఎఱఁగి + ఉన్నన్ = నమస్కరించి యుండఁగా, కని = చూచి, హర్షముతోన్ = సంతోషముతో-

తాత్పర్యము. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు, దేవతలు, నరులు, నాగులు అనువారితోఁ గూడుకొని కుమారస్వామి అప్పుడు మిక్కిలి ఆదరముతో శివుని పాదపద్మములకు నమస్కరించి యుండఁగాఁజూచి సంతోషముతో - తరువాతి గద్యముతో నన్వయము

వ అర్ధనారీశ్వరుండై యున్న యీశ్వరుం డమరులఁగని కరుణామృతరసంబున నోలలార్చుచు మహోసనుం గ్రుచ్చి యెత్తుకొని 213

అర్థము అర్ధనారీశ్వరుండు + ఐ, ఉన్న, ఈశ్వరుండు, అమరులన్ = దేవతలను, కని, కరుణా + అమృత - రసంబునన్ = దయయనెడి అమృతరసముతో, ఓలలార్చుచున్ = స్నానమాడించుచు, మహాసేనున్ = కుమారస్వామిని, గ్రుచ్చి + ఎత్తుకొని

తాత్పర్యము. అర్ధనారీశ్వరుఁడయి యున్న ఈశ్వరుఁడు దేవతలఁ జూచి దయామృతరసమున స్నానమాడించుచుఁ గుమారస్వామిని గ్రుచ్చియెత్తుకొని- తరువాతి పద్యముతో నన్వయము

చ ననిచిన కల్పవల్లికలు నల్గడఁ గల్పకుజంబుఁ జుట్టిన
ట్లనుపమ రత్న భూషణ చయాంచిత బాహులతాలి షణ్ముఖుం
బెనఁచి కవుంగిలించుకొని పేర్చు రణశ్రమ మెల్లఁ బాయ నా
త్రినయనుఁ డుల్ల మి ట్లొనరఁ దేల్చె వడిన్ హరుషాశ్రుధారలన్ 214

అర్థము. ననిచిన - కల్ప - వల్లికలు = పూచిన కల్పలతలు, నల్గడన్ = నాలుగు దిక్కులను, కల్ప - కుజంబున్ = కల్పవృక్షమును, చుట్టిన + అట్లు, అనుపమ -రత్న - భూషణ + చయ + అంచిత - బాహు - లతా + ఆలిన్ = సాటిలేని మణి మయాలంకారముల సమూహముతో నొప్పిన భుజలతల వరుసతో, షష్(ణ్) + ముఖున్ = కుమారస్వామిని, పెనఁచి = పెనవైచుకొని, కవుంగిలించుకొని = ఆలింగనము చేసికొని, పేర్చు = అతిశయించు, రణ-శ్రమము + ఎల్లన్ = యుద్ధశ్రమ మంతయును, పాయన్ = పోవునట్లు, ఆ - త్రినయనుఁడు = ఆ ముక్కంటి, ఉల్లము = మనస్సు, ఇట్లు, ఒనరన్ = ఒప్పఁగా, హరుష + అశ్రు - ధారలన్ = ఆనందబాష్పప్రవాహములందు, వడిన్ = వేగముగా, తేల్చెన్

తాత్పర్యము: పూచిన కల్పలతలు నాలుగుదిక్కులందును గల్పవృక్షమును జుట్టిన విధమున, సాటిలేని రత్నాలంకారసమూహముతో నొప్పిన భుజలతలతో కుమారస్వామిని బెనవైచికొని కౌఁగిలించుకొని, అతిశయించు యుద్ధశ్రమము పోవ నా ముక్కంటి మన సిట్లు ఒప్పఁగా, సంతోష బాష్ప ప్రవాహములందు వడిగాఁ దేల్చెను

విశేషములు: అలంకార ముపమ బాహులతాలి అనుపమరత్నభూషణ చయాంచిత మగుటచే ననిచిన కల్పలతతోఁ బోలిక 'హరుషము' హర్ష శబ్ద వికృతియైనను అశ్రుబ్దముతో సవర్ణదీర్ఘసంధియై సమసించుట విశేషము

గీ ద్వాదశార్ధార్ధనయను నా ద్వాదశార్ధ
వదనుఁ డొగిఁ జుట్టె నిజభుజద్వాదశమున
నుదయ దశశతకిరణుఁ డయ్యుదయనగముఁ
గిట్టి దశశతకరములఁ జుట్టినట్లు 215

అర్థము ఉదయ - దశ - శత - కిరణుఁడు = ఉదయభానుఁడు, ఆ + ఉదయ - నగమున్ = ఆ పొడుపు కొండను, కిట్టి = సమీపించి, దశ - శత - కరములన్ = సహస్రకిరణములతో - వేయి చేతులతో, చుట్టిన + ఱట్లు= చుట్టిన విధమున ఆ - ద్వాదశ + అర్ధ వదనుఁడు = ఆ షణ్ముఖుఁడు = కుమారస్వామి, నిజ - భుజ - ద్వాదశమునన్ = తనవైన పండ్రెండు బాహువులతో, ద్వాదశ + అర్ధ - అర్ధ - నయనున్ = ముక్కంటిని, ఒగిన్ = బాగుగా, చుట్టెన్

తాత్పర్యము ఉదయభానుఁడు ఆ ఉదయపర్వతమును సమీపించి సహస్రకరములతోఁ జుట్టిన విధమున ఆ షణ్ముఖుఁడు తన పండ్రెండు బాహువులతో ముక్కంటిని బాగుగాఁ జుట్టెను

విశేషములు . అలంకార ముపమ

శివుఁడు కుమారునకు జ్ఞానోపదేశంబు చేయుట

వ ఇ ట్లఖిలభువనస్వామి కుమారు లన్యోన్యదివ్యాంగంబు లాలింగన సుధామృతాంబుధి నుడుపంబుగాఁ బట్టి విహరించిన తదనంతరంబ హరి పరమేష్ఠి పురందరాద్యఖిల సుర నర ఫణి ముని గణంబులకు వరదుం డనేక వరంబు లొసంగి నిష్కంటకంబైన సకల భువన భవన సామ్రాజ్య పదవులందు సుప్రతిష్ఠులంజేసి యుమామహేశ్వరులు కుమారు ననేకవేదశాస్త్రాగమ పురాణేతిహాస కథా బృహత్కథాద్యఖిల విద్యావేదికలయందుఁ బారంగతుం జేసి పరమాత్మజ్ఞానధ్యానవిధానంబు లుపదేశించుచు 216

అర్థము : ఇట్లు, అఖిల - భువన - స్వామి - కుమారులు = ఎల్ల లోకముల ప్రభువు - శివుఁడును, కుమారస్వామియు, అన్యోన్య - దివ్య + అంగంబులు = పరస్పర దివ్యశరీరములు, ఆలింగన - సుధా + అమృత + అంబుధిన్ = కౌగిలింత అనెడు క్షీరసముద్రమునందు,ఉడుపంబుగాన్ = తెప్పగా, పట్టి, విహరించిన - తద్ + అనంతరంబు + అ = క్రీడించిన వెంటనే, హరి - పరమేష్ఠి - పురందర + ఆది + అఖిల - సుర - నర - ఫణి - ముని - గణంబులకున్ = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు, మున్నగు నెల్ల దేవతలకు, నరుల, నాగుల, మునుల సమూహములకు,

వరదుండు = వరములనిచ్చువాఁడు - శివుఁడు, అనేక - వరంబులు, ఒసంగి, నిష్కంటకంబు + ఐన = శత్రురహితమైన, సకల - భువన - భవన - సామ్రాజ్య - పదవుల + అందున్ = ఎల్లలోకముల సామ్రాజ్య పదవులందు, సుప్రతిష్ఠులన్ = స్థిరపడినవారిని, చేసి, ఉమా - మహేశ్వరులు = పార్వతీశ్వరులు, కుమారున్, అనేక - వేద - శాస్త్ర + ఆగమ - పురాణ + ఇతిహాస - కథా - బృహత్కథా + ఆది + అఖిల - విద్యా - వేదికల + అందున్ = పెక్కు వేదములు, శాస్త్రములు, ఆగమములు, పురాణములు, ఇతిహాసములు, కథలు, బృహత్కథమున్నగు సర్వవిద్యాపీఠములందును, పారంగతున్ + చేసి, పరమాత్మ - జ్ఞాన - ధ్యాన - విధానంబులు = పరమాత్మను గూర్చిన జ్ఞాన ధ్యానముల పద్ధతులు, ఉపదేశించుచున్

తాత్పర్యము. ఇట్లు సర్వలోక ప్రభువైన ఈశ్వరుఁడును, కుమారస్వామియు, పరస్పర దివ్య శరీరములు ఆలింగనమనెడి క్షీరసముద్రమునందుఁ దెప్పగాఁ బట్టుకొని విహరించినంతనే విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు సకలదేవతల నరుల, నాగుల, మునుల సమూహములకు శివుఁడు పెక్కువరములిచ్చి, శత్రురహితమైన సకల భువన సామ్రాజ్య పదవులందును సుప్రతిష్ఠితులను జేసి పార్వతీశ్వరులు కుమారస్వామిని అనేక వేద శాస్త్ర గమ పురాణేతిహాస కథలు బృహత్కథ మున్నగు నెల్ల విద్యాపీఠములందును పండితుని గావించి పరమాత్మను గూర్చిన జ్ఞానధ్యానపద్ధతు లుపదేశించుచు - తరువాతి పద్యముతో నన్వయము

విశేషములు · అలంకారము రూపకము

చతుర్విద కందము.

సుజ్ఞాన యోగతత్త్వ వి
ధిజ్ఞుల్ భవబంధనములఁ ద్రెంచుచు భువిలో
నజ్ఞానపదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుఁగొల్తు రచలభావన దవులన్ 217

అర్థము. సుజ్ఞాన - యోగ - తత్త్వ - విధిజ్ఞుల్ - సుజ్ఞానము, యోగము, తత్త్వము అనువాని విధులు తెలిసినవారు, భవ - బంధనములన్ = సంసారబంధనములను, త్రెంచుచున్, భువిలోన్ = భూమియందు, అజ్ఞాన - పదమున్, పొందక, ప్రాజ్ఞుల్ = పండితులు, అచల - భావన + తవులన్ = స్థిరబుద్ధి తగులఁగా, శివున్, కొల్తురు

తాత్పర్యము. సుజ్ఞానము, యోగము, తత్త్వము అనువాని విధులు తెలిసిన ప్రాజ్ఞులు సంసారబంధములను ద్రెంచుచు, భువిలో అజ్ఞానపదమును పొందక స్థిరబుద్ధితో శివునిఁ గొల్తురు

విశేషములు చతుర్విధకంద లక్షణము

క రెండవ చరణంబునకున్
రెండవ గణ మాది గాఁగ నిర్మించినచో
దండిఁ జతుర్విధకందము
పాండవపక్షా ! మెలంగుఁ బ్రాజ్ఞుల సభలన్' అప్పుక 4-621

గర్బద్వితీయ కందము

క భవ బంధనములఁ ద్రెంచుచు
భువిలో నజ్ఞానపదముఁ బొందక ప్రాజ్ఞుల్
శివుఁగొల్తు రచలభావన
దవులన్ సుజ్ఞాన యోగ తత్త్వ విధిజ్ఞుల్

గర్బ తృతీయ కందము

క అజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుఁగొల్తు రచలభావన దవులన్
సుజ్ఞాన యోగ తత్త్వ వి
ధిజ్ఞుల్ భవబంధనములఁ ద్రెంచుచు భువిలో

గర్బ చతుర్థకందము

క శివుఁ గొల్తు రచలభావన
దవులన్ సుజ్ఞానయోగతత్త్వవిధిజ్ఞుల్
భవ బంధనములఁ ద్రెంచుచు
భువిలో నజ్ఞానపదముఁ బొందక ప్రాజ్ఞుల్

క సారమతిఁ బాండురాంగు న
వారిత శుభమూర్తిఁ దలఁచువారి శరీరా
ధారమున నుండుఁ గరువునఁ
బూరితమై యుండు రజతపుత్రిక వోలెన్ 218

అర్థము. సార - మతిన్ - మంచి మనసుతో, పాండుర + అంగు = తెల్లని శరీరము గలవాని (శివుని) యొక్క, అవారిత - శుభ - మూర్తిన్ = వారింపఁబడని శుభాకారమును, తలఁచు - వారి = స్మరించు వారియొక్క, శరీర + ఆధారమునన్ = దేహమనెడి ఆధారమున, కరువునన్ = అచ్చునందు, పూరితము + ఐ =

నిండినదయి, ఉండు = ఉండునట్టి, రజత - పుత్రిక + పోలెన్ = వెండిబొమ్మ విధమున, ఉండున్

తాత్పర్యము. మంచి మనసుతో శివుని శుభాకారమును స్మరించువారి శరీరము ఆధారముగా శివుఁడు అచ్చునందు నిండినదయియుండు వెండిపోఁత బొమ్మ విధమున నుండును

విశేషములు: అలంకార ముపమ

కంద గర్భ వృత్తము

చ హరు మనమారఁ గొల్చు డరు, దాతనిఁ గొల్చియు నాదిబోడఁ దాఁ
బొరయునె ? భూరి భోగపుర భూతి విభుత్వముఁ బొంది పేర్మితోన్
బరజనదారుణోక్తి శరపాత నియుక్త పదంబునందుఁ దాఁ
బొరయఁడు వార కోర్చి పరి భూతగణేశ్వరుఁ బొందు నాత్మలోన్ 219

అర్థము. హరున్ = శివుని, మనమారన్ = మనస్ఫూర్తిగా, కొల్చుడు = కొలుచుట, అరుదు = అశక్యము, ఆతనిన్ = శివుని, కొల్చినన్ = సేవించియును, ఆది - బోడన్ = తొలి సన్న్యాసిని - శివుని, తాన్ = తాను, పొరయునె = పొందునా? భూరి - భోగ - పుర - భూతి - విభుత్వమున్ = అధిక సౌఖ్యము యొక్కయు, సంపూర్ణైశ్వర్యముయొక్కయు ప్రభుత్వమును, పొంది, పేర్మితోన్ = గొప్పతనముతో, పర - జన - దారుణ + ఉక్తి - శర - పాత - నియుక్త - పదంబునందున్ = ఇతర జనుల భయంకరోక్తులనెడి బాణముల పాటుగల స్థానమునందు, తాన్, పొరయఁడు = పొందఁడు, వారక = తప్పక, ఓర్చి = జయించి, - సహించి, పరిన్ = క్రమముగా, భూత - గణ + ఈశ్వరున్ = ప్రమధగణముల ప్రభువును - ఈశ్వరుని, ఆత్మలోన్ = మనస్సులో, పొందున్

తాత్పర్యము. శివుని మనస్ఫూర్తిగాఁ గొలుచుట అశక్యము కొలిచియును ఆ యాది సన్న్యాసిని దాను బొందఁజాలఁడు అధిక సౌఖ్యముల సంపూర్ణైశ్వర్యముల విభుత్వమును బొంది, యితర జనుల దారుణములయిన వాక్యములనెడి బాణముల పాతమును బొందఁడు తప్పక జయించి క్రమముగా మనస్సులో నీశ్వరుని బొందును

ఉద్ధతకందము

మనమారఁ గొల్చు డరు దా
తనిఁ గొల్చియు నాది బోడఁ దాఁ బొరయునె భూ
జన దారుణోగ్ర శర పా
తనియుక్తపదంబునందుఁ దాఁ బొరయఁడు పో

మ సరసాహారము రాగహేతు వను టజ్ఞానంబు, పారావతో
త్కరముల్ చిక్కని రాలు మ్రింగియు సదా కామార్తులైయుండుఁ, గే
సరి సాంద్రామిషభుక్తి మైనను సకృత్సంభోగమందున్, మనో
హర విజ్ఞానము కాక రాగరసమం దాహార నిర్వృత్తియే ? 220

అర్థము సరస + ఆహారము = సరసమైన ఆహారము - రసవంతమైన ఆహారము, రాగ - హేతువు = రాగమునకు (రజోగుణమునకు) కారణము, అనుట, అజ్ఞానంబు = తెలివిలేమి, పారావత + ఉత్కరముల్ = పావురముల సమూహాములు, చిక్కనిరాలు మ్రింగియున్, సదా = ఎల్లప్పుడును, కామ + ఆర్తులు + ఐ - ఉండున్ = కామముచేఁ బీడితములయి యుండును, కేసరి = సింహము, సాంద్ర + ఆమిష - భుక్తి = అధికమైన మాంసభోజనము గలది, ఐనను = అయినప్పటికిని, సకృత్ + సంభోగము = ఒక్కమాఱుపొందును - అరుదైన పొందును, అందున్ = పొందును, రాగ - రసమందున్ = అనురాగరసమునందు, మనోహర - విజ్ఞానము + అ = సుందరమైన (గొప్పదియగు) విజ్ఞానమే, కాక, ఆహార - నిర్వృత్తియే = ఆహార సిద్ధియా ?

తాత్పర్యము : రసవంతమైన ఆహారము రాగమునకుఁ గారణమనుట తెలివిలేమి పావురముల సమూహాములు చిక్కని ఱాలు మ్రింగియును ఎల్లప్పుడును కామపీడితములయి యుండును సింహము సాంద్రమయిన మాంసభోజనము గలది యయ్యును అరుదుగా సంభోగించును రాగరసమునందుటకు మనోహర విజ్ఞానముగాక, ఆహారసిద్ధి కారణముగాదు

విశేషములు అలంకారము అర్థాంతరన్యాసము దీనికర్థము

'సింహో మదద్విరదమస్తక మాంసభోజీ
సంవత్సరేణ కురుతే రతి మేకవారమ్,
పారావతః ఖలు శిలాకణ మాత్రభోజీ
కామీ భవ త్యనుదినం వద కోఽ నయో హేతుః

సీ బుద్ధీంద్రియంబుల పాలుఁతులు నాఁ జాలు
కర్మేంద్రియంబుల గర్వముడిచి
విషయాలి నడపాడు వీధిక లనఁజాలు
బుద్ధీంద్రియంబుల పాంక మడఁచి
యంతఃకరణతతి కాటప ట్టనఁజాలు
విషయసమూహంబు వీకు దటిచి
యాజవంజవమున కనుచారియై పర్వు
నంతఃకరణతతి యలవు మడఁచి

తే సురుచిర స్థూలముల్ బాహ్యకరణ సమితి
సూక్ష్మ మంతఃకరణతతిఁ జొచ్చి కూడ
నాత్మ నాత్మైకదృష్టి సర్వాత్మఁ బరమ
పరుని శివుఁ గాంచు టది పరపదవి సుమ్ము 221

అర్థము బుద్ధి + ఇంద్రియంబుల - పాలుఁతులు = బుద్ధియొక్కయు, ఇంద్రియముల యొక్కయు స్త్రీలు, నాన్ + చాలు = అనఁదగు, కర్మ + ఇంద్రియంబుల = కర్మేంద్రియముల యొక్క, గర్వము, ఉడిచి = ఉడిచి (?) = మాన్చి,

విషయ + ఆలి = ఇంద్రియముల సమూహము, నడపాడు = సంచరించునట్టి, వీధికలు = వీధులు, అనన్ + చాలు = అనఁదగు, బుద్ధి + ఇంద్రియంబుల - పాంకము = బుద్ధియొక్కయు, ఇంద్రియముల యొక్కయు, పాంకము = గర్వము, అడఁచి = నశింపఁజేసి,

అంతఃకరణ - తతికిన్ =అంతఃకరణముల సమూహమునకు, ఆటపట్టు = స్థానము, అనన్ + చాలు, విషయ - సమూహంబు - వీకు = ఇంద్రియముల సమూహముయొక్క గర్వము, తటిచి = తఱుగునట్లు చేసి

ఆజవంజవమునకున్ = సంసారమునకు, అనుచారి + ఐ = అనుసరణమైనదయి, పర్వు, అంతఃకరణ - తతి = అంతఃకరణముల యొక్క సమూహము యొక్క, అలవు = శక్తి, మడఁచి = నశింపఁజేసి

సురుచిర - స్థూలముల్ = మనోహరములయిన స్థూలములు, అగు, బాహ్య -కరణ - సమితి = బాహ్యకర్మముల సమూహము, సూక్ష్మము +

అంతఃకరణ - తతిన్ = సూక్ష్ములయిన అంతఃకరణముల సమూహమును, చొచ్చి = ప్రవేశించి, కూడన్ = కూడఁగా, ఆత్మన్ = మనసునందు, ఆత్మ + ఏక - దృష్టిన్ = ఆత్మప్రధానమైన దృష్టితో, సర్వ + ఆత్మున్ = శివుని, పరమ - పరునిన్ = పరాత్పరుని, శివున్ = శివుని, కాంచుట = చూచుట, అది, పర - పదవి - సుమ్ము = ఉత్కృష్ట స్థానము సుమా

తాత్పర్యము బుద్ధీంద్రియముల స్త్రీలు అనఁదగు కర్మేంద్రియముల గర్వము నడఁచి, ఇంద్రియములు సంచరించు వీధు లనఁదగు బుద్ధీంద్రియముల గర్వము నడఁచి అంతఃకరణసమూహమునకు నిలయ మనఁదగిన విషయ సమూహము సామర్థ్యమును తగ్గించి, సంసారమునకు అనుసరణమైనదయి పర్వు అంతఃకరణముల సమూహము శక్తి నడఁచి, స్థూలములైన బాహ్యకర్మములు సూక్ష్ములయిన అంతఃకరణములను జొచ్చి కూడఁగా ఆత్మయందు ఆత్మ ప్రధానమైన దృష్టితో సర్వాత్ముఁడును, పరాత్పరుఁడును, అగు శివునిఁజూచుట యుత్కృష్టమైన స్థానము సుమా !

'ఈ పద్యమున క్షేత్రక్షేత్రజ్ఞ సాయుజ్య స్వరూపమును గని వర్ణించుచున్నాఁడు క్షేత్ర మనఁగాఁ బంచవింశతితత్త్వములు

'బుద్ధీన్ద్రియాణి సార్ధాని మనఃకర్మేన్ద్రియాణి చ !
అహంకారశ్చ బుద్ధిశ్చ పృథివ్యాదీని చైవ హి !
అవ్యక్త మాత్మా క్షేత్రజ్ఞః క్షేత్రస్యాస్య నిగద్యతే ' మా రా కవి

వ అని యనేకప్రకారంబులఁ బరమేశ్వర తత్త్వ రహస్యంబు లుపదేశించి, శివలోకోపకారియైన కుమారునవలోకనంబునం గుమారుఁ గుమార పదవీసుప్రతిష్ఠం జేసి, పరమేశ్వరుం డాశ్రిత జనాధార ధారుణియు, నణిమాది గుణరత్న రత్నాకరుండును, భక్తజనవృజినేంధనపావకుండును, విపశ్చిజ్జనవిపద్బానిలుండును, ముని జన మనోవిహంగమ విహరణ వైహాయసుండును, సంయమిజనహృత్కమల కమలబాంధవుండు, నుపాసకజన నయనేందీవర సుధాకిరణుండును, బరమయోగిజనాంతర్లీనాభేద వేదస్వరూప పరమాత్ముండును, సకల నిష్కల స్వరూప సదాశివుండును, స్వయం ప్రకాశ ప్రభావుండును నై తేజరిల్లుచుం బరమసుఖలీలం బ్రవర్తిల్లుచుండె

అర్థము అని, అనేక - ప్రకారంబులన్, పరమేశ్వర - తత్త్వ - రహస్యంబులు ఉపదేశించి, శివ-లోక + ఉపకారి + ఐన = శివలోకమునకు ఉపకరించునది యగు, కుమారు+అవలోకనంబునన్ = కుమారుని అవలోకనముచే, కుమారున్ = కుమారస్వామిని, కుమార - పదవీ - సుప్రతిష్ఠున్ = యౌవరాజ్యమునందుఁ బ్రతిష్ఠింపఁబడినవానిని, చేసి, పరమేశ్వరుండు, ఆశ్రిత - జన + ఆధార - ధారుణియున్ = ఆశ్రితులైన జనులకు ఆధారమైన భూమియైనవాఁడును, అణిమ + ఆది - గుణ - రత్న - రత్నాకరుండును + అణిమము మున్నగు గుణములనెడి రత్నములకు సముద్రమయినవాఁడును, భక్త - జన - వ్రజిన + ఇంధన - పావకుండును = భక్తులైనజనుల యొక్క పాపములనెడి కట్టెలకు అగ్నియైనవాఁడును, విపశ్చిత్ + జన - విపద్ + ఘన + అనిలుండును = పండితులైన జనులయొక్క ఆపదలనెడి మేఘములకు వాయువైనవాఁడును, ముని - జన - మనస్ + విహంగమ - విహరణ - వైహాయసుండును = మునిజనులయొక్క మనస్సులనెడి పక్షులయొక్క విహారమునకు ఆకాశమైనవాఁడును, సంయమి - జన - హృద్ + కమల - కమలబాంధవుండును = మునులైనజనులయొక్క హృదయములనెడి పద్మములకు సూర్యుఁడైన వాఁడును, ఉపాసక - జన - నయన + ఇందీవర - సుధాకిరణుండును = ఉపాసించు జనులయొక్క కనుఁగలువలకుఁ జంద్రుఁడైనవాఁడును, పరమ - యోగి - జన + అంతర్లీన + అభేద - వేద - స్వరూప - పరమాత్ముండును = గొప్ప యోగిజనులకు అంతర్లీనము, అభేదము, వేద స్వరూపము అయిన పరమాత్ముఁడును, సకల - నిష్కల - స్వరూప - సదాశివుండును - కళాసహితము, కళారహితమునైన స్వరూపముగల సదాశివుఁడును, స్వయం ప్రకాశ - ప్రభావుండును = తనంతఁదాను ప్రకాశించు ప్రభావము గలవాఁడును, ఐ, తేజరిల్లుచున్ = ప్రకాశించుచు, పరమ - సుఖ - లీలన్ = గొప్ప సుఖముతోడి విలాసముతో, ప్రవర్తిల్లుచున్ + ఉండెను

తాత్పర్యము: అని పెక్కురీతులఁ బరమేశ్వరతత్త్వమునందలి రహస్యములు ఉపదేశించి శివలోకమున కుపకరించు కుమారావలోకనముతోఁ గుమారస్వామిని యౌవరాజ్యమునందుఁ బ్రతిష్ఠించి, పరమేశ్వరుఁడు, ఆశ్రితజనుల కాధారభూమియైనవాఁడును, అణిమము మున్నగు గుణరత్నములకు సముద్రమైనవాఁడును, భక్త జనుల పాపములనెడి కట్టెలకు అగ్నియైనవాఁడును, పండిత జనుల ఆపదలనెడి మేఘములకు వాయువైనవాఁడును, మునిజనుల మనస్సులనెడి పక్షుల విహారమునకు ఆకాశమైనవాఁడును, మునులైనజనుల హృదయపద్మములకు సూర్యుఁడైనవాఁడును, పరమయోగి జనులకు అంతర్లీనము,

అభేదము, వేదస్వరూపమునైన పరమాత్ముఁడును, కళాసహితము, కళారహితమునైన స్వరూపముగల పరమాత్ముఁడును, తనంతఁదాను ప్రకాశించు ప్రభావము గలవాఁడును, అయి ప్రకాశించు పరమసుఖమైన విలాసముతోఁ బ్రవర్తిల్లుచుండెను

విశేషములు అలంకారము రూపకము

మ క్షితి సర్వేశ్వరపాదభక్తుల మహాకీర్తిప్రభానూనసం
హతి సూర్యద్యుతి కగలంబగుచు లోకాలోకశైలావలీ
ప్రతిలోకాఖ్య మహీధర స్ఫురిత కుంభ స్తంభ దీపోజ్జ్వలా
యత తేజస్థితిఁ బర్వు నొక్కమొగి బ్రహ్మాండంబులోనన్ వెలిన్ 223

అర్థము. క్షితిన్ = భూమియందు, సర్వేశ్వర - పాద - భక్తుల = పరమేశ్వర పాదభక్తుల యొక్క, మహత్ (మహా) - కీర్తి - ప్రభా + అనూన - సంహతి = గొప్ప కీర్తియనెడు కాంతులయొక్క తక్కువకాని సమూహము, సూర్య-ద్యుతికిన్ = సూర్యకాంతికంటె, అగ్గలంబు + అగుచున్ = అధికమగుచు, లోకాలోక - శైల + ఆవలీ = చక్రవాళపర్వతముల వరుసయనెడు, ప్రతిలోక + ఆఖ్య - మహీధర - స్ఫురిత = ప్రతిలోకమనెడు పేరుగల పర్వతమునందు, స్ఫురిత = తోఁచిన, కుంభ స్తంభ - దీప + ఉజ్జ్వల + ఆయత - తేజస్ + స్థితిన్ = కుంభాకార స్తంభమునందలి దీపము యొక్క ప్రకాశవంతము, విపులమునైన కాంతి విధమున, బ్రహ్మాండంబులోనన్ - వెలిన్ = బ్రహ్మాండములోపలను, బయటను, ఒక్క - మొగిన్ = మొత్తముగా, పర్వున్ = వ్యాపించును

తాత్పర్యము. భూమిలో పరమేశ్వరపాదభక్తుల మహాకీర్తియనెడు కాంతుల సమూహము సూర్యకాంతిని మించి చక్రవాళపర్వతములనెడు ప్రతిలోక పర్వతమునందు స్ఫురించిన కుంభాకారస్తంభమునందలి దీపము యొక్క ప్రకాశవంతము విపులమునైన కాంతి విధమున బ్రహ్మాండములోపలను బయటను మొత్తముగా వ్యాపించును

విశేషములు అలంకార ముపమ

మానిని ధీరత భూమి, గభీరత వారిధి, తేజము వహ్ని, బలం బనిలం,
బారయఁ బెంపు నభంబు, ప్రతాప మహార్పతి, కాంతి విధుండు, మహో
దారత నయ్యజమానులుఁ బేర్మి సదాశివునెన్మిదిమూర్తులుఁ జె
ల్వారఁగ నిచ్చుచునుండెడు నర్ది నహర్నిశమున్ శివభక్తులకున్ 224

అర్థము. ఆరయన్ = చూడఁగా, ధీరతన్ = ధైర్యమును, భూమి = భూరూపమూర్తియును, గభీరతన్ = గాంభీర్యమును, వారిధి = సముద్రరూపమూర్తియున్ను, తేజమున్ = తేజస్సును, వహ్ని = అగ్నిరూపమూర్తియును, బలంబు, అనిలంబు = వాయు రూపమూర్తియును, పెంపున్ = ఆధిక్యమును, నభంబు = ఆకాశరూపమూర్తియును, ప్రతాపము = గొప్ప తాపము - పరాక్రమము, అహర్పతి = సూర్యరూపమూర్తియును, కాంతిన్ = కాంతిని, విధుండు = చంద్రుఁడు, మహత్ (మహా) + ఉదారతన్ = గొప్ప ఔదార్యమును, అయ్యజమానులున్ (ఆ + యజమానులున్) = ఆ యజమానరూపమూర్తియును, పేర్మిన్ = గొప్పతనముతో, సదాశివు + ఎన్మిది మూర్తులున్ = పరమేశ్వరుని అష్టమూర్తులు, అర్థిన్ = కోరికతో, అహర్నిశమున్ = పగలును రాత్రులును -ఎల్లప్పుడును, శివ - భక్తులకున్, చెల్వారఁగన్ (చెల్వు + ఆరఁగన్) = అందముగా, ఇచ్చుచున్ + ఉండెడున్

తాత్పర్యము : ఆరయఁగా భూమూర్తి ధైర్యమును, సముద్రమూర్తి (అమ్మూర్తి) గాంభీర్యమును, వహ్నిమూర్తి తేజస్సును, అనిలమూర్తి బలమును, నభోమూర్తి పెంపును, సూర్యమూర్తి పరాక్రమమును, చంద్రమూర్తి కాంతిని, యజమానమూర్తి మహౌదార్యమునూ ఇట్లు పేర్మితో సదాశివుని అష్టమూర్తులును కోరికతో అహర్నిశమును శివభక్తులకు అందముగా నిచ్చుచుండును

విశేషములు . పంచభూతములు (పృథివ్యప్తేజోవాయురాకాశములు), సూర్యచంద్రులు, యజమానుఁడు అనునవి శివుని అష్టమూర్తులును మానినీవృత్తలక్షణము - నాలుగు పాదములుండును ప్రతిపాదమునను ఏడు భగణములపై నొక గురువుండును, మొదటి యక్షరమునకును పదుమూఁడవ యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము గలదు

మ ధ్రువమై జంగమమల్లికార్జున మునీంద్రుం బేర్మిఁ బేర్కొన్న స
త్కవిరాజోక్త కుమారసంభవ మహాకావ్యంబు భూభూధరా
ర్ణవ వేదానిలతారకాంబర సదానందాత్మ దిక్కాలముల్
సవిలాసస్థితి నుండునంత కిల నాచంద్రార్కమై యుండెడున్ 225

అర్థము : జంగమ మల్లికార్జున - మని + ఇంద్రున్ = జంగమ మల్లికార్జునుఁడనెడు మునిశ్రేష్ఠుని, పేర్మిన్ = ప్రీతితో, పేర్కొన్న = పేర్కొనిన, సత్ + కవి - రాజ + ఉక్త = సుకవిశ్రేష్ఠుఁడైన నన్నెచోడనిచేఁ జెప్పఁబడిన, కుమారసంభవ

- మహత్ (మహా) + కావ్యంబు = కుమారసంభవమనెడి గొప్ప కావ్యము,భూ - భూధర + అర్ణవ, వేద + అనిల - తారక + అంబర - సదానంద + ఆత్మ - దిశ్ (క్) + కాలముల్ = భూమి, పర్వతములు, సముద్రములు, వేదములు, వాయువు, నక్షత్రములు, ఆకాశము, సదానందముగల ఆత్మ, దిక్కులు, కాలము, సవిలాస-స్థితిన్ = విలాసముతో గూడిన ఉనికితో, ఉండు + అంతకున్ = ఉండునంత వఱకును, ఇలన్ = భూమియందు, ఆ + చంద్ర + అర్కము + ఐ = చంద్రసూర్యు లుండునంతవఱకును, ధ్రువము + ఐ = స్థిరమయి, ఉండెడున్ = ఉండును

తాత్పర్యము మునిశ్రేష్ఠుడైన జంగమ మల్లికార్జునుని ప్రీతితో బేర్కొనినట్టియు, సుకవిశ్రేష్ఠుడైన నన్నెచోడనిచే జెప్పబడినట్టియు గుమారసంభవ మహాకావ్యము భూమి, పర్వతములు, సముద్రములు, వేదములు, వాయువు, నక్షత్రములు, ఆకాశము సదానందమైన ఆత్మ, దిక్కులు, కాలములు విలాస స్థితితో నుండునంతవఱకును భూమిలో ఆచంద్రార్కముగా స్థిరమైయుండును

సీ జ్ఞానదీపంబు హృత్సదనంబులో దాన
దీయగా నెత్త దివురువారు
వలచేత వసుమతీవలయంబు నవరత్న
వలయంబుగా నిడవలచువారు
భారతి దమమోమునబసిడిమాడువులోన
నిలువేల్పుగా నిల్పదలచువారు
నణిమాది గుణ మణి హారమ్ము లురమున
హారంబుగా నిడ గోరువారు

తే వెలయ మత్కృతి చదువుడు వినుడు వ్రాయు
డీశ్వరాంబికాగుహ లిత్తు రీప్సితములు
వారి నేమెయి గొనియాడువారి కోర్కి
లొనర జంగమ మల్లికార్జునుడు నొసగు. 226

అర్థము: జ్ఞాన - దీపంబున్ = జ్ఞానమనెడి దివ్వెను, హృద్ + సదనంబులోన్= హృదయమనెడి గృహములో, తాన - దీయ + కాన్ = స్థానదీపముగా, ఎత్తన్ = ఎత్తుటకు - పెట్టుటకు, తివురువారున్ = యత్నించువారును,

వలచేతన్ = కుడిచేతియందు, వసుమతీ - వలయంబున్ = భూవలయమును,నవ - రత్న - వలయంబు + కాన్ = నవరత్నమయమైన హస్తాభరణముగా, ఇడన్ = ఇచ్చుటకు - ధరించుటకు, వలచువారున్ = కోరువారును

భారతిన్ = సరస్వతిని, తమ మోము + పసిఁడి । మాడువులోనన్ = తమ ముఖమనెడి బంగరు మేడయందు, ఇలువేల్పు + కాన్ = గృహదేవతగా, నిల్పన్= నిల్పుటకు, తలఁచు వారున్ =కోరువారును,

అణిమ + ఆది - గుణ - మణి - హారమ్ములు = అణిమము మున్నగు గుణములనెడి మణిమయ హారములు, ఉరమునన్ = వక్షమునందు, హారంబు + కాన్, ఇడన్ = ధరించుటకు, కోరువారున్,

వెలయన్ = ప్రసిద్ధముగా, మత్ + కృతి =నా కావ్యమును, చదువుఁడు, వినుఁడు, వ్రాయుఁడు, ఈశ్వర + అంబికా - గుహులు = ఈశ్వరుఁడు, పార్వతి, కుమారస్వామి, ఈప్సితములు = కోరికలు, ఇత్తురు, వారిన్ = ఆ ఈశ్వరాంబికాగుహులను, ఏ - మెయిన్ =' ఏ రీతిగానైనను, కొనియాడువారి - కోర్కులు = నుతించువారి కోరికలు, ఒనరన్= ఒప్పుగా, జంగమ మల్లికార్జునుఁడున్, ఒసఁగున్ = ఇచ్చును

తాత్పర్యము. జ్ఞానమనెడి దీపమును హృదయ భవనములో స్థానదీపముగా నెత్తుటకు యత్నించువారును, కుడిచేత భూవలయమును నవరత్నమయ హస్తాభరణముగా ధరింపఁగోరువారును, సరస్వతిని దమ ముఖమనెడి మేడలో గృహదేవతగా నిల్పుటకుఁ గోరువారును, అణిమము మున్నగు గుణములనెడి మణిహారములు వక్షమున హారముగాఁ దాల్పఁగోరువారును, నా కావ్యమును జదువుఁడు, వినుఁడు, వ్రాయుఁడు అట్టిచో నీశ్వర పార్వతీ కుమారస్వాములు మీకుఁ గోరికల నిత్తురు వారి నే రీతిగా నైనఁ గొనియాడు వారి కోరుకులను జంగమ మల్లికార్జునుఁడు తీర్చును

విశేషములు అలంకారము రూపకము

ఆశ్వాసాంతము

మ త్రిజగద్వంద్యుఁ డనింద్యుఁ డిష్టజనవర్ధిష్ణుండు విష్ణుండు వా రిజపత్రాక్షుఁడు దక్షుఁ డాదిమునిచారిత్రుండు పాత్రుండు కం జజతత్త్వజ్ఞుఁడు ప్రజ్ఞుఁ డీశ్వరపదాసక్తుండు ముక్తుండు జ న్మ జరా దూరుఁడు ధీరుఁ డాత్మవిదుఁ డానందుం డమందుం డెదన్ 227

అర్థము . త్రి - జగత్ + వంద్యుఁడు = ముల్లోకముల (వారి) చే నమస్కరింపఁదగినవాఁడు, అనింద్యుఁడు = నిందింపఁదగనివాఁడు, ఇష్ట - జన - వర్ధిష్ణుండు = ఇష్టులైన జనులను వృద్ధి పొందించు శీలము గలవాఁడు, విష్ణుండు = వ్యాపనశీలుఁడు, వారిజ - పత్ర + అక్షుఁడు = తామర రేకుల వంటి కన్నులు గలవాఁడు, దక్షుఁడు = సమర్థుఁడు, ఆది - ముని - చారిత్రుండు = ఆదిముని (వ్యాసుని ?) చరిత్రము వంటి చరిత్రము గలవాఁడు, పాత్రుండు = అర్హుఁడు, కంజజ - తత్త్వజ్ఞుఁడు = బ్రహ్మతత్త్వము తెలిసినవాఁడు, ప్రాజ్ఞుఁడు = పండితుఁడు, ఈశ్వర - పద + ఆసక్తుండు = ఈశ్వరుని పాదములయం దాసక్తిగలవాఁడు, ముక్తుండు = సంసారబంధములనుండి విడువఁబడినవాఁడు, జన్మ-జరా-దూరుఁడు = పుట్టుకకు, ముసలితనమునకు దూరమైనవాఁడు, ధీరుఁడు, ఆత్మ - విదుఁడు = ఆత్మజ్ఞానము గలవాఁడు, ఆనందుండు = సంతోషించువాఁడు, ఎదన్ = మనస్సునందు, అమందుండు = మందుఁడుగానివాఁడు - ఇవి యన్నియుఁ గృతిభర్త యగు శ్రీ జంగమ మల్లికార్జునుని విశేషణములు

తాత్పర్యము : ముల్లోకములవారిచే నమస్కరింపఁదగినవాఁడు, నిందింపఁదగనివాఁడు, ఇష్టులైన జనులను వృద్ధిపొందించు శీలముగలవాఁడు, వ్యాపనశీలుఁడు, పద్మపత్రముల వంటి కన్నులు గలవాఁడు, సమర్థుఁడు, ఆదిముని చరిత్రమువంటి చరిత్రము గలవాఁడు, తగినవాఁడు, బ్రహ్మతత్త్వము నెఱిఁగినవాఁడు, పండితుఁడు, శివుని పదములఁ దగులు గలవాఁడు, సంసారబంధమునుండి విడువఁబడినవాఁడు, పుట్టుక ముసలితనము అనువానికి దూరమైనవాఁడు, ధీరుఁడు, ఆత్మజ్ఞానము గలవాఁడు, ఆనందము గలవాఁడు, మనస్సునందు అమందుఁడును అగు కృతిభర్త శ్రీ జంగమమల్లికార్జునుఁడు

విశేషములు : అలంకారము అనుప్రాసము

క **అమిత సుగుణ మణి రచితా**
ద్యమల విభూషణ విభూషి తావయవుఁడు జం
గమ మల్లికార్జునుఁడు వా
గ్రమణీ రమణుండు మునిశిఖామణి పేర్మిన్ **228**

అర్థము . అమిత తావయవుఁడు, అమిత - సుగుణ - మణి - అధికమైన మంచి గుణములనెడి మణులచే, రచిత = రచింపఁబడిన, ఆది + అమల = ప్రమాణములు, నిర్మలములు అయిన, విభూషణ = అలంకారములచే,

విభూషిత = అలంకరింపఁబడిన, అవయవుఁడు = అవయవములు గలవాఁడు, వాచ్ (క్) + రమణీ - రమణుండు = వాగ్దేవికిఁ బ్రియుఁడైన వాఁడు, పేర్మిన్ = గొప్పతనమునందు, ముని - శిఖా మణి = మునులకుఁదలమానికమైనవాఁడు, అగు, జంగమమల్లికార్జునుఁడు

తాత్పర్యము. అధికములయిన సుగుణములనెడి మణులచే రచింపఁబడిన ప్రమాణములు, నిర్మలములునైన అలంకారములచే నలంకరింపఁబడిన అవయవములు గలవాఁడును, వాగ్దేవికిఁ బ్రియుఁడైనవాఁడును గొప్పతనమున మునులకుఁ దలమానికమయినవాఁడును అగు శ్రీ జంగమమల్లికార్జునుఁడు

మ సుకవిస్తుత్యుఁడు నిత్యుఁ డూర్జితుఁడు సుశ్లోకుం డశోకుండు స
ర్వకళాధారుఁడు ధీరుఁ డార్యజనతావర్యుం డవార్యుండు ధ
ర్మ కథాసంగుఁ డసంగుఁ డాద్యుఁడు జగన్మాన్యుండు ధన్యుండు బ్ర
హ్మకులోత్తంసుఁడు హంసుఁ డుత్తమగుణాయత్తుం డమత్తుండెదన్ 229

అర్థము. సుకవి - స్తుత్యుఁడు = సత్కవులచే,స్తుతింపఁదగినవాఁడును, నిత్యుఁడు = శాశ్వతుఁడును, ఊర్జితుఁడు = గొప్పవాఁడును, సుశ్లోకుండు = మంచికీర్తి గలవాఁడు, అశోకుండు = శోకములేనివాఁడు సర్వ - కళా + ఆధారుఁడు = సమస్త కళలకు ఆధారమైనవాఁడును, ధీరుఁడు, ఆర్య - జనతా - వర్యుండు = పూజ్యులైన జనములలో శ్రేష్ఠుఁడును, అవార్యుండు = వారింపరానివాఁడు, ధర్మ - కథా - సంగుఁడు = ధర్మకథలయందు ఇష్టముగలవాఁడు, అసంగుఁడు = సంగము లేనివాఁడు, ఆద్యుఁడు = మొదటివాఁడు, జగత్ + మాన్యుండు = జగత్తులకు మన్నింపఁదగినవాఁడు, ధన్యుండు, బ్రహ్మ - కుల + ఉత్తంసుఁడు = బ్రాహ్మణ వంశ శ్రేష్ఠుఁడు, హంసుఁడు = పరమాత్ముఁడు, ఉత్తమ - గుణ + ఆయత్తుండు = శ్రేష్ఠములయిన గుణములకు వశమయినవాఁడు, ఎదన్ = హృదయమునందు, అమత్తుండు = మత్తుఁడు గానివాఁడు

తాత్పర్యము. సత్కవులచే స్తుతింపఁ దగినవాఁడు, శాశ్వతుఁడు, అధికుఁడు, మంచి కీర్తి గలవాఁడు, శోక రహితుఁడు, సమస్త కళలకు ఆధారమైనవాఁడు, ధీరుఁడు, ఆర్యులైన జనులలో శ్రేష్ఠుఁడు, వారింపరానివాఁడు, ధార్మిక కథలయం దిష్టము గలవాఁడు, సంగ రహితుఁడు, ఆద్యుఁడు, జగములకు మాన్యుఁడు, ధన్యుఁడు, బ్రాహ్మణ వంశ శ్రేష్ఠుఁడు, పరమాత్ముఁడు, ఉత్తమ గుణముల కధీనుఁడు, హృదయములో మత్తుఁడు గానివాఁడు అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

క ముక్తుఁడు కృత్యాకృత్యవి
రక్తుఁడు యోగీశ్వరానురక్తుఁడు తత్త్వా
సక్తుండు నియమ పద సం
యుక్తుఁడు సంసార పద వియుక్తుండు మదిన్ 230

అర్థము . ముక్తుఁడు = సంసారమునుండి విడివడినవాఁడు, కృత్య + అకృత్య - విరక్తుఁడు = చేయఁదగిన, చేయఁదగని వానియందు రక్తిలేనివాఁడు, యోగి + ఈశ్వర + అనురక్తుఁడు = యోగిశ్రేష్ఠులయం దనురాగము గలవాఁడు, తత్త్వ + ఆసక్తుండు = వేదాంతమునందుఁ దగులు గలవాఁడు, నియమ - పద - సంయుక్తుఁడు = నియమమనెడి పదముతోఁ గూడుకొన్నవాఁడు, మదిన్ = మనసునందు, సంసార - పద - వియుక్తుండు = సంసారమనెడి పదము నుండి ఎడఁబాసినవాఁడు

తాత్పర్యము . సంసారబంధమునుండి విడివడినవాఁడును, కృత్యములందును, అకృత్యములందును రక్తిలేనివాఁడు, యోగిశ్రేష్ఠులయం దనురాగము గలవాఁడు, వేదాంతమునందుఁ దగులు గలవాఁడు, నియమమను పదముతోఁ గూడినవాఁడు, మనసునందు సంసారమను పదము నెడఁబాసినవాఁడు అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు

మంగళ మహాశ్రీ వృత్తము

భూవినుతుఁ డార్యజనపూజితుఁడు సద్గుణ విభూషితుఁడు, సర్వా
శా వివర పూరిత విశాల శర నిర్మలయశఃప్రసర శోభితుఁడు, సద్భూ
దేవకులశేఖరుఁడు దేవమునిముఖ్యుఁడు, సుధీజనవరేణ్యుఁడు, ప్రియుండై
యీ వసుధ శిష్టతతి కిష్టఫలయుక్తముగ నిచ్చు దయ మంగళమహాశ్రీ 231

అర్థము . భూ - వినుతుఁడు = భూలోకము (వారి) చే విశేషముగా నుతింపఁబడినవాఁడు, ఆర్య - జన - పూజితుఁడు = పూజ్యులైన జనులచేఁ బూజింపఁబడినవాఁడు, సత్ + గుణ - విభూషితుఁడు = మంచి గుణములచే నలంకరింపఁబడినవాఁడు, సర్వ + ఆశా - వివర - పూరిత - విశాల - శర - నిర్మల - యశః - ప్రసర - శోభితుఁడు = ఎల్లదిక్కుల నడిమి అవకాశములందు నిండింపబడిన విస్తృతము, తెల్లువలె స్వచ్ఛము అయిన యశస్సుయొక్క వ్యాప్తిచేఁ బ్రకాశించు వాఁడు, సత్ + భూదేవ - కులశేఖరుఁడు = ఉత్తమ బ్రాహ్మణ సమూహమునకు శిరోభూషణమైన వాఁడు, దేవ - ముని - ముఖ్యుఁడు = దేవతలలో, మునులలోఁ బ్రధానుఁడు, సుధీ - జన - వరేణ్యుఁడు = పండితులైన జనులలో శ్రేష్ఠుఁడు, - అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు, ప్రియుఁడు + ఐ =

ఇష్టుఁడయి, ఈ - వసుధన్ = ఈ భూమియందు, శిష్ట - తతికిన్ = మంచివారి సమూహమునకు, దయన్ = దయతో, ఇష్ట - ఫల - యుక్తముగన్ = కోరిన ఫలములతోఁ గూడ, మంగళ - మహా - శ్రీన్ = మంగళముతోడి గొప్పదియగు సంపదను, ఇచ్చున్

తాత్పర్యము. భూజనులచే విశేషముగాఁ బొగడఁబడువాఁడును, ఆర్యులైన జనులచేఁ బూజితుఁడును, సద్గుణములచే నలంకరింపఁబడినవాఁడును, ఎల్ల దిక్కుల నడిమి అవకాశములందును బూరింపఁబడిన విస్తృతము, తెల్లువలె నిర్మలమునైన కీర్తి వ్యాప్తిచేఁ బ్రకాశించువాఁడు, ఉత్తమ బ్రాహ్మణ వంశ శ్రేష్ఠుఁడును, దేవ మునులందుఁ బ్రధానుఁడును, పండిత జన శ్రేష్ఠుఁడును, అగు శ్రీ జంగమ మల్లికార్జునుఁడు ఇష్టుఁడై యీ భూమియందలి సజ్జనులకు ఇష్టఫలములతో మంగళ యుక్త మహా సంపదను దయతో నిచ్చుఁగాక !

విశేషములు . మంగళ మహాశ్రీ వృత్త లక్షణము నాలుగు పాదములుండును ప్రతి పాదమునను భ, జ, స,న, భ, జ, స, న, గగ ము లను గణములుండును మొదటి యక్షరమునకుఁ దొమ్మిదవ యక్షరమునకుఁ బదునేడవ యక్షరమునకు యతిమైత్రి ప్రాసనియమము గలదు ఈ పద్యమున మొదటి పాదమున గణభంగ మయినది నాలుగక్షరములు తక్కువయినవి

భ	జ	న	న	భ	జ	స	గ
u ı ı	ı u ı	ı ı u	ı ı ı	u ı ı	ı u ı	ı ı u	u
భూవిను	తుఁడార్య	జన పూ	జితుఁడు	సద్గుణ	విభూషి	తుఁడుస	గర్వా

x x x u x

గద్యము

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీపాద పంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవ ప్రణీతంబైన కుమారసంభవంబను కథయందు ద్వాదశాశ్వాసము సంపూర్ణము

ఈ గద్యము నర్థతాత్పర్యములకుఁ బూర్వాశ్వాసాంతగద్యముల అర్థతాత్పర్యముల నరయునది

మ **ఇది శ్రీ జొన్నలగడ్డవంశమణి యౌ మృత్యుంజయాఖ్యుండు స మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి ద్యదధీశోక్తము శాబ్దికార్ద వివిధస్వారస్య తాత్పర్యముల్ చదురొప్పన్ వచియించి మన్ను విలపత్ సంజీవనీ వ్యాఖ్య యౌ**

వ్యాఖ్యానమున దొరలిన కతిపయ భ్రమప్రమాదములు - వాని సవరింతలు

సీ పద్మాసనస్థుఁడై నుండె 3-193

మనుజునకుఁ బదునాఱు సంస్కారముల మాదిరిగా మంత్రమునకును సంస్కారముల యావశ్యకత కలదు దాహన, ప్లావన, తర్పణాదు లట్టివి

ప్రత్యాహారగతి - ఇంద్రియములను విషయములనుండి మరల్చు విధము

సీ మొనలావులించి వరదు 3-108

ఇందు ఎత్తుగీతిలోని మూఁడవ పాదమున 'మున్న కొసివచ్చి గణికాసమూహితోడ - అనుదాన - గణికా సమూహితోడ ఁనుదానికి గణికల = అడవి మొల్లల మొత్తముతో అని యర్థము చెప్పనొప్పును

సీ అనిమిషపతి పుర మనిమిషాస్పదమయ్యె,
ననలు ప్రో లెల్లను ననలమయము
ప్రేతాధిపతి వీడు ప్రేత సంగతము 4-28

ఇందుఁ బ్రథమపాద ద్వితీయార్ధమున - అనలమయము = అగ్నితో నిండినది యని యర్థము చెప్పుచో శ్లేషము లేక వక్రోక్తి కాదు అందుచే అనలు ప్రోలెల్లను ననలమయము - అనలు ప్రోలు + ఎల్లను = అగ్నిపురమంతయు, ననలమయము = పుష్పమయము అని యర్థము చెప్పనొప్పును

అట్లే- ప్రేతాధిపతి వీడు ప్రేత సంగతము = ప్రేతములకు (పీనుఁగులకు) ప్రభువు అగు యమునియొక్క పట్టణము, ప్రేత -సంగతము = పిశాచభేదములతోఁ గూడినది అని అర్థము చెప్పుచో, శ్లేషము గలిగి, వక్రోక్తి యగును

క చెలుకునఁ బుచ్చక రిమ్ములఁ
గలిచిన రసమానని గతిఁ దరుణుల నెటు చే
వెలి వాపక సంగతి కే
డ్తెలసేసి మనోరథములు ధీరునిఁ బడయున్ 8-159


ఇది మానవల్లి వారి పారము ఇందు మొదటి పాదమున యతిభంగ మయినది

ఈ పద్యమునకు వావిళ్ళవారి ప్రతిలోఁ బారాంతరము గలదు

క చెలి కీనఁ బుచ్చ కతిముతిఁ
గలిచిన రసమానరాని గతిఁ దరుణుల చీఁ
దలి వాపక సంగతి కే
డ్తెలసేసి మనోరథములు ధీరుఁడు పడయున్

ఈ పారమున 'రిమ్ము' గానరాదు

నాగబంధము




చ శరణు మహేశ భూరితరసార సుఖప్రదకామకాలసం
హారభవరోగదారణ సురాసురవన్ద్య శరీరదుఃఖ దు
స్తరకమలా విహార హిమధామ సమస్తగ సోమదేవ వి
స్తరిత రమాదయారసయుతా యురులబ్ధ విభావనామయా

10-ఆ 84 పద్యము

౪

౧పరమశి ! శుభసేవమూర్తీ !
వర సుర వర దనుజదురిత వనధి సుకీర్తీ !
హరదరి శుభ సేవమూర్తీ !
పృథుపురహార ధను భిదురిత జనన సుకీర్తీ 10 ఆ 85 పద్యము

చక్రబంధము



శా ముక్తాముక్త ఘనానురాగమద సమ్మోదైక సంసేవ్య సం
త్యక్తా కర్మ పదప్రభేదమతి విద్యాదేహ శోషైకహా
భక్తాలంబక మంత్రతంత్రమయ సద్భావస్థితైకస్థ్సశా
శక్తేయా మునిచింత్యమాన భరతా సంతాపహా సద్యశా

12 ఆ 201 పద్యము

నన్నెచోడదేవకృత

కుమార సంభవము

(సంజీవనీ వ్యాఖ్యాసమేతము)

అకారాది పద్యానుక్రమణిక

(సప్తమాశ్వాసము నుండి ద్వాదశాశ్వాసాంతము వఱకు)

అ	ఆ పద్య		ఆ పద్య
అంగజరాగసంగత	8 - 125	అనలసుతుఁ డనలకణములు	10 - 176
అంతకు మును నినుఁ	11 - 89	అనవరతము నవ	9 - 150
అందంబులై వేల్పు	12 - 203	అన విని కావ్యుఁడు	10 - 134
అంధకాసురవైరి	11 - 103	అని నటిమి చచ్చి	12 - 127
అంబరనామధేయ	9 - 93	అనిమొనఁ గుంజరాక్షు	12 - 18
అక్కిలి మాయఁగన్నుఁగవ	10 - 36	అనిమొన నిల్చి	11 - 56
అగరు లలాటకాలాగరు	9 - 101	అని వివిధాస్త్రశస్త్ర	11 - 69
అగ్నిగర్భుఁడై కృత్తిక	10 - 92	అనిశము గోసహస్ర	7 - 122
అడిచిరి ముద్గరముల	11 - 119	అనుపమ దివ్యమూర్తి దర	8 - 124
అడ్డ గోడలపై	8 - 55	అనుశీతాచ్ఛజలంబులోఁ	7 - 67
అతివేగంబునఁబవి	12 - 108	అన్నలువ పేతామహుఁడను	9 - 66
అతివేగంబున నరి	12 - 29	అన్నుల తిన్నని నవ్వుల	11 - 26
అతులోత్సాహముతోడ	12 - 130	అప్పురమున వణిగ్జను	8 - 44
అది కాలాగ్ని శిఖాకలాప	12 - 120	అబ్ధిగభీరుఁడు	7 - 162
అది నా వల్లభునుత్తమాంగ	11 - 186	అభిషేకానంతరం బా	10 - 111
అనఘచరిత్రుఁ బాత్రు	9 - 165	అమరఁగ నీ వనంత	8 - 154
అన నక్కజంబుగా	9 - 135	అమరధేనువుల్ సుర	12 - 196
అనయంబై కొనివీచు	11 - 58	అమరారి శిలీముఖ	12 - 125
అనయముఁ జక్కు	11 - 155	అమరులు త్రావుచో	9 - 130

	ఆ	పద్య
అమిత సుగుణమణి	12	228
అమిత సువీర్యవార్ధు	9	155
అమృతాంభోనిధిలో	8	48
అమృతాబ్ధి సొచ్చి	11	3
అమ్మఁ దిగిచి యేసి	11	161
అయుతాశ్వవాహ్యము	12	50
అరగొన కాజి నీల్గి	11	190
అరిబలమంటఁదాఁకిన	11	49
అరిశంఖకౌస్తుభంబులు	8	76
అరిషడ్వర్గ జయిత	10	186
అరిషడ్వర్గ జయుండు	7	159
అరుణకరోత్కరాభిహతి	8	182
అరుణకిరణసహస్రో	10	53
అరుణజలంబులాడి	11	202
అరుణపరాగ మంబర	12	193
అరుణాంభోజాత	10	25
అరుదుగ రెండమ్ములుదొడి	12	46
అఱకొనక కన్న	10	126
అలఁచి విపత్ప్రయోగత	7	47
అలఁతులు నిల్వ హస్త	9	38
అలకల కాంతిఁ గప్పె	9	11
అలక లన్ తరుణుల	8	179
అలఘు విరోధి	11	38
అలరులతోడ నవ్వచు	9	110
అలికలభములు	9	126
అలికలితాంబుజంబు	9	89
అలికులాన్విత	9	8
అలికేశి లక్తకా	8	18
అలిగి దేవేంద్రుఁ డేయు	10	64
అలిగి వరుణుపై	12	38
అలిగి విరహుల	9	124
అలిరణితాబ్జముఁ గని	9	85
అలుకం జండిక	12	110
అవిరళ నిత్యకర్మ	7	119
అవి వివిధాస్త్రశస్త్ర	11	69
అశ్వాశ్వతర శిబికాం	11	12
అష్టతనువృత్తి	8	117
అసదృశులై యష్ట	12	60
అసితోత్పలములపై	9	133
అసుర యేయు నమ్ము	12	150
అస్తగిరిఁ బొందె	8	190

ఆ

ఆంకగొన కుభయ	12	69
ఆకులమంది నిర్జర	12	62
ఆ గిరీంద్రసుత	7	5
ఆడుచు మీఁదఁ బిండుగొని	9	102
ఆడెడి రూపులున్	11	192
ఆతతముగ శుక్రుడు	12	137
ఆ తుంగద్విరదా	11	84
ఆననలీల సుధా	7	9
ఆ నాకపతి గజంబు	10	71
ఆ పరమేశ్వరుండు	10	133
ఆ మాడువిండ్ల తుదిఁగల	7	112
ఆయత బాహువీర్యము	12	145
ఆయతభుజవిక్రముఁడు	12	56
ఆయత మతి నుత	10	182

	ఆ	పద్య
ఆయము లిచ్చుటాజి	11	53
ఆ యవనీరుహోద్గత	9	99
ఆ యిరువుర రెండమ్ముల	12	64
ఆ యిరువురు బహు	12	41
ఆరణి దుర్వారులు	12	40
ఆ రమణి సుందరాకృతి	9	18
ఆ రమణుల దోష	10	46
ఆ లీలాలస దృఙ్మరీచి	8	10
ఆ లోలదృష్టి సంజ్ఞల	8	103
ఆ లోలాలస	8	58
ఆ వనితలు చంపక	9	120
ఆవనిమధ్యసంస్థిత	9	97
ఆసురముగ నాశ్వికుల	11	146
ఆ హరతనూజుఁడు	12	171
ఆ హరాద్రిసుతల	10	50
ఆ హరికాలనేములు	12	93
ఆ హరివిడిచి నిసర్గ	10	77
ఆహవదోహలుండు	12	34
ఆహవభూమి సురా	12	36

ఇ

ఇంత బాహుబలోత్సాహ	12	199
ఇది నాకు సురకువిచ్చుట	7	139
ఇనుఁడు దనదీప్తి	8	186
ఇనుఁ డుదయింపక	10	152
ఇనుఁ డొడఁగూడి రాక	8	90
ఇ మ్మెడపున నిజ	10	193
ఇరుగడలఁ గలసి	12	143
ఇరువా గున్నతి	11	136
ఇలఁ బుట్టదు పుట్టియు	8	165

ఈ

ఈగికిఁ గలుచు హరిద్రా	8	163
ఈతడు నైబుతి	11	88
ఈ ననియె తలఁచు	11	48
ఈ నీరజానన	7	19
ఈ యింద్రుఁ డీకృశానుం	10	169
ఈ రమణి బాల	7	8
ఈ వలయునర్థ	11	45
ఈవిధమున నుత్సాహము	11	28
ఈశు నుద్వాహమున	8	112
ఈ సురరాజు నేఁడు	12	66
ఈ హరుఁ డగసుత	8	183

ఉ

ఉగ్రశస్త్రాస్త్రనికర	11	114
ఉదయ శైలంబుపై	8	114
ఉదయోత్తుంగ	11	98
ఉదుట రణోత్సవం	12	7
ఉద్యోగనిరతు	11	87
ఉపరాగాకులచంద్ర	12	166
ఉభయ బలభట	11	116
ఉరగాభ్రానల	12	149
ఉరగులు కేతు దండముల	8	34
ఉరగులు స్రుక్కి	12	156
ఉరుకుచాగ్రంబు	9	143
ఉరుతర తనుఁడగు	11	179

	ఆ	పద్య
ఉరుతర మణిగణ	7	131
ఉరుతరవారిచక్ర	11	196
ఉరుతర శౌర్యముం	10	121
ఉరునేత్రవహ్ని	10	3
ఉరుపాశములు	11	183
ఉరుబలపదహతి	11	22
ఉరుభుజసత్రుతాపమున	12	95
ఉరు రజతాద్రిపై	8	80
ఉరుహేతిప్రకరోల్లసద్ద్యుతులు	11	19
ఉలియు నిట్టూర్పుల	5	70

ఎ

ఎగయు శిరంబులు	11	171
ఎట్టెట్టూ శివుఁ గల్చె	7	20
ఎత్తిన పువ్వులు	7	123
ఎనసి నిజాసిత	9	116
ఎమ్ములు దొడ వను	7	38
ఎయ్యని తనపై కుటికిన	12	54
ఎలఁబొఱవోనిమేన	7	41
ఎలమిఁ గుమారు	11	17
ఎలమిఁ బ్రాణేశున	9	49
ఎలమెడు జలజాతంబులు	10	26
ఎలుఁగెత్తనోడి మున్నెందేని	10	48

ఏ

ఏ నమరదూత	10	131
ఏనుఁగుఁ బంపువారువము	11	6
ఏమేమీ మదినోట	11	138
ఏలిధము చేసి మెచ్చక	7	45
ఏసిన బాణముల్	12	15
ఏసియు బైచియు	12	169

ఒ

ఒండొరుం గడవంగ	11	150
ఒండొరు నేయు శరంబు	12	141
ఒక యన్యాయము	8	177
ఒక్క నెపమును లేక	8	175
ఒక్క వింటన	12	97
ఒడలి భస్మరజంబు	7	79
ఒడలోమి పెద్ద	11	43

ఓ

ఓలము లేదు కూర్చునని	11	55
ఓలిఁదనరారు క్రోళ్గను	9	59
ఓలిఁ దాంబూలవల్లి	7	98

క

కడఁగి కోదండధరు	11	162
కడకొంతంబుల	11	152
కడితల యుద్దంబులు	11	153
కడితలకాఱు వ్రేయ	11	193
కడుఁ దోరమై పాల్చు	8	67
కడుఁ బెక్కుపోటులఁ	11	135
కడుకొనక తప్ప	9	44
కతిపయ దినముల	9	139
కనకంపుఁగ్రోళులు	9	51
కనకమయ హర్మ్యపంక్తులు	7	113
కనకహర్మ్యములతో	7	151
కనకాచలము నెల	9	3

	ఆ	పద్య		ఆ	పద్య
కనికొంతదవ్వ	8	148	కరిఘటలొండొంటిఁ	11	140
కని త్రిపురారినందనుఁడు	12	188	కరిబృంహితరథ	11	112
కని వనజాసన	7	156	కరి దగర్వంబున	10	179
కనుఁగొన సుందరా	7	126	కరిమద హయలాలా	11	24
కనుకనిఁదొల్లి	8	153	కరిమీఁద నుండి	12	74
కనుచూడ్కిం గోలెను	7	82	కరిముఖుఁడల్గిపట్టుకొని	12	116
కనుచూడ్కిఁదునియలు	11	40	కరిశిరమాడ	12	182
కనువడి నీవును బోటరి	12	20	కరులఁదెమల్చి	12	172
కమనీయాత్మక	7	114	కరు లపై మేఘడంబరము	11	77
కమలజునీవిఁ బక్షములు	11	68	కరులాగోత్రాచలేంద్రొ	11	82
కమలజు పాశంబు	10	171	కరులు కరంబులున్	11	145
కమలదళాక్షి సాలఁ	8	61	కరులు గాఁచినమద్దులు	12	122
కమలాధీశ్వర	9	137	కరువలిరూపు	11	70
కమలాభిశోభితము	10	19	కలధౌత హర్మ్యములపైఁ	8	43
కమియ నీలేక	8	145	కలహభూమిలో	12	112
కరదండాహతపర	10	195	కలహమున సురలు	11	101
కర మభిలాషులై	8	167	కలిమలదూరు భీరు	11	212
కర ముద్రేకముతోడ	12	178	కలుచుట దోసమే	8	151
కరము రాగిమై	8	113	కలువక కల్చినట్లుఁ	8	142
కరములు ద్రివ్విపాదము	12	176	కలుషముతోడ లోకములు	10	7
కరమొప్పఁ గాముక	9	80	కసటు వోవఁదొడసి	7	80
కరమొప్పన్ వియదంగనా	7	89	కామధుక్కల్పవృక్ష	10	103
కరలత లందంద	9	149	కారుణ్యామూర్తి	8	199
కరలతలఁ బెనఁగి	10	34	కారుణాత్మకు నిన్ను	10	97
కరశాఖలఁదరుశాఖలు	9	115	కాలంబు కూడ జగంబు	10	161
కరిఁగరి భటుభట	11	106	కాలాగ్ని రుద్రుఁడును	12	134
కరి ఘటల మీఁద	11	163	కాలుఁ డాదిగ దేవ	12	100

	ఆ	పద్య
కీలు ప్రిదిలినఁబడి	9	68
కుంతములు బిట్టు	11	164
కుముదముతో నలందుర	8	189
కులగిరులు బలసి	7	110
కులజుఁడై విక్రమ	10	115
కులముల రాజు	7	138
కువలయారి సనియె	8	91
కొలఁదికి మీఱఁ	7	108
కొలనిదరిఁ దన్ని	9	76
కోకనదంబులు	8	94
కోమల సన్నతాంగి	8	126
కోరిక పాం దెటింగి	9	153
కోలగతి నడచి	11	159
కౌపు విచ్చి విచ్చి	8	64
క్రందుకొని ప్రబల సురబల	12	83
క్రిక్కిటిసిన శవములలో	11	177
క్రొవ్విరి తమ్మితావి	9	157
క్రొవ్వీరు లెసఁగి పూఁ	8	9
క్షతజాతాపాత	11	197
క్షితి సర్వేశ్వరపాద	12	223

ఖ

ఖచరాంగనల కుచ	10	24

గ

గంధ గజాసురారి	7	28
గంధ సింధురములు	11	18
గగనముఁదాఁకు చిత్ర	7	115
గజ యూథముల	12	106
గదగొని పోరికి	12	25
గరుడాండస్ఫురితేంద్ర	10	87
గరుడేభాజ మహిష	11	10
గర్జిల్లి తోఁతెంచుకరి	11	195
గటిగాననొడళుల	11	125
గళనాదంబులు మంజు	8	180
గళనాదంబులు శుష్క	8	172
గళితమదప్రవాహములు	11	75
గళితోచ్ఛ్వాసము	10	42
గిరిజ తపఃప్రభూతికి	7	86
గిరిసుత కన్యాగుణ	7	73
గిరిసుతకారణమున	8	85
గిరులనటె గెల్చునది	10	119
గిరులైన వజ్రమై జల	12	44
గుణతాడనధ్వని	12	147
గురుకుచలిప్త	8	60
గురుకుచవక్త్రనేత్ర	9	82
గురులను మునులను	10	156
గుహునిపై నట్ల యత్యుగ్ర	12	140
గోపతికారుణ్యంబున	11	90
గ్రుయిలతోడన	11	166

ఘ

ఘనతర దీర్ఘకుంతములు	12	71
ఘనసంఘంబు	10	174

చ

చంచుల నాస్వాదించుచు	10	30
చండతర ప్రతాపబల	11	67

	ఆ	పద్య
చందనంబుఁ గలయ	9	64
చనవెఱిఁగి నడవ	10	183
చనుదెంచి పెర్మితో	7	77
చలిగాడ్పుల ముసరుల	7	100
చానెత్తికొంటి రక్కల	10	166
చాలఁబ్రియుఁడగు	8	92
చీరి నేతితో	8	99
చెదరి తోఁబలతెంచు	9	72
చెనసికలహభీతి	10	146
చెఱకీన పుచ్చు	8	159
చెఱలు విడుమనిన	10	144
చెలఁగన్ నిర్జర	11	8
చెలువ యొక్కర్తు	8	65
చెలువలు మట్టిమ్రానిపయిఁ	9	117
చెలువలు సూచిరి	8	53

జ

జంగమ నగముల భంగి	11	91
జంగమ హిమవంతము	8	28
జన వినుతు సితయశోనిధి	8	196
జనులు విరుద్ధవేషి	7	23
జయఘంటారవ	10	113
జలజంబులలో	9	86
జలజభవాచ్యుతాది	7	55
జలజము సాలి	8	8
జలజములఁ బాసి	10	108
జలధులపై వీచు	11	105
జలనిధి తమకెల్ల	10	22
జలనిధులేడు	10	27
జలమిక్షుఫల	7	93
జారపతి కడకు	8	129
జారపతి రాగరుతిఁ	8	102
జితదేవాధీశ	12	190
జ్ఞానదీపంబు	12	226

త

తగరము వాఁడిచేసి	7	33
తగుఁ దగదని మనమున	10	187
తగులము సేసిచేసి	8	130
తనకధికుల కతిభక్తియు	10	188
తనకనిదాఁపకర్థికి	11	47
తనతనుకాంతి	7	141
తన భండారువు	10	32
తన మతి సతి రతి	8	161
తన మనమున సంభ్రమ	7	64
తన ముఖ మంబుజాతమని	9	88
తన రజతాద్రిలోన	8	77
తన రాగంబునఁ	8	109
తనరు నరుణాంబు	11	206
తన వెలుఁగొక్కప్రొద్దు	7	111
తన సహస్రాక్ష	8	74
తన సుతుఁడగు శశి	8	116
తన హృదయమునం	8	147
తనుమధ్య యోపదీ	8	17
తనువుల ముత్పులకావలి	9	40
తన్నినఁబూచె నెందు	8	122

	ఆ	పద్య
తమకంబున నరుగు	7	75
తమకు వియోగవేళ	9	118
తమచేతుల యాయుధములు	11	124
తమతమ వృత్తు	10	170
తమ మనునీలవర్ణ	8	105
తమ ముఖంబులు	9	87
తమ వక్త్రాధరకేశ	7	99
తరతర మంజికదఱుకఁగఁ	9	148
తరమునఁ గన్గవల్	10	81
తరల ముక్తాహార	12	164
తరుగుల్మాదులు	11	20
తరుణతర తరణికిరణ	7	59
తరుణతరతరణికిరణో	10	205
తరుణతర శశిమండ	8	111
తరుణి పదాహతిఁ	8	174
తఱమి పెనఁచిన నిడుద	11	175
తఱిఁదటి నినుతో	8	95
తఱుసంటి తన్ననెదిరిని	7	49
తలలు తెగిపడిన నట్టలు	11	123
తలలెన్ని యరయుచుం	11	36
తళుకొత్తెం దరహాస	9	48
తా నింతియై యుండ	7	125
తానేల వచ్చు భూసతి	10	181
తారక కింకరు లుగ్ర	12	102
తారకతేజంబడఁపఁ	11	62
తారకప్రభ తోడ్తోన	12	167
తారకవిరచితకృతి	10	153
తారకసుతుఁడు	12	27
తారకుఁడల్కనేయు	12	123
తారకు ననుజులు	12	114
తారకుమీఁద	12	135
తాలగతిఁబొడిచి	11	165
తురగంబునట్టపై	11	180
తురగదళంబు లొండనిసి	11	148
తెరలి పరచక్రములు	12	76
తేనియ ముసురో	9	36
తొడవులు చివికిన	7	39
తొడవులు తదవయవ	9	14
తొలుకొని కుక్కుట	8	184
తొల్లిటి దోషములైనవి	10	125
తోలును నెత్తురుల్	11	174
త్రిజగద్వంద్యుఁడ నింద్యుఁ	12	227
త్రిదశేంద్రాదులు	10	141
త్రినయన నీవెవ్వని	7	84
త్రినయన పుత్రకుఁ	10	73
త్రిభువనములపై	11	143
త్రోచిరి కరిఘట	11	120
త్ర్యంబక! నగసుత నిబిడ	8	14

ద

దండుగులిచ్చి వేలగొని	10	164
దనుజబలంబుఁదాఁకి	12	48
దనుజారికంటె వీరుఁడు	10	58
దనుజునకొక్కయమ్మ	12	170
దనుజుల శరవర్షము	12	154
దనుజేంద్రుఁజెఱలు	10	172

	ఆ	పద్య
దనుజేంద్రు మాయ	12	186
దరహాస దీధితుల్	12	206
దరహాసామృతమున	8	50
దళితసకోరుహాస్యలు	8	52
దశన సౌదామినుల్	7	158
దానవసతి మది	12	153
దానసంపదఁ గడసన్న	7	102
దాని కొడఁబడక	10	127
దారుణకార్యవృత్తి	10	190
దుగ్ధాంబునిధి	8	118
దురమునఁ బటురక్రా	11	168
దురమున నా సురారి	12	58
దురమున నిశితాస్త్ర	11	188
దురమున నోడి	10	139
దురమున మెడ తొడ	11	194
దేవకార్యంబుగా	9	42
దేవా సుకోగ్రాజిఁ	11	101
దేవేశుండు పరిగ్రహించుట	9	54
దొనఁగోలఁ గోల	12	158
దొనపై గొనయముపై	12	159
దోషుల సంగతి నగుదురు	10	40
ద్వాదశార్ధార్దనయను	12	215

ధ

ధనదుండు విల్లుదెగ నే	12	23
ధనదు ధనసంఖ్య	7	120
ధర కంపింపఁ బయోనిధుల్	12	132
ధరణీచక్రము దిద్దిరఁ	12	78
ధరణీధర శోభితమై	11	14
ధార కులికెడు మదజల	12	32
ధారలు వట్టఁబంపు	11	5
ధీరత భూమి గభీరత	12	224
ధృతి దక్కి మ్రొక్కి	8	152
ధ్రువ మండలంబు	8	22
ధ్రువమై జంగము	12	225

న

నడు మస దింతి	8	16
ననిచిన కల్పవల్లికలు	12	214
ననిచిన కల్పవల్లి మద	9	20
న న్నుఱ కేపునం	10	145
నయమున నలవలపులతో	11	78
నయమున భీతి పాసి	9	146
నరకోగ్రభయాతురులై	12	80
నరభోజను లి ట్లోటఱి	12	63
నరుఁడ నీవు నేను	12	87
నరుని నిశాతసాయక	12	89
నలిఁ గమలాననల్	7	95
నలిఁగోటికోటి	7	121
నలికపు మేనులు తిగిచిన	9	114
నలి ఘూర్ణిల్లె	11	108
నలినాకరంబులో	10	55
నలి నాత్మవ్యవసాయ	10	96
నలి నార్చుచు రుద్ర	12	105
నలుగడ నింతయంత	11	13
నిజవదనామితాస్థిత	12	204

	ఆ	పద్య
నిటలతట ప్రచండ	7	31
నిడువాలుఁ జూడ్కులు	9	147
నిధిసంఘంబు	10	95
నిమ్మలు మాదీఫలమ్ములు	7	96
నిర్ఋతియు వారి మాయల	12	42
నీ యజ్ఞానత	7	52
నీరదముల్ కచాతిరుచి	9	70
నీరేరుహోదరుఁడు	9	65
నీలాద్రిపై నీలనీరద	10	97
నీ వఖిలామరేంద్ర	10	15
నీవు దక్కిన	8	155
నుత నవ యౌవన	8	56
నుత బిందు బిసము	10	69
నుతవర్ణాంతర	8	98
నుత విట ఘనకరయంత్ర	9	69
నుదుటి కంటి మంట	10	5
నునుపుగఁ జందనం	8	59
నెగడు పేర్చిందు	8	173
నెగసియాడు	11	176
నెఱిగలుగ నాఁడునాఁటికి	8	7
నెఱినలిఁగోరక మదిలోఁ	9	104
నెలఁతలు కొందఱు	9	83
నెవ్వలి చన్నుల వ్రేఁగున	9	113
నేరక కల్చి భిక్షుకుని	7	34
నేలయు నింగియు	8	135

ప

పగలింటి కట్టెండ	7	65
పతిఁగని లజ్జ	7	69
పతిహితుఁ గులవిప్రోత్తముఁ	10	123
పదసంఘట్టనఁ బెట్టి	12	118
పద్మరాగరాగ	8	110
పని యేమేనియుఁ గల్గె	10	136
పరపరివాద పరాఙ్ముఖుఁ	11	213
పరమపరుఁ బరమ	9	164
పరమపరు లోకగురుఁ	9	167
పరమమాహేశ్వర	7	116
పరమానందుఁడ నింతి	7	161
పరమానందుఁ డమందుఁ	10	202
పరమానందుని నిను	8	15
పరము కపర్దరాగరుచి	7	88
పరమ కపర్ద సంగమున	7	13
పరమునకేను దాసుఁడని	7	137
పరము శరీర భూతి	7	62
పరమేశు వీర్యంబు	10	38
పరమేశ్వరు పాదోదక	8	83
పరవాదీంద్ర ఘనా	8	197
పరశులు కొంతముల్	12	5
పరిఖామలజలములలో	7	107
పరిపరివాదపరాఙ్ముఖుఁ	11	210
పరువడిఁ గులగిరులిడి	7	109
పరువడిఁ బైపయిన్	12	136
పఱతెంచి మగుడ	10	17
పలకలు నొడ్డనములు	11	71
పలుచని పూఁతలున్	8	143
పసిఁడి యాయగములు	12	3

	ఆ	పద్య
పాండురాంగ	7	61
పాయక సర్వర్తుక	7	128
పాలపాపనోటు	10	167
పాలు నేయును	11	54
పించాతపత్రముల్	9	141
పిడుగులయి తాఁకు	12	184
పుడమి నిజసేన	11	23
పుడమి పదాతి	11	25
పుడమిపుఁడున్	11	44
పుడమియై కదలక	7	24
పురహరమూర్తి	9	163
పురహరసుత	12	161
పురహరు నమోఘ	10	11
పురి వీధులు గనుఁగొన	7	117
పురులు గలఁడిచ్చునని	8	140
పురుషుఁడు పురుషున	10	197
పులకలు పొడ్మె	10	79
పులిగూడుదిండి గొరగం	7	43
పూర్వాంభోధి	8	107
పృథుజటాబంధంబు	12	210
పృథుభుజశక్తి	11	142
పొంగి మేర దప్పి	9	22
పొడవు చూడ మగల	11	46
పొలికలనెల్ల	11	208
పోంక నళినీరజస్వల	8	89
పోరఁ బాఁకుదల్చి	11	37
ప్రకటిత మేఘనాదములు	8	24
ప్రణుతామల సద్గుణ	11	211
ప్రళయాభ్ర రసమునా	12	11
ప్రాలు గలనాఁడు	8	168
ప్రియుఁడు రాగోత్కటంబునఁ	9	62
ప్రియు నఖాంకముల్	8	69

ఫ

ఫణభృన్నాథోత్తమాంగ	8	46
ఫలభారానమ్ర	7	101
ఫాలాభీలాంబకు	7	153

బ

బరులు రెండు త్రెవ్వి	11	173
బలపదఘట్టనన్	11	21
బలభేది కరి దొడ్కి	10	66
బలముల వేగమై	11	66
బలసి తేజంబు దిక్కుల	10	75
బలహీనులయ్యు	10	192
బలిఁజెఱఁబెట్టి	11	96
బలిమిఁ దోతెంచు	12	22
బలువిడిఁ దాఁకి వీఁకఁ	12	73
బలువిడిఁ దాఁకి వైరి	11	60
బహుముఖ మటె	10	147
బాలకుఁ బట్టియే	10	149
బాహుబలంబున	12	139
బాహుబలోన్నతి	12	195
బిట్టఱ నెమ్మొయిం	11	151
బిట్టెగసి మీఁదఁ	10	21
బుద్ధీంద్రియంబుల	12	221

	ఆ	పద్య
బృందారకతతి బెదర	12	83
బ్రహ్మాండ నికరంబు	7	27
భ		
భంగిగఁ దనపైఁ	10	23
భక్తిఁ గీడ్వడి సేనాని	10	142
భటవాజి రుండముల్	11	204
భయమే పెట్టనివారిఁ	8	139
భయరోగార్తి	10	92
భర్గుం డంతకవాహినుల్	11	34
భవరౌద్రాశని	8	195
భాలాభీలవిలోచనానల	11	94
భావజుకేళి నచ్చుపడి	8	158
భావజు పంచసాయక	9	112
భాషామృతంబుల	11	27
భువనంబులన్నియుఁ బొలియింప	11	80
భువనీ చక్రాచలేంద్రా	11	64
భువి నీ రాజ్యవిభూతు	10	99
భూతి పూసిన వింత	7	7
భూరి తరవారి	11	15
భూరితరోగ్ర గంభీరాబ్ధు	10	173
భూవినుతుఁ డార్యజన	12	231
భూసుర కులాగ్రణి	7	163
భేరీరవంబు చెలఁగెన్	8	20
భోరనఁగ నెగయు	11	167
భ్రూలాస్యం బధరోష్ఠ	8	176
మ		
మంచిగఁ బ్రీతిఁ బాయక	10	198
మండనానీక విగళిత	11	198
మగలాడువారికి	7	36
మగువ జంగమ	8	62
మజ్జనం బొప్పనాడి	9	6
మడఁది ముఖమండలముఁ	9	61
మణికుట్టిమ ప్రభా	10	106
మణికోదండము లింద్ర	11	138
మణిభూషణప్రభఁ	9	10
మణిభూషణప్రభా	7	40
మణిహేమ రచిత	8	42
మతి నీశుండు తలంచి	9	74
మదన మదనాస్త్ర నిభ	10	203
మదనాగంబులు చేతు	11	35
మదనోత్సవ మద్రువమని	9	103
మనమారంగఁ ద్రుటి	10	94
మనసు లొడఁగూడి	12	208
మనునిభ చారు	11	214
మరకతమయ వజ్ర	7	104
మరణకాలమైన మఱి	8	162
మరుఁ బరిమార్చి	10	165
మలయజ పంకము	9	15
మలయానిలంబు సోఁకినఁ	9	95
మలయుచుఁ బొలుపారు	9	46
మలినుండై కడు డస్సి	10	91
మహాయోగిముఖ్యుండు	10	206
మాటలయట్టిది యగునే	11	39
మానమహార్ణవు	9	166
మానఱి పగలెల్ల	8	6

	ఆ	పద్య
మానితంబైన	9	28
మారుతగతిఁ జను	8	32
ముంచినఁ జప్పుడు విని	9	129
ముంచిరి శరవర్షంబుల	11	118
ముక్తక బంధములగు	11	181
ముక్తాముక్త ఘనాను	12	201
ముక్తాముక్తాయుధములు	11	130
ముక్తుఁడు కృత్యాకృత్య	12	230
ముట్టిగజయూథములఁ	12	173
ముడువ నెత్తిన	8	63
ముదితల కుచకుంభముల	8	36
ముదితలు తొల్లి యౌవన	9	134
మునిజనదత్తార్ఘ్య	8	192
మునుకొనిదేశకాల	10	189
మును మహీధేనువు	7	132
మునుమిడి వైరి	11	42
మురహరపద్మజాదులకు	12	198
మురిసెడి రూపులున్	11	131
మురు వక్షము నో వ్రచ్చుచు	12	85
మృగమదంబుఁ దరుణి	9	63
మృడుబలము లుర్వీ	8	87
మృతులైన వీరులందఱు	11	184
మెఱుఁగుఁ దీఁగెల	7	3
మెఱుఁగుల గన్నులు	7	155
మెలఁతుక కుముదంబుల	8	105
మెలరారు క్రీఁగంటి	7	71
మెలుపిచ్చుం దనువల్లి	8	11
మెలుపునఁ జూయను	8	13
మెలుపొదలించి	9	108
మేరకు నగ్గలమగు	9	26
మేలుగ నెలకొన్న	8	115

ర

రజతాద్రిస్థుఁ డనాది	7	134
రణతూర్యంబులు	11	107
రతి యొనర్పఁబోయి	9	159
రతిలోలుఁడై బాహ్య	9	152
రయమునఁ జని	11	99
రయమున దానవపతి	10	178
రవిపదాహతిఁ జెడి	8	187
రసముల్ గ్రమ్ముచు	7	97
రసరసాయన సుధా	7	147
రాక్షస బలములకెల్ల	12	13
రాగరసాంబుధి	8	171
రాజకదంబ విరాజితంబగుఁ	7	130
రాజరుచివాయఁ	8	188
రాజాలంకృత	7	143
రాజితముగ వీట	9	58
రాజు రుచి వాయఁ	8	188
రెండు రెం డుగ్రశరముల	12	181
రోయిడఁబంచువారు	8	133

ల

లలితాంగంబుల	9	16
లీల నొక్కటఁ జని	9	78
లీలా లోలాలసద్భ్రగ్	8	131

	ఆ	పద్య
లీలోద్యానవనంబుల	9	145
లోలమలి రెండుకన్నులు	8	54
లోలాంబుజాలముల్	10	29

వ

	ఆ	పద్య
వంచనలేదు బిడ్డగల	8	137
వగవఁగ నద్రిరాజు	7	21
వడిఁ ద్రిదశాలి నోర్చు	10	151
వడి నరకుఁడేయు	12	82
వడి నెయిది యిభము	11	158
వనజంబులుఁ గలువలుఁ	8	70
వనమాలాలంకృతి	9	106
వర కార్తస్వర	7	100
వర చందనపంకంబున	9	60
వరదుం డీశుఁడు	10	93
వరదు వివాహవేళ	9	33
వరవనితాననేందు	7	103
వరవృషభేంద్ర	8	78
వరసతి సురత	8	160
వరసతులుఁ బతులు	9	81
వలను లేదేని	8	166
వలరాజున కెత్తిన	9	96
వలరాజు రతియు	8	120
వసుధాధరేంద్ర సుత	7	37
వాడిన వక్త్ర పంకజము	11	57
వాని కురియు ననేకాస్త్ర	12	52
వారక కలహం సావలి	10	20
వారణదానవాహినుల	11	102
వారిరుహానన	7	22
వాలిక లంబుజాక్షములు	8	169
వాలిన దాయవారి	11	92
వాసితానన రుచిర	9	119
వాహనంబులు డిగ్గు	11	30
వికసిత పుష్కరయుత	11	73
విడుమని వేఁడ నావలన	10	148
వితతరుచిఁ బొల్చు	8	31
విని ముత్పులకిత	7	136
వినుతారుణజల	12	17
వినువీధి నడయాడి	10	56
విరహకాలంబు	8	178
విరహమునకంటె	8	164
విరి నెఱి వేనలుల్	9	52
విఱిగిన యలువుల	11	172
విఱిగెడి రూపులున్	11	133
విఱిగె నరదంబు లలుగులు	12	9
విష్టరం బయ్యెను	9	4
వీండేమి సేయుఁ బంచిన	10	155
వీచియు నొత్తియు	12	30
వీధి వీధులఁ బుష్ప	8	122
వీ రేకాదశరుద్రు	11	86
వీ రొరుచేఁ దాఁకనీరని	12	104
వెక్కెడి రూపులున్	11	130
వెలయఁగ సుజనుల	8	57
వెలిమిడి నలికంబు	8	66
వెలుఁగ సూరెలఁ	8	73

	ఆ	పద్య
వెలుఁగు కుమారతేజమున	10	62
వేదము లాదిగా	8	75
వేదాచారులు సంతత	7	118
వేదాదులగు మహా	7	91
వ్రేలిరి కడ గొంతంబులఁ	11	129

శ

శతపత్రోత్థ విమాన	10	88
శరణు మహేశ	10	84
శరదమలాభ్రముపై	8	30
శరధి సమస్త వస్తువులు	7	106
శరహతిఁ దల తెగి	11	170
శరహతిఁ దెగి నేలఁ	11	121
శరహతి శిరములు	11	169
శిరమున సర్వాత్ముండగు	7	149
శిరమున సురసింధు	7	57
శివుఁ డాత్మసుతు	10	191
శివు గౌరీ సహితంబు	9	128
శివుతనయుబలపదాహతి	11	32
శివు వీర్యము పెలుకులఁ	10	9
శృంగార రాజ్యలక్ష్మికి	9	13
శ్రీభారతీసుతుల్	9	21
శ్రీమహిళా మహనీ	8	1
శ్రీ రమణీరమణీయ	10	1
శ్రీ రమణుఁ డఖిల	11	1
శ్రీరామాకేళీ	12	1
శ్రీరామాసంచిత విపు	9	1
శ్రీరామేశకవీశ్వ	10	90
శ్రీశితవక్షుఁడు	7	1

స

సంధిల్లి మేనుల	9	91
సంధిల్లు పూర్వదిక్పతి	8	108
సకల కళాధరుండు	7	25
సకల జనవినుత	7	160
సకలాధారుఁడు	10	204
సజ్జననిధాను	8	198
సన్నలువాలఁ	8	101
సన్నుతత్యాగ ధ్వజం	11	51
సప్తమునీంద్ర	9	32
సప్తవ్యసనేతరుఁడై	10	185
సభలో దానవదూత	10	160
సమదానేకప	7	129
సరసకకోటితామ్ర	11	200
సరసాహారము	12	220
సరసిజరాగావహమై	8	193
సరసిజహితుఁ డటు	8	93
సరసిరుహరాగ	7	105
సరసిరుహాక్షుమోక్షు	11	210
సర్వలక్షణ సంపూర్ణ	8	127
సల్లలితాశోకపల్ల	8	12
సవళులు భిండివాలములు	11	110
సారమతిఁ బాండురాంగు	12	218
సారాసారవిచార	10	98
సాహసులై మునిపత్నులు	10	44
సితతుంగాంగ	8	40
సిద్ధాంగనలు చల్లు	12	192
సిరముత్రెస్సి వడిన	11	178
సుకవిస్తుత్యుఁడు	12	229
సుజనజనైక	10	200
సుజ్ఞానయోగతత్త్వ	12	217
సురచాప వృతాసిత	8	29
సురదూతమగుడఁ	10	158
సురనది దొలఁకాడ	9	35
సురపతి కోపించి	10	68

	ఆ	పద్య
సురబలము నసురబలమున్	11	- 127
సురమహీరుహాలి	10	- 51
సురలకు దీవనయజరా	9	- 131
సురలని నోడి దిక్పతుల	12	- 128
సురలు గని యార్వ	12	- 162
సురవనితా కర చామీ	8	- 38
సురవరులు పెక్కుమాటులు	12	- 151
సురవిరోధుల నోర్చి	7	- 51
సురసతు లర్థిఁ	7	- 124
స్తనకుంభంబులు పూర్ణ	10	- 109
స్తనములు సకుంతలాస్యము	9	- 84
స్త్రీ పానాక్షమ్యగవ్య	10	- 184
స్థిరమతి శుభసిత	10	- 85
స్ఫటికాద్రి మీఁద	9	- 24
స్ఫురదరుణాధరోరు	8	- 71
స్ఫురదురుకాంతి	8	- 149
స్ఫురదురు ఫాలనేత్ర	8	- 81
స్ఫురిత ప్రవాళలతికా	7	- 60
స్ఫురితాంగాసిత	10	- 129
స్రుక్కిరి కరములు	11	- 128
స్వర్గార్థి యందమే	7	- 15

హ

హరగిరిజల మనమున	9	- 56
హర తనయాసురేంద్రుల	12	- 142
హర తనయుఁ డల్గి	12	- 138
హర తనయు శక్తి	12	- 189
హర భాలాంబకజాత	11	- 93
హరసుతుఁ డతుల	12	- 180
హరికరి యోడిపాఁతెడు	10	- 72
హరి గడుఁబ్రీతి	8	- 97
హరి గరుడుండు	7	- 145
హరి నదల్చి తాఁకె	12	- 91
హరినీలోపమ మధ్యకేశి	8	- 5
హరి నేత్రాంబుజ	7	- 17
హరి పరమేష్ఠి పురందర	12	- 212
హరి యుగుఁ గరులం	12	- 174
హరివాణీంద్రామరేంద్ర	8	- 3
హరి సురవల్లభాది	10	- 117
హరుఁ జూచు మగుడఁ	8	- 68
హరుఁజెడనాడి ముందటు	7	- 29
హరుఁడు గనుగీట	9	- 67
హరుఁడు లోకములు	11	- 95
హరునకు నెద్ది పేర్మి	10	- 60
హరునకు రెండు రెండొకొ	8	- 26
హరు మనమారఁగొల్చు	12	- 219
హరు వివాహమునకు	8	- 191
హరు వీర్యముఁ దాల్పఁగ	10	- 13
హర్షముచెడి శతముఖ	12	- 98
హళిక నితంబినీతతి	7	- 94
హిమనగాధీశ్వరునకు	7	- 11
హేమాబ్జినీ కేళి	9	- 161